విషయ సూచిక

1.	భారత ఆర్థిక వ్యవస్థ నిర్మాణం	1.1 - 1.30
2.	భారతదేశ జాతీయాదాయం - వృద్ధి, సమస్యలు	2.1 - 2.37
3.	జనాభా, పేదరికం	3.1 - 3.17
4.	భారతదేశ జనాభా విధానం	4.1 - 4.9
5.	భారతదేశ పేదరిక లక్షణాలు-పేదరిక నిర్మూలన	5.1 - 5.22
6.1	భారతదేశంలో 1950 నుంచి వ్యవసాయాభివృద్ధి పోకడలు - వ్యవసాయ విత్తం	6.1.1-6.1.28
6.2.	ఆర్థికాభివృద్ధి - వ్యవసాయరంగం	6.2.1 - 6.2.20
7.	భూ సంస్కరణలు	7.1 - 7.23
8.	వేతనముల సిద్ధాంతములు	8.1 - 8.12
8.	వ్యవసాయ శ్రామికులు-సమస్యలు	8.1 - 8.14
9.	భారతదేశంలో పరిశ్రమలు-పారిశ్రామికాభివృద్ధి	9.1 - 9.32
10.	ఆధునికీకరణ-నిరుద్యోగం	10.1 - 10.26
11.	భారతదేశ ప్రణాళికలు - ప్రణాళిక వ్యూహం	11.1 - 11.14
12.	భారతదేశ పంచవర్ష ప్రణాళికలు.....	12.1 - 12.37
13.	పన్ను విధానం మరియు భారతదేశ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం	13.1 - 13.46
14.	భారతదేశ కోశ విధానం-కోశ సాధనాలు కోశసవరణలు	14.1 - 14.49
15.	భారతదేశ విదేశీ వ్యాపారం - వ్యాపార చెల్లింపుల శేషం...	15.1 - 15.23
16.	భారతదేశ వర్తక నిబంధనలు....	16.1 - 16.14

పాఠం - 1

భారత ఆర్థిక వ్యవస్థ నిర్మాణం

(Structure of Indian Economy)

1.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

- బ్రిటీష్ పాలనకు పూర్వపు స్థితి
- భారతదేశ స్వాతంత్ర్యం నాటి ఆర్థిక వ్యవస్థ
- 1947 తరువాత భారతదేశ ఆర్థిక వ్యవస్థ
- భారతదేశ వృత్తి నిర్మాణత , మరియు
- అవస్థాపన సౌకర్యాల కల్పన.

విషయసూచిక :

1.1 ఉపోద్ఘాతము

1.2 బ్రిటీష్ పాలనకు పూర్వపు స్థితి

1.2.1 గ్రామాల వ్యవస్థ

1.2.2 పట్టణాల వ్యవస్థ

1.3 భారతదేశం స్వాంతంత్ర్యం నాటి ఆర్థిక వ్యవస్థ

1.3.1 1757 - 1858 కాలం

1.3.2 1850 - 1947 కాలం : వ్యవసాయరంగ వ్యాపారీకరణ

1.3.3 క్షామాలు

1.3.4 పారిశ్రామీకీకరణ

1.3.5 రవాణా మరియు సమాచార సౌకర్యాలు

1.3.6. బ్రిటీష్ వారి దోపిడి.

1.4 1947 తర్వాతి భారతదేశ ఆర్థిక వ్యవస్థ

1.4.1. భారత ఆర్థిక వ్యవస్థ నిర్మాణతలో మార్పు మరియు వృద్ధి

1.4.2 ఆర్థిక వ్యవస్థ నిర్మాణతలో రంగాల వారీగా అభివృద్ధి - వివిధ రంగాలలో సాధించిన ఉత్పత్తి - రాష్ట్రాలవారీగా సాధించిన ఆర్థికాభివృద్ధి.

1.5 భారతదేశ వృత్తి నిర్మాణత - శ్రామికశక్తి పంపిణి.

1.6 అవస్థాపన సౌకర్యాల కల్పన.

1.7 సారాంశము

1.8 కఠిన పదాలు

1.9 నమూనా ప్రశ్నలు

1.10 చదువవలసిన గ్రంథాలు

1.1 ఉపోద్ఘాతము :

ఈ పాఠ్యాంశంలో చర్చించబోయే అంశం "భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణత". అది ఏవిధంగా జరిగింది మరియు దాని తీరుతెన్నులు ఎట్లా వున్నాయో తెలుసుకుందాము. ఈ విషయాన్ని 3 భాగాలుగా విభజించడం జరిగింది. అవి. (i) బ్రిటిష్ పాలనకు పూర్వపు స్థితి ; (ii) స్వాతంత్ర్యం నాటి పరిస్థితి ; మరియు (iii) స్వాతంత్ర్యం తర్వాతి పరిస్థితి. భారతదేశంలో ఆర్థిక ప్రక్రియ ఎట్లా రూపుదిద్దుకుందో తెలుసుకుంటే ఆర్థిక వ్యవస్థ నిర్మాణత ఎట్లా జరిగిందో తెలుస్తుంది. ఆర్థిక ప్రక్రియ ప్రకారం ఆర్థిక వ్యవస్థని మూడింటి క్రింద విభజించవచ్చు. అవి ఏమనగా (i) ప్రాథమిక రంగం అనగా వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగములు ; (ii) ద్వితీయ రంగం అంటే పారిశ్రామిక రంగం ; మరియు (iii) తృతీయ రంగం అనగా సేవల రంగం. వ్యవసాయ రంగంలో సేద్యపురంగం, అడవులు, పశు సంవర్ధనం మరియు చేపల వేట మొదలైనవి వుంటాయి. పారిశ్రామిక రంగంలో గనులు, మాన్యుఫాక్చరింగ్, మరియు విద్యుచ్ఛక్తి, గ్యాస్, మరియు నీటి సరఫరా రంగాలు వుంటాయి. ఒక సేవల రంగంలో రవాణా సౌకర్యాలు, పౌర సమాచార వ్యవస్థ, బ్యాంకింగ్, ఫైనాన్స్ మరియు భీమా రంగం, నిర్మాణ రంగం, హోటల్ మరియు టూరిజం, వ్యక్తిగత సేవలు, మొదలైనవి వుంటాయి. ఈ రంగాలు సాధించిన ప్రగతిని ఈ పాఠంలో నెర్చుకుంటారు. వీటితో పాటుగా వృత్తిపరంగా గమనశీలత గురించి, స్థూలదేశీయోత్పత్తిలో పైన చెప్పిన రంగాల వాటా, అవస్థాపన సౌకర్యాల కల్పన మొదలైన విషయాలు చర్చించబడతాయి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణతపై బ్రిటీష్ వారి విధానాల ప్రభావం ఎంతైన వుంది. వారి పాలనా కాలంలో అనగా 200 సం॥లలో వారు ఆర్థిక వ్యవస్థ పరంగా తీసుకున్న విధానాలు భారతదేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, మరియు భౌగోళిక పరిస్థితులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయనడంలో సందేహంలేదు. ఆ ప్రభావం యినాటికి కూడా జీవించి వుందనే చెప్పాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశ ప్రభుత్వం ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికై ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి శ్రీకారం చుట్టడం జరిగింది. దీని కొరకై 1950 లో ప్రణాళికా సంఘాన్ని స్థాపించడం జరిగింది. ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో 9 పంచవర్ష ప్రణాళికలు పూర్తి అయ్యాయి. దీంట్లో ఎన్నో విజయాలు సాధించినప్పటికి సోవియట్ ప్రణాళికలు సాధించినంత ఘన విజయాన్ని సాధించడం జరగలేదు. ఈ ప్రణాళికల మూలంగా స్థూల దేశీయోత్పత్తిలో 90 దశకంలో 6.6 శాతం సాధించడం జరిగింది. తలసరి ఆదాయం 500 కి పెరిగింది. 10 వ ప్రణాళికా కాలంలో కనీసం 7 శాతం వృద్ధిని సాధించగలమనే ధీమా వ్యక్తం చేయబడింది. (లక్ష్యం 8%) స్థూలదేశీయోత్పత్తిలో ప్రాథమికరంగం వాటా గణనీయంగా తగ్గి ద్వితీయ మరియు తృతీయ రంగాల వాటాలు పెరగడం ద్వారా భారతదేశం అభివృద్ధి పథంలో నడుస్తోంది. అయితే వ్యవసాయ రంగం మీద ఆధారపడిన జనభా శాతం మాత్రం పెద్దగా తగ్గలేదు. ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడం జరిగింది. పారిశ్రామిక రంగంలో మాన్యుఫాక్యరింగ్ మరియు విద్యుచ్ఛక్తి రంగాలు వృద్ధిని సాధిస్తున్నాయి. రైల్వేలు, రవాణా, బ్యాంకింగ్ మొదలైన రంగాలు ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నాయి. వృత్తి పరమైన గమన శీలత కూడా బాగా పెరిగింది. విద్యావకాశాలు మెరుగై నిపుణత కల్గిన శ్రామిక శక్తి అధికం అయ్యింది. భారత దేశం వేగంగా అభివృద్ధిని సాధిస్తున్న దేశాల సరసన స్థానాన్ని సంపాదించింది. (BRIC Report 2003). అయితే ఈ రోజున 26 శాతం మంది ప్రజలు యింకా పేదరిక రేఖ దిగువనే వున్నారు. అందుచేత సాధించవలసిన మార్పు యింకా వుంది. ఆర్థిక వ్యవస్థ నిర్మాణత యొక్క స్వరూప స్వభావాలు ఆర్థిక ప్రక్రియలో జరిగేటటువంటి మార్పు ద్వారా తెలియవీలున్నది.

1.2 బ్రిటిష్ పాలనకు పూర్వపు స్థితి :

బ్రిటిష్ వారి పాలనకు పూర్వం అనగా 18 వ శతాబ్దపు అర్ధ భాగంలో భారత ఆర్థికవ్యవస్థ అంత ఆశాజనకంగా లేదు. దీనికి ముఖ్య కారణం మొగల్ సామ్రాజ్య పతనం. ఇది భారతదేశ ఆర్థిక, రాజకీయ విచ్ఛిన్న స్థితికి దారి తీసింది. దీంతో ఆనాటి గ్రామాలు వెనుకబడి ఏకాకిగాను మరియు స్వయం జీవనాధారంగాను వుండేవి. అంటే గ్రామాలే చిన్న చిన్న రాజ్యాలుగా వుండేవి. మరి పట్టణాలైతే పరిపాలనా కేంద్రాలుగా, తీర్థయాత్రాస్థలాలుగా, వ్యాపార మరియు చేతి వృత్తుల నిలయాలుగా వుండేవి. ఈ విషయాలన్నింటిని చార్లెస్ మెట్‌కాఫే (Charles Met calfe) రచనల ద్వారా తెలుసుకోవచ్చు. అయితే అనాటి ఆర్థిక వ్యవస్థ క్షీణ దశలో వున్నప్పటికి "పారిశ్రామికాభివృద్ధిలో

భారతదేశం ఆనాటి యురోపియన్ దేశాలలో ఎంత మాత్రం తీసిపోదని మరియు ఆనాటి రాజుల యొక్క ధన సంపద పరంగాను మరియు శ్రామికుల హస్తకళా నైపుణ్యంలోను భారతదేశం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది," అని 1918 లో స్థాపించబడిన "పారిశ్రామిక సంఘం" అభిప్రాయపడింది.

1.2.1 గ్రామాల వ్యవస్థ :

ముందుగా ఆనాటి గ్రామాల ఆర్థిక వ్యవస్థ గురించి చూద్దాము. దేశంలో 85 శాతం ప్రజానీకం వ్యవసాయం మీద మరియు వ్యవసాయ సంబంధ ఆర్థిక ప్రక్రియల మీద ఆధారపడి జీవించేవారు. వ్యవసాయ సేద్యంతో పాటుగా పశుపోషణ కూడా చేసేవారు. ఆర్థిక ప్రక్రియలలో గ్రామస్థులు శ్రమ విభజన పాటించేవారు. వృత్తి రీత్యా ప్రత్యేకీకరణగాని, నైపుణ్యతగాని అనాడు గ్రామ ప్రజలలో వుండేవి కావు. అయితే నేత పనివారు, బంగారం పనివారు, వండ్రింగివారు, కుండలు చేసేవారు, మొదలైన వృత్తుల వారు వుండేవారు. ఈ వృత్తులన్ని వంశానుగతంగా వుండేవి. పంట చేతికొచ్చినపుడు చేతి పనివారలకు ఎంతో కొంత ముట్ట చెప్పడం ద్వారా ఆర్థిక ప్రక్రియలో అంతర సంబంధాలు ఎట్లా వుంటాయో తెలుస్తుంది.

అంతే కాకుండా గ్రామాలన్ని స్వయం జీవనాధారిత గ్రామాలు, అనగా ముమారుగా గ్రామీణులు వారి అవసరాలన్ని వారే తీర్చుకుంటారు. యిది ఎలా జరుగుతుందంటే వ్యవసాయదారులు మరియు చేతి పనివారలు ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకునే విధంగా జీవనం సాగించడం వల్ల. అయితే ఈ గ్రామాలు ఉప్పు, సున్నితమైన బట్ట, విలాసవంత వస్తువులకు, ఇతర గ్రామాల మీదనో లేక పట్టణాల మీదనో ఆధారపడేవారు. అందుచేత ఈ గ్రామాలను స్వయం సమృద్ధి గల్గిన రిపబ్లిక్స్‌లుగా మెట్‌కాఫ్ అభివర్ణించాడు.

భారతదేశ గ్రామ ప్రాంతాలలో మూడు వర్గాల ప్రజలు జీవనం సాగిస్తూ వుండేవారు. వారు : వ్యవసాయదారులు; గ్రామీణ హస్తకళానిపుణులు మరియు ఇతర పనివారలు; మరియు గ్రామ పాలనాధికారులు. వ్యవసాయదార్లని భూయజమానులని మరియు కౌలుదార్లని విభజన వుండేది. శ్రమ, మూలధనాన్ని ఉత్పత్తిదారు పొదుపు ద్వారా జమిందార్ల ద్వారా, మరియు వడ్డి వ్యాపారస్తుల ద్వారా సమకూర్చబడేది. చేతివృతుల వారు మరియు ఇతర పనివాళ్ళు గ్రామ సేవకులుగా వుండేవారు. గ్రామాల్లో స్థానిక స్వపరిపాలన "పంచాయత్" ల ద్వారా జరిగేది. ఈ పంచాయత్‌లో గ్రామ న్యాయ స్థానాలుగా వుండి గ్రామ తగాదాలని పరిష్కరించేవారు.

ఆనాటి గ్రామాలు సంపూర్ణ పరిపాలన మరియు ఆర్థిక వ్యవస్థలుగా వుండేవి. అయితే వీటికి యుద్ధాలు మరియు రాజకీయ విప్లవాల తాకిడి లేకపోలేదు.

ఆనాడు వ్యవసాయం యొక్క పరిస్థితి హీన స్థితిలో వుండేది. రైతుల పరిస్థితి చాలా బాధాకరంగా వుండేది. దీనికి కారణం రైతుల మీద అనాడు అధిక పన్ను భారం పడేది. అనాటి పరిపాలన యంత్రాంగం రైతులను అధిక పన్నులను విధించి తీవ్రంగా పీడించేది. రైతులు అతి పురతాన పద్ధతులను ఉపయోగించి పంటలు పండించేవారు. అంతే కాకుండా పూర్తిగా జీవ రసాయన ఎరువులు వాడేవారు. డా॥ బుభావన్ మరియు ఆచార్య గాడ్గిల్ మాటల్లో చెప్పాలంటే, "రైతుల పరిస్థితి ఆనాడు చాలా దయనీయంగా వుండి భూవిధానం రైతుల పురోగతికి ఆటంకంగా వుంటూ ఈ భూవిధానాలన్ని పరిపాలకుల మరియు జమిందారుల అభ్యున్నతికి మాత్రమే తోడ్పడేవి అని అనడంలో సందేహం లేదు."

1.2.2 పట్టణాల వ్యవస్థ :

యిక పట్టణాల విషయానికొస్తే, అనాడు మొత్తం జనాభాలో అతికొద్ది మంది మాత్రమే అనగా ముమారు 10 శాతం మాత్రమే పట్టణాలలో నివసించే వారు. అందుచేత, ఆనాటి పట్టణాలన్నింటిని పెద్దగా పెరిగిన గ్రామాలని అనవచ్చు. ఆచార్య గాడ్గిల్ ప్రకారం అనాటి పట్టణాల ఆవిర్భావానికి ఈ క్రింది కారణాలు చెప్పవచ్చును.

(i) అనాటి పట్టణాలన్ని తీర్థయాత్రాస్థలాలుగా వుండేవి.

ఉదా ॥ కాశి, గయ, అలహాబాద్, పూరి, నాసిక్ మొదలైనవి.

(ii) పట్టణాలు రాజదర్బారు కేంద్రాలుగా మరియు రాజధాని ప్రదేశాలుగా వుండేవి.

ఉదా ॥ ఢిల్లీ, లాహోర్, పూనా, మొదలైనవి.

(iii) పట్టణాలు వర్తక వ్యాపార కేంద్రాలుగానూ వుండేవి. అనాటి పట్టణాలు అతిముఖ్యమైన వ్యాపార మార్గాలలో వుండేవి.

ఉదా ॥ హుబ్లీ, మీర్జాపూర్, సూరత్ మొదలైనవి.

పట్టణాలలో జీవన విధానం గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే వేరుగా వుండేది. పట్టణాలలో అనేక వృత్తులు మరియు అనేక రకాల వర్తకాలు వుంటూ వుండేవి. ఈ క్రేందాలు అనేక మార్కెట్లతో లావాదేవీలు జరిపేవి. మార్కెట్ల పరిమాణం కూడ పెద్దగా వుండేది.

ఆనాటి భారతదేశం ఎక్కువగా వ్యవసాయాధారిత దేశమైనప్పటికి, కొన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులు ముఖ్యంగా హస్తకళా నైపుణ్యం కల్గిన ఉత్పత్తులు ప్రపంచ ప్రఖ్యాతి గాంచినవి. యివి టెక్స్‌టైల్స్‌లో రంగంలో వుండేవి. యివి పట్టు వస్త్రాలు, ముస్లిన్ (Muslin) మొదలైనవి. వీటి ప్రాముఖ్యత గురించి టి.ఎన్. ముఖర్జి యిట్లా అన్నాడు, "ఒక ముస్లిన్ వస్త్రం, 20 గజముల పొడవు మరియు ఒక గజము వెడల్పు గలిగినది, ఒక వేలి ఉంగరంలో పట్టడమే కాకుండా ఆ కొలతలు గల వస్త్రాన్ని తయారు చేయడానికి 6 నెలలు కాలం పట్టేది."

యింకా ఆనాటి భారతదేశం నిపుణత కల్గిన అనేక చేతి వృత్తులకు ఆలవాలము. ఉదా ॥ రాతి మరియు చెక్క చెక్కడములు, బంగారు, వెండి ఆభరణములు, రాగి మరియు ఇత్తడి వస్తువులు, మొదలైనవి.

ఎమ్.జి.రానడే ప్రకారం, "భారతదేశం దేశీయంగా ప్రజల అవసరాలు తీర్చడమే కాకుండా విదేశాలకు కూడా వస్తువులను ఎగుమతి చేసే విధంగా ఆనాటి పరిశ్రమలు తోడ్పడ్డాయి." అంతే కాకుండా, ఈనాటి ఆధునిక దేశాలుగా వున్న పశ్చిమ ఐరోపా దేశాలు అనాగరిక ప్రజలతో నిండి వున్న కాలంలో భారతదేశంలో హస్తకళా నిపుణులకు భోగ భోగ్యాలతో తులతూగే పాలకులకు ఖ్యాతి వహించింది. యింకనూ, ఐరోపా వ్యాపారస్థులు భారతదేశంలో మొదటగా కాలు మోపేనాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ ముఖ్యంగా పారిశ్రామిక వ్యవస్థ ఏవిధంగాను ఐరోపా దేశాల పారిశ్రామిక వ్యవస్థ కన్నా హీనంగా లేదు. అని 1918 సంవత్సరంలో ఏర్పాటు చేసిన "పారిశ్రామిక సంఘం" (Industrial Commission, 1918) వివరించింది.

ఇక బ్రిటీష్ వారి పాలనకు పూర్వం రవాణా పౌర సమాచార సంబంధాలు చాలా హీన స్థితిలో వుండేవి. రవాణా సంబంధాలు లేకపోవడం వల్ల ఆనాటి గ్రామాలు సంబంధాలులేక ఏకాకిగా మిగిలి వుండేవి. దీంతో ప్రజల గమనశీలత లోపించడమే కాకుండా వస్తురవాణాకి కూడ ఆటంకం కలిగింది. దీని వలన మార్కెట్ పరిమాణం బాగా తగ్గిపోయి మార్కెట్లు గ్రామాలకే పరిమితమై యుండేవి.

1.3 భారతదేశ స్వాతంత్ర్యం నాటి ఆర్థిక వ్యవస్థ :

1947 కి పూర్వం భారతదేశం బ్రిటిష్ వారి వలసరాజ్యంగా వుండేది. బ్రిటిష్ వారు భారతదేశాన్ని దోపిడికి గురిచేశారే తప్ప ఆర్థికాభివృద్ధి పట్ల శ్రద్ధ వహించలేదు. అయితే వారి పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నమైనప్పటికి వారి స్వీయ లాభం కొరకై పరిశ్రమలను స్థాపించి అభివృద్ధికి ఉడతా భక్తిగా తోడ్పడ్డారు. బ్రిటీష్ వారి కన్నా ముందు కూడ భారతదేశం విదేశీయుల దురాక్రమణకు గురిఅయ్యింది. అయితే వారికి, బ్రిటిష్ వారికి తేడా ఏంటంటే, బ్రిటిష్ వారు వారి ప్రత్యేకతను అట్లాగే వుంచుకొని, భారతీయతను జీర్ణించుకోలేక పోయిరి. మరి బ్రిటీష్ వారికన్నా ముందు వచ్చి వారు భారతీయతతో కలిసి పోయేరు. బ్రిటీష్ పాలనలో విదేశి పరిపాలకులు, మరియు భారతదేశ ప్రజలు అన్న తేడా ప్రస్ఫుటంగా కనబడేది. అటువంటి వారికి భారతదేశ అభివృద్ధి పట్ల మక్కువ ఏట్లా వుంటుంది.

13.1 1757 - 1858 కాలం :

బ్రిటీష్ పాలనను రెండు కాలాల క్రింద విభజించి చెప్పవచ్చును. మొదటిది ఈస్ట్ ఇండియా కంపెనీ యొక్క పాలనా కాలం : 1757 నుండి 1858. రెండవది బ్రిటిష్ ప్రభుత్వ పాలనాకాలం : 1858 నుండి 1947 వరకు. ఈ రెండు కాలాల ఆధారంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఏట్లా రూపుదిద్దుకుందో తెలుసుకోవచ్చు. మొదటి కాలంలో బ్రిటిష్ వాళ్ళు భారతదేశాన్ని వలస రాజ్యంగా మార్చివేసిరి. ఆ

కాలంలో ఇంగ్లాండులో ఉత్పత్తి పద్ధతుల పరంగా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇదే కాలంలో ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం (1805) జరిగి అక్కడ తయారైన వస్తువులకి వలస రాజ్యమైన భారతదేశం మార్కెట్టుగా మారిపోయింది. భారతదేశ హస్తకళా వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులుగా ఇంగ్లాండు నుండి వస్తు దిగుమతి ఆరంభమైంది. అంతేకాకుండా, బ్రిటీష్ వారి ఆక్రమణ కారణంగా నూతన భూమి శిస్తు విధానం ప్రవేశ పెట్టబడి తద్వారా అధిక పన్నులను రైతుల మీద విధించబడి గ్రామీణ వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. దీంతో బాటుగా ఆనాడు దేశం తీవ్ర క్షామ పరిస్థితులు నెలకొనడం చేత ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం అయింది.

బ్రిటీష్ వారు స్వేచ్ఛా వ్యాపారాన్ని ప్రోత్సహించడం వలన భారతదేశం అతి పురాతనమైన టెక్స్‌టైల్స్ పరిశ్రమ విదేశాల నుండి దిగుమతి అయ్యే యంత్ర తయారి టెక్స్‌టైల్స్ నుండి ఎదురయ్యే పోటీని తట్టుకుని నిలబడలేక హస్తకళా పరిశ్రమలన్ని మూతపడ్డాయి. ఈ పరిశ్రమలలోని చేతి నైపుణ్యం గల శ్రామికులు భూమి లేని కార్మికులుగా మారిపోయిరి. దీంతో వ్యవసాయరంగంలో ఆధారపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగి ప్రచ్ఛన్న నిరుద్యోగితకు దారి తీసింది. నిరుద్యోగిత అటుంచి, వ్యవసాయం మీద ఆధారపడ్డ వారి సంఖ్య 19 వ శతాబ్దం మధ్య భాగంలో 55 శాతం వుంటే, 1901 నాటికి 68 శాతం గాను మరియు 1931 కి 72 శాతంగా పెరిగింది. దీని వలన సేద్యపు భూమి చిన్న చిన్న కమతాలుగా మారి వ్యవసాయ రంగం ముక్కచెక్కలైంది.

అత్యంత విలువైన మరియు కొరతగా వున్న వనరుల సంపదని బ్రిటీష్ వారు భారత దేశం నుండి వారి దేశానికి తరలించి వేసిరి. భారతదేశాన్ని వనరులపరంగా వట్టిపోయేటట్లు చేసిపోయిరి. దీనినే " ఆర్థిక డ్రైన్ సిద్ధాంతం" (Economic Drain Theory). ఈ తరలింపు నిమిత్తం రైల్వేలని, నీటిపారుదల ప్రాజెక్టులని, రెవెన్యూ పరగణాలని (Revenue Settlements) విద్యా వ్యవస్థలని కొంతలో కొంత అభివృద్ధి పరిచేరు. ముఖ్యంగా విద్యా వ్యాప్తివల్ల లేనిపో) అనర్థాలకు దారితీసింది. మిడిమిడి చదువులతో పాశ్చాత్య వేష ధారణలపై మోజు పెరిగి దేశీయ వస్త్ర పరిశ్రమ దెబ్బతింది. అంటే విదేశీ వస్త్రాల మీద, వస్తువుల మీద మోజు పెరిగింది. దీంతో దేశీయ పరిశ్రమలుదెబ్బతిన్నాయి. దీంతో దేశీయ సంస్కృతి పట్ల వ్యతిరేకత మరియు చిన్న చూపు కల్గి విదేశీ వస్తువుల పట్ల, సంస్కృతి పట్ల వ్యామోహం పెరిగిటట్లు చేయడంలో బ్రిటీష్ వారు కృతకృత్యులైయ్యారు. దీనినే "విభజించి పాలించడం" అని అంటారు.

1.3.2 1850-1947 కాలం : వ్యవసాయరంగ వ్యాపారీకరణ :- (Commercialization of Agriculture)

1850 - 1947 కాలంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థలో యింకొక ముఖ్యమైన మార్పు చోటు చేసుకుంది. అదే "వ్యవసాయరంగ వ్యాపారీకరణ" (Commercialization of Agriculture) అంటే వ్యవసాయ రంగం ఆ రోజుల్లో ఆధారపడిన కుటుంబాల అవసరాలు తీర్చేది. అనగా పండిన పంట అది పండించిన కుటుంబం యొక్క అవసరాలు తీరేటట్లు ఉండటమే తప్ప ఆ పంటని అమ్ముకొనడానికి సరిపడేటంత "మిగులు" ఉండేది కాదు. అనగా "అమ్ముకోదగ్గ మిగులు" (Maketable Supplies) ఆరోజుల్లో వుండేది కాదు. అయితే పైన ఉదహరించిన కాలంలో (1850-1947) భారతదేశ వస్తువులకు విదేశాలలో బాగా గిరాకి పెరిగింది. ముఖ్యంగా ప్రత్తి, జ్యూట్, నూనె గింజలు, నీలిమందు, మొదలైన వాటికి ఈ గిరాకి ఆనాడు ప్రారంభమైన "పారిశ్రామిక విప్లవం" కారణంగా వ్యవసాయాధారిత ముడి సరుకులైన ముడిప్రత్తి, ముడి జనుములకు ఏర్పడింది. అంతే కాకుండా బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుండి పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులను నిలిసి వేసింది. దీంతో ముడి సరుకులను అందున వ్యవసాయ సంబంధిత ఎగుమతి చేసే ఆర్థిక వ్యవస్థగా మారింది.

ఈ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగంలో ఉత్పత్తి కుటుంబ వినియోగానికి గాకుండా మార్కెట్‌లో అమ్మకాలకుపకరించే లాగున చేయటాన్ని వ్యాపారీకరణ అని అనవచ్చు. అంటే వ్యవసాయ ఉత్పత్తులను డబ్బుకి విక్రయించేలాగున బ్రిటీష్ ప్రభుత్వం వ్యవసాయదార్లని పురికొల్పింది. అంటే అధిక గిట్టుబాటు ధరలని ప్రభుత్వం ఆశచూపడంతో ముఖ్యంగా వ్యాపార పంటలకు అనగా ప్రత్తి, జనుము మొదలైనవి, రైతులు ఆహార పంటల స్థానంలో వ్యాపార పంటలు వేయనారంభించారు. వ్యాపార పంటలను మార్కెట్టులో అమ్ముకోవాలే తప్ప రైతు కుటుంబ వినియోగానికి పనికిరాదు. దీంతో అనాటి మార్కెట్లలో వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు, మరియు కొనుగోళ్ళు ఆరంభమైయ్యాయి. ఆహార పంటల విస్తీర్ణం తగ్గింది. ఇదే కాలంలో దేశంలో తీవ్ర క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ వ్యాపారీకరణ జరగడానికి యింకొక కారణం బ్రిటిష్ ప్రభుత్వం తన అవసరాలను ఎక్కువ అవ్వడం చేత అధిక రేటులో భూమి

శిస్తుని వసూలు చేసే పరిస్థితి ఏర్పడింది. అనాటి జమిందార్లు రైతుల వద్ద నుండి అత్యధిక అద్దెలో కూడ వసూలు చేయనారంభించిరి. ఈ కారణాల వల్ల వ్యవసాయరంగం వ్యాపారీకరణ దిశగా ప్రయాణించింది.

పారిశ్రామిక విప్లవం ఆధారంగా భారతదేశంలో జరిగిన వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారీకరణ, 1850 లో రవాణా రంగం అభివృద్ధిని సాధించడం ప్రారంభమైంది. అంటే రోడ్డు రవాణా, రైల్వే రవాణా ప్రారంభించబడ్డాయి. రైల్వే రవాణా 1853 లో ప్రారంభమై భారతదేశంలోని మారుమూల ప్రాంతాలను సైతం కలిపి దేశం యొక్క ఆర్థిక ఐక్యతకి దారి తీసింది. దీంతో పంజాబు నుండి గోధుమలు, బెంగాల్ నుండి జనుము, బొంబె నుండి ప్రత్తి ఇంగ్లాండుకి అధిక మొత్తంలో ఎగుమతి జరిగింది. ఈ రైల్వేలు ఎలాగైతే అధిక మొత్తంలో వ్యాపార పంటలను ఇంగ్లాండుకి మోసుకెళ్ళాయో తిరుగు టపాలో అధిక మొత్తం యాంత్రిక వస్తువులను భారత దేశానికి దిగుమతి చేశాయి. ఈ యాంత్రిక వస్తువుల నుండి ఎదురైయ్యే పోటిని భారత హస్తకళా వస్తువులు తట్టుకుని నిలబడలేక కుప్పకూలిపోయాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థ బ్రిటీష్ వారి దయా దాక్షిణ్యాల మీద పూర్తిగా ఆధారపడి జీవించే పరిస్థితి ఎదురైంది.

వ్యవసాయరంగ వ్యాపారీకరణ ద్వారా వచ్చిన ఫలితాలను ఈ క్రింది వాటిలో గమనించగలరు.

(i) వ్యాపార పంటల (Cash Crops) ఉత్పత్తి మరియు విస్తీర్ణము పెరిగాయి; (ii) వ్యాపార పంటలకి మార్కెట్లు కూడా పెరిగాయి; (iii) వ్యాపార పంటలు పండించే రైతుల ఆదాయాలు కూడా పెరిగాయి: (iv) క్రొత్త వ్యాపార పంటలైన కాఫీ, తేయాకు, వేరుశనగ, బంగళాదుంపలు, పళ్ళు, క్రొత్త నూనె గింజల పంటలు మొదలైన పంటలు అభివృద్ధి చెందాయి; మరియు (v) గ్రామ స్వావలంబనకి తీవ్ర విఘాతం ఏర్పడింది.

1.3.3 క్షామాలు (Famines)

బ్రిటీష్ వారి భూమి శిస్తు విధానం వల్ల మరియు వ్యవసాయరంగ వ్యాపారీకరణ వల్ల, భారతదేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్ర విషమ పరిస్థితులు తరచుగా సంభవించే క్షామాల (Famines) రూపంలో ఏర్పడ్డాయి. అంతే కాకుండా, భారతదేశ పారిశ్రామికీకరణకి కూడ యివి పెద్ద అడ్డుగోడగా నిలిచేయి. ఈ క్షామాలకు ముఖ్య కారణం ఆహార పంటల విస్తీర్ణం తగ్గడమే. అప్పుడున్న భూమి శిస్తు విధానం వల్ల వ్యవసాయాభివృద్ధి కుంటు పడింది. వీటిలో క్షామాలు తరచుగా వచ్చేవి. ఈ క్షామాలతో అనాటి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురిఅయ్యేరు. 1765 నుండి 1858 కాలంలో 12 క్షామాలు మరియు 4 పెద్ద కొరత పరిస్థితులు ఏర్పడ్డాయి. తర్వాత 1860 నుండి 1908 వరకు అంటే 49 సం॥లలో 20 క్షామాలు ఏర్పడ్డాయి. అయితే 1908 నుండి 1942 వరకు ఆసలు క్షామాలు ఏర్పడలేదు. 1943 లో వచ్చిన బెంగాలు క్షామం తీవ్ర సంక్షోభాన్ని సృష్టించింది. ఇటువంటి క్షామం మునుపెన్నడురాలేదు. క్షామ సంఘం (Famine Commission) ప్రకారం 15 లక్షలు మంది చనిపోయారని అంచనా. అయితే అనధికార వర్గాల లెక్కల ప్రకారం ముమారుగా 35 లక్షల ప్రాణ నష్టం జరిగిందని అంచనా.

1.3.4 పారిశ్రామీకరణ (Industrialisation) :

యిక బ్రిటీష్ వారి హయాంలో భారతదేశ పారిశ్రామికీకరణకి వస్తే, భారతదేశంలో పారిశ్రామీకీకరణ అంతా ప్రైవేటు రంగంలోనే జరిగింది. అది స్వదేశీ అయినా విదేశీ అయినా, భారతదేశంలో ముఖ్యంగా నూలు మిల్లుల ద్వారా పారిశ్రామీకీకరణ జరిగిందని చెప్పవచ్చు. 1850-55 ప్రాంతంలో మొదటిగా నూలు మిల్లు, జూ మిల్లు, మరియు బొగ్గుగని ప్రారంభించబడినవి. 19 వ శతాబ్దం చివరి నాటికి భారత్‌లో 194 నూలు మిల్లులు, మరియు 36 జ.. వార మిల్లులు వున్నాయి. అంతే కాకుండా బొగ్గు ఉత్పత్తి 6 మిలియన్ టన్నులకు పెరిగింది. ఒక సంవత్సరానికి 1905 సం॥నాటికి భారత్‌లో "స్వదేశీ ఉద్యమం" ప్రారంభమైంది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 70 నూలు మిల్లులు, 30 జనపనార మిల్లులు ప్రారంభించబడ్డాయి. బొగ్గు ఉత్పత్తి 100 శాతం కన్నా ఎక్కువగా పెరిగింది. రైల్వే వ్యవస్థ సం॥కి 800 మైళ్ళు విస్తీర్ణం మేర పెరగనారంభించింది. ఇనుము మరియు ఉక్కు కర్మాగార స్థాపన పరంపర యిప్పడే అంటే మొదటి ప్రపంచ యుద్ధ కాలంలోనే ఆరంభమైంది. ఇదే కాలంలో భారత్ యొక్క యాంత్రిక వస్తువులకి విదేశాలలో గిరాకి పెరిగింది. విదేశాల నుండి దిగుమతులు బాగా తగ్గాయి. అయితే 1923 లో మొదటి విత్త సంఘం (First Fiscal Commission)

ఆదేశానుసారంగా భారత పరిశ్రమలలో కొన్నింటికి విదేశీ పోటి నుండి రక్షణ ఏర్పాటు చేయడమైనది. ఈ రక్షణ వలయంలో ఇనుము మరియు స్టీలు, నూలు ఉత్పత్తులు, జ్యూట్, పంచదార, పేపర్, అగ్గిపెట్టెలు మొదలైనవి వున్నాయి. దీంతో పారిశ్రామికాభివృద్ధి వేగవంతమైంది. తర్వాత 2 వ ప్రపంచ యుద్ధం వల్ల యంత్ర సామాగ్రికి విపరీతమైన గిరాకి ఏర్పడింది. దీంతో 1939 మరియు 1945 కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి 20 శాతం పెరిగింది. మొత్తం ఉత్పత్తి సూచిక 1945 మరియు 1950 కాలంలో 5 శాతం పెరిగింది. మొదటి యుద్ధ కాలంలో (1914) బ్రిటీష్ వాళ్ళు భారత భారీ పరిశ్రమలలో 50 శాతం పరిశ్రమలలో యాజమాన్య హక్కులు కలిగివున్నారు. అయితే రాను రాను ఈ వాటా తగ్గింది. ఉదా ॥కి 1914 లో ఈ వాటా 43 శాతం వుండగా, 1935 కి 10 శాతంకి తగ్గగా, 1948 నాటికి 3.6 శాతానికి పడిపోయింది. అంతే కాకుండా, బ్రిటీష్ వారు భౌగోళిక కారణాల వల్ల కొన్ని పరిశ్రమలను అభివృద్ధి పరిచారు. అవి జ్యూటు మరియు ప్లాన్‌టేషన్ పరిశ్రమలు. ఈ కారణం చేతనే కాఫీ మరియు ఈ ప్లాన్‌టేషన్స్ అభివృద్ధి చెందాయి. బ్రిటీష్ వారు ముఖ్యంగా భారత్‌ను దేశీయ పరిశ్రమలకు నాశనం చేసి వారియొక్క యాంత్రిక పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యవసాయ వలస రాజ్యంగా మార్చి వేసిరి.

1.3.5 రవాణా మరియు సమాచార సౌకర్యాలు :

రవాణా మరియు సమాచార సంబంధాల విషయంగా భారతదేశం బ్రిటీష్ వారి కాలంలో చాలా వెనుకబడి వుంది. దీంట్లో ముఖ్యంగా రోడ్లు మరియు రైల్వే వ్యవస్థలు వస్తాయి. రవాణా వ్యవస్థ సరిగాలేకపోవడం వల్ల ఆనాటి గ్రామాలు ఇతర ప్రాంతాలలో సంబంధాలు లేక ఏకాకిగా మిగిలిపోయాయి. అయితే ఈస్ట్ ఇండియా కంపెనీ 1836 లో తపాల వ్యవస్థను ప్రవేశ పెట్టింది. దీంతో 1.5 మిలియన్ ఖర్చుతో కలకత్తా - ఢిల్లీ రోడ్డుని వేయడం జరిగింది. 1842 లో కలకత్తా - బొంబే మరియు బోంబే - ఆగ్రా రోడ్లులు వేసారు. యివన్నీ యుద్ధ తంత్రం నడపడానికి ఉద్దేశించ బడినవే. ఈ రోడ్లుతో ఎంతో కొంత సామాజికాభి వృద్ధి కూడా జరిగిందని చెప్పవచ్చును. రోడ్ల వ్యవస్థ అంతంత మాత్రంగానే వుండడానికి కారణం నిధుల కొరత మరియు వ్యవస్థాపరమైన లోటుపాట్లు. 1850 లో పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్‌ని ఏర్పాటు చేసి భారతదేశం అంతటా రోడ్లు వేయ నిర్ణయించిరి. అయితే 1827 ప్రారంభించిన రోడ్ల అభివృద్ధి సంఘం (Road Development Committee) గ్రాండ్ ట్రంక్ రోడ్లను అనగా జాతీయ రహదారులను కేంద్ర ప్రభుత్వం మరియు మిగిలిన రోడ్లనే రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించవలెనని సూచించింది. ఈ సంఘం రోడ్డు వేయిడానికి రోడ్లు నిధిని (Road Fund) ఏర్పాటు చేయాలని కూడా సూచించింది. 1943 నాటికి 95,054 మైళ్ళ తారు రోడ్లు, 2,01,414 మైళ్ళ కాచ్చా రోడ్లు వేయడం జరిగింది.

రైల్వేల అభివృద్ధి బ్రిటీష్ వారి కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో కీలక పాత్ర వహించింది. భారత దేశంలో మొదటిగా ఎప్రియల్ 16, 1853 న మొదటి పాసింజరు రైలు బొంబే నుండి థానా వరకు అంటే 21 మైళ్ళ దూరం నడపబడింది. రైల్వేల అభివృద్ధి మొదటి దశలో అనగా 1859-69 కాలంలో 4,600 మైళ్ళ రైల్వేలైనులు వేయబడ్డాయి. రెండవ దశ అనగా 1869-79 లో 2,200 మైళ్ళు మరియు మూడవ దశలో అనగా 1880-1900 లో భారత్‌లోని నలుమూలలకు రైల్వేలు అభివృద్ధి పరచబడ్డాయి. 20 వ శతాబ్దం ఆరంభం నాటికి భారత్‌లో 25,000 మైళ్ళ రైల్వేలు విస్తరించబడ్డాయి. 1947 నాటికి ఈ మైలేజిని 40,525 మైళ్ల మేర పెంచబడింది. ఆనాటి విభజన కారణంగా భారత్ భూభాగంలో 33,865 మైళ్ళ మేర రైల్వే లైనులు దక్కాయన్నమాట.

ఈ రైల్వే విస్తరణ వల్ల ఆర్థిక, సామాజిక, రాజకీయ ఫలితాలు ఏర్పడ్డాయి. ఈ రైల్వే వ్యవస్థ మూలంగా వ్యవసాయ రంగం వ్యాపారీకరణ జరగడమేకాక విదేశీ వ్యాపారం గణనీయంగా పెరిగింది. దేశీయ వ్యాపారం అభివృద్ధి చెందడమే కాకుండా ఆధునిక భారీ పరిశ్రమలను భారతదేశంలో స్థాపించడం జరిగింది. దీంతో పాటుగా సామాజిక రాజకీయ మార్పులు అనేకం చోటు చేసుకున్నాయి.

1947 లో దేశ విభజన జరిగి భారతదేశంగా, పాకిస్థాన్‌గా అఖండ భారతదేశం విడిపోయింది. 71 శాతం భూమి భారత్‌కు మిగిలింది పాకిస్థాన్‌కు వెళ్ళింది. జనుము, ప్రత్తి పంటలకుపకరించే సారవంతమైన భూమి పాకిస్థాన్‌కు, కర్మాగారాలు భారత్‌కు పంపిణి అయ్యాయి. దీంతో పరిశ్రమల ఉత్పత్తి ముఖ్యంగా జనుము నుండి జనపనార ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. విభజన

వల్ల కాందీశీకులను పోషించే భాధ్యత భారత్ మీద పడింది. అనాడు జరిగిన మత కలహాలు కారణంగా ఘమారుగా 75 లక్షల ప్రజలు భారత్‌లోకి వచ్చి పడ్డారు. ఈ సమయంలో భారతదేశం నుండి సంపన్న మరియు మేధో వర్గంలలో కొంత మంది విదేశాలకు తరలి వెళ్ళి వారితో అమూల్యమైన మూలధనాన్ని కూడ వెంట తీసుకు వెళ్ళిపోయిరి. దీనినే ఆధునిక పరిభాషలో "కాపిటల్ ఫ్లైట్" అని అంటారు.

1.3.6 బ్రిటీష్ వారి దోపిడి (Exploitation by Britishers) :

బ్రిటీష్ వారి రెండు వందల ఏళ్ళ పాలనలో భారతదేశం ఎంతో నష్ట పోయింది. ఒక పేదరిక అల్పాభివృద్ధి దేశంగా మిగిల్చి వారు దేశాన్ని వదిలి వెళ్ళేరు. అమూల్యమైన ఖనరులను పొగొట్టుకుంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హస్త కళా వస్తువుల పరిశ్రమలు మూత బడ్డాయి. బ్రిటీష్ వారు రాక పూర్వం పారిశ్రామిక దేశంగా పేరు గాంచిన భారత్ వారి రాకతో విదేశాల మీద ముఖ్యంగా ఇంగ్లాండు మీద అధికంగా ఆధారపడిన దేశంగా మారిపోయింది. ఇంగ్లీషు విద్య గుమస్తాలను తయారు చేసేందుకే ఉపయోగ పడింది. భారతీయ సనాతన సంప్రదాయాలను ఈ విద్యా విధానం తారుమారు చేసింది. 1876 లో దాదాభాయి నౌరోజి "Poverty in India" అనే గ్రంథంలో భారత్‌ను బ్రిటీష్ వారు ఎట్లా వట్టిపోయేటట్లు చేశారో వివరణ యిచ్చాడు ఈయన. "జాతీయాదాయం ఒక సం॥కి 10 శాతం చొప్పున ఇంగ్లాండుకు తరలిపోయిందని" వివరించాడు. అనాటి తలసరి ఆదాయం తత్సంభ జీవన ప్రమాణం చాలా శోభనీయంగా వుండెదని చెప్పవచ్చు. ఉదా॥కి 1867-68 లో జాతీయాదాయం 340 కోట్లు వుండగా, తలసరి ఆదాయం ఒక్క 20 రూపాయలు మాత్రమే (దాదాబాయినౌరోజి). 1867-1901 కాలంలో తలసరి ఆదాయం 25 రూ॥ నుండి 29 రూ॥ల వరకు వుంది. ఇదే కాలంలో జనాభా 17 కోట్లుగా వుంది.

అంతే కాకుండా వృత్తిపరమైన మార్పులు కూడా బాగా తక్కువ. వృత్తి పరంగా పురోగతి అటుంచి తిరోగమనం జరిగిందని చెప్పవచ్చు. ఉదా॥కి చేతి నైపుణ్యం గల్గిన శ్రామికులు భూమి లేని కూలీలుగా మారి వ్యవసాయ రంగం మీద మరింతగా భారం మోపబడింది. 1818 వ సం॥లో వ్యవసాయాధారిత జనాభా 61 శాతం వుంటే బ్రిటిష్ వారి పాలన అంతమొందే నాటికి 72 శాతానికి పెరిగింది.

బ్రిటిష్ వారు ప్రపంచమంతా స్వేచ్ఛా వ్యాపారం వుండాలని వాదించి భారత్ యొక్క విదేశీ వ్యాపారంపై ఆంక్షలు విధించి స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతానికి గండి కొట్టారు. ఈ కోవలో నూలు మరియు సిల్కు వస్త్రాలపై ఆంక్షలు విధించడం జరిగింది. ఎందుకంటే ఈ వస్తువులు బ్రిటీష్ వారి ఉత్పత్తుల కంటే ఎంతో నాణ్యమైనవి. అందుకని బ్రిటీష్ వస్తువులు భారత్‌తో పోటిని తట్టుకుని నిలబడి వుండడానికి ఈ ఆంక్షలు విధించారు. అయితే భారత్‌లోకి కొన్ని పరిశ్రమలకి "విచక్షణా సహిత రక్షణ" కల్పించారు. ఈ రక్షణ కల్పించిన పరిశ్రమలు ఇంగ్లాండు పరిశ్రమలలో కాకుండా తక్కిన దేశాలలో పోటి పడవలసి వుంటుందనే నియమాన్ని విధించారు. భారతదేశం ఈ విధంగా బ్రిటీష్ వారి విధానాల వల్ల దోపిడికి గురైంది.

వలసవాదం తొలి రోజుల్లో బ్రిటీష్ వారి దోపిడి విదేశీ వ్యాపారం మీద ఆంక్షలు విధించడం ద్వారా జరిగేది. అయితే వారి స్వీయ అవసరాల నిమిత్తమై భారత్‌లో పెట్టబడులను ప్రోత్సహిస్తే ఎట్లా వుంటుందనే ఆలోచనలో పడ్డారు. కాలనుగుణంగా దీనికొరకై భారత్‌లో వారు ప్రజోపకర పరిశ్రమలలో (Public Utilities) పెట్టబడి పెట్టడానికి నిర్ణయం జరిగింది. దీనిలో భాగంగా విద్యుచ్ఛక్తి తయారి మరియు నీటిపారుదల ప్రాజెక్టులు చేపట్టేరు. దీంతో బాటుగా రైల్వేలను, షిప్పింగ్, పోర్టులు మొదలైన వాటిమీద పెట్టుబడులను ప్రోత్సహించారు. ఈ పెట్టుబడుల వల్ల దేశీయ వనరులను తరలించడానికే ఎక్కువగా ఉపయోగపడ్డాయి. భారత ప్రజలకు కూడ వీటి నుండి ఎంతో కొంత లాభం చేకూరిందని చెప్పక తప్పదు. వీటి వల్ల భారత్‌లో అవస్థాపన సౌకర్యాల కల్పనకి పునాది ఏర్పడిందని అనుకోవచ్చు.

బ్రిటీష్ వారి దోపిడి విధానం యింకా ఎట్లా వుందంటే, భారత్‌లో తన పరిపాలనా యంత్రాంగాన్ని నడపడానికి అధిక సంఖ్యలో బ్రిటీష్ అధికారులను నియమించి వారి హెచ్చు మొత్తంలో జీత భత్యాలను నిర్ణయించింది. భారతీయ సిబ్బందికి జీత

భవ్యాలను అత్యల్పంగా నిర్ణయించింది. ఈ పరిపాలనా యంత్రాంగానికి ముఖ్యంగా సైనిక వ్యవస్థకి అయిన ఖర్చునంతా భారతదేశం మీద రుద్దడం ద్వారా భారత్ సంపదంతా ఇంగ్లాండుకి తరలి వెళ్ళిపోయింది. దీంతో పాటుగా భారత్‌లో రైల్వేలను మరియు నీటిపారుదల ప్రాజెక్టులకు పెట్టుబడిని అధిక వడ్డీకి స్టెర్లింగ్ అప్పులు చేసి ఆ భారాన్నంత భారత ప్రజల మీద మోపింది. దీంతో సంపద తరిగిపోయింది. ఈ రకమైన సంపద తరలింపు 1931 లో 43 కోట్లుగా వుంది.

వ్యవసాయ రంగం, పరిశ్రమల రంగం, విదేశీ వ్యాపారం, రవాణా రంగం, మొదలైన రంగాలన్ని ఎంతో వెనుకబడి ఆనాడు వుండేయి. ఒక ప్రక్క జనాభా పెరుగుతుండడం, యింకొక ప్రక్క జీవన ప్రమాణ స్థాయి అత్యల్పంగా వుండడం (దాదాభాయి నౌరోజి అంచనాల ప్రకారం 1868 లో తలసరి ఆదాయం కేవలం 20 రూపాయలే) యింకోక ప్రక్క తరచుగా వచ్చే క్షామాలు మొదలైన పరిస్థితులలో ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం అయింది. 1860 నుండి 1945 వరకు అనగా 85 సంగల కాలంలో తలసరి ఆదాయం కేవలం 0.5 శాతం మాత్రమే పెరిగింది. (JR Hicks, M. Mukhrjee & S.K. Ghosh.) ఎటువంటి అభివృద్ధికి నోచుకోని నిశ్చల స్థితి (Stagnation) లో వుంది.

బ్రిటీష్ పాలనలో ఆర్థికాభివృద్ధిలో మార్పులు రాలేదని సంప్రదాయ బద్ధంగానే మిగిలిపోయిందని అనడం ఎంతవరకు సమంజసం అని బిపిన్ చంద్ర (Colonialism & Modernisation, 1970) అభిప్రాయ పడ్డాడు. ఆయన యింకా ఇలా అన్నాడు "భారతదేశం సాంప్రదాయ ఆర్థిక సామాజిక వ్యవస్థ నుండి ఆధునిక ఆర్థిక సామాజిక వ్యవస్థగా రూపాంతరం చెందిందనడంలో అతిశయోక్తిలేదు." (Bipin Chandra, 1970).

1.4 1947 తరువాత భారతదేశ ఆర్థిక వ్యవస్థ :

1947 లో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత భారత ప్రభుత్వం ఎదురుకుండా వున్న ప్రధాన సమస్య ఆర్థిక వ్యవస్థ. పేదరిక విషవలయంలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతుండడం. ముఖ్యంగా ప్రపంచ దేశాల్లో అత్యల్ప తలసరి ఆదాయం గల దేశంగా గణుతికెక్కింది అనాడు. తలసరి వినియోగం కూడా చాలా తక్కువ. తక్కువ ఆదాయంతో అత్యల్ప పొదుపు సామర్థ్యం ఏర్పడి తద్వారా మూలధన సంచయం తక్కువ వుండడం జరిగింది. ఎప్పుడైతే మూలధన సంచయం తక్కువగా వుందో దేశీయ ఉత్పాదక శక్తి ఆటోమేటిక్‌గా తగ్గిపోతుంది. దాంతో ఉత్పత్తి కుంటుపడి ఆదాయం తక్కువగా తయారవుతుంది. ఈ విష వలయం పేదరికాన్ని పెంపు చేసింది. మార్కెట్ల పరిమాణం కూడ తక్కువగా వుండడం ఆనాటి భారతదేశ ఆర్థిక వ్యవస్థకి నిదర్శనం. ఆదాయం తక్కువగా వుంటే మరి గిరాకి ఎక్కడి నుండి వస్తుంది. గిరాకి లేకపోతే మార్కెట్టు వుండదు. మార్కెట్లు లేకపోతే ఉద్యమదారులు ఎట్లా ఆర్థిక ప్రక్రియని కొనసాగిస్తారు. ఈ కారణాల వల్ల ఆనాటి ప్రజలు కటిక దరిద్రంలో బాధపడ్డం జరిగింది. అందుచేత ఈ విషయాలను చేధించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం చేయవలసిన బృహత్ బాధ్యత ఆనాటి జాతీయ ప్రభుత్వం మీద పడింది. దీనికొరకై మిశ్రమ ఆర్థిక వ్యవస్థని రూపొందించి ప్రభుత్వ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూనే ప్రైవేటు రంగాన్ని కూడా ప్రోత్సహించాలని నిర్ణయం జరిగింది. దీంతో కీలక రంగ పరిశ్రమలన్ని కూడ ప్రభుత్వం చేతిలో వుంటాయని మొదటగా 1948 పారిశ్రామిక విధాన తీర్మానం నిర్ణయించింది. అంతే కాకుండా, ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి శ్రీకారం చుట్టేరు. 1950 నుండి ప్రణాళిక శకం ఆరంభమైంది. March 1950 లో ప్రణాళిక సంఘాన్ని నియమించి తద్వారా త్వరతగతిన అభివృద్ధిని సాధించడానికై తగు నిర్ణయాలు చేయడం జరిగింది. దీంతో పంచవర్ష ప్రణాళికల ద్వారా ఆర్థికాభివృద్ధి పరంగా లక్ష్యాలు నిర్ణయించి వాటిని సాధించే ప్రక్రియ ఆరంభమైంది. ఈ లక్ష్యాలలో వేగవంతమైన ఆర్థికాభివృద్ధి, రేటు, స్వయం సంవృద్ధి సాంఘిక న్యాయం, ఉద్యోగ కల్పన, ధరల అదుపు, మొదలైనవి వున్నాయి. వీటి సాధనకై ప్రణాళిక సంఘానికి ఈ క్రింది చెప్పిన విధులను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

(i) దేశంలో లభ్యమయ్యే వస్తు, మూలధన, మానవ వనరులను, సాంకేతిక మానవ వనరులను కూడా అంచనా వేసి, ఈ వనరులలో కొరతలుంటే వాటిని పెంపొందింప చేసుకునే అవకాశాలను, దేశీయ అవసరాలను దృష్టిలో వుంచుకుని, అధ్యయనం చేయవలసి వుంటుంది.

(ii) దేశంలో లభ్యమయ్యే వనరులను సమర్థవంతంగాను మరియు సమతౌల్యంగాను ఉపయోగించడానికి ఒక ప్రణాళికను సిద్ధం చేయవలసి వుంటుంది.

(iii) ప్రాధమిక అవసరాలను (Priorities) నిర్ణయించి, ప్రణాళికను కొనసాగించే దశలను వివరించి, ప్రతి దశని పూర్తి చేయడానికి అవసరమయ్యే వనరుల పంపిణీని నిర్దేశించవలసి వుంటుంది.

(iV) ఆర్థికాభివృద్ధిని అడ్డుకునే అంశాలను సూచించి, ప్రణాళికను విజయవంతంగా అమలు జేయడానికి అవసరమయ్యే పరిస్థితులను, సమకాలీన సామాజిక మరియు రాజకీయ స్థితిగతుల దృష్ట్యా, నిర్ణయించవలసి వుంటుంది.

(v) ప్రణాళిక లోని ప్రతిదశకు సంబంధించిన అన్ని విషయాల పరంగా ప్రణాళికను విజయంతంగా అమలు చేయాలంటే అవసరమయ్యే యంత్రాంగం యొక్క స్వరూప స్వభావలను సూచించాలి.

(vi) ప్రణాళికలోని ప్రతి దశ యొక్క పురోగతిని ఎప్పటికప్పుడు తెలిసికొని, విధానపరంగా సర్దుబాట్లను మరియు పద్ధతులను సలహా యివ్వవలసి వుంటుంది.

(vii) దేశంలో వున్నటువంటి ఆర్థిక పరిస్థితులు, విధానాలు, పద్ధతులు, మరియు అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో వుంచుకుని వాటి నిమిత్తమై తన యొక్క (ప్రణాళిక సంఘం) విధులను నిర్వర్తించటానికై అవసరమైన మాధ్యమిక (Interim) లేక సహాయక సలహాలను యివ్వవలసి వుంటుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైన సమస్యలపై వివరణ కోరినప్పుడు కూడా వాటి పరంగా సలహాలు యివ్వవలసి వుంటుంది.

పైన వివరించిన విధులన్ని ఈ నాటికి కూడ అదే విధంగా వున్నాయి. 1951 నుండి 2002 నాటి భారతదేశం 9 ప్రణాళికలను పూర్తి చేసింది. 10 వ ప్రణాళికా (2002-07) కూడా ప్రారంభమైంది. మొదటి ప్రణాళిక (1951-56) లో వ్యవసాయరంగానికి, రెండవ ప్రణాళికలో (1956-61) పరిశ్రమలకి ప్రాధాన్యత నిచ్చాము. భారతదేశ ప్రణాళికలన్నింటిలో విజయవంతంగా లక్ష్య సాధన గావించింది. మొదటి ప్రణాళికలోనే. ఇది కూడ సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండడం వల్ల జరిగింది. 3 వ ప్రణాళిక (1961-66) ముగిసిన తర్వాత పాకిస్థాన్‌తో యుద్ధం వల్లను మరియు అప్పుడు ఏర్పడిన కరువు పరిస్థితుల కారణంగాను "ప్రణాళికా సెలవు" (Plan Holiday) ప్రకటించడం జరిగింది. 1969-74 కాలంలో 4 వ ప్రణాళికను మొదటి సారిగా కాంగ్రేసేతర ప్రభుత్వం అయిన జనతా ప్రభుత్వం ప్రారంభించింది. అయితే 5వ ప్రణాళిక (1974-79) ప్రభుత్వం కేంద్రంలో మారడం చేత 5 సం॥లు పూర్తి కాకుండానే ముగిసింది. 1980 లో కాంగ్రేసు ప్రభుత్వం రాగానే 6 వ ప్రణాళిక (1980-85) ప్రారంభించబడింది. 7 వ ప్రణాళికా కాలంలో (1985-90) ప్రపంచీకరణ, ప్రైవేటికరణ మరియు సరళీకృత ఆర్థిక విధానాలకి బీజం పడింది. 8 వ ప్రణాళికలో (1990-95) 1990 లో ప్రారంభం అయి 5 సం॥లు కాకుండానే ముగిసింది. దీని వలన 2 సం॥లు సాంవత్సరిక ప్రణాళికలు వచ్చాయి. అయితే సరళీకృత ఆర్థిక విధానాలు ఊపందుకున్నాయి. తర్వాత ఎప్రియల్ 1992 లో 8 వ ప్రణాళిక ఆరంభమైంది. దీని యొక్క పిరియడ్ 1992-97. అటు తర్వాత 9 వ ప్రణాళిక కూడ పూర్తి అయ్యింది. (1997-2002). ఈ ప్రణాళిక మొక్క సమీక్ష ఇంకనూ పూర్తి కాలేదు. గడిచిన 52 సం॥ల (1951-2002) ప్రణాళికా కాలంలో జాతీయాదాయం, తలసరి ఆదాయం, పెట్టుబడి మరియు పొదుపులు, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవల రంగాలు పరంగా ఎంతో అభివృద్ధిని సాధించాము. 2003-04 సం॥లో జాతీయాదాయ పెరుగుదల రేటు 7.5 శాతం నమోదు చేసుకుంది. తలసరి ఆదాయం $ 500 గా పెరిగింది. జనాభా 2004 నాటికి 103 కోట్లు దాటినప్పటికి, సాంవత్సరిక జనాభా వృద్ధిరేటు 1.94 శాతంగా తగ్గింది. UNO యొక్క మానవాభివృద్ధి సూచిక ప్రకారం భారతదేశ ర్యాంకు 128 కి చేరింది. మానవాభివృద్ధిలో ప్రపంచంలో మధ్య స్థాయిలోవుంది. అక్షరాస్యులు 62.5 శాతానికి పెరిగారు. శిశు మరణాల రేటు కూడా గణనీయంగా తగ్గింది. అంటే 70 కి తగ్గింది. సగటున భారతీయుడు 60 సం॥లు జీవిస్తున్నాడు. ప్రజలు సామాజికంగా మరియు రాజకీయంగా చైతన్యవంతులయ్యారు. ఎన్నో గడ్డురోగాల నుండి విముక్తి పొందాము. అయితే మొత్తం ప్రజానీకంలో 26 శాతం మంది ప్రజలు పేదరిక రేఖకు దిగువునే వున్నారు. అంచనాల ప్రకారం 2010 నాటికి ఈ శాతం 5 కి పడిపోతుందని ప్రభుత్వం యొక్క ఆశాభావం.

1.4.1 భారత ఆర్థిక వ్యవస్థ నిర్మాణతలో మార్పు మరియు వృద్ధి :

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతి కాలంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా మార్పు చెందుతూ వచ్చింది. ఈ మార్పు 80 దశకంలో వేగాన్ని పుంజుకుంది. ఈ మార్పుని తెలుసుకొని తద్వారా ప్రజల సమిష్టి శ్రేయస్సు తెలియాలంటే ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికరజాతీయోత్పత్తి (NNP at Factor Cost) ఎట్లా పెరిగిందో అనగా ఏ రేటులో వృద్ధి సాధించిందో తెలుసుకొవలసిన అవసరం వుంది. దీన్ని బట్టి ప్రణాళికా పధక రచన ద్వారా భారత్ ఎట్లా ముందుకు పోయిందో తెలుస్తుంది.

పట్టిక 1 లో ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి మరియు తలసరి నికర జాతీయోత్పత్తి Per Capita NN at Factor cost) లను "స్థిర ధరలలోను" (1980-81=100) మరియు "ప్రస్తుత ధరలలోను" పెరుగుదల ఎట్లావుందో తెలుపుతుంది. పెరుగుదల స్థిర ధరలలో చెప్పడం వల్ల వస్తూత్పత్తి యొక్క "నిజ పెరుగుదల" తెలుస్తుంది. అనగా పెరుగుదల ఉత్పత్తి పెరగడం ద్వారా వచ్చిందా లేక ధరలు పెరగడం ద్వారా వచ్చిందా అని తెలుసుకోవచ్చు. అందుచేత ప్రస్తుత ధర ద్వారా పెరుగుదల చూసి అధ్యయనం చేయడంలో ధరల ప్రభావం తప్పని సరిగా వుంటుంది. ఉత్పత్తిలో పెరుగుదలే అసలైన పెరుగుదల. దీనినే నిజపెరుగుదల లేక స్థిర ధరలలో పెరుగుదల అని అంటారు. అందుచేత ప్రస్తుత ధరలలోని నికర జాతీయోత్పత్తిని ఏదో ఒక సంవత్సర ధరలను ఆధారంగా చేసుకొని (ఉదా : 1980-81=100) వాటిలోకి మార్చడాన్ని బట్టి నిజ ఉత్పత్తి పెరుగుదల తెలుస్తుంది.

పట్టిక. 1 లో నిజ నికర జాతీయోత్పత్తి (Real NNP at Factor Cost) 1980-81 ధరలలో అనగా స్థిర ధరలలో 1950-51 లో 40,454 కోట్లు వుండగా 1997-98 లో 2,71,052 కోట్లకి పెరిగి వృద్ధి రేటును 572 శాతంగా నమోదు చేసుకుంది. అదే ప్రస్తుత ధరలోనైతే 8574 కోట్లు నుండి 1224784 కోట్లకి పెరిగింది, ఇదే కాలంలో ఇదే పట్టికలో నిజ తలసరి ఆదాయం(Real Per Captita NNP at Factor Cost) 1980-81 ధరలలో 1950-51 లో 1127 నుండి 1997-98 నాటికి 2847 కి పెరిగింది. అనగా 53 రెట్లు పెరిగింది. పట్టికలో ప్రస్తుత ధరలలో తలసరి ఆదాయం ఎట్లా పెరిగిందో చూడగలరు.

పట్టిక. 2 లో నికర జాతీయోత్పత్తి మరియు తలసరి ఆదాయంలలో వృద్ధిరేట్లను గమనించవచ్చు. 1980-81 ధరలలో 1950-51 నుండి 1980-81 వరకు అంటే 30 సం॥లలో నిజ NNP 3.4 శాతం వృద్ధిని మరియు నిజ తలసరి ఆదాయంలో 1.2 శాతం వృద్ధిని సాధించాయి. ఇదే ధరలలో 1980-81 నుండి 1997-98 వరకు నిజ NNP 5.5 శాతం వృద్ధిని, తలసరి ఆదాయం 3.4 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. 70 వ దశాబ్దం వరకు 80-81 ధరలలో 3 శాతం వృద్ధిని నిజ NNP సాధించింది. ఇతి అత్యంత తక్కువ రేటు. అందుచేత ఈ రేటుని ప్రొఫెసర్ రాజ్‌కృష్ణ " హిందూరేటు"గా అభివర్ణించాడు. ఇదే కాలంలో నిజ తలసరి ఆదాయంలో పెరుగుదల రేటు 0.7 శాతం నామ మాత్రంగా వుంది, తర్వాత 80 దశకంలో ఆర్థిక వ్యవస్థ వృద్ధిని పుంజుకొని, స్థిర ధరలలో, నిజ NNP 5.4 శాతం వృద్ధిని మరియు నిజ తలసరి ఆదాయం 3.1 శాతం వృద్ధిని సాధించాయి. అటు పిమ్మట 90 దశాబ్దంలో కూడ ఈ రెండు సూచికలలోనూ వృద్ధిని చూడగలము పట్టికలో. ఇదే పట్టికలో ఈ రెండు సూచికలో ప్రస్తుత ధరలలో ఎట్లా వృద్ధిని సాధించాయో తెలుపుతుంది. 50 దశకం నుండి 90 దశకం వరకు NNP 5.2 శాతం నుండి 15.4 శాతం వరకు పెరిగింది. తలసరి ఆదాయం ఇదే కాలంలో 3.2 శాతం నుండి 13.3 శాతానికి పెరిగింది. రెండవ ప్రణాళికా (1956-61) లక్ష్యం ముఖ్యంగా తలసరి ఆదాయాన్ని 1977 నాటికి రెట్టింపు చేయాలని అంటే 100 శాతం పెంచాలని. అయితే పట్టిక. 2 లో 1950-51 నుండి 1980-81 అంటే 3 సం॥ల కాలంలో కేవలం 44.63 శాతం పెరుగుదల మాత్రమే సాధించడం జరిగింది. కాని 1992-93 నాటికి అంటే 42 సం॥లకి (1950-51 నుండి 1992-93) తలసరి ఆదాయం రెట్టింపు అయ్యింది (99.02 శాతం).

పట్టిక. 3 లో నవ్య శ్రేణి ధరలైన 1993-94 దరలను స్థిరంగా చేసుకుని (1993-94=100) ఆర్థికాభివృద్ధి కొలవడం జరిగింది. దీనికి కారణం, ఆర్థికాభివృద్ధి జరుగుతున్నపుడు ధరల పెరుగుదల వుంటుంది. ఉత్పత్తి పెరుగుతూండడంతోనే అందుకని నిజ నిర్ధారణకి ఈ సవరించిన శ్రేణులను గుర్తించటం పరిపాటి. ఈ నూతన స్థిర ధరలలో నిజ NNP 1993-94 లో రూ. 6,85,912 కోట్లుండగా 2000-01 నాటికి 10,50,177 కోట్లకి పెరిగింది. 8 సం॥ల కాలంలో నిజ NNP 53.5 శాతం పెరిగింది. ఇదే కాలంలో నిజ తలసరి ఆదాయం రూ. 7698 నుండి 90 దశాబ్దం తొలి సం॥లలో ప్రారంభించిన "ఆర్థిక సవరణల" (Economic Reforms) ప్రభావం ఎంతైనా

వుందని చెప్పవచ్చు. భారతదేశాన్ని విదేశీ వస్తువులకు మరియు పెట్టుబడులకు మరింతగా తెరిచివుంచే ఆర్థిక విధానానికి ప్రాముఖ్యతనిచ్చింది భారతదేశం. ఇది ఎందుకు చేయవలసి వచ్చిందంటే 1991-92 (Crisis Year) లో స్థూల దేశీయోత్పత్తిలో వృద్ధి రేటు 0.8 శాతానికి పడిపోయింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు "ఒక వారం"కి సరిపోయేటట్లుగా తగ్గిపోయాయి. దీంతో సరళీకరణ, ప్రైవేటీకరణ, మరియు ప్రపంచీకరణ (దీనినే Liberalisation, Privatisation & Globalisation, L.P.G) ఆర్థిక విధానాలు ప్రవేశ పెట్టబడ్డాయి. ఆర్థిక వ్యవస్థ కూడ పుంజుకునే అవకాశం ఏర్పడింది.

పట్టిక. 4 లో నూతన స్థిర ధరలతో వృద్ధి NNP లో మరియు తలసరి ఆదాయాలలో ఏట్లా జరిగిందో తెలుపుతుంది. 1993-94 ధరలలో, NNP 6.8 శాతం వృద్ధిని, తలసరి ఆదాయం 4.8 శాతం వృద్ధిని 1994 - 95 లో సాధించడం జరిగింది. ఇదే ధరలలో NNP మరియు తలసరి ఆదాయాలు 1996-97 లో వరకు పెరిగి 1997-98 పడిపోవడం జరిగింది. ఈ తర్వాత ఆర్థిక వ్యవస్థ మరల పుంజుకుంది. 1994-95 నుండి 1996-97 వరకు సగటున 7.3 శాతం వృద్ధి NNP లోనూ, 5.3 శాతం వృద్ధి తలసరి ఆదాయంలోనూ చూడగలము. ఈ వృద్ధికి కారణం వ్యవసాయ రంగంలో అధిక వృద్ధి నమోదనడం మరియు పరిశ్రమల రంగం, రైల్వేలు, విద్యుచ్ఛక్తి, నిర్మాణ రంగం, హోటల్ రంగాలలో వృద్ధిని సాధించడం వల్ల ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద మంచి ఫలితాలు కనబడ్డాయి. 1980-81 నుండి 2000-01 వరకు, 1993-94 ధరలలో NNP లో 5.5 శాతం తలసరి ఆదాయంలో 3.3 శాతం వృద్ధిని భారతదేశం సాధించింది. పట్టిక.4 లో ప్రస్తుత ధరలలో ఈ రెండు సూచికల ద్వారా వృద్ధి ఏట్లా సాధించబడిందో తెలుసుకోగలరు.

ఇక ప్రణాళికల వారిగా వృద్ధిని పట్టిక. 5 లో చూడగలము. ఈ వృద్ధిరేట్లన్ని 1980-81 ధరలలో చూపబడ్డాయి. 1951 మొదలుకొని 2002 వరకు 9 ప్రణాళికలు పూర్తి అయ్యేయి. 10 వ ప్రణాళిక (2002-07) ప్రారంభమై 2 సం॥లు గడిచింది. ఈ పట్టికలో సాంవత్సరిక సగటు వృద్ధిరేట్లు ఇవ్వబడ్డాయి. మొదటి ప్రణాళికా కాలంలో NNP 3.6 శాతం వృద్ధిని సాధించింది. ఈ రేటు రెండవ ప్రణాళికా కాలం నాటికి 4.0 శాతానికి పెరిగింది. అయితే 3 వ ప్రణాళిక నాటికి NNP వృద్ధి ఋణాత్మకంగా మారింది. అనగా -4.7 నమోదు చేసుకుంది. దీనికి కారణం ఆనాడు ఏర్పడిన తీవ్ర కరువు పరిస్థితులే. అంటే ఈ కరువు 1965 - 66 లోనూ మరియు 1966-67 ఏర్పడింది. అంతే కాకుండా వ్యాపారపరంగా ఆర్థిక మాంద్య (Recession) పరిస్థితులు ఏర్పడ్డాయి. 1967-68 సం॥ తర్వాత ఆర్థిక వ్యవస్థ మరల పుంజుకోనారంభించింది. 1966-69 సావత్సరిక ప్రణాళికలలో NNP 3.7 శాతం వృద్ధి నమోదు చేసుకుంది. ఆ తర్వాత 4 వ ప్రణాళికా కాలం నాటికి NNP వృద్ధిలో క్షీణత ఏర్పడి అంటే 3.3 శాతానికి పడిపోయింది. తలసరి ఆదాయంలో పెరుగుదల 1 శాతం మాత్రమే వుంది. దీనికి కారణం ధరల పెరుగుదల (1972-73 మరియు 1973-74) దీనికి తోడు ఉత్పత్తి సామర్థ్యానికి తగ్గట్టుగా లేకపోవడం.

5 వ ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుని NNP లో 5 శాతం వృద్ధి తలసరి ఆదాయంలో 2.7 శాతం వృద్ధి సాధించడమైనది. ఈ ప్రణాళిక కాలంలో ఆర్థిక వృద్ధి మొత్తం మీద సంతృప్తికరంగానే వుందని చెప్పవచ్చు. ఆ తర్వాత 1979-80 లో కేంద్ర ప్రభుత్వంలో మార్పులు కారణంగా మరల సాంవత్సరిక ప్రణాళిక ప్రవేశ పెట్టబడింది. అయితే అభివృద్ధి సూచికల పరంగా ఋణాత్మకంగా వృద్ధి సాధించింది.

6 వ ప్రణాళిక కాలంలో జాతీయాదాయం 5.5 వృద్ధిని సాధించింది. తలసరి ఆదాయంలో 3.2 శాతం పెరుగుదల రేటు నమోదైంది. 7వ ప్రణాళికలో లక్ష్యంగా పెట్టుకున్న 5 శాతం NNP లో వృద్ధి మరియు 3 శాతం తలసరి ఆదాయంలో వృద్ధి, 1985-90 కాలంలో అధిగమించాయి. NNPలో 5.8 శాతం మరియు తలసరి ఆదాయంలో 3.6 శాతాన్ని సాధించడం జరిగింది. యిది ఎంతైనా ముదావహం.

1990-92 కాలంలో 2 సావత్సరిక ప్రణాళికలు ప్రవేశ పెట్టబడ్డాయి. ఈ రెండు ప్రణాళికల కాలంలో ఆశించిన ఫలితాలను సాధించలేక పోయాయని చెప్పవచ్చు. దీనికి కారణం 1990 లో ఏర్పడిన విషమ పరిస్థితులు (Crisis). ఈ పరిస్థితి ఎట్లా వుందంటే NNP లో 2.5 వృద్ధి మరియు తలసరి ఆదాయంలో 0.4 పెరుగుదల మాత్రమే సాధించడం జరిగింది. దీంతో 80 దశాబ్దంలో సాధించిన దంతా నిలబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. విదేశీ వ్యాపారం కుంటు పడింది. దాంతో విదేశీ మారక ద్రవ్య నిల్వలు పడిపోయాయి. పారిశ్రామిక

రంగంలో వృద్ధి ఋణాత్మకంగా మారింది. వీటి వల్ల సరళీకృత ఆర్థిక విధానాలు 1991 లో ప్రవేశ పెట్టబడ్డాయి. ఈ విధానాలనే 'L.P.G.' (Liberalisation, Privatisation & Globalisation) విధానమని అంటారు.

ఈ విధానాల వల్ల 8 వ ప్రణాళికలో జాతీయాదాయంలో వృద్ధి గణనీయంగా పెరిగింది. పట్టిక. 5 లో చూసినట్లైన లో NNP 6.6 శాతం వృద్ధి మరియు తలసరి ఆదాయంలో 4.6 పెరుగుదల రేటు నమోదయ్యాయి. ఈ ప్రణాళికా కాలంలో నూతన ఆర్థిక విధానాల వల్ల ఆర్థిక వృద్ధిరేటు వ్యవసాయ రంగంలోని ఆటుపోట్ల నుండి తట్టుకుని నిలబడే స్థితికి ఆర్థిక వ్యవస్థ చేరుకుంది. అంతే కాకుండా ఈ కాలంలో (1992-97) వృద్ధి గణనీయంగా పెరగడానికి కారణం పారిశ్రామిక, సేవల రంగాలు వృద్ధిని సాధించడమే. పారిశ్రామిక రంగంలో ఉత్పాదక రంగం (Manufacturing Section) మంచి వృద్ధిని రికార్డు చేసుకుంది. అంతే కాకుండా పారిశ్రామిక సంబంధిత సేవల రంగం బాగా పని తీరుని ప్రదర్శించింది.

పట్టిక. 5 ప్రకారం 1980-81 ధరలలో మొత్తం 8 ప్రణాళికలలోనూ (1951-56 నుండి 1992-97 వరకు) అంటే 46 సం॥లలో నికర జాతీయోత్పత్తిలో పెరుగుదల రేటు 3.64 శాతం వుండగా (సావత్సరిక ప్రణాళికలను మినహాయించి) తలసరి ఆదాయం 2.36 శాతం నమోదు చేసుకుంది.

1.4.2 ఆర్థిక వ్యవస్థ నిర్మాణతలో రంగాల వారీగా అభివృద్ధి :

(i) వ్యవసాయ రంగం :- వ్యవసాయ రంగంలో వ్యవసాయం, అడవులు, చేపలు పట్టడం, పశు సంవర్థనం మొదలైన రంగాలుంటాయి. ప్రణాళికలు ప్రారంభమయ్యే నాటికి స్థూల దేశీయోత్పత్తిలో 56.46 శాతం వ్యవసాయరంగ వాటాగా వుంది. యిక్కడ వ్యవసాయ రంగం అంటే ప్రాథమిక రంగం అని అనుకోవచ్చు. అంటే ప్రాథమిక రంగం అధిక వాటాని పొంది వుంది. దీనికి కారణం పారిశ్రామిక సేవల రంగాలు అభివృద్ధి కాకపోవడమే. ఈ వాటా కాలం గడుస్తున్న కొద్ది తగ్గుతూ వస్తోంది. 1999-2000 నాటి ప్రాథమిక రంగం వాటా కేవలం 25.2 శాతంగా వుంది. అంటే స్థూల దేశీయోత్పత్తిలో ప్రాథమిక రంగం వాటా 118 శాతం (1950-51 నుండి 1999-2000) పడిపోయింది. అభివృద్ధి చెందిన దేశాలలో ఈ వాటా కేవలం 2 నుండి 3 శాతం మాత్రమే వుంటుంది. అందుచేత భారతదేశంలో స్థూల దేశీయోత్పత్తిలో ప్రాథమిక రంగం వాటా 25.2 శాతం కాబట్టి. అభివృద్ధి చెందిన దేశాలలాగే భారత్ కూడా అభివృద్ధి పథంలో నడుస్తోందని ఆర్థిక శాస్త్రవేత్తల వాదం. అయితే దీన్ని బట్టి వ్యవసాయరంగ ప్రాధాన్యత భారతదేశంలో తగ్గుతోందని కూడా అనుకోవచ్చు. అంతేకాకుండా ఒక్క వ్యవసాయ పంటల వాటాని తీసుకుంటే 1950-51 లో వీటి శాతం 50.2 వుంటే 1980-81 నాటికి 36 శాతానికి మరియు 1999-2000 సం॥కి 23.2 శాతానికి పడిపోయింది. అయితే ప్రాథమిక రంగం వాటాలలో (వ్యవసాయం, పశు సంవర్థనం, అడవులు, చేపల వేట, మొ॥) ఒక్క వ్యవసాయం వాటా 93 శాతం వుంటుంది. మిగతావి ప్రాధాన్యత తక్కువగా వున్న రంగాలు, పట్టిక. 6 చూడగలరు.

పారిశ్రామిక రంగం లేదా ద్వితీయ రంగం :- ద్వితీయ రంగం అంటే పారిశ్రామిక రంగం అని అర్థం. ఈ రంగంలో గనులు, మాన్యుఫాక్చరింగ్, నిర్మాణాలు, విద్యుచ్ఛక్తి, గ్యాస్, మరియు నీటిపారుదల మొదలైన రంగాలుంటాయి. ఈ ద్వితీయ రంగం యొక్క వాటా ఎట్లా పెరిగిందో పట్టిక.6 లో చూడవచ్చు. 1950-51 లో స్థూలదేశీయోత్పత్తిలో ద్వితీయరంగ వాటా 15 శాతం మాత్రమే వుంటే 1999-2000లో ఆ వాటా 27 శాతానికి పెరిగింది. అంటే పారిశ్రామికీకరణ దిశగా దేశ ఆర్థిక వ్యవస్థ పయనిస్తోందని తెలుస్తోంది. ద్వితీయ రంగంలో పెద్ద రంగాలు రెండు మాన్యుఫాక్చరింగ్ రంగం మరియు నిర్మాణ రంగం. మాన్యుఫాక్చరింగ్ రంగం వాట 1950-51 లో (స్థూలదేశీయోత్పత్తిలో) 11.4 శాతం వుండా, 1999-2000 17.1 శాతానికి పెరిగింది. అయితే నిర్మాణ రంగం ఇదే కాలంలో 3.3 శాతం వాటా నుండి 5.1 శాతంకి పెరిగింది.

(1980-81 ధరలలో) తృతీయ లేక సేవల రంగం :- ఈ రంగంలోకి వర్తకం, రవాణా, టూరిజమ్ మరియు హోటల్ పరిశ్రమ సమాచారా సంబంధాలు, బ్యాంకింగ్ మరియు, భీమా రంగం, వ్యక్తిగత సేవలు, రియల్ ఎస్టేట్ స్టోరేజి, మొదలయిన రంగాలుంటాయి. ఈ సేవల రంగం ఏ దేశంలో పెరిగి అధిక వాటాని పొందుతుందో ఆ దేశం ఆర్థికాభివృద్ధి సాధించిన దేశంగా చెప్పవచ్చు. అభివృద్ధి

చెందిన దేశాలలో స్థూల దేశీయోత్పత్తిలో 65 శాతం నుండి 70 శాతం వుంటుంది. భారత్‌లో అయితే 1950 - 51లో 28.5 శాతం వుండగా 1999-2000 నాటికి ఈ వాటా శాతం 47.8 గా వృద్ధి పొందింది. అంటే భారత్ కూడా వృద్ధిని అంటే అభివృద్ధిని సాధిస్తోందన్నమాట. ఈ సేవల రంగంలో రవాణా, సమాచార మరియు వర్తక రంగాలు కలిసి 1950-51 లో వాటా (స్థూలదేశీయోత్పత్తిలో) 11 శాతం నుండి 1999-2000 లో 21.9 శాతానికి పెరిగింది.

ఆర్థిక వ్యవస్థ నిర్మాణతలో పారిశ్రామిక రంగం మరియు సేవల రంగాలు సాధించిన వృద్ధి రేటుని ప్రాధమిక రంగం సాధించలేదు. పట్టిక. 7 లో చూసినట్లైన 1950-51 నుండి 1980-81 వరకు ప్రాథమిక రంగం తిరోగమన దశలో వుంది. అంటే వృద్ధి రేటు 3.0 శాతం నుండి 1.5 శాతానికి పడిపోయింది. మిగతా రెండు రంగాలు వృద్ధిని సాధించాయి. 1950-51 నుండి 1990-91 వరకు అంటే 40 సం॥ల కాలంలో వ్యవసాయ రంగం సం॥కి సగటున 2.6 శాతం వృద్ధిని సాధిస్తే పారిశ్రామిక రంగం మరియు సేవల రంగం క్రమముగా 5.6 శాతం మరియు 4.9 శాతం వృద్ధిని సాధించాయి. అదే 90 దశకంలో అయితే అనగా 1990-91 నుండి 2000-01 కాలంలో సేవల రంగం వృద్ధిని 7.5 శాతంతో గణనీయంగా పెంచుకుంది. వ్యవసాయ రంగం 2.6 శాతం వుంటే పారిశ్రామిక రంగం 5.4 శాతం వుంది. మొత్తం మీద ప్రాథమిక రంగం కుంటుపడింది. భారతదేశ ఆర్థిక నిర్మాణతలో, భారతదేశం ప్రధానంగా వ్యవసాయాధారితదేశం. అయితే ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న తరుణంలో ఆర్థిక నిర్మాణతలో నెమ్మది నెమ్మదిగా మార్పు వచ్చి వ్యవసాయ రంగం నుండి పారిశ్రామిక మరియు సేవల రంగాల వైపు ప్రయాణం చేస్తోంది. ఈ నెమ్మదికి కారణం పారిశ్రామిక రంగం 1950-51 నుండి 1990-91 నాటికి 5.6 శాతం వృద్ధిని మాత్రమే సాధించింది. ఇదే కాలంలో సేవల రంగం 4.9 శాతం వృద్ధిని సాధించింది. దీంతో నిర్మాణతలో మార్పు వేగంగా జరిగింది. ఈ మార్పు వేగంగా రావాలంటే పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధిని సాధించవలసి వుంది. దీనివలన వ్యవసాయరంగం కూడా ఊపందుకుంటుంది.

వివిధ రంగాలలో సాధించిన ఉత్పత్తి :

1950-51 లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 51 మిలియన్ టన్నులుంటే 2001-02 నాటికి 211 మిలియన్ టన్నులకి పెరిగింది. అనగా 314 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది. అనేక పంటల విషయంలో భారత దేశం స్వయం సమృద్ధిని సాధించింది. 1950-65 కాలానికి ముందర అంటే హరిత విప్లవానికి ముందర ఆహార ధాన్యాల సావత్సరిక వృద్ధిరేటు 3.2 శాతం వుంటే హరిత విప్లవం తర్వాత 2.7 శాతానికి వృద్ధి పడిపోయింది.

పారిశ్రామిక రంగం ఉత్పత్తి కూడా ఏన్నో రెట్లు పెరిగింది. ఉదా॥కి స్టీలు ఉత్పత్తి 1950-51 లో 1.04 మిలియన్ టన్నుల నుండి 200-01 కి 29.3 మిలియన్ టన్నులకి పెరిగింది. సిమెంటు ఇదే కాలంలో 2.7 మి.టన్నుల నుండి 99.5 మిలియన్ టన్నులకి పెరిగింది. విద్యుచ్ఛక్తి 5.1 బిలియన్ కిలో వాట్స్ నుండి 499.4 బి.కిలో వాట్స్‌కి ఉత్పత్తి పెరిగింది. ఇదే కాలంలో అల్యూమినియమ్ 4 వేల టన్నుల నుండి 620.4 వేల టన్నులకి పెరిగింది. ఒక పేపరు ఉత్పత్తైతే 116 వేల టన్నుల నుండి 3090 వేల టన్నులకి పెరిగింది. బట్ట (Cloth) తయారి విషయానికొస్తే 4215 మిలియన్ స్క్వేర్ మీటర్ల నుండి 1978 మి.స్క్వేర్ మీటర్లకి పెరిగింది. 1997-98 నాటికి దేశంలో 1,35,551 కర్మాగారాలలో రూ. 1,55,947 కోట్ల ఉత్పత్తిలో భారతదేశ పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధిని సాధించింది.

రాష్ట్రాల వారీగా సాధించిన ఆర్థికాభివృద్ధి :

భౌగోళిక పరిమాణంలో భారతదేశం పెద్ద దేశాల సరసన జేరుతుంది. ప్రపంచ జనాభాలో చైనా తర్వాతి స్థానాన్ని ఆక్రమించింది. యినాటి భారత జనాభా 102.8 కోట్లు అయితే 2020 నాటికి ప్రపంచంలో భారతదేశానిదే ప్రధమ స్థానం ఈ జనాభా విషయంలో ఈనాటి పరిస్థితి కొనసాగినట్లైయితే భారతదేశంలో 30 రాష్ట్రాలు మరెన్నో కేంద్రపాలిత ప్రాంతాలున్నాయి. భారతదేశ సమాజాన్ని ఒక "ప్లూరలిస్టిక్ సొసైటి" (Pluralistic Society) చెప్పవచ్చు. అయిననూ, భిన్నత్వంలో ఏకత్వం (Unity in Diversity) కలిగివుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక రాష్ట్రాలు అభివృద్ధిని సాధించాయి. యింకా ఎన్నో రాష్ట్రాలలో అభివృద్ధి నత్తనడక నడుస్తోంది. అభివృద్ధిని సాధించిన రాష్ట్రాలు ఏమనగా మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, పంజాబ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు మొదలైనవి. మిగిలిన రాష్ట్రాలలో

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్ మొదలైనవి మధ్యస్తంగా అభివృద్ధి చెందితే ఒరిస్సా, బీహార్, మరియు మధ్య ప్రదేశ్ రాష్ట్రాలు ఎంతో వెనుకబడి వున్నాయి. ఈ ఆర్థికపరమైన వ్యత్యాసాలకి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా, ఆ రాష్ట్రాల యొక్క పరిమాణం, జనాభా, ఆదాయం, అవస్థాపన సౌకర్యాలు, వ్యవసాయ వాతావరణ పరిస్థితులు మొదలైనవి. దీని వలన రాష్ట్రీయ ఉత్పత్తి అనగా State Domestic Product (SDP) లో వ్యత్యాసాలు కనబడుతున్నాయి.

పట్టిక. 8 పెద్ద రాష్ట్రాలలో 1996-97 లో ఆదాయం, మరియు జనాభా గురించి వివరిస్తుంది. మహారాష్ట్ర దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే అత్యధిక అభివృద్ధిని సాధించింది. పట్టికలో చూపిన విధంగా ఈ రాష్ట్రం 1554 కోట్లని దేశ ఖజానాకి సమకూర్చి పెట్టింది. అంటే జాతీయాదాయంలో ఇది 14.26 శాతం. అదే సం॥లో జనాభా మహారాష్ట్రలో 8.8 కోట్లుగా వుంది. దీని తలసరి ఆదాయం 17666/-. జాతీయాదాయంలో తర్వాతి స్థానాన్ని పొందింది ఉత్తరప్రదేశ్. ఈ శాతం ఎంత అనగా 9.44 శాతం. అయితే ఏ యొక్క తలసరి ఆదాయం మాత్రం 6713/-. ఈ రెండు రాష్ట్రాల తర్వాత మధ్యస్థంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (జాతీయాదాయంలో) వాటా 6.92%, పశ్చిమ బెంగాల్ 6.56%, తమిళనాడు (6.33%) మరియు గుజరాత్ (6.14%) మొదలైనవి వున్నాయి. అయితే తలసరి ఆదాయంలో మాత్రం పంజాబ్ 18,006/- తో అగ్రస్థానంలో వుంది. హర్యానా తలసరి ఆదాయంలో 3 వ స్థానాన్ని ఆక్రమించింది. పట్టికలో యిచ్చిన 14 పెద్ద రాష్ట్రాలు కలిపి జాతీయాదాయంలో 79 శాతాన్ని సమకూర్చి పెట్టాయి, 1996-97లో.

(S.D.P) వృద్ధిరేట్లు :

పట్టిక. 9 పెద్ద రాష్ట్రాల యొక్క రాష్ట్రీయ ఉత్పత్తి వృద్ధిరేట్లు గురించి ప్రస్తావిస్తుంది. 1980-81 ధరలలో వృద్ధి రేట్లు ఇవ్వబడ్డాయి. అంతే కాకుండా తలసరి ఆదాయం ఏ రేట్లలో ఈ రాష్ట్రాలలో పెరిగిందో కూడా ఈ పట్టిక తెలియజేస్తుంది. ఈ పెద్ద రాష్ట్రాలన్నింటిని కలుపుకుని నిజ రాష్ట్రీయ ఉత్పత్తి ఎట్లా పెరిగిందంటే 1980 దశాబ్దంలో (1980-81 నుండి 1990-(1 వరకు) 5.24 శాతం నుండి 1990 దశాబ్దం (1991-92 నుండి 1997-98 వరకు) లో 5.94 కి పెరిగింది. యిక్కడ ముఖ్య విషయమేమిటంటే ఈ పెద్ద రాష్ట్రాల నిజ వృద్ధి రేటు 80 దశకంలో సాధించినది (5.24%) స్థూల దేశీయోత్పత్తి అది కాలంలో సాధించిన వృద్ధిరేటు అయిన 5.5 శాతానికి యించుమించుగా సరిపోయింది. అయితే 90 దశకంలో రాష్ట్రాలు సాధించిన 5.94 శాతం నిజవృద్ధి స్థూలదేశీయోత్పత్తి వృద్ధిరేటు అయిన 6.89 శాతం కన్నా చాలా తక్కువగా వుంది. దీనికి ముఖ్య కారణం స్థూల దేశీయోత్పత్తికి సంబంధించిన డాటాలో సవరణలు జరగ్గా రాష్ట్రయ ఉత్పత్తి డాటాలో అటువంటి మార్పులు జరగలేదు. రాష్ట్రాల తలసరి ఆదాయం 80 దశకంలో 3.03 శాతం వుండగా, 90 దశకం వచ్చే నాటికి 4.02 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా వృద్ధిని చూసినట్లైతే, కొన్ని రాష్ట్రాలు వేగంగాను, కొన్ని రాష్ట్రాలు తక్కువగాను వృద్ధిని సాధించాయి. మహారాష్ట్ర 8.01 శాతం వృద్ధిని మరియు గుజరాత్ 9.57 శాతం వృద్ధిని 90 దశకంలో సాధించాయి. దేశం మొత్తం మీద చూస్తే ఈ రెండు రాష్ట్రాలు ఎక్కువ రేటులో పెరిగాయని చెప్పవచ్చు. రాజస్థాన్, మధ్య ప్రదేశ్, తమిళనాడు మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు 6 శాతం వృద్ధితో ముందున్నాయి. అత్యంత తక్కువ వృద్ధి గల రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, బీహార్ మరియు ఒరిస్సా.

నిజ తలసరి ఆదాయ పెరుగుదల రేట్లు కూడా మహారాష్ట్ర మరియు గుజరాత్ రాష్ట్రాలే అధికంగా సాధించాయి. నిజ రాష్ట్రీయ ఉత్పత్తి పరంగా మరియు నిజ తలసరి ఆదాయం పరంగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలే ముందున్నాయి. మొత్తం మీద పట్టికలో యిచ్చిన 14 రాష్ట్రాలలో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు అభివృద్ధి పథంలో ముందున్నాయి అని అనడంలో సందేహం లేదు. అయితే మహారాష్ట్ర మరియు గుజరాత్ రాష్ట్రాలను త్వరితంగా వృద్ధిని సాధించిన మిరకిల్ ఆర్థిక వ్యవస్థలు (Miracle Economies) అయిన దక్షిణ కొరియా, తైవాన్, థాయిలాండ్, మొదలైన ఆసియా దేశాలతో పోల్చవచ్చును.

1.5 భారతదేశ వృత్తి నిర్మాణత (Occupational Structure of India) :

ఒక దేశ వృద్ధి నిర్మాణత అనగా వివిధ వృత్తులలో శ్రామికుల (Work Force) పంపిణి ఎట్లా వుందో వివరణ యిస్తుంది. అనగా ఏ రంగంలో ఎంతమంది శ్రామికులు పనిజేస్తున్నారు అనే విషయం తెలియజేస్తుంది. మొత్తం వృత్తులన్నింటిని 3 తరగతులుగా విభజించవచ్చు.

(i) ప్రాథమిక లేక వ్యవసాయ సంబంధిత వృత్తులు ; (ii) ద్వితీయ లేక పారిశ్రామిక రంగం ; మరియు (iii) తృతీయ లేక సేవల రంగం. ప్రాథమిక రంగంలో వ్యవసాయం, పశు సంవర్ధనం, అడవులు, చేపల వేట, మొదలగునవి వుంటాయి. ఈ రంగం అంతే కాకుండా ప్రధానంగా భూమి లేక ప్రాకృతిక సంపద మీద ఆధారపడి వుంది. వీటిని ప్రాథమిక రంగం అని అనడానికి కారణం పైన ఉదహరించినవన్నీ మానవుని మనుగడకి ఎంతైనా అత్యవసరం. మానవుని మనుగడకి ప్రకృతి యొక్క సహాయం అవసరమైవున్నది. పారిశ్రామిక రంగంలో చిన్నతరహా మరియు భారీ పరిశ్రమలు అయిన మ్యాన్యూఫాక్చరింగ్ రంగం, మరియు నిర్మాణ రంగం వుంటాయి. ఈ రంగంలో గనులు మరియు విద్యుచ్ఛక్తి రంగాలు కూడా వుంటాయి. ఈ రంగంలో ముడి సరుకులనుపయోగించి అనేక వస్తువులను తయారు చేస్తూ వుంటారు. ఈ రంగం ప్రాథమిక రంగం అందించిన వస్తువులనాధారంగ ఉత్పత్తి సాగిస్తుంది కాబట్టి ఈ రంగాన్ని ద్వితీయ రంగం అని అనవచ్చు. యిక తృతీయ రంగం అంటే సేవల రంగంలో వర్తక వ్యాపారాలు, రవాణా, సమాచార సంబంధాలు, బ్యాంకింగ్ మరియు , మరియు ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సేవలు కొనసాగించడానికి సహాయపడుతూ వుంటుంది. ఈ మూడు రంగాలలో ఎంతెంత శాతం శ్రామికులు వారి జీవనోపాధిని పొందుతున్నారు అనే విషయం తెలుసుకోడం ద్వారా భారతదేశంలో వృత్తి నిర్మాణత స్వరూప స్వభావాలు ఎట్లా వున్నాయో తెలుస్తాయి.

అయితే ఒక దేశం అభివృద్ధి చెందడానికి ఆ దేశపు వృద్ధి నిర్మాణతలో మార్పుకి ఎంతో దగ్గర సంబంధం వుందని చెప్పవచ్చు. అనగా ఒక దేశం అభివృద్ధిని సాధిస్తున్నపుడు, ఆ దేశంలోని శ్రామికులు అధిక శాతం ద్వితీయ మరియు తృతీయ రంగాలలో పనిజేస్తూంటారు. అభివృద్ధి పరకాష్ట చేరుకున్నపుడు తృతీయ రంగంలో ఎక్కువ శాతం శ్రామికులు పనిజేస్తూంటారు. ఉదా॥కి : USA లో 1999 నాటికి తృతీయ రంగంలో 69 శాతం మంది శ్రామికులు పనిజేస్తున్నారు. ప్రాథమిక రంగంలో 3 శాతం, మరియు ద్వితీయ రంగంలో 28 శాతం పని జేస్తున్నారు. ఇదే పరిస్థితి యించు మించుగా అభివృద్ధి చెందిన దేశాలలో చూడగలము, భారతదేశం లాంటి అల్పాభివృద్ధి దేశంలో ప్రాథమిక రంగంలో 64 శాతం మంది, ద్వితీయ రంగంలో 16 శాతం మంది సేవల రంగంలో 20 శాతం మంది పనిజేస్తున్నారు. యిదే ప్రణాళికా ప్రారంభంలో అంటే 1951 లో ప్రాథమిక రంగంలో 72 శాతం మంది, ద్వితీయ రంగంలో 10 శాతం మంది తృతీయ రంగంలో 18 శాతం మంది పనిజేస్తున్నారు. ప్రాథమిక రంగంలోని శ్రామికులు ఎక్కువ శాతం మిగతా రెండు రంగాలకి తరలి వెళ్ళ వలసి యుంది. యిది ఎప్పుడు జరుగుతుందంటే శ్రామికుల యొక్క నిజ తలసరి ఆదాయం పెరిగినపుడు జరుగుతుంది. అయితే అల్పాభివృద్ధి దేశాలలో తలసరి ఆదాయం చాలా తక్కువగా వుండడం మూలంగా ఆహార ఉత్పత్తుల మీద ఆధిక శాతం ఖర్చు చేయడం వల్ల ఆహారేతర ఉత్పత్తుల మీద ఖర్చు అత్యల్పంగా వుంటుంది. దీంతో ద్వితీయ, తృతీయరంగ ఉత్పత్తులకి గిరాకి ఎక్కడి నుండి వస్తుంది. కాబట్టి ఆ రంగాలు అభివృద్ధిని సాధించవు. అంతే కాకుండా మూలధన కొరత మరియు అధునాతన సాంకేతిక విజ్ఞాన లోపం వల్ల ద్వితీయ, తృతీయ రంగాలు, అభివృద్ధిని సాధించలేక పోతున్నాయి.

పట్టిక. 10 లో వివిధ రంగాలలో శ్రామికుల పంపిణి శాతం 1951 నుండి 1999 వరకు ఏట్లా మార్పు చెందిందో తెలియ జేస్తుంది. ప్రాథమిక రంగంలో శ్రామికుల శాతం తగ్గి ద్వితీయ మరియు తృతీయ రంగాలలో శ్రామికుల శాతం పెరిగింది. అంటే భారతదేశం వృత్తుల పరంగా అభివృద్ధిని సాధించిందని చెప్పవచ్చు.

అదే అభివృద్ధి చెందిన దేశాలలో ద్వితీయ మరియు తృతీయ రంగాల ఉత్పత్తులకి విపరీతమైన డిమాండ్ వుంటుంది. అంటే అక్కడ ప్రజల తలసరి ఆదాయంలో బాగా ఎక్కువగా వుండడం చేత వస్తుసేవలకి గిరాకి వుంటుంది. దాంతో ద్వితీయ, తృతీయ రంగాలలో ఎక్కువ మంది శ్రామికులు పనిచేస్తూ వుంటారు. దీని తర్వాత పారిశ్రామిక రంగం వస్తుంది. దీంట్లో 20 నుండి 30 శాతం మంది శ్రామికులలో పనిచేస్తుంటారు. ప్రాథమిక రంగంలో 3 నుంచి 7 శాతం ఉపాధిని పొందుతున్నారు. అధునాతన సాంకేతిక విజ్ఞానం, అధిక మూలధనం వుండడం వల్ల తక్కువ శ్రామికులలో ఎక్కువ ఉత్పత్తిని సాధించే వీలుంటుంది. దీంతో తృతీయ రంగంలో శ్రామికులు మరియు USA, Japan, మరియు UK లలో 59 నుండి 69 శాతం వున్నారు. స్థూల దేశీయోత్పత్తిలో తృతీయ రంగం వాటా ఈ దేశాలలో 60 నుండి 72 శాతం వుంది (World Development Report, 2000) . అయితే భారతదేశంలో కూడా తృతీయ రంగంలో పనిచేసే శ్రామికుల యొక్క శాతం పెరగడమే కాకుండా స్థూల దేశీయోత్పత్తిలో తృతీయ రంగం వాటా పెరుగుతోంది. 1950-51 లో తృతీయరంగ వాటా 28.5 వుంటే 1999-2000 లో 47.8 శాతానికి పెరిగింది. అలాగే శ్రామికుల శాతం తృతీయ రంగంలో 1951లో

17.2 శాతం వుంటే 2000 నాటికి 25.8 శాతానికి పెరిగింది. అంటే అభివృద్ధి జరుగుతోందన్నమాట. కాబట్టి ఆర్థికాభివృద్ధి జరుగుతున్నపుడు తలసరి ఆదాయం పెరిగి శ్రామికులు ప్రాథమిక రంగం నుండి ఇతర రెండు రంగాల వైపు బదిలి అవుతారు.

శ్రామిక శక్తి పంపిణీ (Distribution of Labour Force) :

ఆర్థిక ప్రక్రియలో శ్రామికుని పాత్ర అత్యంత కీలకమైనది. అందుచేత ఆర్థిక ప్రక్రియ యొక్క స్థాయి శ్రామిక సంఖ్యను బట్టి నిర్ణయించబడుతుంది. శ్రామికు శక్తి ఎక్కువగా వుంటే ఆర్థికాభివృద్ధి వేగాన్ని పుంజుకుంటుంది. ఈ శ్రామిక శక్తి ఎంత వుంది అనే విషయం మొత్తం జనాభాలో 0-15 సం॥లు వయస్సు గల్గిన పిల్లలు ఎంత శాతం వున్నారు. 60 సం॥లు వయస్సు దాటిన ముసలి వాళ్ళు ఎంత మంది వున్నారు అనే వాటి మీద ఆధారపడి వుంటుంది. అభివృద్ధి చెందిన దేశాలలో శ్రామిక శక్తి అధికంగా వుండి వేగంగా అభివృద్ధిని సాధిస్తున్నాయి. అల్పాభివృద్ధి దేశాలలో పిల్లల మరియు వృద్ధుల శాతం అధికంగా ఉండి ఆ దేశాలలో ఉత్పత్తి సామర్థ్యం కుంటుపడే పేద దేశాలుగా మిగిలి పోతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో శ్రామిక శక్తి మొత్తం జనాభాలో 45 నుండి 50 శాతం వుంటే అల్పాభివృద్ధి దేశమైన భారత్‌లో 33 శాతం వుంది. ఏ మాత్రం వృద్ధి సాధించినా అదంతా కూడా అధిక సంఖ్యాకులైన పిల్లలు మరియు వృద్ధులను పోషించడానికే సరిపోతుంది. వారి నుండి దేశానికి ఏ మాత్రం ఉపయోగం లేదు. దీనికి కారణం మరణాల రేటు పడిపోయి, జననాల రేటులో తిరోగమనం చాలా తక్కువగా వుండడం. అభివృద్ధి చెందిన దేశాలలో జనాభా వృద్ధి రేటు సున్నా దిశగా ప్రయాణం చేస్తోంది. ముఖ్యంగా ఫ్రాన్స్ దేశంలో, అందుచేత ఫ్రాన్స్‌లో పిల్లల వృద్ధికి అనేక రాయితీలు కల్పిస్తున్నారు.

ఈ కారణాల చేత అంటే "Bottom Heavy Population" కారణాన భారత దేశంలో అత్యంత విలువైన వనరులన్నీ జనాభా తయారికీ తప్ప మూలధన తయారికి ఉపయోగపడడం లేదు. దీంతో 1901 నుండి 1951 నాటికి భారతదేశంలో శ్రామిక శక్తి శాతం 46 నుండి 39 కి పడిపోయింది. 1951 లో జనభా లెక్కలలో శ్రామికుని పరంగా అర్థాన్ని ఖచ్చితంగా చెప్పడం చేత అంటే లాభసాటిగా ఉపాధి పొందిన లేక జీవనాధారానికి పనిచేస్తున్న శ్రామికున్ని మాత్రమే శ్రామికునిగా తీసుకొనడం జరిగింది. దాంతో 1951 శ్రామిక శక్తి 39 కి పడిపోయింది. అయితే 1961 లో ఇది 43 శాతానికి పెరిగింది. 1971 లో శ్రామికుని అర్థం మరింత సాంకేతికంగా మార్చడం చేత శ్రామిక శక్తి శాతం 33 కి పడిపోయింది. తర్వాత 1981 లో 36.7 శాతానికి 1991 లో 37.7 శాతానికి మరియు 2001 లో 39.2 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాలతో పోల్చి చూసినట్లైయితే పల్లెల్లో ఎక్కువ శ్రామిక శక్తి కేంద్రీకృతం అయ్యింది. పురుష శ్రామిక శక్తి అధికంగా వున్నప్పటికి, స్త్రీ శ్రామిక శక్తి కూడా బాగా పెరిగింది. ఇది సామాజిక అభివృద్ధికి నిదర్శనము.

స్వాతంత్ర్యము రాక పూర్వం బ్రిటీష్ వారి వ్యాపార విధానాల వల్ల భారతదేశంలో హస్త కళలు నశించి ప్రజలందరు వ్యవసాయం మీద ఆధారపడవలసి వచ్చింది. దీంతో ఘమారు 71 శాతం మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవించేవారు. బ్రిటిష్ వారు ప్రవేశ పెట్టిన పారిశ్రామికీకరణ ద్వారా (ప్లాన్‌టేషన్స్ మరియు టెక్స్‌టైల్స్ రంగాలలో) ఈ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రణాళిక ద్వారా త్వరితగతిని అభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వకృషిలో భాగంగా ప్రణాళికా సంఘం దేశంలో వృత్తి నిర్మాణతలో మార్పులు తీసుకురావాలని యోచించింది. అంటే వ్యవసాయ రంగం నుండి ద్వితీయ తృతీయ రంగాల వైపుకి శ్రామికులను కొద్ది మొత్తంలో బదిలి చేయాలని నిర్ణయించింది. 1975-76 సం॥ కల్లా వ్యవసాయం మీద ఆధారపడిన జనాభా శాతాన్ని 60 కి తగ్గించాలని 2వ ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకుంది. దీని కొరకు కర్మాగారాలలోను మరియు గనులలోను ఉద్యోగితను 4 రెట్లు పెంచవలసి వుంటుంది. మరియు ప్రణాళికలలో పెట్టుబడి విధానాన్ని ఈ లక్ష్య సాధనకై సర్దుబాటు చేయాలని 2 వ ప్రణాళిక ఆలోచన చేసింది. యిటువంటి శ్రామిక బదిలికి వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం ద్వారా ఆహార మరియు ముడి పదార్థాల అవసరాలు పెరుగుతున్న దేశీయ ఆర్థిక వ్యవస్థకు సరిపడేలాగున చేయాలి. అంతే కాకుండా దేశీయ వనరులను దృష్టిలో వుంచుకుని భారతదేశ శ్రామిక శక్తి అవసరాలు పరిగణనలోకి తీసుకుని ఒక ఉపాధి విధానాన్ని రూపొందించవలసి వుంటుంది అని ప్రణాళికా సంఘం అలోచన చేసింది.

పారిశ్రామీకీకరణ ఎంత జరిగినప్పటికీ భారతదేశంలో వృత్తి పరమైన మార్పు 1951 నుండి 1971 వరకు 72 శాతం దగ్గర స్థిరంగా వుంది. 1971 నుండి 1991 మధ్యన 67 దగ్గర స్థిరంగా వుంది. అయితే వ్యవసాయ రంగం మీద ఆధారపడిన జనాభా ఆ

తర్వాత పడిపోనారంభించింది. 1951 నుండి 1991 కాలంలో రైతుల యొక్క శాతం 9151 లో 50 శాతం వుండగా 1991 లో 38 శాతానికి తగ్గింది. అయితే వ్యవసాయ కూలీలు ఇదే కాలంలో 20 శాతం నుండి 26 శాతానికి పెరిగారు. వస్తూత్పత్తి రంగంలోనూ మరియు సేవల రంగాలలో పెద్దగా పెట్టుబడి జరిగినా 1951 నుండి వృత్తి పరమైన మార్పులు సైన ప్రభావాన్ని అంతగా చూపలేదని చెప్పవచ్చు. ఉదా॥కి 1951 మరియు 1971 లో 28 శాతం శ్రామికులు ద్వితీయ, తృతీయ రంగాలలో నియుక్తులయ్యేరు. 1991 తర్వాత ఈ శాతం 28 నుండి 33 వరకు వుంది. దీన్ని బట్టి చూస్తే పెద్ద మార్పు లేదు. అందుచేత 1951-91 కాలంలో శ్రామిక శక్తి వృత్తి పరంగా ప్రాథమిక రంగం నుండి ఇతర రంగాలకు బదిలి అంతగా జరగలేదు. ఇక్కడ ఒక వైపరీత్యం (Paradox) గురించి చెప్పుకోవచ్చు. 1950 దశాబ్దంలో స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగ వాటా 52 శాతం వుంటే 2000 సం॥ నాటికి 25 శాతానికి తగ్గింది. ద్వితీయ, తృతీయ రంగాల సమీకృత వాటా 48 శాతం నుండి 75 శాతానికి పెరిగింది. అయితే వృత్తి పరమైన మార్పు రమారమిగా స్థిరంగా వుంది. V.K.R.V. Rao మాటల్లో చెప్పాంటే "ఈ విరుద్ధ ప్రవృత్తి భారతదేశ ఆర్థికాభివృద్ధి యొక్క సమస్య మరియు వైపరీత్యం (Paradox). దీంతో వృద్ధి మరియు ఉద్యోగితల మధ్యన ఏదైనా సంబంధం వున్నదా అనేది వివాదాంశమైంది".

1.6 అవస్థాపనా సౌకర్యాల కల్పన :

ఒక దేశం యొక్క ఆర్థికాభివృద్ధి ఆ దేశంలో అందుబాటులో వున్న అవస్థాపనా సౌకర్యాల మీద ఆధారపడి వుంటుంది. దేశ సౌభాగ్యం అంతా కూడా వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై వుంది. ఈ రెండింటి అభివృద్ధి అంతా కూడా సరియైన రీతిలో అభివృద్ధి చెందిన అవస్థాపనా సౌకర్యాల పైన వుంటుంది. అంటే వ్యవసాయ రంగం అధిక ఉత్పాదకత సాధించాలంటే ఈ రంగానికి విద్యుచ్ఛక్తి, ఋణ సదుపాయాలు, రవాణా మరియు సమాచార సౌకర్యాలు, మొదలైనవి అవసరం. అలాగే పారిశ్రామిక రంగం అభివృద్ధికి యంత్రసామాగ్రితో పాటు నైపుణ్యం కల్గిన మానవ వనరులు, వృత్తి పరమైన యాజమాన్యం, ఇంధన వనరులు, బ్యాంకింగ్ మరియు భీమా సదుపాయాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, రవాణా అంటే రైల్వేలు, రోడ్లు, నౌకాయానం, సమాచార సౌకర్యాలు, మొదలైనవి అవసరం. ఈ అవస్థాపన సౌకర్యాలలో యింకా విద్యా, వైజ్ఞానిక మరియు ఆరోగ్య సంబంధిత సౌకర్యాలుంటాయి. భారతదేశం ఈ అవస్థాపనా సౌకర్యాల విషయంలో ఎంతో అభివృద్ధిని సాధించింది. భారతదేశం అవస్థాపన సౌకర్యాల పెంపు వాటి అభివృద్ధిపై తన విధాన నిర్ణయాలలో అధిక ప్రాముఖ్యత నిచ్చింది. యిక్కడ V.K.R.V. Rao మాటల్లో చెప్పాలంటే అభివృద్ధి మరియు అవస్థాపనా సౌకర్యాల మధ్యన గల సంబంధం ఒక నాటితో ఆగిపోయే సంబంధం గాదు. ఇది నిరంతరం కొనసాగే బంధం. అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధి ఒక దేశ ఆర్థికాభివృద్ధి జరగడానికి ముందుగాను, అభివృద్ధి జరుగుతున్నపుడు, మరియు అభివృద్ధి జరిగిన తర్వాత అవసరం అవుతుంది. ఎందుకంటే మన "స్వీయ వేగత్వరణ ఆర్థికాభివృద్ధి" (Self - Quelerating Economic Development) విధానంలోని లక్ష్యాలను నెరవేర్చాలంటే" అని అన్నాడు.

అవస్థాపనా సౌకర్యాలని సమాజం యొక్క మూలధనంగా అంటే సాంఘిక మూలధనంగా నిర్వచించవచ్చు. ఒక ఆర్థిక వ్యవస్థని అభివృద్ధి చెందే దిశగా ప్రయాణింప చేయాలంటే దానికి బలమైన గట్టి పునాది యైన అవస్థాపనా సౌకర్యాలు అవసరం అవుతాయి. పూనాది గట్టిగా లేకపోతే దాని మీద కట్టిన భవంతి కూడా ఎట్లాగైతే బలహీనపడుతుందో అలాగే బలమైన అవస్థాపనా సౌకర్యాలు వ్యవస్థ లేకపోతే ఒక ఆర్థిక వ్యవస్థ కూడా అదే విధంగా బలహీనమై పోతుంది. ఈ ఆర్థిక మరియు సామాజిక అవస్థాపన సౌకర్యాలను ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

(i) ఇంధన వనరులు - బోగ్గు, విద్యుచ్ఛక్తి, ఆయిల్ మరియు సంప్రదాయేతర ఇంధన వనరులు.
(ii) రవాణా సౌకర్యాలు - రైల్వేలు, రోడ్లు, షిప్పింగ్ మరియు విమాన రవాణ.
(iii) సమాచార సౌకర్యాలు - తంతి తపాల సౌకర్యాలు, టెలిఫోన్లు, టెలికమ్యూనికేషన్స్.
(iV) బ్యాంకింగ్, ఫైనాన్స్ మరియు భీమా సౌకర్యాలు,
(v) సైన్స్ మరియు సాంకేతిక విజ్ఞానం
(vi) విద్యా, వైద్య, ఆరోగ్య సౌకర్యాలు.

భారతదేశ ప్రణాళికలో అవస్థాపనా సౌకర్యాల కల్పనకి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ప్రణాళికలలో 50 శాతం పెట్టుబడిని అవస్థాపనా సౌకర్యాల నిమిత్తం ఖర్చు చేయడం జరుగుతోంది. మొదటి 6 ప్రణాళికలలో 55 శాతం నుండి 61 శాతాన్ని ఈ సౌకర్యాల కల్పన నిమిత్తం కేటాయింపులు చేశారు. మరి 7 వ ప్రణాళికలో 63 శాతం పెట్టుబడిని కేటాయించారు. 8 వ ప్రణాళికలో 61 శాతం ఖర్చు చేయడం జరిగింది. ఈ పెట్టుబడిలో అధికశాతం అనగా 46 శాతం (6,7,8 ప్రణాళిలలో) ఇంధన వనరుల కల్పనకి కేటాయించారు. దీని తర్వాత రవాణ మరియు సమాచార రంగం రెండవ స్థానాన్ని ఆక్రమించింది ప్రణాళికా కేటాయింపులలో.

ప్రణాళికలలో అవస్థాపనా సౌకర్యాల నిమిత్తం అధిక కేటాయింపుల కారణంగా ఈ సౌకర్యాల కల్పనలో భారతదేశం అధిక పెరుగుదల రేటుని నమోదు చేసుకుంది. దీని వలన స్థూల నీటి పారుదల పంటల విస్తీర్ణం (Gross Irrigated Area) 1950-51 లో 23 మిలియన్ హెక్టార్లుంటే అంటే స్థూల పంటల విస్తీర్ణం (Gross Cropped Area) లో 17 శాతం వుంటే, 1995-96 లో 89.4 మిలియన్ హెక్టార్లకి అనగా 53 శాతానికి పెరిగింది. బొగ్గు ఉత్పత్తి 1951 లో 32.30 మిలియన్ టన్నులుంటే అది 1997-98 నాటికి 296 మి.టన్నులకి పెరిగింది. ఇదే ఉత్పత్తి 2001-02 కి 323 మిలియన్ టన్నులకి పెరిగింది. అలాగే విద్యుచ్ఛక్తి ఉత్పాదన 1950-51 లో 5 బిలియన్ కిలోవాట్స్ వుంటే 1997-98 నాటికి 515 బిలియన్ కిలోవాట్స్‌కి పెరిగింది. యిదే విధంగా మిగతా రంగాలలో అవస్థాపనా సౌకర్యాలు గణనీయంగా పెరిగాయని చెప్పవచ్చు.

పట్టిక. 11 లో ఏయే రంగాలలో అవస్థాపనా సౌకర్యాల కల్పనలో ఎట్లా అభివృద్ధిని సాధించింది తెలియ జేస్తుంది.

గడిచిన ప్రణాళికా కాలంలో అవస్థాపనా సౌకర్యాల మీద అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టడం వలన వ్యవసాయ రంగంలో ఉత్పత్తి మూడు రెట్లు, పారిశ్రామిక రంగంలో ఏడు రెట్లు ఉత్పత్తి పెరిగింది. అయితే ఈ పెట్టుబడిలో అధిక శాతం పట్టణ ప్రాంతాలకే పరిమితం అయ్యింది. తత్ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉపాధి అవకాశాలు మెరుగువలేదని చెప్పవచ్చు. అంతే కాకుండా ఈ పెట్టుబడి అంతా కూడా అధికాదాయ వర్గాలకే ఎక్కువగా ఉపకరించిందని చెప్పవచ్చు. ఎందుకంటే అధికాదాయ వర్గాల వారు అవస్థాపన సౌకర్యాల ఉపయోగించుకోవడంలో కృతకృత్యులయ్యారు. ముఖ్యంగా వైద్య, రవాణా, విద్యుచ్ఛక్తి, సమాచార సంబంధాల విషయంలో గ్రామీణ ప్రాంతాలలో ధనిక రైతులు మాత్రమే పెద్దతరహా మరియు మధ్యతరహా నీటి పారుదల సౌకర్యాలను లాభసాటిగా ఉపయోగించుకోవడం జరిగింది. మన ప్రణాళికా విధాన నిర్ణేతలు చిన్నతరహా నీటి పారుదల ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల పేద రైతులు లబ్ధి పొందలేదు.

తలసరి ఇంధన వినియోగం ద్వారా ఒక దేశ ఆర్థికాభివృద్ధిని అంచనా వేయవచ్చు. తలసరి ఇంధన వినియోగం ఎక్కువగా వుంటే అభివృద్ధిని సాధించినట్లే అని చెప్పవచ్చు. ఉదా॥కి అభివృద్ధి చెందిన దేశాలైన USA, UK, Japan, మెదలగు దేశాలలో తలసరి ఆదాయం ఎక్కువ, అందుచేత తలసరి ఇంధన వినియోగం కూడా ఎక్కువే. USA లో (1997లో) తలసరి వినియోగం 8,076 Kg లు గాను, UK లో 3863 గాను, Japan లో 4084 Kg లు గాను వుంది.(World Development Report, 2000-01). అయితే భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో తలసరి ఆదాయం 500 కన్నా తక్కువ. అందుచేత తలసరి వినియోగం 1997 లో 479 Kg లు. ఇంధన వనరుల కల్పన పెరుగుతన్నప్పటికి తలసరి కొలమానంలో తక్కువగానే వుంది. అందుచేత యింకా పెద్ద మొత్తంలో ఇంధన సౌకర్యాలు కల్పించవలసి వుంది పెరుగుతున్న దేశ జనాభా దృష్ట్యా.

ఒక ప్రక్క కల్పించిన అవస్థాపన సౌకర్యాలు సరిపడనంతగా లేవని అనుకుంటుంటే ఇంకొక ప్రక్క కల్పించిన సౌకర్యాలను పూర్తిగా వినియోగంచుకోలేని పరిస్థితి. ముఖ్యంగా భారతదేశంలో అవస్థాపన సౌకర్యాల నిర్వహణా యంత్రాంగం సరిగాలేక కల్పించిన సౌకర్యాలు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. రైల్వే లైన్‌లలో 90 శాతాన్ని తీసివేసి క్రొత్త రైలు పట్టాలు వేయాలి. స్వాతంత్ర్యం వచ్చిన నాడు వేసినవి ఇంకా అట్లానే వున్నాయి. దీనికి ముఖ్యకారణం డబ్బు కొరత. అలాగే రోడ్డు మరియు షిప్పింగ్ రంగాలను అభివృద్ధి పరచవలసి యుంది.

అవస్థాపన సౌకర్యాలను మెరుగు పరచాలంటే మూడు పద్ధతుల ద్వారా చేయవలసి వుంటుంది. (a) అవస్థాపన సౌకర్యాల పెంపునకు పెట్టుబడిని పెంచడం; (b) సరియైన నిర్వహణ ద్వారా అవస్థాపన సౌకర్యాలు వాడుకలో వుండే లాగున చూడ్డం : మరియు (C) అవస్థాపన సౌకర్యాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించబడేలాగున చూడడం.

పట్టిక. 1 : ఉత్పత్తికారకాల ఖర్చు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి మరియు తలసరి ఆదాయం

1950 - 51 నుండి 1997 -98

సంవత్సరములు	1980-81 ధరలలో		ప్రస్తుత ధరలలో	
	నికర జాతీయోత్పత్తి (కోట్ల రూ. లలో)	తలసరి ఆదాయం (రూపాయలలో)	నికరజాతీయోత్పత్తి (కోట్ల రూ॥లలో)	తలసరి ఆదాయం (రూపాయలలో)
1950-51	40,454	1127	8574	239
1960-61	58,602	1350	14242	328
1970-71	82,211	1520	36503	675
1980-81	110,685	1630	110685	1630
1990-91	186446	2222	418074	4983
1991-92	186191	2175	479612	5603
1992-93	195602	2243	546023	6262
1995-96	239957	2608	936548	9578
1996-97	258465	2761	1089563	11554
1997-98	271052	2847	1224787	12729

మూలం : ఎకనామిక్ సర్వే, 2000-2001 దత్ & సుందరం, ఇండియన్ ఎకానమి, 2004. ధర్, పి.కే, ఇండియన్ ఎకానమి,2002

పట్టిక. 2. ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికరజాతీయోత్పత్తి మరియు తలసరి ఆదాయాలలో పెరుగుదల రేట్లు 1950-51 నుండి 1997-98 వరకు.

సంవత్సరములు (దశాబ్దములలో)	1980-81 ధరలలో		ప్రస్తుత ధరలలో	
	నికర జాతీయోత్పత్తి %	తలసరి ఆదాయం %	నికర జాతీయోత్పత్తి %	తలసరి ఆదాయం (%) %
1950-51 to 1960-61	3.8	1.8	5.2	3.2
1960-61 to 1970-71	3.4	1.2	9.9	7.5
1970-71 to 1980-81	3.0	0.7	11.7	9.2
1980-81 to 1990-91	5.4	3.1	14.2`	11.6
1990-91 to 1997-98	5.5	3.6	15.4	13.3
1950-51 to 1980-81	3.4	1.2	8.91	6.6
1980-81 to 1997-98	5.5	3.4	14.3	12.5

మూలం : ఎకనామిక్ సర్వే 2000-01.

పట్టిక . 3 ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికరజాతీయోత్పత్తి మరియు తలసరి ఆదాయాలలో పెరుగుదల, 1993-94 నుండి 2000-01 వరకు

సంవత్సరములు	1993- 94 ధరలలో		ప్రస్తుత ధరలలో	
	నికర జాతీయోత్పత్తి కోట్ల రూ॥లలో	తలసరి ఆదాయం రూ॥లలో	నికర జాతీయోత్పత్తి కోట్ల రూ॥లలో	తలసరి ఆదాయం రూ॥లలో
1993-94	685912	7698	685912	7698
1994-95	732651	8069	803090	8845
1995-96	785990	8479	936548	10103
1996-97	847511	8987	1089563	11554
1997-98	890712	9288	1224784	12772
1998-99	948982	9733	1434456	14712
1999-2000	1007769	10068	1564142	15,526
2000-2001	1050177	10306	1702454	16,707

మూలం : ఎకనామిక్ సర్వే 2002-03.

పట్టిక. 4 ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి మరియు తలసరి ఆదాయలలో పెరుగుదల రేట్లు 1994- 95 నుండి 1999-2000 వరకు. (%)

సంవత్సరములు	1980-81 ధరలలో		ప్రస్తుత ధరలలో	
	నికర జాతీయోత్పత్తి %	తలసరి ఆదాయం %	నికర జాతీయోత్పత్తి %	తలసరి ఆదాయం %
1994-95	6.8	4.8	17.1	14.9
1995-96	7.3	5.1	16.6	14.2
1996-97	7.8	6.0	16.3	14.4
1997-98	4.5	2.8	12.0	10.1
1998-99	6.5	4.8	17.1	15.2
1999-2000	6.6	4.8	10.9	9.1
1980-81 to 2000-01	5.5	3.3	14.3	12.0

మూలం : ఎకనామిక్ సర్వే, 2002-03.

పట్టిక. 5 ప్రణాళికా కాలంలో సగటు సాంవత్సరిక వృద్ధి రేట్లు (i) ప్రణాళిక నుండి (viii) ప్రణాళిక వరకు)

ప్రణాళికలు	1980-81 ధరలలో	
	నికర జాతీయోత్పత్తి %	తలసరి ఆదాయం %
I. (1951-56)	3.6	1.8
II. (19956-61)	4.0	2.0
III. (1961-66)	- 4.7	-6.8
సాంవత్సరిక ప్రణాళికలు (1966-69)	3.7	1.5
IV. (1969-74)	3.3	1.0
V. (1974-79)	5.0	2.7
సాంవత్సరిక ప్రణాళికలు (1979-80)	- 6.0	- 8.2
VI. (1980-85)	5.5	3.2
VII. (1985-90)	5.8	3.6
సాంవత్సరిక ప్రణాళికలు (1990-92)	2.5	0.4
VIII. 1992-97	6.6	4.6

మూలం : ఎకానమిక్ సర్వే, 2000-01.

పట్టిక. 6 స్థూల దేశీయోత్పత్తిలో వివిధ రంగాల వాటాలు

సంవత్సరములు	ఆర్థిక రంగాలు		
	ప్రాథమిక రంగం	ద్వితీయ రంగం	తృతీయ రంగం
	(1980-81 ధరలలో)		
1950-51	56.46	15.04	28.50
1960-61	52.13	18.74	29.13
1970-71	45.77	22.35	31.88
1980-81	39.65	24.36	35.99
1990-91	32.91	28.03	39.06
1992-93	32.15	27.12	40.73
	(1993-94 ధరలలో)		
1995-96	30.66	25.36	43.98
1996-97	31.04	25.13	43.83
1997-98	29.24	25.26	45.50
1999-2000	25.20	27.0	47.8

మూలం: పి.కే. ధర్, ఇండియన్ ఎకానమి, 2002 దత్ & సుందరం, ఇండియన్ ఎకానమి, 2004 ఎకానమిక్ సర్వే 2002-03

పట్టిక. 7 ఆర్థిక రంగాల వారీగా వృద్ధి రేట్లు 1950-51 నుండి 2000-01 వరకు

సంవత్సరములు (దశాబ్దాలలో)	వ్యవసాయ రంగం	పారిశ్రామిక రంగం	సేవల రంగం
	1980-81 ధరలలో		
50-51నుండి 60-61	3.0	6.2	4.1
60-61 నుండి 70-71	2.3	5.4	4.6
70-71 నుండి 80-81	1.5	4.0	4.3
80-81 నుండి90-91	3.6	6.7	6.6
50-51 నుండి 90-91	2.6	5.6	4.9
	1993-94 ధరలలో		
90-91 నుండి 2000-01	2.6	5.45	7.5

మూలం : ఎకనామిక్ సర్వే, 2002-03.

పట్టిక. 8 పెద్ద రాష్ట్రాల యొక్క ఆదాయ జనాభాలు, 1996-97

(93-94 ధరలలో)

రాష్ట్రాలు	జనాభా (కోట్లలో)	ఆదాయం (రూ॥కోట్లలో)	తలసరి ఆదాయం (రుపాయలలో)
బీహార్	9.73	411.88	4231
రాజస్థాన్	4.94	443.07	8974
ఉత్తరప్రదేశ్	15.32	1028.64	6713
ఒరిస్సా	3.50	206.36	5893
మధ్యప్రదేశ్	7.38	558.72	7571
ఆంధ్రప్రదేశ్	7.32	754.10	10306
తమిళనాడు	5.90	690.42	11708
కేరళా	3.14	323.87	10309
కర్ణాటక	4.89	513.60	10504
పశ్చిమబెంగాల్	7.47	715.66	9579
గుజరాత్	4.56	668.83	14675
హర్యానా	1.85	303.63	16392
మహారాష్ట్ర	8.80	1553.88	17666
పంజాబ్	2.25	406.85	18006
స్థూలదేశీయోత్పత్తి (దేశం మొత్తం)	94.30	10895.63	11554

మూలం : ఎకనామిక్ సర్వే, 2000. ఎకనామిక్ & పొలిటికల్ వీక్లీ, అక్టోబర్ 14 - 20, 2000.

పట్టిక. 9 రాష్ట్రీయ ఉత్పత్తి (S.D.P) మరియు రాష్ట్రీయ తలసరి ఉత్పత్తి పెరుగుదల రేట్లు,
(1980-81 నుండి 1997 -98 వరకు)

(%)

పెద్దరాష్ట్రాలు	1980-81 ధరలలో			
	1980- 81 నుండి 90-91		1991- 92 నుండి 97-98	
	రాష్ట్రీయ ఉత్పత్తి (S.D.P)	రాష్ట్రీయ తలసరి ఉత్పత్తి Per Capita S.D.P.	రాష్ట్రీయ ఉత్పత్తి (S.D.P)	రాష్ట్రీయ తలసరి ఉత్పత్తి Per Capita S.D.P.
బీహార్	4.66	2.45	2.69	1.12
రాజస్థాన్	6.60	3.96	6.54	3.96
ఉత్తరప్రదేశ్	4.95	2.60	3.58	1.24
ఒరిస్సా	4.29	2.38	3.25	1.64
మధ్యప్రదేశ్	4.56	2.08	6.17	3.87
ఆంధ్రప్రదేశ్	5.65	3.34	5.03	3.45
తమిళనాడు	5.38	3.87	6.22	4.95
కేరళా	3.57	2.19	5.81	4.52
కర్ణాటక	5.29	3.28	5.29	3.45
పశ్చిమబెంగాల్	4.71	2.39	6.91	5.04
గుజరాత్	5.08	3.08	9.57	7.57
హర్యానా	6.43	3.86	5.02	2.66
మహారాష్ట్ర	6.02	3.58	8.01	6.13
పంజాబ్	5.32	3.33	4.71	2.80
సగటు	5.24	3.03	5.94	4.02
స్థూలదేశీయోత్పత్తి (దేశం మొత్తం)	5.55	-	6.89	-

మూలం: ఎకనామిక్ & పొలిటికల్ వీక్లీ, మే 6-12, 2000.

పట్టిక. 10. వివిధ రంగాలలో శ్రామికుల పంపిణి (1951 - 2000) %

సంవత్సరములు	ప్రాథమిక రంగం (%)	ద్వితీయ రంగం (%)	తృతీయ రంగం (%)
1951	72.1	10.7	17.2
1961	71.8	12.2	16.0
1971	72.1	11.2	16.7
1981	70.6	12.9	16.5
1991	66.8	12.7	20.5
1999	64.0	16.0	20.0
2000	56.7	17.5	25.8

మూలం: పి.కే.ధర్, ఇండియన్ ఎకానమి, 2000. ఎకనామిక్ సర్వే, 2002-03.

పట్టిక. 11 అవస్థాపన సౌకర్యాల కల్పన, 1950-51 2001-02.

వివరము	1950 - 51	1990 - 91	2000-02
I. ఇంధనములు:			
(1) బొగ్గు (మి.ట)	32.30	225.50	323.00
(2) విద్యుచ్ఛక్తి (B.Kwh)	5.10	264.30	515.00
(3) పెట్రోలియమ్ క్రూడ్ (మి.ట)	0.30	33.0	32.00
II.స్టీల్ (మి.ట)	1.00	13.50	31.10
III.సిమెంట్ (మి.ట)	2.70	48.80	106.90
IV. రవాణా			
(1) రైల్వేలు: వస్తు రవాణా (మి.ట)	73.20	318.40	492.00
(2) మేజర్ పోర్టులలో సరకు రవాణా (మి.ట)	19.00	251.70	288.00

మూలం : ఎకనామిక్ సర్వే, 2001-02, 2002-03. దర్ & సుందరం, ఇండియన్ ఎకానమి, 2004.

1.7 సారాంశము :

భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణత ముఖ్యంగా రెండింటి మీద ఆధారపడి రూపుదిద్దుకుంది. మొదటిది స్వాతంత్ర్యం రాకపూర్వం బ్రిటీష్ వారి ఆర్థిక విధానాలు. రెండవది, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం అనుసరించిన ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి. ఈ రెండింటి కారణంగా భారతదేశంలో ఆర్థిక ప్రక్రియ తీరుతెన్నుల స్వరూప స్వభావాలు ఎంతో మార్పుని పొందాయి. అయితే భారత దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక మరియు భౌగోళిక పరిస్థితులపై బ్రిటీష్ వారి 200 సం॥ల పాలన అధిక ప్రభావాన్ని చూపింది.

బ్రిటీష్ వారు రాకపూర్వం అనగా 18 వ శతాబ్దపు మధ్య భాగంలో భారతదేశం వ్యవసాయాధారిత దేశంగానే వుంది. సుమారు 85 శాతం మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఉత్పాదక శక్తి మాత్రం హీనంగా వుండేది. పట్టణాలలో పరిశ్రమలు అంతంత మాత్రంగానే వుండేవి. ముఖ్యంగా భారతదేశం హస్తకళా వస్తు పరిశ్రమలకి ఆనాడు పెట్టింది పేరు. యివి పట్టు వస్త్రాలు, ముస్లిన్ వస్త్రాలు మొదలైన పరిశ్రమలుండేవి. పట్టణాలకి, గ్రామాలకి మధ్యన ఆర్థిక సంబంధాలు అంతంత మాత్రంగానే వుండి గ్రామాలు వారి అవసరాలను వారే తీర్చుకునే విధంగా ఆనాటి ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుంది.

బ్రిటీష్ వారి రాకతో ఆర్థిక, రాజకీయ మరియు సామాజిక జీవనం చిన్నాభిన్నం అయింది. దీనికి కారణం బ్రిటీష్ వారు భారతీయతను జీర్ణించుకోలేక పోవడమే. పాలకులు మరియు పాలితుల మధ్య తేడా ప్రస్ఫుటంగా కనబడేది. 1757 - 1858 కాలంలో భారతదేశం బ్రిటీష్ వారి వలసరాజ్యంగా మారి 1805 లో ఇంగ్లాండులో ఏర్పడిన పారిశ్రామిక విప్లవం కారణంగా భారతదేశం పారిశ్రామిక ఉత్పత్తులకి మార్కెట్‌గా మారిపోయింది. దీంతో భారతదేశంలో హస్తకళా పరిశ్రమలు విదేశీ పోటీని తట్టుకోలేక మూతపడ్డాయి. ఈ పరిశ్రమలో కార్మికులందరూ వ్యవసాయకూలీలుగా మారిపోయారు. అనాటి భూమి శిస్తు విధానం వల్ల రైతుల మీద అధిక పన్నులు విధించబడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. అంతేకాకుండా రైల్వేలను ప్రారంభించి భారతదేశ వనరులను పెద్దమొత్తంలో వారి దేశానికి తరలించి భారతదేశాన్ని వనరుల పరంగా వట్టిపోయేటట్లు చేశారు.

1850 -1947 కాలంలో బ్రిటీష్ హయాంలో యింకొక పెనుమార్పు వచ్చి వ్యవసాయరంగాన్ని సమూలంగా నాశనం చేసింది. అది, వ్యవసాయరంగ వ్యాపారీకరణ. అంటే వ్యాపారపంటలకి ప్రాధాన్యత పెరిగి భారతదేశం ప్రాథమిక ఉత్పత్తులను ఏగుమతి చేసే దేశంగా మారిపోయింది. దీనికి రైల్వేల అభివృద్ధి మరింతగా తోడ్పడింది. దీంతో పాటు ఆనాడు దేశంలో 12 క్షామాలు మరియు 4 కరువు పరిస్థితులు ఏర్పడి ప్రజల జీవన స్థితిగతులను దెబ్బతీశాయి. 1943లో వచ్చిన బెంగాల్ క్షామం తీవ్ర సంక్షోభాన్ని సృష్టించింది.

బ్రిటిష్ పాలనలో భారతదేశంలో పారిశ్రామికీకరణ నూలు మిల్లుల ద్వారా జరిగిందని చెప్పవచ్చు. ఇనుము మరియు ఉక్కు పరిశ్రమకు మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనే నాంది ప్రస్తావన జరిగింది. ఈ కాలంలోనే భారత పారిశ్రామిక ఉత్పత్తులకి విదేశాలలో గిరాకి పెరిగింది. 1923 లో భారత పరిశ్రమలకి రక్షణ కూడా కల్పించడం జరిగింది. బ్రిటీష్ వారు భౌగోళిక కారణాల వల్ల జనపనార, ప్లాన్‌టేషన్ పరిశ్రమలను అభివృద్ధి పరిచారు. బ్రిటీష్‌వారు భారతను వారి యొక్క యాంత్రిక పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యవసాయ వలస రాజ్యంగా మార్చివేసిరి.

స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే 1950 లో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేసి భారతదేశంలో ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి శ్రీకారం చుట్టడం జరిగింది. 9 ప్రణాళికలు (1951 - 1997) పూర్తి అయ్యాయి. ఎన్నో విజయాలు సాధించినప్పటికి యింకా సాధించవలసింది యింకా ముందరేవుంది. ముఖ్యంగా నిజ నికర జాతీయోత్పత్తి మరియు తలసరి ఆదాయాలలో 1980 - 81 నుండి 1997 -98 కాలంలో వరుసగా 5.5 శాతం మరియు 3.4 శాతం వృద్ధిని సాధించడం జరిగింది. రంగాలవారీగా చూసినట్లైతే, స్థూలదేశీయోత్పత్తిలో 1999-2000 నాటికి 25 శాతానికి పడిపోయింది. పారిశ్రామికరంగం మరియు సేవలరంగాల వాటా శాతం పెరిగింది. కావున అభివృద్ధిని సాధించినట్లే ఆహారధాన్యాల ఉత్పత్తి 2001 - 02 నాటికి 211 మి.టన్నులకి చేరి యించుమించు స్వయంసమృద్ధిని సాధించినట్లైంది. అయితే వ్యవసాయం మీద ఆధారపడిన శ్రామికుల శాతం 2000 సం॥నాటికి 56.7 శాతానికి మాత్రమే పడింది. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు యింకా పెరగవలసి వుంది. అంతే కాకుండా వ్యవసాయరంగంలో పెట్టుబడులు, మరియు ఉత్పాదక శక్తి పెరిగితే సంపూర్ణ ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.

భారతదేశంలో అభివృద్ధికి అవసరమైనంతగా శ్రామిక శక్తి అందుబాటులో లేదు. అంతే కాకుండా నైపుణ్యం కల్గిన శ్రామికుల శాతం కూడా తక్కువే. దీనికి కారణం పిల్లలు మరియు వృద్ధుల శాతం భారత జనాభాలో అధికంగా వుండడమే. 2001 జనాభా లెక్కలప్రకారం శ్రామిక శక్తి మొత్తం జనాభాలో 39.2 శాతం వుంది. అంతే కాకుండా పల్లెలలో అధిక శ్రామికశక్తి పట్టణాలతో పోలిస్తే కేంద్రీకృతం అయ్యింది. స్త్రీ శ్రామిక శక్తి కూడా బాగా పెరిగింది. ఇది సామాజిక అభివృద్ధికి నిదర్శనం.

V.K.R.V. రావ్ ప్రకారం అభివృద్ధి మరియు అవస్థాపనా సౌకర్యాల మధ్యన గల సంబంధం ఒక్కనాటితో ఆగిపోయే సంబంధం కాదు. అది నిరంతరం కొనసాగుతూ వుంటుంది. ఈ అవస్థాపనా సౌకర్యాలన్ని సాంఘిక మూలధనంగా పరిగణిస్తారు. ఈ సాంఘిక మూలధనం అభివృద్ధికి ముందర మరియు తర్వాత కూడా అవసరమవుతుంది. వీటిలో ఇంధన వనరులు, రవాణా మరియు పౌరసమాచార వ్యవస్థ, విద్యా, వైద్య మరియు ఆరోగ్యం, మరియు బ్యాంకింగ్, ఫైనాన్స్ మరియు భీమా వ్యవస్థలు ఉంటాయి. ప్రణాళికలలో 50 శాతం పెట్టుబడిని ఈ అవస్థాపన సౌకర్యాల కల్పనకి కేటాయించడం జరుగుతోంది. దీంతో రవాణా సౌకర్యాలు, ఇంధన వనరులు, నీటిపారుదల, పంటల విస్తీర్ణం మొదలైనవి ఎంతో పెరిగాయి. అయితే భారతదేశంలో తలసరి ఇంధన వినియోగం అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే చాలా చాలా తక్కువ. 1997 లో ఇది కేవలం 497 kg లు మాత్రమే. అందుచేత అవస్థాపన సౌకర్యాలలో యింకా అభివృద్ధిని సాధించ వలసివుంది.

పై విషయాలన్నింటిని ఒక్కమాటలో చెప్పాలంటే, భారతదేశం సాధించిన ఆర్థిక ప్రగతే భారతదేశ ఆర్థికవ్యవస్థ నిర్మాణత యొక్క స్వరూప స్వభావాలకు దర్పణం.

1.8 కఠిన పదాలు :

1.	స్వయం జీవనాధారిత గ్రామాలు	:	(Self - Sustaining Villages)
2.	పంచాయతీ పాలన	:	
3.	నూతన భూమి శిస్తు విధానం	:	(New Land - Revenue System)
4.	స్వేచ్ఛా వ్యాపారం	:	(Free Trade)
5.	ఆర్థిక డ్రైన్ సిద్ధాంతం	:	(Economic Drain Theory)
6.	వ్యవసాయరంగ వ్యాపారీకరణ	:	(Commercialisation of Agriculture)
7.	అమ్ముకోదగిన మిగులు	:	(Marketable Surplus)
8.	పారిశ్రామిక విప్లవం	:	(Industrial Revolution)
9.	వ్యాపారపంటలు	:	(Cash Crops)
10.	క్షామాలు	:	(Famines)
11.	రక్షణ	:	(Protection)
12.	యాంత్రిక పెట్టుబడిదారి వ్యవస్థ	:	(Machine Capitalism)
13.	వ్యవసాయ వలసరాజ్యం	:	(Agricultural Colony)
14.	రోడ్లనిధి	:	(Road Fund)
15.	దోపిడి	:	(Exploitation)
16.	పబ్లిక్ యుటిలిటీస్	:	(Public Utilities)
17.	హోమ్‌చార్జెస్	:	(Home Charges)
18.	విచక్షణాసహిత రక్షణ	:	(Discriminatory Protection)
19.	పారిశ్రామిక విధాన తీర్మానం, 1948	:	(1948 - Industrial Policy Resolution)

20. ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి	:	(Planning for Economic Development)
21. ప్రణాళికా సంఘం	:	(Planning Commission)
22. ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నిజ నికర జాతీయోత్పత్తి.	:	(Real NNP at Factor cost)
23. నిజ తలసరి ఆదాయం	:	(Real Per Capita Income)
24. ప్రైస్ డిఫ్లేటర్ మరియు ఇన్‌ఫ్లేటర్	:	(Price Deflator & Infletor)
25. నూతన స్థిరధరలు	:	(New Series)
26. ఆర్థిక సవరణలు	:	(Economic Reforms)
27. సరళీకరణ, ప్రైవేటీకరణ మరియు ప్రపంచీకరణ	:	(Liberalization, Privatisation & Globalisation)
28. పేదరిక నిశ్చల స్థితి	:	(Stagnation)
29. హిందూరేటు	:	(Hindu Rate)
30. సాంవత్సరిక సగటు వృద్ధిరేటు	:	(Average Aunnual Growth Rate)
31. బాటమ్ హెవీ పాపులేషన్	:	(Bottem Heavy Population)
32. రాష్ట్రీయ ఉత్పత్తి	:	(State Domestic Product)
33. మిరకిల్ ఆర్థిక వ్యవస్తలు	:	(Miracle Economies)
34. వృత్తుల ప్రత్యేకీకరణ	:	(Occupational Specialization)
35. శ్రామిక శక్తి పంపిణి	:	(Distribution of Labour Power)
36. భారతదేశ ఆర్థికాభివృద్ధి వైపరీత్యం	:	(Paradox of Economic Development of India)
37. స్వీయ వేగత్వరణ ఆర్థికాభివృద్ధి	:	(Self Accelerating Economic Development)
38. స్థూల పంటల విస్తీర్ణం	:	(Gross Cropped Area)
39. తలసరి ఇంధన వినియోగం	:	(Percapita Energy Comsumption)

1.9 స్వయం సమీక్షా ప్రశ్నలు:

(i) స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగ వాటా గణనీయంగా పడినప్పటికి వ్యవసాయరంగం మీద ఆధారపడిన శ్రామికుల శాతం చాల తక్కువగా పడింది - వివరించండి.

(ii) 'ఆర్థికాభివృద్ధి మరియు అవస్థాపనా సౌకర్యాల మధ్యన గల సంబంధం నిరంతరం కొనసాగే బంధం' 'V.K.R.V. రావ్, పరిశీలించండి.

(iii) స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశం రంగాల వారీగా ఎట్లా అభివృద్ధిని సాధించిందో తెలపగలరు ?

(iV) స్వాతంత్ర్యం రాకపూర్వం భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఏట్లా దోపిడికి గురైందో వ్రాయండి ?

(v) వ్యవసాయరంగ వ్యాపారీకరణ అనగా ఏమి ?

(vi) బ్రిటీష్ వారి పాలనలో పారిశ్రామిక మరియు రవాణా రంగాలు ఎట్లా అభివృద్ధిని సాధించాయో వ్రాయండి.

(vii) ఆర్థిక డ్రైన్ సిద్ధాంతం గురించి వివరించండి.

1.10 చదువవలసిన గ్రంథాలు :

(i) Dutt, R. & Sundram, K.P.M. : *Indian Economy.* S. Chand & Co NewDelhi, 2004 Edition

(ii) Uma Kapila (Ed.) : *Indian Economy Since Independence,* New Delhi, 2001-01.

(iii) Alak Ghosh. : *Indian Economy - Its Nature and Problems* - A New look, 1989.

(iv) Dhingra, I.C. : *Indian Economy,* 2003.

(v) Dhar, P.K. : *Indian Economy - Its Growing & Planning* - New Delhi, 2003.

(vi) Agarwal, A.N. : Problems of Development & Planning - New Delhi, 2003.

(vii) Braj Kishore & B.P. Singh. : *Indian Economy Through Plans,* 1981.

(viii) R.K. Sinha : Economic Development, Since Independence Forty Years of India's Development Experience 1988.

(ix) J.S. Uppal : Indian's Economic Problems, 1987.

(x) Mishra & Puri : Indian's Economic Problems, 2002.

(xi) Five Year Plans, Govt. of India, New Delhi.

(xii) Indian Economic Surveys, 1999-2000; 2000-20001 & 2001-02, Govt. of India, New Delhi.

డా ॥ జి. దుర్గాప్రసాద్

పాఠం - 2

భారతదేశ జాతీయాదాయం - వృద్ధి- సమస్యలు

ముఖ్యాంశాలు :

(i) జాతీయాదాయ నిర్వచనం
(ii) జాతీయాదాయ మదింపు పద్ధతులు
(iii) ఇతర జాతీయాదాయ అంశాలు
(iv) భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు
(v) జాతీయాదాయ సంయోజనం
(vi) స్థూల దేశీయోత్పత్తిలో పబ్లిక్‌రంగ సంస్థల వాటాలు
(vii) గ్రామీణ-పట్టణ ఆదాయ విభజన
(viii) స్థూల దేశీయోత్పత్తిలో వివిధరాష్ట్రాల వాటాలు.
(ix) భారతదేశ జాతీయాదాయ అంచనాలలో పరిమితులు
(x) జాతీయాదాయ ప్రాముఖ్యత

విషయ క్రమం :

1.0. పరిచయం

2.0. జాతీయాదాయ నిర్వచనం - మార్షల్ నిర్వచనం పిగూవియన్ నిర్వచనం - ఫిషర్ నిర్వచనం - ఆధునిక నిర్వచనం.

3.0. జాతీయాదాయ మదింపు పద్ధతులు - వస్తుసేవల ఉత్పత్తి మదింపు పద్ధతి - వస్తుసేవల వ్యయంలో మినహాయింపులు - ఆదాయ మదింపు పద్ధతి - మినహాయింపులు.

4.0. ఇతర జాతీయాదాయ అంశాలు - వ్యష్టి ఆదాయం - వ్యయార్హ ఆదాయం - తలసరి ఆదాయం - నిజఆదాయం మరియు ద్రవ్య ఆదాయం - జాతీయాదాయ మరియు ఉత్పత్తి పద్ధుల ఏకత్వం.

5.0. భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు - స్వాతత్ర్యం రాక పూర్వం చేపట్టిన జాతీయాదాయ అంచనాలు - స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతీయాదాయ అంచనాలు - జాతీయాదాయ కమిటి మరియు కేంద్ర గణాంక సంస్థ అంచనాలు - సాంప్రదాయ శ్రేణులు - సవరించిన శ్రేణులు - 1980-81 ధరల శ్రేణులు - నూతన శ్రేణులు (1993-94=100) - 1980-81 ధరలలో జాతీయాదాయ అంచనాలు - హిందూరేటు - 1993 - 94 నూతన శ్రేణులలో జాతీయాదాయ అంచనాలు

6.0. జాతీయాదాయ సంయోజనం-ప్రాథమిక రంగం-ద్వితీయ రంగం- తృతీయ రంగం - పరిశ్రమల వారీగా వృద్ధిరేట్లు.

7.0. స్థూల దేశీయోత్పత్తిలో పబ్లిక్‌రంగ సంస్థల వాటా

8.0. గ్రామీణ - పట్టణ ఆదాయ విభజన

9.0. స్థూల దేశీయోత్పత్తిలో వివిధ రాష్ట్రాల వాటాలు.

10.0. భారతదేశంలో జాతీయాదాయ అంచనాలలో పరిమితులు - ద్రవ్యేతర ఆర్థిక వ్యవస్థ - చిన్న చిన్న ఆదాయాలపరంగా సమాచారం అందుబాటులో లేకపోవడం - ఆర్థిక విధులలో వ్యత్యాసం లేకపోవడం - అన్యాయబద్ధమైన తెలియజెప్పని ఆదాయం - నమ్మదగిన గణాంక సమాచార కొరత - వస్తుత్పత్తికి విలువ కట్టడంలో సమస్యలు - ఇతర సమస్యలు

11.0 జాతీయాదాయ లెక్కల ప్రాముఖ్యత

12.0 సారాంశం

13.0 ముఖ్యపదాలు

14.0 స్వయం సమీక్షా ప్రశ్నలు

15.0 చదువవలసిన గ్రంథాలు

2.0 పరిచయం :

ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో మొత్తం వస్తుసేవల ఉత్పత్తిని నిర్ణయించే కారకాలని విశదీకరించడమే స్థూల అర్థశాస్త్ర యొక్క ఆశయం. దేశంలోని వనరులన్నింటిని పూర్తిగా వినియోగించడం ద్వారా, లేదా పూర్తి వినియోగానికి దగ్గరగా, ఒక సం॥ కాలంలో ఉత్పత్తి అయిన వస్తుసేవల మొత్తం ఉత్పత్తిని ద్రవ్యరూపంలో మదింపు చేయగా వచ్చినదే జాతీయాదాయం అని అనవచ్చు. యిట్లా వచ్చిన జాతీయాదాయాన్ని బట్టి ఒక దేశం ఆర్థికాభివృద్ధిని సాధించిందో లేదో తెలుసుకోవచ్చును. అంటే జాతీయాదాయంలో వృద్ధి కనబడినట్లైతే ఆర్థికాభివృద్ధి సాధించినట్లుగా అనుకోవచ్చు. మేయర్ మరియు బాల్డ్‌విన్‌ల ప్రకారం "ఒక దేశంలో నిజనికర జాతీయోత్పత్తిలో (Real NNP) దీర్ఘకాలంలో వృద్ధి సాధించబడే విధి విధానాన్ని అభివృద్ధి అని అనవచ్చు" (Meier & Baldwilh, 1983, p.s.) భారతదేశంలో నిజనికర జాతీయోత్పత్తిలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమైనప్పటి నుండి (1992-93) స్థిర ధ॥లలో (1993-94) 1999-2000 వరకు సగటు సాంవత్సరిక వృద్ధి రేటు 6.6 శాతం వుంది. ఇదే 50 దశాబ్దంలోనైతే స్థిర ధరలలో 3.8 శాతం మాత్రమే. భారతదేశం అభివృద్ధిని సాధిస్తోందని చెప్పగలము. అలాగే తలసరి ఆదాయంలో, 90 దశాబ్దంలో 3.3 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఈ విషయాన్నంతటిని జాతీయాదాయ అంచనాల వల్లనే తెలుసుకుంటాము.

ఈ పాఠ్యాంశంలో జాతీయాదాయ అంచనాలలోని సిద్ధాంతపరమైన (Theoufical) మరియు వాడుక (Practical) పరమైన అంశాల గురించి విశ్లేషించడం జరిగింది. ఈ విషయాలన్ని తెలిస్తే తప్ప స్థూల అర్థశాస్త్రం గురించి తెలిసే అవకాశం లేదు. మొదటి భాగంలో ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్తలు జాతీయాదాయాన్ని ఏవిధంగా నిర్వచించారో చెప్పి ఆ తర్వాత జాతీయాదాయ మదింపు పద్ధతులు వాటిలో వుండే లెక్కించు విధానాలు చెప్పడం జరిగింది. ఆతర్వాత వ్యష్టి ఆదాయం, వ్యయార్హ ఆదాయం, నిజ ఆదాయం మొదలైన వాటి గురించి వివరణ యివ్వడం జరిగింది. ఈ భాగంలో ఇచ్చిన నిర్వచనాల బట్టి జాతీయాదాయం అంటే "ఒక దేశంలో ఒక సం॥కాలంలో తయారైన మొత్తం అంతిమ వస్తుసేవల నికరవిలువయే" అని చెప్పబడింది. మదింపు పద్ధతులలో ముఖ్యమైనవి ఉత్పత్తి పద్ధతి,(Censes of Production) వ్యయమదింపు పద్ధతి (Expenditure method) మరియు ఆదాయ మదింపు పద్ధతి(Income Method) ఈ పద్ధతుల ద్వారా జాతీయాదాయ అంచనాలు తయారవుతాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యయమదింపు పద్ధతిని మరియు ఆదాయ మదింపు పద్ధతిని ఉపయోగించి అంచనాలు తయారు చేస్తే భారతదేశంలో ఎక్కువగా ఉత్పత్తి పద్ధతి మరియు ఆదాయ మదింపు పద్ధతి ఉపయోగించి అంచనాలు తయారు చేస్తున్నారు. ఏ రంగంలో ఏ పద్ధతి అనుకూలంగా వుంటుందో ఆ పద్ధతిని ఉపయోగించడం జరుగుతుంది. భారతదేశంలో వ్యయం పరంగా సమాచారం వుండదు. అదే విదేశాలలో వ్యయం పరంగా సమాచారం అందుబాటులో వుంటుంది. అయితే జాతీయాదాయ అంచనాలలో వస్తుసేవల పరంగా వ్యయపద్ధతి అన్న ఉత్పత్తి పద్ధతి అన్న ఒక్కటే. అందుకనే "జాతీయాదాయ మరియు ఉత్పత్తి పద్దు"(Natinal Income & Product A/C) అనేవి జాతీయాదాయ అంచనాలలో ఒక ముఖ్యభాగం. ఈపద్దు ఆస్తి మరియు అప్పుల పట్టిక (Balance Sheet) మాదిరిగా ఆదాయ మరియు ఉత్పత్తుల విలువ మొత్తాలు సమానంగా వుంటాయి. అందుకనే ఏపద్ధతి ద్వారా జాతీయాదాయాన్ని కొలిచిన విలువ ఒకటేనని అంటాము.

ఇక రెండవ భాగంలో భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు ఎట్లా వున్నాయో చర్చించడం జరిగింది. ఈ భాగంలో స్వాతంత్ర్యం రాకపూర్వం అంచనాలు ఎట్లా చేశారో తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతీయాదాయ కమిటి మరియు కేంద్ర గణాంక సంస్థల అంచనాలు మొదలైనవి విశ్లేషించడం జరిగింది. జాతీయాదాయం 1950-51 తర్వాత అంటే ప్రణాళికల శకం ఆరంభమైన నాటినుండి ఈనాటి వరకు ఏవిధంగా వృద్ధిని సాధించింది, ఆ రకంగా ఏయే రంగాలు స్థూల దేశీయోత్పత్తిలో ఎంతెంత సమకూర్చాయి అనేవి విశదీకరించడం జరిగింది. అయితే జాతీయాదాయం వృద్ధి అనేది 1980 దశాబ్దం నుండి ఆరంభమైంది. 1990 దశకంలో సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా వృద్ధి మరింతసాధించబడింది. ఈదశలో వ్యవసాయరంగ వాటా స్థూలదేశీయోత్పత్తిలో తగ్గి తృతీయ రంగ వాటా గణనీయంగా పెరిగింది. దీన్ని బట్టి చూస్తే భారతదేశం అభివృద్ధి పథంలో నడస్తోందని తెలుస్తోంది. అయితే భారతదేశానికి పట్టుకొమ్మ అయిన వ్యవసాయ రంగం ఎంతో నిర్లక్ష్యానికి గురైంది. ఇదే భాగంలో స్థూల దేశీయోత్పత్తిలో రాష్ట్రాల వాటా ఎట్లా వుందో కూడా చెప్పబడింది. అంతే కాకుండా గ్రామీణ పట్టణ ఆదాయ వ్యత్యాసాలు మరియు స్థూల దేశీయోత్పత్తిలో పబ్లిక్ రంగసంస్థల

వాటాల గురించి వివరించి జాతీయాదాయ అంచనాలలో వుండే పరిమితులను మరియు జాతీయాదాయ ప్రాముఖ్యతను చివరిగా వివరణ యివ్వడం జరిగింది.

2.0 జాతీయాదాయ నిర్వచనం

ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధిని అంచనా వేయడానికి జాతీయాదాయ లెక్కలు ఒక ముఖ్యమైన సాధనం. ఆర్థికాభివృద్ధి అనగా ఒక దేశంలోని వనరులను ఉపయోగించుకుని వస్తుసేవల ఉత్పత్తిని గరిష్ఠం చేసుకోవడం, ఈ వస్తుసేవల ఉత్పత్తి విలువనే జాతీయాదాయం అని అంటారు. జాతీయాదాయన్ని ఈ విధంగా తెలుసుకోడం ద్వారా ఒక ఆర్థిక వ్యవస్థ ఏట్లా నడుస్తోందో తెలుస్తుంది. ఈ జాతీయాదాయాన్ని అనేక విధాలుగా నిర్వచించడం జరిగింది. జాతీయాదాయాన్ని నిర్వచించిన వారిలో ప్రముఖులు మార్షల్, పిగూ, ఫిషర్ మొదలైన వారు ఉన్నారు.

2.1 మార్షల్ నిర్వచనం :- ఒక దేశం యొక్క శ్రమ మరియు మూలధనం ఆ దేశం యొక్క వనరులనుపయోగించి తయారు చేసిన అన్నిరకాల వస్తువుల, అనగా వస్తూ మరియు వస్తేతర వస్తువుల మరియు సేవలలో కలుపుకుని మొత్తం నికర సాంవత్సరిక ఉత్పత్తిని నికర సాంవత్సరిక ఆదాయం లేక రెవెన్యూ లేక జాతీయ డివిడెండ్ అని అనవచ్చు. ఈ నిర్వచనంలో ముఖ్యంగా చెప్పినదేమిటంటే వస్తుసేవల సావంత్సరిక నికర ఉత్పత్తిని జాతీయాదాయం అని పిలవవచ్చు. నికర అంటే స్థూల జాతీయాదాయం నుండి మూలధన తరుగు తీసివేస్తే మిగిలిన నికర ఆదాయం జాతీయాదాయం అవుతుంది. దీనినే నికర జాతియోత్పత్తి అని అంటారు. (Net National Product). అంతే కాకుండా యిక్కడ మార్షల్ శ్రమని మరియు మూలధనాన్ని ఉత్పత్తి కారకాలుగా గుర్తించాడు. మార్షల్ నికర జాతీయోత్పత్తినే జాతీయాదాయం అని అన్నాడు. (Principles of Economies, p.434)

2.2 పిగూ వియవ్ నిర్వచనం:- మార్షల్ అడుగుజాడలలో నడిచిన కేంబ్రిడ్జి ఆర్థిక శాస్త్రవేత్త అయిన ఎ.సి.పిగూ ఆదాయాన్ని ద్రవ్యరూపంలో చెప్పినట్లైతే దానిని జాతీయాదాయం అని అనవచ్చు అని అన్నాడు. ఆయన ప్రకారం, జాతీయాదాయం ఒక సమాజం యొక్క కొలవదగిన(objective) ఆదాయంలో భాగం. ఈ ఆదాయంతోపాటుగా ద్రవ్యంలో అంచనా వెయ్యగల్గిన విదేశీ ఆదాయం కూడా దీంట్లో భాగం అయ్యుంటుంది. జాతీయాదాయం అంటే ద్రవ్యరూపంలో విలువకట్టగలిగే ఒక దేశం యొక్క ఆదాయం (The Economics of the Welfare, p.31). విదేశాలలో పెట్టిన పెట్టుబడి మీద సంపాదించిన ఆదాయం కూడా ఒక దేశ జాతీయాదాయంలో భాగమే. ఈ రెండింటిని కలిపితే స్థూల జాతీయాదాయం లేదా ఉత్పత్తి అవుతుంది. యిక్కడ మనం ఒక సం॥లో తయారై కొవడానికి వీలుకల్గిన ఆదాయాన్నే జాతీయాదాయం అనాలి. పిగూ 'సం॥' అనే పదాన్ని గాని అలా అర్థంవచ్చేటట్లుగా గాని చెప్పలేదు. తర్వాత, ద్రవ్యంలో కొలవలేనివి అనగా ఒక కుటుంబంలో గృహిణ యొక్క సేవలు జాతీయాదాయలలోకి లెక్కలోకి రావని అర్థం. అంటే ఒక మేనేజరు తన స్త్రీ అయిన సెక్రెటరీని పెళ్ళి చేసుకుంటే ఆ మేనేజరు ఆ స్త్రీ సేవలకి జీతం యివ్వడు కాబట్టి జాతీయాదాయం తగ్గే ప్రమాదం వుంది. అంతే కాకుండా పిగూ నిర్వచనం అల్పాభివృద్ధి చెందిన దేశాలలో వినిమయం ఎక్కువగా వస్తురూపంలో జరుగుతుంది. కాబట్టి జాతీయాదాయం తక్కువగా కనపడే ప్రమాదముంది. అయితే అటుంటి పరిస్థితులలో ద్రవ్యకొలమానం ద్వారా విలువని అంచనా వేయడం ద్వారా ఈ సమస్యని అధిగమిస్తారు. దీనినే "IMPUTATION" అని అంటారు.

2.3 ఫిషర్ నిర్వచనం : (IRWING FISHER):

మార్షల్ మరియు పిగూలు ఉత్పత్తిని (Production) ఆధారంగా చేసుకొని జాతీయాదాయాన్ని నిర్వచిస్తే, ఫిషర్ వినియోగాన్ని ఆధారంగా చేసుకుని జాతీయాదాయాన్ని నిర్వచించాడు. ఫిషర్ ప్రకారం, జాతీయ డివిడెండ్ లేక ఆదాయంలో కడపటి వినియోగదారులు పొందిన సేవలు మాత్రమే వుంటాయి. ఈ సేవలు వస్తువుల ద్వారా కావచ్చు. యింకా ఇలా అన్నాడు, "ఒక పియానో లేక ఒక కోటు (overcoat) నా (ఫిషర్) కోసం తయారు చేసింది. ఈ సం॥లో, అది ఈ సం॥ఆదాయంలో భాగం కాదు, అయితే అది ఆదివరకే ఉన్నటువంటి మూలధనం (Accumulated Capital) కి అదనంగా వచ్చి చేరినటు వంటిది. ఆ వస్తువే మూలధనం. ఈ వస్తువు ద్వారా (పియానో లేక కోటు) నాకు సంప్రాప్తించిన, అందునా ఈ సంవత్సరం, సేవలని మాత్రమే ఆదాయం" అని అనాలి. అని వివరించాడు.

ఫిషర్ నిర్వచనం వినియోగదారుల శ్రేయస్సు గురించి వివరిస్తుంది. వినియోగదార్ల ఆర్థిక శ్రేయస్సు వారి యొక్క వినియోగం మీద ఆధారపడి వుంటుంది. ఎక్కువ వినియోగం చేస్తే ఎక్కువ శ్రేయస్సు తక్కువ వినియోగం అయితే తక్కువ శ్రేయస్సు లభిస్తుంది. ఈ వినియోగం వ్యక్తుల యొక్క జీవన ప్రమాణాన్ని ప్రతిఫలిస్తుంది. యింకొక రకంగా చెప్పాలంటే వినియోగవ్యయమే జాతీయాదాయం. ఫిషర్ పిగూ లాగానే ద్రవ్యకొలమానాన్ని చెప్పాడు. అంటే వినియోగాన్ని ద్రవ్యరూపంలో కొలవడం ద్వారా జాతీయాదాయాన్ని లెక్కవేయాలి. వస్తుసేవల వినియోగాన్ని ద్రవ్యంలో కొలిస్తేనే ఎంతవ్యయం అయ్యిందో తెలుస్తుంది. ఈ విధమైన లెక్కచాలా కష్టం. అమెరికా లాంటి దేశాలలో ఫరవాలేదు తేలికగా లెక్కవేయవచ్చు. భారతదేశం లాంటి దేశంలో వ్యయపరమైన ఎక్కౌంట్లు తయారు చేసే అలవాటుండదు. కావున ఇటువంటి కొలమానం కష్టం. అంతేకాకుండా కొన్ని వస్తువులు మన్నిక కలిగిన వస్తువులు (durable goods) వుంటాయి. ఒక సం॥లో అటువంటి వస్తువుల నుండి పొందిన సేవని మాత్రమే జాతీయాదాయంలోకి తీసుకోవాలని ఫిషర్ తన నిర్వచనంలో పేర్కొన్నాడు. మరి ఆ మన్నిక వస్తువు తయారైంది అదే సం॥లో, అంటే దానినుండి మొదటగా ఎప్పుడైతే సేవపొందేనో అ సంవత్సరం. ఈ వస్తువు 4 లేక 5 సం॥లు అంతకన్నా ఎక్కువ సం॥లు తన సేవని అందించవచ్చు. ఉదా॥ 2004 సం॥లో ఒక ఫ్రిజ్ తయారైంది అని అనుకోండి. ఈ వస్తువు మన్నిక గల్గి ఒక సం॥లో నిరాఘాటంగ తన సేవని అందించిందనుకోండి. దీని ఖరీదు 10,000/-. ఫిషర్ ప్రకారం ఈ వస్తువు నుండి వినియోగదారునికి 1 సం॥లో వచ్చిన సేవని జాతీయాదాయంలో కలపాలి. అంటే Rs.1000 (1×10,000)మాత్రమే జాతీయదాయంలో కలపాలి. అయితే వస్తువు తయారైంది 2004 లో మొత్తం Rs. 10000 ని 2004 లోని జాతీయాదాయంలో కలపాలా లేక వద్దా అంటే కలపాలి అనేదే కరెక్టు. మార్షల్, పిగూలో అట్లాగే చేయాలని వారి నిర్వచనాల ద్వారా చెప్పేరు. ఫిషర్ మాత్రం 1/10 వంతే కలపవలసి వుంటుందని అన్నాడు. యిలా వస్తుసేవల వినియోగం అంటే చాలా సమస్యలు ఎదురు అవుతాయి. ఫిషర్ తన నిర్వచనం ద్వారా మూలధనం సంచయం గురించి కూడా మాట్లాడం జరిగింది. అయితే వస్తువు కాని సేవకాని అది తయారైన సం॥కి సంబంధించిన జాతీయాదాయంలో వాటి విలువని తప్పని సరిగా కలిపితేనే జాతీయాదాయాన్ని కరెక్టుగా లెక్కవేసినట్లు అవుతుంది.

2.4 ఆధునిక నిర్వచనాలు:

నోబెల్ బహుమతి గ్రహీత అయిన సైమన్‌కుజెట్స్ (Simon Kuzhets) జాతీయదాయాన్ని యిట్లా నిర్వచించాడు. "కరుసరి వినియోగదార్ల చేతుల్లోకి ఒక దేశం యొక్క ఉత్పాదక పద్ధతి ద్వారా ఒక సం॥లో తయారైన నికర వస్తుసేవల ఉత్పత్తి యొక్క ప్రవాహాన్ని జాతీయాదాయం అని అనాలి అని అన్నాడు. ఈ నిర్వచనంలో వాడిన పదాలు : (i) నికర ఉత్పత్తి; (ii) ఒక సం॥ ; మరియు (iii) ఉత్పాదక పద్ధతి నికర ఉత్పత్తి అంటే స్థూలజాతీయోత్పత్తి నుండి తరుగు తీసివేస్తే వచ్చిన ఉత్పత్తి. దీనినే నికర జాతీయోత్పత్తి (NNP) అని అనవచ్చు. దీనినే జాతీయాదాయం అని కూడా అంటారు. తర్వాత వస్థూత్పత్తి ఎట్లా జరగాలి అంటే ఉత్పాదక పద్ధతుల ద్వారా ఒక ప్రత్యేక సం॥లో జరగాలి. అంటే ఒక సం॥లో ఉత్పాదక ప్రక్రియ ద్వారా వస్తుసేవల ఉత్పత్తి జరగాలి. అలా జరగ్గా ఏర్పడిన ఆదాయాన్ని జాతీయాదాయం అని అంటారు.

U.N.O కూడా జాతీయాదాయ నిర్వచనాన్ని దాన్ని అంచనా వేసే పద్ధతుల ద్వారా అనగా నికరజాతీయోత్పత్తి అని, ఉత్పత్తి కారకాల వాటాలని, నికరజాతీయ వ్యయం అని నిర్వచించింది. వాటినే వరుసగా ఉత్పత్తి పద్ధతిని (Product Method) ఆదాయపద్ధతి (Income Method) మరియు వ్యయపద్ధతి (Expenditure Method) అని అంటారు. ఈ మూడు పద్ధతులలో దీని ననుసరించి జాతీయాదాయం లెక్క కట్టిన ఒకటే విలువ తప్పక వస్తుంది.

భారత జాతీయాదాయ కమిటి (April, 1951) యొక్క మొదటి రిపోర్టులో జాతీయాదాయాన్ని ఇట్లా నిర్వచించింది. "ఒక నిర్ణీత కాలంలో, ఒక వస్తువుకు రెండుసార్లు విలువ కట్టకుండా, తయారైన వస్తుసేవల విలువను అంచనా వేస్తే, అది జాతీయాదాయం అవుతుంది."

పై నిర్వచనాలన్నింటిని బట్టి జాతీయాదాయం అంటే "ఒక దేశంలో ఒక సం॥ కాలంలో ఉత్పాదక ప్రక్రియ ద్వారా ఉత్పత్తి అయిన మొత్తం వస్తుసేవల నికర విలువ"ని జాతీయాదాయం అనవచ్చు.

3.0 జాతీయాదాయ మదింపు పద్ధతులు:

జాతీయాదాయాన్ని లెక్కించడానికి గడిచిన పేజిల్లో U.N.O. అన్నట్లుగా మూడు పద్ధతులున్నాయి. అవి (i) వస్తూత్పత్తి పద్ధతి (Product Method) (ii) ఆదాయ పద్ధతి(Income Method); మరియు వ్యయమదింపు పద్ధతి (Expenditure Method). అభివృద్ధి చెందిన దేశాలలో ఆదాయ వ్యయ పద్ధతుల ద్వారా జాతీయాదాయాన్ని మదింపు చేస్తే అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆదాయ ఉత్పత్తి పద్ధతులను ఉపయోగించి జాతీయాదాయాన్ని లెక్కించడం జరుగుతోంది. అయితే ప్రతిదేశం కూడా జాతీయా లెక్కలను ఒక ఎక్కౌంట్ పట్టిక (Accounting Table) రూపంలో తయారు చేస్తారు. భారత దేశంలో కేంద్ర గణాంక పట్టిక (C.S.O.) ఈ లెక్కలు తయారుచేస్తుంది. ఈ పట్టికని "జాతీయాదాయ మరియు ఉత్పత్తి పద్దు" (National Income and Product Account.) దీనినే ఆస్తి మరియు అప్పుల పట్టి (Balance Sheet) అని పిలుస్తారు. ఈ పట్టికలో ఎడమవైపున ఆదాయ ప్రవాహాలు మరియు కుడివైపున వస్తూత్పత్తి ప్రవాహాలు ఉంటాయి. కుడిఎడమల రెండింటిలోని మొత్తం ఒకటే. అంటే ఎడమవైపున ఉన్నటు ఐటములన్నీ కలిపితే వచ్చే మొత్తానికి కుడివైపున వున్న ఐటముల మొత్తానికి సమానం. అందుచేతనే దీనిని ఆస్తి అప్పుల పట్టిక అన్నారు. అంటే ఆస్తి మరియు అప్పులు సరిపోతేనే వ్యాపారం సజావుగా సాగుతుంది. జాతీయాదాయ లెక్కలలో రెండువైపుల సమానం ఎందుకుంటే ఒక రూపాయ విలువ గల్గిన వస్తుసేవలు తయారైతే దానికి సమానమైన రూపాయి ఆదాయం తయారైనట్లే యింకో రకంగా చెప్పాలంటే తయారైన ప్రతిరూపాయి ఆదాయానికి ఒక రూపాయ విలువ గల్గిన వస్తుసేవలు తయారవుతాయి. అందుచేత ఆదాయ మదింపు ద్వారా జాతీయదాయాన్ని అంచనా వేసిన లేక ఉత్పత్తి పద్ధతి ద్వారా అంచనా వేసినా విలువ జాతీయాదాయానికి వస్తుంది.

ఈ మదింపు పద్ధతులను ఒక్కొక్కటిగా నేర్చుకుని వాటిలో ఎదురయ్యే సమస్యలను చర్చిందాము.

3.1 వస్తుసేవల ఉత్పత్తి మదింపు పద్ధతి:

ఈ పద్ధతిలో ఆర్థిక వ్యవస్థలో ఒక సం॥ కాలంలో ఉత్పాదక ప్రక్రియ ద్వారా తయారైన వస్తుసేవల మొత్తాన్ని స్థూల జాతీయోత్పత్తి (G.N.P.) అని అంటారు. దేశంలో తయారైన కోట్ల సంఖ్యలోవున్న వస్తువులను మరియు సేవలను మరియు వాటియొక్క పరిమాణాన్ని మరియు నాణ్యతను దృష్టిలో వుంచుకుని వేలసంఖ్యలో వున్న ధరవరలను సమీకరించి వస్తుసేవల పరిమాణాన్ని వాటి ధరలచేత గుణించగా వచ్చేదే స్థూల జాతీయోత్పత్తి. ఈ కార్యానికి తగిన సమాచారం (Data) లభ్యమైందని అనుకున్నప్పటికి, మొత్తం వస్తూత్పతిని లెక్కవేయడం తలకు మించిన వ్యవహారం. ఈ వస్తూత్పత్తి మొత్తాన్ని తేలికగా కనుక్కునే మార్గం లేకపోలేదు. అదెంటంటే వస్తువులు కొనుగోలు చేసేటపుడు వాటికైన ఖర్చు ద్వారా తేలికగా జాతీయాదాయాన్ని లెక్కించవచ్చు. దీనివే వ్యయ మదింపు పద్ధతి అని అంటారు. వస్తువులను కొనుగోలు ధర దగ్గర వాటిని కొనుగోలు చేసే సమయాన మదింపు చేయడం జరుగుతుంది. ఆ విధంగా మొత్తం కొనుగోళ్ళ విలువను అనగా వస్తుసేవల ఖర్చును లెక్కవేసిన స్థూల జాతీయోత్పత్తి వస్తుంది. అయితే ఈ పద్ధతి భారతదేశం లాంటి దేశాలలో ఉపయోగ పడుతుందా అనేది కాసేపు పక్కన పెట్టండి.

(i) వస్తువుల వ్యయంలో మినహాయింపులు :- వస్తుసేవల మీద చేసిన వ్యయాన్ని సింపుల్‌గా కలిపివేస్తే స్థూల జాతీయోత్పత్తి వస్తుందంటే అది తప్పు. వస్తుసేవల వ్యయాన్ని పరిగణనలోకి తీసుకునేటపుడు ఏ వ్యయాన్ని మదింపు చేయాలి మరియు ఏది చేయకూడదు అన్న విషయం మదింపుదారులు క్షుణ్ణంగా గ్రహించవలసి వుంటుంది. వ్యయాన్ని మదింపు చేసేటపుడు తీసుకోవలసిన కొలమానం ఏంటంటే (i) ఒక ప్రత్యేక సం॥కి సంబందించిన వ్యయం అయ్యుండాలి; మరియు (ii) ఆ వ్యయం ఉత్పాదక ప్రక్రియ ద్వారా తయారైన వస్తుసేవల మీదనే చేయాలి. అందుచేత గడిచిన కాలాల్లో జరిగిన వ్యయాన్ని ప్రస్తుత కాలానికి సంబంధించిన స్థూల జాతీయోత్పత్తిలో కలపరాదు. ప్రస్తుత కాలానికి సంబందించి ప్రస్తుత ఉత్పత్తిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే వస్తువు కాని మరియు సేవ కాని విషయంలో చేసిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోరాదు. ఉదా॥. బాండ్లు, షేర్లు మొదలైన వాటిమీద చేసిన కోట్లాది రూపాయల వ్యయాన్ని జాతీయోత్పత్తిలో కలపరాదు. ఎందుకంటే ఈ బాండ్ల మరియు షేర్ల కొనుగోళ్ళలో ద్రవ్యం చేతులు మారిందె తప్ప ఏ విధమైన ఉత్పాదక ప్రక్రియ జరగలేదు. అంటే ఉత్పత్తి జరిగితేనే లెక్కిస్తాము లేదా లెక్కించము.

అలాగే ప్రభుత్వ ప్రజలకి ఏవిధమైన ప్రతిఫలం వస్తురూపంలోగాని సేవల రూపంలోగాని ఆశించకుండ బదిలి చెల్లింపుల (Transfer Payments) రూపంలో వ్యయాన్ని చేస్తూవుంటుంది. యిక్కడ ఉత్పత్తి జరగనందున జాతీయోత్పత్తిలో యిటువంటి వ్యయాన్ని తీసుకోబోము.

అంతేకాకుండా జాతీయాదాయాన్ని లెక్కించేటపుడు మధ్యస్థ వస్తువు (Intermediate Product) మీద వ్యయాన్ని లెక్కించాలా లేక అంత్య వస్తువు మీద (Final Product) వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలా అన్నది యింకొక సమస్య. యిక్కడ అంత్య వస్తువు మీద వ్యయాన్ని మాత్రమే జాతీయాదాయ లెక్కలలోకి తీసుకోవాలి. అంత్య వస్తువు అంటే అంతిమ వినియోగానికి పనికి వచ్చేది. ఉదా॥ ఒకబ్రెడ్ అయితే బ్రెడ్ తయారీకి ఉపకరించే గోధుమ పిండిని మధ్యస్థ వస్తువు అనవచ్చు. ఒక్కడ బహుళ ప్రాముఖ్యత గల్గిన ఉదాహరణ ఒకటి చూద్దాము. అదే గోధుమ-పిండి-బ్రెడ్ ఉదాహరణ-రైతు 20 రూ॥ల గోధుమలను పిండిమర యజమాని ఇచ్చేడు. ఈ పిండిమర యజమాని పిండితయారు చేసి బ్రెడ్ యజమానికి 32 రూ॥లకు ఇచ్చేడు. బ్రెడ్ యజమాని ఈ పిండిని బ్రెడ్‌క్రింద మార్చి 60 రూ॥కి అమ్మేడు. ఈ ముగ్గురు వస్తువుకి పెంచిన విలువలు వరసగా 20+12+28=60. అందుచేత బ్రెడ్ మీద 60 రూపాయలు వ్యయం చేస్తే దానినే జాతీయోత్పత్తిలో కలుపుతాము లేదా ప్రతీ స్టేజీలోను ఎంత విలువ వచ్చి కలిసింది అనే దానిమీద ఆధారపడి రైతు దగ్గర కలిసిన విలువ 20 రూ॥, పిండిమర దగ్గర కలిపిన 12 రూ॥ మరియు బ్రెడ్ తయారి దగ్గర కలిపిన 28 రూ॥ల వ్యయాలను లెక్కలోకి తీసుకోవచ్చు. దీనినే అదనంగా కలిపిన విలువ ద్వారా (Value Added) లెక్కించే పద్ధతి అని అంటారు.

ఒక ఉద్యమదారుని (Entrepreneur) విషయంలోనైతే అతను క్రొత్త ప్లాంట్ మరియు యంత్రసామగ్రి మీద చేసిన మొత్తం వ్యయం (స్థూలస్థిర పెట్టుబడి) నుండి వస్తూత్పత్తిలో వాడివేసిననటువంటి ప్లాంట్ మరియు యంత్రసామగ్రి (తరుగుదల) తీసివేస్తే మిగిలేదే నికర స్థిర పెట్టుబడి. ఆ నికర స్థిర పెట్టుబడిని మాత్రమే జాతీయోత్పత్తిలో పరిగణన తీసుకుని దానిని నికర జాతీయోత్పత్తి అని అంటారు.

ప్రభుత్వం కూడా అనేక రకాల వస్తుసేవలను కొనుగోలు చేస్తూ వుంటుంది. దానికైన వ్యయాన్ని లెక్కలోకి తీసుకోవాలి, ఒక్క బదిలి చెల్లింపులు తప్పించి.

ఉద్యమదారులు ఉత్పత్తి ప్రక్రియలో కొన్ని వస్తువుల సగం తయారైనవి మరియు ఒక సం॥లో అమ్ముడు కాకుండా మిగిలినవి వుంటాయి. వీటిని ఇన్వెంటరీస్ (Inventories) అని పిలుస్తారు. ఇవి ఋణాత్మకంగాను (Negative) మరియు ధనాత్మంగాను (Positive) వుంటాయి. జాతీయోత్పత్తిలో పరిగణనలోకి తీసుకోవాలి.

అయితే ఒక మూసి వుంచిన (Close) ఆర్థిక వ్యవస్థ అయితే పైన చెప్పినంత వరకు సమాచారం సరిపోతుంది. ఒక తెరిచి వుంచిన (open) ఆర్థిక వ్యవస్థ అయితే ఎగుమతులు మరియు దిగుమతుల నికర విలువను జాతీయోత్పత్తిలో కలుపుకోవాలి. అంటే వ్యయాన్ని కలుపుకోవాలి.

పైన చెప్పిన వివరణ ద్వారా స్థూల జాతీయోత్పత్తిని ఈ క్రింది విధంగా వ్రాయవచ్చు.

(i) GNP = C+I+G+(-M)

యిక్కడ GNP = స్థూలజాతీయోత్పత్తి

C = వ్యక్తుల వినియోగ వ్యయం

I = ఉద్యమదారుల పెట్టుబడి వ్యయం

G = ప్రభుత్వం వస్తుసేవలపై చేసే వ్యయం

X = ఎగుమతులు

M = దిగుమతులు.

(ii) NNP = C+I+G+(X-M)-D

యిక్కడ NNP = నికర జాతీయోత్పత్తి

D= తరుగుదల (Depreciation or wear & Tear)

లేదా = NNP = GNP - Depreciation

(iii) GDP = GNP - y_A

యిక్కడ GDP = స్థూల దేశీయోత్పత్తి.

y_A = ఒక దేశానికి సంబంధించిన ప్రజలు ఇతర దేశాల్లో సంపాదించిన ఆదాయ ప్రవాహం.

(iv) = NNP - y_A

యిక్కడ NDP = నికర దేశీయోత్పత్తి

ఒక దేశం యొక్క ఆర్థిక వ్యవస్థని దేశీయంగా పరిశీలించి దానిపై జాతీయాదాయ ప్రాముఖ్యతను వివరించాలంటే స్థూలదేశీయోత్పత్తి మరియు నికర దేశీయోత్పత్తి అనే సూచికలు అవసరమవుతాయి. ముఖ్యంగా భారత దేశ ప్రజలు ఇతర దేశాల్లో ఆర్జించిన ఆదాయాన్ని లేక ఇతర దేశ ప్రజలు ఆదేశాల్లో భారత ప్రజలు అందించిన వస్తుసేవలపై చేసిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని స్థూల జాతీయోత్పత్తిని లెక్కవేస్తారు. ఇట్లా బయటి నుండి వచ్చే ఆదాయ ప్రవాహాలు ఋణాత్మకంగాను మరియు ధనాత్మకంగాను వుంటాయి. ఈ రోజున భారతదేశ ప్రజలు విదేశాలకు వెళ్ళి ఉద్యోగాలు మరియు వ్యాపారాలు చేయడం ద్వారా భారతదేశానికి ఆదాయ చెల్లింపులు ఎక్కువగా జరుగుతున్నాయి. అటువంటపుడు GNPకి GDPకి మధ్యన తేడా బాగా వుంటుంది. NNP నుండి ఈ చెల్లింపులు తీసివేస్తే వచ్చేNDP అనేది దేశ ఆర్థిక పరిస్థితిని దైనందిన జీవనానికి దగ్గరగా (Nearer to reality) ఆలోచించి భారతదేశం ముందుకి నడుస్తోందా లేక వెనక్కి నడుస్తోందా అని తెలుసుకోడానికి ఎంతైన ఉపకరిస్తుంది.

3.2 ఆర్థికవ్యవస్థ యొక్క విలువల మదింపు - ఆదాయ మదింపు పద్ధతి:-

ఇందాక చెప్పినట్లుగా ఏ పద్ధతిలో జాతీయాదాయాన్ని మదింపు చేసినా వచ్చే వస్తుసేవల మొత్తం విలువ ఒకటే. అంతే కాకుండా వ్యయ మదింపు పద్ధతిలో తెలుసుకొన్న మినహాయింపులు కొద్ది మార్పులతో ఆదాయ మదింపు పద్ధతిలో కూడా వర్తిస్తాయి.

ఆదాయ మదింపు పద్ధతి క్రింద ఒకదేశంలో ఒక సం॥కాలంలో ఉత్పాదక ప్రక్రియ ద్వారా తయారైన ఆదాయం మొత్తాన్ని జాతీయాదాయం (National Income) అని అంటారు. ఇందులో జాతీయాదాయాన్ని ఉత్పత్తి కారకాల రాబడి క్రింద చెప్పబడుతుంది. (Receipt of Income by the Factors of Production). అందుకనే జాతీయాదాయాన్ని ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి (NNP at Factor Cost) రూపంలో చెప్పడం జరుగుతూ వుంటుంది. జాతీయాదాయంలో ఎవరి వాటా ఎంత అనే విషయం ఈ మదింపు పద్ధతిలో తెలుస్తుంది.

మినహాయింపులు:

ఆదాయం వైపున గడిచిన కాలాల్లో జరిగిన ఉత్పత్తి ద్వారా కారణభూతమైన భవంతులు, వాహనములు మొదలైనవి అమ్మకాలు జరపడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రస్తుత సం॥ ఆదాయంలో కలపరాదు. ఎందుకంటే ప్రస్తుత సం॥లో ఉత్పాదక ప్రక్రియ ద్వారా ఆ వస్తువులు తయారు కాలేదు కాబట్టి అలాగే బాండ్లు మరియు షేర్లు లావాదేవిల వల్ల వచ్చిన ఆదాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోరు. ఎందుకంటే ఉత్పాదక ప్రక్రియ జరగలేదు ఈ విషయంలో కూడా.

బదిలీ చెల్లింపుల ద్వారా వచ్చిన ఆదాయం కూడ జాతీయదాయంలోకిరాదు. ఎందుకంటే అట్లా పొందిన ఆదాయానికి తగ్గట్టుగా ఏవిధమైన వస్తువు కాని లేక సేవ కాని తయారు కాలేదు.

అయితే దేన్ని ఆదాయంక్రింద పరిగణించాలి. వ్యాపార సంస్థలు రాబడిగా పొందిన ఆదాయాన్ని లెక్కలోకి తీసుకోవాలి. ఎందుకంటే ఈ సంస్థలు ఆ ఆదాయానికి సరిపడే వస్తూత్పత్తిని ఉత్పాదక ప్రక్రియ ద్వారా అందించారు. కాబట్టి అయితే అంతిమ వస్తువుల ద్వారా తయారైన ఆదాయాన్ని మాత్రమే లెక్కించాలి. అలా కాకపోతే లెక్కించిన ఆదాయాన్ని మరల మరల లెక్కించినట్లు అవుతుంది. ఇందాక వివరించిన గోధుమ-పిండి-బ్రెడ్ ఉదాహరణ చూడండి.

ఈ విధంగా వచ్చిన ఆదాయాలన్నింటిని కలిపితే వచ్చేదే జాతీయదాయం. ఈ జాతీయదాయంలో ఉత్పత్తి కారకాల వాటాలుంటాయని అన్నాము. అవి ఏంటంటే (i) జీతభత్యాలు (Wages & Salaries); (ii) యాజమాన్య ఆదాయం (Proprietors Income); (iii) బాడుగ ఆదాయం (Rents); (iv) కంపెనీల లాభాలు (Corporate profits); మరియు (v) నికరవడ్డీ (Net Interest). యిక్కడ జీతభత్యాలలో శ్రామికుల వేతనాలు, సాంఘిక భీమా (Social Insurance) నిమిత్తమై కంపెనీ చేసిన చెల్లింపులు మరియు ఇతరత్రా సంపాదించిన శ్రామిక ఆదాయం. యాజమాన్య ఆదాయం అంటే రాయల్టీలనుండి మరియు ఇతర ఆస్తుల నుండి (Royalties & Good will) వచ్చే ఆదాయం. యిక బాడుగ అంటే అద్దె. భవంతులు, మరియు వ్యవసాయ భూములు, మరియు ఇతరత్రా ఆస్తులపై వచ్చే అద్దె. కంపెనీ లాభాలలో లాభాలపైపన్ను, డివిడెండ్లు మరియు అవిభాజ్యలాభాలలో వుంటాయి. ప్రజలకి ప్రభుత్వం నుండి ప్రైవేటు వ్యక్తులు మరియు కంపెనీల నుండి వచ్చే వడ్డీ. (i) నుండి (v) వరకు కలపగా వచ్చిన మొత్తాన్ని జాతీయాదాయం అని అంటారు.

యిట్లా వచ్చిన జాతీయాదాయానికి (i) వ్యాపారబదిలి చెల్లింపులు మరియు (ii) పరోక్ష వ్యాపార పన్నులను కలిపి దాంట్లోంచి (iii) సబ్సీడీలను తీసివేస్తే వచ్చేదే నికర జాతీయోత్పత్తి (NNP). వ్యాపార బదిలి చెల్లింపులంటే ప్రభుత్వం మాదిరిగానే వ్యాపార సంస్థలు కూడా బదిలి చెల్లింపులు చేస్తాయి. ఉదాహరణకి వ్యాపారసంస్థలు వారి వ్యాపారాభివృద్ధికై వస్తురూపంలోను మరియు ద్రవ్యరూపంలో పారితోషికాల్ని ప్రకటిస్తాయి. అంతేకాకుండా కంపెనీలు పరోక్షపన్నులైన యూనియన్ ఎక్సైజ్ మరియు సేవల పన్నులనూ చెల్లిస్తుంటాయి. ఇక సబ్సిడీలు అనగా మార్కెట్టులో పోటిని తట్టుకోవడానికి కొన్ని సంస్థలకు సబ్సిడీలను ప్రకటిస్తుంది ప్రభుత్వం. అంటే ఒక వస్తువు తయారీ ఖర్చు మార్కెటు ధరకన్నా ఎక్కువగా వున్నపుడు ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని సబ్సిడీలను అందజేస్తుంది. ఈనాడు ప్రభుత్వం చేసేత పరిశ్రమకి, వంట గ్యాస్, కిరోసిన్ మొదలైన వాటికి సబ్సిడీలు యిస్తోంది.

యిట్లా వచ్చిన నికరజాతీయోత్పత్తికి యంత్రములు మరియు ప్లాంట్‌లపై అయిన తరుగుదల ఖర్చును (Depreciation) ని కలిపేతే 'స్థూల జాతీయోత్పత్తి' వస్తుంది.

పైన చెప్పిన విషయాల్ని ఈ క్రింది సమీకరణం ద్వారా చూపించవచ్చు. జాతీయాదాయం అంటే ఉత్పత్తి కారకాల ఆదాయ రాబడి అని తెలుసుకున్నాము. అలాంటపుడు ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి ఈ క్రింద విధంగా నిర్వచించవచ్చు.

(i) GNP at factor cost = GNP at Market Prices - Indirect Taxes + Subsidies.

GNP at Market Prices అనగా మార్కెట్టు ధరల దగ్గర స్థూల జాతీయోత్పత్తి అని అర్థం.

(ii) NNP at Factor cost = NNP at markest Prices - Indirect Taxes + Subsidies.

ఉత్పత్తికారకాల ఖర్చు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి అంటే యింకో రకంగా జాతీయాదాయం అని అర్థం.

4.0 ఇతరజాతీయదాయ అంశాలు:-

4.1 వ్యష్టి ఆదాయం: (Personal Income):-

అన్నిరకాల మార్గాలు నుండి (Sources) లభించిన వ్యక్తుల యొక్క ప్రస్తుత ఆదాయాన్ని వ్యష్టి ఆదాయమని పిలుస్తారు. ఈ వ్యష్టి ఆదాయం ఎటువంటి ఉత్పత్తిని అంచనా వేయడానికి ఉపయోగపడే కొలమానం కాదు. ఎందుకంటే వ్యష్టి ఆదాయంలో ఉత్పాదక

ప్రక్రియ ద్వారా తయారు కానటువంటి ఆదాయం కూడ వుంటుంది. ఈ ఆదాయాన్ని బదిలి చెల్లింపుల నుండి వచ్చిన ఆదాయం అని అంటారు. అందుచేత వ్యష్టి ఆదాయంలో ఉత్పాదక ప్రక్రియకి ప్రతిఫలంగా వచ్చిన ఆదాయం మరియు బదిలి చెల్లింపులు వుంటాయి.

వ్యష్టి ఆదాయం కనుగోనాలంటే జాతీయాదాయం నుండి వ్యక్తులు పొందిని ఆదాయాలన్నింటిని తీసివేయాలి. అవి ఏమనగా (i) సాంఘిక భీమా (Social Insurance) అవసరార్థమై చేసిన చెల్లింపులు (Contributions). వీటిని యాజమాన్యదారుడే కార్మికుల తరుపున ప్రభుత్వానికి చెల్లిస్తాడు. (ii) మొత్తం కంపెనీ లాభాలు ఉద్యమదారుని ఆదాయం యిది జాతీయాదాయంలో భాగం. దీంట్లోంచి కొంత మొత్తాన్ని లాభాలపై పన్ను (Profit tax) రూపంలో ప్రభుత్వానికి చెల్లించబడుతుంది. ఈ లాభాలలో యింకా కొంత భాగాన్ని అవిభాజ్య లాభాల క్రింద (Undiributed Profits) కంపెనీల దగ్గరే వుంచుకోబడతాయి. మిగిలిన భాగాన్ని (మొత్తం కంపెనీల లాభాల నుండి పన్నులను మరియు అవిభాజ్య లాభాలను తీసివేసి మిగిలినది) డివిడెండ్లు రూపంలో వ్యక్తుల వద్దకు ఆదాయం క్రింద వస్తుంది.

యిట్లా లెక్కించిన జాతీయాదాయానికి వ్యక్తులు ప్రభుత్వం నుండి మరియు కంపెనీల నుండి, వస్తుసేవల రూపంలో ప్రతిక్రియ చేయకుండా, పొందిన ఆదాయాన్ని అనగా బదిలి చెల్లింపుల ద్వారా వ్యక్తులో పొందిన ఆదాయాన్ని కలపవలసి వుంటుంది. దీంతో బాటుగా వడ్డీ ఆదాయాన్ని (ప్రభుత్వం మరియు వినియోగదారుల నుండి వచ్చిన) మరియు కంపెనీలు వ్యక్తులకి చెల్లించిన బదిలి చెల్లింపులు (Business Transfer Payments)కలపాలి.

పైన వివరించిన విషయాలను ఈ క్రింది విధంగా వ్రాయవచ్చు.

వ్యష్టి ఆదాయం= జాతీయాదాయం-కంపెనీ లాభాలపై పన్నుల - సాంఘిక భీమా చెల్లింపులు - అవిభాజ్య లాభాలు + ప్రభుత్వ బదిలి చెల్లింపులు + కంపెనీల బదిలి చెల్లింపులు + ప్రభుత్వం వడ్డీ చెల్లింపులు + వినియోగదార్ల వడ్డీ చెల్లింపులు

4.2 వ్యయార్హ ఆదాయం : (Disposable Personal Income):

వ్యష్టి ఆదాయంలాగానే ఈ వ్యయార్హ ఆదాయం కూడా ఆర్థిక వ్యవస్థ యొక్క ఉత్పత్తికి కొలమానం క్రింద ఉపయోగపడదు. వ్యయార్హ ఆదాయాన్ని తేలికగ లెక్కించవచ్చు. అది ఎట్లనిన, వ్యష్టి ఆదాయం నుండి వ్యక్తిత్వ పన్నులను తీసివేస్తే మిగిలిందే వ్యయార్హ ఆదాయం. వ్యక్తులు ఈ వ్యయార్హ ఆదాయాన్ని వారి అవసరాలకు స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. యిక్కడ వ్యక్తిత్వ పన్నులంటే ప్రత్యక్ష పన్నులైన ఆదాయపన్ను మరియు వృత్తి పన్ను మొదలైనవి.

ఈ వ్యయార్హ ఆదాయాన్ని ఈ క్రింది విధంగా చూపించవచ్చు.

వ్యష్టి ఆదాయం - వ్యక్తిత్వ పన్నులు = వ్యయార్హ ఆదాయం

ఈ వ్యయార్హ ఆదాయం నుండి వస్తుసేవల వినియోగానికి ఖర్చు చేయవచ్చు. అలా ఖర్చు చేయగా మిగిలిన దాన్ని పొదుపు చేయవచ్చు. వ్యయార్హ ఆదాయం నుండి పొదుపు తీసివేస్తే వచ్చేదే "వ్యక్తిత్వ వినియోగవ్యయం"

4.3 తలసరి ఆదాయం:

ఒక సంవత్సర కాలంలో తయారైన ఒక దేశం యొక్క సగటు ఆదాయాన్ని తలసరి ఆదాయం అని అంటారు. ఇది ఏట్లా వస్తుందంటే ఒక దేశం యొక్క జాతీయాదాయాన్ని ఆ దేశ జనాభా పెట్టి భాగిస్తే వచ్చేదే తలసరి ఆదాయం. ఈ తలసరి ఆదాయాన్ని బట్టి ఒకదేశం యొక్క జీవన ప్రమాణ స్థాయి ఎట్లా వుందో తెలియజేస్తుంది. తలసరి ఆదాయం ఎక్కువగా వుంటే జీవన ప్రమాణ స్థాయి ఎక్కువగా వున్నట్లు గ్రహించాలి. తక్కువగా తలసరి ఆదాయం వుంటే తక్కువ జీవన ప్రమాణ స్థాయి వున్నట్టు. ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధిని కొలవాలంటే ఈనాడు వాడబడే ఏకైక కొలమానం తలసరి ఆదాయం. అందుచేత తలసరి ఆదాయాన్ని ఈక్రింద విధంగా వ్రాయవచ్చు.

2003 లో తలసరి ఆదాయం = 2003 జాతీయాదాయం

2003 జనాభా

4.4 నిజాదాయం (Real Income) & ద్రవ్య ఆదాయం (Money Income) :

నిజ జాతీయాదాయం అనగా ప్రస్తుత ధరలలోని జాతీయాదాయాన్ని గడిచిన సం॥లలో ఏదోఒక సం॥ని ఆధారంగా చేసుకుని ఆ ధరలలోకి మార్చి చెప్పినట్లైన దానిని నిజజాతీయాదాయం అని అంటారు. ఈవిధంగా ఎందుకు చేస్తారంటే ప్రస్తుత ధరలలోని ధర ప్రభావాన్ని తప్పించి అసలు ఉత్పత్తిలో పెరుగుదల వున్నదా లేక లేదా అని అంచనా వేయడానికి. ఈరోజులన అమలులోవున్న నవ్యశ్రేణులు (1993-94=100) నుపయోగించి ప్రస్తుత ధరలలో వున్న జాతీయాదాయాన్ని 'ఉదా॥కి 2002-03) బేస్ సంవత్సరపు ధరలలోకి (వీటినే స్థిర ధరలంటారు) తర్జుమా చేస్తారు. దీనికి ఈ క్రింది సూత్రాన్ని వుపయోగిస్తారు.

నిజ జాతీయాదాయం (NNP at factor Cost) =

ప్రస్తుత ధరలలో NNP × బేస్ సం॥వు (1993-94=100) ధరసూచిక

ప్రస్తుత సం॥వు (2002-03) ధరసూచిక

ప్రస్తుత ధరని స్థిరధరలలోకి (1993-94=100) తగ్గించి నిజ NNP ని లెక్కవేస్తున్నాము కావున పైసూత్రాన్ని "డైస్ డిఫ్లేటర్" అని అంటారు. స్థిరధరలలో చూపిన NNP ప్రస్తుత ధరలలో వున్న NNP కన్నా తక్కువగా వుంటుంది. ఒక్కోక్కప్పుడు 1983-84 లోని ధరలలో వున్న NNP ని స్థిర ధరలలోకి (1993-94=100) మార్చాలంటే పైసూత్రాన్ని తిరగవేయాలి. అపుడు దానిని "డైస్ ఇన్‌ఫ్లేటర్" అని అంటారు. అందుచేత NNP లో నిజమైన పెరుగుదల కనుగొనాలంటే పైసూత్రాన్ని ఉపయోగించాలి. తద్వారా ఆర్థికాభివృద్ధిని తెలుసుకోవచ్చు. అలాకాకుండా ప్రస్తుత ధరలలో ఆర్థికాభివృద్ధిని చూచినట్లైతే ధరల ప్రభావం వల్ల ఎక్కువగా కనబడి విధనా నిర్ణేతలను తప్పుదారి పట్టిస్తుంది.

4.5 జాతీయాదాయ మరియు ఉత్పత్తి పద్దుల ఏకత్వం: (National Income and Products Accounting Identity)

ఆదాయ మదింపు ద్వారా కనుగొన్న స్థూల జాతీయోత్పత్తి ఉత్పత్తి మదింపు ద్వారా అంచనా వేసిన స్థూల జాతీయోత్పత్తికి సమానం. ఎందుకంటే తయారైన ప్రతీ రూపాయి ఆదాయం ద్వారా ఒక రూపాయ వస్తుసేవలు తయారవుతాయి. ఈ విషయాన్ని క్రింది విధంగా వ్రాయవచ్చు.

ఆదాయ మదింపు పద్ధతి ద్వారా అంచనా వేసిన స్థూల దేశీయోత్పత్తి

GNP=C+S+T

యిక్కడ S = పొదుపు (వ్యక్తుల మరియు ఉత్పత్తిదారుల)

T = పన్నులు (ప్రభుత్వఆదాయం)

ఉత్పత్తి మదింపు ద్వారా లెక్కించిన GNP :

GNP=C+I+G+(X-M)

(గడిచిన పేజీలు త్రిప్పిచూడండి)

ఏ పద్ధతి ద్వారా నైనా వచ్చే విలువ అంటే విలవ ఒకటే కాబట్టి పైన పెర్కొన్న రెండు సమీకరణాలను ఈక్రింది విధంగా వ్రాయవచ్చు.

C+S+T=GNP=C+I+G+(X-M)

PART - II

5.0 భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు

గడిచిన పాఠ్యాంశంలో జాతీయాదాయపరంగా నిర్వచనాలు, కొలమానములు, వేర్వేరు విషయపరమైన అంశాలు మొదలైనవి నేర్చుకొనడం జరిగింది. వీటన్నిటిని సిద్ధాంతపరంగా ఆలోచన చేశాము. యిక ముందు భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు, జాతీయాదాయంలో వృద్ధి, జాతీయాదాయం మదింపులో ఎదురైయ్యే సమస్యలు మరియు ఇతర అంశముల గురించి నేర్చుకుందాము.

5.1 స్వాతంత్ర్యం రాకపూర్వం చేపట్టిన జాతీయాదాయ అంచనాలు:

స్వాతంత్ర్యం రాకపూర్వం జాతీయాదాయ అంచనాలు అనేకం చేపట్టబడ్డాయి, ఈ అంచనాలు చేపట్టిన వారిలో ప్రముఖులు:

(i) దాదాబాయి నౌరోజి	- 1868 (అంచనా చేపట్టిన సం॥)
(ii) విలియం డిగ్బీ	- 1899 (॥)
(iii) ఫిండ్లే షిరాస్	- 1911,1922,1931 (॥)
(iv) షా మరియు ఖయ్ బట్టా	- 1921 (॥)
(v) వి.కే. ఆర్. వి.రావ్	- 1931 -32 1945 - 46 (॥)
(vi) ఆర్. సి.దేశాయి	- 1931-40 (॥)

ఈ అంచనాలన్నీ వ్యక్తిగత కృషి ఫలితమే. వ్యక్తిగతంగా కృషి చేయడం వలన ఎక్కువ ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించలేకపోయిరి. అందుచేత ఈ అంచనాలలో జాతీయాదాయ లెక్కలు సుస్పష్టంగా లేవు. పైన పేర్కొన్న వాళ్ళలో దాదాభాయి నౌరోజి, షా మరియు ఖంబట్టా, ఫిండ్లే షిరాస్ మరియు వాడియా మరియు జోషి మొదలైన వారు వ్యవసాయ రంగంలోని ఉత్పత్తి విలువని అంచనా వేసి దానికి వ్యవసాయేతర ఆదాయం క్రింద కొంత శాతాన్ని కలపి జాతీయాదాయాన్ని అంచనా వేశారు. ఈ అంచనాలకి వివిధమైన సాంకేతికత లేదు. ఎందుకంటే వీరు అనుకున్న ప్రమేయాలన్ని అసంబద్ధమైనవే అని చెప్పవచ్చు. అందుచేత ఈ అంచనాలు శాస్త్ర సమ్మతమైనవికావు.

ఆ తర్వాత వి.కే.ఆర్.వి.రావ్ ఉత్పత్తి మరియు ఆదాయ మదింపు పద్ధతుల సమ్మేళనాన్ని ఉపయోగించి జాతీయాదాయన్ని లెక్కవేశాడు. రావ్ భారత ఆర్థికవ్యవస్థని రెండింటి క్రింద విభజించాడు. మొదటి భాగంలో వ్యవసాయం, పచ్చిక మైదానాలు, అడవులు, గనులు, చేపలవేట, మరియు వేట (Hunting) లను చేర్చాడు. ఈ సెక్టారులో రావ్ ఉత్పత్తి పద్ధతిని ఉపయోగించి ఈ రంగంలో మొత్తం ఉత్పత్తిని లెక్కవేశాడు. యిక రెండవ గ్రూపుక్రింద పరిశ్రమలు, వర్తకం, రవాణా, పరిపాలన మరియు పబ్లిక్‌సేవలు, వృత్తులు, కళలు, మరియు దేశీయ సేవలు. ఈరంగంలో ఆదాయ పద్ధతిని ఉపయోగించి జాతీయాదాయన్ని లెక్కించాడు. ఇట్లా లెక్కించిన ఆదాయానికి గృహసంబంధ ఆస్తి నుండి పొందిన ఆదాయాన్ని మరియు ఇతర దేశీయాదాయాన్ని కలుపుకొని విదేశాలో ఆర్జించిన ఆదాయాన్ని యిట్లా ఆదాయపద్ధతి ద్వారా లెక్కించిన జాతీయాదాయానికి కలపడం జరిగింది. అంటే రెండవరంగంలో జనితమైన ఆదాయానికి ఈక్రింద ఆదాయాల్ని కలపాలి :

(i) గృహసంబంధ ఆస్తినుండి వచ్చిన ఆదాయం;

(ii) ఇతర దేశీయాదాయం; మరియు

(iii) విదేశాలలో ఆర్జించిన ఆదాయం.

ఈ విధంగా లెక్కించిన స్థూల జాతీయాదాయం (GNP) నుండి ఉత్పత్తి విధానంలో వినియోగించి వేసిన వస్తుసేవలను (Used up goods & Services in the Process of Production) తీసివేసి నికర జాతీయాదాయం (NNP) లెక్కించడం జరిగింది.

పట్టిక.1 లో వివిధ వ్యక్తులు లెక్కించిన జాతీయాదాయ మరియు తలసరి ఆదాయ అంచనాలో యివ్వబడ్డాయి. వీరిలో దాదాబాయి నౌరోజి జాతీయాదాయాన్ని మొదటి సారిగా భగీరథ ప్రయత్నంగా 1867-68 లో అంచనావేసి జాతీయాదాయాన్ని 370 కోట్లు రూపాయిలుగా తేల్చాడు. తలసరి ఆదాయాన్ని 20 రూపాయలుగా లెక్కవేశాడు. మరి V.K.R.V.రావు అయితే 1931-32లో జాతీయాదాయాన్ని రూ॥ 1689 కోట్లగాను మరియు తలసరి ఆదాయం 65 రూ॥లు గాను అంచనావేశాడు. రావు ప్రకారం 1942 - 43లో తలసరి ఆదాయం 114 రూ॥లు గాను వుందని అన్నాడు. 1945-46 లో కామర్స్ మంత్రిత్వశాఖ అంచనాల ప్రకారం రూ॥ 6234 కోట్ల జాతీయాదాయం మరియు తలసరి ఆదాయం 198 రూ॥గా వుందని ప్రభుత్వ అంచనా.

అందరి అంచనాలలో రావ్ యొక్క అంచనాలు ఒక సాంకేతిక ప్రయత్నంగా చెప్పవచ్చు. అంతే కాకుండా ఈయన జాతీయాదాయ అంచనాల మీద ఎందరో విజ్ఞానవేత్తలకి ఎన్నో ప్రభుత్వాలకి ఆశక్తిని రేకెత్తించాడనడంలో సందేహం లేదు.

మిగతా వ్యక్తులందరివి సాంకేతికత లోపించిన అంచనాలు. ఫిండ్లే షిరానే ముఖ్యంగా వ్యవసాయేతర ఆదాయాన్ని వ్యవసాయాదాయంలో 50 శాతం అని ఊహించుకుని జాతీయాదాయాన్ని అంచనవేశాడు. వాడియా మరియు జోషి అయితే ఈ ఆదాయాన్ని 30 శాతంగా అనుకుంటే, షా మరియు ఖంబట్టా దీనిని 10 శాతంగా ఎంచుకున్నారు. దీంతో వీరిలెక్కలు అంత నమ్మశక్యం కాకుండా వున్నాయి. అంతే కాకుండా వీరందరూ జాతీయాదాయాన్ని ప్రస్తుత ధరలలో లెక్కించారు. అందులో కూడ వేర్వేరు సంవత్సరాలకి అంచనావేశారు. దీంతో ఒక అంచనాకి వేరోక అంచనాకి పోలిక లేకుండా పోయింది.

సర్‌జాన్ హిక్స్, ఎమ్ ముఖర్జి, ఎస్.కే.ఘోష్‌లు 1860 - 1945 కాలానికి 1970 -71 ధరలలో తలసరి ఆదాయంలో వృద్ధి రేట్లను లెక్కవేశారు. ఈ రెట్లు ఈక్రింద పట్టికలో యివ్వబడ్డాయి.

పట్టిక 2 తలసరి ఆదాయ వృద్ధిరేట్లు, 1860 - 1950

కాలము	వృద్ధిరేట్లు %
1860 - 1885	1.1.
1885 - 1905	-0.3
1905 -1925	1.3
1925 - 1950	-0.1
1860 - 1945	0.5

1860 నుండి 1945 వరకు తలసరి ఆదాయంలో పెరుగుదల 0.5 శాతం మాత్రమే వుంది అంటే బ్రిటిష్ వారి పాలనలో భారతదేశం పేదరిక నిశ్చలస్థితి (Stagnation) ఈవృద్ధిరేట్లని చూసి హిక్స్ మరియు ఇతరులు అన్నారు, "స్వాతంత్ర్యం రాకపూర్వం 1885-1905 కాలంలోనూ మరియు 1925-1950 కాలంలోనూ తలసరి ఆదాయ వృద్ధిరేటు పడిపోవడానికి కారణం ఆ సం॥లలో తలసరి ఆదాయం పడిపోడమే."

5.2 స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతీయాదాయ అంచనాలు :

స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే అంటే ఆగస్టు 1949 లో భారత ప్రభుత్వం జాతీయాదాయ సంఘాన్ని ప్రో.పి.పి. మహాల్‌నోబిన్ ఆధ్యక్షత నియమించింది. ఈసంఘంలో సభ్యులుగా ప్రో.డి.ఆర్ గాడ్గిల్ మరియు వి.కే.ఆర్.వి.రావ్‌లు నియమించబడ్డారు. ఈ సంఘం యొక్క ముఖ్యోద్దేశం అధీకృత జాతీయాదాయ అంచనాలు తయారు చేయుట. దీంతో బాటుగా జాతీయాదాయానికి సంబంధించిన

ఇతర అంచనాలు చేయడం; అందుబాటులో వున్న సమాచారం (Data) యొక్క నాణ్యత పెంచి, తగిన సమాచారాన్ని సమకూర్చుకోవడం; మరియు జాతీయాదాయంలో పరిశోధనలు జరిగేలాగున ప్రయత్నించడం మొదలైనవి.

ఈ జాతీయాదాయ సంఘం 15 ఏప్రియల్ 1951 లో తన మొదటి రిపోర్టుని సిద్ధం చేసింది. భారతదేశ చరిత్రలో యిదోక మైలురాయి. ఎందుకంటే భారతదేశంలో మొదటిసారిగా జాతీయాదాయ సమాచారాన్ని ఒక సాంకేతిక పద్ధతిలో భారతదేశం మొత్తాని కలుపుకుని ఎన్నో సంబంధిత అంశాలను జతచేర్చి జాతీయాదాయ సంఘం తయారు చేసింది. ఈ జాతీయ సంఘం తన చిట్టచివరి రిపోర్టును 14, ఫిబ్రవరి 1954 లో ప్రభుత్వానికి సమర్పించింది.

జాతీయాదాయ సంఘం యొక్క రిపోర్టులోని ముఖ్యాంశములు ఏమనగా:

(i) 1950-51 జాతీయాదాయంలో సగభాగాన్ని వ్యవసాయరంగం మరియు వ్యవసాయ అనుబంధ రంగాలు సమకూర్చిపెట్టాయి.

(ii) ద్వితీయరంగం అనగా గనులు, మాన్యుఫ్యాక్చరింగ్, మరియు చేతి వర్తకములు అన్ని కలిపి జాతీయాదాయంలో 1/6వ వంతుని అందించింది.

(iii) కామర్స్, రవాణా మరియు తంతి తపాల సౌకర్యములు అంటే తృతీయరంగం 1/6వ వంతుకన్నా కొద్దిగా ఎక్కువ భాగాన్ని జాతీయాదాయంలో కలిగివున్నాయి.

(iv) ఆదాయాన్ని ఆర్జించి పెట్టే సేవలైన వృత్తులు మరియు కళలు, పరిపాలనా సేవలు, దేశీయసేవలు, గృహసంబంధ ఆస్తులు జాతీయాదాయంలో 15 శాతాన్ని సమకూర్చాయి.

(v) జాతీయాదాయంలో వస్తూత్పత్తి యొక్క వాటా 2/3వ వంతు వుంటుంది.

(vi) జాతీయాదాయంలో సేవలు 1/3 వంతు వాటాని కలిగివున్నాయి.

(vii) 1950-51లో, నికరదేశీయోత్పత్తి (NDP) లో ప్రభుత్వరంగ వాటా 7.6. శాతం దీంతో బాటుగా, జాతీయ వ్యయంలో ప్రభుత్వరంగ వాటా 8.2 శాతం.

(viii) అంచనాలలో దొర్లిన తప్పుల యొక్క శాతం 10.

జాతీయాదాయ సంఘం తన యొక్క మొదటి రిపోర్టులో 1948-49 సం॥కి సంబంధించిన జాతీయాదాయాన్ని (NNP at Factor cost) రూ॥8710 కోట్లుగాను మరియు తలసరి ఆదాయాన్ని రూ॥255 (సం॥కి) గాను అంచనా వేసిరి. దీంతో పాటుగా రంగాల వారిగాను మరియు పరిశ్రమ యొక్క స్వరూపాన్ని బట్టికూడా జాతీయాదాయ సమాచారాన్ని పొందుపరచారు, జాతీయాదాయ సంఘం వారు. ఈ సంఘం అఖరి రిపోర్టులో జాతీయాధాయ అంచనాలను 1948-49తో పాటుగా 1949-50 మరియు 1950-51 సం॥లకి కూడా పొందుపరచారు. జాతీయాదాయ సంఘం భారతదేశంలో జాతీయాదాయ అంచనాలకి ఒక పునాది ఏర్పాటు చేసింది.

5.3 జాతీయాదాయ కమిటి మరియు కేంద్రగణాంక సంస్థ (C.S.O.)ల అంచనాలు :

జాతీయాదాయ కమిటి చేపట్టిన కార్యాన్ని అనుసరిస్తూ, కేంద్రప్రభుత్వం యొక్క కేంద్ర గణాంక సంస్థ (Central Statistical organisation) 1955 నుండి జాతీయాదాయ అంచనాలను అధీకృతంగా ప్రారంభించింది. అప్పటినుండి సాంవత్సరిక అంచనాలను ప్రకటిస్తోంది.

కేంద్ర గణాంక సంస్థ జాతీయాదాయ అంచనాలను 5 రకాల ధరల శ్రేణులలో (5 Different Price Series) ప్రకటించింది. అవి ఏమనగా

(i) సాంప్రదాయ శ్రేణులు - 1948 - 49 ఆధార సం॥ (1948-49=100)
(Conventional Series)
(ii) సవరించిన శ్రేణులు - 1960 - 61 ఆధార సం॥ (1960-61=100)
(iii) 1970-71 ఆధార సం॥పు శ్రేణులు (1970-71=100)
(iv) 1980-81 ఆధార సం॥పు శ్రేణులు (1980-81=100)
(v) నూతన శ్రేణులు - 1993-94 ఆధార సం॥ (1993-94=100)

5.3 (i) సాంప్రదాయ శ్రేణులు : (Conventional Series):- సాంప్రదాయ శ్రేణులలో 1948-49 ధరలను స్థిరం చేసుకుని అంటే 1948 - 49 సం॥ని బెస్ సం॥గా తీసుకుని (1948-49=100) 1948-49 నుండి 1964-65 వరకు జాతీయాదాయ అంచనాలను కేంద్రగణాంక సంస్థ ప్రకటించింది. వీటినే స్థిర ధరల దగ్గర జాతీయాదాయ అంచనాలు (National Income at Constant Prices) అని పిలుస్తారు. వీటితో పాటుగా 1948-49 నుండి 1964-65 వరకు అప్పటి ప్రస్తుత ధరలలో (Current Prices) కూడ అంచనాలను తయారు చేసింది.

సాంప్రదాయ శ్రేణుల ప్రకారం భారతదేశాన్ని ఆర్థికపరంగా 13 రంగాలుగా విభజించడం జరిగింది. అవి:

1. వ్యవసాయం; 2. పశుసంవర్ధనం; 3. అడవులు; 4. గనులు; 5. కర్మాగారములు; 6. చేవలవేట; 7. చిన్నపరిశ్రమలు; 8.సంఘటిత బ్యాంకింగ్ మరియు భీమా రంగం; 9. ఇతర వర్తక వ్యాపారములు మరియు రవాణా; 10. వృత్తులు, కళలు, మరియు దేశీయ సేవలు; 11.ప్రభుత్వరంగ సంస్థలు (PSUs) 12. గృహసంబంధ ఆస్తులు; మరియు విదేశీవ్యాపార చెల్లింపుల శేషం (Balance of Payments) మరియు విదేశాల నుండి నికర ఆదాయం.

పైన ఉదహరించిన మొదటి 6 రంగాలలో ఆదాయాన్ని ఉత్పత్తి పద్ధతి ద్వారా లెక్కించడం జరిగింది. మిగిలిన రంగాల ఆదాయాన్ని లెక్కించడానికి ఆదాయ పద్ధతిని వాడారు.

వ్యవసాయ రంగంలో ఫలసాయాన్ని లెక్కించడానికి ఒక హెక్టారుకి వచ్చిన పంటని, వేసినటువంటి ఎకరాలల గుణిస్తే మొత్తం పంట విలువ ఎంత తెలుస్తుంది. ఈ విలువ నుండి ఖర్చులు అంటే విత్తనాలకైన ఖర్చు, ఎరువులకైన ఖర్చు, మార్కెట్టు ఖర్చులు, బాగుచేతలు మరియు తరుగుదల తీసివేయగా వచ్చిన నికర విలువని వ్యవసాయరంగ ఉత్పత్తి విలువగ్రింద తీసుకుంటారు. మిగతా వాటి విషయంలో ఉత్పత్తిని మార్కెట్టు ధర చేత గుణించి ఒక రంగం యొక్క విలువని కనుగొనడం జరిగింది.

ఒక చిన్న పరిశ్రమ యొక్క విలువని కట్టాలంటే ఆ పరిశ్రమలో ఉపాది పొందిన శ్రామికుల సంఖ్యను వేతన రేటు పెట్టి గుణిస్తే ఆ పరిశ్రమ యొక్క ఉత్పత్తి విలువ తెలుస్తుంది. అంటే ఆదాయ పద్ధతిని ఉపయోగించామన్నమాట. అలాగే బ్యాంకింగ్ మరియు భీమా రంగం. పబ్లిక్ రంగ సంస్థలలో కూడా వేతనాలు, జీతాలు తీసుకుని ఆ రంగం యొక్క మొత్తం ఆదాయాన్ని కనుక్కుంటారు. గృహసంబంధ ఆస్తుల విషయంలో గ్రామిణ మరియు పట్టణ ప్రాంతాలలోని నికర అద్దెవిలువని అంచనా వేస్తారు. ఈ విధంగా ఏ రంగంలో ఏ పద్ధతి సరిపోతుందో చూసి ఆ పద్ధతినుపయోగించి జాతీయాదాయాన్ని లెక్కవేస్తారు.

ఈ అంచనాల ప్రకారం విషయంలో V.K.R.V.రావ్. అన్న మాటలను ఒకసారి గుర్తుకు తెచ్చుకుందాము. "జాతీయాదాయ అంచనాలలో ముఖ్యంగా రంగాల వారీగా చేపట్టిన అంచనాలలో 60 శాతం మాత్రమే ఒక సం॥కి సంబంధించి ప్రత్యక్ష సమాచారంగా వుంటుంది. మిగిలిన 40 శాతం సమాచారాన్ని పరోక్ష పద్ధతులో గణాంక పద్ధతుల నుపయోగించి జాతీయాదాయాన్ని అంచనా వేయడం జరుగుతుంది" అని అన్నాడు. అంటే ఈ 40 శాతం సమాచారంలో ఎంతవరకు నిజానికి దగ్గరగా వున్నాయన్నది ప్రశ్న.

5.3 (ii) సవరించిన శ్రేణులు :- సాంప్రదాయ శ్రేణుల్లో ప్రస్తుత మరియు స్థిర ధరలలో వెలవరించిన జాతీయాదాయ అంచనాలన్ని జాతీయాదాయ సంఘం యొక్క మొదటి మరియు చివరి రిపోర్టులలో వివరించిన అంశాల మీదనూ మరియు గణాంక పద్ధతుల పైనను

ఆధారపడి వున్నాయి. వేర్వేరు రంగాలలో జాతీయోత్పత్తిని ఇదివరకు ఉపయోగించిన పద్ధతులతో పోలిస్తే మెరుగ్గా వున్న గణాంకాల ఆధారంగా లెక్క వేసే ప్రయత్నంలో కేంద్రగణాంక సంస్థ మే, 1961 లోక్రొత్త విధి విధానాలను National Income Statistics - Proposals for a Revised Series of National Income Estimates 1995-56 to 1959-60" అనే ప్రపోజల్ లో ప్రకటించడం జరిగింది. జాతీయాదాయాన్ని లెక్కించే విధానంలో వచ్చిన మార్పుల కనుగుణంగా వచ్చిన జాతీయాదాయ వివరాలను సవరించిన శ్రేణులని అంటారు. ఈ శ్రేణులలో జాతీయాదాయాన్ని ప్రస్తుత ధరలలోను మరియు స్థిరధరలైన 1960-61 ధరలలోనూ (1960-61=100) 1960-61 నుండి 1975-76 లెక్కించారు.

తర్వాత, 1970-71 ధరలని స్థిరధరలుగా చేసుకుని క్రొత్త శ్రేణులను కేంద్ర గణాంక సంస్థ ప్రవేశ పెట్టింది. అంటే 1960-61 స్థిరధరల స్థానే, 1970-71 ధరలను స్థిర ధరలుగా ప్రకటించింది. (1970-71=100). ఈ సవరించిన శ్రేణుల ప్రకారం ఆర్థిక వ్యవస్థను 15 రంగాలుగా విభజించడం జరిగింది. అవి వ్యవసాయం; అడవులు; చేపల పరిశ్రమ; గనులు మరియు క్వారీయింగ్; భారీ పరిశ్రమలు; చిన్న తరహా పరిశ్రమలు; నిర్మాణరంగం; విద్యుచ్ఛక్తి, గ్యాస్, మరియు నీటిసరఫరా; రవాణా మరియు సమాచార వ్యవస్థ; వ్యాపారం; రియల్ఎస్టేట్ మరియు గృహయాజమాన్యం; ప్రభుత్వ పరిపాలన, మరియు రక్షణరంగం; ఇతర సేవలు; మరియు విదేశీ వ్యాపార వ్యవహారాలు. కొద్ది మార్పులలో ఈ రంగాలలో సాంప్రదాయ శ్రేణులు లాగునే ఉత్పత్తి మరియు ఆదాయ పద్ధతులను వాడి జాతీయాదాయ అంచనాలు తయారు చేయడం జరిగింది. అంటే వస్తు తయారి రంగంలో ఉత్పత్తి పద్ధతి మరియు ఇతర రంగాలలో ఆదాయ పద్ధతిని వాడి జాతీయాదాయాన్ని లెక్కించారు. అంతేకాకుండా ఈ సవరించిన శ్రేణులలో ఉపాధి అంచనాలకై 1961 మరియు 1971 జనాభా లెక్కలను వాడడం జరిగింది.

5.3 (iii) 1980-81 ధరల శ్రేణులు:- కేంద్ర గణాంక సంస్థ 1980-81 ని బేస్ సం॥గా తీసుకుని ప్రస్తుత ధరలలోనూ మరియు 1980-81 స్థిరధరలలోనూ జాతీయాదాయ గణాంక వివరాలను అందజేసింది. యిలా శ్రేణులను మార్చడం వల్ల వాస్తవానికి దగ్గరగా జాతీయాదాయాన్ని అంచనావేయుచ్చు. అభివృద్ధి జరుగుతున్నపుడు ఉత్పత్తి పెరగడంతో పాటు ధరలు పెరుగుతాయి. ఈ పెరుగుదల సమంజసమే. ఉదా॥కి 1995-96 జాతీయాదాయాన్ని 1950-51 స్థిరధరల దగ్గర చెప్పడం ఎంతో హాస్యాస్పదంగా వుంటుంది.

ఈ 1980-81 స్థిరధరల శ్రేణులలో స్థిరమూలధన వినియోగాన్ని ఎట్లా అంచనా వేయ్యాలో ఆవిధానం చెప్పబడింది. ఇదివరకు స్థిరమూలధనం పరంగా కంపెనీల యొక్క చిట్టా ఆవర్జాలను తిరగేసి తరుగుదల తెలుసుకుని స్థిరమూలధన వినియోగాన్ని లెక్కవేసేవారు. 1980-81 శ్రేణులలో స్థిరమూలధన వినియోగం సుమారుగా ఆ యంత్రాన్ని మార్చి వేరోక యంత్రాన్ని కంపెనీలో నియమిస్తే ఎంత ఖర్చు అంవుతుందో దానికి సమానమవుతుందని అంచనా. ఈ పద్ధతి రాజ్ వర్కింగ్ గ్రూపు యొక్క సలహా ఆధారంగా స్థిర మూలధన వినియోగాన్ని లెక్కించే విధానాన్ని వివరించడం జరిగింది.

5.3 (iv) మాతన శ్రేణులు : (1993-94=100):- కేంద్ర గణాంక సంస్థ 1993-94 ని బేస్ సం॥గా తీసుకుని నూతన శ్రేణులను ప్రవేశ పెట్టింది. అంటే 1980-81 సం॥ స్థానంలో 1993-94 ధరలని స్థిరధరలుగా చేసుకుని జాతీయాదాయాన్ని అంచనా వేయడం జరుగుతోంది. దీంతోబాటుగా కేంద్ర గణాంక సంస్థ "జాతీయ పద్దుల గణాంకాలు" (National Accounts Statistics NAS) క్రొత్త ప్రక్రియని ప్రారంభించింది. 1993-94 ఒక మంచి సం॥ము. అందుకనే ఆ సం॥న్ని ఆధారంగా చేసుకుని నూతన శ్రేణులు ప్రారంభమైనాయి. పూర్వం కన్నా ఎన్నో మార్పులు మరియు చేర్పులు ఈ నూతన శ్రేణులలో చేపట్టబడ్డాయి. స్థూల దేశీయోత్పత్తి యొక్క(GDP) పరిధిని విస్తృత పరచబడింది. ఉదా॥కి వ్యవసాయ సంబంధ ఆర్థిక ప్రక్రియలలో క్రొత్తగా హార్టికల్చర్ మరియు ఫ్లోరీకల్చరు వచ్చిచేరాయి. అలాగే పెరటి మొక్కల పెంపకం చేర్చడం జరిగింది. గనులు మరియు మాన్యూఫ్యాక్చరింగ్ విషయంలో 1996-97 మరియు 1997-98 సం॥లకి "మాన్యువల్ సర్వే అఫ్ ఇండస్ట్రీస్" (ASI) అంచనాలను రిజిస్టర్ కానటువంటి మాన్యుఫ్యాక్చరింగ్ ఆదాయాన్ని లెక్కించడానికి మరియు క్విక్ అంచనాలు తయారు చేయడానికి ఉపయోగించడం జరిగింది.

కేంద్ర గణాంక సంస్థ NAS (National Accounts Statistics) అంచనాలు తయారు చేయడానికి బేస్ సం॥ని ప్రతి 5 సం॥ల కొకసారి మార్చాలి అని పేర్కొంది. ఆ 5 సం॥లలో ఏర్పడిన నిర్మాణాత్మక మార్పులను పరిగణాలోకి తీసుకునే వీలుంటుంది. అయితే

5 సం॥లు అంటే చాలా తక్కువ కాలం. అందుచేత బేస్ సం॥ని పది సం॥ల కొకసారి మారిస్తే ఫలితాలు నిజానికి దగ్గరగా వుంటాయి. అంతేకాక గడిచిన కాలంలో పోల్చడానికి కూడా ఎంతైనా ఉపయోగకారిగా వుంటుంది.

5.4 1980-81 శ్రేణులలో జాతీయాదాయ అంచనాలు :

గడిచిన 52 సం॥ల ప్రణాళికా యుగంలో (1951-2002) భారతదేశం ఎంతో అభివృద్ధి సాధించింది. 2002 సం॥ నాటికి 9 ప్రణాళికలు పూర్తి అయ్యాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థ మీద ఈ ప్రణాళికల ప్రభావం ఎంతవరకు వున్నదో తెలుసుకోవాలంటే జాతీయాదాయ మరియు తలసరి ఆదాయాల అంచనాలు మరియు ఈ రెండు సూచికలలో సాధించిన వృద్ధిని పరిగణనలోకి తీసుకోవాల్సివుంటుంది. కేంద్ర గణాంక సంస్థ **(C.S.O.)** ఈ అంచనాలను చేపడుతుందని ఇదివరకే తెలుసుకున్నాము. ఈ రెండు సూచికల పరంగా కేంద్ర గణాంక సంస్థ ముందుగా ప్రస్తుత ధరలలో (Current Prices) అంచనాలను తయారు చేసి ఆటు తర్వాత ఈ అంచనాలను స్థిర ధరలలోకి మార్చడం ద్వారా ధరల యొక్క ప్రభావాన్ని తీసివేస్తుంది. గడిచిన పేజీల్లో వివరించిన "ప్రైస్ డిఫ్లేటర్" (Price Deflator) ని ఉపయోగించి స్థిర ధరలలోకి మారుస్తుంది. దీనివలన ప్రస్తుత ధరలలో వున్న నికర జాతీయోత్పత్తిలో అసలైన పెరుగుదల వుందా లేదా అనే విషయం తెలుస్తుంది. తద్వారా ప్రజలయొక్క జీవన ప్రమాణంలో ఏదైన మార్పు వచ్చిందా, లేదా అనే విషయం కూడా తెలుస్తుంది. ప్రస్తుత ధరలలో వున్న నికరజాతీయోత్పత్తిలో రెండింటి యొక్క ప్రభావం వుంటుంది. ఒకటి వస్తుసేవల ఉత్పత్తిలో పెరుగుదల. రెండవది ధరలలో పెరుగుదల. ఈ రెండింటిలో ధరలలో మార్పుని డిఫ్లేటర్ నుపయోగించి తీసివేసి స్థిరధరలలో చెప్పబడుతుంది. అటువంటి నికరజాతీయోత్పత్తిని ఇతర ఆర్థికపరమైన విషయాలలో సరిపోల్చి ఆర్థిక ప్రగతిని అంచనావెయ్య వీలవుతుంది. ఉదా॥కి ఇతరదేశాల జాతీయాదాయాలలో పోల్చవచ్చు మరియు భారతదేశంలోనే వేర్వేరు కాలాల్లో అభివృద్ధి ఏట్లా జరిగిందో చెప్పవచ్చు. ఉత్పత్తి పెరుగుదల లేక కేవలం ధరల పెరుగుదల మాత్రమే వుంటే అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ఇది అనర్థదాయకం. అందుచేత నికరజాతీయోత్పత్తి స్థిర ధరలలో వృద్ధి వున్నట్లైతే దేశం యొక్క ఉత్పాదక శక్తి పెరిగినట్లే. అంతేకాకుండా తలసరి ఆదాయాన్ని స్థిరధరలలో కొలవడం ద్వారా ప్రజల యొక్క తలసరి జీవన ప్రమాణం తెలుస్తుంది. జీవనప్రమాణం పెరిగిందని తెలిస్తే, దేశంలో ఆర్థిక పురోభివృద్ధి (Economic Progress) జరిగినట్లే.

పట్టిక.3. లో ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి మరియు తలసరి ఆదాయాల అంచనాలను గడిచిన 52 సం॥ల ప్రణాళికాబద్ధ ఆర్థికప్రగతి ఏట్లా జరిగిందో తెలుస్తుంది. ఈ పట్టికలో తలసరి ఆదాయం అంచనా కూడా ఇవ్వబడింది. ఈ రెండు సూచికలను ప్రస్తుత మరియు స్థిర (1980-81=100) ధరలలోనే చూపబడ్డాయి. అంతే కాకుండా ఎన్నిక చేసుకున్న సం॥లలో వృద్ధి ఎట్లా సాధించబడిందో కూడ చూపడమైంది.

(i)మెదటి ప్రణాళిక (1951-56):- 1980-81 స్థిరధరలలో మొదటి ప్రణాళిక ప్రారంభంలో అంటే 1951-52 లో నికరజాతీయోత్పత్తి రూ॥41443 కోట్లు వుండగా ప్రణాళిక చివరి సం॥లో 1955-56 లో రూ॥ 48,288 కోట్లుగా పెరిగింది. ఈ రెండు సం॥లలో పెరుగుదల రేట్లు వరసగా 2.4 శాతం, మరియు 2.5 శాతం నమోదు చేసుకుంది. ప్రణాళికా మొత్తానికి సరాసరిన 3.6 శాతం వృద్ధిని నిజనికరజాతీయోత్పత్తి సాధించింది. ప్రస్తుత ధరలలో నైతే 51-52 లో రూ.9034 కోట్ల నుండి 1955-56 లో రూ.9161 కోట్లకి పెరిగింది.

తలసరి ఆదాయంలో 1951-52 లో 1135.4 రూ॥ల నుండి 1955-56లో 1228.7 కి పెరిగింది. 1980-81 స్థిరధరలలో ప్రణాళికా మొత్తానికి సరాసరి పెరుగుదల రేటు 1.8 శాతంగా వుంది. అయితే ప్రస్తుత ధరలలో తలసరి ఆదాయం ఈ రెండు సం॥లలో రూ॥ 4247.5 నుండి రూ॥233.1 కి పడిపోయింది.

(ii) రెండవ ప్రణాళిక (1956-56):- అదే స్థిరధరలలో 1956-57 లో నిజ NNP రూ॥50955 కోట్ల నుండి 1960-61 అంటే ప్రణాళికాంతానికి రూ॥58602 కోట్లకి పెరిగింది. ఈ రెండు సం॥లలో వృద్ధిరేట్లు వరసగా 5.5 శాతం మరియు 7.0 శాతం నమోదు చేసుకుంది. అయితే ప్రణాళిక సరాసరి వృద్ధి రేటు 4 శాతం సాధించడం జరిగింది.

నిజ తలసరి ఆదాయంలో 1956-57 లో రూ॥ 1270.7 నుండి రూ॥ 1350.3 పెరుగుదల ఏర్పడింది. ప్రణాళిక సరాసరి వృద్ధిరేటు 2.0 శాతంగా వుంది.

(iii) మూడవ ప్రణాళిక (1961-66):- ఈ ప్రణాళికలో ఈ రెండుసూచికలలో అనగా నిజ NNP మరియుPCI (Percapita Income) లలో పురోభివృద్ధి లేదనే చెప్పాలి. 1980-81 ధరలలో నిజ NNP 1961-62 లో రూ ॥60168 కోట్లుండగా 1965-66 లో రూ॥65,734 కోట్లుంది. ప్రణాళిక ప్రారంభ సం॥లో పోలిస్తే చివరి సం॥లో వృద్ధిరేటు పడిపోయింది. నిజతలసరి ఆదాయం కూడ ప్రారంభంలో ఎంత వుందో చివరలో కూడ అంతే వుంది. అయితే ప్రణాళిక సగటు వృద్ధి నిజ NNP లో 4.7 శాతం, నిజ PCI లో 6.8 శాతం వుంది. దీనికి కారణం 3వ ప్రణాళికాలంలో ఏర్పడిన తీవ్ర కరువు పరిస్థితులే అంటే ఈ కరువు 1965-66 లోను మరియు 1966-67లలో ఏర్పడింది. అంతే కాకుండా, వ్యాపారవరంగా ఆర్థిక మాంద్య పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటి ప్రభావం చేత వృద్ధి రేటు రెండు సూచికల పరంగా ఋణాత్మకంగా వుంది. ఈ విషయాన్ని "ఆర్థిక వ్యవస్థ నిర్మాణత" అనే అధ్యాయంలో పట్టిక. 5 చూడగలరు.

(iv) 4వ ప్రణాళిక (1969-74):- 3వ ప్రణాళిక తర్వాత సాంవత్సరిక ప్రణాళికలు చేపట్టబడ్డాయి (1966-69 కాలంలో) ఈ కాలంలో స్థిర ధరలలో నిజ NNP లో 3.7 శాతం మరియు నిజ PCI 1.5 శాతం వృద్ధి సాధించబడింది. అయితే ఆతర్వాత వచ్చిన 4వ ప్రణాళికలో స్థిర ధరల దగ్గర (1980-81=100) నిజ NNP 1969-70 లో రూ॥ 78177 కోట్లుండగా 1973-74 లో అంటే ప్రణాళికా ఆఖరు నాటికి రూ॥86010 కోట్లుగా పెరిగింది. ప్రారంభ సం॥లో కంటే చివరి సం॥లో వృద్ధి తగ్గింది. ఇదేకాలంలో నిజ PCI రూ॥1477.8 నుండి రూ॥1482.9 వరకు పెరిగింది. వృద్ధి ఈ కాలంలో తగ్గింది. దీంతో ప్రణాళిక సగటు వృద్ధిరేటు నిజ NNP 3.3 శాతానికి క్షీణించింది. 1966-69 సాంవత్సరిక ప్రణాళికలతో పోలిస్తే తలసరి ఆదాయ స్థిరధరల దగ్గర వృద్ధిరేటు 1.0 శాతం మాత్రమే నమోదు చేసుకుంది. ఈ రెండు సూచికలపరంగా వృద్ధిరేటు క్షీణించడానికి 1972-73 మరియు 1973-74 లలో ధరల పెరుగుదల ఏర్పడ్డం మరియు వస్తుసేవల ఉత్పత్తి ఉత్పాదక ఫామర్థ్యానికి అనుగుణంగా లేకపోవడం అనేవి కారణాలుగా వివరించవచ్చు.

(v) 5వ ప్రణాళిక: (1974-79):- ఈ ప్రణాళికా కాలంలో ఆర్థిక వ్యవస్థ పుంజుకుందని చెప్పవచ్చు. స్థిర ధరలలో నిజ NNP 1974-75 లో రూ.87116 కోట్లనుండి 1978-79 లో రూ.109466 కోట్లకి పెరిగింది. ఈ సంవత్సరంలో వృద్ధిరేటు వరసగా 1.3 శాతం గాను మరియు 5.6 శాతంగాను వుంది. అయితే ప్రణాళిక సరాసరి వృద్ధి రేటు 5 శాతాన్ని నమోదు చేసుకుంది. యిక స్థిరధరలలో నిజ PCI రూ॥ 1469.1 నుండి రూ॥ 1689.3 కి పెరిగింది ఇదే సం॥లలో 1974-75 మరియు 1978-79 సం॥లలో నిజ PCI యొక్క పెరుగల రేటు- 0.9 నుండి 3.3. శాతానికి పెరిగింది. ఇది మంచి పరిణామం. ప్రణాళికా సగటు వృద్ధి రేటు 2.7 శాతంగా వుంది.

(vi) 6వ ప్రణాళికా (1980-85):- భారతదేశంలో నిజనికర జాతీయోత్పత్తి పరంగా అసలుసిసలైన వృద్ధిని సాధించింది 80 దశాబ్దంలోనే అందులోనూ 6వ ప్రణాళికలోనే. స్థిరధరల దగ్గర 1980-81 లో రూ॥ 110685 కోట్లనుండి 1984-85 రూ॥ 133808 కోట్లకి నిజ NNP పెరిగింది. సాంవత్సరిక పెరుగుదల రేటు తగ్గింది. అయిటే ప్రణాళిక సరాసరిన 5.5 శాతం వృద్ధిని సాధించింది. ఇదే సం॥లలో నిజ PCI స్థిరధరల దగ్గర రూ॥ 1630.1 నుండి రూ॥ 1810.7 కి పెరిగింది. దీంట్లో కూడా సాంవత్సరిక వృద్ధిరేటు తగ్గించి నిజ PCI యొక్క ప్రణాళిక సగటు 3.2 శాతం.

(vii) 7వ ప్రణాళిక (1985-90):- ఈ ప్రణాళికలో నిజ NNP లో 5 శాతం మరియు తలసరి ఆదాయంలో 3 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకోగా సాధించింది. అంతకన్నా ఎక్కువ. స్థిరధరల దగ్గర 1985-86 లో నిజ NNP రూ॥ 139025 కోట్ల నుండి 1989-90 లో రూ॥ 177315 కోట్లకి పెరిగింది. ఈ కాలంలో సాంవత్సరిక వృద్ధి రేటు కూడా పెరిగింది. ప్రణాళిక సరాసరి 5.8 శాతాన్ని నమోదు చేసుకుంది. ఇదేకాలంలో స్థిర ధరల దగ్గర నిజ PCI రూ॥ 1841.4 నుండి రూ॥ 2157.1 కి పెరిగింది. ప్రణాళిక సగటు పెరుగుదల రేటు 3.6 శాతాన్ని సాధించడమైంది.

(viii) 8వ ప్రణాళిక (1992-97):- 1990-92 సం॥లలో సాంవత్సరిక ప్రణాళికలు ప్రవేశ పెట్టబడ్డాయి. ఈ కాలంలో ఆశించిన లక్ష్యాన్ని సాధించడం జరగలేదు. దీనికి కారణం 1991-92 కాలంలో ఏర్పడిన విత్తసంబంధ విషమ పరిస్థతులు. నిజ NNP లోనూ (0.8 శాతం) మరియు తలసరి ఆదాయంలోను (0.4 శాతం) వృద్ధి గణనీయంగా పడిపోయింది. అంతే కాకుండా వ్యవసాయరంగం

పారిశ్రామిక రంగాలలో అభివృద్ధి కుంటు పడింది. విదేశీమారక నిల్వలు ఒక వారానికి సరిపడేవి మాత్రమే వున్నాయి. యిటువంటి పరిస్థతులలో భారత ప్రభుత్వం "సరళీకృత ఆర్థిక విధానాలను" ప్రవేశ పెట్టి విదేశి పెట్టుబడులను అధిక మొత్తంలో ఆకర్షించడానికి ప్రయత్నం చేసింది. దీంతో 8వ ప్రణాళికలో నిజ NNP మరియు నిజ PCI లలో పెరుగుదల కనబడింది. స్థిర ధరలలో నిజ NNP 1992-93 లో రూ. 195602 కోట్ల నుండి 1996-97 లో రూ ॥258465 కోట్లకి పెరిగింది. ఈ సం॥లలో వృద్ధిరేటు కూడా పెరిగింది. ప్రణాళిక సగటు వృద్ధి 6.6 శాతం ఆర్థిక వ్యవస్థ నమోదు చేసుకుంది. తలసరి ఆదాయంలో కూడా పెరుగుదలని చూడగలము. స్థిరధరలలో 1992-93 లో రూ॥ 2243 నుండి 1996-97 లో రూ॥ 2761 పెరిగింది. అయితే వృద్ధి రేటు ప్రారంభకాలంలో 5.9 శాతం వుండగా చివర సం॥లో 3.2 శాతానికి తగ్గింది. ప్రణాళికా సగటు పెరుగుదల రేటు 4.6 శాతం సాధించబడింది. 8వ ప్రణాళికా కాలంలో నూతన ఆర్థిక విధానాల వల్ల ఆర్థిక వృద్ధి రేటు వ్యవసాయరంగంలోని ఆటుపోట్ల నుండి తట్టుకుని నిలబడే స్థితికి ఆర్థిక వ్యవస్థ చేరుకుంది. అంతే కాకుండా, ఈ ప్రణాళికాకాలంలో పారిశ్రామిక సేవల రంగాలు వృద్ధిని సాధించాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో మాన్యూఫాక్చరింగ్ రంగం మెరుగైన వృద్ధిని సాధించింది. పారిశ్రామిక సంబంధిత సేవల రంగం మంచి పని తీరుని ప్రదర్శించింది.

(ix) 9వ ప్రణాళిక (1997-2002):- పట్టిక. 3 లో 9వ ప్రణాళిక సంబంధించినంత వరకు స్థిరధరలుగా నూతన శ్రేణులైన 1993-94 ధరలను తీసుకుని పెరుగుదల రేటుని చెప్పడం జరిగింది. అంటే నిజ NNPని మరియు నిజ PCI లలో వృద్ధిని 1993-94 ధరలలో చెప్పేయన్న మాట. ఈ ప్రణాళికలో 1993-94 ధరల దగ్గర 1997-98 లో నిజ NNP రూ॥ 890712 కోట్లనుండి ప్రణాళికాంతానికి అంటే 2000-01 నాటికి రూ॥ 1050177 కోట్లకి పెరిగింది. వృద్ధిరేటు మాత్రం క్షీణించింది. ప్రణాళిక సరాసరి 4.6 శాతానికి తగ్గంది. 8వ ప్రణాళికతో పోలిస్తే ఇది తక్కువే. తలసరి ఆదాయం కూడా ఈ రెండు సం॥లలో వరుసగా రూ॥ 9288 నుండి రూ॥ 10306 కి పెరిగింది. అయితే 1993-94 నుండి 1997-98 నాటికి నిజ PCI వృద్ధికూడా తగ్గింది. ప్రణాళిక సగటు నిజవృద్ధి రేటు 3 శాతంగా నమోదు అయ్యింది.

5.5 హిందూ రేటు:

1980-81 ధరలలో 1950-51 నుండి 1980-81 వరకు అనగా 30సం॥ల కాలంలో నిజ నికర జాతీయోత్పత్తి 3.4 శాతం వృద్ధిని మరియు నిజ తలసరి ఆదాయం 1.2 శాతం వృద్ధిని సాధించాయి. ఈ విషయాన్ని "భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణత" అనే అధ్యాయంలో పట్టిక. 2 లో గమనించగలరు. భారతదేశంలో ఈ రెండు సూచికలలో వృద్ధి 1980 దశాబ్దం నుండి ప్రారంభమైందని చెప్పవచ్చు. 1980-81 ధరలలో 1980-81 నుండి 1997-98 కాలంలో నిజ NNP 5.5 శాతం వృద్ధిని, నిజ PCI 3.4 శాతం వృద్ధిని సాధించాయి. ఒక్క 80 దశకంలోనే నిజ NNP 5.4 శాతం వృద్ధిని సాధించింది. ఇది 70 దశకంలో సాధించిన 3 శాతం NNP కన్నా బాగా ఎక్కువ. 70 దశకంలో నిజ PCI లో కూడా కేవలం 0.7 శాతం వృద్ధి సాదించబడింది. అదే 80 దశకంలో 3.1 శాతం మరియు 90 దశకంలో 3.6 శాతం నిజ PCI లో పెరుగుదల సాధించబడింది. 70 దశాబ్దంలో సాధించిన 3 శాతం వృద్ధిని (నిజ NNP) Prof రాజ్‌కృష్ణ "హిందూ రేటు" గా అభివర్ణించాడు. అంటే అత్యల్పరేటు క్రింద పరిగణించడమే కాకుండా భారతదేశానికి ఈ వృద్ధి రేటు అభివృద్ధిని సాధించడంలో ప్రతిబంధకంగా తయారైంది అని వివరణ ఇచ్చాడు. జీవన ప్రమాణ స్థాయి గణనీయంగా పడిపోయింది. (0.7శాతం) అదే ప్రస్తుత ధరలలో (Current Prices) లోనైతే 1950 దశాబ్దంలో NNP లో వృద్ధి 5.2 శాతం వుండగా 90 దశాబ్దం నాటికి 15.4 శాతానికి పెరిగింది. తలసరి ఆదాయం కూడా ఇదేకాలంలో 3.2 శాతం నుండి 13.3 శాతానికి పెరిగింది. 2వ ప్రణాళికా (1956-61) లక్ష్యం తలసరి ఆదాయాన్ని 1997 నాటికి రెట్టింపు చేయాలని అనగా 100 శాతం వృద్ధిని సాధించాలని ఆశయం. అయితే 1950-51 నుండి 1980-81 వరకు అనగా 30 సం॥ల కాలంలో తలసరి ఆదాయంలో కేవలం 44.63 శాతం పెరుగుదల మాత్రమే సాధించడం జరిగింది. అయితే 1992-93 నాటికి అంటే 42 సం॥లకి (1950-51 నుండి 1992-93) తలసరి ఆదాయం రెట్టింపు అయ్యింది. (99.02 శాతం).

5.6 1993-94 నూతన శ్రేణులలో జాతీయాదాయ అంచనాలు:

నిజ నిర్ధారణకి దగ్గరగా వుండాలనే వుద్దేశ్యంలో కేంద్ర గణాంక సంస్థ 1993-94 ధరలని ఆధారంగా చేసుకుని నూతన శ్రేణులను (New Series) తయారు చేసింది. ఆర్థికాభివృద్ధి జరుగుతున్నపుడు ఉత్పత్తి పెరుగుదలతో పాటు స్వాభావికంగా ధరలు పెరుగుతాయి. ఉదా॥కి 2000-01 జాతీయాదాయాన్ని 80-81 ధరలలో డిఫ్లేట్ చేసి చెప్పడం అనేది సరియైన పద్ధతి కాదు. ఎందుకంటే ఈరెండు ధరల మధ్యన 20 సం॥ల తేడా వుంది. ఈమధ్యలో ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు జరుగుతాయి. అందుచేత ఈ తేడా 10 సం॥లు అంతకన్నా తక్కువ వుంటే నిజాన్ని నిగ్గుతీయడానికి వీలుంటుంది. కొంతమంది ఆర్థిక నిపుణులు ఈ తేడా 5 సం॥లు అయితే బావుంటుందని అనడం జరిగింది.

అందుచేత 80-81 ధరలని ఆధారంగా చేసుకుని జాతీయాదాయంతో పోలిస్తే 93-94 ధరల నాధారంగా చేసుకుని లెక్కవేసిన జతీయాదాయం (ఉదా॥2000-01) ఎక్కువగా వుంటుంది. ఈ నూతన శ్రేణులలో నిజ NNP 1993-94 లో రూ॥ 685912 కోట్లుండగా 2000-01 నాటికి రూ॥ 10,50, 177 కోట్లకి పెరిగి 53.11 శాతం వృద్ధిని సాధించింది. ఇదేకాలంలో నిజ PCI రూ॥ 7998 నుండి రూ॥ 10306 కి పెరిగి 33.88 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది. ఈపెరుగుదలపై మొదటి దశ (92-93 నుండి 95-96) మరియు రెండవ దశ (1995-96 తర్వాత) ఆర్థిక సవరణల ప్రభావం ఎంతైనా వుందని చెప్పవచ్చు. భారతదేశం మరింతగా తెరచి వుంచే ఆర్థిక విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ విషయాన్ని భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణత" అనే అధ్యాయంలో పట్టిక.3. లో చూడగలరు.

1993-94 ధరలలో వృద్ధిరేట్ల విషయానికి వస్తే నిజ NNP 1994-95 లో 6.8 శాతం పూర్తిగా వుండగా, 1995-96 మరియు 1996-97 లో వరసగా 7.3 శాతం మరియు 7.8 శాతం సాధించి 1997-98 లో 4.5 శాతానికి పడిపోయింది. అటుతర్వాత 1998-99 మరియు 1999-2000 లలో పుంజుకుని వరసగా 6.5 శాతం మరియు 6.6 శాతం సాధించబడింది. తలసరి ఆదాయంలో, 1993-94 ధరల దగ్గర, 1994-95 లో 4.8 శాతం వుండగా. 1996-97 కి 6.0 శాతానికి పెరిగింది. ఆతర్వాత 4.8 శాతానిక 1999-2000లో పడిపోయింది. 1994-95 నుండి 1996-97 వరకు నిజ మరియు నిజ లలో పెరుగుదల బాగా జరగడానికి కారణం వ్యవసాయ రంగంలో వృద్ధి నమోదు అవడం. పరిశ్రమలు, రైల్వేలు, విద్యుచ్ఛక్తి, నిర్మాణ రంగం, హోటల్ రంగం వృద్ధిని సాధించడం వల్ల ఆర్థికవ్యవస్థ మొత్తం మీద మంచి ఫలితాలు కనబడ్డాయి. ఈ 1993-94 ధరలలో, 1980-81 నుండి 2000-01 వరకు సాంవత్సరిక వృద్ధిరేటు నిజ NNP 5.5 శాతం, తలసరి ఆదాయంలో 3.3 శాతం వృద్ధిని భారతదేశం సాధించింది. ఈ విషయాన్ని "భారతదేశ వ్యవస్థ నిర్మాణత" అనే అధ్యాయంలో పట్టిక.4 లో చూడగలరు.

6.0 జాతీయాదాయ సంయోజనం: (Composition of National Income)

ఆర్థిక వ్యవస్థలో వివిధ రరంగాలలో ఉత్పత్తి చేసిన మొత్తం వస్తుసేవల ద్రవ్యవిలువ జాతీయాదాయమవుతుంది. అంటే వివిధ రంగాల ఆదాయాలు జాతీయాదాయంలో వాటలుగా వుంటాయి.. ఈ రంగాల వాటాలే జాతీయాదాయ సంయోజనాన్ని సూచిస్తాయి. కాబట్టి జాతీయాదాయంలో ఏఏ రంగానికి ఎంతెంత వాటా ఉన్నదో పరిశీలిస్తే ఆయారంగాల ప్రాధాన్యతలు, పోకడలు తెలుస్తాయి. భారతదేశంలో ఆర్థిక వ్యవస్థలో మూడురంగాలున్నాయి. అవి (i) ప్రాథమిక రంగం - వ్యవసాయం, అడవులు, చేపలవేట, గనులు మరియు క్వారీయింగ్ ; (ii) ద్వితీయ రంగం - మాన్యుఫాక్చరింగ్, నిర్మాణం, విద్యుచ్ఛక్తి, గ్యాస్, మరియు నీటి సరఫరా; మరియు (iii) తృతీయ రంగం - వ్యాపారం రవాణా మరియు సమాచార సంబంధాలు; హోటల్ మరియు టూరిజం; బ్యాకింగ్, భీమా మరియు రియల్ ఎస్టేటు; పరిపాలనా యంత్రాంగం మరియు రక్షణ; కమ్యూనిటి మరియు వ్యక్తిత్వ సేవలు.

6.1 ప్రాథమిక రంగం:

పట్టిక.4 లో స్థూల దేశీయోత్పత్తి వివిధ రంగాల మధ్యన ఎట్లా పంపిణి అయ్యిందో, 1950-51 నుండి 1999-2000 కాలంలో తెలియజేస్తుంది. ఈ పట్టిక లో ఒక్కొక్క రంగం ఎంత భాగం స్థూల దేశీయోత్పత్తిని సమకూర్చి పెట్టాయో తెలుస్తుంది. ఈ పట్టికలో

చూపబడినట్లుగా ప్రాథమిక రంగంలోని వ్యవసాయరంగం స్థూల దేశీయోత్పత్తిలో అధిక వాటా కలిగివుంది. వ్యవసాయరంగం యొక్క వాటా 1950-51 లో 48.6 శాతం వుండగా 1999-2000 వచ్చేనాటికి 23.2 శాతానికి పడిపోయింది. ప్రాథమికరంగంలో వ్యవసాయం 90 శాతంపైనే స్థూల దేశీయోత్పత్తిని సమకూరుస్తోంది. మొత్తం ప్రాధమికరంగం యొక్క వాటా చూసినట్లైతే 1950-51 లో 56.4 శాతం వున్న స్థూల దేశీమోత్పత్తిలో వాటా 1999-2000 నాటికి 27.5 శాతానికి పడిపోయింది. అంటే వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత తగ్గుతోందన్న మాట అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ ఈ వాట 2 నుండి 3 శాతం మాత్రమే ఆ దేశాలలో ప్రాధమిక రంగం యొక్క వాటా చాల తక్కువ. భారతదేశంలో కూడా ఆ వాటా తగ్గుతూ వస్తోంది కాబట్టి అభివృద్ధి చెందుతోందని అనుకోవాలని కొందరు ఆర్థిక నిపుణులు అంటున్నారు. అయితే భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పశ్చిమ అభివృద్ధి చెందిన దేశాలలో కాకుండా "ఏషియన్ టైగర్స్" 'దక్షిణకొరియా, తైవాన్, జపాన్ మొదలైన దేశాలు) ముఖ్యంగా చైనాతో పోలిస్తే చాలా చాలా తక్కువ. అంతే కాకుండా వ్యవసాయరంగంలో పబ్లిక్ మరియు ప్రైవేటు పెట్టుబడులు బాగా తక్కువగా వుండడం యింకొక కారణం. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగ వాటా తగ్గుతోందంటే ఆ రంగం యొక్క ప్రాధాన్యత దేశ ఆర్థిక వ్యవస్థలో తగ్గుతోందనమాట.

ప్రాథమిక రంగంలో అడవుల యొక్క వాటా స్థూల దేశీయోత్పత్తిలో 1950-51 లో 6 శాతం వుంటే 1999-2000 నాటికి 1.1 శాతంకి తగ్గిపోయింది. అయితే గనులు (Mining) మరియు క్వారీయింగ్ వాటా ఇదేకాలంలో 1.1 శాతం నుండి 2.3 శాతానికి వృద్ధి పొందింది.

6.2 ద్వితీయ రంగం :

పట్టిక. 4 ప్రకారం ద్వితీయరంగ వాటా స్థూల దేశీయోత్పత్తిలో పెరిగింది. 1950-51 లో 15 శాతం వుంటే 1999-2000 లో 24.7 శాతానికి పెరిగింది. ద్వితీయరంగరలో ప్రాధాన్యతా రంగం మాన్యుఫాక్చరింగ్ రంగం. ఈ రంగం వాటా ద్వితీయ రంగంలోకి మిగతా వాటాతో పోలిస్తే బాగా ఎక్కువ. 1950-51 లో 11.4 శాతం వున్నది 1999-2000 లో 17.1 శాతానికి పెరిగింది. దీని తర్వాత నిర్మాణ రంగం వస్తుంది. ఈ రంగం వాటా 1950-51 లో 3.3 శాతం వుంటే, 1999-2000 లో 5.1 శాతానికి పెరిగింది. తర్వాత విద్యుచ్ఛక్తి, గ్యాస్, మరియు నీటి సరఫరాల యొక్క వాటా స్థూల జాతీయోత్పత్తిలో పెరిగింది. మొత్తం మీద స్థూల దేశీయోత్పత్తి యొక్క పెరుగుదలకి తోడ్పడేది మాన్యుఫాక్చరింగ్ రంగం. ఈ రంగంలో రిజిష్టర్ కాబడిన రంగాలలో ఉత్పత్తి 1950-51 లో 4.4 శాతం వుంటే (స్థూల దేశీయోత్పత్తిలో) 1999-2000 లో 11.3 శాతానికి పెరిగింది. అయితే రిజిష్టర్ కానటుంటి సంస్థల ఉత్పత్తి ఈ కాలంలో అత్యల్పంగా వుండడమే కాకుండా పెరుగుదల కూడా తక్కువగానే వుంది. ఉదాకి 1950-51 లో ఈ సంస్థల వాటా 4.5 శతం వుండగా 1999-2000 లో 5.8 శాతంగా మాత్రమే పెరిగింది..

6.3 తృతీయ రంగం:

తృతీయరంగం పెరుగుదల అభివృద్ధికి సూచిక క్రింద చెప్పబడుతుంది. అభివృద్ధి చెందిన దేశాలలో ఆ రంగం వాటా స్థూలదేశీయోత్పత్తిలో 65 శాతం నుండి 70 శాతం వుంటుంది. భారతదేశంలో కూడా ప్రణాళిక శకం ఆరంభమైన తర్వాత ఈ సేవల రంగం వృద్ధిని బాగా సాధించిందని చెప్పవచ్చు. పట్టిక.4 లో చూపినట్లుగా, స్థూలదేశీయోత్పత్తిలో తృతీయ రంగ వాటా శాతం 1950-51 లో 28.5 శాతం వుంటే 1999-2000 నాటికి 47.8 శాతానికి పెరిగింది. భారతదేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్న మాట. ఈ సేవల రంగంలో కీలకపాత్ర నిర్వర్తించేది వ్యాపారం, రవాణా మరియు హోటల్ మరియు టూరిజం రంగం. పట్టిక ప్రకారం ఈ రంగం 1950-51 లో స్థూల దేశీయోత్పత్తిలో 11 శాతం వుండగా 1999-2000 నాటికి 21.9 శాతానికి పెరిగింది. దీని తర్వాత ఫైనాన్స్ మరియు రియల్ ఎస్టేటు రంగం ఇదే కాలంలో స్థూల దేశీయోత్పత్తిలో 9 శాతం నుండి 12.7 శాతానికి తన వాటాని పెంచుకుంది. ఇక కమ్యూనిటి మరియు వ్యక్తిత్వ సేవలు ఇదేకాలంలో 8.5 శాతం వాటా నుండి 13. 2 శాతం వాటాకి అభివృద్ధిని సాధించాయి. ఈ కమ్యూనిటి సేవలలో పరిపాలన యత్రాంగం ముఖ్యంగా ఆర్థిక మరియు శ్రేయస్సును పెంపొందించే సేవలైన విద్య, వైద్యం, ఆరోగ్యం, మరియు కుటుంబ సంక్షేమం వుంటాయి. ఆర్థికవృద్ధి త్వరితగతిన సాధించాలంటే ఈ సేవలు వేగంగా అభివృద్ధి చెందవలసి వుంటుంది.

పరిశ్రమల వారీగా జాతీయ సంయోజనంలో మార్పు అంతాకూడా భారత దేశం అనుసరించిన ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి సంకేతం. ఈ వృద్ధి ప్రక్రియలో సంఘటిత రంగం లో (organised sector) మాన్యూఫాక్చరింగ్ రంగం వేగాన్ని పుంజుకుంటుంది. అయితే వ్యవసాయరంగం వెనుకబడే అవకాశం వుంది. పట్టిక 4 లో ఈ విషయాన్ని గమనించాము. అంతేకాకుండా వ్యవసాయ పంటలలో ఆహార పంటల వాటాని తీసుకుంటే 1950-51 లో ఈ శాతం 50.2 వుంటే 1999-2000లో 23.2 శాతానికి పడిపోయింది. యింకో విషయం ఏమిటంటే స్థూలదేశీయోత్పత్తిలో ప్రాథమిక రంగం వాటా 50 సం॥లలో (1959-51 నుండి 1999-2000) 51.24 శాతం (56.4%నుండి 27,5 %) పడిపోయింది. అయితే వ్యవసాయ రంగం మీద ఆధారడి జీవిస్తున్న వారి శాతం 1951 లో 72.1 శాతం వుంటే 2000 సం॥లో 56.7 శాతానికి పడింది. అంటే కేవలం 50 సం॥లలో 21.36 శాతం మాత్రమే పడింది. స్థూలదేశీయోత్పత్తిలో ప్రాథమిక రంగం వాటా 51.24 శాతం పడిపోగా, ఆధారపడ్డ శ్రామికుల శాతంలో తగ్గుదల 21.36 శాతం వుంది. దీని అర్థం వ్యవసాయరంగంలో మిగులు శ్రామికుల సమస్య యింకా (Surplus labour Problem) కొనసాగుతోందనమాట. అంటే ప్రచ్ఛన్న నిరుద్యోగిత వ్యవసాయ రంగంలో తన పట్టుని కొనసాగిస్తోంది. ఇతరరంగాలలో ఉపాధి అవకాశలు యింకా పెరగాలి మరియు శ్రామికులలో గమన శీలత కూడా పెరగాలి. ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి.

6.4 పరిశ్రమల వారీగా దేశీయోత్పత్తిలో వృద్ధిరేట్లు :

పట్టిక. 5 పరిశ్రమల వారీగా స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేట్లను 1950-51 నుండి 1996-97 వరకు అంటే 47 సం॥ల కాలంలో ఎట్లా మార్పు చెందాయో తెలియజేస్తుంది. ముందుగా ప్రాథమిక రంగం ఏవిధంగా పెరుగుదలని సాధించిందో చూద్దాము. 1950 దశకంలో (1980-81 ధరల దగ్గర) 3 శాతం వృద్ధిని సాధించింది. అయితే 60 దశాబ్దంలో 2.3 శాతానికి, 70 దశాబ్దంలో 1.5 శాతానికి పడిపోయింది. 80 దశాబ్దంలో దేశ ఆర్థికవ్యవస్థ ఆరోగ్యం బావుండడం వల్ల ప్రాథమిక రంగం కూడా పుంజుకుని 3.6 శాతం వృద్ధిని సాధించింది. సరళీకృత ఆర్థిక విధానాలు అవలంభించిన కాలంలో ప్రాథమిక రంగంలో వృద్ధి 2.8 కి పడిపోయింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశ పెట్టిననూ ప్రాథమిక రంగంలో పెట్టుబడులు ప్రోత్సహించబడలేదు. ఉత్పాదకత కూడా చాలా తక్కువగా వుంది. 1950-51 నుండి 1996-97 కాలంలో అంటే 47 సం॥లలో సరాసరిన ప్రాథమిక రంగం 2.64 శాతం వృద్ధిని మాత్రమే సాధించింది. ప్రాథమిక రంగంలో సింహభాగం(Lion's Share) ఆక్రమించిన వ్యవసాయరంగం కూడా ప్రాథమిక రంగం పోకడ మాదిరిగానే వుంది. వ్యవసాయరంగంలో వృద్ధి 1950 దశకంలో 3.3 శాతం వృద్ధిని సాధించగా 60 మరియు 70 దశాబ్దాలలో పడిపోయి 80 దశకంలో పుంజుకుని తర్వాత మరల పడిపోవడం జరిగింది. 47 సం॥లలో సగటున 2.8 శాతం సాంవత్సరిక వృద్ధిని సాధించింది. అవడులలో వృద్ధి ఒక్క 60 దశకంలో 3 శాతం వుండగా తర్వాత ఋణాత్మకంగా మారిపోయింది. చేపల వేటలో వృద్ధి 1950 దశకంలో 5.5 శాతం వుండగా 1990 దశాబ్దంలో 6.5 శాతానికి పెరిగింది. మొత్తం పిరియడ్‌లో సరాసరి 4.8 శాతం సాంవత్సరిక వృద్ధిరేటు నమోదు చేసుకుంది. అటుతర్వాత గనులు మరియు క్వారీయింగ్‌లో 1950 దశాబ్దంలో 5.6 శాతం వుండగా తర్వాత 60 మరియు 70 దశాబ్దాలలో పడిపోయి 80 దశకంలో తిరిగి వృద్ధిని సాధించింది. మరల 90 దశాబ్దంలో పడిపోయింది. సరాసరిని 1950 నుండి 1996 - 97 వరకు 4.9 వృద్ధిని సాధించింది. మొత్తం మీద ప్రాథమిక రంగంలో చేపలవేట మరియు క్వారీయింగ్ బాగా వృద్ధిని సాధించాయి.

ఆర్థికాభివృద్ధి జరుగుతున్నపుడు ఆర్థిక వ్యవస్థ పారిశ్రామిక రంగం వైపుకి పరిణితి చెందుతుంది. ద్వితీయరంగం 1950 దశాబ్దంలో 6.2 శాతం వృద్ధిని సాధించింది. తర్వాత రెండు దశాబ్దాలలో వృద్ధి క్షీణించి మరల 80 దశకంలోనూ వృద్ధి రేటు 6.7 శాతం సాధించి దానిని 90 దశకంలో యించుమించుగా నిలబెట్టుకుంది. ద్వితీయ రంగంలో పెద్ద స్థానాన్ని ఆక్రమించిన మాన్యూఫాక్చరింగ్ రంగంలో 50 దశకంలో 6 శాతం వృద్ధిని సాధించగా తర్వాత తగ్గి 80 దశాబ్దం వచ్చేనాటికి మరల పుంజుకుని 7.2 శాతాన్ని సాధించింది. తర్వాత తగ్గి 6.36 శాతాన్ని సాధించింది. తీసుకున్న 47 సం॥లలో సగటున 5.73 శాతం వృద్ధిని సాధించింది. దీని తర్వాత చెప్పుకోదగింది విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటిసరఫరా రంగం. ఈ రంగం 50 దశకంలో ఏకంగా 10.3 శాతం వృద్ధి సాధించి 90 దశాబ్దం వచ్చేనాటికి 7.6 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది. 47 సం॥లలో సరాసరి వృద్ధి మాన్యుఫ్యాక్చరింగ్ రంగం కన్నా అధికంగా

8.96 శాతాన్ని సాధించి ముందంజలో వుంది. ఇంక నిర్మాణ రంగం ఇదే కాలంలో 6.3 శాతం వృద్ధిని సాధించి 90 దశకంలో 4.6 శాతానికి పడిపోయింది.

తృతీయ రంగం ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తుంది. పట్టిక. 5లో చూసించిన విధంగా ఈ రంగం అంటే సేవల రంగం 50 దశాబ్దంలో 4.1 శాతం వృద్ధిని పొందగా తర్వాత 70 దశాబ్దం వరకు ఇంచుమించు అదే రేటులో వృద్ధి సాగింది. 80 దశాబ్దంలో 6.6 శాతం మరియు 90 దశాబ్దంలో 7.4 శాతం సాధించింది. 47 సం॥ల కాలంలో సరాసరిన 5.4 శాతం వృద్ధిని సాధించింది సేవల రంగం. ఈసేవల రంగంలో ప్రాధాన్యత సంతరించుకున్న వ్యాపార, రవాణా మరియు సమాచార రంగం 1950 దశకంలో 5.3 శాతంలో వృద్ధి ప్రారంభమై 90 దశాబ్దం నాటికి 8 శాతం వృద్ధిని సాధించింది. మొత్తం కాలంలో (1950 నుండి 1996-97) 5.88 శాతం వృద్ధిని సాధించింది. తర్వాత బ్యాంకింగ్, భీమా మరియు రియల్‌ఎస్టేటు రంగం 3 శాతంలో వృద్ధి జరిగి 1950 దశాబ్దంలో 90 దశకంలో 8.8 శాతం సాధించింది. మొత్తం మీద సగటున 5.28 శాతాన్ని నమోదు చేసుకుంది. అలాగే పరిపాలనా యంత్రాంగము మరియు ఇతర సేవలు కూడా పెరుగుదలని సాధించడం జరిగింది.

స్థూల దేశీయోత్పత్తి (1980-81 ధరలలో) 1950 దశాబ్దంలో 3.9 శాతం వుండగా తర్వాత 70 దశకం వచ్చేనాటికి 3.1 శాతానికి పడిపోయింది. అటుతర్వాత 80 దశాబ్దంలో 5.6 శాతం మరియు 90 దశకంలో 5.8 వృద్ధిని సాధించడం జరిగింది. అయితే 1990-91 నుండి 2000-01 పిరియడ్ తీసుకున్నట్లైతే స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు 80 దశకంలో ఎంతవుందో అంతే వుంది. దీనిని బట్టి అర్థం అయ్యింది ఏమనగా 90 దశాబ్దంలో చేపట్టిన సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా పెద్దగా లబ్ధిపొందలేదేమోననిపిస్తుంది. దీనికి కారణం 90 దశకంలో వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు బాగా పడిపోవడం (2.8%) అలాగే మైనింగ్ మరియు క్వారీయింగ్ రంగం కూడా 90 దశాబ్దంలో పడిపోయింది. (3.4%).

భారతదేశ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ప్రాధాన్యత వ్యవస్థ నుండి పారిశ్రామికీకరణ దిశగా ప్రయాణం చేస్తోంది. దీంతో ద్వితీయ మరియు తృతీయ రంగాల వాటాలు స్థూల దేశీయోత్పత్తిలో పెరుగుతాయి. దీంతో జాతీయాదాయ సంయోజనం మార్పు రావడం విధాయకం. అయితే ఈ మార్పు చాలా నెమ్మదిగా జరుగుతోంది. దీనికి కారణం పారిశ్రామికీకరణ నెమ్మదిగా జరగడమే. అందుచేత పారిశ్రామికీకరణని వేగవంతం చేస్తేనే వ్యవసాయరంగంతో పాటుగా అన్ని రంగాలు అభివృద్ధిని సాధించడం ద్వారా స్థూలజాతీయోత్పత్తి పెరిగి భారతదేశం అభివృద్ధి పథంలో ముందుంటుంది. యిప్పటికీ భారతదేశం వేగంగా పెరిగే దేశాల సరసన స్థానాన్ని సంపాదించుకుంది. (BRIC Report, 2003).

7.0 స్థూలదేశీయోత్పత్తిలో పబ్లిక్‌రంగ సంస్థల వాటా:

1951లో ప్రణాళికా శకం ప్రారంభంలోనే భారత ప్రభుత్వం మిశ్రమ ఆర్థిక వ్యవస్థ వైపు మొగ్గు చూపింది. అంటే ప్రభుత్వ ప్రైవేటు పారిశ్రామిక సంస్థల మేళవింపు. ప్రభుత్వ సంస్థలకి పెద్దపీట వేసి తగిన రాయితీలతో మరియు నియంత్రణలతో ప్రైవేటు రంగ అభివృద్ధికి కంకణం కట్టుకుంది. భారత ప్రభుత్వం ఆవిధంగా "కమాండింగ్ హైట్స్" (కీలకరంగాలు) మీద పట్టు సాధించడం ద్వారా ప్రజాశ్రేయస్సుని గరిష్ఠం చేయటమే కాకుండా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయప్రయత్నం చేసింది. దీని ప్రకారం 1951 లో రూ॥29 కోట్ల పెట్టుబడితో 5 పబ్లిక్ రంగం సంస్థలు స్థాపించింది. ఈ సంస్థలు 2002 నాటికి అంటే 52 సం॥లలో పెట్టుబడి రూ 3,24, 632 కోట్లకి పెరిగి 240 సంస్థలు ప్రభుత్వ అధీనంలో పనిజేస్తున్నాయి. ఈ సంస్థలు స్థూల దేశీయోత్పత్తి పెరుగుదలకి ఎంతో కృషిసల్పాయి. 1950-51 లో స్థూల దేశీయోత్పత్తిలో పబ్లిక్ రంగం సంస్థల వాటా 7.6 శాతం వుండగా 1970-71 నాటికి 14.9 శాతానికి అటుతర్వాత 1980-81 లో 19.7 శాతానికి చివరగా 2000-01 సం॥నాటికి 24.9 శాతానికి ఈ వాటా పెరిగింది. అయితే 1995-96 పబ్లిక్ రంగం సంస్థల వాటా 26.2 శాతం వుండేది. ఈ వాటాలో తగ్గుదలకి కారణం ప్రభుత్వం యొక్క సరళీకృత ఆర్థిక విధానాలలో భాగంగా పబ్లిక్‌రంగ సంస్థలలో "పెట్టుబడి ఉపసంహరణ విధానం" (Disinventment Policy) ద్వారా పబ్లిక్ రంగం సంస్థలను ప్రైవేటు పరం చేయనారంభించారు. దీనికి కారణం ప్రబ్లిక్ రంగ సంస్థలు ఎక్కువ భాగం నష్టాల్లో నడవడం. ఉదా॥కి 2001-02 లో 109 సంస్థల్లో రూ॥10,387 కోట్ల నష్టం వాటిల్లింది.

8.0 గ్రామిణ-పట్టణ ఆదాయ విభజన:

కేంద్ర గణాంక యొక్క జాతీయ పద్దుల గణాంకాల ప్రకారం నికరదేశీయోత్పత్తి (NDP) వివరాలను గ్రామిణ-పట్టణ విభజన కనుకూలంగ యివ్వడం జరిగింది. పట్టిక. 6 లో నికరజాతీయోత్పత్తిలో గ్రామీణ పట్టణ ప్రాంతాల వాటాలు చూపబడ్డాయి. నికర జాతీయోత్పత్తిలో (ప్రస్తుత ధరలలో) 1970-71లో గ్రామీణ ప్రాంతం 62.4 శాతం వాటాని కలిగి వుండగా 1980-81 లో ఈ వాటా 58.9 శాతానికి పడిపోయింది. 1993-94 సం॥కి గ్రామిణ ప్రాంత వాటా 54.3 శాతానికి తగ్గిపోయింది. గ్రామిణ ప్రాంత వాటా 23 సం॥లలో (1970-71 నుండి 1993-94) 12.5 శాతం పడిపోయింది. మనం ఇదివరకే వ్యవసాయరంగ వాటా స్థూల దేశీయోత్పత్తిలో పడిపోయిందని దీనివల్ల గ్రామీణ ఆదాయం కూడ పడిపోయింది. నికర దేశీయోత్పత్తిలో ఎప్పుడైతే గ్రామిణ ఆదాయం యొక్క శాతం తగ్గుతూ వచ్చిందో ఇదేకాలంలో పట్టణ ఆదాయం పెరగనారంభించింది. 1970-71లో పట్టణ ప్రాంతం యొక్క వాటా 37.6 శాతం వుండగా 1980-81 లో 41.1 శాతానికి పెరిగి 1993-94లో 45.7 శాతానికి వృద్ధి పొందింది. నికరదేశీయోత్పత్తిలో పట్టణ ప్రాంతం వాటా భారతదేశంలో పెరుగుతూ వస్తోంది. దీనికి కారణం పారిశ్రామిక మరియు సేవలరంగాల అభివృద్ధి ఎక్కువగా పట్టణాలలో జరగడమే. అంతేకాకుండా మన అభివృద్ధి విధానాలు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి పట్టణ-పక్షపాత (Urbar bias) తో కూడుకున్నటువంటివే. వ్యవసాయ రంగం వాటా తగ్గడం తద్వారా గ్రామిణ ఆదాయం తగ్గడం అంతాకూడా వ్యవసాయరంగం పట్ల నిర్లక్ష్య వైఖరి కూడా ఒక కారణం.

పట్టిక.6 లో ప్రాంతాల వారీగా (పట్టణ-గ్రామీణ) తలసరి నికరదేశీయోత్పత్తి కూడా యివ్వబడింది. గ్రామీణ ప్రాంతాల తలసరి ఆదాయం 1970- 71 లో రూ.529 వుండగా 1980-81లో రూ.1,245 కి పెరిగి 1993-94లో రూ. 5,783 కి పెరిగింది. అంటే 27 సం॥లలో గ్రామీణ తలసరి ఆదాయం 993.19 శాతం వృద్ధిని సాదించింది. అంటే గణనీయంగా పెరిగింది. అదేవిధంగా పట్టణప్రాంతా ఆదాయం కూడా 1970-71 లో రూ.1,294నుండి 1993-94 నాటికి రూ.13,525కి పెరిగింది. అంటే 23 సం॥లలో 945.21 శాతం పెరిగింది. ఇదేకాలంలో మొత్తం తలసరి ఆదాయం రూ॥680 నుండి రూ॥7834కి పెరిగింది.

పట్టిక. 6 లో జనాభా పెరుగుదల ఎట్లావుందో ఈరెండు ప్రాంతాలలో అన్న విషయాన్ని వివరిస్తుంది. గ్రామీణ ప్రాంత జనాభా 1970-71 లో 43.4 కోట్లుండగా 1993-94 నాటికి 65.5 కోట్లకి పెరిగింది. అయితే ఈ 23 సం॥ల కాలంలో జనాభా 80.27 శాతం నుండి 73.51 శాతానికి పడిపోయింది. మరి పట్టణ ప్రాంత జనాభా అయితే ఇదేకాలంలో 19.73 శాతం నుండి 26.49 శాతానికి పెరిగింది. ఈ విషయాన్ని కేంద్ర గణాంక సంస్థ తెలియజేసింది. యిక్కడ తెలియజేసింది గ్రామాలు పట్టణాలలో నివసిస్తున్న జనాభా గురించి, అంతేకాని వ్యవసాయ రంగం మీద ఆధారపడిన శ్రామిక గురించి కాదు.

9.0 స్థూల దేశీయోత్పత్తిలో వివిధ రాష్ట్రాల వాటాలు:

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాభివృద్ధితో పాటు అనేక రాష్ట్రాలు అభివృద్ధిని సాధించాయి. యింకేన్నో రాష్ట్రాలు వెనుకబడివున్నాయి. రాష్ట్రాల అభివృద్ధిలో ఆర్థిక సామాజిక విషయాల పరంగా ఎంతో వ్యత్యాసాలు కనబడతాయి. అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలు మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, పంజాబ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు మొదలైనవి. వేదరాష్ట్రాలుగా మిగిలిపోయినవి మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్ మొదలైనవి. మధ్యస్థంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, రాజస్థాన్ మొదలైనవి. వీటికి అనేక కారణాలున్నాయి. ఈ రాష్ట్రాల ఉత్పత్తి (State Domestic Product) అంతటిని కలిపితే స్థూలదేశీయోత్పత్తి అవుతుంది. 1996-97 లో 14 పెద్ద రాష్ట్రాలు అయిన బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్, గుజరాత్, హర్యానా, మహారాష్ట్ర మరియు పంజాబ్ రాష్ట్రాలని కలిపి స్థూల దేశీయోత్పత్తిలో 79 శాతాన్ని సమకూర్చిపెట్టాయి. ఈ విషయాన్ని "భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణత" అన్న అధ్యాయంలో పట్టిక 9 లో చూడగలరు. రాష్ట్రాల వారీగా తీసుకుంటే మహారాష్ట్ర దేశ ఖజానాకి రూ॥1554 కోట్లని సమాకూర్చిపెట్టింది. ఇది స్థూలదేశీయోత్పత్తిలో 14.26 శాతం. దీని తలసరి ఆదాయం రూ॥ 17,666/-గా నమోదు చేసుకుంది. మహారాష్ట్ర తర్వాత స్థానాన్ని 1996-97 లో ఉత్తరప్రదేశ్ పొందింది. ఈరాష్ట్రం యొక్క ఆదాయం రూ॥1028.64 కోట్లు యిది స్థూలదేశీయోత్పత్తిలో 9.44 శాతాన్ని సంపాదించింది. అయితే ఈ రాష్ట్ర

యొక్క తలసరి ఆదాయం రూ.6713/- ఇలా ఎందుకుందంటే జనాభా అన్ని రాష్ట్రాల జనాభా కంటే అత్యధికం (15.32 కోట్లు) ఈరెండు రాష్ట్రాల తర్వాత మధ్యస్థంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ యొక్క వాటా (జాతీయాదాయంలో) 6.33 శాతం, మరియు గుజరాత్ వాటా 6.14 శాతంగా వుంది, 1996-97లో అయితే తలసరి ఆదాయంలో పంజాబ్ రూ॥18006/-తో అగ్రస్థానంలో వుంది.

పైన ఉదహరించిన పెద్దరాష్ట్రాలు (14) రాష్ట్రీయ ఉత్పత్తిలో (SDP) లో 1980-81 ధరల దగ్గర, 1980-81 నుండి 1990-91 కాలంలో సగటున 5.24 శాతం సాంవత్సరిక వృద్ధిరేటుని సాధించడం జరిగింది. ఈవృద్ధిరేటు స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు అయిన 5.55 శాతానికి ఇంచుమించుగా దగ్గరగా వుంది. అయితే రాష్ట్రీయ ఉత్పత్తి 14 రాష్ట్రాలలో 1991-92 నుండి 1997-98 కాలంలో, 1980-81 ధరలలో, 5.94 శాతం సాంవత్సరిక వృద్ధిరేటును నమోదు చేసుకోవడం జరిగింది. ఇది స్థూలదేశీయోత్పత్తి వృద్ధిరేటు అయిన 6.89 శాతానికి చాలా తక్కువ. ఇక తలసరి ఆదాయం (రాష్ట్రాల)లో స్థిర ధరలలో 1980-81 నుండి 1990-91 కాలంలో 3.03 వృద్ధిని మరియు 1991-92 నుండి 1997-98 కాలంలో 4.02 శాతాన్ని సాధించడం జరిగింది. ఈ విషయాన్ని "భారతదేశ ఆర్థికవ్యవస్థ నిర్మాణం" అన్న అధ్యాయంలో పట్టిక.9 చూడగలరు. ఈ 14 రాష్ట్రాలలో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మరియు రాజస్థాన్ రాష్ట్రాలు పైగణాంక వివరాలు బట్టి అభివృద్ధిని వేగంగా సాధిస్తున్న రాష్ట్రాలుగా చెప్పబడ్డాయి. అయితే మహారాష్ట్ర మరియు గుజరాత్‌లను మిరకిల్ ఆర్థిక వ్యవస్థలుగా చెప్పవచ్చు. ఎందుకంటే ఈ రెండు రాష్ట్రాలను వేగంగా అభివృద్ధి చెందిన మిరకిల్ ఆర్థిక వ్యవస్థలైన దక్షిణ కొరియా, తైవాన్, థాయిలాండ్ మొదలైన దేశాలతో పోల్చవచ్చును.

10.0 భారతదేశంలో జాతీయాదాయ అంచనాలలో పరిమితులు:

భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు తయారు చేయడంలో గణాంక నిపుణులు ఎన్నో సిద్ధాంతపరమైన మరియు వాడుకపరమైన సమస్యల నెదుర్కోవలసివస్తోంది. ముఖ్యంగా కొన్ని రకాల సేవలను లెక్కించడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సేవలలో వ్యక్తిపరమైనవి మరియు ప్రభుత్వ పరిపాలనాపరమైనవి వున్నాయి. జాతీయాదాయ సంఘం (National Income Committee) మొదటి రిపోర్టులో ఈ సమస్యల పరంగా ఇలా చెప్పడం జరిగింది: "ప్రభుత్వం యొక్క సాధారణ పరిపాలనలో ఏ భాగం ప్రైవేటు వ్యాపార సంస్థలకి సేవ అవుతుంది, ఆ సేవ ఉత్పత్తి విలువలో భాగం అవుతుందా, అయితే, జాతీయాదాయంలో ఆసేవని లెక్కించనవసరం లేదు మరియు ఆ సేవలో ఏభాగం ప్రజలైన వ్యక్తులకి మరియు వినియోగదార్లకి సేవ అవుతుంది, అలా అయితే ఆసేవని జాతీయాదాయంలో లెక్కించాలా" అనేది ఒక పెద్దసమస్య. వ్యాపార సంస్థకి ప్రభుత్వసాధారణా సేవలు ఉత్పత్తి విలువలో అంటే ఉత్పత్తి ఖర్చు (Cost of Production)లో భాగమైతే జాతీయాదాయ సిద్ధాంతం ప్రకారం ఉత్పత్తి విలువని జాతీయాదాయంలోకి తీసుకుంటే సరిపోతుంది. ఒకే విలువని రెండుసార్లు లెక్కించినట్లు అవుతుంది (Double Counting). యిక రెండవ విషయంలో ప్రభుత్వం పరిపాలనా సేవలు ప్రజలకి అందిస్తుంది. వినియోగదార్లుగా ఆ సేవలను పొందితే అంటే "అంతిమ వినియోగాని"కైతే (Final Consumption) అటువంటప్పుడు ఆప్రభుత్వసేవలను జాతీయాదయంలో వస్తువినియోగంలాగే పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది.

ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగం అందించే సేవలు, ఉదా॥పోలీస్ రక్షణ వ్యవస్థకైన ఖర్చుని, అంతిమవస్తువుకైన ఖర్చు అని అనుకోవాలా లేక ఉత్పత్తి విధానంలో ఖర్చు అయిపోయిన అంటే వినియోగింపపడిపోయిన వస్తువుకైన ఖర్చు అని అనుకోవాలా, అన్నది సమస్య. పోలీసు రక్షణ లేందే ఏ వ్యాపార సంస్థ తన మనుగడని సాగించలేదు అని అనుకుంటే పోలీస్ రక్షణ ఒక వినియోగింపబడిపోయిన (Used up in the Proceless of Production) వస్తువు క్రింద వస్తుంది. అలాంటపుడు పోలీస్ రక్షణకైన ఖర్చుని లెక్కించం. ఎందుకంటే ఈ ఖర్చు విలువ వ్యాపార సంస్థ యొక్క ఉత్పత్తి విలువలో ఇమిడి వుంది కాబట్టి. పోలిస్ రక్షణ అనేసేవ వ్యాపారసంస్థ తయారు చేసిన వస్తువుతో పోలిస్తే వేరుగా వున్న సేవలని అనుకున్నట్లైతే అది "అంతిమవస్తువు" (Final good) అవుతుంది. అలాంటపుడు, ఆ సేవని లెక్కించవలసి వుంటుంది.

ఇదే విధంగా వ్యక్తిగత సేవలు కూడా అనేక సమస్యలను తెచ్చిపెడతాయి. ఉదా॥కి ఒకవ్యక్తి తను ఉద్యోగం చేసే ఆఫీసుకి తన యింటి దగ్గర నుండి ప్రయాణం చేసి అంటే సిటీబస్‌లో ప్రయాణం చేసి ఆఫీసుకు చేరుకుంటున్నాడు. అతనికి ఆ ప్రయాణానిక బస్ టిక్కెట్టు రూపేణ ఎంతో కొంత ఖర్చు అవుతోంది. అంతే కాకుండా ఈవ్యక్తి తన ఆరోగ్య రక్షణకి కూడా ఈ విధంగా ఖర్చు చేస్తూంటాడు. ఈ ఖర్చులను "అత్యవసర అవసరాలు" (Regrettable necessities) అని అంటారు. అయితే ఈ ఖర్చులను ఈ వ్యక్తి తను ఆఫీస్‌లో పన్నిచేయడానికి వీలుగా, ఖర్చు చేస్తున్నాడు కాబట్టి ఈఖర్చుని ఉత్పత్తి ప్రక్రియలో ఖర్చు అయిపోయిన వస్తువుగా అనుకుని జాతీయాదాయంలో లెక్కించగూడదా? అనేది సమస్య.

ఈ సమస్యలను పరిష్కరించడం చాలా క్లిష్టతరమైనది. సగుణాత్మక (Quatitative) నిర్ణయించబడుతూ వుంటుంది. ఇటువంటి పరిస్థితులలో ఏ ఇద్దరు వ్యక్తులు ఒకే నిర్ణయానికి రాకపోవచ్చు. ఎందుకంటే ఇద్దరి మానసిక పరిస్థితి వేరువేరుగా వుంటుంది కాబట్టి ఇటువంటి సమస్యలను, మరియు వ్యక్తుల ఖర్చులను "అంతిమ వస్తు వినియోగం" క్రింద పరిగణిస్తే సమస్య తీరిపోతుంది (ఎవ్వర్ట్‌పేరో, 1995, P 22-23).

పైన వివరించిన సిద్ధాంత పరమైన సమస్య కాకుండా ఈక్రింద వివరించిన జాతీయాదాయ అంచనాలలో వాడకపరమైన సమస్యలున్నాయి.

10.1 ద్రవ్యేతర ఆర్థికవ్యవస్థ (Non - Monetised Economy):

ఏ ఆర్థిక వ్యవస్థ అయిన ముఖ్యంగా అల్పాభివృద్ధి దేశాలలో వినిమయం రెండురకాలుగా వుంటుంది. మొదటిది ఎస్తు మార్పిడి విధానం (Barter System of Change) రెండవది ద్రవ్యమార్పిడి వినిమయం (Money Economy) ఎక్కడైతే ద్రవ్యమార్పిడి విధానం అంటే వినిమయం (Goods are exchanged for Money) వీంటుందో అక్కడ జాతీయ లెక్కలు మెరుగ్గా, నాణ్యతతో వుంటాయి. ఇది అమెరికా, U.K. మరియు, ఇతర అభివృద్ధి చెందిన దేశాలలో వుంటుంది. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో వస్తుమార్పిడి వినమయం (Good are exchanged for Goods) ముఖ్యంగా ప్రాథమిక రంగంలో కొనసాగుతోంది. అంటే ద్రవ్యాన్ని చెల్లించి వస్తుసేవలు కొనుగోలు చేసే తత్వం ప్రజలలో యింకనూ గ్రామాల్లో పూర్తిగా రాలేదు. ఇది ఎందుకు జరుగుతోందంటే గ్రామాల్లో మార్కెట్టుకు వచ్చే వ్యవసాయోత్పత్తి శాతం తక్కువే. గ్రామాల్లో ప్రజలు వ్యవసాయోత్పత్తిని సాంతవాడకానికి మరియు వస్తుమార్పిడి వినిమయానికి ఉపయోగించడం వల్ల యిటువంటి పరిస్థితి ఏర్పడింది. మరి వస్తువు మార్కెట్టుకు వచ్చి ద్రవ్యరూపంలో అమ్మకాలు మరియు కొనుగోళ్లు జరిగితేనే జాతీయాదాయాన్ని కరెక్టుగా అంచనా వేయవీలుంటుంది. అప్పుడు మాత్రమే దేశం యొక్క ఆర్థికాభివృద్ధిని అంచనావేయగల్గుతాము. అలా జరగడంలేదు కాబట్టి భారతదేశంలో జాతీయాదాయం అల్పఅంచనా (Under estimate) కి గురువుతోంది. ఇటువంటి పరిస్థితి ముఖ్యంగా ఆహార పంటల విషయంలో జరుగుతోంది. గణాంక నిపుణులు ఈ సమస్య తలెత్తినపుడు ద్రవ్యేతర వ్యవస్థలో ఉత్పత్తి అయిన వస్తువుల విలువను అనుభవం మీద లెక్కించి (IMPUTATION) ఆవిలువను ద్రవ్యవ్యవస్థలో వున్న ఉత్పత్తి విలువకి కలుపుతారు. ఆ విధంగా జాతీయాదాయాన్ని అంచనా వేస్తారు.

10.2 చిన్న చిన్న ఆదాయాల పరంగా సమాచారం అందుబాటులో లేకపోవడం:

చిన్నచిన్న ఉత్పత్తిదారులు మరియు కుటుంబ పరిశ్రమలు విషయంలో ఆదాయపరంగా సరియైన సమాచారం అందకపోవడం గణాంక నిపుణులను వేధిస్తున్న యింకొక సమస్య. భారతదేశంలో ఈనాటికి అంటే స్వాతంత్ర్యం వచ్చి 57 సం॥లు పూర్తి అయిన తర్వాత కూడా చాలామంది ఉత్పత్తిదారులు వారి సంస్థని కుటుంబ పరిశ్రమగాను మరియు చాలా చిన్నతరహాగాను నడపడం జరుగుతోంది. సాధారణంగా ఈ ఉత్పత్తిదారులందరు నిరక్షరాస్యులవడం చేత వారి పరిశ్రమ పరంగా ఏ విధమైన పద్దులు గాని సమాచారాన్నిగాని వారు నిర్వహించలేకపోతున్నారు. అలాంటి అవసరం వుంటుందని గాని వారు గ్రహించలేక పోతున్నారు. యిటువంటి పరిస్థితులలో జాతీయాదాయ సంఘం యిట్లా వివరించింది. "యిటువంటి చిన్నతరహా మరియు కుటుంబ పరిశ్రమలు అధిక సంఖ్యలో నున్నపుడు వాటి ఉత్పత్తి విలువని అంచనా వేయడంలో ఊహాజనితమైన అంచనాలో చోటుచేసుకుంటాయి". అందుచేత స్థూలదేశీయోత్పత్తిలో అంచనాలు కొంత భాగం ప్రత్యక్షంగా ప్రస్తుత సమాచారం ఆధారంగా తయారవుతాయి, యింకొంత భాగం యిటువంటి బెంచ్‌మార్క్

అంచనాలు (Bench Mark Estimates) చోటుచేసుకుంటాయి. 1985-86 సం॥లో కేంద్ర గణాంక సంస్థ ప్రత్యక్షంగా సేకరించిన సమాచారం ఆధారంగా స్థూలదేశీయోత్పత్తిలో 62.2 శాతాన్ని అంచనా చేయడం జరిగింది. మిగిలినదంతా బెంచ్‌మార్క్ అంచనాలే. కాబట్టి అసంఘటిత రంగంలో యిటువంటి సమస్యలున్న కారణంగా జాతీయాదాయ అంచనాలలో తప్పుల శాతం ఎక్కువయ్యే ప్రమాదముంది. ఇక్కడ V.K.R.V. రావ్ ఇలా అన్నారు. "ఆర్థికవ్యవస్థ ఎంత ఎక్కువగా సంఘటిత (Organised) మయితే అంత ఎక్కువగా అంచనాల వ్యాప్తి జరుగుతుందని, దాంతో తప్పులు తక్కువగా దొర్లుతాయని, తెలిసి చేసిన తప్పులు అటుంచి"అన్నారు.

10.3 ఆర్థిక విధులలో (వృత్తులలో) వ్యత్యాసం లేకపోవడం:

భారతదేశంలో వృత్తుల పరంగా వర్గీకరణ అసంపూర్తిగా వుందని చెప్పవచ్చు. ప్రజలు చేపట్టే ఆర్థికవిధులలో తేడాని గమనించడం చాలా కష్టంగా వుండడమనేది భారతదేశ జాతీయాదాయ లెక్కల స్వభావం. ఒక సన్నకారురైతు సం॥లో కొంత భాగం పంటపొలంలో పనిజేస్తాడు; యింకొంతకాలం కర్మాగారంలో కార్మికుడుగా పనిజేస్తాడు;. మరికొంతకాలం అద్దె రిక్షా త్రొక్కుతాడు. ఇలా ఒకేవ్యక్తి యిన్ని పనుల్లో వుంటే ఏ వృత్తి నుండి ఎంత ఆదాయం వచ్చిందో చెప్పడం చాలా కష్టంతో కూడుకొన్నటువంటిది. వృత్తులపరంగా వర్గీకరణ ఖచ్చితంగా లేదు. అయితే జాతీయాదాయ లెక్కలలో వేర్వేరు వృత్తులపరంగా ఉత్పత్తిదారులను వర్గీకరించవలసి వుంటుంది.

10.4 అన్యాయబద్ధమైన తెలియచెప్పిన ఆదాయం: నల్లధన ఆర్థిక వ్యవస్థ (Black Money)

భారతదేశంలో నల్లధన ఆర్థిక వ్యవస్థ, తెల్లధన ఆర్థిక వ్యవస్థతో సమాంతరంగా నడుస్తోంది. నల్లధనం (Black Money) అన్యాయ బద్ధంగా సంపాదించిన డబ్బు. ఈ నల్లధనం భారతదేశం ఆర్థిక వ్యవస్థలో అంతర్లీనంగాను మరియు పైకి కనబడకుండా తన వ్యవస్థని కొనసాగిస్తూంటుంది. ఈ నల్లదన వివరాలను ఎవరు పైకి చెప్పరు. అందుచేత జాతీయాదాయ లెక్కలలోకిరాదు. 1983-84 లో NIPFP (National Institute of Public Finance & Policy) New Delhi.అనే పరిశోధనా సంస్థ ఈ నల్లధనాన్ని జాతీయాదాయంలో సుమారు 18 శాతం నుండి 21 శాతం వుంటుందని అంచనా వేసింది. ఇంత పెద్ద మొత్తంలో నల్లధనం చెలామణి అవుతుంటే జాతీయాదాయ అంచనాలు తప్పుతాయనడంలో సందేహం లేదు. అంతే కాకుండా ఈ నల్లధనం అంతకంతకు పెరుగుతుందే తప్ప తరగదు. ఆటువంటప్పుడు జాతీయాదాయ అంచనాలు అల్ప అంచనాలుగానే వుంటాయి.

10.5 నమ్మదగిన గణాంక సమాచార కొరత:

భారతదేశంలో జాతీయాదాయ అంచనాలు కరెక్టుగా చేసేందుకు తగిన సమాచారం అందునా నమ్మదగింది మరియు అధికార యుక్తమైన (Reliable and authentic) సమాచారం అందుబాటులో లేకపోవడం యింకొక ప్రధాన సమస్య. భారతదేశంలో గణాంక వివరాలను శిక్షణ లేనటువంటి మరియు సగం అక్షరాస్యులు అయిన గ్రామ సేవకుల ద్వారా సమాచారాన్ని సేకరించడం పరిపాటి. అందుచేత అవి నమ్మదగినవి కావు. అయితే కొన్ని గణాంక సంస్థలైన NNS (Natinal Sample Survoey)ద్వారా ప్రభుత్వం గణాంక వివరాలను సేకరిస్తుంది. అయితే ఈ ప్రయత్నాలు సరిపోవు. ఈ కారణాల ద్వారా భారతదేశ జాతీయాదాయ లెక్కలలో ఎన్నో తప్పులు దొర్లే అవకాశం లేకపోలేదు.

అంతేకాకుండా NAS (National Accounts Statistics) సమాచారంలో కుటుంబాలు మరియు వ్యక్తుల పరంగా ఆదాయ పంపిణి (Income Distribution) పరంగా సమాచారం లేదు. అయితే NSS ఈ వివరాలను యింకొక మార్గంద్వారా అంటే వినియోగదార్ల వినియోగ వ్యయం ద్వారాను మరియు ఆదాయ పంపిణి మీద ఒక పైలట్ సర్వే జరపడం ద్వారాను, అలాగే వినియోగం మరియు పొదుపు సమాచారం ద్వారాను 1983-84లో ఎన్నిక చేసిన రాష్ట్రాలు మరియు 4 మహానగరాలలోను నిర్వహించబడింది. శాంపుల్ చిన్నది అవడం వల్ల లెక్కలు తప్పాయి. దీంతో పైలట్‌సర్వేలను దేశమంతటా చేపట్టాలని నిర్ణయించింది. ఈ ఆదాయ పంపిణి క్షుణ్ణంగా తెలిస్తే భారతదేశంలో ఎట్లావుందో జాతీయాదాయ వృద్ధి వల్ల పేద ప్రజలకి ఎంతవరకు మేలు చేకూరిందో తెలుస్తుంది. (Trickle Down effect).

10.6 వస్తూత్పత్తికి విలువ కట్టడంలో సమస్యలు

జాతీయాదాయాన్ని అంచానాలు వేయడంలో ఉత్పత్తి పద్ధతిలో (Production Method) ఉత్పత్తి విలువ ద్వారా మొత్తం (GNP) విలువని తెలుసుకుంటాము. అయితే విలువని వస్తువుల ధర ద్వారా తెలుసుకుంటాము. ఇక్కడ విలువని లెక్క కట్టెటపుడు ఏ ధరని పరిగణనలోకి తీసుకోవాలి అనేది ఒక ప్రధానమైన సమస్య. అయితే సాపెక్ష ప్రయోజనాలు (Relative Utilities) మరియు సాపేక్ష కొరతలు (Relative Scarcities) ప్రతిబింబించే సాపేక్ష ధరలని తీసుకుకోవలసి వుంటుంది. ఈ ప్రయోజనాలు మరియు కొరతలు ప్రతిబింబించే ధరని మార్కెట్టు ద్వారా నిర్ణయించబడుతుంది. దానినే మార్కెట్టు ధర అని అంటాము. ఇక్కడకూడా ఆదాయం పంపిణి (Income Distribution) మార్కెట్టులో వుండే గిరాకిని ప్రభావితం చేస్తుందే తప్ప సమానమైన ఆదాయం వున్న వినియోగదారుల సాపేక్ష ప్రయోజనం బట్టి గిరాకి ఆధారపడి వుండదు. అలాగే వనరుల యొక్క కొరత మార్కెట్టు ద్వారా నిర్ణయింపబడిన ఉత్పాదక వనరుల పంపిణి (Allocation) ద్వారా తెలియడమే కాకుండా, ఉత్పాదక సామర్థ్యాన్ని (Productive Capacity) తక్కువగా వినియోగించడం లేక తప్పుగా ఉపయోగించడం వల్ల కూడా వనరుల కొరత ఏర్పడుతుంది. అసలు వనరుల కొరత మార్కెట్టు ద్వారా జరిగిన పంపణి ద్వారా తెలుస్తుంది. ఇటువంటి పరిస్థితులలో మార్కెట్టు ద్వారా కాకుండా ఇతర పద్ధతుల ద్వారా ధర మరియు ఉత్పత్తి నిర్ణయించబడితే దానివల్ల సాపేక్ష ప్రయోజనాలు మరియు కొరతలో అట్లా నిర్ణయింపబడిన ధరలో ప్రతిబింబించవు. అది ప్రభుత్వ విధానం ద్వారా నిర్ణయింపబడిన ధర అవుతుంది. ఆ ధరలు ఉత్పత్తిదారుల మరియు వినియోగదారుల అభిరుచులను ఏట్లా ప్రతిబింబిస్తాయి. ఒక ధర దగ్గర యిలాంటపుడు, వస్తుసేవల ఉత్పత్తి విలువకన్నా జాతీయ వ్యయం ఎక్కువగా వుంటే అటువంటి పరిస్థితి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అయితే ధరలలో ఈ సాధారణా పెరుగుదల అన్ని వస్తు సేవల విషయంలో ఒకేరకంగా వుండదు. దీనివల్ల సాపేక్షధరలలో యింకొకక్రొత్త అంశాన్ని ప్రవేశపెట్టవలసి వుంటుంది. కాబట్టి ద్రవ్యోల్బణం అనేది రెండింటి ద్వారా వస్తుంది. (i) సాధారణ ధరల స్థాయిలో పెరుగుదల (Risethe General Price level) మరియు (ii) వ్యక్తిత్వ వస్తుసేవల ధరలలో (Priees of Individual goods and Services) వేర్వేరు పెరుగుదల. దీంతో ద్రవ్యం యొక్క విలువ (Value of Money) వేర్వేరు ఉత్పత్తిదారులు మరియు వేర్వేరు వినియోగదారుల పరంగా వేర్వేరుగా వుంటుంది. దీనివలన ధరలు సాపేక్ష ప్రయోజనాల్ని మరియు కొరతలని ప్రతిబింబించవు. యిటువంటి పరిస్థితులలో జాతీయ ఉత్పత్తి యొక్క విలువ అంచనా కట్టడంలో సమస్యలు ఎదురవుతాయి. ఇటువంటి పరిస్థితులలో ద్రవ్య జాతీయాం (Money National Income) లో ధరల ప్రభావాన్ని తీసివేయడానికి సాధారణ ధరల స్థాయిలో మార్పుని బట్టి (Charges in the Genearl Price level) "డిఫ్లేట్" (Deflate) అంటే హీనపరచడం జరుగుతుంది. అంటే ధరల ప్రభావాన్ని తీసివేస్తారన్నమాట. అయితే సాధారణ దరలు సాపెక్ష ధరలలోని మార్పుని ప్రతిబింబించవు. యిటువంటి సమస్యలు జాతీయాదాయ లెక్కలలో ఎదురవుతాయి. (V.K.R.V.Rao, 1983, P.1.to 7)

జాతీయాదాయ లెక్కలలో నికరదేశీయోత్పత్తి (NDP) స్థానంలో స్థూలదేశీయోత్పత్తి (GDP) వాడటం జరుగుతోంది. ఎందుకంటే మూలధన తరగుదల లేదా మూలధన వినియోగ రేటుకి (Rate & Capital Comsumption) విలువ కట్టడంలో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. మూలదన వస్తువుల ధర నిర్ణయంలో సమస్యలతో పాటు వాటి నాణ్యత నిర్ణయంలో కూడా ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

10.7 ఇతర సమస్యలు:

భారతదేశంలో అధికశాతం జనాభా వ్యవసాయరంగంలో పనిచేస్తున్న కారణంగా వారి ఆదాయాల పరంగా స్పష్టమైన సమాచారం లభించడంలేదు. వారి ఆదాయం మీద ఏవిధమైన పన్నులేదు. అంతేకాకుండా ద్వితీయరంగంలో రిజిష్టర్ కాని వ్యాపార సంస్థలు మరియు చిన్నచిన్న కంపెనీలు వస్తుసేవల రంగంలో వున్నాయి. వీరు ఏ పన్నుల పరిధిలోకి (Tax Net) రారు. ఈ రెండు రంగాలలో (ప్రాథమిక మరియు ద్వితీయ) ముఖ్యంగా ఆదాయపుపన్ను కట్టె శాతం చాలా చాలా తక్కువ. అంటే వ్యవసాయ రంగం మీద ఏ పన్ను విధించడం లేదు. రిజిష్టర్ కానటువంటి సంస్థలు ద్వితీయ రంగంలో ఎక్కువగా వున్న పన్నుల పరిధిలోకి రారు. అంతే కాకుండా వ్యాపార సంస్థలలో అధిక శాతం ఏవిధమైన మరియు ఖచ్చితమైన పద్ధులను నిర్వహించక పోవడం వల్ల జాతీయాదాయ లెక్కలు

తప్పుతున్నాయి. ఈ వ్యాపార సంస్థలలో కుటుంబ సంస్థలు (Family enterprises) మరియు స్వయం ఉపాధి సంస్థలు అసలు పద్దులను తయారు చెయ్యవు. ఎవరైన పద్దులో కరెక్టుగా తయారు చేసినా వాటిని ఎవరికి కూడా తెలియపర్చడానికి యిష్టపడరు.

11.0 జాతీయాదాయ లెక్కల ప్రాముఖ్యత:

జాతీయాదాయ అంచనాలు బహుళ ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. ముఖ్యంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎట్లా పనిజేస్తుందో తెలియపరుస్తుంది. జాతీయాదాయం పెరుగుతున్నట్లైతే ఆర్థికాభివృద్ధి జరుగుతున్నట్లుగా చెప్పడచ్చు. అదే దీర్ఘకాలం పాటు పెరిగితే దానినే ఆర్థికాభివృద్ధి అనాలి అని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలైన మేయర్ మరియు బాల్టువిన్ (Meier & Baldwin, 1985, p.5) అంతే కాకుండా వివిధ ఆర్థిక రంగాలలో ప్రగతి ఎట్లా వుందో కూడ తెలుస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుండి ఈనాటి వరకు వ్యవసాయరంగం ప్రాధాన్యత తగ్గి, ద్వితీయ మరియు తృతీయ రంగాల ప్రాముఖ్యత పెరిగింది. స్థూలదేశీయోత్పత్తిలో 48 శాతం సేవలరంగం సమకూరుస్తోంది. తర్వాత స్థానాన్ని ద్వితీయరంగం ఆక్రమించింది. ఏదైన రంగంలో ఉపాధి పొందుతున్న శ్రామికులతో పోలిస్తే ఆ రంగాలలో ఉత్పాదకత తక్కువగా వున్నట్లైతే అంటే స్థూల దేశీయోత్పత్తిలో ఆ రంగం వాటా తక్కువగా వుంటే, ఆ విధంగా వుండడానికి తగిన కారణాలను అన్వేషించి వాటి నివారణకు తగిన విధానాలను చేపట్టడానికి వీలుంటుంది. కాబట్టి అందుచేత జాతీయాదాయ అంచనాలు ఎంతో ఉపయోగకారిగా వుంటాయి.

భారతదేశం 1951 సం॥నుండి ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి శ్రీకారం చుట్టింది. ఈప్రణాళికలలో జాతీయాదాయ అంచనాలు ఒక మనిషికి హృదయం ఎంత అత్యవసరమో అంత అవసరం. ఈ అంచనాలు ఉపయోగించి ప్రణాళికలలో సాధించవలసిన ఆర్థిక లక్ష్యాల నిర్ణయం జరుగుతుంది. అంటే ఆర్థిక విధానాలు రూపుదిద్దుకోడం ఈ అంచనాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. యింకా చెప్పాలంటే, సంతులిత ఆర్థికవృద్ధిని సాధించాలన్నా లేదా ప్రాంతీయ అసమానతలను తొలిగించాలన్నా జాతీయదాయ అంచనాలు ఎంతో ఉపయోగకారిగా వుంటాయి.

ఈ రోజున ప్రపంచ దేశాల అభివృద్ధిని కొలవడానికి తలసరి ఆదాయాన్ని ఒక ప్రాతిపదికగా తీసుకోడం జరుగుతోంది. తలసరి ఆదాయ ఆధారంగానే ప్రపంచ దేశాలను అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలుగా విభజించడం జరుగుతోంది. జాతీయాదాయ అంచనాల వల్ల ఒక దేశ తలసరి ఆదాయాన్ని తద్వారా అభివృద్ధిని సరిపోల్చుకోడానికి ఎంతైనా ఉపయోగపడతాయి. అంతేకాకుండా ప్రజల జీవన ప్రమాణస్థాయి ఎట్లావుందో కూడా తెలుస్తుంది. ప్రజల జీవనప్రమాణం పెరిగింది అంటే జాతీయాదాయ పెరుగుదల రేటు జనాభా పెరుగుదల రేటుకన్నా అధికంగా వుందన్న మాట. జాతీయాదాయ పెరుగుదలతో పాటు తలసరి ఆదాయ పెరుగుదల రేటులో పెరుగుదలకూడా తెలుసుకొనడం ద్వారా ఆర్థికాభివృద్ధి తీరుతెన్నులను గ్రహించవచ్చు.

అనేక ప్రభుత్వ డిపార్టుమెంటులకు జాతీయాదాయ లెక్కల ద్వారా వారి పనితీరుని అంచనా వీలుంటుంది. ప్రభుత్వ ట్రజరీ డిపార్టుమెంటు ఈఅంచనాల ద్వారా పన్ను ఆదాయాన్ని లెక్కవేసుకుంటుంది. అదే విధంగా కార్మికశాఖ, రవాణాశాఖ, పరిశ్రమల శాఖ, కామర్స్‌శాఖ మొదలైన శాఖలు జాతీయాదాయ అంచనాల ద్వారా వారి శాఖలకు సరిపడే విధాన నిర్ణయాలు చేపడతారు.

ప్రణాళికలు విజయవంతమయ్యాయా లేక విఫలమయ్యాయా అనే విషయం జాతీయాదాయ అంచనాల బట్టే తెలుస్తుంది. అంటే జాతీయాదాయ పెరుగుదలలో లక్ష్యసాధన, తలసరి ఆదాయంలో లక్ష్యసాధన మరియు పెట్టుబడి, పొదుపు, వినియోగం, ఉత్పత్తి మొదలగు అంశాలలో లక్షసాధన గురించి ఈ అంచనాలే తెలుపుతాయి.

అంతే కాకుండా జాతీయాదాయంలో పెరుగుదలరేటు, తలసరి ఆదాయంలో పెరుగుదల రేటు మరియు పెట్టుబడిలో పెరుగుదల రేటు మొదలైన వాటిని కాలనుగుణంగాను మరియు ప్రాంతానికనుగుణంగాను సరిపోల్చుకోవచ్చు. అంటే ఎన్నిక చేసుకున్న సం॥లలో వృద్ధి ఎట్లా వుంది. లేక అంతర ప్రాంతీయ వృద్ధి ఎట్లా వుంది. లేక అంతర-రంగ వృద్ధి ఎట్లా వుంది. అనే విషయాలు తెలుస్తాయి. ఎద్వారా అభివృద్ధి ఎట్లా జరిగిందో తేటతెల్లమవుతుంది.

ఆదాయ పంపిణి దేశంలో ఎట్లావుంది. సాంఘిక మరియు ఆర్థిక న్యాయం సామాన్యుడికి అందుతోందా అనేవిషయం తెలుస్తుంది. ప్రాంతీయ అసమానతలు తొలగించడంతో పాటుగా సామాన్యుడి వస్తువినియోగ సామర్థ్యం ఏ విధంగా వున్నదో తెలుస్తోంది. ప్రాంతీయాదాయ పంపిణి సమాచారాన్ని బట్టి ప్రాంతాలలో అభివృద్ధిని తెలుసుకోవచ్చు. దీనిని బట్టే భారతదేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలని మరియు అభివృద్ధి చెందని లేక చెందుతున్న రాష్ట్రాలని వర్గీకరణ చేయడం జరిగింది.

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో జాతీయాదాయ అంచనాల ప్రయోజనం ఎంతో ఘనదని చెప్పడంలో సందేహం లేదు.

పట్టిక. 1. స్వాతంత్ర్యం రాక పూర్వం జాతీయాదాయ మరియు తలసరి ఆదాయ అంచనాలు

అంచనావేసిన వ్యక్తులు	అంచనావేసిన సం॥	జాతీయాదాయం (రూ॥కోట్లలో)	తలసరి ఆదాయం (రూ॥లలో)	
1. దాదాబాయి నౌరోజి	1867-68	370	20	
2. F.J.అట్‌కిన్‌సన్	1874-75	574	31	
3. బారింగ్ & బార్ బోర్	1881-82	525	27	
4. లార్డ్ కర్జన్	1897-98	675	30	
5. విలియమ్ డిగ్బీ	1898-99	390	18.9	
6. వకీల్ మహాజన్	1910-14	NA		58.5
7. ఫిండ్లే షిరాస్	1910-11	1942	80	
8. "	1921-22	NA		116
9. వాడియా జోషి	1913-14	1067	44.5	
10. A. లిప్టన్	1919-20	2954	144	
11. షా & ఖంబట్టా	1921-22	2364	67	
12. V.K.R.V రావ్	1925-29	NA		80
13.	1931-32	1689	65	
14.	1942-43	NA		114
15. కామర్స్ మంత్రిత్వశాఖ	1945-46	6234	198	

మూలం: P.K ధర్. ఇండియన్ ఎకానమి, 2001, p. 62

S.P. గుప్తా , స్టాటిస్టికల్ మెథడ్స్, 2000, p. 1.86

పట్టిక .3: ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికర జాతీయోత్పత్తి మరియు ఆదాయాల అంచనాలు (1980-81 శ్రేణులలో)

ప్రణాళిక	సం॥	ఉత్పత్తి కారకాల ఖర్చు దృష్ట్యా నికరజాతీయోత్పత్తి				తలసరి ఆదాయం			
		ప్రస్తుత ధరలలో రూ॥కోట్లలో	సం॥ పెరుగుదల రేటు (%)	1980-81 ధరలలో	సం॥ పెరుగుదల రేటు (%)	ప్రస్తుత ధరలలో రూ॥లలో	సం॥ పెరుగుదలరేటు (%)	1980-ధరలలో రూ॥లలో	పెరుగుదల రేటు (%)
I.	51-52	9034	5.4	41443	2.4	247.5	3.6	1135.4	0.8
	55-56	9161	1.5	48288	2.5	233.1	-0.3	1228.7	0.7
II.	1956-57	10972	19.8	50955	5.5	273.6	17.4	1270.7	3.4
	1960-61	14242	9.3	58602	7.0	328.2	7.3	1350.3	5.0
III.	1961-62	14946	4.9	60168	2.7	336.6	2.6	1355.1	0.4
	1965-66	22247	4.1	65734	-4.7	458.7	1.7	1355.3	-6.8
IV.	1969-70	34421	9.9	78177	6.7	650.7	7.6	1477.8	4.5
	1973-74	52362	23.2	86010	4.9	902.8	20.4	1482.9	2.6
V.	1974-75	61290	17.1	87116	1.3	1033.6	14.5	1469.1	-0.9
	1978-79	85298	7.0	109466	5.6	1316.3	4.6	1689.3	3.3
VI.	1980-81	110685	19.9	110685	7.5	1630.1	17.2	1630.1	5.1
	1984-85	185018	11.1	133808	3.4	2503.6	8.7	1810.7	1.2
VII.	1985-86*	206133	11.4	139025	3.9	2730.2	9.1	1841.4	1.7
	1989-90*	357285	15.5	177315	7.0	4346.5	13.1	2157.1	4.8
VIII	1992-93	546023	13.8	195602	5.1	6261.7	11.8	2243.1	3.1
	1996-97	1089563	16.3	258465	7.7	11554.2	14.4	2761	5.9
iX	1997-98	1224787	12.0	890712	4.9	12772	10.2	9288	-3.2
	2000-01	1702454	8.84	1050177	4.21	16707	7.61	10306	2.36

*బేస్ సం॥ 93-94 (నూతన శ్రేణులు)

మూలం: ఎకనామిక్ సర్వే 2000-01, 2001-02, 2002-03.

పట్టిక. 4 స్థూల దేశీయోత్పత్తి పంపిణి - 1950-51 నుండి 1999- 2000

(పరిశ్రమల వారీగా)

(1980-81 ధరలలో)*

పరిశ్రమ	పంపిణి శాతం					
	1950-51	1970-71	1980-81	1990-91	1996-97	1999-2000
I. ప్రాధమిక రంగం	56.4	45.8	39.6	33.4	27.8	27.5
1. వ్యవసాయం	48.6	39.7	34.7	29.5	24.4	23.2
2. అడవులు	6.0	4.0	2.7	1.4	-	1.1
3. చేపల వేట	0.7	0.8	0.8	0.8	2.1	1.0
4. గనులు క్వారియింగ్	1.1	1.3	1.5	1.7	1.7	2.3
II. ద్వితీయ రంగం	15.0	22.3	24.40	27.0	29.3	24.7
1. మాన్యూఫాక్చరింగ్	11.4	16.1	17.70	20.6	22.5	17.1
2. నిర్మాణ రంగం	3.3	5.0	5.00	4.1	4.3	5.1
3. విద్యుచ్ఛక్తి, గ్యాస్, మరియు నీటి పరఫరా	0.3	1.2	1.70	2.3	2.5	2.5
III. తృతీయ రంగం	28.5	31.8	36.00	39.60	42.7	47.8
1. వ్యాపార రంగం, రావాణా	11.0	14.2	16.70	18.10	20.2	21.9
2. ఫైనాన్స్ & రియల్ ఎస్టేట్	9.0	8.0	8.80	10.30	12.2	12.7
3. కమ్యూనిటి & వ్యక్తిత్వ సేవలు	8.5	9.6	10.50	11.20	10.4	13.2
మొత్తం	100-00	100-00	100-00	100-00	100-00	100-00

* 1993-94 స్థిర ధరలలో

మూలం: ఎకనామిక్ సర్వే, 2000-01, 2001-02.

పట్టిక. 5 స్థూలదేశీయోత్పత్తి వృద్ధిరేటు - 1950-51 నుండి (పరిశ్రమల వారీగా)

(1980-81 ధరలలో) (%)

పరిశ్రమ	1950-51 నుండి 1960-61	1960-61 నుండి 1970-71	1970-71 నుండి 1980-81	1980-81 నుండి 1990-91	1990-91 నుండి 1996-97	1950-51 నుండి 1996-97
I. ప్రాథమికరంగం	3.0	2.3	1.5	3.6	2.8	2.64
1. వ్యవసాయం	3.3	2.2	1.7	3.9	2.9	2.80
2. అడవులు	0.3	3.0	-0.9	-1.0	-1.0	0.40
3. చేపలవేట	5.5	3.5	2.8	5.7	6.5	4.80
4. Q#□° & క్వారీయింగ్	5.6	3.9	4.9	6.7	3.4	4.90
II. ద్వితీయ రంగం	6.2	5.4	4.0	6.7	6.36	5.73
1. మాన్యుఫాక్చరింగ్	6.0	5.2	4.0	7.2	6.9	5.86
2. నిర్మాణ రంగం	6.3	5.5	3.0	3.6	4.6	4.60
3. విద్యుచ్ఛక్తి, గ్యాస్, నిటీ సరఫరా రంగం	10.3	11.1	6.8	9.0	7.6	8.96
III. తృతీయ రంగగం	4.1	4.6	4.3	6.6	7.4	5.40
1. వ్యాపారం, రవాణా సమాచార సంబంధాలు	5.3	5.0	4.7	6.4	8.0	5.88
2. బ్యాంకింగ్, భీమా రియల్ ఎస్టేట్	3.0	3.4	4.0	7.2	8.8	5.28
3. పరిపాలనా యత్రాంగం, రక్షణ	3.1	3.9	3.0	5.5	4.0	3.90
4. ఇతర సేవలు	3.1	3.9	3.0	5.5	5.5	4.20
స్థూల దేశీయోత్పత్తి	3.9	3.7	3.1	5.6	5.8	4.42

మూలం: ఎకనామిక్ సర్వే, 2000-01, 2001-02, ఉమాకపిల, ఇండియన్ ఎకానమి సిన్స్ ఇండిపెండెన్స్ p. 740- 769

పట్టిక. 6 నికర దేశీయోత్పత్తిలోగ్రామీణ - పట్టణ ప్రాంతాల వాటాలు 1970-71 నుండి 1993-9

(ప్రస్తుత ధరలలో)

సం॥లు	నికర దేశీయోత్పత్తి (రూ॥కోట్లలో)			తలసరి నికర దేశీయోత్పత్తి (రూ॥లలో)			జనాభా (కోట్లలో)		
	గ్రామిణ ప్రాంతం	పట్టణ ప్రాంతం	మొత్తం	గ్రామిణ ప్రాంతం	పట్టణ ప్రాంతం	మొత్తం	గ్రామిణ ప్రాంతం	పట్టణ ప్రాంతం	మొత్తం
1970- 71	22937 (62.4)	13850 (37.6)	36787 (100.0)	529	1294	680	43.4 (80.27)	10.7 (19.73)	54.0 (100.0)
1980-81	65004 (58.9)	45336 (41.1)	110340 (100.0)	1245	2888	1625	52.2 (76.88)	15.7 (23.12)	67.9 (100.00)
1993-94	378791 (54.3)	319201 (45.7)	697992 (100.0)	5783	13525	7834	65.5 (73.51)	23.6 (26.49)	89.1 (100.00)

మూలం: దత్ R. & సుందరం K.P.M. ఇండియన్ ఎకానమీ, 2004, P.38.

నోట్: బ్రాకెట్లలో వున్న అంకెలు మొత్తంలో శాతాన్ని సూచిస్తాయి.

3. సారాంశం:

జాతీయాదాయ అంచనాలు ఒక దేశ ఆర్థికవ్యవస్థకి కొలమానంగా పనిచేస్తాయి. అందుకనే ప్రపంచ దేశాల అభివృద్ధిని జాతీయాదాయ అంచనాలలో సరిపోల్చడం అనేది పరిపాటి. జాతీయాదాయం అనగా ఒక దేశంలో ఒక సం॥కాలంలో ఉత్పాదక ప్రక్రియ ద్వారా ఉత్పత్తి అయిన మొత్తం వస్తుసేవల నికర విలువని అనవచ్చు. మార్షల్, పిగూ, ఫిషర్, సైమన్ కజ్‌నెట్స్ మొదలైన ఆర్థిక శాస్త్రవేత్తలు నిర్వచించడం జరిగింది. మార్షల్ ఉత్పత్తి కారకాల పరంగా నిర్వచనం చెప్తే, పిగూ ఆదాయాన్ని ద్రవ్యరూపంలో అంచనావేస్తే జాతీయాదాయం అవుతుందని అన్నాడు. ఫిషర్ వినియోగాన్ని అధారంగా చేసుకుని జాతీయాదాయాన్ని వివరించాడు. సైమన్ కుజ్నెట్స్, ఫిషర్ చెప్పినట్లుగా అంతిమ వినియోగానికి కుపకరించే వస్తుసేవల మొత్తాన్ని జాతీయాదాయం అని అన్నాడు. భారతదేశ జాతీయాదాయ కమిటి 1951 లో ఒక వస్తువుకు రెండుసార్లు విలువకట్టకుండా దేశంలో 25 సం॥లో తయారైన వస్తుసేవల మొత్తమే జాతీయాదాయం అని చెప్పడం జరిగింది.

జాతీయాదాయాన్ని మదింపు చేయడానికి U.N.O చెప్పినట్లుగా మూడు పద్ధతులున్నాయి. అవి (i) ఉత్పత్తిపద్ధతి, (ii) వ్యయమదింపు పద్ధతి; మరియు (iii) ఆదాయంమదింపు పద్ధతి. మొదటి పద్ధతిలో మొత్తం వస్తుసేవల ఉత్పత్తిని వాటి ధరలలో గుణించగా వచ్చేదే స్థూలయోత్పత్తి (G.N.P.) అని అంటారు. అయితే ఈ పద్ధతి చాలా కష్టతరమైనది. అందుచేత వస్తుసేవలను కొనగోలు చేసే సమయాన లెక్కించడం తేలిక. ఈ పద్ధతిని అభివృద్ధిచెందిన దేశాలలో ఉపయోగిస్తున్నారు. దీంట్లో ఉత్పాదక ప్రక్రియ ద్వారా తయారైన వస్తుసేవల కొనుగోళ్ళన మాత్రమే తీసుకోవడం జరుగుతుంది. అందునా ఒక ప్రత్యేక సం॥లో తయారైన వస్తువులను తీసుకుంటారు. అంతేకాకుండా అంతిమ వస్తువ విలువ తీసుకుని మరియు ఈ అంతమ విలువలోకి రాని వస్తువలను ప్రత్యేకంగా లెక్కించాలి. ఈ విధంగా లెక్కించిన ఆదాయాన్ని జాతీయాదాయం అని అంటారు. ఉత్పత్తికారకాల ఖర్చుదృష్ట్యా జాతీయాదాయాని లెక్కవేసినట్లైతే అది ఆదాయ మదింపు పద్ధతి అవుతుంది. ఈ ఖర్చు ఆదాయాన్ని లెక్కిస్తున్న సం॥లో ఉత్పాదక ప్రక్రియ ద్వారా మాత్రమే జరగాతి. ఈ లెక్కప్రకారం ఉత్పత్తి కారకాలకి ఎంతెంత వాటా జాతీయాదాయంలో వచ్చిందో తెలుస్తుంది. జాతీయాదాయ లెక్కలలో కొలమానాలు ముఖ్యంగా మూడు వున్నాయి. అవి, G.N.P., NNP మరియు NI (జాతీయాదాయం). వీటితో పాటుగా వ్యష్టి ఆదాయం, వ్యయార్హ ఆదాయం అనే కొలమానాలు కూడా వున్నాయి. ఏపద్ధతిలో మదింపు చేసినా వచ్చే జాతీయాదాయ విలువ ఒక్కటే. ఎందుకంటే ఒక్క రూపాయి వస్తూత్పత్తి జరిగితే ఒక రూపాయి ఆదాయం తయారైనట్లే.

భారతదేశంలో జాతీయాదాయ అంచనాలలో చేసిన వారిలో ముఖ్యులు దాదాబాయినౌరోజి (1868) మరియు V.K.R.V రావ్ (1931-32)లు. దాదాబాయినౌరోజి జాతీయాదాయాన్ని 370 కోట్లరూ॥లుగాను మరియు తలసరి ఆదాయాన్ని 20రూపాయలుగాను 1868 సం॥కి నిర్ణయించాడు. ఇక రావ్ 1931-32 సం॥కి జాతీయాదాయాన్ని రూ॥1689 కోట్లగాను మరియు తలసరి ఆదాయాన్ని 65 రూ॥లుగాను లెక్కించాడు. బ్రిటిష్ వారి పాలనలో అంటే ముఖ్యంగా 1860 నుండి 1945 వరకు భారతదేశం పేదరిక నిశ్చలస్థితిలో వుంది. దీనికి కారణం తలసరి ఆదాయంలో పెరుగుదల రేటు లేదనే చెప్పాలి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంటే 1949 జాతీయాదాయ కమిటి పి.సి మహల్‌నోబిన్ ఆధ్వర్యంలో స్థాపించబడి దానియొక్క అంతిమ రిపోర్టును 1954 లో ప్రభుత్వానికి సమర్పించింది. ఈ రిపోర్టులో జాతీయాదాయంలో వ్యవసాయరంగంవాటా 50 శాతంగా చెప్పింది. 1948-49 లో ఈ కమిటి జాతీయాదాయాన్ని రూ॥8710 కోట్లుగాను మరియు తలసరి ఆదాయాన్ని రూ॥ 255/- గాను లెక్కించింది. ఈ కమిటి భారతదేశంలో జాతీయాదాయ అంచనాలకి ఒక గట్టి పునాదిని ఏర్పాటు చేసింది. తర్వాత 1955 లో కేంద్ర గణాంక సంస్థని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ సంస్థ జాతీయాదాయాన్ని సాంప్రదాయ శ్రేణులలోనూ, సవరించిన శ్రేణులలోను మరియు నూతన శ్రేణులలో 1955 నుండి ఈనాటి వరకు అంచనాలను తయారుచేసింది. ఈ అంచనాలలో ఆర్థిక ప్రక్రియ ప్రకారం అనేక రంగాలుగా విభజించి ఏ రంగంలో ఏ మదింపు పద్ధతి ఉపయోగపడితే ఆ పద్ధతిని అనుసరించి అంచనాలు తయారు చేసింది.

ప్రణాళికాశకం 1951లో ఆరంభమైన తర్వాత మొదటి ప్రణాళికా ప్రారంభంలో జాతీయాదాయం రూ॥ 9034 కోట్లుంటే 2000-01 సం॥లో 17,02,454 కోట్లకి పెరిగింది. వృద్ధిరేటు చూస్తే 1951 -52 లో 5.4 శాతం వున్నది 200.-01 లో 8,84 శాతానికి

పెరిగింది. అయితే స్థిరధరలో ఇదేకాలంలో వృద్ధిరేటు నికరజాతియోత్పత్తిలో 2.4 శాతం నుండి 4.21 శాతానికి పెరిగింది. వృద్ధిరేటు మాత్రం 0.8 నుండి 2.36 శాతానికి పెరిగింది. జాతీయాదాయంలో నిజమైన వృద్ధిరేటు 80 దశాబ్దం నుండి ప్రారంభమైంది. 70 దశకంలో 3 శాతం కన్నా తక్కువ వృద్ధిరేటు జాతీయాదాయంలో సాధించడం వల్ల Prof.రాజ్‌కృష్ణ ఆ వృద్ధిరేటుని "హిందూరేటుగా" వర్ణించడం జరిగింది. అయితే 80 దశకం నుండి 90 దశకం వరకు వృద్ధి రేటు స్థిరధరల దగ్గర 5.5గా నమోదు చేసుకుంది. అదే 1993-94 స్థిరధరల దగ్గర 90 దశకంలో 6.6 శాతం వృద్ధిరేటు భారతదేశం సాధించింది.

జాతీయాదాయంలో వృద్ధి సాధిస్తున్న తరుణంలో ప్రాథమిక రంగవాటా 1951 లో 56.4 శాతం వుంటే జాతీయాదాయంలో 1999-2000 నాటికి 27.5 శాతానికి పడిపోయింది. తృతీయరంగం వాటా 1999-2000 లో 47.5 శాతానికి పెరిగింది. ద్వితీయ రంగం కూడా పురోభివృద్ధిని సాధించింది. వ్యవసాయరంగ వాటా జాతీయాదాయంలో గణనీయంగా పడిపోయినప్పటికి వ్యవసాయం మీద ఆధారపడిన జనాభాలో తగ్గుదల మాత్రం తక్కువగా పడింది. తృతీయ రంగం వాటా పెరిగింది. కాబట్టి దేశం అభివృద్ధిలో వ్యవసాయం రంగం పాలు పంచుకోవడం లేదని అనుకోవాలా. వ్యవసాయరంగంలో పెట్టుబడులు క్షీణించడంతో పాటు ఉత్పాదకత కూడా క్షీణించింది. ప్రచ్ఛన్న నిరుద్యోగిత యింకా కొనసాగుతోంది. అంతేకాకుండా 1950-51 నుండి 1996-97 కాలంలో ప్రాథమిక రంగంలో వృద్ధిరేటు 3 శాతం కన్నా తక్కువగా వుంటే ద్వితీయ మరియు తృతీయ రంగాలలో వృద్ధి ఇదే కాలంలో 6 శాతానికి దగ్గరగా వుంది.

జాతీయాదాయంలో పబ్లిక్ రంగసంస్థల వాటా 1950-51 లో 7.6 శాతం వుంటే 2000-01 లో ఈ వాటా 24.9 శాతానికి పెరిగింది. అయితే అనేక పబ్లిక్ రంగసంస్థలు నష్టాలబాటలో పయనిస్తున్నాయి. అలాగే జాతీయాదాయంలో గ్రామీణ - పట్టణ వాటాలు చూస్తేగ్రామీణ వాటి పడిపోయి పట్టణ వాటా పెరుగుతోంది.. 1970-71 లో జాతీయాదాయంలో గ్రామీణ వాటా 62.4 శాతం వుంటే 1993-94 కి 54.3 శాతానికి పడిపోయింది. మరి పట్టణ వాటా ఇదేకాలంలో 37.6 శాతం నుండి 45.7 శాతానికి వృద్ధి నొందింది. యింకా, జాతీయాదాయంలో రాష్ట్రాల వాటా చూసినట్లైతే, 14 పెద్ద రాష్ట్రాలలో మహారాష్ట్ర 1996-97 లో స్థూల దేశీయోత్పత్తిలో 14.26 శాతాన్ని సమకూర్చిపెట్టి అభివృద్ధిలో ముందంజలో వుంది. ఈ 14 రాష్ట్రాలు కలిపి, స్థూల దేశీయోత్పత్తిలో 79 శాతాన్ని సమకూర్చి పెట్టాయి. తలసరి ఆదాయంలో పంజాబ్ రూ.18006/-తో అగ్రస్థానంలో వుంది. తర్వాత మహారాష్ట్ర, హర్యానా, మరియు గుజరాత్‌లో తలసరి ఆదాయంలో వరస స్థానాలను ఆక్రమిస్థాయి. అయితే మహారాష్ట్ర మరియు గుజరాత్‌లను వేగంగా అభివృద్ధిని సాధిస్తున్న దేశాలతో పోల్చవచ్చును.

భారతదేశంలో జాతీయాదాయ అంచనాలలో అనేక జటిలమైన సమస్యలు ఎదురువుతున్నాయి. భారతదేశం పూర్తిగా ద్రవ్య ఆర్థిక వ్యవస్థకాదు. దీంతో అనేక వస్తుసేవల విలువలు కట్టడం అసాధ్యం. ఇలాంటి చోట బెంచ్‌మార్క్ అంచనాలు చేస్తూ వుంటారు. తర్వాత సమాచార కొరత వీటివలన జాతీయాదాయ లెక్కలలో తప్పులు దొర్లి అవకాశం వుంది. ఈ సమస్యని అధిగమించడానికి జాతీయ డేటా బ్యాంక్ (National Data Bank) నొకదానిని సాంకేతిక నిపుణులను సభ్యులుగా చేసి స్థాపించాలి. అలాంటప్పుడు మాత్రమే జాతీయా లెక్కలు దేశం యొక్క పనితీరుని విశ్లేషించగలవు.

4. పాఠ్యాంశంలోని ముఖ్యపదాలు :

(i)	జాతీయాదాయ మరియు ఉత్పత్తి పద్ధ	(National Income & Product A/C)
(ii)	ప్రస్తుత ఉత్పాదక ప్రక్రియ	(Current Productive Activity)
(iii)	బదిలి చెల్లింపులు	(Transfer Payment)
(iv)	అంతిమ వస్తువు	(Final Good)
(v)	మధ్యస్థ వస్తువు	(Intermediate Good)
(vi)	అదనంగా కలిసినే విలువ	(Value Added)
(vii)	సగం తయారైన వస్తువులు	(Inventories).
(viii)	స్థూలజాతియోత్పత్తి	(GNP)

(ix)	నికర జాతీయోత్పత్తి	(NNP)
(x)	స్థూల దేశీయోత్పత్తి	(GDP)
(xi)	నికర దేశీయోత్పత్తి	(NDP)
(xii)	ఉత్పత్తి కారకాల ఖర్చు ద్వారా నికర జాతీయోత్పత్తి	(NNP at factor Cost)
(xiii)	వ్యక్తి ఆదాయం	(Personal Income)
(xiv)	వ్యయార్హ ఆదాయం	(Disposable Income)
(xv)	తలసరి ఆదాయం	(Per capita Income)
(xvi)	నిజ ఆదాయం	(Real Income)
(xxvii)	సాంప్రదాయ శ్రేణులు	(Conventional Series)
(xviii)	సవరించిన శ్రేణులు	(Revised Series)
(xix)	నూతన శ్రేణులు	(New Series)
(xx)	జాతీయ పద్దుల గణాంకాలు	(National Account Statistics)
(xxi)	డ్రైన్ డిఫ్లేటర్	
(xxii)	మిగులు శ్రామికుల సమస్య	(Surplues labour Problem)
(xxiii)	పెట్టుబడి ఉపసంహరణ విధానం	(Disinvestment Policy)
(xxiv)	రాష్ట్రీయ ఉత్పత్తి	(State Domestic Product)
(xxv)	రాష్ట్రీయ తలసరి ఉత్పత్తి	(Percapita State Domestic Product.)
(xxvi)	అంతిమ వినియోగం	(Final Consumption)
(xxvii)	రెండుసార్లు ఒకే విలువలని లెక్కించుట	(Double Counting)
(xxviii)	ద్రవ్యేతర ఆర్థిక వ్యవస్థ	
(xxix)	ఇంప్యుటేషన్	(Imputation)
(xxx)	బెంచ్‌మార్క్ అంచనాలు	(Bench Mark Estimations)
(xxxi)	నల్లధనం	(Black Money)
(xxxii)	సాధారణ ధరల స్థాయి	(General Price level)
(xxxiii)	సాపేక్షధరలు	(Relative Prices)
(xxxiv)	సాపేక్ష ప్రయోజనం	(Relative Utilities)
(xxxv)	సాపేక్ష కొరతలు	(Relative Scarcities)
(xxxvi)	పన్నుల పరిధి	(Tax Net)

5. వ్యయం సమీక్ష ప్రశ్నలు:

(i) జాతీయాదాయ నిర్వచనాన్ని విపులీకరించండి.

(ii) జాతీయాదాయ మదింపు పద్ధతులను వాటిలో వుండే పరిమితులను విశ్లేషించండి.

(iii) ఈ క్రింది అంశాలను గురించి వ్రాయండి :

(a) GNP, (b) NNP, (c) GDP, (d) NDP, (d) NDP, (e) NI,

(f) వ్యక్తి ఆదాయం; (g) వ్యయార్హ ఆదాయం; (h) తలసరి ఆదాయం (i) నిజ ఆదాయం

(iv) జాతీయాదాయ మరియు ఉత్పత్తుల ఏకత్వాన్ని వివరించండి.

(v) స్వాతంత్ర్యం రాకపూర్వం జాతీయాదాయాల అంచనాలు తెలియజేయండి.

(vi) స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంచనాలను వివరించండి.

(xvii) 1980-81 ధరలలో జాతీయాదాయ మరియు తలసరి ఆదాయాలలో వృద్ధిరేట్లను పరిశీలించండి.

(viii) హిందూ రేటు అనగానేమి?

(ix) 1993-94 ధరలలో జాతీయాదాయ పెరుగుదలను మదింపు చేయండి.

(x) జాతీయ సంయోజన తీరుతెన్నులు వివరించండి.

(xi) భారతదేశ జాతీయాదాయ అంచనాలలో పరిమితులు లేదా సమస్యలను వివరించండి.

6. చదవవలసిన పుస్తకములు:

(i) V.K.R.V. Rao : India's National Income, 1950-1980, 1983.

(ii) Dutt. & Sundaram. k.P.M. : Indian Economy. 2004.

(iii) Agarwal, A.N. : Indian Economy, Problems of Dovelopment & Planning. 2000

(iv) P.K. Dhar : Indian Ecomony - Its growing Dimensions 2002.

(v) .Dhingra, I.C. : Indian Economy, 2003.

(vi) Mishra & Puri : Indian Economy, 2002.

(vii) Economic Survey : 2000-01, 2001-02. 2002-03. Govt of Indian, New Delhi.

(viii) C.S.D 'S Publications, Govt. of India, New Delhi.

(ix) Uma Kapila (Ed) : Indian Economy Since Independence, 2000-01

(x) J.S. Uppal : Indian Economic Problems, 1987.

(xi) Sinha, R.K. : Economic Development Since Independance 1988.

(xii) Broj Kishore & B.P. Singh : Indian Economy Through plans, 1981.

(xiii) Edward Shapiro : Mano Economic Analysis, 1993.

(xiv) S.P. Gupta : Statistical Methods, 1990.

(xv) V.K.R.V. Rao : Changing Structure of the Economy in Uma kapila (R.d)., Inidan Economy Since Indenpendance. 2000-01.

(xvi) .G. Durga Prasad : Growth Rates of Indian Economy. An Analysis of Pre and post Reform Period ; in

పాఠం - 3

జనాభా, పేదరికం

3.0 లక్ష్యము :

ఈ పాఠ్యాంశం పూర్తయ్యేసరికి మీరు క్రింది విషయాలను అవగాహన చేసుకుంటారు.

- జనాభా పరిణామ సిద్ధాంతం
- భారతదేశంలో జనాభా పెరుగుదల స్వభావము (1891 నుంచి 2001 వరకు)
- భారతదేశంలో జనన, మరణాల రేట్లు
- భారతదేశంలో జనసాంద్రత, వయోవర్గాల వారి జనాభా, నగరీకరణ స్వభావం.
- భారతదేశంలో అక్షరాస్యతా వృద్ధి
- జనాభా - పేదరికానికి గల సంబంధం.

పాఠ్యాంశ నిర్మాణ క్రమం :

3.1 విషయ పరిచయం

3.2 జనాభా సిద్ధాంతాలు

3.3 జనాభా పరిణామ సిద్ధాంతం

3.4 భారతదేశంలో జనాభా పరిమాణం - జనాభా వృద్ధి రేట్లు

3.5 భారతదేశంలో జనన, మరణాల రేట్లు

3.6 భారతదేశంలో జనసాంద్రత, స్త్రీ-పురుష నిష్పత్తి

3.7 భారతదేశంలో వయోవర్గాల జనాభా

3.8 భారతదేశంలో పట్టణ జనాభా

3.9 భారతదేశ రాష్ట్రాల్లో పట్టణీకరణ

3.10 భారతదేశ జనాభా నాణ్యత

3.11 భారతదేశంలో వృత్తి వారీ శ్రమ విభజన

3.12 జనాభా - పేదరికం

3.14 సారాంశం

3.15 కఠిన పదాలు

3.16 చదువవలసిన పుస్తకాలు

3.1 విషయ పరిచయం :

ఒక దేశ ఉత్పత్తి పరిమాణం ఆ దేశంలోని భౌతిక, మానవవనరులపై ఆధారపడి ఉంటుంది. ఒక దేశ జనాభానే ఆ దేశ మానవ వనరులని కూడా అంటారు. దేశ ఆర్థిక శ్రేయస్సును అంచనా వేయటానికి మానవ వనరుల పరిశీలన ఎంతో ఆవశ్యకం. ఉత్పత్తికి కారణభూతం జనాభా, చేసిన ఉత్పత్తిని ఉపయోగించేది కూడా జనాభాయే మానవ వనరుల పరిమాణం, మానవ వనరుల సామర్థ్యం భిన్న అర్థాలనిస్తాయి. మానవ వనరుల పరిమాణం అంటే సంఖ్యాపరంగా జనాభా మానవ వనరుల సామర్థ్యం కేవలం సంఖ్యా పరంగానే కాక వారి నాణ్యతను (విద్యాస్థాయి, ఆరోగ్యం, పౌష్టికాహారం, వివిధ వయోవర్గాలు, పంపదల్లో అసమానతలు,

నిరుద్యోగం మొదలైన అంశాలను బట్టి) తెలియ జేస్తుంది. ఏ దేశంలో మానవ వనరుల సామర్థ్యం ఎక్కువగా ఉంటుందో, ఆ దేశంలో సహజ వనరులను ఉపయోగించుకునే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది కావున ఉత్పత్తి స్థాయి, ఉత్పాదకత ఎక్కువగా ఉంటుంది.

ఒక దేశంలోని జనాభా పెరుగుదల అభిలషణీయ స్థాయి చేరేవరకు అంటే ఉన్న సహజవనరులను సమర్థవంతంగా ఉపయోగించే స్థాయి వరకు దేశాభివృద్ధికి దోహదం చేస్తుంది. కాని అధిక జనాభా అనేక ఆర్థిక, సామాజిక సమస్యలకు కారణమై దేశ ప్రగతిని దెబ్బతీస్తుంది. జనాభా త్వరితగతిని పెరుగుతూ ఉన్నందున ఏర్పడే వివిధ ఆర్థిక సమస్యలు చివరకు దేశ పేదరికానికి దారితీస్తాయి. ప్రపంచంలోని పేదదేశాలలో దాదాపు అన్ని దేశాలు అధిక జనాభాను కలిగి ఉన్నట్లు గణాంకాలు వెల్లడి చేస్తున్నాయి.

ఈ పాఠ్యభాగంలో మనం జనాభా సిద్ధాంతాలను, భారతదేశంలో 1951 కి పూర్వం మరియు 1951 తరువాత జనాభా పెరుగుదల ధోరణులు, జనాభా - పేదరికం మధ్యగల సంబంధాన్ని గురించి తెలుసుకుందాం.

3.2 జనాభా సిద్ధాంతాలు :

జనాభాను గూర్చి అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలలో ముఖ్యుడు రాబర్ట్ మాల్థస్. మాల్థస్. మాల్థస్ జనాభా సిద్ధాంతం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సిద్ధాంతం. మాల్థస్ దృష్టిలో జనాభా పెరుగుదల ఆర్థికాభివృద్ధికి ప్రతిబంధకం. మాల్థస్ అభిప్రాయంలో ఆహారపదార్థాలు అంకశ్రేఢిలో పెరిగితే జనాభా గుణశ్రేఢిలో పెరుగుతుందని, ఈ పెరుగుచున్న జనాభాను నియంత్రించక పోతే కరవుకాటకాలు, భూకంపాలు, వరదలు మొదలైన ప్రకృతి భీభత్సావాలు ఏర్పడి జనాభా నియంత్రించ బడుతుందని అంటారు. ఈ సహజ నియంత్రణ పరిస్థితులు ఏర్పడకుండా ఉండాలంటే ప్రజలు కృత్రిమ జనాభా నివారణ చర్యలు తీసుకోవాలని అంటారు. అందుకోసం ఆలస్య వివాహాలు బ్రహ్మచర్యం లాంటి చర్యలను జనాభా చేపట్టాలని మాల్థస్ భావించాడు. మాల్థస్ దృష్టిలో జనాభా పెరుగుదలను నిరాశావాద దృష్టితోనే చూచాడు. జనాభా పెరుగుదల ఉత్పత్తి, పెంచుతుందని, తత్ఫలితంగా దేశ ఉత్పత్తి ఆదాయ స్థాయిలు పెరుగుతాయనే కోణంలో మాల్థస్ పరిశీలన చేయలేదు. మాల్థస్ సిద్ధాంతం సర్వాంగీకారం కాకపోవటం వల్లనూ, సిద్ధాంతంలో ఉన్న లోపాల వల్ల మరో సిద్ధాంతం రూపొందించటం జరిగింది. దీనినే అభిలషణీయ జనాభా సిద్ధాంతం లేదా ఆధునిక జనాభా సిద్ధాంతమని అంటారు.

అభిలషణీయ జనాభా సిద్ధాంతం ప్రకారం జనాభాను మూడు రకాలుగా వర్గీకరించటం జరిగింది. (1) అల్ప జనాభా (2) అభిలషణీయ జనాభా (3) అధిక జనాభా. ఒక దేశంలో ఉన్న సహజ వనరులను సంపూర్ణంగా ఉపయోగించుకోవటానికి ఏ పరిమాణంలో జనాభా అవసరమో ఆ జనాభాను అభిలషణీయ జనాభా అంటారు. అభిలషణీయ జనాభా ఉన్న దేశంలో తలసరి ఆదాయం గరిష్టంగా ఉంటుంది. అంతకన్నా జనాభా తక్కువగా ఉంటే అల్ప జనాభా అని, అంతకు మించి ఉంటే అధిక జనాభా అని అంటారు. అల్ప జనాభా ఉన్న దేశాల్లో జనాభా పెరుగుదల వాంఛనీయం. ఎందుకంటే ఆ దేశాల్లో జనాభా పెరుగుతూ ఉంటే వనరుల వినియోగం పెరిగి జాతీయ, తలసరి ఆదాయాలు పెరుగుతాయి. అధిక జనాభా దేశానికి వాంఛనీయం కాదు. అధిక జనాభా ఉన్నదేశాలు జనాభాను నియంత్రించుకోవలసి ఉంటుంది. లేనిచో పెరుగుచున్న జనాభా ఆర్థికాభివృద్ధిని నిర్వీర్యం చేస్తుంది. తలసరి ఆదాయం తక్కువగా ఉంటుంది. ప్రజలు నిరక్షరాస్యులుగా ఉండి బాల్య వివాహాలు చెయ్యటం, మత ఆచారాలకు కట్టుబడి ఉండటం, సాంఘిక కట్టుబాట్లు, అధిక సంతానంపై ఆసక్తి కలిగి ఉండటం వల్ల జననాల రేట్లు ఎక్కువగా ఉంటాయి. అయితే ప్రజల తలసరి ఆదాయం తక్కువగా ఉన్నందువల్ల ఆహార, ఆరోగ్య సదుపాయాలను సమృద్ధిగా పొందలేరు. ఆర్థిక వ్యవస్థలో వైద్య సదుపాయాల కొరత, పౌష్టికాహారలోపం, అపరిశుద్ధ వాతావరణం మొదలైన కారణాల వల్ల మరణాలరేటుకూడా ఎక్కువగా ఉంటుంది. జనన మరణాల రేట్లు ఈ దశలో అధికంగా ఉన్నందున జనాభా దాదాపు స్థిరంగా ఉంటుంది. ఈ దశలో వృద్ధి సాధించగలిగే సామర్థ్యం ఆర్థిక వ్యవస్థలో ఉన్నా వాస్తవానికి తక్కువ వృద్ధి మాత్రమే ఉంటుంది.

3.3 జనాభా పరిణామ సిద్ధాంతం :

ఈ సిద్ధాంతం కాలక్రమంలో జనాభా మార్పు చెందే ధోరణిని తెలియ జేస్తుంది. జనాభా పరిణామ సిద్ధాంతము మూడు దశలలో జనాభా పెరుగుదలను వివరిస్తుంది. ఈ సిద్ధాంతం దేశంలోని జనన, మరణాల రేట్లలోని మార్పులు తదనుగుణంగా ఆర్థికాభివృద్ధికి గల సంబంధాన్ని వివరిస్తుంది.

3.3.1 మొదటి దశ :

జనాభా పరిణామ సిద్ధాంతం మొదటిదశలో జనన మరణాల రేట్లు అధికంగా ఉంటాయి. అందుచెత జనాభా దాదాపు స్థిరంగా (మార్పు లేకుండా) ఉంటుంది. ఈ దశ వ్యవసాయ ప్రాధాన్యత ఉన్న వెనుకబడ్డ దేశాల్లో ఉంటుంది. వెనుకబడిన దేశాల్లో ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ప్రాధాన్యత కలిగి ఉంటుంది. పురాతన పద్ధతుల్లో వ్యవసాయం, అధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉండటం వల్ల జాతీయాదాయం తక్కువగా ఉంటుంది.

3.3.2 రెండో దశ :

ఈ దశలో జననాల రేట్లు ఎక్కువగా ఉంటాయి, మరణాల రేటు తగ్గి ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తుంది. ఆర్థిక అభివృద్ధి జరిగే స్థితిలో ప్రజల ఆదాయ స్థాయి పెరుగుతుంది. ఆదాయం పెరిగినందున ప్రజలు పౌష్టికాహారం తీసుకొంటారు. ప్రభుత్వం కూడా వైద్య సదుపాయాలను పెంచటం, అంటురోగాలను నిర్మూలించే చర్యలు చేపట్టటం మొదలైన చర్యలు తీసుకుంటుంది. ఈ కారణాల వల్ల మరణాల రేటు తగ్గుతుంది. అయితే జననాల రేటు ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఈ రేటు సాంఘీక పరిస్థితులు, ఆచార అలవాట్లు, మూఢ నమ్మకాలు ఆలోచనా విధానంలో మార్పులపై ఆధారపడి ఉంటుంది. వీటిలో మార్పు అంత త్వరితంగా రాదు. అందుచేత జననాలరేటు ఎక్కువగా ఉంటుంది.

మరణాల రేటు తగ్గి, జననాల రేట్లు ఎక్కువగా ఉన్నందున జనాభాలో పెరుదల త్వరితంగా ఉంటుంది. ఈ పరిస్థితిని 'జనాభా విస్ఫోటం' అంటారు.

3.3.3 మూడో దశ:

ఈ దశలో తగ్గిన మరణాల రేటుకు అనుగుణంగా జననాల రేటు కూడా తగ్గుతుంది. ఆర్థికాభివృద్ధి జరుగుచున్న స్థితిలో, అభివృద్ధి చెందుచున్న దేశాలలో వ్యవసాయ రంగ ప్రాధాన్యత తగ్గి పాక్షికంగా పారిశ్రామికీకరణ జరుగుతుంది. ప్రజలు వ్యవసాయరంగం నుంచి పారిశ్రామిక రంగానికి, పల్లెల నుంచి పట్టణాలకు తరలుతారు. స్త్రీలు ఉత్పత్తి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. ప్రజల్లో అక్షరాస్యత, విద్య వ్యాప్తి చెందుతుంది. నగరీకరణ విస్తరిస్తుంది. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో పల్లెల్లోని ప్రజలు సంతానం భారమని భావించటం, పట్టణాల్లోని ప్రజలు వారి జీవనప్రమాణ స్థాయిని నిలబెట్టుకోవడం కోసం చిన్న కుటుంబ ప్రాముఖ్యతను గుర్తించటం జరుగుతుంది. స్త్రీలు పని పాటల్లో పాల్గొన్నందువల్ల ఎక్కువ మంది పిల్లలను సంరక్షించటం కూడా సాధ్యం కాదు. ఈ విభిన్న కారణాల వల్ల జననాల రేటు తగ్గుతుంది. ఈ విధమైన సాంఘీక ఆర్థిక కారణాలవల్ల జననాల రేటు తగ్గుతుంది. కావున జనన, మరణాల రేట్లు ఈ దశలో తక్కువగా ఉంటాయి. ఆర్థిక వ్యవస్థ ఈ దశలో చేరినట్లయితే జనాభా సమస్య పరిష్కారమైనట్లే చెప్పవచ్చు. ఈ దశ ప్రారంభమైతే ఆర్థిక వ్యవస్థలలోని కీలకస్థితి అయిన జనాభా విస్ఫోటం అంతరించినట్లుగా చెప్పవచ్చు.

జనాభా పరిణామ సిద్ధాంతం ద్వారా మనం అధిక జనన, మరణాల రేట్లు ఉన్న పురాతన ఆర్థిక వ్యవస్థ నుంచి తక్కువ జనన, మరణాలు కలిగిన ఆర్థిక వ్యవస్థగా పరిణామక్రమాన్ని తెలుసుకోవచ్చు. జనాభా పరిణామ సిద్ధాంతంలోని మొదటి దశలో అధిక జనన, మరణాలతో సమతూకంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ, రెండో దశలో అసమతూకం ఏర్పడుతుంది. జననాలు ఎక్కువగానే ఉంటూ మరణాలు తగ్గటం జరుగుతుంది. ఎందుకంటే మరణాలు తగ్గించటం అనేది పౌష్టికాహారం, వైద్య సదుపాయాలు, వ్యాధులను నిరోధించటం, మొదలైన అంశాలపై ఆధారపడి ఉంటుంది. కావున వీటిని ప్రజలు వెంటనే స్వీకరిస్తారు. అయితే జననాల రేటు

తగ్గించటం అనేది ప్రజలు సామాజిక మార్పుపై అంటే ఆచారాలు, నమ్మకాలు, విశ్వాసాలు, మత విశ్వాసాలు మొదలైన అంశాలపై ఆధారపడి ఉంటుంది. వీటిలో మార్పు రావటానికి ఎక్కువ కాలం పడుతుంది. అందుచేత జనన, మరణాల మధ్య ఉన్న వ్యత్యాసాలు సర్దుకొని సమతూకం ఏర్పడటానికి ఎక్కువ సమయం అవసరమౌతుంది. ఈ కాలంలో జనాభా పరమైన మార్పులు చోటు చేసుకొని జనన, మరణాలు తక్కువ స్థాయితో సమతూకం ఏర్పడి జనాభా తగ్గుతుంది. ఆ తరువాత మూడో దశ ఏర్పడి కొనసాగుతుంది.

3.4 భారతదేశంలో జనాభా పరిమాణం - జనాభా వృద్ధి రేట్లు:

ప్రపంచ భౌగోళిక విస్తీర్ణంలో 2.4 శాతం కలిగి ఉన్న భారతదేశం జనాభాలో 16.85 (దాదాపు 17) శాతం కలిగి ఉంది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న దేశం చైనా కాగా రెండోస్థానం భారతదేశం ఆక్రమిస్తుంది. అభివృద్ధి చెందుచున్న దేశాల జనాభాలో భారతదేశం 19.96 శాతం ఉందని అంచనా. 2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 1027.1 మిలియన్లు, సగటున సాంవత్సరిక వృద్ధి రేటు 1.93. భారతదేశ జనాభా పరిమాణం, వృద్ధి రేట్లు పట్టిక 3.1 లో పొందుపరచటం జరిగింది.

గత శతాబ్ధకాలంలో భారతదేశ జనాభా క్రమక్రమంగా పెరుగుచున్ననూ జనాభా వృద్ధి తీరు వివిధ రకాలుగా కొనసాగుతూ ఉంది. జనాభాలో వచ్చిన మార్పులను కింది పట్టిక - తెలియ జేస్తుంది. భారతదేశ జనాభా పెరుగుదలను ఆధారంగా చేసుకొని గత శతాబ్దాన్ని నాలుగు దశలుగా చెప్పవచ్చు. అవి : 1. నిశ్చల జనాభా (1891-1921), 2. క్రమంగా జనాభా వృద్ధి (1921-1951), 3. ఎక్కువ రేటులో త్వరితంగా జనాభా వృద్ధి (1951-1981), 4. అధిక వృద్ధితో పాటు జనాభా తప్పని సరిగా తగ్గుతుందనే లక్షణాలతో జనాభా వృద్ధి (1981-2001).

పట్టిక నం 3.1
భారత దేశంలో జనాభా వృద్ధి

జనాభా గణన సం॥ము	జనాభా (మిలియన్లలో)	పెరుగుదల/తగ్గుదల (మిలియన్లలో)	పెరుగుదల/తగ్గుదల శాతం	జనాభా వృద్ధి స్వభావం
1891	236	0.0	0.0	
1901	236	+16	+5.7	
1911	252	-1	-0.3	
1921	251	+15	+0.19	
1891 నుంచి 1921				నిశ్చల జనాభా
1931	279	+28	+11.0	
1941	319	+40	+14.2	
1951	361	+42	+13.3	
1921 నుంచి 1951		+110	+1.22	క్రమంగా వృద్ధి
1961	439	+78	+21.5	
1971	548	+109	+24.8	
1981	683	+135	+24.7	
1951 నుంచి 1981		+322	+2.14	ఎక్కువ రేటులో త్వరితంగా వృద్ధి
1991	844	+161	+23.5	అధిక వృద్ధితో పాటు
2001	1027	+183	+21.3	జనాభా తప్పని సరిగా తగ్గుతుందనే లక్షణాలు

మూలం : Census of India 2001, Series 1, Paper 1 of 2001, Provisional Populaltion Tables.

భారతదేశంలోని మొదటి దశ 30 సం॥ల కాలంలో (1891 - 1921) జనాభా 236 మిలియన్ల నుంచి 251 మిలియన్లకు మాత్రమే పెరిగింది. అంటే ఈ 30 సం॥లలో పెరిగిన జనాభా 15 మిలియన్లు, ఈ కాలంలో జనాభా వార్షిక పెరుగుదల రేటు 0.19 శాతం. ఈ పెరుగుదల రేటు అతి స్వల్పమైనది. మొదటి దశ 30 సం॥ల కాలంలో జననాలు, మరణాలు అధికంగాను దాదాపు సమానంగా ఉన్నందున జనాభా పెరుగుదల స్వల్పంగా ఉంది. ఈ 30 సం॥ల కాలంలో భారతదేశం జనాభా పరిణామ సిద్ధాంతంలోని మొదటి దశను కలిగి ఉంది. ఈ దశను నిశ్చల జనాభా కలిగి ఉన్న దశగా చెప్పవచ్చు.

రెండో దశ కాలం 30 సం॥లలో (1921-1951) జనాభా 251 మిలియన్ల నుంచి 361 మిలియన్లకు పెరిగింది. ఈ 30 సం॥ల కాలంలో జనాభా పెరుగుదల 110 మిలియన్లు కాగా జనాభా పెరుగుదల రేటు 1.22. ఆ రెండో దశలో జనాభా పెరుగుదలకు కారణం మరణాల రేటు వెయ్యికి 49 నుంచి 27కు తగ్గటం. మరణాల రేటు తగ్గుదలకు కారణాలలో ప్లేగు, కలరా, మశూచి మొదలైన అంటువ్యాధుల నియంత్రణను ముఖ్యంగా చెప్పవచ్చు. అయితే జననాల రేటు మాత్రం అతిస్వల్పంగా తగ్గింది.

మూడో దశ కాలమైన 30 సం॥లలో (1951-1981) జనాభా 361 మిలియన్ల నుంచి 683 మిలియన్లకు పెరిగింది. ఈ 30 సం॥లలో జనాభా రికార్డు స్థాయిలో అంటే 322 మిలియన్లు పెరగగా సాంవత్సరిక జనాభా వృద్ధి రేటు 2.14 (గత దశకన్నా రెట్టింపు). ఈ దశలోనే జనాభా విస్ఫోటం సంభవించింది. భారతదేశం ప్రణాళిక బద్ధమైన ఆర్థికాభివృద్ధి సాధించటం, హెచ్చు స్థాయిలో ఆసువత్రులు, వైద్య సదుపాయాలు పెంపొందించటం వల్ల మరణాలను తగ్గించటం వల్ల మరణాల రేటు వెయ్యికి 15కు తగ్గింది కాని జననాల రేటు మాత్రం 40 నుంచి 37 కు మాత్రమే తగ్గింది. అందుచేత జనాభా విస్ఫోటం ఈ దశలో సంభవించటం జరిగింది.

ఇక నాలుగో దశ కాలమైన 20 సం॥లలో (1981-2001) భారతదేశం అధిక జనాభా వృద్ధి కలిగి తప్పని సరిగా జనాభా వృద్ధి తగ్గుతుందనే స్థితికి చేరటం జరిగింది. ఈ 20 సం॥లో జనాభా 683 మిలియన్ల నుంచి 1027 మిలియన్లకు పెరిగింది. ఈ పెరుగుదల 344 మిలియన్లు, జనాభా పెరుగుదల రేటు మాత్రం గత దశలో ఉన్న 2.14 నుంచి 1.93 కు తగ్గింది. భారతదేశంలో వస్తున్న సాంఘీక, సాంస్కృతిక, ఆర్థిక కారణాలవల్ల రాబోయే కాలంలో జననాల రేట్లు మరింత తగ్గి, జనాభా వృద్ధి రేటు తగ్గగలదు.

గత శతాబ్ధ కాలంలో భారతదేశ జనాభా పోకడలను బట్టి చూస్తే 1921 వ సం॥ము వరకు జనాభా పరిణామ సిద్ధాంతంలోని మొదటి దశ కొనసాగింది. 1921 నుంచి రెండో దశ ప్రారంభమై నేటికినీ కొనసాగుతూ ఉంది. జనాభా పరిణామ సిద్ధాంతంలోని మూడో దశలోనికి భారతదేశం ఏ సమయంలోనైనా ప్రవేశించవచ్చు.

3.5 భారతదేశంలో జనన, మరణాల రేట్లు :

జనన, మరణాల రేట్లను బట్టి జనాభా పెరుగుదల ఉంటుంది. ఈ రేట్లను ప్రాతిపదికగా చేసుకొని జనాభా పరిణామ సిద్ధాంతంలో ఒక దేశం ఏ దశలో ఉందో చెప్పడం జరుగుతుంది. దేశ ఆర్థికాభివృద్ధిని కూడా ఈ రేట్లను బట్టి చెప్పవచ్చు. భారత దేశంలో జనన, మరణాల రేట్లను కింది పట్టిక 3.2 తెలియ జేస్తుంది.

పట్టిక 3.2

భారతదేశంలో సగటు వార్షిక జనన, మరణాల రేట్లు

దశబ్దం	వెయ్యికి జననాలు	వెయ్యికి మరణాలు
1891 - 1900	45.8	44.4
1901 - 1910	48.1	42.6
1911 - 1920	49.2	48.6
1921 - 1930	46.4	36.3
1931 - 1940	45.2	31.2
1941 - 1950	39.9	27.4
1951 - 1960	40.0	22.8
1961 - 1970	41.2	18.9
1971 - 1980	37.2	15.0
1981 - 1990	32.6	11.1
1991 - 2000	25.8	8.5

మూలం : Census of India 1981, Annual Report (2000 - 2001) Ministry of Health and Family Welfare, Economic Survey (2002 - 2003)

భారతదేశంలో 1921కి పూర్వం జననాల రేటు 45.8 నుంచి 49.2 మధ్య ఉండగా మరణాల రేటు 44.4 నుంచి 48.6 మధ్య ఉన్నందువల్ల జనాభా వృద్ధి రేటు అతి తక్కువగా ఉంది. అయితే 1921 నుంచి మరణాల రేటు గణనీయంగా తగ్గుతూ 2000 నాటికి 8.5కు చేరింది. అయితే జననాల రేటు కూడా తగ్గింది కాని మరణాల రేటంత వేగంగా కాక మెల్లగా తగ్గుతూ 2000 నాటికి 25.8కి తగ్గింది. ఈ జననాల మరణాల మధ్య వ్యత్యాసం శేషించే రేటు (Survival Rate) కు కారణమై జనాభా విస్ఫోటానికి దారితీసింది. మన దేశంలో అధిక జనాభాకు కారణం జననాల రేటుకన్నా మరణాల రేటు శీఘ్రంగా తగ్గడం.

భారతదేశంలో కొన్ని ముఖ్యరాష్ట్రాల జనన, మరణాల రేట్లను పట్టిక 3.3 లో గమనిస్తే కేరళ జనన, మరణాల రేట్లు అన్నిటి కన్నా తక్కువగాను, సగటు స్త్రీ వివాహ వయస్సు ఎక్కువగా ఉంది. అధిక జననాల రేటు (32.8) కలిగిన రాష్ట్రం ఉత్తరప్రదేశ్, అధిక మరణాల రేటు (10.7) కలిగిన రాష్ట్రం ఒరిస్సా, అధిక బాల్య మరణాల రేటు (97) కలిగిన రాష్ట్రం కూడా ఒరిస్సా కాగా, అత్యల్ప సగటు స్త్రీ వివాహ వయస్సు (17.8) కలిగిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పట్టికలోని జనన, మరణాల రేట్లు గమనిస్తే, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల జననాల రేట్లు నేటికి 30కి పైగా ఉన్నాయి. మరణాల రేట్లు ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలలో 10 కంటే తక్కువ. ఆంధ్రప్రదేశ్ తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలలో స్త్రీ సగటు వివాహ వయస్సు జనాభా విధానంలో నిర్దేశించిన వివాహ వయస్సు (18 సం॥లు) కన్నా ఎక్కువగా ఉన్నట్లు చెప్పవచ్చు.

పట్టిక 3.3

భారత దేశంలోని 14 రాష్ట్రాల్లో జనన, మరణాలరేట్లు (1999)

రాష్ట్రం	జననాల రేటు	మరణాల రేటు	శిశు మరణాల రేటు(IMR)	స్త్రీలలో నగటు వివాహ వయస్సు
1. కేరళ	18.0	6.4	14	22.3
2. తమిళనాడు	19.3	8.0	52	20.2
3. ఆంధ్రప్రదేశ్	21.7	8.2	66	17.8
4. మహారాష్ట్ర	21.1	7.5	48	19.1
5. కర్ణాటక	22.3	7.7	58	19.4
6. పశ్చిమ బెంగాల్	20.7	7.1	52	19.5
7. పంజాబ్	21.5	7.4	53	20.3
8. ఒరిస్సా	24.1	10.7	97	19.5
9. గుజరాత్	25.4	7.9	63	20.4
10. హర్యానా	26.8	7.7	68	19.2
11. బీహార్	31.5	8.9	63	18.6
12. మధ్యప్రదేం	31.1	10.4	90	18.8
13. రాజస్థాన్	31.1	8.4	81	18.4
14. ఉత్తరప్రదేశ్	32.8	10.5	84	19.3
భారత దేశం	26.1	8.9	70	19.4

మూలం : ప్రణాళికా సంఘం, తొమ్మిదో ప్రణాళిక (1997 - 2002), Vol.I, P.23 మరియు రిజిస్ట్రార్ జనరల్ ఆఫీసు, ఇండియా.

3.6 భారతదేశంలో జన సాంద్రత, స్త్రీ-పురుష నిష్పత్తి :

జన సాంద్రత మనిషి - భూమి నిష్పత్తిని (Man - land ratio) తెలుపుతుంది. భారతదేశ జన సాంద్రతను పట్టిక 3.4ను గమనిస్తే 1901 లో నగటు చదరపు కిలోమిటరుకు 77 మంది ఉండగా, 2001 నాటికి 324కు పెరిగింది. జనాభాలో శీఘ్ర పెరుగుదల వల్ల జనసాంద్రత భారతదేశంలో క్రమక్రమంగా పెరిగింది. ఈ జనసాంద్రతను బట్టి ఒక దేశం పేదదేశమా లేక సంపన్న దేశమా చెప్పటం సాధ్యంకాదు. ఎందుకంటే అత్యధిక జనసాంద్రత కలిగిన (చదరపు కిలోమిటరుకు 336) జపాన్ అభివృద్ధి చెందిన దేశం, ఎందుకంటే అది పారిశ్రామికాభివృద్ధిని సాధించటం జరిగింది. అందువల్ల జనసాంద్రత ఉన్నా ఉన్న సహజ వనరులను అభిలషణీయంగా ఉపయోగించుకుంటూ, పారిశ్రామిక ప్రగతి, సాంకేతిక ప్రగతి సాధిస్తే దేశం సంపన్న దేశంగా మరగలదు.

భారతదేశంలో స్త్రీ, పురుష నిష్పత్తిని గమనిస్తే 1901 నుంచి 2001 వరకు 1000 మంది పురుషులకు స్త్రీలు 1000 కన్నా తక్కువగా ఉన్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం 1000 మంది పురుషులకు స్త్రీలు 933 మంది.

పట్టిక నం 3.4
భారతదేశంలో స్త్రీ, పురుష నిష్పత్తి

సంవత్సరం	జనసాంద్రత (చ.కి.మీ.కు)	1000 మంది పురుషులకు స్త్రీలు
1901	77	972
1911	82	964
1921	81	955
1931	90	950
1941	103	945
1951	117	946
1961	142	941
1971	177	930
1981	216	934
1991	267	927
2001	324	933

అయితే అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి వెయ్యి మంది పురుషులకు రష్యాలో 1070 మంది స్త్రీలు, బ్రిటన్‌లో 1060, అమెరికాలో 1050 ఉన్నారు. అభివృద్ధి చేందిన దేశాల్లో పురుషుల కన్నా స్త్రీలు ఎక్కువగా ఉంటారు.

జన్యు సంబంధంగా స్త్రీ శిశువుల శేషించే రేట్లు, స్త్రీల జీవన రేటు ఎక్కువ. కాని అభివృద్ధి చెందుచున్న భారతదేశం లాంటి దేశాల్లో ప్రకృతికి విరుద్ధంగా స్త్రీలకన్నా పురుషులే ఎక్కువగా ఉండటం గమనించవచ్చు. దీనికి కారణం స్త్రీ శిశువుల్లో, బాలికల్లో గర్భధారణ వయస్సులో గల స్త్రీలలో మరణాలు ఎక్కువగా ఉండటం. ఆడపిల్లలపై విముఖత, స్త్రీ మరణాలకు కారణమౌతున్నాయి. కాని 1991 నుంచి 2001కి స్త్రీ పురుష నిష్పత్తి 927 నుంచి 933 కు పెరగటం హర్షించ దగ్గ పరిణామం. భారతదేశంలో పురుషులకన్నా స్త్రీలు ఎక్కువగా ఉన్న రాష్ట్రం కేరళ. ఈ రాష్ట్రంలో 1000 మంది పురుషులకు 1058 మంది స్త్రీలున్నారు. 1000 మంది పురుషులకు అతి తక్కువ మంది స్త్రీలు (861) ఉన్న రాష్ట్రం హర్యానా. ఆంధ్రప్రదేశ్‌లో 1000 మంది పురుషులకు 978 మంది స్త్రీలున్నారు.

3.7 భారతదేశంలో వయోవస్థా వర్గ జనాభా:

భారతదేశంలో వయోవస్థా వర్గ జనాభా 1911 లో 0-14 వయస్సులో 38.8 శాతం, 15-60 లోపు జనాభా 60.2 శాతం, 60 ఆ పై జనాభా 1.00 శాతం ఉన్నారు. ఏ దేశంలోనైనా 15-60 సంఱల లోపు ఉన్న జనాభా శాతంపై శ్రామిక శక్తి, తద్వారా అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. మన దేశంలో 15-60 సంఱల మధ్య గల జనాభా శాతం 1911 నుంచి 1931 వరకు పెద్దగా మార్పులేదు కాని 1971 నాటికి 53.4కు తగ్గి తరువాత 1991కి 57.1 కు పెరిగింది. పట్టిక - ను గమనిస్తే 1971 నుంచి ఈ వయోవస్థా జనాభాలో వచ్చే పెరుగుదల అనుకూలమైన మర్పుగా చెప్పవచ్చు. 60 ఆపై వయస్సుగల జనాభా క్రమక్రమంగా పెరుగుచున్నట్లు గమనించవచ్చు. దీన్ని బట్టి చూస్తే ప్రజల జీవన కాలం పెరిగిందని గమనించవచ్చు. ఈ మర్పు ఆరోగ్య ప్రమాణాల్లో వచ్చిన పురోభివృద్ధిని సూచిస్తుంది. 1971 నుంచి 0-14 వయస్సులో జనాభా తగ్గుదలను బట్టి చూస్తే ప్రజలు పరిమిత కుటుంబంపై ఆసక్తి చూపుచున్నట్లు అందుచేత ఈ శాతం తగ్గినట్లు గమనించవచ్చు. 1991 గణాంకాలు భారతదేశ పురోభివృద్ధిని వెల్లడిచేస్తాయి. ఈ గణంకాలు పట్టిక 3.5 లో పొదుపరచటం జరిగింది.

పట్టిక నం 3.5

భారతదేశంలో వివిధ వయోవస్థావర్గాల్లో జనాభా శాతాలు

వరుస సంఖ్య	సంవత్సరము	వయోవస్థా వర్గాలు సం॥లలో		
		0-14	15-60	60 ఆపైన
1.	1911	38.8	60.2	1.0
2.	1921	39.2	59.6	1.2
3.	1931	38.3	60.2	1.5
4.	1961	41.0	53.3	5.7
5.	1971	41.4	53.4	5.2
6.	1981	39.7	54.1	6.2
7.	1991	36.5	57.1	6.4

మూలం : IMAR, Fact Book on Manpower, P.12 Census of India 1981, series I, India Paper 2 of 1983.

3.8 భారతదేశంలో పట్టణ జనాభా :

ఆర్థికాభివృద్ధి నగరీకరణతో ముడిపడి ఉంది. భారతదేశంలో 20వ శతబ్ద మొదటి 50 సం॥లలో ఆర్థిక స్తబ్ధత వెలకొంది. 1901 లో 11 శాతంగా ఉన్న పట్టణ జనాభా 1941 నాటికి 14¼ శాతానికి మాత్రమే పెరిగింది. అయితే 1957 లో ఇచ్చిన నవరణ నిర్వచనం ప్రకారం పట్టణ జనాభా 17.3 శాతానికి చేరింది. ఆ తరువాత క్రమక్రమంగా పెరుగుతూ 2001 నాటికి 27.8 శాతానికి చేరింది. భారతదేశ పట్టణ, గ్రామీణ, జనాభా వివరాలు పట్టిక 3.6 తెలియ జేస్తుంది.

భారతదేశంలో రెండవ, మూడవ ప్రణాళికల్లో శీఘ్ర పారిశ్రామికీకరణ కార్యకలాపాలు చేపట్టినా, పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు విస్తృతంగా ఉత్పన్నం కాకపోవడం వల్ల పట్టణ జనాభా త్వరితంగా పెరగలేదు. పాకిస్తాన్, చైనా యుద్ధాలు, దుర్భిక్ష కారణాలు కూడా నగరీకరణకు ప్రతిబంధకాలయ్యాయి. అందుచేత భారతదేశంలో పట్టణ జనాభా త్వరితంగా పెరగలేదు. కాని 1981 - 2001 మధ్యకాలంలో పట్టణ జనాభా పెరుగుదల వేగవంతం అయ్యింది. కాని ప్రపంచ దేశాలతో పోల్చితే భారతదేశం నగరీకరణలో తక్కువ స్థానంలో ఉంది. గత రెండు దశాబ్దాల కాలంలో పట్టణ జనాభా పెరుగుదల ఊపందుకున్నట్లు, భవిష్యత్తులో త్వరితంగా పెరగగలదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పట్టణ, గ్రామీణ జనాభా నిష్పత్తి కూడా ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తుంది.

పట్టిక నం 3.6

భారతదేశంలో పట్టణ, గ్రామిణ జనాభా, జనాభా వృద్ధి

గణన సం॥ము	జనాభా (మిలియన్లలో) మొత్తం జనాభా	గ్రామీణ జనాభా	పట్టణ జనాభా	మొత్తం జనాభాలో శాతం గ్రామీణ జనాభా	పట్టణ జనాభా	దశబ్దంలో పట్టణ జనాభా వృద్ధి శాతం	పట్టణ గ్రామీణ జనాభా నిష్పత్తి
1901	232.9	207.3	25.6	89.0	11.0	.....	1:8.1
1911	246.0	220.4	25.6	89.6	10.4	0.0	1:8.6
1921	244.3	216.6	27.7	88.7	11.3	+8.25	1:7.8
1931	270.8	237.8	33.0	87.8	12.2	+19.1	1:7.2
1941	309.0	265.5	43.5	85.9	14.1	+32.1	1:6.1
195.	361.1	298.7	62.4	82.7	17.3	+43.2	1:4.7
1961	439.2	360.3	78.9	82.0	18.0	+25.3	1:4.5
1971	548.2	439.1	109.1	80.1	19.9	+38.0	1:3.7
1981*	685.2	525.7	159.5	76.7	23.3	+46.8	1:3.3
1991**	844.3	627.1	217.2	74.3	25.7	+35.6	1:2.9
2001	1027.0	742.0	285.0	72.2	27.8	+31.2	1:2.6

* అస్సాం అంచనా వేసిన జనాభాతో కలిపి

**జమ్మూ, కాశ్మీర్ అంచనా వేసిన జనాభాతో కలిపి

మూలం : రిజిస్ట్రార్ జనరల్, ఇండియా.

3.9 భారతదేశ రాష్ట్రాల్లో పట్టణీకరణ :

ఆర్థికాభివృద్ధి జరుగుచూన్నట్లయితే మూడు విషయాలు చోటు చేసుకుంటాయి. అవి : 1. తలసరి ఆదాయం పెరిగి ప్రజల జీవన స్థాయి పెరుగుతుంది, 2. నిరుద్యోగితా రేటు, పరిమాణం తగ్గుతుంది, 3. దారిద్ర్యన రేఖ దిగువనున్న జనాభా శాతం తగ్గుతుంది. భారతదేశంలో పట్టణీకరణ, దాని ప్రభావం వివిధ ఆర్థిక సూచికలపై ఏవిధంగా ఉన్నది కింది పట్టిక 3.7 తెలియజేస్తుంది.

పట్టికలో ఉన్న పట్టణీకరణ, ఇతర అంశాల మధ్యగల సమసంబంధ గుణకాన్ని బట్టి పట్టణీకరణ ప్రభావం ఆర్థికాభివృద్ధిపై ఏవిధంగా ఉంటుందో చెప్పవచ్చు. పట్టణ జనాభాకు, రోజువారీ స్థాయి నిరుద్యోగితకు గల సహసంబంధ గుణకం 0.35. ఈ సహ సంబంధము ఋణాత్మకము, బలహీనమైన సహసంబంధము. పట్టణ జనాభాకు దారిద్ర్య రేఖ దిగువనున్న జనాభా శాతానికి గల సహసంబంధము 0.42. ఈ సహ సంబంధం కూడా రుణాత్మకమైనది అయితే స్వల్పమైనదిగా చెప్పవచ్చు.

అయితే పట్టణ జనాభాకు తలసరి ఆదాయానికి గల సహసంబంధ గుణకం విలువ + 0.77.

పట్టిక నం 3.7

భారతదేశంలో కొన్ని రాష్ట్రాల్లో నగరీకరణ, తలసరి ఆదాయం, నిరుద్యోగం, దారిద్రరేఖ దిగువనున్న జనాభా.

రాష్ట్రం	మొత్తం జనాభాలో పట్టణ జనాభా (2001) శాతం	తలసరి ఆదాయం వర్తమాన ధరల్లో (1996-97) రూ॥లో	నిరుద్యోగ రేటు (రోజువారీ స్థాయి, 1999 - 2003)	దారిద్ర రేఖ దిగువనున్న జనాభాశాతం (1993 - 94)
1. తమిళనాడు	43.9	13,382	11.78	35.0
2. మహారాష్ట్ర	42.4	17,825	7.16	36.9
3. గుజరాత్	37.4	16,287	4.55	24.2
4. కర్ణాటక	34.0	11,772	4.57	33.2
5. పంజాబ్	33.9	17,447	4.03	11.8
6. హర్యానా	29.0	16,454	4.77	25.1
7. పశ్చిమ బెంగాల్	28.0	9,886	14.99	35.7
8. ఆంధ్రప్రదేశ్	27.1	11,224	8.03	22.2
9. కేరళ	26.0	13,050	2.97	25.4
10. మధ్యప్రదేశ్	25.0	8,689	4.45	42.5
11. రాజస్థాన్	23.4	10,171	3.13	27.4
12. ఉత్తరప్రదేశ్	20.8	7,743	4.08	40.90
13. ఒరిస్సా	15.0	6,401	7.34	48.6
14. బీహార్	13.4	4,965	7.32	55.0
15. అస్సాం	12.7	7,394	22.21	40.9
16. హిమాచల్‌ప్రదేశ్	9.8	10,728	2.96	28.4
భారతదేశం	27.8	11,564	7.32	36.0

మూలం : 1. సెన్సస్ ఆఫ్ ఇండియా , 2001

2. ఎకనమిక్ సర్వే 2001 - 2002

3. ప్లానింగ్ కమీషన్ (1998), తొమ్మిదో ప్రణాళిక (1997 - 2002)

ఈ సహ సంబంధము ధనాత్మకము మరియు విశ్వశించదగినది (ఐరివీదీరితీరిబీబిదీశి). ఈ గణాంకాలను బట్టి పట్టణీకరణ జరుగుతూన్నట్లయితే తలసరి ఆదాయం పెరుగుతూ ఉంటుందని చెప్పవచ్చు. అయితే పట్టణీకరణ పెరుగుతూవుంటే నిరుద్యోగిత, దారిద్ర్యరేఖ దిగువ జనాభా శాతం తగ్గుతుంది. వీటి మధ్య సమసంబంధం బలహీనమైనది. అయిననూ పట్టణీకరణ ప్రభావం వీటిమీద వ్యతిరేకంగా ఉంది. కావున పట్టణీకరణ ప్రభావం ఆర్థిక వ్యవస్థలోని వివిధ ఆర్థికాంశాలపై ప్రభావితం చేసి ఆర్థికాభివృద్ధి పథంలో పయనించటానికి సహకరిస్తుంది.

3.10 భారతదేశ జనాభా నాణ్యత :

ఏ దేశ జనాభా నాణ్యతనైనా ఆ దేశ ప్రజల జీవిత కాలం, అక్షరాస్యతా స్థాయి, సాంకేతిక శిక్షణా స్థాయిపై ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో 1951వ సం॥ము నుంచి అక్షరాస్యతా శాతాలు కింది పట్టిక 3.8లో చూపటం జరిగింది.

భారతదేశంలో 1981వ సం॥ము వరకు 0-4 సం॥లలోపు పిల్లలను అక్షరాస్యతా రేట్లు లెక్కించేటప్పుడు మినహాయించటం జరిగేది. 1991 నుంచి 0-6 సం॥లలోపు పిల్లలను అక్షరాస్యతా లెక్కింపులో మినహాయించటం జరిగింది. 7 సం॥లు ఆపై వయస్సు గలవారి పురుషుల అక్షరాస్యతా శాతాలను గమనిస్తే 1981 లో 56.5 శాతం నుంచి 1991కి 64.1 శాతానికి, 2001కి 75.8కి పెరిగింది. స్త్రీల అక్షరాస్యతా శాతాలు 1981 లో 29.5 శాతం నుంచి 1991కి 39.3 శాతానికి, 2001 కి 52.1 శాతానికి పెరిగింది. మొత్తం అక్షరాస్యతా శాతాలు 1981లో 43.7 శాతం నుంచి 1991 కి 52.2 శాతానికి, 2001కి 65.4 శాతానికి పెరిగింది. 1991 నుంచి 2001కి స్త్రీ, పురుషుల అక్ష్యరాస్యతా శాతాల మధ్య వ్యత్యాసం తగ్గింది.

పట్టిక 3.8

భారతదేశంలో అక్షరాస్యతా శాతాలు

సంవత్సరం	పురుషుల అక్ష్యరాస్యత	స్త్రీల అక్షరాస్యత	మొత్తం అక్షరాస్యత
1951	27.2	8.9	18.3
1961	40.4	15.3	28.3
1971	46.0	22.0	34.5
1981	53.4	28.5	41.4
	(56.5)	(29.5)	(43.7)
1991	64.1	39.3	52.2
2001	75.8	52.1	65.4

మూలం : Census of India, Series I, India, Paper I of 2001

Note : 1951, 1961, 1971, 1981 సం॥ల అక్షరాస్యతా రేట్లు 5 సం॥లు ఆపై వారివి.
1991, 2001 సం॥ల రేట్లు 7 సం॥లు ఆ పై వయస్సు గలిగిన వారివి.
1981 సం॥లో బ్రాకెట్లలో ఉన్న సంఖ్యలు 7 సం॥లు ఆ పై వయస్సుగల వారివి.

పట్టిక 3.9 ను గమనిస్తే భారతదేశంలో జన్మించినప్పుడు అంచనా వేసే జీవన వయస్సు 1961 - 71 దశాబ్ధంలో 47.1 సం॥లు పురుషులకు, 45.6 సం॥లు స్త్రీలకు ఉంది. అంతకు పూర్వంతో పోల్చితే జీవన వయస్సు గణనీయంగా పెరిగినట్లు చెప్పవచ్చు. ఈ రేట్లు 1993 - 97 నాటికి పురుషులలో 60.4 సం॥లకు, స్త్రీలలో 61.8 సం॥లకు, సగటున మొత్తం 61.1 సం॥లకు పెరిగింది. స్త్రీల జీవన వయస్సు పెరుగుదలను గమనిస్తే మన దేశంలో కూడా స్త్రీల రక్షణ విషయంలో జాగ్రత్త పెరిగిందని చెప్పవచ్చు. స్త్రీల రక్షణ విషయంలో పెరుగుదలతో పాటు అంటువ్యాధుల నిర్మూలన, వైద్య సదుపాయాల పెరుగుదల, వైద్య సిబ్బంది పెరుగుదల మొదలైన సదుపాయాలు విస్తరించటం వల్ల మరణాలు తగ్గటం తద్వారా స్త్రీల, పురుషుల జీవన వయస్సు గణనీయంగా పెరిగినట్లు చెప్పవచ్చు.

పట్టిక 3.9

భారతదేశంలో జన్మించిన సమయంలో అంచనా వేసే జీవన వయస్సు (సం॥లలో)

కాలం	పురుషులు	స్త్రీలు	మొత్తం
1911 - 21	19.4	20.9	
1921 - 31	26.9	26.9	
1931 - 41	32.1	31.4	
1941 - 51	32.4	31.7	
1951 - 61	41.9	40.6	41.2
1961 - 71	47.1	45.6	46.4
1971 - 81	54.1	54.7	54.0
1993 - 97	60.4	61.8	61.1

మూలం : Census of India, 1971, Age and Life tables and Census of India, 1981, Series -1, India Paper I of 1984 and Economic Survey (2001 - 2002)

3.11 భారతదేశంలో వృత్తి వారీ శ్రమవిభజన :

భారతదేశంలో వృత్తుల ప్రాతిపదికగా శ్రామిక వ్యవస్థను మూడు విధాలుగా అనగా ప్రాథమిక రంగం (వ్యవసాయ రంగం), ద్వితీయ రంగం (పారిశ్రామిక రంగం), తృతీయ రంగం (సేవారంగం) అని మూడు విధాలుగా విభజించవచ్చు. ఈ విభజన ప్రాతిపదికగా భారతదేశ శ్రామిక వ్యవస్థ స్వరూపాన్ని పరిశీలిద్దాం. భారతదేశంలోని వృత్తి వారీ శ్రమ విభజనను పట్టిక 3.10 లో చూపటం జరిగింది.

ఎ) 1999 - 2000 సం॥లో వృత్తి వారీ శ్రమ విభజన :

1999-2000 సంవత్సర గణాంకాల ప్రకారం భారతదేశంలో 56.7 శాతం శ్రామికులు వ్యవసాయ రంగంలో, 17.5 శాతం శ్రామికులు పారిశ్రామిక రంగంలో 25.8 శాతం శ్రామికులు సేవా రంగంలో ఉన్నారు. 1991 గణాంకాలతో పోల్చితే, వ్యవసాయ రంగంలో శ్రామికుల శాతం 1991 లో 66.8 ఉండగా 1999 - 2000 నాటికి 56.7 కు తగ్గింది. ద్వితీయ రంగంలో (పారిశ్రామిక రంగం) 12.7 శాతం నుంచి 17.5 శాతానికి, తృతీయ రంగంలో (సేవారంగం) 20.5 నుంచి 25.8 శాతానికి పెరిగింది. 1991 నుంచి 1999 - 2000 దశాబ్ద కాలంలో వ్యవసాయరంగంలో 10.1 శాతం తగ్గగా, పారిశ్రామిక రంగంలో 4.8 శాతం మరియు సేవారంగంలో 5.3 శాతానికి పెరిగింది.

పట్టిక నం 3.10

భారతదేశంలో వృత్తుల వారీ శ్రామికుల వర్గీకరణ (శాతాలలో)

రంగం/వృత్తి	1901	1951	1961	1971	1981	1991	1999-2000
A. ప్రాథమిక రంగం (1+2+3)	71.7	72.1	71.8	72.1	68.8	66.8	56.7
1. వ్యవసాయ దారులు	50.6	50.0	52.8	43.4	41.6	38.4	
2. వ్యవసాయ కూలీలు	16.0	19.7	16.7	26.3	24.9	26.4	
3. పశువుల పెంపకం,అడవులు, మత్స్యపెంపకం మొదలైనవి.	4.2	2.4	2.3	2.4	2.3	1.9	
B. ద్వితీయ రంగం(4+5+6) 12.6	10.7	12.2	11.2	13.5	12.7	17.5	
4. మైనింగ్ మరియు క్వారీయింగ్	0.1	0.6	0.5	0.6	0.6	0.6	0.7
5. తయారీ పరిశ్రమ	11.7	9.0	10.6	9.5	11.3	10.2	12.4
6. నిర్మాణం	0.8	1.1	1.1	1.1	1.6	1.9	4.4
C. తృతీయ రంగం(7+8+9)	15.7	17.2	16.0	16.7	17.7	20.5	25.8
7. వర్తక, వాణిజ్యం	6.1	5.2	4.0	5.6	6.2	7.5	11.1
8. రవాణా, నిల్వ, కమ్యూనికేషన్లు	1.1	1.5	1.6	2.4	2.7	2.8	4.1
9. ఇతర సేవలు	8.5	10.6	10.4	8.7	8.8	10.2	10.6
మొత్తం	100.0	100.0	100.0	100.0	100.0	100.0	100.0

బి) ప్రణాళికల పూర్వం వృత్తి వారీ శ్రమ విభజన (1901 - 1951):

పట్టిక ను గమనిస్తే భారతదేశంలో ప్రాథమిక రంగం పై ఆధారపడ్డ శ్రామికులు 1901 లో 71.7 శాతం ఉండగా 1951 నాటికి 72.1 కి అనగా 0.4 శాతం పెరిగింది. పారిశ్రామిక రంగంలో శ్రామికులు 1901లో 12.6 శాతం ఉండగా 1957కి 10.7 శాతానికి, అంటే 1.5 శాతానికి తగ్గింది. సేవా రంగంలో 15.7 నుంచి 17.2 శాతానికి అంటే 2 శాతానికి పెరిగింది.

గణాంకాలను పరిశీలిస్తే, 1901 - 1951 కాలంలో పారిశ్రామిక శ్రామికుల శాతం తగ్గి, వ్యవసాయ రంగంలో శాతం నామ మాత్రం పెరగగా, సేవా రంగంలో ఎక్కువ శాతం పెరిగింది. ఈ గణాంకాలను బట్టి చూస్తే పారిశ్రామిక శ్రామికులు సేవా రంగానికి తరలినట్లు కనిపిస్తుంది. ఈ మార్పుకు కారణము బ్రిటీషు పాలనలో పారిశ్రామిక రంగం దెబ్బతినడంతో పాటు, బ్రిటీషు పాలకులకు వ్యక్తిగత సేవలంచించేవారు, సైనిక, ఇతర సేవల్లో భారతీయులను ఉపయోగించుకున్నందున సేవారంగ శాతం పెరిగినట్లుగా, పారిశ్రామికరంగం శాతం తగ్గినట్లుగా చెప్పవచ్చు.

సి) ప్రణాళికా కాలంలో వృత్తి వారీ శ్రమవిభజన (1951-2000) :

భారత ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన కృషి ప్రారంభించిన తరువాత వ్యవసాయరంగంలోని కార్మికులను పరిశ్రమ, సేవా రంగాలలోకి తరలించే ప్రయత్నాలు ప్రారంభించింది. రెండో ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి అధిక ప్రాముఖ్యతను ఇవ్వడంతో పాటు సేవా రంగాన్ని విస్తరించే ప్రయత్నాలు చేసింది.

పట్టిక లోని సమాచారాన్ని గమనిస్తే 1951 నుంచి 1971 వరకు వ్యవసాయరంగంలో మార్పు దాదాపుగా లేకపోగా (దాదాపు 72. శాతం) 1981 లో 68.8 శాతానికి, 1991లో 66.8 శాతానికి, 1999 - 2000 లో 56.7 శాతానికి తగ్గింది. వ్వసాయరంగంలో గణనీయమైన తగ్గుదల 1991 తరువాతనే సంభవించింది. పారిశ్రామికరంగంలో శ్రామికుల శాతాన్ని గమనిస్తే పారిశ్రామికరంగం శాతం 1951 నుంచి 1991కి ఒడుదుడుకులకు గురౌతూ 1991 తరువాత గణనీయంగా పెరిగింది. శ్రామిక రంగంలో శాతాన్ని పరిశీలిస్తే 1951 లో 17.2 శాతం ఉన్న శ్రామికులు 1961, 1971 లో తగ్గి తరువాత 1981 లో 17.7 శాతానికి పెరిగి ఆ తరువాత క్రమంగా పెరిగి 1999-2000 సంలో 25.8 శాతానికి పెరిగింది.

ప్రణాళికా కాలంలో వృత్తి వారీ శ్రమ విభజనలో గణనీయమైన మార్పు 1951 నుంచి 1991 వరకు లేదని గణాంకాలు వెల్లడి చేస్తున్నాయి. అందుకు కారణంగా పెరుగుచున్న జనాభాకు వ్యవసాయేతర ఉపాధి నదుపాయాలు లేనందున వ్యవసాయరంగం పైనే ఆధారపడటం, (2) వ్యవసాయ రంగంలోని హరిత విప్లవం పంజాబు, హర్యానా, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్‌లకు మాత్రమే పరిమితమై శ్రమ విభజనపై ప్రభావం చూపక పోవటం, (3) పారిశ్రామికీకరణలో మూలధన సాంద్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం మొదలైనవి చెప్పవచ్చు.

వృత్తిపర శ్రమ విభజనలో గణనీయమైన మార్పు 1991 నుంచి 1999-2000 మధ్య కాలంలో వచ్చినట్లు చెప్పవచ్చు. ఈ దశాబ్దంలో సేవారంగం విస్తరించింది. వర్తక వాణిజ్యాలలో వ్యక్తిగత సేవలు గణనీయంగా పెరిగాయి. గృహ రంగంలో, చిన్న పరిశ్రమల్లో, గృహనిర్మాణ రంగంలో పెరుగుదల సంభవించింది. ఈ మార్పుకు కారణం ప్రభుత్వం అవలంభించిన నిర్మాణ, శ్రమ సాంద్రత విధానం కావచ్చు. 1991 తరువాత మన దేశంలో పరిశ్రమ, సేవా రంగాలు విస్తరిస్తున్నట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

3.12 జనాభా - పేదరికం :

పేదరికమనేది ఒక సామాజిక ఆర్థిక దృగ్విషయం. పేదరికాన్ని రెండు భావనల్లో పరిశలించటం జరుగుతుంది. ప్రజలు తమ కనీస అవసరాలను తీర్చుకోలేని ఆదాయాన్ని పొందుచున్నట్లయితే వారు నిరపేక్ష పేదరికంలో ఉన్నట్లుగా చెప్పవచ్చు. నిరపేక్ష పేదరికాన్ని తలసరి ఆదాయాన్ని బట్టిగాని, తీసుకొనే ఆహార పదార్థాల కేలరీలను బట్టిగాని లెక్కించటం జరుగుతుంది. కాని సాపేక్షపేదరికం ఇందుకు భిన్నమైనది. దేశంలోని విభిన్న వర్గాల యొక్క ఆదాయాన్ని లేదా వ్యయాలను పోల్చి తక్కువ. ఆదాయం లేదా వ్యయాలు చేసే వారిని పేదలుగా లెక్కించటం జరుగుతుంది. ఆదాయ లేదా వ్యయాలను పోల్చి చెప్పే పేదరికాన్ని సాపేక్ష పేదరికం అంటారు. నిరుపేక్ష పేదరికం అనే భావన అభివృద్ధి చెందని దేశాల్లో ఎక్కువ ఉపయోగించటం జరుగుతుంది. సాపేక్ష పేదరిక భావన అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా ఉపయోగిందబడుతుంది. ప్రస్తుతం ఈ భాగంలో ఉపయోగించబోతున్న పేదరికం అనే పదం నిరపేక్ష పేదరికం అనే భావనలోనే ఉపయోగించటం జరుగుతుంది.

ఏ దేశంలోనైనా జనాభా అభిలషణీయ పరిమితి చేరే వరకు ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. అయితే అధిక జనాభా ఆర్థిక ప్రగతికి గొడ్డలి పెట్టు. ప్రపంచంలోని అభివృద్ధి చెందుచున్న దేశాలన్నీ అధిక జనాభాను కలిగిఉండి పేదరికంలో కొట్టుమిట్టాడుచున్నాయి. అధిక జనాభా అనేక ఆర్థిక, సామాజిక సమస్యలకు కారణమై, ఫలితంగా పేదరికానికి దోహదం చేస్తోంది. జనాభా పెరుగుదలకు, పేదరికానికి సంబంధం ఉందనేది అందరు ఆర్థిక శాస్త్రవేత్తలు అంగీకరించే సత్యం. దేశంలో పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు పెరుగుచున్న కొద్ది జనాభా తగ్గటం జరగుచున్నట్లు గణాంకాలు వెల్లడి చేస్తున్నాయి. ఈ భాగంలో మనం జనాభా పెరుగుదల ఏవిధంగా పేదరికానికి దోహదం చేస్తోంది అనే విషయాన్ని గురించి చదువుకుందాం.

ఎ) భూమి - మానవ నిష్పత్తి తగ్గుదల :

పెరుగుచున్న జనాభా వల్ల దేశంలో భూమి-మానవ నిష్పత్తి క్రమంగా తగ్గి ఆర్థికాభివృద్ధిపై వ్యతిరేక ప్రభావాన్ని కలుగ చేస్తుంది. చదరపు కిలోమీటరుకు జనసాంద్రత త్వరితగతిని పెరుగుతూ దేశాభివృద్ధిని కుంటుపరుస్తుంది. తగ్గుచున్న భూమి - మానవ నిష్పత్తి, పెరుగుచున్న జనసాంద్రతలు ఆర్థికాభివృద్ధి ఫలాలను హరించి వేస్తాయి. తలసరి సాగు భూపరిమాణం తగ్గుతుంది. కమతాల విభజన, విఘటనల ఫలితంగా వ్యవసాయ ఉత్పాదకత ఆశించినంతగా పెరగదు. ఫలితంగా జాతీయాదాయం తగ్గుతుంది. వ్యవసాయ రంగంలో వత్తిడి పెరిగినందున అదనపు శ్రామికులకు వ్యవసాయరంగం ఉపాధి కల్పించలేక పోగా ప్రచ్ఛన్న నిరుద్యోగిత, అల్పోద్యోగితలకు కారణమై ఫలితంగా పేదరికానికి దారితీస్తున్నది.

బి) శ్రామిక సంఖ్య పెరుగుదల :

జనాభా పెరుగుదల వల్ల శ్రామిక శక్తి పెరుగుతుంది. పెరుగుచున్న శ్రామిక శక్తి వల్ల వేతనరేటు తగ్గి శ్రామికుల ఆదాయం తుగ్గుతుంది. దేశంలో నిరుద్యోగిత, అల్పోద్యోగిత మొదలైన వివిధ నిరుద్యోగితలు ఏర్పడతాయి. నిరుద్యోగిత వల్ల యువశక్తి జాతీయోత్పత్తి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉండదు. నిరుద్యోగితలో పెరుగుదల, శ్రామిక శక్తి పెరుగుదల వల్ల వేతనాల్లో తగ్గుదల ఏర్పడి ఫలితంగా పేదరికానికి కారణమై, పేదరికం పెరుగుదలకు దోహదం చేస్తోంది. పేదరిక్యం, నిరుద్యోగం అనేవి జంట సమస్యలు. వీటిలో ఒకదానికి మరొకటి కారణమై, ఫలితమై ఉంటుంది.

సి) మూలధన సంచయన తగ్గుదల :

జనాభా పెరుగుదల పేదరిక విషవలయాలను విస్తరింపచేసి పేదరిక విస్తరణకు కారణమౌతోంది. జనాభా త్వరితగతిని పెరుగుతూ ఉంటే జాతీయాదాయంలో వినియోగం పెరిగి, పొదుపు తగ్గుతుంది. పొదుపురేట్లు తగ్గటం వల్ల మూలధన సంచయనం తగ్గి తక్కువ పెట్టుబడికి దోహదం చేస్తుంది. పెట్టుబడి తగ్గటం ఉత్పత్తి తగ్గుదలకు, ఆదాయ తగ్గుదలకు దోహదం చేసి ప్రజల తలసరి ఆదాయం తగ్గి పేదరిక విస్తరణకు కారణమౌతుంది. ఈ విధంగా జనాభా పెరుగుదల మూలధన తగ్గుదలకు తత్ఫలితంగా పేదరికానికి కారణమౌతోంది.

డి) పట్టణాలకు వలస :

జనాభా పెరుగుదలవల్ల పల్లెల్లో ప్రజలకు ఉపాధి లభ్యం కానందున వారు పట్టణాలకు తరలి వెళ్ళటం జరుగుతుంది. అందుచేత పట్టణాలలో వత్తిడి పెరిగి అనేక సమస్యలకు అనగా రవాణా సదుపాయాల కొరత, మురికి వాడలు ఏర్పడటం లాంటి సమస్యలకు కారణం కావటమే కాక పట్టణాల్లో నిరుద్యోగితకు కారణమౌతుంది. పట్టణాలలో ఏర్పడ్డ నిరుద్యోగ సమస్య కారణముగా పట్టణాల్లో పేదరికం పెరుగుతోంది. ఈ విధంగా పెరిగిన జనాభా ఫలితంగా పట్టణాల్లో పేదరికం పెరుగుతోంది.

ఇ) ఆరోగ్యవ్యయం పెరుగుదల :

పెరుగుతూన్న జనాభా వల్ల ప్రభుత్వానికి ఆరోగ్య పరమైనా వ్యయం ఒకవైపు పెరగటంతో పాటు, నగటు ఆరోగ్యవ్యయం తగ్గుతుంది. కావున ప్రజల ఆరోగ్యస్థితి తగ్గి ప్రజా సంక్షేమం దెబ్బతింటుంది. తగ్గిన ప్రజా సంక్షేమము, ఆరోగ్య ప్రమాణాల వల్ల శ్రామిక ఉత్పాదకతా శక్తి తగ్గి, తక్కువ ఉత్పాదకత మరియు తక్కువ ఆదాయానికి దారితీసి పేదరికాన్ని విస్తరింపచేస్తుంది. పెరుగుచున్న ఆరోగ్య వ్యయం వల్ల ప్రత్యక్ష ఉత్పత్తి కార్యకలాపాలపై వ్యయం తగ్గి, జాతీయాదాయంలో తగ్గుదలకు కారణమై పేదరికం మరింత విస్తరించటానికి దోహదం చేస్తుంది.

యఫ్) పర్యావరణ కాలుష్యం ఏర్పడటం :

పెరుగుచున్న జనాభా భూమిపై వత్తిడిని పెంచి పర్యావరణ సమస్యలకు కారణమై చివరిగా పేదరికాన్ని పెంపొందిస్తోంది. పెరుగుచున్న జనాభా ఆహార అవసరాలు తీర్చటం కోసం సాంద్ర వ్యవసాయం, బహుళ పంటలను పండించటం, విచక్షణా రహితంగా రసాయన ఎరువులు మరియు క్రిమినాశక మందులను వాడటంవల్ల పర్యావరణం క్షీణిస్తోంది. భూసారవంతం క్షీణిస్తోంది. భూసారక్షీణత, పర్యావరణ క్షీణతల వల్ల వ్యవసాయ ఉత్పాదకతా శక్తి తగ్గి, వ్యవసాయ ఉత్పత్తులు తగ్గుతాయి. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతా శక్తి తగ్గుదల అంతిమంగా పేదరికానికి కారణమౌతోంది.

3.13 సారాంశం :

ఏ దేశ ఉత్పత్తి పరిమాణమైనా ఆ దేశ భౌతిక, మానవ సంబంధమైన వనరులపై ఆధారపడి ఉంటుంది. ఒక దేశ జనాభానే ఆదేశ మానవ వనరులు అనికూడా అంటాము. జనాభాకు ఆర్థికాభివృద్ధికి సంబంధించి పరిశీలన కోసం వివిధ జనాభా సిద్ధాంతాలు రూపొందించబడ్డాయి. మాల్థస్ సిద్ధాంతం ప్రకారం జనాభా ఆర్థికాభివృద్ధికి ప్రతిబంధకం. తరువాత రూపొందించబడిన అభిలషణీయ జనాభా సిద్ధాంతము జనాభాకు సహజవనరులకు సంబంధం చేకూర్చుతూ ఏ దేశానికైనా అభిలషణీయ జనాభా పరిమాణం వాంఛనీయమని, అభిలషణీయ పరిమాణానికి మించిన జనాభా అధిక జనాభా అని, అధిక జనాభా దేశానికి వాంఛనీయం కాదని వివరించటం జరిగింది. జనాభా పరిణామ సిద్ధాంత ప్రకారం ప్రతిదేశం మూడు దశల గుండా వయనించటం జరుగుతుందని, మొదటి దశలో జననాల, మరణాల రేట్లు హెచ్చుగా ఉంటాయని, రెండోదశలో జననాల రేట్లు హెచ్చుగా ఉండి మరణాల రేట్లు తగ్గుతాయని, మూడోదశలో జనన, మరణాల రేట్లు రెండూ తగ్గుతాయని వివరిస్తూ, ఏ దేశమైనా మూడో దశను చేరిందంటే ఆ దేశం అభివృద్ధి చెందిన దేశంగా చెప్పవచ్చని వివరించటం జరిగింది.

2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 1027 మిలియన్లు. భారతదేశం ప్రస్తుతం జనాభా పరిణామ సిద్ధాంతంలోని రెండో దశలో కొనసాగుతోంది. ఏ సమయంలోనైనా మూడో దశలో ప్రవేశించవచ్చు. 1991-2000 దశాబ్దకాలంలో భారతదేశ జననాల రేటు వెయ్యికి 25.8 కాగా మరణాల రేటు వెయ్యికి 8.5. 2001 లెక్కల ప్రకారం చదరపు కిలోమీటరుకు జన సాంద్రత 324 కాగా, 1000 మంది పురుషులకు స్త్రీలు 933 మంది ఉన్నారు. వయోవర్గ పరిమాణాన్ని బట్టి భారత దేశ జనాభాలో 1991 ప్రకారం 36.5 శాతం 0-14 సం॥ల వయస్సు కలిగిన వారు, 57.1 శాతం 15 - 60 సం॥ల వయస్సు మధ్య, 6.4 శాతం 60 సం॥లు ఆపై వయస్సు కలిగిన వారు. 2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో అక్షరాస్యతా శాతం 65.4, పురుషుల అక్షరాస్యతా శాతం 75.8 కాగా స్త్రీల శాతం 52.1. 1999 - 2000 లెక్కల ప్రకారం భారతదేశంలో వ్యవసాయరంగంలో పనిచేసే కార్మికుల శాతం 56.7, పరిశ్రమరంగంలో పనిచేసే వారిశాతం 17.5, సేవారంగంలో పనిచేసే వారి శాతం 25.8.

జనాభా పెరుగుదలకు పేదరికానికి గల సంబంధాన్ని పరిశీలిస్తే, ఒక దేశ జనాభా అభిలషణీయ పరిమాణం చేరేవరకు ఆర్థికాభివృద్ధిని ఇనుమడింప జేస్తుంది, కాని అధిక జనాభా ఆర్థికాభివృద్ధిని కుంటుపరచి పేదరికానికి దారితీస్తుంది. ప్రపంచంలోని అభివృద్ధి చెందుచున్న దేశాల్లో దాదాపు అన్ని దేశాలు అధిక జనాభా కలిగిన దేశాలే. అధిక జనాభా పరోక్షంగా అనేక ఆర్థిక సమస్యలకు

కారణమై, ఫలితంగా పేదరికానికి కారణమౌతోంది. కావున అధిక జనాభా కలిగిన దేశాలు తమ జనాభాను నియంత్రించుకోవడం ద్వారా పేదరిక సమస్యను అధిగమించవచ్చు.

3.14 స్వయం సమీక్షా ప్రశ్నలు :

వ్యాసరూప ప్రశ్నలు :

1) స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో వచ్చిన జనాభా పరమైన మార్పులను వివరించుము.

2. జనాభా - పేదరికం మధ్యగల సంబంధాన్ని చర్చించుము.

సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు :

3. భారతదేశంలో వయోవస్థావర్గ జనాభా స్వరూపం తెలుపుము.

4. భారతదేశ రాష్ట్రాల్లో పట్టణీకరణ ధోరణి.

5. జనాభా పరిణామ సిద్ధాంతం.

6. భారతదేశంలో వృత్తి వారీ శ్రమవిభజన.

3.15 కఠిన పదాలు :

1. అభిలషణీయ జనాభా : ఒక దేశంలో ఉన్న సహజవనరులను సంపూర్ణ స్థాయిలో ఉపయోగించుకోవడానికి ఎంత జనాభా అవసరమో ఆ జనాభాను అభిలషణీయ జనాభా అంటారు.

2. శిశు మరణాల రేటు : ఒక సం॥ము లోపు శిశువుల మరణాల రేటు. ఈ రేటును వేయికి లెక్కకడతాము.

3. జనాభా వృద్ధి రేటు : జననాల రేటుకు మరణాల రేటుకు మధ్య గల వ్యత్యాసమే జనాభా వృద్ధి రేటు.

4. నిరపేక్ష పేదరికం : దేశంలోని ప్రజలు తమ కనీస అవసరాలైన ఆహారం, వస్త్రం మొదలైనవి తీర్చుకోలేని ఆదాయాన్ని పొందే స్థితిని నిరపేక్ష పేదరికం అంటారు.

3.16 చదువవలసిన పుస్తకాలు :

1. Ruddar Datt and Sundaram, Indian Economy, 2004.
2. Misra and Puri, Indian Economy 2004.
3. Misra and Puri, Economics of Development and planning, 2003.
4. Census of India (2001) Series -1 (India) Paper 1 of 2001, Provisional Population Totals.
5. Planning commission, seventh five year plan.
6. Planning commission , The Approach Paper to the Ninth Five Year plan (1997-2002).
7. Registrar General of India (1996), Reports of the Technical Group of Population Projections.

పాఠం - 4

భారతదేశ జనాభా విధానం

4.0 లక్ష్యం :

ఈ పాఠం పూర్తయ్యేటప్పటికి మీరు క్రింది విషయాలు అవగాహన చేసుకుంటారు.

1. జనాభా విధానం అనగానేమి?
2. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో జనాభా విధానం
3. జాతీయ జనాభా విధానం, 1976
4. జాతీయ జనాభా విధానం 2000
5. భారతదేశ జనాభా అంచనాలు.

ముఖ్యాంశాలు :

4.1 విషయ పరిచయం

4.2 1976కు పూర్వం కుటుంబ నియంత్రణ

4.3 జాతీయ జనాభా విధానం, 1976

4.4 ఏడో ప్రణాళికలో జనాభా విధానం

4.5 ఎనిమిదో ప్రణాళికలో జనాభా విధానం

4.6 తొమ్మిదో ప్రణాళికలో జనాభా విధానం

4.7 జాతీయ జనాభా విధానం, 2000.

4.8 జాతీయ జనాభా విధానం - సమీక్ష

4.9 2016 నాటికి భారతదేశ జనాభా అంచనాలు

4.10 సారాంశం

4.11 కఠిన పదాలు

4.12 స్వయం సమీక్షా ప్రశ్నలు

4.13 చదువవలసిన పుస్తకాలు

4.1 విషయ పరిచయం

ఒక దేశ జనాభా పెరుగుదల రేటును తగ్గించేందుకు ప్రభుత్వము రూపొందించి అమలు చేసే విధానాన్ని జనాభా విధానము అంటారు. సాధారణంగా జనాభా పెరుగుదల రేటును తగ్గించేందుకు ప్రభుత్వము అమలు చేసే జనాభా విధానము నాలుగు పద్ధతులలో ఉంటుంది. అవి: 1. నైతికమైనవి 2. చట్టపరమైనవి 3. గర్భనిరోధకాలు 4. వైద్య చికిత్స. నైతిక పరమైన పద్ధతులు స్వచ్ఛందమైనవి. స్వచ్ఛందంగా వివాహాన్ని వాయిదా వెయ్యటం, ఆలస్యంగా వివాహం చేసుకొనటం, కుటుంబ పరిమాణాన్ని పరిమితంగా ఉంచుకోవటం, బ్రహ్మచర్యాన్ని పాటించటం మొదలైనవి నైతిక పరమైన పద్ధతుల్లోకి వస్తాయి. ప్రజలకు జనాభా సమస్యలపై అవగాహన కల్పించటం ద్వారా ఈ పద్ధతులను అవలంభించేట్లు చేయవచ్చు. రెండో విధమైన పద్ధతి చట్టపరమైనది. బాల్య వివాహాలను అరికట్టటం, వివాహ వయస్సును పెంపొందించటానికి ప్రభుత్వం చట్టాలను రూపొందించి జనాభా పెరుగుదల అరికట్టే పద్ధతిని చట్టపరమైనదిగా అంటారు.

జనాభాను నియంత్రించేందుకు అవలంభించే మూడో పద్ధతి గర్భనిరోధకాలు. గర్భనిరోధక సాధనాలను ప్రజలకు అందుబాటులో ఉంచటం, ఉచితంగా సప్లయ్ చేయటం, వాటిని ఉపయోగించే విషయాన్ని బహుళంగా ప్రచారం చేయటం మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. ఆఖరి పద్ధతి వైద్య చికిత్స. ఈ పద్ధతిలో జనబాలను శాశ్వితంగా నిరోధించేందుకు పురుషులకు లేదా స్త్రీలకు శస్త్ర చికిత్సలు చేయటం జరుగుతుంది. ఈ పద్ధతిని అవలంబించే వారికి వివిధ ప్రోత్సాహకాలు కూడా ఇవ్వటం జరుగుతుంది.

దేశ జనాభా ధోరణి నంతరం స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో జనాభా శీఘ్రగతిని పెరగనారంభించింది. పెరుగుచున్న జనాభా, జనాభా పెరుగుదల వల్ల ఏర్పడుచున్న సమస్యల దృష్ట్యా ప్రభుత్వం జనాభాను నియంత్రించ సంకల్పించింది. భారత ప్రభుత్వం అమలు చేసే ప్రణాళికల్లో జనాభా నియంత్రణను కూడా జతచేసి అమలు చేయటం జరిగింది.

4.2 1976కు పూర్వం కుటుంబ నియంత్రణ

భారతదేశం ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి సాధించే ప్రయత్నంలో భాగంగా జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టటం జరిగింది. జనాభాను అరికట్టేందుకు భారతదేశం చేపట్టిన మొట్టమొదటి చర్య 1952 లో అధికారికంగా కుటుంబ నియంత్రణను చేపట్టటం. మొదట భారతదేశం వైద్య చికిత్స విధానం ద్వారా (Clinical Approach) కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టటం జరిగింది. ఈ విధానం అమలుకోసం పట్టణాలలో 549, గ్రామీణ ప్రాంతాల్లో 1100 కుటంబనియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటితో పాటే అన్ని ఆసుపత్రులలో, ఆరోగ్య కేంద్రాలలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స సదుపాయాలు కల్పించింది. కాని భారతదేశానికి ఒక నిర్దిష్టమైన జనాభా విధానం లేదు.

1961 జనాభా లెక్కలలో ఊహించిన జనాభా వృద్ధిరేటుకు మించి జనాభా వృద్ధిరేటు ఉన్నందున కుటుంబ నియంత్రణ త్వరితగతిని అమలు చేయాలని ప్రభుత్వం భావించింది. మూడో పంచవర్ష ప్రణాళిక ముఖ్య లక్ష్యాల్లో జనాభా స్థిరీకరణ మూల లక్ష్యంగా, ఈ లక్ష్య సాధన కోసం కుటుంబ నియంత్రణను విస్తృతంగా ఉపయోగించాలని భావించటం జరిగింది. అయితే వైద్య చికిత్స పద్ధతి (Clinical Approach) వల్లనే జనాభా స్థిరీకరణ సాధ్యం కాదని 'Extension Approach' ని కూడా జతచేసి కుటుంబ నియంత్రణ విధానం అమలు చేయటం జరిగింది. కుటుంబ నియంత్రణ నిమిత్తం నిధులను కూడా పెంచటం జరిగింది అయితే ఈ నిధులు ఈ కార్యక్రమ అములుకు సరిపోవటం లేదని ప్రభుత్వం భావించింది.

1966 వ సం॥లో కుటుంబ నియంత్రణ కోసం ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధర్వర్యంలో ఒక అన్ని హంగులు కలిగిన కుటుంబ నియంత్రణ శాఖను ఏర్పాటు చేయటం జరిగింది. ఈ శాఖ ఆధ్వర్యంలో ప్రతి జిల్లా స్థాయిలోను కుటుంబనియంత్రణ యంత్రాంగాన్ని రూపొందించింది. అనేక సేవా సదుపాయాలను పెంపొందించింది. కుటుంబనియంత్రణను కూడా 'Cafeteria Approach' లో స్వచ్ఛందంగా ఇష్టపడే వారికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయటం జరిగింది. ఈ జనభా నియంత్రణ కోసం ప్రచార సాధనాలను విస్తృతంగా ఉపయోగించటం జరిగింది.

1966-69 సం॥లలో కుటుంబ నియంత్రణ లక్ష్యాలను ఎన్నుకొని ఆ లక్ష్య సాధన కోసం అధిక మొత్తాల్లో నిధులను ప్రభుత్వం కేటాయించింది. నాల్గవ ప్రణాళికలో కూడా అధిక మొత్తాల్లో కుటుంబ నియంత్రణ కోసం కేటాయింపులు చేసి, కుటుంబ నియంత్రణ సేవలను విస్తృతం చేసింది. అయితే ఈ చర్యల వల్ల ఆశించిన ఫలితాలు లభ్యం కానందును ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో జాతీయ జనాభా విధానాన్ని అమలు చేయటం జరిగింది.

4.3 జాతీయ జనాభా విధానం, 1976.

గతంలో భారత ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఆశించిన ఫలితాలు రానందున, జనాభా పెరుగుదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏప్రియల్ 16, 1976 న జాతీయ జనాభా విధానాన్ని రూపొందించటం జరిగింది. ఈ జనాభా విధానం వల్ల భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఒకే విధమైన చర్యలు అమలు చేయటం జరుగుతుంది. గతంలోవలే కుటుంబ నియంత్రణ పూర్తిగా వెచ్చిక విధానానికి భిన్నంగా ఆర్థికాభివృద్ధి, కుటుంబ నియంత్రణ సమాంతరంగా కొనసాగించాలని భావించటం జరిగింది. ఈ

జనాభా విధానంలోని ముఖ్య అంశాలు క్రింది విధంగా ఉన్నాయి.

1. వివాహ కనీస వయస్సు పురుషులకు 18 సం॥నుండి 21 సం॥లకు, స్త్రీలకు 15 సం॥ల నుంచి 18 సం॥లకు పెంచటం జరిగింది.
2. కేంద్ర స్థాయిలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స విధిగా పాటించాలనే చట్టం చేయలేదు కాని అవసరమైతే రాష్ట్రాలు చట్టాలు చేసుకునే అవకాశం కల్పించటం జరిగింది.
3. కుల, మత, వర్గ విచక్షణ లేకుండా ముగ్గురు పిల్లల పరిమితిని వర్తింప చేయటం
4. లోక్‌సభలో సీట్ల సంఖ్య 1971 సెన్సస్ ప్రకారమే కొనసాగుతుంది. రాబోయే 25 సం॥ల వరకు ఇదే విధంగా సీట్లు ఉంటాయి.
5. ప్రణాళికలో నిధుల కేటాయింపుకు కూడా 1971 జనాభాయే ప్రాతిపదిక
6. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సకు వేళ్ళే వారికి ద్రవ్య సహాయాన్ని పెంచటం, గ్రూపుగా వేళ్లేవారికి గ్రూపుగా ప్రోత్సాహకాలు అందించటం.

ఈ విధమైన చర్యలను అమలు చేస్తూ జనాభాను స్థిరీకరించాలని ప్రభుత్వం ఉద్దేశించటం జరిగింది. అయితే 1977 సం॥లోని అత్యవసర పరిస్థితిలో ప్రభుత్వం అమలు చేసిన నిర్భంధ కుంటుంబ నియంత్రణ విధానం అనేక సమస్యలకు దారితీసింది. అందుచేత బలవంతంగా జనాభాను అరికట్టటం సాధ్యం కాని విషయమని, ప్రజల్లో అవగాహన కల్పించటం ద్వారా కుటుంబ నియంత్రణను అమలు చేయాలని సంకల్పించటం జరిగింది.

4.4 ఏడో ప్రణాళికలో జనాభా విధానం

గత ప్రణాళికల్లో కన్పించిన లోటుపాట్లు సరిచేస్తూ, ఆరోగ్య లక్ష్యాలను పరిస్థితుల కనుగుణంగా నిర్ణయిస్తూ 2000 సం॥నాటికి నికర పునరుత్పత్తి రేటు 1(ఒకటి) ఉండేటట్లుగా కాక 2006-2011 కు ఆ రేటు సాధించే వాస్తవిక లక్ష్యంతో ఈ ప్రణాళికలో జనాభా విధానాన్ని నిర్ణయించటం జరిగింది.

భారతదేశంలో శిశు మరణాలను అరికట్టకపోతే జననాల రేటును తగ్గించటం సాధ్యం కాదని ప్రభుత్వం భావించింది. అందుకోసం మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమానికి అధిక ప్రాధ్యాన్యతను ఇవ్వటం జరిగింది. మాతా, శిశు ఆరోగ్యం పెంపొందిస్తే శిశు జీవన రేటు పెరుగుతుంది తత్ఫలితంగా కుటుంబ నియంత్రణకు వేళ్ళే అవకాశాలు పెరుగుతాయి. ప్రభుత్వం మాతా, శిశు సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత నివ్వటం, అధిక మొత్తాల్లో కేటాయింపులు చేయటం, ప్రసవాలు శిక్షణ పొందిన సిబ్బంది చేత జరిపించే విధంగా శిక్షణ పొందిన వైద్య సిబ్బందిని పెంచటం లాంటి చర్యలను ఏడో ప్రణాళికలో ప్రభుత్వం చేపట్టింది.

4.5 ఎనిమిదో ప్రణాళికలో కుటుంబ నియంత్రణ వ్యూహం

ఎనిమిదో ప్రణాళికా సంఘం తన నివేదికలో భారతదేశం ఎదుర్కొనే అతి ముఖ్యమైన ఒకే ఒక సమస్య జనాభా విస్ఫోటం అని, జనాభా వృద్ధి రేటు 2 శాతం (దాదాపు) చాలా ఎక్కువ శాతం అని, అందుచేత జనాభా నియంత్రణకు అధిక ప్రాధాన్యతను ఇవ్వటం జరగాలని భావించటం జరిగింది. నికర పునరుత్పత్తి రేటు 1 శాతం 2011-2016 నాటికి సాధ్యమౌతుందని భావించటం జరిగింది. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను గమనిస్తే 96.5 శాతం స్త్రీలు చేయించుకోగా (ట్యూబెక్టమీ), కేవలం 3.5 శాతం పురుషులు చేయించు కోవటం జరిగింది. దీన్ని బట్టి చూస్తే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకోవటంలో పురుషులు సహకరించటం లేదని, కుటుంబ నియంత్రణ కేవలం స్త్రీలకు సంబంధించిన విషయంగానే పరిగణిస్తున్నట్లు విశదమౌతుంది. కావున కుటుంబ నియంత్రణలో పురుషుల భాగ్యాన్ని పెంచటం జరిగింది.

4.6 తొమ్మిదో ప్రణాళికలో జనాభా విధానం (1997-2002)

భారతదేశంలో జనాభా పెరుగుదలకు సంబంధించిన మూడు ముఖ్య అంశాలను తొమ్మిదో ప్రణాళిక గుర్తించింది. అవి:

1) భారతదేశంలో పునరుత్పత్తి వయస్సులో ఉన్న జనాభా అధిక సంఖ్యలో ఉన్నట్లు, వారి వల్ల 60 శాతం జనాభా వృద్ధి జరుగుచున్నట్లు అంచనా వెయ్యటం జరిగింది.
2) గర్భనిరోధక సాధనాలు అవసరాలకనుగుణంగా లభ్యం కానందున జనాభా వృద్ధి 20 శాతం పెరుగుచున్నట్లు అంచనా
3) అధిక శిశు మరణాల వల్ల పునరుత్పత్తి పెరగటం చేత జనాభా 20 శాతం పెరుగుచున్నట్లు అంచనా.

ఈ అంశాలను అధిగమించే విధంగా తోమ్మిదో ప్రణాళికా విధానాన్ని రూపొందించటం జరిగింది. ఈ ప్రణాళికలో శిశు మరణాలను వెయ్యికి 50, అపరిష్కృత మృతి రేటు వెయ్యికి 23, సమగ్ర సంతతి రేటు 2002 నాటికి 2.6 కు తగ్గించే విధంగా పునరుత్పత్తి, శిశు ఆరోగ్య కార్యక్రమాన్ని రూపొందించటం జరిగింది. ఈ లక్ష్యసాధన కోసం పునరుత్పత్తి, శిశు ఆరోగ్య కార్యక్రమం కింది చర్యలను కూడా ప్రతిపాదించటం జరిగింది.

1. తల్లి ఆరోగ్యం, శిశు ఆరోగ్యం పరిరక్షణ చేస్తూ తల్లి సౌభాగ్యం, శిశు జీవన కాలం పెంపొందించటం
2. గర్భనిరోధక సాధనాలను అందుబాటులో ఉండే విధంగా సప్లయ్ పెంచటం
3. చట్టపరంగా గర్భస్రావ సదుపాలయాలను పెంపొందించటం
4. సమాజంలోని అట్టడుగు వర్గాలకు పౌష్టికాహార సేవలనందించటం
5. లైంగిక సంబంధమైన వ్యాధులను నిరోధిస్తూ, వైద్య సదుపాయాలను కల్పించటం.

ఈ లక్ష్య సాధన కోసం గతంలోని కేటాయింపు 1.8 శాతం వలే కాక 3 శాతం కుటుంబ నియంత్రణ, సంక్షేమ సేవలకోసం పెంచటం జరిగింది. ఈ ప్రణాళికా కాలం పూర్తి కాకుండానే నూతన జాతీయ జనాభా విధానాన్ని 2000 సం॥లో రూపొందించటం జరిగింది.

4.7 జాతీయ జనాభా విధానం, 2000

o భారతదేశంలో 'ఇద్దరు పిల్లలు' అనే నియమాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు, 2046 వ సంవత్సరానికి జనాభాను స్థిరీకరించే ఉద్దేశంతో నేషనల్ డోమోక్రాటిక్ ఎలియన్స్ (NDA) ప్రభుత్వం ఫ్రబవరి 15, 2000 న జాతీయ జనాభా విధానం (2000) ను అమలు చేయాలని ఉద్దేశించటం జరిగింది. ఈ విధానంలో వెంటనే స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో లక్ష్యాలను నిర్దేశించటం జరిగింది. కృత్రిమ గర్భనిరోధక సాధనాలు,ఆరోగ్య అవస్థాపనా సదుపాయాల పెంపుదల, ఆరోగ్య సిబ్బందిని పెంపొందిచటం లాంటివి వెంటనే తీసుకోవలసిన చర్యలకు సంబంధించిన లక్ష్యాలు కాగా, 2010 నాటికి సమగ్ర సంతతి రేటును తగ్గించటం స్వల్ప కాలిక లక్ష్యం. 2046 వ సంవత్సరానికి జనాభాను స్థిరీకరించటం దీర్ఘకాలిక లక్ష్యం. ఈ లక్ష్యాల సాధన కోసం భారత ప్రభుత్వం కృషిని ఆరంభించింది.

భారతదేశ నూతన జనాభా విధానం 2000లో ఉన్న ముఖ్య విషయాలు క్రింది విధంగా ఉన్నాయి.

1. 42 వ రాజ్యాంగ సవరణ ప్రకారం లోక్‌సభలో సీట్లను నిర్ణయించే ప్రాతిపదిక 1971 వ సం॥ము జనాభా పై ఆధారపడి ఉంటుంది. ఈ సవరణ ప్రకారం 2001 వ సంవత్సరం వరకు లోక్‌సభ సభ్యులు నిర్ణయించే ప్రాతిపదిక జనాభా 1971 వ సం॥ము జనాభా. ఈప్రాతిపదికను 2026 వరకు వర్తించాలని నూతన జనాభా విధానం నిర్ణయించింది. అందువల్ల చిన్న కుటుంబ నియమం పాటించే తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు తగ్గటం కాని, అధిక జనాభా కలిగిన రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరగటం కాని ఉండదు.

2. పై నిర్ణయంతో పాటు, 2046 నాటికి స్థిర జనాభాను సాధించేందుకు కింది చర్యలను తీసుకుకోవాలని ఈ జనాభా విధానం పేర్కొంది.

i) బాల్య మరణాల రేటును 1000 జీవజ్జననాలకు 30 కంటే తగ్గించటం
ii) ప్రసూతి మరణాల రేటును 1,00,000 మందికి 100 కంటే తగ్గించటం
iii) అందరికి వ్యాధి నిరోధక టీకాలు వెయ్యటం

iv) మొత్తం ప్రసవాలలో 80 శాతం ప్రసవాలు డిస్పెన్సరీలు, ఆసుపత్రులు, వైద్య సంస్థల్లో శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా జరిగేట్లు చూడటం.

v) అందరికి 'ఎయిడ్స్' వ్యాధికి సంబంధించిన సమాచారం అందటం. అంటువ్యాధులను నిరోధిస్తూ నియంత్రించటం

vi) ఇద్దరు పిల్లల నియమాన్ని పాటించే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వటం

vii) గర్భస్రావాలు క్షేమంగా జరిగేట్లు సదుపాయాలను పెంపొందించేట్లు చూడటం

viii) బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని, గర్భస్థశిశు లింగ నిర్ధారణకు సంబంధించిన చట్టాన్ని ఖచ్చితంగా అమలు జరిగేట్లు చేడటం

ix) 18 సం॥లలోపు బాలికలకు వివాహం జరగకుండా చూస్తూ, వీలున్న వరకు వివాహ వయస్సు 20 సం॥లు పెంచేట్లు చూడటం

x) 21 సం॥ తరువాత వివాహం చేసుకున్న స్త్రీలకు; ఇద్దరు పిల్లల తరువాత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకొన్న స్త్రీకు ప్రత్యేక బహుమతిని ఇవ్వటం

xi) దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఇద్దరు.పిల్లల తరువాత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకున్నవారికి ఆరోగ్య భీమాను కల్పించటం

xii) ప్రధాన మంత్రి నేతృత్వంలో జాతీయ జనాభా కమీషన్ ఏర్పాటు చేసి జనాభా విధానాన్ని పర్యవేక్షిస్తూ, అమలు జరిగేట్లు చూడటం

ఈ లక్ష్యాల ప్రాతిపదికగా రాబోయే పది కీలకమైన సంవత్సరాలకు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించటం జరిగింది. ఈ కార్యచరణ ప్రణాళిక కింది అంశాలను కలిగి ఉంది.

ఎ) గ్రామ పంచాయితీ స్థాయిలో గృహిణులతో ఎక్కువగా ఏర్పాటైన స్వయం సేవక బృందాలు ఆ గ్రామంలోని గ్రామ పంచాయతీతోనూ, ఆరోగ్య సేవకులతోను

బి) ప్రాథమిక విద్యను ఉచితంగా, నిర్భంధంగా అందించటం

సి) జనన, మరణాల నమోదు వలెనే వివాహాలను, గర్భాలను విధిగా నమోదు చేసేట్లు చూడటం

భారత ప్రభుత్వం 2046 వ సం॥రానికి జనాభా స్థిరత్వాన్ని సాధిస్తుందని ఆశించటం జరిగింది అందుకోసం అందరికి సరిపడ గర్భనిరోధక సాధనాలను అందించేందుకు, అవస్థాపనా సదుపాయాలు కల్పించేందుకు అదనంగా రూ॥3000 కోట్లు అవసరం

నూతన జాతీయ జనాభా విధానం సరైన దిశలో రూపొందించటం జరిగిందని, జనాభాకు సంబంధించి తెలియజేస్తుందని UNFPA ప్రతినిధి మైఖేల్ వ్లాసోఫ్ (Micheal Vlassof) వ్యాఖ్యానించారు. కాని విమర్శకులు మాత్రం పరిమిత కుటుంబ బాధ్యతను పూర్తిగా స్త్రీల మీదే ఉంచటం జరిగిందన్నారు. ఈ విధానం పరిమితి కుటుంబ విషయంలో పురుషులకు సంబంధించి మెతక వైఖరి అవలంభించిందని, పూర్తి బాధ్యత స్త్రీలపైనే ఉంచిందని కుటుంబ నియంత్రణ అసోసియేషన్ ప్రసిడెంట్ డా॥నాని పూరి అన్నారు.

4.8 భారతీయ జనాభా విధానం - సమీక్ష

ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే, ఏ దేశంలోనైనా విద్య, జీవన ప్రమాణంలో గణనీయమైన పెరుగుదల సాధించకుండా జనాభా వృద్ధిరేటు తగ్గలేదనేది వాస్తవం. కాని భారతదేశ జనాభా విధానంలో పునరుత్పత్తి రేట్లను తగ్గించే విషయాన్ని అలక్ష్యం చేసి కుటుంబ నియంత్రణ ద్వారా జనాభాను నియంత్రణ చేయాలని సంకల్పించటం జరిగింది. మన దేశం అవలంభించే జనాభా విధానంలో మూడు ముఖ్యమైన లోపాలు గమనించవచ్చు

1. గర్భనిరోధక సాధనాలకు అధిక ప్రాధాన్యం:- బి.ఆర్. సేన్ అనే శాస్త్రవేత్త భారతదేశంలో జనాభా సమస్యను సక్రమంగా అవగాహన చేసుకోలేదని అంటారు. వివిధ సమయాల్లో భారతప్రభుత్వ విధానాలు గర్భనిరోధక సాధనాల సప్లై పెంచటం, వీటి ఉపయోగాన్ని ప్రచారం చేయటానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వటం జరిగింది తప్ప గ్రామాల్లోని పేద ప్రజానీకానికి జీవన ప్రమాణాన్ని పెంపొందించే విధంగా చర్యలు చేపట్టి జనాభా పెరుగుదల అరికట్టాలనే పైపున చర్యలు చేపట్టటం జరగలేదని సేన్ అభిప్రాయపడ్డారు. అందువల్ల భారతదేశంలో మరిముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాన్ని పెంపొందించే విధంగా దారిద్ర్య నిర్మూలనా చర్యలు త్వరితగతిని చేపట్టినప్పుడే జనాభా నియంత్రణ సాధ్యమౌతుందని, అందుకోసం అదనపు అభివృద్ధి కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టవలసిన ఆవశ్యకత ఉందని సేన్ అంటారు. భారతదేశంలోని కేరళ, తమిళనాడు, గోవాలలో జననాల రేటు గణనీయంగా తగ్గించటానికి కారణం అక్షరాస్యత, ఆరోగ్య పరిరక్షణ అని T.N. క్రిష్ణన్ అంటారు.

ఈ నేపధ్యంలో భారతదేశంలో జనాభా నియంత్రణ కోసం అవలంభించే పద్ధతులైన గర్భ నిరోధక సాధనాల సప్లై పెంచటం, కుటుంబనియంత్రణ పాటించే వారికి ప్రోత్సాహకాలు ఇవ్వటం లాంటి చర్యలతో పాటు అధిక ప్రాముఖ్యత అక్షరాస్యత, విద్యలతో పాటు పేదరిక నిర్మూలనా కార్యక్రమాలను గణనీయంగా పెంపొందించి గ్రామీణ ప్రజల్లో జీవన ప్రమాణాన్ని పెంపొందించటం చేసినచో జనాభా పెరుగుదల రేటును గణనీయంగా తగ్గించవచ్చు.

2. నిర్భంద కుటుంబ నియంత్రణ విధానాలు:- భారతదేశంలో జనాభా నియంత్రణ ఆవశ్యకత ఎంతైనా ఉంది. భారతదేశ ప్రణాళికాభివృద్ధి ఫలాలు ప్రజలకు అందకపోవటానికి కారణం జనాభా అనేది నిర్వివాదాంశం. అయితే కుటుంబ నియంత్రణ కార్యక్రమం 1976 లో వలే నిర్భంధంగా కాకుండా స్వచ్ఛందంగా పాటించాల్సిన ఆవశ్యకతను జనాభా అధ్యయన శాస్త్రవేత్తలు అభిప్రాయపడటం జరిగింది.

ప్రవీణ్ విసారియా అభిప్రాయంలో విధిగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సను ప్రోత్సహించటం కన్నా కుటుంబ నియంత్రణ కోసం వేళ్ళే వారికి ద్రవ్య సంబంధమైన, ఇతర ప్రోత్సాహకాలను, ఎక్కువ సంతానం కోసం వెళ్ళకుండా నిరుత్సాహకాలను అమలు చేయటం మంచి పద్ధతి అంటారు. కాని ప్రోత్సాహకాలు లేదా నిరుత్సాహకాలు అనేవి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సతో సంబంధం లేకుండా కుటుంబంలోని సంతానంతో ముడిపెడితే మంచిది అంటారు. కుంటుంబ నియంత్రణ కోసం అవసరమైన పద్ధతుల ఎంపికలో దంపతులకు స్వేచ్ఛ అవసరమని అంటారు.

3. కుటుంబ నియంత్రణ అమలు విధానం:- భారతదేశంలోని కుటుంబ నియంత్రణ విధానాన్ని గత నాలుగు దశాబ్దాలుగా పరిశీలిస్తే మొదటి రెండు దశాబ్దాల కన్నా తరువాత రెండు దశాబ్దాలలో మరణాల రేటు గణనీయంగా తగ్గింది. ఎందుకంటే మొదట్లో కుటుంబ నియంత్రణ అమలుకు సంబంధించిన నిర్ణయాలు అత్యున్నత స్థాయిలో జరిగేవి. అయితే ఆ తరువాత ఆ విధానంలో ఉన్న లోపాలు సరిదిద్దుకోవడం వల్ల తరువాత కాలంలో వాటి ప్రభావం జననాల రేట్లపై చూపటం జరిగింది.

భారతదేశంలో కుటుంబ నియంత్రణ 1950 దశకం మొదట్లో 'Clinic Approach' ద్వారా జరిగేది. అయితే ఈ విధానం ఐరోపా, అమెరికా దేశాల్లో ఫలవంతం అయినా భారతదేశ పరిస్థితులకు విఫలం అయ్యింది. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం'The Extension Approach' అనే విధానం అవలంభించటం జరిగింది. ఈ విధానం కూడా సత్ఫలితాలు ఇవ్వవందున మరల నిర్భంద కుటుంబ నియంత్రణ విధానం వైపుకు మొగ్గు చూపినా ఫలితం లేకపోయింది. అందుచేత మరల నూతన విధానం అంటే 'Camp Approah' ని అవలంభిచటం జరిగింది. ప్రస్తుతం అమలు జరుగుచున్న విధానం . ఈ విధానంలో కుటుంబ నియంత్రణ ఆసక్తి కలిగిన వారికి నగదు లేదా ఇతర ప్రోత్సాహకాలను ఇస్తూ కుటుంబ నియంత్రణ శిబిరాల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స పొందేట్లు చూడటం.

భారతదేశ జనాభా నియంత్రణ విధానంలో పై చెప్పిన ముఖ్యమైన మూడు లోపాలు కన్పించినా, కుటుంబ నియత్రణ విధానం ప్రభావం జనాభా, జననాలరేటు, జనాభా వృద్ధి రేట్లుపై గణనీయంగా ఉంది. అయితే జనాభా నియంత్రణ విధానం మరింత సత్ఫలితాలను ఇవ్వాలంటే క్రింది చర్యలను ప్రవీణ్ విసారియా సూచిస్తారు.

1. భారత ప్రజల్లో పునరుత్పత్తి స్వభావంపై ఉన్న ఆలోచనా సరళిని మార్చేందుకు ఎక్కువ సంఖ్యలో 'health Workers' ను నియమించటంతో పాటు వారి సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించాలి.

2. కుటుంబ నియంత్రణ విధానాన్ని నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా కాక జననాల రేటును, మరణాల రేటును తగ్గించే విధంగా చూడటం

3. వివాహాన్ని ఆలస్యంగా చేసుకోవటానికి, వివాహానంతరం సంతానాన్ని పరిమితం చేసుకోవటానికి ప్రోత్సాహకాలను, నిరుత్సాహకాలను అందించే విధంగా ఒక విధానం అవసరం.

ఈ మూడు విధాలైన చర్యలను చేపట్టినట్లయితే ప్రజల్లో పునరుత్పత్తి మీద దృక్పథాన్ని సులువుగా మార్చవచ్చు అని, తత్ఫలితంగా పునరుత్పత్తి రేటు గణనీయంగా తగ్గుతుందని ప్రవీణ్ విసారియా అంటారు.

4.9 2016 నాటికి భారతదేశ జనాభా అంచనాలు:-

కుటుంబనియంత్రణ అమలు, పునరుత్పత్తి రేటు, మరణాల రేట్లను ఆధారంగా చేసుకొని జనాభాను అంచనా వేసేందుకు టెక్నికల్ గ్రూపును ప్రణాళికా సంఘం నియమించింది. ఈ టెక్నికల్ గ్రూపు కొన్ని ప్రమేయాలను ప్రాతిపదికగా తీసుకొని 1996-2016 నాటికి అంచనా వేసింది.

4.9.1 జనన, మరణ రేట్ల అంచనాలు:- 1996-2001 నాటికి అపరిష్కృత మరణాల రేటు 24.1 ఉంటుందని, ఈ రేటు 2011 -2016 కు 21.41 కి తగ్గుతుందని అంచనా వేయ్యటం జరిగింది. అపరిష్కృత మరణాల రేటు 1996-2001 లో 8.99 ఉండి 2011-2016 కు 7.48కి తగ్గుదుంది. సహజ వృద్ధి రేటు 1996-2001 లో 15.11 ఉండి, 2011-2016 కు 13.9కి తగ్గుతుంది. ఈ సమాచారం క్రింది పట్టిక తెలియజేస్తుంది.

అంచనా వేసిన అపరిష్కృత జనవాల రేటు, అపరిష్కృత మరణాల రేటు, సహజవృద్ధి రేటు

కాలం	అపరిష్కృత జననాల రేటు	అపరిష్కృత మరణాల రేటు	సహజ వృద్ధి రేటు
1996 - 2001	24.10	8.99	15.11
2001-2006	22.84	8.27	14.57
2006-2011	22.27	7.80	14.48
2011-2016	21.41	7.48	13.9

మూలం: తొమ్మిదో ప్రణాళిక (1997-2002), Vol. II P. 41

4.9.2 జనాభా అంచనాలు

ఇరవై సంవత్సరాల కాలంలో (1996-2016) భారతదేశ జనాభా 934 మిలియన్ల నుంచి 1264 మిలియన్లకు పెరుగుతుందని టెక్నికల్ గ్రూపు అంచనా వేసింది. ఈ జనాభా పెరుగుదలకు సంబంధించిన మరికొన్ని గణాంకాలను క్రింది పట్టిక తెలియజేస్తుంది.

పట్టిక సం.

భారతదేశానికి అంచనా వేసిన జనాభా (1996-2016)

సంవత్సరం	మిలియన్లలో			శాతాలలో	
	పురుషులు	స్త్రీలు	మొత్తం	పురుషులు	స్త్రీలు
1996	485	449	934	51.9	48.1
2001	524	448	1012	51.8	48.2
2006	564	530	1094	51.6	48.4
2011	607	572	1179	51.5	48.5
2016	649	615	1264	51.3	48.7

మూలం : Report of the Technical Group on Population Projections (1996)

1996 - 2016 మధ్య కాలంలో జనాభా 35.3 శాతం పెరుగుతుందని అంచనా వేశారు. పురుషుల వృద్ధి 3.8 శాతం (48 నుంచి 649 మిలియన్లు), స్త్రీల వృద్ధి 37.0 శాతం (449 నుండి 615 మిలియన్లు) ఉంటుందని అంచనా. వృద్ధి రేటు పురుషుల కన్నా స్త్రీలదే ఎక్కువగా ఉంటుందని అంచనా. స్త్రీ పురుష శాతాలను గమనిస్తే, స్త్రీల శాతం 48.1 నుండి 48.7 కు పెరుగుతుందని, పురుషుల శాతం 51.9 నుంచి 51.3 కు తగ్గుతుందని అంచనా.

4.10 సారాంశం

ఏ దేశమైన తన జనాభాను క్రమబద్ధం చేసుకోవటానికి అవలంభించే విధానాన్ని జనాభా విధానం అంటారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారత ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించేందుకు కృషి ప్రారంభించింది. భారతదేశ అభివృద్ధికి పెరుగుచున్న జనాభా ప్రతిబంధకంగా గుర్తించి జనాభాను నియంత్రించే ప్రయత్నాలు చేపట్టింది. 1952 వ సం॥లో కుటుంబ నియంత్రణ విధానాన్ని అధికారికంగా చేపట్టింది. కేవలం కుటుంబ నియంత్రణ ద్వారా చేపట్టే చర్యలు ఆశించిన ఫలితాలను ఇవ్వనందును మొట్టమొదటి సారిగా 1976 లో జనాభా విధానాన్ని ప్రవేశ పెట్టటం జరిగింది. ఈవిధానంలో వివాహవయస్సును పెంచటం, కుటుంబంలోని పిల్లలు ముగ్గురికి పరిమితం చేయటం, 1971 ప్రకారం లోక్‌సభ సీట్లు కొనసాగించటం మొదలైన చర్యలు తీసుకుంది. ఆ తరువాత వివిధ ప్రణాళికల్లో జనాభా విధానాన్ని కొనసాగిస్తూ 2000 సం॥లో నూతన జనాభా విధానాన్ని రూపొందించటం జరిగింది. ఈ విధానంలో కూడా లోక్‌సభ సీట్లను 1971 వ సం॥ము జనాభాప్రాతిపదికగా కొనసాగించటం. ఈ 2026 వ సం॥ము ఉండేట్లు నిర్ణయించటం జరిగింది. ఈ నిర్ణయంతో పాటు జనాభా పరమైన లక్ష్యాలను, ఆరోగ్య పరమైన లక్ష్యాలను నిర్ణయించి

వాటిని సాధించేందుకు కృషి చేయాలని నిర్ణయించటం జరిగింది. ఈ లక్ష్యసాధన కోసం కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించటం జరిగింది. ఈ విధానం అమలు చేయటం వల్ల 2046 నాటికి జనాభా స్థిరత్వాన్ని భారత ప్రభుత్వం సాధించగలుగుతుందని ఆశించటం జరిగింది. మన జనాభా విధానం అమలలో కొన్ని లోటు పాట్లు ఉన్నట్లు అనగా గర్భ నిరోధక సాధనాలపై ఎక్కువగా ఆధారపడటం, నిర్బంధంగా కుటుంబ నియంత్రణ అమలు, కుటుంబ నియంత్రణ చేసే విధానంలో అమలు వంటివి ఉన్నట్లు గుర్తించటం జరిగింది. ఈ లోటుపాట్లు అధిగమిస్తూ కుటుంబ నియత్రణ విధానాన్ని, జనాభా విధానాన్ని అమలు చేస్తే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాధించగలదు అనటంలో సందేహం లేదు.

4.11 కఠిన పదాలు

2. శిశు మరణాల రేటు : వెయ్యిమందికి సంవత్సరం లోపు శిశువులు మరణించే రేటును శిశు మరణాల రేటు అంటారు.
3. అపరిష్కృత మృతి రేటు : వెయ్యి మంది జనాభాలో సంభవించే మరణాల రేటును అపరిష్కృత మృతి రేటు అంటారు.
4. సమగ్ర సంతతి రేటు : గర్భధారణ వయస్సులోని 1000 మంది స్త్రీలకు కలిగే జననాల రేటును సమగ్ర సంతతి రేటు.

4.12 స్వయం పరిశీలన ప్రశ్నలు :

వ్యాస రూప ప్రశ్నలు

1. భారతదేశంలో నూతన జనాభా విధానాన్ని వివరించండి.
2. స్వాతంత్ర్యానంతరం భారతదేశం అవలంభిస్తున్న జనాభా విధానాన్ని సమీక్షించండి

సంక్షిప్త ప్రశ్నలు

1. 1976 కు పూర్వం జనాభా విధానం
2. జనాభా విధానం, 1976
3. 2016 కి భారతదేశ జనాభా అంచనాలు

4.13 చదువవలసిన పుస్తకాలు

1.	Ruddar Datt and K.P.M. Sundaram	:	Indian Economy, 2004
2.	Misra and Puri	:	Indiam Economy, 2004.
3.	I.C. Dhigra	:	The Indian Economy
4.	Planning Commission	:	Various Planning Commission Report

పాఠం - 5

భారతదేశ పేదరిక లక్షణాలు - పేదరిక నిర్మూలన

5.0 ఉద్దేశ్యం :

ఈ పాఠ్యాంశం పూర్తయ్యేసరికి మీరు క్రింది విషయాలను అవగాహన చేసుకుంటారు.

1. పేదరిక భావనలు - నిరపేక్ష, సాపేక్ష పేదరికాలు.
2. భారతదేశంలో పేదరిక అంచనాలు.
3. NSSO వారి55వ రౌండ్ అంచనాలు
4. పేదరిక కారణాలు
5. పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు
6. భారతదేశంలో పేదరిక నిర్మూలనా వ్యూహం.

పాఠ్యాంశ నిర్మాణ క్రమం :

5.1 ఉద్దేశాలు, లక్ష్యాలు

5.2 విషయ పరిచయం

5.3 పేదరికం - భావనలు

5.4 భారతదేశంలో పేదరికం

5.3.1 భారతదేశంలో పేదరిక పరిశీలనలు

5.4 NSSO యొక్క 55వ రౌండ్ పేదరిక అంచనాలు

5.5 ప్రణాళికా సంఘం పేదరిక అంచనాలు

5.6 భారతదేశంలో పేదరికానికి కారణాలు

5.7 పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు

5.8 భారతదేశంలో పేదరిక నిర్మూలనా వ్యూహం

5.9 భారతదేశంలో పేదరిక నిర్మూలన - విమర్శనాత్మక పరిశీలన

5.10 సారాంశం

5.11 కఠిన పదాలు

5.12 స్వయం సమీక్షా ప్రశ్నలు

5.13 చదువవలసిన పుస్తకాలు

5.1 విషయ పరిచయం:

పేదరికం ఏదేశానికైనా ఒక శాపంగా చెప్పవచ్చు. పేదరికమనేది ఒక సామాజిక, ఆర్థిక సమస్య. పేదరికమనేది కార్యకరణ సంబంధం కలిగినది. కావుననే రాగ్నార్ నర్క్స్ అనే శాస్త్రవేత్త పేదరిక విష్షవలయాన్ని వివరిస్తూ పేదరికానికి కారణము, ఫలితము కూడా పేదరికమే అని వివరించాడు. ప్రపంచంలోని అభివృద్ధి చెందుచున్న దేశాలు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య పేదరికం. మన భారతదేశం కూడా అనాదిగా పేదరిక సమస్యను ఎదుర్కొంటున్నది. స్వాతంత్యానికి పూర్వం బ్రిటీషు వారి వలన పాలన పేదరిక సమస్యను మరింత జఠిలం చేసింది. స్వాతంత్ర్యానంతరం మన ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం ప్రణాళికాబద్ధమైన కృషి ప్రారంభించి

కొనసాగిస్తోంది. అయిననూ భారతదేశంలో 27.1 శాతం జనాభా పల్లెల్లో, 23.6 శాతం జనాభా పట్టణాల్లో నేటికినీ పేదరికంలో ఉన్నారు. ఈ పాఠంలో భారతదేశంలో పేదరికం, కారణాలు, నివారణ చర్యలను గూర్చి తెలుసుకుందాం.

5.2 పేదరికం - భావనలు:

పేదరికం అనేది ఒక సామాజిక, ఆర్థిక దృగ్విషయము. ఏదేశంలోనైనా కొంత భాగం జనాభా వారికి అవసరమైన కనీస అవసరాలు పొందలేని స్థితిలో ఉంటారు. ఆ జనాభాను పేదరికంలో ఉన్నారని అంటాము. కొన్ని దేశాల్లో అధిక శాతము జనాభా వారి కనీస అవసరాలైన ఆహారం, వస్త్రం, గృహం లాంటివి పొందలేని స్థితిలో ఉంటారు. సాధారణంగా అభివృద్ధి చెందుచున్న దేశాల్లో అధిక శాతం వారి కనీస అవనరాలను పొందలేని స్థితిలో ఉంటుంటారు. అందుచేతనే అభివృద్ధి చెందుచున్న దేశాలు పేదరికంలో మగ్గుతూ ఉన్నట్లు చెప్పటం జరుగుతుంది.

ప్రపంచంలోని అన్ని దేశాలలో పేదరికాన్ని నిర్వచించే ప్రయత్నాలు జరిగాయి. అన్ని దేశాలు కూడా పేదరిక నిర్వచనంలో కనీస లేదా మంచి జీవనం లేని స్థితినే పేర్కొనటం జరిగింది. అయితే విభిన్న దేశాలు విభిన్న దృక్కోణాలలో పేదరికాన్ని నిర్వచించటం, ఆ కోణాలలోనే పేదరికాన్ని అంచనా వేయటం జరుగుతుంది. పేదరికాన్ని రెండు భావనలలో (ఎ) నిరపేక్ష పేదరికం (బి) సాపేక్ష పేదరికం అనే భావనలలో పరిశీలించటం సర్వ సాధారణంగా అందరూ అంగీకరించటం జరిగింది.

ఎ) నిరపేక్ష పేదరికం :

దేశంలోని ప్రజల కనీస జీవనానికి ధాన్యాలు, పప్పులు, పాలు మొదలైనవి అవసరం. ఈ వస్తు పరిమాణాలను వాటి ధరలతో గుణిస్తే మానవుల కనీస అవసరానికి అవసరమైన వ్యయం తెలుస్తుంది. ఈ వ్యయ పరిమాణాన్నే దారిద్ర్యపు రేఖ అంటారు. ఈ వ్యయాన్ని చేయలేని ఆదాయం పొందే వారందరిని దారిద్ర్య రేఖ దిగువన ఉన్నట్లు చెప్పటం జరుగుతుంది. ఈ విధంగా మానవ కనీస అవసరాలకు వ్యయం చేయలేని స్థితిని నిరపేక్ష పేదరికం అంటారు. భారతదేశంలో కనీస జీవన అవసరాలైన తిండి, బట్ట, ఇల్లు మొదలైనవి లేనందువల్ల భారతదేశ పేదరికాన్ని నిరపేక్ష పేదరికంగా చెప్పవచ్చు. ఈ విధమైన పేదరికం అభివృద్ధి చెందుచున్న దేశాల్లో ఉంటుంది.

బి) సాపేక్ష పేదరికం :

దేశంలోని విభిన్న వర్గాల ప్రజల ఆదాయాన్ని లేదా వినియోగాన్ని పోల్చి, తక్కువ ఆదాయం లేదా తక్కువ వ్యయం చేస్తున్న ప్రజలను పేదవారుగా లెక్కించటం జరుగుతుంది. ఈ విధంగా ఆదాయాలను పోల్చి లెక్కించే పేదరికాన్ని సాపేక్ష పేదరికం అంటాము. సాధారణంగా ఒక దేశంలోని అధిక ఆదాయంగల 5 నుంచి 10 శాతం మంది ప్రజల ఆదాయస్థాయిని, ఆదేశంలోని తక్కువ ఆదాయం గల 5 నుంచి 10 శాతం మందితో పోల్చి పేదరికాన్ని నిర్ధారించటం జరుగుతుంది. ఈ విధమైన భావన సంపన్న దేశాలకు ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఈ భావన ద్వారా దేశ ఆదాయ అసమానతలను పరిశీలించవచ్చు.

5.3 భారతదేశంలో పేదరికం :

భారతదేశ పేదరికం నిరపేక్ష పేదరికం. భారతదేశంలో దారిద్ర్య రేఖ అంటే "మనిషికి సగటున రోజుకు 2,250 కేలరీల శక్తి కలిగి ఉండటం". దేశంలో 2,250 కేలరీల శక్తి నిచ్చే ఆహార పదార్థాలు పొందలేని వారందరిని దారిద్ర్య రేఖ దిగువన ఉన్నట్లు చెప్పటం జరుగుతుంది. ఈ శక్తినిచ్చే ఆహార పదార్థాలు పొందేందుకు నెలసరి వ్యయం ఎంత అవసరమో ఆ వ్యయం చేయలేని వారందరూ దారిద్ర్య రేఖ దిగువన ఉన్నట్లుగా చెప్పటం జరుగుతుంది. ఈ ప్రాతిపదికగా వివిధ శాస్త్రవేత్తలు దేశదారిద్ర్య స్థాయిని అంచనా వెయ్యటం జరిగింది.

5.3.1 భారతదేశంలో పేదరిక పరిశీలనలు :

భారతదేశంలో పేదరికాన్ని గురించి వివిధ శాస్త్రవేత్తలు, సంస్థలు పరిశీలనలు చేశాయి. అందులో కొన్ని ముఖ్యమైన అంచనాలను గూర్చి తెలుసుకుందాం. వివిధ అంచనాల వివరాలు పట్టిక 5.1 లో పొందుపరచటం జరిగింది.

ఎ) ఒఝా అంచనా :

భారతదేశంలో పేదరిక రేఖ దిగువ భాగానున్న జనాభాను ఒఝా పరిశీలించారు. రోజుకు 2,250 కేలరీల శక్తి గల పదార్థాల వినియోగాన్ని పేదరిక రేఖగా తీసుకొని అంచనా వెయ్యటం జరిగింది. గ్రామాలలో వెలసరి ఆదాయం 1960-61 ధరలలో రూ॥.8/-, ।1/-లు, పట్టణాల్లో రూ॥15/-, రూ॥18/-లు దారిద్ర్య రేఖగా అంచనావేసి పేదరికంలో ఉన్న జనాభాను లెక్కించటం జరిగింది. ఈ అంచనా ప్రకారం 1960-61లో 184 మిలియన్ల జనాభా (51.8%) గ్రామాలలోను, 6 మిలియన్లు జనాభా (7.6%) పట్టణాలలోనూ పేదరికంలో ఉన్నారు. 1967-68 సం॥లో 289 మిలియన్ల జనాభా (70%) పేదరికంలో ఉన్నట్లు ఒఝా అంచనావేశారు.

బి) బర్ధన్ గ్రామీణ పేదరిక అంచనాలు :

బర్ధన్ వ్యవసాయ శ్రామికుల ధర నూచీ ప్రాతిపదికగా కనీస జీవన వ్యయాన్ని లెక్కించాడు. సాధారణంగా గ్రామాల్లో నివసించే పేదవారు తమ ఆదాయంలో తక్కువ శాతం తయారీవస్తువుల మీద, ఎక్కువ శాతం వ్యవసాయ వస్తువులు మీద ఖర్చు చేస్తుంటారని, అందువల్ల గ్రామీణ ప్రాంతాల ధరలు, పట్టణ ధరల కన్నా, తక్కువగా ఉంటాయనే ఉద్దేశంతో కనీస జీవన వ్యయాన్ని లెక్కించాడు. బర్ధన్ ప్రకారం కనీస జీవన వ్యయం నెలకు రూ॥లు 15/-గా భావించి పేదరికాన్ని అంచనా వెయ్యటం జరిగింది. బర్ధన్ ప్రకారం 1960-61వ సంవత్సరంలో (1960-61 ధరల ప్రకారం) 38 శాతం జనాభా (131 మిలియన్లు) దారిద్ర రేఖ దిగువన ఉండగా, 1967-68 నాటికి 53.0 శాతానికి (221 మిలియన్లు) పెరగటం జరిగింది.

సి) మిన్హాస్ గ్రామీణ పేదరిక అంచనా :

B.S. మిన్హాస్ అనే శాస్త్రవేత్త గ్రామాల్లో దారిద్ర్య రేఖను 1960-61 ధరల్లో రూ॥ 20/-గా తీసుకుని గ్రామీణ పేదరికాన్ని 1956-57, 1963-64, 1969-70 సం॥లకు అంచనా వేశారు. అతని అంచనాల ప్రకారం 1956-57వ సం॥లో 181 మిలియన్ల జనాభా ।ంటే 65 శాతం జనాభా దారిద్ర్య రేఖ దిగువన ఉన్నట్లు అంచనావేశారు. 1963-64వ సం॥మునకు దారిద్ర్యరేఖ దిగువన ఉన్న జనాభా 221 మిలియన్లకు పెరిగినా, ఆ జనాభా శాతం మొత్తం జనాభాలో 57.8 శాతమే. అంటే దారిద్ర్య రేక దిగువనున్న జనాభా శాతం తగ్గింది. అతని అంచనా ప్రకారం 1969-70లో గ్రామాల్లో పేదరిక రేఖ దిగువనున్న జనాభా 210 మిలియన్లకు తగ్గగా, దారిద్ర్య రేఖ దిగువనున్న జనాభా శాతం కూడా 50.6 శాతానికి తగ్గింది. ఈ గణంకాలను పరిశీలిస్తే, భారతదేశ గ్రామీణ పేదరిక శాతం 1956-57 నుంచి 1969-70 సం॥మునకు 14.4 శాతం తగ్గింది. ఈ వివరాలు పట్టిక 5.1 వెల్లడి చేస్తాయి.

పట్టిక నం 5.1 ం

వివిధ అంచనాల ప్రకారం భారతదేశంలో పేదరికం

అంచనావేసిన వారు	సం॥ము	గ్రామిణ పేదరికం	పట్టణపేదరికం	మొత్తం	దారిద్రరేఖణ ప్రమాణం
1. P.D. ఓజా	1960 - 61	184 (51.6	6(7.6)	190 (44.6)	గ్రామిణ నెలసరి తలసరి వినియోగ్ వ్యయం
	1967 - 68	289 (70.0)			1960-61 ధరలో 15-18 రూ॥లు,
2. P.K. బర్ధన్	1960 - 61	131 (38.0)			పట్టణ ఆదాయం 8-11 రూ॥లు
	1967 - 68	221 (53.0)			వ్యవసాయ కార్మికుల వినియోగ సూచీ
					ఆధారంగా 1960-61 ధరల్లో నెలసరి తలస్థరి
					వినియోగం రూ॥లు 15/-.
3. B.S. మిన్హాస్	1956 - 57	181 (65.0)			1960 - 61 ధరల్లో రూ॥ 20/-
	1963 - 64	221 (57.8)			
	1969 - 70	210 (50.6)			
4. M. అహ్లూవాలియా	1956 - 57	181 (54.1)			1960-61 ధరల్లో గ్రామీణ ప్రాంతాల్లో రు॥ 15/-
	1963 - 64	171 (44.5)			పట్టణ ప్రాంతాల్లో రూ॥ 20/-
	1967 - 68	235 (56.5)			
	1973 - 74	241 (46.1)			
5. దండేకర్ & రాత్	1960 - 61	135 (40.0)	42 (50.0)	177 (41.0)	1960 - 61 ధరల్లో గ్రామీణ ప్రాంతాల్లో
	1969 - 70	166 (40.0)	49 (50.0)	215 (41.0)	రూ॥లు 15/-, పట్టణాల్లో రూ॥ 22.5/-
6. ఏడో ఫైనాన్స్ కమిషన్	1970 - 71	225 (53.0)	52 (51.0)	277 (52.0)	
7.ఆరో ప్రణాళిక (1980 - 85)	1979 - 80	260 (50.7)	57 (40.0)	310 (48.4)	1979-80 ధరల్లో గ్రామాణ ప్రాంతాల్లో రూ॥76,
					పట్టణ ప్రాంతాల్లో రూ॥ 88/-
8. V.M దండేకర్	1971 - 72	238 (46.0)			1971-72 ధరల్లో రూ॥లు 32.7/-
	1977 - 78	284 (49.5)			1977-78 ధరల్లో రూ॥లు 54.4/-
	1983 - 84	286 (44.4)			1983-84 ధరల్లో రూ॥లు 88.4/-
9. ప్రపంచ బ్యాంకు	1983	252 (44.9)	65 (36.4)	317 (42.5)	గ్రామీణ ప్రాంతాల్లో రూ॥లు 89.0/-
					పట్టణ ప్రాంతాల్లో రూ॥లు 112.2/-
	1988	252 (41.7)	70 (33.6)	322 (39.6)	

10.మిన్హాస్, జైన్,బెండూల్కర్	1987 - 88	284 (44.9)	77(36.5)	361 (42.7)	వర్తమాన ధరల్లో గ్రామీణ ప్రాంతాల్లో రూ॥లు 122.6/-, పట్టణ ప్రాంతాల్లో రూ॥లు 158.3/-
11. ప్రణాళికా సంఘం	1987-88	229 (39.1)	83 (40.2)	312 (39.1)	వర్తమాన ధరల్లో గ్రామీణ ప్రాంతాలలో రూ॥ 115.43/- పట్టణ ప్రాంతాల్లో రూ॥ 165.58/-
12. ప్రణాళికా సంఘం	1996-97	211 (30.6)	66 (25.6)	277 (29.2)	వర్తమాన ధరలలో గ్రామీణ ప్రాంతాలలో రూ॥ 115.43/- పట్టణ ప్రాంతాల్లో రూ॥ 165.58

గమనిక:

1. 1960 - 61 సం॥లు మినహా మిగిలిన అన్ని సం॥లలో రోజుకు 2250 కేలరీల శక్తికి అనుగుణంగా వర్తమాన ధరలను రూపొందించటం జరిగింది.
2. బ్రాకెట్లలోని సంఖ్యలు మొత్తం జనాభాకు శాతాలు.

13. **N S S O**	1999 - 2000	195 (27.1)	65(23.6)	260(26.1)	గ్రామీణ ప్రాంతాల్లో రూ॥ 211.30/- పట్టణ ప్రాంతాల్లో రూ॥ 454.11/-

ii) అహ్లూవాలియా గ్రామీణ పేదరిక అంచనాలు :

మాంటెక్ అహ్లూవాలియా అనే ఆర్థికవేత్త కూడా కనీస జీవన వ్యయం గ్రామాలలో నెలకు రూ॥లు 15/- గాను పట్టణాలలో నెలకు రూ॥లు 20/- గాను తీసుకుని పేదరికాన్ని 1956-57 నుంచి 1973-74కు అంచనావేశారు. వీరి అంచనాల కాలంలో పేదరికంలో తీవ్ర ఒడుదుడుకులు కనిపిస్తాయి. 1960-61 సం॥ర ధరల్లో 1956-57వ సం॥లో దారిద్రరేఖ దిగువనున్న జనాభా శాతం 54.1 కాగా, 1963-64 సం॥రానికి 44.5 కు తగ్గింది. మరలా 1967-68వ సం॥ములో 56.5 శాతానికి పెరిగింది. 1973-74వ సం॥లో పేదరిక శాతం 46.1కి తగ్గింది. ఈ ఒడుదుడుకులను బట్టి "భారతదేశంలో పేదరికం పెరుగుతున్న ధోరణి కనిపించటంలేదు" అని అహ్లూవాలియా అంటారు. పేదరికానికి వ్యవసాయ రంగ ఉత్పాదకతకు విలోమ సంబంధం ఉన్నట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే అభివృద్ధి ప్రతిఫలాలు గ్రామాలలోని అట్టడుగు పేదలకు అందటంలేదని, కావున కేవలం ఉత్పదకత పెంచే చర్యలు కాక గ్రామాలలోని అట్టడుగువారి అభ్యున్నతికోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టవలసిన ఆవశ్యకత ఉందని అహ్లూవాలియా అంటారు.

iii) దండేకర్ & రాత్ అంచనాలు :

దండేకర్ & రాత్ అనే శాస్త్రవేత్తలు కూడా కనీస ఆహార పదార్థాల శక్తి 2250 కేలరీలనే దారిద్ర్యరేఖకు ప్రాతిపదికగా తీసుకున్నారు. 1960-61 ధరలలో గ్రామాలలో నెలసరి ఆదాయం రూ॥లు 15/-గాను, పట్టణాల్లో రూ॥22.5/- లను పేదరిక రేఖగా తీసుకొని పేదరికాన్ని అంచనా వేయ్యటం జరిగింది. 1960-61వ సం॥ము మరియు 1969-70 సంవత్సరాలలో దారిద్రరేఖ దిగువన ఉన్న జనాభా శాతం 41. కాని జనాభా మాత్రము 1960-61లో 177 మిలియన్లు ఉండగా 1969-70లో 215 మిలియన్లు ఉన్నారు. అంటే 1960-61 సం॥ నుండి 1969-70 సం॥మునకు పేదరికంలో ఉన్న జనాభా 38 మిలియన్లు పెరగటం జరిగింది.

గ్రామీణ పేదరికంపై మిన్హాస్ అంచనాలు :

NSS సమాచారంపై ఆధారపడి మిన్హాస్ 1960-61 ధరల ప్రకారం నెలకు 20 రూ॥లు కనీస జీవన వ్యయంగా అంచనా వేసి (దారిద్ర్యరేఖ), 1956-57 సం॥ములో 65 శాతం (181 మిలియన్లు), 1963-64 సం॥లో 57.8 శాతం (221 మిలియన్లు), 1973-74 సం॥లో 50.6 శాతం (210 మిలియన్లు) గ్రామీణ జనాభా పేదరికంలో ఉన్నట్లు ప్రకటించటం జరిగింది. 1956-57వ సం॥ము నుంచి 1963-64 సం॥మునకు గ్రామీణ పేదరిక శాతం 65 నుంచి 57.8కి తగ్గినట్లు కనిపించినా గ్రామీణ పేదల సంఖ్య మాత్రం 181 మిలియన్లు నుంచి 221 మిలియన్లకు పెరిగింది. 1963-64 నుంచి 1973-74కు గ్రామీణ పేదరిక శాతం 7.2కు తగ్గినా పేదలు మాత్రం కేవలం 11 మిలియన్లే తగ్గారు.

యఫ్) ఏడో ఫైనాన్స్ కమిషన్ అంచనాలు :

ఏడో ఫైనాన్స్ కమిషన్ వృద్ధి చేసిన దారిద్ర్యరేఖ (Augmented Poverty line) ఆధారంగా పేదరికాన్ని అంచనా వేయటం జరిగింది. వృద్ధి చేసిన పేదరిక రేఖ లో NSS వారు లెక్కించే గృహ వినియోగ వ్యయంతో పాటు, ప్రభుత్వ వ్యయాలు వచ్చే లాభాలను కూడా జతచేయటం జరిగింది. ఈ పద్ధతిలో నెలవారి తలసరి కుటుంబ వినియోగ వ్యయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నెలవారి తలసరి వ్యయం అనగా (ఎ) ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ (బి) నీటి పథకాలు, శానిటేషన్‌ల (సి) విద్య (డి) పోలీసు, జైళ్ళు, కోర్టులు నిర్వహణ (ఇ) రోడ్లు (యఫ్) సాంఘీక సంక్షేమము లను కూడా జతచేయటం జరిగింది. 1970-71వ సం॥ము రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయాలను ఇందుకోసం ఉపయోగించటం జరిగింది.

ఏడో ఫైనాన్స్ కమిషన్ అంచనాల ప్రకారం 1970-71వ సం॥లో భారతదేశంలో 52.0 శాతం జనాభా (227 మిలియన్లు) పేదరికంలో ఉన్నట్లు తెలుస్తుంది. అందులో 53 శాతం (225 మిలియన్లు) గ్రామాలలోను, 51 శాతం (52 మిలియన్లు) పట్టణాలలో ఉన్నట్లు తెలుస్తుంది. దారిద్ర్య రేఖను విస్తరించటం వల్ల గతంలో కన్నా పేదరికం ఎక్కువగా ఉన్నట్లు ఈ ఫలితాలు వెల్లడిస్తాయి.

జి) ప్రపంచ బ్యాంకు అంచనాలు :

ప్రణాళికా సంఘం, నేషనల్ శాంపిల్ సర్వే, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ వారు ఉపయోగించిన పద్ధతుల నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు భారతదేశ పేదరిక అంచనాలను వేయటం జరిగింది. 1983 ధరల్లో గ్రామీణ పేదరిక రేఖను నెలకు రూ॥ 89/- గాను పట్టణాలలో రూ॥ 112.2/-లను ప్రాతిపదికగా తీసుకొని అంచనా వేయగా 1983వ సంవత్సరంలో 252 మిలియన్ల గ్రామిణ జనాభా (44.9 శాతం), 65 మిలియన్ల పట్టణ జనాభా (36.4 శాతం), మొత్తం మీద 317 మిలియన్ల జనాభా దారిద్ర్యరేఖ దిగువ ఉన్నట్లు తేలింది. 1988 వ సం॥మునకు వేసిన అంచనాప్రకారం భారత దేశంలో 322 మిలియన్ల జనాభా పేదరికంలో ఉన్నట్లుగాను, అందులో 252 మిలియన్లు (41.7 శాతం) పల్లెల్లో, 70 మిలియన్లు (33.6శాతం) పట్టణాల్లో ఉన్నట్లు వెల్లడి అయ్యింది.

హెచ్) మిన్హాస్, బైన్, టెండూల్కర్ అంచనాలు :

ఆర్థికవేత్తలైన మిన్హాస్, బైన్, టెండూల్కర్‌లు NSS సమాచార ఆధారంగా గ్రామాలలోని వ్యవసాయ కార్మికుల సర్దుబాటు చేసిన వినియోగ వస్తువుల ధరసూచీ ప్రాతిపదికగా (CPIAL) పేదరిక అంచనాలు వెయ్యటం జరిగింది. పట్టణాల పేదరిక అంచనాల కోసం పట్టణాలలోని పారిశ్రామిక కార్మికుల వినియోగ, వస్తువుల ధర చూచీ (CPIIW) మరియు ఇతర పారిశ్రామిక పనివారల (CPINM) వినియోగ వస్తుధర సూచీల ఆధారంగా పేదరిక అంచనాలు వెయ్యటం జరిగింది. ఈ అంచనాల ప్రకారం పట్టిక - 5.1 లో చూపినట్లుగా భారతదేశంలో 1987-88 నాటికి గ్రామీణ పేదరికం 44.9 శాతం (284 మిలియన్లు), పట్టణాలలో 36.5 శాతం (36.5 మిలియన్లు), భారతదేశంలో 42.7 శాతం (361 మిలియన్లు) ఉందని అంచనా.

వీరి అంచనాల ప్రకారం భారతదేశంలో గ్రామీణ పేదరిక శాతం 1970-71లో 57.3 ఉండగా 1987-88 నాటికి 44.9 శాతానికి తగ్గింది. పట్టణ పేదరిక శాతం 1970-71లో 45.9 ఉండగా 1987-88కి 36.5 శాతానికి తగ్గింది. భారతదేశం మొత్తం మీద 1970-71లో 51.1 శాతం ఉన్న పేదరికం 1987-88 నాటికి 42.7 శాతానికి తగ్గింది. వీరి అంచనాల ప్రకారం 1970-71 నుంచి 1987-88 మధ్యకాలంలో పేద ప్రజల పెరుగుదల రేటు సాలీనా 0.9 శాతం ఉండగా, జనాభా పెరుగుదల రేటు 2.2 శాతం ఉందని కావున పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు పేదరిక తగ్గుదలకు దోహదం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

ఐ) ప్రణాళికా సంఘం అంచనాలు :

1989లో రూపొందించబడిన ప్రణాళికా సంఘం యొక్క నిపుణుల కమిటీ ప్రొ॥ D.T. లక్డావాల అధ్యక్షతన పేదరిక అంచనాలు 1973-74 నుంచి 1987-88 సం॥లకు వేసి 1993లో సమర్పించటం జరిగింది. ఈ అంచనాలు ఆధార సం॥ము 1973-74, దారిద్రరేఖ గ్రామ ప్రాంతాల్లో రూ॥ 115.43గానూ, పట్టణాలో రూ॥లు 165.58 గాను తీసుకుని పేదరిక శాతాన్ని అంచనా వెయ్యటం జరిగింది. ఈ అంచనాల ప్రకారం భారతదేశంలో 1987-88 సం॥లో గ్రామీణ పేదరికం 39.1 శాతం (229 మిలియన్లు), పట్టణ పేదరికం 40.2 శాతం (83 మిలియన్లు) మొత్తం మీద భారతదేశంలో 39.1 శాతం (361 మిలియన్లు) ఉంది.

వీరు తలసరి కేలరీల శక్తికి సంబంధించిన ప్రాతిపదికన పేదరికాన్ని లెక్కించి వేసిన అంచనాల ప్రకారం భారతదేశ పేదరిక గణాంకాల వివరాలు.

1. 1973-74 వ సం॥లో గ్రామీణ పేదరికం 56.4 శాతం ఉండగా 1987-88కి 39.1కి తగ్గింది.
2. పట్టణ పేదరికం 1973-74లో 49.2 శాతం కాగా 1987-88కి 40.1కి తగ్గింది.
3. భారతదేశం మొత్తం మీద పేదరికం 1973-74లో 54.9 శాతం ఉండగా 1987-88కి 39.3కు తగ్గింది.

వీరి అంచనాల ప్రకారం మొత్తం పేదరిక నిష్పత్తి 14 సం॥ల కాలంలో 15.6 శాతం తగ్గింది, సగటున సంవత్సరానికి 1.2 శాతం తగ్గింది. గ్రామాలలో పెరుగుచున్న నిరుద్యోగిత వల్ల గ్రామాలవారు పట్టణాలకు తరలివెళ్లటం వల్ల పట్టణాల్లో పేదరిక శాతం ఎక్కువగాను పల్లెల్లో తక్కువగా ఉన్నట్లు ఫలితాలు వెల్లడిస్తాయి.

ప్రణాళికా సంఘం 1996-97 అంచనాల ప్రకారం గ్రామీణ పేదరికం 30.6 శాతం (211 మిలియన్లు) పట్టణ పేదరికం 25.6 శాతం (66 మిలియన్లు) మొత్తం మీద పేదరికం 29.2 శాతం (277 మిలియన్లు ఉన్నట్లు అంచనా).

5.4 శ్రీఐఐం యొక్క 55వ రౌండ్ పేదరిక అంచనాలు :

నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ జూలై 1999 నుంచి జూన్ 2000 కాలంలో అధిక శాంపిల్స్‌ను తీసికొని పేదరిక అంచనాలను పూర్తి చేసింది. ఈ అంచనాల ప్రకారం భారతదేశంలో పేదరికం 30 రోజుల రికాల్ దృష్ట్యా 26 శాతానికి, 7 రోజుల రికాల్ దృష్ట్యా 23.3 శాతానికి తగ్గిందని వెల్లడించింది.

గత అంచనాలలో NSSO కేవలం గడచిన 30 రోజుల కాలాన్ని ప్రాతిపదికగా తీసుకొని ప్రశ్నలు వేసి సమాధానాలు క్రోడీకరించటం జరిగేది. కాని 55వ రౌండ్ లో వేసిన ప్రశ్నలు అందుకు భిన్నంగా వస్త్రం, పాదరక్షలు, విద్య, ఆరోగ్యం మరియు మన్నికగల వస్తువుల విషయంలో 365 రోజుల కాలానికి ప్రశ్నలు అడగటం జరిగింది. ఆహారం, పొగాకు, మత్తు పదార్థాలు మొదలైన వాటి విషయంలో 30 రోజులకు, మరియు వారానికి ప్రశ్నలు వేసి సమాచారాన్ని రాబట్టటం జరిగింది. అందువల్లనే 55వ రౌండ్ పేదరిక అంచనాలను ఇతర అంచనాలతో పోల్చరాదని ఖచ్చితంగా వెల్లడించటం జరిగింది. ఈ అంచనాల వివరాలు పట్టిక 5.2 తెలియజేస్తుంది.

పట్టిక నం. 5.2

భారతదేశంలో పేదరిక అంచనాలు (శాతాలలో)

సంవత్సరం	భారతదేశం	గ్రామీణ	పట్టణ
1973-74	54.9	56.4	49.0
1977-78	51.3	53.14	45.2
1983	44.5	45.7	40.8
1987-88	38.9	39.1	38.2
1993-94	36.0	37.3	32.4
1999-2000			
30 రోజుల రికాల్	26.1	27.1	23.6
7 రోజుల రికాల్	23.3	24.0	21.6

గమనిక:- 1999-2000 అంచనాలను గత అంచనాలతో పోల్చరాదు. ఎందుకంటే ఈ అంచనాలు వేసే పద్ధతుల్లో, సేకరించిన సమాచారంలో స్వల్ప మార్పులు ఉన్నాయి.

మూలం:- Ministry of Finance, Goverment of India, Economic Survey (2000-01) P.13

ఈ అంచనాల ప్రకారం 1973-74 లో 54.9 శాతం ఉన్న పేదరికం 1993-94కు 36 శాతానికి తగ్గగా 1999-2000 సం॥రానికి 30 రోజుల రీకాల్ ప్రకారం 26.1 శాతానికి, 7 రోజుల రికాల్ ప్రకారం 23.3 శాతానికి తగ్గింది. గ్రామీణ పేదరికం 1973-74 లో 56.4 శాతం ఉండగా 1993-94కు 37.3 శాతానికి, 1999-2000 లో 30 రోజుల రికాల్ ప్రకారం 27.1 శాతం, 7 రోజుల రికాల్ ప్రకారం 24 శాతానికి తగ్గింది. పట్టణ పేదరిక శాతాలు 1973-74లో 49 ఉండగా 1993-94కు 32.4 శాతానికి, 1999-2000 లో 30 రోజుల రికాల్ ప్రకారం 23.6 శాతానికి, 7 రోజుల రికాల్ ప్రకారం 21.6 శాతానికి తగ్గింది.

5.4.1 రాష్ట్రాల వారీగా పేదరికం :

NSSO వారి రాష్ట్రాల వారీగా పేదరిక అంచనాలను క్రింది పట్టిక -5.3 తెలియజేస్తుంది. ఈ పేదరిక శాతాలు గమనిస్తే పేదరిక తగ్గుదలలో అనేక ఒడుదుడుకులు కనిపిస్తాయి. 1993-94 నుంచి 1999-2000 సం॥లలో అన్ని రాష్ట్రాల్లో గ్రామీణ పేదరికం

తగ్గింది. పట్టణ పేదరికాన్ని గమనిస్తే ఒరిస్సాలో పెరగగా మిగిలిన అన్ని రాష్ట్రాల్లో తగ్గింది, పేదరిక తగ్గుదల వివిధ రాష్ట్రాలలో వివిధ రకాలుగా ఉంది. కొన్ని రాష్ట్రాలలో ఎక్కువ పాయింట్ల శాతం తగ్గగా మరికొన్ని రాష్ట్రాల్లో స్వల్ప పాయింట్ల శాతం తగ్గింది. స్థూలంగా భారతదేశం మొత్తం మీద గ్రామీణ పేదరికం 1993-94లో 37.3 శాతం ఉండగా 1999-2000 నాటికి 27.1 శాతానికి తగ్గింది. పట్టణ పేదరికం 1993-94లో 32.4 శాతం ఉండగా 1999-2000 నాటికి 23.6 శాతానికి తగ్గింది. ఈ అంచనాలపై విభిన్న శాస్త్రవేత్తలకు ఏకాభిప్రాయం లేదు. ఈ మధ్య కాలంలో జరిపిన పరిశోధనలు భారతదేశంలో పేదరిక తగ్గుదల ధోరణులు కన్పించలేదని వెల్లడిస్తున్నాయి. అందుకు భిన్నంగా 55వ రౌండ్ NSSO సమాచారం పేదరికం గణనీయంగా తగ్గినట్లు తెలియజేస్తుంది.

పట్టిక నం 5.3

భారతదేశంలో రాష్ట్రాల వారీగా పేదరిక శాతాలు

	గ్రామీణ		పట్టణ	
రాష్ట్రం	1993-94	1999-2000	1993-94	1999-2000
1. ఆంధ్రప్రదేశ్	15.9	11.2	38.3	26.6
2. అరుణాచల్‌ప్రదేశ్	45.0	40.0	7.7	7.5
3. అస్సాం	45.0	40.0	7.7	7.5
4. బీహార్	58.2	44.3	34.5	32.9
5. గుజరాత్	22.2	13.2	27.9	15.6
6. హర్యానా	28.0	8.3	16.4	10.0
7. హిమాచల్‌ప్రదేశ్	30.3	7.9	9.2	4.6
8. జమ్మూ, కాశ్మీర్	30.3	4.0	9.2	2.0
9. కర్నాటక	29.9	17.4	40.1	25.3
10. కేరళ	25.8	9.4	24.5	20.3
11. మధ్యప్రదేశ్	40.6	37.1	48.4	38.4
12. మహారాష్ట్ర	37.9	23.7	35.2	26.8
13. మేఘాలయ	45.0	40.0	7.7	7.5
14. నాగాలాండ్	45.0	40.0	7.7	7.5
15. ఒరిస్సా	49.7	48.0	41.6	42.8
16. పంజాబ్	11.9	6.4	11.4	5.8
17. రాజస్థాన్	26.5	13.7	30.5	19.8
18. తమిళనాడు	32.5	20.6	39.8	22.1
19. ఉత్తరప్రదేశ్	42.3	31.2	35.4	30.9
20. పశ్చిమ బెంగాల్	40.8	31.9	22.4	14.9

గమనిక:

దారిద్ర రేఖలు : నెలకు తలసరి ఆదాయం రూ॥లో

	గ్రామీణ	పట్టణ
1993-94	211.30	274.88
1999-2000	327.56	454.11

మూలము: ప్రణాళికా సంఘం.

5.5 ప్రణాళికా సంఘం అంచనాల ప్రకారం భారతదేశంలో పేదరికం:

వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రణాళికా సంఘం వారి అంచనాల ప్రకారం పేదరిక వివరాలు పట్టికలో పొందుపర్చటం జరిగింది. 1987-88 నుంచి 1999-2000 మధ్య కాలంలో దారిద్ర్యరేఖ దిగువనున్న జనాభా, జనాభా శాతం, పేదరిక తగ్గుదల వివరాలు క్రింది పట్టిక తెలియజేస్తుంది. పట్టికలో గణాంకాలను బట్టి భారతదేశంలో పేదరిక శాతం 1987-88లో 38.9 శాతం ఉండగా 1993-94కు 36.0 శాతానికి, 1999-2000 సం॥నికి 26.1 శాతానికి తగ్గింది. 1987-88 నుంచి 1993-94కు 2.9 శాతం తగ్గగా, 1993-94 నుంచి 1999-2000కు 9.9 శాతం తగ్గింది.

రాష్ట్రాల పేదరిక స్వరూపాన్ని గమనిస్తే 1987-88 నుంచి 1993-94 కాలంలో ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, జమ్మూ-కాశ్మీర్, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, బీహార్‌లలో పేదరికం శాతం పెరగగా, మిగిలిన వాటిలో తగ్గింది, దేశం మొత్తం మీద కూడా తగ్గటం జరిగింది. 1993-94 నుంచి 1999-2000 కాలంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పేదరికం తగ్గింది. ఈ మార్పులు వివిధ రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వివిధ రకాలుగా ఉన్నట్లు పట్టికల్లో గమనించవచ్చు. భారతదేశంలో ఆర్థిక సంస్కరణ ప్రభావం పేదరికంపై ప్రభావం చూపినట్లు 1993-94 నుంచి 1999-2000 సం॥లలో వచ్చిన పేదరిక తగ్గుదల శాతాలు తెలియజేస్తాయి.

భారతదేశ పేదరిక స్వరూపం స్థూలంగా గమనిస్తే 7 ముఖ్య రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలు 2,319 లక్షల పేదలను 1993-94లో కలిగి ఉండటం అంటే పేద ప్రజల్లో 72.4 శాతం కలిగి ఉండటం జరిగింది. అంటే పేదప్రజలు ఈ 7 రాష్ట్రాల్లోనే అధికంగా కేంద్రీకృతం అయ్యారనేది వెల్లడౌతుంది.

ప్రణాళికా సంఘం అంచనాల ప్రకారం దారిద్ర్య రేఖ దిగువనున్న జనాభా

రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతం	జనాభా (లక్షలలో)			జనాభా నిష్పత్తి (మొత్తం జనాభాలో శాతం)			పేదరిక తగ్గుదల	
	1987 - 88	1993 - 94	1999 - 2000	1987 - 88	1993 - 94	1999 - 2000	1987 - 88 to 1993 - 94	1993 - 94 to 1999 - 94
1. ఢిల్లీ	10.3	15.5	11.5	12.4	14.7	8.2	-2.3	6.5
2. పంజాబ్	25.2	25.1	14.5	13.2	11.8	6.2	1.4	5.6
3. చండీఘర్	0.8	0.8	0.5	14.7	11.4	5.7	3.3	5.7
4. హిమాచల్ ప్రదేశ్	7.5	15.9	5.1	15.5	28.4	7.6	-12.9	20.8
5. డామన్ & డయ్యూ	-	0.2	0.1	-	15.8	4.4	-	11.4
6. హర్యానా	25.4	43.9	17.3	16.6	25.1	8.7	-8.5	16.4
7. జమ్మూ & కాశ్మీర్	17.0	20.9	3.5	23.8	25.2	3.5	-1.4	21.7
8. గోవా	3.0	1.9	0.7	24.5	14.9	4.4	9.6	10.5
9. ఆంధ్రప్రదేశ్	160.4	154.0	119.0	25.9	22.2	15.8	3.7	12.1
10. కేరళ	88.5	76.6	41.0	31.8	25.4	12.7	6.4	6.3
11. మిజోరామ్	1.7	1.9	1.8	27.5	25.7	19.5	1.8	6.2
12. మణిపూర్	5.3	6.8	7.2	31.4	33.8	28.5	-2.4	5.3
13. గుజరాత్	122.4	105.2	67.9	31.5	24.2	14.1	7.3	6.8
14. మేఘాలయ	5.5	7.4	8.2	33.9	37.9	33.9	-4.0	4.0
15. నాగాలాండ్	3.7	5.1	5.5	34.4	37.9	32.7	-3.5	5.2
16. లక్షద్వీప్	0.2	0.1	0.1	35.0	25.0	15.6	10.0	9.4
17. రాజస్థాన్	142.9	128.5	81.8	35.2	27.4	15.3	7.8	7.5
18. సిక్కిం	1.4	1.8	2.1	36.1	41.4	36.6	-5.3	4.8
19. త్రిపుర	8.8	11.8	13.0	35.2	39.1	34.4	-3.9	4.7
20. అస్సాం	75.8	96.4	94.6	36.2	40.9	36.1	-4.7	4.8
21. అరుణాచల్‌ప్రదేశ్	2.8	3.7	4.0	36.2	39.4	33.5	-3.2	3.3

22. కర్నాటక	158.6	156.5	104.4	37.5	33.2	20.0	4.2	13.2
భారత దేశం	3070.5	3203.7	2602.5	38.9	36.0	26.1	2.9	9.9
23. మహారాష్ట్ర	296.3	305.2	228.0	40.4	36.9	25.0	3.5	11.9
24. ఉత్తర ప్రదేశ్	536.5	604.5	529.9	41.5	40.9	31.2	0.6	9.7
25. పాండిచ్చేరి	3.1	3.3	2.4	41.5	37.4	21.7	4.1	15.7
26. మధ్యప్రదేశ్	264.3	298.5	298.5	43.1	42.5	37.4	0.6	5.1
27.అండమాన్‌నికోబార్	1.1	1.1	0.8	43.9	34.5	21.0	9.4	13.5
28. తమిళనాడు	231.1	202.1	130.5	43.4	35.0	21.1	8.4	13.9
29. పశ్చిమబెంగాల్	283.6	254.6	213.5	44.7	35.7	27.0	9.0	8.7
30. బీహార్	420.9	493.4	425.6	52.1	55.0	42.6	-2.9	12.4
31. ఒరిస్సా	165.9	160.6	189.1	55.6	48.6	47.1	7.0	1.5
32. దాద్రా & నగర్‌హైవేలి	0.8	0.8	0.3	67.1	50.8	17.1	16.3	33.7

మూలం: ప్రణాళికా సంఘం స్మరణలు.

5.6 భారతదేశంలో పేదరికానికి కారణాలు లేదా లక్షణాలు :

భారత ఆర్థిక వ్యవస్థను పట్టిపీడిస్తున్న సమస్యల్లో ముఖ్యమైనది దారిద్ర్యం. భారతదేశంలో పేదరికము సామాజిక, ఆర్థిక సమస్య. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీషు వలస పాలన భారతదేశాన్ని మరింత పేదరికానికి గురిచేసింది. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం పేదరికాన్ని అతిముఖ్యమైన సమస్యగాను, ఇతర సమస్యలకు పేదరికమే మూలకారణం అని భావించి పేదరిక నిర్మూలనా కార్యక్రమాలను అమలుచేసింది. ఈ కార్యక్రమాలు పేదరిక తగ్గుదలకు దోహదం చేసినా నేటికినీ భారతదేశంలో NSSO వారి 55వ రౌండ్ ప్రకారం 23.6 శాతం ఉంది. ఈ పేదరికానికి కారణమైన వివిధ లక్షణాలు లేదా కారణాలను గూర్చి ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ఎ) జనాభా పెరుగుదల :

ఏ దేశంలోనైనా అధిక జనాభా ఆర్థికాభివృద్ధికి ప్రతిబంధకము. భారతదేశ పేదరిక కారణాలలో జనాభా పెరుగుదల ఒకటి. భారతదేశ జనాభా 1901 లో 236 మిలియన్లు కాగా 1951 నాటికి 361 మిలియన్లు, 2001 నాటికి 1027 మిలియన్లు, కాని భూమి మాత్రం నాటికి నేటికి అంతే పరిమాణంలో ఉంది. అందుచేత భూమి-మానవనిష్పత్తి త్వరితంగా తగ్గింది. కాని ఉపయోగంలో ఉన్న భూమికాని సాంకేతిక ప్రగతిలో గాని మార్పులు పెరుగుచున్న జనాభాకు అనుగుణంగా లేవు. 1991-2001 దశాబ్దంలో సగటు సాలుసరి జనాభా వృద్ధిరేటు 1.93 శాతం. పెరుగుచున్న జనాభా వల్ల ఆహార పదార్థాల కొరత ఏర్పడటం, అనుత్పాదక వినియోగదారులు పెరగటం, నిరుద్యోగ సమస్య ప్రభలటం మొదలైన అనేక సమస్యలకు కారణమై ఫలితంగా పేదరిక సమస్య జఠిలమౌతున్నది.

బి) ఆర్థిక అసమానతలు :

భారతదేశంలో ఉన్న ఆదాయ అసమానతలు పేదరికాన్ని మరింత ఉధృతంగా పెరిగేట్లు చేస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అసమానతల వల్ల భూమి, భౌతిక సంబంధమైన ఆస్తులు కొంతమంది చేతుల్లో ఉండటం వల్ల వారు ధనికులుగా ఉండగా భూమి, సంపదలు లేనివారు దారిద్ర్యంలో ఉండటం జరుగుతుంది. ధనికుల తలసరి ఆదాయం ఆధికంగా ఉన్నందున పెట్టుబడి కార్యకలాపాలు చేసేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవడం వల్ల ధనికులు మరింత ధనికులుగా మారుతూ, పేదలు కడు దరిద్రులుగా మారి పేదరికంలో మ్రగ్గుచున్నారు. వారసత్వ చట్టాలు కూడా ఆర్థిక అసమానతలకు కారణమై పేదరికాన్ని పెంపొందించటం జరుగుతోంది.

సి) వ్యవసాయరంగంపై అధిక వత్తిడి :

భారతదేశంలో వ్యవసాయరంగం అధికశాతం జనాభాకు ఉపాధి పదుపాయాన్ని కల్పిస్తుంది. 1999-2000 ప్రకారం 56.7 శాతం జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారు. పారిశ్రామిక రంగం, సేవా రంగం త్వరితగతిని విస్తరించక పోవటం వల్ల పెరుగుచున్న జనాభా ఉపాధి కోసం వ్యవసాయరంగంపై ఆధారపడవలసి వస్తుంది. అందువల్ల వ్యవసాయరంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగిత పెరుగుతోంది. దీనితోపాటు ఋతు సంబంధమైన నిరుద్యోగిత, అల్పోద్యోగితలు వ్యవసాయ రంగంలో ఎక్కువ. అందుచేత వ్యవసాయరంగంలో ఉపాంత ఉత్పత్తి తగ్గి, శ్రామికుల ఆదాయాలు తగ్గి పేదరికానికి దారితీయడం జరుగుతుంది. మరోవైపు యాంత్రీకీకరణ ప్రభావం వల్ల వ్యవసాయరంగంలో కూడా ఉపాధి పదుపాయాలు తగ్గుచున్నాయి. ఈ వివిధ కారణాల వల్ల శ్రామికుల ఆదాయాలు తగ్గి పేదరికం ఏర్పడుతుంది.

డి)వ్యవసాయ రంగంలో అల్పోత్పాదకత :

భారతదేశంలో పేదరికానికి మరో కారణం వ్యవసాయరంగంలో అల్పోత్పాదకత. వ్యవసాయ ఉత్పాదకత పెరుగుచున్నప్పటికీ ఇతర దేశాలతో పోల్చితే మనదేశ ఉత్పాదకత తక్కువ. వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశ పెట్టకపోవడం,

అధిక దిగుబడి వంగడాలను ఉపయోగించక పోవడం, తగినంత నీటి పారుదల సదుపాయాలు లేకపోవడం వల్ల వ్యవసాయరంగ ఉత్పాదకత తక్కువగా ఉంది. అందువల్ల భారతదేశంలో పెరుగుచున్న జనాభాకు సంపద వ్యవసాయ ఉత్పత్తులు చేయలేకపోవడం జరుగుతుంది. అందువల్ల వ్యవసాయ ఉత్పత్తుల కొరత ఏర్పడి పేదరికానికి దారితీస్తుంది.

ఇ) సహజ వనరులను సద్వినియోగం చేసుకోలేక పోవడం :

భారతదేశంలో సహజవనరులు పుష్కలంగా ఉన్నాయి. మన దేశంలోని సహజవనరులైన భూమి, నీరు మొదలైన సహజవనరులను అభిలషణీయంగా ఉపయోగించుకోలేక పోవడం జరుగుతుంది. భారత దేశంలోని మొత్తం భూభాగంలో కేవలం 62 శాతం మాత్రమే (1999-2000) మనం వినియోగించుకోగలుగుచున్నాము. 1974 సం॥పు సమాచారం ప్రకారం మొత్తం వర్షపాతమైన 400 మిలియన్ హెక్టార్ల మీటర్లలో ఉపయోగించుకుంటున్నది 38 మిలియన్ హెక్టార్లు మాత్రమే. అదే విధంగా మత్స్య సంపద, ఖనిజ సంపద మొదలైన సహజ సంపదలు తక్కువ స్థాయిలో ఉపయోగించుకోవడం జరుగుతుంది. సహజ వనరుల అల్ప వినియోగం వల్ల ఉత్పాదకత తక్కువగా ఉండి, ప్రజల ఆదాయం తగ్గి పేదరికానికి దారి తీస్తోంది.

యఫ్) నిరుద్యోగం :

నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు ఒకదానినొకటి ప్రభావితం చేస్తూ ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తూ ఉంటాయి. భారతదేశంలో పేదరికానికి ఒక బలమైన కారణం నిరుద్యోగం. స్వాతంత్ర్యానంతరం భారతదేశం వ్యవసాయ, పారిశ్రామిక, తృతీయ రంగాల్లో గణనీయమైన కృషి చేసినా నేటికినీ నిరుద్యోగ సమస్య బలంగానే ఉంది. రానురాను ఉత్పత్తి కార్యకలాపాల్లో మూలధన సాంద్రత పద్ధతులను ఉపయోగించటం వల్ల శ్రామికులకు అదనపు ఉద్యోగాలు కల్పించకపోగా, ఉన్న ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతున్నది. ప్లానింగ్ కమిషన్ అంచనాల ప్రకారం 9వ ప్రణాళికా కాలంలో 106 మిలియన్లు నిరుద్యోగులుంటారు. ఈ విధంగా పెరుగుచున్న నిరుద్యోగితకు సరిపడ ఉపాధి సౌకర్యాలు అందకపోవడం వల్ల ప్రజల ఆదాయం స్థాయి తగ్గి పేదరికానికి కారణమౌతుంది. NSSO 55వ రౌండ్ లెక్కల ప్రకారం 1993-94 లో 6 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు 1999-2000 నాటికి 7.32 శాతానికి పెరిగింది. ఈ విధంగా పెరుగుచున్న నిరుద్యోగం పేదరికానికి కారణమౌతుంది.

జి) భారతదేశ అభివృద్ధి వ్యూహం :

భారతదేశంలో పేదరికం త్వరితంగా తగ్గకపోవటానికి మరో కారణం మన ప్రభుత్వం అవలంభిస్తున్న అభివృద్ధి వ్యూహం. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం భారీ పరిశ్రమలకు ప్రాధన్యతను ఇవ్వడం జరిగింది. భారీ పరిశ్రమలు ఎక్కువ మూలధనం, తక్కువ శ్రమతో ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహిస్తాయి. అందుచేత ఎక్కువ శ్రామికులకు ఉపాధి సౌకర్యాలు ఈ పరిశ్రమలు సమకూర్చలేకపోయాయి. శ్రమ సాంద్రత సాంకేతిక పద్ధతుల ఉపయోగం క్రమక్రమంగా క్షీణించటం వల్ల పెరుగుచున్న జనాభాకు అవసరమైన ఉపాధి లభ్యం కాలేదు. భారత ప్రభుత్వం అవలంభించే దారిద్ర్య నిర్మూలనా కార్యకలాపాల ఉద్దేశం ఆర్థిక వృద్ధితో పాటు పేదరిక నిర్మూలనను సాధించటం. అందువల్ల అభివృద్ధికి ప్రాధాన్యతను ఇవ్వటం వల్ల, పేదరికానికి ద్వితీయ స్థానం ఇవ్వటం వల్ల పేదరికం త్వరితంగా తగ్గటం లేదు. కావున పేదరిక నిర్మూలనే ముఖ్య ప్రాధాన్యతగా ప్రభుత్వ విధానాలను రూపొందించాల్సిన అవశ్యకత ఉంది.

హెచ్) రాజకీయ, సాంఘిక పరిస్థితులు :

భారతదేశ రాజకీయ, సాంఘీక పరిస్థితులు పేదరిక నిర్మూలనకు, ఆర్థిక అభ్యున్నతికి అనుగుణంగా లేవు. రాజకీయ పరిస్థితులను గమనిస్తే 1947కు పూర్వం భారతదేశం వలస ఆర్థిక వ్యవస్థగా ఉంది. బ్రిటీషు వారు అవలంబించిన వలసవిధానం ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టు. వారు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారు. పారిశ్రామికీకరణకు అవకాశం ఇవ్వలేదు. కేవలం వారి అభ్యున్నతికి

మన ఆర్థిక వ్యవస్థను ఉపయోగించుకున్నారే తప్ప మన ఆర్థిక ప్రగతిని నిర్లక్ష్యం చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా మన పరిపాలకుల్లో చిత్తశుద్ధి లేకపోవడం వల్ల, చేపట్టిన కార్యక్రమాలు సఫలీకృతం కావడంలేదు. ఈ విధంగా రాజకీయ కారణాలు మనదేశ పేదరికానికి కారణమౌతూ, ఆర్థిక ప్రగతిని ఆటంక పరచుచున్నాయి.

రాజకీయ కారణాలతో పాటు సాంఘీక కారణాలు కూడా పేదరికానికి కారణమౌతున్నాయి. మన దేశంలోని కులమత ఆచారాలు, సనాతన సాంప్రదాయాలు, గ్రామాల్లో పేదరికానికి కారణమౌతున్నాయి. సంకుచిత దృక్పధం, సాంఘీక కట్టుబాట్ల వల్ల దేశం పురోగమించటం లేదు. సాంఘీక పరిస్థితులు సమాజ స్థబ్ధతకు దారితీసి, చైతన్యాన్ని తగ్గించి, పురోగమత్వాన్ని నిరోధిస్తుంది. అందుచేత సాంఘీక పరమైన మార్పులేనిదే ప్రజలు చురుకుగా ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనలేరు. ఫలితంగా భారతదేశం పేదరికంగా కొనసాగుతుంది.

5.7 పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు :

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారత ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించేందుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఈ కార్యక్రమాలు ముఖ్యంగా ఉపాధిని పెంపొందించేవి లేదా ఉత్పాదకతను పెంపొందించేవి. పేదరిక నిర్మూలన కోసం సాంప్రదాయ పద్ధతుల కన్నా ఉద్యోగితను పెంపొందించే పద్ధతే దారిద్ర్యాన్ని తప్పనిసరిగా నిర్మూలిస్తుందని అరో పంచవర్ష ప్రణాళికా డాక్యుమెంట్ నందు వివరించటం జరిగింది. భారత ప్రభుత్వం పేదరిక నిర్మూలన కొసం చేపట్టిన చర్యలను రెండు రకాలుగా చెప్పవచ్చు. అవి (1) స్వల్ప కాలిక చర్యలు (2) దీర్ఘ కాలిక చర్యలు. భారత ప్రభుత్వం చేపట్టిన వివిధ పధకాలు ఉదా॥ గ్రామీణ పనుల కార్యక్రమం, సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం, జవహర్ రోజ్‌గార్ యోజన మొదలైనవి స్వల్ప కాలిక చర్యలుగా చెప్పవచ్చు. దీర్ఘకాలిక చర్యలలోకి భూసంస్కరణలు, జనాభా నియంత్రణ, వ్యవస్థాపరమైన చర్యలు మొదలైనవి వస్తాయి. ఈ చర్యలను గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

5.7.1 స్వల్పకాలిక పేదరిక నివారణ చర్యలు :

అల్పాదాయమే పేదరికానికి కారణం. అల్ప ఆదాయానికి కారణము అల్ప ఉత్పత్తి. అల్పోత్పత్తి నిరుద్యోగితకు కారణమౌతుంది. పరోక్షంగా పేదరికానికి ముఖ్యమైన కారణం నిరుద్యోగం. కావున భారత ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించటం ద్వారా పేదరికాన్ని నిర్మూలించే ప్రయత్నాలను చేస్తున్నది. ఈ విధంగా నిరుద్యోగ నిర్మూలన కోసం చేపట్టిన దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాలు స్వల్పకాలిక చర్యల జాబీతాలోకి వస్తాయి.

భారతదేశంలో క్రమ క్రమంగా పెరుగుచున్న పేదరికాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అనేక ఉద్యోగితా కార్యక్రమాలను చేపట్టటం జరిగింది. 1970వ సం॥ము నుంచి అనేక ప్రత్యేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టింది. 1970-71వ సం॥లో దుర్భిక్ష ప్రాంతాల కార్యక్రమం (Drought Prove Area Prgramme), 1971లో Crash Scheme for Rural Employment కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగింది. 1977-78వ సం॥లో ఎడారి ప్రాంతాల అభివృద్ధి ప్రోగ్రామ్ (Desert Development Programme), 1976-77లో పనికి ఆహార పధకం ప్రారంభించటం జరిగింది. గ్రామీణ యువకులకు స్వయం ఉపాధి కల్పించే నిమిత్తం 1979లో TRYSEM (Training Rural Youth For Self Employments), 1978వ సం॥లో అంత్యోదయ కార్యక్రమం ప్రారంభించటం జరిగింది. ఇవికాక వివిధ కార్యక్రమాలైన చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ. (Small Farmers Development Agency), ఉపాంత వ్యవసాయదారుల మరియు వ్యవసాయ కూలీల అభివృద్ధి ఏజెన్సీ (Marginal Farmers and Agricultural Labour Agency), భూమిలేని గ్రామీణ ప్రజల ఉపాంత భద్రతా పధకం మొదలైన కార్యక్రమాలు చేపట్టటం జరిగింది. కార్యక్రమాలు దేశం మొత్తానికి వర్తించే విధంగా కాక నిర్దేశించిన ప్రాంతాలకు, నిర్దేశించిన వర్గాలకు మాత్రమే పరిమితమయ్యాయి. కొన్ని సందర్భాలలో ఒకే విధమైన వర్గానికి వివిధ కార్యక్రమాలు వర్తించటం కూడా జరిగేది. కార్యక్రమాలు చేపట్టిననూ ఆశించిన విధంగా ఫలితాలను పొందలేక పోవటం జరిగింది. అందువల్ల సమగ్రమైన పధకాలను రూపొందించేందుకు ప్రయత్నాలను ప్రభుత్వం చేపట్టింది. ఈ సమగ్ర కార్యక్రమాలను సంక్షిప్తంగా వివరించటం జరిగింది.

ఎ) సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం (IRDP):

గతంలో కొనసాగుచున్న అనేక గ్రామీణాభివృద్ధి పథకాలైన, పనికి ఆహారపథకం (FFW), SFDA, MFAL, DPAP, DDP, CADP మొదలైన కార్యక్రమాల స్థానంలో సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాన్ని (Integrated Rural Development Programme) ఆరో పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అక్టోబరు 2, 1980లో 50॥ బ్లాకులలో ప్రారంభించటం జరిగింది. ప్రతి బ్లాకు నందు 600 పేద కుటుంబాలను ఎంపిక చేసి మొత్తం మీద 75 మిలియన్ల పేద కుటుంబాల వారిని 1985 నాటికి దారిద్ర్య రేఖను దాటించాలని ఉద్దేశించటం జరిగింది. ఈ పథకం నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 శాతంలో అందిస్తాయి.

ఈ పథకం లబ్దదారులలో సన్నకారు రైతులకు 25 శాతం, ఉపాంత వ్యవసాయదారులు, వ్యవసాయ కార్మికులు మరియు గ్రామీణ చేతివృత్తుల వారికి 33.3 శాతం, గిరిజనులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుంది. కమ్యూనిటీ కార్యక్రమాలైతే 50 శాతం సబ్సిడీ ఇవ్వటం జరుగుతుంది.

ఏడో ప్రణాళికా కాలంలో 182 లక్షల కుటుంబాలు లబ్ధిపొందగా అందులో 82 లక్షలు షెడ్యూల్డు కులాలు మరియు తెగలు, 34.3 లక్షలు స్త్రీ లబ్ధిదారులు. ఎనిమిదో ప్రణాళికా కాలంలో లబ్ధి పొందిన కుటుంబాలు 108.2 లక్షలు కాగా అందులో 54.1 లక్షలు షెడ్యూల్డు కులాలు మరియు తెగలు, 36.4 లక్షలు స్త్రీలు.

ఇప్పటివరకు ఈ కార్యక్రమం ద్వారా అనేక లక్షల కుటుంబాలు దారిద్ర్యరేఖ పై భాగానికి వచ్చినా, ఈ కార్యక్రమ అమలులో ఉన్న లోపాల వల్ల మరింత మెరుగైన ఫలితాలను సాధించలేకపోవటం జరిగింది. అవి (1) లబ్ధిదారుల ఎంపికలో ఉన్న లోపాలు (2) లబ్ధిదారులకు అవసరమైన అవస్థాపనా సదుపాయాలు లేకపోవటం వల్ల ఆశించినంత ఫలితాలు సాధించలేక పోవటం జరిగింది. ఈ లోపాలను అధిగమించే ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తున్నది. ఈ కార్యక్రమ ఫలితాలు గ్రామాలలోని పేదలలోని దిగువ వర్గాలకు అందినప్పుడే గణనీయ ఫలితాలను సాధించవచ్చు.

బి) భూమిలేని గ్రామీణ ప్రజల ఉపాధి భద్రతా కార్యక్రమం (RLEGP)

పేదరికాన్ని నిర్మూలిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత, అల్పోద్యోగితను తగ్గించేందుకు 1983లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమం భూమిలేని గ్రామీణ ప్రజల కొసం ఉద్దేశించినది. ఈ కార్యక్రమ లాక్ష్యాలు. (1) గ్రామాల్లోని భూమిలేని పేదలకు ఉద్యోగావకాశాలు కల్పించటం (2) గ్రామీణ అనస్థాపన సదుపాయాలను పెంపొందించటం. ఈ కార్యక్రమం పేదరికంలో ఉన్న ప్రజలకు ఎక్కువగా సహాయపడింది. ఈ కార్యక్రమం వల్ల ఆరో ప్రణాళిక చివరి రెండు సంవత్సరాలలో 260.18 మిలియన్ పని దినాలు కల్పించటం జరిగింది. ఏడో ప్రణాళికా కాలంలో 1985-86లో 247.58 మిలియన్ పనిదినాలు, 1988-89లో 296.56 మిలియన్ల పనిదినాల ఉద్యోగిత కల్పించబడింది. ఈ కార్యక్రమాన్ని 1989లో NREP తో మిళితం చేసి జవహర్ రోజ్‌గార్ యోజనగా రూపొందించటం జరిగింది.

సి) జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం (NREP)

గతంలోని పనికి ఆహార పథకాన్ని స్వల్ప మార్పులతో 1981-82 సం॥లో జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకంగా చేపట్టటం జరిగింది. ఈ కార్యక్రమ లక్ష్యాలు (1) గ్రామీణ ప్రాంతాలలోని స్త్రీ, పురుషులకు ఉద్యోగిత కల్పించటం (2) గ్రామీణ అవస్థాపనా సదుపాయాలు చేకూర్చటం (3) గ్రామీణ పేదల జీవన పరిమాణాన్ని పెంపొందించటం ఈ కార్యక్రమానికి సంబంధించి నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. 50:50 నిష్పత్తిలో చేకూర్చేవి. ఈ కార్యక్రమంలో 1986-87 నాటికి 395.23 పనిదినాలు, 1987-88 నాటికి 370.77 మిలియన్లు, 1988-89 నాటికి 394.96 మిలియన్లు పనిదినాలను కల్పించటం జరిగింది. ఆ తరువాత 1989లో ఈ కార్యక్రమం JRY లో విలీనమయ్యింది.

డి) జవహర్ రోజ్‌గార్ యోజన (JRY)

1981వ సం॥లో ప్రారంభించిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (NREP), 1983లో ప్రారంభించిన గ్రామీణ భూమిలేని వ్యవసాయ కార్మికుల ఉపాధి పథకాలను (RLEGP) మిళితం చేసి 1989లో జవహర్ రోజ్‌గార్ యోజన కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగింది. భారతదేశంలో గ్రామీణ నిరుద్యోగులకు, అల్పోద్యోగులకు పని కల్పించి, దారిద్ర్య రేఖను దాటించటం ఈ కార్యక్రమ ప్రాథమిక లక్ష్యం కాగా వివిధ ద్వితీయ లక్ష్యాలను కలిగి ఉంది. అవి : (ఎ) గ్రామీణ అవస్థాపనను కల్పించటం ద్వారా నిలకడగా ఉద్యోగితను కల్పించటం (బి) సామాజిక, కమ్యూనిటీ ఆస్తులను కల్పించటం (సి) పేదలకు ఉద్యోగావకాశాలు కొనసాగే విధంగా సామాజిక ఆస్తులకు ఏర్పాటు చెయ్యటం (డి) వేతనాలపై అనుకూల ప్రభావాన్ని కల్పించటం (ఇ) గ్రామిణ ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచటం. ఈ కార్యక్రమం దారిద్ర్యరేఖ దిగువన ఉన్న గ్రామీణ ప్రజలకోసం ఉద్దేశించటం జరిగింది. ఈ కార్యక్రమానికి 80 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం, 20 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం చేకూర్చుతాయి.

జవహర్ రోజ్‌గార్ యోజన కార్యక్రమంలో 1989-93 సం॥లలో 4,332 మిలియన్ పనిదినాలు కల్పించాలని నిర్దేశిస్తే, సాధించినది 4283 పనిదినాలు. అంటే దాదాపు 97 శాతం లక్ష్యం సాధించటం జరిగింది. ఈ పనిదినాల్లో 1605 మిలియన్ పనిదినాలు షెడ్యూల్డు కులాల వారికి, 776 మిలియన్ల పనిదినాలు షెడ్యూల్డు జాతుల వారికి కల్పించటం జరిగింది. మొత్తం పనిదినాల్లో 55.6 శాతం పనిదినాలు SC/ST లకు కల్పించటం జరిగింది. JRY కార్యక్రమం గ్రామాల్లో అవస్థాపన సదుపాయాలు కల్పించటంతో పాటు దారిద్ర్యరేఖ దిగువనున్న పేదలను పైకి తీసుకురావటానికి ఎంతో దోహదపడింది. ఈ కార్యక్రమంలో అంతర్భాగంగా కొనసాగిన మిలియన్ బావుల కార్యక్రమంలో (Millian Wells Programme) 1988-89వ సం॥లో 10 లక్షల బావులు నిర్మించగా, 1997-98 నుంచి 1998-99 సం॥లో అదనంగా 1.9 లక్షల బావులు నిర్మించటం జరిగింది. JRY లో మరో అంతర్భాగమైన ఇందిరా ఆవాస్ యోజనలో (IAY) 1989-90 నుంచి మార్చ్ 2001 నాటికి 67.5 లక్షల ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యింది. ఈ విధంగా పేదల అభ్యున్నతికి JRY కార్యక్రమం ఎంతో దోహదం చేసింది.

ఇ) జవహర్ గ్రామ సమృద్ధి యోజన (JGSY):

1989 వ సం॥లో ప్రారంభమైన JRY కార్యక్రమాన్ని స్వల్ప మార్పులతో జవహర్ గ్రామ సమృద్ధి యోజనగా పేరు మార్చి 1999 నుంచి అమలుచేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి కూడా కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 నిష్పత్తిలో నిధులను సమకూర్చుతాయి. ఈ కార్యక్రమ అమలులోనే స్వల్పమైన మార్పులు ఉన్నాయి. ఈ కార్యక్రమం ద్వారా 2000 - 2001 సం॥లో 88.5 మిలియన్ పనిదినాలను కల్పించటం జరిగింది.

యఫ్) స్వర్ణ జయంతి గ్రామ స్వరాజ్‌గార్ యోజన (SGSY):

1999లో ప్రారంభమైన జవహర్ గ్రామ సమృద్ధి యోజనను, ఉపాధి భద్రతా కార్యక్రమాన్ని (Employments Assurance Scheme) మిళితం చేసి 2001 లో స్వర్ణ జయంతి గ్రామ స్వరాజ్‌గార్ యోజన అనే కార్యక్రమంగా అమలు చేయటం జరుగుచున్నది.

స్వర్ణ జయంతి సహారి రోజ్‌గార్ యోజన (SJSRY):

ఈకార్యక్రమాన్ని 1999లో ప్రారంభించటం జరిగింది. అప్పటివరకూ కొనసాగుచున్న సమగ్ర గ్రామీణాభి వృద్ధి కార్యక్రమం (IRDP), మిలియన్ బావుల కార్యక్రమాను విలీనం చేసి స్వర్ణ జయంతి సహారీ రోజ్‌గార్ యోజనగా అమలు చేయటం జరుగుతుంది. గ్రామాల్లో ఉన్న పేదల ద్వారా ఏర్పాటైన స్వయం సహాయక బృందాలు మైక్రో ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు చేసుకోవటానికి అవసరమైన పరపతిని అందించి, దారిద్ర్యరేఖ దిగువనున్న ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం సహాయపడుచున్నది.

జి) స్వర్ణ జయంతి సహారి రోజ్‌గార్ యోజన (SJSRY):

1997కు పూర్వమున్న దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాలైన నెహ్రూ రోజ్‌గార్ యోజన, ప్రధానమంత్రి సమగ్ర పట్టణ పేదరిక నిర్మూలనా కార్యక్రమం (Prime Minister's Integrated Urban Poverty Alleviation Programme), పట్టణ కనీస సేవల కార్యక్రమాలను (Urban Basic Services Programme) మిళితం చేసి ఈ కార్యక్రమాన్ని రూపొందించటం జరిగింది. పట్టణంలో ఉన్న నిరుద్యోగులు, అల్పోద్యోగులకు స్వయం ఉపాధి సదుపాయాన్ని కల్పించి ఉపాధి కల్పించటం ఈ కార్యక్రమ ఉద్దేశం. ఈ కార్యక్రమానికి నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 75:25 శాతంలో సమకుర్చుతాయి.

హెచ్) ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన (PMRY):

ఏనిమిదో ప్రణాళికా కాలంలో విద్యావంతులైన యువకులకు ఉపాధి కల్పించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎనిమిదో ప్రణాళికాంతానికి 7 లక్షల మైక్రో ఎంటర్‌ప్రైజస్ స్థాపించబడ్డాయి.

ఐ) ఉపాధి భద్రతా కార్యక్రమం (Employment Assurance Scheme)

మహారాష్ట్ర ప్రభుత్వ Employment Guarentee Scheme నమూనాలో భారత ప్రభుత్వం 1993వ సం॥లో Employment Assurance Scheme ను ప్రారంభించటం జరిగింది. ఈ ఉపాధి భద్రతా కార్యక్రమంలో నైపుణ్యంలేని స్త్రీ, పురుష శ్రామికులకు (16నుంచి 60 సం॥లోపు) 100 రోజులు ఉపాధిని కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించటం జరిగింది. దారిద్ర్యరేఖ దిగువనున్న కుటుంబాలలో ఇద్దరు మాత్రమే ఈ కార్యక్రమంలో లబ్ధిపొందనర్హులు.

ఈ కార్యక్రమం ద్వారా 1993-94 సం॥లో 494.74 లక్షల పనిదినాలు లభ్యం కాగా 1999-2000 సం॥లో 2,786.17 లక్షల పనిదినాలు లభ్యమయ్యాయి. ఈ కార్యక్రమం సం॥మునకు సగటున అందిస్తున్న పనిదినాలు 41.3 రోజులు. ఈ పనిదినాల లక్ష్యమైన మనిషికి 100 రోజులు (సంవత్సరానికి) స్థాయి అందించగలిగితే ఈ కార్యక్రమ లబ్ధిదారులందరూ పేదరిక రేఖను దాటగలరు.

5.7.2 దీర్ఘకాలిక పేదరిక నిర్మూలనా చర్యలు :

ప్రత్యక్షంగా పేదరికాన్ని నిర్మూలించే ఉద్దేశంతో కాకున్నను పరోక్షంగా పేదరికాన్ని ఉద్దేశించి లేదా పేదరికంపై ప్రభావాన్ని చూపే చర్యలను దీర్ఘకాలిక పేదరిక నిర్మూలనా చర్యలుగా వివరించటం జరిగింది. అవి (ఎ) భూసంస్కరణల అమలు (బి) గ్రామీణ పారిశ్రామికీకరణ (సి) అక్షరాస్యతను పెంపొందించటం (డి) జనాభా నియంత్రణ (ఇ) పంస్థవరమైన మార్పులు చేపట్టటం మొదలైనవి. వీటిని గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

ఎ) భూసంస్కరణలు:

భారతదేశంలోని భూమిలేని శ్రామికులకు భూవసతి కల్పించటం, కౌలుదారులకు యాజమాన్య హక్కు కల్పించటం, గిరిజనుల జీవనాన్ని మెరుగుపరచటం, పేదలకు భూపదుపాయాన్ని పెంపొందించటం మొదలైన ఉద్దేశాలతో భూసంస్కరణలను అమలు చెయ్యటం జరిగింది. భారతదేశంలో చేపట్టిన భూసంస్కరణలు (ఎ) మధ్యవర్తుల తొలగింపు (బి) భూగరిష్ట పరిమితి విధింపు (సి) కౌలు సంస్కరణలు (డి) సహకార వ్యవసాయం మొదలైనవి. వీటిని అమలు చేయటం ద్వారా పేదరిక నిర్మూలనకు అవకాశం ఏర్పడింది. కాని ఈ సంస్కరణలు సమర్థవంతంగా అమలుకాలేదు. భూసంస్కరణలు సమర్థవంతంగా అమలు చేస్తే పేదరికం గణనీయంగా తగ్గుతుంది.

బి) గ్రామీణ పారిశ్రామికీకరణ :

భారతదేశ గ్రామీణ వ్యవస్థలో గ్రామీణ పరిశ్రమలు కీలక స్థానాన్ని ఆక్రమిస్తాయి. గ్రామీణ పారిశ్రామికీకరణ వల్ల (ఎ) పేదరికాన్ని తొలగించుట (బి) నిరుద్యోగ సమస్య నిర్మూలన అనే రెండు లక్ష్యాలు నెరవేరుతాయి. అందుచేత భారత ప్రభుత్వం

గ్రామీణ పారిశ్రామికీకరణకు ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించి గ్రామీణ పారిశ్రామికీకరణకు దోహదం చేసే విధానాలను చెపట్టటం జరిగింది. ప్రణాళికా కాలంలో గ్రామీణాభి వృద్ధికి ప్రాధాన్యతను క్రమ క్రమంగా పెంచటం జరుగుతోంది. గ్రామీణ పారిశ్రామికీకరణలో ఉన్న అవరోధాలు తొల్గించి, శీఘ్రగతిని పారిశ్రామికీకరణ జరిగినట్లయితే పేదరిక నిర్మూలన త్వరితగతీని సాధ్యమౌతుంది.

సి) అక్షరాస్యతను పెంపొందించటం :

అక్షరాస్యత, విద్య అనేవి మానవ వనరుల సామర్థ్యాన్ని పెంచుతాయి. మానవ సామర్థనం పెరిగితే, ఉత్పాదకతాశక్తి పెరిగి అధిక ఆదాయం పొందే అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా పేదలు దారిద్ర్యరేఖను అధిగమించగలరు. ఆ ఉద్దేశంతో భారత ప్రభుత్వం నిరక్షరాస్యతా నిర్మూలనా కార్యక్రమాన్ని, విద్యను పెంపొందించే కార్యక్రమాలను చేపట్టింది. సార్వత్రిక విద్యను సాధించేందుకు 14 సం॥ల లోపు పిల్లలకు ఉచిత విద్య, వయోజన విద్య కార్యక్రమాలు, అనియత విద్యాకార్యక్రమాలు మొదలైన కార్యక్రమాలు చేపట్టటం జరిగింది. అయితే 2001 నాటికి భారతదేశ అక్షరాస్యతా శాతం 65.4. భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో పోల్చితే పెరిగిన అక్షరాస్యతా రేటు ఆశాజనకంగా లేదనే చెప్పాల్సి వుంది. అక్షరాస్యత, విద్యను పెంపొందించే చర్యలను సమర్థవంతంగా చేపట్టి, అక్షరాస్యతను పెంపొందిస్తే పేదరికం మరింత తగ్గుతుంది.

డి) జనాభా నియంత్రణ :

భారతదేశ పేదరికానికి ముఖ్య కారణం జనాభా పెరుగుదల. భారత ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం ఎన్ని కార్యక్రమాలు తీసుకున్నను, పెరుగుచున్న జనాభావల్ల అవి నిర్వీర్యమౌతున్నాయి. భూమి/మానవ నిష్పత్తి తగ్గటం, ఆహార పదార్థాలు సరిపడ అందకపోవటం వల్ల ప్రజలు పేదరికంలో ఉంటున్నారు. అందుచేత భారత ప్రభుత్వం కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని, వివిధ జనాభా విధానాలను అమలు చేస్తూ జనాభాను అరికట్టే చర్యలను చేపడుతుంది. వీటి ఫలితంగా జనాభా సాలుసరి వృద్ధి రేటు 1.93 శాతానికి తగ్గింది. జనాభా వృద్ధిరేటు 2021 నాటికి 1.44 శాతానికి తగ్గుతుందని అంచనా వేసి ప్రయత్నాలను కొనసాగిస్తోంది. జనాభా తగ్గుదల కొనసాగుతూ ఉంటే పేదరిక తగ్గుదల కూడా అనుసరిస్తుంది.

ఇ) సంస్థాపరమైన చర్యలు :

పేదరిక నిర్మూలనకు దారిద్ర్య నివారణ చర్యలేకాక సంస్థాపరమైన చర్యలు కూడా అవసరం. దేశంలో దారిద్ర్యానికి కారణమైన సామాజిక పరిస్థితులలో మార్పుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించటం జరుగుతుంది. సంస్థాపరమైన మార్పులు-పేదరికానికి సంబంధించిన చర్చ 1993లో జరిగిన అంతర్జాతీయ సమావేశాలలో వచ్చింది. ఈ చర్చలలో శ్రమ సాంద్రత ఉత్పత్తి పద్ధతులను వీలైనంత ఎక్కువగా ప్రవేశపెట్టడం, సంక్షేమ పథకాల్లో ప్రజల చొరవను పెంపొందించటం లాంటి చర్యలు పేదరికాన్ని తగ్గించేందుకు దోహద పడతాయని అభిప్రాయాన్ని వెలిబుచ్చటం జరిగింది. కావున భారతదేశంలో సంస్థాగతమైన మార్పులను త్వరితంగా ప్రవేశ పెట్టటం ద్వారా పేదరికాన్ని నిర్మూలన చేయవచ్చు.

5.8 భారతదేశంలో పేదరిక నిర్మూలనా వ్యూహం :

భాంతదశ ప్రణాళికల లక్ష్యాలలో ఒక ముఖ్య లక్ష్యం పేదల జీవన ప్రమాణాన్ని పెంపొందించటం. అందుకు అనుగుణంగా దారిద్ర్యరేఖ దిగువునున్న ప్రజలకు ఉపాధి కల్పించాలని రెండో ప్రణాళికలోనూ, తక్కువ ఆదాయ వర్గాల వారికి 'ఉపాధి, విద్యను' అందించి వారి జీవన ప్రమాణాన్ని పెంపొందించాలని నాల్గవ ప్రణాళికలోను ప్రస్తావించటం జరిగింది. పేద ప్రజలలో ఎక్కువ మంది చిన్న వ్యవసాయదారులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు అని గుర్తించి వారికి వేతన -ఉపాధి చర్యలను చేపట్టటం జరిగింది. నాల్గవ ప్రణాళికలో ప్రణాళికా బద్ధమైన పెట్టుబడిని ఎక్కువగా వెనుకబడ్డ ప్రాంతాలకు, వెనుకబడ్డ వర్గాలకు మళ్ళించాలని కూడా ఉద్దేశించటం జరిగింది. పేదరికం పై ప్రత్యక్షంగా ఎదుర్కొనే ప్రయత్నం 5వ పంచవర్ష ప్రణాళికలో జరిగింది. గరీబీ హటావో

అనే నినాదంపై అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం 5వ పంచవర్ష ప్రణాళికల్లో పేదరిక నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలను చేపట్టింది.

భారతదేశ ప్రణాళికావేత్తలు పేదరికం అనేది ఒక సజాతీయ లక్షణంగా భావించి దేశ వ్యాప్తంగా దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాలు ఒకే విధంగా చేపట్టటం జరిగింది. పేదరికాన్ని వివిధ లక్షణాలపై ఆధారపడి వర్గీకరించే ప్రయత్నం మొదట జరుగలేదు. అయితే ఇందిరా హీర్వాణి పేదలను రెండుగా వర్గీకరించటం జరిగింది. అందులో ఒకటి నైపుణ్యం కలిగి స్వయం ఉపాధి చేపట్ట గలిగిన వారు, రెండోది వేతన-ఉపాధి కార్యక్రమం చేపట్ట వలసిన వర్గం వారు. కావున దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాలు ఈ రెండు వర్గాలకు ప్రత్యేకంగా వారి అభ్యున్నతికి అనుగుణంగా చేపట్టాలని సూచించారు. నీలకంఠం రాత్ కూడా ఇ్ర్ఞఈఆ కార్యక్రమాన్ని విమర్శిస్తూ వేతన - ఉపాధి కార్యక్రమాలనే విస్తృతంగా అవలంభించాలని సూచించారు. హిర్వే & దంత్‌వాలా పండితులు రాత్ సూచనకు స్పందిస్తూ స్వయం ఉపాధిని నిర్లక్ష్యం చేయరాదని, గ్రామీణ ప్రాంతాలలో ఈ కార్యక్రమ ఆవశ్యకతను ప్రస్తావించటం జరిగింది. ఆరో పంచవర్ష ప్రణాళికా కాలంలో ఈ విభిన్న దృక్పథాలను కొంత వరకు అనుసంధానం చెయ్యటం జరిగింది. పేదరిక నిర్మూలనా కార్యక్రమాల్లో స్వయం ఉపాధి కార్యక్రమం వేతన - ఉపాధి కార్యక్రమం మిళితం చెయ్యటం జరిగింది. వివిధ ప్రాంతాల ప్రాతిపదికగా ఆ ప్రాంతాల పరిస్థితులను బట్టి కార్యక్రమాలు అమలు చేయటం జరిగింది.

ఏడో ప్రణాళికా కాలంలో పేదరిక నిర్మూలనా కార్యక్రమాల కన్నా ఉత్పాదకత కలిగిన ఉపాధి కల్పించటం ద్వారా పేదరికాన్ని నిర్మూలించే ప్రయత్నం జరిగింది. పేదరిక నిర్మూలనా చర్యలు దేశ అభివృద్ధికి జోడించలని సంకల్పించాటం జరిగింది. అందువల్ల ఈ ప్రణాళికలో ముఖ్యంగా పేదరికం కన్పించదు కాని పేదరికాన్ని పరోక్షంగా నిర్మూలించేందుకు ఉత్పాదకత కలిగిన ఉపాధి ముఖ్యంగా కన్పిస్తుంది. ఈ ప్రణాళికలో పేదరిక రేఖ దిగువనున్న 39.9 శాతం జనాభాను 1990 నాటికి 28.2 కు తగ్గించాలిని ఉద్దేశించటం జరిగిందికాని తగ్గినది స్వల్పంగానే.

ఎనిమిదో పంచవర్ష ప్రణాళికలో దారిద్ర్య నిర్మూలనిను ముఖ్య లక్ష్యంగా నిర్ణయించటం జరిగింది. ఈ లక్ష్య సాధన కోసం ఉపాధి కల్పిస్తూ వృద్ధిని సాధించాలనే వ్యూహాన్ని అవలంభించటం జరిగింది. ఉత్పాదకతతో కూడిన ఉద్యోగితను కల్పించే చర్యలను తీసుకోవటం జరిగింది. అందుకోసం కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టటంతో పాటు కొనసాగుచున్న కార్యక్రమాల్లో కూడా స్వల్ప మార్పులతో అమలు చేయటం జరిగింది. ఈ విధంగా పేదరిక నిర్మూలన కోసం వివిధ పేదరిక నిర్మూలనా కార్యక్రమాలను చేపట్టటం జరిగింది. అయిననూ నేటికినీ దారిద్ర్యంలో ఉన్న జనాభా శాతం 1999-2000 లెక్కల ప్రకారం 26.1 ఉంది.

5.9 భారతదేశంలో పేదరిక నిర్మూలన - విమర్శనాత్మక పరిశీలన:

భారతదేశం దారిద్ర్యాన్ని నిర్మూలించేందుకు అవలంభించే వ్యూహాలను ప్రణాళిక, ప్రణాళికకు మార్పు చేస్తూ అవలంభిస్తున్ననూ నేటికిని దారిద్ర్య నిర్మూలన సాధ్యం కాలేదు. దాదపు 26.1 శాతం జనాభా కనీస జీవన స్థాయి లేక పేదరికంలో మ్రగ్గుచున్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న కార్యక్రమాలు కూడా ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయి. కావున మన వ్యూహంలో, అవలంభించే దారిద్ర్య నిర్మూలనా పధకాల్లో ఎదురౌతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవలసిన అవసరం ఉంది. అవి:

1) దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాలు స్వల్ప కాలంలో ఆదాయాన్ని పెంపొందించే విధంగా రూపొందించబడ్డాయే తప్ప దీర్ఘకాలంలో ఫలితాలను ఇచ్చేవిధంగా సామాజిక ఉత్పాదకాలైన కుటుంబ సంక్షేమం, పౌష్టికాహారం, సాంఘిక భద్రత మొదలైన వాటిని చొప్పించే ప్రయత్నం చేయలేదు. కావున వీటిని అందించే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేయవలసిన ఆవశ్యకత ఉంది.
2) సాధారణ ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనలేని అంగ వికలురు, ఆనారోగ్యం కలిగి ఉన్న వారికి ఈ కార్యక్రమాలు అందుబాటులో లేవు. పేదరిక నిర్మూలనా కార్యక్రమాల వల్ల స్త్రీలకు కూడా న్యాయం జరగలేదు.
3) వేతనా - ఉపాధి కార్యక్రమాల వల్ల ఆదాయం పెరిగింది. అయితే పెరిగిన ఆహార వస్తువుల ధరలు, వస్తువుల సప్లయ్ అనుగుణంగా లేనందు వల్ల ఆదాయం పెరిగిందే తప్ప వారి జీవన ప్రమాణ స్థాయి పెరగలేదు.

ఎ) భారతదేశంలో వ్యవసాయ విస్తీర్ణ వృద్ధి రేటు : 1949-50 నుంచి భారతదేశ వ్యవసాయ విస్తీర్ణ పెరుగుదల పట్టిక - 6.2 లో పొందు పరచటం జరిగింది. హరిత విప్లవానికి పూర్వం అంటే 1950-65 సంవత్సర కాలంలో అదనపు భూమిని సాగులోకి తెచ్చిన వివరాలను పట్టికలో గమనిస్తే చాలా ఆశాజనకంగా కనిపిస్తుంది. అన్ని పంటల సాగు విస్తీర్ణం 1.6 శాతం పెరగగా ఆహార ధాన్యాల వృద్ధి రేటు 1.4 శాతం, ఆహారేతర ధాన్యాల వృద్ధి రేటు 2.5 శాతం పెరిగింది. ఈ ఫలితాలను బట్టి ఉపాంత భూములు, నిరుపయోగ భూములను ఉపయోగంలోకి తీసుకురావటం జరిగింది. ఆహారేతర పంటల వృద్ధి రేట్లు గమనిస్తే బంగాళదుంప సాగు విస్తీర్ణం అత్యధికం (4.4%) కాగా తరువాత స్థానాలను ప్రత్తి (3.3%) నూనెగింజలు (2.6%) చెరకు (2.5%) ఆక్రమిస్తాయి. ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణ వృద్ధి శాతాలలో అత్యధికం గోధుమ (1.7%) కాగా తరువాత స్థానాలను వరి (1.3%) పప్పుధాన్యాలు (1.2%) ముతక ధాన్యాలు (0.9%) ఆక్రమిస్తాయి.

పట్టిక నెం. 6.1.2.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో పండించే ముఖ్య పంటల విస్తీర్ణంలో పెరుగుదల

పంటలు	విస్తీరణము, మిలియన్ హెక్టారులో			సగటు వార్షిక వృద్ధి రేటు	
	1949-50	1964-65	2000-01	1949-50 నుంచి 1964-65	1964-65 నుంచి 2001-02
1. ఆహార ధాన్యాలు మొత్తం	99	118	120	1.4	0.1
ఎ) వరి	30	36	44	1.3	0.6
బి) గోధుమ	10	13	25	1.7	2.0
సి) ముతక ధాన్యము (Coarse Cereals)	39	44	31	0.9	-1.1
డి) పప్పుధాన్యాలు (Pulses)	20	24	20	1.2	-0.5
2. ఆహారేతర ధాన్యాలు మొత్తం	23	33	38	2.5	0.3
ఎ) నూనె గింజలు	10	15	22	2.6	1.1
బి) చెరకు	1.5	2.6	4.4	2.5	1.4
సి) ప్రత్తి	4.9	8.4	9.1	3.3	0.1
డి) బంగాళదుంప	0.2	0.4	1.2	4.4	3.5
అన్ని పంటలు కలిపి	122	151	160	1.6	0.1

మూలము : ఎకనమిక్ సర్వే 2002 - 2003 Government of India

హరిత విప్లవం తరువాత కాలమైన 1965-2002లో అన్ని పంటల వ్యవసాయ విస్తీర్ణ వృద్ధి రేటు 0.1 శాతం కాగా ఆహార పంటల విస్తీర్ణ వృద్ధి రేటు 0.1 శాతం, ఆహారేతర పంటల విస్తీర్ణ వృద్ధి రేటు 0.3 శాతం ఆహార పంటల్లో గోధుమ విస్తీర్ణం 2 శాతం, వరి 0.6 శాతం పెరగగా ముతక ధాన్యం - 1.1 శాతానికి, పప్పుదినుసులు - 0.5 శాతానికి తగ్గింది. ఆహారేతర పంటల్లో బంగాళాదుంప విస్తీర్ణ పెరుగుదల అత్యధికం (3.5%) తరువాత స్థానాలు చెరకు (1.4%) నూనెగింజలు (1.1%), ప్రత్తి ఆక్రమిస్తాయి.

పట్టిక 6.2 ను సమీక్షిస్తే ఆహారేతర పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగినట్లు తెలుస్తుంది. ఆహారేతర పంటలలో కూడా బంగాళా దుంప విస్తీర్ణం అత్యధికంగా పెరిగింది. అహార పంటల విస్తీర్ణానికి సంబంధించిన గణాంకాలు పరిశీలిస్తే సస్యవిప్లవం తరువాత కాలంలో ముతక ధాన్యం, పప్పుధాన్యాల విస్తీర్ణం తగ్గి, గోధుమ సాగుకు మళ్లినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే విధంగా ఆహారేతర ధాన్యాల విస్తీర్ణం గణాంకాలు నూనెగింజల, ప్రత్తి విస్తీర్ణం తగ్గి, బంగాళా దుంప విస్తీర్ణం పెరుగుదలకు దోహదం చేసిందని చెప్పవచ్చు.

బి) 1949-50 సం॥ నుంచి దిగుబడి వృద్ధిరేటు : భారతదేశంలో 1949-50 సంవత్సరము నుంచి ఆహార, ఆహారేతర ధాన్యాల దిగుబడి గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదలకు కారణాలు నిటిపారుదల సౌకర్యాలు అభివృద్ధి, సాంద్ర వ్యవసాయ పద్ధతులను ఉపయోగించటం, అధిక దిగుబడి వంగడాలను వాడటం, యాంత్రికీకరణను ఉపయోగించటం.

హరిత విప్లవానికి పూర్వం వరి వృద్ధి రేటు ఎంతో ఆశాజనకంగా ఉన్నట్లు పట్టిక 6.3 తెలియజేస్తుంది. 1949-50 సంవత్సరములో హెక్టారు దిగుబడి 7 క్వింటాళ్ళు కాగా 1964-65కు 11 క్వింటాళ్లకు పెరిగింది. వార్షిక వృద్ధిరేటు 2.1 శాతం. గోధుమ దిగుబడి అదే కాలంలో 6.6 క్వింటాళ్ళ నుంచి 9.1 క్వింటాళ్ళకు, పప్పుధాన్యాలు 4 క్వింటాళ్ల నుంచి 5.2 క్వింటాళ్ళకు, ముతక ధాన్యాలు 4.3 క్వింటాళ్ళ నుంచి 5.1 క్వింటాళ్ళకు పెరిగాయి. అయితే వార్షిక వృద్ధి రేట్లు గోధుమ, ముతక ధాన్యం 13 శాతం కాగా పప్పుధాన్యాలు 0.2 శాతం మాత్రమే. సగటున అన్ని ఆహార ధాన్యాల వార్షిక వృద్ధి రేటు 1.4 శాతం.

పట్టిక 6.1.3.

స్వాతంత్ర్యానంతరం ముఖ్య పంటల్లో హెక్టారుకు దిగుబడి పెరుగుదల

పంటలు	హెక్టారుకు దిగుబడి			వార్షిక వృద్ధి రేటు	
	1949-50	1964-65	2001-2002	1949-50 నుంచి 1964-65	1964-65 నుంచి 2001-2002
1. ఆహార ధాన్యాలు మొత్తం	-	-	-	1.4	2.4
ఎ) వరి (క్వింటాళ్లలో)	7.1	10.8	20.9	2.1	1.8
బి) గోధుమ (క్వింటాళ్లలో)	6.6	9.1	27.7	1.3	3.2
సి) ముతక ధాన్యం (క్వింటాళ్లలో (Coarse Cereals)	4.3	5.1	10.8	1.3	2.2
డి) పప్పుధాన్యాలు (క్వింటాళ్లలో)	4.0	5.2	6.1	0.2	0.1
2. ఆహారేతర ధాన్యాలు మొత్తం				0.9	1.6
ఎ) నూనెగింజలు (క్వింటాళ్లలో)	5.2	5.6	8.6	0.1	1.2
బి) చెరకు (టన్నులలో)	34	47	67	1.0	1.2
సి) ప్రత్తి (కేజిలలో)	95	122	189	2.0	1.5
డి) బంగాళదుంప (క్వింటాళ్లలో)	66	84	180	1.6	3.1

మూలం : Economic Survey 2002 - 2003, Government of India

హరిత విప్లవానంతర కాలంలో ఆహారేతర పంటల్లో గోధుమ పంట సగటు వార్షిక ఉత్పత్తి రేటు గరిష్టంగా (3.1%) ఉండగా తరువాత స్థానాల్లో ప్రత్తి (1.5), నూనెగింజలు (1.2%), చెరకు (1.2%) ఆక్రమిస్తాయి. ఆహార పంటలలో గోధుమ వార్షిక సగటు ఉత్పత్తి రేటు అత్యధికం (3.2%) అయితే తరువాత క్రమంలో ముతక ధాన్యాలు (2.2%), వరి (1.8%) మరియు పప్పుధాన్యాలు (0.8%) వస్తాయి. ఈ కాలంలో హెక్టారుకు దిగుబడి వ్యవసాయ పంటలైన గోధుమ 27.7 క్వింటాళ్ళు ఉండగా, వరి 20.9 క్వింటాళ్ళు, ముతక ధాన్యం 10.8 క్వింటాళ్ళు మరియు పప్పుధాన్యాలు 6.1 క్వింటాళ్ళు, ఆహారేతర పంటలలో ప్రత్తి 189 కేజీలు కాగా బంగాళాదుంప 180 క్వింటాళ్ళు, నూనె గింజలు 8.6 క్వింటాళ్ళు, చెరకు 67 క్వింటాళ్ళు.

సి) 1949 నుంచి 2002 కాలంలో భారతదేశ వ్యవసాయ ఉత్పాదకత : ప్రపంచ దేశాల వ్యవసాయ ఉత్పాదకతతో భారతదేశాన్ని పోల్చితే మన దేశ ఉత్పాదకతా స్థాయి తెలుస్తుంది. అందుచేత కొన్ని ముఖ్య దేశాల్లో వ్యవసాయ ఉత్పాదకత కొన్ని ముఖ్య పంటలకు సంబంధించి పట్టిక - 6.1.4. లో చూపటం జరిగింది. ఈ పట్టికలో భారతదేశంలో కొన్ని ముఖ్య పంటల దిగుబడి మరియు అత్యధిక ఉత్పత్తి చేసే దేశాలు, ఉత్పాదకత కలిగిన దేశాల వివరాలు ఉన్నాయి.

ఆహార పంటలు : అత్యధిక వరి ఉత్పత్తి చేసే దేశం చైనా, చైనాలో హెక్టారుకు దిగుబడి 63.2 క్వింటాళ్లు. ప్రపంచంలో వరిలో అత్యధిక ఉత్పాదకత (88.8 క్వింటాళ్లు) కలిగిన దేశం ఈజిప్టు. భారతదేశంలో హెక్టారుకు వరి ఉత్పతి 29.3 క్వింటాళ్లు మాత్రమే. అయితే భారతదేశ అధిక దిగుబడి వంగడాలను ఉపయోగించినచో హెక్టారుకు 40 నుంచి 58 క్వింటాళ్ళు ఉత్పత్తి చేయవచ్చు. దీన్ని బట్టి భారతదేశంలో ఉత్పాదకతా సామర్థ్యం ఉన్ననూ వాస్తవంగా ఉత్పత్తి చేస్తున్నది తక్కువ అని చెప్పవచ్చు.

ప్రపంచంలో అత్యధిక గోధుమను ఉత్పత్తి చేస్తున్న దేశం చైనా, ఈ దేశ దిగుబడి హెక్టారుకు 39.7 క్వింటాళ్లు.

పట్టిక నెం. 6.1.4.

1999 వ సంవత్సరము భారతదేశంలో ముఖ్య పంటల దిగుబడి (హెక్టారుకు క్వింటాళ్లలో)

పంటలు	భారతీయ అధిక దిగుబడి వంగడాలు దిగుబడి	వాస్తవ దిగుబడి	ప్రపంచంలో అత్యధిక దిగుబడి కలిగిన దేశం దిగుబడి	దేశం	ప్రపంచంలో అత్యధిక దిగుబడి	దేశం
ఎ) ఆహార పంటలు						
1. వరి	40-58	29.3	63.2	చైనా	88.8	ఈజిప్టు
2. గోధుమ	60-68	25.8	39.7	చైనా	80.5	బ్రిటన్
3. జొన్నలు	60-80	16.7	83.9	అమెరికా	96.9	ఇటలీ
బి) ఆహారేతర పంటలు						
4. చెరకు		680	686	బ్రెజిల్	1190	ఈజిప్టు
5. వేరుశనగ (Pods)	20-30	9.1	27.9	చైనా	30.4	అమెరికా
6. ప్రత్తి (లింట్)	15-20	2.3	10.2	చైనా	12.7	ఆస్ట్రేలియా
7. జనుము	25-30	20.0	20.0	ఇండియా	25.2	చైనా

మూలం : FAO Production Year Book (1999), Agricultural Statistics at a Glance, 2002.

అత్యధిక ఉత్పాదక (80.5 క్వింటాళ్లు) కలిగిన దేశం బ్రిటన్, మన భారతదేశాన్ని గమనిస్తే వాస్తవిక దిగుబడి రేటు హెక్టారుకు 25.8 క్వింటాళ్ళు. మన దేశ అధిక దిగుబడి వంగడాలను ఉపయోగిస్తే హెక్టారుకు 60 నుంచి 68 క్వింటాళ్లకు ఉత్పత్తి చేయవచ్చు. కాని ఉత్పత్తి చేస్తున్నది మాత్రము 25.8 క్వింటాళ్లు మాత్రమే.

జొన్న విషయానికి వస్తే ఉత్పత్తిలో అగ్రస్థానం అమెరికా. కాని అమెరికాలో హెక్టారుకు ఉత్పత్తి చేసే పరిమాణం 83.9 క్వింటాళ్ళు. అత్యధిక సగటు దిగుబడిని (96.8 క్వింటాళ్లు) సాధిస్తున్న దేశం ఇటలీ. భారతదేశంలో జొన్న దిగుబడి హెక్టారుకు 16.7 క్వింటాళ్ళు మాత్రమే. మన దేశం అధిక దిగుబడి వంగడాలను ఉపయోగిస్తే సాధించగల దిగుబడి హెక్టారుకు 60 క్వింటాళ్ల నుంచి 80 క్వింటాళ్ళు ఉండగా సాధిస్తూంది కేవలం 16.7 క్వింటాళ్ళు.

ఆహార ధాన్యాల ఉత్పాదకతా శక్తిని ఇతర దేశాలతో పోల్చుకుంటే మన దేశ ఉత్పాదకత తక్కువ. మనదేశ అధిక దిగుబడి వంగడాలను ఉపయోగించినట్లయితే మనం సాధించగల దిగుబడి కన్నా తక్కువగా సాధిస్తున్నాం. కావున మన దేశం వనరుల ద్వారా ఉత్పత్తిని అధికం చేసుకోగలిగిన శక్తి ఉన్నా వాటిని సమర్థవంతంగా వినియోగించుకోలేక పోతున్నాము అనేది వాస్తవము.

ఆహారేతర ధాన్యాలు : చెరకు ఉత్పత్తిలో బ్రెజిల్ అగ్రస్థానాన్ని వహిస్తుంది. ఈ దేశ హెక్టారు దిగుబడి రేటు 686 క్వింటాళ్ళు. చెరకు ఉత్పాదకతా శక్తి అత్యధికంగా (హెక్టారుకు 1190 క్వింటాళ్లు) ఉన్న దేశం ఈజిప్ట్. భారతదేశ చెరకు ఉత్పత్తి హెక్టారుకు 680 క్వింటాళ్ళు.

వేరుశనగ ఉత్పత్తి అత్యధికంగా ఉన్న దేశం చైనా. చైనా దిగుబడి హెక్టారుకు 27.9 క్వింటాళ్లు. వేరుశనగ దిగుబడి అత్యధికంగా (30.4 క్వింటాళ్లు) ఉన్నదేశం అమెరికా. భారతదేశ ఉత్పత్తి హెక్టారుకు 9.1 క్వింటాళ్ళు మాత్రమే. మన దేశ అధిక దిగుబడి వంగడాలను ఉపయోగించటం ద్వారా 20 నుంచి 30 క్వింటాళ్ళు ఉత్పత్తి చేయగలిగిన శక్తి ఉన్నను సాధిస్తున్నది కేవలం 9.1 క్వింటాళ్ళు.

ప్రత్తి ఉత్పత్తిలో అగ్రస్థానం చైనా కాగా ఆ దేశ ఉత్పాదకతా శక్తి హెక్టారుకు 10.2 క్వింటాళ్ళు. ప్రత్తి ఉత్పాదకతా శక్తి అత్యధికంగా (12.7 క్వింటాళ్ళు) ఉన్న దేశం ఆస్ట్రేలియా. భారతదేశ ఉత్పత్తిని గమనిస్తే హెక్టారుకు 2.3 క్వింటాళ్ళు మాత్రమే. భారతదేశ HYV వంగడాలు ఉపయోగిస్తే మనం సాధించగల ఉత్పత్తి హెక్టారుకు 15 నుంచి 20 క్వింటాళ్ళు ఉన్ననూ సాధిస్తున్నది 2.3 క్వింటాళ్ళే.

జనుము ఉత్పత్తిలో భారతదేశం హెక్టారుకు 20 క్వింటాళ్ళు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచంలో అత్యధిక ఉత్పాదకతా శక్తి (25.2 క్వింటాళ్ళు) కలిగిన దేశం చైనా. భారతదేశ HYV వంగడాలను ఉపయోగించి ఉత్పత్తి చేయగలిగిన సామర్థ్యం హెక్టారుకు 25 నుంచి 30 క్వింటాళ్ళు ఉన్ననూ మనం సాధిస్తున్నది (20 క్వింటాళ్ళు) తక్కువ.

పై వివరణను బట్టి మన దేశంలోని HYV వంగడాలను ఉపయోగించుకున్నట్లయితే మనం ఉత్పత్తి చేయగలిగిన శక్తికన్నా తక్కువ ఉత్పత్తిని మాత్రమే సాధించగలుగుచున్నాము. అంటే ఉత్పాదకతా సామర్థ్యం ఉన్ననూ వనరులను సమర్థవంతంగా ఉపయోగించు కోలేకపోచున్నాము.

డి) భారతదేశంలో 1949-50 నుంచి మొత్తం వ్యవసాయ ఉత్పత్తి వృద్ధిరేటు : ఏ దేశ వ్యవసాయ ఉత్పత్తి మొత్తం పరిమాణమైన ఆ దేశంలో వ్యవసాయ విస్తీర్ణం, హెక్టారు దిగుబడి మీద ఆధారపడి ఉంటుంది. పట్టిక 6.5లో భారతదేశంలో కొన్ని ముఖ్యపంటల ఉత్పత్తిని చూపటం జరిగింది. హరిత విప్లవానికి పూర్వకాలమైన 1950-65 లో ఆహార ధాన్యాల సగటు వార్షిక వృద్ధి రేటు 3.2 శాతం. ముఖ్య ఆహార పంటలైన వరి వార్షిక వృద్ధిరేటు 3.5 శాతం, గోధుమ 4.0 శాతం. ముతక ధాన్యం వృద్ధి రేటు 2.2 శాతం కాగా పప్పుధాన్యాల వృద్ధి రేటు 1.4 శాతం. హరిత విప్లవం తరువాత కాలంలో (1965 - 2002) గోధుమ వార్షిక వృద్ధిరేటు 5కు పెరగగా, వరి, ముతక ధాన్యం వృద్ధి రేట్లు 2.2, 0.6 శాతాలకు తగ్గాయి. పప్పుధాన్యాల వృద్ధిరేటు రుణాత్మకంగా (-0.2 శాతం) ఉంది.

ఆహారేతర పంటలలో నూనె గింజల వృద్ధిరేటు హరిత విప్లవానికి ముందు 3.3 శాతం ఉండగా తరువాత 1.9కి తగ్గింది. అదే విధంగా చెరకు 4.3 శాతం నుంచి 2.5 శాతానికి, ప్రత్తి 4.6 నుంచి 1.4 శాతానికి తగ్గింది. అయితే బంగాళా దుంప మాత్రం 4.3 శాతం నుంచి 4.9 శాతానికి పెరిగింది.

పట్టిక నెం. 6.1.5.

భారతదేశంలో 1949-50 నుంచి 2001 - 2002 కాలంలో కొన్ని ముఖ్య పంటల ఉత్పత్తి

(ప్రతి పోగా మిగిలినవన్నీ మిలియన్ టన్నులు, ప్రతి మిలియన్ చేళ్లలో)

పంటలు	ఉత్పత్తి			సగటు సాంవత్సరిక వృద్ధిరేటు శాతంలో	
	1949-50	1964-65	2001-2002	1949-50 నుంచి 1964-65	1964-65 నుంచి 2001-2002
1. ఆహార ధాన్యాలు మొత్తం	55	89	212	3.2	2.2
ఎ) వరి	24	39	83	3.5	2.2
బి) గోధుమ	6	12	72	4.0	5.0
సి) ముతక ధాన్యం	17	25	44	2.2	0.6
2. ఆహారేతర ధాన్యాలు మొత్తం	(57+3)	(135+6)	342+10		
ఎ) నూనెగింజలు	5	9	20	3.3	1.9
బి) చెరకు	50	122	300	4.3	2.5
సి) ప్రత్తి	3	6	10	4.6	1.4
డి) బంగాళదుంపలు	2	4	22	4.3	4.9

మూలం : Economic Survey 2002 - 2003, Government of India

1950 నుంచి భారతదేశ వ్యవసాయ ధోరణులు - సమీక్ష : భారతదేశంలో 1965వ సంవత్సరంలో జీవ-రసాయన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి వ్యవసాయ ఉత్పత్తిని పెంపొందించే ప్రయత్నం ప్రారంభమైనది. అయితే గోధుమ, బంగాళాదుంప ఉత్పత్తిలో తప్ప మిగిలిన వ్యవసాయ పంటలలో మాత్రం గణనీయమైన ఫలితాలమ సాధించలేకపోయాము. ముతక ధాన్యము, పప్పుధాన్యాల విషయంలో నామ మాత్రంగానే సాధించగలిగాము. 1965-2002 కాలంలోని ప్రగతిని సమీక్షిస్తే కింది ఫలితాలు వెల్లడౌతాయి.

1. హరిత విప్లవానికి పూర్వం వ్యవసాయ భూమి విస్తీర్ణం పెరిగింది. హరిత విప్లవానంతరం ఉత్పాదకతా శక్తి పెరిగింది.

2. గోధుమ ఉత్పత్తిలో తప్ప మిగిలిన పంటల విషయంలో వ్యవసాయ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆశించిన ఫలితాలు అందించలేదు.

3. వరి ఉత్పత్తి ఆలస్యంగా పెరిగినా, వరి ఉత్పత్తి గణనీయంగా పెరగటానికి HYV వంగడాలు అనుకూలించలేదు.

4. ఆహార ధాన్యాల సాంవత్సరిక వృద్ధిరేటు 2.2 శాతం కొనసాగటానికి కారణం గోధుమ వృద్ధిరేటు 5.0 శాతంగా ఉండటమె.

5. ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించటం, వర్షాలు అనుకూలంగా ఉండటం చేత తక్కువ సారవంతమైన భూములలో నూనెగింజలు, ముతక ధాన్యం, పప్పుధాన్యాల పంటలను పండించటం జరిగింది.

6. భారతదేశ వ్యవసాయ వృద్ధి రేటు గణనీయంగా ఉన్ననూ వివిధ కాలాలలో ఒడిదుడుకులు ఎక్కువగా ఉన్నాయి.

భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తులను సమీక్షిస్తే హెక్టారుకు దిగుబడి పెరిగింది. ప్రణాళికా కాలంలో మరింత ఎక్కువగా పెరిగింది. అయితే మన దేశ వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొనే స్థాయిలో మాత్రం పెరగలేదు. ఉత్పాదకతా శక్తి పెరగటానికి అవకాశం ఉన్ననూ మనం సాధించలేకపోతున్నాము. అందుకు అనేక రకాలైన అవరోధాలున్నాయి. వీటిని గురించి తరువాత భాగంలో చదువుకుందాం.

6.1.4. భారతదేశంలో వ్యవసాయరంగ అల్పోత్పత్తికి కారణాలు

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదకతా స్థాయి పెరిగింది. కాని సాధించిన ఉత్పాదకత కన్నా హెచ్చుగా సాధించే అవకాశం ఉన్నా మనం సమర్థవంతంగా వనరులను ఉపయోగించుకోలేకపోతున్నాము. వ్యవసాయ రంగంలో కొంత పురోభివృద్ధి కనిపించినా, వ్యవసాయ రంగ పరిస్థితుల్లో చెప్పుకోతగ్గ మార్పులు లేవు. భారతదేశంలో వ్యవసాయ అల్పోత్పత్తికి కారణాలను విశ్లేషించుకున్నట్లయితే ఆ రంగ పురోభివృద్ధికి సంబంధించి తీసుకోవలసిన చర్యలు మనకు అవగాహన అవుతాయి. భారతదేశంలో వ్యవసాయ రంగ అల్పోత్పత్తికి కారణాలను మూడు రకాలుగా చెప్పవచ్చు. అవి : 1) సాధారణ కారణాలు, 2. సంస్థాపరమైన కారణాలు 3. సాంకేతిక పరమైన కారణాలు. ఈ మూడు కారణాలను ఇప్పుడు విపులంగా పరిశీలిద్దాం.

6.1.4.1. సాధారణ కారణాలు : సాధారణ కారణాలను మళ్లీ స్థూలంగా మూడు రకాలుగా చెప్పవచ్చు. ఎ) సాంఘీక వాతావరణం, బి) భూమిపై వత్తిడి సి) భూమి క్షీణత,

ఎ) సాంఘీక వాతావరణం : భారతదేశంలోని వ్యవసాయదారులు పేదలు, నిరక్షరాశ్యులు, అమాయకులు. మానవాతీత శక్తులపై ఆధారపడేవారు, సంకుచిత ఆలోచన, మారుతున్న పరిస్థితులతో మారే స్వభావం లేనివారుగా చెప్పవచ్చు. వ్యవసాయ కుటుంబాలు కూడా కుల వ్యవస్థ, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అనే పాత సాంప్రదాయాలకు బద్దమై ఉంటాయి. ఈ సనాతన సాంప్రదాయాలు, మానవాతీత శక్తులపై నమ్మిక వల్ల వ్యవసాయదారులు తమ సాంప్రదాయ బద్దమైన వ్యవసాయంతోనే సంతృప్తి చెందుతూ ఉంటారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉత్పత్తి పద్ధతులను వెంటనే స్వీకరించే స్వభావాన్ని కలిగి ఉండరు. వ్యవసాయదారుల్లో కొంత వర్గం తప్ప మిగిలిన వాళ్లందరూ పై లక్షణాలను కలిగి ఉండటం వల్ల, వారి పేదరికం వల్ల వ్యవసాయాభివృద్ధి చర్యలు చేపట్టక పోవటం వల్ల వ్యవసాయ రంగ ఉత్పాదకత భారతదేశంలో తక్కువగా ఉంది. 'BIMARU' రాష్ట్రాలో ఉత్పాదకత మరింత తక్కువగా ఉంది.

బి) భూమిపై వత్తిడి : భారతదేశంలో భూమిపై ఆధారపడ్డ జనాభా చాలా ఎక్కువగా ఉన్నందున భూమిపై వత్తిడి ఎక్కువగా ఉంది. 1901 వ సంవత్సరం నుంచి వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ జనాభా దాదాపు 70 శాతం. ఈ శతాబ్ద ప్రారంభంలో వ్యవసాయంపై ఆధారపడ్డ జనాభా 163 మిలియన్లు కాగా 2001 నాటికి 310.7 మిలియన్లు. ఈ విధంగా వ్యవసాయ రంగంపై వత్తిడి పెరగటానికి కారణం వ్యవసాయేతర రంగాల్లో శీఘ్ర అభివృద్ధి జరగక పోవడం. వ్యవసాయ రంగంపై పెరుగుచున్న వత్తిడివల్ల కమతాల విభజన, విఘటన జరిగి, తలసరి భూ పరిమాణం తగ్గి చిన్న చిన్న కమతాలు ఏర్పడతాయి. ఈ పరిణామం వల్ల నికర వ్యవసాయ భూమి తగ్గటం (గట్లు ఏర్పరచటం వల్ల), ప్రచ్ఛన్న నిరుద్యోగిత పెరగటం, ఉపాంత ఉత్పాదకత శూన్యం లేదా ఋణాత్మకంగా మారుతుంది. జనాభా వత్తిడి వల్ల 1901 లో సగటు కమతం 0.43 హెక్టార్లు ఉండగా 2001 నాటికి 0.20 హెక్టార్లకు తగ్గింది. అందుచేత వ్యవసాయంలో అల్పోద్యోగితా పోకడలు కన్పిస్తున్నాయి.

సి) భూమి క్షీణత : అల్పోద్యోగితకు కారణాల్లో మరొకటి భూమి క్షీణత. భూమి క్షీణత వల్ల భూమి నాణ్యత తగ్గటం ఫలితంగా ఉత్పాదకతా శక్తి తగ్గుతుంది. ఈ మధ్య కాలంలో భారత ప్రభుత్వం వేసిన అంచనాలు దేశంలోని సగం భూభాగం అంటే దాదాపు 329 మిలియన్ హెక్టార్లు క్షీణించినట్లు తెలియజేస్తున్నాయి. దేశ భూ భాగంలో దాదాపు 43 శాతం ఎక్కువగా క్షీణించి ఉత్పాదకతా శక్తిని 33 - 67 శాతం కోల్పోయినట్లు, 5 శాతం భూభాగం వ్యవసాయానికి ఉపకరించకుండా పోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ విధంగా వ్యవసాయ భూములు సారవంతాన్ని కోల్పోయినందువల్ల ఉత్పాదకతా శక్తి తగ్గి అల్పోత్పత్తికి కారణమౌతుంది.

6.1.4.2. సంస్థాపరమైన కారణాలు : భారతదేశంలో వ్యవసాయ అల్పోత్పత్తికి సంస్థాగతమైన అంశాలు కూడా కారణం. సంస్థాపరమైన కారణాలను మూడు రకాలుగా చెప్పవచ్చు. అవి :

ఎ) కమతాల పరిమాణం

బి) కౌలు పద్ధతులు

సి) వ్యవసాయేతర సేవలు

ఎ) కమతాల పరిమాణం : భారతదేశంలో సగటు వ్యవసాయ కమత పరిమాణం చాలా తక్కువ. అంటే 2 హెక్టార్ల కన్నా తక్కువ లేదా 5 ఎకరాల కన్నా తక్కువ. వ్యవసాయ కమతాల పరిమాణం తక్కువేకాక కమతాల విభజన, విఘటనలకు గురి అవుచున్నది. నేటికిని చెక్కనాగలితో సేద్యం చేయటానికి అనుకూలం కాని కమతాలు మన భారతదేశంలో ఉన్నాయి. చిన్న కమతాలు ఉంటే శాస్త్రీయ వ్యవసాయం సాధ్యం కాదు. ఉత్పాదకాలను సక్రమంగా ఉపయోగించుకోలేకపోవటం వల్ల వృధాలు ఎక్కువగా ఉంటాయి. గట్ల రూపంలో భూమి వృధా అవ్వటంతోపాటు వ్యవసాయదారుల మధ్య వివాదాలకు అవకాశం ఏర్పడుతుంది. నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం 1961-62లో 2 హెక్టార్ల లోపు కమతాలు 52 శాతం ఉండగా, 1995-96 నాటికి 80 శాతానికి పెరిగింది. ఈ విధంగా వ్యవసాయ కమతాలు క్రమంగా తగ్గుతూ, శాస్త్రీయ వ్యవసాయానికి ఉపయుక్తంగా లేకపోవటం, వృధాలు పెరగటం వల్ల భారతదేశ వ్యవసాయ ఉత్పాదకత అల్పంగా ఉంది.

బి) కౌలు పద్ధతులు : భారతదేశ వ్యవసాయ అల్పోద్యోగితకు ముఖ్యకారణంగా కౌలు పద్ధతులు చెప్పవచ్చు. జమిందారీ వ్యవస్థ భారతదేశ వ్యవసాయదారులను దోపిడీ చేయటమేకాక వ్యవసాయదారులకు ఉత్పాదకత పెంపొందించాలనే ఆసక్తిని కూడా నశింపచేసింది. తరువాత జమిందారీ వ్యవస్థను రద్దు చేసింది. కౌలు భద్రత, కౌలు నియంత్రణ, కౌలుదారులకు యాజమాన్యపు హక్కులు మొదలైన అంశాలపై భారత ప్రభుత్వం చట్టాలు చేసింది. అయితే ఈ చట్టాలు ఫలవంతమైన ఫలితాలు ఇవ్వనందున వ్యవసాయదారులు ఉత్పాదకతా శక్తిని పెంపొందించే దిశగా పయనించటం లేదు. మానసికంగా ఉత్పాదకతా శక్తిని పెంచాలనే ఆలోచనకు వ్యవసాయదారులు రాకుంటే ఉత్పాదకత పెరగదు.

సి) వ్యవసాయేతర సేవలు : భారతదేశంలో వ్యవసాయేతర సేవలు వ్యవసాయదారులకు అందుబాటులో లేవు. నేటికిని వ్యవసాయదారులు ఋణాలకోసం వడ్డీవ్యాపారులను ఆశ్రయించవలసి రావటం, అధిక వడ్డీలను చెల్లించవలసి వస్తుంది. సహకార సంస్థలు, ప్రభుత్వం విత్త సదుపాయాలు అందిస్తున్నా నామమాత్రంగానే కొనసాగుతుంది. మార్కెటింగ్, గిడ్డంగి సదుపాయాలు కూడా అంతంత మాత్రంగానే ఉండటం జరుగుతుంది. భారతదేశంలోని వ్యవసాయదారులకు వ్యవసాయేతర సేవలు అందుబాటులో లేనందువల్ల వ్యవసాయోత్పత్తి అల్పంగా ఉంది. ఈ రకమైన సేవలు అందుబాటులో లేనందున వ్యవసాయదారులు ఆకర్షణీయ ధరలు ఉన్నా ఉత్పత్తిని పెంచలేకపోచున్నారు. భారతదేశ వ్యవసాయదారులకు పరపతి సదుపాయాలు, మార్కెటింగ్ సదుపాయాలు, నిల్వసదుపాయాలు అందుబాటులో లేనందువల్ల వ్యవసాయ ఉత్పాదకత తక్కువగా ఉంది.

6.1.4.3. సాంకేతిక పరమైన కారణాలు : వ్యవసాయ రంగంలో అల్పోత్పత్తికి సంబంధించిన సాంకేతిక కారణాలను రెండుగా చెప్పవచ్చు. అవి : ఎ) పురాతన సాంకేతిక పద్ధతులు బి) నీటి పారుదల సదుపాయాల కొరత

ఎ) పురాతన సాంకేతిక పద్ధతులు : భారతదేశంలో ఎక్కువమంది వ్యవసాయదారులు పురాతన, సామర్థ్యంలేని సాంకేతిక పద్ధతులను లేదా ఉత్పత్తి విధానాలను ఉపయోగించటం జరుగుతుంది. వ్యవసాయదారులు పేదవారు, సనాతన ఆలోచనా దృక్పథం కలిగిన వారైనందున మారుచున్న ఆధునిక పద్ధతులను అవలంభించలేకపోతున్నారు. ఈ మధ్యకాలంలో వ్యవసాయధారుల ఆలోచనలో మార్పు వచ్చి నూతన సాంకేతిక సాధానాలైన ఉక్కునాగళ్ళ, పంపుసెట్లు, పంటకోతమెషిన్లు ఉపయోగించటం జరుగుతుందినే కాని ఈ మార్పు చాలా పరిమితంగా ఉంది. వ్యవసాయంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులను, రసాయనిక ఎరువులు, క్రిమినాశక మందులు వాడనిదే వ్యవసాయ ఉత్పాదకత పెరగదు. అయితే భారతదేశంలో వీటిని చాలా తక్కువగా ఉపయోగించటం జరుగుతుంది. భారతీయ వ్యవసాయదారులు ఉపయోగించే విత్తనాలలో నాణ్యత లేనందువల్ల కూడా వ్యవసాయోత్పత్తి తక్కువగా ఉంది. వ్యవసాయదారుల ఆర్థికస్థితి తక్కువగా ఉన్నందుచేత వీరు ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంభించలేకపోవటం ఫలితంగా ఉత్పాదకతా శక్తి తక్కువగా ఉంది.

బి) నీటి పారుదల సదుపాయాల కొరత : సమృద్ధిగా నీటి పారుదల సదుపాయాలు లేకపోవటం వ్యవసాయ రంగంలో అల్పోత్పత్తికి ముఖ్యకారణంగా చెప్పవచ్చు. భారతదేశంలో అధిక శాతం వ్యవసాయదారులు వర్షాధారం మీద వ్యవసాయం చేయటం జరుగుతుంది. అతి స్వల్ప సంఖ్యలో వ్యవసాయదారులు కృత్రిమ నీటి సదుపాయాన్ని పొంది వ్యవసాయం చేస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం మొత్తం వ్యవసాయ భూమిలో 18 శాతం భూమికే నీటి పారుదల సదుపాయం ఉంది. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వల్ల నీటిపారుదల సదుపాయాన్ని 1999-2000 నాటికి 40.2 శాతానికి పెంచగలిగాము. ఇంకా 60 శాతం భూభాగానికి నీటి పారుదల సదుపాయాలు లేవు. వ్యవసాయదారుల ఆర్థిక స్థితికూడా కృత్రిమ నీటి సదుపాయాలను పెంపొందించుకునే విధంగా లేదు. అందుచేత వ్యవసాయోత్పత్తి భారతదేశంలో అల్పంగా ఉంది.

భారతదేశంలో వ్యవసాయరంగంలో అల్పోత్పత్తికి విభిన్న అంశాలు వ్యక్తిగతంగా, సమిష్టిగా కారణమౌతున్నాయి. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించి వ్యవసాయాభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టటం జరిగింది. ఈ చర్యల వల్ల వ్యవసాయ ఉత్పాదకత పెరిగింది. అయితే వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొనే స్థాయిలో పెరగలేదు. వ్యవసాయ వనరులు అల్పంగా ఉపయోగించుకోవటం సంపూర్ణ సామర్థ్యాన్ని నేటికిని పొందలేకపోవటం వల్ల వ్యవసాయోత్పత్తి అల్పంగా ఉంది. అందుచేత ఉన్న వనరులను వాటి సామర్థ్యాన్ని మొత్తాన్ని ఉపయోగించుకొనే దిశగా చర్యలు చేపట్టవలసి ఉంది.

6.1.5. భారతదేశంలో వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదలకు చేపట్టవలసిన చర్యలు

ఇంతవరకు మనం వ్యవసాయ రంగంలో అల్ప ఉత్పాదకతకు కారణాలు తెలుసుకున్నాం. పై కారణాలను బట్టి తీసుకోవలసిన చర్యలు కూడా అవగాహన అవుతాయి. భారతదేశంలో, వ్యవసాయ ఉత్పాదకతను పెంచటం కోసం తీసుకోవలసిన చర్యలు విభిన్న కోణాల నుంచి అంటే సాంకేతిక, సంస్థాపరమైన, సాంఘిక, ఆర్థిక కోణాల నుంచి అవసరము. అల్పోద్యోగిత నుంచి అధిక ఉత్పాదకతను సాధించేందుకు కింది చర్యలను తీసుకోవలసి ఉంటుంది.

ఎ) భూ సంస్కరణల అమలు : భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం భూ సంస్కరణలు చేపట్టటం జరిగింది. ఈ సంస్కరణలలో భాగంగా మధ్యవర్తుల తొలగింపు, కౌలుదారులకు యాజమాన్యపు హక్కులు, వ్యవసాయకమతాలపై గరిష్ట పరిమితిని విధించటం, సహకార వ్యవసాయం లాంటి చర్యలను చేపట్టటం జరిగింది. కాని ఈ సంస్కరణలు ఫలవంతం కాలేదు. అందువల్ల భూ సంస్కరణలను అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టవలసి ఉంది. 'దున్నే వాడిదే భూమి' అనే నినాదాన్ని నిజం చేసే విధంగా ప్రభుత్వం చర్యలను చేపట్టటం వ్యవసాయదారులకు ప్రోత్సాహకంగా పనిచేసి వ్యవసాయరంగ ఉత్పాదకత పెరుగుదలకు దోహదం జరుగుతుంది.

బి) భూమి, నీటి వనరుల సమగ్ర నిర్వహణ : భారతదేశంలోని వ్యవసాయ భూమి సగం మేరకు భూసార క్షీణతకు గురయ్యింది. భూమికోత, ఆమ్లీకరణ మొదలైన కారణాల వల్ల భూసారం క్షీణించి ఉత్పాదకత తగ్గుతుంది. కావున భూమి, నీటి వనరుల యాజమాన్య నిర్వహణ ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ వనరుల నిర్వహణ కోసం 25 సంవత్సరాల దీర్ఘదర్శి ప్రణాళికను ప్రణాళికా సంఘం ఏర్పాటు చేయ్యటం జరిగింది. 10 వ ప్రణాళికలో 75 మిలియన్ హెక్టార్ల భూమిని 20,850 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయాలని సంకల్పించటం జరిగింది. ఈ విధంగా క్షీణిస్తున్న భూమిని అభివృద్ధి చేయటం కోసం భూమి, నీటిని సమగ్ర నిర్వహణ చేయవలసి ఉంది.

సి) మేలు రకం విత్తనాల వాడకం : వ్యవసాయ ఉత్పాదకత పెరుగుదల ముఖ్యంగా మేలురకం విత్తనాల వాడకంపై ఆధారపడి ఉంటుంది. మన దేశంలోని పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లోని అనుభవాలు ఈ విషయాన్ని వెల్లడి చేస్తాయి. కావున వ్యవసాయదారులు మేలురకం విత్తనాలు వాడే విధంగా చర్యలను చేపట్టాలి. ప్రభుత్వం వ్యవసాయదారుల భూములను పరిక్షించి ఏ పంటలు ఆ భూమికి అనుకూలమైనవో, ఏ విత్తనాలు ఉపయోగించటం మంచిదో వ్యవసాయదారులకు తెలియజేయాలి. వ్యవసాయదారులకు పంటలను పండించే విధానం, రసాయన ఎరువుల వినియోగం, అధిక దిగుబడి వంగడాలను సాగుచేయటం వంటి విషయాలపై అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత ఉంది.

డి) రసాయన ఎరువుల వాడకం : మేలురకం విత్తనాల వాడకం అధిక రసాయన ఎరువుల వాడకంతో ముడిపడి ఉంది. భారతదేశంలోని వ్యవసాయదారులు భూమి ఉత్పాదకతను కొనసాగించటానికి ఉపయోగించవలసిన ఎరువుల పరిమాణంలో 10 వ శాతం మాత్రమే ఉపయోగిస్తున్నారని అంచనా. 1998-99 గణాంకాల ప్రకారం హెక్టారు భూమికి భారతదేశంలో రసాయనిక ఎరువుల వాడకం 105.8 కేజీలు కాగా, చైనాలో 291.7 కేజీలు, బంగ్లాదేశ్‌లో 149.1 కేజీలు, ఈజిప్ట్‌లో 404.3 కేజీలు. కావున భారతదేశంలో సమృద్ధిగా రసాయనిక ఎరువుల వాడకానికి అందులోనూ నత్రజని, పోటాసియమ్, భాస్వరపు ఎరువులు ఉపయోగించే విధంగా చర్యలు చేపట్టటం వల్ల ఉత్పాదకతను పెంచవచ్చు.

ఈ) నీటిపారుదల : మేలురకం విత్తనాలను, రసాయన ఎరువుల ఉపయోగానికి నీటిపారుదల సౌకర్యాలు అత్యావశ్యకము. నీటి సదుపాయం బహుళ పంట విధానానికి అవకాశాన్ని కల్పించి ఉత్పాదకతను పెంచుతుంది. కావున నీటి పారుదల సదుపాయాల అభివృద్ధి కోసం ఉన్న నీటి పారుదల సదుపాయాల ఆధునికీకరణ, నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం, నదులలో నీటి నిల్వలను సక్రమంగా పంపిణీ చెయ్యటం, నీటి వనరుల పరిమాణంపై సంపూర్ణంగా సర్వేచేసి వాటిని అభిలషణీయంగా ఉపయోగించుకోవటానికి సంబంధించిన ప్రాజెక్టులను చేపట్టటం ద్వారా నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చును. కావున ప్రభుత్వం పై చర్యలను చేపట్టటం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుంది.

యఫ్) మొక్కల సంరక్షణ : భారతదేశంలో పంటలో 5 శాతం పంట క్రిమి కీటకాలు, తెగుళ్ల వల్ల దెబ్బతింటున్నదని వ్యవసాయ శాస్త్రవేత్తల అంచనా. ఈ విధంగా పంట దెబ్బతినటానికి కారణం వ్యవసాయదారులకు సస్యరక్షణపై అవగాహన లేకపోవటం, క్రిమి సంహారక మందులను ఉపయోగించకపోవటం. కొంత మంది వ్యవసాయదారులు క్రిమిసంహారక మందులు వాడుచున్నా ఆశించిన ఫలితాలు పొందలేకపోవుచున్నారు. ఎందుకంటే వ్యవసాయదారులందరూ క్రిమి సంహారక మందులు వాడినప్పుడే వాటి వల్ల సత్ఫలితాలు లభ్యమౌతాయి. కావున వ్యవసాయదారులందరూ మొక్కల సంరక్షణ చర్యలను తీసుకునే విధంగా ప్రభుత్వం విధానాన్ని చేపట్టాలి. అవసరమైతే తక్కువ రేట్లతో ప్రభుత్వ సాంకేతిక సిబ్బంది క్రిమి సంహారక మందులు ఇచ్చే విధంగా చర్యలను చేపడితే ఉత్పాదకత పెరగగలదు.

జి) వ్యవసాయంలో యాంత్రీకరణ : వ్యవసాయరంగంలో యాంత్రీకరణవల్ల ఉత్పాదకతా శక్తి పెరుగుతుంది. యంత్రాల సహాయంతో వ్యవసాయం చేయటం వల్ల కాలము పొదుపు అవ్వటంతోపాటు వ్యయాలు కూడా తగ్గుతాయి. అయితే యాంత్రీకరణతో పాటు మేలురకం విత్తనాలు, రసాయనిక ఎరువుల వినియోగం, ఇతర ఉత్పాదకాలు కూడా ఉత్పాదకత పెరుగుదలకు తోడ్పడతాయి. అయితే యాంత్రీకీకరణ ప్రాధాన్యతను గుర్తించి వ్యవసాయదారులు యంత్ర సహాయంతో వ్యవసాయం చేయడం ద్వారా ఉత్పాదకతను పెంచవచ్చు.

హెచ్) పరపతి, మార్కెటింగ్ సదుపాయాలు : వ్యవసాయ ఉత్పాదకత పెంపొందించేందుకు అవసరమైన మేలురకం విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమినాశక మందులు, యంత్రాలు, నీటి పారుదల సదుపాయాలు సమకూర్చుకోవటానికి సమృద్ధిగా ద్రవ్యం అవసరం. అయితే భారతదేశంలో వ్యవసాయదారులు సమృద్ధిగా ద్రవ్యాన్ని కలిగి ఉండకపోవటం వల్ల వారికి అవసరమైన పరపతి సదుపాయాలు అవసరము. లేనిచో వడ్డీ వ్యాపారస్తులు కబంధ హస్తాలలోకి చిక్కుకుపోయి వ్యవసాయోత్పత్తిని పెంచలేరు. కావున వ్యవసాయదారులకు అవసరమైన పరపతిని వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు అందించే విధంగా చర్యలను చేపట్టాలి. ఉత్పత్తి చేసిన తరువాత కూడా తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు, నిల్వ సదుపాయాలు లేక అవస్థలు పడటం జరుగుతుంది. అందుచేత పండివ పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవటం, నిల్వకు అవకాశం లేనందున వెంటనే అమ్ముకోవడం వల్ల తక్కువ ధర లభ్యమౌతుంది. ఫలితంగా వ్యవసాయోత్పత్తిని పెంపొందించుకొనే అవకాశం వ్యవసాయదారులకు లభించటం లేదు. అందుచేత వ్యవసాయదారులకు అవసరమైన పరపతిని తక్కువ వడ్డీరేట్లకు అందించటంతోపాటు, మార్కెటింగ్ సదుపాయాలు, గిడ్డంగి సదుపాయాలు మొదలైన వాటిని విస్తరించినట్లయితే వ్యవసాయోత్పత్తి పెరుగుతుంది.

ఐ) ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు : వ్యవసాయదారులు ఉత్పాదకతను పెంపొందించేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను అందించటం ద్వారా దేశ వ్యవసాయ ఉత్పాదకతను పెంచవచ్చు. వ్యవసాయదారులకు ఇచ్చేప్రోత్సాహకాలు విభిన్న రీతుల్లో అందించవచ్చు. అవి : 1. భూ సంస్కరణలను చిత్తశుద్ధితో అమలు చేయటం, 2. వ్యవసాయ ఉత్పాదకాలను సరైన సమయంలో అందజేయటం,

3. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను అందించటం, 4. వ్యవసాయంలో ఏర్పడే నష్టభయాన్ని అధిగమించేందుకు పంట భీమా పథకాలను అమలు చేయటం, 5. అధిక ఉత్పాదకతను సాధించిన రైతులకు అవార్డులు, మెరిట్ సర్టిఫికెట్లు ఇవ్వడం. ఈ విధమైన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందించినట్లయితే వ్యవసాయదారులు ఉత్పాదకతను పెంపొందించేందుకు ఆసక్తిని చూపగలరు.

జె) వ్యవసాయ పరిశోధన : వ్యవసాయరంగంలో పరిశోధన అత్యావశ్యకం. ప్రస్తుతం మన దేశంలో Indian Council of Agricultural Research వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఇతర విశ్వవిద్యాలయాలు, సంస్థలు వ్యవసాయ రంగంలో పరిశోధనలను కొనసాగిస్తూ అధిక దిగుబడి విత్తనాలను రూపొందిస్తున్నాయి. గోధుమ పంటలో మనం గణనీయమైన అభివృద్ధిని సాధించటం జరిగింది. వివిధ పరిశోధన సంస్థలు భూ సారాలను పరీక్ష చేసి భూ సారాన్ని పెంచే సలహాలను, భూ సారవంతాన్ని పరిరక్షించే పద్ధతులను, పంటలకు వచ్చే తెగుళ్లు, నివారణ చర్యలను, పంట వ్యయాన్ని తగ్గించుకోవటానికి సలహాలను ఇవ్వటం జరుగుతుంది. కాని ఈ సదుపాయాలు వ్యవసాయదారులందరికి అందుబాటులో లేవు. కావున పరిశోధన ఫలితాలను వ్యవసాయదారులందరికి విస్తరించటం ద్వారా వ్యవసాయోత్పత్తిని ఇనుమడింప చేయవచ్చు.

భారతదేశంలో వ్యవసాయోత్పత్తిని పెంపొందించేందుకు పైన చెప్పిన వివిధ రకాలైన చర్యలను చేపట్టవలసిన ఆవశ్యకత ఉంది. పై చర్యల్లో కొన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నా వ్యవసాయదారులందరికి సరిపడే విధంగా లేవు. ఈ సదుపాయాల కొరతతో పాటు వ్యవసాయదారుల సాంఘీక పరిస్థితులు అనగా నిరక్షరాశ్యత, సనాతన దృక్పథం, మారుచున్న పరిస్థితులకనుగుణంగా మారకపోవటం మొదలైన పరిస్థితులు కూడా వ్యవసాయంలో అల్పోద్యోగితకు కారణమౌతున్నాయి. కావున ప్రభుత్వం వ్యవసాయదారులలో ఉన్న నిరక్షరాశ్యత, అజ్ఞానం, సాంప్రదాయ ఆలోచనా ధోరణిని మార్చేందుకు అవసరమైన చర్యలను కూడా చేపట్టవలసి ఉంటుంది. మన దేశ వ్యవసాయోత్పత్తిని పెంపొందించేందుకోసం ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు చిత్తశుద్ధితో కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

6.1.6. వ్యవసాయ విత్తము

వ్యవసాయం అసంఘటిత కార్యకలాపం. వ్యవసాయం యొక్క జయాపజయాలు హెచ్చుగా వాతావరణంపై ఆధారపడి ఉంటాయి. వ్యవసాయదారులు తీసుకునే రుణాలను ఇదిమిత్తంగా ఉత్పాదక, అనుత్పాదక రుణాలు విభజించేందుకు ఎల్లప్పుడు సాధ్యంకాదు. అందుచేతనే వ్యవసాయానికి రుణాలందించేందుకు బ్యాంకులు ఆసక్తి చూపకపోవటం, అందుచేత వ్యవసాయదారులు రుణాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించవలసి వస్తుంది. ఫలితంగా వ్యవసాయదారులు వడ్డీ వ్యాపారస్తుల హస్తాల్లో చిక్కుకొని ఆ విషవలయం నుంచి బయటకు రాలేక వ్యవసాయ కూలీలుగా మారుచున్న పరిస్థితి కూడా ఏర్పడుతుంది. ప్రస్తుతం వ్యవసాయ విత్త అవసరాలను గురించి మనం తెలుసుకుందాం.

6.1.6.1. వ్యవసాయ విత్త ఆవశ్యకత : వ్యవసాయదారుల విత్త అవసరాలను రెండు కోణాలలో పరిశీలిద్దాం. 1. కాల ప్రాతిపదిక 2. అవసరాల ప్రాతిపదిక. ఈ రెండు ప్రాతిపదికలపై ఆధారపడి వ్యవసాయ విత్త ఆవశ్యకతను గురించి తెలుసుకుందాం.

1. కాల ప్రాతిపదికపై వ్యవసాయ అవసరతలు (On the Basis of Time) : వ్యవసాయదారులకు అవసరమైన పరపతిని కాలప్రాతిపదికపై ఆధారపడి మూడు రకాలుగా చెప్పవచ్చు. అవి : ఎ) స్వల్పకాల పరపతి బి) మధ్యకాలిక పరపతి, సి) దీర్ఘకాలిక పరపతి. వ్యవసాయదారులు విత్తనాలకోసం, ఎరువులకోసం, వేతనాల చెల్లింపు కోసం, పశువుల దాణా కోసం, వివిధ రకాలైన వినియోగ అవసరాలు, అనుత్పాదక కార్యకలాపాల కోసం తీసుకునే రుణాలు స్వల్పకాలిక రుణాల కోవకు వస్తాయి. స్వల్పకాలిక రుణాల కాల పరిమితి 15 నెలలు. ఈ రుణ సదుపాయాన్ని వడ్డీ వ్యాపారస్తులు, సహకార సంఘాలు అందిస్తూంటాయి. మధ్యకాలిక రుణాల జాబితాలోకి పశువుల కొనుగోలు, వ్యవసాయ పరికరాల కొనుగోలు, బావుల త్రవ్వకం మొదలైనవి వస్తాయి. మధ్యకాలిక రుణాల కాల పరిమితి 15 నెలల నుంచి 5 సంవత్సరాల వరకు ఉంటుంది. ఈ విధమైన రుణాలు సాధారణంగా వడ్డీ వ్యాపారస్తులు, బంధువులు, సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకులు అందిస్తాయి. 5 సంవత్సరాలు మించి కాల పరిమితి గల రుణాలను దీర్ఘకాలిక రుణాలు అంటాము. దీర్ఘకాలిక అవసరాలైన వ్యవసాయ భూముల అభివృద్ధి, గొట్టపు బావుల తవ్వకం, ట్రాక్టర్లు మొదలైన అవసరాల కోసం తీసుకొనే రుణాలు దీర్ఘకాలిక రుణాలు. ఈ విధమైన రుణాలు ప్రాధమిక సహకార, గ్రామీణ అభివృద్ధి బ్యాంకులు అందిస్తూ ఉంటాయి. ఈ మూడు రకాలైన అనగా స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు కాల ప్రాతిపదిక మీద వ్యవసాయదారులు తీసుకొనే రుణాలు.

2. అవసరాల ప్రాతిపదిక **(On the Basis of Purpose)** : అవసరాల ప్రాతిపదికపై ఆధారపడి వ్యవసాయదారులు తీసుకునే రుణాలను 1) ఉత్పాదక 2) వినియోగం, మరియు 3) అనుత్పాదక అనే మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. వ్యవసాయ ఉత్పాదకతకు ప్రత్యక్షంగా దోహదం చేసే విత్తనాల కొనుగోలు, రసాయన ఎరువుల కొనుగోలు, వ్యవసాయ పనిముట్లు, బావుల తవ్వకం, వేతనాల చెల్లింపు మొదలైనవన్నీ ఉత్పాదక రుణాల వర్గంలోకి వస్తాయి. వినియోగం కోసం వ్యవసాయదారులు తీసుకొనే రుణాలు రెండో వర్గంలోకి వస్తాయి. వరదలు, దుర్భిక్ష పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతినటం వల్ల వ్యవసాయదారులు వినియోగ అవసరాల కోసం రుణాలు తీసుకోవాల్సి వస్తుంది. వీటిని 'వినియోగ రుణాలు' అంటారు. మూడో రకం రుణాలు అనుత్పాదక రుణాలు. వ్యవసాయదారులు వారి కోర్టులకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి, మత సంబంధమైన వేడుకలకు, వివాహాలు, క్రతువులు, పండుగలు మొదలైన కార్యక్రమాల కోసం తీసుకొనే రుణాలను అనుత్పాదక రుణాలు అంటాము. వ్యవసాయదారులు ఉత్పాదక, వినియోగ రుణాలను తిరిగి చెల్లించగలరు కాని అనుత్పాదక రుణాలను తిరిగి చెల్లించటం కష్టము. ఎందుకంటే అవి ఏ విధంగాను ఉత్పాదకతకు దోహదం చెయ్యలేవు.

6.1.6.2. వ్యవసాయ విత్త మూలాలు (Sources of Agricultural Finance) : వ్యవసాయానికి పరపతిని అందించే మూలాలను రెండు రకాలుగా చెప్పవచ్చు. అవి 1. సంస్థాగతం కాని మూలాలు లేదా వ్యక్తులు అందించే మూలాలు 2. సంస్థాగతమైన మూలాలు

ఎ) సంస్థాగతం కాని మూలాలు : వ్యక్తులు అందించే రుణాలను సంస్థాగతం కాని వ్యవసాయ రుణాలు అంటారు. ఈ విధమైన రుణాలను గ్రామాల్లో వడ్డీ వ్యాపారస్తులు, బంధువులు, వ్యాపారస్తులు, కమీషన్ ఏజెంట్లు, భూ స్వాములు అందిస్తూంటారు. మొట్టమొదటి నుంచి వ్యవసాయదారులు రుణాలకోసం వీరిపైనే ఎక్కువగా ఆధారపడేవారు. సంస్థాగతం కాని రుణాల శాతం మొత్తం రుణంలో 1951-52 లో 93 శాతం కాగా, సంస్థాగత రుణం కేవలం 7 శాతం మాత్రమే. 1961-62 నాటికి సంస్థాగతం కాని రుణం 81 శాతానికి తగ్గి, సంస్థాగత రుణం 19 శాతానికి పెరిగింది. ఆ తరువాత క్రమక్రమంగా సంస్థాగతం కాని రుణం 1981 కి 37 శాతానికి తగ్గగా సంస్థాగత రుణాలు 63 శాతానికి తగ్గింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే వ్యవసాయదారులు తమ రుణాలకోసం వ్యక్తులను అంటే వడ్డీ వ్యాపారస్తులను, బంధువులను, వ్యాపారస్తులు మొదలైన వారిని ఆశ్రయించటం తగ్గిందని చెప్పవచ్చు. ఈ పరిణామం ఆశించదగ్గ మంచి పరిణామముగా చెప్పవచ్చు.

బి) వ్యవస్థాగతమైన మూలాలు : భారతదేశంలో చాలా కాలంగా వ్యవసాయదారులకు పరపతిని వ్యక్తుల ద్వారా లేదా సంస్థాగతం కాని మూలాల ద్వారా లభ్యమయ్యేది. సంస్థాగతం కాని మూలాల ద్వారా రుణాలు ఖరీదైనవిగాను, దోపిడీ స్వభావాన్ని కలిగి ఉండేవి. స్వాతంత్ర్యానంతరం సంస్థాగతమైన మూలాలు అభివృద్ధి చెందసాగాయి. సంస్థాగతమైన పరపతి మూలాలలో సహకార పరపతి సంఘాల, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వస్తాయి. వ్యవసాయ పరపతికి అత్యున్నత సంస్థగా నాబార్డ్ (NABARD) వ్యవహరిస్తుంది. మన దేశ కేంద్ర బ్యాంకు అయిన రిజర్వు బ్యాంకు వ్యవసాయాభివృద్ధికి కీలకమైన పాత్రను పోషిస్తూ NABARD కు అవసరమైన విత్త సదుపాయాలను అందించి గ్రామీణాభివృద్ధికి అవసరమైన సూచనలను అందిస్తూంటుంది.

మన దేశంలో సంస్థాగతంగా వ్యవసాయదారులకు పరపతిని అందించే విధానాన్ని బహుళ ఏజెన్సీ విధానం (Multi Agency Approach) అంటారు. ఈ బహుళ ఏజెన్సీ పరపతి విధానం ఉద్దేశాలు సాధించిన ఫలితాలను గురించి ముందుగా తెలుసుకుందాం.

6.1.6.3 బహుళ ఏజెన్సీ పరపతి విధానం : వ్యవసాయాభివృద్ధికి అతి కీలకమైన ఉత్పాదకం పరపతి. అయితే అనాదిగా వ్యవసాయదారులు వడ్డీ వ్యాపారస్తుల నుంచి పరపతిని తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. వడ్డీ వ్యాపారస్తులు వసూలు చేసే వడ్డీరేట్లు అధికంగా ఉండటమే కాక వ్యవసాయదారులను దోపిడీ చేసే విధంగా వ్యవహరించేవారు. అందుచేత భారత ప్రభుత్వం స్వాతంత్ర్యానంతరం బహుళ ఏజెన్సీ పద్ధతి ద్వారా అనగా సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు ద్వారా తక్కువ వడ్డీరేట్లకు, సమృద్ధిగా వ్యవసాయదారులకు పరపతి అందించే విధానాన్ని చేపట్టటం జరిగింది. ఈ బహుళ ఏజెన్సీలోని సంస్థలందించే పరపతియే సంస్థాగతమైన పరపతి.

బహుళ ఏజెన్సీ విధానం లక్ష్యాలు : భారతదేశం అవలంభిస్తున్న బహుళ ఏజెన్సీ లక్ష్యాలు కింది విధంగా ఉన్నాయి.

ఎ) వ్యవసాయ రంగానికి సకాలంలో, అధిక మొత్తాల్లో పరపతిని అందించటం

బి) గ్రామీణ ప్రాంతాల్లో క్రమక్రమంగా వడ్డీ వ్యాపారస్తులను తొలగించటం

సి) అందించే పరపతిని అన్ని ప్రాంతాలకు సమానంగా అందేలా చూడటం. అనగా గ్రామీణ అసమానతలను తగ్గించటం

డి) ఎక్కువ పరపతిని ప్రత్యేకంగా కొనసాగించే కార్యక్రమాలకు ఉదా॥ Pulses Development Programme, Special Rice Development Programme, National Oilseeds Development Programme లకు అందేలా చూడటం

ఈ విధమైన లక్ష్యసాధనకోసం సంస్థాపరమైన పరపతిని అందించటం జరుగుతుంది.

సంస్థాగతమైన పరపతి అవసరత : ప్రైవేటు వ్యక్తుల పరపతిలో ఉన్న ఇబ్బందుల వల్ల సంస్థాగతమైన పరపతి ఆవశ్యకత ఏర్పడింది. ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల నుంచి తీసుకునే పరపతి వల్ల క్రింది సమస్యలు ఉన్నాయి.

1. ప్రైవేటు పరపతి ఎల్లప్పుడు లాభోద్దేశంతో కూడినది, ప్రైవేటు వ్యక్తులు ఎల్లప్పుడు దోపిడీ లక్ష్యంతోనే ఉంటారు.

2. ప్రైవేటు రుణాలపై వడ్డీ ఎక్కువగా ఉండటంతోపాటు ఉత్పాదకతకు ముడిపడి ఉండదు.

3. ఈ రుణాలు అవసరాలకనుగుణంగా అవసరమైన వ్యక్తులకు అందించబడవు

4. వ్యవసాయాభివృద్ధికి ఇవి లభ్యంకావు. దీర్ఘకాలానికి తక్కువ వడ్డీతో ఇవి అందించబడవు.

5. వ్యవసాయదారుల అవసరతలకు అనుగుణంగా ప్రైవేటు రుణాలు అందించబడవు.

అయితే సంస్థాగత పరపతి తక్కువ ఖరీదులో లభ్యమౌతుంది. ఈ పరపతి ముఖ్యోద్దేశం వ్యవసాయదారుల వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడి వారి ఉత్పాదకతను పెంపొందించి ఫలితంగా వారి ఆదాయ స్థాయిని పెంపొందించటం. సంస్థాగత సంస్థలిచ్చే పరపతిపై వడ్డీరేట్లు తక్కువ. కాల అవసరాలకనుగుణంగా పరపతిని అందించటం జరుగుతుంది. పరపతి సంస్థలు కేవలం పరపతి అందించటమే కాక వారికి వ్యవసాయ సంబంధమైన కార్యక్రమాలలో అంటే ఉపయోగించే విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమినాశక మందులు మొదలైనవాటిల్లో తమ సలహాలను అందిస్తూ వ్యవసాయదారులకు అండదండగా ఉంటాయి.

భారతదేశంలో బహుళ ఏజెన్సీ విధానం పరిణామ క్రమం : భారతదేశంలో వ్యవస్థాపరమైన పరపతి సంస్థలు స్థాపించక పూర్వం వ్యవసాయ ఉత్పత్తి తగ్గి అనేక తీవ్ర సమస్యలు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితిని సరిదిద్దేందుకై ప్రభుత్వం సహకారపరపతి సంఘాలను, భూమి తనఖా బ్యాంకులను ఏర్పాటు చేసింది. ఈ సహకార విధానం వల్ల వ్యవసాయం గణనీయంగా పెరుగుతుందని ఆశించటం జరిగింది. కాని 1950-51లో జరిపిన (Survey of Rural Credit) గ్రామీణ పరపతి సర్వే ప్రకారం సహకార సంస్థలు అందించిన పరపతి మొత్తం పరపతిలో కేవలం 3.3 శాతమే అని వెల్లడైంది. అయితే ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులు వ్యవసాయ పరపతిలో 93 శాతం అందించినట్లు సర్వే వెల్లడి చేసింది. ఆ తరువాత 1954లో All India Rural Survey Committee ఈ విధంగా ప్రకటించింది. సహకారం విఫలమైంది కాని సహకారం తప్పని సరిగా ఫలిస్తుంది ! ఈ కమిటీ సలహాల మేరకు భారతీయ రిజర్వు బ్యాంకు సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసే విధంగా చర్యలను చేపట్టటం జరిగింది.

1955 వ సంవత్సరములో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను రూపొందించటం జరిగింది. ఇతర విధులతో పాటు వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను ఈ బ్యాంకుకి ఇవ్వటం జరిగింది. 1969వ సంవత్సరములో All India Rural Credit Survey Committee ప్రతిపాదనల మేరకు 'బహుళ ఏజెన్సీ విధానం' (Multi Agency Approach) రూపొందించి వ్యవసాయ రంగానికి పరపతి సదుపాయాన్ని అందించటం ప్రారంభించబడింది. ఇదే సమయంలో సహకార సంస్థలు వ్యవసాయ పరపతి అందించలేకపోతున్నాయని వాణిజ్య బ్యాంకులు

వ్యవసాయ పరపతిని అందించే విషయంలో ప్రముఖ పాత్ర వహించాలని క్రెడిట్ సర్వే కమిటీ ప్రకటించటం జరిగింది. ఈ అంశం ముఖ్య కారణంగా 1969 వ సంవత్సరములో వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణ జరిగింది. ఆ తరువాత 1975లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (Regional Rural Banks) స్థాపన జరిగింది. ఈ విధంగా బహుళ ఏజెన్సీ విధానం విస్తరిస్తూ వ్యవసాయదారులకు పరపతి సదుపాయాలను అందిస్తూ వస్తుంది.

ఆ తరువాత బహుళ ఏజెన్సీ పద్ధతి ద్వారా అందించబడే వ్యవసాయ పరపతిని అనుసంధానం చేయటానికి, వివిధ సంస్థలకు సహకరించేందుకు ఒక ప్రత్యేక బ్యాంకింగ్ సంస్థ ఉండాలని భావించి NABARD (National Bank for Agriculture and Rural Development) అనే సంస్థను రిజర్వు బ్యాంకు స్థాపించటం జరిగింది. ఈ విధంగా భారతదేశంలో బహుళ ఏజెన్సీ విధానం ద్వారా సంస్థాగత పరపతి సదుపాయాలను భారత ప్రభుత్వం అందిస్తోంది.

భారతదేశంలో సంస్థాగత పరపతి విస్తీరణ : భారతదేశంలో సంస్థాగత పరపతి సంస్థలు అందిస్తున్న పరపతి పరిమాణం, కాలగమనంలో వచ్చిన పెరుగుదలను కింది పట్టిక 6.1.6 తెలయజేస్తుంది.

పట్టిక నెం. 6.1.6
వ్యవసాయ పరపతి పంపిణీ

సంవత్సరం	సహకార బ్యాంకులు	(కోట్ల రూపాయలలో)	
		వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు	మొత్తం
1984-85	3,440 (55)	2,790 (45)	6,230
1990-91	3,970 (44)	5,010 (56)	8,980
2000-2001	21,910 (41)	31,590 (59)	53,500
2001-2002	27,080 (41)	39,690 (59)	66,770

(బ్రాకెట్లలోని సంఖ్యలు మొత్తం పరపతిలో శాతం)

మూలం : Government of India, Economic Survey (2001 - 2002) p. 200

వ్యవస్థాగత మూలాల ద్వారా అందిన వ్యవసాయ పరపతి 1984-85లో 6,230 కోట్ల రూపాయలు కాగా 2000-2001కి 53,500 కోట్లకు పెరిగింది. 2001-2002 నాటికి ఈ పరపతి 66,700 కోట్ల రూపాయలకు చేరుతుందని అంచనా. అందులో సహకారసంస్థల పరపతి (స్వల్ప, దీర్ఘకాలిక పరపతులు) 1984-85 లో 55 శాతం ఉండగా, 2001-2002 నాటికి 41 శాతానికి తగ్గింది. అదే కాలంలో

వాణిజ్య బాంకులు అందించిన పరపతి శాతం 45 నుంచి 59కి పెరిగింది. ఈ గణాంకాలు వ్యవసాయ పరపతిలో సంస్థాగత మూలాల ద్వారా అందించే పరపతి గణనీయంగా పెరిగిందనే విషయాన్ని వెల్లడిస్తాయి. సంస్థాగత పరపతి సంస్థలు మరిత మెరుగ్గా పరపతి అవసరాలు తీర్చగలిగే అవకాశం ఉన్ననూ క్రింది కారణాల వల్ల అవి మరింత సమర్థవంతంగా పనిచేయలేకపోతున్నాయి.

సంస్థాగత పరపతిలో ఉన్న ఇబ్బందులు : 1950 నాటికి కేవలం 3 శాతం మాత్రమే వ్యవసాయ పరపతి అవసరాలను తీర్చగలిగిన సంస్థాగత పరపతి సంస్థలు నేడు 60 శాతం పైన వ్యవసాయదారుల అవసరాలను తీర్చగలుగుచున్నాయి. అయితే వడ్డీ వ్యాపారస్తుల పాత్ర కూడా ఎక్కువగానే ఉన్నట్లు గమనించవచ్చు. వ్యవసాయ పరపతి అందించే విషయంలో సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పాత్ర గణనీయంగా పెరిగినా నేటికినీ పేద వ్యవసాయదారుల్లో 70 శాతం మందికి ఈ సంస్థలు పరపతి సదుపాయాలందించ లేకపోచున్నాయి. అందుకు క్రింది పరిస్థితులు కారణాలుగా చెప్పవచ్చు.

ఎ) ప్రభుత్వం స్థాపిస్తున్న వ్యవసాయ పరపతి సంస్థలు వ్యవసాయదారుల్లో ధనిక వ్యవసాయదారులైన కేవలం 30 శాతం మందికే పరపతిని అందించటం జరుగుతుంది.

బి) కేవలం ఉపాంత, సన్నకారు రైతుల కోసం ఏర్పాటైన పరపతి సదుపాయాలను కూడా వారికి అందటం లేదు. అందుకు కారణం ధనిక వ్యవసాయదారులు, ప్రభుత్వాధికార్లతో పరోక్ష అంగీకారం ద్వారా ఆ రుణ సదుపాయం పొందటం జరుగుతుంది.

సి) పేదల్లో కూడా అట్టడుగు వారైన కట్టు బానిసలు, వ్యవసాయ కూలీలు, షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డ్ కులాల వారు నేటికిని వడ్డీ వ్యాపారస్తుల కబంద హస్తాల్లో ఉండి దోపిడీకి గురౌతూనే ఉన్నారు.

డి) సంస్థాగత పరపతి సంస్థలు కేవలం ప్రకటనల్లో మాత్రమే పేద ప్రజలు, పేద వ్యవసాయదారులకు రుణాలని చెప్పటం తప్ప వాస్తవంగా వారికి పరపతి చేరటం లేదు. అందుచేతనే గ్రామీణ ప్రాంతాలలోని అట్టడుగు 70 శాతానికి పరపతి సదుపాయాలు అందటం లేదు.

బహుళ ఏజెన్సీ విధానంలో సమస్యలు : వడ్డీ వ్యాపారస్తుల నుంచి వ్యవసాయదారులను తప్పించేందుకు సరైన విధానంగా భావించి రూపొందించిన బహుళ ఏజెన్సీ విధానంలో వివిధ సమస్యలు వెలుగులోకి వచ్చాయి. CE కామత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన Working Group క్రింద సమస్యలను గుర్తించటం జరిగింది.

ఎ) ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న వ్యవసాయ పరపతి సంస్థల మధ్య అవగాహన లేకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో అధిక పరిమాణంలో పరపతి, మరికొన్ని ప్రాంతాల్లో అల్ప పరపతిని ఇవ్వటం జరుగుతోంది.

బి) లీడ్ బ్యాంకు పధకాన్ని అమలుచేసి జిల్లా పరపతి ప్రణాళిక రూపొందించినా జిల్లాల్లోను, వివిధ బ్లాకు స్థాయిల్లోను వ్యవసాయ పరపతిని సమర్థవంతంగా అమలు చెయ్యలేకపోవడం జరుగుతుంది.

సి) భారతీయ రిజర్వు బ్యాంకు వివిధ రకాలైన సూచనలను ఇస్తున్నా, వివిధ సంస్థలు వారికనుగుణమైన విధానాల ద్వారా రుణాలను రాబట్టుకొనే ప్రయత్నాలు చేస్తున్నవి. అందువల్ల సంస్థల్లో అనవసర పోటీతత్వం ఏర్పడుతోంది.

డి) రుణాల వసూళ్లలో అనేక సమస్యలను సంస్థలు ఎదుర్కొంటున్నాయి. కొన్ని సందర్భాల్లో ఒకే సెక్యూరిటీ మీద వివిధ సంస్థలో ఒకే వ్యక్తి రుణాలు తీసుకోవటం జరుగుతుంది. అందుచేత రుణాల వసూలు కష్ట సాధ్యమౌతుంది.

ఈ మధ్య కాలంలో ప్రారంభించిన Service Area Approach వల్ల పరపతి పంపిణీ సక్రమంగా అమలు జరుగుచున్ననూ ఈ విధానంలోనూ వివిధ బలహీనతలు ఉన్నాయి. రుణాలు ఇచ్చే సంస్థలు అందులోనూ సహకార సంస్థలు ఎదుర్కొంటున్న అతి ముఖ్య సమస్య బాకీల వసూలు. ఈ బాకీలు సహకార సంస్థలో 40 నుంచి 42 శాతం ఉంటే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో 47 శాతం ఉన్నాయి. బాకీల పరిమాణం ఎక్కువగా ఉన్నందున ఈ సంస్థల మనుగడ కష్టంగా ఉంది. దీనితో పాటు ప్రభుత్వం అవలంబించే రుణ మాఫీ విధానం. ఏదో కొన్ని రాష్ట్రాల్లో అవలంభిస్తున్న రుణ మాఫీ క్రమంగా విస్తరించి దేశానికి విస్తరించింది. అందుచేత ఈ సంస్థలు ఇచ్చిన

రుణాలు మరలా రుణాలు ఇవ్వటానికి ఉపకరించటం లేదు. అందువల్ల సంస్థాపర రుణాలిచ్చే సంస్థలు పెరుగుచున్న వ్యవసాయదారుల అవసరాలకు తగ్గట్లు రుణ సదుపాయాలను అందించలేకపోతున్నాయి.

6.1.6.4. వ్యవస్థాగత పరపతి అందించే సంస్థలు : వ్యవస్థాగతమైన పరపతి సదుపాయాలను అందించే సంస్థలు

1. సహకార పరపతి సంఘాలు

2. వాణిజ్య బ్యాంకులు

3. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు అని

వ్యవసాయ సంస్థాగత పరపతి సంస్థలకు అత్యున్నత సంస్థ NABARD అని గతంలో మనం తెలుసుకున్నాము. ప్రస్తుతం ఈ సంస్థాగత మూలాలను గురించి వివరంగా తెలుసుకుందాం.

6.1.6.4.1. సహకార పరపతి సంస్థలు : పరపతిని అందించే స్వభావంపై ఆధారపడి భారతదేశంలోని సహకార పరపతి సంస్థల నిర్మాణాన్ని రెండు రకాలుగా చెప్పవచ్చు. అవి : 1. స్వల్పకాల పరపతి సంస్థలు, 2. దీర్ఘకాల పరపతి సంస్థలు. స్వల్పకాలిక పరపతినిచ్చే సంస్థల నిర్మాణము మూడంచెలలో ఉంటుంది. క్రింది స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉంటాయి. ఇవి గ్రామీణ స్థాయిలో నిర్వహించబడుతూ ఉంటాయి. మధ్య స్థాయిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, పై స్థాయిలో రాష్ట్ర సహకార బ్యాంకులు నిర్వహించబడుతూ ఉంటాయి. గ్రామ స్థాయిలో నిర్వహించబడే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు 10 మంది లేదా 10 కన్నా ఎక్కువ మందితో ఏర్పడతాయి. ఈ సంస్థలు వ్యవసాయదారుల చెల్లింపు శక్తిపై ఆధారపడి ఉత్పాదక కార్యకలాపాలకు పరపతిని అందిస్తాయి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు రుణాలను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అందిస్తుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు పరపతిని రాష్ట్ర సహకార బ్యాంకు అందిస్తుంది. రాష్ట్ర సహకార బ్యాంకు రిజర్వు బ్యాంకుకు, క్రింది స్థాయి సహకార సంస్థలకు వారధిగా కూడా పనిచేస్తుంది.

వ్యవసాయ దీర్ఘకాలిక పరపతి అవసరాలైన శాశ్వత భూమి అభివృద్ధి పనులకు, వ్యవసాయ యంత్రాల కొనుగోలుకు, గత రుణాల చెల్లింపుకు దీర్ఘకాలిక సహకార పరపతి సంస్థలు స్థాపించబడ్డాయి.

ఎ) స్వల్పకాలిక పరపతి సంస్థలు : స్వల్పకాలిక పరపతి సంస్థలు మూడంచెలుగా ఉన్నాయని మనం తెలుసుకున్నాం. అవి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, రాష్ట్ర సహకార బ్యాంకు. ఈ సంస్థల స్వరూపం పనితీరును గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1) ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (Primary Agricultural Credit Societies) : సహకార పరపతి సంఘాన్నే 'ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం' (PACS) అని పిలుస్తారు. ఈ సంఘంలో 10 లేదా అంతకన్నా ఎక్కువ సభ్యులు సాధారణంగా ఒకే గ్రామానికి సంబంధించి ఉంటారు. ఈ సంఘ సభ్యుల ప్రవేశ రుసుం నామ మాత్రంగా ఉండి పేద వ్యవసాయదారులు కూడా సభ్యులుగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ సంఘంలోని సభ్యులు సాధారణంగా ఒకరికొకరు తెలిసి ఉంటారు. సంఘానికి నష్టం ఏర్పడితే ఆ నష్టాన్ని సభ్యులందరూ విధిగా భరించాల్సి ఉంటుంది. సంఘ సభ్యుల ద్వారా ఎన్నుకోబడిన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి సంఘ కార్యకలాపాలను నిర్వహిస్తారు. వీరికి ఏ విధమైన ప్రతిఫలం ఉండదు. ప్రతి సంఘము ప్రవేశ రుసుము, వాటాలు, డిపాజిట్లు, రుణాల ద్వారా నిధులను సమకూర్చుకుంటుంది.

ఈ సంఘము అందించే రుణాలు స్వల్పకాలికమైనవి. వ్యవసాయ సంబంధమైన కార్యకలాపాల నిర్వహణ కోసం సంవత్సరము లోపు కాలం రుణాలు తక్కువ రేట్లకు వ్యవసాయదారులకు ఈ సంఘం అందిస్తుంది. 1950-51లో ఈ సంస్థల ద్వారా రూ॥లు 23 కోట్లు రుణాలు మంజూరు కాగా, 1960-61 నాటికి 200 కోట్ల రూపాయలకు, 1999-2000 నాటికి 13,600 కోట్లు రూపాయలు మంజూరు కాబడ్డాయి. ఈ సంస్థలిచ్చే రుణాలు విస్తారంగా పెరిగినట్లు కన్పించినా వ్యవసాయదారుల డిమాండుకు సరిపడలేవనే చెప్పవచ్చు.

PAC ల సంఖ్య, వనరుల స్థితి : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (PACS) భారతదేశంలో 1904 నుంచి కొనసాగుచున్ననూ, స్వాతంత్ర్యానంతరం వీటిని శక్తివంతమైన సంస్థలుగా రూపొందించటం జరిగింది. గతంలో కొనసాగుచున్న సంఘాలను స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వము, రిజర్వుబ్యాంకు పునర్వవస్థీకరించటం జరిగింది. భారతదేశంలో 1960-61 లో 2,12,000 ప్రాథమిక పరపతి సంఘాలు ఉండగా అవి 1970-71 నాటికి 1,61,000కు, 1999 - 2000 సంవత్సరానికి 92,000కు తగ్గటం జరిగింది.

దేశంలోని PAC లలో దాదాపు అన్ని PAC లు ద్రవ్య వనరుల కోసం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులపైనే ఆధారపడి ఉన్నాయి. ఏ ప్రదేశంలో కేంద్ర సహకార బ్యాంకులు ఆర్థికంగా శక్తివంతంగా ఉండవో ఆ బ్యాంకు పరిధిలో ఉన్న PAC లు ఆర్థికంగా క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటాయి. 1999 మార్చి నాటికి PAC లు అందించిన రుణాలు రూ॥లు 21,100 కోట్లకు పైనే ఉంటుంది.

PAC లు ఎదర్కొంటున్న సమస్యలు : ప్రాథమిక పరపతి సంఘాలు ఆ సంఘాల పరిధిలో స్థానిక అవసరాలకు పరపతిని అందిస్తూ ఉంటాయి. వ్యవస్థాపరంగా, విత్త పరంగా ఈ సంస్థలు బలహీనమైనందున ఇవి వ్యవసాయానికిచ్చే పరపతి పరిమితంగా ఉంటుంది. The All India Rural Credit Review Committee కింది సమస్యలను ప్రాథమిక పరపతి సంస్థలు ఎదుర్కొంటున్నట్లుగా గుర్తించాయి.

ఎ) వ్యవసాయ పరపతి మొత్తంలో వ్యవసాయ పరపతి అందించే పరపతి చాలా తక్కువ

బి) సన్నకారు వ్యవసాయదారులు, కౌలుదారులు ఈ సంఘాల ద్వారా రుణాన్ని వారి అవసరాలకనుగుణంగా పొందలేకపోతున్నారు.

సి) దాదాపు అన్ని PAC లు ఉత్పత్తిలో ముడిపడ్డ రుణాలను అందించలేకపోచున్నాయి.

డి) అన్ని స్థాయి పరపతి సంస్థల్లో వసూలు కాని రుణాలు త్వరితంగా పెరుగుచున్నాయి.

ఈ) PAC లు వ్యవసాయదారుల అవసరాలకు అనుగుణంగా, అనుకూల సమయంలో రుణాలను అందించలేకపోతున్నాయి.

PAC లు సమర్థవంతంగా పనిచేయలేకపోవటానికి ముఖ్యకారణాలుగా ద్రవ్య వనరుల కొరత, రుణాలు వసూలు కాకపోవటం. మొదటిగా ఈ సంస్థల ద్రవ్య వనరుల పెంపొందించే చర్యలను చేపట్టాలి. ఫలితంగా వ్యవసాయదారుల అవసరాలకు అనుగుణంగా స్వల్పకాలిక రుణాలను అందించవచ్చు. రుణాలను అందించటానికి సంబంధించిన నియమ నిబంధనలను వసూలుకు కూడా అనుగుణంగా ఉండే విధంగా మార్చటం ద్వారా అధికార్లకు వసూలుకు సంబంధించిన శిక్షణను అందించటం ద్వారా ఈ సంస్థల పనితీరును మెరుగుపర్చవచ్చు.

2) కేంద్ర సహకార బ్యాంకులు : ఒక జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కలయిక వల్ల కేంద్ర సహకార బ్యాంకు ఏర్పడుతుంది. దీనినే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అని కూడా అంటారు. ఈ బ్యాంకులో వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు వ్యక్తులు కూడా వాటాదారులుగా చేరవచ్చు. ఈ బ్యాంకు ముఖ్యోద్దేశము వ్యవసాయ పరపతి సంఘాలకు రుణ సదుపాయాన్ని అందిస్తూ ప్రజల వద్ద నుండి డిపాజిట్లను సేకరించటం. ఈ బ్యాంకు రాష్ట్ర సహకార బ్యాంకుకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు వారధిగా పనిచేస్తుంది. కేంద్ర సహకార బ్యాంకులు కావలసిన నిధులను వాటా మూలధనం, నిల్వలు, డిపాజిట్లు, రాష్ట్ర సహకార బ్యాంకు రుణాల ద్వారా సమకూర్చుకుంటుంది.

భారతదేశంలో 2000 - 2001 నాటికి 367 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులున్నాయి. ఈ బ్యాంకులిచ్చిన రుణాలు మొత్తం రూ॥లు 47,630 కోట్లు. కేంద్ర సహకార బ్యాంకులలో వనరులు కొరతగా ఉన్న బ్యాంకులను బలోపేతం చేసేందుకు నాబార్డ్ ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ప్రకారం కొరతగా ఉన్న కేంద్ర సహకార బ్యాంకులున్న రాష్ట్ర ప్రభుత్వాలకు విత్త వనరులను అందించి, ఆ బ్యాంకుల వాటాలను ప్రభుత్వం కొనే విధంగా పథకాన్ని రూపొందించింది.

3) రాష్ట్ర సహకార బ్యాంకులు : ప్రతి రాష్ట్రంలో ఒక రాష్ట్ర సహకార బ్యాంకు ఉంటుంది. సహకార పరపతి వ్యవస్థలో ఈ బ్యాంకు శిఖరాగ్ర బ్యాంకు. రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు ఇందులో సభ్యత్వాన్ని కలిగి ఉంటాయి. కేంద్ర సహకార బ్యాంకుల మీద నియంత్రణ, సమన్వయం, వాటికి నిధులను సమకూర్చటం మొదలైనవి రాష్ట్ర సహకార బ్యాంకులు నిర్వర్తించే విధులు. వాటా మూలధనం, రిజర్వు బ్యాంకు అందించే నిధులు, డిపాజిట్ల ద్వారా ఈ బ్యాంకు నిధులను సమకూర్చుకుంటుంది.

భారతదేశంలో మొత్తం 29 రాష్ట్ర సహకార బ్యాంకులు ఉన్నాయి. ఈ బ్యాంకులు 2000 - 01 సంవత్సరము నాటికి రూ. 38,250 కోట్ల రూపాయలు ఋణంగా ఇవ్వటం జరిగింది. ఈ బ్యాంకులు గ్రామీణ సహకార పరపతి ఉద్యమానికి తోడ్పడటమే కాక ఇతర సహకార కార్యక్రమాలకు కూడా సహకరిస్తుంది.

బి) దీర్ఘకాలిక పరపతి సంస్థలు : దీర్ఘకాలిక పరపతి అవసరాలైన 1. భూమి అభివృద్ధి 2. వ్యవసాయ సంబంధమైన యంత్రాల కొనుగోలు 3. పాత రుణాల చెల్లింపులు వీటి కోసం వ్యవసాయదారులకు పరపతి అందించే సంస్థలను దీర్ఘకాలిక పరపతి సంస్థలు అంటాము. ఇవి రెండు స్థాయిలలో అంటే రాష్ట్ర స్థాయిలో, ప్రాథమిక స్థాయిలో నిర్వహించబడుతూ ఉంటాయి. వీటి నిర్వహణ వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉంటుంది. వీటి స్వరూపాన్ని బట్టి ఈ సంస్థలను నాలుగు రకాలుగా చెప్పవచ్చు.

1. రాష్ట్ర సహకార వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకులు. (State Co-operative Agricultural and Rural Development Banks) ఇవి యూనిటరీ స్వభావాన్ని కలిగి ఉంటాయి.
2. ప్రాథమిక సహకార వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు (Primary Co-operative Agricultural and Rural Development Banks). ఈ బ్యాంకులు ఫెడరల్ స్వభావాన్ని కలిగి ఉంటాయి.
3. యూనిటరీ, ఫెడరల్ స్వభావాలను కలిగి ఉన్న మిశ్రమ సంస్థలు
4. ప్రత్యేకంగా వ్యవసాయ, గ్రామీణ బ్యాంకులు లేకుండా రాష్ట్ర సహకార బ్యాంకుల ద్వారానే దీర్ఘకాలిక ద్వారా పరపతిని అందించటం.

1. సహకార వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (Co-operative Agricultural and Rural Development Banks-CARDBs) : మొదట వ్యవసాయదారుల వారి దీర్ఘకాలిక పరపతి అవసరాలను వడ్డీ వ్యాపారస్తులు తీర్చేవారు. తరువాత రాష్ట్ర ప్రభుత్వాలు, సహకార పరపతి బ్యాంకులు దీర్ఘకాలిక పరపతి అవసరాలు తీర్చేవి. అయితే ఏజెన్సీల నిర్వహణలో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా దీర్ఘకాలిక పరపతి అవసరాలు తీర్చేందుకు భూమి తనఖా బ్యాంకులు (Land Martagage Banks) ఏర్పాటు చెయ్యటం జరిగింది. ఈ భూమి తనఖా బ్యాంకులే సహకార వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులుగా కొనసాగుచున్నాయి.

భారతదేశంలో 1950-51 లో 5 రాష్ట్ర సహకార వ్యవసాయ, గ్రామీణ బ్యాంకులు ఉండగా నేడు అవి 19కి పెరిగాయి. అదే కాలంలో ప్రాథమిక సహకార వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు 286 నుంచి 745కి పెరిగాయి. ప్రాథమిక వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు 2000 - 2001 సంవత్సరములో అందించిన పరపతి రూ. 1,750 కోట్లు కాగా మొత్తం అందించిన పరపతి 8,050 కోట్లు. అదే విధంగా రాష్ట్ర సహకార వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు అందించిన పరపతి 2000 - 2001 లో రూ॥లు 2,520 కోట్లు కాగా మొత్తం పరపతి రూ॥ 12,380 కోట్లు.

CARDBs నిర్మాణం : ప్రతి రాష్ట్రంలోనూ ఒక భూమి అభివృద్ధి బ్యాంకు ఉంటుంది. ఈ బ్యాంకులనే రాష్ట్ర సహకార వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు (SCARDBs) అంటారు. అదే విధంగా ప్రతి రాష్ట్రంలోనూ ప్రాథమిక సహకార వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకులు (PCARDBs) ఉంటాయి. కొన్ని రాష్ట్రాలలో PCARDBs లు ఉండవు కాని భూమి అభివృద్ధి బ్యాంకు శాఖలే ఈ విధులను నిర్వర్తిస్తాయి. ఆంధ్ర, కేరళ, మహారాష్ట్రలో ఒకటికి మించి SCARDBs ఉండి సమిష్టిగా పనిచేస్తుంటాయి. మధ్యప్రదేశ్‌లో రాష్ట్ర సహకార బ్యాంకే SCARDBs విధులను నిర్వర్తిస్తుంది. ఈ విధంగా వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా SCARDBs పనిచేస్తుంటాయి.

ద్రవ్య వనరులు, పని తీరు : CARDBs తన ద్రవ్య వనరులను వాటా మూలధనం, బాండ్లు, షేర్లు విడుదల చేయటం ద్వారా సమకూర్చుకుంటుంది. ఈ మధ్య కాలంలో నాబార్డు SCARDBs కు రిఫైనాన్స్ సదుపాయాన్ని అందిస్తుంది.

CARDBs వ్యవసాయ ఆస్తులను హామీగా ఉంచుకొని వ్యవసాయదారులకు దీర్ఘకాలిక పరపతిని అందిస్తాయి. ఈ బ్యాంకులు వీలున్నంత వరకు మొదటి తనఖా ద్వారానే రుణాలు ఇస్తాయి. కొన్ని సందర్భాల్లో రెండో తనఖా ద్వారా కూడా రుణాలను అందిస్తాయి. ఈ బ్యాంకులు వ్యవసాయ ఆస్తి విలువలలో 50 శాతం వరకు రుణ సదుపాయాన్ని అందించటం జరుగుతుంది.

CARDBs ఎదుర్కొంటున్న సమస్యలు : భూమి అభివృద్ధి బ్యాంకింగ్ ఇంకా కొన్ని రాష్ట్రాలలో బలంగా పనిచేయటం లేదు. CARDBs వ్యవసాయాభివృద్ధిలో కూడా ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల కార్యకలాపాలకు పరపతిని అందిస్తూంది. ఈ బ్యాంకులిచ్చే అన్ని రుణాలు అభివృద్ధి రుణాలే. అందులోనూ ముఖ్యంగా చిన్న కమతాలున్న వారికే అందిస్తుంది. ఈ బ్యాంకుల స్థాపన వలన భూమి అభివృద్ధి బ్యాంకింగ్ విస్తరించినా, ఇంకా మెరుగైన సేవలందించేందుకు అనేక అవరోధాలు ఉన్నాయి.

1. బాకీల పెరుగుదల : CARDBs వ్యవసాయదారులకు అందించిన రుణాలను తిరిగి రాబట్టుకోలేకపోతుంది. రాను రాను బాకీలు పెరిగిపోతున్నాయి. PCARDBs లో బాకీల శాతం 42 నుంచి 44 వరకు ఉంది. వీటిని వసూలు చేయటం బ్యాంకింగ్ యంత్రాంగానికి కష్టతరంగా ఉంది. ఉద్దేశ పూర్వకంగా రుణాలను చెల్లించకపోవటం కూడా జరుగుతుంది. బాకీలు పెరిగినందువల్ల ఈ బ్యాంకుల విత్త పరిస్థితి క్లిష్టంగా తయారవ్వటమే కాక ఈ మొత్తాన్ని మరలా రుణాల రూపంలో ఇవ్వటానికి అవకాశం ఏర్పడటం లేదు.

2. అధికారులకు శిక్షణ లేకపోవటం : CARDBs సంస్థలు విస్తరించటంలో సందేహం లేదు. కాని విధి నిర్వహణలో ఏర్పడుచున్న సవాళ్ళను ఎదుర్కొనే సామర్థ్యం అధికార్లలో లేదు. కావున అధికారులకు రుణ మంజూరు, రుణ వసూలుకు సంబంధించిన విషయంలో సాంకేతిక శిక్షణనను ఇవ్వవలసిన ఆవశ్యకత ఉంది. అవసరమైతే సహకార సంస్థలకు సంబంధించిన చట్టాలను ఈ బ్యాంకులకు కూడా వర్తించే విధంగా చర్యలను తీసుకోవలసిన ఆవశ్యకత ఉంది.

రుణాల మళ్లింపు : CARDBs అందించే రుణ విధానంలో మార్పులు అవసరం. సాంప్రదాయ బద్దంగా రుణాలను అందించే విధంగా కాక ప్రభుత్వ హామీ, వ్యక్తిగత హామీ మొదలైన వాటిని హామీలుగా రుణాలిచ్చే విధానాన్ని గురించి ఆలోచించటం ద్వారా రుణాలను సకాలంలో వసూలు చేసుకోవచ్చు.

నేటికిని భూమిలేని వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తుల వారు, ఉపాంత వ్యవసాయదారులు CARDBs నుంచి రుణాలు పొందలేకపోతున్నారు. వీరికి పరపతిని అందించే విధమైన చర్యలను తీసుకోవలసి ఉంది.

CARDBs అందించే రుణ సదుపాయం అన్ని వర్గాల వారికి అందటం లేదు. కావున అన్ని విధాలైన వర్గాల వారికి సహాయాన్ని అందించే చర్యలను చేపట్టవలసి ఉంది.

పైన తెలిపిన సమస్యలను అధిగమించినప్పుడే CARDBs బ్యాంకులు సమర్థవంతంగాను, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి ఉపయోగపడటానికి అవకాశం ఉంది. కావున పై సమస్యలను అధిగమించే విధంగా చర్యలను చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

6.1.6.4.2. వాణిజ్య బ్యాంకులు : వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణకు దోహదం చేసిన అంశాల్లో ముఖ్యమైన వాదన వాణిజ్య బ్యాంకులు వ్యవసాయ సమస్యలకు దూరంగా ఉంటూ వ్యవసాయ అవసరాల, భూమి అభివృద్ధి విషయాల్లో ఉదాసీనంగా వ్యవహరించటం జరుగుతుంది. భారతదేశంలో 1967 సంవత్సరము బ్యాంకుల సామాజిక నియంత్రణ ప్రవేశపెట్టటం జరిగింది. తరువాత గ్రామీణ ప్రాంతాల్లో శీఘ్రగతిన వాణిజ్య బ్యాంకులను స్థాపించటం జరిగింది. ఆ తరువాత 1969లో బ్యాంకుల జాతీయీకరణ జరిగింది. 1969లో గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో 1860 వాణిజ్య బ్యాంకుల శాఖలు ఉండగా ఆ సంఖ్య 2000 మార్చి నాటికి 32,710 కి పెరిగింది. ప్రస్తుతం వాణిజ్య బ్యాంకుల్లో 16 మిలియన్ల వ్యవసాయదారులు రూ॥ 53,690 కోట్ల రుణ సదుపాయాన్ని పొందారు. 1969 వ సంవత్సరములో కేవలం 0.2 మిలియన్ల వ్యవసాయదారులు కేవలం 160 కోట్ల రుణ సదుపాయాన్ని పొందటం జరిగింది. ఈ విధంగా వ్యవసాయదారులకు వాణిజ్య బ్యాంకులు పరపతి సదుపాయాన్ని అందజేస్తున్నాయి. వాణిజ్య బ్యాంకులు వ్యవసాయదారులకు అందించే పరపతి స్వభావాన్ని ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ఎ) ప్రత్యక్షంగా అందించే సహాయం : వాణిజ్య బ్యాంకులు జాతీయీకరణ జరిగే సమయానికి వ్యవసాయదారులకు పరపతినందించటంలో సహకార సంస్థలకు ప్రత్యేకత ఉందని, వాణిజ్య బ్యాంకులు ప్రత్యక్షంగా వ్యవసాయ పరపతిని అందించే అనుభవం లేదనే అభిప్రాయం ఉండేది. జాతీయీకరణ తరువాత వ్యవసాయ పరపతి అందించాలనే కార్యక్రమాన్ని వాణిజ్య బ్యాంకులు ఉధృతం చేసినా మొదట పెద్దరైతులకు, అధిక దిగుబడి ఆహార పదార్థాలను పండించే రైతుల మీదనే కేంద్రీకృతం కాబడింది. తరువాత క్రమ క్రమంగా రుణాలను అన్ని వర్గాలకు

అందే విధంగా చర్యలను తీసుకోవటం జరిగింది. ప్రస్తుతం వాణిజ్య బ్యాంకులు అందించే రుణాల్లో 42-45 శాతం స్వల్పకాలిక పంట రుణాలు ఇవ్వటం జరిగింది. దీర్ఘకాలిక రుణాలు అనగా పంపుసెట్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాలు మొదలైన వాటికిచ్చే రుణాలు మొత్తం రుణంలో 35 నుంచి 37 శాతం వరకు ఉన్నాయి. పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, పందుల పెంపకం, తేనెటీగల పెంపకం మొదలైన వాటికి 15 నుంచి 16 శాతం రుణాన్ని సమకూర్చటం జరిగింది.

భారత ప్రభుత్వం 1980 అక్టోబరులో సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (IRDP) ప్రారంభిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులను ఈ కార్యక్రమానికి విత్త సదుపాయాన్ని అందించమని కోరింది. అందుకు అనుగుణంగా వాణిజ్య బ్యాంకులు IRDP లబ్దిదారులకు రుణ సదుపాయాన్ని అందించటం జరుగుతుంది.

బి) పరోక్ష విత్త సహాయం : వాణిజ్య బ్యాంకులు వ్యవసాయానికి ప్రత్యక్షంగానే కాక పరోక్షంగా కూడా సహాయాన్ని అందజేస్తున్నాయి. సహకార సంస్థలకు విత్త సదుపాయాన్ని అందించటం ద్వారా వ్యవసాయానికి పరోక్షంగా సహాయం చేస్తుంది. వ్యవసాయ యంత్రసామాగ్రి తయారుచేసే పరిశ్రమ, భారతీయ ఆహార సంస్థ (Food Corporation of India) ఆహార పదార్థాల సమీకరణ, నిల్వల విషయంలో విత్త సహాయం అందించటం, కేంద్ర భూమి అభివృద్ధి బ్యాంకుల డిబెంచర్లకు చెల్లింపులు చేయటం మొదలైన చర్యలను చేపడుతూ పరోక్షంగా వాణిజ్య బ్యాంకులు వ్యవసాయానికి సహాయాన్నందిస్తున్నాయి.

వ్యవసాయ పరపతి వల్ల వాణిజ్య బ్యాంకులు ఎదుర్కొంటున్న సమస్యలు :

1. రాబోయే కొద్ది సంవత్సరాలలో వ్యవసాయ పరపతి అవసరాలు రూ॥ 50,000 నుంచి 60,000 కోట్లు ఉంటుందని అంచనా ఈ బాధ్యతను సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు వహించవలసి ఉంది. కాని వాణిజ్య బ్యాంకుల వద్ద వ్యవసాయ రంగానికి లభ్యమయ్యే వనరులు పరిమితంగా ఉన్నాయి. కావున ఈ పరిమితమైన వనరులను అభిలషణీయంగా ఉపయోగించవలసిన ఆవశ్యకత అన్ని వాణిజ్య బ్యాంకుల మీద ఉంది.

2. వ్యవసాయానికి ఉన్న వనరులు పరిమితమేకాక వ్యవసాయానికి పరపతి సౌకర్యాలను అందించేందుకు వాణిజ్య బ్యాంకుల్లో సిబ్బంది కొరతగా ఉంది. అన్ని గ్రామాలకు, వీలైనంత ఎక్కువ మంది వ్యవసాయదారులకు పరపతిని అందించటానికి అవసరమైనంత సిబ్బంది లేదు. భారతదేశంలో దాదాపు 5,50,000 గ్రామాలు ఉండగా, బ్యాంకు శాఖలు 47,000 మాత్రమే ఉన్నాయి. ఈ శాఖల ద్వారా గ్రామాలన్నింటికి పరపతిని అందించటం కష్టసాధ్యమైన విషయం. కావున వాణిజ్య బ్యాంకుల శాఖలను విస్తరించాల్సిన ఆవశ్యకత ఉంది.

3. వాణిజ్య బ్యాంకుల యొక్క గ్రామీణ ప్రాంతాల యొక్క శాఖల్లోనూ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లోనూ ద్రవ్య సంబంధమైన వనరుల వత్తిడి ఎక్కువగా ఉంది. ఈ శాఖలు చిన్న చిన్న మొత్తాల్లో ఎక్కువ రుణ సదుపాయాలు తక్కువ వడ్డీరేట్లకు (Concessional Interest Rates) ఇవ్వవలసి వస్తుంది. దీనితో పాటు మొత్తం డిపాజిట్లలో కరెంట్ డిపాజిట్ల శాతం అతి తక్కువగా ఉంది.

4. వాణిజ్య బ్యాంకులు ఇస్తున్న వ్యవసాయ రుణ బాకీలు క్రమక్రమంగా పెరుగుచున్నాయి. 1990లో అమలు చేసిన రుణ మాఫీ (Agricultural and Rural Credit Debt Relief Schemes) స్కీముల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాణిజ్య బ్యాంకుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

ఈ విధమైన పరిస్థితులను వాణిజ్య బ్యాంకులు ఎదుర్కొంటూ వ్యవసాయ విత్త సహాయాన్ని అందిస్తున్నాయి. భారతదేశంలో ఉన్న అత్యధికమంది సన్నకారు వ్యవసాయదారుల అభివృద్ధికి దోహదం చేసేలా నూతన పరపతి పథకాలను అమలు చేయటం ద్వారా పరపతిని మరింత విస్తరించవచ్చు.

6.1.6.4.3. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (Regional Rural Banks) : శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల పథకంలో ఉన్న వ్యవసాయదారులు, గ్రామీణ చేతి వృత్తుల వారికి సంస్థాగత పరపతిని అందించాలనే అంశ ప్రాతిపదికపై ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు స్థాపించటం జరిగింది. ఈ బ్యాంకుల స్థాపన ముఖ్యలక్ష్యం గ్రామీణ ప్రాంతాల్లో పరపతి, ఇతర సేవలను అందించటం. ఈ సేవలను

మరిముఖ్యంగా చిన్న, ఉపాంత వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తులవారు, చిన్న చిన్న వ్యాపార సంస్థలు నడిపే వారికి అందించి వ్యవసాయం, వర్తకం, వాణిజ్యం, పరిశ్రమ, ఇతర ఉత్పాదక కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చెందేలా చూడటం.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల స్థాపన 1975లో జరిగింది. మొదట ఐదు బ్యాంకులు మొరాదాబాద్, జైపూర్, భీవాని, జైపూర్, మల్దా అనే ప్రదేశాల్లో సిండికేట్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యునైటెడ్ కమర్షియల్ బ్యాంకు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల ఆధ్వర్యంలో స్థాపించబడ్డాయి. ఈ గ్రామీణ బ్యాంకుల వాటా మూలధనం 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 15 శాతం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, 35 శాతం స్పాన్సర్ చేసిన వాణిజ్య బ్యాంకు అందించటం జరిగింది. ఈ గ్రామీణ బ్యాంకుల వాణిజ్య బ్యాంకులందించే సేవలతో పాటు కొన్ని ప్రత్యేకమైన సేవలను అందిస్తాయి.

ఎ) గ్రామీణ బ్యాంకుల పరిధి ఒక నిర్ణీత ప్రాంతానికి పరిమితమై ఉంటుంది. అది ఒక జిల్లా కావచ్చు లేదా ఒక రాష్ట్రంలోని కొన్ని జిల్లాలు కావచ్చు.

బి) ఈ బ్యాంకులు చిన్న ఉపాంత వ్యవసాయదారులకు గ్రామీణ చేతివృత్తుల వారికి, వ్యవసాయ కార్మికులకు, మరియు ఇతరులకు ఉత్పాదక రుణ సదుపాయాన్ని అందిస్తాయి.

సి) గ్రామీణ బ్యాంకుల వడ్డీరేట్లు సహకార సంఘాల వడ్డీరేట్లకు మించి ఉండరాదు. అందుకోసం స్పాన్సర్ చేసిన బ్యాంకు, రిజర్వుబ్యాంకులు కొన్ని రాయితీలను ఇస్తూ ఉంటాయి.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విధానాలను, నిర్వహణను నాబార్డు పరిశీలిస్తూ ఉంటుంది. ఈ బ్యాంకులకు నాబార్డ్ రీఫైనాన్స్ సదుపాయాన్ని అందిస్తూ, అవి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుంది. గ్రామీణ బ్యాంకుల స్థాపన, నిర్వహణ, వాటి విధానాల రూపకల్పన అమలు మొదలైన విషయాల్లోను నాబార్డ్ అజమాయిషీ చేస్తూ గ్రామీణ బ్యాంకులకు, రిజర్వు బ్యాంకుకు వారధిగా పనిచేస్తుంది.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల సమీక్ష : ప్రస్తుతం భారతదేశంలో 196 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు 23 రాష్ట్రాల్లో పనిచేస్తున్నాయి. ఈ బ్యాంకుల శాఖల మొత్తం 14,500. 1999-2000 నాటికి గ్రామీణ బ్యాంకుల డిపాజిట్లు రూ॥ 30,050 కోట్లు కాగా 12,660 కోట్ల రూ॥లు వ్యవసాయం మరియు ఇతర గ్రామీణ వృత్తుల వారికి స్వల్ప మరియు దీర్ఘకాలిక రుణాలుగా అందించటం జరిగింది. గ్రామీణ బ్యాంకులిచ్చే రుణాల్లో 95 శాతం రుణాలు పేదవారికి అందుచున్నాయి. అత్యధిక గ్రామీణ బ్యాంకు కలిగిన రాష్ట్రం ఉత్తర ప్రదేశ్.

గత 22 సంవత్సరాలుగా 20 సూత్రాల ప్రణాళిక అమలులో IRDP కార్యక్రమ నిర్వహణలో గ్రామీణ బ్యాంకులు చురుగ్గా పాల్గొంటున్నాయి. ఈ బ్యాంకులు విభిన్న వడ్డీరేట్ల పధకం (Differential Interest Rates Scheme) వికలాంగులకు సంబంధించిన ఉపాధి మరియు సహాయక పధకాలను అమలు చేస్తున్నది. అయితే ఈ బ్యాంకులు ఎదుర్కొనే ముఖ్య సమస్య బాకీల పరిమాణం పెరిగిపోయి, వసూలు కష్టసాధ్యమౌతుంది.

6.1.6.4.4. జాతీయ వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంకు (NABARD) : భారతదేశ వ్యవసాయ పరపతికి శిఖరాగ్ర సంస్థ జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (National Bank for Agriculture and Rural Development). ఈ బ్యాంకును జూలై 12, 1982 లో స్థాపించటం జరిగింది. 1982 కు పూర్వం గ్రామీణ పరపతికి భారతీయ రిజర్వు బ్యాంకు చేపట్టిన విధులన్నిటిని నాబార్డ్ నిర్వర్తించటం జరుగుతుంది. ఈ సంస్థ అందించే సదుపాయం రిఫైనాన్స్ సదుపాయము.

నాబార్డ్ విధులు. (Duties of NABARD)

నాబార్డ్ క్రింది విధులను నిర్వర్తించటం జరుగుతుంది.

1. గ్రామీణ రంగంలోని పరపతి అవసరాలకు ఈ బ్యాంకు శిఖరాగ్ర బ్యాంకుగా (Apex Bank) వ్యవహరిస్తుంది
2. సహకార రంగం పనితీరును అజమాయిషీ చేస్తుంది.

3. స్వల్పకాలిక రుణాలను (18 నెలలలోపు) ఋతు సంబంధమైన వ్యవసాయ కార్యకలాపాలకోసం రాష్ట్ర సహకార బ్యాంకులకు అందిస్తుంది.

4. నిర్దేశించిన వ్యవసాయ కార్యకలాపాలకు, ప్రకృతి వైపరీత్యాలవల్ల స్వల్ప కాలిక రుణాలను మధ్యకాలిక రుణాలుగా మార్పిడి చేసుకొనే నిమిత్తం మధ్య కాలిక రుణాలను (18 సంవత్సరాల నుంచి 7 సంవత్సరాల కాలం) రాష్ట్ర సహకార బ్యాంకులకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు అందజేస్తుంది.

5. వ్యవసాయ రంగంలో వివిధ స్కీములల్లో పెట్టుబడికోసం మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను (25 సంవత్సరాల లోపు) రాష్ట్ర సహకార బ్యాంకులకు, భూమి అభివృద్ధి బ్యాంకులకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు, వాణిజ్య బ్యాంకులకు అందజేస్తుంది.

6. సహకార పరపతి సంస్థ సంస్థల్లో వాటాలను కొనేందుకు ప్రభుత్వాలకు దీర్ఘకాలిక రుణాన్ని (20 సం॥లు మించకుండా) అందిస్తుంది.

7. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, రాష్ట్ర సహకార బ్యాంకులను ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను తనిఖీ చేస్తుంది.

8. గ్రామీణ పరపతి అభివృద్ధికి దోహదంచేసే విధానాలను, ప్రణాళికలను రూపొందించి అవి అమలయ్యేటట్లు చూస్తుంది.

9. గ్రామీణాభివృద్ధి పరిశోధన నిధిని ఉపయోగించి వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిపై పరిశోధనలు జరిపి, ప్రాజెక్టులను రూపొందిస్తుంది. వివిధ ప్రాంతాల కనుగుణంగా ప్రాజెక్టుల రూపకల్పనను చేసి అన్ని ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధికి దోహదంచేస్తుంది.

10. వ్యవసాయానికి, గ్రామీణాభివృద్ధికి విదేశీ సంస్థలు అందించే పరపతి ఈ బ్యాంకు ద్వారానే అందించటం జరుగుతుంది.

నాబార్డ్ పనితీరు : భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధి, చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, హస్తకళలు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు పరపతి మళ్లించటం, పరపతి విధానం రూపొందించి, అమలు చేసే కార్యక్రమాన్ని నాబార్డు చేపడుతుంది. అన్ని వ్యవసాయ గ్రామీణ ఆర్థికాభివృద్ధి కార్యకలాపాల పరపతి అవసరాలను తీర్చే ఒకే ఒక్క ఏజెన్సీ నాబార్డు. ఈ సంస్థ రాష్ట్ర సహకార బ్యాంకులకు, వాణిజ్య బ్యాంకులకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ద్వారా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి తోడ్పడుతుంది. నాబార్డు అందించిన పరపతి సహాయాన్ని గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ఎ) నాబార్డు అందించిన రీఫైనాన్స్ సదుపాయం : నాబార్డు రెండు రకాలైన రీఫైనాన్స్ సదుపాయాలు అందిస్తుంది. రాష్ట్ర సహకార బ్యాంకులకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వాలకు అందించే రిఫైనాన్స్ సదుపాయం మొదటిది. రెండో రకం రిఫైనాన్స్ సదుపాయం ద్వారా క్రింది స్థాయి పరపతి సంస్థల వనరులను పెంపొందించటం జరుగుతుంది. 2002 - 2003 సంవత్సరము (జూలై-మార్చి) నాటికి నాబార్డ్ రాష్ట్ర సహకార బ్యాంకులకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించిన రిఫైనాన్స్ పరిమాణము రూ॥ 6,875 కోట్లు.

వివిధ ప్రయోజనాల దృష్ట్యా నాబార్డ్ అందించిన రిఫైనాన్స్ సదుపాయాన్ని ప్రస్తుతం తెలుసుకుందాం. పట్టిక 6.7 లో 1992-93, 1997-98 సంవత్సరాలలో వివిధ ప్రయోజనాలకు నాబార్డ్ అందించిన రిఫైనాన్స్ పరిమాణం పొందుపరచటం జరిగింది.

పట్టిక నెం. 6.1.7.

ప్రయోజన దృష్ట్యా నాబార్డ్ మంజూరు చేసిన రిఫైనాన్స్ పరిమాణం

(కోట్ల రూపాయల్లో)

ప్రయోజనం	1992-93	1997-98
1. చిన్న నీటి పారుదల	560	520
	(23.7)	(13.3)
2. భూమి అభివృద్ధి	10	60
	(0.4)	(1.5)
3. వ్యవసాయ యాంత్రికీకరణ	520	1110
	(22.0)	(28.2)
4. ప్లాంటేషన్, తోటల పెంపకం	100	190
	(4.3)	(4.8)
5. కోళ్లు, గొర్రెలు, పందులు, మత్స్య పెంపకం	90	230
	(3.8)	(5.9)
6. పాడి పరిశ్రమ	100	350
	(4.3)	(8.9)
7. సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం (IRDP)	650	610
	(27.5)	(15.5)
8. ఇతరములు*	330	860
	(14.0)	(21.9)
మొత్తం	2360	3930

బ్రాకెట్లలో ఉన్న సంఖ్యలు మొత్తంలో అంశాలు

మూలం : RBI, Report on Currency and Finance (1997 - 98) Vol. 1

* బయోగ్యాస్, అడవుల పెంపకం, వ్యవసాయేతర రంగాలు మొదలైనవి ఇతరములలోకి వస్తాయి.

నాబార్డు అందించిన రుణ సదుపాయం 1992-93లో 2,360 కోట్లు కాగా 1997-98 కి 3,930 కోట్లుకు పెరిగింది. 1997-98 సంవత్సరములో నాబార్డు అందించిన రిఫైనాన్స్ సదుపాయం ప్రాధాన్యతా క్రమంలో (అంటే అందించిన రుణం మొత్తం రుణంలో శాతం) వ్యవసాయ యాంత్రికీకరణ (28.2%), ఇతరాలు (21.9%), సమగ్ర గ్రామీణాభివృద్ధి (15.5%), చిన్న నీటి పారుదల (13.3%), పాడి

పరిశ్రమ (8.9%), కోళ్లు, గొర్రెలు, పందులు, మత్స్య పెంపకం (5.9%), ప్లాంటేషన్, తోటల పెంపకం (4.8%), మరియు భూమి అభివృద్ధి (1.5%).

1997-98 లో నాబార్డు అందించిన సహాయంలో 54 శాతం రాష్ట్ర సహకార వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులు, 36 శాతం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, 10 శాతం రాష్ట్ర సహకార బ్యాంకులు పొందటం జరిగింది.

భారతదేశంలో గ్రామీణ సహకార పరపతి వ్యవస్థ స్వరూపాన్ని పునర్ వ్యవస్థీకరణకు, శక్తివంతం చేయటానికి నాబార్డు కృషి చేస్తున్నది. సహకార పరపతి సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించి, వీటి పనితీరును పెంపొందించే విధంగా సహాయ సహకారాలను అందిస్తుంది.

గ్రామీణ అవస్థాపనా అభివృద్ధి నిధి (Rural Infrastructure Development Fund) : గ్రామీణ అవస్థాపనా సదుపాయాలైన నీటి పారుదల, గ్రామీణ రోడ్లు, గ్రామీణ వంతెనలు, వాటర్ షెడ్స్ అభివృద్ధి, వరద రక్షణ, మార్కెట్ యార్డులు మొదలైన వాటిని అభివృద్ధి చేసేందుకు 2,000 కోట్లతో నాబార్డు నందు గ్రామీణ అవస్థాపనా అభివృద్ధి నిధిని ప్రభుత్వం రూపొందించింది. ఈ స్కీము కింద 2003 మార్చి నాటికి రూ॥ 29,475 కోట్లు మంజూరు కాగా అందులో గ్రామీణ రోడ్లు రూ॥ 10,875 కోట్లు (36.9%), నీటి పారుదల ప్రాజెక్టులకు రూ॥ 10,011 కోట్లు (34.0%), గ్రామీణ వంతెనలకు రూ॥ 3,729 కోట్లు (36.9%), మిగిలిన రూ॥ 4,860 కోట్లు (16.5%) ఇతర స్కీములైన వాటర్ షెడ్ నిర్వహణ, వరద నివారణ, గ్రామీణ మార్కెట్ యార్డులు మొదలైన వాటికి పంపిణీ జరిగింది.

ఈ విధంగా బ్యాంకుల పరపతి వ్యవసాయానికి మళ్లించేందుకు నాబార్డు కృషి చేస్తుంది. గ్రామీణ పరపతిని అందించే సంస్థల వనరులను పెంచేందుకు రిఫైనాన్స్ సదుపాయాన్ని కలుగజేస్తుంది. వ్యవసాయ పరపతికి అత్యున్నత సంస్థగా పనిచేస్తూ వ్యవసాయాభివృద్ధికి నాబార్డు కృషి చేస్తుంది.

6.1.7. సారాంశము :

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నుముకలాంటిది. స్వాతంత్ర్యానికి పూర్వం వ్యవసాయం నిర్లక్ష్యం కాబడింది. స్వాతంత్ర్యానంతరం ప్రణాళికా కాలంలో వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. భారతదేశంలో వ్యవసాయ రంగం ద్వారా వచ్చే జాతీయాదాయం, ఆహార సప్లయ్, ఉపాధి సదుపాయాలు మొదలైన అంశాలను బట్టి మన దేశంలో వ్యవసాయ రంగం కీలక పాత్రను వహిస్తుందని తెలుస్తుంది. మన దేశంలో 1965వ సంవత్సరం నుంచి హరిత విప్లవానంతర కాలంగా చెప్పవచ్చు. ఈ కాలంలో వ్యవసాయ ఉత్పత్తులు, ఉత్పాదకతలో వృద్ధి సాధించినా ఇంకా గరిష్ట ఉత్పాదకత శక్తిని చేరుకోలేదు. వ్యవసాయరంగంలో అల్పోత్పాదకతకు మూడు ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. అవి సాధారణ కారణాలు, సాంకేతిక కారణాలు, వ్యవస్థా సంబంధమైన కారణాలు. ఈ మూడు రకాలైన కారణాలలో ఉన్న ఇబ్బందులను అధిగమిస్తే మన దేశ వ్యవసాయ ఉత్పాదకత త్వరితంగా పెరిగి గరిష్ట స్థాయికి చేరుకోగలదు.

భారతదేశంలో వ్యవసాయ పరపతి మూలాలను వ్యవస్థాగతంకాని, వ్యవస్థాగతమైన మూలాలని రెండుగా చెప్పవచ్చు. వడ్డీ వ్యాపారస్తులు, బంధువులు, స్నేహితులు మొదలైనవారి వద్ద తీసుకొనే పరపతిని వ్యవస్థాగతం కాని మూలాలని అంటాము. వ్యవసాయానికి పరపతిని అందించే సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వ్యవస్థాగతమైన మూలాలుగా చెప్పవచ్చు. వ్యవస్థాగత సంస్థల అజమాయిషీ రిఫైనాన్స్ సదుపాయాన్ని అందించే సంస్థ నాబార్డ్. నాబార్డు వ్యవసాయ పరపతికి అత్యున్నత లేదా శిఖరాగ్ర సంస్థ. స్వాతంత్ర్యం వచ్చి 55 సంవత్సరాలు గడచినా నేటికి వ్యవస్థాగతం కాని రుణాల శాతం మొత్తం వ్యవసాయ రుణాల్లో గణనీయంగానే ఉంది. సంస్థాగత పరపతి సంస్థలు గణనీయంగా పెరిగినా అనేక సమస్యలు అనగా నైపుణ్యం లేని సిబ్బంది, బాకీల పెరుగుదల లాంటి సమస్యలతో సతమతమౌతున్నాయి. ఈ సమస్యలను అధిగమించినప్పుడే వ్యవస్థాగత పరపతి సమృద్ధిగా అంది వ్యవసాయాభివృద్ధి సాధ్యమౌతుంది.

6.1.8. కఠిన పదాలు

హరిత విప్లవం : వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు అనగా రసాయనిక ఎరువులు, అధిక దిగుబడి వంగడాలు మొదలైన విప్లవాత్మక మార్పులు సంభవించటాన్నే సస్య విప్లవం (హరిత విప్లవం) అంటారు. భారతదేశంలో 1960వ సంవత్సరములో ఈ మార్పులు ప్రారంభమయ్యాయి.

బహుళ ఏజెన్సీ విధానం : సంస్థాగతంగా వ్యవసాయదారులకు పరపతిని అందించే విధానాన్ని బహుళ ఏజెన్సీ విధానం అంటారు.

నాబార్డు : వ్యవసాయ పరపతికి శిఖరాగ్ర బ్యాంకు. ఈ బ్యాంకు సంస్థాగత పరపతి సంస్థలకు రిఫైనాన్స్ సదుపాయాలను అందిస్తుంది.

6.1.9. నమూనా ప్రశ్నలు

వ్యాసరూప ప్రశ్నలు

1. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగ పాత్రను వివరించుము
2. భారతదేశంలో 1950-51 నుంచి వ్యవసాయరంగ పోకడలను వివరించుము
3. భారతదేశ వ్యవసాయరంగంలో అల్పోత్పత్తికి కారణాలను తెల్పి, ఉత్పత్తిని అధికం చేసే చర్యలను సూచించుము ?
4. భారతదేశంలో వ్యవసాయ విత్తాన్ని అందించే సంస్థలను గూర్చి వ్రాయుము
5. భారతదేశంలో సహకార పరపతి సంఘాలు అందించే వ్యవసాయ పరపతిని విమర్శనాత్మకంగా వ్రాయుము

సంక్షిప్త ప్రశ్నలు

6. పారిశ్రామికాభివృద్ధిలో వ్యవసాయరంగం పాత్ర
7. వ్యవసాయ విత్త ఆవశ్యకత
8. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు
9. బహుళ ఏజెన్సీ విధానం
10. నాబార్డు
11. వ్యవసాయ పరపతి వల్ల వాణిజ్య బ్యాంకులు ఎదుర్కొంటున్న సమస్యలు

6.1.10. చదువదగిన గ్రంథాలు

1. Ruddar Dutt & Sundaram : Indian Economy, 2004
2. Misra & Puri : Indian Economy
3. I.C. Dingra, : The Indian Economy
4. J.P. Bhattacharya : Studies in Indian Economy
5. Government of India : Economic Survey, 2002 - 2003.

- ఆచార్య. యమ్.వి. నరసింహశర్మ

పాఠం - 6.2

ఆర్థికాభివృద్ధి - వ్యవసాయ రంగం

(Agricultural Growth and Finance in India)

6.2.0 లక్ష్యం :

ఈ పూర్తి పాఠాన్ని చదివిన తరువాత క్రింది విషయాలను పూర్తిగా అవగాహన చేసుకోవచ్చు.

- ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయరంగపు పాత్ర
- వ్యవసాయ పరపతికి మార్గాలు
- వ్యవసాయ రంగంలో ఉత్పాదకత ఎలా పెంచవచ్చు.
- రెండవ హరిత విప్లవము ఆవశ్యకత

విషయసూచిక :

6.2.1 ఉపోద్ఘాతము
6.2.2 భారతదేశంలో వ్యవసాయ రంగం ప్రాధాన్యత
6.2.3 వ్యవసాయరంగంలో ఉత్పత్తి - ఉత్పాదకతలో పోకడలు
6.2.4 వ్యవసాయరంగంలో అల్ప ఉత్పాదకతకు కారణాలు
6.2.5 వ్యవసాయరంగానికి ఆర్థిక సహాయం
6.2.5.1 స్వల్పకాలిక ఋణాలు
6.2.5.2 మధ్యకాలిక ఋణాలు
6.2.5.3 దీర్ఘకాలిక ఋణాలు
6.2.5.4 వ్యవసాయ ఋణాలకు మార్గాలు
6.2.5.5 సహకార సంఘాలు
6..25.6 వాణిజ్య బ్యాంకులు - వ్యవసాయ పరపతి
6.2.5.7 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు
6.2.5.8 జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్)
6..2.6 వ్యవసాయాభివృద్ధి : పంచవర్ష ప్రణాళికలు
6.2.7 హరిత విప్లవము
6.2.8 రెండవ హరిత విప్లవము - ఆవశ్యకత
6.2.9 జాతీయ వ్యవసాయ విధానము
6.2.10 వ్యవసాయ రంగం - ఆర్థిక సంస్కరణల ప్రభావం
6.2.11 2004 - 05 వార్షిక బడ్జెట్
6.2.12 సారాంశము
6.2.13. చదువదగిన గ్రంథాలు

6.2.1 ఉపోద్ఘాతము :

ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగము ప్రధానపాత్ర వహిస్తున్నది. 1950లో ఆర్థికవేత్తలు, ఆర్థికాభివృద్ధికి పారిశ్రామికాభివృద్ధియే ముఖ్యమని వాదించినప్పటికి వ్యవసాయాభివృద్ధి కూడా పారిశ్రామికాభివృద్ధితో సమానంగా అభివృద్ధి చెందినప్పుడు మాత్రమే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని చెప్పవచ్చు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, అర్జెంటీనా మొదలయిన

దేశాలు ప్రారంభదశలో బడుగు దేశాలే కాని ఇవన్నీ వ్యవసాయరంగంలో అనతి కాలములోనే గణనీయమైన అభివృద్ధి సాధించాయి. ఆ దేశాలు ప్రారంభదశ నుంచి కూడా ఎక్కువగా ఆహారపదార్థాలు పండించి ఇంగ్లాండ్ మొదలైన దేశాలకు ఎగుమతి చేసి ఎక్కువ లాభాలు ఆర్జించాయి. సోవియట్ రష్యా ప్రణాళికా యుగానికి పూర్వం ఆహారధాన్యాల మిగులు ఎక్కువగా ఉన్న కారణం వల్లనే ఆర్థికాభివృద్ధి త్వరితగతిన సాధించగలిగింది. మారిస్‌డాబ్ అభిప్రాయంలో ఒక దేశం పురోగతికి పారిశ్రామికీకరణ ముఖ్యమైనదేకాని, పారిశ్రామికీకరణ గతిని నిర్ణయించేది వ్యవసాయపు మిగులేనని చెప్పారు. యూరప్ ఖండంలో ఎన్నో దేశాలు స్వల్పకాలంలోనే పారిశ్రామిక విప్లవం సాధించగలిగినాయి. ఈ దేశాలలో పారిశ్రామిక విప్లవం ప్రారంభమయ్యే నాటికి వ్యవసాయరంగము దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకుపోవటానికి ఎంతో పరిపక్వమైన స్థితిలో ఉన్నదని చెప్పవచ్చు. అప్పటికి ఆ దేశాలలో వ్యవసాయరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధిని సాధించి, పారిశ్రామిక విప్లవానికి అనువైన పరిస్థితులు సృష్టించినారు. ఇంగ్లండ్ దేశ పారిశ్రామిక చరిత్రను పరిశీలించినప్పుడు మనకు రెండు విషయాలు విశదమవుతాయి. ఒకటి, వ్యవసాయరంగంలో అభివృద్ధికి బహుముఖంగా కృషి జరిగింది. రెండు శీఘ్రగతిన పెరుగుతున్న పట్టణప్రజల అవసరాల నిమిత్తం వలస దేశాలనుంచి ఆహారపదార్థాలు తరలించటం జరిగినది. ఈ విధంగా ఆహారపదార్థాల సప్లయి బ్రిటిష్ వారికి అందకపోతే పారిశ్రామికాభివృద్ధి కుంటుపడి ఉండేదేమో !

ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి అవసరమే అయినా వివిధ దేశాల చరిత్రను పరిశీలించినప్పుడు పారిశ్రామికాభివృద్ధి జరగటానికి ఇతోధికమైన వ్యవసాయ పదార్థాల మిగుళ్ళు అవసరము అని విశదమవుతున్నది. సంతులిత అభివృద్ధి తొలదశలో ఆర్థికవనరుల కేటాయింపులో వ్యవసాయరంగానికి ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది. ప్రతి దేశము ఒకప్పుడు వ్యవసాయ ప్రాధాన్యత ఉన్న దేశమే. అవి పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నా, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నా మొదట వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించడం తప్పనిసరి అని చెప్పవచ్చు.

6.2.2 భారతదేశంలో వ్యవసాయ రంగం ప్రాధాన్యత :

భారతదేశ ఆర్థికాభివృద్ధికి వ్యవసాయరంగం వెన్నెముక వంటిదని చెప్పనచ్చును. ప్రజలకు కావలసిన ఆహార పదార్థములను అందించటమేకాక పారిశ్రామికాభివృద్ధికి కావలసిన ముడిపదార్థములను కూడా వ్యవసాయ రంగమే అందిస్తున్నది. భారతదేశంలో మూడు దశాబ్దాల నుంచి పారిశ్రామికీకరణ వేగంగా జరుగుతున్నప్పటికీ వ్యవసాయ రంగం ప్రాధాన్యత తగ్గలేదు. భారతదేశంలో వ్యవసాయ రంగం ప్రాధాన్యతను ఈ క్రింది అంశాల ద్వారా వివరించవచ్చు.

6.2.2.1 జాతీయ ఆదాయంలో వ్యవసాయరంగం వాటా :

మొదటి ప్రపంచ యుద్ధ కాలములో భారతదేశ జాతీయాదాయంలో 65 శాతం వ్యవసాయరంగం నుండి వచ్చినదే. దీనికి కారణం పారిశ్రామికాభివృద్ధి మరియు అవస్థాపనా సౌకర్యాలు ఆ కాలంలో అభివృద్ధికి నోచుకోకపోవడమే కారణమని చెప్పవచ్చు. భారతదేశంలో ప్రణాళికలు ప్రారంభమయిన తరువాత పారిశ్రామిక మరియు సేవారంగాలు అభివృద్ధి చెందినందువలన జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా తగ్గినది. 1950 - 51లో ఉత్పత్తి కారకాల ఖరీదు దృష్ట్యా జాతీయాదాయం (GDP at Factor Cost) లో వ్యవసాయ రంగపు వాటా 59.2 శాతం ఉండగా 1990 - 91లో 34.9%, 2002 - 2003లో 22.1 శాతం (1993 - 94 ధరల వద్ద) గా ఉన్నది.

అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చినపుడు అభివృద్ధి చెందిన దేశాలు చాలా తక్కువగా వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నాయి. అమెరికా మరియు బ్రిటన్ దేశాల స్థూల దేశీయ ఉత్పత్తిలో వ్యవసాయ రంగపు వాటా 2 శాతంగా మాత్రమే ఉన్నది దీనినిబట్టి ఒక దేశం పురోగతి సాధించేకొద్దీ, ఆ దేశం వ్యవసాయరంగంపై ఆధారపడటం తగ్గుతుందని విశదమవుతున్నది.

6.2.2.2 వ్యవసాయ రంగం - ఉద్యోగావకాశాలు :

భారతదేశంలో 1951 జనాభా లెక్కల ప్రకారం మొత్తం శ్రామికశక్తిలో 69.5 శాతం, 1981లో 59.4 శాతం, 1999లో 60 శాతం పనిచేస్తున్నారు. పారిశ్రామిక మరియు సేవారంగాలు జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఉద్యోగావకాశాలు

సృష్టించలేకపోవడం వలన పెరుగుతున్న జనాభా వ్యవసాయం రంగంపైనే ఆధారపడటం జరుగుతున్నది. దీనివలన ప్రచ్ఛన్న నిరుద్యోగము మరియు అల్పఉద్యోగిత అనే సమస్యలు ఎక్కువగా ప్రబలుతున్నాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నట్లు తెలియుచున్నది. 1999లో బంగ్లాదేశ్‌లో 57 శాతం, చైనాలో 68 శాతం, పాకిస్తాన్‌లో 48 శాతం ప్రజలు వ్యవసాయం రంగంపై ఆధారపడి ఉన్నట్లు తెలియుచున్నది. కాని అభివృద్ధి చెందిన దేశాలైన ఇంగ్లండ్, అమెరికా వంటి దేశాలలో 2%, జపాన్ మరియు ఫ్రాన్స్‌లో 4 శాతం, జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలియుచున్నది. దీనినిబట్టి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఎక్కువ జనాభా, అభివృద్ధి చెందిన దేశాలలో తక్కువ జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలియుచున్నది.

6.2.2.3 పెరుగుతున్న జనాభాకు ఆహార మిగులు అందించుట :

జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉన్న మనదేశంలో ఆహారధాన్యాలకు డిమాండ్ పెరుగుతున్నది. భారతదేశం లాంటి శ్రామికుల మిగులు ఎక్కువగా ఉన్న ఆర్థిక వ్యవస్థలలో ప్రస్తుతమున్న ఆహార వినియోగస్థాయి తక్కువగా ఉన్నది. ఈ దేశాలలో తలసరి ఆదాయాలలో వచ్చిన కొద్దిపాటి పెరుగుదల వలన ఆహారఉత్పత్తులకు డిమాండ్ పెరిగినది. వ్యవసాయరంగం ఆహార ఉత్పత్తులలో 'విక్రయం అయిన మిగులు' ను పెంచుకోనట్లయితే అతి తీవ్ర సంక్షోభానికి దారితీయవచ్చు. అభివృద్ధిచెందుతున్న దేశాలు కొంతవరకు ఆహార ఉత్పత్తుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాయి. కొన్ని అనివార్య పరిస్థితులలో తప్ప ఈ దేశాలు అంతగా ఆహారపదార్థాల దిగుమతులపై ఆధారపడలేదు.

భారతదేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 1996-97 లో 199.4 మిలియన్ టన్నులు ఉండగా , 2007-2008 నాటికి అంచనావేస్తున్న ఒక బిలియన్ జనాభాకు సరిపోయే విధంగా 300 మిలియన్ టన్నులు ఆహారధాన్యాల ఉత్పత్తి సాధించాలని 9వ ప్రణాళిక లక్ష్యంగా తీసుకున్నది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ఆహారధాన్యాల ఉత్పత్తి యొక్క వార్షిక వృద్ధిరేటు 4.5 శాతానికి పెంచవలసిన అవసరం ఉన్నది.

6.2.2.4 పారిశ్రామికాభివృద్ధిలో వ్యవసాయరంగం పాత్ర :

పారిశ్రామిక రంగానికి కావలసిన ముడిపదార్థాలను వ్యవసాయరంగం తీరుస్తున్నది. పట్టణ శ్రామిక జనాభాకు కావలసిన ఆహారధాన్యాల సప్లయి, శ్రామిక సప్లయి మరియు పారిశ్రామిక ఉత్పత్తులకు అవసరమయిన డిమాండ్‌ను వ్యవసాయరంగం కల్పిస్తున్నది. ప్రత్తి, జనపనార, చెరుకు, పొగాకు, కాఫీ, టీ, రబ్బరు, నూనెగింజలు మొదలగు ముడిపదార్థములు పారిశ్రామికాభివృద్ధికి ఎంతో అవసరము.

6.2.2.5 అంతర్జాతీయ వ్యాపారంలో వ్యవసాయరంగం పాత్ర :

భారతదేశ వ్యవసాయరంగం ఎగుమతులలో ప్రధానపాత్ర వహిస్తున్నది. మన వ్యవసాయ ఉత్పత్తులయిన టీ, కాఫీ, సుగంధద్రవ్యాలు, పొగాకు, నూనెగింజలు మొదలయినవి మన ఎగుమతులలో అగ్రస్థానం ఆక్రమించినాయి. ప్రత్యక్షంగా 50 శాతం, పరోక్షంగా 20 శాతం ఎగుమతులు వ్యవసాయరంగం నుండి వచ్చేవే. మొత్తం ఎగుమతులలో 1960-61లో 44.2 శాతం, 1980-81 లో 30.7 శాతం మరియు 2002-2003 లో 12.2 శాతంగా వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయి. ఇటీవల సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు బాగా పెరిగినప్పటికీ ఇందులో భారత్ వాటా చాలా తక్కువగా ఉన్నది. ప్రపంచ వ్యవసాయ వాణిజ్యంలో భారత్ వాటా 1970లో 0.7 శాతం ఉండగా ప్రస్తుతం ఇది 0.5 శాతానికి తగ్గటానికి కారణం ఇతరదేశాల నుంచి ఎదురవుతున్న పోటీయే. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా సంపాదించిన విలువైన విదేశీ మారక ద్రవ్యంతో మన పరిశ్రమలకు కావలసిన యంత్రపరికరాలు మరియు పెట్రోలియం ఉత్పత్తులను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము.

6.2.2.6 మూలధన కల్పన - వ్యవసాయరంగం పాత్ర :

ఆర్థికాభివృద్ధిలో మూలధనకల్పన ప్రధానపాత్ర వహిస్తుందనే అభిప్రాయంతో అందరూ ఏకీభవిస్తున్నారు. మూలధన కల్పన సరిపోయినంత ఎక్కువ స్థాయిలో లేనట్లయితే ఆర్థికాభివృద్ధి సాధించలేము. స్థూల మూలధన కల్పనలో వ్యవసాయరంగం 1950-51 నుంచి ప్రధానమైన పాత్ర వహిస్తున్నదని క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

పట్టిక - 6.1

స్థూలదేశీయ మూలధన కల్పన - వ్యవసాయరంగ శాతం

సంవత్సరము	శాతం
1950 - 54	25.36
1955 - 59	19.17
1960 - 64	15.17
1970 - 74	19.23
1975 - 79	17.23
1980 - 81	15.4
1990 - 91	9.8
2000 - 01	7.1

Source : S.K. Misra, V.K.Puri, 'Indian Economy' 2004, page 277

పై అంశాలేకాక, భారతదేశంలోని లక్షలాది పశువులకు కావలసిన ఆహారం వ్యవసాయరంగం నుంచి వస్తున్నది. భారత ప్రభుత్వం వివిధ ప్రణాళికలలో వ్యవసాయ రంగానికి సముచితమైన స్థానం ఇచ్చి, ఈ రంగం అభివృద్ధి కొరకు ఎక్కువ వనరులను కేటాయిస్తున్నది. కాబట్టి భారతదేశంలో వ్యవసాయరంగం ప్రధానమైన పాత్ర వహిస్తున్నదని చెప్పవచ్చును.

6.2.3 వ్యవసాయ రంగంలో ఉత్పత్తి - ఉత్పాదకతలో పోకడలు :

అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించదలచే ఏ దేశమైనా ముందు తమ దేశంలోని వారందరికీ ఆహారం సమకూర్చేందుకు అవసరమైన స్థాయిలో ఉత్పత్తిని సాధించాలి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటాతోపాటు వ్యవసాయరంగంపై ఆధారపడే జనసంఖ్య తగ్గుదల కూడా అభివృద్ధిలో ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల, ఉత్పాదకతతో పాటు వ్యవసాయరంగంలోనూ, వ్యవసాయేతర రంగాల్లో ప్రజల ఆదాయం పెరుగుదల కూడా అభివృద్ధిని సూచిస్తుంది. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం వలన, అలాగే వ్యవసాయరంగంలో పనిచేస్తున్న వారి సంఖ్య తగ్గడం వలన ఆ రంగంలో మిగిలిన వారి ఉత్పాదకశక్తి పెరుగుతుంది. వ్యవసాయరంగంలో నుంచి ఇతర మార్గాలవైపు నుళ్ళేవారు వేరే ఉపాధి అవకాశాలను ఆశ్రయించి ఆదాయం పెంచుకోగలుగుతారు. వ్యవసాయ రంగంలో ఉన్నవారికి, ఈ రంగాన్ని వీడి వేరే మార్గాలలో ఉపాధి పొందిన వారికీ వైవిధ్యమైన ఆహారాన్ని సమకూర్చుకొనే శక్తి సమకూరుతుంది. వ్యవసాయోత్పత్తులకు డిమాండ్ స్థిరంగా ఉంటుంది.

పట్టిక - 6.2

వ్యవసాయ రంగ ఉత్పత్తిలో పోకడలు 190 - 51 నుండి 2002 - 2003

(మిలియన్ టన్నులలో)

పంట	యూనిట్	1950 - 51	మొదటి పంచవర్ష ప్రణాళిక (1951-56) (సగటు)	రెండవ పంచవర్ష ప్రణాళిక (1956-61) (సగటు)	మూడవ పంచవర్ష ప్రణాళిక (1961-66) (సగటు)	వార్షిక ప్రణాళికలు (1966-69) (సగటు)	నాల్గవ పంచవర్ష ప్రణాళిక (1969-74) (సగటు)	ఐదవ పంచవర్ష ప్రణాళిక (1974-79) (సగటు)	ఆరవ పంచవర్ష ప్రణాళిక (1980-85) (సగటు)	ఏడవ పంచవర్ష ప్రణాళిక 1985-90) (సగటు)	ఎనిమిదవ పంచవర్ష (1992-97) (సగటు)	2001-02	2002-03
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)
బియ్యం	టన్నులు	20.6	25.0	30.3	35.1	35.9	41.8	47.3	54.5	65.1	78.7	93.1	75.7
గోధుమలు	టన్నులు	6.4	7.9	9.7	11.1	15.5	25.4	29.8	41.2	48.3	62.9	71.8	69.3
జొన్న	టన్నులు	5.5	7.5	8.7	8.8	9.7	8.3	10.8	11.3	10.9	10.7	7.8	6.9
రాగులు	టన్నులు	2.6	3.4	3.4	3.9	4.5	6.0	5.0	6.0	5.2	6.7	8.4	4.6
మొక్కజొన్న	టన్నులు	1.7	2.7	3.6	4.6	5.6	6.1	6.3	7.3	7.6	9.8	13.3	11.1
ఇతరధాన్యాలు	టన్నులు	6.1	6.6	6.5	6.3	6.2	6.4	7.1	6.0	5.4	4.9	4.4	3.6
పప్పుధాన్యాలు	టన్నులు	8.4	10.1	11.7	11.1	10.3	10.9	11.7	11.8	12.5	13.3	13.2	11.3
మొత్తం ఆహార ధాన్యాలు	టన్నులు	50.8	63.2	74.0	81.0	87.8	103.0	118.1	138.1	155.0	189.0	212.0	182.6
నూనెగింజలు	టన్నులు	6.2	5.5	6.7	7.3	7.2	8.3	8.9	11.4	13.9	21.9	20.5	15.8
చెరకు	టన్నులు	57.1	55.3	80.3	109.2	104.3	128.1	153.5	174.9	196.4	258.4	300.1	278.6
ప్రత్తి	బేళ్ళలో	3.0	3.9	4.8	5.4	5.5	5.9	6.8	7.5	8.4	12.2	10.1	9.3
జూట్	బేళ్ళలో	3.3	3.9	4.4	5.7	4.9	5.5	5.2	6.4	8.9	8.1	10.5	10.8

Source : S.K. Misra & V.K. Puri, 'Indian Economy' 2004, p. 289

ఆహారధాన్యాల ఉత్పత్తి 1950-51లో 50.8 మిలియన్ టన్నులు కాగా, ఏడవ ప్రణాళికా కాలంలో (1985 - 90) సాంవత్సరిక సగటు 155 మిటియన్ టన్నులుకాగా, ఎనిమిదవ ప్రణాళికా కాలంలో (1992 - 97) సాంవత్సరిక సగటు 187 మిలియన్ టన్నులుగా నమోదయినట్లు పై పట్టిక ద్వారా తెలుస్తున్నది. 2001 - 02 సం॥లో ఆహారధాన్యాల ఉత్పత్తి 212.0 మిలియన్ టన్నులకు పెరగగా 2002 - 03 సం॥లో దేశంలో ఏర్పడ్డ దుర్భిక్ష పరిస్థితుల కారణంగా ఉత్పత్తి 182.6 మిలియన్ టన్నులకు తగ్గింది. 2003 - 04 సం॥లో ఆహారధాన్యాల ఉత్పత్తి 212 మిలియన్ టన్నులుగా ఉండగలదని ఫిబ్రవరి 2004లో జరిపిన ఒక అంచనా ప్రకారం తెలుస్తున్నది.

ఆహారేతర పంటలను పరిశీలించినప్పుడు, ప్రత్తి మరియు జనపనార యొక్క ఉత్పత్తిలో పురోగతి నెమ్మదిగా ఉన్నది. నూనెగింజల యొక్క ఉత్పత్తి 1980's మధ్యకాలంలోను, 1990's లో కొన్ని సంవత్సరాలలోను పెరిగింది. 1987 - 88లో నూనెగింజల ఉత్పత్తి 12.7 మిలయన్ టన్నులు కాగా, 1990 - 91 నాటికి 18.6 మిలియన్ టన్నులు గాను, 1998 - 99 నాటికి 24.7 మిలియన్ టన్నులుగాను ఉన్నట్లు పై పట్టిక ద్వారా తెలుస్తున్నది. కాని 2002 - 03 సం॥లో నూనెగింజలు ఉత్పత్తిలో తగ్గుదల సంభవించి 15.8 మిలియన్ టన్నులుగా నమోదయ్యింది. ప్రత్తి ఉత్పత్తి ఏడవ ప్రణాళికా కాలంలో సాంవత్సరిక సగటు ఉత్పత్తి 8.4 మిలియన్ బేళ్ళుకాగా, ఎనిమిదవ ప్రణాళికా కాలంలో సాంవత్సరిక సగటు 12.2 మిలియన్ బేళ్ళుగా ఉన్నది. 2002-03 సం॥లో ప్రత్తి ఉత్పత్తి 9.3 మిలియన్ బేళ్ళు మాత్రమే. 1950 - 51 నుంచి 2002 - 03 సం॥రం వరకు పరిశీలించినప్పుడు చెరకు ఉత్పత్తిలో స్థిరమైన వృద్ధి కన్పిస్తున్నది.

పట్టిక - 6.3

ప్రతి హెక్టారుకు పంటల దిగుబడి (ప్రతి హెక్టారుకు కేజీలలో)

పంట	1950-51	1960-61	1971-72	1985-86	2001-02	2002-03
బియ్యం	668	1,013	1,141	1,552	2,086	1,874
గోధుమలు	655	851	1,380	2,046	2,770	2,747
జొన్న	353	533	460	633	785	752
రాగులు	288	286	452	344	875	610
మొక్కజొన్న	547	926	900	1,146	2,018	1,723
పప్పుధాన్యాలు	441	539	501	547	609	536
మొత్తం ఆహారధాన్యాలు	552	710	858	1,175	1,739	1,614
నూనె గింజలు	481	507	526	570	913	733
ప్రత్తి	88	125	151	197	189	212
జూట్	1,043	1,049	1,107	1,524	1,996	1,869

Source : 1) VI Plan, 1980 - 85, Annexure 9.2 p. 140,

2) Economic Survey 2002 - 03

3) Agricultural Statistics at a Glance, 2003.

పై పట్టిక ప్రతి హెక్టారు దిగుబడిలో వచ్చిన పెరుగుదలను సూచిస్తుంది. 1950 - 51 నుంచి 2002 - 03 మధ్యకాలంలో ఆహారధాన్యాల దిగుబడి ప్రతి హెక్టారుకు మూడు రెట్లు పెరిగింది. 1950 - 51 ఒక హెక్టారులో ఆహారధాన్యాల దిగుబడి 552 కేజీలు కాగా 2002 - 03 నాటికి 1,614 కేజీలకు పెరిగింది. ముఖ్యంగా గోధుమ యొక్క దిగుబడిలో గణనీయమైన ప్రగతి కన్పిస్తున్నది. 1950 - 51లో గోధుమ దిగుబడి ప్రతి హెక్టారుకు 655 కేజీలు కాగా, 2002-03 నాటికి దిగుబడి 2,747 కేజీలకు పెరిగింది. జొన్నలు, రాగులు మరియు మొక్కజొన్న లాంటి గింజ ధాన్యాల ఉత్పాదకతలో పెరుగుదల చాలా నెమ్మదిగా ఉన్నది. పప్పుధాన్యాల యొక్క దిగుబడి చాలా నిరాశాజనకంగా ఉన్నది. పప్పుధాన్యాల దిగుబడి ఒక హెక్టారుకు 1960 - 61లో 536 కేజీలు కాగా 2002 - 2003 నాటికి దిగుబడిలో అదే పరిస్థితి కన్పిస్తున్నది.

పట్టిక - 6.4

పంట	దేశం	క్వింటాళ్ళు / హెక్టారుకు
గోధుమ	1. ఇంగ్లండ్	70.8
	2. ఫ్రాన్స్	66.3
	3. చైనా	38.3
	4. ఇండియా	27.4
బియ్యం	1. అమెరికా	72.1
	2. జపాన్	66.6
	3. చైనా	63.5
	4. ఇండియా	29.6
ప్రత్తి	1. చైనా	33.3
	2. అమెరికా	20.0
	3. పాకిస్తాన్	18.8
	4. ఇండియా	6.0
వేరుశనగ	1. అమెరికా	33.9
	2. చైనా	31.4
	3. అర్జంటీనా	22.6
	4. ఇండియా	7.6

ఆధారము : టాటా సర్వీసెస్ లిమిటెడ్, Statistical outline of India, 2003 - 04, Table 295, p. 260

పై పట్టికను అనుసరించి ఒక అంశాన్ని తెలుసుకోవచ్చు. భారతదేశంలో భూమి ఉత్పాదకత అంటే హెక్టారుకు దిగుబడి ఇతర దేశాలతో పోల్చి చూసినప్పుడు అతి తక్కువగా ఉన్నది.

6.2.4 వ్యవసాయరంగంలో అల్ప ఉత్పాదకతకు కారణాలు :

1. మనదేశంలో వర్షపాతం మీద ఆధారపడి పంటలు పండించే రైతులు ఎంతో మంది ఉన్నారు. సకాలంలో నీటి సప్లయి లేనందున దిగుబడి కూడా చాలా తక్కువగా ఉన్నది. నీటిపారుదల ప్రాజెక్టులను ఎక్కువగా ఏర్పాటు చేయడం ద్వారా మనకున్న నీటి వనరులను పూర్తిగా సద్వినియోగ పరచుకొని అధిక ఉత్పత్తి పొందే ప్రయత్నం చేయాలి.

2. మన సాంప్రదాయ రైతులు అతి తక్కువ సాంకేతిక పరిజ్ఞానాన్ని మాత్రమే కల్గిఉన్నారు. అంతేకాక వారు ఆధునిక దిగుబడినిచ్చే విత్తనాలు, ఎరువులు మొదలగు వాటిని వినియోగించే ప్రయత్నం కూడా చేయటానికి చొరవచూపరు. అందువలన వ్యవసాయం కేవలం వృత్తిగానే తప్ప వ్యాపారదృష్టితో చూడటంలేదు. రైతులు ఎక్కువమంది నిరక్షరాస్యులైనందున పంట మార్పిడికి కూడా అంతగా చొరవచూపరు. ఈ కారణం వలన ఉత్పత్తి కూడా చాలా తక్కువగా ఉన్నట్లు తెలియుచున్నది.

3. భారతదేశంలోని వ్యవసాయ కమతాల పంపిణీ అసమానతతో కూడుకొని ఉన్నది. కమతం పరిమాణం చిన్నదిగా ఉండటం వల్ల ఆదాయం తక్కువ ఉండి, పొదుపు, పెట్టుబడులు తక్కువగా ఉండటానికి కారణమవుతుంది. అంటే అధికోత్పత్తిని ఇచ్చే నూతన వంగడాలను, ఎరువులను, క్రిమిసంహారక మందులను, నూతన ఉత్పాదకాలను, పద్ధతులను వినియోగించడానికి అవకాశం ఉండదు. శ్రమను, పరిశ్రమలను, పశువులను సంపూర్ణంగా వినియోగించుకోలేక ఉత్పత్తి వ్యయాలు పెరిగిపోతాయి. మనదేశంలో 58.1 శాతం కమతాలు ఒక హెక్టార్ కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. కమతం విస్తీర్ణం ఒక హెక్టారుకు తగ్గితే లాభసాటి కాదని నిర్ణయించవచ్చు. మనదేశంలో తనసరి భూమి లభ్యత 0.40 హెక్టార్లు మాత్రమే.

4. వ్యవసాయ రంగంలో ఇప్పటికీ రైతులు సంవత్సరములో ఒకే పంటను పండిస్తున్నారు. అలా కాక సంవత్సరములో రెండు లేక మూడు పంటలను పండిస్తే మరింత ఉత్పత్తిని పెంచుకునే అవకాశం కలదు.

5. వ్యవసాయ రంగంలో సాంకేతిక మార్పులు ఆశించినంతగా జరగనందువలన పురాతన ఉత్పత్తి పద్ధతులు, పురాతన పరికరాలనే వినియోగిస్తున్నాము. అందువలన మనం పశ్చిమదేశాలలో లాగా మన వ్యవసాయాన్ని ఆధునికీకరణ చేయలేకపోతున్నాం. అధిక దిగుమడినిచ్చే విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు, ఆధునిక నీటి సదుపాయాలు కూడా చాలా తక్కువగా ఉన్నాయి. అధిక దిగుబడిని సాధిస్తూ అంతర్జాతీయ స్థాయిని చేరుకునే ప్రయత్నం చేయాలంటే ఈ ఉత్పత్తికారకాలన్నింటిని వినియోగించుకోవలసి ఉంటుంది.

6. వ్యవసాయోత్పత్తి తక్కువగా ఉండటానికి గల కారణాలలో భూస్వామ్య వ్యవస్థలో, కౌలు విధానాలలో ఉండే లోపాలే అతి ముఖ్యమైనవని చెప్పవచ్చు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జమిందారీ, రైత్వారీ, మహల్వారీ పద్ధతుల వల్ల భూకేంద్రీకరణ జరగడం, కౌలువిధానం అభివృద్ధికావడం వల్ల భూమి దున్నేవారికి ప్రోత్సాహం కరువైంది. లోపభూయిష్టమైన ఈ భూస్వామ్య పద్ధతులు, కౌలు పద్ధతులే వ్యవసాయోత్పత్తి తక్కువగా ఉండటానికి కారణమైంది.

7. నిరక్షరాస్యత, బుద్ధిహీనత, మూఢనమ్మకాలు, సంకుచిత భావాలు, ఆచారాలపై, విధానాలపై పూర్తి నమ్మకం, కులవ్యవస్థ, ఉమ్మడి కుటుంబాలు మొదలైన లక్షణాలు ఉన్న గ్రామీణ వాతావరణం వ్యవసాయరంగం వెనుకబడి ఉండటానికి కారణమవుతున్నది. వాతావరణ అంచనా, నూతన సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించడంలో ముందంజ వేసే స్థితికి గ్రామీణ ప్రజలు వచ్చినప్పుడు మాత్రమే వ్యవసాయ రంగంలో అభివృద్ధి జరుగుతుంది.

6.2.5 వ్యవసాయ రంగానికి ఆర్థిక సహాయం :

దేశ జనాభాలో మూడింట రెండు వంతులకు పైగా వ్యవసాయం జీవనాధారంగా ఉన్నది. ఈ మేరకు ప్రభుత్వం కూడా మొదటి పంచవర్ష ప్రణాళికా కాలం నుంచి (1951 - 56) వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై పెద్దసంఖ్యలో ఆధారపడిన పేదలు, ప్రధానంగా చిన్న, మధ్యతరహా రైతులు, బలహీనవర్గాల వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల నుంచి బయటపడి ఆయా వర్గాలు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందుబాటులోకి

తెచ్చుకోవడంతోపాటు సాగు విధానాలను మెరుగుపరచుకొని, ఉత్పత్తి మరియు ఉత్పాదనలను పెంచుకొనేందుకు వీలుగా వారికి సకాలంలో తగినంత పరపతి సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం ముమ్మర చర్యలు తీసుకొంటుంది. రైతుల వ్యవసాయ పరపతి అవసరాలు మూడు భాగాలుగా విభజించవచ్చు. 1) స్వల్పకాలిక అవసరాలు, 2) మధ్యకాలిక అవసరాలు 3) దీర్ఘకాలిక అవసరాలు.

6.2.5.1 స్వల్పకాలిక ఋణాలు :

విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, పశువులకు మేత కొనుగోలు చేయడానికి రైతులకు స్వల్పకాలిక ఋణాలు అవసరమవుతాయి. ఈ ఋణాలు వారు 15 నెలల్లో తిరిగి చెల్లించవచ్చు. ఇటువంటి ఋణాలను రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి సహకార సంఘాల నుంచి తీసుకుంటారు.

6.2.5.2 మధ్యకాలిక ఋణాలు :

రైతులు వ్యవసాయ పనిముట్లు కొనడానికి, బావులు మరమ్మత్తులు చేయడానికి, పశువులను కొనుగోలు చేయడానికి ఋణాలు అవసరమవుతాయి. ఈ ఋణాలను వారు 15 నెలల నుంచి 5 సంవత్సరాల పరిధిలో తీర్చివేయగలరు. ఈ ఋణాలను వడ్డీవ్యాపారులు, సహకార సంఘాలు, వాణిజ్యబ్యాంకుల నుండి రైతులు పొందుతారు.

6.2.5.3 దీర్ఘకాలిక ఋణాలు :

ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వంటి భారీ యంత్ర పరికరాలను కొనుగోలు చేయడానికి, గొట్టపు బావులు తవ్వడానికి, భూములను చదును చేయడానికి, పాత బకాయిలను తీర్చడానికి రైతులకు దీర్ఘకాలిక ఋణాలు అవసరమవుతాయి. ఈ ఋణాల కాలపరిమితి 5 సంవత్సరాలకు మించి ఉంటుంది. రైతులు ఈ ఋణాలను సాధారణంగా భూమి అభివృద్ధి బ్యాంకుల నుంచి తీసుకుంటుంటారు.

6.2.5.4 వ్యవసాయ ఋణాలకు మార్గాలు :

వ్యవసాయ ఋణాలు సాధారణంగా రెండు మార్గాల్లో లభిస్తాయి. ఒకటి సంస్థాపరమైన ఋణాలు, రెండు ఇతర మార్గాల ద్వారా వచ్చే ఋణాలు, రైతులు వడ్డీవ్యాపారులు, బంధువులు, వర్తకులు, కమీషన్ ఏజెంట్లు, భూస్వాముల వద్ద ఋణాలు తీసుకుంటారు. ఇవి ఇతర మార్గాల్లో వచ్చే ఋణాలుగా భావించవచ్చు. సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల ద్వారా వచ్చే ఋణాలను సంస్థాపరమైన ఋణాలుగా భావించవచ్చు. మొత్తం గ్రామీణ పరపతిలో వడ్డీవ్యాపారుల వాటా 1951లో 71.6 శాతం ఉండగా, 1991 నాటికి 17.6 శాతానికి తగ్గింది. వ్యవసాయ రంగానికి సంబంధించి సంస్థాపరమైన ఋణాలు 1970 - 71లో రూ. 1,798 కోట్లు కాగా 1989 - 90లో రూ. 10,628 కోట్లకు పెరిగింది. 2001 - 02 సం॥లో రూ. 64,000 కోట్లు, 2002 - 03 సం॥లో సంస్థాపరమైన రుణాలు రు. 82,073 కోట్లకు చేరగలవని అంచనా. తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో వ్యవసాయ రంగానికి మొత్తం పరపతి రూ. 2,33,700 కోట్లుగా ఉండగలదని అంచనా. పదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో వ్యవసాయం మరియు అనుబంధాలకు సంబంధించి మొత్తం పరపతి రూ. 7,36,570 కోట్లుగా ఉండగలదని భావిస్తున్నారు. ఇది తొమ్మిదవ ప్రణాళికలో ఇచ్చిన పరపతి కన్నా మూడురెట్లు ఎక్కువగా ఉన్నది.

6.2.5.5. సహకార సంఘాలు :

గ్రామీణ ప్రాంతాలలో అనాదిగా అప్పులు ఇచ్చే వడ్డీ వ్యాపారుల బ్యాంకింగ్ వ్యవస్థ సరైన ప్రత్యామ్నాయం కాలేకపోయింది. అలాంటి ప్రతికూల పరిస్థితుల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిని, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత పేదలను ఆదుకొనేందుకు ఆర్థిక నిపుణులు, ప్రణాళికావేత్తలు సహకార వ్యవస్థకు రూపకల్పన చేశారు. దోపిడీరహిత విధానం, స్వచ్ఛంద సభ్యత్వం, విధాన నిర్ణయాల్లో వికేంద్రీకరణ వంటి లక్షణాలు గల సహకారపద్ధతి గ్రామీణాభివృద్ధికి అత్యంత అవసరంగా వారు గుర్తించారు. పేద,చిన్న, మధ్య తరహా రైతులకు తక్కువ వడ్డీపై సంస్థాగత బుణాలు అందించడం, గ్రామీణ పరపతి విధానంలో వడ్డీవ్యాపారులు, మధ్య దళారీల ప్రమేయాన్ని నివారించడం వంటివి ప్రధాన ఉద్దేశ్యంతో ప్రభుత్వం సహకార ఉద్యమాన్ని ప్రారంభించింది. ప్రతి పంచవర్ష ప్రణాళికలో సహకార రుణాలను పెద్దఎత్తున పెంచుతూ వస్తోంది.

మూడంచెల వ్యవస్థ గల ఈ విధానంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పి.ఎ.సి) క్రింది స్థాయిలోనూ, రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకులు (ఎస్ సి బి) పై స్థాయిలోనూ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (డిసిసిబి) ఆ రెండింటి మధ్య పనిచేస్తున్నాయి. ఆయా రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర సహకారబ్యాంకులు డిసిసిబి ఆర్థిక వ్యవహారాలను నియంత్రించడంతోపాటు జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు), డిసిసిబి, పిఎసి లకు అనుసంధానంగా పనిచేస్తున్నాయి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు గ్రామీణ ప్రాథమిక సహకార సంఘాలకు రుణాలు ఇస్తూ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి రాష్ట్ర సహకార బ్యాంక్ మరియు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల మధ్య వారధిగా పనిచేస్తాయి.

6.2.5.5.1 సహకార సంఘాలు - గ్రామీణ పరపతి :

సహకార ఉద్యమం మనదేశంలో 1904లో ప్రారంభమయినప్పటికీ, స్వాతంత్ర్యానికి ముందు ఈ సంఘాల యొక్క పాత్ర గ్రామీణ పరపతిలో నామమాత్రంగా ఉన్నది. 1951 - 52లో మొత్తం గ్రామీణ పరపతిలో సహకార సంఘాల వాటా 3.1 శాతం గా మాత్రమే ఉన్నది. స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఇవి చాలా పురోగతి సాధించాయి. 1961 - 62లో మొత్తం పరతపతిలో సహకార సంఘాల వాటా 15.5 శాతంగాను, 1970 - 71లో 22.7 శాతంగాను ఉన్నది. 1951 - 52లో ఈ సంఘాలు ఇచ్చిన స్వల్పకాలిక మరియు మధ్యకాలిక పరపతి రూ. 23 కోట్లు కాగా, 1961 - 62 నాటికి రూ. 203 కోట్లకు, 1979 - 80నాటికి రూ. 1,425 కోట్లకు పెరిగింది. 1992 - 93 సం॥లో సహకార సంఘాలు ఇచ్చిన మొత్తం గ్రామీణ పరపతి రు. 9,387 కోట్లుగా ఉన్నది (మొత్తం సంస్థాపరమైన పరపతిలో ఇది 61.8శాతము) తర్వాత కాలములో సహకార సంఘాలు ఇచ్చిన వ్యవసాయ పరపతిలో పెరుగుదల ఉన్నప్పటికీ, మొత్తం సంస్థాపరమైన పరపతిలో వీటి వాటా తగ్గింది. 2001 - 02వ సం॥లో సహకార సంఘాలు ఇచ్చిన మొత్తం గ్రామీణ పరపతి రూ. 27,080 కోట్లు, మొత్తం సంస్థాపరమైన పరపతిలో (రూ. 64,000 కోట్లు) వీటి వాటా 42 శాతంగా మాత్రమే ఉన్నది.

6.2.5.5.2 సహకార సంఘాలు - సమస్యలు :

1999లో శ్రీ కె. మాధవరావు అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ, శ్రీ జగదీష్‌కపూర్ చైర్మన్‌గా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్-2000 కమిటీ, ప్రొఫెసర్ వి.ఎస్.వ్యాస్ అధ్యక్షతన గల నిపుణుల కమిటీ - 2001, దేశంలోని సహకార పరపతి సంఘాల వ్యవస్థ మనుగడపైనా, వాటి ఆర్థిక స్థితిగతులపైనా, నివేదిక సమర్పించాయి. ఈ కమిటీల నివేదిక ప్రకారం సహకార పరపతి సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇలా ఉన్నాయి - 1. మందకొడిగా బకాయిల వసూళ్ళు. 2. పెరిగిపోతున్న బుణబకాయిలు, నిరర్థక ఆస్తులు, 3. తక్కువ స్థాయిలో వ్యాపార కార్యకలాపాల విస్తరణ, 4. అసమగ్ర రుణ ప్రణాళిక, 5. తక్కువ పెట్టుబడులు.

రుణాల పంపిణీలో పేదరైతులకు, కౌలుదారులకు, భూమిలేని వ్యవసాయ కార్మికులకు తగిన ప్రాధాన్యం లభించడం లేదు. మొత్తం రుణాలలో వారికి 3 శాతం మాత్రమే అందుతున్నది. చిన్న , మధ్యతరహా రైతులకు అందుతున్న రుణాలు పెట్టుబడులకు చాలకుండా ఉన్నాయి. సహకార సంఘాల నిధుల కేటాయింపులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు ఉండటంతో కొన్ని రాష్ట్రాలే ప్రయోజనం పొందుతున్నాయి. ఉదాహరణకు బీహార్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల కంటే గుజరాత్, హర్యానా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల రైతులు ఎక్కువ ప్రయోజనం పొందుతున్నారు. సహకార రుణాల పంపిణీలో దేశంలోని గిరిజన, కొండ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సహకార రంగంలో సభ్యత్వాలు తగ్గడం, నిర్వహణ లోపించిన సిబ్బంది, రుణాలపై అధికవడ్డీ, డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ తక్కువగా ఉండటం ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు.

6.2.5.6 వాణిజ్య బ్యాంకులు - వ్యవసాయ పరపతి :

వ్యవసాయ పరపతి విషయంలో చాలా కాలంగా వాణిజ్యబ్యాంకుల పాత్ర చాలా పరిమితమైందని చెప్పవచ్చు. ప్రకృతి మీద ఆధారపడిన వ్యవసాయదారులకు రుణాలను ఇవ్వడం వాణిజ్య బ్యాంకులకు లాభదాయకం కాదనే ఉద్దేశ్యంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, బ్రాంచీల స్థాపనలో కూడా పారిశ్రామిక కేంద్రాలకు, పట్టణాలకు పరిమితమయింది. 1969లో బ్యాంకుల జాతీయకరణ ప్రారంభమయిన తరువాత బ్రాంచీల స్థాపన విషయంలోను, అందించే రుణాల విషయంలోను, గ్రామీణ ప్రాంతం అత్యధికమైన ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నది. 1969లో మొత్తం షెడ్యూల్ బ్రాంచీల సంఖ్య 8,262 ఉండగా గ్రామీణ బ్రాంచీల సంఖ్య 1,833 (22%) మాత్రమే. 2002 జూన్ నాటికి మొత్తం బ్రాంచీల సంఖ్య 66,239కు పెరగగా, గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచీల సంఖ్య 33,459గా ఉన్నది. (సుమారు 50%)

6.2.5.7 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు :

1975లో 5 గ్రామీణ బ్యాంకులతో ప్రారంభమయిన ఈ బ్యాంకుల స్థాయి ప్రస్తుతం 196కు పెరిగింది. రిజర్వ్‌బ్యాంక్ 1977 జూన్‌లో గ్రామీణ బ్యాంకుల తీరును పరిశీలించడానికి యం.కె. దంత్‌వాలా అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ అభిప్రాయం ప్రకారం గ్రామీణ బ్యాంకులు గ్రామీణ పరపతి నిర్మాణంలో చాలా ఉపయోగకరమైన మూలకంగా వర్ణించారు. ఒక్కొక్క గ్రామీణబ్యాంకు 20,000 జనాభాకు మాత్రమే పరిమితం కావాలని, ఇతర వాణిజ్య బ్యాంకుల లాగా రిజర్వ్‌బ్యాంకు నియంత్రణకు లోబడి ఉండాలని, వాటా మూలధనంలో మార్పులు అవసరమని, సహకార పరపతి బ్యాంకులు కావలసినంతమేరకు పరపతిని అందించలేకపోతున్నాయని వివరించారు. కాబట్టి గ్రామీణ బ్యాంకులు అధికంగా స్థాపించాలని సూచనలు చేయడం జరిగింది. ఈ కమిటీ సూచనలకు అనుగుణంగా సహకార సంఘాలు బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ఈ బ్యాంకులను అధికంగా స్థాపించాలని, అటువంటి ప్రాంతాలను గుర్తించడానికి ఒక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి కోసం ఏర్పాటు చేయబడిన వ్యవస్థాపూర్వక పరపతి సమీక్షా సంఘం వారి రిపోర్ట్ ప్రకారం గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో గ్రామీణ బ్యాంకులు సరైనవని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే వాణిజ్య బ్యాంకుల వ్యాపారాన్ని ఈ గ్రామీణ బ్యాంకులకు మార్చి రిజర్వ్‌బ్యాంక్ ద్వారా పొందే రీఫైనాన్స్ పొందాలని, ఈక్విటీ వాటాలు పెంచుకొనే అవకాశం కల్పించాలని, ప్రభుత్వం కాకుండా వీటిపై నియంత్రణ చేయడానికి, రెగ్యులర్ చేయడానికి జాతీయ బ్యాంకుకు బాధ్యత ఉండాలని సూచించారు.

1975లో 12 జిల్లాలలో 17 బ్రాంచీలతో ఈ బ్యాంకులు ప్రారంభమయ్యాయి. మార్చి 2000 నాటికి 476 జిల్లాలలో, 14498 బ్రాంచీలతో 196 గ్రామీణ బ్యాంకులు పనిచేస్తున్నాయి. ఈ బ్యాంకుల అడ్వాన్స్‌లు 1979 డిశంబరు నాటికి రూ. 1408కోట్లు, 1987 డిశంబర్‌లో రూ. 2332 కోట్లు, 2001 - 2002 నాటికి రూ. 4,957 కోట్ల వరకు పెరిగాయి. మొత్తం వ్యవసాయ రంగానికి ఇచ్చిన సంస్థాపరమైన పరపతిలో ఈ బ్యాంకులు 8.8 శాతం వాటాను కలిగి ఉన్నాయి. (2001 - 2002)

6.2.5.8 జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) :

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) ఇతోధికంగా సహాయం చేస్తోంది. వ్యవసాయంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలు, నీటిపారుదల, రోడ్ల నిర్మాణం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి తదితర రంగాలకు ఈ బ్యాంక్ ఆర్థిక సహాయం అందిస్తున్నది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు రుణసౌకర్యం కల్పిస్తున్న సహకార బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే రుణాల వల్ల ఆయా బ్యాంకులు ఇబ్బందులకు గురవ్వకుండా, ఆర్థిక ఒత్తిళ్ళకు లోనవకుండా నాబార్డ్ వాటికి నిధులను సమకూరుస్తుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా 1982 జూలై 13న నాబార్డ్ అవతరించింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధీనంలో నడిచే అగ్రికల్చర్ క్రెడిట్ డిపార్టుమెంట్, రూరల్ ప్లానింగ్, క్రెడిట్ విభాగాలు, అగ్రికల్చర్ రీఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌లను కలిపి వేసి నాబార్డ్ ఏర్పాటుచేశారు. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి దేశంలో అత్యున్నత బ్యాంకుగా నాబార్డ్ వెలుగొందుతుంది. రుణ కార్యకలాపాలతోపాటు ప్రణాళికలు రూపొందించటం, వివిధ పథకాల పర్యవేక్షణ, అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించడం, బ్యాంకర్ల కార్యకలాపాలను అవసరమైతే నియంత్రించడం ప్రధాన ధ్యేయంగా నాబార్డ్ పనిచేస్తోంది.

2002 - 2003 నాటికి నాబార్డ్, రాష్ట్ర సహకార బ్యాంకులకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు రీఫైనాన్స్ చేయవలసిన మొత్తం బకాయిలు రూ. 6,875 కోట్లుగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాలలో అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధినిధి పథకం (ఆర్.ఐ.డి.ఎఫ్) క్రింద మార్చి 2003 నాటికి రూ. 29,475 కోట్లు నాబార్డ్ మంజూరుచేసి దీనిలో రూ. 17,145 కోట్లు మంజూరు చేసింది. మంజూరు చేసిన మొత్తం రూ. 29,475 కోట్లలో గ్రామీణ రోడ్లకు 10,875 కోట్లు (36.9%), గ్రామీణ ప్రాంతాలో బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 3,729కోట్లు (12,6%),మిగతా 4,860 కోట్ల రూపాయలను వాటర్‌షెడ్ నిర్వహణ, వరద నిర్వహణ, గ్రామీణ ప్రాంతాలలో మార్కెట్‌యార్డ్‌ల ఏర్పాటు, కోల్డ్‌స్టోరేజీల, అడవుల అభివృద్ధి, మరియు గ్రామీణ ప్రాంతాలలో మంచినీటి కొరకు కేటాయించారు.

6.2.6 వ్యవసాయాభివృద్ధి : పంచవర్ష ప్రణాళికలు :

1943వ సం॥లో బెంగాల్‌లో వచ్చిన కరువు దేశంలోని ఆహారధాన్యాల కొరతను వ్యక్తం చేయడమేగాక, వ్యవసాయాభివృద్ధి విషయమై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించిందని చెప్పవచ్చు. 1947లో దేశవిభజన జరిగిన తరువాత మనదేశంలో ఆహారధాన్యాల కొరత తీవ్రరూపాన్ని దాల్చింది. విభజనకు పూర్వపు జనాభాలో 82 శాతం ప్రజలు భారతదేశంలో నిలిచిపోగా, వరి పండే ప్రదేశంలో 55 శాతం, అపరాలు పండే ప్రదేశంలో 75 శాతం భూప్రదేశం మాత్రమే భారతదేశానికి మిగిలింది. ఎక్కువ జనాభా మరియు వారిని ఆదుకోగలందులకు కావలసిన భూపరిణామము తక్కువ భారతదేశానికి దక్కింది. నీటిపారుదల సౌకర్యాలు మనదేశానికి తక్కువ ప్రమాణంలోను, పాకిస్తాన్‌కు ఎక్కువ ప్రమాణంలోను లభించినాయి. దేశ విభజన ఫలితంగా శరణార్థుల సమస్య ఏర్పడింది. వారిని పోషించే బాధ్యత ప్రభుత్వంపై పడటం జరిగింది. ఈ కారణం వలన కూడా ఆహారసమస్య తీవ్రరూపం దాల్చింది. సంపాదించుకున్న స్వాతంత్ర్యాన్ని నిలుపుకొని, ప్రజలకు ప్రజాస్వామ్య ప్రభుత్వం పట్ల నమ్మకం కలగడానికి కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ప్రభుత్వానికి ఏర్పడింది. 1951లో ప్రణాళికా బద్ధమైన కృషిద్వారా అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం పూనుకోవడంతో, భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక నూతనశకము ఆరంభమైనదని చెప్పవచ్చు.

6.2.6.1 వ్యవసాయరంగ అభివృద్ధికి తీసుకున్న చర్యలు :

ప్రణాళికా కేటాయింపులో ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇచ్చింది. అయితే మొత్తం కేటాయింపులో వ్యవసాయ రంగానికి చేసిన కేటాయింపులు ఒక ప్రణాళికకు మరో ప్రణాళికకు మారాయి.

మొదటి ప్రణాళికా పెట్టుబడిలో 32 శాతం వ్యవసాయరంగానికి, నీటిపారుదలకు కేటాయించారు. రెండవ ప్రణాళికలో 22 శాతం కేటాయించారు. మొదటి రెండు ప్రణాళికా కాలాల్లో సేద్యపు నీటి సౌకర్యాలు మెరుగుపరచారు. ఎరువుల వాడకం పెరిగింది. భూసంస్కరణలు, కౌలుదారీ సంస్కరణలు ప్రవేశపెట్టారు. సాంద్రవ్యవసాయజిల్లాల పథకాన్ని చేపట్టారు. ఈ పథకంలో భాగంగా కొన్ని జిల్లాలకు వ్యవసాయం అవసరాలను పుష్కలంగా అందచేశారు. మూడోప్రణాళికా కాలంలో వ్యవసాయ రంగానికి, సహకార పరపతికి, మార్కెట్ సొసైటీలకు కలిపి 20 శాతం నిధులు కేటాయించారు. 1960వ దశకం మధ్యభాగంలో ప్రభుత్వం ఒక కొత్త వ్యూహాన్ని ప్రకటించింది. అదనపు భూమిని వ్యవసాయం క్రిందకు తీసుకురావాలని, మేలురకం విత్తనాలను వినియోగించాలని, పంట మార్పిడి విధానాన్ని ప్రవేశపెట్టాలని, బహుళ పంటలు పండించాలని సంస్థాపరమైన సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వార్షిక ప్రణాళికల కాలంలో (1966 - 69) వ్యవసాయ రంగానికి 24 శాతం నిధులు కేటాయించారు. నాలుగో ప్రణాళికలో వ్యవసాయ రంగానికి 24 శాతం కేటాయింపులు చేశారు. 1973 - 74 సం॥లో ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 129 మిలియన్ టన్నులుకాగా 104.66 మిలియన్ టన్నులు మాత్రమే సాధించడం జరిగింది. ఐదవ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి 24 శాతం కేటాయింపులు చేశారు. 1973 - 74 సం॥లలో ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 129 మిలియన్ టన్నులు కాగా 104.66 మిలియన్ టన్నులు మాత్రమే సాధించడం జరిగింది. ఐదవ ప్రణాళికలో వ్యవసాయరంగానికి 20 శాతం, ఆరవ ప్రణాళికలో 25 శాతం, ఏడవ ప్రణాళికలో 22 శాతం, ఎనిమిదవ ప్రణాళికలో 18 శాతం, తొమ్మిదవ ప్రణాళికలో 4.4 శాతం, పదవ ప్రణాళికలో 4 శాతం కేటాయింపు జరిపారు.

పట్టిక - 6.5

ప్రణాళికా కాలం	సాధించిన విజయం (వార్షికశాతం)
మొదటి ప్రణాళిక	4.1
రెండవ ప్రణాళిక	4.0
మూడవ ప్రణాళిక	1.4
వార్షిక ప్రణాళికలు	6.2
నాలుగవ ప్రణాళిక	2.9
ఐదవ ప్రణాళిక	4.2
ఆరవ ప్రణాళిక	6.0
ఏడవ ప్రణాళిక	3.5
ఎనిమిదవ ప్రణాళిక	3.9
తొమ్మిదవ ప్రణాళిక	2.06

Source : Agricultural Statistics at a Glance, 2003

పై పట్టికను పరిశీలించినప్పుడు ప్రణాళికాపరంగా వ్యవసాయరంగం సాధించిన వార్షికవృద్ధి ఒక ప్రణాళికకు మరొక ప్రణాళికకు మారాయి. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు జాతీయ ఆదాయంలో ఉన్న వాటా 1950 - 51 సం॥లో 58.8 శాతం ఉండేది. ఇది ప్రస్తుతం (2002 - 2003) 22 శాతానికి తగ్గిపోయింది. వ్యవసాయోత్పత్తులుపెరిగినా మొత్తం ఆర్థిక వ్యవస్థలో వాటా శాతం తగ్గటమంటే పరిశ్రమలు, సేవల రంగాలు మరింత వేగంగా పెరుగుతున్నాయని గమనించాలి. మౌలిక రంగమైన వ్యవసాయమే పరిశ్రమలను, వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుంది. పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలను ఇది సరఫరా

చేస్తుంది. 1950 - 51 సం॥లో 118.7 మిలియన్ హెక్టార్లలో సేద్యం జరిగేది. 1988 - 89 సం॥ నాటికి సేద్యం జరిగే విస్తీర్ణం 141.7 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. ఇండియాలో మొత్తం 304.2 మిలియన్ హెక్టార్ల భూమి సేద్యయోగ్యమైనట్లు అంచనా. అనగా 46.5 శాతం సేద్యమైన భూమిలోనే వ్యవసాయం జరుగుతున్నది. హెక్టారుకు దిగుబడి గణనీయంగా పెరిగింది. అంటే ఉత్పాదకతలో పెరుగుదల కన్పించింది. 1950 - 51లో హెక్టారు విస్తీర్ణంలో 668 కేజీల బియ్యం పండితే 2001 - 02 సం॥ నాటికి 2960 కేజీలకు చేరుకుంది. అలాగే గోధుమ పంట దిగుబడి కూడా 665 కేజీల నుంచి 2740 కేజీలకు పెరిగింది. నూనె గింజల ఉత్పత్తి 481 కేజీల నుంచి 856 కేజీలకు, జనపనార ఉత్పత్తి 1043 కేజీల నుంచి 2174 కేజీలకు పెరిగింది.

వ్యవసాయ రంగంలో ప్రణాళికా పరంగా జరిగిన అభివృద్ధి ఇతర మార్గాల ద్వారా కూడా తెలుసుకోవచ్చు. 1966 - 67 సం॥లో 1.89 మిలియన్ హెక్టార్ల ప్రాంతంలో అధికోత్పత్తి వంగడాలు వినియోగిస్తే 1997 - 98 సం॥లో 76 మిలియన్ హెక్టార్లలో అధికోత్పత్తి వంగడాలు వినియోగించారు. నీటిపారుదల సౌకర్యం గల నికరప్రాంతం 1950 - 51లో 20.9 మిలియన్ హెక్టార్లయితే 97 - 98 నాటికి 89.4 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. 1952 - 53 సం॥లో ఎరువుల వాడకం 66 వేల టన్నులు కాగా, 2001 - 02 నాటికి ఎరువుల వాడకం 173 లక్షల టన్నులకు పెరిగింది.

6.2.7 హరిత విప్లవము :

హెచ్చు వంగడాలలో నవకల్పనతో మొదలుపెట్టి, ఇతర నవీన ఉత్పాదకాల సహాయంతో ఉత్పాదకాలను అధికంగా హెచ్చించి, వ్యవసాయదారులలో నూతన ఉత్సాహాన్ని కలుగజేసి వర్థమాన దేశాలలోని వ్యవసాయాన్ని జీవన విధానం నుంచి, పరిశ్రమగా మార్చే అవకాశం కల్పించిన విప్లవాత్మకమైన మార్పుల కూర్పునే "హరిత విప్లవము" అంటారు. విలియం యస్.గాండ్ మొట్టమొదట ఈ పదాన్ని ఉపయోగించగా, నార్మిన్ బోర్లాగ్ దీనికి ఆధ్యుడు కాగా భారతదేశంలో డా॥ స్వామినాధన్ కృషివలన హరితవిప్లవం సంభవించిందని చెప్పవచ్చు. 1960 - 61 లో ప్రారంభమైన సాంద్ర వ్యవసాయ జిల్లాల కార్యక్రమం (IADP) 1964లో ప్రారంభమైన సాంద్ర వ్యవసాయ ప్రాంతాల కార్యక్రమము (IAAP) 1966 - 67 సం॥లోని అధికోత్పత్తి వంగడాల నూతన వ్యవసాయక వ్యూహం ద్వారా మనదేశంలో హరితవిప్లవం సంభవించింది. నూతన వ్యవసాయాభివృద్ధి వ్యూహంలో మూడు రకాలైన మార్పులు గోచరిస్తాయి. 1. జీవశాస్త్ర మార్పులు, 2. రసాయనిక మార్పులు, 3. యాంత్రిక మార్పులు. వ్యవసాయోత్పత్తి స్థిరంగా ఉండటానికి, నూతన వ్యవసాయ విధానాలు విజయవంతం కావడానికి నీరు ప్రాణాధారము. 1951వ సం॥లో 226 లక్షల హెక్టార్లకు సేద్యపు నీటి సౌకర్యం ఉండగా తొమ్మిదవ ప్రణాళిక పూర్తయ్యేనాటికి (1997 - 2002) నాటికి ఆ విస్తీర్ణం 957 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఇటీవల కాలంలో వ్యవసాయోత్పత్తి స్థిరంగా ఉండటానికి కారణం సేద్యపు నీటి లభ్యత పెరగటమే.

6.2.7.1 జీవశాస్త్ర మార్పులు :

హెచ్చు దిగుబడినిచ్చే వంగడాల అభివృద్ధిలో వచ్చే మార్పులన్నీ ఈ కోవలకి వస్తాయి. ఈ అధిక దిగుబడినిచ్చే వంగడాలు ఎకరా ఉత్పాకతకు గణనీయంగా పెంచటమేకాక పంటను స్వల్పకాలంలోనే ఇస్తాయి. ఈ కారణంగా ఒక సంవత్సర కాలంలో బహుళ పంటలను వేయటానికి అవకాశం లభిస్తుంది.

రెండు దశాబ్దాల కాలంలో అధికోత్పత్తి వంగడాల వాడకం పెరిగింది. 1966 - 67 సం॥లో 1.88 మిలియన్ హెక్టారుల భూమిలో మాత్రమే అధిక దిగుబడి నిచ్చే వంగడాలను ఉపయోగించగా 1997-98 నాటికి 76 మిలియన్ హెక్టార్లలో ఈ విత్తనాలను ఉపయోగిస్తున్నారు. అతి స్వల్పకాలంలో ఈ కార్యక్రమం సుమారు 60 రెట్లు (భూమిలో) అధికమైంది. మొత్తం పంట

విస్తీర్ణంలో 37 శాతం అధికోత్పత్తి వంగడాలు ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన సమాజాభివృద్ధి కార్యక్రమాలు, అధికోత్పత్తి వంగడాల కార్యక్రమం (1966 -67), ప్రయోగశాల నుంచి పంట పొలాలకు పథకం, మినీ కిట్ పథకం విజయవంతం కావడంవల్లనే అధికోత్పత్తి వంగడాల వాడకం విస్తారంగా జరుగుతున్నది. ఆహార పంటల్లో గోధుమకు మొదట అధికోత్పత్తి వంగడాలను అభివృద్ధి చేశారు. తర్వాత క్రమంగా వరిపంట విషయంలో కూడా అధికోత్పత్తి వంగడాల వాడకం ఎక్కువయింది. ఈ విధంగా అధికోత్పత్తి వంగడాల వాడకం ఆహారపంటలైన వరి, గోధుమ, మొక్కజొన్న, జొన్న, సజ్జలకే చాలా వరకు పరిమితమైనది. ఆహారేతర పంటలైన చెరుకు, ప్రత్తి తప్ప మిగతా పంటల విషయంలో ఈ రంగంలో ప్రగతి చాలా స్వల్పంగా ఉన్నది.

6.2.7.2 రసాయనిక మార్పులు :

అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు రసాయనిక ఎరువులకు, తెగుళ్ళకు తట్టుకోగలిగి హెచ్చు ప్రతిఫలమిచ్చేవిగా ఉంటాయి. అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ఉపయోగించినపుడు రసాయనిక ఎరువుల వినియోగం కూడా అధికమౌతుంది. అంతేకాక పంట తెగుళ్ళకు గురిఅయ్యే అవకాశం ఉండటం వల్ల క్రిమిసంహారక మందుల వినియోగం కూడా అధికమౌతుంది.

1952 - 53 సం॥లో మొత్తం ఎరువుల వాడకం దాదాపు 66 వేల టన్నులు. 1999 - 2002 నాటికి ఇది 181 లక్షల టన్నులకు పెరిగి, 2001 - 2002 నాటికి 174 లక్షల టన్నులుగా ఉన్నది. సబ్సిడీ ధరకు ఎరువులను సరఫరా చేయడం, మినీకిట్ ప్రదర్శనల వల్ల ఈ పెరుగుదల ఏర్పడింది. 1966 - 67 సం॥లో అధికోత్పత్తి వంగడాల ప్రచార కార్యక్రమం పెరిగిన తరువాత మనదేశంలో ఎరువుల వాడకం బాగా పెరిగింది.

పట్టిక - 6.6

ఎరువుల వాడకంలో పెరుగుదల (మిలియన్ టన్నులలో)

ఎరువులు	1970 - 71	1980 - 81	1990 - 91	1999 - 2000	2001 - 2002
మొత్తం	2.2	5.5	12.5	18.1	17.4
నైట్రోజన్	1.5	3.7	8.0	11.50	11.3
ఫాస్ఫేట్	0.5	1.2	3.2	4.90	4.3
పొటాష్	0.2	0.6	1.3	1.61	1.8

Source : Agricultural Statistics at a Glance, 2003

ఇండియాలో ఎరువుల వాడకంలో రాష్ట్రాల మధ్య తీవ్రమైన తేడాలు ఉన్నాయి. దేశంలో సరాసరి హెక్టారుకు 90.12 కేజీల యన్.పి.కె. ఎరువులను వాడితే, నాగాలాండ్‌లో సరాసరి రెండు కేజీలను మాత్రమే వాడుతున్నారు. ఈ వాడకం ఒరిస్సాలో 40.91 కేజీలు, ఆంధ్రప్రదేశ్‌లో 143.46 కేజీలు, పంజాబ్‌లో 173.38 కేజీలు, హర్యానాలో 155 కేజీలు ఉన్నది. దేశంలోని 70 శాతం వర్షాధార భూముల్లో 20శాతం ఎరువులను మాత్రమే వాడుతున్నారు. ఎరువులను తక్కువగా వాడే ప్రాంతాలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఒక జాతీయ పథకాన్ని ప్రారంభించి ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నది. దీనికొరకు 16 రాష్ట్రాలలోని 60 జిల్లాలను ఎంపికచేశారు. వివిధ పంటలకు ఎరువుల వాడకంలో చాలా వ్యత్యాసం ఉంది. ఎరువులు అధికంగా గోధుమ, వరి, చెరుకు పంటలకు వినియోగిస్తున్నారు. పప్పుధాన్యాలకు, ముతక ధాన్యాలకు తక్కువగా వాడుతున్నారు. భూసారం తక్కువగా ఉన్నప్పటికీ, వర్షాధార ప్రాంతాలలో ఈ పంటలను పండించటం వల్ల ఎరువుల వాడకం తక్కువగా ఉన్నది.

6.2.7.3 క్రిమిసంహారక మందులు :

1951 - 52 సం॥లో క్రిమిసంహారక మందుల వినియోగం 100 టన్నులుండగా 1991 - 92 నాటికి అది 78,400 టన్నులకు పెరిగింది. అయితే దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య క్రిమిసంహారక మందుల వాడకంలో విపరీతమైన తేడాలున్నాయి. తమిళనాడులో పంటలు పండించే విస్తీర్ణంలో హెక్టారుకు సరాసరి 1.8 కేజీల ఫార్ములేటెడ్ క్రిమిసంహారక మందులను వినియోగిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో హెక్టారుకు సరాసరి 100 గ్రాముల క్రిమిసంహారక మందులు మాత్రమే వినియోగిస్తున్నారు. పంటల ఉత్పత్తి పెంచడానికి పంటలను క్రిమికీటకాల దాడి నుంచి రక్షించడానికి క్రిమియాజమాన్య పద్ధతులపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిని ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ అని వ్యవహరిస్తున్నారు రసాయనిక క్రిమి సంహారక మందులపై అతితక్కువ ఆధారపడే విధానంగాను, మానవులకు హానికరం కాకుండాను పరిసరాలకు మేలు జరిగేలా ఈ పద్ధతి రూపొందించారు.

6.2.7.4 వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ :

త్వరితంగా సకాలంలో వ్యవసాయ కార్యకలాపాలను నిర్వహించడానికి నూతన యంత్రాల అవసరం ఏర్పడుతుంది. నవీన యాంత్రిక పద్ధతులలో వ్యవసాయం చేసినప్పుడు, సంప్రదాయ వ్యవసాయం కంటే 25 నుంచి 30 శాతం వరకు వ్యవసాయ ఉత్పాదకత పెంచవచ్చని రోషన్‌సింగ్, బి.బి.సింగ్ వారి అంచనాల వల్ల తెలుస్తున్నది. యాంత్రీకరణ ద్వారా వేగంగా బహుళ పంటలను పండించడానికి అవకాశాలు ఏర్పడతాయని అనేక పరిశీలనల వల్ల తెలుస్తున్నది.

1961 సం॥లో దేశంలో 31 వేల ట్రాక్టర్లు మాత్రమే ఉండగా 2001 - 02 నాటికి వీటిసంఖ్య 22 లక్షలకు పెరిగింది. పంటలు పండే విస్తీర్ణం లక్ష హెక్టార్లకు 1961వ సం॥లో 20ట్రాక్టర్లు ఉండగా 1988 నాటికి 595కి పెరిగింది. ఆయిల్ ఇంజన్ల సంఖ్య 1961లో 2.30 లక్షలు ఉండగా 1988 నాటికి వీటి సంఖ్య 42.50 లక్షలకు పెరిగింది. లక్ష హెక్టార్లకు ఆయిల్ ఇంజన్ల సంఖ్య 1961లో 151 ఉండగా 1988 నాటికి 2400కి పెరిగింది. 1961లో విద్యుత్ మోటార్ల సంఖ్య 2 లక్షలు ఉండగా 1988 నాటికి 70 లక్షలకు చేరుకుంది. పంటలుపండే విస్తీర్ణంలో 1961లో లక్ష హెక్టార్లకు విద్యుత్ మోటార్ల సంఖ్య 135 ఉండగా 1988 నాటికి 3,995కు పెరిగింది. ఈ కాలంలో ఎలక్ట్రిక్ మోటార్ల సంఖ్య 218 శాతం, డీజిల్ ఇంజన్ల సంఖ్య 19 శాతం, ట్రాక్టర్ల సంఖ్య 302 శాతం పెరిగింది. వెయ్యి హెక్టార్లకు ఇండియాలో సరాసరి 3.7 ట్రాక్టర్లు కాగా, ప్రపంచంలో సరాసరి 13.1 ట్రాక్టర్లు, జపాన్‌లో 181 ట్రాక్టర్లు ఉన్నాయి. ఇండియాలో భూమిపై జనాభా ఒత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల కమతాలు చిన్నవిగా ఉండి, రైతులుపేదరికంలో ఉండటంవల్ల డీజిల్ కొరత, విద్యుత్ కొరత ఉండటం వల్ల యాంత్రీకరణ తక్కువస్థాయిలో జరుగుతున్నది.

6.2.8 రెండవ హరిత విప్లవం - ఆవశ్యకత :

పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలను తీర్చి గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచాలంటే రెండవ హరితవిప్లవం అనివార్యం. రెండవ హరిత విప్లవానికి వికేంద్రీకరణ కార్యాచరణ, పటిష్టమైన ప్రణాళిక చాలా ముఖ్యమైన అంశాలు. ప్రభుత్వము, ప్రైవేటు రంగము సంయుక్తంగా పెట్టుబడులను సమకూర్చాలి.

మనదేశంలో స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయరంగ వాటా 22 శాతం కంటే తగ్గిపోయింది. వ్యవసాయరంగంపై ఆధారపడి పనిచేస్తున్న శ్రామికుల సంఖ్య 58.4 శాతం ఉంది. ప్రణాళికా విధానం ప్రారంభమై ఆరు దశాబ్దాలు గడిచినా ఈ పరిస్థితి మారలేదు. వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న వారిలో 46 శాతం మంది అంటే 107.4 మిలియన్ల మంది చాలా తక్కువ వేతనంతో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలని 2001 జనాభా లెక్కలు తెలియజేస్తున్నాయి. హరిత విప్లవంలో ప్రధానంగా గతంలో విత్తనం - నీరు - ఎరువుల పరిజ్ఞానాన్ని వినియోగించుకొని రైతులు ఎంతో ప్రయోజనం పొందారు. కాని వీటి విపరీత వినియోగం

అస్థిరతకు దారితీసింది. రసాయనిక ఎరువులు, పురుగుమందులు మితిమీరి వాడటంవల్ల నీటివనరులు కలుషితమవుతున్నాయి. భూగర్భ జలాల్ని గరిష్ఠంగా వాడుకోవడం వల్ల నీటినిల్వలు పూర్తిగా అడుగంటి పర్యావరణం ప్రమాదస్థితికి చేరుకోవడం జరుగుతుంది. నీటి ప్రవాహం, గాలివల్ల భూమి కోతకు గురికావడం, నేలపై పొర కొట్టుకుపోవడం మరొక సమస్యగా ఉంటుంది.

అపరిమితమైన రసాయనిక ఎరువుల వాడకం తగ్గించే సేంద్రియ ఎరువుల వాడకం ఎక్కువ చేయడం శ్రేయస్కరము. రెండవ హరిత విప్లవంలో ఆహార భద్రత కోసం పర్యావరణ సుస్థిరత అనేది ముఖ్యమైన అంశంగా పరిణమించింది. పర్యావరణ అనుకూల పరిస్థితుల్లోనే ఉత్పాదకతను పెంపొందించుకునేందుకు చర్యలు తీసుకోవాలి. పప్పుధాన్యాలు, నూనెగింజల పంటల ఉత్పత్తిని ఎక్కువ చేయవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు,శనగ, కంది, మినుములు మొదలైన పంటలను ప్రోత్సహించాల్సి ఉంది. ఆహార సమస్య తొలగిపోవడానికి, నేలల పరిస్థితి మెరుగుపడడానికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. కొండ ప్రాంతాల నుండి మైదానప్రాంతాల వరకు అన్ని ప్రాంతాలను దత్తత చేసుకొని వాటర్‌షెడ్ కార్యక్రమం ద్వారా నేలల్లో పచ్చదనం ఏర్పరచి, చెట్లు పెంచేందుకు సమీకృత చర్యలు చేపట్టాలి. విద్య, నైపుణ్య వికాసం, ఆరోగ్య రంగాలకు ప్రోత్సాహం ఒక వైపు, వ్యవసాయ ప్రాసెసింగ్ పరిశ్రమల విస్తృతి మరో వైపు ఏకకాలంలో జరిగినట్లయితే వచ్చే తరానికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇందుకోసం మౌళిక సదుపాయాల కల్పనకు, ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమకి పెద్దమొత్తంలో పెట్టుబడులు కావాలి. పెట్టుబడుల కంటే ప్రాసెస్ చేసిన ఆహారపదార్థాలు ప్రజలకు తక్కువ ధరకు లభించడం ముఖ్యం. దానిని బట్టే ఆ పదార్థాలకు డిమాండ్ పెరుగుతుంది. గ్రామీణ ఆదాయం, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదలవల్ల పారిశ్రామిక అభివృద్ధి కూడా సాధ్యమవుతుంది. రెండవ హరితవిప్లవానికి ప్రభుత్వం, ప్రైవేటు రంగానికి తగిన పెట్టుబడులు పెట్టాలి. వికేంద్రీకృత కార్యాచరణ, పటిష్టమైన ప్రణాళిక చాలా ముఖ్యమైన అంశాలు. ఆగ్రో ప్రాసెసింగ్, పశు సంవర్ధక రంగం, మత్స్య పరిశ్రమ రంగాల్లో స్వల్పకాలంలోఉద్యోగావకాశాలు సమకూరతాయి.

పట్టిక 6.7

భారతదేశంలో వివిధ రకాల ఆహారధాన్యాలకు గిరాకీ (వెయ్యి టన్నుల్లో)

	2000		2015		2030	
ఆహారం	స్వల్పాదాయ	అధికాదాయ	స్వల్పాదాయ	అధికాదాయ	స్వల్పాదాయ	అధికాదాయ
బియ్యం	84417	84255	101886	101441	114499	113893
గోధుమ	63375	62535	74607	72411	83045	80087
మొక్కజొన్న	10466	10281	12196	11714	13522	12876
ముతకధాన్యాలు	21803	21419	25407	24403	28171	26825
మొత్తం ఆహార ధాన్యాలు	180061	178500	214096	209969	239238	233681
పప్పుధాన్యాలు	16599	17028	21303	22578	24515	26312
తిండిగింజలు	196659	195528	235399	232574	263752	259993
బంగాళదుంప	19905	20716	26394	28911	30760	34370
వంటనూనెలు	8151	8324	10355	10863	11870	12581
కూరగాయలు	83388	91165	123824	151861	150823	193562

పండ్లు	47688	51774	69678	84099	84336	106126
పాలు	76932	82451	109092	127805	130502	158325
మాంసం	5335	5918	8196	10396	101181	13524
గ్రుడ్లు	1880	2086	2889	3664	3566	4770
చేపలు	5507	6108	8460	10731	10444	13971

స్వల్పాదాయ వర్గాలు : తలసరి జి డి పి లో 3.6 శాతం

అధికాదాయ వర్గాలు : తలసరి జి డి పి లో 5.5. శాతం

ఆధారం : Indian Agricultural Survey, 'The Hindlu', 2000.

భవిష్యత్తులో బియ్యం, గోధుమ వంటి ఆహారధాన్యాలకంటే పండ్లు, కూరగాయలు, చేపలు, పాలు, మాంసం, గుడ్లకు గిరాకీ పెరగగలదని పట్టిక సూచిస్తున్నది. 2030 సంవత్సరం నాటికి గోధుమ, బియ్యం గిరాకీ 30 శాతం కంటే పెరగగలదని మొత్తం ఆహారధాన్యాల గిరాకీ 50 శాతానికి ఇంచుమించుగా మాత్రమే పెరగగలదని పట్టిక సూచిస్తున్నది. అయితే బంగాళదుంపల గిరాకీ 50 శాతం, కాయగూరల గిరాకీ 120 శాతం పెరుగుతుంది. పండ్ల గిరాకీ నూరుశాతం, పాల గిరాకీ నూరుశాతంపైన, మాంసం కూడా నూరు శాతంపైన, గుడ్ల గిరాకీ 150 శాతం, చేపల గిరాకీ కూడా 100 శాతం పైగా పెరుగుతుంది. ఐ.సి.ఎ. ఆర్. తోటల పెంపకంలో పరిశోధనను పటిష్టం చేయడానికి తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికలో రూ. 213 కోట్లు కేటాయించింది. ఇది ఎనిమిద పంచవర్ష ప్రణాళికలో కేటాయించిన రూ. 104.70 కోట్ల కంటే రెట్టింపు పైన ఉన్నది. ఐ.సి.ఎ.ఆర్.పండ్లతోటల పెంపకం విభాగంలో పండ్లతోటలు, కూరగాయలు, దుంపకూరలు, అరటి, సుగంధ ద్రవ్యాలు, పుష్ప, ఔషధ సంబంధమైన మొక్కల పెంపకానికి సంబంధించిన ఏడు భారీ పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు అమలులో ఉన్నాయి. ఈ పంటలు పండించటం, వాటి నిర్వహణ, ప్రాసెసింగ్ వంటి కార్యక్రమాలను ఈ విభాగాలు అనుసంధానం చేస్తుంటాయి. వాస్తవానికి తొమ్మిదో పంచవర్ష ప్రణాళికలో తోటల పెంపకం రంగానికి రూ. 1300 కోట్లు కేటాయించారు. (పరిశోధన కార్యక్రమాల్లో కేటాయించినది గాక) ఆదివాస, కొండ ప్రాంతాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయడం, శీతల గిడ్డంగులను ఆధునీకరించడం ఆ కార్యక్రమంలో ఉన్నది.

6.2.9 జాతీయ వ్యవసాయ విధానం :

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధిని త్వరితం చేసేందుకు మౌలిక సదుపాయాలు కల్పించడం, ఉత్పత్తులకు విలువ చేర్పును ప్రోత్సహించడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, గ్రామప్రాంతాల్లో ఉపాధి కల్పించడం, వ్యవసాయ శ్రామికులు, వారి కుటుంబాలకు ఉన్నత జీవన ప్రమాణాలతో జీవించే అవకాశం కల్పించడం ద్వారా ఇంతవరకు వినియోగంలోలేని భారతీయ వ్యవసాయరంగ సామర్థ్యాన్ని వెలికితీయడం జాతీయ వ్యవసాయ విధానం లక్ష్యంగా ఉన్నది. 2000 జూలై 28న ప్రభుత్వం జాతీయ వ్యవసాయ విధానాన్ని ప్రకటించింది. రానున్న రెండు దశాబ్దాలలో ఆశిస్తున్న ఫలితాలు ఇవి -

1) వ్యవసాయ రంగంలో నాలుగు శాతానికి మించి వార్షిక పెరుగుదల రేటు సాధించాలి
2) నగరాలకు వలసలనరికట్టి, సరళీకరణ, ప్రపంచీకరణతో ఉత్పన్నమయ్యే సవాళ్ళను ఎదుర్కోవాలి.
3) భూ, జలవనరులను, జీవ వైవిధ్యాన్ని సంరక్షించుకుంటూ, వనరుల సమర్థవంతమైన వినియోగంలో అభివృద్ధి సాధించాలి
4) విస్తృత ప్రాంతంలో, రైతులందరికీ సమానంగా ఫలాలు అందే అభివృద్ధి సాధించాలి.

5) అభివృద్ధి గిరాకీ ననుసరించి జరగాలి. స్వదేశీ మార్కెట్ల అవసరాలు తీర్చాలి. ఆర్థిక సరళీకరణ ప్రపంచీకరణల వల్ల ఎదురయ్యే సవాళ్ళకు తట్టుకొని వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా ఇతోధికమైన ప్రయోజనాలు అందించాలి.

6) ఈ అభివృద్ధి సాంకేతిక పరిజ్ఞానపరంగా, పర్యావరణ పరంగా, ఆర్థిక అంశాలపరంగా నిరాఘాటంగా కొనసాగించగలిగేదిగా ఉండాలి.

6.2.10 వ్యవసాయ రంగం - ఆర్థిక సంస్కరణల ప్రభావం :

1991 - 92 నాటికి వ్యవసాయరంగం చాలా నిరుత్సాహస్థితిలో ఉండింది. ఆర్థిక సంస్కరణల ప్రభావం వలన 1996 - 97 నాటికి వ్యవసాయ రంగం ఎంతో ప్రగతిని సాధించగలిగింది. 1998 - 99 నాటికి ఆహారధాన్యాల్లో మిగులు ఏర్పడింది. 2001 - 2002లో 212 మిలియన్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరుగగా, 2002 - 2003లో దేశంలోని కొన్ని ప్రాంతాలలో కరువు దృష్ట్యా ఉత్పత్తి 182.6 మిలియన్ టన్నులుగా ఉన్నది. సరళీకృత ఆర్థిక విధానాలను అనుసరించి, వ్యవసాయరంగం కూడా ఎగుమతులలో గల నియంత్రణలు తొలగించి, వాటిని ప్రోత్సహించే వాతావరణం వైపు పయనించింది. దీనివలన ఎంతో ప్రగతిని సాధించడంతోపాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల వృద్ధికి దోహదపడింది. ఈ తరహా ఉత్పత్తులు మన ఎగుమతులలో 33 శాతం వరకు ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా మొత్తం విదేశీమారక ద్రవ్యంలో 15 నుంచి 20 శాతం వరకు సమకూరుతున్నది. వ్యవసాయ రంగంలో అనేక ఒడుదుడుకులు అటు ఆహార రంగంలోను, ఇటు వాణిజ్యరంగంలోను గమనించవచ్చు. అయితే ఇందుకు ప్రధానకారణం ఆర్థిక సంస్కరణలు మాత్రమే అని చెప్పటం సబబు కాదు. ఋతుపవనాల అనుకూలత కూడా వ్యవసాయాభివృద్ధికి ఎంతో అవసరం. వ్యవసాయ రంగంలో వివిధ ప్రాంతాల్లో అసమానతలు ఉన్నాయి. చివరికి హరిత విప్లవం ప్రభావం కూడా కేవలం పంజాబ్, ఉత్తరప్రదేశ్, హర్యానాలకు మాత్రమే పరిమితమైంది. మిగతా ప్రాంతాలలో నామమాత్రమే ప్రభావం చూపింది. హరిత విప్లవం ధనవంతులైన రైతులకు మాత్రమే అందుబాటులో ఉండటం వలన ప్రాంతీయ, వ్యక్తిగత అసమానతలు రైతుల మధ్య పెరిగిపోయాయి.

ఆర్థిక సంస్కరణల కాలంలో పాడిపరిశ్రమ రంగం ఎంతో పురోభివృద్ధిని సాధించింది. దీనిని 'శ్వేత విప్లవం' గా అభివర్ణించవచ్చు. నూనెగింజల ఉత్పత్తి కూడా పెరిగింది. వ్యవసాయరంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచి వార్షిక వ్యవసాయాభివృద్ధిరేటు 4 శాతానికి తగ్గకుండా చూడటానికి 2005 నాటికి గణనీయమైన ప్రగతిని సాధించటానికి ఉద్దేశించి "జాతీయ వ్యవసాయవిధానం 2000"ను ప్రకటించారు. ఈ విధంగా వ్యవసాయరంగంపై ఆర్థిక సంస్కరణల ప్రభావం కన్పిస్తుంది.

6.2.11 2004 - 05 వార్షిక బడ్జెట్ - వ్యవసాయాభివృద్ధి, నీటిపారుదల :

ఆర్థిక వ్యవస్థకు కొత్త జవసత్వాలు ఇవ్వటానికి రైతులకు ప్రయోజనం చేకూర్చే అనేక ప్రకటనలను ఆర్థికమంత్రి శ్రీ చిదంబరం చేశారు. ఆహారసబ్సిడీగా రూ. 25,800 కోట్లను, ఎరువు సబ్సిడీ కోసం రూ. 12,662 కోట్లను కేటాయించారు. రాబోవు మూడు సంవత్సరాలలో వ్యవసాయ రుణాలను రెట్టింపు చేయాలని కేంద్రం సంకల్పించింది. ఈ నిర్ణయాన్ని అమలుచేసే బాధ్యతను బ్యాంకులకు అప్పగించారు. సహకారరంగ బ్యాంకింగ్ వ్యవస్థను సంస్కరించుకొనేందుకు తగిన సూచనలను ఇచ్చేందుకు ఒక టాస్క్‌ఫోర్స్‌ను నెలకొల్పుతారు. 'వేగవంతమైన సాగునీటి లబ్ధిపథకం (ఎ.ఐ.బి.పి.) క్రింద పూర్తికావచ్చిన పథకాలకు ప్రాధాన్యతను ఇస్తారు. వ్యవసాయంతో ప్రత్యక్ష సంబంధం వున్న ఐదు లక్షల నీటివనరుల మరమ్మత్తు,పునరుద్ధరణకు ఒక బృహత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వము చేపట్టనుంది. గ్రామీణ మౌలిక సదుపాయ అభివృద్ధి నిధికి (ఆర్.ఐ.డి.ఎఫ్)

రూ. 8000 కోట్లను సమకూరుస్తారు. ఈ సం॥ దేశంలో ఎంపిక చేసిన అయిదు జిల్లాల్లో రూ. 100 కోట్లతో పైలట్ ప్రాజెక్టులను అమలుచేస్తారు. దేశవ్యాప్తంగా ఒక లక్ష నీటివనరులలో జాతీయ జల సంరక్షణ పథకాన్ని అమలుచేస్తారు. జాతీయ హార్టీకల్చర్ మిషన్‌ను నెలకొల్పి 2011 - 12 నాటికి తోటల ఉత్పత్తులను ప్రస్తుతం ఉన్న 1.5 కోట్ల టన్నుల నుంచి 30 కోట్ల టన్నులకు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుత పంటల సీజనులో 20 శాతం వర్షపాతం నమోదు అయిన కేంద్రాల్లో వాతావరణ భీమా పథకాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెడతారు. పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వలకు సంబంధించిన సంస్థల లాభాలపై పన్నును మొదటి ఐదేళ్ళకు పూర్తిగానూ, తర్వాత ఐదేళ్ళకు 25 శాతం మినహాయింపు ప్రకటించారు.

6.2.12 సారాంశము :

గ్రామీణ ప్రజల సాంఘిక జీవితాన్ని బాగుచేయడంలోనూ, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలోనూ వ్యవసాయక పరపతి విధానం ముఖ్యపాత్ర వహిస్తున్నది. ఆర్థికాభివృద్ధి జరగవలెనన్న అన్నిరంగాల్లో అభివృద్ధి అవసరము. కాని ఆర్థికాభివృద్ధి తొలిదశలో ద్వితీయ, తృతీయ రంగాలకన్నా వ్యవసాయరంగం ఎక్కువ ప్రాముఖ్యం వహిస్తుంది. వ్యవసాయాభివృద్ధి తొలిదశలో మూలధన సేకరణ చాలా నెమ్మదిగా జరుగుతుంది. ఈ కారణం వల్ల వ్యవసాయాభివృద్ధి కూడా కుంటుపడుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఈ సందర్భంలో వ్యవసాయ పరపతి ప్రాముఖ్యం వహిస్తుంది. వ్యవసాయదారులకు పరపతి సౌకర్యాలు కలుగజేస్తే పెట్టుబడిశక్తి పెరుగుతుంది. ఆధునిక పద్ధతులలో వ్యవసాయంచేసి ఉత్పత్తి అధికం చేసి తద్వారా తమ ఆదాయాన్ని పెంచుకోగలుగుతారు. ఉత్పత్తి కార్యాలకు లభ్యమయ్యే పరపతిని అధికం చేయాలి. పరపతి వ్యయాన్ని తగ్గించాలి. సహజంగా ప్రయివేటు పరపతి వ్యయం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి సంస్థాపరమైన ఆధారాల ద్వారా చౌకపరపతిని రైతులకు అందచేయాలి. పరపతిని అందచేయటంలో సన్నకారు రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించవలెను. పరపతితో పాటు ఇతర ఉత్పాదకాలను రైతులకు అందచేయాలి. వ్యవసాయాభివృద్ధి సాధించడం, తద్వారా త్వరితంగా ఆర్థికాభివృద్ధి సాధించటం వీలవుతుంది.

6.2.13 చదువదగిన గ్రంథాలు :

1. Ruddar Dutt &K.P.M. Sundaram : indian Economy, 2004
2. A.M. Khusro : Readings in Agricultural Development
3. S.K. Misra & V.K.Puri : Indian Economy, 2004
4. John W. Mellor : The Economics of Agricultural Development

డా॥ కోటిరెడ్డి

పాఠం - 7

భూ సంస్కరణలు
(Land Reforms in India)

7.0 లక్ష్యం :

ఈ పూర్తి పాఠాన్ని చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను పూర్తిగా అవగాహన చేసుకోవచ్చు.

- భూసంస్కరణ అంటే ఏమిటి, వాటి ధ్యేయాలు
- భూస్వామ్య విధానాలు
- భూసంస్కరణల స్వరూప స్వభావాలు
- భూసంస్కరణల అమలులోని సమస్యలు

విషయసూచిక :

7.1 ఉపోద్ఘాతము

7.2 భూస్వామ్య విధానాలు

7.3 భూ సంస్కరణల స్వరూప స్వభావాలు

7.3.1 మధ్యవర్తుల తొలగింపు

7.3.2 కౌలు సంస్కరణలు

7.3.3 కమతాలపై గరిష్ఠ పరిమితి విధింపు

7.4 కమతాల సమీకరణ ఆవశ్యకత

7.5 సహకార వ్యవసాయం

7.6 సమిష్టి వ్యవసాయం

7.7 ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణల అమలు

7.8 భూసంస్కరణల శాసనాలను అమలు జరిపే సమస్య

7.8.1 భూ సంస్కరణల శాసనాల అమలుకు అనువైన పరిస్థితులు

7.9 సారాంశం

7.10 నమూనా ప్రశ్నలు

7.11 చదువదగిన గ్రంథాలు

7.1 ఉపోద్ఘాతము :

ఆర్థిక ప్రగతిని సాధించడానికి వ్యవసాయ ఉత్పాదకత, ఉత్పాదితము అధికం చేయడం ఎంతో అవసరము. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయరంగాన్ని పునర్వ్యవస్థీకరించడంలో ప్రభుత్వాలు భూసంస్కరణలకు ప్రాధాన్యమిస్తున్నాయి.

7.2 భూస్వామ్య విధానాలు :

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి జమిందారీ పద్ధతి, మహల్వారీ పద్ధతి, రైత్వారీ పద్ధతి అనే మూడు పద్ధతులు ఉండేవి.

7.3 భూ సంస్కరణల స్వరూప స్వభావాలు :

వ్యవసాయాభివృద్ధిని సాధించడానికి తలపెట్టే భూసంస్కరణలు అనేక స్వరూపాలను ధరిస్తాయి. వాటిని మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

ఎ) మధ్యవర్తుల తొలగింపు

బి) కౌలు సంస్కరణలు

సి) కమతాలపై గరిష్ట పరిమాణ నిర్మాణం

7.4 కమతాల సమీకరణ ఆవశ్యకత :

చిన్న కమతాల వలన ఏర్పడే సమస్యలను తొలగించడానికి కమతాల సమీకరణ ఎంతో అవసరము.

7.5 సహకార వ్యవసాయం :

భూమిపై యాజమాన్య హక్కులు వ్యక్తిగతంగానే ఉంచుకొని, సభ్యులందరి కమతాలను సమీకరించి ఉమ్మడి నిర్వహణ క్రింద సహకార సూత్రాలను అన్వయించి చేసే వ్యవసాయము.

7.6 సమిష్టి వ్యవసాయం :

భూమిపై యాజమాన్యం సమాజపరంగా ఉండి, నిర్వహణ సమిష్టిగా ఉండి చేసే వ్యవసాయమే సమిష్టి వ్యవసాయము.

7.7 ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణల అమలు :

కేంద్ర ప్రభుత్వ భూసంస్కరణల చట్టం సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో 1975 జనవరి 1 నుంచి భూసంస్కరణల చట్టాన్ని రూపొందించారు.

7.8 భూసంస్కరణల శాసనాలను అమలు జరిపే సమస్య :

భూసంస్కరణలకు సంబంధించిన శాసనాలను అమలు జరపడంలో భారతదేశం విజయం సాధించలేకపోయింది. వీటిని సక్రమంగా అమలు జరపాలంటే అనువైన పరిస్థితులు కల్పించాలి.

7.9 ముగింపు :

మిగులు భూమిని పేదరైతులకు, భూమిలేనివారికి పంపిణీ చేసి దానిని వ్యవసాయోగ్యంగా మార్చుకోవడానికి వారికి రుణసదుపాయం కల్పించాలి.

7.1 ఉపోద్ఘాతము :

ఆర్థిక ప్రగతిని సాధించడానికి వ్యవసాయ ఉత్పాదకత, ఉత్పాదితము అధికం చేయడం ఎంతో అవసరము. ఇందునిమిత్తమై తలపెట్టే వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలలో భూసంస్కరణలు కీలకస్థానం వహిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయ రంగాన్ని పునర్వ్యవస్థీకరించడంలో ప్రభుత్వాలు భూసంస్కరణలకు ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇస్తున్నాయి. అధిక ఉత్పత్తి, అధిక సామర్థ్యమున్న వ్యవసాయరంగం ఏర్పడవలెనంటే వ్యవసాయము సాంకేతికంగా అభివృద్ధి చెందవలెను. సాంకేతికపరమైన మార్పులు తేవడానికి వ్యవసాయ రంగంలో వ్యవస్థాపూర్వకమైన మార్పులు అవసరమవుతాయి. వ్యవస్థాపూర్వకమైన మార్పులలో భూసంస్కరణలు ప్రధానపాత్ర వహిస్తాయి. భూసంస్కరణ జరగనిదే వ్యవసాయము సాంకేతికంగా అభివృద్ధి చెందడం కష్టమవుతుంది. ఈ విషయాన్ని గుర్తించే వర్థమాన దేశాలలో వ్యవస్థాపూర్వకమైన మార్పులు తీసుకొని రావడానికి భూసంస్కరణలను రూపొందించడం జరుగుతున్నది. లాభసాటిగా లేని కమతాలు, భూ యాజమాన్యపు పంపిణీలో అసమానతలు, భూమి కేంద్రీకరణ వల్ల నిరుపయోగంగా ఉండే భూములు, కమతాల విభజన, విఘటన, హెచ్చు కౌలు పరిమాణం, కౌలుదారులకు భద్రత లేకపోవడం, వివిధ రకాలైన కౌలుదారీ విధానాలు, గ్రామీణ రుణసమస్య మొదలైన లక్షణాలు ఉన్న వ్యవస్థలలో భూసంస్కరణలు ప్రధానపాత్ర వహిస్తున్నాయి.

7.1.1. భూ సంస్కరణ - నిర్వచనాలు :

'భూసంస్కరణ' అనే పదాన్ని అనేక విధాలుగా నిర్వచించినారు. భూసంస్కరణను రాజకీయ దృష్టితోను, సాంఘిక సమానత్వ దృష్టితోను, ఆర్థికాభివృద్ధి దృష్టితోను చూడవచ్చును. దీనిని అనేక కోణాల నుంచి పరిశీలించడంలో వివిధ రకాలుగా నిర్వచించడం జరిగింది. భూసంస్కరణ అనే పదాన్ని పరిమిత భావంతో కూడుకొన్న మరియు విశాల భావంతో కూడుకొన్న అనే రెండు విధాలుగా నిర్వచించవచ్చు.

పరిమిత భావము :

కౌలుదార్ల, సన్నకారురైతుల, వ్యవసాయ కూలీల మేలును దృష్టిలో ఉంచుకొని భూస్థితిని పునఃపంపకం చేయడాన్నే 'భూసంస్కరణ' అంటారు. ఇది పారంపర్యంగా తెలిసినటువంటి, అందరూ ఒప్పుకొన్నటువంటి అభిప్రాయము. డొరీన్ వారినల్ అభిప్రాయంలో ఈ నిర్వచనం పరిమితమైనప్పటికీ, వాస్తవానికి గతంలోగాని, ప్రస్తుతంగాని భూసంస్కరణ అంటే పై అర్థమే ఉంది.

విశాల భావము :

పరిమిత భావంతోగాక, విశాలభావంతో కూడుకొన్నట్లుగా భూసంస్కరణలను ఐక్యరాజ్యసమితి (U.N.O) వారు ఈవిధంగా నిర్వచించారు. "భూమి పునఃపంపకమేగాక, కౌలు పరిమాణ నిర్ణయం, కౌలుదారులకు భద్రత, వ్యవసాయ కూలీల వేతన నిర్ణయం, వ్యవసాయ పరపతి మార్గాల అభివృద్ధి, భూమి పన్నుల విధానాల మెరుగుదల, సహకార సంస్థల అభివృద్ధి, వ్యవసాయ విద్యాబోధన, వ్యవసాయంలో సాంకేతిక మార్పులు మొదలైనవన్నీ భూసంస్కరణలకు సంబంధించినవేనని" వారి అభిప్రాయం. ఈ అభిప్రాయంలో అనేకమంది అర్థశాస్త్రజ్ఞులు ఏకీభవిస్తారు. స్పెయిన్ మరియు ఇటలీ దేశాలలో కూడా భూసంస్కరణలు అంటే భూమికి సంబంధించిన ఆర్థికమైన మార్పులేగాక ఆర్థికేతరమైన మార్పులు కూడా అని అర్థము.

విశాలదృష్టితో భూసంస్కరణను నిర్వచించడంలోను, పరిమిత భావంలో నిర్వచిండంలోను తేడా లేదు. పరిమిత భావము భూసంస్కరణ తక్షణ, కీలకమైన కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తుంది. విశాలభావము భూసంస్కరణ ఆశయాలను, ఆ ఆశయాలను సాధించడానికి కావలసిన చర్యల గురించి వివరిస్తుంది. "భూ సంస్కరణ" అనేది కేవలం భూమి పునఃపంపకం చేయడంలో

కీలకమైనప్పటికీ, భూస్వామ్య పద్ధతులలో మార్పులు తెచ్చే చర్యలకు మాత్రం పరిమితం అయి ఉండరాదు. భూసంస్కరణ ముఖ్య ఉద్దేశ్యము సాంఘిక న్యాయంతోపాటు అధికోత్పత్తి సాధించడం కాబట్టి, భూసంస్కరణలతోపాటు వ్యవసాయాదారులకు ఇతర అనేక సదుపాయాలు చేకూర్చనట్లయితే భూసంస్కరణలు ఆశించిన ఫలితాలను ఇవ్వవు. నీటిపారుదల సౌకర్యాలు, నవీన ఉత్పాదకాలు, పరిమిత సౌకర్యాలు మొదలైనవన్నీ భూసంస్కరణలతో జత అయినప్పుడే ఆశించిన ఫలితాలు సాధించడానికి వీలవుతుంది.

7.1.2 భూ సంస్కరణ ధ్యేయాలు (Objectives) :

1. బ్రిటిష్ కాలం నుండి సంక్రమించిన వ్యవసాయ రంగంలోనున్న వ్యవస్థాపూర్వక లోపములను పరిష్కరించి వ్యవసాయాభివృద్ధికి ఆటంకములను తొలగించుట
2. వ్యవసాయ ఆదాయాన్ని న్యాయమైన రీతిగా పంపిణీ చేయడం
3. భూమి వాస్తవంగా వ్యవసాయం చేయువారికి భూయాజమాన్య హక్కులు కల్పించుట, భూపునఃపంపిణీ కార్యక్రమాలు చేపట్టి తద్వారా వ్యవసాయరంగంలో అనేకులకు స్థిరంగా ఉద్యోగం కలగజేయుట
4. వ్యవసాయక దేశాలలో భూస్థితి, వ్యక్తులకు ఆర్థిక విలువను, సంఘంలో గౌరవాన్ని చేకూర్చుతుంది.

7.2 భూస్వామ్య విధానాలు :

భూమి యజమానులకు, కౌలుదార్లకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేసేదే భూస్వామ్య పద్ధతులు. ప్రభుత్వానికి, భూమి దున్నేవానికి మధ్య ఉండే సంబంధం ప్రత్యక్షమైనదా లేక పరోక్షమైనదా అనే విషయాలపై భూస్వామ్య వ్యవస్థను వర్గీకరించవచ్చు. స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో మూడు రకాలైన పద్ధతులుండేవి.

7.2.1 జమిందారీ పద్ధతి :

1793లో కారన్‌వాలీస్ ఈ పద్ధతిని మొదటిగా పశ్చిమబెంగాల్‌లో ప్రవేశపెట్టారు. దీనిని "శాశ్వత సెటిల్‌మెంట్" అని కూడా అంటారు. దీనివల్ల రైతుల నుంచి శిస్తు వసూలు చేసే అధికారాన్ని కొందరు వ్యక్తులకు శాశ్వతంగా వంశపారంపర్య హక్కుగా ఇవ్వడం జరిగింది. ప్రభుత్వానికి భూమిశిస్తు ఒడిదుడుకులు లేకుండా వస్తుందని, జమిందారులు ప్రభుత్వానికి విశ్వాసపాత్రులుగా ఉంటారని, శాశ్వత అధికారం లభించింది కాబట్టి వ్యవసాయాభివృద్ధి జరుగుతుందని ఈ పద్ధతిని ప్రవేశపెట్టడం జరిగింది. పన్ను వసూలు చేసినందుకు వీరికి 10/11 వంతు కమీషన్ నిర్ణయించారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఈ పద్ధతి పశ్చిమబెంగాల్, బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మరియు మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అమలులో ఉన్నది.

లోపాలు :

జమిందారులు ప్రభుత్వానికి చెల్లించే భూమిశిస్తులో మార్పు లేకున్నప్పటికీ, రైతుల నుంచి వసూలు చేసే భాటకం మాత్రం విపరీతంగా పెరుగుతూ ఉండేది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ భాటకం ఖచ్చితంగా చెల్లించవలసిన అవసరం ఏర్పడింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 1893-94లో జమిందారులు రైతుల నుంచి వసూలు చేసిన భాటకం మొత్తం రూ. 12.24 కోట్లు కాగా ప్రభుత్వానికి చెల్లించినది రూ. 5.93 కోట్లు మాత్రమే. ఈ రాష్ట్రంలో జమిందారులు లాభం 1893-94 మరియు 1944-45 మధ్యకాలంలో రూ. 6.31 కోట్ల నుండి 10.71 కోట్ల రూపాయలకు పెరిగింది. ఇవికాక వెట్టిచాకిరీ మొదలైన వివిధ మార్గాల ద్వారా గ్రామీణ ప్రజలను దోపిడీ చేయటం జరిగింది. రాజస్థాన్ రాష్ట్రంలో 175 రకాల

పన్నులను విధించడం ద్వారా అక్రమ వసూళ్ళు చేస్తూ, పన్ను చెల్లించని వారినుండి భూములను స్వాధీనపరచుకొనేవారు. 1949-50 సం॥లో వ్యవసాయ ఆదాయం మొత్తం రూ. 4,800 కోట్లుకాగా, దీనిలో రూ. 1200 కోట్లు మధ్యవర్తుల వాటాగా వెళ్ళిందని భవానీసేన్ అభిప్రాయపడ్డారు. అంతేగాక, అనుపస్థితి భూస్వాముల సంఖ్య విపరీతంగా పెరిగింది. 1921లో అనుపస్థితి భూస్వాములు 3.7 మిలియన్లు ఉండగా, 1931లో 4.1 మిలియన్లకు, 1951లో 5.3 మిలియన్లకు పెరిగింది. ఈ వ్యవస్థ ద్వారా మధ్యవర్తుల సంఖ్య పెరగడమేకాక, భూమి ఆదాయాల కేంద్రీకరణ జరిగి గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ రంగంలో స్తబ్దత ఏర్పడింది.

7.2.2. మహల్వారీ పద్ధతి :

ఈ పద్ధతిని విలియం బెంటింక్ ఆగ్రా మరియు ఔధ్ ప్రాంతంలో ప్రవేశపెట్టారు. తర్వాత ఈ పద్ధతి మధ్యప్రదేశ్ మరియు పంజాబ్‌కు వ్యాపించింది. ముస్లిం సాంప్రదాయానికి అనుగుణంగా ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థలో గ్రామంలోని భూమి మొత్తాన్ని గ్రామస్థుల ఆస్తిగా పరిగణించి గ్రామం అంతటికి శిస్తు నిర్ణయించడం జరిగేది. ఈ శిస్తును 30 నుంచి 40 సంవత్సరాల కొకసారి నిర్ణయించడం జరిగేది. గ్రామస్థులంతా కలిసి పన్ను వసూలుచేసే బాధ్యతను ఒక వ్యక్తికి అప్పగించడం జరుగుతుంది. పన్నులు వసూలుచేసే వారికి 5 శాతం కమీషన్ ఉంటుంది. అయితే ఈ పన్ను వసూలు చేసే వ్యక్తి కూడా మధ్యవర్తిగా మారడానికి అవకాశాలు ఎక్కువగా ఉండేవి.

7.2.3 రైత్వారీ పద్ధతి :

1792లో థామస్ మన్రో ఈ పద్ధతిని మొట్టమొదటిసారిగా మద్రాస్ రాష్ట్రంలో ప్రవేశపెట్టారు. క్రమక్రమంగా మహారాష్ట్ర, తూర్పు పంజాబ్ మరియు అస్సాం రాష్ట్రాలకు వ్యాపించింది. ఇది హిందూ సాంప్రదాయాలకు అనుగుణంగా వున్న వ్యవస్థ. ఈ పద్ధతి ద్వారా ప్రభుత్వానికి, రైతులకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. భూమిని సాగుచేసే రైతు ప్రత్యక్షంగా ప్రభుత్వానికి శిస్తు చెల్లించడం జరుగుతుంది. భూసారం, ఎకరా దిగుబడి, ఉత్పత్తి ఖర్చు మొదలైన వాటిని దృష్టిలో ఉంచుకొని 20 లేదా 30 సం॥ల కొకసారి శిస్తు నిర్ణయించడం జరుగుతుంది. అతివృష్టి, అనావృష్టి సమయాల్లో శిస్తులో తగ్గుదల లేదా మాఫీని ప్రభుత్వం పరిశీలించేది. ఈ పద్ధతిలో మధ్యవర్తులకు అవకాశాలు లేవు. కాని భూముల కేంద్రీకరణ జరగడంవల్లనూ, భూములు సాగుబడి చేసేవారు లేకపోవడం వల్ల కౌలుదార్లు ఏర్పడడం జరిగింది. దీనివల్ల జమిందారీ పద్ధతిలోని మధ్యవర్తుల వల్ల ఏర్పడే లోపాలు, సమస్యలు ఈ వ్యవస్థలో కూడా ఏర్పడే అవకాశం ఉంది. భూమిపై ఆధారపడి జీవితాన్ని పోషించుకొనే వ్యక్తులకు, భూమిని సొంతంగా కలిగి ఉండే సదుపాయం చేసి గ్రామీణ ప్రాంతాలలో ప్రజాస్వామ్యానికి స్థిరమైన పునాది వేయడం.

7.3 భారతదేశంలో భూసంస్కరణల స్వరూప స్వభావాలు :

భూస్వామ్య పద్ధతులు వివిధ దేశాలలో వివిధ రకాలుగా ఉంటాయి. ఆయా దేశపరిస్థితులననుసరించి ఏది ఉత్తమమైన పద్ధతి అని నిర్ణయించుకోవలసి ఉంటుంది. భూస్వామ్య పద్ధతులు సక్రమంగా ఉన్నప్పుడే వ్యవసాయాన్ని సమర్థవంతంగా కొనసాగించడానికి సరి అయిన వాతావరణం ఏర్పడుతుంది. భూస్వామ్య పద్ధతులలోని లోపాలు తొలగించి వ్యవసాయాభివృద్ధి సాధించడానికి తలపెట్టే భూసంస్కరణలు అనేక స్వరూపాలను ధరిస్తాయి. వాటిని ముఖ్యంగా మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

1. మధ్యవర్తుల తొలగింపు
2. కౌలు సంస్కరణలు
3. కమతాలపై గరిష్ఠ పరిమాణం తొలగింపు

7.3.1 మధ్యవర్తుల తొలగింపు (Abolition of Intermediaries) :

ప్రభుత్వము, వ్యవసాయాదారుల మధ్య, మధ్యవర్తులు ఉండటం వ్యవసాయ రంగంలో ఒక లోపంగా గుర్తించారు. మధ్యవర్తులు ఉండే పరిస్థితులలో భూమి హక్కుకు సంబంధించిన రికార్డ్‌లు సరిగా ఉండవు. ఈ పరిస్థితులలో వ్యవసాయాదారునికి పరపతిని సంపాదించడం కష్టమతుంది. సమాజానికి చెందిన భూములను వ్యక్తిగత భూములుగా మార్చడం జరుగుతుంది. కాబట్టి విదేశీపాలన నుంచి విముక్తి చెందిన తరువాత భారతదేశంతో సహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో తీసుకొన్న భూసంస్కరణలలో మధ్యవర్తుల తొలగింపు ప్రథమచర్య. భారతదేశంలో 1947 తర్వాత మధ్యవర్తులను తొలగించుటకు రాష్ట్ర ప్రభుత్వాలు శాసనాలు రూపొందించాయి. 1960 నాటికి దేశమంతటా మధ్యవర్తులు తొలగింపబడ్డారు. 173 మిలియన్ ఎకరాల భూమిని మధ్యవర్తుల నుండి స్వాధీనపర్చుకొన్నందువలన 2 కోట్ల మంది కౌలుదారులకు ప్రభుత్వంతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడ్డాయి.

7.3.2 కౌలు సంస్కరణలు :

జమిందారీ, రైత్వారి ప్రాంతాలలో కౌలుదారీ విధానం చాలా సర్వసామాన్యమైనది. జమిందార్లు, అనుపస్థితి భూస్వాములు స్వంతంగా వ్యవసాయం చేయలేక తమ భూమిలో కొంతభాగంకాని, పూర్తిగా కాని ఇతరులకు అంటే సన్నకారురైతులకు, పాలంలేని శ్రామికులకు సేద్యం చేయడానికి ఇచ్చే పద్ధతిని 'కౌలుదారీ వ్యవసాయం' అంటారు. కౌలుదారీ వ్యవసాయాన్ని మూడు తరగతులుగా విభజించవచ్చు.

1. జిరాయితీ హక్కులున్న కౌలుదార్లు
2. ఏ హక్కులు లేని కౌలుదార్లు
3. ఉప కౌలుదార్లు

భారతదేశంలోని ఎక్కువమంది కౌలుదార్లు రెండు లేదా మూడో వర్గానికి చెందినవారు. నేషనల్ శాంపిల్ సర్వే వారి అంచనాల ప్రకారం కౌలుకు తీసుకొన్న మొత్తం భూమి 1953 - 54లో మొత్తం భూమిలో 20.33 శాతం ఉండగా, 1961 - 62లో 10.69 శాతానికి, 1971 - 77లో 10.57 శాతానికి తగ్గింది. వీటిలో శాశ్వత కౌలువిధానం క్రింద వున్న భూమిని చేర్చలేదు. అందుచేత మొత్తం కౌలుదార్ల క్రింద వున్న భూమి, కౌలుదార్ల సంఖ్య ఖచ్చితంగా తెలియడం లేదు. 1951 జనాభా లెక్కల ప్రకారం కౌలుదారుల సంఖ్య వ్యవసాయాదారులలో 12.3 శాతం ఉండగా, 1961 లెక్కల ప్రకారం ఇది 23 శాతం (8% Pure Tenants + 15% Mixed Tenants) ఉంది. దీనినిబట్టి కౌలుదారుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది, వీరిని ఉద్ధరించడానికి ఉద్దేశించినవే కౌలుదారీ చట్టాలు. కౌలుదారీ సంస్కరణలను మూడు విధాలుగా చేసి పరిశీలించవచ్చు.

ఎ. కౌలు పరిమాణము

బి. కౌలు భద్రత

సి. కౌలుదారులకు యాజమాన్య హక్కులు

7.3.2.1 కౌలు పరిమాణము :

జనసాంద్రత అధికంగా ఉంటూ, భూమి కీలకంగా ఉన్న భారతదేశం వంటి దేశాలలో భాటకస్థాయి, పరిపూర్ణ పోటీభాటకం కన్నా అధికంగా ఉంటూ, ఏకస్వామ్య భాటకం స్వరూపాన్ని దాల్చి ఉత్పాదితంలో ఎక్కువ వాటా సాధారణంగా అనుపస్థితమైన

భూస్వామికి సంక్రమించడం వల్ల వ్యవసాయాదారుల పెట్టుబడిశక్తిని, ఆసక్తిని కుంగదీస్తున్నది. మన దేశంలో 1930-40 దశాబ్దాలలో కౌలుపరిమాణం మొత్తం ఉత్పత్తిలో 40 నుండి 50 శాతం ఉండేది. ఆచార్య బ్రిజ్‌నారాయణ్ అంచనాల ప్రకారం పంజాబ్‌లో భూస్వాములు బెలూయిపద్ధతి క్రింద 80 శాతం పంటను భాటక రూపంలో తీసుకొనేవారు. దీనిని దృష్టిలో ఉంచుకొని మొత్తం ఉత్పత్తి 1/4 లేదా 1/5 భాగం మాత్రమే కౌలు పరిమాణం ఉండాలని మొదటి పంచవర్ష ప్రణాళిక సూచించింది. దీనికనుగుణంగా వివిధ రాష్ట్రాలలో వివిధ రకాలుగా కౌలుపరిమాణం నిర్ణయిస్తూ శాసనాలను జారీచేశారు. అస్సాం, కర్ణాటక, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలలో కౌలు పరిమాణం మొత్తం స్థూల ఉత్పత్తిలో 1/5 నుండి 1/4 శాతంగాను, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లో 1/6 నుంచి 1/4 శాతం, కేరళ రాష్ట్రంలో 1/4 నుండి 1/2 శాతం, పంజాబ్, హర్యానా, జమ్ము అండ్ కాశ్మీర్‌లో 1/3 శాతం, తమిళనాడులో 33.3 నుంచి 40 శాతంగాను, ఆంధ్ర ప్రాంతంలో 25 నుంచి 30 శాతంగాను, తెలంగాణా ప్రాంతంలో 20 నుండి 25 శాతంగాను నిర్ణయిస్తూ శాసనాలు జారీచేశారు. కౌలును వస్తురూపంలో కాకుండా, రొక్కం రూపంలో నిర్ణయించాలనే సూచన ఒకటి ఉన్నది. మనదేశంలో హెచ్చుగా వస్తురూపంలో కౌళ్ళ వసూలు జరుగుతున్నాయి. ఇది మారడం గ్రామీణ వ్యవస్థకు చాలా మంచిది.

మనదేశంలో భాటకం భూసారం అనే అంశంలోనే నిర్ణయించడం జరగదు. ఇక్కడ భాటకంలో ఏకస్వామ్య అంశం కూడా చేరి ఉన్నది. భూమి కొరతగా ఉండటంతో వ్యవసాయ భూమికి డిమాండ్ ఎక్కువగా ఉన్నందువలన భాటకం నిర్ణయించడంలో భూస్వామి ఎక్కువ శక్తివంతుడుగా ఉన్నాడు. దీని మూలంగా భాటకం రేటు అధికంగా ఉన్నది. సంస్కరణల గురించి తెలిసినప్పటికి కౌలుదారులకు కలిగిన మేలు మాత్రం శూన్యం. చట్టరీత్యా నిర్ణయించిన కౌలు ఆంధ్రప్రాంతంలోను, జమ్మూ కాశ్మీరు, తమిళనాడు, పంజాబ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ఎక్కువగా ఉన్నది. దానిని ప్రణాళికలలో సూచించిన మేరకు తగ్గించవలసిన అవసరం ఉన్నది. దేశానికంతటికి అనువైన భాటకం రేటు నిర్ణయించడం కష్టం. భూసారము, నీటిపారుదల సౌకర్యాలు, ఉత్పత్తి వ్యయాలు, పంటల తీరు మొదలైన వాటిని దృష్టిలో ఉంచుకొని భాటకం రేటు నిర్ణయించవలెను. అలా చేసినప్పుడే న్యాయమైన భాటకం నిర్ణయించినట్లవుతుంది.

7.3.2.2 కౌలు భద్రత :

దీర్ఘకాలిక పెట్టుబడులు ప్రోత్సహించడానికి, పరపతి సౌకర్యాలు పొందటానికి కౌలుభద్రత ఆవశ్యకము. కౌలుదారునకు చట్టరీత్యా జిరాయితీ హక్కులు కలిగించి, సహేతుకమైన ఒక దీర్ఘకాలము - సుమారు 5 లేక 6 సం॥రాలలో - కౌలుదారుని భూమి నుంచి తొలగించబడకుండా ఉండే ఏర్పాటును కౌలుభద్రత అనవచ్చు. రక్షణ కౌలుదారీ చట్టాలలో శాశ్వత భద్రతతోపాటు, కౌలుదారు భూయజమాని కావడానికి తగిన సదుపాయాలు చేయడం జరిగింది. రక్షణ కౌలుదారీ చట్టాలు కౌలుదారీ సమస్యలు తీవ్రంగా ఉన్న పరిస్థితులలో అవసరమవుతాయి. కౌలుదారుకు సాంఘిక న్యాయం చేకూరవలెనంటే, వ్యవసాయరంగంలో అధికోత్పత్తి సాధించవలెనంటే కౌలుభద్రత కల్గించవలెను. కౌలుదారులను వారి భూముల నుంచి వెళ్ళగొట్టకుండా నిరోధిస్తూ, భూస్వాములు వారి భూములను స్వాధీనపరచుకోవడానికి హక్కు ఇవ్వకూడదని మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలు నిర్దేశించడం జరిగింది. దీనికనుగుణంగా వివిధ రాష్ట్రాలలో కేంద్రపాలిత ప్రాంతాలలో చట్టాలు తీసుకువచ్చారు. వివిధ రాష్ట్రాలలో కౌలుదార్ల రక్షణ కోసం చట్టబద్ధమైన నిర్ణయాలు తీసుకొన్నప్పటికి అన్ని రాష్ట్రాలలో ఇవి ఒక విధంగా లేవు. ప్రధానంగా వివిధ రాష్ట్రాలలో మూడు రకాలుగా శాసనాలను రూపొందించడం జరిగింది.

1. ఉత్తరప్రదేశ్, ఢిల్లీలలో భూస్వాములకు స్వంతసేద్యం పేరు మీద భూమిని తిరిగి తీసుకోవడానికి హక్కు లేకుండా కౌలుదారులకు సంపూర్ణమైన (శాశ్వతంగా, వంశపారంపర్య హక్కుగా) కౌలు రక్షణ ఇవ్వటం జరిగింది
2. భూస్వాములు స్వంత సేద్యం కోసం కౌలుదారుల నుంచి భూమిని తీసుకోవచ్చు. కాని తప్పనిసరిగా కొంతభూమిని కౌలుదారులకు వదలిపెట్టాలని నిర్దేశిస్తూ అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, ఒరిస్సా, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో చట్టాలు ఉన్నాయి.

3. పశ్చిమబెంగాల్, జమ్ము మరియు కాశ్మీర్, మణిపూర్, త్రిపురలలో యజమాని స్వంత సేద్యానికి తీసుకొనే భూమికి ఒక గరిష్ఠ పరిమితి నిర్ణయించడం జరిగింది.

భాటకం సరిగా చెల్లించనప్పుడు, భూసారాన్ని నష్టపరిచే ఏ చర్య తీసుకొన్నా, ఇతరులకు మళ్ళీ కౌలుకు ఇచ్చినప్పుడు, వ్యవసాయేతర అవసరాలకు భూమిని ఉపయోగిస్తే కౌలుదారుని వెళ్ళగొట్టడానికి హక్కు భూస్వాములకు ఇవే చట్టాలలో కొన్ని నియమ నిబంధనలను ఏర్పాటు చేయడం జరిగింది.

7.3.2.3 కౌలుదారునకు యాజమాన్య హక్కులు :

భారతదేశంలో గత మూడు దశాబ్దాల నుంచి కౌలుదారులకు యాజమాన్య హక్కులు కలగచేయడానికి కృషి జరుగుతూ ఉంది. భూసంస్కరణల ధ్యేయాలలో యాజమాన్య హక్కులు అతి ముఖ్యమైనవి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత జపాన్ దేశంలో కౌలుదారులకు యాజమాన్య హక్కులు కల్పించడం జరిగింది. కౌలుదారులు భూమి ఖరీదును వాయిదాల మేరకు చెల్లించేటట్లు ప్రభుత్వం ఏర్పాటు చేయడంవల్ల కౌలుదారులలో ఆత్మవిశ్వాసం, శ్రద్ధ, ప్రోత్సాహం పెరిగి ఎకరాఫలసాయం విపరీతంగా అభివృద్ధి చెందింది. కౌలుదారులు తాము సేద్యం చేస్తున్న భూములకు యాజమానులైన పక్షంలో వ్యవసాయరంగం త్వరితంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందని జపాన్ అనుభవం ద్వారా తెలుసుకోవచ్చు. భూస్వాములు స్వంత వ్యవసాయం కోసం భూమిని తీసుకొనే వీలులేని భూముల యాజమాన్యం పొందే హక్కును కౌలుదారులకు ఇవ్వాలని ప్రణాళికా సంఘం వారు సూచించడం జరిగింది. కౌలుదారులు తమ కౌలు భూములను కొనే అవకాశం వివిధ రాష్ట్రాలలో వివిధ రకాలుగా ఉన్నది. 'భూకౌలుదార్లు భూమి కొనే హక్కును ఐచ్ఛికంగా ఉంచక వారు విధిగా కొనేటట్లు చేయాలని' మూడో పంచవర్ష ప్రణాళిక సూచించింది. భూస్వాములకు చెల్లించవలసిన నష్టపరిహారం కౌలుదారులు సులభమయిన వాయిదాలలో చెల్లించేటట్లు ఏర్పాటు చేయాలని, ఆ వాయిదాలు మొత్తం ఉత్పత్తిలో నాలుగవ భాగానికి మించకూడదని, నష్టపరిహార భారం పూర్తిగా కౌలుదారుడే భరించాలని, ఆ భారం ప్రభుత్వంపై ఉండకూడదని ప్రణాళికా సంఘం సూచించింది. కౌలుదారులు చెల్లించవలసిన నష్టపరిహారం వివిధ రాష్ట్రాలలో వివిధ రకాలుగా నిర్ణయించాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, అస్సాం రాష్ట్రాలలో భూమిశిస్తుకు కొన్నిరెట్లుగాను, ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతాలలో), మైసూరు, కేరళ రాష్ట్రాలలో భాటకానికి కొన్ని రెట్లుగాను, ఒరిస్సా, పంజాబ్ రాష్ట్రాలలో భూమి మార్కెట్ విలువను ఆధారంగా చేసుకొని, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో నికర ఆదాయానికి కొన్ని రెట్లుగాను నిర్ణయించడం జరిగింది.

భూమిని కొనుగోలు చేయడానికి ఆర్థిక స్థోమత ఉన్న కౌలుదారులు చాలా తక్కువ. కావున వారి తరపున ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించి వారికి యాజమాన్య హక్కులు కల్పించి తిరిగి వాయిదాల రూపంలో వసూలు చేసుకోవాలి. ప్రభుత్వం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహాయపడకపోతే కౌలుదారులు భూస్వాముల నుంచి ఎదురయ్యే ఒత్తిడి వలన ఎక్కువ నష్టపరిహారాన్ని చెల్లించవలసిరావచ్చు. ప్రభుత్వం జోక్యం ద్వారా కౌలుదారులకు యాజమాన్య హక్కులు కల్పించినట్లయితే వారు ఎంతో ఉత్సాహంతో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనగలరు. పశ్చిమబెంగాల్‌లో 'ఆపరేషన్ బార్గా' క్రింద 14 లక్షల మంది (Share Croppers) ను గుర్తించారు. 24 లక్షల మంది కౌలుదారులు యాజమాన్య హక్కులు కోరుతూ చేసుకున్న ధరఖాస్తులను కేరళ ప్రభుత్వం అనుమతించింది. వివిధ రాష్ట్రాలలో కౌలుదారులకు యాజమాన్య హక్కులు సంబంధించి చట్టాలు తీసుకువచ్చినందువలన 6.32 మిలియన్ల హెక్టార్ల భూమిలో 12.42 మిలియన్ కౌలుదారులకు యాజమాన్య హక్కు కల్పించడమైనది.

7.3.3. కమతాలపై గరిష్ఠ పరిమితి విధింపు :

ఎక్కువ పరిమాణం గల కమతాలు సాంఘిక న్యాయాన్ని చేకూర్చడానికి ప్రతిబంధకాలేగాక, వాటి మీద శ్రామిక సాంద్రత తక్కువగా ఉండటంవల్ల, ఉత్పాదకత ఎక్కువ జేయడానికి దోహదం చేయవు. ఇటువంటి కమతాలపై గరిష్ట పరిమితి నిర్ణయించడం

అవసరము. గరిష్ఠ పరిమాణం నిర్ణయించినప్పుడు, ఆ పరిణామాన్ని మించి ఉన్న భూములను మిగులు భూములుగా పరిగణించడం జరుగుతుంది. ఆ మిగులు భూములను కౌలుదారులకు, సన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు పంచిపెట్టడం ద్వారా భూమిలేని వారికి భూమి చేకూర్చడం జరుగుతుంది. దీని ఫలితంగా భూమి యాజమాన్యంలో కేంద్రీకరణ ఆరికట్టడం జరిగి సాంఘిక, ఆర్థిక న్యాయం చేకూరుతుంది. కుటుంబంలోని జనసంఖ్య, భూసారము, నీటిపారుదల సౌకర్యాలు, ఎకరా ఫలసాయం మున్నగునవి వివిధ ప్రాంతాలలో వేరువేరుగా ఉంటాయి. భూమి నుంచి ఆదాయాన్ని ఆధారంగా తీసుకొని, ఆ ఆధారంతో కమతాల పరిమాణం నిర్ణయించే పద్ధతి సక్రమమైన పద్ధతిగా పరిగణించడం జరుగుతుంది. వ్యవసాయ కుటుంబానికి ఎంత ఆదాయం అవసరమవుతుందని ప్రభుత్వం నిర్ణయించి ఆ మొత్తాన్ని గడించడానికి ఒక్కొక్క ప్రాంతంలో వ్యవసాయ కుటుంబానికి కమతం పరిమాణం ఎంత ఉండవలెనని నిర్ణయించవలసి ఉంటుంది.

1972లో న్యూఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశం కుటుంబాన్ని ప్రాతిపదికగా చేసుకొని కమతాలపై గరిష్ఠ పరిమితికి సూచనలు చేసింది. ఈ సమావేశంలో భూసంస్కరణలో మార్పును గురించి అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రసంగంలో మన రాజకీయ విధానం సంరక్షింపబడాలంటే భూసంస్కరణలనే చాలా కఠినతరమైన పరీక్షలో నెగ్గవలసి ఉంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఈ క్రింది నిర్ణయాలను తీసుకోవడం జరిగింది.

1. భూమి సారవంతముగా ఉండి నీటిపారుదల వసతులు కూడా ఉండి ఏటా రెండు పంటలు పండే భూమికి గరిష్ఠ పరిమితి 10 నుంచి 18 ఎకరాల మధ్య ఉండాలి.
2. నీటిపారుదల ఉండి ఏటా ఒక పంట ఉండే పక్షంలో గరిష్ఠ పరిమితి 27 ఎకరాలకు మించి ఉండకూడదు.
3. భూసారం ఒకే తీరులేని వివిధ భూములకు గరిష్ఠ పరిమితి 54 ఎకరాలకు మించి ఉండకూడదు.
4. గరిష్ఠ పరిమితిని కుటుంబాన్ని ఆధారంగా చేసుకొని నిర్ణయించాలి. భర్త, భార్య వారి మైనరు సంతానాన్ని ఏక కుటుంబంగా భావించాలి. కుటుంబంలో 5 గురు కంటే ఎక్కువమంది సభ్యులుంటే ఒక్కొక్క సభ్యునికి అదనంగా కొంత భూమి ఉండేటట్లు గరిష్ఠ పరిమితిని పెంచాలి. 5 గురు కన్నా ఎక్కువ సభ్యులుండే కుటుంబానికి నిర్ణయించిన పరిమితి కంటే రెండురెట్లుకు మించి ఉండరాదు.
5. గరిష్ఠ పరిమితి నిర్ణయించేటప్పుడు కుటుంబంలోని ప్రతి మేజరును ప్రత్యేక యూనిట్‌గా గుర్తించాలి.
6. తేయాకు, రబ్బరు, కాఫీ మొదలైన తోటలు, పరిశ్రమలు, లేదా వాణిజ్య పంటలు క్రింద ఉండే భూమి, వ్యవసాయేతర కార్యక్రమాల కోసం అవసరమయిన భూములకు ఈ చట్టాల నుంచి మినహాయింపు యివ్వాలి. పంచదార పరిశ్రమల క్రింద ఉండే భూమి గరిష్ఠ పరిమితి 100 ఎకరాలకు మించి ఉండరాదు.
7. మిగులు భూమిని పొందిన వ్యవసాయకూలీలు, షెడ్యూల్ కులాలు, తెగల వారి విషయంలో నష్టపరిహారాన్ని మార్కెట్ విలువ కంటే బాగా తక్కువ ఉండేటట్లు నిర్ణయించాలి. మిగులు భూముల పంపిణీలో వీరికి ప్రాధాన్యం ఇవ్వాలి.
8. నష్టపరిహారం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ద్రవ్యభారం లేకుండా చూడాలి.

గరిష్ఠ పరిమితిని మించి భూమి ఉన్న భూస్వాముల దగ్గర నుంచి మిగులు భూములను తీసుకోవడానికి వారికి నష్టపరిహారం చెల్లించవలసి ఉంటుంది. ఈ నష్టపరిహారాన్ని ఆ భూమిపై చెల్లిస్తున్న భూమిశిస్తును ఆధారంగా చేసుకొని నిర్ణయించటం జరిగింది. ఈ నష్ట పరిహారాన్ని భూములు పొందిన వారి నుంచి రాబట్టాలని, ప్రభుత్వంపై భారం పడకూడదని ముఖ్యమంత్రుల సమావేశం సూచించింది. దీనిని వాయిదా పద్ధతులలో చెల్లించాలని అయితే ఇది (వాయిదా + దాని మీద వడ్డీ + భూమిశిస్తు అన్నీ కలిపి) ఉత్పత్తిలో ఐదు లేదా నాలుగు భాగాల కంటే అధికంగా ఉండకూడదని నాలుగవ పంచవర్ష ప్రణాళికలో సూచించడం జరిగింది.

పట్టిక - 7.1

వివిధ రాష్ట్రాలలో భూకమతాలపై గరిష్ఠ పరిమితి (హెక్టార్లలో)

క్రమ సంఖ్య	రాష్ట్రం	నీటిపారుదల ఉండి రెండు పంటలు పండే భూమి	నీటిపారుదల ఉండి ఒక పంట పండే భూమి	డ్రై లాండ్
1.	ఆంధ్రప్రదేశ్	4.05 నుండి 7.28	6.07 నుండి 10.93	14.16 నుండి 21.85
2.	అస్సాం	6.74	6.74	6.74
3.	బీహార్	6.07 నుండి 7.28	10.12	12.14 నుండి 18.21
4.	గుజరాత్	4.05 నుండి 7.28	6.07 నుండి 10.93	8.09 నుండి 21.85
5.	హర్యానా	7.25	10.9	21.8
6.	హిమాచల్‌ప్రదేశ్	4.05	6.07	12.14 నుండి 28.33
7.	జమ్మూ & కాశ్మీర్	3.6 నుండి 5.06	- - -	5.95 నుండి 9.20
8.	కర్ణాటక	4.05 నుండి 8.10	10.12 నుండి 12.14	21.85
9.	కేరళ	4.86 నుండి 6.07	4.86 నుండి 6.07	4.86 నుండి 6.07
10.	మధ్యప్రదేశ్	7.28	10.93	21.85
11.	మహారాష్ట్ర	7.28	10.93	21.85
12.	మణిపూర్	5.00	5.00	6.00
13.	ఒరిస్సా	4.05	6.07	12.14 నుండి 18.21
14.	పంజాబ్	7.00	11.00	20.50
15.	రాజస్థాన్	7.28	10.93	21.85 నుండి 70.82
16.	తమిళనాడు	4.86	12.14	24.28
17.	సిక్కిం	5.06	---	20.23
18.	త్రిపుర	4.00	4.00	12.00
19.	ఉత్తరప్రదేశ్	7.30	10.95	18.25
20.	పశ్చిమబెంగాల్	5.00	5.00	7.00

Source : Ministry of Agriculture, Agricultural Statistics at a Glance (2002) p. 250.

7.3.3.1 మిగులు భూములు - వాటి కేటాయింపు :

మిగులు భూములను కౌలు భూముల నుంచి తొలగించబడిన వారికి, భూమిలేని వ్యవసాయ కూలీలకు ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, తెగలవారికి కేటాయించాలని నిర్ణయించడం జరిగింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ వారి వార్షిక నివేదిక 2001 - 02 ప్రకారం మనదేశంలో సెప్టెంబర్ 30, 2001 నాటికి 73.27 లక్షల ఎకరాలను మిగులు భూమిగా ప్రకటించారు. దీనిలో 64.95 లక్షల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. 53.79 లక్షల ఎకరాలను 54.84 లక్షల లబ్దిదారులకు పంపిణీ

చేసారు. లబ్దిదారులలో 36 శాతం షెడ్యూల్డ్ కులాలకు 15% షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు ఉన్నారు. మిగులు భూమి పంపిణీ తీరు పరిశీలించినట్లయితే అది చాలా మందకొడిగా సాగుతున్నట్లు తెలుస్తున్నది. మార్చి 1990 నుండి 2001 సెప్టెంబర్ వరకు పది సంవత్సరాల కాలంలో 2.83 లక్షల ఎకరాల భూమి మాత్రమే పంపిణీ చేయడం జరిగింది. మొత్తం పంపిణీ చేయబడిన 53.79 లక్షల ఎకరాలలో 14.75 లక్షల ఎకరాల ప్రభుత్వ వృధా భూములను భూమిలేని పేదవారి మధ్య పంపిణీ చేసారు.

మిగులు భూమి వివరాలు (లక్షల ఎకరాలలో)

పట్టిక - 7.2

క్రమసంఖ్య	వివరాలు	31-3-80 నాటికి	31-3-85 నాటికి	31-3-90 నాటికి	30-9-01 నాటికి
1.	అంచనావేసిన మిగులు భూమి	69.13	72.07	72.25	73.67
2.	ప్రకటించిన మిగులు భూమి	48.50	56.98	62.12	64.95
3.	స్వాధీనం చేసుకొన్నభూమి	35.50	42.64	46.47	53.79
4.	పంచిన భూమి	24.75	32.90	43.60	54.84

Source : Ministry of Rural Areas and Employment Annual Report (2001 - 02)

పట్టిక 7.3

నిర్వాహక కమతాల సంఖ్య, కమతాల పరిమాణరీత్యా సాగులో ఉన్న ప్రాంతం : 1995 - 96

కేటగిరి	కమతాల పరిమాణము (హెక్టార్లలో)	కమతాల సంఖ్య (మిలియన్లలో)	%	మొత్తం సాగులో ఉన్న భూమి (మిలియన్ హెక్టార్లలో)	%	కమతాల సగటు పరిమాణం (హెక్టార్లలో)
1. ఉపాంత	0 - 1.0	71.18	61.6	28.12	17.2	0.40
2. చిన్న	1.0 - 2.0	21.64	18.7	30.72	18.8	1.42
3. సెమీ మీడియం	2.0 - 4.0	14.26	12.3	38.96	23.8	2.73
4. మీడియం	4.0 - 10.0	7.09	6.1	41.40	25.3	5.84
5. పెద్ద	10 కి పైన	1.40	1.2	24.16	14.8	17.21
మొత్తం		115.57	100.0	163.36	100.00	1.41

Source : Government of India, Ministry of Agriculture, Agricultural Statistics at a Glance, 2003, Table- 16.1.

పై పట్టిక ద్వారా భారతదేశంలోని కమతాల సగటు పరిమాణం చాలా తక్కువ అని తెలుస్తున్నది. ఇది 1995 - 96లో 1.41 హెక్టార్లగా ఉన్నది. ఒక హెక్టారు కన్నా తక్కువగా ఉన్న కమతాలు లాభసాటి కమతాలు కావని నిర్ణయించినప్పుడు మనదేశంలో 61.6 శాతం లాభసాటికాని కమతాలే. చిన్న కమతాలు వ్యవసాయరంగ అభివృద్ధికి ప్రతిబంధకంగా ఉంటాయి. చిన్నచిన్న కమతాలు అత్యధిక సంఖ్యలో ఉండటం వల్ల సరిహద్దు గట్ల కోసం, కాలిబాటల కోసం సాగుబడిలో ఉన్న భూమిని నినియోగించుకోలేము. చిన్న కమతాలుండటం వల్ల ఆదాయాలు కనిష్టంగా ఉండి పొదుపు, పెట్టుబడి లేక మంచి విత్తనాలు, ఎరువులు, నూతన ఉత్పత్తి పద్ధతులు వినియోగించుకోలేరు. దీని వలన ఉత్పత్తి తగ్గుతుంది.

కమతాల గరిష్ఠ పరిమాణము నిర్ణయించే సందర్భంలో లాభసాటి కమతాలు (Economic Holding), అభిలషణీయమైన కమతాలు (Optimum holding), కుటుంబ కమతము (Family Holding) మొదలైన వివిధ రకాలైన కమతాల ప్రస్తావన వస్తుంది.

7.3.3.2 లాభసాటి కమతము :

ఒక వ్యవసాయదారుని కుటుంబంలోని వ్యక్తులకు సంపూర్ణమైన పని ఇస్తూ, వారికి సమంజసమైన జీవన ప్రమాణాన్ని సమకూర్చడానికి తగిన ఆదాయమిస్తూ సమర్థవంతంగా వ్యవసాయం చేయడానికి అనువైన పరిమాణంలో ఉండే కమతాలను లాభసాటి కమతాలనవచ్చు. కాంగ్రెస్ వ్యవసాయ సంస్కరణ సంఘం వారి అభిప్రాయంలో "ఒక వ్యవసాయాదారుని కుటుంబానికి సమంజసమైన జీవన ప్రమాణాన్ని సమకూర్చేవిగానూ, కుటుంబ సభ్యులకు ఒక ఎడ్ల జతను, సంపూర్ణ ఉద్యోగితను కల్పించేదిగాను ఉండే కమతమే లాభసాటి కమతము". లాభసాటి కమతాల పరిమాణము అన్ని దేశాలకు, అన్ని ప్రాంతాలకు, అన్ని కాలాలకు ఒకటిగా ఉండదు. ఆయా ప్రాంతాలలోని భూసారము, నీటిపారుదల సౌకర్యము మొదలైన వాటిని బట్టి కమతాల పరిమాణము నిర్ణయించవలసి ఉంటుంది.

7.3.3.3 అభిలషణీయమైన కమతాలు :

అర్థశాస్త్రజ్ఞులు ఉత్పత్తి రంగాలన్నింటిలో 'అభిలషణీయమైన' అనే పదాన్ని వాడుతూ ఉంటారు. వ్యవసాయరంగంలో కూడా అభిలషణీయమైన కమతము అనే భావము వాడుకలో ఉంది. ఈ రకపు కమతాల పరిమాణము వ్యవసాయదారుని నిర్వహణ సామర్థ్యంపైన, అనుసరించే సాంకేతిక పద్ధతుల పైన ఆధారపడి ఉంటుంది. 'సాంకేతిక పద్ధతులు మారక, కనీస సగటు వ్యయంలో ఉత్పత్తిని కొనసాగించే కమత పరిమాణాన్ని అభిలషణీయ పరిమాణము' అని అనవచ్చు. వివిధ ప్రాంతాలలోని వ్యవసాయ పద్ధతులలో తేడాలు ఉండటం వల్ల అభిలషణీయమైన కమతము వివిధ పరిమాణంలో ఉంటుంది.

7.3.3.4 కుటుంబ కమతాలు :

లాభసాటి కమతాలకు కనీస ఆదాయం ప్రామాణికమయినట్లు, కుటుంబ కమతాలకు కుటుంబంలోని శ్రామికులకు సంపూర్ణ ఉద్యోగావకాశ కల్పనము ప్రమాణంగా ఉంటుంది. కుటుంబ కమతాల పరిమాణాన్ని ఖచ్చితంగా నిర్ణయించడం తేలిక కాదు. ఈ పరిమాణం కుటుంబంలోని శ్రామికుల, వ్యవసాయ పద్ధతులు, పంటలతీరు, మూలధనం - శ్రామిక నిష్పత్తి మొదలయిన వాటి మీద ఆధారపడి ఉంటుంది.

7.3.3.5 గరిష్ట పరిమితిని నిర్ణయించడం : విమర్శ :

1. గరిష్ఠ పరిమాణం నిర్ణయించడంలో ఆదాయాన్ని ఆధారంగా తీసుకోవటం మంచిదే. కాని ఈ ఆదాయం స్థిరమైనది కాదు. ప్రకృతి వైపరీత్యాల వలన వ్యవసాయ ఆదాయం ఒడిదుడుకులకు లోనవుతుంది. ముఖ్యంగా వ్యవసాయాదారుని

ఆదాయం భూమి నుంచి వచ్చే ఫలసాయము, వ్యవసాయ వస్తువుల ధరలపై ఆధారపడి ఉంటుంది. భూమి ఫలసాయం తరచూ మారడమేగాక, వ్యవసాయ ధరలలో కూడా మార్పులు ఉంటాయి. ఇలాంటి అనిశ్చితమైన ఫలసాయము, ధరలచే నిర్ణయమయ్యే ఆదాయము ఆధారంగా గరిష్ట పరిమాణం నిర్ణయించడం ఎంతవరకు సమంజసమనేది కొందరి అభిప్రాయము.

2. గరిష్ట పరిమాణము నిర్ణయించినంతమాత్రాన పంపకానికి తగిన మిగులు భూమి లేకపోవచ్చు. మిగులుభూమి తక్కువగా ఉండటమేకాక అది అనేక ప్రదేశాలలో చిన్న పరిమాణంలో ఉండవచ్చు. పంపకానికి లభ్యమయ్యే భూమి అసలు వ్యవసాయానికి ఉపయోగపడుతుందా అనే సందేహం కూడా ఉంది.
3. భూమి పంపకం వల్ల కమతాల పరిమాణము స్వల్పమై భూమి నుంచి వచ్చే ఫలసాయం జీవనాధారానికి మాత్రం సరిపోవచ్చు. అటువంటి పరిస్థితులలో దేశంలో విక్రయం కాగల మిగులు సన్నగిల్లవచ్చు. ఈ చర్య వ్యవసాయ రంగంలో మూలధన కల్పనను దెబ్బతీయవచ్చు.
4. గరిష్ఠ పరిమాణం నిర్ణయించి మిగులు భూమిని పంపకం చేయడంలో పెద్దతరహాలో వ్యవసాయం చేస్తూ అనేక ఆదాలను గడిస్తూ సమర్థవంతంగా ఉన్న కమతాలను చెడగొట్టడం జరుగుతుంది. దీని మూలంగా ఉత్పత్తి తగ్గిపోయే ప్రమాదం ఉంది.
5. మిగులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటంతో భూస్వాములకు నష్టపరిహారం ఇవ్వవలసి ఉంటుంది. కొత్తగా యజమాన్యపు హక్కులు పొందినవారు భూమి ఖరీదును ఇచ్చుకోలేకపోవచ్చు. పెద్దమొత్తంలో నష్టపరిహారం చెల్లించడం పేద దేశాలలోని ప్రభుత్వాలకు కూడా సమస్యే.
6. దేశంలో భూమికి మాత్రం గరిష్ఠ పరిమాణం నిర్ణయించి ఇతర రకాల ఆస్తులను మినహాయించిన సంఘంలో స్పర్థలు ఏర్పడవచ్చు. ఈ విధంగా గరిష్ఠ పరిమాణ నిర్ణయం భూస్థితికి మాత్రం పరిమితి అయిందనే విమర్శ ఉన్నది.

7.4 కమతాల సమీకరణ ఆవశ్యకత :

కమతాలపై గరిష్ఠ పరిమితి విధింపువల్ల లభ్యమైన మిగులు భూమి బహుస్వల్పం అవడం వలన అసంఖ్యాకంగా ఉన్న చిన్న చిన్న విఘటిత కమతాల పరిణామాన్ని మెరుగుపరచడానికి కొన్ని విధాలయిన సంస్కరణలు అవసరము. ఈ దృష్ట్యా కమతాల పరిణామానికి సంబంధించిన భావనలలో కనిష్ఠ కమతమనే భావం ప్రాధాన్యత వహిస్తుంది. మన దేశంలో కుటుంబం కమతమనే భావం ప్రాధాన్యత వహిస్తుంది. మనదేశంలో కుటుంబం కమతంలో మూడోవంతు పరిమాణం గల కమతాన్ని కనిష్ఠ కమతంగా పరిగణించారు. వారసత్వపు హక్కుల మూలంగా కమతాల పరిమాణం క్రమంగా క్షీణించిపోవడమేకాక, కమతాల విఘటన జరుగుతుంది. దీని ఫలితంగా ఒక వ్యవసాయదారు కమతం స్వల్పపరిమాణంలో వేరు వేరు స్థలాలలో ఉండటం సంభవిస్తుంది. అటువంటప్పుడు లాభసాటిగా వ్యవసాయం చేయడం కష్టం. వాటినన్నింటిని ఏకఖండముగా ఒకేచోట ఉండేటట్లు ఏర్పాటుచేసే పద్ధతిని 'కమతాల సమీకరణము' అంటారు. మనదేశంలో పంజాబ్, ఉత్తరప్రదేశ్ మొదలైన రాష్ట్రాలలో కమతాల సమీకరణ చేయడానికి, కమతాల విఘటన అరికట్టడానికి శాసనాలు చేశారు. కాని వీటిని పటిష్టంగా అమలు పెట్టలేదని చెప్పవచ్చు. కమతాల కనీస స్థాయిని నిర్ణయించి, ఆ స్థాయి తర్వాత కమతాల విభజన జరగకూడదనే శాసనం ఎంతో అవసరము.

కమతాల సమీకరణ కార్యక్రమం ప్రారంభించడానికి ముందు పట్టాదారుల హక్కులను తెలియజేసే పత్రాలను సక్రమంగా రూపొందించవలసి ఉంటుంది. భూములు కౌలుదారులు స్వాధీనంలో ఉండగా కమతాల సమీకరణ కార్యక్రమం కష్టమవుతుంది.

ఈ కార్యక్రమాన్ని కొనసాగించడానికి భూములను సర్వేచేయడం, నేలలను వర్గీకరించడం, భూములకు విలువ కట్టడం మొదలయిన చర్యలు తీసుకోవాలి. కమతాల యాజమానులందరికీ ఈ కార్యక్రమం లాభసాటిగా ఉన్నప్పుడే వారి సహకారం లభ్యమవుతుంది. భారతదేశం లాంటి ప్రజాస్వామ్య దేశంలో సహకార వ్యవసాయ పద్ధతి ద్వారా కమతాల సమీకరణ సాధించడమేకాక, దానితోపాటు ఉపాంత వ్యవసాయదారుల సమస్యలను పరిష్కరించడానికి అవకాశం వస్తుంది.

7.5 సహకార వ్యవసాయం :

భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశాలలో సహకార వ్యవసాయ పద్ధతి ద్వారా కమతాల సమీకరణ సాధించడమేకాక, దానితోపాటు వ్యవసాయదారుల సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ కారణం వల్ల వర్థమానదేశాలలో భూసంస్కరణ కార్యక్రమాలలో సహకార వ్యవసాయం కూడా ముఖ్యమైనదిగా పరిగణించవచ్చు. సహకార వ్యవసాయాభివృద్ధి కొరకు బలీయమైన పునాదుల్ని ఏర్పాటు చేయటానికి అవసరమైన చర్యల్ని రెండవ ప్రణాళిక తీసుకొంది. 1959 జనవరిలో భారత జాతీయ కాంగ్రెస్, సర్వసభ్య సమావేశం నాగపూర్‌లో సమావేశమైన సందర్భంలో దేశమంతటా సహకార వ్యవసాయం ప్రవేశపెట్టే తీర్మానాన్ని ఆమోదించింది. దీనికి ముందు సేవా సహకార సంఘాలను ఏర్పరచాలని తీర్మానించింది. 'సహకార ఉద్యమం విఫలం అయితే గ్రామీణ భారతదేశ అత్యున్నత ఆశలను వమ్ముచేసినట్లు అవుతుందని' 1927లో వ్యవసాయంపై ఏర్పాటయిన రాయల్ కమీషన్ అభిప్రాయపడింది. 1949లో కాంగ్రెస్ వ్యవసాయ సంస్కరణల కమిటీ అధ్యక్షులు జె.సి. కుమారప్ప కూడా సహకార వ్యవసాయం ద్వారా వ్యవసాయాభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

పద వివరణ :

సహకార వ్యవసాయం అనే పదాన్ని వివిధ అర్థాలలో వాడటం జరిగింది. భూమి యాజమాన్యము, నిర్వహణ, వ్యక్తిపరంగా ఉండి పరిమిత ప్రయోజనాల కోసం, కొందరు వ్యవసాయదారులు, సహకరించి ఉమ్మడి సదుపాయాలు కల్పించుకొని వ్యవసాయం చేయడాన్ని సహకార వ్యవసాయం అనలేము. ఈ రకపు వ్యవసాయ సంఘాన్ని సహకార సేవా వ్యవసాయం (Service Co-operatives) అనడం సమంజసము. భూమిపై యాజమాన్యము సమాజపరంగా ఉండి, నిర్వహణ సమిష్టిగా ఉండి చేసే వ్యవసాయాన్ని కూడా సహకారవ్యవసాయంగా పరిగణించలేము. ఈ రకపు వ్యవసాయాన్ని సమిష్టి వ్యవసాయము (Collective Farming) అనడం సమంజసము.

సహకార వ్యవసాయము అనగా భూమిపై యాజమాన్యపు హక్కులు వ్యక్తిగతంగానే ఉంచుకొని సభ్యులందరి కమతాలను సమీకరించి ఉమ్మడి నిర్వహణ క్రింద సహకార సూత్రాలను అన్వయించి చేసే వ్యవసాయము. దీనినే సహకార ఉమ్మడి వ్యవసాయము Co-operative Joint Farming అని కూడా అంటారు. మనదేశంలో ప్రణాళికా సంఘంవారు ఈ అర్థంలోనే ఈ పదాన్ని వాడతారు.

7.5.1 సహకార వ్యవసాయం లక్షణాలు :

1. సభ్యుల కమతాల సమీకరింపబడి ఏకక్షేత్రంగా ఏర్పడుతుంది.
2. సహకార సంస్థలో సభ్యులుగా చేరినప్పటికీ, వ్యవసాయదారులకు యాజమాన్యపు హక్కులు ఉంటాయి.
3. వ్యవసాయము పరస్పర సహాయము, తోడ్పాటు అనే రెండు సూత్రాలపై ఆధారపడి ఉంటుంది.
4. నిర్వహణ కార్యంలో సభ్యులందరికీ సమాన హక్కులు ఉంటాయి.

5. వచ్చే ఆదాయంలో కొంత రిజర్వ్‌ఫండ్‌కు ఉంచుకొని మిగతా ద్రవ్యాన్ని సభ్యుల మధ్య సహకార సూత్రాల ప్రకారం పంచిపెట్టటం జరుగుతుంది.

7.5.2 సహకార వ్యవసాయ ఆవశ్యకత - లాభాలు :

1. సహకార వ్యవసాయంలో చిన్న కమతాల యజమానులు ఏకమవుతున్నాయి. దీని ఫలితంగా కమతాల సమీకరణ జరగటానికి వీలవుతుంది. కమతాల విభజనను, కమతాల విఘటనను అరికట్టడానికి సహకార వ్యవసాయం ఉత్తమమయింది.
2. చిన్న కమతాలైనప్పటికీ పెద్దతరహా ఉత్పత్తి జరుగుతుంది. కాబట్టి అంతర్గతమైన, బహిర్గతమైన ఆదాలను పొంది ఉత్పత్తి ఖర్చును తగ్గించుకొని అధిక లాభాన్ని పొందవచ్చు.
3. సహకార వ్యవసాయంలో భూసార సంరక్షణ, భూమి పునరుద్ధరణ, బావులు త్రవ్వడం, డ్రయినేజ్ నదుపాయాలు ఏర్పరచడం మొదలయిన అభివృద్ధి కార్యకలాపాలను సాధించడం సులభమవుతుంది.
4. సహకార వ్యవసాయం వల్ల కమతాల సమీకరణ జరిగి ప్రచ్ఛన్న నిరుద్యోగ పీడన గురి అయిన ఉపాంత వ్యవసాయాదారుల శ్రమను ఆదనపు వ్యయం లేకుండా మూలధన కల్పనకు వినియోగించుకోవచ్చు.
5. సహకార వ్యవసాయం ఉపాంత వ్యవసాయదారులను ప్రభుత్వ విస్తరణ అధికారులతో సన్నిహితం చేయడానికి అవకాశం కల్పిస్తుంది. ఇది వ్యవసాయ రంగంలో సాంకేతికమైన మార్పులు తేవడానికి దోహదం చేస్తుంది.
6. వ్యవసాయాదారుడు వ్యక్తిగతంగా పెచ్చు పరపతిని పొందలేకపోవచ్చు. అంతేకాక పరపతి మార్గాలను పూర్తిగా వినియోగించుకోలేకపోవచ్చు. కాని సహకార సంస్థల పరంగా పెచ్చుపరపతిని పొందడమేకాక, వివిధ మార్గాల ద్వారా కూడా పరపతిని పొందవచ్చు. వడ్డీవ్యాపారస్తుల కోరల నుంచి విముక్తి పొందవచ్చు.
7. ఈ సంస్థలలో ప్రణాళికాబద్ధమైన కృషివల్ల అధికోత్పత్తి సాధ్యమవుతుంది.
8. సహకార వ్యవసాయంలో విక్రయం కాగల మిగులు సహజంగా అధికంగా ఉంటుంది. ఫలసాయం చేతికిరాగానే విక్రయం చేయవలసిన అవసరం లేదు కాబట్టి లాభసాటి ధరకు అమ్మటం వీలవుతుంది. సహకార సంస్థకు బేరమాడేశక్తి (bargaining capacity) ఎక్కువగా ఉంది కాబట్టి ఎక్కువ ధరకే విక్రయం చేయగల అవకాశముంది.
9. ప్రభుత్వ విధానాలను రూపొందించడానికి అవసరమైన గణాంక వివరాలు ఈ సహకార క్షేత్రాలలో లభ్యమవుతున్నాయి. సహకార సంఘాలలో అన్ని కార్యక్రమాలకు లెక్కలు తయారుచేస్తారు.
10. సహకార సంఘాల వలన సామాజిక నాయకత్వ గుణాలను, ఒకరినొకరు సహాయపడే ధృక్పథాన్ని పెంపొందించుకునే అవకాశం కలుగుతుంది. స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుంది.
11. సహకార వ్యవసాయం ఆచరణలోకి వచ్చినందువలన, కొద్ది వ్యసాయదారుల చేతులలో భూమి కేంద్రీకరించబడటం, తద్వారా ఆదాయాలలో అసమానతలను తొలగించవచ్చు.
12. సహకార వ్యవసాయ పద్ధతిలో కౌలుదారుల సమస్యలకు చోటు లేదు. వ్యవసాయ శ్రామికులను దోచుకోవటం జరగదు.
13. సహకార క్షేత్రంలో సాంద్ర వ్యవసాయం వీలవుతుంది. సాంద్ర వ్యవసాయంలో ఎక్కువమంది శ్రామికులకు పని ఉంటుంది. దీనిమూలంగా శ్రామికులకు పనిచేసే రోజులు పెరుగుతాయి.

7.5.3 సహకార వ్యవసాయంలో ఇబ్బందులు :

భారతదేశంలో సహకార వ్యవసాయం ఆశించినమేరకు, అవసరమైనంతవరకు ప్రగతిని సాధించలేకపోయింది. దీనికి అనేక సమస్యలు, అభివృద్ధిని నిరోధించే అంశాలు ఉన్నాయి. అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు కూడా అనేక విమర్శలకు గురిఅయింది. అనుకొన్నంతమేరకు సహకార ఉద్యమం అభివృద్ధి చెందలేదని డాక్టర్ పి.యస్.లోకనాథం, డి.ఆర్.గాడ్గిల్, జ్ఞానచంద్, గున్నార్ మిర్డల్ మొదలైనవారు తెల్పారు.

1. వ్యక్తిగత వ్యవసాయాన్ని సహకార వ్యవసాయంగా మార్చడంలో అనేక సమస్యలున్నాయి. వ్యవసాయదారు, సహకార వ్యవసాయంలో చేరినంతనే భూమిని స్వయంగా నిర్వహణచేసే హక్కులు పోగొట్టుకొని సహకార సంస్థ నియమాలకు కట్టుబడి ఉండవలసి వస్తుంది. ఉత్పత్తి అధికం చేయడంలోగల శక్తిసామర్థ్యాలను సంస్థకు అప్పగించవలసివస్తుంది. భూమిని సంస్థ స్వాధీనం చేయడంలో భూమి వలన తనకు చేకూరుతున్న సౌకర్యాలను కోల్పోవడం జరుగుతుంది. ఈ కారణాల వల్ల వ్యవసాయదారులందరూ సహకార వ్యవసాయ సంస్థలో సభ్యులుగా చేరడానికి సమ్మతించకపోవచ్చు.

2. ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయి నిరుద్యోగం పెరుగుతుందనే అపోహ వల్ల కూడా సహకార వ్యవసాయంలో చేరడంలేదు. కాని దీనివల్ల ప్రచ్ఛన్న నిరుద్యోగిత, బహిర్గత నిరుద్యోగితగా మారుతుందనే విషయాన్ని కూడా ప్రచారం చేయవలసిన అవసరం ఉంది.

3. సహకార ఉద్యమం ప్రయోజనాల గురించి తెలుసుకోగల అక్షరాస్యత, చైతన్యం లేకపోవడం వల్ల అది అభివృద్ధి చెందలేక పోయింది. ఈ ఉద్యమం ద్వారా ఏర్పడే ప్రయోజనాల గురించి వివిధ ప్రచార సాధనాల ద్వారా అత్యధిక ప్రచారం చేయవలసిన అవసరం ఉన్నది.

4. సహకార వ్యవసాయంవల్ల వ్యవసాయాభివృద్ధి సాధించవచ్చుననే అభిప్రాయం సత్యదూరమైనదని కొందరి అభిప్రాయము. సహకార వ్యవసాయం వల్ల భూమిలేని రైతుల ఆదాయం పెరగడంలేదు. గున్నార్‌మిర్డల్ అభిప్రాయంలో సహకార వ్యవసాయంలోని ముఖ్యలోపము ప్రస్తుతపు వ్యవసాయ రంగంలోని పరిస్థితులలో మార్పు ఏమీలేకపోవడం. భూస్వాములు, కౌలుదారులు, వ్యవసాయ కూలీలు వీరిమధ్య సాంప్రదాయంగా కూడా అంతస్తులలోని భేదాలు, సహకార వ్యవసాయంలో కూడా కొనసాగడం జరుగుతుంది. ఈ పరిస్థితులలో సహకార వ్యవసాయం సమర్థవంతంగా కొనసాగించవచ్చు అనడానికి ఆస్కారమేమీ లేదు.

5. సంస్థ ద్వారా లభించే పరపతి సౌకర్యాలను ఉపయోగించుకోవడానికి మాత్రమే సహకార సంస్థలు పనిచేస్తున్నాయి అనే దృక్పథంలోనే గ్రామీణ రైతులు ఉండటం వలన అభివృద్ధి జరగడం లేదు. చాలావరకు భారతదేశంలోని సహకార క్షేత్రాలు ప్రారంభించడానికి ముఖ్యమైన కారణం పరపతి పొందడానికేనని ఆచార్య వినోభా భావే అభిప్రాయపడినారు. అంటే ముఖ్యమైన ధ్యేయాలకు తిలోదకాలివ్వడం జరిగిందని చెప్పవచ్చు.

6. సహకార వ్యవసాయ సంస్థ నేర్పరచడంలో భూస్వాముల నుంచి వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. కౌలుదారుల వల్లనో, వ్యవసాయ కూలీల వల్లనో వ్యవసాయం జరిపిస్తూ వారిపై అధికారం చెలాయిస్తున్న భూస్వామి సహకార వ్యవసాయంలో సభ్యుడై ఇంతవరకు తన దయాదాక్షిణ్యంతో బ్రతుకుతున్న వారితో సమానం కావడానికి సమ్మతిస్తాడనుకోవడం భ్రమే అవుతుంది.

   డేనియల్ థర్నర్ అనే అర్థశాస్త్రవేత్త భారతదేశంలోని వివిధ రకాలైన 117 సంఘాలను పరిశీలించి తన నివేదికలో సహకార సంఘాలలోని ముఖ్యులంతా గ్రామాలలోని ధనవంతులేనని అభిప్రాయపడ్డారు. ఒక బహుళార్థక సాధక

సహకార సంఘంలో మొత్తం స్వల్పకాలిక రుణాలు రూ. 1,91,000 లలో రూ. 95,000/-లు పదకొండు మంది మాత్రమే చేజిక్కించుకొన్నారని తన పరిశోధనలలో పేర్కొన్నారు.

7. సహకార సంస్థల సభ్యులు చెల్లించవలసిన బకాయిలు విపరీతంగా పెరగడం వల్ల ఈ ఉద్యమం బలహీనపడింది. బకాయిలు పెరగడానికి కారణం సహకార పరపతిని సద్వినియోగం చేసుకోకపోవడం. సభ్యులు పరపతిని వ్యవసాయ కార్యకలాపాలకు కాకుండా ఇతర కార్యకలాపాల కొరకు వినియోగించడం.

8. అధికభాగం సహకార వ్యవసాయ సంఘాలు ముఖ్యమైన ధ్యేయాలను వదలి, గరిష్ట పరిమితి చట్టాలనుంచి రక్షించుకోవడానికి, కౌలుదారులను వెళ్ళగొట్టడానికి లేదా ప్రభుత్వం నుంచి లభించే తక్కువ వడ్డీ రుణాల కోసం భూస్వాములు ఈ సహకార వ్యవసాయ సంస్థలను ప్రారంభిస్తున్నారు.

9. సహకార వ్యవసాయంలో నిర్వహణకు సంబంధించిన సమస్య కూడా ఈ ఉద్యమం బలహీనపడటానికి ఒక కారణము. ఒకవైపు వ్యవసాయదారులకు సహకార క్షేత్రాలను నిర్వహించడంలో తగిన సామర్థ్యం లేకపోవడం, రెండోవైపు ప్రభుత్వ యంత్రాంగం కూడా సరైన నిర్వహణ, పర్యవేక్షణ, విచారణ చేయలేకపోతున్నాయి. రూరల్ క్రెడిట్ రివ్యూ కమిటీ (Rural Credit Review Committee) వారు తమ నివేదికలో సహకార వ్యవసాయంలో పర్యవేక్షణ లేకపోవడం, ఉన్నా సమర్థవంతంగా లేకపోవడంవల్ల అనేక బలహీనతలు చోటుచేసుకున్నాయని దీనివల్ల బకాయిలు పెరగడం, బూటకపు రుణాలు, పరపతి దుర్వినియోగం మొదలైనవన్నీ సహకార ఉద్యమ అభివృద్ధిని నిరోధిస్తున్నాయని పేర్కొన్నారు.

10. గున్నార్ మిర్డల్ అభిప్రాయంలో ఆదాయ అసమానతలు తొలగించి, వ్యవసాయదారుల మధ్య సమానత్వం సాధించడానికి సహకార వ్యవసాయం దోహదం చేయగలదనే భావన కేవలం భ్రమ మాత్రమే. అసమానత్వాన్ని తొలగించడానికి చర్యలు తీసుకోకనే వ్యవసాయ పరిస్థితులను పెంపొందించడానికి సహకార వ్యవసాయం ప్రయత్నిస్తున్నది. ప్రభుత్వం నుంచి తరచుగా కొన్ని సహాయాలు పొందువచ్చనే ఉద్దేశ్యంతోనే భూస్వాములు సహకార వ్యవసాయంలో చేరవచ్చు. ప్రభుత్వం నుంచి ధన సహాయం పొందడానికి, గరిష్ఠ కమతాల నిబంధనల నుంచి తప్పించుకోవడానికి, కౌలుదారులను భూమి నుంచి తొలగించడానికి మాత్రమే భూస్వాములు ఈ సంస్థలలో సభ్యులుగా చేరే ప్రమాదమున్నది.

7.5.4 సహకార వ్యవసాయము : సమీక్ష :

సహకార వ్యవసాయంలో అనేక లాభాలు ఉన్నప్పటికీ, అలాంటి క్షేత్రాలను నిర్మించడంలోను, నిర్వహణలోను అనేక ఇబ్బందులున్నాయి. సహకార వ్యవసాయము విజయవంతం కావలెనన్న అది స్వచ్ఛందమైన ఉద్యమంగా రూపొందించడం అవసరము. అందుకు వ్యవసాయదారుల ఐచ్ఛిక సమ్మేళనము (Voluntary Association), వారిమధ్య సహకారము, సమానత్వము, సమర్థవంతమైన నిర్వహణశక్తి అవసరము. దేశంలో నాయకత్వము ఈ పరిస్థితులు కల్పించినప్పుడే సహకార వ్యవసాయం అభివృద్ధి చెందుతుంది. ఈ వ్యవసాయం కేవలం కమతాల సమీకరణకు మాత్రమే పరిమితం కాకుండా సాంకేతికమైన మార్పులకు, మూలధన కల్పనకు, ఉద్యోగావకాశాలను పెంపొందించే శక్తివంతమైన సాధనము అయినప్పుడే ఈ ఉద్యమం సఫలీకృతమవుతుంది.

7.6 సమిష్టి వ్యవసాయము (Collective Farming) :

కమతాల సమీకరణకు, వ్యవసాయాన్ని సమర్థవంతంగా ఆధునిక పద్ధతులలో నడపడానికి సహకార వ్యవసాయం ఏవిధంగా తోడ్పడుతుందో అదేవిధంగా సమిష్టి వ్యవసాయం కూడా వ్యవసాయాభివృద్ధికి అవసరమవుతుంది. భూమిపై

యాజమాన్యము వ్యవసాయాభివృద్ధికి అవసరమవుతుంది. భూమిపై యాజమాన్యము సమాజపరంగా ఉండి, నిర్వహణ సమిష్టిగా ఉండి చేసే వ్యవసాయాన్ని సమిష్టి వ్యవసాయమంటారు. ఇటువంటి వ్యవసాయము కమ్యూనిస్టు దేశాలలోను, కొంతవరకు ఇజ్రాయిల్ మరియు మెక్సికో దేశాలలో ఆచరణలో ఉన్నది.

7.6.1 సమిష్టి వ్యవసాయం - లక్షణాలు :

1) వ్యవసాయదారులు తన భూమి యాజమాన్యపు హక్కులను, భూమికి సంబంధించిన వ్యక్తిగత ఆస్తులను వదులుకోవడం
2) మొత్తం భూమి, ఇతర వనరుల యాజమాన్యము సమిష్టిగా సమాజం స్వాధీనంలో ఉంటుంది.
3) ఈ వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం అనేక విధాలుగా పంపిణీ అవుతుంది. సభ్యుల నిపుణత, సాంకేతిక జ్ఞానం అనుసరించి వేతనాలస్థాయి నిర్ణయించడం జరుగుతుంది. సామర్థ్యానికి గుర్తింపు లభిస్తుంది.
4) వ్యవసాయ నిర్వహణ ఎన్నుకొన్న సంఘం జరుపుతుంది. ఈ సంఘము వ్యవసాయ కార్యకలాపాల పర్యవేక్షణ, పరపతిని చేకూర్చడం, విక్రయ సదుపాయాలు కలుగజేయడం వంటి కార్యాలను నిర్వహిస్తుంది.

7.6.2.2. ప్రయోజనాలు :

1. చిన్నకమతాల వ్యవసాయంలోని లోపాలను తొలగించవచ్చు. చిన్న కమతాల సమీకరణ సాధ్యమవుతుంది.
2. ఈ పద్ధతిలో పెద్దతరహాలో వ్యవసాయంచేసి పెద్దతరహా ఆదాలను పొందవచ్చు. సాంకేతికమైన, ఆర్థికమైన అభివృద్ధి సాధించవచ్చు.
3. ఈ వ్యవసాయం వలన భూమి యాజమాన్యానికి సంబంధించిన అసమానతలను తగ్గించడానికి తోడ్పడుతుంది.
4. వ్యవసాయ రంగంలోని సాంఘిక, ఆర్థిక అన్యాయాలను తొలగిస్తుంది. సమర్థవంతమైన వ్యవసాయ వ్యవస్థను రూపొందించి వ్యవసాయ ఉత్పాదకత పెంచడానికి ఈ వ్యవసాయం తోడ్పడుతుంది.

7.6.3.4 లోపాలు :

1) రైతుకు సంబంధించిన భూమి, ఇతర వనరులు సమాజపరం కావడం వల్ల వ్యక్తిగత స్వేచ్ఛ ఉండదు. వ్యక్తిగత ప్రోత్సాహం నశించవచ్చు. వ్యవసాయాభివృద్ధికి ఈ ప్రోత్సాహం ఎంతో అవసరము.
2) వ్యవసాయదారులకు తగిన ప్రోత్సాహకాలు లభ్యం కానట్లయితే ఉత్పాదకత తగ్గే అవకాశము ఉంది.
3) సమిష్టి వ్యవసాయంలో ప్రభుత్వ ఉద్యోగుల పెద్దరికం, జోక్యం ఎక్కువై, నిర్వహణ లోపాలకు దారితీయవచ్చు.

7.6.4 సమిష్టి వ్యవసాయం - సమీక్ష :

సమిష్టి వ్యవసాయం విజయవంతం కావడానికి ప్రభుత్వ సహాయం పెద్దఎత్తున కావలసివస్తుంగి. సభ్యులకు తగిన సాంకేతిక జ్ఞానం కూడా అవసరము. ఇజ్రాయిల్, మెక్సికో దేశాలలో కొన్ని పరిస్థితులలో ఈ విధమైన వ్యవసాయం విజయవంతమైనది. ఈ దేశాలలో వ్యవస్థాపనలో క్రమశిక్షణ, సభ్యులకు తగిన శిక్షణ, సభ్యులలో విద్యాస్థాయి అధికంగా ఉండటం సమిష్టి వ్యవసాయం విజయవంతం కావడానికి తోడ్పడ్డాయి. భారతదేశంలో విద్య, సాంకేతిక పరిజ్ఞానం తక్కువస్థాయిలో ఉన్నందువలన సమిష్టి వ్యవసాయం నుంచి ఆశించిన ఫలితాలను పొందటం దుర్లభమవుతుంది.

7.7 ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణల అమలు :

భూమి పంపిణీలో ఉన్న లోపాలు తొలగించే ఉద్దేశ్యంతో కేంద్రప్రభుత్వం భూసంస్కరణల చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో 1975 జనవరి 1వ తేదీ నుండి భూసంస్కరణల చట్టాన్ని రూపొందించారు. 1975 నుండి ఇప్పటి వరకు భూసంస్కరణల అమలుతీరును పరిశీలించినట్లయితే అది చాలా మందకొడిగా సాగుతున్నట్లు తెలుస్తున్నది.

7.7.1 భూగరిష్ఠ పరిమితులు :

కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు మన రాష్ట్రప్రభుత్వం సంస్థాపరమైన చర్యలలో భాగంగా మధ్యవర్తులను తొలగించింది. కౌలు సంస్కరణలు తెచ్చి, కమతాలకు గరిష్ఠ పరిమితులు నిర్ణయించింది. వీటిలో గరిష్ఠ పరిమితుల చట్టం ముఖ్యమైనది. ఇందులోని ముఖ్యాంశాలు :

1) ఐదుగురు కుటుంబ సభ్యులు ఉన్న కుటుంబానికి ఆరి (మాగాణి) భూమి 10 ఎకరాలు, మెట్టభూమి 25 ఎకరాలు పరిమితిగా నిర్ణయించారు.

2) ఆరి, మెట్ట భూములు రెండూ ఉన్న పక్షంలో ఒక హెక్టారు ఆరిభూమి, రెండు హెక్టార్ల మెట్టభూమికి సమానంగా పరిగణించాలి.

3) కొబ్బరి తోటలు, ద్రాక్ష తోటలు పెంచుతున్న భూముల విషయంలో ఆరిభూమి 27 ఎకరాలు, మెట్టభూమి 56 ఎకరాలు ఉండవచ్చు. ఇంతకంటే ఎక్కువ ఎవరూ కలిగి ఉండటానికి వీలులేదు అని భూగరిష్ఠ పరిమితుల చట్టం స్పష్టంగా తెలుపుతోంది.

మనదేశంలో 41.7 లక్షల ఎకరాల మిగులు భూమి ఉన్నది. దీనిలో 8.80 లక్షల ఎకరాల మిగులు భూమి మన రాష్ట్రంలోఉంది. దేశం మొత్తంలో 27 లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొన్నారు. దీనిలో 4.45 లక్షల ఎకరాలను మనరాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. స్వాధీనం చేసుకొన్న భూమిలో ఎక్కువభాగం సేద్యానికి యోగ్యంగా లేకపోవడం లేదా కోర్టు దావాలో ఉండటం జరుగుతోంది. సేద్యయోగ్యం కాని భూమిని సామాజిక అడవులు, ఇతర సామాజిక అవసరాలకు వినియోగిస్తున్నారు. 3.40 లక్షల ఎకరాల భూమిలో 3.16 లక్షల ఎకరాల భూమిని వ్యవసాయ ప్రయోజనాలకు, ఇళ్ళ స్థలాల నిమిత్తం బలహీన వర్గాలకు పంపిణీ చేసారు. వాటిలో 1,06,630 మంది హరిజనులకు 1,48,300 ఎకరాలను, 31,381 మంది గిరిజనులకు 54,431 ఎకరాలను, 63,206 మంది వెనుకబడిన తరగతులకు 92,101 ఎకరాలు, 14,160 ఇతర కులాలవారికి 20,656 ఎకరాల భూమిని పంపిణీ చేసారు. ఫలితంగా 5.6 లక్షల మందికి 19 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసారు. 5,423 ఎకరాలు సామాజిక అడవులు, పశుగ్రాసం నిమిత్తం వివిధ శాఖలకు కేటాయించారు. ఇంకా 18,690 ఎకరాలు మిగులు భూమి పంపిణీ కావలసి ఉంది.

రాష్ట్రంలో భూసంస్కరణల చట్టం క్రింద 29 ట్రిబ్యునల్స్‌కు 4,44,015 డిక్లరేషన్‌లు అందాయి. వాటిలో 4,43,889 కేసులను పరిష్కరించారు. ప్రభుత్వం డిక్లరెంట్ అప్పీలేట్ ట్రిబ్యునల్స్‌కు దాఖలు చేసిన అప్పీళ్ళు 52,304 ఉన్నాయి. వీటిలో 30,079 కేసులలో ట్రిబ్యునల్స్ డిక్లరెంట్లకు, అనుకూలంగా తీర్పు చెప్పాయి. 4,902 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా డిక్లరెంట్లు ప్రభుత్వ హైకోర్టులలో దాఖలు చేసిన కేసులు 16,502 ఉన్నాయి. వాటిలో 9,150 కేసులు డిక్లరెంట్లకు అనుకూలంగాను, 2,474 కేసులు ప్రభుత్వానికి అనుకూలంగాను పరిష్కారమయ్యాయి. ఇంకా 4,428 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

పట్టిక - 7.4

రాష్ట్రంలో భూయాజమాన్యం శాతాల వివరాలు

సం॥రము	సన్నకారు (హెక్టారులోపు)		చిన్నకారు (1-2 హెక్టార్లు)		సెమీ మీడియం (2-4 హెక్టార్లు)		మీడియం (4-10 హెక్టార్లు)		పెద్ద (10 హెక్టార్ల పైన)	
	కమతం	విస్తీర్ణం	కమతం	విస్తీర్ణం	కమతం	విస్తీర్ణం	కమతం	విస్తీర్ణం	కమతం	విస్తీర్ణం
1961-62	66.32	8.15	11.46	9.69	10.60	16.97	8.61	31.29	3.01	33.90
1971-72	65.30	9.92	13.65	13.16	11.22	21.22	5.57	30.15	2.26	25.58
1981-82	67.49	11.26	14.03	15.29	10.01	20.70	6.69	29.83	1.78	22.92
1991-92	73.74	21.30	20.34	39.91	3.50	15.53	5.46	30.74	0.43	8.06

ఆధారము : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు: సవాళ్ళు సి.ఇ.యన్.యన్., 2003, పేజీ నెం. 163

1960 ఆరంభం నుండి 1990ల ఆరంభం నాటికి ఆంధ్రప్రదేశ్‌లో చిన్న, సన్నకారు (రెండు హెక్టార్ల వరకు) కమతాలు మొత్తం కమతాల్లో 78 నుండి 94 శాతానికి పెరిగాయి. పెద్ద (10 హెక్టార్లపైన) కమతాలు 2.26 శాతం నుండి 0.5 శాతానికి తగ్గాయి. మీడియం (4-10 హెక్టార్లు) కమతాలు 8.6 శాతం నుండి 5.5 శాతానికి తగ్గాయి. సెమిమీడియం (2-4 హెక్టార్లు) కమతాలు 10.6 శాతము నుండి 3.5 శాతానికి తగ్గాయి. చిన్న, సన్నకారు రైతుల ఆధీనంలోని భూమి శాతం 18 నుండి 51కి పెరిగింది. మీడియం, పెద్ద కమతాల ఆధీనంలోని భూమి 65 శాతం నుండి 32 శాతానికి తగ్గిపోయింది.

7.8 భూసంస్కరణ శాసనాలను అమలు జరిపే సమస్య :

అనేక దేశాలు భూసంస్కరణలకు సంబంధించిన శాసనాలు చేయడం వాటిని అమలులో పెట్టడం కూడా జరిగింది. కాని ఈ శాసనాలను అమలులో పెట్టటంలో వెనుకబడిన దేశాలు విజయాన్ని సాధించలేకపోయాయని చెప్పవచ్చు. గున్నార్ మిర్డల్ పరిశీలన ప్రకారం దక్షిణాసియా దేశాలలో కౌలుదారులలో నిరక్షరాస్యత ఎక్కువ. వారికి కౌలుదారీ శాసనాల గురించికాని, వాటిద్వారా చేకూరే హక్కుల గురించి కాని పరిజ్ఞానం లేదు. పెద్ద భూస్వాములు సహజంగా భూసంస్కరణల పట్ల వ్యతిరేకత చూపుతారు. భూసంస్కరణలు అమల్లులో పెట్టటానికి చర్యలు తీసుకొనే ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించటానికి వారు ప్రయత్నం చేయవచ్చు. కౌలుదార్ల మధ్య ఐకమత్యం లేనందువల్ల వారు తమ హక్కులను సమిష్టి శక్తితో రక్షించుకోలేకపోతున్నారు. కౌలుదార్లు సహజంగా భూస్వాముల పిడికిలిలో ఉంటారు. అలాంటి పరిస్థితులలో కౌలుదారులకు శాసనాల నుంచి రక్షణ చేకూరదు. అనుపస్థితి భూస్వాములకన్నా భూస్వామి రైతులు అనేక యుక్తులుపన్ని కౌలు శాసనాలను తప్పించుకొంటున్నారు. ప్రస్తుతపు సాగుదారులను తొలగించి, కూలీల సహాయంతో వ్యవసాయం చేయగల్గుతున్నారు. భూమి తన చేతుల నుంచి కూలీల చేతులలోకి మారగలదనే భయంతో కౌలుదారులు జీవించవలసి ఉంటుంది. శాసనాలు ఆ భయాన్ని తొలగించలేకపోతున్నాయి. దక్షిణ ఆసియా దేశాలలో సొంత వ్యవసాయం కోసం భూమిని కౌలుదారుల నుంచి వశపరుచుకొనే హక్కులు భూస్వాములకు అధికంగా ఉన్నాయి. సొంత వ్యవసాయమనే సాకుతో కౌలుదారులను తరచుగా భూమి నుంచి తొలగించడం జరుగుతున్నది. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలలో మాత్రం సొంత వ్యవసాయం నిమిత్తమై స్వాధీనం చేసుకొనే భూమి పరిమాణాన్ని శాసనాల ద్వారా పరిమితం చేయడం జరిగింది.

భూస్వాములు, కౌలుదారుల మధ్య గల సాంఘిక అంతస్తుల (Social Status) తేడా ఎక్కువగా ఉండటం వల్ల కూడా భూసంస్కరణలకు సంబంధించిన శాసనాలను అమలు జరపడం కష్టమవుతున్నది. పాశ్చాత్య దేశాలలో భూస్వామి - కౌలుదారు వీరిమధ్య గల సాంఘిక అంతస్తుల తేడాలు దక్షిణ ఆసియాలో వలె ఎక్కువగా లేవు. కాబట్టి శాసనాల ఉల్లంఘనాన్ని ఎదిరించే ధైర్యం కౌలుదారులకు పాశ్చాత్య దేశాలలో ఉన్నాయి.

భారతదేశంలో భూసంస్కరణ శాసనాలను అమలులో పెట్టడంలో ఉన్న సమస్యల విషయమై చేసిన పరిశీలననుబట్టి భూసంస్కరణల విషయంలో అనేక లోపాలున్నాయని తెలుస్తున్నది. శాసనాలు చేయడంలోను వాటిని అమలులో పెట్టటంలో ఆలస్యం జరిగింది. దేశంలోని అనేక ప్రాంతాలలో పంటలు పంచుకొనే ఏర్పాటు ఉంది. కౌలుదారులను తొలగించడం జరుగుతున్నది. కౌలుదారులను రక్షించే పరిపాలనా యంత్రాంగం వారికి అందుబాటులో లేదు. కౌలుదారులు - భూస్వాముల ఒప్పందాన్ని తెలియజేసే గ్రామీణ రికార్డులు అన్ని రాష్ట్రాలలోను లేవు. రికార్డ్‌లు ఉన్నచోట్ల కూడా కౌలుదారుని పేరు వ్రాసే అలవాటు లేదు. ఒకవేళ కౌలుదారుని పేరు వ్రాసి పెట్టినా, భూస్వామికి గ్రామంలో ఉండే పలుకుబడి ప్రభావం వలన కౌలుదారు తన హక్కులను రక్షించుకోలేకపోతున్నాడు. రెవిన్యూ శాఖ వారి దృక్పథం కూడా కౌలుదారుల పట్ల కొన్ని సమయాలలో వ్యతిరేకంగా ఉంటుంది. కౌలుపరిమాణం నిర్ణయించి చేసిన శాసనాలు పటిష్టంగా అమలులో పెట్టటంలేదు. భూములను, ఇతర పేరులతో మార్చడంవల్ల, కుటుంబ విభజన జరగడం వల్ల, కమతాల గరిష్ఠ పరిమాణం నిర్ణయించే చర్యలు ఎక్కువ ప్రయోజనకారులుగా ఉండటం లేదు. వి.యమ్. దండేకర్ అభిప్రాయంలో భూసంస్కరణ శాసనాలలో లోపాలు ఉండటంవల్ల, ఈ సమస్య పరిష్కారం న్యాయస్థానాలకు పోవడం, అందువలన శాసనాలను అమలులో పెట్టడం ఆలస్యమవుతున్నది. భూసంస్కరణ శాసనాలను అమలులో పెట్టటానికి పెద్ద యెత్తున పరిపాలనా యంత్రాంగం అవసరమవుతుంది. ఉన్న యంత్రాంగానికి పరిపాలనా కార్యక్రమాలు ఇప్పటికే ఎక్కువగా ఉన్నాయి కాబట్టి వారు భూసంస్కరణల శాసనాలపట్ల శ్రద్ధ చూపలేరు. రెవిన్యూ పరిపాలనను అభివృద్ధి చేసినట్లయితే భూసంస్కరణ అమలులో పెట్టటం కొంత సులభమవుతుంది. సక్రమంగా శాసనాలను అమలుపెట్టనట్లయితే చాలా ఉపయోకరమైన శాసనం కూడా వ్యవసాయరంగ పరిస్థితులను పెంపొందించడంలో నిష్ప్రయోజనమనిపించుకొంటుంది.

7.8.1 భూసంస్కరణ శాసనాల అమలుకు అనువైన పరిస్థితులు :

భూసంస్కరణ శాసనాలు చేయడం, వాటిని విజయవంతం కావలెనన్న, భూమికి సంబంధించిన విషయ సేకరణ అవసరము. వ్యవసాయ పరిమాణము, భూసారలక్షణము, భూస్వామ్య పద్ధతులు, కమతాల పరిమాణము, పంటల తీరు, ఉత్పాదకత, నీటిపారుదల సౌకర్యాలు మొదలయిన వాటిని గురించి గణాంకాత్మక విషయసేకరణ ఎంతో అవసరము. ఈ విషయ సేకరణలో లోపాలు ఉన్నట్లయితే భూసంస్కరణ శాసనాలలో లోపాలు ఉండటం, శాసనాలు విమర్శలకు గురికావడం, శాసనాలు అమలులో పెట్టటంలో ప్రజల నుంచి వ్యతిరేకత బయలుదేరడం సంభవిస్తాయి.

భూసంస్కరణ శాసనాలను పటిష్టంగా అమలులో పెట్టవలెనంటే, శాసనాలు సులభమైనవిగాను, అవగాహనకు, ఆచరణకు అనుకూలమైనవిగాను ఉండవలెను. కౌలుదారుల సాంఘిక ఆర్థిక బలహీనత కారణంగా ఏర్పడే సమస్యలను ఎదుర్కొనటానికి తగిన పరిపాలనా యంత్రాంగం ఉండవలెను. పరిపాలనా యంత్రాంగం కౌలుదారులకు అందుబాటులో ఉండవలెను. కౌలు భద్రతకు సంబంధించిన శాసనాలను ఉల్లంఘించడానికి అవసరం లేనటువంటి పరిస్థితులు చేకూర్చాలి.

సంఘంలో భూస్వామి కౌలుదారుల అంతస్తులో తేడాలను తగ్గించడానికి తగిన చర్యలను తీసుకోవాలి. కౌలుదారుల ఆర్థికస్థాయి పెరగడంతో సమాజంలోని అంతస్తుల తారతమ్యాలు తగ్గుతాయి. అది భూసంస్కరణల శాసనాలను అమలులో

పెట్టడానికి దోహదం చేస్తుంది. భూసంస్కరణల శాసనాలు అమలులో పెట్టడంలో శాసనాల పరిజ్ఞానం కౌలుదారులలో ఉండవలెను. ఇందుకు విద్యావిస్తరణ అవసరమవుతుంది. ప్రతి గ్రామంలోను కౌలుపట్టాలను తయారు చేసినట్లయితే ప్రతి కౌలుదారు భూస్వామి నుంచి ఎంత భూమిని కౌలుకు తీసుకొన్నది స్పష్టంగా తెలుసుకోవచ్చు.

మిగులు భూమి పంపిణీ చేసే సమయంలో అవసరమైతే చట్టం చేసయినా సరే భూమిని కేటాయించిన వ్యక్తి లేదా భూమి మీద స్థిరపడే వ్యక్తి 20 ఏళ్ళ వరకు తన భూమిని వ్యవసాయేతరమైన ఏ సహకార సంస్థకుగాని, వ్యాపార బ్యాంకుకు గాని లేదా ప్రభుత్వానికి గాని తాకట్టు పెట్టకూడదు లేదా అమ్మకూడదు అని నిర్ణయించాలి. ఆలా చేసినట్లయితే ప్రస్తుతం భూములను పొందిన వ్యక్తులు తమ అవసరం కొద్ది భూములను అమ్మి తిరిగి భూమి లేని వారిగా మారి పథకం నీరుగారి పోయేటట్లు చేయవచ్చు.

పంపిణీ చేయబడిన భూమివల్ల పేదలకు ప్రయోజనం కలగాలంటే, వారికి విత్తనాలు, రసాయనిక ఎరువులు, నీటివనరులు ముఖ్యంగా పరపతి, రూపొందించబడిన విస్తృత సేవలు అమలులోకి తేవాలి.

భూసంస్కరణ శాసనాలను అమలులో పెట్టాలంటే ప్రభుత్వానికి ప్రజల సహకారం ఎంతో అవసరం. భూస్వాములలో కొంత త్యాగబుద్ధి, వ్యక్తిగత సమస్యలపట్ల ప్రభుత్వ ఔదార్యంలో శాసనాలలో సరళత అవసరమవుతుంది. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వము ప్రజల సహకారాన్ని పొంది అమలులో పెట్టవచ్చు.

7.9 సారాంశము :

మన వ్యవసాయరంగం సంస్థాపరమైన, సాంకేతికపరమైన సమస్యలతో సతమతమవుతున్నది. ఫలితంగా వ్యవసాయంలో స్తబ్దత ఏర్పడి ఉత్పత్తులు గణనీయంగా పడిపోతున్నాయి. చేసిన కష్టం చేతికందక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దున్నేవానికి భూమి స్వంతం కానిదే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచడం ద్వారా అధికోత్పత్తి సాధించలేము. భూసంస్కరణలు సక్రమంగా అమలు జరగకపోతే దేశంలో వెనుకబడినతనం ఉండి వ్యవసాయ రంగంలో సామాజిక న్యాయం చేకూరక అభివృద్ధి ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. గరిష్ట పరిమితులు నిర్ణయించిన కాలానికి, వాటికి ఆచరణలో పెట్టిన కాలానికి మధ్య ఎక్కువ తేడా ఉండటం వలన చాలామంది మిగులు భూములను చట్టవిరుద్ధంగా అమ్ముకొన్నారు. ప్రభుత్వం ఎన్నిచర్యలు చేపట్టినప్పటికీ వాటిని భూస్వాములు వారికి అనుకూలంగా మార్చుకొంటున్నారు. సరిఅయిన రికార్డులు, సమర్థవంతమైన పరిపాలన లోపించడం వలన గరిష్ఠ పరిమితి చట్టాల అమలులో జాప్యం జరుగుతుంది. ప్రజలే ప్రభుత్వానికి సహకరించకపోవడం వలన కమతాలకు గరిష్ట పరిమితి నిర్ణయించిన తరువాత మిగులు భూమిని తీసుకొని భూమిలేనివానికి పంపిణి చెయడం కష్టమైపోతుంది. పెండింగ్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించి మిగులు భూమిని పంపిణీ చేయాలి. ఈ నేపధ్యంలో సంస్కరణలు అర్థవంతంగా అమలవ్వాలంటే రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రజల కమిటీలను ఏర్పరచి అందులో అనుభవంగల వారిని సభ్యులుగా నియమించాలి. అప్పుడప్పుడు రాజకీయ సమావేశాలు ఏర్పరచి భూసంస్కరణల అమలు గురించి సమీక్షించాలి. భూమికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు తయారుచేయాలి. వ్యవసాయదారులకు పాసుపుస్తకాలు ఇవ్వాలి. మిగులు భూమిని పేదరైతులకు, భూమిలేనివారికి పంపిణీచేసి దానిని వ్యవసాయ యోగ్యంగా మార్చుకోవడానికి వారికి ఋణసదుపాయం కల్పించాలి. భూగరిష్ఠ పరిమితుల చట్టాన్ని సక్రమంగా అమలుచేసినట్లయితే సాంఘిక న్యాయం చేకూరుతుంది. వ్యవస్థాపరమైన సమస్యలు పరిష్కారమై వ్యవసాయరంగం అభివృద్ధి చెందుతుంది.

7.10 నమూనా ప్రశ్నలు :

1. భూసంస్కరణల ధ్యేయాల్ని వివరించండి.
2. భారతదేశంలో భూసంస్కరణల స్వరూప స్వభావాల్ని వివరించండి.
3. సహకార వ్యవసాయ లక్షణాలను, లాభాలను, ఇబ్బందులను వివరించండి.
4. సమిష్టి వ్యవసాయము గూర్చి వ్రాయుము.

7.10 చదువదగిన గ్రంథాలు :

1. Dorren Warriner : Land Reforms and Economic Development
2. A.M. Khusro : Readings in Agricultural Development
3. Prof. G.Partha Sarathy & Dr. B. Prasada Rao : Implementation of Land Reforms in Andhra Pradesh
4. Telugu Academy : Indian Economy, 1998
5. Ruddar Dutt & K.P.M. Sundaram : Indian Economy, 2004
6. Telugu Academy : Agricultural Economics

డా॥ కోటిరెడ్డి

పాఠము - 8

వ్యవసాయ శ్రామికులు - సమస్యలు

8.0 లక్ష్యం :-

ఈ పాఠ్యాంశాన్ని చదివిన తరువాత విద్యార్థి సమగ్రంగా ఈ క్రింది విషయాలను గురించి అవగాహన చేసుకోగలడు.

* వ్యవసాయ శ్రామికుల స్థితిగతులు మరియు సమస్యలు
* వ్యవసాయ శ్రామికులలో నిరుద్యోగం - అల్ప ఉద్యోగిత పెరగడానికి గల కారణాలు
* వ్యవసాయ శ్రామికుల సమస్యలను నివారించడానికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలు

విషయసూచిక :-

8.1 ఉపోద్ఘాతము

8.2 వ్యవసాయశ్రామికులు

8.3 వ్యవసాయశ్రామికులలో నిరుద్యోగం - అల్పఉద్యోగిత పెరగడానికి గల కారణాలు

8.4 వ్యవసాయశ్రామికుల స్థితిగతులు మరియు సమస్యలు

8.5 వ్యవసాయ శ్రామికుల స్థితిగతులు మెరుగుపరచడానికి చర్యలు

8.6 వ్యవసాయశ్రామికుల స్థితిగతులు మెరుగుపరచడానికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలు

8.7 సారాంశం

8.8 ముఖ్యపదాలు

8.9 నమూనా ప్రశ్నలు

8.10 చదువదగిన గ్రంథాలు

8.1 ఉపోద్ఘాతము :

వ్యవసాయం అభివృద్ధి చెందుతూ ఉంటే అది ప్రజల కొనుగోలు శక్తిని పెంచి వారు పారిశ్రామికవస్తువులను, సేవలను ఖరీదు చేసుకునేట్లు చేయడమే కాక వ్యవసాయరంగం నుంచి శ్రామికులు పారిశ్రామికంగానూ, తచితరంగానూ ఉద్యోగాలు స్వీకరించేందుకు వారిని విడుదల చేస్తుంది. అలా వారిని విడుదల చేయకుండా ఉన్నట్లయితే దేశానికి ఆర్థిక పురోగతి, లేక పేదరిక నిర్మూలన అనేవి సాధ్యం కావు. ప్రాథమికరంగం లేదా వ్యవసాయం ద్వారా అందుతున్న అత్యధిక ఉత్పత్తులు, రెండవ రంగంలోని సాధనాల ద్వారా వస్తురూపకల్పన చేయవలసి ఉంటుంది .దీనికి మూడోరంగం సేవలు ఉపయోగించడం జరుగుతుంది. మానవ అవసరాలు తీరేముందు, తృప్తి తీర్చుకొనే ముందు ఇదంతా జరుగుతుంది. ఇక్కడ గ్రహించవలసిన విషయమేమంటే, వ్యవసాయరంగంపై ఆధారపడే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లయితే, అంతమేరకు ఆ దేశం పేదదేశంగానే కొనసాగవలసి ఉంటుంది. ఆ దేశంలో ఆ ప్రజానీకం జీవనప్రమాణ స్థాయి చాలా దిగజారి ఉంటుంది. దేశంలోని జనాభాలో అధిక

సంఖ్యాకులు వ్యవసాయోత్పత్తి చేయడంలో విద్య, ప్రజారోగ్యం, ఆరోగ్య భద్రత, విద్యుత్ లాంటి సేవా కార్యకలాపాలలో నాగరిక జీవన విధానాల వాంఛలను పరిపూర్తి చేయడంలో ద్వితీయ, తృతీయమైన రంగాలలో ఆర్థిక రీత్యా నిమగ్నమై ఉన్నట్లయితే ప్రజల జీవన ప్రమాణస్థాయి ఉన్నతంగా ఉంటుంది. ఆర్థికరంగంలోని ఒక పరిశ్రమలో నిమగ్నమై పనిచేసే కూలి అనతికాలంలోనే నేర్పరి కైతూ, ఇతర పరిశ్రమలకు, ఇతర వృత్తులకు అడుగిడుతూ, గిరాకీకి చురుకుదనం కలిగిస్తూ, ఉత్పత్తి అధికం చేసే ప్రతి అంశాన్ని అతడు పరిశీలిస్తుంటాడు. గిరాకీ కంటే ఉత్పత్తి దేనిలోనైతే అధికమవుతుందో ఆ స్థితి నుంచి శ్రామికుడు మార్పుకు గురి అవుతాడు. దీని ప్రభావం వలన వస్తు ఉత్పత్తిలో చురుకుదనం కలిగించి, అధిక ధరలు, లాభాలు, వేతనాలపై చూపుతుంది. ఆదాయరీత్యా, వ్యవసాయ ఆదాయాలు ఇతరమైన వాటికంటే తక్కువే అయినప్పటికి, ఈనాడు వ్యవసాయంలో స్థిరపడి ఉన్న కూలీలు, ఆకర్షణీయమైన అవకాశం లభించినప్పుడు తమ పూర్వ వృత్తిని విడిచి పెడతారు. అంటే ప్రతి ఎకరంలోనూ ఉత్పత్తి అత్యధికమైనప్పుడు, వారు వ్యవసాయేతర వృత్తులకు మార్పు చెందుతారు. ఇందువల్ల మొత్తం ఉత్పత్తిలో వ్యత్యాసం కనపడదు. అంటే, తాము నూతనవృత్తి నిర్వహించే పరిసరాలలో సులభంగానో, చౌకగానో ఆహారం వారికి అందుబాటవుతుంది.

8.2 వ్యవసాయ శ్రామికులు :

వ్యవసాయ శ్రామికులు సమాజంలోని ఆర్థికంగా మరియు సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందినవారు. ఒక కుటుంబంనందు సంపాదించే వారిలో అధిక సంఖ్యాకులు ప్రధానంగా వ్యవసాయ కార్మికులైనచో ఆ కుటుంబాన్ని వ్యవసాయ కార్మిక కుటుంబంగా పరిగణించవచ్చు. ఒక కుటుంబం పొందే మొత్తం ఆదాయంలో సగానికి పైగా వ్యవసాయ వేతనాల నుండి పొందితే, ఆ కుటుంబాన్ని వ్యవసాయ 'శ్రామిక కుటుంబం' అని చెప్పవచ్చు. వ్యవసాయ శ్రామికులను 4 విధాలుగా విభజించవచ్చు.

ఎ) భూమిలేని వ్యవసాయ శ్రామికులలో కొందరు భూస్వాములను అంటిపెట్టుకుని ఉంటారు.

బి) భూమిలేని వ్యవసాయ శ్రామికులలో కొందరు ఎవరినీ అంటిపెట్టుకోకుండా స్వతంత్రంగా జీవిస్తూ, వారికి పని దొరికిన చోట పనిచేస్తూ ఉంటారు.

సి) అతి తక్కువ పరిమాణంలో కమతాలను కల్గి ఉండి,ఎక్కువ సమయం ఇతరులవద్దే పని చేస్తుంటారు.

డి) లాభసాటి కమతాలున్న వ్యవసాయ శ్రామికులు, వారు శ్రామికులుగా పనిచేయకున్నచో వారి పిల్లలలో కొందరు పెద్ద భూస్వాముల వద్ద పనిచేస్తుంటారు.

8.2.1 వ్యవసాయ శ్రామికుల సంఖ్య :

వ్యవసాయ శ్రామికుల సంఖ్య, ఆదాయము మరియు వారి జీవనప్రమాణస్థాయికి సంబంధించి నిర్దిష్టమైన అంచనాలు లభ్యం కాకపోయినప్పటికి, కొన్ని కమిటీలు మరియు కమీషన్ రిపోర్టుల ఆధారంగా కొంత సమాచారం లభ్యమవుతుంది. రెండవ వ్యవసాయ శ్రామికుల ఎంక్వయిరీ కమిటీ రిపోర్టు ఆధారంగా 1960లో మొత్తం గ్రామీణ కుటుంబాలలో 25 శాతం వ్యవసాయ శ్రామిక కుటుంబాలున్నాయి. వీరిలో 85 శాతంపైగా క్యాజువల్ శ్రామికులు కాగా, సుమారు 15 శాతం వ్యవసాయ శ్రామికులు భూస్వాములను అంటిపెట్టుకొన్నవారు. 50 శాతం పైగా వ్యవసాయ శ్రామిక కుటుంబాలకు భూమిలేకపోగా మిగిలినవారికి కొద్దిపాటి భూమి మాత్రమే ఉంది. వ్యవసాయ శ్రామికులు ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు వెనుకబడిన తరగతులకు చెందినవారు. ఒక అంచనా ప్రకారం మొత్తం వ్యవసాయ శ్రామికులలో 75 నుండి 80 శాతం షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు.

1991 లో ఏర్పాటైన గ్రామీణ శ్రామికుల జాతీయ కమీషన్ అంచనా ప్రకారం 1987 - 88 లో మొత్తం 108. 4 మిలియన్ల గ్రామీణ కుటుంబాలలో 43 మిలియన్ల కుటుంబాలు గ్రామీణ శ్రామిక కుటుంబాలున్నాయి. వీరిలో వ్యవసాయ శ్రామిక కుటుంబాలు 33.3 మిలియన్లు. మొత్తం శ్రామిక కుటుంబాలలో 39.7 శాతం గ్రామీణ శ్రామిక కుటుంబాలు కాగా, 30.7 శాతం వ్యవసాయ శ్రామిక కుటుంబాలున్నాయి. దీనిప్రకారం 1987- 88 లో మొత్తం గ్రామీణ శ్రామిక కుటుంబాలలో 77 శాతం వ్యవసాయ శ్రామిక కుటుంబాలే.

1981 జనాభా లెక్కల ప్రకారం మొత్తం వ్యవసాయ శ్రామికులు 64.4 మిలియన్లు. మొత్తం శ్రామికులలో వ్యవసాయ శ్రామికులు 26.3 శాతంగా ఉన్నారు. 1961లో వ్యవసాయ శ్రామికులు 31 మిలియన్లు మాత్రమే. దీని ప్రకారం వ్యవసాయ శ్రామికుల సంఖ్యలో పెరుగుదల ఎక్కువగా ఉన్నదని చెప్పవచ్చు. గ్రామీణ శ్రామికులపై ఏర్పాటయిన జాతీయ కమీషన్ అభిప్రాయంలో '1970's మరియు 1980's లలో గ్రామీణ జనాభా సాంవత్సరిక వృద్ధి 2 శాతం మరియు 1.5 శాతంగా ఉన్నది. ఇదే కాలంలో వ్యవసాయ శ్రామికుల వృద్ధి 4 శాతం మరియు 3 శాతంగా ఉన్నది'. ఉపాంత రైతులు కూడా భూమిలేని శ్రామికులుగా మారుతున్నారు. పాత ఋణాల నేపధ్యంలో పెరుగుతున్న ఆర్థికపరమైన ఒత్తిళ్ళ వలన వీరు తమకున్న కొద్దిపాటి భూమిని కూడా విక్రయించి భూమిలేని వ్యవసాయ శ్రామికులుగా మారిపోతున్నారు.

గ్రామీణ శ్రామికులపై ఏర్పాటయిన జాతీయ కమీషన్ మరొక అంచనా ప్రకారం 1977 - 78 లో వ్యవసాయ వేతన ఉపాధిలో భాగంగా పురుషులకు సంవత్సరంలో సగటు పనిదినాలు 230 కాగా స్త్రీలకు 184 గా ఉన్నాయి. 1983 లో (4వ గ్రామీణ శ్రామిక ఎంక్వయిరీ అంచనా ప్రకారం) సంవత్సరంలో పురుషుల సగటు పనిదినాలు 159 కాగా, స్త్రీలకు 136 పనిదినాలు మాత్రమే లభించాయి. మొత్తం దేశంలోని శ్రామిక శక్తిలో వేతన కార్మికుల నిష్పత్తి 1972 -73లో 34.1 శాతంగా ఉండగా 1987-88 నాటికి 41.4 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో మొత్తం వేతన శ్రామికులలో క్యాజువల్ శ్రామికులు 1972-73లో 64.8% కాగా 1987 -88లో 75.8% గా ఉన్నారు. వ్యవసాయరంగంలో సాంకేతిక పరమైన మార్పులు చోటుచేసుకోవడం, కౌలుదార్ల తొలగింపు, సాంప్రదాయమైన కుటీర పరిశ్రమలు తరిగిపోవడం, ద్రవ్యోల్బణం లాంటి ముఖ్యమైన కారకాలు దేశంలో వివిధ ప్రాంతాలలో వివిధరకాలుగా ఉండటంవలన వ్యవసాయకార్మికుల సంఖ్య పెరుగుదలకు కారణమని జాతీయ కమీషన్ అభిప్రాయపడింది.

1991 జనాభా లెక్కల ప్రకారం, వ్యవసాయ కార్మికులు 1951లో ఉన్న 27.5 మిలియన్ల నుండి 1991లో 74.6 మిలియన్లకు పెరిగారు. ఈ 40 సంవత్సరాల కాలంలో 171 శాతం వ్యవసాయ కార్మికులు పెరిగినట్లు ఇది సూచిస్తున్నది. వ్యవసాయరంగంలో మొత్తం శ్రామికులు (వ్యవసాయదారులు మరియు వ్యవసాయ శ్రామికులు) 1951 లో ఉన్న 97.2 మిలియన్లనుండి 1991 నాటికి 185.3 మిలియన్లకు పెరిగారు. ఈ 40 సంవత్సరాల కాలంలో ఇది 90.5 శాతం పెరుగుదలను సూచిస్తున్నది.

8.3 వ్యవసాయ శ్రామికులలో నిరుద్యోగం - అల్ప ఉద్యోగిత పెరగడానికి కారణాలు :

భారతదేశంలో వ్యవసాయ శ్రామికుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. శ్రామికుల సంఖ్య పెరగడానికి గల కారణాలను క్రిందివిధంగా వివరించవచ్చు. శ్రామికుల సంఖ్య పెరిగేకొద్ది నిరుద్యోగం, అల్ప ఉద్యోగిత ఎక్కువగా ఉంటుంది.

8.3.1 జనాభా పెరుగుదల :

1921 తర్వాత మనదేశంలో జనాభా పెరుగుదల చాలా వేగవంతమయింది. కాని అభివృద్ధి చాలా నెమ్మదిగా ఉన్నందువలన వ్యవసాయరంగం మినహా మిగిలిన రంగాలలో ఉపాధి అవకాశాలు కల్పించడం సాధ్యంకాలేదు. ఉత్పత్తి రంగం, రవాణా మరియు తృతీయ రంగానికి చెందిన పరిశ్రమలలో మూలధన – శ్రామిక నిష్పత్తి స్థిరమైనది. దీనిలో ఎటువంటి మార్పులేదు. దీనివలన ఈ రంగాలలో పెరుగుతున్న జనాభాకు ఉపాధి అవకాశాలు కల్పించలేము. కాని వ్యవసాయ రంగంలో ఈ పరిస్థితి విభిన్నంగా ఉంటుంది. మూలధన – శ్రామిక నిష్పత్తి కాకుండా భూమి – శ్రామిక నిష్పత్తి వ్యవసాయరంగంలో మార్పు చెందుతూ ఉంటుంది. కనుక జనాభా పెరుగుతున్నప్పుడు, పెరుగుతున్న జనాభా తమ జీవనాధారం కోసం వ్యవసాయరంగంపై ఆధారపడతారు. కావున పెరుగుతున్న జనాభా వ్యవసాయరంగంలో శ్రామికుల సంఖ్య పెరుగుదలకు ముఖ్య కారణంగా చెప్పవచ్చు.

8.3.2 కుటీర పరిశ్రమలు మరియు గ్రామీణ హస్తకళల తగ్గుదల :

బ్రిటీష్ పరిపాలనా కాలంలో కుటీర పరిశ్రమలు మరియు గ్రామీణ హస్తకళలు చాలా వరకు తగ్గిపోయాయి. వీటి స్థానంలో ఆధునిక పరిశ్రమలు ఏర్పాటు చేయబడలేదు. మనదేశానికి చెందిన సాంప్రదాయ పరిశ్రమలను నాశనం చేయడానికి బ్రిటీష్ పాలకులు అనేక రకాల చర్యలు తీసుకున్నారు. కుటీర పరిశ్రమలు మరియు హస్తకళల రంగంపై ఆధారపడిన నేర్పరితనం కల్గిన మరియు నేర్పరితనం లేనటువంటి శ్రామికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో వారు శ్రద్ధ వహించలేదు. ఈ పరిశ్రమలలో ఉపాధి కోల్పోయిన వారు తమ జీవనాధారం కొరకు వ్యవసాయరంగంపై ఆధారపడుట వలన వ్యవసాయ శ్రామికుల సంఖ్య పెరిగిపోతున్నది.

8.3.3 చిన్న రైతులు మరియు కౌలుదారులను భూమినుంచి తొలగించుట :

దక్షిణ భారతదేశంలో రైత్వారీ పద్ధతి ఉన్న ప్రాంతాలలో భూమి మొదట రైతులకే చెందింది. తర్వాత కాలంలో మధ్యవర్తులు పెరగడం వలన భూమి నెమ్మదిగా చిన్న రైతుల వద్దనుండి మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. దీని వలన చిన్న రైతులు కౌలుదారులుగానో లేక వ్యవసాయ శ్రామికులుగానో మిగిలిపోవలసివచ్చింది. భూసంస్కరణల ప్రారంభానికి ముందుకాలంలో జమీందారులు మరియు భూస్వాములు ఎటువంటి ప్రత్యామ్నాయాలు లేనందువలన ఉపాధి కోసం వ్యవసాయరంగంపై ఆధారపడటం వలన వారు వ్యవసాయ శ్రామికులుగా మిగిలిపోయారు.

8.3.4 లాభసాటి కాని కమతాలు :

పెరుగుతున్న జనాభా మరియు ఉమ్మడికుటుంబాలు విచ్ఛిన్నం కావడం వలన ఉన్న కమతాలు విభజింపబడి చాలా చిన్న కమతాలుగా మారుతున్నందువలన వ్యవసాయేతరరంగంపై వత్తిడి పెరుగుచున్నది. దీనివలన చాలా పెద్ద సంఖ్యలో కమతాలు లాభసాటి కాని కమతాలుగా మారుతున్నాయి. పేదరికం వలన సకాలంలో పెట్టుబడి పెట్టలేక వ్యవసాయరంగ కార్యక్రమాలలో వెనుకబడి ఉంటున్నారు. ఈ చిన్న కమతాలనుంచి వచ్చే ఆదాయం తమ కుటుంబ అవసరాలకు కూడా సరిపోనందువలన అదనపు ఆదాయం కొరకు జమీందారులు మరియు భూస్వాములకు చెందిన వ్యవసాయ క్షేత్రాలలో ఉపాధి పొందుతూ వ్యవసాయ శ్రామికులుగా మారుతున్నారు.

8.3.5 ఋణగ్రస్థత ఎక్కువగా ఉండుట :

గ్రామీణప్రాంతాలలో చిన్న రైతులలో ఋణభారం ఎక్కువగా ఉండటం కూడా వ్యవసాయ శ్రామికుల సంఖ్య పెరగడానికి ఒక కారణము. వడ్డీ వ్యాపారులు గ్రామీణప్రాంతాలలోని చిన్న రైతులకు ఉత్పాదక మరియు అనుత్పాదక ఋణాలనిస్తారు. వారు వసూలు చేసే వడ్డీ రేటు అధికంగా ఉండటం మరియు మోసపూరితమైన అకౌంట్లు నిర్వహించి అధికమొత్తంలో చిన్న రైతులు బకాయిలు ఉన్నట్లుగా చూపుతారు. తీసుకున్న ఋణాలను తిరిగి చెల్లించలేని పరిస్థితులలో ఇప్పటికే ఋణంకోసం తనఖాగా ఉంచిన తమ భూమిని వడ్డీ వ్యాపారులకు కోల్పోయి వీరు వ్యవసాయ శ్రామికులుగా మిగిలిపోతున్నారు.

8.3.6 భూమి పంపిణీలో అసమానతలు :

భూమిని సొంతంగా కలిగి ఉండటంలో అనేక అసమానతలు ఉన్నాయి. కొందరు వంశపారంపర్య హక్కువలన పూర్వీకుల నుండి భూమిని స్థిరాస్థిగా పొందారు. కొందరు కష్టించి పనిచేసి భూమిని కొనుగోలు చేసిన రైతులు కలరు. గ్రామీణ ప్రాంతాలలో ఆదాయవ్యత్యాసాలు ఉండటానికి గల ముఖ్యకారణాలుగా వీటిని పేర్కొనవచ్చు. ఒక అంచనా ప్రకారం మనదేశంలో 2 హెక్టార్ల కన్నా తక్కువ భూమి కల్గిన చిన్న రైతులు 76 శాతం ఉన్నట్లు తెలియుచున్నది. మనదేశంలో నీటిపారుదల సౌకర్యాలు సరిగా లేనందువలన ఇప్పటికీ వర్షాల మీద ఎంతోమంది రైతులు ఆధారపడి తమ పంటలను పండిస్తున్నారు. వర్షాలు కూడా సకాలంలో కురవక పోవడం, అతివృష్టి, అనావృష్టి ల వలన చిన్న రైతులు అనేక కష్టాలను ఎదుర్కోనవలసి వస్తున్నందువల్ల తమకున్న కొద్దిపాటి భూములను విక్రయించి వ్యవసాయ శ్రామికులుగా మారిపోతున్నారు.

8.4 వ్యవసాయ శ్రామికుల స్థితిగతులు మరియు సమస్యలు :

వ్యవసాయ శ్రామికులు సంఘంలో దోపిడీకి మరియు అణచివేతకు గురి అయిన బలహీనవర్గాల వారు. స్వాతంత్ర్యానికి ముందు వీరి స్థితి సెర్ఫ్(serf) ల స్థితికన్నా మెరుగుగా ఉండేదికాదు. భూస్వాములు, జమీందారులు వీరికి కొంత ఋణాలు ఇవ్వడం ద్వారా, వాటిని తీర్చలేని పక్షంలో బానిసలుగా మార్చుకొనేవారు. ఈ బానిస వ్యవస్థ ఒక తరాన్నుంచి మరొక తరానికి కొనసాగుతూ, ఈ వ్యవస్థను అంటిపెట్టుకుని ఉన్న శ్రామికులు దోపిడీకి గురవుతున్నారు. స్వాతంత్ర్యం లభించిన తరువాత 57 సంవత్సరాల కాలంలో ఈ పరిస్థితి కొంత మెరుగయ్యింది. ఇప్పటికీ వ్యవసాయశ్రామికులు ఎటువంటి వనరులూ లేని పేద తరగతికి చెందిన వారిగా మిగిలిపోయారు. వారి వేతనస్థాయి మరియు వినియోగస్థాయి చాలా తక్కువగా ఉంది. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లభించనప్పుడు, వారు భూస్వాములపై ఆధారపడవలసి వస్తున్నది. శ్రామిక డిమాండ్ కన్నా శ్రామిక సప్లై ఎక్కువగా ఉన్నందువలన వారు ఎక్కువగా నిరుద్యోగానికి గురవుతున్నారు.

వ్యవసాయరంగంలో శ్రామికశక్తి (వ్యవసాయదారులు మరియు వ్యవసాయ శ్రామికులు కలిపి) 1951లో 97.2 మిలియన్లు కాగా 1991 నాటికి వీరిసంఖ్య 185.2 మిలియన్లకు పెరిగింది. వ్యవసాయ శ్రామికులు 1951 లో 27.3 మిలియన్లు కాగా వీరి సంఖ్య 1991 నాటికి 74.6 మిలియన్లకు పెరిగింది. దీనినిబట్టి 1951 మరియు 1991 మధ్యకాలంలో వ్యవసాయ శ్రామికులసంఖ్య 3 రెట్లు పెరిగింది. వ్యవసాయరంగంలో శ్రామికశక్తిని నిష్పత్తిని ఆధారంగా చేసుకొని పరిశీలించినప్పుడు 1951లో వ్యవసాయ శ్రామికులలో 28% పెరుగుదల ఉండగా, 1991లో పెరుగుదల 40% ఉంది. దీనిని బట్టి భారతదేశ వ్యవసాయరంగంలో శ్రామికశక్తి యొక్క కాజువలైజేషన్ వేగంగా ఉండటం గమనించవచ్చు. స్థూలదేశీయ ఉత్పత్తి(GDP) లో వ్యవసాయరంగం వాటా తగ్గుతూ ఉంది. 1950-51 లో వ్యవసాయరంగం వాటా జి.డి.పి. లో 59.2% కాగా, 1990-91 నాటికి 35% కు తగ్గి ప్రస్తుతము 24% ఉంది. స్వాతంత్ర్యం లభించిన తరువాత కాలంలో వ్యవసాయరంగంలో ప్రతి శ్రామికుని జి.డి.పికి, వ్యవసాయేతర రంగాలలో ప్రతి శ్రామికుని జి.డి.పి.కి అంతరం పెరుగుతున్నట్లు తెలుస్తున్నది.

8.4.1 వేతనాలు మరియు ఆదాయాలు :

భారతదేశంలో వ్యవసాయ వేతనాలు మరియు వ్యవసాయశ్రామిక కుటుంబాల ఆదాయాలు చాలా తక్కువ. మొదటి వ్యవసాయ శ్రామిక ఎంక్వయిరీ రిపోర్ట్ ప్రకారం 1950-51 వ్యవసాయ శ్రామిక కుటుంబాల తలసరి సాంవత్సరిక ఆదాయము రూ. 104 గా ఉండగా, కుటుంబం యొక్క సగటు వార్షిక ఆదాయము రూ. 447. రెండవ వ్యవసాయ శ్రామిక ఎంక్వయిరీ రిపోర్టు ప్రకారం వ్యవసాయ కార్మికుల స్థితి ఇంకా క్షీణించింది. 1956-57లో తలసరి వార్షిక ఆదాయం రూ 99.4 గాను, వ్యవసాయ శ్రామిక కుటుంబం యొక్క సగటు వార్షిక ఆదాయము రూ. 437 గా ఉన్నది. వ్యవసాయరంగంలో హరితవిప్లవం చోటు చేసుకొన్న తరువాత వేతన రేటులో పెరుగుదల ప్రారంభమయింది. 1984-85 లో దినసరి వేతనం రూ. 6 నుండి రూ. 11 మధ్య ఉందని జి. పార్థసారధి అంచనావేశారు. పంజాబ్, హర్యానా మరియు కేరళలో దినసరి వేతనం దీనికన్నా ఎక్కువ. కనీస జీవన ప్రమాణస్థాయి కొనసాగించాలంటే దినసరి కనీసవేతనం రూ. 22 అవసరం అవుతుందని పార్థసారధి అభిప్రాయపడ్డారు. 1984-85లో కనీస జీవన ప్రమాణానికి ప్రతిరోజుకు అవసరం అయిన దినసరి వేతనం కన్నా, వేతనరేటు చాలా తక్కువగా ఉండటం వ్యవసాయ కార్మికుల దయనీయమైన స్థితిని సూచిస్తున్నది.

వ్యవసాయ కార్మికుల వేతనరేట్ల పై 1990 లో పశ్చిమ బెంగాల్‌లో కె. మహంతి అధ్యయనం చేశారు. 1990-91లో ఉన్న సగటు దినసరి వేతనం రూ. 21.50 పైసలు, 1998-99 నాటికి రూ. 49.96 కు పెరిగిందని మహంతి అంచనా వేశారు. 1990-91 నుండి 1998-99 మధ్య కాలంలో సగటు దినసరి వేతనం రెట్టింపు కన్నా ఎక్కువయింది. సగటు దినసరి వాస్తవిక వేతన రేటు 1990-91లో రు. 21.50 పై కాగా 1998-99 లో రూ. 24.48 పైగా ఉన్నది. ఇదే కాలంలో సగటు దినసరి వాస్తవిక వేతనరేటు 13.80 శాతం పెరిగింది. 1990's లో పశ్చిమ బెంగాల్ వ్యవసాయ ఉత్పత్తిలో అధిక వృద్ధిని సాధించింది. 1990-91లో ఈ రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 112.70 లక్షల టన్నులు కాగా, 1998-99 నాటికి 143.67 లక్షల టన్నులకు పెరిగింది. ఇదే కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో వృద్ధి 27.5%.

8.4.2. ఉద్యోగిత మరియు పనిచేసే పరిస్థితులు :

వ్యవసాయ శ్రామికులు నిరుద్యోగిత మరియు అల్ప ఉద్యోగిత అనే సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. వ్యవసాయ కార్యకలాపాలు కొన్ని ఋతువులకే పరిమితమైనందువలన, మిగిలిన ఋతువులలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేనందువలన వారు నిరుద్యోగులుగా ఉంటారు. వ్యవసాయకార్మికులలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్నందువలన వీరు సంఘటితం కాలేరు, కనీస వేతనాల కొరకు డిమాండ్ చేయలేరు. మన దేశంలో వెట్టిచాకిరీ శ్రామిక వ్యవస్థ (bonded labour system) రద్దు చేసినప్పటికీ దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ వ్యవస్థ ఇంకా అమలులో ఉన్నట్లుగా తెలుస్తున్నది. నేషనల్ శాంపిల్ సర్వే 32 వ రౌండ్ అంచనాప్రకారం దేశంలో ఇప్పటికి 3.5 లక్షలు వెట్టిచాకిరీ శ్రామికులు ఉన్నారు. ఏ ప్రాంతంలో అయితే దీనిని పూర్తిగా రద్దుచేశారో అక్కడ పనిచేయవలసిన సమయం ఎంతో నిర్ణయించబడలేదు. విత్తనాలు నాటినప్పటి నుండి పంట నూర్పిడి వరకు వ్యవసాయ శ్రామికులు క్షేత్రాలలో రాత్రింబగళ్ళు పనిచేయవలసి ఉంటుంది. వీరు దినసరి వేతనాలపై నియమింపబడిన వారు అయినందువలన వీరికి ఎటువంటి శెలవుకాని, వేరే ఎటువంటి ప్రయోజనాలు వీరికి ఉండవు.

8.4.3 ఋణగ్రస్తత :

వ్యవసాయ శ్రామికుల ఆదాయస్థాయి తక్కువైనందువలన, వీరు తరుచుగా ఋణాలు తీసుకుంటారు. ఋణాలకొరకు వీరు ఎక్కువగా వడ్డీ వ్యాపారులపై ఆధారపడతారు. వ్యవసాయశ్రామికులు పేదరిక విషవలయంలో చిక్కుకొని ఉన్నందువలన

ఎటువంటి సెక్యూరిటీలను చూపించలేరు. దీనివలన సంస్థా పరమైన ఏజెన్సీలు వీరికి ఋణాలు ఇవ్వటానికి ఆసక్తిని చూపించుటలేదు. కనుక తమకు కావలసిన ఋణాల కొరకు వీరు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వడ్డీ వ్యాపారులు వీరి వద్దనుంచి అధికవడ్డీ వసూలుచేస్తూ, తప్పుడు లెక్కలు చూయిస్తూ వీరిని అనేక విధాలుగా మోసగిస్తున్నారు. వ్యవసాయ శ్రామికులు చేసిన ఋణాలు ఒక తరం నుంచి మరొక తరానికి బదిలీ అవుతూ ఇంతవరకు పూర్తిగా చెల్లింపబడకుండా అధికమొత్తంలో ఉన్నాయి.

8.4.4. స్త్రీల వేతనాలు తక్కువ :

స్త్రీ వ్యవసాయ కార్మికులు వ్యవసాయక్షేత్రాలలో ఎక్కువ సమయం పనిచేస్తూ పురుషులకన్నా తక్కువ వేతనాలు పొందుతున్నారు. మెట్ట ప్రాంతాలలో ఈ వివక్ష ఇంకా ఎక్కువగా ఉంది. చాలా ప్రాంతాలలో స్త్రీలకు చెల్లిస్తున్న వేతనాలు కనీస వేతనాల కన్నా తక్కువగా ఉన్నాయి.

8.4.5. బాల కార్మికులు :

మన దేశంలో బాలకార్మికులు 17.5 మిలియన్ల నుండి 44 మిలియన్ల వరకు ఉండగలరని అంచనా. ఆసియా ఖండంలో ఉన్న 1/3వ వంతు బాల కార్మికులు భారతదేశంలో ఉన్నారు. ఎక్కువమంది బాలకార్మికులు వ్యవసాయరంగంలో ఉన్నారు.

పట్టిక 8.1 : వివిధ రాష్ట్రాల్లో బాలకార్మికుల శాతం (1999-2000)

రాష్ట్రం	గ్రామీణ		పట్టణ	
	5-9	10-14	5-9	10-14
	వయోగ్రూపు	వయోగ్రూపు	వయోగ్రూపు	వయోగ్రూపు
ఆంధ్రప్రదేశం	2.7	25.1	0.7	7.1
అస్సాం	0.4	4.6	0.3	7.8
బీహార్	0.2	5.0	0.1	3.4
గుజరాత్	0.7	11.5	0.0	3.6
హర్యానా	0.1	2.6	0.0	2.4
కర్నాటక	0.1	15.2	0.1	5.9
కేరళ	0.0	0.7	0.0	0.5
మధ్యప్రదేశ్	0.3	10.6	0.2	2.5
మహారాష్ట్ర	0.8	8.5	0.0	2.3
ఒరిస్సా	0.4	9.0	0.0	1.7
పంజాబ్	0.5	5.5	1.8	3.5
రాజస్థాన్	2.5	16.7	0.4	5.1
తమిళనాడు	0.4	8.6	0.1	4.7
ఉత్తరప్రదేశ్	0.2	6.4	0.3	5.5
పశ్చిమ బెంగాల్	0.4	8.8	0.2	6.2
ఆలిండియా	0.7	9.3	0.3	4.3

ఆధారము: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆర్థిక సంస్కరణలు - సవాళ్ళు 'CESS' 2004, జనవరి, పేజి నెం. 146.

పై పట్టిక 8.1 ను పరిశీలించినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోకెల్లా అత్యధిక శాతం బాల కార్మికులున్నారు. స్త్రీలు అత్యధికంగా శ్రమలో పాలుపంచుకోవడానికి బాలకార్మికులు అధికంగా ఉండటానికి మధ్య సంబంధం ఉన్నట్లు అనిపిస్తోంది.

8.4.6 వలస శ్రామికుల పెరుగుదల :

హరిత విప్లవ ప్రభావం వలన నీటి పారుదల సౌకర్యాలు అధికంగా ఉన్న ప్రాంతాలలో వేతన ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందవల్ల వర్షాభావంపై ఆధారపడిన ప్రాంతాలలోని శ్రామికులు నీటి పారుదల సౌకర్యాలు అధికంగా ఉన్న ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. అంతర్ రాష్ట్ర గ్రామీణ వలస శ్రామికులు 10 మిలియన్లు ఉండగలరని అంచనా. శ్రామిక సప్లయ్ అధికంగా ఉన్న ప్రాంతాలలో కూడా ఉపాధి కల్పించే వారు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన శ్రామికులకు ప్రాధాన్యత ఇస్తున్నారు, ఎందువలననగా వారిపై ఎక్కువగా పెత్తనం చెలాయించవచ్చనే ఉద్దేశ్యంతో.

8.4.7 భూస్వామి – శ్రామిక సంబంధాలు :

దేశం మొత్తం మీద భూస్వామి – శ్రామిక సంబంధాలు ఒక విధంగా లేవు. వివిధ రాష్ట్రాలమధ్య, ఒకే రాష్ట్రంలోని వివిధ గ్రామాల మధ్య వీరి మధ్య సంబంధాలు ఉద్యోగితాకాలం, వేతన చెల్లింపు పద్ధతి, భూస్వాములలో బేరమాడే శక్తులకు సంబంధించి ఒక విధంగా లేవు. భూస్వామి – శ్రామికుల సంబంధాలు రెండు విధాలుగా ఉంటాయని చెప్పవచ్చు. మొదటి కేటగిరీకి సంబంధించి శ్రామికులు స్వేచ్ఛగా ఉంటారు, ఉన్న వేతనరేటు వద్ద తమకు ఇష్టపూర్వకంగానే భూస్వాములు లేదా జమీందారుల వద్ద పనిచేస్తారు. ఇష్టంలేనిచో వారివద్ద పనిచేయడాన్ని నిలిపివేస్తారు. వారు అవసరమయితే గ్రామాన్ని వదలి వేరే ప్రాంతలకు పనికోసం వెళ్ళగలరు. రెండవ కేటగిరీలో ఉన్న శ్రామికులు భూస్వాములను అంటిపెట్టుకొని ఉన్న శ్రామికులు. వారు అంటి పెట్టుకొని ఉన్న భూస్వాములకు చెందిన క్షేత్రాలలో పనిచేస్తూ, భూస్వాములు ఎంత వేతనం నిర్ణయించి ఇచ్చినా తీసుకుంటారు. ఇటువంటి కేటగిరీకి చెందిన శ్రామికులు పూర్తిగా స్వేచ్ఛను కోల్పోతారు.

8.5 వ్యవసాయ శ్రామికుల స్థితిగతులు మెరుగుపరచడానికి చర్యలు :

వ్యవసాయ శ్రామికుల స్థితిగతులు మెరుగుపరచడానికి క్రింది సూచనలు ఉపకరిస్తాయి. అవి –

8.5.1 సెర్ఫ్‌డమ్ *(Serfdom)* వ్యవస్థ తొలగింపు

దేశంలోని చాలా ప్రాంతాలలో ఉన్న వ్యవసాయ సెర్ఫ్‌డమ్ వ్యవస్థను తొలగించాలి. భూమిలేని వ్యవసాయ శ్రామికులలో కొందరు భూస్వాములను అంటి పెట్టుకొని ఉంటారు. వీరు తమ యజమానుల భూములకై పనిచేస్తుంటారు. వీరిని ఒకప్పటి ప్రాశ్చాత్య దేశాలలో ఉండే సెర్ఫ్ (Serf) లలో పోల్చవచ్చు. యజమానులు భూములను అమ్మి వేసినపుడు భూములతోపాటు వీరు కూడా క్రొత్త యజమానులకు సంక్రమించెదరు. వీరికిచ్చే వేతనాలు సాధారణంగా వస్తురూపంలో ఉంటాయి. కొన్ని శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ వ్యవస్థను త్వరగా రూపుమాపటం చాలా కష్టం. ఈ బానిస వ్యవస్థను రూపుమాపాలంటే గ్రామీణ ప్రజలలో అక్షరాస్యత పెంపొందించి వారికి సరైన ఉపాధి అవకాశాలు కల్పించాలి. వెట్టిచాకిరీ నిర్మూలన, వడ్డీ వ్యాపారులను నియంత్రించడం, ఇళ్ళస్థలాల పంపిణీ లాంటి చర్యలు 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం క్రింద తీసుకోదగిన చర్యలు.

8.5.2 వ్యవసాయరంగంలో కనీస వేతనాల సక్రమ అమలు :

పంజాబ్ మరియు కేరళ రాష్ట్రాలలో తప్ప వ్యవసాయ శ్రామికులు తక్కువ వేతనాలు పొందుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసే శ్రామికుల వేతనాల పెంపుదలకు చర్యలు తీసుకోవాలి. వేతనరేటు పెంచనట్లయితే, వ్యవసాయ శ్రామికుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడం చాలా కష్టం. కనీస వేతనాల చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలి. మనదేశంలో జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉన్నందువలన శ్రామిక సప్లై పెరుగుతుండటం, ఈ చట్టం అమలుకు ఒక అవరోధంగా ఉంది.

8.5.3 భూమిలేని వ్యవసాయ శ్రామికులకు పునరావాసం :

వ్యవసాయ శ్రామికుల స్థితిగతులు మెరుగుపరచడానికి భూమిలేని శ్రామికులకు భూ వసతి కల్పించాలి. భూ గరిష్ట పరిమితి చట్టాలు అమలు చేయుట ద్వారా లభ్యమయ్యే మిగులు భూములను భూమిలేని వ్యవసాయ కార్మికులకు పంచిపెట్టాలి. భూదాన ఉద్యమం ద్వారా లభించిన భూమిని వ్యవసాయ శ్రామికులకు పంచిపెట్టడం ద్వారా వారి స్థితిగతులు మెరుగుపర్చాలి.

8.5.4 వ్యవసాయ రంగ అభివృద్ధి :

వ్యవసాయరంగంలో కార్యకలాపాలు కొన్ని ఋతువులకే పరిమితమయినందువల్ల వ్యవసాయ శ్రామికులకు పూర్తికాలం ఉపాధి లభించడంలేదు. వ్యవసాయ కార్యకలాపాలు పెంచి తద్వారా ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించాలంటే సాంద్ర వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ, నీటిపారుదల సౌకర్యాలు విస్తరించాలి. వీటితోపాటు బహుళ పంటల విధానం అవలంభించినట్లయితే సంవత్సరం మొత్తం వ్యవసాయ కార్మికులకు ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చు. శ్రామిక ఉత్పాదకత పెరిగినట్లయితే సంవత్సరం మొత్తం వ్యవసాయకార్మికులకు ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చు. శ్రామిక ఉత్పాదకత పెరిగినట్లయిత శ్రామిక వేతనాలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాలలో లభ్యమయ్యే ముడిసరుకులను ఉపయోగించుకొనే వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పుట ద్వారా వ్యవసాయ శ్రామికులకు అదనపు ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణ స్థాయిని మెరుగుపరచవచ్చు. గ్రామీణ ప్రాంతాలకు విధ్యుచ్ఛక్తి సౌకర్యాలు విస్తరింపఁడినందువలన ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్న చిన్నతరహా పరిశ్రమలను కూడా గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయాలి. ఇటువంటి పరిశ్రమల ఏర్పాటు వ్యవసాయ శ్రామికులకు చాలా విధాలుగా ఉపకరిస్తాయి.

(ఎ) ఋతు సంబంధమైన నిరుద్యోగం తగ్గింపబడుతుంది.

(బి) మిగులు శ్రామిక శక్తిని ఈ పరిశ్రమలకు తరలించవచ్చు.

(సి) వ్యవసాయరంగంపై జనాభా వత్తిడి తగ్గి, వ్యవసాయ ఉత్పాదకత పెరిగి శ్రామిక వేతనాల పెరుగుదలకు దారి తీస్తుంది.

(డి) వ్యవసాయ రంగంలో ఉపాధి లభించని శ్రామికులు ఈ పరిశ్రమలలో ఉపాధి పొందడం ద్వారా తమ కుటుంబ జీవన ప్రమాణాన్ని మెరుగు పర్చుకోవడానికి వీలవుతుంది.

8.5.5. బేరమాడే శక్తి పెరుగుదల :

వ్యవసాయ శ్రామికులు సంఘటితమవటం ద్వారా తమ బేరమాడే శక్తిని మెరుగుపర్చుకోవాలి. వీరు సంఘటితమయినప్పుడే, బేరమాడే శక్తి పెరిగి మంచి వేతన రేటు పొందగలుగుతారు. పెద్దరైతులు మరియు భూస్వాములు ఆర్థికంగా, సామాజికంగా

చాలా శక్తివంతులైనందువల్ల శ్రామికులు సంఘటితం కావడానికి ఒక అవరోధంగా ఉంది. దేశంలో కొన్ని ప్రాంతాలలో వ్యవసాయ శ్రామికులు సంఘటితమయ్యే పరిస్థితులు నెలకొన్నప్పుడు వీరు ఆ పరిస్థితిని విచ్ఛిన్నం చేయగలిగారంటే, వీరికున్న అపరిమితమైన శక్తియుక్తి లేమిటో తెలుస్తున్నది. ప్రభుత్వ ప్రోత్సాహం మరియు రక్షణ ఉంటేనే వ్యవసాయ శ్రామికులు సంఘటితం కాగలరు.

8.5.6. పబ్లిక్ వర్క్స్ కార్యక్రమాలు :

వ్యవసాయ శ్రామికులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య సంవత్సరంలో కొద్దిరోజులు మాత్రమే వ్యవసాయ రంగంలో ఉపాధి లభించడం. ఉపాధి లభించనటువంటి రోజులు 3 నుంచి 6 నెలల వరకు ఉండవచ్చు. ఇటువంటి కాలంలో గ్రామీణ ప్రాంతాలలో పబ్లిక్ వర్క్స్ కార్యక్రమాలయిన రోడ్ల నిర్మాణం, పాఠశాల భవనాల నిర్మాణం, కాల్వలు మరియు బావుల త్రవ్వకం లాంటి వాటిని చేపట్టి వ్యవసాయ శ్రామికులకు ఉపాధి కల్పించాలి. వ్యవసాయ కార్యకలాపాలు లేనికాలంలో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి వారికి సంవత్సరం పొడవునా ఉపాధి కల్పించిన వారమవుతాం.

8.5.7 జీవన ప్రమాణ స్థాయి మెరుగుదల :

ప్రభుత్వం వ్యవసాయ శ్రామికుల స్థితిగతులు మెరుగుపరచడానికి అవసమయితే కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు అమలు పరచగలదు. వ్యవసాయ శ్రామికులలో ఎక్కువమంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు, వీరిని గ్రామాలలోని బావుల నుంచి త్రాగునీరు తీసుకువెళ్ళటానికి కూడా కొన్ని ప్రాంతాలలో అనుమతించడం లేదు. ప్రభుత్వం వీరికోసం త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం వ్యవసాయ శ్రామికులకు ఇళ్ళ స్థలాలు పంపిణీ చేసి, వాటి నిర్మాణానికి తగిన ఆర్థిక సహాయం చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో వ్యాపారునుంచి వీరి దోపిడీకి గురికాకుండా చౌకధరల దుకాణాల ద్వారా వీరికి అవసరమయిన నిత్యావసర వస్తువులను సరసమైన ధరల వద్ద అందించాలి. వ్యవసాయ శ్రామికులు పనిచేసే ప్రదేశంలో సామాజిక - ఆర్థిక పరిస్థితులు మెరుగుదలకు ప్రభుత్వం ఆరోగ్యకేంద్రాలు, ప్రసూతి వార్డులు, యూత్‌క్లబ్‌లు మరియు ఆటలకోసం అవసరమయిన సౌకర్యాలు కల్పించాలి. వీరికొరకు వృత్తివిద్య మరియు సాంకేతిక శిక్షణ లాంటి ప్రత్యేక కార్యక్రమాలు అమలు పర్చాలి.

8.5.8 సాంఘిక భద్రతా సౌకర్యాలు :

పారిశ్రామిక శ్రామికుల మాదిరి వ్యవసాయ శ్రామికులకు సాంఘిక భద్రత లేదు. వీరికి పెన్షన్లు, గ్రాట్యూటీలు, జబ్బుపడినప్పుడు శెలవు దినాలు లాంటి సౌకర్యాలు లేవు. ఇటువంటి సాంఘీక భద్రతా చర్యలు వ్యవసాయ శ్రామికుల కొరకు చేపట్టవలసిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలి. వ్యవసాయ శ్రామికులకు భీమా సౌకర్యాలు మరియు వృద్ధాప్య పెన్షన్ల మంజూరులాంటి పథకాలను చేపట్టి, తద్వారా వారి జీవన ప్రమాణ స్థాయిని మెరుగు పర్చాల్సిన భాద్యత ప్రభుత్వానికి ఉంది.

8.6 వ్యవసాయ కార్మికుల స్థితిగతులు మెరుగుపరచడానికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలు :

వ్యవసాయ కార్మికుల స్థితిగతులు మెరుగుపరచడానికి ప్రభుత్వం ఈ క్రింది చర్యలను తీసుకొంది.

8.6.1 కనీస వేతనాల చట్టం :

1948 కనీస వేతనాల చట్టాలను అనుసరించి వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలను నిర్ణయించు చున్నది. అనేక ఇబ్బందుల వలన ఎక్కువ రాష్ట్రాలలో 1974 వరకు వ్యవసాయ శ్రామికులకు కనీస వేతనాలు నిర్ణయించడం సాధ్యం కాలేదు. శ్రామిక ఉత్పాదకత తక్కువగా ఉండటం, ఎక్కువమంది రైతుల కమతాల పరిమాణం చిన్నవిగా ఉండటం వలన ఎక్కువ వేతనాలు చెల్లించగలిగే స్థాయి వారికి లేకపోవడం, వేతనాలలో మార్పుకు భూస్వాముల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడం, వ్యవసాయ శ్రామికులు సంఘటితం కాలేకపోవడం, చాలా ప్రాంతాలలో అధికంగా శ్రామిక సప్లై ఉండటం లాంటి [illegible] వల్ల కనీసవేతనాలు నిర్ణయించడం సాధ్యం కాలేదు. కాని ప్రణాళికా కాలంలో కొన్ని మార్పులు చోటు చేసుకొన్నాయి. రాష్ట్రాలలో వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. రైతుల ఆదాయాలలో పెరుగుదలను గమనించిన శ్రామికులు కొన్ని ప్రాంతాలలో ఎక్కువ వేతనాల కొరకు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. ఇటువంటి నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ శ్రామికులకు కనీస వేతనాలను నిర్ణయించే విషయంలో అనేక చర్యలు తీసుకొంది. ప్రస్తుతం జమ్ము మరియు కాశ్మీర్, నాగాలాండ్ మరియు సిక్కిం రాష్ట్రాలు మినహాయించి అన్నీ రాష్ట్రాలలో వ్యవసాయ శ్రామికుల కనీస వేతనాలకు సంబంధించి శాసనాలు చేయబడ్డాయి. కాని శ్రామిక సప్లయ్ వ్యవసాయరంగంలో ఎక్కువగా ఉన్నందువలన ఈ శాసనాల వల్ల శ్రామికులు పొందిన ప్రయోజనం చాలా స్వల్పం. బేరమాడే శక్తి వ్యవసాయ కార్మికులలో తక్కువైనందువల్ల కనీసవేతనాల కొరకు వీరు వత్తిడి తీసుకురాలేరు.

8.6.2 వెట్టిచాకిరీ రద్దు :

స్వాతంత్ర్యం లభించిన తరువాత 'వెట్టిచాకిరీ' అనునది అనాగరికమైనదని, సాంఘికన్యాయం సాధించుటలో ఇది ప్రతిబంధకమని భావించి దీనిని నిర్మూలించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. అక్టోబర్ 1975 న ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా వెట్టిచాకిరీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. తరువాత ఈ వ్యవస్థను రద్దు చేస్తూ 1976లో ఒక చట్టం తీసుకు వచ్చారు. ఈ చట్టం దేశం మొత్తం మీద వెట్టిచాకిరీని రద్దుచేస్తూ, ఇప్పటివరకు ఈ వ్యవస్థలో కొనసాగుతున్న శ్రామికులకు స్వేచ్ఛను కల్పించింది. ఈ చట్టాన్ని ఆధారంగా చేసుకొని 2,82,368 వెట్టిచాకిరీ కార్మికులను గుర్తించి వారికి స్వేచ్ఛను కల్పించారు. భారతరాజ్యాంగం వెట్టిచాకిరీని, బానిసత్వాన్ని నిషేదించినప్పటికి, ఇంకా కొందరు భూస్వాములు వ్యవసాయ కార్మికులను బానిసలుగా చేసుకొని వారిచేత వెట్టిచాకిరీ చేయించుచున్నారు. చట్టపరమైన చర్యల ద్వారా, అక్షరాస్యత పెంచడం ద్వారా వ్యవసాయ కార్మికులలో చైతన్యం కలిగించి వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది.

8.6.3 భూమిలేని శ్రామికులకు భూమి కల్పించుట :

వ్యవసాయ శ్రామికుల ఆర్థికస్థితి మెరుగుపరచడానికి ప్రభుత్వం భూమిలేని శ్రామికులకు భూమి పంపిణీ చేసింది. భూ పరిమిత చట్టాల ద్వారాను, భూదాన్ మరియు గ్రామ్‌దాన్ ఉద్యమాల ద్వారా లభించిన భూమి పునఃపంపిణీలో షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యవసాయ శ్రామికులకు ప్రాధాన్యమివ్వాలని 1957లో జాతీయ అభివృద్ధి మండలి తీర్మానించింది. ఇప్పటివరకు 70 లక్షల హెక్టార్ల భూమిని భూమి లేని శ్రామికుల మధ్య పంపిణీ చేయడం జరిగింది. కాని ఈ శ్రామికులకు లభించిన భూమిలో ఎక్కువ భాగం వ్యవసాయానికి అనువుగా లేదు.

8.6.4 ఇళ్ళ స్థలాల పంపిణీ :

గ్రామాలలో వ్యవసాయ కార్మికులకు ఇళ్ళస్థలాల పంపిణీ కొరకు అనేక రాష్ట్రాలలో చట్టాలు చేయబడ్డాయి. రెండవ ప్రణాళికా కాలంలో ఇళ్ళ స్థలాలను ఉచితంగా లేదా సబ్సిడీ ఆధారంగా ఇవ్వడానికి అనేక చర్యలు తీసుకోబడ్డాయి. నాల్గవ

ప్రణాళికా కాలంలో ఇళ్ళ స్థలాల పంపిణీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక సహాయం అందచేసే ఒక పథకాన్ని ప్రారంభించింది. కనీస అవసరాల కార్యక్రమం(MNP) లో భాగంగా ఈ పథకాన్ని ఏడవ ప్రణాళికా కాలంలో రాష్ట్రాలకు సంబంధించిన పథకంగా మార్చారు. ఈ పథకం ద్వారా ఉచిత ఇళ్ళ స్థలాలే కాకుండా నిర్మాణానికి అవసరమయిన ఆర్థిక సహాయం చేస్తారు. ఎనిమిదవ ప్రణాళికలో కూడా ఈ పథకాన్ని కొనసాగించారు.

8.6.5. ఉద్యోగిత కల్పనకు ప్రత్యేక పథకాలు :

గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రణాళికా కాలంలో అనేక పథకాలు ప్రవేశపెట్టారు. వీటిలో ముఖ్యమైనవి. గ్రామీణ వర్క్స్ కార్యక్రమం (RWP), గ్రామీణ ఉద్యోగిత కొరకు క్రాష్ స్కీమ్(CSRE), మహారాష్ట్రలో 1972-73లో ప్రారంభించిన ఉపాధి హామీ పథకం, పనికి ాహారపథకం, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం(NREP), గ్రామీణ ప్రాంతాలలో భూమిలేని పేదవారి ఉపాధి హామీ పథకం(RLEGP). ఆరవ ప్రణాళికలో ప్రారంభించిన (NREP) మరియు 1983లో ప్రారంభించిన RLEGP పథకాలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో భూమి లేని పేదవారికి సంబంధించిన ఉపాధి కల్పన పథకాలు. RLEGP పథకం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులలో ప్రారంభించిన పథకం. NREP మరియు RLEGP పథకాలను 1989-90 లో విలీనం చేస్తూ జవహర్ రోజ్‌గార్ యోజన (JRY) పథకాన్ని ప్రారంభించారు. ఏప్రియల్ 1, 1999 నుండి JRY ను "జవహర్ గ్రామ సమృద్ధి యోజన" పథకం గా మార్చారు. ఈ యోజన యొక్క ముఖ్యఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాలలో అవస్థాపనా సౌకర్యాలు మెరుగుపర్చి తద్వారా సుస్థిర ఉద్యోగితకు అవసరమైన అవకాశాలు పెంచుట మరియు గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగులకు అనుబంధమైన ఉద్యోగ అవకాశాలు పెంపొందించుట. అక్టోబర్ 2, 1993న ఉపాధి హామీ పథకాన్ని(EAS) గుర్తింపబడిన 1,772 వెనుక బడిన బ్లాక్ (దుర్భిక్ష పీడిత, ఎడారి, కొండ ప్రాంతాలలోని బ్లాక్‌లు) లలో ప్రారంభించారు. EAS ను ఏప్రియల్ 1999 నుండి ఒకే వేతన ఉపాధి పథకంగా స్థిరమైన వార్షిక వ్యయంతో పునర్నిర్మించారు. ఈ కార్యక్రమాన్ని మొత్తం 5,448 గ్రామీణ బ్లాక్‌లకు విస్తరించారు. EAS కార్యక్రమం యొక్క ప్రాధమిక విధి, వేతన ఉపాధి కొరతగా ఉన్న కాలంలో పేదరికరేఖ దిగువన నివసించే గ్రామీణ పేదలకు చేతితో చేయబడే (Manual work) శ్రమను కల్పించి అదనపు వేతన ఉపాధి కల్పించడం. సెప్టెంబర్ 2001 నుండి గ్రామీణ ప్రాంతాలలో వేతన ఉపాధి కల్పనకు సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (SGRY) పథకాన్ని ప్రారంభించారు. ఏప్రియల్ 1, 2002 నుండి EAS మరియు JGSY పథకాలను SGRY లో విలీనం చేశారు.

8.6.6. ప్రత్యేక ఏజెన్సీలు :

చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ (SFDA) మరియు ఉపాంతరైతుల మరియు వ్యవసాయ కార్మికుల అభివృద్ధి ఏజెన్సీ (MFALDA) ను 1970-71 లో రు. 115 కోట్ల వ్యయంతో ప్రారంభించారు. MFAL కార్యక్రమం క్రింద 2.5 ఎకరాల కన్నా వ్యవసాయ కమతాలు తక్కువగా ఉన్న రైతులను ఉపాంత రైతులని మరియు గ్రామీణ కుటుంబాలకు తమ ఆదాయాలలో 50% పైగా వ్యవసాయం నుంచి లభిస్తున్నట్లయితే వారివి వ్యవసాయ కార్మిక కుటుంబాలుగా గుర్తించారు. నాల్గవ ప్రణాళికా కాలంలో MFAL పథకం క్రింద దేశ వ్యాప్తంగా వివిధ జిల్లాలలో 41 ప్రాజెక్టులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా నీటి పారుదల, భూ సారపరిరక్షణ, పాడిపరిశ్రమ, భూముల క్రమబద్ధీకరణ లాంటి పథకాలు అమలు పర్చారు. అయిదవ ప్రణాళికలో SFDA మరియు MFAL లమధ్య ఉన్న తేడాను తొలగించి ఒకే కార్యక్రమంగా రూపొందించారు.

ఈ ప్రత్యేక ఏజెన్సీ కార్యక్రమాలతోపాటు, నాల్గవ ప్రణాళికలో దుర్భిక్ష పీడిత ప్రాంతాలకు సంబంధించి దుర్భిక్ష పీడిత ప్రాంతాల కార్యక్రమం (DPAP) ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మిగతా లక్ష్యాలతో పాటు వ్యవసాయ

శ్రామికులకు ఉపాధి కల్పన అనే లక్ష్యాన్ని కూడా ఈ కార్యక్రమంలో పొందుపరచారు. ఈ కార్యక్రమంలో భాగంగా నీటి పారుదల సౌకర్యాలు, భూసార పరిరక్షణ, రక్షితనీరు మరియు రోడ్ల నిర్మాణాలలో వ్యవసాయ శ్రామికులకు ఉపాధి లభిస్తుంది.

8.6.7 మిగతా చర్యలు :

వ్యవసాయ శ్రామికుల స్థితిగతులు మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రణాళికా పరంగా అనేక చర్యలు చేపట్టింది. ఉదాహరణకు చిన్న తరహా కుటీరపరిశ్రమల అభివృద్ధి, గ్రామీణ హస్తకళల అభివృద్ధి మరియు పారిశ్రామిక కేంద్రాలను గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం లాంటి చర్యల ద్వారా ప్రభుత్వం వ్యవసాయ శ్రామికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చింది.

8.7 సారాంశం :

ఆహారం మానవుని ప్రాథమిక అవసరమై ఉన్నందున నాగరిక సమాజం ఆవిర్భవించినప్పటినుండి, ఉత్పత్తిలో అది ముఖ్య స్థానాన్ని సంపాదించుకొంది. అనేక ఇతర అవసరాలు పెరుగుతున్నప్పటికీ, వ్యవసాయంలో ఆహారోత్పత్తి కృషిలో, ఒక శతాబ్దం క్రితం వరకు ఏ ఇతర ఉత్పత్తి కంటే కూడ, దాని అవసరాలకు మించిన శ్రామికులను అత్యధికంగా గ్రహించింది. చిన్న కమతాలను కల్గిన రైతులు గిట్టుబాటు ధరలు లభింపక ఆదాయాలు తగ్గి వ్యవసాయ శ్రామికులుగా మారిపోతున్నారు. వ్యవసాయరంగంలో ఉన్న ఋతుసంబంధమైన మరియు ప్రచ్ఛన్న నిరుద్యోగాల వలన శ్రామికుల జీవన ప్రమాణస్థాయి దిగజారుతున్నది. అందువల్ల వారి సంక్షేమ రీత్యా చూసినప్పుడు, ఆర్థికంగా సౌలభ్యంలో లేని కమతాలు కలిగిన వీరు, వీరితోపాటు మరికొంతమంది రైతులు మరియు భూమిలేని శ్రామికులు ఉపాధికనుబంధ వృత్తులైన, గృహ, చిన్న తరహా పరిశ్రమలను ముఖ్య వృత్తిగా గాని, పాక్షిక వృత్తిగా గాని గ్రహించవలసి ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో మిగిలిఉన్న రైతాంగం కమతాల పరిమాణం విషయంలో మెరుగుదల కనిపించి వారి ఆదాయాల పెరుగుదలకు దోహదం కలుగుతుంది. వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఈ కొనుగోలు శక్తిలోని అభివృద్ధి వ్యవసాయేతర వస్తువుల ఉత్పత్తికి, సేవలకు గిరాకీలని సృష్టిస్తుంది. ఈ సమయంలో మరికొంత అదనంగా శ్రామికులు అవసరమౌతారు. ఈ వ్యక్తులు కూడా వ్యవసాయం నుంచే విడుదలవుతారు. దీని ఫలితంగా మిగిలిఉన్న రైతాంగం చేతుల్లో ఉన్న కమతాల పరిమాణంలో మరికొంత అభివృద్ధి రావడం వంటి మార్పులు తప్పనిసరి అవుతాయి. వ్యవసాయరంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు సహకారం వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయ శ్రామికులలో అక్షరాస్యత పెరిగినప్పుడు వారు తమ సమస్యల పరిష్కారం కొరకు సంఘటితం కాగలరు. ప్రభుత్వం భూ సంస్కరణలు, కనీస వేతనాల చట్టాన్ని సక్రమంగా అమలుపరుస్తూ వ్యవసాయ శ్రామికుల సమస్యలను పరిష్కరించి వారి జీవన ప్రమాణ స్థాయి పెరుగుదలకు చర్యలు తీసుకోవాలి.

8.8. ముఖ్యపదాలు :

1) వ్యవసాయ శ్రామిక కుటుంబం : ఒక కుటుంబం పొందే మొత్తం ఆదాయంలో సగానికి పైగా వ్యవసాయ వేతనాల నుంచి పొందే కుటుంబం వ్యవసాయ కుటుంబం.

2) సెర్ఫ్ : యజమానులు భూమిని విక్రయించి నప్పుడు భూమితోపాటు క్రొత్త యజమానులకు వీరు సంక్రమిస్తారు.

3) అల్ప ఉద్యోగిత : ఒక వ్యక్తి సామర్థ్యానికి తగ్గ పని లభించినప్పుడు, తక్కువ స్థాయిలో పని చేయడం.

4)	మూలధన - ఉత్పత్తి నిష్పత్తి	:	ఒక యూనిట్ వస్తూత్పత్తికి ఎన్ని యూనిట్ల మూలధనం అవసర మవుతుందో తెలియ జేసే నిష్పత్తి.
5)	DPAP	:	దుర్భిక్ష పీడిత ప్రాంతాల కార్యక్రమం. 1972-73లో ప్రారంభించారు.
6)	SFDA	:	చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ.
7)	MFALDA	:	ఉపాంత రైతుల మరియు వ్యవసాయ కార్మికుల అభివృద్ధి ఏజెన్సీ
8)	JGSY	:	జవహర్ గ్రామ సమృద్ధి యోజన
9)	SGRY	:	సంపూర్ణ గ్రామీణరోజ్‌గార్ యోజన
10)	RLEGP	:	గ్రామీణ ప్రాంతాలలో భూమిలేని పేదవారి ఉపాధి హామీ పథకం
11)	EAS	:	ఉపాధి హామీ పథకం.

8.9 నమూనా ప్రశ్నలు :

1) వ్యవసాయ శ్రామికుల పెరుగుదలకు గల కారణాలను వివరించండి.

2) వ్యవసాయ శ్రామికుల ప్రస్తుత స్థితిగతులు మరియు వారి సమస్యలను వివరించండి.

3) వ్యవసాయ శ్రామికుల సమస్యలను నివారించడానికి మీరెటువంటి చర్యలు సూచిస్తారు.

4) వ్యవసాయ శ్రామికుల సమస్యలను నివారించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించండి.

8.10 చదువదగిన గ్రంథాలు :

1) చౌదరి చరణ్‌సింగ్	:	ఆర్థిక సంక్షోభంలో భారతదేశం - కారణాలు,పరిష్కారాలు,1990.
2) C.E.S.S.	:	ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆర్థిక సంస్కరణలు, సవాళ్ళు
3) S.K. Misra & V.K. Puri	:	Indian Economy, 2004.
4) Ruddar Datt & K.P.M. Sundharam	:	Indian Economy, 2004.

డా॥ కోటిరెడ్డి

పాఠం - 9

భారతదేశంలో పరిశ్రమలు -పారిశ్రామికాభివృద్ధి

9.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తర్వాత క్రింది విషయాలు గురించి విద్యార్థి పూర్తిగా అవగాహన చేసుకోవచ్చు.

- భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికాభివృద్ధి
- ప్రభుత్వ మరియు ప్రయివేటు రంగాల పాత్ర
- పెద్దతరహా మరియు చిన్నతరహా పరిశ్రమల సమస్యలు
- ప్రైవేటీకరణ - పెట్టుబడుల ఉపసంహరణ

విషయసూచిక :

9.1. ఉపోద్ఘాతము
9.2. మౌలిక మరియు మూలధన వస్తువుల ప్రాధాన్యత
9.3. పారిశ్రామిక వృద్ధిరేటు
9.4. పారిశ్రామిక విధానం.
9.5. పంచవర్షప్రణాళికల ద్వారా పారిశ్రామిక అభివృద్ధి
9.6. అభివృద్ధి బ్యాంకింగ్ మరియు ఆర్థిక సంస్థలు
9.7. ప్రభుత్వ మరియు ప్రయివేటు రంగం
9.8. భారతదేశంలో ముఖ్య పరిశ్రమలు
9.9. కుటీర, చిన్నతరహా పరిశ్రమలు
9.10. ప్రైవేటీకరణ
9.10.1. ప్రభుత్వ రంగ పెట్టుబడుల ఉపసంహరణ
9.11. సారాంశము
9.12 ముఖ్యపదాలు
9.13 నమూనా ప్రశ్నలు
9.14 చదువదగిన గ్రంథాలు

9.1. ఉపోద్ఘాతము :

భారత పారిశ్రామికరంగం రూపురేఖలు స్వాతంత్ర్యానంతరం అనూహ్యంగా మార్పుచెందాయి. స్వతంత్ర్యం వచ్చేనాటికి మన పరిశ్రమలు చాలా మౌలికమైన స్థాయిలో ఉన్నాయి. విలువ చేర్చిన (Value Added) ఉత్పత్తులలో జౌళి పరిశ్రమ (56.8 శాతం) ఉక్కు (7.6. శాతం) చక్కెర (6.6 శాతం), ఇంజనీరింగ్ (8.4) శాతం, రసాయనాలు (4.1 శాతం) సిమెంట్ (2.1. శాతం) మాత్రమే చెప్పదగినవి. 1950 నాటికి జాతీయ ఆదాయానికి ఆధునిక పరిశ్రమల నుంచి 6 నుంచి 8 శాతం లభిస్తే చిన్న తరహా

పరిశ్రమలు , గనుల నుంచి 12 నుంచి 14 శాతం ఆదాయం సమకూరేది. స్వతంత్రం వచ్చిన కొత్తలో పెట్టుబడి సరుకులు, ఉత్పత్తి దారుల సరుకులు అనేవి ఉండేవి కావు . యంత్రాలు, యంత్ర పనిముట్లకోసం భారత పరిశ్రమలు పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడేవి. 1950 లో యంత్రపనియుట్ల అవసరాల్లో 89.8 శాతం దిగుమతుల ద్వారానే సమకూరేవి. దేశీయంగా కేవలం రూ. 30 లక్షల విలువ చేసే యంత్రపనిముట్లు, ఇతర సరకులు తయారయ్యేవి.

ఆధునిక భారతదేశ పరిశ్రమలపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థకు పునాది వేసినది భారత ప్రధానిగా పదేహేడేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను అట్టడుగు స్థాయినుంచి పునర్నిర్మించినది జవహర్‌లాల్ నెహ్రూ. ఇందుకాయన ప్రభుత్వరంగ పరిశ్రమల నాలంబన చేసుకొన్నారు. అందుకు కారణం భాక్రానంగల్ జల విద్యుత్ ప్రాజెక్ట్ , భిలాయ్ ఉక్కుకర్మాగారం వంటి భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్మించే వనరులు ప్రయివేటురంగానికి లేకపోవడమే. ఈ తరహా ప్రాజెక్టులనే 'ఆధునిక భారతదేశపు దేవాలయాలుగా చూడగలిగిన ధార్మికుడు నెహ్రూ. మౌలిక సదుపాయాల పరిశ్రమలు లేనిదే ఆధునిక పారిశ్రామిక ఆర్థికవ్యవస్థ పునాదులు నిర్మించడం సాధ్యం కాదని ఆయన గ్రహించారు. 1950 లో మాదిరిగానే ఈనాటికీ మౌలిక సదుపాయాల కొరత అభివృద్ధిని కుంటుపరుస్తోంది.

1951 నాటికి ఇనుము, ఉక్కు రంగంలో రెండు పెద్ద పరిశ్రమలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య ఆరుకు పెరిగింది. ద్విచక్ర వాహనాలు, రసాయనిక ఎరువులు వంటి రంగాలలో 1951 నాటికి దేశంలో పరిశ్రమలు లేవు. ప్రస్తుతం ఈ రంగాలలో దాదాపు స్వయం సమృద్ధి సాధించగలిగాము. ఇంజనీరింగ్ పరిశ్రమలలో దేశ ప్రగతి సంతృప్తికరంగా ఉంది. చక్కెర , సిమెంట్, విద్యుత్, బాయిలర్లు, పలు వినియోగ వస్తువుల ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించింది. మైనింగ్ పరిశ్రమ, బొగ్గు, ఇనుపఖనిజం, బాక్సైట్ రంగాలలో గణనీయమైన ప్రగతి సాధ్యమయింది. లఘుపరిశ్రమలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచంలో పారిశ్రామీకీకరణ పొందిన దేశాల్లో ఇండియాది పదోస్థానం.

టేబుల్ - 9.1

స్వాతంత్ర్యానంతరం వివిధ ఉత్పత్తులలో వృద్ధి

వస్తువు	యూనిట్	1950-51	1970-71	2000-01
వస్త్రాలు	మిలియన్ టన్నులలో	4215	7,602	19,718
ఎరువులు (N)	'000 టన్నులు	9	830	11,025
సిమెంట్	మిలియన్ టన్నులలో	2.7	14.3	99.5
స్టీల్	మిలియన్ టన్నులలో	1.0	4.6	29.3
విద్యుచ్ఛక్తి	బిలియన్ కిలోవాట్	5.1	55.8	499.4
అల్యూమినియం	'000 టన్నులు	4.0	168.8	620.4
కమర్షియల్ వాహనాలు	వేలసంఖ్య	8.6	41. 2	152.0

Source : Economic Survey 2001-02

పై పట్టిక 9.1 ప్రకారం స్వాతంత్ర్యానంతరం పైవ వివరించిన అన్ని వస్తువుల విషయంలో మంచి ప్రగతి కనిపించింది.

9.2 మౌలిక మరియు మూలధన వస్తువుల ప్రాధాన్యత :

ప్రణాళికలను పరిశీలించినప్పుడు అవి మనదేశ పారిశ్రామిక రంగంలో మౌలిక మరియు మూలధన వస్తు ఉత్పత్తులు పెంచడానికి ప్రాధాన్యమిచ్చాయి. 1959 లో మౌలిక మరియు మూలధన వస్తువులు మొత్తం ఉత్పాదక మూలధనంలో 50 శాతం వాటాకలిగి ఉండగా , 1991-92 నాటికి వీటి వాటా 79 శాతానికి పెరిగింది. మొత్తం ఉద్యోగితలో వీటి వాటా 1951 లో 25% గా ఉండగా 1991-92 నాటికి 52% కు పెరిగింది. మౌలిక పరిశ్రమలయిన ఇనుము మరియు ఉక్కు, ఎరువులు, రసాయనాలు మరియు నాన్ - ఫెర్రస్ మెటల్స్ పారిశ్రామికీకరణ ప్రభావం వలన తమ స్థితిని మెరుగుపర్చుకున్నాయి. ఇదే కాలంలో వినియోగ వస్తుపరిశ్రమలయిన టెక్స్‌టైల్స్, చక్కెర , పేపరు మరియు పొగాకు పరిశ్రమలు ఉత్పాదక మూలధనము మరియు ఉద్యోగిత కల్పనకు సంబంధించి క్షీణించాయి.

9.3 పారిశ్రామిక వృద్ధిరేటు :

1951 తర్వాత పారిశ్రామిక వృద్ధిరేటు ఒకే విధంగా లేదు. 1951 నుంచి 1965 వరకు 14 సంవత్సరాల కాలంలో స్థిరమైన వృద్ధి రేటు 8% సాధించడం జరిగింది. తర్వాత కాలంలో పారిశ్రామిక వృద్ధిరేటులో ఒడిదుడుకులు ఏర్పడ్డాయి. 1966-67 వృద్ధి స్తంభించగా, 1976-77 లో అధికస్థాయిలో 9.5% లో వృద్ధి , 1979-80 లో -1.4 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది. 1961-70 మధ్య కాలంలో సగటు పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు 5.5 శాతంగాను, 1971-80 మధ్య కాలంలో సాంవత్సరిక సగటు వృద్ధి 4 శాతంగాను ఉంది. 1980-85 కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు సంవత్సరానికి 5.5% గా ఉంది. 7వ ప్రణాళికా కాలంలో (1985-90) సగటు సాంవత్సరిక వృద్ధిరేటు 8 శాతంగాను, 8 వ ప్రణాళికలో 7.3% గాను, 1993-94 నుండి 1996-97 మధ్యకాలంలో సాంవత్సరిక పారిశ్రామిక వృద్ధి రేటు 8.6% గాను, 1997-98 నుండి 2002-03 మధ్యకాలంలో 5.1% గాను ఉన్నది. 2003-04 సం॥లో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు 6.5 శాతమని C.S.O అంచనావేసింది.

టేబుల్ - 9.2

పారిశ్రామిక ఉత్పత్తి - సాంవత్సరిక సగటు వృద్ధిరేటు

(యూజ్ - బేస్‌డ్)

గ్రూపు	1980-81 నుండి 1991-92	8 వ ప్రణాళిక 1992-93 నుండి 1996-97	9వ ప్రణాళిక 1997-98 నుండి 2001-02	2000-01	2001-02	2002-03
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)
1.మౌలిక వస్తువులు	7.4	6.8	4.1	3.7	2.6	4.8
2. మూలధన వస్తువులు	9.4	8.9	4.7	1.8	-3.4	10.5
3. మాధ్యమిక వస్తువులు	4.9	8.5	5.8	4.7	1.5	3.9
4. వినియోగవస్తువులు	6.0	6.6	5.5	8.0	6.0	7.1
ఎ. అనశ్వర	10.8	13.4	10.7	14.5	11.5	-6.3
బి. నశ్వర	5.3	4.8	3.8	5.8	4.1	12.0
సాధారణ సూచీ	7.8	7.4	5.0	5.0	2.7	5.8

Source : (1) Economic Survey 2000-2001 , Box 7.1, P. 130

(2) Economic Survey , 2002-03, Table 7.3, P. 131

(3) R.B. I. , Report on Currency and Finance, 2002-03, Table 2. 15, P. 13.

పై పట్టికను పరిశీలించినప్పుడు సంస్కరణలు ప్రారంభించడానికి ముందు దశాబ్దంతో పోల్చినప్పుడు పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు సంస్కరణలు ప్రారంభమయిన తరువాత దశాబ్దంలో తక్కువగా ఉంది. ఎనిమిదవ ప్రణాళికాలంలో పారిశ్రామికాభివృద్ధిరేటు సంతృప్తికరంగా ఉంది. ఈ ప్రణాళికలో వృద్ధిలక్ష్యం 7.4% కాగా, లక్షిత వృద్ధిరేటును సాధించడం జరిగింది. 9వ ప్రణాళికలో వృద్ధిలక్ష్యం 8.2% గా నిర్ణయించగా 5% మాత్రమే సాధించడం జరిగింది. 1980's తో పోల్చినప్పుడు 1990's లో మౌలిక మరియు మూలధన వస్తురంగాల ప్రగతి క్షీణించింది. 1980's లో మూల ధనవస్తురంగం సగటు సాంవత్సరిక వృద్ధిరేటు 9.4 శాతం కాగా ఎనిమిదవ ప్రణాళికలో 8.9 శాతానికి, తొమ్మిదవ ప్రణాళికలో 4.7 శాతానికి తగ్గింది. మౌలిక వస్తురంగంలో కూడా ఇదే ధోరణి కన్పిస్తున్నది.

సంస్కరణల ముందు కాలం కన్నా సంస్కరణలు అమలుపరచిన తరువాత కాలంలో మాధ్యమిక మరియు వినియోగవస్తురంగంలో మంచి ప్రగతి కన్పించింది. పారిశ్రామిక వృద్ధి విషయంలో సంస్కరణలు అమలు అవుతున్న కాలంలో స్థిరత్వం లేకపోవటాన్ని క్రింది విషయాల వలన తెలుసుకోవచ్చు.

(1) 1992-93 లో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు 2.3% కాగా, 1993-94 లో 6 శాతానికి పెరిగింది. 1995-96 సం॥లో వృద్ధి రేటు 13 శాతంగా ఉండగా మరల 1996-97 సం॥లో 6.1 శాతానికి తగ్గింది. 2000-01 సం॥ లో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధిరేటు 2.7 శాతంగా మాత్రమే ఉంది.

(2) మూలధన వస్తురంగం 1993-94 లో -4.1 శాతం ఋణాత్మక వృద్ధిని నమోదుచేసుకోగా 1994-95 లో 24.8 శాతం వృద్ధి కనపరిచింది. 1998-99లో 12.6 శాతం వృద్ధి జరగగా, 2000-01 సం॥లో 1.8 శాతం వృద్ధి నమోదయ్యింది. 2001-02 లో -3.4 శాతం, 2002-03 సం॥లో 10.5 శాతం వృద్ధిని కనపరచింది.

(3) మౌలిక వస్తురంగంలో 1995-96 సం॥లో వృద్ధి 10.8 శాతం కాగా 1996-97 లో వృద్ధి 3 శాతం మాత్రమే. 1997-98 లో ఈ రంగంలో వృద్ధి 6.9 శాతానికి పెరిగి, 1998-99 నాటికి 1.6 శాతానికి తగ్గింది.

(4) మాధ్యమిక వస్తురంగంలో వృద్ధి 1994-95 లో 3.7 శాతం కాగా 1995-96 లో 19.4 శాతానికి పెరిగింది. 1996-97 లో 8.1 శాతం వృద్ధి నమోదు కాగా, 2001-02 లో వృద్ధి రేటు 2.1 శాతం గా మాత్రమే ఉంది.

(5) అనశ్వర వినియోగ వస్తురంగం 1995-96 లో 25.8 శాతం వృద్ధి సాధింపగా, 1996-97 లో 4.6% వృద్ధి మాత్రమే కనపరిచింది. 2001-02 లో వృద్ధిరేటు ఈ రంగంలో 11.5 శాతం కాగా 2002-03 లో ఋణాత్మక వృద్ధిరేటు -6.3 % ను కనపరిచింది.

9.4 పారిశ్రామిక విధానం :

మనదేశంలో పారిశ్రామిక విధానం అనేక తీర్మానాల ద్వారాను, ప్రణాళిక ముసాయిదాల ద్వారాను, చట్టాల ద్వారాను క్రమంగా ఆవిర్భవించింది. భారత ఆర్థిక వ్యవస్థ అవసరాలను గుర్తించి ప్రభుత్వం పారిశ్రామిక విధానంలో మార్పులు చేస్తూ వచ్చింది. పెరుగుతున్న జనాభాకు పారిశ్రామిక అవసరాలు తీరేవికావు. మన ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందాలంటే వ్యవసాయరంగంతోపాటు పారిశ్రామిక రంగం కూడా అభివృద్ధి సాధించాలి.

9.4.1 1948 పారిశ్రామిక విధానము :

మన దేశానికి స్వాతంత్ర్యం రాగానే 1948 లో ప్రధమంగా పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. భారతదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ప్రభుత్వ, ప్రయివేటు రంగాల పరస్పర సహకారంతో పారిశ్రామిక ప్రగతి జరగాలని ఆశించడం జరిగింది. ఈ విధానంలో పరిశ్రమలను నాలుగు వర్గాలుగా విభజించడం జరిగింది. ప్రభుత్వ రంగ ఆధీనంలో ఉండవలసిన కీలకపరిశ్రమలు పేర్కొనబడ్డాయి. విదేశీమూలధన పెట్టుబడిని సమకూర్చుకోవడంలో తన ఆసక్తిని ప్రభుత్వం ఈ తీర్మానం ద్వారా తెలయజేసింది. అయితే విదేశీమూలధనంతో ప్రారంభమయ్యే పరిశ్రమల యాజమాన్యంలోనూ, ఆ సంస్థలను అదుపుచేయడంలోనూ అధిక భాగం అధికారం మన దేశస్తులకు ఉండాలని ఆశించడమయింది.

9.4.2. 1956 పారిశ్రామిక విధానము :

మొదటి పారిశ్రామిక తీర్మానం తర్వాత ఆర్థిక వ్యవస్థలో కొన్ని మార్పులు వచ్చాయి. 1956 సం॥ లో మొదటి పంచవర్ష ప్రణాళిక పూర్తి అయి కొత్త అనుభవాలు గడించాం. మన ప్రభుత్వం సామ్యవాదరీతి సమాజ స్థాపన ముఖ్య ధ్యేయంగా పేర్కొని ఏప్రియల్ 1956 లో ఈ విధానాన్ని ప్రకటించింది. ఈ పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమలను మూడు షెడ్యూళ్ళుగా విభజించడమైంది. షెడ్యూల్-A లో 17 పరిశ్రమలు ఉంటాయి. ఈ పరిశ్రమలు ప్రభుత్వ యాజమాన్యంలో ఉంటాయి. షెడ్యూల్ -B లో 12 పరిశ్రమలు ఉంటాయి, ఈ రకం పరిశ్రమలు ప్రయివేటు సంస్థలతో లేదా ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేయవచ్చు. ఇతర పరిశ్రమలన్నింటిని షెడ్యూల్ -C లో చేర్చారు. 1956 పారిశ్రామిక తీర్మానాన్ని ఆర్థిక రాజ్యాంగంగా భావించవచ్చు. సామ్యవాదరీతి సమాజస్థాపన, మిశ్రమ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం ఈ తీర్మానంలో చోటు చేసుకున్నాయి. ప్రభుత్వరంగ విస్తరణకు ఈ తీర్మానం ప్రాధాన్యమిచ్చింది. ఈ విధానం ద్వారా ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమలు స్థాపించి ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుంది. కుటీర, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి పెద్దతరహా పరిశ్రమల ఉత్పత్తులపై అదుపు మొదలైన చర్యలను ప్రభుత్వం చేపడుతుంది.

9.4.3. 1977 పారిశ్రామిక విధానం :

1977 డిసెంబర్‌లో జనతా ప్రభుత్వం ఈ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి, గ్రామీణ, కుటీరపరిశ్రమల ద్వారా స్వయం ఉపాధి కల్పించడం ఈ విధానం ముఖ్యలక్ష్యాలు. జిల్లా పారిశ్రామిక కేంద్రాలను నెలకొల్పి చిన్నతరహా పరిశ్రమలకు కావసిన సేవలు, సదుపాయాలు అందించాలని నిర్దేశించడమైనది. చిన్నతరహా, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి సరిపోయే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి శ్రామికుల ఆదాయాన్ని, ఉత్పాదకతను పెంచడానికి కృషి చేయాలని ప్రభుత్వం భావించింది. అనుషంగిక పరిశ్రమ (Tiny Sector) ను ఈ విధానం ద్వారా ప్రవేశపెట్టారు. ఆర్థికస్తోమత కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ఈ విధానంలో చర్యలు తీసుకోవడం జరిగింది. అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పద్ధతులను మనదేశ పరిస్థితులకనుగుణంగా ఉపయోగించుకొని సాంకేతిక రంగంలో స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వం భావించడమైంది. శ్రామికులు, పారిశ్రామిక యూనిట్ల నిర్వహణలో పాల్గొనేటట్లు చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తీర్మానం బహుళ జాతి సంస్థల ఆధిపత్యానికి తిలోదకాలిచ్చింది.

9.4.4. 1980 - పారిశ్రామిక విధానం :

కాంగ్రెసు ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగానే జులై 1980 లో కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందించింది. ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతమున్న విద్యుచ్ఛక్తి, రవాణా, బొగ్గు మొదలైన వస్తువుల కొరతలను తొలగించి ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పధంలో

నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఈ తీర్మానంలో ఆశించడమైనది. ఈ విధానం ప్రభుత్వరంగ నిర్వహణ తీరు సమర్థవంతంగా చేసేందుకు, పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించాలని భావించడమైనది. ప్రతి జిల్లాలోను కేంద్రీకృత సంస్థలను (Nucleus Plants) నెలకొల్పి అనుబంధ సంస్థలకు ఉత్పాదకాలను సమకూర్చడానికి ఏర్పాటు చేయడమైంది. కేంద్రీకృతసంస్థలు చిన్నతరహా సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధునీకరించడానికి తోడ్పడతాయి. గ్రామప్రాంతాల ప్రజలకు ఎక్కువగా ఉద్యోగావకాశాలు కల్పించడానికి, వారి తలసరి ఆదాయం పెంచడానికి , చేనేత పరిశ్రమలకు, చేతి వృత్తులవారికి, ఖాదీతోపాటు ఇతర గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహమివ్వాలని ఈ తీర్మానం భావించడమైంది.

9.4.5. 1990 - పారిశ్రామికవిధానం :

1990 మేలో అధికారంలో ఉన్న జనతాదళ్ ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రకటించింది. వ్యవసాయాధారిత పరిశ్రమలు అభివృద్ధి చేయడం, ఉద్యోగిత కల్పించడం, చిన్నతరహా పరిశ్రమలను అభివృద్ధి పరచడం ద్వారా ఎగుమతులను పెంచడం ఈ పారిశ్రామిక విధానం యొక్క ముఖ్యలక్షణాలు. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కొరకు చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (SIDBI) స్థాపింపబడింది. వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధి కొరకు KVIC మరియు KVI అనే బోర్డుల కార్యకలాపాలను కూడా వ్యాప్తి చేసింది. వెనుక బడిన ప్రాంతాలలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు లైసెన్స్ విధానాన్ని సరళీకరించారు. ఆ పరిశ్రమలు మూలధన వస్తువులను దిగుమతి చేసుకోవటానికి , ముడిపదార్థాలు మరియు ఉత్పత్తికి అవసరమగు విడిభాగాలను దిగుమతి చేసుకొనేందుకు అనుమతి ఇవ్వబడింది. పరిశ్రమలకవసరమైన విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకొనేందుకు, బహుళజాతి సంస్థలు (MNC) తో ఒప్పందాలు కుదుర్చుకొనేందుకు అనుమతి ఇవ్వబడింది. చిన్నతరహా పరిశ్రమల మూలధన పరిమితిని రు.35 లక్షల నుండి రు. 60 లక్షలకు పెంచారు. పరిశ్రమల స్థాపనలో ప్రాంతానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. ఎగుమతులకు ఉద్దేశించిన సంస్థలకు ప్రోత్సాహకాలిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని, విదేశీపెట్టుబడులను ఆకర్షించేందుకు ఈక్విటీ మూలధనాన్ని 40% కు పెంచడమైంది.

9.4.6 నూతన పారిశ్రామిక విధానం :

1960 దశకం మధ్యకాలం నుంచి పరిశ్రమలకు లైసెన్స్‌లిచ్చే విధానం అసమర్థతను ప్రోత్సహించినందువల్ల, ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించవలసి వస్తోందని స్పష్టం కాసాగింది. ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి 1991 జులైలో విధానాల్లో పెనుమార్పులకు శ్రీకారం చుట్టారు. పరిశ్రమలలో సామర్థ్యాన్ని పెంపొందించటానికి పోటీ తత్వాన్ని ప్రోత్సహించడం అందుకు వీలుగా లైసెన్స్ విధానం తొలగించి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాన్ని సరళతరం చెయ్యడం క్రొత్త విధానంలోని కీలక అంశాలు. 1991 జులై 24 వ తేదీన క్రొత్త పారిశ్రామిక విధానం ప్రకటనను పార్లమెంట్‌కు నివేదించారు.

వివరాలు:

(1) రక్షణపరంగా, వ్యూహాత్మకంగా, సామాజిక కారణాలు, పర్యావరణానికి సంబంధించిన కారణాలవల్ల కీలకమైనవి, హానికర రసాయనాలు, ఉన్నత వర్గాల వినిమయవస్తువులు ఉత్పత్తి చేసేవి అయిన 5 పరిశ్రమలు ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందాలి.

(2) ప్రభుత్వ రంగానికి కేటాయించిన పరిశ్రమల (ప్రభుత్వ దృష్టిలో భద్రత, వ్యూహాత్మక ప్రాధాన్యం గలవి) సంఖ్యను 4 కు కుదించారు. ఈ విధంగా ప్రభుత్వరంగ పాత్రను 17 నుంచి 4 కు తగ్గించారు.

(3) 34 అధిక ప్రాధాన్యం గల పరిశ్రమల్లో విదేశీకంపెనీలు నేరుగా పెట్టుబడి పెట్టడానికి అనుమతించారు. 51 శాతం విదేశీపెట్టుబడిని ఈ పరిశ్రమలలో అనుమతిస్తారు. విదేశాల నుంచి అవసరమయిన యంత్ర పరికరాలు దిగుమతి చేసుకోవడానికి ప్రాజెక్ట్ మొత్తం పెట్టుబడిలో 51 శాతం మించి అవసరమైనప్పుడు విదేశీపెట్టుబడిదారులు ఆయా పరిశ్రమల్లో 51 శాతం మించి వాటా కల్గి ఉండటానికి అనుమతించారు.

100 శాతం విదేశీపెట్టుబడి 100 శాతం ఎగుమతి ప్రాధాన్యత గల పరిశ్రమలు, శక్తి రంగంలోను, రోడ్లు, బ్రిడ్జిలు , నౌక నిర్మాణం, హోటల్ మరియు టూరిజమ్, కొరియర్ సర్వీసులు, టౌన్‌షిప్ నిర్మాణాలలోను అనుమతిస్తారు.

(4) విదేశీ వాటాదారులు పెట్టుబడిపెట్టేటప్పుడు విధిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావాలన్న నిబంధనను తొలగించారు.

(5) కొన్ని నిర్దిష్ట రంగాలలో బహుళజాతి కంపెనీలు నేరుగా విదేశీపెట్టుబడిని సమకూర్చే ప్రతిపాదనలను పరిశీలించడానికి వారితో మంతనాలు జరపడానికి విశేషాధికారాలు గల బోర్డును ఏర్పాటుచేశారు.

(6) ప్రభుత్వరంగ సంస్థల వాటాలలోని కొంతభాగాన్ని మ్యూచువల్ ఫండ్‌లకు, ఆర్థిక సంస్థలకు, ప్రజలకు, కార్మికులకు విక్రయిస్తారు. ఆ విధంగా నిధులను సమీకరించడమే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎక్కువమందికి వాటాలు ఉండేలా చేస్తారు.

(7) M.R.T.P. కంపెనీలు మరియు పెద్దపరిశ్రమల ఆస్తులపై ఉన్న పరిమితులను M.R.T.P. చట్టాన్ని సవరించడం ద్వారా తొలగించారు. అయితే M.R.T.P. కమీషన్ గుత్త వైఖరులను, వాణిజ్యలావాదేవీల్లో అవకతవకలను దర్యాప్తు చేస్తూనే ఉంటుంది. M.R.T.P. కంపెనీలు కొత్త పథకాలకు తమ కార్యకలాపాలను విస్తరించుకోవచ్చు. ఇతర కంపెనీలతో విలీనం కావచ్చు. కొత్త కంపెనీలను తమలో చేర్చుకోవచ్చు.

(8) పునరుజ్జీవం చేయవీలులేని ప్రభుత్వరంగ ఖాయిలా సంస్థలను బోర్డ్‌ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్ (బి.ఐ.ఎఫ్.ఆర్) కు నివేదిస్తారు. వీటిని పునరుజ్జీవింపచేసి పునరావాసం కల్పించే అవకాశాలను అన్వేషిస్తారు. ఇందువల్ల నష్టపోయే కార్మికులను రక్షించడానికి అవసరమైన సామాజిక భద్రతా కార్యక్రమాన్ని ఏర్పాటుచేస్తారు.

(9) అదనపు పెట్టుబడి అవసరం లేనిచోట్ల కొత్త పరిశ్రమలు గాని, పాతపరిశ్రమలు గాని ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రాడ్ బాండింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

(10) విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడానికి విధానాలను సరళం చేసారు.

9.5 పంచవర్ష ప్రణాళికల ద్వారా పారిశ్రామిక అభివృద్ధి

ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి విధానాన్ని 1948 పారిశ్రామిక తీర్మానంలోనే స్పష్టం చేసింది. మొదటి పంచవర్ష ప్రణాళికలో ప్రాథమిక రంగమైన వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. పరిశ్రమల అభివృద్ధికి కావలసిన అవస్థాపనా సౌకర్యాలు కల్పించాలని తలపెట్టడం జరిగింది. పరిశ్రమల అభివృద్ధి కొరకు పబ్లిక్ రంగంలో రూ. 57 కోట్లు, కొత్త ప్రాజెక్ట్‌ల ఆధునీకరణకు రూ. 340 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. ఈ ప్రణాళికలో సింద్రీ ఎరువుల కర్మాగారం, చిత్తరంజన్ రైలింజన్‌ల ఫ్యాక్టరీ, టెలిఫోన్, పరిశ్రమలు, కేబుల్ కర్మాగారం, పెన్సిలిన్ ఫ్యాక్టరీ మొదలైన వాటిని స్థాపించడమైంది. ఉక్కుయంత్రాల తయారీ, మందులు మొదలైన వాటిని కూడా నెలకొల్పారు. ఈ ప్రణాళిక కాలంలో సగటు అభివృద్ధి రేటు 7% ఉంది. రెండో ప్రణాళికా కాలంలో పారిశ్రామిక రంగానికి పునాది వేయడమే కాకుండా వైవిధ్యీకరణకు అంకురార్పణ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో రూర్కెలా, భిలాయ్, దుర్గాపూర్‌లలో ఉక్కుపరిశ్రమలు స్థాపింపబడ్డాయి. ఇంకా రసాయనాలు, ఎలక్ట్రానిక్ యంత్రపరికరాలు తయారు చేసే భారీ పరిశ్రమలు కూడా నెలకొల్పారు. ప్రయివేటు రంగం కూడా రూ. 765 కోట్లు పెట్టుబడి పెట్టి ఉత్పత్తి పెరుగుదలకు

దోహదపడింది. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కొరకు 60 ఇండస్ట్రియల్ ఏస్టేట్స్‌ను, 1000 చిన్నతరహా పరిశ్రమలను స్థాపించారు. మూడో పంచవర్ష ప్రణాళికాకాలంలోను, తరువాత వచ్చిన మూడు వార్షిక ప్రణాళికల్లోనూ పారిశ్రామిక ప్రగతిలో హెచ్చుతగ్గులు ఉన్నాయి. మూడోప్రణాళికలో మొదటి నాలుగు సంవత్సరాలు పారిశ్రామిక ప్రగతి సంతృప్తికరంగానే ఉంది. తరువాత నాలుగు సంవత్సరాలు (1965-1969) మొదట నెమ్మదిగాను, తరువాత వేగంగాను పారిశ్రామిక ఉత్పత్తి తగ్గింది. నూలువస్త్రాలు, పంచదార, ఎరువులు మరియు స్టీలు ఉత్పత్తులు బాగా తగ్గినందున మూడో ప్రణాళిక కాలంలో అనుకున్నంతగా ఫలితాలను సాధించలేక పోయాము. వార్షిక ప్రణాళికల కాలంలో (1966-69) రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం వలన పారిశ్రామిక ఉత్పత్తి బాగా దెబ్బతింది. రూపాయి విలువ తగ్గింపు (1966) , స్టీలు, బొగ్గు, పేపర్, ఎరువుల మీద నియంత్రణలను సడలించుట వల్లన 1968-69 లో పారిశ్రామిక ప్రగతి గణనీయంగా సాధించగల్గాము.

నాలుగో పంచవర్ష ప్రణాళికలో పరిశ్రమల రంగానికి మొత్తం పెట్టుబడిలో 3/4వ వంతు అంటే రు. 5,300 కోట్లు కేటాయించారు. ఈ ప్రణాళికా కాలంలో పారిశ్రామిక పునాది మరింత విస్తరించడమే కాకుండా ఆధునీకరణ, స్వావలంభన సాధించగల్గాము. మిశ్రమలోహాలకు అవసరమైన ప్రత్యేకరకం ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్, పెట్రోలియం శుద్ధి ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ట్రాక్టర్లు, ఎలక్ట్రికల్ పరికరాల ఉత్పత్తిలో మంచి ప్రగతి కన్పించింది. కీలకమైన విద్యుత్, ఉక్కు కొరతవల్ల నాలుగో ప్రణాళికా కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలను దేశం అందుకోలేక పోయింది. అనేక పరిశ్రమలు స్థాపితశక్తిని పూర్తిగా సద్వినియోగం చేసుకోలేకపోయాయి. సగటున పరిశ్రమల అభివృద్ధిరేటు 5 శాతం కన్నా మించలేదు. అయిదో పంచవర్ష ప్రణాళికా కాలంలో రూ. 9,600 కోట్లు పబ్లిక్‌రంగ పరిశ్రమల కోసం, రూ. 535 కోట్లు గ్రామీణ చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం కేటాయించారు. మొత్తం ప్రణాళికా వ్యయంలో 26% పరిశ్రమల రంగానికి కేటాయించారు. 1973 సంవత్సరంలో పెట్రోల్ సంక్షోభం ఏర్పడటం, ఆహార ధాన్యాల ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం విచ్చలవిడి గావడంతో ప్రణాళికాలక్ష్యాలను అందుకోలేకపోయాము. ఈ ప్రణాళిక కాలంలో పారిశ్రామిక అభివృద్ధి రేటు 5.3. శాతం.

ఆరో పంచవర్ష ప్రణాళికలో పబ్లిక్ రంగంలో పరిశ్రమల కోసం రూ. 15,220 కోట్లు కేటాయించారు. ఇది కాకుండా రూ. 1780 కోట్లు గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి కేటాయించారు. అల్యూమినియం, జింక్, ధర్మోప్లాస్టిక్స్, లెడ్, పెట్రోకెమికల్స్, ఎలక్ట్రికల్ పరికరాలు, ఆటోమొబైల్స్, వినియోగవస్తువుల ఉత్పత్తి విస్తరణకు పెట్టుకొన్న లక్ష్యాలను సాధించాము. అధికాదాయ వర్గాలవారు వినియోగించే వస్తువులు ఎక్కువగా పెరిగాయి. 7% పారిశ్రామికాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోగా 5.5% మాత్రమే సాదించగలిగాం. లక్ష్యాన్ని సాధింపలేకపోవడానికి విద్యుచ్ఛక్తి కొరత , పారిశ్రామిక అంశాలు , బొగ్గు కొరత మొదలైనవి కారణాలు. ఏడో ప్రణాళికలో రూ. 19708 కోట్లు ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలకు రు. 2,750 కోట్లు గ్రామీణ , చిన్న తరహా పరిశ్రమలకు కేటాయించారు. మొత్తం ప్రణాళిక వ్యయంలో ఇది 12.5%. పారిశ్రామికాభివృద్ధి లక్ష్యాన్ని 8.7 శాతంగా నిర్ణయించారు. కాని 8.5 శాతం ప్రగతిని సాధించగలిగారు. ఈ ప్రణాళికా కాలంలో అనేక సమస్యలను ఎదుర్కొన్నా ఆర్థిక వ్యవస్థ ఈ పెరుగుదల రేటును సాధించగలిగింది.

ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక (1992-97) కాలంలో ప్రాంతీయ అసమానతలను తొలగించేందుకు చిన్నతరహా పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వరంగంలో పరిశ్రమలు మరియు ఖనిజాల అభివృద్ధి కొరకు రు. 40,,588 కోట్లు కేటాయించారు. ఇది మొత్తం ప్రభుత్వరంగ వ్యయంలో 9.3 శాతము. ఈ ప్రణాళికలో సాధించిన పారిశ్రామికాభివృద్ధి రేటు 7.4% (సాంవత్సరికవృద్ధి).

తొమ్మిదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో పారిశ్రామికాభివృద్ధి లక్ష్యం 8.2% కాగా వాస్తవంగా సాధించినది 5% మాత్రమే మొత్తం ప్రణాళికావ్యయంలో 7.6% (రు. 65,148 కోట్లు) పారిశ్రామిక రంగానికి కేటాయించారు, కాని వాస్తవంగా ఈ రంగంపై చేసిన వ్యయం రు. 44,695 కోట్లుగా ఉన్నది.

పదవ ప్రణాళికా కాలంలో పరిశ్రమల మరియు ఖనిజాల అభివృద్ధి కొరకు రు. 58,939 కోట్లు కేటాయించారు. ఇది మొత్తం ప్రణాళికావ్యయంలో 3.9%. ఈ ప్రణాళికాకాలంలో సాంవత్సరిక సగటు వృద్ధి 10% గా ఆశిస్తున్నారు.

9.6 అభివృద్ధి బ్యాంకింగ్ మరియు ఆర్థిక సంస్థలు

9.6.1 ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (IFCI)

పరిశ్రమలకు కావలసిన మధ్యకాలిక , దీర్ఘకాలిక ఋణాలను , కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు, పాత ప్రాజెక్టుల విస్తరణకు, ఆధునికీకరణకు సమకూర్చేందుకు ఈ సంస్థ 1948 లో స్థాపింపబడింది. IFCI నుంచి ప్రధానంగా ప్రయివేటు కార్పొరేషన్ రంగము, సహకార రంగం ఋణాలను తీసుకొన్నాయి. 25 సంవత్సరాల లోపుగా చెల్లించే ఋణాలను భారతీయ కరెన్సీలోను, విదేశీకరెన్సీలోను ఈ సంస్థ మంజూరు చేస్తుంది. యంత్రసామాగ్రి కొనేందుకు, ఫ్యాక్టరీ భవన నిర్మాణానికి , భూమి కొనుగోలు చేసేందుకు కూడా సరిపడినంత ఋణాలను IFCI సమకూర్చుతుంది. పారిశ్రామిక యూనిట్లు ఓపెన్ మార్కెట్‌లో ప్రకటించిన ఋణాలకు ఈ సంస్థ గ్యారంటీ ఇస్తుంది. ఈ యూనిట్లు విడుదల చేసే షేర్లు, డిబెంచర్లకు అండర్ రైటింగ్ చేస్తుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న ఋణాలకు హామీ ఇస్తుంది. IFCI లో IDBI కి, వాణిజ్య బ్యాంకులకు, LIC కి, సహకార బ్యాంకులకు వాటాలుంటాయి. IFCI 1980-81 లో 110 కోట్లు రూపాయల ఆర్థిక సహాయం చేయగా 2001-2002 లో ఇది 2,120 కోట్ల రూపాయలకు పెరిగింది.

9.6.2 ఇండస్ట్రియల్ క్రెడిట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ICICI) :

IFCI తర్వాత అఖిల భారత స్థాయిలో పరిశ్రమలకు కావలసిన ఆర్థిక వనరులను సమకూర్చేందుకు 1955 లో ICICI ఏర్పాటు చేసారు. తొలిదశలో ఈ సంస్థ ప్రయివేటురంగానికి మాత్రమే ఋణాలను మంజూరు చేయాలని సంకల్పించారు. తరువాత సంయుక్త, ప్రభుత్వ , సహకార రంగాలలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు కూడా ఋణాలనివ్వాలని నిర్ణయించారు. రూపాయిలలోను, విదేశీకరెన్సీలలోను కంపెనీలకు సహాయం చేస్తుంది. ఇతర ఆర్థిక సంస్థలు నిర్లక్ష్యం చేసే అండర్‌రైటింగ్ సదుపాయాలను ICICI కల్పిస్తుంది. యాజమాన్య, సాంకేతిక అవసరాలను తీరుస్తుంది. సాంప్రదాయేతర రంగాలలోని పరిశ్రమలైన రసాయనాలు, పెట్రోకెమికల్స్, భారీఇంజనీరింగ్, లోహ ఉత్పత్తుల రంగానికి ICICI బాగా తోడ్పడింది. ICICI ప్రజలకు డిబెంచర్లను జారీ చేయడం ద్వారాను, అంతర్జాతీయ ఏజన్సీల నుంచి నిధులను సమకూర్చుకుంటుంది. ICICI అందించిన ఆర్థిక సహాయం 1980-81 లో 180 కోట్లు కాగా, 1990-91 లో రూ. 1,970 కోట్లకు, 2000-01 లో రూ. 31, 960 కోట్లకు పెరిగింది.

9.6.3 ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (IDBI) :

పారిశ్రామిక సంస్థల నిధుల అవసరాలు తీర్చేందుకు అనేక సంస్థలు ఉన్నప్పటికి ఈ రంగానికి నిధుల కొరత పెద్ద సమస్యగానే ఉన్నది. కావున ఈ లోటును పూడ్చేందుకు IDBI 1964 లో స్థాపించబడింది. అభివృద్ధి బ్యాంకింగ్‌లో సర్వోన్నత సంస్థగా ఇది పనిచేయాలని నిర్దేశించారు. IDBI ఇతర అభివృద్ధి బ్యాంకులకు రీఫైనాన్స్ సౌకర్యాన్ని కల్పిస్తుంది. రాష్ట్ర ఆర్థిక సంస్థలకు కూడా ఈ సదుపాయాన్ని ఇస్తుంది. IFCI, ICICI, SFC లు జారీ చేసే షేర్లను, బాండ్లను IDBI కొనుగోలు చేస్తుంది. IDBI చేసే మొత్తం ఆర్థిక సహాయంలో ప్రత్యక్షంగా అందచేసే ఆర్థిక సమాయం మూడోవంతు ఉంటుంది. SFC లు, స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్లు మరియు వాణిజ్యబ్యాంకుల ద్వారా IDBI పరిశ్రమలకు పరోక్షంగా ఆర్థిక సహాయం చేస్తుంది. పారిశ్రామికంగా బాగా వెనుకబడిన రాష్ట్రాలలో IDBI ప్రత్యక్షంగా , పరోక్షంగా ఋణాలనందించి ప్రాంతీయ

అసమానతలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నది. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి IDBI ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ వారికి అనేక మినహాయింపులు ఇచ్చి అదనపు సౌకర్యాలను కలుగచేస్తున్నది. IDBI 1980-81 లో రూ. 1,010 కోట్ల ఆర్థిక సహాయం అందించగా, 1990-91 లో రూ. 4,460 కోట్లు , 2000-01 లో 17,500 కోట్లు ఆర్థిక సహాయం అందించింది.

9.6.4. రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంస్థలు (SFC'S)

పార్లమెంట్ 1951 లో ఆమోదించిన రాష్ట్ర ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్ ప్రకారం ఆయా రాష్ట్రాలలో SFC లు ఏర్పాటయ్యాయి. చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలకు రాష్ట్ర స్థాయిలో ఆర్థిక వనరులు సమకూర్చేందుకు రాష్ట్ర తరహా ఆర్థికసంస్థలు స్థాపించబడ్డాయి. దేశంలో 18 SFC లు ఉన్నాయి. వీటి కార్యకలాపాలు ఆయా రాష్ట్రాలకు మాత్రమే పరిమితము. ఈ సంస్థలు లఘుపరిశ్రమలకు, వెనుకబడిన ప్రాంతాలలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తాయి. వెనుక బడిన ప్రాంతాల్లోని సంస్థలకు రాయితీ రేట్ల మీద తక్కువ వడ్డీపై బుణాలు ఇస్తాయి. 2000-01 లో SFC లు అందించిన ఆర్థిక సహాయం రు. 1560 కోట్లు.

9.6.5 యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (UTI)

దిగువ తరగతి ప్రజల ఆదాయాలను సమీకరించి, దేశ పారిశ్రామికాభివృద్ధి ఫలితాలు వారికందేలా చేయడం కోసం UTI ను 1964 ఏర్పాటు చేశారు. ఈ విధంగా చిన్నతరహా పెట్టుబడిదారులు తక్కువ రిస్కుతో పరిశ్రమలలో భాగస్వాములై మంచి ప్రతిఫలాలు పొందేందుకు అవకాశం కల్పించబడింది. దాదాపు 95% UTI పెట్టుబడి పరిశ్రమలలో మామూలు షేర్లు, ప్రిఫరెన్స్ షేర్లు, డిబెంచర్ల రూపంలో ఉంటుంది. UTI ఆర్థికవనరులను ఇనీషియల్ కాపటల్ అని, యూనిట్ కాపిటల్ అని రెండుగా విభజించవచ్చు. 2000-01 లో UTI కార్పొరేట్ రంగానికి రూ. 5,970 కోట్ల బుణాలను మంజూరు చేసింది.

9.6.6 ఇండస్ట్రియల్ రీకన్‌స్ట్రక్షన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (IRBI)

ఖాయిలా పడిన పరిశ్రమలకు ఆర్థికసహాయం అందచేయడం, అవసరమైన సాంకేతిక, యాజమాన్యనైపుణ్యాలను అందించుట కొరకు 1971 లో భారతప్రభుత్వం ఇండస్ట్రియల్ రీకన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (IRCI) ను ఏర్పాటు చేసింది. 1985 సంవత్సరంలో దీనిని ఇండిస్ట్రియల్ రీకన్‌స్ట్రక్షన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (IRBI) గా మార్చారు. ఈ బ్యాంక్ ఆర్థిక సహాయం అందించేటప్పుడు ఆధునికీకరణకు, ఉత్పాతదక శక్తిని పెంచడానికి, టెక్నాలజీని మెరుగుపరచడానికి ప్రాధాన్యత ఇస్తుంది. ఆ విధంగా ఖాయిలా యూనిట్లు మనుగడ సాగించేలా చేస్తుంది. IRBI ను 1997 లో ఇండియన్ ఇండస్ట్రియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (IIBI) గా మార్చారు. 2000-01 లో IIBI రు.1,950 కోట్ల బుణాలను మంజూరుచేసి, రు. 1,560 కోట్లను ఆర్థిక సహాయంగా అందించింది.

9.6.7 ఎగ్జిమ్ బ్యాంక్ :

దీనిని ఎగుమతి, దిగుమతి దారుల నిమిత్తం 1982 జనవరి 1 న స్థాపించారు. ఎగుమతిదారులను ప్రోత్సహిస్తూ అవసరమయిన నిధుల్ని సమకూర్చటంలో ఇది సహకరిస్తుంది.

9.6.8 భారతీయ చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (SIDBI)

చిన్నతరహా పరిశ్రమల రంగానికి ఆర్థిక, ఆర్థికేతర సహాయం అందించేందుకు 1990 వ సంవత్సరంలో SIDBI ని ఏర్పాటు చేశారు. ప్రస్తుత సంస్థలు ఆధునికీకరణకు, ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యాలు పెంపొందించడానికి, సాంకేతిక విజ్ఞానం

మెరుగుపర్చుకోవడానికి, ఉపాధికల్పనకు తోడ్పడే పరిశ్రమలను చిన్న ,పట్టణ ప్రాంతాలలో నెలకొల్పడాన్ని SIDBI ప్రోత్సహిస్తుంది. పట్టణ ప్రాంతాలకు వలసలను నివారించడం వాటిపై SIDBI దృష్టిని కేంద్రీకరిస్తుంది. SIDBI 1990-91 లో రు.1,840 కోట్లు, 2000-01 లో రూ. 6,440 కోట్లు ఆర్థిక సహాయాన్ని అందించింది.

9.7 ప్రభుత్వరంగ మరియు ప్రయివేటు రంగం :

మనదేశానికి స్వాతంత్ర్యం లభించే నాటికి దేశంలో మొత్తం ఉత్పత్తి మరియు వాణిజ్యము ప్రయివేటురంగం చేతుల్లో ఉండేది. ప్రభుత్వరంగానికి అంత ప్రాధాన్యత లేదు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, రైల్వేలు, పోర్టులు, పోస్టల్ మరియు టెలిగ్రాఫ్‌లకు సంబంధించి మాత్రమే ప్రభుత్వరంగ పాత్ర పరిమితమయ్యింది. 1951 తరువాత ప్రభుత్వరంగ పరిధిని కేంద్ర మరియు రాష్ట్రప్రభుత్వాలు విస్తృతపరిచాయి. పెట్టుబడి, మూలధన సంచయనం, ఎగుమతుల ప్రోత్సాహము మరియు దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ విధానాలకు సంబంధించి ప్రభుత్వరంగం గణనీయమైన పాత్ర వహిస్తున్నది. అయినప్పటికి, ఇప్పటికి ప్రయివేటురంగం మొత్తం ఉద్యోగితలో 90% స్థూలదేశీయ ఉత్పత్తిలో 80% ను ఆక్రమించి ఉంది.

టేబుల్ - 9.3

భారతదేశంలో ప్రయివేటు కార్పొరేట్ రంగం వృద్ధి

	1957	1971	2000
కంపెనీల సంఖ్య	29,357	30,332	5,42,308
ఎ. ప్రభుత్వము	74	314	1,257
బి. ప్రభుత్వేతర	29,283	30,008	5,41,051
చెల్లించిన మూలధనం (రూ॥లు కోట్లలో)			
అన్నికంపెనీలు	1,080	4500	267.898
	(100.0)	(100.0)	(100.0)
ప్రభుత్వ కంపెనీలు	7.0	2060	95842
	(6.8)	(45.8)	(35.8)
ప్రభుత్వేతర కంపెనీలు -	1010	2440	1,72,056
	(93.2)	(54.2)	(64.2)

Note: బ్రాకెట్లలో సూచించిన సంఖ్య మొత్తం చెల్లించిన మూలధనంలో దాని యొక్క శాతాన్ని సూచిస్తున్నది.

ఆధారము : టాటా-సర్వీసెస్ లిమిటెడ్, స్టాటిస్టికల్ అవుట్‌లైన్ ఆఫ్ ఇండియా (2001-2002)

పై పట్టిక గత నాలుగు దశాబ్దాలుగా భారతదేశంలో కార్పొరేట్ రంగం యొక్క వృద్ధిని సూచిస్తున్నది. ప్రభుత్వ రంగంలోని కంపెనీల సంఖ్య తక్కువయినప్పటికి, చెల్లించిన మూలధనం (Paid - up Capital) విషయంలో ప్రభుత్వరంగంలోని కంపెనీలు ప్రముఖపాత్ర వహిస్తున్నాయి. కంపెనీల సంఖ్య విషయంలో కూడా ప్రభుత్వ రంగ కంపెనీల వృద్ధి, ప్రయివేటు రంగ కంపెనీల వృద్ధిరేటు కన్నా ఎక్కువగా ఉంది. 1957 మరియు 2000 సం॥ల మధ్య కాలంలో ప్రభుత్వ కంపెనీలు 74 నుంచి 1,257 కు పెరిగాయి. మరోవైపు ఇదే కాలంలో ప్రభుత్వేతర కంపెనీలు 29,283 నుంచి, 5,41,051 కు పెరిగాయి.

ప్రభుత్వకంపెనీలు చెల్లించిన మూలధనం 1957 లో రు. 70 కోట్లు కాగా మార్చి 2000 నాటికి రు. 95,842 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో ప్రయివేటు రంగ కంపెనీల చెల్లించిన మూలధనం రు. 1010 కోట్లనుండి 1,72,056 కోట్లకు పెరిగింది. మొత్తం చెల్లించిన మూలధనంలో ప్రభుత్వ కంపెనీల వాటి 1957 లో 6.8% కాగా, 2000సం॥ నాటికి 35.8% కు పెరిగింది. ఇది ప్రభుత్వ కంపెనీలకు సంబంధించి పెరుగుతున్న ప్రాధాన్యతను సూచిస్తున్నది.

టేబుల్ 9.4

ఉద్యోగితలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల వాటా

(లక్షలలో)

సం॥	పబ్లిక్‌రంగము	ప్రయివేటు రంగము	మొత్తం
1971	71	121	192
1981	155	74	229
1991	190	77	267
2001	191	87	278

ఆధారము : ఎకనామిక్ సర్వే 2002-2003

పై పట్టికలో పబ్లిక్ మరియు ప్రయివేటు రంగానికి సంబంధించి సంఘటిత రంగంలో ఉద్యోగిత పరిమాణాలను సూచించడమైంది. ప్రభుత్వ రంగము 1971 లో 71 లక్షలమందికి ఉపాధి అవకాశాలు కల్పించగా, ఈ సంఖ్య 2001 వ సం॥నికి 191 లక్షలకు పెరిగింది. ప్రయివేటు రంగము 1971 లో 121 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించగా ఈ సంఖ్య 2001 వ సం॥రానికి 87 లక్షలకు తగ్గింది. మన దేశంలో సంఘటితరంగంలో ఉన్న మొత్తం ఉద్యోగితలో ప్రభుత్వరంగము కల్పించిన ఉద్యోగిత 2001 వ సం॥రములో 70% గా ఉన్నది.

టేబుల్ 9.5.

నికర దేశీయ ఉత్పత్తిలో ప్రభుత్వ మరియు ప్రయివేటు రంగాల వాటా

(రూ. కోట్లలో 1993-94 ధరలవద్ద)

	ప్రభుత్వ రంగం	ప్రయివేటు రంగం	మొత్తం
1. వ్యవసాయం, అడవులు మరియు ఫిషరీస్	4,549	2,70,309	2,74,858
	(1.7)	(98.3)	(100.0)
2. మైనింగ్ మరియు క్వారీయింగ్	16,785	3,863	20,645
	(81.3)	(18.7)	(100.0)
3. ఉత్పత్తి రంగం	21,106	1,27,015	1,48,121
	(14.2)	(85.8)	(100.0)
4. విద్యుచ్ఛక్తి, గ్యాస్, వాటర్	18,487	-3,878	14,609
	(126.5)	(-26.5)	(100.0)

5. నిర్మాణము	9,607	46,089	55,696
	(17.2)	(82.8)	(100.0)
6. వాణిజ్యము, హోటల్స్ మరియు రెస్టారెంట్స్	5,267	1,58,797	1,64,064
	(3.2)	(96.8)	(100.0)
7. రవాణా, స్టోరేజ్ మరియు సమాచారము	36,044	30,066	66,110
	(54.5)	(45.5)	(100.0)
8. ఫైనాన్స్, ఇన్యూరెన్స్, రియల్ ఏస్టేట్ మరియు బిజినెస్ సర్వీసులు	47,074	84,453	1,31,527
	(35.8)	(64.2)	(100.0)
9. కమ్యూనిటీ, సోషియల్ మరియు పర్సనల్ సర్వీసులు	95,509	48,203	1,43,712
	(66.5)	(33.5)	(100.0)
మొత్తం	2,54,428	7,64,917	1,019,345
	(25.0)	(75.0)	(100.0)

Source : నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్, 2002.

పైపట్టిక 9.5 పరిశీలించినప్పుడు మనదేశ జాతీయ ఆదాయములో ప్రయివేటు రంగము యొక్క ప్రధాన పాత్ర తెలుస్తున్నది. 1999-2000 సం॥ లో నికరదేశీయ ఉత్పత్తిలో ప్రభుత్వరంగం 25% వాటా కల్గి ఉండగా ప్రయివేటు రంగం వాటా 75% గా ఉన్నది. వ్యవసాయం, అడవులు, ఫిషరీస్, చిన్నతరహా పరిశ్రమలు , నిర్మాణము, రవాణా మొదలగు రంగాలలో ప్రయివేటు రంగం వాటా, ప్రభుత్వరంగం కన్నా ఎక్కువగా ఉంది.

9.7.1. ప్రయివేటు రంగము మరియు చిన్నతరహా పరిశ్రమలు :

మనదేశంలో చిన్నతరహా పరిశ్రమలు ప్రయివేటు రంగంలో ఉన్నాయి. పారిశ్రామికాభివృద్ధిలో ఈ పరిశ్రమలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఈ పరిశ్రమలు శ్రమసాంద్రతతో కూడుకున్నవి అయినందువలన స్థానికంగా లభ్యమయ్యే వనరులతో వస్తు ఉత్పత్తి చేస్తూ ఉపాధి అవకాశాలు పెంచవచ్చు. ఆదాయ, సంపదలలో ఉన్న వ్యత్యాసాలు తొలగించడానికి, మానవ మరియు భౌతిక మూలధనాన్ని సమర్థవంతంగా సేకరించడానికి ఈ పరిశ్రమలు తోడ్పడతాయి. ప్రాంతీయ అసమానతలను తొలగించి ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి సాధనకు ఈ పరిశ్రమలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రభుత్వము ఈ పరిశ్రమలకు అవసరమయిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటంలోను, పరపతి సౌకర్యాలు కల్పించటం లోను, వీటి అభివృద్ధికి అవసరమయిన దిగుమతులపై నియంత్రణలు తొలగించడంలోను ఎంతో సహాయపడుతున్నది. పెద్దతరహా పరిశ్రమలనుంచి ఎదురయ్యే పోటీనుంచి వీటిని రక్షించడానికి కొన్ని వస్తువుల ఉత్పత్తిని చిన్నతరహా పరిశ్రమలకు ప్రభుత్వం రిజర్వుచేసింది. దేశ పారిశ్రామికాభివృద్ధి వేగవంతం చేయాలంటే ఈ పరిశ్రమలు ప్రయివేటు రంగంలోనే ఉండేవిధంగా చూడవలసిన అవసరం ప్రభుత్వానికి ఉంది.

9.7.2 పొదుపు మరియు మూలధనకల్పనలో ప్రభుత్వ మరియు ప్రయివేటు రంగాల వాటా :

స్థూలదేశీయ మూలధన కల్పన మొదటి ప్రణాళికలో స్థూలదేశీయ ఉత్పత్తి (GDP) లో 10.7% కాగా, ఎనిమిదవ ప్రణాళికలో 24.6% గాను, 2000-2001 లో 24% గాను ఉన్నది.

టేబుల్ 9.6

స్థూలదేశీయ పొదుపు మరియు మూలధనకల్పనలో ప్రభుత్వ , ప్రయివేటు రంగాల వాటా

ప్రణాళికా కాలంలో సగటు	మార్కెట్ ధరల వద్ద GDP లో శాతం		
	ప్రభుత్వరంగం	ప్రయివేటు రంగం	మొత్తం
స్థూలదేశీయ పొదుపు :			
మొదటి ప్రణాళిక (1951-56)	1.7	8.7	10.4
రెండవ ప్రణాళిక (1956-61)	2.0	10.4	12.4
మూడవ ప్రణాళిక (1961-66)	3.4	10.9	14.3
నాల్గవ ప్రణాళిక (1969-74)	3.0	14.4	17.4
అయిదవ ప్రణాళిక (1974-79)	4.6	17.0	21.6
ఆరవ ప్రణాళిక (1980-85)	3.6	16.5	20.1
ఏడవ ప్రణాళిక (1985-90)	2.3	18.1	20.4
ఎనిమిదవ ప్రణాళిక (1992-97)	1.4	21.9	23.3
1997-98	1.0	22.1	23.1
2000-01	-1.7	25.1	23.4
స్థూలదేశీయ మూలధన కల్పన :			
మొదటిప్రణాళిక	3.5	7.2	10.7
రెండవ ప్రణాళిక	6.6	8.8	15.4
మూడవ ప్రణాళిక	8.4	8.3	16.7
నాల్గవ ప్రణాళిక	7.2	10.9	18.1
అయిదవ ప్రణాళిక	9.5	11.7	21.2
ఆరవ ప్రణాళిక	11.1	10.5	21.6
ఏడవ ప్రణాళిక	10.7	12.1	22.8
ఎనిమిదవ ప్రణాళిక	9.2	15.4	24.6
1997-98	1.1	24.1	25.2
2000-2001	6.8	17.2	24.0

Source : CMIE, Basic Statistics Relating to the Indian Economy, Vol. I , All India, August 1994 and CSO, National Accounts Statistics 2002.

పై పట్టిక 9.6 పరిశీలించినప్పుడు స్థూలదేశీయ పొదుపులో ప్రభుత్వరంగం కన్నా ప్రయివేటు రంగం వాటా ఎక్కువ. అదేవిధంగా స్థూలమూలధనకల్పనలోనూ ప్రయివేటు రంగమే ప్రధానపాత్ర వహిస్తున్నది. పొదుపులో ప్రభుత్వరంగం వాటాను

మొదటి ప్రణాళిక నుంచి 2000-2001 సం॥ వరకు పరిశీలించినప్పుడు ఒకే విధమైన మార్పు కనిపించటంలేదు. 1951-56 లో స్థూలదేశీయపాదుపులో ప్రభుత్వరంగంవాటా GDP లో 1.7% కాగా, అయిదవ ప్రణాళికలో 4.6% గాను, ఎనిమిదవ ప్రణాళికలో తక్కువ స్థాయి 1.4% కు తగ్గింది. 1999-2000 మరియు 2000-2001 లో ఈ రంగం వాటా ఋణాత్మకంగా ఉంది.

స్థూలదేశీయపాదుపులో ప్రయివేటు రంగం వాటాకు సంబంధించి స్థిరమైన పెరుగుదల కన్పిస్తున్నది. ఈ రంగం వాటా 1951-56 లో G.N.P. లో 8.7%, అయిదవ ప్రణాళికలో 17% , ఎనిమిదవ ప్రణాళికలో 21.9% , 1997-98 లో 22.1% మరియు 2000-2001 లో 25.1% గా ఉన్నది.

9.8 భారతదేశంలో ముఖ్యపరిశ్రమలు :

పారిశ్రామికాభివృద్ధి సాధించాలంటే ఏదేశంలోనైనా తప్పనిసరిగా కొన్ని కీలకమైన పరిశ్రమలు అభివృద్ధిచెందాలి. ఆర్థికాభివృద్ధికి స్వయం సమృద్ధి తప్పనిసరి. దీనికనుగుణంగా ప్రతిదేశం తన పారిశ్రామిక విధానాన్ని తయారు చేసుకోవలసిన అవసరం ఉంది. దిగుమతులపై ఆధారపడకుండా, మనకున్న వనరులను సద్వినియోగపరచుకొని అభ్యుదయపథంలోకి అడుగిడాలంటే కొన్ని ముఖ్యమైన పరిశ్రమలను తప్పనిసరిగా అభివృద్ధిపరచాలి.

9.8.1 ఇనుము - ఉక్కుపరిశ్రమ (IRON & STEEL INDUSTRY) :

పారిశ్రామికాభివృద్ధికి ఇనుము-ఉక్కుపరిశ్రమ అత్యంత కీలకమైనది. ఇనుము, ఉక్కును ఆధునిక పద్ధతుల ద్వారా తయారుచేయటం మొదటిగా మనదేశంలో 1875 లో జరిగింది. భారీఎత్తున ఇనుము, ఉక్కును తయారుచేయడం ప్రప్రథమంగా 1907 లో జంషెడ్‌పూర్‌లో టాటా ఇనుము-ఉక్కుకంపెనీ (TISCO) మొదలుపెట్టింది. ప్రభుత్వ రంగంలో విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు వర్క్స్ లిమిటెడ్ 1923లో భద్రావతిలో స్థాపించబడింది. స్వాతంత్ర్యం లభించేనాటికి మనదేశంలో ఇనుము-ఉక్కు మొత్తం ఉత్పత్తి 1.3 మిలియన్‌టన్నులు మొదటి ప్రణాళికలో ఇనుము-ఉక్కు ఉత్పత్తిని అధికం చేయడానికి విస్తరణ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. రెండవ ప్రణాళికాకాలంలో భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్‌లలో ప్రభుత్వరంగం పెద్ద ఉక్కు కర్మాగారాలను నిర్మించింది. మూడవ ప్రణాళికలో బొకారో వద్ద ప్రభుత్వ రంగంలో మరొక నూతన కర్మాగారం నెలకొల్పడమే కాక, అదివరకే స్థాపించబడిన పరిశ్రమలను వ్యాప్తిచేసేందుకు కూడా ప్రయత్నం జరిగింది. నాల్గవ ప్రణాళికా కాలంలో స్టీల్‌ప్లాంట్ల గరిష్ట ఉత్పాదక శక్తిని ఉపయోగించుకొనేందుకు ప్రయత్నించడమే కాక తమిళనాడులోని సేలం, కర్ణాటకలోని విద్యానగరం, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణము మొదలగు ప్రాంతాలలో కూడా క్రొత్తగా ఇనుము, ఉక్కు పరిశ్రమలు ప్రారంభించారు.

ప్రభుత్వరంగ ఉక్కుకర్మాగారముల నిర్వహణకు, సమన్వయమునకు 1973 లో భారత ఉక్కు అధారిటీ (Steel Authority of India) నెలకొల్పబడినది. 1975-77 మధ్య అత్యవసరపరిస్థితిలో కూడా స్టీలు ప్లాంట్లు బాగానే ఉత్పత్తి కార్యక్రమాన్ని చేపట్టగలిగాయి. ఆరవ ప్రణాళికా కాలంలో మాత్రం బొగ్గు, విద్యుచ్ఛక్తి, రైలురవాణా సమస్యల వలన ఉత్పత్తి అంత సంతృప్తికరంగా లేదు. ఏడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో పరిశ్రమల ఆధునీకరణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిపరచడం మొదలగు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.

9.8.1.1. సమస్యలు

ఏ దేశంలో పారిశ్రామికాభివృద్ధి అయినా ఆ దేశ ఇనుము, ఉక్కు పరిశ్రమల మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇంజనీరింగ్ వస్తు పరిశ్రమలు, మెషిన్ టూల్స్ పరిశ్రమలు స్వాతంత్ర్యానంతరం బాగా అభివృద్ధి చెందాయి. మాధ్యమిక వస్తువులు, మూలధన వస్తువులు మరియు వినియోగవస్తువులు కూడా అనేకం ఈ ఇనుము ఉక్కు కర్మాగారాలలో తయారుచేస్తున్నాము. ఈపరిశ్రమ క్రింది సమస్యలను ఎదుర్కొంటున్నది.

1. ఉక్కు పరిశ్రమలో ముడిసరకుల వ్యయం మొత్తం వ్యయంలో 35% గా ఉంటున్నది. స్థాపిత శక్తి పూర్తిగా ఉపయోగింపబడకుండుట, ఆధునీకరణ లోపించడం, ఉత్పాదకత తక్కువగా ఉండటం మొదలైన కారణాలవలన ఉత్పత్తి వ్యయాలు ఎక్కువగా ఉండి అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ శక్తిని కోల్పోతున్నది.
2. బొగ్గుకొరత, రైల్వేవాగన్ల కొరత మరియు కరెంటుకోత వలన కూడా ఉక్కు కర్మాగారాలలో ఉత్పత్తి తగ్గుతున్నది ముఖ్యంగా మెటలర్జికల్ బొగ్గు, కొన్ని రాష్ట్రాలలో విద్యుత్ బోర్డుల వైఫల్యం వలన ఉత్పత్తికి తరచుగా అవాంతరాలు వస్తున్నాయి.
3. అనవసరమయిన రాజకీయ జోక్యం , తరచుగా శ్రామికుల వివాదాలు, సమ్మెల వలన కూడా యాజమాన్యం సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నది.
4. ఉక్కు కర్మాగారాలకు కావలసిన దుక్క ఇనుము, పిల్లెట్స్ మరియు కోకింగ్ బొగ్గు దిగుమతులకు కావలసిన విదేశీ మారకద్రవ్య కేటాయింపులు ఒక సమస్యగా ఉన్నది.
5. బ్లాస్ట్‌ఫర్నేస్‌లో వాడటానికి అవసరమయిన తక్కువ బూడిద శాతంగల కోకింగ్ బొగ్గు పరిమితంగా ఉండటం కూడా ఈ పరిశ్రమ ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య.
6. ఉక్కు కర్మాగారములలోని స్థాపిత శక్తి పూర్తిగా వినియోగింపబడుట లేదు. స్థాపతశక్తి వినియోగం ఇటీవల కాలంలో పెరుగుతున్నది. 1981 - 82 లో స్థాపిక శక్తి వినియోగం 15% మాత్రమే కాగా, ప్రస్తుతం ఇది 90%గా ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చినపుడు స్థాపితశక్తి వినియోగం ఈ కర్మాగారాలలో తక్కువ.
7. ఫలన కాలం ఎక్కువగా ఉండటం కూడా ఈ పరిశ్రమ ఎదుర్కొంటున్న ముఖ్యసమస్య. కర్మాగారం స్థాపన ప్రారంభానికి, అది ఉత్పత్తి చేయు దశకు చేరుటకు మధ్యకాలం అనగా ఫలనకాలము ఎక్కువగా ఉండటం వలన ఋణాలపై వడ్డీభారం ఎక్కువగా ఉంటున్నది. కర్మాగారం స్థాపనకు అంచనా వేసిన వ్యయం కూడా పెరుగుతున్నది.

9.8.2 వస్త్ర పరిశ్రమ (Textile Industry) :

ఆధునిక భారతదేశములో వస్త్రపరిశ్రమ అతిపెద్ద పరిశ్రమ. స్థూల విదేశీ ఉత్పత్తిలో 2.4% వాటాను, మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 14% వాటాను ఈ పరిశ్రమ కల్గి 82 మిలియన్ల ప్రజలకు ఈ పరిశ్రమ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నది. మొత్తం ఎగుమతుల రాబడిలో ఈ పరిశ్రమ ద్వారా వచ్చిన రాబడి 23% (ఏప్రియల్ జనవరి 2003), దిగుమతుల బిల్లులో ఈ పరిశ్రమ వాటా 3%. మనదేశంలో స్వయంసమృద్ధి సాధించిన పరిశ్రమ ఇది ఒక్కటే. 1818లో మొదటి నూలుమిల్లును కలకత్తాలో ఏర్పాటుచేశారు. 1954లో ముంబాయిలో నూలుమిల్లు ఏర్పాటు చేయడంతో ఈ పరిశ్రమ ప్రారంభమయిందని చెప్పవచ్చు. ఈ పరిశ్రమ మన దేశంలో ముంబాయి, అహ్మదాబాద్‌లో కేంద్రీకృతమయినదని చెప్పవచ్చు. 1911లో దేశంలోఉన్న మొత్తం మిల్లులలో 33% ముంబాయిలో ఉన్నాయి. ఈ పరిశ్రమ కల్పించిన మొత్తం ఉద్యోగితలో 45% ఉద్యోగిత ముంబాయిలో ఉన్న మిల్లులు కల్పించాయి. అహ్మదాబాద్‌లో 19% మిల్లులు ఉండగా, అవి 13.6% శ్రామికులకు ఉద్యోగిత కల్పించాయి. ముంబాయి నగరానికి బయట కొన్ని మిల్లులు షోలాపూర్, బరోడా మరియు మహారాష్ట్రలోని కొన్ని చిన్నకేంద్రాలలో ఉన్నాయి. 1951లో మానవ ఉత్పాదికత నూలుమిల్లులు 383 ఉన్నాయి. మార్చి 31, 1999 నాటికి వీటిసంఖ్య 1,824కు పెరిగింది. వీటిలో 192 ప్రభుత్వ రంగంలోను, 153 సహకార రంగంలోను, మరియు 1,479 ప్రయివేటు రంగంలోను ఉన్నాయి.

వస్త్ర పరిశ్రమలో మూడు రంగాలు ఉంటాయి. అవి 1) మిల్లు రంగం, 2) పవర్‌లూమ్ రంగం, 3) హాండ్లూమ్ రంగం. చివరి రెండింటిని వికేంద్రీకరించబడిన రంగం క్రింద సంయుక్తంగా పరిగణిస్తారు. ప్రభుత్వం వికేంద్రీకరించబడిన రంగానికి అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చినందున మొత్తం ఉత్పత్తిలో ఈ రంగం వాటా గణనీయంగా పెరిగింది.

మొత్తం ఫ్యాబ్రిక్ ఉత్పత్తిలో మిల్లురంగం వాటా 1950 - 51లో 76% కాగా, 1980 - 81 నాటికి 38 శాతానికి తగ్గింది. 2001 - 2002 నాటికి ఈ రంగం వాటా పూర్తిగా క్షీణించి 3.7 శాతానికి చేరుకుంది. వికేంద్రీకరించబడిన రంగం వాటా మొత్తం ఫాబ్రిక్ ఉత్పత్తిలో 1950 - 51లో 24%కాగా, 2001-2002 నాటికి 96.3% పెరిగింది. వస్త్ర పరిశ్రమలోని మూడు రంగాలను అభివృద్ధిపరచాలనే లక్ష్యంతో ప్రభుత్వం 1985 జూన్‌లో క్రొత్త టెక్స్‌టైల్ విధానాన్ని ప్రకటించింది. ఈ విధానం యొక్క ముఖ్య ఉద్దేశ్యం దేశంలో పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా మంచి నాణ్యతగల ఉత్పత్తిని సరసమైన ధరల వద్ద అందించే విధంగా ఈ పరిశ్రమ ఉత్పత్తి చేయాలి. అదేవిధంగా ఎగుమతుల ఉద్దేశ్యం నెరవేరే విధంగా కూడా ఈ పరిశ్రమ ఉత్పత్తి పెంచాలని క్రొత్త టెక్స్‌టైల్ విధానం యొక్కఉద్దేశ్యము. వస్త్రపరిశ్రమ ఆధునికీకరణ అవసరాల కొరకు 1986లో 750 కోట్ల రూపాయలలో ఆధునీకరణ నిధిని ఏర్పాటుచేశారు. క్రొత్త టెక్స్‌టైల్ విధానం 2000 ప్రకారం 2010 నాటికి టెక్స్‌టైల్ ఎగుమతులు 11 బిలియన్స్ నుండి 50 బిలియన్స్‌కు పెంచాలని, దీనిలో గార్మెంట్స్ వాటా $ 25 బిలియన్స్‌గా ఉండాలని లక్ష్యం.

9.8.2.1 వస్త్రపరిశ్రమ - సమస్యలు :

1) ప్రభుత్వ నియంత్రణ వలన వస్త్ర పరిశ్రమ అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. ధరలు, నూలుపంపిణీ, ఉత్పత్తి విధానాలలో ప్రభుత్వ జోక్యం వలన మిల్లులకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు తగ్గాయి. ఉత్పత్తి వ్యయంకన్నా, ప్రభుత్వం నిర్ణయించిన ధర ఒక్కో సందర్భంలో తక్కువగా ఉన్నప్పుడు ఉత్పత్తిదారులు నష్టాలను ఎదుర్కొంటున్నారు.

2) బొగ్గు సప్లయి కొరతగా ఉండటం, కరెంట్ కోత ఎక్కువగా విధించడం వలన ఈ పరిశ్రమలో ఉత్పత్తి దెబ్బతింటున్నది.

3) ముడి పదార్థాలు కొరతగా ఉండటం వలన అనేక మిల్లుల ఉత్పత్తి కుంటుపడుతున్నది. మూడవ ప్రణాళికలో ముడి ప్రత్తి ఉత్పత్తి లక్ష్యం 7 మిలియన్ బేళ్ళు కాగా వాస్తవంగా జరిగిన ఉత్పత్తి 4.9 మిలియన్ బేళ్ళు మాత్రమే. 1996 - 97లో 14.3 మిలియన్ బేళ్ల ముడిప్రత్తి ఉత్పత్తి జరిగి స్వయం సమృద్ధి సాధించాము. కాని 2001 - 2002లో ప్రత్తి ఉత్పత్తి 10.1 మిలియన్ బేళ్ళకు తగ్గింది.

4) పురాతన యంత్రాలను వాడటం వలన ఉత్పత్తి దెబ్బతింటున్నది. మన వస్త్ర పరిశ్రమలో 80% యంత్రాలు పురాతనమైనవి. వీటిస్థానంలో అధునాతన యంత్రాలు ఏర్పాటు చేస్తే తప్ప మనం అంతర్జాతీయ వ్యాపారంలో రాణించలేము.

5) పవర్ లూమ్ రంగంలాగా అభివృద్ధి చెందడం, ప్రభుత్వ వస్త్రవిధానంలో ప్రోత్సాహకాలు ఎక్కువగా లేనందువలన అనేక నూలుమిల్లులు మూతపడ్డాయి.

6) చైనా మరియు పాకిస్తాన్‌తో పోల్చినపుడు మన దేశంలో వేతనాలు 30 నుంచి 60% వరకు ఎక్కువగా ఉంటాయి. దీనివలన ఉత్పత్తి వ్యయాలు పెరిగి ప్రపంచ మార్కెట్‌లో నిలబడలేకపోతున్నాం. అదీకాక ఉత్పాదకత కూడా తక్కువగా ఉన్నందువలన ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్నాయి.

7) ప్రభుత్వం దిగుమతి చేసుకున్న నూలు మీద అధిక సుంకాలు విధించినందువలన నూలు వస్త్రాల ధరలు ఎక్కువగా పెరిగాయి. అనేక రకాల నూలువస్త్రాలపై ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు విధించినందువలన ధరలుపెరిగి అమ్మకాలు తగ్గాయి.

8) ప్రతి నూలుమిల్లు కంట్రోలు వస్త్రాలు (ముతక వస్త్రాలు, మధ్యతరహా వస్త్రాలు) తప్పనిసరిగా తయారుచేయాలి. అందువలన దాదాపు చాలా మిల్లులు బాగా నష్టాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది.

9.8.3 చక్కెర పరిశ్రమ :

భారతదేశంలో చక్కెర పరిశ్రమ రెండవ అతి పెద్ద వ్యవసాయాధారిత పరిశ్రమ. ప్రపంచంలో చక్కెర ఉత్పత్తి చేసే దేశాలయిన రష్యా, బ్రెజిల్ మరియు క్యూబా తర్వాత భారతదేశం నాలుగవ స్థానాన్ని ఆక్రమించింది. ఈ పరిశ్రమ మన దేశంలో 3.25 లక్షల కార్మికులకు ప్రత్యక్షంగానూ, 25 మిలియన్ల వ్యవసాయదారులకు పరోక్షంగానూ ఉద్యోగిత కల్పిస్తున్నది. కేంద్ర ప్రభుత్వానికి ఎక్సైజ్ డ్యూటీ లభించే మార్గాలలో ఈ పరిశ్రమ అతిముఖ్యమైనది. ప్రస్తుతం మన దేశంలో 420 చక్కెర కర్మాగారాలు 15 మిలియన్ టన్నుల స్థాపితశక్తితో పనిచేస్తున్నాయి. 400 కర్మాగారాలు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. వీటిలో 120 ప్రయివేటు రంగంలోను, 60 ప్రభుత్వ రంగంలోను మరియు 220 సహకార రంగంలోను ఉన్నాయి. 1951లో ప్రభుత్వం చెరకు కనీస ధర, పంచదార గరిష్ఠధరను నిర్ణయించి కొంత ప్రోత్సాహాన్ని అందించింది. తత్ఫలితంగా పంచదార ఉత్పత్తి పెరిగినందువలన రేషనింగ్‌కు ప్రభుత్వం స్వస్తి పలికింది. ప్రభుత్వం నియంత్రణలను విధించడం, ఒక్కో సందర్భంలో సడలించటం వంటి మార్పులెన్నో చేసినప్పటికీ పంచదార ఉత్పత్తి పెరుగుతూనే ఉంది.

టేబుల్ - 9.7

పంచదార ఉత్పత్తి మరియు వినియోగము (మిలియన్ టన్నులలో)

సం॥ము	ఓపెనింగ్ స్టాకు	ఉత్పత్తి	వినియోగము
1950 - 51	0.2	1.1	1.1
1970 - 71	2.1	3.7	4.0
1990 - 91	2.2	11.9	10.7
1995 - 96	5.6	14.8	10.6
1997 - 98	6.5	12.7	10.6

* ఎగుమతులు కలిపి

ఆధారము : R.B.I. Report on Currency and Finance 1997-98 Vol-1 and Economic Survey 1998-99.

9.8.3.1 స్వాతంత్ర్యం లభించిన తర్వాత ప్రగతి :

1932కు ముందు మనదేశంలో ఉన్న 32 కర్మాగారాలు సం॥ నికి 1.6 టన్నుల పంచదారను ఉత్పత్తి చేశాయి. మనదేశం ప్రతి సంవత్సరం 6 లక్షల టన్నుల పంచదారను దిగుమతి చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. 1932లో ఈ పరిశ్రమకు ప్రభుత్వం రక్షణ విధానాన్ని ప్రకటించింది. తద్వారా 1937 నాటికి ఉత్పత్తి 10 లక్షల టన్నులకు పెరిగింది మరియు కర్మాగారాల సంఖ్య 137కు పెరిగింది.

1950's లో పంచదార ఉత్పత్తి 1 మిలియన్ టన్నుకు పెరిగింది. ఎక్కువ ఉత్పత్తి సాధించడానికి ప్రభత్వం ఇచ్చిన అనేక ప్రోత్సాహకాల వలన 1970 - 71 నాటికి 7 మిలియన్ టన్నులకు, 1990 - 91 నాటికి 12 మిలియన్ టన్నులకు, 1995 - 96 నాటికి 14.8 మిలియన్ టన్నులకు ఉత్పత్తి పెరిగింది. కాని 1997 - 98 లో ఉత్పత్తి 12.7 మిలియన్ టన్నులకు తగ్గింది. గత రెండు దశాబ్దాలుగా పంచదార ఉత్పత్తి మరియు సప్లై చాలా ప్రోత్సాహకరంగా ఉంది. ఉత్పత్తి స్థిర పరిమాణంలో పెరుగుతున్నప్పటికి, వినియోగంలో పెరుగుదల తక్కువ రేటులో ఉన్నది. దీనివలన స్టాకు ప్రతి సం॥ము పెరుగుతున్నది. 1990 - 91లో పంచదార స్టాకు 2.2 మిలియన్ టన్నులు ఉండగా 1997 - 98 లో 6.5 మిలియన్ టన్నులకు పెరిగింది.

9.8.3.2 చక్కెర స్కామ్ 1993 - 94 :

1991 - 93 మరియు 1993 - 94 లో పంచదార పరిశ్రమకు ఊహించని సమస్యలు ఎదురయ్యాయి. చెరుకు ఉత్పత్తి వాతావరణములో వచ్చే మార్పుల వలన అనేక ఒడిదుడుకులకు లోనయ్యింది. దీనివలన చక్కెర ఉత్పత్తికి వినియోగించే భూమి పరిమాణం తగ్గింది. ముఖ్యంగా మహారాష్ట్రలో పంచదార ఉత్పత్తి ఈ కాలంలో తగ్గటానికి కారణం దీని ఉత్పత్తికి వినియోగించే భూపరిమాణం తగ్గటమే. 1993 - 94 లో దేశంలో మొత్తం ఉత్పత్తి 9.8 మిలియన్ టన్నులు మాత్రమే. 1993 - 94 సం॥ చివరిలోను మరియు 1994 - 95 సం॥ము మొదట్లోను స్వదేశంలో పంచదార ధర కేజీ 18రూ. నుంచి 20 రూ.లుగా ఉన్నది. ఈ కారణం వలన మనదేశం పంచదారను దిగుమతి చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. ప్రపంచంలో చక్కెర ఉత్పత్తిలో 4వ అతిపెద్ద దేశమయిన మనదేశం దిగుమతుల కొరకు అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రవేశించినందువలన అంతర్జాతీయ ధరలు బాగా పెరిగాయి. ఈ పరిస్థితి వలన మనదేశం కొంత నష్టాన్ని చవిచూడవలసి వచ్చింది. కనుక దీనిని చక్కెర స్కామ్‌గా వ్యవహరించడం జరిగింది.

9.8.3.3 చక్కెర అభివృద్ధి నిధి :

చక్కెర పరిశ్రమ ఆధునికీకరణకు, పునరుద్ధరణకు ఈ నిధి ఉదారంగా అప్పులిచ్చి, చక్కెర ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడుతుంది. చక్కెర కర్మాగారాల పరిధిలోని ప్రాంతాలలో చెరకు ఉత్పత్తికి కూడా సహాయపడుతుంది. 1997 నాటికి ఈ నిధి క్రింద రూ. 1,936 కోట్లు జమ అయ్యాయి. దీనిలో రూ. 1,160 కోట్లును ఈ నిధి నుండి ఈ పరిశ్రమ అభివృద్ధి కొరకు ఋణాలుగా మంజూరు అయ్యాయి.

9.8.3.4 చక్కెర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు :

1. ముడి పదార్థాలు సకాలంలో లభించక చెరకు ఉత్పత్తి తరచుగా ఒడిదుడుకులకు లోనవుతున్నది. ఈ కారణం వలన చక్కెర పరిశ్రమ అనేక సందర్భాలలో తీవ్ర సమస్యలను ఎదుర్కొనవలసి వస్తున్నది.
2. జౌళి మరియు వస్త్రపరిశ్రమలలో మాదిరి చక్కెర కర్మాగారాలలో వినియోగిస్తున్న యంత్రాలు చాలా పురాతనమైనవి. వీటిని ఆధునీకరించవలసిన అవసరం ఎంతో ఉన్నది. బీహార్ మరియు ఉత్తరప్రదేశ్‌లలో ఉన్న చక్కెర కర్మాగారాలలో ఆధునికీకరణ తప్పనిసరి.
3. ప్రభుత్వం చక్కెర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన స్థిరమైన దీర్ఘకాలిక విధానం చేపట్టనందువలన తరచుగా వచ్చే మార్పులతో అనేక ఇబ్బందులకు గురి అవుతున్నాయి. 1967 - 68లో చక్కెర కర్మాగారాలు మొత్తం ఉత్పత్తిలో 60% ప్రభుత్వానికి లేవీ (Levy) రూపంలో ఇవ్వవలసి ఉండేది, మిగతా 40% మార్కెట్ ధరల వద్ద మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. తదుపరి లేవీ చక్కెర శాతాన్ని 70% కు పెంచారు. 1978లో జనతా ప్రభుత్వము ఈ పరిశ్రమపై ఉన్న అన్ని నియంత్రణలను తొలగించింది. తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వము ఈ పరిశ్రమపై పాక్షికంగా నియంత్రణ విధిస్తూ, ద్వంద్వ ధరల విధానాన్ని విధించింది. ప్రస్తుతం చక్కెర ఉత్పత్తిదారులు మొత్తం ఉత్పత్తిలో 10% లేవీగా సప్లై చేయాలి, మిగతా 90 శాతం ఉత్పత్తిని మార్కెట్‌లో ధరల వద్ద విక్రయించుకోవచ్చు.
4. చక్కెర పరిశ్రమలో ఉత్పత్తి అయిన మొలాసిస్‌పై ధర మరియు కేటాయింపు నియంత్రణ ఉన్నది. మొలాసిస్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర తక్కువగా ఉన్నది. మొలాసిస్‌ను కేటాయింపబడిన డిస్టలరీలు కూడా నిర్ణయించిన సమయంలో కొనకపోవడం వల్ల కూడా ఈ పరిశ్రమలో లాభాల రేటు తగ్గడానికి ఒక కారణం.

5. ఈ పరిశ్రమలో ఉత్పత్తి వ్యయాలు, ఇతర దేశాలతో పోల్చినపుడు మనదేశంలో ఎక్కువ. ఈ పరిశ్రమపై ఎక్సైజ్ పన్ను భారం మరియు కొనుగోలు పన్నుల భారాలు ఉన్నాయి. ఉత్పత్తిని ప్రోత్సహించుటకు మిల్లులు కూడా కొంత రవాణా భారాన్ని మోస్తున్నాయి.

6. చక్కెర ఉత్పత్తి చెరకు ధర మరియు బెల్లం ధరలపై ఆధారపడి యుంటుంది. చక్కెర, బెల్లం తయారు చేయడానికి మనం పండించే ముడిపదార్థమైన చెరుకు సరిపోవడం లేదు. ఈ రెండు వస్తువుల తయారీకి చెరకు ఒక్కటే ముడిపదార్థం కనుక చెరకు కొరత ముఖ్య సమస్యగా తయారయ్యింది. అదీకాక, చెరకు, బెల్లం రెండూ సరైన ప్రత్యామ్నాయాలు అయనందున వినియోగదారులు ఏ వస్తువు ధర తక్కువగా ఉంటే దానిని వినియోగించుకొని, మిగిలిన వస్తువు డిమాండ్ తగ్గించుకొంటున్నారు.

7. ఇటీవల కాలంలో సహకార రంగంలో చక్కెర ఉత్పత్తి బాగా పెరుగుతున్నది. మన దేశంలో మొత్తం ఉత్పత్తిలో 60% ఆక్రమించాయి. కావున సహకార పరిశ్రమల ప్రాధాన్యం పెరిగి స్వతంత్రంగా ఉత్పత్తిచేసే పరిశ్రమలు ఆ పోటీని తట్టుకోలేకపోతున్నాయి.

9.8.4 సిమెంట్ పరిశ్రమ (Cement Industry) :

1914లో సిమెంట్ ఉత్పత్తి కొరకు గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో ఇండియన్ సిమెంట్ కంపెనీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం మనదేశంలో 20 పెద్ద సిమెంటు తయారీ యూనిట్లు మరియు 140 మినీ - సిమెంట్ ప్లాంట్లు 105 మిలియన్ల టన్నుల స్థాపిత శక్తితో పనిచేస్తున్నాయి. ప్రస్తుతం సిమెంట్ పరిశ్రమ వాస్తవ ఉత్పత్తి 70 మిలియన్ టన్నులు. ఈ పరిశ్రమ 2 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నది. ప్రపంచంలో సిమెంట్ ఉత్పత్తిదారులలో రష్యా, జపాన్, అమెరికా, ఇటలీ, పశ్చిమ జర్మనీ మరియు ఫ్రాన్స్ తర్వాత మనదేశం ఏడవ స్థానం ఆక్రమించింది. 1994 - 95లో సిమెంట్ తలసరి వినియోగాన్ని పరిశీలించినప్పుడు మన తలసరి వినియోగం (68 కేజీలు) ప్రపంచంలో అతి తక్కువ అని తెలుస్తున్నది. తలసరి సిమెంట్ వినియోగం జపాన్‌లో 700 కేజీలు, పశ్చిమ జర్మనీలో 650 కేజీలు, ఫ్రాన్స్‌లో 600 కేజీలు, చైనాలో 120 కేజీలు, పాకిస్తాన్‌లో 98 కేజీలుగా ఉన్నది.

టేబుల్ - 9.8

సిమెంట్ పరిశ్రమ ప్రగతి (మిలియన్ టన్నులలో)

సంవత్సరము	ఉత్పత్తి చేయగల శక్తి	ఉత్పత్తి	ఉత్పాదక శక్తిలో ఉత్పత్తి శాతం
1950 - 51	3.3	2.7	82
1970 - 71	17.3	14.3	83
1990 - 91	64.0	48.8	76
1997 - 98	106.7	83.21	78

ఆధారము : R.B.I. Report on Currency and Finance 1997 - 98, Vol. 1

పై పట్టికలో సూచించిన విధంగా మన దేశంలో సిమెంట్ ఉత్పత్తి వరుసగా పెరుగుదలను సూచించుచున్నది. అయితే పరిశ్రమల ఉత్పాదక శక్తిని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నాము.

ఏ పరిశ్రమలలోను లేనటువంటి ఆర్థిక స్థోమత కేంద్రీకరణ సిమెంట్ పరిశ్రమలోనే ఉన్నదని చెప్పవచ్చు. ప్రభుత్వ రంగము, A.C.C., దాల్మియా, జైన్ మరియు బిర్లాస్ చాలా వరకు మన సిమెంట్ పరిశ్రమలను నియంత్రిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఈ పరిశ్రమలలోని యూనిట్లలో విలీనాలు కొంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పరిశ్రమ మొత్తాన్ని పరిశీలించినప్పుడు అన్ని రాష్ట్రాలలోను సిమెంట్ పరిశ్రమ వ్యాప్తి చెందినట్లు తెలుస్తున్నది. సున్నపురాళ్ళు దాదాపు అన్ని రాష్ట్రాలలోను లభ్యమవుతున్నాయి. దీనికితోడు రవాణా సౌలభ్యం కొరకు రైల్వేలైను దగ్గరగా ఉన్నట్లయితే ఆ ప్రాంతాలలో సిమెంట్ యూనిట్లు కేంద్రీకరింపబడతాయి. 1980 నాటికి సిమెంట్ యూనిట్లు ముఖ్యంగా మనదేశ దక్షిణ, పశ్చిమ ప్రాంతాలలో కేంద్రీకృతమయ్యాయి. మొత్తం ఉత్పత్తిలో ఉత్తర మరియు తూర్పు ప్రాంతాలు 21 శాతం ఉత్పత్తి చేస్తుండగా, 44 శాతాన్ని వినియోగించుకొంటున్నాయి. దక్షిణ మరియు పశ్చిమ ప్రాంతాలు మొత్తం ఉత్పత్తిలో 79 శాతాన్ని ఉత్పత్తి చేస్తూ, 57 శాతం మాత్రమే వినియోగించుకొంటున్నాయి.

9.8.4.1 సమస్యలు :

1. ఈ పరిశ్రమపై విధించే టారిఫ్ ఎక్కువగా ఉంటున్నది. సిమెంట్‌పై విధించే ఎక్సైజ్ పన్ను స్థిరంగా పెరుగుతున్నది. ఈ పరిశ్రమకు సంబంధించిన అభివృద్ధి మండలి అంచనా ప్రకారం ప్రతి టన్ను సిమెంట్‌పై మొత్తం లేవీ 66.8%గా ఉంటున్నది.
2. సిమెంట్ పరిశ్రమకు ముఖ్యమైన ముడిసరుకు బొగ్గు. సిమెంట్ ఉత్పత్తి చేయడానికి అయ్యే వ్యయంలో బొగ్గు వ్యయం 15 నుంచి 20%గా ఉంటుంది. ఒక టన్ను సిమెంట్ తయారుచేయడానికి సగటున 250 కేజీల బొగ్గు అవసరమవుతుంది. ఉత్తర, దక్షిణ మరియు పశ్చిమ భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో ఉన్న సిమెంట్ ప్లాంట్లకు సుమారు 1000 నుండి 1200 కిలోమీటర్ల దూరం నుంచి బొగ్గును సప్లై చేయవలసి ఉంటుంది. బొగ్గు కొరత మరియు నాణ్యత కూడా సరిగా లేకపోవడం ఈ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలలో ప్రధానమైంది.
3. సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోవటం కూడా ఈ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలలో ఒకటి. ఎకనామిక్ టైమ్స్ రీసెర్చ్ బ్యూరో అంచనా ప్రకారం 1998 - 99లో ఉత్తర ప్రాంతాలలో ఉన్న సిమెంట్ ప్లాంట్లు తమ సామర్థ్యంలో 72.9% మాత్రమే వినియోగించుకుంటున్నాయి. తూర్పు ప్రాంతంలోని ప్లాంట్లు 64.8%, పశ్చిమ ప్రాంతాలలో ఉన్న ప్లాంట్లు 91.2% మరియు దక్షిణ ప్రాంతాలలోని సిమెంట్ ప్లాంట్లు తమ సామర్థ్యంలో 80.3% మాత్రమే వినియోగించుకుంటున్నాయి.

4) సిమెంట్ పరిశ్రమలో ఉత్పత్తి గణనీయంగా పెరిగినప్పటికి, పెరుగుతున్న జనాభా మరియు వారి అవసరాల దృష్ట్యా చూసినప్పుడు తలసరి లభ్యత చాలా తక్కువగా ఉంటున్నది.

5) అభివృద్ధి చెందుతున్న దేశాలలో సహజంగా నిర్మాణాత్మక కార్యక్రమాలకు భారీగా సిమెంట్ అవసరమవుతుంది. కాని సిమెంట్ కొరత పెద్ద అవరోధంగా పరిణమించింది.

6) రైల్వే వ్యాగన్లు సరిగా లభ్యం కాకపోవడం, ఫర్నేస్ ఆయిల్ సరిగా లభ్యం కాకపోవడం, కరెంట్ కోత కూడా చాలా ప్లాంట్లు మూతపడటానికి కారణం.

9.8.5 జౌళి పరిశ్రమ (Jute Industry) :

మనదేశంలో జౌళిపరిశ్రమ అతి పురాతనమైనది. విద్యుత్‌తో నడిపే మొదటి జౌళిమిల్లును 1859లో కలకత్తాకు సమీపాన రిష్రా వద్ద ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ పరిశ్రమ మన దేశంలో మంచి పురోగతి సాధించింది. బెంగాల్‌లో ఈ

పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. దేశవిభజన ఈ పరిశ్రమ అభివృద్ధికి విఘాతం కల్పించింది, ఎందువలననగా, జౌళిని పండించే ఎక్కువ ప్రాంతం బంగ్లాదేశ్ పరమైంది. జౌళిని పండించే మొత్తం భూమిలో 25 శాతం మాత్రమే మనదేశానికి మిగిలింది. ముడిజౌళి ఉత్పత్తి పెంచడానికి భారత ప్రభుత్వం ఎక్కువ కృషి చేసింది. దీని ఫలితంగా 1947 - 48 జౌళి క్రింద ఉన్న భూమి విస్తీర్ణం 6.52 లక్షల ఎకరాలుకాగా, 1950 - 51 నాటికి ఇది 1.4 మిలియన్ ఎకరాలకు పెరిగింది. ఇదే కాలంలో ముడిజౌళి ఉత్పత్తి 1.6 మిలియన్ బేళ్ళ నుంచి 3.3 మిలియన్ బేళ్ళకు పెరిగింది. జౌళివస్త్రాల ఉత్పత్తి 1950-51లో 837 వేల టన్నులు కాగా 1980 - 81 నాటికి 1,392 వేల టన్నులకు, 1999 - 2000 నాటికి 1,591 వేల టన్నులకు పెరిగింది.

9.8.5.1 జౌళి పరిశ్రమ - సమస్యలు :

1) జౌళికి ప్రత్యామ్నాయాలు మార్కెట్‌లోకి ప్రవేశించినందు వలన ఈ పరిశ్రమ తిరోగమన దశలో ఉన్నది. జౌళి సంచుల స్థానంలో సింథటిక్ సంచుల వాడకం మన దేశంలోను, విదేశాలలోను పెరిగింది. మనదేశంలో ఆహారధాన్యాలు, ఎరువులు, సిమెంట్ మరియు పంచదార ప్యాకింగ్‌ను జౌళి సంచుల స్థానంలో సింథటిక్ సంచులలో చేస్తున్నారు.

2) మనదేశంలోని ఈ పరిశ్రమకు సంబంధించిన ఎగుమతుల విషయంలో బంగ్లాదేశ్ మరియు చైనాల నుంచి మంచి పోటీ ఎదురయ్యింది.

3) మనదేశంలో ఉన్న జౌళి మిల్లులు చాలా పురాతనమైనవి, వీటిలో ఉత్పత్తి పాతయంత్రాల సహాయంతో జరుగుతున్నది. దీనివలన ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్నాయి. మనదేశానికి జౌళి ఎగుమతులలో పోటీదారులయిన బంగ్లాదేశ్ మరియు చైనాలలో ఉన్న మిల్లులు కొత్తవి, వీటిలో ఆధునిక యంత్రాల సహాయంతో ఉత్పత్తి జరుగుచున్నది, తద్వారా ఉత్పత్తి పెరిగి ఉత్పత్తి వ్యయాలు తగ్గుచున్నాయి.

4) చాలా కాలంగా పశ్చిమబెంగాల్‌లో విద్యుచ్ఛక్తి కొరత తీవ్రంగా ఉన్నది. దీనివలన ప్రభుత్వం ఈ పరిశ్రమపై విద్యుత్‌కోత విధించింది.

5) వేతనాలు మరియు ముడిసరుకుల ధరలు పెరగడం, స్థాపితశక్తి మరియు వాస్తవ ఉత్పత్తికి మధ్య తేడా ఎక్కువగా ఉండటం ఈ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్య.

9.9. కుటీర, చిన్నతరహా పరిశ్రమలు :

19వ శతాబ్దంలో పెద్దతరహా పరిశ్రమలు ప్రారంభమయ్యే వరకు పరిశ్రమలన్నీ మనదేశ ఆర్థికవ్యవస్థలో కుటీర పరిశ్రమల రూపంలో ఉండేవి. నూలు, పట్టువస్త్రాలు, లోహ వస్తువులు మొదలైనవి కుటీర పరిశ్రమలలోనే వెలుగొందాయి. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటన్ మరియు ఇతరదేశాలలో తయారయిన వస్తువుల వలన మన చిన్న పరిశ్రమల రంగంలో పోటీ ఏర్పడి, ఈ రంగంలో అభివృద్ధి కొరవడింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, గ్రామీణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంచి, ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరచే చర్యలో భాగంగా ప్రభుత్వం కుటీర మరియు చిన్నతరహా పరిశ్రమల పునరుద్ధరణకు తోడ్పడింది. 1955 సం॥లో పనిచేసే కార్మికుల సంఖ్యపై ఆధారపడి చిన్నతరహా పరిశ్రమలను నిర్వచించారు. విద్యుచ్ఛక్తి ఉపయోగిస్తూ 50 మందికన్నా తక్కువ మంది శ్రామికులున్న పరిశ్రమలు, విద్యుచ్ఛక్తిని వినియోగించకుండా 100 మంది కంటే తక్కువ మంది శ్రామికులున్న పరిశ్రమలను చిన్నతరహా పరిశ్రమలుగా గుర్తించారు. ఈ నిర్వచనాన్ని తరువాత కాలంలో సవరించడం జరిగింది. ప్రస్తుతం రూ. 1 కోటి మించకుండా పెట్టుబడి మూలధనం ఉన్న పారిశ్రామిక సంస్థలను చిన్నతరహా పరిశ్రమలుగా భావిస్తున్నారు. అనుబంధ పరిశ్రమల విషయంలో మూలధన పెట్టుబడి రూ. 1 కోటి వరకు ఉండవచ్చు. రూ. 25 లక్షల లోపు పెట్టుబడి ఉన్న పరిశ్రమలను అతిచిన్న పరిశ్రమలు (Tiny Sector) గా ప్రస్తుతం నిర్వచిస్తున్నారు.

టేబుల్ 9.9

చిన్నతరహా పరిశ్రమల ప్రగతి 1994 - 95 నుండి 2002 - 2003

సం॥ము	యూనిట్ల సంఖ్య (మిలియన్‌లో) 31 డిశంబర్ వరకు	ఉత్పత్తి (కోట్ల రూపాయలలో)		ఉద్యోగిత (మిలియన్లలో)	ఎగుమతులు ((ప్రస్తుత ధరలవద్ద) కోట్ల రూ॥లలో
		ప్రస్తుత ధరలవద్ద	స్థిరమైన ధరల వద్ద) (1993-94)		
1994 - 95	2.57	2,98,886	2,66,054	14.66	29,068
	(7.7)	(23.7)	(10.1)	(5.2)	(14.9)
1995 - 96	2.66	3,62,656	2,96,385	15.26	36,470
	(3.9)	(21.3)	(11.4)	(4.1)	(25.5)
1996 - 97	2.80	4,11,858	3,29,935	16.00	39,248
	(5.5)	(13.6)	(11.3)	(4.8)	(7.6)
1997 - 98	2.94	4,62,641	3,57,749	16.72	44,442
	(5.0)	(12.3)	(8.4)	(4.5)	(13.2)
1998 - 99	3.08	5,20,650	3,85,296	17.16	48,979
	(4.6)	(12.5)	(7.7)	(2.6)	(10.2)
1999 - 2000	3.21	5,72,887	4,16,736	17.85	54,200
	(4.3)	(10.0)	(8.2)	(4.0)	(10.7)
2000 - 01	3.31	6,39,024	4,51,033	18.56	69,797
	(3.1)	(11.5)	(8.2)	(4.0)	(28.8)
2001 - 02	3.44	6,90,316	4,78,456	19.22	71,244
	(3.9)	(8.0)	(6.1)	(3.6)	(2.1)
2002 - 03	3.57	7,60,844	5,13,910	20.00	N.A
	(3.8)	(10.2)	(7.4)	(3.9)	

Note : Figures in brackets give the increase over previous year

Source : i) Govt. of India, Economic Survey 2002 - 03, Table 7.25, p. 152, ii) Govt.of India, 2004, p. 475

1994 - 95 నుండి 2002 - 03 వరకు చిన్నతరహా పరిశ్రమల రంగం యొక్క ప్రగతి పై పట్టికలో ఇవ్వబడింది. 1994 - 95 లో చిన్నతరహా రిశ్రమల ఉత్పత్తి విలువ రూ. 2,98,886 కోట్లు కాగా 2002-2003 లో ఉత్పత్తి విలువ రూ. 7,60,844 కోట్లు (ప్రస్తుత ధరల వద్ద) కు చేరుకుంది. స్థిరధరల వద్ద (1993-94 ధరల వద్ద) చిన్నతరహా పరిశ్రమల ఉత్పత్తి విలువ 1994 - 95లో 2,66,054 కోట్లు కాగా 2002 - 03 నాటికి రూ. 5,13,910 కోట్లకు చేరుకుంది. ఈ పరిశ్రమ 1994 - 95లో 14.66 మిలియన్ల మందికి ఉపాధి కల్పించగా, ఈ సంఖ్య 2002 - 2003 లో 20 మిలియన్లకు పెరిగింది. 1994 - 95లో

(ప్రస్తుత ధరల వద్ద) ఈ పరిశ్రమ రూ. 29,098 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 2001 - 02 నాటికి వీటి ఎగుమతుల విలువ రూ. 71, 244 కోట్లకు పెరిగింది. మనదేశం యొక్క మొత్తం ఎగుమతులలో చిన్నతరహా పరిశ్రమల వాటా 1971-72లో 9.6% ఉండగా, 2001-02 నాటికి ఈ పరిశ్రమ వాటా 34.1%కు పెరిగింది.

9.9.1 చిన్నతరహా పరిశ్రమల సమస్యలు - నివారణ మార్గాలు :

చిన్నతరహా యూనిట్లలో ఒక యూనిట్‌కు, ఇంకొక యూనిట్‌కు మధ్య తేడా ఉండడమే ఖాయిలా పడటానికి ముఖ్య కారణం అయినప్పటికి సాంకేతిక పరిజ్ఞాన లోపం, మార్కెట్ అడ్డంకులు, చెల్లింపుల జాప్యం, ఉత్పత్తిలో లాభాలు గడించే సామర్థ్యం లోపించడం, అసమర్థ యాజమాన్యం, అప్పులు తీసుకొనే వారిలో విజాయితీ లోపించడం, పారిశ్రామిక యూనిట్లు స్థాపించే క్రమంలో ఎంపిక చేయువిధానం లోపభూయిష్టంగా ఉండడం, ముడిసరుకుల కొరత, స్థానిక ప్రాంతీయ కారణాలు మొదలైనవి చిన్నతరహా పారిశ్రామిక రుగ్మతకు ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చును. ఈ కారణాలను ప్రధానంగా ఐదు రకాలుగా వర్గీకరించి చెప్పవచ్చు. అవి

1) విత్త సంబంధమైనవి
2) పాలనా పరమైనవి
3) అవస్థాపనా కొరతలకు సంబంధించినవి
4) సాంకేతికమైనవి
5) ఇతరములు

అయితే ఏ ఒక్క కారణం కూడా మొత్తం ఖాయిలా పడటానికి కారణం కాదు, భిన్న రకాల కారణాలు సామూహికంగా యూనిట్లపై ప్రభావం చూపిస్తాయి అనే అంశాన్ని FICCI అధ్యయనం సూచిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత అధ్యయనం చేయకుండా పారిశ్రామిక యూనిట్లు నెలకొల్పేవారికి ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తున్నాయి. ఇది కూడా చిన్నతరహా పారిశ్రామిక యూనిట్లు ఖాయిలా పడటానికి దారితీస్తుంది. ఎందుకంటే ఈ రాయితీలు ఇవ్వడంవల్ల ఇష్టానుసారంగా యూనిట్లను స్థాపించడం జరుగుతుంది. ఇలాంటి ప్రణాళికా రహితమైన యూనిట్లకు ఏ అడ్డంకులు లేకుండా అప్పులు ఇస్తే బ్యాంకులు, స్టేట్‌ఫైనాన్స్ కార్పోరేషన్‌లు సమాన బాధ్యత వహించవలసి ఉంటుంది. అధిక పెట్టుబడి ప్రాజెక్టులు, మార్కెట్‌లో గిరాకీ గురించి సమాచారం అందకపోవడం, ఉత్పత్తుల ఎంపికలో తప్పటడుగు వేయడం, సంబంధిత రంగాలకు సరిపోయేంత లాభాలను సరఫరాదారులకు ఇవ్వకపోవడం, పారిశ్రామిక కేంద్రాలకు సరియైన స్థలాలను కేటాయించకపోవడం, ప్రత్యామ్నాయ వస్తువుల ఆవిర్భావం ఇంకా కొన్ని విషయాలలో ఉద్యమకారులు బుద్ధి పూర్వకంగానే పరిశ్రమలను ఖాయిలా పరిశ్రమలుగా తయారుచేయడం జరుగుతుంది అనే విషయం కూడా అధ్యయనాలు ద్వారా తెలుస్తోంది. ఈ అంశాలే కాకుండా చిన్నతరహా యూనిట్లు వెనుకబడిన ప్రాంతాలలో స్థాపించడం, అవస్థాపన సౌకర్యాల కొరత, మార్కెట్లు ఎక్కువ దూరంలో వుండటం, నైపుణ్యం కల్గిన కార్మికులు దొరక్కపోవడం, సమర్థవంతమైన నిర్వహణ లేకపోవడంచేత చాలా కాలం నుండి యంత్రసామాగ్రి వృథాగా పడిఉండటం మొదలగు కారణాలు కూడా రుగ్మతలకు దారితీస్తాయి.

1971 సంవత్సరం మొదట్లో అనేక సమస్యలను ప్రారంభంలోనే పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భారత ప్రభుత్వం పరిశ్రమలకు ఆర్థిక సహాయం ఇచ్చేందుకు భారతీయ పారిశ్రామిక పునర్నిర్మాణ సంస్థను (IRCI) ఏర్పాటు చేసింది. దీనిని 1986 సంవత్సరంలో భారతీయ పారిశ్రామిక పునర్నిర్మాణ బ్యాంకు (IRBI) గా మార్చారు. 1981 సంవత్సరంలో ప్రభుత్వం ఖాయిలా పడ్డ యూనిట్ల పట్ల అనుసరించవలసిన సూచనలను కూడా జారీ చేసింది. ఖాయిలాపడిన పరిశ్రమల కంపెనీ చట్టం 1985 వచ్చింది. BIFR ను నెలకొల్పారు. కాని అది పనిచేయు సంవిధానంలో చిన్నతరహా యూనిట్లను మినహాయించారు.

వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర ఏజన్సీలు చిన్నతరహా రంగంలో రుగ్మతపై అధ్యయనాలు చేసారు. కాని ప్రాథమిక స్థాయి నుండి వీటిని ఎదుర్కొనటానికి సరియైన ప్రత్యామ్నాయాలు ఏవీ చేపట్టలేదు. స్థూలంగా చెప్పాలంటే ఆర్థిక వ్యవస్థలో నాలుగు రకాల ఖాయిలాపడ్డ యూనిట్లు కనిపిస్తాయి. 1) కొన్ని పరిశ్రమలు ఖాయిలీ పరిశ్రమలుగా పరిగణించవచ్చు. 2) కొన్ని పుట్టుకతోనే ఖాయిలీ పడినవి. 3) కొన్ని వాటి జీవితకాలములో వృద్ధిచెంది ఖాయిలా పడినవి. 4) మరికొన్ని ఖాయిలా పడటానికి సిద్ధంగా ఉన్నవి.

అభివృద్ధి కావడానికి అవకాశమున్న ఖాయిలా పడిన చిన్నతరహా యూనిట్లు, పునరావాస కార్యక్రమంలో ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వీటిని విజయవంతంగా నడపటానికి ప్రభుత్వము సహాయం ఎంతైనా అవసరము. ఒక యూనిట్ ఆరోగ్యవంతంగా లేకపోయినట్లయితే వెంటనే నిలిపివేయాలి లేదా అది ఎదుర్కొంటున్న చిక్కులు తొలగించి సరియైన సంస్థగా తీర్చిదిద్దాలి. ఇంకొక రకంగా పరిశీలించినట్లయితే, పునరావాస కార్యక్రమం అవసరమని భావించిన వాటికి స్వల్పకాలిక ఋణాలు ఇచ్చి ప్రోత్సహించాలి.

చిన్నతరహా ఉత్పత్తి రంగంలో ఉత్పత్తి అయ్యే దాదాపు 800 ఉత్పత్తులకు రక్షణలు కల్పిస్తున్నప్పటికి ఆ పరిశ్రమలు ఖాయిలా పడటం విపరీతంగా పెరుగుతూ ఉంది. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలలో సహా కొన్ని అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో కూడా చిన్నతరహా యూనిట్లన్నింటిలో ఇదే పరిస్థితి కనపడుతోంది. ప్రతి సంవత్సరం నష్టపోతూ అలా ఐదు సంవత్సరాలు వచ్చేసరికి పెట్టిన పెట్టుబడిలో 50 శాతం వరకు గానీ, లేదా దానికి సమానంగానే మూలధనాన్ని కోల్పోతూ, నష్టపోతూ ఉన్నట్లయితే ఆ చిన్నతరహా పారిశ్రామిక యూనిట్‌ను ఖాయిలా పడ్డదానిగా గుర్తించవచ్చు. ఈ అంశాన్ని పరిగణలోనికి తీసుకున్నట్లయితే వికేంద్రీకరించిన ప్రతి చిన్నతరహా కుటీరపరిశ్రమలో సహితం ఉత్పత్తి కుంటుపడుతూనే ఉందని చెప్పవచ్చు. కాబట్టి చిన్నతరహా పరిశ్రమలు వ్యయం పెరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నప్పుడు, ప్రతి సంవత్సరం ఆర్థిక సంస్థలకు చెల్లించవలసిన మొత్తాన్ని (వడ్డీతో సహా వాయిదాలను) ఒక సంవత్సరం వరకు చెల్లించనట్లయితే అటువంటి పరిశ్రమలను కూడా ఖాయిలా పడ్డ పరిశ్రమలుగా గుర్తించవచ్చు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఖాయిలాపడిన పరిశ్రమలను గుర్తించడానికి తెలిపిన అంశాలలో ప్రతి సంవత్సరం నష్టాలకు లోనుకావడం, ఆర్థికపరమైన దుస్థితి ఏర్పడటం మొదలైనవి ఉన్నాయి.

ఇక కాలాగుణమైన ఋణాలిచ్చే ఆర్థిక సంస్థలైతే

ఎ) వరుసగా నాలుగుసార్లు అర్థసంవత్సరపు వాయిదాలను వడ్డీతో కాని లేదా అసలుకాని ఆర్థిక సంస్థలకు ఇవ్వలేకపోయినపుడు

బి) వరుసగా రెండు సంవత్సరాలు నష్టం వచ్చినా లేదా మూలధనం నుండి 50 శాతం కాని అంతకంటే ఎక్కువకాని నష్టం సంభవించినప్పుడు

సి) చట్టపరిధిలో ఒకటి లేదా రెండు సంవత్సరాల కాలంలో పూర్తిస్థాయిలో అంటే ఉన్న ఆస్తుల విలువకన్న ఋణాలు పేరుకు పోయినప్పుడు ఒక పారిశ్రామిక యూనిట్‌ను ఖాయిలా పడినదిగా గుర్తించవచ్చు అని పేర్కొంటున్నాయి.

నాయక్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా చిన్నతరహా పరిశ్రమల్లో ఖాయిలా యూనిట్ల నిర్వచనంలో మార్పువచ్చింది. ఒక యూనిట్ ఋణఖాతాలు అనుమానాస్పదంగా మారినప్పుడు ఋణాలకు సంబంధించి అసలు లేదా వడ్డీ చెల్లింపు గడువుకు రెండున్నరేళ్ళ నుంచి బకాయి పడినప్పుడు నగదు నష్టాలు పేరుకుపోయిన కారణంగా రెండు అకౌంటింగ్ సంవత్సరాల్లో గరిష్ఠ నికర విలువ, 50 శాతం లేదా అంతకు మించి తరిగిపోయినప్పుడు ఆ యూనిట్‌ను ఖాయిలా పడినదిగా పేర్కొనవచ్చునని భారత రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. ఈ కొత్త నిర్వచనం వల్ల ఖాయిలాపడుతున్న యూనిట్‌ను ముందుగా గుర్తించి, అవసరమైన సాయాన్ని అందజేయవచ్చని ఆర్.బి.ఐ. అభిప్రాయపడింది. కాబట్టి చాలా సంవత్సరాల నుండి చిన్నతరహా పరిశ్రమలలోని ఖాయిలా స్థితిని ఒకే విధంగా నిర్వచించలేదని చెప్పవచ్చు.

1993 నాటికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన వివరాల ప్రకారం చిన్నతరహా రంగంలో 2,21,472 పారిశ్రామిక యూనిట్లు, చిన్నతరహాయేతర రంగంలో 1,461 యూనిట్లు ఖాయిలాపడ్డట్టు తెలుస్తోంది. ఈ యూనిట్లు బకాయిపడ్డ బుణాలు మొత్తం రూ. 6,115.16 కోట్లు. మార్చి 1995 నాటికి చిన్నతరహా రంగంలో 2,68,815 యూనిట్లు ఖాయిలా పడ్డట్లు ఒక అంచనా.

చిన్నతరహా రంగంలో ఖాయిలాపడిన యూనిట్లను తిరిగి ఆరోగ్యవంతమైనవిగా తీర్చిదిద్దటానికి

1) చిన్నతరహా రంగంలో ఖాయిలాపడిన యూనిట్లను ఆజమాయిషీ చేయడానికి జిల్లాస్థాయిలో పునారావాస కమిటీలను ఏర్పాటు చేయాలి.

2) ప్రస్తుతం నిర్వచించిన దాని ప్రకారము ఆర్థిక సంబంధమైన విషయాలు మాత్రమే ఖాయిలా పడటానికి కారణాలుగా భావించాలి. కాని పూర్తిస్థాయిలో శ్రమశక్తి వినియోగము, కొత్త విషయాలు కనుగొనడం మొదలైన అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి.

3) అవసరానుకూలంగా, ఇష్టపూర్వకంగా యూనిట్‌ను ఖాయిలాపడేలా చేసే వారికి జరిమానాలు విధించాలి.

4) ఖాయిలాపడిన యూనిట్లను తిరిగి వినియోగంలోకి తెచ్చే సంస్థలకు రాయితీలు ఇవ్వకూడదు.

ముందే రూపొందించిన పునరావాస, అభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా అమలుచేస్తూ ప్రభుత్వం జిల్లాస్థాయిలో అధికారులను నియమించి తగిన విధంగా వారికి తర్ఫీదు ఇవ్వాలి. అప్పుడు మాత్రమే చిన్నతరహా రంగంలోని ఉద్యమదారులు పూర్తి సామర్థ్యంతో పనిచేయగలుగుతారు. చిన్నతరహా రంగానికి సంబంధించిన విధాన సంస్కరణలో సాధించిన ప్రగతి శూన్యమని, చిన్నతరహా యూనిట్ల కోసం రిజర్వుచేసిన వస్తువుల జాబితా ఇంకా ఎక్కువగానే ఉందని, ఇలా రక్షణ కల్పించడంవల్ల సామర్థంపై ప్రభావం పడగలదని, వ్యవసాయపరమైన నియంత్రణల సడలింపుతోపాటు పారిశ్రామిక పునరవ్యవస్థీకరణ, కార్మిక విధానాల సమీక్ష జరపాలని భారత రిజర్వుబ్యాంకు మాజీ గవర్నరు డాక్టర్ యం. నరసింహం అభిప్రాయపడ్డారు. ఇంకా ప్రభుత్వరంగ సంస్కరణలను కూడా మరింత తీవ్రంగా పరిశీలించాలని, పారిశ్రామిక విధానానికి సంబంధించిన 5 పరిశ్రమల్లో తప్ప మిగతా వాటిలో లైసెన్సింగ్‌ను తొలగించడం హర్షణీయమని, డి లైసెన్సింగ్ పరిధిని మరింత విస్తరించే విషయమై సమీక్ష జరపాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

9.10 ప్రైవేటీకరణ :

ప్రభుత్వం ఉత్పాదక కార్యకలాపాలను ప్రభుత్వ రంగం నుండి ప్రయివేటు రంగానికి బదిలీ చేసే ప్రక్రియను ప్రైవేటీకరణ అంటారు. 1980 నుండి బ్రిటన్‌లోనేకాక అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలోను, సామ్యవాద దేశాలైన చైనా మరియు రష్యాలోను ప్రైవేటీకరణ వ్యాప్తి చెందుతుంది. ప్రభుత్వరంగ ఆధీనంలో ఉన్నటువంటి అనేక సంస్థాగత రుగ్మతల నుండి మన ఆర్థిక వ్యవస్థను కాపాడుకొనేందుకు ప్రైవేటీకరణ ఒక సాధనము. ప్రభుత్వ రంగానికే కేటాయింపబడి, ఇప్పటివరకు ప్రభుత్వ ఆజమాయిషీలో ఉన్న ఏకస్వామ్య సంస్థలలో సైతం ప్రయివేటు రంగానికి మనదేశంలో అవకాశం కల్పించబడింది. ప్రభుత్వరంగ పరిధిని పరిమితం చేయటం ద్వారా మరియు ప్రభుత్వ రంగ సంస్థల విస్తరణ కార్యక్రమములను చేపట్టకపోవటం ద్వారా మన ప్రభుత్వం పెద్దఎత్తున ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నది.

ప్రైవేటీకరణ - ఆవశ్యకత :

మనదేశంలో లోటుబడ్జెట్ క్రమేపీ పెరుగుతున్నది. దీనివలన ద్రవ్యోల్బణం పెరగడమేకాక, ఆర్థికాభివృద్ధికి అవరోధంగా ఉండే అనేక అంశాలను మనం ఎదుర్కొనవలసి వస్తున్నది. ప్రణాళికేతర వ్యయం ఎక్కువగా పెరుగుతున్నందువలన విలువైన

వనరులు ప్రభుత్వ వ్యయాన్ని తట్టుకునేందుకు తరలింపబడుతున్నాయి. ఆర్థిక ప్రణాళికలలో మూలధన ఉత్పత్తి నిష్పత్తి క్రమేపీ పెరుగుతున్నది. ప్రభుత్వరంగ సంస్థలు ఎక్కువగా నష్టాలలో నడుస్తున్నాయి. ప్రభుత్వరంగంలో అసంతృప్తికరమైన ఉత్పాదకత, అధిక సిబ్బంది, పరిశోధనాభివృద్ధి కుంటుపడటం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధునికీకరించకపోవడం వంటి లోపాలు ప్రభుత్వరంగంలో కన్పిస్తున్నాయి. దీనివలన ప్రభుత్వ రంగంలో పెట్టుబడికి, రాబడి రేటు క్షీణించింది. ప్రభుత్వరంగ సంస్థలు నష్టాలలో నడవటానికి కారణం అవి తన స్థాపితశక్తిని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నాయి. ఎక్కువ ప్రభుత్వ రంగ సంస్థలు చాలా కాలంగా తమ స్థాపిత శక్తిలో 50 శాతం మాత్రమే వినియోగించుకుంటున్నాయి. 1999 - 2000 మరియు 2000-2001 కాలంలో స్థూలదేశీయ పాదుపులో ప్రభుత్వరంగం వాటా ఋణాత్మకంగా ఉండగా, 2000-2001 లో ప్రయివేటు రంగం వాటా 25.1 శాతంగా ఉంది. 1999 - 2000 లో నికర దేశీయ ఉత్పత్తిలో ప్రభుత్వరంగం 25% వాటా కల్గిఉండగా, ప్రయివేటు రంగం వాటా 75%.

1991లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నూతన ఆర్థిక సంస్కరణలో ఒక ముఖ్యాంశము ప్రైవేటీకరణ. 1956 పారిశ్రామిక తీర్మానం ద్వారా ప్రభుత్వ రంగానికి రిజర్వ్ చేసిన పరిశ్రమల సంఖ్య 17 కాగా, ప్రస్తుతం వీటి సంఖ్యను 4కు తగ్గించారు. మనదేశంలో ప్రైవేటీకరణకు లోనుకాని రంగాలు చాలా తక్కువ. రహదార్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, బ్యాంకులు, స్టీల్‌ప్లాంట్లు, కర్మాగారాలు, టెలికమ్యూనికేషన్లు ఇలా అన్ని రంగాలను ప్రైవేటీకరిస్తున్నారు. గతంలో ప్రయివేటు కంపెనీలకు అవకాశం లేని రంగాలలో ఇప్పుడు ప్రైవేటు రంగాన్ని అనుమతిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ ప్రక్రియను చేపడుతున్నారు. ఈ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆశించిన ఫలితాలను సాధించిందా, ఈ విధాన అమలు అర్థమేమిటో ముందుగా అర్థం చేసుకోవాల్సి ఉంది. ప్రైవేటీకరణ అనేది స్థానికంగా జరుగుతున్న ఆర్థిక విధాన ప్రక్రియ మాత్రమే కాదు. అంతర్జాతీయ ద్రవ్యసంస్థల సిఫారసుల మేరకు ఈ సంస్థల కన్సల్టెంట్‌ల సలహాలతో ఈ ప్రక్రియ జరుగుతోంది అనే విమర్శ ఉంది.

ప్రైవేటీకరణ ప్రక్రియలో సహజంగా మూసివేత, రిట్రెంచ్‌మెంట్, స్వచ్ఛంద, నిర్భంద పదవీవిరమణ ఉంటాయని భయాందోళనలు ఉన్నాయి. ఆసంఘటిత రంగాలలో అభద్రతతో పనిచేసే వారిసంఖ్య పెరుగుతుంది. ఫలితంగా యజమానులకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది. ఈ మేరకు ప్రైవేటీకరణ ఆర్థిక ప్రక్రియను మార్చవచ్చు. అంతేగాక అవసరమైన చట్టపరమైన మార్పులు కూడా వస్తున్నాయి. కార్మిక సంస్కరణల పేరిట పారిశ్రామిక వివాదాల బిల్లు, ట్రేడ్ యూనియన్ చట్టాలు, కాంట్రాక్టు ఉద్యోగుల చట్టాలకు మార్పులు ముందుకొస్తున్నాయి. ప్రైవేటీకరణ ప్రభావం చట్టాలపై కూడా పడుతోంది.

ప్రైవేటీకరణ జరగాలంటే సరళీకృత ఆర్థిక విధానం చాలా అవసరము. ప్రభుత్వ రంగం విఫలమైనందువల్లనే ప్రైవేటీకరణను సమర్థించలేము. సామాజిక న్యాయంలో కూడిన ఆర్థికాభివృద్ధి జరగాలన్నా, ఆర్థిక స్థోమత కేంద్రీకరణ నివారించాలన్నా, అవస్థాపనా సౌకర్యాలు మెరుగుపర్చాలన్నా ప్రభుత్వ రంగం యొక్క అవసరం ఉంది. ప్రయివేటు రంగ సంస్థల అభివృద్ధికై ప్రభుత్వరంగ సంస్థలు పోటీ లేకుండా ఉండే ధరల విధానాన్ని అవలంభించటం, ప్రయివేటు రంగ సంస్థల ఉత్పత్తులకు మార్కెట్‌ను సృష్టించటం కూడా చేస్తుంటాయి. ప్రభుత్వ రంగం అత్యంత వ్యయంతో కూడిన పరిశోధనలు కూడా చేపట్టి తద్వారా ప్రయివేట్ ఉత్పత్తిదారులకు మరింత ఎక్కువ ప్రయోజనాలను కల్పిస్తుంది. కనుక ప్రభుత్వ సహకారం లేనిదే ప్రయివేటు రంగం ముందంజ వేయలేదు. కొన్ని కీలక పరిశ్రమలయిన రైల్వేలు, రక్షణ, అణుశక్తి, ఇనుము, ఉక్కు మొదలగు సంస్థలలో ప్రభుత్వరంగం ఎంతో కృషిచేస్తున్నది. సాంఘికపరంగా కొన్ని అంశాలపై ప్రభుత్వ నియంత్రణ ఎంతో అవసరము.

మనదేశం ప్రైవేటీకరణ విధానాన్ని అవలంభిస్తున్నట్లు కొన్ని అంశాల ద్వారా తెలుస్తున్నది. ప్రభుత్వం క్రొత్తగా ప్రభుత్వ సంస్థలను స్థాపించడంగాని, వ్యాప్తి చేయడానికి గాని బడ్జెట్‌లలో ఎటువంటి అవకాశం కల్పించబడటంలేదు. నష్టాలలో నడిచే సంస్థలలో 100% ఈక్విటీలో ప్రైవేటీకరణ చేయడానికి ఇప్పటికే అవకాశం కల్పించబడింది. ఉక్కు మరియు విద్యుత్ రంగాలలో సైతం ప్రయివేటు కార్పోరేట్ రంగానికి అవకాశం కల్పించబడింది.

9.10.1 ప్రభుత్వరంగ పెట్టుబడుల ఉపసంహరణ :

భారతీయ ఆర్థికాభివృద్ధి సిద్ధాంతానికి ప్రభుత్వరంగములో కేంద్ర ప్రభుత్వ రంగ పాత్ర అద్వితీయమైనది. కీలకరంగాల అభివృద్ధి ద్వారా అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రజాస్వామ్యంలో ప్రజలందరికీ ఫలితాలు సమకూర్చే విధంగా ప్రాంతీయ అసమానతలు తొలగించడంలోను, ఆర్థిక స్థోమత కేంద్రీకరణను నివారించడంలోనూ ప్రభుత్వరంగం ప్రముఖ పాత్ర వహించింది.

ప్రభుత్వరంగ అభివృద్ధికి గత 50 సంవత్సరాలలో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ సంస్థలు అనేక రంగాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించి ఉత్పత్తిని పెంచి అనేక సాంకేతిక సామర్థ్యాలను రూపొందించింది. కానీ కాలక్రమేణా వీటిలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు అసంతృప్తికరమైన ఉత్పాదకత, ఆధిక సిబ్బంది, పరిశోధనాభివృద్ధి కుంటుపడటం, మానవ వనరులకు తగినంత శ్రద్ధ చూపకపోవడం, ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని నవీనం చేయలేకపోవడం వంటి లోపాలు ప్రభుత్వరంగంలో ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి. వీటి మూలంగా ప్రభుత్వరంగంలో పెట్టుబడికి రాబడిరేటు క్షీణించసాగింది. ప్రభుత్వరంగ సంస్థలు లాభసాటి స్థాయి నుంచి దేశం మోయలేని భారాలుగా మారాయి. అదీగాక లాభసాటి కానివి లేదా ఖాయిలాపడిన ప్రయివేటు సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం మరిన్ని కష్టాలకు కారణమయింది. ప్రభుత్వరంగ సంస్థలలో వచ్చే నష్టాలలో మూడవవంతు నష్టాలకు ఈ సంస్థలే కారణమైనాయి. వీటికితోడు ప్రభుత్వరంగంలో ఇమడని మరొక రకం సంస్థలు కొన్ని ఉన్నాయి. అవే మితిమీరిన వినియోగ వస్తువులను ఉత్పత్తిచేసే సంస్థలు. ఈ కారణాల వల్ల కేంద్రప్రభుత్వం 1991 విధాన తీర్మానంలో నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలోని ఒక అంశము ప్రభుత్వరంగ పెట్టుబడుల ఉపసంహరణ.

ప్రభుత్వరంగ సంస్థల నుండి ప్రభుత్వ పెట్టుబడులను అమ్మివేసే విధానాన్ని అనేకమంది ఆర్థికశాస్త్రవేత్తలు, రాజకీయ నిపుణులు, పరిపాలకులు,సామాన్య ప్రజలు పలువిధాలుగా విమర్శించారు. కంపెనీ వాటాలను వాస్తవధర కంటే తక్కువధరకు అమ్మడం, లాభాలతో నడిచే ప్రభుత్వ రంగ సంస్థల నుండి ప్రభుత్వం పెట్టుబడులను ఉపసంహరింప చేయడం, నష్టాలతో నడిచే సంస్థలను ఏమాత్రం పట్టించుకోకపోవడం మొదలైనవి ముఖ్యమైన విమర్శలు. అందువలన కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో ఈ విధానాన్ని విమర్శించింది. దీని మూలాన ప్రభుత్వం 1992 ఫిబ్రవరి నెలలో రంగరాజన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ జూన్ 1993న ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది.

9.10.2 రంగరాజన్ కమిటీ సిఫార్సులు :

1. ఉపసంహరించవలసిన పెట్టుబడుల నిష్పత్తి :

ముఖ్యంగా ప్రభుత్వ రంగానికి మాత్రమే కేటాయించిన పరిశ్రమలలో తప్ప ప్రభుత్వ పెట్టుబడుల నిష్పత్తి పూర్తిగా అమ్మవచ్చును. అంటే ప్రభుత్వ వాటాలు ఏ సంస్థలలో అయితే 49 శాతం వుంటాయో వాటి నుండి ఉపసంహరింప చేయవచ్చును. కానీ తగు కారణాలను చూపుతూ ప్రభుత్వం తమ సంస్థల ఈక్విటీ వాటాలను 26 శాతం వరకు ఉంచుకొనవచ్చును.

2. పెట్టుబడులు ఎవరికి అమ్మాలి :

రంగరాజన్ కమిటి ప్రకారం ప్రభుత్వ పెట్టుబడులను మ్యూచువల్ ఫండ్స్ వారికి ప్రభుత్వ సంస్థలలో పనిచేసే కార్మికులకు లేదా ఉద్యోగులకు, సాధారణ ప్రజానీకానికీ, బ్యాంకు వ్యాపారస్తులకు, స్టాకు బ్రోకర్లకు మాత్రమే అమ్మాలి. అయితే మొత్తం వాటాలలో 5 శాతం మాత్రమే ఒక్కొక్క విభాగానికి అమ్మాలి. అంతేగాక ఒక వ్యక్తికి 200 వాటాలకు మించి అమ్మరాదు. వీరితోపాటు విదేశీపెట్టుబడిదార్లకు, బహుళజాతి సంస్థలకు కూడా అమ్మవచ్చును.

3. వాటాల విలువ నిర్ణయించడం :

మార్కెట్ ధరల ప్రకారం వాటాల ధరలను నిర్ణయించి అమ్మాలి. ఈ విధంగా లేనట్లయితే వేలం ద్వారా ధరను నిర్ణయించాలి.

4. పెట్టుబడి ఉపసంహరణ ద్వారా వచ్చిన మొత్తాన్ని ఉపయోగించే విధానం :

అమ్మగా వచ్చిన మొత్తానికి రెన్యువల్ ఫండ్స్‌లో చేర్చి దాని నుండి 10శాతం పబ్లిక్ సెక్టార్ యూనిట్లకు ఇచ్చి మిగిలింది సాంఘిక రంగాలైన ఆరోగ్యం, ఉపాధికల్పన, పేదరిక నిర్మూలన వంటి వానికి వినియోగించాలి.

9.10.3 ఉపసంహరణ లక్ష్యాలు :

ప్రభుత్వరంగ సంస్థలలో ఉన్న ప్రభుత్వ పెట్టుబడులు లేదా వాటాలను అమ్మివేసే విధానాన్ని ప్రభుత్వరంగ పెట్టుబడుల ఉపసంహరణ విధానమని అంటారు. అప్పటి ఆర్థికమంత్రి ప్రొఫెసర్ మన్మోహన్‌సింగ్ పెట్టుబడి ఉపసంహరణ విధానాన్ని 1991 - 92 బడ్జెట్‌లో పొందుపరిచారు.

1) ప్రతి సంవత్సరము కేంద్ర ప్రభుత్వము బడ్జెట్‌లో వచ్చే లోటుకు కావలసిన ఆర్థిక వనరులను ద్రవ్యోల్బణ రహితంగా సమీకరించడం.

2) జాతీయ పునరావృత్తి నిధికి కావలసిన నిధులను సమకూర్చడం

3) ప్రభుత్వరంగ ఈక్విటీ విధానాన్ని విస్తృతపరచడం

1956వ సంవత్సరపు పారిశ్రామిక విధాన తీర్మాన ప్రకారం ప్రభుత్వ సంస్థలలో లేక కంపెనీలలో గల ప్రభుత్వ వాటాలు 49 శాతం ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలలో గల ప్రభుత్వ ఈక్విటీ వాటాలను నాలుగు శాతం కంటే ఎక్కువ ఉపసంహరించటానికి వీలులేదు. కావున ప్రభుత్వము ఈ నిష్పత్తి కంటే ఎక్కువ తగ్గించడానికి ఇష్టపడలేదు.

ఉపసంహరించిన మొత్తం పెట్టుబడులు

పట్టిక - 9.10

సం॥రము	లక్ష్యం (రూ॥లు కోట్లలో)	సాధింపబడినది (రూ॥లు కోట్లలో)
1991 - 92	2500	3,038
1992 - 93	2500	1,913
1993 - 94	3500	శూన్యం
1994 - 95	4000	4,843
1995 - 96	7000	362
1996 - 97	5000	380
1997 - 98	4800	902
1998 - 99	5000	5,371

1999 - 00	10,000	1,829
2000 - 01	10,000	1,869
2001 - 02	12,000	5,632
2002 - 03	12,000	3,342
2003 - 04	13,200	14,500
2004 - 05	4,000	- - -

Source : Indian Economy : Duff & Sundharam

9.10.4 డిజిన్వెస్ట్‌మెంట్ కమీషన్ :

ప్రభుత్వరంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం కొరకు జి.వి.రామకృష్ణ అధ్యక్షతన డిజిన్వెస్ట్‌మెంట్ కమీషన్‌ను 1996 ఆగస్టు 7న ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ చేయవలసిన విధులు :

1. కార్యదర్శులతో కూడిన కోర్‌గ్రూప్ నివేదించిన పి.ఎస్.యు.లలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రాధాన్యమైన వాటిని గుర్తించడం
2. తనకు నివేదించిన పి.యస్.యుల డిజిన్వెస్ట్‌మెంట్‌కు 5 నుంచి 10 సంవత్సరాల్లోపల సమగ్ర ప్రణాళికను రూపొందించడం.
3. తనకు నివేదించిన పి.యస్.యు.ల నుంచి ఏ మేరకు పెట్టుబడులను ఉపసంహరించాలో నిర్ణయించడం.
4. డిజిన్వెస్ట్‌మెంట్ ఏ పద్ధతిలో ఉండాలో సిఫార్సు చేయడం (ఉదాహరణకు ప్రభుత్వ వాటాలను దేశీయ కంపెనీలకు విక్రయించాలా లేక వేలం వేయాలా అనే విషయాన్ని సిఫార్సు చేయడం)
5. డిజిన్వెస్ట్‌మెంట్ వల్ల ఉపాధి కోల్పోయే కార్మికుల ప్రయోజనాల కాపాడటం, డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియలో పాలుపంచుకోవడానికి వారిని ప్రోత్సహించడం
6. నిర్దిష్ట పి.ఎస్.యులకు తగిన ఆర్థిక సలహాదారులను ఎంపిక చేయడం.

కీలకం, వ్యూహాత్మకం కాని సంస్థల నుంచి 74 శాతం వరకు ఈక్విటీని ఉపసంహరించాలని మరియు కీలకమైన, వ్యూహాత్మక సంస్థల నుంచి 26 శాతం మించి ఈక్విటీని ఉపసంహరించరాదని కమీషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 1991 - 92 నుంచి 2003 - 04 వరకు పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం మొత్తం రూ. 91,500 కోట్లు కాగా, సాధించింది రూ. 43,981 కోట్లు మాత్రమే. 2004 - 05 సం॥రానికి పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ. 4,000 కోట్లుగా నిర్ణయించారు.

9.10.5 ఉపసంహరణ వల్ల లాభనష్టాలు :

9.10.5.1 లాభాలు :

1) ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ వలన, వాటాదారుల ఒత్తిడి వలన ప్రభుత్వరంగంలో నైపుణ్యం, పోటీతత్వం పెరుగుతుంది.

2) ఈ విధానం ద్వారా బడ్జెట్‌లో వచ్చే లోటును పూడ్చవచ్చు.

3) ప్రభుత్వరంగ సంస్థలకు బడ్జెట్ ఉపసంహరణ ద్వారా మిగిలిన ధనంలో కొంత మొత్తాన్ని సాంఘిక, జాతీయ అభివృద్ధి పథకాల మీద ఖర్చుపెట్టవచ్చును.

9.10.5.2 నష్టాలు :

1) లోటుబడ్జెట్‌ను పూడ్చడానికి ప్రభుత్వ పెట్టుబడులను అమ్మివేయడం అనేది తాత్కాలిక చర్య మాత్రమే. ఈ ప్రకారం బడ్జెట్ లోటును పూడ్చడం మంచి పద్ధతి కాదు.

2) ప్రభుత్వ సంస్థలు నష్టాలతో నడుస్తాయనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పెట్టుబడులను అమ్మివేస్తున్నారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వ రంగంలో ఏ సంస్థలు అయితే లాభాలలో నడుస్తున్నాయో ఆ సంస్థలలో ఉండే ప్రభుత్వ పెట్టుబడులను అమ్మివేస్తున్నారు.

3) ప్రభుత్వ పెట్టుబడులు స్వల్ప నిష్పత్తిలో అమ్మినంత మాత్రాన ప్రభుత్వ సంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తి రాదు. ఎందుకంటే వాటాలలో ప్రయివేటు వ్యక్తుల కంటే ప్రభుత్వ పెట్టుబడులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ప్రభుత్వ ఆధిపత్యం తప్పనిసరిగా ఉంటుంది.

4) ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ విధానంపై మూడురకాల విమర్శలున్నాయి.

ఎ) ప్రభుత్వ వాటాలను అమ్మే ముందు ఆ ప్రభుత్వ సంస్థలకు ఉన్న ఆస్తులను తగు విధంగా లెక్కకట్టడం లేదు. దానివలన ప్రభుత్వ ఈక్విటీ వాటాలను మార్కెట్ ధర కంటే తక్కువ ధరలకు అమ్మివేయడం జరుగుతోంది.

బి) ప్రభుత్వ సంస్థ వాటాలను అమ్మే ముందు ఆ సంస్థల మేనేజర్లను గానీ, ఇతర నిపుణులను గానీ సంప్రదించకుండానే అమ్మకాలు జరిగిపోతున్నాయి.

9.11 సారాంశము :

ఇంగ్లాండ్, న్యూజిలాండ్ లాంటి దేశాలలో పెద్ద ఎత్తున ప్రైవేటీకరణను చేపట్టి ఘోరంగా విఫలమయ్యారు. బ్రిటన్ తర్వాత అతివేగంగా ప్రైవేటీకరణ అమలుచేసిన దేశం న్యూజిలాండ్. 1980వ దశకంలో న్యూజిలాండ్‌లో బహుశా పార్లమెంట్ మినహా దాదాపు అన్ని ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు కంపెనీలకు అమ్మివేశారు. ఇప్పుడు ఈ దేశంలో తిరిగి అన్ని ఆస్తులను జాతీయం చేస్తున్నారు. గత మూడేళ్ళలో 6 పరిశ్రమలను జాతీయం చేశారు. ఇటీవల న్యూజిలాండ్ ఎయిర్‌లైన్స్‌ని జాతీయం చేసి తిరిగి ప్రభుత్వరంగంగా మార్చారు. అమెరికాలో కూడా విమానశ్రయాల భద్రత విషయంలో ప్రైవేటు రంగం విఫలమయింది, అందువలన దీనిని ప్రయివేటు రంగం నుంచి తప్పించి ప్రభుత్వరంగంలోకి మార్చారు.

పై అనుభవాల దృష్ట్యా మనదేశంలో ప్రైవేటీకరణను ఒక క్రమపద్ధతిలో నెమ్మదిగా తీసుకొనివచ్చి అవసరమైన సంస్థాగత మార్పులు చేయాలి. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలలో ఏ మార్పులు తీసుకురావాలన్నా ప్రజల సహకారం, ఉద్యోగుల సహకారం ఎంతో అవసరం. ప్రైవేటీకరణ విజయవంతం కావాలంటే ముఖ్యంగా ప్రజల ఆమోదం తప్పనిసరి. ప్రభుత్వరంగ సంస్థలలో మూసివేత, రిట్రెంచ్‌మెంట్, నిర్బంధ పదవీ విరమణలు ఉంటాయనే భయం ఈ సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు ఉండకుండా చూడాలి. అలాగే మనదేశంలో ప్రైవేటీకరణ సత్ఫలితాలను పొందాలంటే ప్రజల సహకారం చాలా అవసరం అని చెప్పవచ్చు.

9.12 Technical Terms :

IDBI	:	భారతదేశ పారిశ్రామికాభివృద్ధి బ్యాంక్
KVIC	:	ఖాధీ మరియు విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్
అనుషంగిక పరిశ్రమ	:	రు. 25 లక్షల లోపు పెట్టుబడి ఉన్న పరిశ్రమలు (అతి చిన్న పరిశ్రమలు)
ప్రైవేటీకరణ	:	ఉత్పాదక కార్యకలాపాలు ప్రభుత్వ రంగం నుండి ప్రయివేటు రంగానికి బదిలీ చేయుట
డిజిన్వస్ట్‌మెంట్	:	ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ
ICICI	:	భారతదేశ పారిశ్రామిక పరపతి మరియు పెట్టుబడి కార్పొరేషన్
IRBI	:	భారతదేశ పారిశ్రామిక పునర్నిర్మాణ బ్యాంక్
SIDBI	:	చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్

9.13 నమూనా ప్రశ్నలు :

1. సంస్కరణల యుగంలో భారతదేశ పారిశ్రామికాభివృద్ధిని వివరించండి.
2. 1991 నూతన పారిశ్రామిక విధానాన్ని వివరించండి.
3. భారతదేశంలోని పెద్దతరహా పరిశ్రమల అభివృద్ధి మరియు వాటి సమస్యలను వివరించండి.
4. చిన్నతరహా పరిశ్రమల ప్రగతి మరియు వాటి సమస్యలను పరిష్కరించడానికి నివారణోపాయాలు వివరించండి.
5. ప్రైవేటీకరణ ఆవశ్యకతలను తెల్పి, ప్రభుత్వరంగసంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని వివరించండి.
6. ఆర్థికాభివృద్ధిలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల పాత్ర వివరించండి.

9.14 చదువదగిన గ్రంథాలు :

1. Ruddar Datt & Sundaram : Indian Economy, 2004
2. S.K. Misra & K.K. Puri : Indian Economy, 2004
3. Telugu Academy : Indian Economy, 1998
4. Indian Industrial Economy : K. Sivayya, & Das, 1995.

- డా॥ కోటిరెడ్డి

పాఠం - 10

ఆధునికీకరణ - నిరుద్యోగం

10.0 లక్ష్యం

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ క్రింది విషయాలను అవగాహన చేసుకుంటారు

★ ఆధునీకరణ అంటే ఏమిటి ?

★ భారతదేశంలో ఆధునికీకరణ

★ నిరుద్యోగితలో రకాలు

★ భారతదేశంలో నిరుద్యోగితా ధోరణులు

★ భారతదేశంలో నిరుద్యోగితకు కారణాలు, నివారణ చర్యలు

★ భారతదేశ ఉద్యోగితా విధానం

★ ఆధునికీకరణ - నిరుద్యోగ సంబంధం

విషయసూచిక :

10.1 విషయపరిచయం

10.2 ఆధునికీకరణ

10.3 నిరుద్యోగిత - రకాలు

10.4 భారతదేశంలో నిరుద్యోగిత

10.5 భారతదేశంలో ఉద్యోగితా స్వభావం

10.6 వయోవస్థా వారీగా నిరుద్యోగితా రేట్లు

10.7 విద్యాస్థాయిని బట్టి నిరుద్యోగిత

10.8 భారతదేశంలో నిరుద్యోగ సమస్యకు కారణాలు

10.9 నిరుద్యోగ సమస్య పరిష్కార మార్గాలు

10.10 భారతదేశ ఉద్యోగితా విధానం

10.11 భారతదేశంలో నిరుద్యోగ నిర్మూలనా కార్యక్రమాలు

10.12 ఆధునికీకరణ - నిరుద్యోగం - కార్మిక సంఘాలు

10.13 సారాంశము

10.14 కఠిన పదాలు

10.15 నమూనా ప్రశ్నలు

10.16 చదువదగిన గ్రంథాలు

10.1 విషయపరిచయం

ఆర్థిక రంగంలో జ్ఞానాభివృద్ధితోపాటు విజ్ఞానం, సాంకేతికాలలో మార్పు రావటాన్నే ఆర్థిక ఆధునికీకరణ అంటారు. ఈ పాఠంలో ఆధునికీకరణ అంటే ఆధునిక ఆధునీకరణయే. బ్రిటీషు వారి పాలనలో భారతదేశంలో జరిగిన ఆధునికీకరణ భారతదేశాభివృద్ధి లక్ష్యంగా కాక బ్రిటీషు ఆర్థిక వ్యవస్థ పటిష్టత కోసం జరిగింది. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం కొనసాగిన ఆధునికీకరణ వల్ల భారతదేశాభివృద్ధి త్వరితంగా జరిగిందని చెప్పవచ్చు. వివిధ రంగాల్లో ఆధునికీకరణను గూర్చి ఈ పాఠంలో తెలుసుకుంటాం.

నిరుద్యోగిత అంటే వర్తమాన వేతనానికి ఇష్టపడి పని చేయాలనుకున్ననూ పని లభ్యంకాని స్థితిని నిరుద్యోగిత అని చెప్పవచ్చు. నిరుద్యోగితలు అనేక రకాలుగా ఉంటాయి. భారతదేశంలో నిరుద్యోగితలను గ్రామీణ నిరుద్యోగిత, పట్టణ నిరుద్యోగితలుగా చెప్పవచ్చు. గ్రామాల్లో ముఖ్యంగా కన్పించే నిరుద్యోగితలు రుతు సంబంధమైన, ప్రచ్ఛన్న నిరుద్యోగితలు కాగా పట్టణాల్లో కన్పించే నిరుద్యోగితలు పారిశ్రామిక, విద్యావంతుల్లో నిరుద్యోగితలు. ఈ పాఠంలో మనం భారతదేశంలో ఉద్యోగితా ధోరణులు, నిరుద్యోగ స్వభావం, నిరుద్యోగితకు కారణాలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలుసుకోవడం జరుగుతుంది. ఆధునికీకరణ ప్రభావం ఉత్పత్తులు, ఉత్పత్తి నాణ్యతలపై అనుకూల ప్రభావం చూపినా ఉద్యోగితపై వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుంది. ఆధునికీకరణలో కార్మిక సంఘాల పాత్ర, ఆ ప్రభావం వల్ల ఉద్యోగితలో వచ్చే మార్పులను కూడా ఈ పాఠంలో మనం తెలుసుకోబోతున్నాం.

10.2 ఆధునీకరణ

ఆధునికీకరణ అనే పదాన్ని విస్తృతార్థంలో ఉపయోగించటం జరుగుతూ ఉంటుంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలన్నింటిలోనూ ఈ పదాన్ని ఉపయోగించటం జరుగుతుంది. ఆర్థిక రంగంలో ఆధునికీకరణను ఆర్థిక ఆధునీకరణగా ప్రయోగించటం జరుగుతుంది. ఏ రంగంలోనైనా గుణాత్మక మార్పులు చోటు చేసుకున్నట్లయితే ఆ రంగంలో ఆధునికీకరణ జరిగినట్లుగా చెప్పటం జరుగుతుంది. అదే విధంగా ఆర్థిక రంగంలో గుణాత్మకమైన మార్పులు సంభవించినట్లయితే ఆర్థిక ఆధునికీకరణ అని అంటాము. మరో విధంగా చెప్పాలంటే ఆర్థిక రంగంలో జ్ఞానాభివృద్ధిలో పాటు, విజ్ఞానం, సాంకేతికాలతో పాటు సంస్థలలో కూడా మార్పు రావటమే ఆర్థిక ఆధునికీకరణ ఈ భాగంలో ఆధునికీకరణ అనే పదం ఆర్థిక ఆధునికీకరణనే సూచిస్తుంది.

ఆధునికీకరణ క్రమంలో మూడు ముఖ్యమైన మార్పులు సంభవిస్తాయి.

1. ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో (వ్యవసాయ, పారిశ్రామిక, తృతీయ) శాస్త్రీయాభివృద్ధి జరుగుతుంది. పరిశోధనల ఫలితంగా నూతన ఉత్పత్తి విధానాలు, ఆధునిక యంత్ర సాధనాలను ఉపయోగించటం జరుగుతుంది. నూతన ఉత్పాదకాలను కనుగొని ఉత్పత్తి పద్ధతుల్లో ఉపయోగించటం జరుగుతుంది.

2. ఉత్పత్తి కార్యకలాపాలలోనూ మార్పులు చోటు చేసుకుంటాయి. బహుళ పంటల విధానం, సాంద్ర వ్యవసాయం మొదలైనవి వ్యవసాయరంగంలో కొనసాగుతూండగా, చిన్న పరిశ్రమలు భారీ పరిశ్రమలుగా మారటం మొదలైన పరిణామాలు చోటు చేసుకుంటాయి.

3. ఉత్పత్తిదారుల దృక్పథంలో మార్పు సంభవిస్తుంది. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఉత్పత్తిదారులు విద్యావంతులుగా మారతారు. ఉత్పత్తికి సంబంధించిన సమాచారాన్ని పొందటం, నూతన మార్పులను అవగాహన చేసుకోవడం వల్ల ఉత్పత్తి విధానాల్లో విప్లవాత్మకమైన మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పులకనుగుణంగా సంస్థాగతమైన మార్పులు కూడా చోటు చేసుకుంటాయి.

10.2.1. ఆధునికీకరణ ఫలితాలు : ఆర్థిక వ్యవస్థలో ఆధునికీకరణ జరుగుతుందంటే ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తున్నట్లు భావించాలి. ఆధునికీకరణ వల్ల అనేక అనుకూల ప్రభావాలు ఉన్నాయి. అవి :

1. ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదకతా శక్తి పెరిగి, ఉత్పత్తి పెరుగుతుంది. తత్ఫలితంగా ప్రజల ఆదాయం పెరిగి ప్రజల జీవన ప్రమాణం వృద్ధి చెందుతుంది.

2. ఉద్యోగితా స్థాయి వృద్ధి చెందుతుంది. ఉద్యోగితలో వైవిధ్యం పెరుగుతుంది.

3. వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవటానికి అవకాశం ఏర్పడుతుంది. దేశీయ వనరులను ఉపయోగించుకోగలిగిన సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందుతుంది.

4. వలస నిరోధించబడుతుంది. ఆధునీకరణ వల్ల ఉద్యోగితా వైవిధ్యం పెరుగుతుంది. కావున స్వదేశంలోనే ఉద్యోగావకాశాలు విస్తరించబడి వలసకు అవకాశం తగ్గుతుంది.

5. ఆధునికీకరణ ఫలితంగా వస్తువులను అంతర్జాతీయ ప్రమాణాల్లో ఉత్పత్తి చేయవచ్చు. అందుచేత అంతర్జాతీయ వర్తకం కూడా వృద్ధి చెందుతుంది.

6. వస్తు ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయి. ఫలితంగా సంస్థలు, పరిశ్రమలు చేసే ఉత్పత్తి కార్యకలాపాలు లాభదాయకంగా ఉంటాయి.

7. ఆధునికీకరణ ఫలితంగా వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, తృతీయ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటాయి. అన్ని రంగాల్లో "ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ"ని ప్రవేశపెట్టుట జరుగుతుంది. తత్ఫలితంగా ఆర్థిక వ్యవస్థ 'Knowledge Based Economy' గా మారుతుంది.

8. ప్రపంచ వ్యాప్తంగా మారుచున్న పరిస్థితులు, ప్రపంచీకరణ దిశలో 'మార్కెట్ ఆర్థిక వ్యవస్థ 'Market Economy' ప్రాధాన్యత విస్తారంగా పెరిగింది. ఈ పోకడలలో నిలబడగల శక్తికి ఆధునీకరణే ఆవశ్యకము.

10.2.1. బ్రిటీషు వలస పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ ఆధునికీకరణ : బ్రిటీషు పాలనకు పూర్వము భారత వ్యవస్థ స్వయం సమృద్ధి కలిగిన గ్రామాలను, మరియు పట్టణాలను కలిగి ఉండేది. ఆర్థిక వ్యవస్థ వెనుకబడిన ఆర్థిక వ్యవస్థ. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పురాతన పద్ధతుల్లో ఉత్పత్తి కార్యకలాపాలు కొనసాగుతూ ఉండేవి. భారతదేశ మత విధానం, కుల వ్యవస్థ, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మొదలైన వివిధ అంశాలు భారత ఆర్థిక వ్యవస్థ ఆధునికీకరణకు అడ్డంకిగా నిలిచాయని బ్రిటీష్ ఆర్థిక వేత్తల భావన. ఈ అంశాలే భారతదేశ వెనుకబడ్డతనానికి కారణమని వీరి అభిప్రాయం.

భారతదేశం 1757 నుంచి 1858 వరకు ఈస్టిండియా కంపెనీ పాలనలో, 1858 నుంచి 1947 వరకు బ్రిటీషు ప్రభుత్వ పాలనలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఆధునీకరణ కొనసాగే కాలంలో బ్రిటీషు వారి పాలనలో భారతదేశం ఉండటం వల్ల ఆర్థిక వ్యవస్థ సాంప్రదాయ సిద్ధంగానే కొనసాగటం జరిగింది. అయితే జరిగిన ఆధునికీకరణ కూడా బ్రిటీషు వారికి అనుగుణంగానే జరిగింది. బ్రిటీషు ఆధిపత్యంలో భారతదేశం ఉన్నందున బ్రిటీషు పెట్టుబడిదారీ వ్యవస్థ బలోపేతం అవ్వటానికి భారతదేశంలో ఏఏ రంగాలలో ఆధునికీకరణ జరగాలో ఆ రంగాలలోనే ఆధునీకరణ కొనసాగింది. అనగా భారతదేశాభివృద్ధి కోసం కాక బ్రిటీషు ఆర్థిక వ్యవస్థ పటిష్టం కోసం భారతదేశంలో ఆధునికీకరణ కొనసాగింది.

బ్రిటీషు వారి పాలనలో వ్యవసాయం వాణిజ్యపరంగా మార్పు చెందింది. కుటుంబ వినియోగం కోసం కాక అమ్మకం కోసం వ్యవసాయ ఉత్పత్తులను చేయటాన్నే వ్యవసాయ రంగంలో వాణిజ్యీకరణ అంటారు. ఇంగ్లాండులో 19వ శతాబ్ద మధ్య కాలంలో పారిశ్రామికీకరణ పూర్తి అవ్వటం వల్ల అనేక వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండు పెరిగింది. ఇంగ్లాండుకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులు ఉదా॥ ప్రత్తి, చెరకు, వేరుశనగ మొదలైన వాటిని ఉత్పత్తి చేసి ఇంగ్లాండుకు అమ్మకం చేసే విధంగా మన వ్యవసాయం మార్పు చెందింది. అనగా మన వ్యవసాయ రంగాన్ని వారి పరిశ్రమాభివృద్ధికి మలచుకోవటం జరిగింది. ఈ మార్పు మన దేశంలో కరవు రావటానికి అవకాశాలను పెంచిందే తప్ప, మన దేశ అభ్యున్నతికి దోహదం చేయలేదనే చెప్పవచ్చు.

బ్రిటీషు వారి పాలనలో మన స్వదేశీ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికీకరణ కొనసాగుతూ ఉంటే మన స్వదేశీ పరిశ్రమలు దెబ్బతినటంతో పాటు భారీ పరిశ్రమల ఏర్పాటు జరిగింది. 1850-55 కాలంలో మొదటి నూలు మిల్లు, జనవనార

మిల్లు, బొగ్గు గని ప్రారంభించటం జరిగింది. ఈ సమయంలోనే రైల్వేలైను కూడా వెయ్యటం జరిగింది. ఆ తరువాత 19వ శతాబ్దం ఆఖరి 25 సంవత్సరాలలో భారతదేశంలో 55 ప్రత్తి మిల్లులు, 18 జనపనార మిల్లులు ఏర్పాటు చెయ్యబడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా 19వ శతాబ్దం చివరి నాటికి శీఘ్ర పారిశ్రామికీకరణ కొనసాగుచుండగా, భారతదేశంలోని బొగ్గు, ఇనుము ఉపయోగించుకొనేందుకే ఆధునిక పరిశ్రమలు భారత దేశంలో ప్రారంభించడం జరిగింది. వాస్తవానికి భారతదేశ ఆర్థిక వ్యవస్థలో బ్రిటీషు వారి పరిపాలనా కాలంలో వచ్చిన ఆధునికీకరణ బ్రిటీషు వారి ఆర్థిక వ్యవస్థ పటిష్టమవ్వటానికి వచ్చిన మార్పు తప్ప, మన దేశాభివృద్ధి లక్ష్యంగా వచ్చిన మార్పు కాదు. అందుచేతనే బ్రిటీషు వారి కాలంలో భారతదేశంలో ఒక వైపు ఆధునికీకరణ ధోరణి మరో వైపు అల్పాభివృద్ధి కొనసాగింది. ఈ పరిస్థితుల్లో 1947వ సంవత్సరము బ్రిటీషువారు మనకు స్వతంత్ర్యాన్నిచ్చి వెళ్లటం జరిగింది.

10.2.2. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ఆధునికీకరణ : స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి భారతదేశంలో వ్యవసాయ రంగంలో సనాతన పద్ధతులు కొనసాగుతూ ఉండేవి. పారిశ్రామిక రంగంలో ఆధునికీకరణ జరిగినా అది పరిమితంగానూ, పరిమితమైన పరిశ్రమలలోనే జరిగింది. సేవా రంగంలో కూడా సాంప్రదాయ పద్ధతులే ఎక్కువగా ఉపయోగించబడేవి. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో వచ్చిన ఆధునీకరణ పోకడలను రంగాల వారీగా కింద వివరించటం జరిగింది.

ఎ) వ్యవసాయ రంగంలో ఆధునికీకరణ : స్వాతంత్ర్యానికి పూర్వం వ్యవసాయ రంగంలో ఆధునికీకరణ లేనట్లుగానే చెప్పవచ్చు. వచ్చిన మార్పేదైనా ఉంటే అది వ్యవసాయాన్ని వాణిజ్య దృక్పథంలో కొనసాగించటం. కావున వ్యవసాయం పురాతన పద్ధతుల్లో కొనసాగటం వల్ల వ్యవసాయరంగంలో ఉత్పాదకత తక్కువగా ఉండి, అల్పోద్యోగిత ఉంటూ ఉండేది. ఈ స్థితిలో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. స్వాతంత్ర్యానంతరం ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి సాధించే ప్రయత్నాలు సాగాయి. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగి, ఉద్యోగిత పెంపొందించి, భూమిపై జనాభా వత్తిడి తగ్గి, ఆర్థిక అసమానతలు తగ్గే విధంగా వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరణ చర్యలు చేపట్టాలని ప్రణాళికా సంఘం ఉద్దేశించింది. ఆ క్రమంలో 1960 దశకం మధ్య కాలంలో వ్యవసాయ రంగంలో పురాతన పద్ధతుల స్థానే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టటం జరిగింది. అందులో అంతర్భాగంగా 61 పైలట్ ప్రాజెక్టులను నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెడుతూ సాంద్ర వ్యవసాయ జిల్లా కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగింది. ఆ తరువాత అధిక దిగుబడి విత్తనాలను కూడా దీనికి జత చేయటం జరిగింది. ఈ విధంగా ఆవలంభించిన వ్యూహాన్నే వివిధ పేర్లతో అంటే ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, విత్తన, ఎరువుల, నీటి సాంకేతిక పరిజ్ఞానం లేదా సస్య విప్లవంగా పిలవటం జరుగుతుంది.

వ్యవసాయ రంగంలో ఆధునికీకరణ దిశలో నూతన మెక్సికన్ విత్తనాలైన లెర్మారోజో, సోనా - 64, కల్యాన్, పివి - 18, మొదలైన గోధుమ వంగడాలను, టి.యన్ - 1, ఐ.ఆర్ - 8, టినిన్ - 3, ఎ.డి. టి - 17 మొదలైన వంగడాలను వరిలో ప్రవేశపెట్టటం జరిగింది. ఈ కాలంలోనే సేంద్రీయ ఎరువులు, క్రిమినాశక మందులు, ఆధునిక యంత్ర సామగ్రీలను ప్రవేశపెట్టటం జరిగింది.

భారతదేశంలో అవలంభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానం, జీవ సాంకేతిక పరిజ్ఞానం అని రెండుగా చెప్పవచ్చు. యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానం మూలధన సాంద్రత కలిగినది మరియు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేదిగా ఉంటుంది. జీవ-సాంకేతిక పరిజ్ఞానం రసాయనాలు, జీవ సంబంధమైనది. ఈ సాంకేతిక పరిజ్ఞానంలోకి రసాయన ఎరువులు, క్రిమి నాశక మందులు, అధిక దిగుబడి వంగడాలు వస్తాయి.

సస్య విప్లవ ప్రభావం వల్ల భారతదేశంలో నీటి పారుదల విస్తరణ, యంత్ర సాధనాల ఉపయోగం, రసాయన ఎరువుల వాడకం, అధిక దిగుబడి విత్తనాల వాడకం విస్తారంగా వృద్ధి చెందింది. సస్య విప్లవం సాగుభూమి, ఉద్యోగిత, ఆదాయాలపై అధిక ప్రభావాన్ని చూపింది. సస్య విప్లవం వ్యవసాయంలో వెనుకబడినతనాన్ని తొలగించింది. వ్యవసాయ రంగంలో గుణాత్మక మార్పు సాధ్యమైంది. సస్య విప్లవ పంధాలోనే శ్వేత విప్లవం White Revolution (పాలు, పాల ఉత్పత్తులు), నీలి విప్లవం Blue Revolution (ఆక్వా కల్చర్) మొదలైనవి కొనసాగాయి. భవిష్యత్తులో ఇంద్ర ధనస్సు విప్లవం (Rainbow Revolution) కూడా రాబోతుంది.

బి) పారిశ్రామిక రంగంలో ఆధునికీకరణ : బ్రిటీషు పాలన పూర్వం భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉండేది. అయితే బ్రిటీషు పాలన భారతదేశ పరిశ్రమలను క్రమంగా క్షీణింప చేసింది. ఫలితంగా భారతదేశంలోని దేశవాళీ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. పారిశ్రామిక విప్లవ ఫలితంగా బ్రిటీషు ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా ఉండే భారీ పరిశ్రమలు భారతదేశంలో స్థాపించబడ్డాయి. జనపనార పరిశ్రమలు, నూలు పరిశ్రమలు బ్రిటీషు వారి కాలంలో ప్రారంభించబడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతదేశంలోని పరిశ్రమలు తక్కువ సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండేవి. తత్ఫలితంగా తక్కువ నాణ్యత కలిగిన శ్రామికులను ఉపయోగించుకోవడం, అల్ప వనరుల వినియోగం, తక్కువ మూలధన సాంద్రతను కలిగి ఉండేవి. అనగా ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికీకరణకు అనుగుణంగా పరిశ్రమలు ఆధునీకరింపబడలేదు.

స్వాతంత్ర్యానంతరం పరిశ్రమలను ఆధునీకరిస్తూ, ఆర్థికాభివృద్ధి త్వరితగతిని సాధించాలని భారత ప్రభుత్వం ఉద్దేశించింది. 1948 పారిశ్రామిక తీర్మానంలో ఉప్పు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, మెషిన్ టూల్స్, పంచదార, పేపరు, న్యూస్ ప్రింట్ మొదలైన 18 పరిశ్రమలను ఆధునీకరించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, పెద్ద మొత్తంలో పెట్టుబడి చేయాలని తీర్మానించి ఆధునీకరించటం జరిగింది. పారిశ్రామిక తీర్మానం 1956లో పారిశ్రామికీకరణకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. పారిశ్రామిక విధానం, 1977లో సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వటం జరిగింది. దేశ ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని, విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, ఆ దిశలో ఆధునికీకరణకు ప్రాధాన్యతను ఇవ్వటం జరిగింది. పరిశోధనలను ప్రోత్సహించే చర్యలను కూడా సూచించటం జరిగింది.

పారిశ్రామిక విధానం 1980లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వటం జరిగింది. విదేశ మార్కెట్ ఉన్న వస్తు పరిశ్రమల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రపంచ మార్కెట్ పెరిగే విధంగా ఆధునీకరించాలని తీర్మానించటం జరిగింది. మధ్య తరగతి, చిన్న పరిశ్రమల్లో పరిశోధనలను పెంపొందించటంతో పాటు ఉన్న పరిమిత వనరులను అభిలషణీయ పరిమాణంలో ఉపయోగించే విధమైన సాంకేతిక పరిజ్ఞాన అన్వేషణకై అధిక నిధులను కేటాయింపు చేయాలని ఉద్దేశించటం జరిగింది. ప్రతి పరిశ్రమను కూడా ఆధునికీకరించేందుకై అన్ని రకాలైన ఆధునికీకరణ ప్యాకేజీలను సిద్ధపరచాలని తీర్మానించటం జరిగింది.

నూతన ఆర్థిక విధానం నేపథ్యంలో భారతదేశ పారిశ్రామిక తీర్మానం, 1991 రూపొందించటం జరిగింది. ఈ తీర్మానంలోని అంశాల్లో విదేశీ సాంకేతిక పరిజ్ఞాన ఒప్పందం కూడా అతి కీలకమైన అంశం. మారుతున్న ప్రపంచ సాంకేతిక పరిజ్ఞాన దృష్ట్యా భారతదేశ పారిశ్రామిక వాతావరణ ఆధునికీకరణ అవసరకతను గుర్తించటం జరిగింది. భారత పరిశ్రమల్లో ఆశించిన సాంకేతిక స్థాయిని పెంపొందించేందుకు కొన్ని నిర్దేశించిన పరిమితుల ప్రకారం సాంకేతిక పరిజ్ఞాన ఒప్పందాలను ప్రభుత్వం అతి సులువుగా ఆమోదించే అంశాన్ని కూడా ఈ తీర్మానంలో పొందు పరచటం జరిగింది. ఆధునీకరించే ప్రక్రియలో దేశ పరిస్థితుల దృష్ట్యా అనుకూలమైన స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశోధించే నిమిత్తం విదేశీ సాంకేతిక నిపుణుల ద్వారా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాలను పరీక్షించాలని కూడా ఉద్దేశించటం జరిగింది. ఈ విధంగా పారిశ్రామిక రంగంలో ఆధునికీకరణ ధోరణులు స్వాతంత్ర్యానంతరం చోటు చేసుకున్నాయి. నూతన ఆర్థిక విధాన ఫలితంగా, ప్రపంచీకరణ నేపథ్యంలో పారిశ్రామిక ఆధునికీకరణ త్వరితగతిని సాగుతుంది.

సి) తృతీయ రంగంలో ఆధునికీకరణ : తృతీయ రంగంలో బాంకింగ్, భీమా, రవాణా, టెలికమ్యూనికేషన్స్, శక్తి, విదేశీ వ్యాపారం మున్నగునవి ఉంటాయి. బ్రిటీషు వారి పాలనలో తృతీయ రంగం వెనుకబడి ఉంది. స్వాతంత్ర్యానంతరం తృతీయ రంగంలో త్వరిత గతిని ఆధునికీకరణ ప్రవేశ పెట్టటం జరిగింది. 1949 వ సంవత్సరములో రిజర్వు బాంకు జాతీయీకరణ, 1969 వ సంవత్సరములో 14 బ్యాంకుల జాతీయీకరణ తరువాత బ్యాంకింగ్ రంగంలో ఆధునికీకరణ వేగవంతంగా ప్రారంభమైంది. టెలి బ్యాంకింగ్, శాటిలైట్ బ్యాంకింగ్‌లు ఏర్పాటు చెయ్యటం జరిగింది.

ఇన్సూరెన్స్ రంగంలో బ్రిటీష్ కాలంలో ఉన్నా పూర్తీ స్థాయి సంస్థలు గాలేవు. స్వాతంత్ర్యం తరువాత 1946 లో 245 ఇన్సూరెన్సు కంపెనీల జాతీయీకరణ జరిగింది. క్రమ క్రమంగా ఈ కంపెనీలు కూడా ఆధునీకరించబడ్డాయి. క్రమ క్రమంగా భారతదేశంలో వాణిజ్య బ్యాంకులు కూడా ఈ రంగంలోకి వచ్చాయి.

రవాణా రంగంలో భాగమైన రైల్వేలు, రోడ్డు రవాణా, జల రవాణా, వాయు రవాణాలలో కూడా స్వాతంత్ర్యానంతరం ఆధునికీకరణ చోటు చేసుకుంది. ఆధునికీకరణ ఫలితంగా ఈ రంగాలు విస్తృతంగా అభివృద్ధి చెందాయి. ఫలితంగా అవస్థాపనా వ్యయాలు భారతదేశంలో వృద్ధి చెందాయి.

టెలి కమ్యూనికేషన్స్ రంగంలో కూడా స్వాతంత్ర్యానంతరం ఆధునికీకరణ కొనసాగింది. శక్తి రంగంలో కూడా పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ విధంగా స్వాతంత్ర్యానంతరం తృతీయ రంగ ఆధునీకరణ కొనసాగింది.

స్వాతంత్ర్యానంతరం ఆధునికీకరణ ఫలితంగా వ్యవసాయరంగ ఉత్పత్తుల్లో వచ్చిన పెరుగుదలను పట్టిక 10.1 తెలియజేస్తుంది. వ్యవసాయ రంగంలో హరిత విప్లవ ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 314 శాతం, వరి 338 శాతం, గోధుమ 1483 శాతం పెరిగింది. నూనె గింజల ఉత్పత్తి 1950-51 నుంచి 2001-2002 సంవత్సరమునకు 320 శాతం పెరగగా, చెరకు ఉత్పత్తి 412 శాతం ప్రత్తి 300 శాతం జనుము 267 శాతం పెరిగింది. ఉత్పత్తులకు సంబంధించిన అసలు సంఖ్యలు పట్టిక 10.1లో పొందు పరచటం జరిగింది.

పట్టిక 10.1

వ్యవసాయ ఆధునికీకరణ ఫలితంగా కొన్ని వ్యవసాయ ఉత్పత్తులలో మార్పులు

			1950-51	2001-2002	పెరుగుదల శాతం
1.	ఆహార ధాన్యాలు	(మిలియన్ టన్నులు)	51	212	314
	వరి	"	21	93	338
	గోధుమ	"	6	72	1483
2.	నూనె గింజలు	"	5	21	320
3.	చెరకు	"	57	300	412
4.	ప్రత్తి	(మిలియన్ బేళ్లలో)	3	10	300
5.	జనుము	"	3	12	267

ఆధునికీకరణ నేపధ్యంలో భారతదేశ పారిశ్రామిక రంగంలో 1950-51 నుంచి 2000-2001 సంవత్సరమునకు కొన్ని ముఖ్య పరిశ్రమల్లో ఉత్పత్తులను పట్టిక 10.2 తెలియజేస్తుంది. వస్త్ర ఉత్పత్తి 1950-51లో 4215 మిలియన్ మీటర్లు ఉండగా 2000-2001కి 19718 మిలియన్ మీటర్లకు పెరిగింది. రసాయన ఎరువులు 9వేల టన్నుల (1950-51) నుంచి 830 (2000-01) వేల టన్నులకు పెరిగింది. అదే కాలంలో సిమెంట్ 2.7 నుంచి 995 మిలియన్ టన్నులకు, స్టీలు 1.0 నుంచి 29.3 మిలియన్ టన్నులకు, విద్యుచ్ఛక్తి 5.1 బిలియన్ వాట్ల నుంచి 499.4 బిలియన్ వాట్లకు పెరిగింది. అల్యూమినియం 4.0 వేల టన్నుల నుంచి 620.4 వేల టన్నులకు; పేపరు, పేపరు బోర్డు 116 వేల టన్నుల నుంచి 3090 వేల టన్నులకు, వాణిజ్య వాహనాలు 8.6 వేల నుంచి 152.0 వేలకు పెరగటం జరిగింది. ఈ విధంగా వివిధ రంగాలలో ఆధునికీకరణ శీఘ్ర ఉత్పత్తి పెరుగుదలకు దారి తీసింది.

పట్టిక 10.2

కొన్ని పరిశ్రమలలో ఆధునికీకరణ ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తుల్లో మార్పులు

వస్తువు		1950-51	2000-2001
1. వస్త్రం	మిలియన్ మీటర్లు	4215	19718

2. రసాయన ఎరువులు	వేల టన్నులు	9	830
3. సిమెంటు	మిలియన్ టన్నులు	2.7	99.5
4. స్టీలు	"	1.0	29.3
5. విద్యుచ్ఛక్తి	బిలియన్ కిలో వాట్లలో	5.1	499.4
6. అల్యూమినియం	వేల టన్నులో	4.0	620.4
7. పేపరు, పేపరు బోర్డు	"	116	3090
8. వాణిజ్య వాహనాలు	వేలలో	8.6	152.0

10.3 నిరుద్యోగిత - రకాలు

సంక్షిప్తంగా నిరుద్యోగితను నిర్వచించటం చాలా కష్టము. అమలులో ఉన్న వేతనానికి ఇష్టపడిన వారందరికి పని లభించక పోవడాన్నే నిరుద్యోగిత అంటారు. అమలులో ఉన్న వేతనానికి ఇష్టపడ్డవారందరికి పని లభ్యమైతే సంపూర్ణోద్యోగిత అంటారు. బెవరిడ్జ్ ప్రకారం సంపూర్ణోద్యోగిత అనగా 'పని చేసే వారికి మించి ఉద్యోగాలు ఉండటం' ఆర్థిక వ్యవస్థలో ఆకర్షణీయమైన వేతనాలున్న పరిస్థితుల్లో, ఏ కారణం చేతనైనా ఉద్యోగాన్ని కోల్పోయిన వ్యక్తులు మరలా ఉద్యోగాన్ని అతి స్వల్ప కాలంలో సంపాదించుకోగలరు. పని చేసే వారికి మించి ఉద్యోగాలు ఉండే పరిస్థితిని సంపూర్ణోద్యోగితగా బెవరిడ్జ్ వివరించారు.

ఆర్థిక వ్యవస్థ మొత్తంగా పరిశీలిస్తే, నిరుద్యోగిత అంటే మానవ వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోలేక పోవడం. అందువల్ల ఉత్పత్తి తగ్గుతుంది. తత్ఫలితంగా ప్రజల జీవన ప్రమాణం తగ్గుతుంది. నిరుద్యోగిత ప్రభావం నిరుద్యోగులపై తీవ్రంగా ఉంటుంది. నిరుద్యోగిత నిరుద్యోగుల జీవన ప్రమాణాన్ని తగ్గించటమే కాక శ్రామికుల నైతిక శక్తిని తగ్గించి, ఆత్మ విశ్వాసాన్ని తగ్గించి చివరిగా శ్రామికుల నైపుణ్యతను, పని లక్షణాలను తగ్గించి పని చేయలేని స్థితికి చేర్చుతుంది.

నిరుద్యోగితలలో రకాలు : నిరుద్యోగ సమస్య అన్ని ప్రపంచ దేశాలకు సంబంధించిన సమస్య. అయితే కారణాలు, తీవ్రత వివిధ దేశాల్లో వివిధ రకాలుగా ఉంటుంది. కారణాల ప్రాతిపదికగా నిరుద్యోగితను వివిధ రకాలుగా చెప్పవచ్చు. అవి. (1) చక్రీయ నిరుద్యోగిత (2) సాంకేతిక నిరుద్యోగిత (3) సంఘృష్ట నిరుద్యోగిత (4) ఋతు సంబంధమైన నిరుద్యోగిత 5. నిర్మాణాత్మక నిరుద్యోగిత 6. ప్రచ్ఛన్న నిరుద్యోగిత.

1. చక్రీయ నిరుద్యోగిత : వ్యాపార చక్రాల కారణంగా ఏర్పడే నిరుద్యోగితను చక్రీయ నిరుద్యోగిత అంటారు. వ్యాపార చక్రాలలో తిరోగమనము ప్రారంభమై వ్యాపార కార్యక్రమాలు క్రమంగా తగ్గుచూ ఉన్న స్థితిలో ఉత్పత్తి తగ్గి నిరుద్యోగిత ఏర్పడుతుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో ఈ నిరుద్యోగిత వ్యాపార చక్రాల్లోని ఆర్థిక మాంద్య సమయంలో ఏర్పడుతుంది.

2. సాంకేతిక నిరుద్యోగిత : సాంకేతిక పురోగతి కారణంగా వచ్చిన మార్పుల ద్వారా రూపొందించే యంత్ర సామాగ్రి తక్కువ మంది శ్రామికుల ద్వారా ఉత్పత్తి చేసేదిగా ఉంటుంది. అందుచేత కొంత మంది ఉపాధిని కోల్పోతారు. ఈ విధంగా ఏర్పడ్డ నిరుద్యోగితను సాంకేతిక నిరుద్యోగిత అంటారు.

3. సంఘృష్ట నిరుద్యోగిత : శ్రామికుల సప్లయ్, డిమాండ్‌ల మధ్య సర్దుబాటుకు అవకాశం లేనందున ఏర్పడే నిరుద్యోగితను సంఘృష్ట నిరుద్యోగిత అంటారు.

4. ఋతు సంబంధమైన నిరుద్యోగిత : పారిశ్రామిక కార్యకలాపాల్లో ఋతు సంబంధమైన హెచ్చు తగ్గుల వల్ల కొంత మంది శ్రామికులు నిరుద్యోగులుగా ఉంటారు. ఈ విధంగా ఏర్పడ్డ నిరుద్యోగితను ఋతు సంబంధమైన నిరుద్యోగిత అంటారు. ఉదా॥కు పంచదార

ఫ్యాక్టరీలో సంవత్సరమునకు కేవలం 100 నుంచి 120 రోజులు మాత్రమే ఉద్యోగిత ఉంటుంది. ఆ తరువాత వారు నిరుద్యోగులౌతారు. వ్యవసాయ రంగంలో కూడా కోత కాలంలో పని పాటలుండి ఆ తరువాత నిరుద్యోగులుగా ఉంటారు.

5. నిర్మాణాత్మక నిరుద్యోగిత : ఆర్థిక వ్యవస్థ స్వరూపంలో మౌలిక మార్పులు చోటు చేసుకున్నందున ఏర్పడే నిరుద్యోగితను నిర్మాణాత్మక నిరుద్యోగిత అంటారు. ఉదాహరణకు మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటన్ ఎగుమతులు తగ్గటం చేత ఎగుమతి పరిశ్రమల్లో శ్రమ డిమాండ్ తగ్గి నిరుద్యోగ సమస్య ఏర్పడింది.

6. ప్రచ్ఛన్న నిరుద్యోగిత : ఉపాంత ఉత్పాదకత లేని ఉద్యోగితను ప్రచ్ఛన్న నిరుద్యోగిత అంటారు. ఈ నిరుద్యోగిత వ్యవసాయరంగంలో ఉంటుంది. ఉదాహరణకు వ్యవసాయ రంగంలో 10 మంది చేయగలిగిన పనికి 15 మంది వెళ్లినట్లయితే అదనంగా వెళ్లిన 5 మందిని ప్రచ్ఛన్న నిరుద్యోగులు అంటారు.

10.4. భారతదేశంలో నిరుద్యోగిత

అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే నిరుద్యోగితా సమస్య అభివృద్ధి చెందిన దేశాల సమస్య కన్నా భిన్నమైనది. అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక దేశాల్లో నిరుద్యోగ సమస్య సార్థక డిమాండు లోపం వల్ల ఏర్పడుతుంది. ఈ దేశాలు ఎదుర్కొనే నిరుద్యోగితలు చక్రీయ (Cyclical) లేదా సంఘృష్ట (Frictional) నిరుద్యోగితలు. కావున ఈ దేశాల్లో సార్థక డిమాండు పెంపొందించటం ద్వారా నిరుద్యోగ సమస్యను తొలగించవచ్చని కీన్స్ అంటారు.

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే నిరుద్యోగ సమస్యలు భిన్నంగా ఉంటాయి. భారతదేశం ఎదుర్కొనే నిరుద్యోగితలు తీవ్ర అల్పోద్యోగిత లేదా గ్రామీణ ప్రాంతాల్లో ప్రచ్ఛన్న నిరుద్యోగిత, పట్టణ ప్రాంతాల్లో విద్యావంతుల నిరుద్యోగిత. కావున భారతదేశ నిరుద్యోగ సమస్యకు కారణం సార్థక డిమాండు లోపం కాదు. మూలధనం కొరత, ఇతర వనరుల కొరతలు భారతదేశ నిరుద్యోగితకు కారణంగా చెప్పవచ్చు.

10.4.1. నిరుద్యోగిత అంచనాలు : ఒక సంవత్సరములో ఒక వ్యక్తి రోజుకు 8 గంటల చొప్పున 273 రోజులు పనిని కలిగినట్లయితే ఆ వ్యక్తికి ఉద్యోగిత ఉన్నట్లు చెప్పటం జరుగుతుంది. భారతదేశంలో నిరుద్యోగిత నిపుణుల కమిటీ ఆదేశానుసారంగా NSSO వారు నిరుద్యోగితకు సంబంధించిన మూడు భావనలను రూపొందించారు.

1. సాధారణ స్థితి నిరుద్యోగిత లేదా తీవ్ర నిరుద్యోగిత (Usual Status Unemployment) : ఒక సంవత్సర కాలంలో ఎక్కువ కాలము నిరుద్యోగిత ఉన్నట్లయితే దీనిని సాధారణ స్థితి నిరుద్యోగిత అంటారు. అయితే ఈ నిరుద్యోగిత ఉండే రంగాన్ని బట్టి దీనిని రెండు విధాలుగా చెప్పవచ్చు.

ఎ) సాధారణ ముఖ్య స్థితి నిరుద్యోగిత (Usual Principal Status Unemploment) : సర్వే జరిపే కాలానికి ముందు సంవత్సరం ముఖ్య రంగాల్లో లభ్యమయ్యే ఉద్యోగితపై ఆధారపడి దీనిని లెక్కించటం జరుగుతుంది.

బి) సాధారణ ముఖ్య స్థితి మరియు అనుబంధ నిరుద్యోగిత (Usual Principal and Subsidiary Status Unemployment) : సర్వే జరిపే కాలానికి క్రితం సంవత్సరంలో ముఖ్య మరియు ఇతర అనుబంధ రంగాల్లో లభ్యమయ్యే ఉద్యోగిత ప్రాతిపదికన దీనిని లెక్కించటం జరుగుతుంది. ఈ సాధారణ స్థితి నిరుద్యోగితనే తీవ్ర నిరుద్యోగిత అని కూడా అంటారు.

2) వారపు స్థితి నిరుద్యోగిత (Weekly Status Unemployment) : సర్వే జరిపే వారంలో కనీసం ఒక గంట కూడా పని దొరకని నిరుద్యోగితను వర్తమాన వారపు స్థితి (The Current Weekly Status Unemployment) నిరుద్యోగిత అంటారు. ఈ రేటును కూడా వ్యక్తి ప్రాతిపదికన (Person rate) రూపొందించటం జరుగుతుంది.

3) రోజువారీ స్థితి నిరుద్యోగిత (Daily Status Unemployment) : సర్వే నిర్వహించే వారంలో పని లభ్యమయ్యే స్థితిని ఈ నిరుద్యోగిత తెలుపుతుంది. ఒక వ్యక్తికి రోజులో 1 గంట నుంచి 4 గంటల వరకు పని లభ్యమయితే దీనిని సగం పని దినంగా, 4 గంటల

మించి లభ్యమయితే ఒక పని దినంగా లెక్కిస్తారు. ఈ నిరుద్యోగితా రేటు (The Current Daily Status) ఒక వ్యక్తికి సర్వే వారంలో రోజుకు లభ్యమయిన పని స్థాయిని తెలుపుతుంది.

సాధారణ స్థితి నిరుద్యోగితను (Usual Status Unemployment) లెక్కించే సంవత్సరంలో తీవ్ర నిరుద్యోగితను లేదా Unemployment ను కొలవటానికి ఉపయోగిస్తారు. వారపు స్థితి నిరుద్యోగితను (Current Weekly Status Unemployment) తీవ్ర నిరుద్యోగితను వారానికి కొలవటానికి ఉపయోగించటం జరుగుతుంది. రోజువారీ స్థితి నిరుద్యోగితను (Current Daily Status Unemployment) తీవ్ర నిరుద్యోగిత, అల్పోద్యోగితలను వారానికి కనుగొనే సమగ్ర కొలమానంగా ఉపయోగించటం జరుగుతుంది. ఈ మూడు భావనలలో రోజు వారీ స్థితి నిరుద్యోగితా భావన నిరుద్యోగ అంచనాలకు సరైన భావన అని చెప్పవచ్చు.

10.4.2. భారతదేశంలో నిరుద్యోగితా స్వభావాల్లో మార్పులు : NSSO వారి భావనలైన సాధారణ ముఖ్య స్థితి (UPS) సాధారణ ముఖ్య మరియు అనుబంధ స్థితి (UPSS), వర్తమాన వారపు స్థితి (CWS) మరియు వర్తమాన రోజువారీ స్థితి (CDS) నిరుద్యోగితలు ఏ విధంగా మార్పు చెందుచున్నది క్రింది పట్టిక 10.3 తెలియజేస్తుంది.

పట్టిక నెం. - 10.3

భారతదేశంలో వివిధ భావనలలో నిరుద్యోగితా రేట్లు

(శ్రామికుల శాతం)

	సాధారణ ముఖ్య స్థితి (UPS)	సాధారణ ముఖ్య మరియు అనుబంధ స్థితి (UPSS)	వర్తమాన వారపు స్థితి (CWS)	వర్తమాన రోజు స్థితి (CDS)
గ్రామీణ				
1977-78	3.26	1.54	3.74	7.70
1983	1.91	1.13	3.88	7.94
1987-88	3.07	1.98	4.19	5.25
1993-94	1.80	1.20	3.00	5.63
1999-2000	1.96	1.43	3.91	7.21
పట్టణ				
1977-78	8.77	7.01	7.86	10.34
1983	6.04	5.02	6.81	9.52
1987-88	6.56	5.32	7.12	9.36
1993-94	5.21	4.52	5.83	7.43
1999-2000	5.23	4.63	5.89	7.65
మొత్తం (పట్టణ + గ్రామీణ)				
1977-78	4.23	2.47	4.48	8.18
1983	2.77	1.90	4.51	8.28
1987-88	3.77	2.62	4.80	6.09

1993-94	2.56	1.90	3.63	6.03
1999-2000	2.81	2.23	4.41	7.32

మూలం : ప్రణాళికా సంఘం, 2001, Report on Task Force on Employment Oppurtunities

భారతదేశంలో 1991 వ సంవత్సరములో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టటం జరిగింది. అయితే వాస్తవానికి సంస్కరణలు అమలు జరిగిన సంవత్సరము 1993-94. అందుచేత 1993-94 నుంచి 1999-2000 సంవత్సరము వరకు 6 సంవత్సరాలు సంస్కరణ అమలు కాలముగా భావించి విశ్లేషించటం జరిగింది. పైన తెలిపిన నాలుగు నిరుద్యోగితా మానాలను పట్టికలో గమనిస్తే అన్ని నిరుద్యోగితా రేట్లు 1977-78 నుంచి 1993-94 కాలంలో తగ్గుతున్న ధోరణి కన్పిస్తుంది. అయితే ఈ ధోరణి 1993-94 నుంచి మారి పెరగటం జరిగింది.

భారతదేశంలో సాధారణ ముఖ్య స్థితి నిరుద్యోగిత 1977-78లో 4.23 శాతం ఉండగా 1993-94 కు 2.56 శాతానికి తగ్గి 1999-2000 నాటికి 2.81 శాతానికి పెరిగింది. సాధారణ ముఖ్య మరియు అనుబంధ స్థితి నిరుద్యోగితా రేటు 1977-78 లో 2.47 శాతం నుంచి 1993-94కు 1.90కు తగ్గి తరువాత 2.23కు పెరిగింది. వారపు స్థితి నిరుద్యోగిత కూడా అదే కాలంలో 4.48 శాతం నుంచి 3.63 శాతానికి తగ్గి మరల 4.41 కి పెరిగింది. రోజువారీ స్థితి శాతాలు కూడా 1997-78లో 8.18 ఉండగా 1993-94 కు 6.03కు తగ్గి తరువాత 7.32 కు పెరగటం జరిగింది. ఈ విధమైన ధోరణే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూడా కనిపిస్తుంది.

గ్రామీణ, పట్టణ నిరుద్యోగిత రేట్లు గమనిస్తే పట్టణాల్లో అన్ని నిరుద్యోగితా రేట్లు 1993-94 నుంచి 1999-2000కు స్వల్పంగా పెరిగాయి. గ్రామాల్లో మొదటి మూడు నిరుద్యోగితా రేట్లు సాధారణ ముఖ్య స్థితి, సాధారణ ముఖ్య మరియు అనుబంధ స్థితి, వారపు స్థితి నిరుద్యోగితా రేట్లు స్వల్పంగా పెరిగినా రోజువారీ స్థితి (CDS) నిరుద్యోగిత మాత్రం త్వరితంగా అంటే 1993-94 నుంచి 1999-2000కు 5.63 శాతం నుంచి 7.21 శాతానికి పెరిగింది. ఏన్ని బట్టి ఆర్థిక సంస్కరణల కాలంలో వ్యవసాయం నిర్లక్ష్యం చేయబడిందని అందుచేతనే నిరుద్యోగితా రేటు అధికంగా పెరిగిందని చెప్పవచ్చు.

10.5. భారతదేశంలో ఉద్యోగితా స్వభావము

భారతదేశంలో ఉద్యోగితా స్వభావం క్రింది లక్షణాల ప్రాతిపదికగా పరిశీలించవచ్చు

1. వృత్తివారీ ఉద్యోగిత
2. నిర్వహణ, నిర్వహణేతర రంగాల్లో ఉద్యోగిత
3. గ్రామీణ, పట్టణ నిరుద్యోగిత

1. వృత్తివారీ ఉద్యోగిత : ఆర్థిక వ్యవస్థను స్థూలంగా మూడు రంగాలు అనగా ప్రాధమిక రంగం, ద్వితీయ రంగం, తృతీయ రంగాలుగా విభజించవచ్చు. వ్యవసాయం మరియు అనుబంధ కార్యకలాపాలు, మరియు మైనింగ్, క్వారీయింగ్‌లు ప్రాధమిక రంగంలోకి వస్తాయి. విద్యుచ్ఛక్తి తయారీ గ్యాస్, నీటి సప్లయి, నిర్మాణ రంగాలు ద్వితీయ రంగంలోకి వస్తాయి. సేవా రంగ కలాపాలైన వర్తకం, రవాణా, కమ్యూనికేషన్లు మొదలైనవన్నీ తృతీయ రంగంలోకి వస్తాయి.

పట్టిక 10.4ను గమనిస్తే ప్రాధమిక రంగంలో 1983లో 69 శాతంగా ఉన్న ఉద్యోగిత 1990-2000 నాటికి 60.4 శాతానికి తగ్గింది. ఉద్యోగితా వృద్ధి రేటు (సాలుసరి) 1983-94 మధ్య 10 సంవత్సరాల కాలంలో ప్రాధమిక రంగంలో 1.60 శాతం కాగా 1994-2000 సంవత్సరముల మధ్యకాలంలో -0.34 కు తగ్గింది. ద్వితీయ రంగంలో ఉద్యోగిత 13.8 శాతం కాగా 1999-2000 నాటికి 16.8 శాతానికి పెరిగింది. సాలుసరి వృద్ధి రేటు కూడా 1983-94 మధ్య కాలం నుంచి 1994-2000 సంవత్సరాల మధ్య కాలానికి 2.90 శాతం నుంచి 3.14 శాతానికి పెరిగింది. తృతీయ రంగంలో ఉద్యోగితా రేటు 1983లో 17.2 శాతం ఉండగా 1999-2000 సంవత్సరానికి 22.7 శాతానికి పెరిగింది. తృతీయ రంగంలో సాలుసరి వృద్ధి రేటు 1983-84 లో 3.53 కాగా ఈ రేటు 1994-2000 కు 2.42 కు తగ్గింది. అన్ని రంగాల వృద్ధి రేటును గమనిస్తే 1983-94 సంవత్సరములో 2.04 శాతం నుంచి 1994-2000కు 0.98కి తగ్గింది.

పట్టిక 10.4లో తెలిపిన సమాచారం క్రింది ఫలితాలు వెల్లడిస్తాయి.

ఎ. వ్యవసాయ రంగం, మైనింగ్ మరియు క్వారీయింగ్, విద్యుచ్ఛక్తి, గాస్ మరియు నీటి సప్లయ్ కార్యకలాపాల్లో నూతన ఆర్థిక విధానాల అమలు కాలంలో వృద్ధి రేట్లు రుణాత్మకంగా మారాయి. 1983-94 నుంచి 1994-2000 సంవత్సర కాలంలో వ్యవసాయ రంగ వృద్ధి రేటు (సాలుసరి) 1.51 శాతం నుంచి -0.34కు, మైనింగ్ మరియు క్వారీయింగ్ సాలుసరి వృద్ధిరేటు 4.16 నుంచి -2.85కు, విద్యుచ్ఛక్తి, గ్యాస్ మరియు నీటి సప్లయ్ రేటు 4.50 నుంచి -0.88కి తగ్గింది.

పట్టిక నెం. 10.4

వృత్తివారీగా ఉద్యోగత

రంగం	ఉద్యోగుల సంఖ్య (మిలియన్లలో)			సాలుసరి (సాంవత్సరిక) వృద్ధి రేటు శాతం	
	1983	1993-94	1999-2000	1983-94	1994-2000
I. ప్రాథమిక రంగం	208.99	245.16	239.83	1.60	-0.34
	(69.0)	(65.5)	(60.4)		
1. వ్యవసాయం	207.23	242.46	237.56	1.51	-0.34
	(68.4)	(64.8)	(59.8)		
2. మైనింగ్ మరియు క్వారీయింగ్	1.76	2.70	2.27	4.16	-2.85
	(0.6)	(0.7)	(0.6)		
II. ద్వితీయరంగం	41.66	55.53	66.91	2.90	3.14
	(13.8)	(14.8)	(16.8)		
3. తయారీ పరిశ్రమ	34.03	42.50	48.01	2.14	2.05
	(11.2)	(11.3)	(12.1)		
4. విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటి సప్లయ్	0.85	1.35	1.28	4.50	-0.88
	(0.3)	(0.4)	(0.3)		
5. నిర్మాణ పరిశ్రమ	6.78	11.68	17.62	5.32	7.09
	(2.2)	(3.1)	(4.4)		
III. తృతీయ రంగం	52.11	73.76	90.26	3.53	2.42
	(17.2)	(19.7)	(22.7)		
6. వర్తకం	19.22	27.78	37.32	3.57	5.04
	(6.3)	(7.4)	(9.4)		
7. రవాణా, స్టోరేజి కమ్యూనికేషన్లు	7.39	10.33	14.69	3.24	6.04
	(2.4)	(2.8)	(3.7)		
8. ఫైనాన్షియల్ సేవలు	1.70	3.52	5.08	7.18	6.20
	(0.6)	(0.9)	(1.3)		
9. కమ్యూనిటీ, సాంఘిక వ్యక్తిగత సేవలు	23.80	32.13	33.20	2.90	0.55
	(7.9)	(8.6)	(8.4)		
మొత్తం ఉద్యోగిత	302.76	374.45	397.00	2.04	0.98
	(100)	(100)	(100)		

గమనిక : బ్రాకెట్లలోని సంఖ్యలు మొత్తం ఉద్యోగితలో శాతాలు

మూలం : Report on Task Force on Employment Oppurtunity, ప్రణాళికా సంఘం, 2001

బి. తయారీ (Manufacturing) ఫైనాన్షియల్ సేవలు, కమ్యూనిటీ, సామాజిక మరియు వ్యక్తిగత సేవల వృద్ధి రేట్లు తగ్గాయి. తయారీ రంగంలో 1983-94లో 2.14గా ఉన్న ఉద్యోగితా వృద్ధి రేటు 1999-2000కు 2.05కు తగ్గింది. అదే కాలంలో ఫైనాన్షియల్ సేవల వృద్ధి రేటు 7.18 నుంచి 6.20కు, కమ్యూనిటీ, సామాజిక, వ్యక్తిగత సేవల వృద్ధిరేటు 2.90 నుంచి 0.55 కు తగ్గాయి.

సి. సాంవత్సరిక వృద్ధి రేట్లు పెరిగిన రంగాలు వరుసగా నిర్మాణం, వర్తకం, రవాణా రంగాలు. నిర్మాణ రంగంలో 1983-94 నుంచి 1994-2000 మధ్య కాలంలో సాలుసరి వృద్ధి రేటు 5.32 నుంచి 7.09 కి, వర్తకంలో 3.57 నుంచి 5.04కి, రవాణా రంగంలో 3.24 నుంచి 6.04కు పెరగటం జరిగింది.

పై విశ్లేషణను బట్టి నూతన ఆర్థిక విధానంలో ఆమలు కాలంలో ప్రాధమిక రంగంలో ఉద్యోగితా రేట్లు రుణాత్మకంగా (వ్యవసాయం, మైనింగ్) ఉన్నాయి. అంటే ఉద్యోగిత తగ్గిపోతోందన్నమాట. ఉద్యోగితా వృద్ధిరేట్లు పెరుగుతున్న రంగాలు నిర్మాణం, వర్తకం రవాణా. ఈ రంగాల్లో ఉద్యోగత క్రమంగా పెరుగుచున్నది. మిగిలిన రంగాలైన తయారీ, ఫైనాన్షియల్, కమ్యూనిటీ సేవల రంగాలలో ఉద్యోగిత పెరుగుచున్నను గతంలో పెరుగుదల కన్నా తక్కువగా ఉంది. మొత్తంగా గమనిస్తే ప్రాధమిక రంగంలో ఉద్యోగిత తగ్గింది. ద్వితీయ రంగంలో ఉద్యోగిత పెరుచున్నను గత పెరుగుదల కన్నా తక్కువగా ఉంది. తృతీయ రంగంలో ఉద్యోగిత పెరిగింది. దీనిని బట్టి నూతన ఆర్థిక విధానాల అమలు కాలంలో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్లు చెప్పవచ్చు.

2. నిర్వహణ, నిర్వహణేతర రంగాల్లో ఉద్యోగిత : ప్రభుత్వ రంగం లేదా ప్రైవేటు రంగంలో 10 లేక అంతకన్నా ఎక్కువ ఉద్యోగులతో కొనసాగే రంగాన్ని నిర్వహణ రంగం అంటాము. నిర్వహణ రంగంలో వేతనాలు ఎక్కువగా ఉండటంతో పాటు ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలు కూడా ఉంటాయి. భారతదేశంలో నిర్వహణ, నిర్వహణేతర రంగాల్లో నిరుద్యోగిత, నిరుద్యోగితా వృద్ధి రేట్లు పట్టిక 10.5లో చూపటం జరిగింది.

పట్టిక నెం. 10.5

నిర్వహణ, నిర్వహణేతర రంగాల్లో ఉద్యోగిత

రంగం	ఉద్యోగిత మిలియన్లలో			సాంవత్సరిక వృద్ధి రేటు	
	1983	1994	1999-2000	1983-94	1994-2000
మొత్తం ఉద్యోగిత	30.2.75	374.45	397.00	2.04	0.98
నిర్వహణ రంగ ఉద్యోగిత	24.01 (7.9)	27.37 (7.3)	28.11 (7.1)	1.20	0.53
ప్రభుత్వరంగం	16.46 (2.5)	19.44 (5.2)	19.41 (4.9)	1.52	-0.03
ప్రైవేటు రంగం	7.55 (2.5)	7.93 (2.1)	8.70 (2.2)	0.45	1.87
నిర్వహణేతర రంగ ఉద్యోగిత	278.7 (92.1)	347.08 (92.7)	368.89 (92.9)	2.01	1.02

Note : బ్రాకెట్లలోని సంఖ్యలు మొత్తం ఉద్యోగితలో శాతాలు

మూలం : Planning Commission 2001, Report of the Task Force on Employment Oppurtunities p. 2.25

భారతదేశంలో నిర్వహణ రంగ ఉద్యోగిత 1983లో 24.01 మిలియన్లు ఉండగా 1994కు 27.37 మిలియన్లకు 1999-2000కు 28.11 మిలియన్లకు పెరిగినట్లు కనిపించినా మొత్తం శ్రామికుల శాతంతో చూస్తే 1983లో 7.9 శాతం ఉన్న నిర్వహణ రంగ నిరుద్యోగిత 1994కు 7.3 శాతానికి 1999-2000కు 7.1 శాతానికి తగ్గింది. అంటే నూతన ఆర్థిక విధానం అవలంభించిన కాలంలో నిర్వహణ రంగ నిరుద్యోగితా శాతం తగ్గింది. ఈ రంగ సాంవత్సరిక వృద్ధి రేటు 1983-94 మధ్య కాలంలో 2.04 ఉండగా 1994-2000 మధ్య కాలంలో 0.98 కి తగ్గింది. అంటే నిర్వహణ రంగ ఉద్యోగిత నూతన ఆర్థిక విధానాలు అవలంభించటం వల్ల తగ్గుతుందనే విషయం వెల్లడి అవుతుంది. నిర్వహణ రంగంలో భాగాలైన ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో కూడా ఉద్యోగుల సంఖ్య పెరిగినట్లు కన్పించినా శాతాల రూపంలో తగ్గింది. ప్రభుత్వ రంగ శ్రామికుల శాతం మొత్తం శ్రామికుల్లో 1983లో 5.4 ఉండగా, 1994కు 5.2కు, 1999-2000కు 4.9 శాతానికి తగ్గింది. ప్రైవేటు రంగ శ్రామికుల శాతం 1983లో 2.5 ఉండగా, 1994 కు 2.1కి తగ్గినా 1999-2000 నాటికి అతి స్వల్పంగా అంటే 2.2 శాతానికి పెరిగింది. నిర్వహణేతర రంగంలో శ్రామికుల సంఖ్య, శ్రామికుల శాతం పెరిగినా, వృద్ధి రేటు మాత్రం 2.01 (1983 - 94) నుంచి 1.02 (1994-2000)కు తగ్గింది.

3. భారతదేశంలో పట్టణ, గ్రామీణ నిరుద్యోగితా రేట్లు : భారతదేశంలో గ్రామీణ నిరుద్యోగితా రేటు కన్నా పట్టణ నిరుద్యోగితా రేటు ఎక్కువ. కింది పట్టిక 10.6 ను బట్టి భారతదేశ నిరుద్యోగితా రేట్లు గ్రామాల్లో, పట్టణాల్లో ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవచ్చు.

పట్టిక నెం. 10.6

భారతదేశంలో పట్టణ, గ్రామీణ నిరుద్యోగితా రేట్లు*

(శ్రామికుల్లో శాతాలు)

సర్వే కాలము	పట్టణ ప్రాంతం			గ్రామీణ ప్రాంతం		
	పురుషులు	స్త్రీలు	మొత్తం	పురుషులు	స్త్రీలు	మొత్తం
1977-78	9.4	14.5	10.3	7.1	9.2	7.7
1983	9.2	11.0	9.5	7.5	9.0	7.9
1987-88	8.8	12.0	9.4	4.6	6.7	5.3
1993-94	6.7	10.5	7.4	5.6	5.6	5.6
1999-2000	7.2	9.8	9.7	7.2	7.3	7.2

* వర్తమాన రోజువారీ స్థితి నిరుద్యోగితా రేట్లు

మూలం : నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ సర్వేలు

పట్టికను గమనిస్తే 1977-78లో 10.3 శాతంగా ఉన్న పట్టణ నిరుద్యోగితా రేటు క్రమంగా తగ్గుతూ 1993-94కు 7.4 కు తగ్గి తరువాత 1999-2000 నాటికి స్వల్పంగా అంటే 7.7 కు పెరిగింది. గ్రామీణ నిరుద్యోగితా రేట్లు పరిశీలించినట్లయితే 1977-78లో 7.7 నుంచి 1983 నాటికి 7.9కి పెరిగి తరువాత 1987-88 సంవత్సరంలో గణనీయంగా అంటే 5.3 శాతానికి తగ్గి మరలా పెరుగుతూ 1999-2000 సంవత్సరమునకు 7.2కు పెరిగింది.

భారతదేశంలో పట్టణ నిరుద్యోగితా రేట్లు క్రమంగా తగ్గుతూ 1993-94 నుంచి 1999-2000 సంవత్సరములలో స్వల్పంగా మాత్రమే (7.4 నుంచి 7.7కు) పెరుగుటకు కారణము అభివృద్ధి క్రమంలో పట్టణాలకు ప్రాధాన్యతను ఇవ్వటం. గ్రామీణ నిరుద్యోగితా రేట్లు 1977-78 నుంచి 1983 కు పెరిగి, తరువాత 1987-88కి తగ్గి ఆ తరువాత క్రమంగా పెరిగాయి. ఈ పెరుగుదలకు కారణము ఆర్థిక

సంస్కరణల కాలంలో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయటం. ఈ నిరుద్యోగితా రేట్ల స్వభావాన్ని గమనిస్తే నూతన ఆర్థిక విధానాన్ని అవలంభించినందువల్ల లేదా ఆర్థిక సంస్కరణల కాలంలో పట్టణాలకు ప్రాధాన్యత పెరిగినట్లు, గ్రామాలు నిర్లక్ష్యానికి గురైనట్లు గమనించవచ్చు.

10.6. వయోవస్థల వారీగా నిరుద్యోగితా రేట్లు

భారతదేశంలో వయోవస్థా వర్గాల వారీ నిరుద్యోగితా రేట్లు క్రింది పట్టిక 10.7లో చూపటం జరిగింది. భారతదేశంలో 1993-94 నుంచి 1999-2000 నాటికి యువకులలోను, అన్ని వయోవస్థా వర్గాలలోను నిరుద్యోగితా రేటు పెరిగింది.

పట్టిక నెం. 10.7

1999-2000 సంవత్సరములో వయోవస్థల వారీగా నిరుద్యోగితా రేట్లు*

వయోవస్థా వర్గం	పట్టణ	గ్రామీణ	ఉమ్మడి
15-19	19.0	13.3	14.4
	(16.6)	(8.8)	(10.3)
20-24	18.7	11.8	13.5
	(19.2)	(9.8)	(12.0)
25-29	10.9	8.7	9.2
	(10.4)	(7.4)	(8.1)
15-29సం॥లు	15.5	11.0	12.1
	(15.0)	(8.6)	(10.1)
30-34	4.9	6.1	5.8
35-39	3.7	5.0	4.6
40-44	2.7	4.8	4.2
45-49	2.4	4.6	3.9
50-54	2.1	4.5	3.9
55-59	2.0	4.6	4.0
60 ఆపైన	3.8	3.5	3.5
అన్ని వర్గాలు	7.7	7.2	7.3
	(7.4)	(5.6)	(6.0)

*వర్తమాన రోజువారీ స్థాయి నిరుద్యోగితా రేట్లు

Note : బ్రాకెట్లలోని సంఖ్యలు 1993-94 సంవత్సరాల నిరుద్యోగితా రేట్లు

మూలం : 50వ (1993-94), 51వ (1999-2000) రౌండ్ NSSO సర్వేలు

15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గలిగిన వారిని యువకులు అంటాము. యువకుల నిరుద్యోగితా రేటు పట్టణాల్లో 1993-94 లో 15 ఉండగా 1999-2000 నాటికి 15.5కు అంటే స్వల్పంగా పెరిగింది. కాని గ్రామీణ నిరుద్యోగితా రేటు అదే

కాలంలో 8.6 నుంచి 11కు పెరిగింది. యువకులలో నిరుద్యోగితారేటును బట్టి ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాలు యువత నిరుద్యోగితను తగ్గించలేక పోయాయనే నిజాన్ని వెల్లడిస్తాయి. అంతేకాక గ్రామీణ నిరుద్యోగితా రేటు గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదల స్వభావాన్ని బట్టి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నదని తెలియజేస్తుంది. యువకుల నిరుద్యోగితా పెరుగుదలను బట్టి ప్రభుత్వం నూతనంగా ఉద్యోగాన్ని వెతుక్కునే వారికి ఉద్యోగావకాశాలు కల్పించలేకపోతుంది అని తెలుసుకోవచ్చు. ఈ విషయంలో నూతన ఆర్థిక విధానాలు ఫలవంతం కాలేదని చెప్పవచ్చు.

10.7 విద్యాస్థాయిని బట్టి నిరుద్యోగిత :

సెకండరీ లేదా ఆపై విద్యార్హత కలిగిన నిరుద్యోగులను విద్యావంతులైన నిరుద్యోగులు అంటారు. వివిధ విద్యా స్థాయిలను బట్టి నిరుద్యోగితా రేట్లను (UPSS సాధారణ ముఖ్య, అనుబంధ స్థాయి) కింది పట్టిక తెలియజేస్తుంది.

పట్టిక 10.8

విద్యాస్థాయిని బట్టి నిరుద్యోగితా రేట్లు* (శ్రామికుల్లో శాతాలు)

విద్యాస్థాయి	నిరుద్యోగితా రేట్లు		
	1987-88	1993-94	1999-2000
1. నిరక్షరాస్యులు	1.1	0.2	0.2
2. ప్రాథమిక విద్యాస్థాయి	1.9	0.9	1.2
3. మధ్య స్థాయి	5.3	3.4	3.3
4. సెకండరీ	8.7	6.2	5.5
5. హైయ్యర్ సెకండరీ	-	8.7	7.8
6. డిగ్రీ, ఆపైన	9.9	9.3	8.8
విద్యావంతులైనవారు (సెకండరీ ఆపైన)	9.0	7.7	7.1
అన్ని విద్యాస్థాయిలు	2.7	1.9	2.2

* నిరుద్యోగితా రేట్లు సాధారణ ప్రాథమిక, అనుబంధ స్థాయికి సంబంధించినవి.

మూలం : 43వ (1987-88), 50వ (1993-94) మరియు 55వ (1999-2000) రౌండ్ NSSO సర్వేలు

భారతదేశంలో అన్ని విద్యా స్థాయిల నిరుద్యోగితా రేటు కన్నా మూడు రేట్లు విద్యావంతులైన నిరుద్యోగితా రేటు ఉన్నట్లు మనం పట్టిక 10.8లో గమనించవచ్చు. నిరక్షరాస్యులు, ప్రాథమిక, మధ్యస్థాయి విద్యావంతుల నిరుద్యోగితా రేట్ల తగ్గుదలకన్నా విద్యావంతులైన నిరుద్యోగిత తగ్గుదల తక్కువగా ఉంది. అందుకు కారణము నిరక్షరాస్యులు, ప్రాథమిక, మధ్యస్థాయి విద్యావంతులు తమకు అవకాశం ఉన్న ఏ పనినైనా చేయటం జరుగుతుంది. కాని విద్యావంతులు ఆ విధంగా ఉండరు అందుచేతనే ఈ రేటు స్వల్పంగా తగ్గింది.

భారతదేశ విద్యావంతుల సంఖ్యలో విద్యావంతుల నిరుద్యోగిత శాతాలను పట్టిక 10.9 తెలియజేస్తుంది

పట్టిక 10.9

భారతదేశంలో విద్యావంతులైన యువకుల్లో నిరుద్యోగితా రేట్లు

సంవత్సరం	సెకండరీ విద్య ఆపై స్థాయి			అన్ని రకాలైన సాంకేతిక విద్యలు		
	పట్టణ	గ్రామీణ	ఉమ్మడి	పట్టణ	గ్రామీణ	ఉమ్మడి
1983	30.0	20.4	20.7	23.9	25.0	24.4
	(10.7)	(2.5)	(4.2)			
1987-88	16.6	15.9	16.2	20.7	24.0	22.1
	(12.1)	(3.8)	(5.4)			
1993-94	20.8	17.0	18.5	25.9	29.0	27.3
	(10.8)	(2.9)	(4.6)			
1999-2000	18.3	12.5	14.8	24.5	22.8	23.7
	(11.2)	(3.7)	(5.4)			

* సాధారణ స్థితి నిరుద్యోగిత

గమనిక : 1. సాంకేతిక విద్యలో వ్యవసాయం, ఇంజనీరింగ్, టెక్నాలజీ, వైద్యం మరియు ఇతరాలలోని సర్టిఫికేట్లు లేదా డిప్లమోలు కూడా ఉంటాయి.

2. యువకులు అంటే 15-29 సంవత్సరాల వారు

3. బ్రాకెట్లలోని సంఖ్యలు యువకుల మొత్తంలో శాతాలు

మూలం : వివిధ NSSO సర్వేలు

భారతదేశంలోని విద్యావంతులైన యువకుల్లో విద్యావంతులైన నిరుద్యోగుల శాతం 199-2000 లెక్కల ప్రకారం 14.8 కాగా ఈ రేటు పట్టణాల్లో 18.3 ఉండగా, గ్రామాల్లో 12.5 గా ఉంది. సాంకేతిక అర్హతలు కలిగిన విద్యావంతులైన నిరుద్యోగిత శాతం 23.7 ఉండగా, అందులో పట్టణాల శాతం 24.5 మరియు గ్రామాల శాతం 22.8.

పై పట్టికలోని సమాచారాన్ని గమనిస్తే 1999-2000 సంవత్సరంలో విద్యావంతులైన నిరుద్యోగితా శాతాలకన్నా సాంకేతిక విద్యార్హత గలిగిన వారి నిరుద్యోగితా శాతాలు ఎక్కువగా ఉన్నట్లు గమనించవచ్చు. కావున సాంకేతిక విద్యార్హతలు గలవారి ఉద్యోగితను పెంపొందించవలసిన ఆవశ్యకత ఉంది. 1983వ సంవత్సరము నుంచి ఈ నిరుద్యోగితా రేట్లలో ఒడుదుడుకులు కన్పించినా, తగ్గుదల సంభవించింది.

10.8 భారతదేశంలో నిరుద్యోగ సమస్య కారణాలు :

భారతదేశంలో నిరుద్యోగ సమస్యకు అనేక కారణాలున్నాయి. అయితే వివిధ కారణాలు ఒకదాన్ని మరొకటి ప్రభావితం చేస్తూ ఈ సమస్యలను జఠిలం చేస్తున్నాయి. ఈ కారణాలను గూర్చి ఇప్పుడు తెలుసుకుందాం.

1. ఉద్యోగితను పెంపొందించని అభివృద్ధి : సాధారణంగా ఆర్థికాభివృద్ధి ఉద్యోగావకాశాలను పెంపొందించేదిగా ఉండాలి. అయితే భారతదేశంలో జరుగుచున్న అభివృద్ధి, ఉపాధి సదుపాయాలు మెరుగుపరిచేట్లు లేదు. భారతదేశంలో 1950-51 నుంచి 1980-81 వరకు సాధించిన సాంవత్సరిక వృద్ధి రేటు 3.6. ఈ రేటు వల్ల ఎక్కువ ఉద్యోగావకాశాలు సాధ్యం కావు. 1980 దశకం నుంచి 1990 దశకం వరకు స్థూల జాతీయోత్పత్తి రేటు దాదాపు 5.6 శాతం ఉన్నా నూతన ఉద్యోగావకాశాలు మాత్రం ఆశించిన విధంగా లేవు. తయారీ

రంగంలో గత రెండు దశాబ్దాలలో ఉద్యోగిత వ్యాకోచత్వం 0.59 నుంచి 0.33 కు తగ్గింది. అన్ని రంగాలలో కలిపి ఉద్యోగితా వ్యాకోచత్వము 1983 నుంచి 1986-87 వరకు 0.68 ఉండగా 1993-94 నుంచి 1999-2000కు 0.16 కు తగ్గటం జరిగింది. ఈ గణాంకాలను బట్టి భారతదేశ అభివృద్ధి ఉద్యోగాలను పెంపొందించేదిగా లేనందున నిరుద్యోగ సమస్య పెరుగుతోందని వెల్లడౌతుంది.

2. శ్రామిక శక్తి పెరుగుదల : భారతదేశంలో పెరుగుచున్న జనాభా శ్రామిక శక్తి పెరుగుదలకు దోహదం చేసింది. NSSO అంచనాల ప్రకారం 1993-94 సంవత్సరములో 20.13 మిలియన్ల నిరుద్యోగులు ఉండగా 1999-2000 నాటికి 26.58 మిలియన్లకు పెరిగారు. నిరుద్యోగితా రేటు ఇదే కాలంలో 6 శాతం నుంచి 7.32 శాతానికి పెరిగింది. ఈ నిరుద్యోగులకు ప్రణాళికాబద్ధమైన కృషి ద్వారా కూడా ఉపాధి కల్పించటం సాధ్యం కాలేదు. గతంలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగిత కల్పించలేక పోగా అదనంగా వచ్చి చేరే వారికి కూడా ఉద్యోగిత కల్పించలేకపోవటం వల్ల ఈ సమస్య మరింత జఠిలంగా తయారవుతోంది. పట్టణాల్లో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించలేక పోగా పల్లెల్లోని నిరుద్యోగులకు వ్యవసాయరంగం ఉపాధిని అందించలేకపోతుంది.

3. అనానుకూలమైన సాంకేతిక పరిజ్ఞానం : భారతదేశం అధిక శ్రామిక శక్తిని, కొరతగా మూలధనాన్ని కలిగి ఉన్న దేశం. ఈ పరిస్థితుల్లో మన దేశంలో మార్కెట్ శక్తులు స్వేచ్ఛగా, సమర్థవంతంగా పనిచేయాలంటే మనం, శ్రమ సాంద్రత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి. అయితే భారతదేశంలో పరిశ్రమల్లోనే కాక వ్యవసాయ రంగంలో కూడా మూలధన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించటం జరుగుతోంది. మూలధన సాంకేతిక పరిజ్ఞానం పాశ్చాత్య దేశాలకు అనుకూలం కాని భారతదేశానికి ప్రతికూలమైనది. అధిక జన సాంద్రత, శ్రమ శక్తి కలిగిన మన దేశంలో మూలధనానికి బదులు శ్రమను ఉపయోగించే పాశ్చాత్య సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించటం వల్ల నిరుద్యోగ సమస్య మరింత తీవ్రతరం అవుతోంది.

4. లోపభూయిష్టమైన విద్యా వ్యవస్థ : మనదేశ విద్యా వ్యవస్థ లోప భూయిష్టమైనది. వాస్తవానికి మెకాలే ప్రవేశపెట్టిన విద్యా విధానాన్నే నేటికిని కొనసాగిస్తూ కేవలం ప్రభుత్వ శాఖల్లో పనిచేసే గుమస్తాలను తక్కువ స్థాయి అధికార్లను మాత్రమే తయారు చేయడం జరుగుతుంది. కాని మారుతూ ఉన్న పరిస్థితులకనుగుణంగా నిరుద్యోగ సమస్యను తొలగించే విద్యా విధానం అవసరం. ఏ దేశానికైనా మానవ వనరులను సమర్థవంతంగా అభివృద్ధి పధంలో మళ్ళించగలిగే విద్యా విధానం అవసరం అని మిర్డాల్ అంటారు. కావున మారుచున్న పరిస్థితుల కనుగుణంగా నాణ్యతను పెంపొందించేదిగాను ఉద్యోగావకాశాలను పెంపొందించేదిగాను లేని విద్యా విధానాన్ని అవలంభించటం వల్ల భారతదేశ నిరుద్యోగ సమస్య మరింత తీవ్ర రూపం దాలుస్తోంది.

10.9. నిరుద్యోగ సమస్య పరిష్కార మార్గాలు

నిరుద్యోగ సమస్య అతి క్లిష్టమైనది. ఈ సమస్య పరిష్కారానికి వివిధ కోణాల నుంచి ఎదుర్కోవలసి ఉంటుంది. క్రింది చర్యలను చేపట్టినట్లయితే నిరుద్యోగ సమస్యను పరిష్కరించవచ్చు. నిరుద్యోగ సమస్య పరిష్కార మార్గాలను రెండు రకాలుగా చెప్పవచ్చు.

1. దీర్ఘ కాలిక చర్యలు :

ఎ) త్వరిత గతిని ఆర్థికాభివృద్ధి చర్యలను చేపట్టాలి. ఆర్థికాభివృద్ధిని విభిన్న కోణాలలో పారిశ్రామికీకరణ ద్వారా శ్రమ సాంద్రత సాంకేతిక పరిజ్ఞానము ద్వారా చేపట్టవలసి ఉంటుంది.

బి) ప్రస్తుత లోపభూయిష్టమైన విద్యా విధానం స్థానే సాంకేతిక, వృత్తి విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలి.

సి) వ్యవసాయ రంగంలో ఉద్యోగిత పెంపొందించే శాస్త్రీయ పద్ధతులను ప్రవేశపెట్టాలి.

డి) శీఘ్రగతిని పెరుగుచున్న జనాభాను అరికట్టే చర్యలను సమర్థవంతంగా చేపట్టాలి.

ఇ) ఉద్యోగితను పెంపొందించే విధంగా పబ్లిక్ వర్క్స్‌ను అన్ని స్థాయిలలో చేపట్టాలి.

2. స్వల్ప కాలిక చర్యలు :

ఎ) చిన్న పరిశ్రమలను స్థాపించటంతో పాటు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి

బి) జాతీయ విస్తరణ సేవలను ప్రోత్సహించాలి

సి) రోడ్డు, రవాణాను ప్రోత్సహించటం ద్వారా సేవారంగంలో ఉద్యోగితను పెంపొందించవచ్చు.

డి) ప్రభుత్వం గృహ నిర్మాణ స్కీములను ప్రవేశపెట్టాలి

ఇ) ప్రైవేటు బిల్డింగ్ నిర్మాణాన్ని ప్రోత్సహించాలి.

పైన తెలిపిన వివిధ రకాలైన స్వల్పకాలిక, దీర్ఘ కాలిక చర్యలను చేపట్టటం ద్వారా భారతదేశంలో నిరుద్యోగ సమస్యను అరికట్టవచ్చు.

10.10. భారతదేశ ఉద్యోగితా విధానం :

నిరుద్యోగ నిర్మూలన అనేది భారత పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలలో ఒక లక్ష్యం. అయితే 6వ పంచవర్ష ప్రణాళిక వరకు భారతదేశానికి ఒక ఉద్యోగితా ప్రణాళిక లేదు. 6వ పంచవర్ష ప్రణాళిక వరకు ఆర్థికాభివృద్ధి ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారమౌతుందని ప్రభుత్వం భావించింది. అయితే ఆర్థికాభివృద్ధితో నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రత్యక్ష పోరాటం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. తదనుగుణంగా వివిధ ప్రణాళికల్లో వివిధ ఉద్యోగితా విధానాలను రూపొందించి, ఆ విధానాల అమలు ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి సల్పుతోంది.

ఆరవ ప్రణాళిక ఉద్యోగితా విధానం : ఆరవ ప్రణాళికా పీఠికలో నిరుద్యోగానికి సంబంధించి క్రింది విధంగా పేర్కొనటం జరిగింది. గత దశాబ్ద కాలంలో నిరుద్యోగం, అల్పోద్యోగం గణనీయంగా పెరిగింది. ఈ స్థితిని ఎదుర్కొనేందుకు రెండు గమ్యాలను రూపొందించుకోవాలని, అవి. 1. ఆర్థికాభివృద్ధి రేటును పెంపొందించటం ద్వారా అల్పోద్యోగితను తగ్గించాలని 2. సాధారణ స్థితి నిరుద్యోగితను తగ్గించాలని సూచించటం జరిగింది. ఈ పంధాలో ఉద్యోగిత పెంచడానికి ఉద్యోగితతో కూడిన ఆర్థికాభివృద్ధి అవసరం. అందుకోసం స్వల్ప కాలిక చర్యలను వెంటనే చేపట్టటం జరిగింది. మన ఆర్థిక వ్యవస్థ మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. ప్రభుత్వ రంగం హెచ్చు మూలధన సాంద్రత కలిగినదైనందున ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే చర్యలను చేపడుతూ, వ్యవసాయ రంగాన్ని చిన్న కుటీర పరిశ్రమలను, వ్యవసాయేతర రంగాలను ప్రోత్సహించటం జరిగింది. ఈ ప్రణాళికా కాలంలో కొన్ని ముఖ్య ఉద్యోగితా పథకాలను అనగా సమగ్ర గ్రామీణ అభివృద్ధి పథకం (IRDP), జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (NREP), గ్రామీణ యువకుల స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమం (TRYSEM), ఆపరేషన్ ఫ్లడ్ - 2 కార్యక్రమాలను ప్రారంభించటం జరిగింది. ఈ విధంగా ఆరో ప్రణాళికా కాలంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికై చర్యలను చేపట్టటం జరిగింది.

ఏడో ప్రణాళికలో ఉద్యోగిత దృక్పథం : ఏడో ప్రణాళికా ప్రారంభానికి భారతదేశంలో 15 సంవత్సరాలు దాటిన వయస్సు గల వారి నిరుద్యోగిత 9.2 మిలియన్లు ఉన్నట్లుగాను, ప్రణాళికా కాలంలో అదనంగా 39.38 మిలియన్లు శ్రామిక శక్తి జత అవుతుందని అంచనా వేయటం జరిగింది. అంటే ఏడో ప్రణాళికా కాలంలో అదనంగా 47.58 మిలియన్ల ఉద్యోగిత కల్పించవలసి ఉంది.

ఈ ప్రణాళికా కాలంలో 40.36 మిలియన్ల ఉద్యోగాలు కల్పించవచ్చని, ఇంకా 7.58 మిలియన్లు నిరుద్యోగులుగా ఉంటారని అంచనా. ఈ 7.58 మిలియన్లకు ఉద్యోగావకాశాలు ప్రణాళికాంతానికి కల్పించాలని భావించటం జరిగింది. అందుకోసం గత ప్రణాళికా కాలంలో ప్రారంభించబడిన IRDP, NREP, RLEGP, TRYSEM మొదలైన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలనేది ఈ ప్రణాళికా విధానం. NREP, RLEGP కార్యక్రమాలను మిళితం చేసి జవహర్ రోజ్‌గార్ యోజనను ప్రారంభించటం జరిగింది. సాంకేతికాభివృద్ధిని పెంపొందించి, ఆధునికీకరణను జోడిస్తూ ఆరో ప్రణాళికా విధానాన్నే మరింత సమర్థవంతంగా అమలు చేయడమే 7వ ప్రణాళిక ఉద్యోగితా దృక్పథం.

ఎనిమిదో ప్రణాళికలో ఉద్యోగితా దృక్పథం : ఎనిమిదో ప్రణాళిక ప్రారంభ అంచనాల ప్రకారం ఏడో ప్రణాళికలో మిగిలి ఉన్న నిరుద్యోగుల సంఖ్య 28 మిలియన్లు ప్రణాళికా కాలంలో అదనంగా వచ్చి చేరే శ్రామికులు 37 మిలియన్లని అంచనా వెయ్యటం జరిగింది. అంటే 8వ ప్రణాళికా కాలంలో 65 మిలియన్లకు ఉద్యోగితను కల్పించవలసి ఉంది. తరువాత ప్రణాళికా కాలంలో (1995-2000) 41 మిలియన్ల శ్రామికులు వచ్చి అదనంగా జత అవుతారని, మొత్తం 1990 నుంచి 2000 సంవత్సరాల కాలంలో ఉద్యోగాలను కోరుకొనే వారి సంఖ్య 106 మిలియన్లు ఉంటుందని అంచనా. కావున ఈ నిరుద్యోగులకు ఉద్యోగిత కల్పించాలంటే 8వ ప్రణాళికలో 4 శాతం ఉద్యోగితా వృద్ధి రేటు, ఆ తరువాత 2000 వరకు 3 శాతం కన్నా ఎక్కువ ఉద్యోగితా వృద్ధి రేటు సాధించ వలసి ఉంటుందని ప్రణాళికా సంఘం అంచనా వేసింది. ఈ లక్ష్య సాధనకనుగుణంగా ఉద్యోగితా వ్యాకోచత్వాలు కలిగి ఉన్న రంగాలను ప్రోత్సహిస్తూ, ఉద్యోగావకాశాలు మెరుగుపరచగల సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహిస్తూ, ఉద్యోగిత పెంపొందించే విధంగా వివిధ రంగాల ప్రాధాన్యతలను సర్దుబాటు చేస్తూ నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని భావించటం జరిగింది.

తొమ్మిదో ప్రణాళికా కాలంలో ఉద్యోగితా విధానం : 1993-94 వ సంవత్సరములో NSSO 50వ రౌండ్ సర్వే ప్రకారం వ్యవసాయ రంగ శ్రామికులలో 84 శాతం నిరక్షరాశ్యులు లేదా ప్రాథమిక విద్యలోపు వారు. వ్యవసాయేతర రంగాల్లో వీరి శాతం 51.8 శాతం, పరిశ్రమ రంగంలో 69.8 శాతం. అందుచేత నిరక్షరాస్యులు, ప్రాథమిక విద్యలోపు శ్రామికులకు ఉపాధి కల్పించేందుకు అనుగుణంగా అధిక ఉద్యోగితా అవకాశం ఉన్న రంగాలను ప్రోత్సహించాలని తొమ్మిదో ప్రణాళిక ఉద్దేశించటం జరిగింది.

ఈ లక్ష్యంలో భాగంగా వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడిని ప్రోత్సహించాలని, వెనుకబడ్డ ప్రాంతాల్లో నీటి పారుదల ప్రాజెక్టులు అవస్థాపనా సదుపాయాలను కల్పించాలని ఉద్దేశించటం జరిగింది. అనగా వ్యవసాయ వృద్ధితో పాటు ఉద్యోగితను కూడా పెంపొందించాలని భావించటం జరిగింది. పండ్ల తోటలను ప్రోత్సహించాలని కూడా ఉద్దేశించటం జరిగింది.

ఉద్యోగితా కల్పనలో వ్యవసాయేతర రంగ ప్రాముఖ్యతను గుర్తించి ఈ రంగాన్ని మరింత బలోపేతం చెయ్యాలని ఉద్దేశించటం జరిగింది. పారిశ్రామిక రంగంలో వినియోగ వస్తు పరిశ్రమలు 2/3వ వంతు ఉద్యోగితను కల్పిస్తున్నాయనే వాస్తవాన్ని గుర్తించి, ఈ రంగాన్ని ప్రోత్సహించటం ద్వారా వినియోగ వస్తు ఉత్పత్తిని, ఉద్యోగితను పెంపొందించాలని భావించటం జరిగింది. ఉద్యోగితా కల్పనలో చిన్న, కుటీర పరిశ్రమల ప్రాముఖ్యతను గుర్తించి వీటి ప్రాధాన్యతను పెంపొందించాలని ఉద్దేశించటం జరిగింది.

సేవా రంగంలో ఉద్యోగితా వృద్ధి రేటు పాలీనా 1982 - 87 నుంచి 1993-94 కు 5.39 శాతం ఉండగా, 1983 నుంచి 1987-88 నాటికి కేవలం 1.84. కావున సేవారంగ ప్రాధాన్యతను పెంపొందించాలని ఉద్దేశించటం జరిగింది. "అందరికి విద్య", "అందరికి ఆరోగ్యం" అనే లక్ష్య సాధన క్రమంలో ఉద్యోగావకాశాలు విస్తృతమౌతాయని భావించటం జరిగింది.

ఈ లక్ష్యాల సాధనకోసం గతంలో కొనసాగిస్తున్న ఉద్యోగితా కార్యక్రమాలను మరింత పటిష్టం చేయటం జరిగింది. అందులో భాగంగా జవహర్ రోజ్‌గార్ యోజన (JRY), ఉద్యోగిత భద్రతా పథకాలను (EAS) సమర్థవంతంగా అమలుచేస్తూ, అవస్థాపనా సదుపాయాల అభివృద్ధి ద్వారా ఉద్యోగావకాశాలను పెంపొందించాలని భావించటం జరిగింది. స్వయం ఉపాధి రంగాన్ని కూడా విస్తృత పరచాలని, బలపరచాలని తొమ్మిదో ప్రణాళికా సంఘం ఉద్దేశించటం జరిగింది.

పదో ప్రణాళిక ఉద్యోగితా విధానం : పదో ప్రణాళికలో నూతనంగా చేరే శ్రామికులకు ప్రణాళిక చివరి సంవత్సరానికి కల్పిస్తూ, పది సంవత్సరముల కాలంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే విధంగా 8 శాతం స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటును నిర్దేశించటం జరిగింది. పదో ప్రణాళికా కాలంలో నిరుద్యోగ సంఖ్య వివరాలు పట్టిక 10.10లో పొందు పరచటం జరిగింది.

పట్టిక 10.10

పదో ప్రణాళికలో ఉద్యోగిత స్థితి (మిలియన్లలో)

1. మార్చి 31, 2002 నాటికి శ్రామికులు	378.21
2. లభ్యమయ్యే ఉద్యోగాలు	343.36
3. నిరుద్యోగులు (1-2)	34.85
4. నూతనంగా ప్రవేశించే శ్రామికులు	35.29
5. మొత్తం అవసరమైన ఉద్యోగాలు	70.14

పట్టిక 10.10 తెలిపినట్లుగా కల్పించవలసిన 70.14 ఉద్యోగాలలో 50 మిలియన్లు 10వ ప్రణాళికలో కల్పించగా, మిగిలిన 20.14 మిలియన్లు ప్రత్యేక పథకాల ద్వారా కల్పించాలని ఉద్దేశించటం జరిగింది.

ప్రణాళిక కల్పించాలని ఉద్దేశించిన అదనపు 50 మిలియన్ల ఉద్యోగాల్లో వ్యవసాయ రంగం 9.26 మిలియన్లు, పారిశ్రామిక రంగం 13.51 మిలియన్లు, తృతీయ రంగం 19.16 మిలియన్లు, వివిధ పథకాలు (PMRY, SSI, REPG, KVIC, SGRY, PMGSY, SGSY) 7.06 మిలియన్లు కల్పించే విధంగా ప్రణాళికను సిద్ధపరచటం జరిగింది. ఈ లక్ష్య సాధన దిశగా 10వ పంచవర్ష ప్రణాళిక ప్రస్తుతం కొనసాగుతోంది.

10.11 భారతదేశంలో నిరుద్యోగ నిర్మూలనా కార్యక్రమాలు :

నిరుద్యోగ సమస్య పరిష్కారానికై భారత ప్రభుత్వం 1970 వ సంవత్సరములో భగవతి కమిటీని ఏర్పాటు చెయ్యటం జరిగింది. ఈ కమిటీ తన పూర్తి నివేదికను 1973 వ సంవత్సరములో సమర్పించింది. నిరుద్యోగ సమస్య పరిష్కారానికై విద్యుద్దీకరణ, రోడ్ల, నిర్మాణం, గ్రామీణ గృహ నిర్మాణం,చిన్ననీటి పారుదల ప్రాజెక్టులను చేపట్టాలని భగవతి కమిటి సూచించింది. ఈ చర్యలు గ్రామీణ నిరుద్యోగిత, అల్పోద్యోగితలను తగ్గిస్తాయని కమిటి భావించింది. వీటితో పాటు స్వయం ఉపాధి, ఇంజనీరింగ్ పట్టభద్రుల ఉపాధిని పెంపొందించేందుకు ఆగ్రో - సేవా కేంద్రాలను ప్రోత్సహించాలని కూడా సూచించటం జరిగింది. ఈ కమిటీ రిపోర్టు ప్రకారం భారత ప్రభుత్వం క్రింది కార్యక్రమాలను చేపట్టింది. ఆ తరువాత మరికొన్ని కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. వీటిని సంక్షిప్తంగా తెలుసుకుందాం.

1. గ్రామీణ పనుల కార్యక్రమం (Rural Works Programme) : 1970-71 వ సంవత్సరంలో దుర్భిక్ష ప్రాంతాల అభ్యున్నతి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టటం జరిగింది. దుర్భిక్ష తీవ్రత తగ్గించేందు కోసం చిన్న, మధ్య తరగతి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం మొదలైన కార్యక్రమాలను చేపట్టి శ్రామికులకు ఉద్యోగిత కల్పించటం ఈ కార్యక్రమ లక్ష్యం.

2. ఉపాంత వ్యవసాయదారుల, వ్యవసాయ కార్మికుల కార్యక్రమం (Marginal Farmers and Agricultural Labourers) ఉపాంత వ్యవసాయదారులకు సబ్సిడీ రూపంలో వ్యవసాయ పరపతి అందిస్తూ, ఉపాంత వ్యవసాయదారులు మరియు వ్యవసాయ కార్మికులను వ్యవసాయ అనుబంధ వృత్తులైన డైరీ, పౌల్ట్రీ, చేపల పరిశ్రమ మొదలైన కార్యకలాపాలు చేపట్టే వారికి సబ్సిడీ రూపంలో పరపతి నందించి ఉద్యోగితను పెంపొందించటం ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని 1947 - 72 లో ప్రారంబించటం జరిగింది.

3. సన్నకారురైతుల అభివృద్ధి ఏజెన్సీ (Small Farmers Development Agency, 1971 - 72) : సన్నకారు రైతుల ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసేందుకు అవసరమైన పరపతిని అందించుట ఈ కార్యక్రమ ఉద్దేశం. ఆధునిక సాంకేతిక పద్ధతుల వల్ల సాంద్ర వ్యవసాయం సాధ్యమౌతుంది.

4. సమగ్ర మెట్ట ప్రాంతాల వ్యవసాయాభివృద్ధి (Integrated Dry Land Agricultural Development) : మెట్ట ప్రాంతాలలో వ్యవసాయాభివృద్ధి కోసం భూముల పరిరక్షణ, నీటి పరిరక్షణకు సంబంధించి శాశ్వత కార్యకలాపాలను ఈ కార్యక్రమంలో చేపట్టటం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో శ్రమ సాంద్రత పద్ధతులను ఉపయోగించటం వల్ల ప్రతి కోటి రూపాయల ఖర్చువల్ల 15,000 మంది నిరుద్యోగులకు ఉపాధి లభ్యమౌతుంది.

5. వ్యవసాయ సేవా కేంద్రాలు (Agro-Service Centres) : వ్యవసాయం, పరిశ్రమల రంగాల్లో అనుభవం ఉన్న ఇంజనీరింగ్, వ్యవసాయ పట్టభద్రులకు, ఇతర సాంకేతిక సర్టిఫికెట్లు కలిగి ఉన్న విద్యావంతులైన నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించటం ఈ కార్యక్రమ లక్ష్యం.

వర్క్‌షాపులు, వ్యవసాయ యంత్రాల రిపేరు షాపులు, విడి భాగాల షాపులు మొదలైన వాటి ఏర్పాటుకు అవసరమైన పరపతిని అందించి స్వయం ఉపాధిని కల్పిస్తుంది.

6. ఉపాధి భద్రతా కార్యక్రమం (Employment Guarentee Scheme, 1972-73) : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెంపొందించేందుకు మహారాష్ట్రలో ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమ లక్ష్యాలు

ఎ) గ్రామీణ పేదలకు ఉత్పాదకతతో కూడిన ఉపాధి కల్పించటం

బి) చిన్న నీటి ప్రాజెక్టులు, నీరు మరియు నేల పరిరక్షణ, కాల్వల త్రవ్వకం, భూ అభివృద్ధి మొదలైన కార్యకలాపాలను శ్రమ సాంద్రత పద్ధతుల ద్వారా అమలు చేయటం

సి) ఈ కార్యక్రమాలను ప్రభుత్వము మాత్రమే నిర్వహిస్తుంది. ప్రైవేటు కాంట్రాక్టర్ల ద్వారా నిర్వహించబడరాదు.

7. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (National Rural Employment Programme, 1980) : దారిద్ర్య రేఖ దిగువనున్న పేదలకు అదనంగా సంవత్సరానికి 300 నుండి 400 మిలియన్ల పని దినాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించటం జరిగింది. గ్రామీణ అవస్థాపనా సదుపాయాలైన మంచినీటి బావులు, సామాజిక బావులు, చెరువులు, చిన్ననీటి ప్రాజెక్టులు, గ్రామీణ రోడ్లు మొదలైనవి కల్పించటం ద్వారా ఉపాధి సదుపాయాలు పెంపొందించాలనేది ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ కార్యక్రమం 50 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు జరిగింది.

8. గ్రామీణ భూమిలేని శ్రామికుల ఉపాధి భద్రతా కార్యక్రమం (...ral Landless Employment Guarentee Programme, 1 83) : భూమిలేని వ్యవసాయ కుటుంబాలలో కనీసం ఒకరికి 80 నుంచి 100 పని దినాలు కల్పించాలనేది ఈ కార్యక్రమ ఉద్దేశం. ఈ క ్యక్రమంలో చేపట్టే పనులు కూడా NREP లో వలే చిన్న నీటి ప్రాజెక్టులు, గ్రామీణ రోడ్లు మొదలైన గ్రామీణ అవస్థాపనా కార్యకలాపాలు. ఈ కార్యక్రమంలో అంతర్భాగంగా ఇందిరా ఆవాజ్ యోజన (IAS) ఉండేది. IAS కార్యక్రమంలో దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారికి ఇళ్ల నిర్మాణం చేయటం జరుగుతుంది.

9. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (Integrated Rural Development Programme, 1980) : గతంలో కొనసాగుచున్న ఉపాధి భద్రతా కార్యక్రమం, పనికి ఆహార పథకం, సన్నకారు రైతుల అభివృద్ధి ఏజెన్సీ, ఎడారి అభివృద్ధి కార్యక్రమం మొదలైన అనేక కార్యక్రమాలను సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం అనే ఒకే గొడుగు క్రిందకు తీసుకురావటం జరిగింది. ఈ పథకంలో లబ్దిదారులను ఎంపిక చేసి సబ్సిడీతో కూడిన రుణ సదుపాయాన్ని అందించటం జరుగుతుంది. రైతులకైతే 25 శాతం, ఉపాంత వ్యవసాయదారులకు 33.3 శాతం, వ్యవసాయ కార్మికులు మరియు చేతి వృత్తుల వారికైతే 50 శాతం మూలధన వ్యయంపై సబ్సిడీ అందిస్తుంది. ఈ కార్యక్రమంలో అందించే పరపతి కేటాయింపులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 : 50 శాతం అందించటం జరుగుతుంది.


10. జవహర్ రోజ్‌గార్ యోజన (Jawahar Rozgar Yojana, 1989) : గతంలో కొనసాగుచున్న జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం (NREP) మరియు గ్రామీణ భూమిలేని శ్రామికుల ఉపాధి భద్రతా కార్యక్రమం (RLEGP) లను మిళితం చేసి 1989లో జవహర్ రోజ్‌గార్ యోజనను ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ పంచాయితీలు నిర్వహిస్తాయి. ఈ కార్యక్రమ ప్రధమ లక్ష్యం దారిద్ర్య రేఖ దిగువనున్న నిరుద్యోగులు, అల్పోద్యోగులకు ఉపాధిని కల్పించటం కాగా ద్వితీయ లక్ష్యం గ్రామాలకు అవస్థాపనా సదుపాయాలను చేకూర్చటం. ఈ కార్యక్రమంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం, సామాజిక అడవుల పెంపకం, భూ అభివృద్ధి పాఠశాలల నిర్మాణం మొదలైన కార్యకలాపాలు చేపట్టవచ్చు. ప్రైవేటు కాంట్రాక్టర్లను నియమించరాదు. ఈ కార్యక్రమానికయ్యే నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80:20 నిష్పత్తిలో సమకూర్చుతాయి. ఈ కార్యక్రమంలో ఇందిరా ఆవాజ్ యోజన, మిలియన్ బావుల పధకం ఉప కార్యక్రమాలుగా ఉండేవి. ఈ కార్యక్రమాన్ని (JRY) కొన్ని స్వల్ప మార్పులతో జవహర్ గ్రామ సమృద్ధి యోజనగా 1999లో మార్పు చేయటం జరిగింది. ఆ తరువాత జవహర్ గ్రామ సమృద్ధి యోజనతో ఉపాధి భద్రతా కార్యక్రమాన్ని (Employment Assurance Scheme) జోడించి స్వర్ణ జయంతి గ్రామీణ యోజ్‌గార్ యోజన అనే కార్యక్రమం 2001 నుంచి కొనసాగుతుంది.

10.12 ఆధునీకరణ - నిరుద్యోగం - కార్మిక సంఘాలు

ఆధునికీకరణ ప్రభావాలలో ముఖ్యమైనది కార్మిక సంఘాలు ఉద్భవించటం. పారిశ్రామికీకరణ ఫలితంగా 19వ శతాబ్దం, 20వ శతాబ్ద ప్రారంభంలో శీఘ్ర పారిశ్రామికీకరణ కొనసాగింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రభలటం, యాజమాన్యం ద్వారా శ్రామికులు దోపిడీకి గురవ్వటం జరిగింది. తత్ఫలితంగా శ్రామికుల భద్రత కోసం, పెరుగుచున్న శ్రామిక దోపిడీ ఎదుర్కొనే లక్ష్యంతో పాశ్చాత్య దేశాల్లో కార్మిక సంఘాలు పుట్టుకొచ్చాయి. ఈ విధంగా ఉద్భవించిన కార్మిక సంఘాలు శ్రామికుల వేతనాలు పెంపొందించే విషయంలో సఫలీకృతమయ్యాయి. శ్రామికుల సాంఘీక భద్రత, శ్రామిక సంక్షేమాన్ని పెంపొందించుకొనే విషయంలో కార్మిక సంఘాలు వివిధ నియమ నిబంధనలను రూపొందించుకోవటం, తదనుగుణంగా యాజమాన్యాలతో ఒప్పందమై, తమ సభ్యుల సంక్షేమాన్ని పరిరక్షించుకొనే విషయంలో విజయం సాధించాయి.

అయితే ఈ నియమ నిబంధనల ఫలితంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తి వ్యయం పెరిగింది. కార్మిక సంఘాల లక్ష్యం పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు (Insiders) తప్ప, నూతనంగా పరిశ్రమలలోకి చేరే శ్రామికులు కాదు. పెరిగిన ఉత్పత్తి వ్యయం, ఆధునికీకరణ ఫలితంగా నిరుద్యోగ సమస్య మరింతగా పెరగటం జరిగింది. ఈ విధంగా ఆధునికీకరణ ఫలితంగా శ్రామిక సంఘాల ఏర్పాటు, తత్ఫలితంగా నిరుద్యోగ సమస్య ప్రభలటానికి సంబంధించిన విశ్లేషణను గురించి అనేక ఆధునిక శాస్త్రవేత్తలు వివరించటం జరిగింది. అందులో హిస్టరిసిస్ అనే శాస్త్రవేత్త ఇచ్చిన విశ్లేషణను గురించి తెలుసుకుందాం.

క్రింది రేఖా పటంలో X అక్షము పై శ్రామికుల డిమాండు మరియు సప్లయ్‌ని, Y అక్షముపై వాస్తవిక వేతనాన్ని తీసుకోవటం జరిగింది. SL_1 రేఖ ప్రారంభ శ్రమ సప్లయ్ రేఖ, DL_1 రేఖ ప్రారంభ డిమాండు రేఖ. A బిందువు సమతౌల్య బిందువు. సమతౌల్య ఉద్యోగితా స్థాయి ON^1, సమతౌల్య వేతనం AN_1.



ఈ విధంగా A అనే సమతౌల్యంలో కొనసాగే స్థితిలో ఆధునికీకరణ జరిగిందని భావిద్దాం. ఆధునీకరణ ప్రభావం వల్ల శ్రామికుల డిమాండ్ రేఖ DL_1 నుంచి DL_2 కు తగ్గింది. ఫలితంగా SL_1 మరియు SL_2 రేఖలు ఖండించుకున్న B సమతౌల్య బిందువు. సమతౌల్య వేతనం BN_2, సమతౌల్య ఉద్యోగిత ON_2, ఆధునికీకరణ ఫలితంగా ఉద్యోగితా స్థాయి ON_1 నుంచి ON_2 కు, వేతనం AN_1 నుంచి BN_2 కు తగ్గింది.

అయితే మారిన ఉద్యోగతా స్థాయి వద్ద డిమాండు రేఖ (DL_1) కనుగుణంగా పొందవలసిన వేతనం CN_2. అంటే పొందవలసిన వేతనం CN_2 కాగా పొందిన వేతనం BN_2. ఈ రెంటి మధ్య గల వ్యత్యాసం CB అనే పరిమాణంలో వేతనాన్ని కార్మిక సంఘాల ప్రయత్నం ద్వారా పొందగలుగుతాయి. కార్మిక సంఘాల లక్ష్యం పరిశ్రమల్లోని కార్మకులే తప్ప బయట నుంచి వచ్చే కార్మికులు కాదు. అందుచేత తగ్గిన నిరుద్యోగిత N_1N_2 మాత్రం అదే విధంగా ఉంటుంది. కాల గమనంలో శ్రమ సప్లయ్ రేఖ SL_1 నుంచి SL_2 కు తగ్గుతుంది. ఈ విధంగా అధిక వేతనాలు CN_2 మరియు అల్ప ఉద్యోగిత ON_2 దీర్ఘ కాలంలో కొనసాగుతాయని హిస్టరీసిస్ వివరించటం జరిగింది. అనేక పాశ్చాత్య దేశాల్లో ఈ స్థితి కొనసాగినట్లు అనుభవాలు తెలుపుతున్నాయి.

ఆధునీకరణ వల్ల దీర్ఘ కాలంలో అధిక వేతనం, అల్పోద్యోగిత కొనసాగటానికి నాలుగు కారణాలను హిస్టరీసిస్ వివరించాడు.

1. పరిశ్రమ లోపలి వారి శ్రేయస్సు కార్మిక సంఘాల లక్ష్యం : ఆధునికీకరణ ప్రభావం వల్ల పరిశ్రమలోని కార్మికుల వేతనాలు తగ్గటంతోపాటు బయటి వారికి ఉద్యోగావకాశాలు తగ్గిపోతాయి. అయితే పరిశ్రమలలోని శ్రామికుల శ్రేయస్సే లక్ష్యంగా ఉన్న కార్మిక సంఘాలు తగ్గిన వేతనాన్ని పెంపొందించటం జరుగుతుంది. అయితే పరిశ్రమ బయట నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన వీటి లక్ష్యం కాదు. అందుచేత నిరుద్యోగిత కొనసాగుతుంది.

2. ఉద్యోగాన్వేషణ, పని లభ్యం కాకపోవటం : ఆధునికీకరణ ఫలితంగా ఉద్యోగావకాశాలు తగ్గిపోతాయి. ఉద్యోగాన్వేషణలో ఉన్న నిరుద్యోగులు ఉద్యోగ ప్రయత్నాలు కొనసాగించే క్రమంలో ఉద్యోగాలు లభ్యం కాకపోవటం ఒకవైపు, ఒక వేళ ఉద్యోగాలున్నను అందుకు వారు తగిన వారు కాక పోవడం లేదా వారికి తగినవి కాకపోవడం వల్ల నిరుద్యోగులుగా మిగిలిపోవడం.

3. శ్రామికుల నిరుత్సాహం : శ్రామికులు ఉద్యోగాన్వేషణ కొనసాగించి, ఉద్యోగం లభ్యం కాకపోవడం వల్ల నిరుత్సాహపడతారు. ఉద్యోగం దొరుకుతుందనే ధైర్యాన్ని కోల్పోతారు. తత్ఫలితంగా ఉద్యోగాన్వేషణలో విసిగి, వేసారి చివరకు ఉద్యోగాన్వేషణను విరమించి నిరుద్యోగులుగానే కొనసాగుతారు.

4. విస్తరిస్తున్న అవకాశాలకు (Prospects) సంబంధించిన సమాచార లోపం : ఆధునికీకరణ నేపథ్యంలో ఉత్పన్నమయ్యే ఉద్యోగాలు, వాటి ప్రయోజనాలకు సంబంధించిన సమాచారం అందకపోవడం వల్ల శ్రామికులు నిరుద్యోగులుగా మిగిలిపోతారు.

ఈ నాలుగు కారణాల వల్ల ఆధునీకరణ క్రమంలో దీర్ఘ కాలంలో నిరుద్యోగిత, హెచ్చు వేతనాలు కొనసాగుతాయని హిస్టరీసిస్ అనే శాస్త్రవేత్త విశ్లేషించారు.

10.13. సారాంశము :

ఆర్థిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోవడాన్నే ఆర్థిక ఆధునికీకరణ అనవచ్చు. స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో ఆధునికీకరణ చోటు చేసుకున్నా అది అతి పరిమితంగా, బ్రిటీషు వారికి అనుకూలంగానే మార్పు సంభవించింది. స్వాతంత్ర్యానికి పూర్వం వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, తృతీయ రంగాలు దాదాపు సాంప్రదాయ పద్ధతుల్లోనే కొనసాగినట్లుగా చెప్పవచ్చు.

స్వాతంత్ర్యానంతరం వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగం, తృతీయరంగంలలో త్వరితగతిని ఆధునికీకరణ కొనసాగింది. 1966-67 సంవత్సరములో సస్య విప్లవం వ్యవసాయ రంగంలో ఆధునికీకరణకు నాందిగా చెప్పవచ్చు. ఆ తరువాత శ్వేత విప్లవం, నీలి విప్లవం ద్వారా వ్యవసాయ అనుబంధ వృత్తుల్లో కూడా గణనీయమైన మార్పు సంభవించింది. పారిశ్రామిక తీర్మానాల ఫలితంగా పారిశ్రామిక రంగంలోనూ, తృతీయ రంగాలలో కూడా ఆధునికీకరణ కొనసాగింది. వస్తూత్పత్తి గణనీయంగా పెరగటంతో పాటు వస్తు నాణ్యత కూడా గణనీయంగా పెరిగింది. అయితే ఆధునీకరణ క్రమంలో ఏర్పడే ముఖ్యమైన సమస్య నిరుద్యోగ సమస్య.

మార్కెట్‌లో అమలులో ఉన్న వేతనానికి ఇష్టపడి పని చేయాలనుకొనే వారికి పని లభ్యం కాని స్థితిని నిరుద్యోగిత అంటాము. భారతదేశం ఎదుర్కొనే సమస్యల్లో ముఖ్య సమస్య నిరుద్యోగ సమస్య. భారతదేశ నిరుద్యోగ సమస్యకు అనేక కారణాలున్నాయి. అందులో కొన్ని అభివృద్ధితో పాటు ఉద్యోగిత పెరగకపోవటం, జనాభా పెరుగుదల, మూలధన సాంద్ర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించటం లాంటివి ముఖ్యమైనవి. భారతదేశంలో ప్రణాళికా బద్ధమైన కృషిలో భాగంగా 6వ పంచవర్ష ప్రణాళికలో ఉద్యోగితా వ్యూహాన్ని రూపొందించటం జరిగింది. ఈ విధానాన్ని కొనసాగిస్తూ, వివిధ ప్రణాళికల్లో మార్పులను చేస్తూ నిరుద్యోగ నిర్మూలనకు కృషి జరుగుతోంది. భారతదేశంలో నిరుద్యోగ నిర్మూలనా కార్యక్రమాలను కూడా ఈ విధాన క్రమంలో చేపట్టటం జరిగింది. NREP, RLEGP, JRY, JGSY, IRDP, IAY, SGRY మొదలైనవి కొన్ని నిరుద్యోగితా నిర్మూలనా కార్యక్రమాలు. ఈ కార్యక్రమాల ఫలితంగా, ప్రభుత్వం అవలంభించే ఉద్యోగితా విధానం ఫలితంగా నిరుద్యోగితా రేట్లలో మార్పులు సంభవించాయి. అయితే ఈ మార్పులను గమనిస్తే గ్రామీణ నిరుద్యోగిత పెరిగే ధోరణి, పట్టణ నిరుద్యోగిత తగ్గే ధోరణి కన్పిస్తుంది. ఈ మార్పులను బట్టి భారత ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేస్తున్నట్లు చెప్పవచ్చు.

10.14. కఠిన పదాలు

1. సస్య విప్లవం : వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు అంటే నూతన దిగుబడి వంగడాలు, నూతన యంత్ర సామాగ్రి మొదలైనవి వచ్చి ఫలితంగా వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరిగే స్థితిని సస్య విప్లవం అంటారు. భారతదేశంలో మూడో పంచవర్ష ప్రణాళికా కాలంలో ఈ మార్పు సంభవించింది. అదే విధంగా పాల ఉత్పత్తి విధానాల్లో విప్లవాత్మక విధానాలను శ్వేత విప్లవం అని, జల చరాల ఉత్పత్తుల్లో (చేపలు, రొయ్యలు) విప్లవాత్మక మార్పులను నీలి విప్లవం అంటారు.
2. సంపూర్ణోద్యోగిత : మార్కెట్‌లో అమలులో ఉన్న వేతనానికి ఇష్టపడ్డ వారందరికి పని లభ్యమయ్యే స్థితినే సంపూర్ణోద్యోగిత అంటారు
3. ప్రచ్ఛన్న నిరుద్యోగిత : ఉపాంత ఉత్పాదకత లేని ఉద్యోగులను ప్రచ్ఛన్న నిరుద్యోగులు అంటారు.
4. ఆధునికీకరణ : దేశంలో ఏ రంగంలోనైనా గుణాత్మక మార్పులు చోటు చేసుకున్నట్లయితే దానిని ఆధునికీకరణ అంటారు.

10.15. నమూనా ప్రశ్నలు

వ్యాసరూప ప్రశ్నలు

1. ఆధునికీకరణ అనగానేమి ? భారతదేశంలో ఆధునికీకరణ ధోరణులను తెలుపుము
2. నిరుద్యోగితలో రకాలను తెలుపుము ? భారతదేశంలో నిరుద్యోగితా స్వభావాలలో మార్పులను తెలుపుము ?
3. భారతదేశంలో నిరుద్యోగ సమస్యకు కారణాలను తెలిపి, ప్రభుత్వం చేపట్టిన నిరుద్యోగ నిర్మూలన కార్యక్రమాలను తెలుపుము.

సంక్షిప్త వ్యాసరూప ప్రశ్నలు

4. ఆధునికీకరణ అనగానేమి ? ఆధునికీకరణ ఫలితాలను వ్రాయుము ?
5. ఆధునికీకరణ - నిరుద్యోగం
6. భారతదేశ ఉద్యోగితా విధానాన్ని వివరించుము

సంక్షిప్త ప్రశ్నలు

7. భారతదేశంలో నిరుద్యోగిత అంచనా భావనలు
8. భారతదేశంలో పట్టణ, గ్రామీణ నిరుద్యోగిత రేట్లు
9. బ్రిటీషు పాలనలో ఆధునికీకరణ

10.16. చదువదగిన గ్రంథాలు

1.	Ruddar Dutt & K.P.M. Sundaram	:	Indian Economy
2.	S.K. Misra & V.K. Puri	:	Indian Economy
3.	I.C. Dhingra,	:	Indian Economy
4.	S. Sankaran	:	Economic Development of India

ప్రొఫెసర్ యం.వి.ఎన్. శర్మ

పాఠం - 11

భారతదేశ ప్రణాళికలు - ప్రణాళికా వ్యూహం

లక్ష్యం

ఈ పాఠ్యభాగాన్ని చదువుట ద్వారా క్రింది అంశాలను తెలుసుకోగలము.

- ప్రణాళిక అర్థ వివరణ
- ప్రణాళికల లక్ష్యాలు
- ప్రణాళికల వ్యూహాలు
- ప్రణాళికల ద్వారా సాధించిన ప్రగతి
- ప్రణాళికా వైఫల్యాలు మొ॥వి వివరంగా తెలుసుకోవచ్చు.

ముఖ్యాంశాలు :

11.1 పరిచయము

11.2 ప్రణాళిక - అర్థ వివరణ

11.3 ప్రణాళిక ఆవశ్యకత - లక్ష్యాలు.

11.4 వివిధ పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలు.

11.5 భారతదేశ ప్రణాళికలు - అభివృద్ధి వ్యూహం.

11.6 ప్రణాళికల ద్వారా సాధించిన ప్రగతి

11.7 ప్రణాళికల వ్యూహం - వైఫల్యాలు.

11.8 ముగింపు

11.9 ముఖ్యపదాలు

11.10 స్వయం పమీక్ష ప్రశ్నలు

11.11 చదువవలసిన పుస్తకాలు.

11.1 పరిచయము

బ్రిటిష్ పాలనలో మనదేశం అన్ని విధాలా దోపిడికి గురైయిందని చెప్పవచ్చు. సుమారుగా 200 సంవత్సరాలు పైగా దేశాన్ని బ్రిటీష్ వారు పాలించినప్పటికీ దేశాభివృద్ధికి వారు చేసిన కృషి అంతగాలేదు. వలసపాలనా విధానం, ముడి సరకులు ఎగుమతులు చేసే దేశంగా మలచింది. స్వతంత్రం పొందాక దేశ విభజన ప్రభావం నుండి, వెనుకబడిన ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించుటకు మన ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేస్తుంది. స్వాతంత్ర్యానికి ముందే మన నాయకులు దేశార్థికశాఖ వృద్ధికోసం తహతహలాడుతున్న విషయం అందరూ ఎరిగినదే. పరాయి పాలనలో చేయలేని అభివృద్ధికి గల కృషిని అనంతరం దేశ సమగ్ర ఆర్థికాభివృద్ధికై సాంఘిక, ఆర్థిక వ్యూహాలను రూపొందించి వాటి సాధనకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ దిశలో ఆర్థిక ప్రణాళికలు ద్వారా మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గంగా భావించారు. దేశీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికా లక్ష్యాలను నిర్ణయించుకోవడం జరిగింది. మన ప్రణాళికా సంఘం అభిప్రాయం ప్రకారం భారతదేశంలోని పంచవర్ష ప్రణాళికల ప్రధాన లక్ష్యాలను వృద్ధి, ఆధునీకరణ, స్వయం పోషకత్వం, సాంఘిక న్యాయం మొదలయిన అంశాలుగా విభజించవచ్చు. ఈ లక్ష్యాలు నెరవేర్చుకోనుటకు ప్రయత్నాలు

నిరంతరం కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ సందర్భంలో మనదేశం పంచవర్ష ప్రణాళికల ప్రధాన లక్ష్యాలు గురించి వివరంగా తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

11.2 ప్రణాళికా అర్థవివరణ:- ప్రతిదేశంలోనూ ఏదో ఒక విధమైన ఆర్థిక ప్రణాళిక ఉంది. అందువల్ల ప్రణాళికా యుగంగా ప్రస్తుత కాలాన్ని పేర్కొంటారు. ప్రణాళిక, ఆర్థిక ప్రణాళిక గురించి తెలుసుకుందాం.

ప్రణాళికా ఆర్థాన్ని వివరించిన వారిలో ఆచార్య డికెన్‌సన్ ప్రముఖులు. ఈయన ప్రకారం మనము చేరదలచుకున్న పరిస్థితికి మధ్య ఉండే అంతరమునకు ఒకవంతెన కట్టుట ప్రణాళికగా చెప్పవచ్చును. జాగ్రత్తగా ముందుగా ఆలోచించి నిర్ణయించిన లక్ష్యములను ఒక నిర్ణీత కాలవ్యవధిలో సాధించుటకు, ఆర్థిక కలాపాలను ఆలోచించి, ప్రవేశపెట్టి వాటిని ప్రభుత్వము నియంత్రణ చేయుట ప్రణాళిక.

11.3 ప్రణాళికల ఆవశ్యకత - లక్ష్యాలు:- ప్రణాళికా అనునది నూతన విషయం కాదు. ప్రభుత్వ జోక్యము కలిగిన ఆర్థిక వ్యవస్థలో ప్రణాళిక సాధారణ అంశము. అభివృద్ధి చెందిన మరియు చెందుతున్న దేశాల్లో ప్రణాళికాయుక్త అభివృద్ధి ఉంటున్నది. ప్రణాళికలకు సంబంధించి స్పష్టమయిన సమగ్రమయిన ప్రణాళికలను రష్యా దేశము అవలంభించినది. తద్వారా ఆదేశం ఆర్థికాభివృద్ధి వేగవంతమయింది. ప్రణాళికాబద్ధమయిన విధానాలు వల్ల రష్యాలో ఆర్థికామాంద్యం (1929-32) ప్రభావాలు లేవని చెప్పవచ్చు. కాబట్టి కొన్ని ఆర్థిక - సాంఘిక లక్ష్యములను సాధించుటకు ప్రణాళిక ఇంచుమించు అన్ని దేశాలకు అవసరం. "ఏ వస్తువులు ఎంత పరిమాణంలో ఉత్పత్తి చేయవలె, ఏ విధంగా ఎప్పుడు ఎక్కడ ఉత్పత్తి చేయాలి, ఎవరికి, ఎలా కేటాయించాలి" అని ప్రధానమయిన నిర్ణయాలను, ఆర్థిక వ్యవస్థను సంపూర్ణముగా సర్వే చేసిన తరువాత ఒక నిర్ణీతమయిన అధికార సంస్థ ఉద్దేశపూర్వకంగా తీసుకునే నిశ్చయాలను ప్రణాళిక రచన"గా పేర్కొనడం జరిగింది. కొన్ని ప్రభుత్వ సంస్థలు ఉద్దేశ పూర్వకంగాను, సుదీర్ఘ ఆలోచన తరువాత ఆర్థిక ప్రాథాన్యతలను ఎంపిక చేసుకోవడం ప్రణాళికా రచనగా శ్రీమతి బార్బరా ఊటన్ నిర్వచించారు. అయిన మన ప్రణాళికా సంఘం వాస్తవిక, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికకు మరో విధంగా నిర్వచనం ఇచ్చారు. దేశీయంగా, అంతర్జాతీయంగా (ఇటీవల కాలంలో అంతర్జాతీయ వనరులను పరిగణలోకి తీసుకున్నారు) లభ్యమవుతున్న వనరులను ఎంత సామర్థ్యంతో వీలయితే అంతే సామర్థ్యంతోనూ ఉపయోగించి కొన్ని స్పష్టమయిన లక్ష్యాలను సాధించాలని ఉద్దేశ పూర్వకంగా జాగ్రత్తగా ఆలోచించిన తరువాత ప్రభుత్వం తీసుకునే చొరవను ప్రణాళికగా నిర్వచించింది. ఈ విధంగా ప్రణాళిక వివరణలో అనేక నిర్వచనాలున్నాయి. మనము ప్రస్తుతముండే పరిస్థితికి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ముఖ్యంగా మనదేశంలో వనరులు పుష్కలంగా లభిస్తాయి. అనేక కారణాలువల్ల అనగా నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, నిరక్షరాస్యత, మూలధనం కొరత మొదలయిన కారణాలు వల్ల వనరులను వినియోగించుటలో దుబారా ఎక్కువగా ఉంటుంది. వ్యాపార చక్రాల ప్రభావం ఆర్థిక వ్యవస్థపై ఉంటుంది. దేశంలో వివిధ అంశాల యందు ముఖ్యంగా వస్తు సప్లయి విషయంలో కృత్రిమ కొరతను సృష్టిస్తారు. మరోవైపు పేదరికం నిరుద్యోగం, ఆర్థిక కేంద్రీకరణ, సాంఘిక దురాచారాలు మొ॥ దేశాన్ని ఆర్థికంగా ఆటంక పరుస్తున్నాయి. అందువల్ల ఆర్థిక కర్యాకలాపాలు పూర్తిస్థాయిలో సమర్థవంతంగా అమలుపరుచుటకు ప్రణాళికా బద్ధమయిన చర్యలు అవసరం ఎంతైనా ఉంది. ఆర్థిక చరిత్ర పరిశీలించిన యెడల అభివృద్ధి చెందిన అన్ని దేశాలు ప్రణాళిక పాటించాయి. అయితే వాటి లక్షములలో కొంత తేడా ఉండవచ్చు. మన ప్రణాళికా లక్ష్యాలు క్లుప్తంగా క్రింద వివరించడమయినది.

1. ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా ఉన్న పేదరిక విషవలయాలను క్షేదించుట :- వెనుకబడిన దేశాల్లో పేదరికం ఒక ప్రధాన అంశంగా గోచరిస్తుంది. పేదరికం, పేదరికానికి కారణమవుతుందని ఆర్థికవేత్తలు ప్రవచించారు. పేదరికం వల్ల నిరుద్యోగం, తద్వారా తిరోగమన పెట్టుబడులు, తక్కువ జాతీయాదాయానికి కారణాలవుతారు. ప్రణాళికా బద్ధమయిన ఆర్థికాభివృద్ధి ద్వారా పేదరిక విషవలయాలను అధిగమించుట అవకాశం ఉంది.

2. వివిధ రంగాలలో పెరుగుదల రేటుమ కొనసాగించుటకు:- ప్రణాళికల ముఖ్య ఉద్దేశ్యం జాతీయాదాయం మరియు తలసరి ఆదాయాన్ని వృద్ధి చేయుట. ఉత్పత్తిలో పెరుగుదలను కొనసాగించి తద్వారా ఆదాయాన్ని వృద్ధి చేయాలి. దానితో పాటుగా జనాభా పెరుగుదల రేటు కంటె ఈ ఆదాయ పెరుగుదల రేటు ఎక్కువగా ఉండాలి. ఉత్పత్తిలో భారీ పెరుగుదల కొరకు వ్యవసాయ రంగాల్ని

అభివృద్ధివరచి ఉత్పాదకతను పెంచాలి. నీటిపారుదల, ఎరువులు అభివృద్ధి చెందిన మార్కెటింగ్ సదుపాయాలు మొదలయినవి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడతాయి. పారిశ్రామిక రంగాన్ని మరింతగా అభివృద్ధిని చేగిరపరచవలసి ఉంటుంది. ప్రభుత్వరంగంలో పెట్టుబడులు పెంచుతూ ప్రయివేటురంగాన్ని వృద్ధిచేయుటకు మార్గదర్శకంగా ఉంటూ వాటికి సహాయం అందించాలి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆయారంగాలను అభివృద్ధి పరచుట ప్రణాళికల ఉద్దేశ్యం.

3. స్వయం పోషకత్వాన్ని సాధించుట :- దేశ ఆర్థిక వ్యవస్థ స్వావలంబన , స్వయం పోషకత్వం సాధించుటకు అవసరమయిన చర్యలు తీసుకోబడతాయి. విదేశాలపై ఆధారపడుటను క్రమేపీ తగ్గించి, దిగుమతులు కూడా సాధ్యమయినంతగా ముఖ్యం. ఆహార ధాన్యాల దిగుమతులను తగ్గించి దేశీయంగా వాటి ఉత్పత్తులను పెంచుటకు, ప్రాథమికమయిన పరిశ్రమలను స్థాపించి తద్వారా స్వయం పోషకత్వాన్ని పొందుట కూడా ప్రణాళికల ఉద్దేశ్యం.

4. సాంఘిక న్యాయం :- సమాజంలో గల అట్టడగు వర్గాలకు బలహీన వర్గాలకు సాంఘిక న్యాయాన్ని సమకూర్చుటం అంటే ఆదాయ, పంపిణి అసమానతలను తొలగించడం పేదరికాన్ని నిర్మూలించడం మొదలయిన అంశాలు నెరవేర్చుట ద్వారా సాంఘిక సమానత్వాన్ని సాధించు ధ్యేయం. సాంఘిక న్యాయాన్ని అందించుటకు గాను ఆదాయ, పంపిణీలోని అసమానతలు నివారించవలసి ఉంటుంది. ఆర్థిక కేంద్రీకరణ నివారించి అందరికి సమానమయిన ఆర్థిక స్థామతను కల్పించుట ప్రణాళికా ధ్యేయంగా భావించారు. సామ్యవాదరీతి సమాజాన్ని స్థాపించుటకు ప్రభుత్వ లక్ష్యంగా భావించి ప్రజల జీవనప్రమాణ స్థాయిని పెంచుటకు చర్యలు తీసుకోబడతాయి. పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు చేపట్టి తద్వారా సాంఘిక న్యాయాన్ని సమకూర్చి ఆర్థిక కేంద్రీకరణను నివారించు చర్యలు ప్రణాళికలో భాగం.

5. పేదరిక నివారణ నిర్మూలనా చర్యలు చేపట్టుట :- దేశంలో ఇప్పటికీ సుమారుగా 28 నుండి 38 వరకు ప్రజలు పేదరిక రేఖ దిగువన జీవనాన్ని సాగిస్తున్నారు. పేరదిక నిర్మూలన లేకుంటే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదు. అందువల్ల ప్రణాళికా కాలంలో పేదరిక నిర్మూలనకు వివిధ పథకాలు ప్రవేశపెట్టి పేదరికంపై అలుపులేని పోరాటం సాగించుట జరుగుతుంది.

6. ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుట :- అభివృద్ధి చెందుతున్న మనదేశాన్ని పట్టిపీడిస్తున్న దీర్ఘకాల సమస్యలలో అత్యంత ప్రధానమయినది నిరుద్యోగం. దేశంలో తీవ్రమయిన ప్రచ్ఛన్న నిరుద్యోగిత, అల్ప నిరుద్యోగిత ఉంది. కాబట్టి నిరుద్యోగాన్ని అల్ప ఉద్యోగితను, ప్రచ్ఛన్న నిరుద్యోగితను నిర్మూలించవలసిన అవసరం ఎంతైనా ఉంది. పరిశ్రమలను స్థాపించి వ్యవసాయ రంగంతో పాటు అభివృద్ధి పరచి ఉద్యోగవకాశాలు పెంచుట ప్రణాళికల ఉద్దేశ్యము.

7. ప్రధాన అవరోధాలను అధిగమించు చర్యలు :- మన ఆర్థిక వ్యవస్థ వివిధ రకాలయిన అవరోధాలను ఎదుర్కొనుచున్నది. వ్యవసాయరంగం వెనుకబడి ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయం కొనసాగినా వ్యవసాయపరంగా కూడా ప్రాంతీయ అసమానతలకు దారితీసింది. అలాగే తయారీ రంగం సామర్థ్యం తక్కువగా ఉంది. మనదేశ ఎగుమతుల్లో ఎక్కువ భాగం తయారీ రంగం నుండే ఉన్నప్పటికీ వాటి సామర్థ్యాన్ని పెంపొందించుకోలేకపోయాయి. విదేశీ చెల్లింపులలో లోటును నివారించలేకపోతున్నాము. మనదేశంలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు పరస్పర పూరకాలు. ఒక దానిమీద మరొకటి ఆధారపడి ఉంది. మన ప్రాథమిక వస్తువులను ఎగుమతి చేసినా అభివృద్ధి కవసరమయిన, దిగుమతులకు అవసరమయ్యే విదేశీ మారకాన్ని సమకూర్చుకోవడంలో చెల్లింపులలో లోటును భర్తీ చేయలేక పోయింది. పారిశ్రామిక రంగాన్ని వేగవంతం చేయుట ద్వారా ఎగుమతుల ప్రోత్సాహం కట్టించాలని ప్రణాళికలలో మరో అంశంగా భావిస్తున్నారు.

8. ఆధునీకరణ :

దేశ ఆర్థికాభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిని భారతీయ ప్రణాళికావేత్తలు ఆదినుండి గుర్తించారు. శాస్త్రాభివృద్ధిని, సాంకేతికప్రగతి ఉత్పత్తిని పెంచి ఆర్థికాభివృద్ధి రేటును వేగిరపరుస్తుంది. స్వాతంత్ర్యం పొందినపుడు మనం సాంకేతికంగా వెనకబడి

ఉన్నాం. ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికా కాలంలో పరిశోధనా రంగం అభివృద్ధి చేయాలని సంకల్పించారు. కాలానుగుణంగా మారుచున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కొత్త ఉత్పత్తి సంబంధాలను కొత్త నైపుణ్యాలను, నూతన సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి అయా రంగాల్లో మేళవించాలని భావించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచటం, వ్యవస్థాపరమైన, నిర్మాణాత్మక మార్పులను ఆర్థిక వ్యవస్థలో తీసుకురావాలి. తద్వారా వేగవంతమయిన అభివృద్ధిని సాధించాలని ప్రణాళికలో పేర్కొన్నారు.

సాంఘిక ఆర్థిక, వ్యవస్థాపన మూలధన కల్పన కూడా మరో అంశం. రవాణా, కమ్యునికేషన్లు, శక్తి, విద్యా, ఆరోగ్యము మొదలగు ఆర్థిక సాంఘిక వ్యవస్థాపనా మూలధనము కల్పించితేగాని అభివృద్ధి సాధ్యంకాదు. ప్రయివేటు రంగం వీటిలో పెట్టుబడి పెట్టుటకు ముందుకురావు. అందువల్ల వీటికి ప్రభుత్వమే కల్పించాలి. అల్పాభివృద్ధి దేశాల్లో ఇవి మరింతగా తక్కువగాను కొరతతో నిండి ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం పెట్టుబడి పెట్టి ప్రణాళికా యుక్తంగా అభివృద్ధి పరచాలి. వాటితోపాటుగా శీఘ్ర అభివృద్ధి సాధించుటకు వ్యవసాయము మరియు పారిశ్రామిక రంగముల సంతులిత వృద్ధి సాధించాలి. సంతులిత వృద్ధి సాధించుటకు ప్రణాళిక అవసరము.

ఆర్థికాభివృద్ధి సాధించవలెనన్న మూలధన మార్కెట్టు అభివృద్ధి చెందాలి. విత్త సంస్థలు, బ్యాంకింగ్ వంటివి వృద్ధి చెందాలి. ఆర్థిక స్థిరత్వం సాధించుటకు ఆర్థికాభివృద్ధిలో సంభవించు అసమతూకములను నివారించుటకు. డిమాండ్లు సప్లయిల మధ్య సమతూకమును సాధించుటకు ప్రణాళిక అవసరం. ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ద్రవ్యోల్బణం. ప్రతిద్రవ్యోల్బణం పరిస్థితులను, ఒత్తిడిలను నివారించవలసి ఉంటుంది. దేశీయంగా మూలధనం అభివృద్ధికి మూలధన సంచయనం పెరుగుదల అవసరం. పొదుపు మరియు పెట్టుబడులు పెరగాలి. అభివృద్ధి చెందుతున్న దేశం కావడం వల్ల ఇవి తక్కువగా ఉన్నాయి. వీటిని పెంచుటకు మరియు పెట్టుబడిని అత్యుత్తమ మార్గాలకు తరలించుటకు ప్రణాళికాబద్ధమైన పరిస్థితులు అవసరం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో దోహదం చేయలేకపోతున్నది. సత్వర లాభములు నిచ్చే వాణిజ్య రంగములకు మాత్రమే వారి పెట్టుబడి పరిమితమయింది. పారిశ్రామికీకరణకు కీలక మరియు మౌళిక పరిశ్రమలలో పెట్టుబడి పెట్టుటకు ముందుకు రాలేదు. కాబట్టి సరైన ఉద్యమిత్వం రూపొందుటకు ప్రణాళిక అవసరము. ప్రభుత్వ పెట్టుబడుల వలన సంభవించి ఆర్థికాభివృద్ధి ప్రయివేటు ఉద్యమిత్వమును ప్రోత్సహిస్తుంది. దానికి అవసరమయిన వనరుల సేకరణకు ప్రణాళిక అవసరము.

అల్పాభివృద్ధి దేశాలలో మార్కెటు యంత్రాంగం పటిష్ఠంగా పనిచేయదు. ఆర్థిక వ్యవస్థలలో చాలా భాగము ద్రవ్యేతర రంగముగ ఉంటుంది. ఉత్పత్తి, ఉత్పాదక, ద్రవ్య మరియు మూలధన మార్కెట్లు అసంఘటితమయినవిగా ఉంటాయి. అందుచేత ధరల యంత్రాంగం సమిష్టి డిమాండ్ మరియు సప్లయిలను సమానం చేయలేదు. మార్కెటు అసంపూర్ణతలను తొలగించుటకు, వనరులను అభిలాషణీయ మార్గములలో తరలించుటకు, ధరల యంత్రాంగం సార్థకమయినదిగా చేయుటకు ప్రణాళికా అవసరం.

అధిక రేటులో పెరుగుచున్న జనాభా అల్పాభివృద్ధి దేశములకు ఒక లక్షణము. అధిక జనాభా పెరుగుదల రేటు ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా ఉంటుంది. కాబట్టి జనాభా నియంత్రణకు ప్రణాళిక అవసరం.

పైన వివరించిన కారణముల వలన అభివృద్ధి చెందుతున్న లేదా అల్పాభివృద్ధి దేశాల్లో ప్రణాళికలకు ప్రత్యేక ఆవశ్యకత ఉంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక స్థిరత్వము సాధించుట ప్రధాన సమస్య అయితే అల్పాభివృద్ధి దేశములకు సత్వర ఆర్థికాభివృద్ధి సాధించుట ప్రధాన సమస్య ఈ ఆశయాలు ప్రణాళిక లేకుండా సాధ్యంకాదు. ఆర్థిక కార్యకలాపాలు పూర్తిగా ప్రయివేటు రంగ వ్యక్తులకు, మార్కెటు యంత్రాంగమునకు వదిలి వేసిన యడల ఈ లక్ష్యములను సాధించుటకు అడ్డంకులు ఏర్పడవచ్చు. కాబట్టి ప్రతి దేశములలో కూడా ఆయా దేశములలో నెలకొనియున్న ఆర్థిక, సాంఘిక పరిస్థితులను బట్టి ఏదో రూపంగో ప్రణాళిక అవసరముంటుంది. ఆర్థిక చరిత్ర పరిశీలించిన యడల అభివృద్ధి చెందిన అన్ని దేశాలు ప్రణాళిక పాటించాయి. అందువల్ల సత్వర అభివృద్ధికి పై అంశాలు ప్రధానమయిన ఉద్దేశాలుగా చెప్పబడుచున్నవి. అయితే ప్రతి ప్రణాళికా కాలంలో కొన్ని ప్రత్యేకమయిన లక్ష్యాలను నిర్దేశించుకొని కొనసాగించడం జరుగుచున్నది. ఇప్పటివరకు 9 ప్రణాళికలు పూర్తికాగా 10 వ పంచవర్ష ప్రణాళిక కొనసాగుచున్నది. గడిచిన ప్రణాళికలయందు గల లక్ష్యాలను క్లుప్తంగా తెలుసుకుందాం.

11.4. వివిధ పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలు

11.4.1 మొదటి పంచవర్ష ప్రణాళిక (1951 - 56) :- మొదటి పంచవర్ష ప్రణాళిక కాలం 1951-56 రెండవ ప్రపంచ యుద్ధయు దేశ విభజన, మన ఆర్థికవ్యవస్థను చిన్నాభిన్నం చేసాయి. ఆహార కొరత తీవ్రముగా ఉండేది, ద్రవ్యోల్బణం ఉధృతంగా ఉండేది. రెండవ ప్రపంచ యుద్ధం, దేశ విభజన వలన ఉత్పన్నమయిన సమస్యలను పరిష్కరించడం మొదటి ప్రణాళిక ప్రధాన లక్ష్యము. దీనితో పాటు జాతీయాదాయాన్ని, ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచడం రెండవ లక్ష్యం; యుద్ధము వలన దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను ఆర్థిక పునరావాసాన్ని కల్పించడం ఆహారధాన్యాలు, జనుము, ప్రత్తి పంట పారిశ్రామిక ముడి పదార్థాల కొరతను తొలగించడం, ద్రవ్యాల్బణాన్ని అరికట్టడం, రైల్వే, రోడ్డు, రవాణా సౌకర్యాలు విద్యుచ్ఛక్తి, నీటిపారుదల మొదలగు ఆర్థిక సాంఘిక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టుట, సామాజిక న్యాయాన్ని కల్గజేయుట, ప్రాంతీయ సమాజాభివృద్ధి సాధించుట, ఆర్థికాభివృద్ధి కార్యక్రమములను అమలుపరుచుటకు కావలసిన పటిష్ఠమయిన పరిపాలనా యంత్రాంగాన్ని నెలకొల్పుట మొదలయిన లక్ష్యాలతో ప్రణాళికను ప్రారంభించారు.

11.4.2 రెండవ ప్రణాళిక (1956-61):- రెండవ పంచవర్ష ప్రణాళిక కాలం 1956-1961. మొదటి పంచవర్ష ప్రణాళిక మన ఆర్థిక వ్యవస్థకు పటిష్ఠమైన పునాది వేసింది. రెండవ ప్రణాళికను రూపొందించారు. సామ్యవాదరీతి సమాజ స్థాపన ధ్యేయంగా 1956 పారిశ్రామిక తీర్మానం రూపకల్పన, జాతీయాదాయంలో 25 శాతం వృద్ధి, పారిశ్రామికీకరణను వేగవంతం చేయుట, ఉద్యోగవకాశాలను విస్తృత పరచుట, ఆదాయ అసమానతలు తగ్గించుట ఈ ప్రణాళిక ముఖ్య లక్ష్యాలు.

11.4.3 మూడవ ప్రణాళిక (1961-66):- 1961 నుండి 1966 వరకు మూడవ పంచవర్ష ప్రణాళిక కొనసాగింది. ఆర్థిక వ్యవస్థను స్వావలంబనమైనదిగాను స్వయం పోషకమయినదిగాను చేయడం, రానున్న 10-15 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత లక్ష్యాలను నిర్ణయించడం అనగా దీర్ఘకాలిక దృక్పథంతో ప్రస్తుత ప్రణాళికను తయారుచేయుట, సంమటితమున పారిశ్రామిక వ్యవస్థ నిర్మాణం, ఉత్పాదక శక్తిని అన్నిరంగాల్లోనూ పెంచడం, స్థానిక వనరులను గరిష్ట స్థాయిలో వినియోగించుట ఉద్యోగావకాశాలను పెంచుట, మానవ శక్తిని పూర్తిగా వినియోగించుకొని ప్రజల ఆదాయ సంపదలలో వ్యత్యాసాలు తగ్గించి ఆర్థిక వికేంద్రీకరణ కల్పించడం వంటి అంశాలను పరిధిలోకి తీసుకున్నారు.

11.4.4 వాలుగవ ప్రణాళిక :- మూడవ ప్రణాళిక ముగియగానే 4వ ప్రణాళిక ప్రారంభం కావాలి. కాని పరిస్థితుల ప్రభావం వల్ల 1966-69 మధ్యకాలంలో 3 వార్షిక ప్రణాళికలను రూపొందించారు. 1969-74 లో నాల్గ ప్రణాళికలను ప్రవేశ పెట్టారు. అల్పాదాయం, నిరుద్యోగ సమస్య, ఆర్థిక స్థామత కేంద్రకరణలో చెప్పుకోదగిన ఫలితాలు పొందలేక పోవడం వల్ల ఈ ప్రణాళికలో చర్యలు తీసుకున్నారు. జాతీయాదాయం సాలీనా 5 1/2 శాతం పెంచడం, ఆర్థిక స్థిరత్వం సాధించడం, స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించుటకు ధరలను స్థిరీకరించడం ఆర్థిక వ్యవస్థలో స్వావలంబనను స్వయం సమృద్ధిని సాధించుట ఉద్యోగవకాశాలు విశేషంగా పెంచుట, ప్రాంతీయ ఆసమానతల నివారణ, పరిశ్రమలను ప్రభుత్వరంగంలో విస్తరింపజేసి వాటి లాభాలను పెంచుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

11.4.5 అయిదవ పంచవర్ష ప్రణాళిక :- వాస్తవిక అభివృద్ధి ఆశించిన రీతిలో 4వ ప్రణాళికా కాలంలో లేదని తేలడంతో 5వ ప్రణాళికను పేదరిక నిర్మూలన ధ్యేయంతో గరీబీహటావో నినాదంతో రూపొందించారు. స్థూలజాతీయోత్పత్తిని 5.5 శాతం వార్షిక వృద్ధిని సాధించడం, ఉత్పాదక ఉద్యోగవకాశాలను పెంచడం, ప్రజలకు కనీస అవసరాలయిన విద్య, మంచినీటి సదుపాయాలు, గ్రామీణ ఆరోగ్యం, భూమిలేని కూలీలకు ఇండ్ల స్థలాలు, గ్రామీణ రోడ్లు, విద్యుత్, రవాణా, మురికివాడల నిర్మూలన, సాంఘిక సంక్షేమం, వ్యవసాయం, మౌళిక కీలక పరిశ్రమలు, వినియోగవస్తుఉత్పత్తి పెంపుదలకు ప్రజా పంపిణి వ్యవస్థను మెరుగు పరుచుట, ఎగుమతుల అభివృద్ధికి, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణకు తీవ్రకృషి చేయడం, అనవసర వినియోగ వ్యయాన్ని తగ్గించుట, ధరలు-వేతనాలు-ఆదాయాలు వీటిమధ్య న్యాయమైన సమతూకాన్ని సాధించుట, సాంఘిక ఆర్థిక ప్రాంతీయ అసమానతలు తగ్గించుటకు వ్యవస్థాపూర్వక మరియు ఇతర విధానాలను ఆవలంభించుట మొ॥వి 1974-79 మధ్యకాలంలో గల 5వ పంచవర్ష ప్రణాళిక ధ్యేయాలు.

11.4.6 ఆరవ ప్రణాళిక (1980-1985) :- జాతీయాదాయం పెరుగుదల సంవత్సరానికి 5.2 శాతం తలసరి ఆదాయం సంవత్సరానికి 3.3 శాతం పెరుగుదల, ఆర్థిక సాంకేతిక రంగంలో స్వయం సమృద్ధి సాధించుట, పేదరికాన్ని, నిరుద్యోగాన్ని తగ్గించుట, దేశీయ పొదుపును పెంచుట సమర్థవంతంగా పొదుపు వనరులను ఉపయోగించుట, ప్రాంతీయ అసమానతలను తగ్గించుట ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించుట ఆరవ పంచవర్ష ప్రణాళికల ముఖ్యాంశాలు.

11.4.7 ఏడవ ప్రణాళిక - ధ్యేయము (1985-90) :- ఈ ప్రణాళిక లక్ష్యాలు క్రింది విధంగా ఉన్నాయి. గరిష్ట స్థాయిలో ఉత్పాదకత కలిగిన ఉపాధి కల్పన, ఆహారధాన్యాలలో స్వయం సమృద్ధి సాధించుట వాటి వినిమయ స్థాయి పెంచుట, అవస్థాపనలో ఇబ్బందులు, కొరతను నివారించుట; మొత్తం ఆర్థికరంగంలో సామర్థ్య వినియోగం, ఉత్పాతకను మెరుగుపరచుటతో పాటుగా, పేదరిక నిర్మూలన, వర్గాల మధ్య పట్టణ ప్రాంతాల మధ్య అంతరాలు తగ్గించుట, సాంఘికంగాను ముఖ్యంగా విద్య ఆరోగ్యం పోషకాహారం, పారిశుద్ధ్యం, గృహనిర్మాణం రంగాలలో వినిమయస్థాయి పెంచుట, ఎగుమతులను పెంచి దిగుమతులను ప్రత్నామ్నాయాలు సమకూర్చుటం ద్వార్ా స్వాలలంభనను సాధించుట, ఉత్పత్తి, ఇంధన వనరులను పొదుపు చేయుట, వాతావరణ పరిసర పారిశుద్ధ్య పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు పూర్తిగా పాల్గొనునట్లు చేయుటకు ప్రణాళిక రచనను వికేంద్రికరణ, అభివృద్ధి ప్రణాళికా రచనలో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం అనుసరించుట మొదలైనవి.

11.4.8 ఎనిమిదవ ప్రణాళిక (1992-97) ధ్యేయాలు :- దేశ రాజకీయ వ్యవస్థలో ఏర్పడిన మార్పులు ఫలితంగా 1989 సెప్టెంబరు నెలలో తయారు చేసిన ప్రణాళికను 1990 లో జూన్‌లో జాతీయ అభివృద్ధి మండలి ఆమోదం పొందింది. అయినప్పటికీ రాజకీయ సంక్షోబాలు వల్ల 1992 నుండి ఈ ప్రణాళికను అమలులో ఉంటున్నట్లు ప్రకటించారు. ఈ ప్రణాళిక ప్రారంభం నాటికి పూర్వం గల రెండు సంవత్సరాలలో దేశ విత్త పరిస్థతులు నానాటికి తారతమ్యం పెరిగిపోయింది. హఠాత్తుగా విదేశీ మారక నిల్వలు తగ్గిపోయాయి. దీనివల్ల దిగుమతులు తగ్గించి వేయడం, మరోవైపు ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, పరిశ్రమలో మాంద్య పరిస్థితులు మొ॥కారణాలు కారణంగా 1991-92 లో 2.5 శాతం వృద్ధిరేటు పడిపోయింది. ఈ పరిస్థితిల్లో ఈ ప్రణాళిక లక్ష్యాలు నిర్దేశించడంలో నూతనత్వం కనిపించింది. ఈ శతాబ్దానికి సంపూర్ణ లేదా దాదాపు సంపూర్ణ ఉద్యోగిత సాధించడం. ప్రజలు పాల్గొనుటకు అవకాశం కల్పించే పధకాలు మరియు ప్రోత్సాహాలు అందించడం, జనాభా క్రమబద్ధీకరణ చేయడం, ప్రాథమిక విద్య సార్వత్రిక విద్యగా మార్పుచేయడం, త్రాగునీరు, ప్రాథమిక ఆరోగ్యసౌకర్యాలు కల్పించడం, వెట్టిచాకిరి, పాకీ వృత్తిని పూర్తిగా తొలగించడం, వ్యవసాయ రంగం వృద్ధి ద్వారా స్వయం సంపూర్ణతను సాధించి ఎగుమతులకు అవసరమయిన మిగుళ్ళు కల్పించగల స్థితికి తేవడం, వృద్ధి ప్రక్రియ స్థిరత్వంతో కొనసాగడానికి అవసరమయిన ప్రాథమిక అవసరాలయిన శక్తి, రవాణా కమ్యూనికేషనులు, నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం, ఈ ప్రణాళికలో ముఖ్యలక్ష్యాలు.

11.4.9 తొమ్మిదవ ప్రణాళికా (1999-2002):- నూతన ఆర్థిక సంస్కరణలు, పారిశ్రామిక తీర్మానాలలో సంస్కరణ ప్రభావాలు మధ్య ఈ ప్రణాళిక యొక్క లక్ష్యాలు చాలా వరకు సామాజిక శ్రేయస్సుకు సంబంధించినవిగా ఉన్నాయి. ఈ ప్రణాళికా లక్ష్యాలు:-

వ్యవసాయరంగానికి ప్రాధాన్యతను ఇస్తూ, గ్రామీణాభివృద్ధి సాధించుటకు ఉత్పాదక ఉద్యోగితను పెంచి పేదరిక నిర్మూలన చేయుట, స్థిరమయిన ధరల విధానంలో వేగవంతమయిన ఆర్థిక వృద్ధిని సాధించడం, అందరికి ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారికి పౌష్టిక ఆహారాన్ని అందించడం, కనీస అవసరాలయిన రక్షిత మంచినీరు, విద్య, సార్వత్రిక విద్య, వసతి సౌకర్యాలు కల్పన, జనాభా పెరుగుదల నియంత్రణ, ప్రజలు భాగస్వామ్యంలో స్వయం సంమృద్ధిని సాధించుట ప్రయత్నాలు, సాంఘికంగా ప్రయోజనాలను పొందలేని స్త్రీలకు, షెడ్యూల్ కులాలకు మరియు తెగలకు, వెనుకబడిన వర్గాల వారికి , మైనారిటీలను బలవత్తరం చేయుట, పంచాయితీరాజ్, స్వయం శక్తి సంఘాలు ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి అభివృద్ధిని కొనసాగించుట, స్వయం స్వావలంబన మొదలయినవి ఈప్రణాళికలో గల ముఖ్యాంశాలు.

11.4.10. పదవ ప్రణాళిక:- ఈప్రణాళిక 2002-07 కాలానికి సంబంధించినది. ఈ ప్రణాళికలో లక్ష్యాలు క్రింది విధంగా ఉన్నాయి.

వార్షిక వృద్ధిరేటు సగటున 80 శాతం ఉండేలా చర్యలు, తలసరి ఆదాయం వార్షికంగా 6.4 శాతం ఉంటుందని అంచనా. జనాభా వృద్ధిరేటు 1.6 శాతానికి తగ్గుదల, సమృద్ధిగా వినియోగ వస్తువులు ఆహార ఉత్పత్తులు పెంచుట, కనీస అవసరాలయిన విద్య, ఆరోగ్యం, నీటిపారుదల, పారిశుద్ధ్యాన్ని అందించుట, వివిధ వర్గాల వారిని విధాన నిర్ణయాలలో భాగస్వామ్యం చేయడంతో పాటుగా క్రింది అంశాలను కూడా పరిగణలోకి తీసుకొని ఫలితాలకు కృషి చేస్తారు.

- పేదరికపు రేటును 2007 నాటికి 20 శాతానికి 2012 నాటికి 10 శాతానికి తగ్గించుట
- శ్రామికులకు అదనపు ఉద్యోగవకాశాలు కల్పించుట
- 2007 నాటికి ప్రాథమిక విద్యను అమలుపరుచుటకు సమర్థవంతంగా చర్యలు
- జనాభా నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- అక్షరాస్యత రేటును 2007 నాటికి 72 శాతానికి 2012 నాటికి 80 శాతానికి పెంచుట
- శిశు మరణాల నిష్పత్తిని తగ్గించుటలో భాగంగా 2007 సంవత్సరానికి ప్రతి వెయ్యిమంది జనాభాలో 45 మంది గల మరణాలను 2012 నాటికి 28 కి తగ్గించాలని లక్ష్యంగా ప్రణాళికను రూపొందించారు.
- పర్యావరణ పరిరక్షణకుగాను అడవులు మరియు చెట్ల వృద్ధికి 2007 నాటికి 25 శాతం 2012 నాటి 33 శాతం పెరుగుదలను కాంక్షించారు.
- అన్ని గ్రామాలు 2012 నాటికి త్రాగునీరు, సౌకర్యం,
- కాలుష్యానికి గురైన ప్రధాన నదులను 2007 నాటికి శుద్ధిచేయటం మిగిలిన వాటికి 2012 నాటికి సరిచేయుట మొ॥ ఈ ప్రణాళికలో గల ప్రధాన లక్ష్యాలు

వివిధ ప్రణాళికా కాలంలో నిర్దేశించిన లక్ష్యాలు నెరవేర్చుటకు ప్రణాళికా వ్యూహకర్తలు అనేక వ్యూహాలను అవలంభించారు. దీనినే ప్రణాళికా వ్యూహంగా పేర్కొనడం జరిగింది. ఈ వ్యూహం ద్వారా నిర్దేశించిన లక్ష్యాలకు చేరుకున్న సంధర్భాలు అలాగే విఫలమయిన ప్రణాళికా వ్యూహాలు ఉన్నాయి. ఈ అంశాలు గురించి ఇపుడు తెలుసుకుందాం.

11.5. వివిధ ప్రణాళికా కాలంలో గల ప్రణాళికా వ్యూహం (లేదా) భారతదేశ ప్రణాళికలు - అభివృద్ధి వ్యూహం

ఆర్థికంగా వెనుకబడిన ఆర్థిక వ్యవస్థను ఒక స్వయం జనీత ఆర్థిక వ్యవస్థగా రూపొందించాలంటే అర్థవంతమయిన ఒక వ్యూహాన్ని లేదా వ్యూహాత్మక విధానాన్ని అవలంభించవలసి ఉంటుంది. అభివృద్ధి వ్యూహంలో నిర్ణయించవలసిన ప్రధాన విషయాలు ప్రధానంగా 5 రకాలుగా విభజించవచ్చు. 1. వ్యవసాయము పరిశ్రమలు వీటి చూపవలసిన ప్రాధాన్యత 2. పారిశ్రామిక రంగంలో భారి పరిశ్రమలకు తేలిక పాటి పరిశ్రమలకు ఇవ్వవలసిన ప్రాధాన్యత 3. ఉత్పత్తి పద్ధతులతో శ్రమ సాంద్రత పద్ధతులకు మూలధన సాంద్రత పద్ధతులకు ఇవ్వవలసిన ప్రాధాన్యత, 4. సమవృద్ధి అసమవృద్ధి లేదా సంతులిత అసంతులిత వృద్ధిలో దేనిని అనుసరించాలి. మరియు 5 విదేశీ వ్యాపారములో ఎగుమతులను పెంచడం దిగుమతులను తగ్గించుకొనడం. ఈ వ్యూహాలను అవలంభించి ఆర్థికవ్యవస్థ స్వావలంభన సాధించుటకు అవకాశముంటుందని ప్రణాళిక వ్యూహకర్తలు అభిప్రాయపడినారు.

భారతదేశ ప్రణాళికలో నిర్దేశమయిన వ్యూహం అంటూ రెండవ పంచవర్ష ప్రణాళిక మినహా మిగిలిన కాలాల్లో లేదని చెప్పవచ్చు. ముఖ్యంగా మొదటి ప్రణాళికా కాలంలో వ్యూహమంటూ లేకుండా కొన్ని అంశాలను ఎన్నుకొన వాటిలో అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. అలాగే 2వ ప్రణాళికా కాలంలో 'మహలనోబిస్' నమూనా ఆధారంగా ప్రణాళికా వ్యూహాన్ని అవలంభించారు. తరువాత కాలంలో అనగా అయిదవ పంచవర్ష ప్రణాళికా కాలం వరకు రెండవ ప్రణాళికా వ్యూహాన్నే కొద్దిపాటి మార్పులతో కొనసాగించారని చెప్పవచ్చు. ఆరవ ప్రణాళిక నుండి 10 ప్రణాళిక వరకు వ్యూహరచనలో మార్పులు వచ్చాయి. ప్రణాళికా వ్యూహాలను క్లుప్తంగా తెలుసుకుందాం.

11.5.1 మొదటి ప్రణాళిక :- మొదటి ప్రణాళిక వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతను ఇచ్చారు. వ్యవసాయము దాని అభివృద్ధి దాహదం చేసే నీటిపారుదల, విద్యుచ్ఛక్తి మీద ప్రభుత్వరంగం మొత్తం వ్యయంలో 44 శాతం కేటాయించారు. (వ్యవసాయం 15 శాతం, నీటిపారుదల 16 శాతం, విద్యుచ్ఛక్తి 13 శాతం) వ్యవసాయరంగానికి ప్రాధాన్యత నివ్వడం సమర్థించతగిన విధానమే. ఎందుకంటే ఈప్రణాళిక ప్రారంభంనాటికి ఆహార ధాన్యాలు, పారిశ్రామిక ముడిపదార్థాల కొరత తీవ్రంగా ఉంది. వ్యవసాయం మనదేశంలో ప్రధాన పరిశ్రమ. 70 శాతం (ప్రస్తుతం 61.4 శాతం) ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వారి ఆదాయాలు పెరిగితే పారిశ్రామిక వస్తువులకు డిమాండ్ ఏర్పడుతుంది. అందువల్ల పారిశ్రామికరణకు, జీవన ప్రమాణ స్థాయి పెరుగుదలకు వ్యవసాయభివృద్ధి అవసరంగా భావించారు. వ్యవసాయ ఎగుమతులను పెంచి తొలిదశలో ఆర్థికాభివృద్ధికి కావలసిన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించుటకు దీనికి ప్రాధాన్యతనిచ్చారు. తద్వారా ఆర్థిక వ్యవస్థకు గట్టి పునాదులు వేయుటకు ప్రయత్నించారు. ఈ ప్రణాళికలో పరిశ్రమలకు 4 శాతం మాత్రమే కేటాయించారు.

11.5.2 2వ ప్రణాళిక :- ఈప్రణాళికా కాలంలో పరిశ్రమలకు ప్రాధాన్యత నిచ్చారు. వ్యవసాయరంగంలో సాధించిన ప్రగతి వల్ల జాతీయాదాయాన్ని పెంచుటకు పరిశ్రమల స్థాపనకు శ్రద్ధచూపారు. భారీ పరిశ్రమల స్థాపన, యంత్ర నిర్మాణం, రసాయనాలు మొ॥ స్థాపించుటకు చర్యలు తీసుకున్నారు. వినియోగవస్తువుల కొరతలేకుండా చిన్నతరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు అభివృద్ధికి చర్యలు తీసుకోబడినాయి. ఖనిజాలకు మొత్తం ప్రభుత్వ రంగ వ్యయం 20 శాతం కేటాయించారు. ఇదికాక ప్రయివేట్ రంగంలో 675 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ రంగం 900 కోట్లు రూ॥లు కేటాయించారు. ఈ వ్యూహం వల్ల ద్రవ్యోల్బణం పెరిగిందని విదేశీ మారకద్రవ్య సంక్షోభం ఏర్పడిందని వినియోగ వస్తువుల కొరత ఏర్పడిందని విమర్శలు వచ్చాయి. తరువాత ప్రణాళికలో కూడా పరిశ్రమలకు ప్రాధాన్యత నిచ్చారు అయితే భారీ పరిశ్రమలలో ఉత్పత్తయిన వస్తువులను ఆ రంగంలోకి పునఃఉత్పత్తికి ఉపయోగించే రేటు అనగా Plough back rate తక్కువగా ఉందని పరిశీలన వల్ల తెలిసింది. పరిశ్రమలతో పాటుగా వ్యవసాయ రంగానికి కూడా ప్రాధాన్యత ఇచ్చి ఉండవలసింది. పరిశ్రమలు తరువాత రవాణా, విద్యుచ్ఛక్తి మొదలగు సాంఘిక సేవలకు ప్రాధాన్యత నిచ్చారు.

11.5.3 మూడవ ప్రణాళిక :- ఈ ప్రణాళికలో వ్యవసాయానికి పరిశ్రమలకు రెండింటికి ప్రాధాన్యత నిచ్చారు. రెండవ ప్రణాళికలో ఏర్పడిన కొరతలు అనేక సమస్యలకు దారి తీసాయి. తీవ్ర ద్రవ్యోల్బణం ఏర్పడింది. వ్యవసాయోత్పత్తి తగినంతగా లేనందున అభవృద్ధి తగ్గుతుందని తెలుసుకొని రెండింటికి ప్రాధాన్యత నిచ్చారు. ఆర్థిక వ్యవస్థను స్వయం జనితమయిందిగాను, స్వయం పోషకమయినదిగాను చేయడం ఈ ప్రణాళిక వ్యూహం. అంతేకాక దీర్ఘదర్శి దృక్పథం అవలంభించబడినది 10-15 సంవత్సరాలకు అవసరాలను దృష్టిలో ఉంచుకుని లక్ష్యాలను నిర్ణయించారు. భారీ, మౌళిక పరిశ్రమలను కూడా స్థాపించారు. స్వయం పోషకత్వం సాధించుటకు ఇది అవసరం. వ్యవసాయానికి 12.7 శాతం నీటి పారుదలకు 7.7 శాతం విద్యుచ్ఛక్తి 14.6 శాతం పరిశ్రమలకు 20.1 శాతం ప్రభుత్వ రంగంలో కేటాయించారు. రవాణాకు, సాంఘిక సేవలకు కూడా ప్రాధాన్యత నిచ్చారు.

11.5.4 4వప్రణాళిక :- ఈప్రణాళిక కూడా వ్యవసాయరంగానికి 17.1 శాతం నీటిపారుదలకు 6.8 శాతం విద్యుచ్ఛక్తికి 15 శాతం పరిశ్రమలకు 20.9 శాతం ప్రభుత్వ రంగంలో కేటాయించారు. గత ప్రణాళిక వలెనే ఈ ప్రణాళికలో కూడా వ్యవసాయం, పరిశ్రమల తరువాత రవాణాకు 20.3 శాతం సాంఘిక సేవలకు 17.6 శాతం కేటాయించారు.

11.5.5 అయిదవ ప్రణాళిక :- ఈ ప్రణాళికలో కూడా వ్యవసాయానికి పరిశ్రమలకు ప్రాధాన్యతను ఇచ్చారు. ప్రభుత్వరంగం వ్యయంలో పరిశ్రమలకు 24 శాతం కేటాయించగా వ్యవసాయము, నీటిపారుదలకు 18.7 శాతం కేటాయించారు. చిన్న పరిశ్రమలకు, కుటీర పరిశ్రమలకు ఇది వరకన్నా ఎక్కువ మొత్తం కేటాయించారు. సామాన్య ప్రజల వినియోగ వస్తు ఉత్పత్తికి ప్రాధాన్యతనిచ్చారు. ఉద్యోగవకాశాల విస్తరణకు, స్వయం సమృద్ధిని సాధించుట ప్రధాన ఆశయంగా పెట్టుకున్నారు.

11.5.6 ఆరవ ప్రణాళిక :- ఆరవ ప్రణాళిక నుండి 8వ ప్రణాళిక వరకు ప్రత్యేక వ్యూహమంటూ సూచించినప్పటికీ, ఆరవ ప్రణాళిక దీర్ఘదర్శి ప్రణాళికను దృష్టిలో ఉంచుకొని తయారు చేయడం జరిగింది. ఈ ప్రణాళిక 1981 నుండి 1995 కాలానికి వర్తిస్తుంది. ఈ

ప్రణాళికలో సాంఘిక ఆర్థిక సూచికలు వృద్ధిని దృష్టిలో ఉంచుకొని రూపొందించారు. వ్యవసాయ రంగానికి దాని సంబంధించిన ఇతర సేవలకు 12.8 శాతం శక్తి, సైన్సు, టెక్నాలజి అభివృద్ధికి 28.1 శాతం, రవాణా కమ్యునికేషనులు కొరకు 15.9 శాతం, పరిశ్రమలు, ఖనిజాలకు 15.4 శాతం సాంఘిక సేవలకు 15.3 శాతం, నీటిపారుదల కమ్యునికేషన్లలకు 12.5 శాతం పెట్టుబడులను కేటాయించారు. ఈ కేటాయింపులతో పాటుగా కింది వ్యూహాన్ని సిఫారసు చేసారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన అవస్థాసనను ఏక కాలము పటిష్టం చేయడానికి చర్యలు తీసుకోవడం, ఉపాధి అవకాశాలను ముఖ్యంగా గ్రామ ప్రాంతాలలోను, అసంఘటిత రంగంలోను పెంచడాన్కి ప్రత్యేకమయిన, నిర్దిష్టమయిన పథకాలను అమలు చేయడం పరస్పర సంబంధమున్న సమస్యల పరిష్కారానికి విడివిడిగా చర్యలు తీసుకునే బదులు సంఘటిత చర్యలు తీసుకోవడం, వివిధ రంగాలలో జరిగే కార్యక్రమాల అమలు వివరాలు తెలుసుకోవడం ద్వారా నిర్వహణను సమర్థవంతంగా కొనసాగించడం స్థానికంగా అనువైన పథకాలను రూపొందించడం, వాటిని త్వరితగతిని అమలు చేయడాన్కి పటిష్టమయిన చర్యలు తీసుకోవడం మొదలయిన వ్యూహాన్ని రూపొందించారు.

11.5.7. 7వ ప్రణాళిక :- ఈ ప్రణాళిక కూడా దీర్ఘదర్శి ప్రణాళిక విధానంలో భాగంగానే రూపకల్పన జరిగింది. ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి ప్రక్రియను ప్రారంభించి నిలకడైన వృద్ధి సాధించుటకు ప్రయత్నం ముమ్మరం చేయడం, స్వావలంబనమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, సామాజిక న్యాయం, దేశీయమైన సాంకేతిక పురోగాభివృద్ధికి గట్టి పునాదులు వేసి నవసమాజ నిర్మాణం చేయుట లక్ష్యంగా వ్యూహాన్ని రూపొందించారు.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి 13.6 శాతం శక్తికి 28.6 శాతం, పరిశ్రమలు ఖనిజాలు అభివృద్ధిక 13.5 శాతం, సాంఘిక సేవలను 15.8 శాతం కేటాయించారు.

11.5.8 8వ ప్రణాళిక :- మొత్తం ప్రణాళిక ప్రక్రియలోనే మౌలికమైన మార్పులు తేవాలనే సంకల్పం ఉన్నట్లు కనబడుతుంది ప్రణాళికల అమలు విషయంలో ప్రభుత్వం నిర్వహించాల్సిన పాత్రను పునఃనిర్వహించి, వనరుల కేటాయింపునకు సంబంధించి కొన్ని మౌలిక నిర్ణయాలు చేయడం జరిగింది. ఆర్థిక వ్యవస్థలో ఒక ఉత్పాదకతా సంస్కృతిని కల్పించాలనే సంకల్పం స్పష్టంగా కనిపిస్తుంది. నిర్మించబోయే సమాజం దృష్ట్యా వివిధ విధాన నిర్ణయాలు సమేళనాన్ని అనుసరిస్తూ లక్ష్యాలు కోసం రూపొందించారు. ప్రభుత్వరంగ సంస్థల పాత్రను పునర్నిర్వచించి భౌతిక ప్రాథమిక అవసరాలు, అవస్థాపన సౌకర్యాలు కల్పించడం శక్తి, రవాణా, కమ్యునికేషన్లు, నీటిపారుదల వంటి వాటికే పరిమితం కావాలని నిర్ణయించింది. మార్కెటు యంత్రాంగం సామర్థ్యాన్ని పెంపొందించే సాధనంగా ఉండాలని ప్రభుత్వం ఆశించిన సామాజిక లక్ష్యాలను సాధించడంలో చేయూతనిచ్చి మార్గం చూపేదిగా తన పాత్ర నిర్వహించాలని వ్యూహ రచనచేసి ప్రణాళిక సంఘం నిర్ణయించి ప్రయివేటురంగానికి ప్రాధాన్యతనిచ్చారు. ఎనిమిదో ప్రణాళికలో ప్రభుత్వ పెట్టుబడి 45.2 శాతం కాగా ప్రయివేటు రంగంలో 54.8 శాతం గా నిర్ణయించారు.

11.5.9 9వ ప్రణాళిక :- ఈ ప్రణాళిక యొక్క వ్యూహంలో ముఖ్య అంశాలు :

- ప్రయివేటు రంగానికి పూర్తి సామర్థ్యాన్ని కల్పించి ఉత్పత్తి, ఉద్యోగిత ఆదాయాలను పెంపొందించడం
- వైద్య ఆరోగ్యం, విద్య, రక్షిత నీటి సరఫరా మొ॥ వాటిలో ప్రభుత్వం జోక్యముంటుంది.
- రోడ్లు, శక్తి, పోర్టులు, రైల్వేలు మొదలయిన ఆర్థిక అవస్థాపనా సౌకర్యాలను కల్పిస్తుంది.
- వ్యవసాయరంగానికి అవసరమయిన నీటిపారుదల, గ్రామీణ రోడ్ల సంఘటిత మార్కెట్లు రూపకల్పన, పరిశోధనా కార్యకలాపాలు ప్రభుత్వం చేపడుతుంది.
- వ్యవసాయాభివృద్ధి ద్వారా గ్రామీణ ఆదాయాలు పెంచుట
- ప్రభుత్వరంగ సంస్థ ప్రాధాన్యత తగ్గించుట

- దిగుమతులు టారిఫ్‌లు తగ్గించుట ద్వారా చెల్లింపుల వేషం
- భీమారంగంలో ఏకస్వామ్యధోరణి నివారణకు ప్రయివేటు సంస్థలను సర్దుబాటు అనుమతిస్తారు.
- కోశలోటు, రెవెన్యు లోటు నివారణకు పన్ను ద్వారా సర్దుబాటు చేసుకుంటారు.

ఈ విధంగా ప్రభుత్వ 8వ ప్రణాళిక నుండి ఆర్థిక కలాపాలలో క్రమేపీ తగ్గుతో సామాజిక సంక్షేమానికి పరిమితమవుతూ సరళీకృత విధానాలు ప్రణాళికలో కనిసిస్తున్నాయి.

11.5.10 10వ ప్రణాళిక :- పదవ ప్రణాళిక యొక్క వ్యూహం క్రింది అంశాలతో ముడిపడి ఉంది. ప్రణాళికా లక్ష్యాలు నెరవేర్చుటకు వీటిని రూపొందించారు.

- ప్రయివేటు రంగానికి భలోపేతమయిన భాగస్వామ్యం ఆర్థిక కార్యకలాపాల్లో ఉంటుంది.
- ప్రభుత్వ రంగం పాత్ర తక్కువ పరిధి కలిగిఉంది క్రమేపీ తగ్గుతుంది. అవసరమయిన అంశాల్లోనే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది.
- సామాజిక రంగాల్లో ప్రభుత్వ పాత్ర జోక్యం పెరుగుతుంది.
- అవస్థాపనా సౌకర్యాలలో ముఖ్యంగా ప్రయివేటు రంగం జోక్యం చేసుకోని గ్రామీణ అవస్థాపనా సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ జోక్యం ఉంటుంది. నాణ్యమైన సేవలు, వస్తువులు, వినియోగాదారులకు అందిస్తారు.

11.6. ప్రణాళికల ద్వారా సాధించిన ప్రగతి:

మన దేశంలో ప్రణాళికా వ్యూహం మొదలై నాలుగు దశాబ్దాలు దాటింది. అయిదవ దశాబ్దిలో పయనిస్తుంది. ప్రజాస్వామ్యదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ననుసరిస్తూ ప్రణాళికల ద్వారా గణనీయమయిన ఆర్థికాభివృద్ధిని సాధించగలిగింది. ఇప్పటకీ 9 ప్రణాళికలు అమలు పరచి 10వ ప్రణాళికలో ఉన్నాము. ఈ సందర్భంగా మనదేశం గత దశాబ్దాల్లో ప్రణాళికల ద్వారా ఎంత అభివృద్ధిని సాధించింది తెలుసు కోవాలి. మనదేశ ప్రణాళికానుభవం గురించి కూలంకషంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

1. జాతీయ మరియు తలసరి ఆదాయాల్లో పెరుగుదల: - మన ప్రణాళికలలో ముఖ్యఉద్దేశంగా జాతీయాదాయం మరియు తలసరి ఆదాయం పెరుగుదలను పేర్కొన్నారు. దేశ నికర జాతీయోత్పత్తిలో పెరుగుదల కనిపించింది. 1950-51 మరియు 1980-81 మధ్యకాలంలో సగటు వార్షిక నికర జాతీయోత్పత్తి రేటు 3.4 శాతం ఉండగా 1980-81 నుండి 1996-97 మధ్య కాలంలో 5.3 శాతానికి పెరిగింది. తలసరి ఆదాయంలో పెరుగుదల పైన తెలపిన కాలాల్లో 1.2 శాతం నుండి 3.2 శాతానికి పెరిగింది. అలాగే జాతీయాదాయం ప్రస్తుత ధరలలో 1950-51 లో 9142 కోట్లు రూ॥లు కాగా 2001-02 నాటికి 1,8,47,980 కోట్లకి చేరుకుంది. తలసరి ఆదాయం కూడా అదేకాలంలో 254.7 రూపాయలనుండి 17,806.0 రూపాయలకు పెరిగింది. మరో విధంగా చెప్పాలంటే వివిధ ప్రణాళికల కాలంలో జాతీయోత్పత్తిలో వృద్ధిరేటు క్రింది విధంగా ఉంది.

జాతీయోత్పత్తి వృద్ధిరేటు

ప్రణాళిక	1	2	3	4	5	6	7	8	9	10
వృద్ధిరేటు	3.6	4.1	2.5	3.3	5.0	5.4	5.8	6.7	5.4	8.0* (అంచనా)

పై పట్టికలో వివిధ ప్రణాళికల కాలంలో జాతీయోత్పత్తి వృద్ధిరేటును తెలుపుతుంది. సరాసరి వృద్ధిరేటు 3.5 నుండి 4 శాతంగా ఉన్నట్లు కనుగొన్నారు. ఇదేకాలంలో జనాభా వృద్ధిరేటు సరాసరి 2 శాతం ఉన్నట్లు తెలిపారు.

మన స్థూల జాతీయోత్పత్తిలో పొదుపు శాతం కూడా పెరుగుచున్నది. వాస్తవిక పొదుపు సుమారుగా 24.3 శాతం దాటి ఉంది. మరణాల రేటు గణనీయంగా తగ్గినప్పటికీ, జననాల రేటులో తగ్గుదల అంతగా లేనందున జనాభా సగటున 2 శాతం వార్షిక పెరుగుదల ఉండగా తలసరి వినియోగం కేవలం 1.4 శాతం చొప్పున మాత్రమే పెరుగుచున్నది.

2. వ్యవసాయ రంగం వృద్ధిలో పెరుగుదల :- గడచిన 50 సంవత్సరాల కాలంలో వ్యవసాయ రంగంపై ప్రతి ప్రణాళిక కాలమందు సగటున 23 నుండి 24 శాతం వరకు ప్రభుత్వాలు కేటాయింపులు చేసాయి. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. 1960-61 కాలంలో ప్రవేశపెట్టిన నూతన వంగడాల వియోగం వల్ల ఉత్పత్తులు మరింతగా పెరిగాయి. వ్యవసాయానికి అవసరమయిన నీటిసరఫరా, రసాయనాల, ఎరువులు, విత్తనాలు మొదలయినవి అందుబాటులోకి రావటం వల్ల దిగుబడులు పెరిగాయి. 1950-51 కాలంలో సుమారుగా 97.32 మిలియన్ల హెక్టారులు ఆహార ఉత్పత్తుల క్రింద భూమి సాగులు ఉండగా 2001-02 నాటి 120.80 హెక్టార్లకు పెరిగింది. ఉత్పత్తి కూడా 50.82 మిలియన్ల టన్నులనుండి 211.32 టన్నులకు చేరింది. ఉత్పాదకత హెక్టారుకు 522 కేజీల నుండి 1700 కేజీలకు పెరిగింది. వ్యవసాయరంగంలో నూతన పద్ధతులు వల్ల గణనీయమయిన ప్రగతి సాదించింది.

3. పారిశ్రామిక ప్రగతి:- 1951-1997 మధ్యకాలంలో ప్రభుత్వం ఎక్కువగా భారీ మరియు మౌళిక పరిశ్రమలపై ఎక్కువగా పెట్టుబడి పెట్టింది. సుమారుగా 53 నుండి 55 శాతం వరకు పరిశ్రమలకు, రవాణా, కమ్యునికేషన్లు, విద్యుత్, పంపిణి కొరకు వనరులు కేటాయింపు అయా ప్రణాళికల కాలాల్లో జరిగింది. ఆయా పరిశ్రమల ఉత్పత్తి కూడా పెరిగింది. సగటు వృద్ధిరేటు 1974-79 నుండి 2000-01 మధ్య కాలంలో మార్పులకు గురైంది. నూతన సంస్కరణల కాలంలో ఈ మార్పు మరింతగా కనిపించింది. ప్రాథమిక వస్తువులు Basic వస్తువుల ఉత్పత్తి యొక్క వార్షిక వృద్ధిరేటు 1980-85 కాలంలో 8.5 శాతం ఉండగా 2001-02 నాటికి 2.8 శాతానికి తగ్గింది. బొగ్గు ఉత్పత్తిలో వృద్ధి 1950-51 లో 3.2 మిలియన్ల టన్నులు ఉండగా 1996-97 నాటికి 308 మి.ట లకు చేరుకుంది. ఇనుము మరియు ఇనుప ధాతువు ప్రగతి కనిపించింది. 1950-51 లో 3 మి॥ట॥ ఉండగా 1996-97 నాటికి 66 మి.ట॥ లకు చేరింది. అల్యూమినియం ఉత్పత్తి 1950-51 లో 4 వేల టన్నుల వుంటే 1996-97 నాటికి 524 వేల టన్నులకు పెరిగింది. తలసరి వినియోగాం కూడా పెరిగింది. కరెంటు వాడకం తలసరి 2.4 Khw నుండి 57.7 శాతానికి పెరిగింది. అయితే సగటు వార్షిక వృద్ధిరేటులో మాత్రం తగ్గుదల ఉంది. మొదటి ప్రణాళికలో 9.80 నుండి 3.6 శాతానికి వృద్ధిరేటు పడిపోయింది.

ఆర్థిక అవస్థావవల అభివృద్ధి :

ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకమగు శక్తి, నీటిపారుదల, రవాణా మొదలగు ఆర్థిక అవస్థాపనా వనరులను సమకూర్చి పారిశ్రామికాభివృద్ధికి అనువైన వాతావరణం కల్పించబడింది. రోడ్డు రవాణా సదుపాయాలను బాగా మెరుగు పరచి తద్వారా వ్యవసాయ రంగానికి మరియు చిన్ని చిన్న పట్టణాలలో ప్యాక్టరీల వ్యాప్తికి అనువయిన వాతావరణాన్ని కల్పించగలిగాము. నీటిపారుదల, జలవిద్యుత్, మార్కెటు విస్తరణ మొదలయినవి ప్రణాళికా కాలంలో వేగవంతమయినవి.

ఎగుమతులు మరియు దిగుమతులు ప్రత్యామ్నాయాల్లో మార్పులు:

దేశీయంగా పారిశ్రామికీకరణ వేగవంతంగా జరగడం వల్ల దేశీయంగా ఇతరదేశాల వస్తువులు తయారుచేసి (ప్రత్యామ్నాయ) దిగుమతులను తగ్గించుకోగలిగాము. అనగా దిగుమతి ప్రత్యామ్నాయ వస్తు ఉత్పత్తులను దేశీయంగా తయారుచేయుట జరిగింది. మరోవైపు ఎగుమతులు ప్రోత్సాహక పద్ధతులను ప్రవేశపెట్టి తయారి వస్తువులు, ఖనిజాలు, ధాతువులు, ఇంజనీరింగ్ వస్తువులను ఎగుమతి చేయు స్థాయికి చేరాము. పారిశ్రామిక ప్రగతి సాధించుట ద్వారా మనం మూలధన వస్తువుల కొరకు విదేశాలపై ఆధారపడుట తగ్గించాము. అంతేకాక సాంప్రదాయ వస్తువులే కాక అనేక రకాల పారిశ్రామిక వస్తువులను ఎగుమతి చేయగలుగు స్థాయికి ఎదిగాము.

శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రగతి :

ఆధునిక పరిశ్రమలకు అవసరమయిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా సంపాదించగలిగాం. దానివల్ల ఇతరదేశాల నిపుణులపై ఆధారపడే విధానం నుండి బయటపడినాము. ఇండియా ఈనాడు సాంకేతిక నిపుణులను ఇతర దేశాలకు ఎగుమతి చేయుటలో ముందంజలో ఉంది. మధ్యతూర్పు మరియు ఆసియన్ నిపుణులను ఎగుమతి చేయుచున్నారు. భారీస్థాయిలో విద్యావ్యవస్థను, విధానాన్ని అభివృద్ధి పరచగలిగాం. ప్రపంచంలో 3వ స్థానంలో విద్యావిధాన రూపకల్పనలో మనదేశం ఉంది. 1950-51 లో 239 లక్షలు విద్యార్థులు విద్యాసంస్థల్లో నమోదుకాగా 1996-97 నాటికి 1827 లక్షలకు చేరింది. ప్రాథమిక విద్యలో 192 లక్షల నుండి 1118 లక్షలకు పైన తెలిపిన కాలంలో పెరిగింది. 6 నుండి 11 సంవత్సరాల వయస్సు గల జనాభాలో వీరు 31 నుండి 84 శాతానికి పెరిగింది. మధ్యస్థాయిలో 31 లక్షలు నుండి 40 లక్షలకు పెరిగింది. అలాగే మిగిలిన సెక్టారులనందు హాజరు పెరిగింది. ప్రణాళికా కాలంలో విద్యాభివృద్ధి భాగా పెరిగింది.

దారిద్ర రేఖకు దిగువున వున్న ప్రజలు:

మన సామ్యవాదరీతి ప్రణాళిక వ్యూహం ప్రజలందరికీ కనీస అవసరాలను కల్పించాల్సి వున్నప్పటికీ దేశం మొత్తం మీద 37 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు తెలుస్తుంది. అయితే ఇటీవల కాలంలో కొంత వరకు తగ్గినట్లు సర్వేలు తెలుపుచున్నాయి.

దేశప్రజల జీవిత కాలంలో పెరుగుదల :

1951 లో భారతీయుని సగటు జీవిత కాలం కేవలం 32 సం॥లు మాత్రమే. అది 1991-1992 నాటికి 58 సంవత్సరాలకు చేరింది. ప్రస్తుతం 61 సంవత్సరాలుగా ఉంది. మసూచి, కలరా, టి.బి, ప్లేగు, మొదలైన అంటువ్యాధులు నివారణ సమర్థవంతంగా జరిగినందున మెరుగైన విద్యా సదుపాయాల వల్ల మరణాల రేటు తగ్గించాము. పోషకాహారం అందరికి అందించలేనప్పటికీ సగటు జీవిత కాలం పెరిగినట్లు తెలియుచున్నది.

11.7 ప్రణాళికా వ్యూహం - వైఫల్యాలు.

1951 నుండి ప్రణాళికా విధానం ద్వారా మనం గణనీయమయిన అభివృద్ధి సాధించినప్పటికీ అనేక వైఫల్యాలను చవి చూడవలసి వచ్చింది.

1. దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నప్రజలు :- మనం సామ్యవాద రీతి ప్రణాళికా వ్యూహం ప్రజలందరికీ కనీస అవసరాలను కల్పించాల్సి ఉన్నప్పటికీ ఏడవ ప్రణాళిక అంచనా ప్రకారం 273 మిలియన్లు ప్రజలు 1984-85లో దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నట్లు తెలుస్తుంది. వారిలో 222 మిలియన్లు గ్రామాల్లోను 51 మిలియన్లు పట్టణాలలో ఉన్నట్లు తెలియుచున్నది. దేశం మొత్తం మీద ప్రస్తుతం 37 శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు తెలియుచున్నది. ప్రణాళికలు పేదరికాన్ని నిర్మూలించే ప్రక్రియలో పూర్తిగా విజయం సాధించలేక పోయింది.

2. పనిచేయు శక్తి సామర్థ్యాలున్న ప్రజలకు ఉద్యోగం కల్పించలేదు :- ప్రణాళికలు పెరుగుతున్న జనాభా వలన నిరుద్యోగ సమస్యకూడా పెరుగుచున్నట్లే కనిపిస్తుంది. మొదటి ప్రణాళికాంతానికి 5.3 మిలియన్లు నిరుద్యోగులు ఉండగా ప్రస్తుతం మొత్తం శ్రామిక శక్తిలో 8.43 శాతం శ్రామికులు నిరుద్యోగులుగా ఉన్నారు. 1999-2000 కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యిమంది నిరుద్యోగుల్లో 72 శాతం మగవారు, 73 శాతం స్త్రీలు, పట్టణప్రాంతాల్లో 70 శాతం మగవారు, 94 శాతం స్త్రీలు నిరుద్యోగులుగా ఉన్నారు. నిరుద్యోగిత నిరంతరం పెరుగుచున్నది.. దీనివల్ల యువత నిస్పృహకు లోనయి సంఘ వ్యతిరేక శక్తులుగా మారే ప్రమాదం ఉంది.

3. ఆదాయ సంపదల వ్యత్యాసాలను తొలగించలేకపోవడం :- దేశ అభివృద్ధి ఫలాలను అందరి మధ్య సమానంగా పంపిణి జరగలేదు. అట్టడుగున ఉన్న 20% మంది ప్రజల జీవనం మరింత దుర్భరమైనట్లు మరో 20% మంది ప్రజల జీవనం దాదాపుగా స్థిరంగా ఉన్నట్లు సర్వేలు వివరిస్తున్నాయి. గ్రామీణ పేదరికం ఇప్పటికీ తగ్గలేదు. పట్టణ పేదరికాల్లో మార్పులు కూడా చెప్పుకోదగ్గవిగాలేవు.

4. ద్రవ్యోల్బణం :- సామాజిక న్యాయం జరుగుచున్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు ధరల పరిస్థితిని మరో సూచికగా తెలుసుకోవచ్చు. ముఖ్యంగా ఆహార పదార్థాలు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నందున సగటు మనిషి జీవన వ్యయం మరింతగా పెరుగుచున్నది. కాని విలాస వస్తువుల ధరలలో అంత పెరుగుదల లేనందున ధనికుల మీద ఎలాంటి భారమూ పడుటలేదని తెలియుచున్నది. సగటు మనిషికి అవసరమయ్యే చక్కెర, అగ్గిపెట్టెలు, కిరోసిన్, కూరగాయలు, వంటనూనెలు ధరలు పెరుగుతూ ఆకాశాన్నంటుతున్నాయి.

5. ఆర్థిక కేంద్రీకరణను తగ్గించుకోలేకపోవడం :- మన ప్రణాళికా వ్యూహం ధ్యేయం సామ్యవాద రీతి సమాజాన్ని స్థాపించటమే అయినప్పటికీ ఏకస్వామ్య ధోరణిని అరికట్టడంలో మన ప్రణాళికలు విఫలం చెందినట్లు తెలుస్తుంది. కోశ విధానమగు పన్నుల విధానాన్ని ఎంత విస్తృతంగా వాడుతున్నప్పటికీ ఆదాయ వ్యత్యాసాల్లో తేడాను అంతగా తొలగించలేకపోయాము. అలాగునే గ్రామీణ ప్రాంతాల్లో భూమి బినామీ పేర్లతో కొద్ది మంది భూస్వాములు దగ్గర దాగి ఉన్నందున పేదలకు మిగులు భూమిని పంచడం కేవలం ఆశయరూపంలోనే ఉన్నది. దాదాపు 3% గృహస్తులు సగం పైగా వ్యవసాయ భూములను కల్గి ఉన్నారని, అట్టడగు స్థాయిలో 75% గృహస్థులు కేవలం 10 శాతం వ్యవసాయ భూములను కలిగి ఉన్నట్లు తెలియుచున్నది.

ఆదాయ అసమానతలు విషయంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 20,000లోపు ఆదాయంగల వారు 27 శాతం ప్రజలు దగ్గర 2.4 శాతం మాత్రమే ఉండగా పట్టణ ప్రాంతాల్లో 33.5 గృహస్థులు 1.4 శాతం ఆదాయాలను కలిగి ఉన్నారు. 2,50.000 రూపాయలు ఆదాయంగల గృహస్థులు గ్రామాల్లో 9.6 శాతం ఉండగా వారి వద్ద 48.8 శాతం ఆదాయం కేంద్రీకృతమయింది. పట్టణాలలో 14.2 శాతం గృహస్థులు 65.8 శాతం ఆదాయాన్ని కలిగిఉన్నారు. ఇలా తక్కువ మంది వద్ద ఎక్కువ ఆదాయస్థాయి, ఎక్కువ ప్రజలు గృహస్థులు వద్ద అతి తక్కువ ఆదాయ స్థాయి కలిగి ఉంది. ప్రణాళికలు వీటిని నివారించలేకపోయాయి.

7. భూపంస్కరణలు:- మన గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాములనుండి అధిక భూములను తీసుకుని భూమిలేని రైతులకు పునఃపంపిణి చేయటంలో మన ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. భూస్వాములు బినామి పేర్లతో భూములను వారి ఆధీనంలోనే ఉంచుకున్నారు. అంతేకాక వ్యవసాయ భూములపై రైతులు పారిశ్రామిక రంగంలో కూడా ఉత్పత్తంతా కేవలం మౌళిక వస్తువులు, మూలధన వస్తువులకే పరిమితమయింది. వినియోగ వస్తు ఉత్పత్తి కూడా ధనిక వర్గానికి అవసరమయ్యేవే కావడం వల్ల సగటు మనిషిని విస్మరించారు.

ఉద్యోగావకాశాలు ఆర్థిక కార్యకలాపాలతో పాటుగా పెరుగుతాయని భావించారేగాని దానిపై ప్రత్యేక శ్రద్ధ చూపలేదు. అందుకిల్ల మన ప్రణాళికా వ్యూహరచన ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ, దేశాభివృద్ధికి తగినట్లుగా తీర్చిదిద్దుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

11. ముగింపు :

ప్రణాళికలు నిర్ణీత కాలానికి దిశ నిర్దేశకాలు. అందువల్ల పటిష్టమయిన వ్యూహం అవసరముంటుంది. గడచిన 5వ ప్రణాళికల కాలంలో చూసిన శ్రద్ధ, ఆశయదీక్ష తరువాత ప్రణాళికల కాలంలో కనిపించలేదు. ప్రభుత్వ ఆస్తులు పెంచే దిశలో ప్రణాళికలు (మొదటి అయిదు ప్రణాళికలు) పయనిస్తే 8వ ప్రణాళిక కాలం నుండి ఆ ఆస్తులను ప్రయివేటు పరం చేయుదిశలో పయనిస్తున్నాయి. ప్రణాళికా వ్యూహాలు దీర్ఘకాలిక అభివృద్ధికి తోడ్పడాలి. అంతేకాని ప్రస్తుత అవసరాలే ముఖ్యం కాదు. ప్రణాళికలలో సరిస్కరణల భావాలు ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి. ముంద్రుతరాలకు ఆస్తులను ఆందించాలి. ప్రణాళిక విజయాల ఫలితాలు కొందరికే పరిమితమయ్యాయి. సాంఘిక సమానత్వం అందనంత దూరంలో ఉంది. నూతన సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అందువల్ల పొందే ఆదాయాలపై కూడా ఎటువంటి పన్నులు విధించక కేవలం పారిశ్రామిక, సేవా రంగాలలో పనిచేస్తున్న వారిపైనే వ్యక్తిగత ఆదాయపన్ను విధించుటలో న్యాయంలేదు. సహకార వ్యవసాయం కూడా మన గ్రామీణ ప్రాంతాల్లో అంతగా అమలులో లేదు. అందువల్ల చిన్నకారు రైతులు ఇప్పటికీ పురాతన వ్యవసాయ పరికరాలను, పద్ధతులను వాడుతున్నందువల్ల అధిక దిగుబడిని పొందలేకపోవుచున్నారు.

8. మానవ వనరులు ఉపయోగం :- దేశంలో మానవ వనరులకు కొరత లేదు. ఇతరదేశాల్లో మానవ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించే కుంటుంటే మనదేశంలో వాటిని వినియోగించుకోవడంలో విఫలమయ్యాము. వాటికి పూర్తిస్థాయిలో ఉద్యోగిత కల్పించకపోతే దేశీయంగా సమతౌల్యాన్ని సాధించలేము.ం అందరికి పని కల్పించు శ్రమ సాంద్రత పరిశ్రమలు మనకు అనుకూలమయినవి. కాని ప్రణాళికల్లో వీటి ప్రస్థావనకు తగిన కృషి చేయడం లేదు.

మన ప్రణాళికలను సమీక్షిస్తూ సుఖమాయ్ చక్రవర్తి క్రింది లోపాలను వివరించాడు.

ఉత్పత్తి గణనీయంగా పెరిగినప్పటికీ శక్తి, రవాణా, స్టీలు, ఎరువులు ఉత్పత్తిలో అనేక లోపాలు ఉన్నాయి.

ఇప్పటికి కనీస అవసరాలు నేరవేరక దారిద్రరేఖ దిగువనే ఉన్న ప్రజలు శాతం ఎక్కువ.

హరిత విప్లవం కొన్ని ప్రాంతాలకు, పంటలకే పరిమితం కావడం వల్ల పారిశ్రామిక రంగానికి అవసరమయిన ముడి పదార్థాలు ఉత్పత్తి జరగలేదు.

మన ప్రణాళికల వ్యూహాన్ని మార్చి పూర్తి ఉద్యోగితను సాధించి, పేదరికాన్ని నిర్మూలించి, సమాజంలో అందరికి సమానవకాశాలను కల్పించేదిగా పయనించాలి. ఈ దిశలో ప్రణాళికలను పునర్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

11.9 ముఖ్య పదాలు :

1. ప్రణాళిక : లభ్యమయ్యే వనరులను ఉపయోగించి, నిర్దిష్టకాలంలో ఆశించిన ఫలితాలకు ఏర్పరచుకునే చొరవ.
2. స్వయం పోషకత్వం : ఇతర దేశాలపై ఆధార పడకుండా దేశీయంగా వివిధ చర్యలు ద్వారా ఆశించిన లక్ష్యాలు నెరవేర్చుకొను విధానం
3. సాంఘిక న్యాయం : సమాజంలో ప్రజలందరికి వ్యత్యాసాలులేని విధంగా అందించు న్యాయమైన అవకాశాలు.
4. గరీభీహటావో : పేదరికాన్ని పారద్రోలుట దేశంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలని 5వ ప్రణాళికలో పేర్కొన్నారు.
5. ప్రణాళికా వ్యూహం :ప్రణాళికా లక్ష్యాలను నెరవేర్చుటకు అనుసరించు ప్రక్రియ.
6. ఆర్థిక కేంద్రీకరణ : సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవ్వడాన్ని అలా వ్యవహరిస్తారు.
7. అవస్థాపనా సౌకర్యాలు : రోడ్లు, రవాణా, నీటిపారుదల, జలవిద్యుత్ వార్తా సౌకర్యాలు, విద్య, వైద్య మొ॥ సౌకర్యాలు
8. దిగుమతుల ప్రత్యామ్నాయం : దిగుమతుల వస్తువుల దేశీయంగానే తయారు చేసుకొని వాటిని దిగుమతి తగ్గించుకొను ప్రయత్నం.

11.10. స్వయం సమీక్షా ప్రశ్నలు :

1. ప్రణాళికల యొక్క లక్ష్యాలు వివరించండి.
2. ఇండియాలో ప్రణాళికల లక్ష్యాలు నెరవేర్చుటకు అనుబంధించే వ్యూహాలను వివరించుము.
3. ప్రణాళిక ఆశయాలు ఎంతవరకు నెరవేర్చబడినవో తెల్పండి.
4. ప్రణాళికలు వైఫల్యాలు వివరిం.

11.11. చదువవలసిన పుస్తకాలు :

1. Sukhamoy Chakravarty : Development Planning, The Indian Experience.
2. Various Planning Commission Reports
3. Bimal Jalan : The Indian Economy , Problems & Prospects.
4. Pramit chaudhuri : The Indian Economy ; poverty and Development
5. Ruddar Datt & K.P.M. Sundaram : Indian Economy
6. I.C. Bhingrer : The Indian Economy & Environment

- ఆచార్య మోపిదేవి సుందరరావు

పాఠం - 12

భారతదేశ పంచవర్ష ప్రణాళికలు - వనరుల సమీకరణ, ప్రణాళికలలో వివిధ రంగాలకు వనరుల కేటాయింపు మరియు వ్యవసాయ మరియు పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో ప్రణాళికల పాత్ర.

12.0. లక్ష్యాలు

ఈ పాఠ్యభాగాన్ని చదివాక క్రింది అంశాల గురించి మిరు వివరంగా తెలుసుకోగలుగుతారు.

* ప్రణాళికలకు అవసరమయిన ద్రవ్య వనరుల ఎలా సమకూరుతాయి.
* వనరుల విభజన ఎలా ఉంటుంది.
* ప్రణాళికలకు గల వివిధ వనరులు
* వనరుల కేటాయింపు
* ఏయే వనరులపై ఎక్కువగా ఆధారపడాలి అనే అంశాల గురించి తెలుసుకొనుటకు సవివరంగా తెలుపుట
* ప్రణాళికా కాలంలో వ్యవసాయరంగం
* ప్రణాళికా కాలంలో పారిశ్రామికాభివృద్ధి మొ॥వి.

ముఖ్యాంశాలు:

12.1. పరిచయము

12.2. ప్రణాళికలకు లభ్యమయ్యే వనరుల వర్గీకరణ

12.2.1. అంతర్గత లేదా స్వదేశీ వనరులు

12.2.2. బహిర్గత వనరులు.

12.3. వివిధ ప్రణాళికా కాలంలో వనరుల సమీకరణ

12.3.1. మొదటి ప్రణాళిక

12.3.2. రెండవ ప్రణాళిక

12.3.3. మూడవ ప్రణాళిక

12.3.4. వార్షిక ప్రణాళికలు

12.3.5. 4 వ ప్రణాళిక

12.3.6. 5 వ ప్రణాళిక

12.3.7. 6 వ ప్రణాళిక

12.3.8. 7 వ ప్రణాళిక

12.3.9. 8 వ ప్రణాళిక

12.3.10. 9 వ ప్రణాళిక

12.3.11. 10 వ ప్రణాళిక

12.4. ప్రణాళికల వనరుల సమీకరణ - సమీక్ష.

12.4.1. వివిధ ప్రణాళికలకు వనరులు సమకూర్చు విధానం

12.4.2. వివిధ ప్రణాళికలలో వివిధ మూలాల నుండి ద్రవ్యవనరుల సమీకరణ

12.5. ప్రణాళికా కాలంలో వనరుల కేటాయింపు తీరు తెన్నులు.

12.5.1. మొదటి ప్రణాళిక

12.5.2. రెండవ ప్రణాళిక

12.5.3. మూడవ ప్రణాళిక

12.5.4. వార్షిక ప్రణాళిక

12.5.5. 4 వ ప్రణాళిక

12.5.6. 5 వ ప్రణాళిక

12.5.7. ఆరవ ప్రణాళిక

12.5.8. 7 వ ప్రణాళిక

12.5.9. 8 వ ప్రణాళిక

12.5.10. 9 వ ప్రణాళిక

12.5.11. 10 వ ప్రణాళిక

12.6. ప్రణాళికలు - ప్రాధాన్యత క్రమంలో మార్పులు.

12.7. పారిశ్రామికాభివృద్ధిపై ప్రణాళికల పాత్ర. (మొదటి ప్రణాళిక నుండి - 10 వ ప్రణాళిక వరకు)

12.8. వ్యవసాయరంగం అభివృద్ధిపై ప్రణాళికల పాత్ర. (మొదటి ప్రణాళిక నుండి 10వ ప్రణాళిక వరకు)

12.9. ముగింపు

12.10. ముఖ్య పదాలు.

12.11. స్వయం మదింపు ప్రశ్నలు

12.12. చదవవలసిన పుస్తకాలు.

12.1. పరిచయము :

ఆర్థిక ప్రణాళికల నిర్వహణకు వనరులు సమకూర్చాలి. ప్రణాళికలను విజయవంతం చేయడానికి, సమర్థవంతంగా అమలు జరపడానికి ప్రధానంగా ఎదురయ్యే ఇబ్బంది వనరుల సమీకరణ. ప్రణాళికల పరిమాణం (మనదేశంలో) ఎక్కువ. అందువల్ల వనరుల అవసరం చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రణాళికలను తయారు చేయడం, ప్రాథాన్యతాక్రమాలను నిర్ధారించటం చాలా సులభమైనవని. కాని వాటిని సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన నిధులను సమీకరించడం చాలా కష్ట సాధ్యమయిన విషయం. ఏ ప్రణాళిక విజయం అయినా భౌతికంగా లభించే వనరుల సమీకరణ. మీదే ఆధారపడి ఉంటుంది. వనరుల సమీకరణ లేకుండా ప్రణాళికను గురించి ఆలోచించటమంటే చీకట్లో గెంతటమే అవుతుంది. నిజానికి ప్రణాళికా సంఘం అమలు చేయడానికి మనదేశంలో వనరులు ఎలా సమకూరుతున్నాయనే అంశం ఈ పాఠంలో మీరు చదువుతారు.

12.2. ప్రణాళికలకు లభ్యమయ్యే వనరుల వర్గీకరణ :-

ప్రణాళికను రూపొందించిన తరువాత దానికి అవసరమయిన వనరులను సమకూర్చుకొనుటకు ప్రయత్నాలు ప్రారంభిస్తారు. వివిధ రూపాల్లో వనరులు సంక్రమిస్తాయి. ప్రణాళికలకు లభ్యమయ్యే వనరులు అంతర్గతంగాను, బహిర్గతంగాను లభిస్తాయి. అందువల్ల వీటిని రెండురకాలుగా విభజించవచ్చు. అవి

1. అంతర్గత లేదా స్వదేశ వనరులు

2. బహిర్గత వనరులు.

12.2.1. అంతర్గత లేదా స్వదేశ వనరులు :- ప్రణాళికలకు అవసరమయిన వనరులను అంతర్గతంగా లేదా దేశీయంగానే సమీకరించినట్లయితే దానిని అంతర్గత వనరులుగా పేర్కొంటారు. అంతర్గత వనరులను స్థూలంగా తిరిగి రెండు రకాలుగా విభజించవచ్చు. అవి A. బడ్జెటు వనరులు B. స్వదేశీ రుణాలు

A. బడ్జెటు వనరులు : బడ్జెటు పాదుపులు అంటె ప్రభుత్వం దేశంలో సమీకరించిన దేశీయ నిధులని చెప్పవచ్చు. వీటిని తిరిగి నాలుగు విధాలుగా విభజించవచ్చు. (1) ప్రస్తుత రాబడి నిల్వలు. ప్రస్తుత రాబడి నిల్వలు అనగా ప్రస్తుత వ్యయం కంటె అదనంగా ఉన్న నిల్వలు. ఇవి ప్రణాళికకు ముందున్న పన్నురేట్లపై ఆధారపడి ఉంటాయి. (2) అదనపు నిల్వలు : వనరుల సమీకరణలో అతి ముఖ్యమయిన భాగంగా అదనపు నిల్వలను చెప్పవచ్చును. దీనిలో అదనపు పన్నులు, ప్రభుత్వరంగ సంస్థల నుండి అదనపు రాబడులు కలిసి ఉంటాయి. మూడవ అంశంగా రిజర్వు బ్యాంకు లాభాలను పేర్కొనవచ్చు. రిజర్వు బ్యాంకుకు వచ్చే లాభాలు మనదేశంలో వనరుల సమీకరణలో ప్రధానమైన వనరులలో ఒకటిగా తీసుకుంటారు. మనదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ప్రభుత్వరంగం విస్తరిస్తూ ఉంది. కాని విచారించ వలసిన విషయమేమంటె ఈ సంస్థలు దేశానికి అవసరమయిన వనరులు సమకూర్చలేక పోతున్నాయి. అంతేకాక ఖాయిలా పడుచున్నాయి. ప్రభుత్వరంగం మిగుళ్ళు ప్రణాళికలో వనరుల భాగంగా పేర్కొన్నారు. కాని ప్రభుత్వ రంగం మిగుళ్ళు వనరుల్లో ఒక భాగంగా పేర్కొనుట ఇప్పటి పరిస్థితుల్లో సాధ్యం కాదు.

B. స్వదేశీ రుణాల ద్వారా వనరుల సేకరణ :- స్వదేశీ రుణాలలో అనేక అంశాలు కలిగి ఉంటాయి. పాదుపులు, ప్రభుత్వ రుణాలు, డిపాజిట్లు, ప్రావిడెంట్ ఫండ్, లోటు ద్రవ్య విధానం, మరియు ఇతర మార్గాల ద్వారా దేశీయంగా వనరులను సమీకరిస్తారు. మనదేశంలో 1951 నుండి పాదుపు చేయుటకు ప్రోత్సాహకాలు ఇచ్చుటకు అనేక చర్యలు తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా వాణిజ్య బ్యాంకులు, భీమా కంపెనీలు, పోస్టాఫీసులు మొదలయినవి పొదుపును ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరము వేలాది కోట్ల రూపాయలను సమీకరిస్తున్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా పాదుపు చేయుటకు ముందుకు రాని పక్షంలో ప్రభుత్వాలు నిర్భంధంగా నయినా పొదుపు చేయించాలని నర్క్సె పేర్కొన్న విషయాన్ని కొన్ని సందర్భాలలో పాటించాలి. పాదుపుల ద్వారానే కాక అవసరమయినపుడు ప్రజలనుంచి సేకరించే రుణాలు, ప్రభుత్వ రంగ సంస్థలనుంచి సేకరించే రుణాలు, మార్కెటు రుణాలు ఆర్థిక సంస్థల నుంచి సేకరించే రుణాలు ప్రభుత్వ రుణాలుగా పేర్కొంటారు. వీటి ద్వారా ప్రణాళిక ధ్యేయాలు నెరవేర్చుటకు వనరులు సేకరిస్తారు. నిర్భంధ డిపాజిట్లు, ప్రైజ్ గోల్డ్ బాండిలు, యాన్యుటీ డిపాజిట్లు మొదలయిన వాటి ద్వారా డిపాజిట్లు సేకరిస్తారు. ఈ మార్గాలే కాక అదనపు ద్రవ్యాన్ని ముద్రించి వనరులను సేకరిస్తారు. అదనపు ద్రవ్యాన్ని ముద్రించి చెలామణిలో పెట్టడాన్ని లోటుద్రవ్య విధానం అంటారు. లోటుద్రవ్య విధానం దీనికి అవసరమయిన ఒక మార్గం. రాష్ట్ర సమీకరణ నిధి, కేపిటల్ రిసీట్సు మొదలయినవి ఇతర వనరుల మార్గాలుగా పేర్కొంటారు. పైన చెప్పిన అంశాలన్నీ అంతర్గత వనరులుగా పరిగణిస్తారు.

12.2.2. బహిర్గత వనరులు :- ప్రణాళికా వనరులను బహిర్గతంగా కూడా సేకరిస్తారు. విదేశీ సహాయంతో విదేశాల నుంచి లభించిన గ్రాంట్లు, రుణాలు, సహాయం, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సి మొదలయిన వాటి నుండి సేకరించిన రుణాలు బహిర్గత వనరులుగా వివరిస్తారు. అంతర్గత, బహిర్గత వనరులు సరిపడినంతగా లేని పక్షంలో ప్రభుత్వం లోటుద్రవ్య విధానం ద్వారా అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఇవన్నీ ప్రభుత్వరంగంలో ప్రణాళిక వనరుల సమీకరణకు సంబంధించినవి. దీనితో పాటుగా ప్రయివేటు రంగం నుండి కూడా వనరుల సమీకరణ జరుగుతుంది. వాటిని కూడా పరిశీలించుట ఎంతైనా అవసరం.

వ్యక్తులు స్వహాసిద్ధంగా చేసిన పొదుపులు, కంపెనీలు మరియు సంస్థలు చేసే పొదుపులు, బ్యాంకుల ద్వారా వినియోగంలోకి వస్తాయి. అంతేకాక ప్రభుత్వ రంగ పారిశ్రామిక విత్త సంస్థలయిన పారిశ్రామిక ఆర్థిక సహాయ సంస్థ, రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలు, పరిశ్రమల పరపతి, పెట్టుబడుల సంస్థ, పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు మొదలయినవి ప్రయివేటు సంస్థల కందించే నిధులుగా చెప్పవచ్చు.

ప్రయివేటు పరంగా మార్కెట్లో షేర్లు, డింబెంచర్లు, డిపాజిట్లు మొదలయిన వాటిద్వారా అత్యధిక మొత్తాలలో నిధులు సేకరిస్తారు. చివరిగా విదేశీ నిధులు ఈక్విటీ మూలధనరూపంలో, విదేశీ సహాయంతో సంయుక్త నిర్వహణ, ప్రవాస భారదతీయుల నుంచి పెట్టుబడులు, ఈక్వేటీ రూపంలో నిధులు, అంతర్జాతీయ ఫైనాన్సు కార్పోరేషన్లు ప్రపంచ బ్యాంకు రుణాలు మొదలయినవి ప్రయివేటు రంగంలో వనరులుగా పేర్కొనవచ్చు.

12.3. వివిధ ప్రణాళికా కాలంలో వనరుల సమీకరణ :

మన ప్రణాళికలలో వనరుల సేకరణ వివిధ రూపాల్లో ఉంది వాటిని క్రింద వివరించడమయినది.

12.3.1. మొదటి ప్రణాళిక - వనరులు సమీకరణ :- మొదటి ప్రణాళిక (1951-56) అనేక ఆశయాలు నెరవేర్చుట లక్ష్యాలుగా తయారు చేయడం జరిగింది. అందువల్ల అధిక మొత్తంలో వనరుల కేటాయింపు జరిగింది. అందుకు అవసరమయిన వనరులను క్రింది తెలిపిన మార్గాల ద్వారా సేకరించారు. ఈ ప్రణాళికలో మొత్తం ప్రభుత్వంరంగ వ్యయం రూ.1960 కోట్లు గా నిర్ణయించారు. దీనిలో ప్రభుత్వం రూ.1352 కోట్లను దేశీయ వనరుల ద్వారా సమకూర్చుకొనగా, రూ. 188 కోట్లు విదేశీ సహాయంతో, రూ.420 కోట్లు లోటు బడ్జెటు ద్వారా సమకూర్చుకున్నది. వనరుల సమీకరణకు సంబంధించిన వివరాలు క్రింది విధంగా ఉన్నాయి. ఈ ప్రణాళికలో పెట్టుబడి వ్యయంలో పీలయినంత మేర ప్రస్తుత ఆదాయం నుంచి సమకూర్చుకోవాలని ప్రభుత్వం తలంచింది. ప్రభుత్వ కోశ విధానంలో ఈ విషయాన్ని ప్రధాన అంశంగా తీసుకోవడం జరిగింది. వనరుల సమీకరణ విధానం ఈ ప్రణాళికలో క్రింద విధంగా ఉంది.

పట్టిక 12.1. మొదటి ప్రణాళిక - వనరుల సమీకరణ

	అంశం	మొత్తం (కోట్లరూ॥లు)	శాతం
1.	పన్నులు, రైల్వేల నుంచి మిగులు	752	38
2.	మార్కెటు రుణాలు	205	10
3.	చిన్న మెత్తాల పొదుపులు, ఫండేతర రుణాలు	304	16
4.	ఇతర మూలధన వసూలు	91	5
5.	విదేశీ సహాయం	188	10
6.	లోటు బడ్జెటు	420	21
	మొత్తం	1960	100

ప్రభుత్వం ఈ ప్రణాళికకు అవసరమయిన ఆదాయం నిర్ధారించుకున్న విధానం వాస్తవంలో పరిస్థితి అంత ప్రోత్సహకంగా లేదని చెప్పవచ్చు. ఎగుమతి పన్నులు పోగా అదనపు పన్ను ద్వారా రూ.176 కోట్లు సమీకరించారు. రాష్ట్రప్రభుత్వాలు 230 కోట్ల రూ॥లు వరకు సమీకరించ వలసి ఉండగా కేవలం రూ। 60 కోట్ల మాత్రమే లభించాయి. రాష్ట్రాలు తమ ఆదాయాల నుండి 410 కోట్ల రూపాయలు సమకూర్చుకోవలసి ఉండగా కేవలం 269 కోట్ల రూ॥లు సమకూర్చుకున్నాయి. రైల్వేల పరిస్థితి మరింత దారుణంగా ఉంది రూ.170 కోట్లు బదులుగా రూ॥115 కోట్లు మాత్రమే సమకూర్చాయి. అయితే ద్రవ్యమార్కెటు పుంజుకోవడం వల్ల రుణాల ద్వారా ఆశించిన మొత్తాల కన్నా ఎక్కువగా అనగా రూ.155 కోట్లు నిర్దేశిత మొత్తం కాగా 205 కోట్ల రూపాలయలు వాస్తవంగా వసూలు చేసారు. చిన్న మొత్తాల పొదుపులు అన్‌ఫండెడ్ రుణాలు కూడా లక్ష్యం కన్న ఎక్కువగా ఉన్నాయి. ఇవి 34 కోట్ల రూపాయలు. పరిస్థితులు ఇలా ఉండగా బాధకరమయిన విషయమేమంటె ప్రభుత్వ రంగంలోని అభివృద్ధి కార్యక్రమాలకుగాను గ్రాంట్లు, రుణాల రూపంలో రూ. 296 కోట్ల విదేశీ సహాయంగా లభించగా అందులో రూ. 188 కోట్లు మాత్రమే వినియోగించారు. లోటు బడ్జెటు పద్దతి

ఈ ప్రణాళికా కాలంలోనే మొదలయింది. ద్రవ్యలోటు రూ. 290 కోట్లకు పరిమితి చేయాలని తలచినా చివరకది రూ.420 కోట్లకు చేరింది.

12.3.2. రెండవ ప్రణాళిక (1956-1961) :- రెండవ ప్రణాళికలో ప్రణాళికా సంఘం వారు ముందుగా లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని సాధించడానికి అవసరమయిన ద్రవ్య వనరులను సమీకరించుటకు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రభుత్వ రంగంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగడానికి రూ.4800 కోట్లు అవసరం అవుతుందని మొదటిలో భావించినప్పటికీ చివరకది రూ. 4600 కోట్లకు పరిమితమయింది.

12.3.3. మూడవ పంచవర్ష ప్రణాళిక (1961-66) :- ప్రణాళిక రూపకల్పనలో - అవసరమయిన వనరులు సేకరణ అంచనా విలువ కన్నా తక్కువగా జరిగింది. సుమారుగా 7500 కోట్ల రూ॥లు మేరకు ద్రవ్య వనరులు అందుబాటులో ఉంటాయని భావించినారు. భౌతిక కార్యక్రమాల మీద జరిగే వ్యయం 8000 కోట్ల రూ॥లు ఉంటుందని తలిస్తే ప్రణాళికాంతానికి రూ.8630 కోట్లకు చేరింది. వీటికి అవసరమయిన వనరుల సేకరణ క్రింది మార్గాల ద్వారా జరిగింది.

పట్టిక :12.2. 3వ ప్రణాళిక - వనరుల సమీకరణ (ప్రభుత్వ రంగం)

	అంశం	మొత్తం (కోట్ల రూ॥లో)	శాతం
1.	ప్రస్తుత ఆదాయం నుంచి లభించే మిగులు	470	5.4
2.	రైల్వేల నుంచి లభించే మిగులు	80	0.9
3.	ఇతర ప్రభుత్వ సంస్థల నుండి లభించేవి	395	4.5
4.	రుణాలు (నికరం)	915	10.6
5.	చిన్న మొత్తాల పాదుపు (నికరం)	585	6.8
6.	ప్రావిడెంట్ ఫండ్, డిపాజిట్లు	640	74
7.	అదనపు పన్నులు	2880	33.4
8.	విదేశీ సహాయం	2455	28.4
9.	లోటు బడ్జెట్	1150	13.4
	మొత్తం	8630	100

బడ్జెట్ వనరులు ప్రస్తుత ఆదాయం నుంచి లభించే మిగులు, రైల్వేల నుంచి లభించే మిగులు, ఇతరు ప్రభుత్వ సంస్థల నుంచి లభించే మిగులు, నికర రుణాలు నికర చిన్న మొత్తాల పాదుపులు, ప్రావిడెంట్ ఫండ్ ఇతర డిపాజిట్లు, అదనపు పన్నులు, ద్వారా రూ.4750 కోట్లు అనగా 63.2 శాతం సమకూర్చాలని నిర్ణయించగా రూ.5025 కోట్లు అంటే 58.2 శాతం మాత్రమే వీలయింది. ప్రస్తుత ఆదాయం నుంచి లభించే మిగులు రెండవ ప్రణాళికలో వలే ఆశించిన విధంగా సమకూరలేదు. ఇవి రూ. 550 కోట్లుగా భావిస్తే రూ. 470 కోట్ల వచ్చాయి. ప్రభుత్వ రుణాల విషయంలో పరిస్థితి అనుకూలంగా ఉన్నప్పటికీ పాదుపు విషయంలో అసంతృప్తిని మిగిల్చింది. రైల్వేలు, ప్రభుత్వ రంగం సంస్థలు పరిస్థితి ఈ విధంగానే ఉండి వీటితోపాటు డిపాజిట్లు ద్వారా రూ.100 కోట్లు అదనపు పన్నుల నుండి 1170 కోట్ల రూ॥లు విదేశీ సహాయం ద్వారా రూ.255 కోట్లు అదనంగా లభించాయి. ద్రవ్యలోటు రూ.550 కోట్లుగా అంచనవేయగా అది రెట్టింపై 1150 కోట్ల రూ॥లకు చేరింది. వనరుల సమీకరణలో ద్రవ్య లోటు ముఖ్యమయిన పాత్ర పోషిస్తుంది.

12.3.4. వార్షిక ప్రణాళికలు (1966-69) :- మూడవ ప్రణాళికా కాలంలో సంభవించిన పరిణామాల వల్ల వెంటనే 4వ ప్రణాళికను ప్రారంభించకుండా వార్షిక ప్రణాళికలను అమలు పరిచారు. 3వ ప్రణాళిక కాలంలో మొదటి మూడు సం॥లు తీవ్ర అనావృష్టికి దేశం గురికాగా, 1962 లో చైనాతోను 1965 లో పాకిస్థాన్‌తోను జరిగిన యుద్ధం వల్ల రక్షణ వ్యయం పెరిగిపోయింది. విదేశీ సహాయం నిలిపివేత, 1966 లో రూపాయి విలువ తగ్గింపుతో ధరలు పెరుగుదల మొ॥ కారణాల వల్ల నిధులు కొరత ఏర్పడటం వల్ల ప్రణాళికా శెలవుగా ప్రకటించారు. వాటి స్థానే 3 వార్షిక ప్రణాళికలు ప్రారంభించారు. ఈ మూడు వార్షిక ప్రణాళికలలో మొత్తం ప్రభుత్వరంగ వ్యయం రూ. 6628 కోట్లు.దీనిలో బడ్జెట్ వనరుల ద్వారా 3542 కోట్లు (53.4%), లోటు ద్రవ్యం ద్వారా రూ. 675 కోట్లు అంటె 10.2 శాతం, విదేశీ సహాయం ద్వారా రూ.2410 కోట్లు (36.4%) సమకూర్చు కోవడం జరిగింది.

12.3.5. వాలుగో ప్రణాళిక (1969-1974) :- ఈ ప్రణాళికలో నిర్దేశిత మొత్తం 15902 కోట్లు రూ॥లు ప్రభుత్వరంగం అంతమొత్తాన్ని అంచనావేయగా 16160 కోట్లు రూపాయలు మాత్రమే వ్యయం వీలయింది. ఈ ప్రణాళికకు అవసరమయిన వనరులను క్రింది వాటి ద్వారా సంపాదించారు.

పట్టిక. 12.3. వాల్గవ ప్రణాళికలో వనరుల సమీకరణ :

	అంశం	మొత్తం (కోట్లరూ॥లలో)	శాతం
1.	ప్రస్తుత ఆదాయం నుండి లభించే మిగులు	1673	10.5
2.	ప్రభుత్వ సంస్థలు సమకూర్చే మిగులు	2231	14.0
3.	రుణాలు ద్వారా సమీకరణ	1820	11.4
4.	చిన్న మొత్తాల పొదుపు ద్వారా	769	4.8
5.	ప్రావిడెంట్ ఫండ్, డిపాజిట్లు మొ॥వి	2241	14.1
6.	అదనపు వనరుల సమీకరణ	3198	20.1
7.	భీమా సంస్థల నుండి, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుండి సేకరించే రుణాలు	506	3.1
8.	విదేశీ సహాయం	2614	16.4
9.	లోటు ద్రవ్యం	850	5.3
	మొత్తం	15902	100.

ఈ ప్రణాళిక లో దేశీయ వనరులపై ఎక్కువగా ఆధారపడేలా నిర్ణయం తీసుకున్నారు. అందువల్ల 74 శాతం వరకు బడ్జెటు వనరుల ద్వారా 26 శాతం (1460 కోట్లు) విదేశీ సహయం మరియు లోటు ద్రవ్య విధానం ద్వారా లభించాయి.

12.3.6. 5వ ప్రణాళిక (1974-79) :- ఈ ప్రణాళికలో ప్రయివేటు మరియు ప్రభుత్వ రంగాలు కలిసి మొత్తం రూ॥54,400 కోట్లుగా నిర్ణయించారు. దీనిలో 37,250 కోట్లురూపాయలు ప్రభుత్వ రంగం వాటాకాగా దీనిని 39,303 కోట్ల రూపాయలకు పెంచటం జరిగింది. ఈ మొత్తాల సమీకరణ క్రింది విధంగా ఉంది.

పట్టిక . 12.4. 5వ ప్రణాళిక - వనరుల సమీకరణ :

	అంశం	మొత్తం (కోట్ల రూ॥లలో)
1.	బడ్జెటు వనరులు	7348
2.	ప్రస్తుత ఆదాయం నుండి లభించే మిగులు	5612
3.	ప్రభుత్వ సంస్థల నుండి లభించే మిగులు	5988
4.	రుణాల ద్వారా	7232
5.	చిన్న మొత్తాల పొదుపు	1850
6.	ప్రావిడెంటు ఫండ్	1280
7.	ద్రవ్య సంస్థల నుండి నిర్ణీత రుణాలు	895
8.	ఇతర వనరులు	6850
9.	విదేశీ సహాయం	2443
10.	లోటు ద్రవ్యం	1000.

ఈ మొత్తాలలో 82 శాతం దేశీయ వనరుల ద్వారా సమకూర్చు కోవడం జరిగింది. అంతేకాకుండా విదేశీ సహాయం ద్వారా రూ. 5830 కోట్లు (15 శాతం), మిగిలిన 3 శాతం ద్రవ్య లోటు ద్వారా సమకూర్చినారు.

12.3.7. ఆరవ ప్రణాళిక 1980-85 :- ప్రస్తుత ధరలో ఈ ప్రణాళిక యొక్క మొత్తం పెట్టుబడి, 1,10,820 కోట్లు. దీనిలో ప్రభుత్వ రంగం వాటా 97500 కోట్లు రూపాయలు. ఈ ప్రణాళిక యొక్క వనరుల సమీకరణ ఇలా ఉంది. ప్రస్తుత ధరలో వివరించాము.

పట్టిక. 12.4. ఆరవ ప్రణాళికలో వనరుల సమీకరణ

	అంశం	కోట్ల రూ॥లు (ప్రస్తుత ధరల్లో)	శాతం
	A. దేశీయ బడ్జెటు వనరులు.	86610	78
1.	ప్రస్తుత ఆదాయం నుండి లభించే మిగులు :	1890	2
2.	ప్రభుత్వరంగ సంస్థల ద్వారా మిగులు	5810	5
3.	అదనపు వనరులు	20150	18
	(ఎ) అదనపు పన్నులు	12820	12
	(బి) ప్రభుత్వరంగ సంస్థలు	22120	20
4.	మార్కెటు రుణాలు	23820	21
5.	ఇతర అంతర్గత ప్రయివేటు పొదుపు	8530	8
B.	విదేశీ నిధులు	15680	14

లోటు బడ్జెటు

ఈ ప్రణాళికలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కరెంటు ఖాతా వ్యయాన్ని అదుపులో ఉంచి అభివృద్ధి కోసం నిధులను సమకూర్చుకోవాలని ప్రణాళికా సంఘం అభిప్రాయపడింది. కాని మిగులు కంటె లోటు పెరగడం కనిపించింది. ప్రభుత్వరంగం సంస్థల అంతర్గత మిగుళ్లు, లాభాల ద్వారా 9400 కోట్లు రూపాయలు, ప్రయివేటు పొదుపు ద్వారా 37 శాతం వనరులు సమకూరుతాయని ఆశించారు. దానితో పాటు రూ.21300 కోట్లు అదనపు వనరుల సమీకరణ ద్వారాను, 10930 కోట్ల రూ॥లు విదేశీ సహాయంగాను భావించారు. లోటు బడ్జెటు ద్వారా 5000 కోట్ల రూ॥లు (5 శాతం) గా ఆశించినా అది 14 శాతానికి (15680 కోట్లు) చేరింది. ధరల పెరుగుదల ప్రణాళికేతర వ్యయం పెరుగుదల వల్ల అంచనాలు తారుమారయినాయి.

12.3.8. ఏడవ ప్రణాళిక 1985-1990 :- ఈ ప్రణాళిక వనరుల సేకరణ ఏవిధంగా ఉంది పట్టిక 12.5 ద్వారా తెలుసుకోవచ్చును.

పట్టిక 12.5. 7 వ ప్రణాళికలో వనరుల సమీకరణ

అంశం	కోట్లు రూ॥ల ప్రస్తుత ధరల్లో	శాతం
1. దేశీయ బడ్జెటు వనరులు	35988	19.7
(A) ప్రస్తుత ఆదాయాల నుండి మిగులు	14261	7.8
(B) ప్రభుత్వరంగ సంస్థల వాటా మిగులు	13246	7.2
(C) అదనపు వనరులు	37003	20.3
2. కాపిటల్ నికర రాబడులు	103232	56.5
3. విదేశీ సహాయం	15139	8.3
4. లోటు బడ్జెటు	28457	15.5

7 వ ప్రణాళికలో వనరుల సేకరణ అంచనాలకు తుది అంచనాలకు చాలా వ్యత్యాసం ఉంది. వనరుల సమీకరణ మరియు వ్యయాన్ని అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమయింది. కరెంటు ఖాతాలో మిగులు లేదు. ఈ ప్రణాళిక ఎక్కువగా రుణాల మీద ఆధార పడింది. లోటు ద్రవ్యాన్ని నివారించలేకపోయారు.

12.3.9. ఎనిమిదవ ప్రణాళిక 1992-97 :- 8 వ ప్రణాళికలో రూ. 4,38,000 కోట్లు ప్రభుత్వ రంగం పెట్టుబడిగా మొత్తం 8,71,000 కోట్లుగా పెట్టుబడిని నిర్ణయించారు. ప్రభుత్వం వాటా సుమారుగా 49.5 శాతంగా పేర్కొన్నారు. మొత్తం మీద ఈ ప్రణాళికలో వనరుల సమీకరణ లక్ష్యం క్రింద తెలిపిన విధంగా ఉన్నవి.

పట్టిక. 12.6. 8వ ప్రణాళిక వనరుల సమీకరణ :

అంశం	మొత్తం (కోట్లు రూ॥లు)	శాతం
1. దేశీయ వనరులు		
(ఎ) ప్రభుత్వ ఆదాయాల్లో మిగులు	35005	8.1
(బి) ప్రభుత్వరంగ సంస్థల చెల్లింపులు	148140	34.1
(సి) రుణాలు, యితర మూలధన రాబడులు	202255	46.6
2. విదేశాల నుండి నికర రాబడి	28 700	6.6
3. లోటు బడ్జెటు	20,000	4.6
మొత్తం	434100	100

12.3.10. 9 వ ప్రణాళిక (1997-02) :

9 వ ప్రణాళికలో వనరుల సమీకరణ క్రింది విధంగా ఉంది. ప్రభుత్వరంగం నుండి సుమారుగా 8,59,200 కోట్లు కాగా ఇందులో కేంద్రం రూ.4,92,221 కోట్లు, రాష్ట్రాలకు 3,66,979 గా పేర్కొన్నారు.

పట్టిక. 12.7. 9వ ప్రణాళిక వనరుల సమీకరణ (1996- ధరలలో)

అంశం	మొత్తం (కోట్లు రూ॥లు)	శాతం
కరెంటు రాబడులు	1406	0.2
ప్రభుత్వరంగ సంస్థల రాబడులు	340049	39.6
రుణాలు	460179	53.6
దేశీయంగా విదేశీ ప్రవాహాలు	60018	7.0
ద్రవ్యలోటు		-
మొత్తం	859200	100

9 వ ప్రణాళికలో కరెంటు రాబడులు ఆశించిన విధంగా లేవు. అంతేకాకుండా ఈ ప్రణాళికలో ద్రవ్యలోటును నివారించుటకు ప్రయత్నాలు ప్రారంభించారు. మొత్తం మీద కేంద్రం తరుపున 77 శాతం రాష్ట్రాల ద్వారా 23 శాతం వనరులు సమీకరణ చేయుటకు ప్రయత్నించారు.

12.3.11. 10వ ప్రణాళిక :- పదవ ప్రణాళికలో వనరుల సమీకరణ క్రింది విధంగా నిర్ణయించారు.

10 వ ప్రణాళికలో వనరుల సమీకరణ: పట్టిక. నెం. 12.8.

వ.నెం.	అంశం	మొత్తం (రూ.కోట్లలో)	శాతం
1.	కరెంటు లావాదేవీల నుండి	20,193	1.3
2.	అప్పులు (మిస్‌లేనియస్ మూలధన రిసీట్లు కలిపి)	9,46,667	59.4
3.	ఇతర దేశాల నుండి ఇన్‌ఫ్లోస్	27,200	1.7
4.	ప్రభుత్వరంగ సంస్థల నుండి	5,98,240	37.6
	మొత్తం	15,92,300	100.0

ఈ ప్రణాళికలో వనరుల సమీకరణలో అధిక భాగం అప్పులపై ఆధారపడినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలు వనరుల ద్వారా 37.6 శాతం వనరులను సమీకరించుట అంచనాగా తీసుకున్నారు.

12.4. ప్రణాళికల వనరుల సమీకరణ - సమీక్ష :-

ఆయా ప్రణాళికల కాలంలో ప్రణాళికలకు అవసరమయిన వనరులు ఏవిధంగా సమమకూర్చుకోవడం జరిగిందో తెలుసుకున్నాము. ఇపుడు వాటి గురించి అనగా వివిధ పంచవర్ష ప్రణాళికలకు వనరులు సమకూర్చిన తీరును మరియు వివిధ ప్రణాళికలకు వివిధ మూలాల నుండి లభించే ద్రవ్య వనరులు గురించి సమీక్షిద్దాం.

12.4.1. వివిధ ప్రణాళికలలో వనరులు సమకూర్చిన విధానం :- వివిద ప్రణాళికల వనరుల సమీకరణ విధానం యొక్క తీరుగల పట్టికలను గమనించినట్లయితే వనరుల సమీకరణలో ఎక్కువ భాగం దేశీయ బడ్జెటు వనరులని తెలుస్తుంది. రెండవ

మరియు 3 వ ప్రణాళికలను మినహాయిస్తే మిగిలిన అన్ని ప్రణాళికల యందు వీటి శాతం సుమారుగా 70 నుండి 80 శాతం వరకు ఉంది. మొదటి ప్రణాళిక విజయవంతం కావడంతో దానిని స్ఫూర్తిగా తీసుకొని రెండు మరియు 3 వ ప్రణాళికలో భారీ ఎత్తున విదేశీ వనరులు, లోటుద్రవ్యం ద్వారా వనరులు సమీకరణకు ఆసక్తిని చూపారు. అయితే 4వ ప్రణాళికలో స్వయం పోషకత్వం ధ్యేయం కావడం వల్ల విదేశీ సహాయం పై ఆధారపడుట వల్ల జరిగే అనర్థాలను గుర్తించుట జరిగి 13 శాతానికే విదేశీ సహాయంపై ఆధారపడుట జరిగింది. అయిదవ ప్రణాళికలో 15 శాతం, ఆరవ ప్రణాళికలో 8 శాతం ఎనిమిదవ ప్రణాళికలో 6.6 శాతం మాత్రమే ఈ సహాయం పరిమితంగా ఉండేలా జాగ్రత్త పడ్డారు. లోటుద్రవ్య విషయంపై కూడా దృష్టిని సారింపజేసారు. ఎందుకంటె ధరలు పెరుగుదల అనార్థాలకు దారి తీయుట లోటు ద్రవ్యం వల్లనే కాదా. అందువల్ల లోటు ద్రవ్యాన్ని క్రమేపి తగ్గింప తలపెట్టారు. ఎడవ ప్రణాళికలో 15.5 శాతం చేరుకోవడంతో ఆందోళన చెంది 8వ ప్రణాళిక నాటికి 4.6 శాతానికి పరిమితం చేసారు. 9 వ ప్రణాళికలో మరింతగా తగ్గింప తలచారు. అయినా లోటు ద్రవ్యాన్ని అదుపుచేయలేక పోయారు. ఇప్పటి పరిస్థితుల్లో 9 మరియు 10 ప్రణాళికల యందు విదేశీ రుణాలతో పాటు ప్రభుత్వరంగ సంస్థలు వాటాను విక్రయించుట ద్వారా కొంత వరకు వనరులను సమీకరించుటకు ప్రయత్నాలు చేస్తున్నారు. వనరుల సమీకరణలో నూతన ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

12.4.2. వివిధ ప్రణాళికలకు వివిధ మూలాల నుంచి ద్రవ్య వనరుల సమీకరణ :- ప్రణాళికా విజయం అనేది వనరుల లభ్యత మీద ఆధారపడి ఉంటుందని ముందే తెలుసుకున్నాం. వనరులు లేనపుడు, సమకూరనపుడు ఎంత గొప్పగా నిర్మించిన ప్రణాళిక అయినప్పటికీ అనుకున్న లక్ష్యాలను సాధించలేము. కావున వనరుల సమీకరణకు ప్రణాళికలలో అత్యంత ప్రాధాన్యముంది. ప్రభుత్వానిక అందుబాటులో ఉంటే ద్రవ్య వనరులను అంతర్గత, బహిర్గత వనరులని రెండుగా విభజించవచ్చునని ముందుగానే పేర్కొనటం జరిగింది. మన ప్రణాళికలకు ఏ ఒక్క వనరుతో ప్రణాళికావసరాలు తీరవు. అందువల్ల అన్ని మూలల నుండి లభించే వనరులను సమీకరించుకోవలసి ఉంటుంది. మన ప్రణాళికలకు ప్రధానంగా పన్నులు, రుణాలు, చిన్న మొత్తాల పొదుపు, ప్రభుత్వ సంస్థల మిగుళ్ళు, లోటుద్రవ్యం, మరియు విదేశీ సహాయం ద్వారా సమీకరించుకోవడం జరుగుచున్నది.

మన దేశంలో ఆదాయం నుంచి లభించే మిగులు ప్రధానమయిన వనరు. పన్నులు గతంలో 20 నుండి 35 శాతం వరకు పన్నుల నుండి వచ్చేది కాని పేదవారి శాతం ఎక్కువ కావడం వల్ల పొదుపు శక్తి తగ్గింది. ధనికులు పొదుపు కన్నా ఆడంబర వినియోగానికి ఖర్చు చేయడం, గ్రామస్థాయిలో పొదుపు చేయుటకు తగిన సంస్థలు లేకపోవడం వల్ల పన్నులపైనే ఎక్కువ ఆధారపడుచున్నారు. పన్నుల్లో ప్రత్యక్ష పన్నులు ద్వారా అధిక ఆదాయం గలవారి నుండి ఎక్కువగా వసూలు వీలవుతుంది. దీనితో పాటు ఆర్థిక అసమానతలు నివారించే వీలుకలుగుతుంది.

పన్నులు పెంచుకుంటూ పోవడం వల్ల దుష్పలితాలు ఎదురవుతాయి. అందువల్ల ఒక స్థాయి వద్ద పన్నుల విధింపుకు పరిమితి విధించాలి. వేరే మార్గంగా రుణాలను పరిగణిస్తారు. రుణాలనేవి స్వచ్ఛందంగాను పన్నులకు పూరకంగాను ఉంటాయి. అందువల్ల కనీసవడ్డి చెల్లింపుతో రుణాలను తీసుకోవడం జరుగుతుంది. ప్రభుత్వం రుణాల ద్వారా ఆదాయ సమీకరణ చేస్తున్నారు.

వెనుకబడిన దేశం కావడం వల్ల ప్రజల ఆదాయస్థాయి తక్కువగా ఉండటం చేత చిన్న మొత్తాలు ద్వారా పొదుపును ప్రోత్సహిస్తూ వనరులను సమీకరిస్తున్నారు. పొదుపును ప్రోత్సహిస్తూ వనరులను సమీకరిస్తున్నారు. అల్పాదాయ వర్గం వారినుండి పన్నులు రూపంలో వసూలు ఉండవు. అందువల్ల వారి నుండి ఈ విధంగా వనరులు సేకరిస్తారు. ఆరోప్రణాళికా కాలంలో 9 శాతం ఏడో ప్రణాళికలో 10 శాతం చిన్న మొత్తాల ద్వారా పొదుపు లక్ష్యం కాగా 10వ ప్రణాళికలో సుమారుగా 18 శాతంగా నిర్ణయించారు.

ప్రభుత్వం నిర్వహించే ప్రభుత్వరంగ పరిశ్రమలు సుమారుగా 1993 నాటికి 245 ఉన్నాయి. సుమారుగా రూ. 1,46,871 కోట్లు పెట్టుబడి వీటిలో పెట్టారు. అందువల్ల వీటి ద్వారా లాభాలు ఆశించడం పరిపాటి. మొదటి రెండు ప్రణాళికల్లో వీటిద్వారా లాభాలు లేవు. రైల్వే రంగం మాత్రం రూ.382 కోట్లు సమకూర్చాయి. మూడవ ప్రణాళికలో మొత్తం పెట్టుబడిలో రైల్వేలు కాకుండా 7.7 శాతం, 7వ ప్రణాళికలో 19.7 శాతం వీటి నుండి వచ్చాయి. అయితే 9 మరియు 10 వ ప్రణాళికా కాలంలో వీటిలో ఎక్కువ నష్టాలు రావడంతో వీటి యొక్క వాటాను కొంత మేర విక్రయించుట ప్రణాళికలో భాగంగా పేర్కొంటున్నారు.

ప్రభుత్వరంగం నుండి మిగుళ్ళు లేక పోవడంతో వనరుల సేకరణకు అన్ని మార్గాల ద్వారా వనరులు చాలని పక్షంలో అంతిమ మార్గంగా లోటు ద్రవ్యాన్ని విధానాన్ని అవలంభిస్తున్నారు. లోటుద్రవ్యం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని ఆర్థిక వేత్తలు కొందరు పేర్కొనినా మితిమీరిన లోటు ద్రవ్యం వల్ల ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అందువల్ల క్రమేపీ లోటుద్రవ్య విధానాన్ని పరిమితం చేస్తున్నారు.

స్థాయికి మించిన వనరులు అవసరం ఉన్నపుడు ఆశయ సాధనకు విదేశాలనుండి రుణాల సహాయాన్ని పొందవలసి ఉంటుంది. అవకాశం ఉన్నంత మేరకు వాటిని ఉత్పాదక ఖర్చులుగా వినియోగిస్తే పర్వాలేదు. అంతేకాక విదేశీ సహాయం అన్ని వేళలా మంచిదికాదు. ఈ విషయాన్ని కూడా మన ప్రణాళికా సంఘం గుర్తించింది. అందువల్ల విదేశీ మూలధనం తేలిగ్గా లభిస్తున్నప్పటికీ దానికి అలవాటు పడకుండా ఉండుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మొదటి ప్రణాళికలో 10 శాతం వాటాగా ఉన్న విదేశీ సహాయం తరువాత కాలంలో '6' శాతం కన్నా తక్కువగా ఉండటం ఈ సందర్భంగా వివరించవచ్చు. అయితే ఇటీవల కాలంలో నూతన ఆర్థిక సంస్కరణల వల్ల విదేశీ సహాయం, పెట్టుబడులపై పరిమితులు లేకుండా పోయాయి. ఆర్థికాభివృద్ధికి ఒక మూలకంగా నేడు పేర్కొంటున్నారు. వీటి వల్ల కలిగే ప్రభావాలు ముందు ముందు తెలియవచ్చు.

12.5. ప్రణాళికలలో వనరుల కేటాయింపు తీరు తెన్నులు :-

వనరుల కేటాయింపు అంటే ప్రణాళికాలక్ష్యాలు గమ్యం చేరుటకు సమీకరించిన వనరులను ఆయా రంగాలకు ఎంత మొత్తంలో ఇస్తున్నారో తెలుపుతుంది. ఆర్థిక వ్యవస్థలో అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే పెట్టుబడులు సయితం సమతూకంలో ఉండాలి. మన దేశంలో వివిధ రంగాల ప్రాధాన్యతలను, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికా సంఘం వనరుల కేటాయింపు చేస్తుంది. అందువల్ల ప్రణాళికలలో ప్రాధాన్యతలు మారవచ్చును. ఆయా ప్రణాళికలను పరిశీలిస్తే ఈ విషయం గోచరిస్తుంది.

12.5.1. మొదటి ప్రణాళికలో వనరుల కేటాయింపు :- మొదటి ప్రణాళికలో ప్రాధాన్యతలు మిగతా ప్రణాళికల కన్నా భిన్నమయినవి. యుద్ధం వల్ల, దేశ విభజన వల్ల దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించుటకు అన్ని రంగాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకున్నారు. తద్వారా జాతీయాదాయం, ప్రజల జీవన ప్రమాణస్థాయిని పెంచుటకు అవకాశ ముంటుందని భావించారు. ఈ ప్రణాళికల్లో వివిధ రంగాలకు కేటాయింపులు ఇలా ఉన్నాయి.

పట్టిక. 12.9. మొదటి ప్రణాళికలో వనరుల పంపిణి :

వ.నెం.	అంశం	వ్యయం (కోట్లరూ॥లు)	మొత్తం (శాతంలో)
1.	వ్యవసాయం & అనుబంధరంగాలు	290.0	14.8
2.	నీటిపారుదల & వరదల నిరోధం	434.0	22.2
3.	విద్యుచ్ఛక్తి	149.0	7.6
4.	కుటీర & చిన్న పరిశ్రమలు	49.0	2.1
5.	పరిశ్రమలు మరియు ఖనిజాలు	55.0	2.8
6.	రవాణా & కమ్యునికేషన్లు	518.0	26.4
7.	విద్య మరియు శాస్త్ర పరిశోధన	149.0	7.6
8.	ఆరోగ్యం - కుటుంబ నియంత్రణ	98.0	5.0
9.	నీటి సరఫరా మరియు పరిశుభ్రత, గృహనిర్మాణం పట్టణ మరియు ప్రాంతీయ వృద్ధి	33.0	1.7
10.	వెనుకబడిన తరగతుల, కార్మిక సంక్షేమం	32.0	1.6
11.	ఇతర కార్యక్రమాలు	160.0	8.2
	మొత్తం	1960.0	100.0

ఈ ప్రణాళికలో మొత్తం వ్యయం రూ. 1960 కోట్లు కాగా దీనిలో 22.2 శాతం నీటిపారుదల, వరదల నివారణ వంటి కార్యక్రమాలకు కేటాయించారు. వ్యవసాయ ప్రాధాన్యత ప్రణాళిక కాబట్టి 14.8 శాతం కేటాయించారు. పారిశ్రామిక రంగానికి 2.8 శాతం మాత్రమే కేటాయించారు. పారిశ్రామిక రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల అనంతర కాలంలో విదేశీ మారకద్రవ్యం, ధరలు పెరుగుదల, ముడి పదార్థాల కొరత ఏర్పడినవి.

12.5.2. రెండవ ప్రణాళికలో వనరుల కేటాయింపులు :- ఈ ప్రణాళికను పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామిక రంగంలో భారీ పరిశ్రమల వ్యూహంతో ప్రారంభించారు. వివిధ రంగాల కేటాయింపులు క్రింది పట్టికలో చూపడమయినది.

పట్టిక.12.10 రెండవ ప్రణాళికలో ఆయా రంగాలకు వనరుల కేటాయింపు

వ.నెం.	అంశం	వ్యయం (కోట్లరూ॥లో)	శాతం
1.	నీటిపారుదల & వరదనిరోధం	430	9.2
2.	వ్యవసాయం& అనుబంధరంగాలు	549	1.7
3.	విద్యుచ్ఛక్తి	452	9.7
4.	కుటీర & చిన్న పరిశ్రమ	187	4.0
5.	పరిశ్రమలు & ఖనిజాలు	938	20.1
6.	రవాణా & కమ్యునికేషన్లు	1261	22.0
7.	విద్య & పరిశోధన	273	5.9
8.	ఆరోగ్యం & కుటుంబ నియంత్రణ	228	4.8
9.	నీటిపారుదల; పరిశుభ్రత, గృహనిర్మాణం, పట్టణ, ప్రాంతీయాభివృద్ధి	85	1.8
10.	వెనుకబడిన తరగతుల, కార్మిక సంక్షేమము	83	1.8
11.	ఇతర కార్యక్రమాలు	186	4.0
	మొత్తం	4672	100

ఈ ప్రణాళికలో మొత్తం 4672 కోట్ల రూ॥లు పెట్టుబడిలో సుమారుగా 20.1 శాతం పరిశ్రమలకు కేటాయించారు. రవాణా, కమ్యునికేషన్లకు అధికమొత్తంలో 24.6 శాతం కేటాయించారు. వ్యవసాయరంగానికి 12.7 శాతం కేటాయించారు. ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగానిక తగినంత ప్రాధాన్యత ఇవ్వనందున పరిశ్రమలకు అవసరమయిన ముడి పదార్థాల కొరత తీవ్రమయింది.

12.5.3. మూడవ ప్రణాళికలో వనరుల పంపిణీ :- మూవడ ప్రణాళికలో 5 శాతం వార్షిక వృద్ధి రేటు పెరుగుదల లక్ష్యంతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను విస్తృతం చేస్త ప్రాథమిక పరిశ్రమలైన రసాయనాలు, ఇంధనం, మెషనరీ, విద్యుత్ రంగాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. లభ్యమవుతున్న మానవ వనరులను వినియోగించి ఉపాధి అవకాశాలు పెంచు ధ్యేయంతో వివిధ రంగాలకు వనరులను పంపణీ చేసారు.

పట్టిక : 3 వ ప్రణాళికలో వివిధ రంగాలకు వనరుల పంపిణీ :

వార్షికవృద్ధి 5 శాతం లక్ష్యంగా, వ్యవసాయ, పారిశ్రామిక రంగాన్ని విస్తృతం చేస్తూ ప్రాథమిక పరిశ్రమలను అభివృద్ధి పరచు ధ్యేయంతో వనరులను క్రింది విధంగా ఆయారంగాలకు కేటాయించారు.

పట్టిక :12.11 3వ ప్రణాళికలో వనరుల పంపిణీ :

	విషయం	వ్యయం (కోట్లరూ॥లో)	శాతం
1.	వ్యవసాయ & అనుబంధ రంగాలు	1088.9	12.7
2.	నీటిపారుదల &.వరద నిరోధం	664.7	7.8
3.	విద్యుచ్ఛక్తి	1252	14.6
4.	కుటీర & చిన్న పరిశ్రమలు	240.8	2.8
5.	పరిశ్రమలు & ఖనిజాలు	1726.3	20.1
6.	రవాణా & కమ్యునికేషన్లు	2111.7	24.6
7.	విద్య	588.7	6.9
8.	శాస్త్ర పరిశోధన	71.6	0.8
9.	ఆరోగ్యం	225.9	2.6
10.	కుటుంబనియంత్రణ	24.9	0.3
11.	నీటిసరఫరా, పరిశుభ్రత	105.7	1.2
12.	గృహ నిర్మాణాలు పట్టన ప్రాంతీయాభివృద్ధి	127.6	1.5
13.	వెనుకబడిన తరగతుల సంక్షేమం	99.1	1.2
14.	సాంఘిక సంక్షేమం	19.4	0.2
15.	కార్మిక సంక్షేమం& వృత్తి పనివారల శిక్షణ	55.8	0.7
16.	ఇతర కార్యక్రమాలు	173.1	2.0
	మొత్తం	8576.5	100.0

3వ ప్రణాళికలో వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 1.2 శాతం వనరులను కేటాయించగా, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు 12.7 శాతం కేటాయించారు. పరిశ్రమలకు 20.1 శాతం, రవాణా, కమ్యునికేషన్లు రంగానికి 24.6 శాతం కేటాయించారు.

12.5.4. వార్షిక ప్రణాళికలు - వనరుల పంపిణీ :

మూడవ ప్రణాళికలో అస్తవ్యస్తంగా తయారయిన ఆర్థిక వ్యవస్థను తిరిగి పుంజుకొనుటకు వార్షిక ప్రణాళికల్లో చర్యలు తీసుకున్నారు. ఈ వార్షిక ప్రణాళికలో వనరుల పంపకం క్రింది విధంగా ఉన్నాయి.

పట్టిక: 12.12 వార్షిక ప్రణాళికలో వనరులు పంపకం

వ.నెం.	అంశం	మొత్తం (కోట్లరూ॥లో)	శాతం
1.	వ్యవసాయ & అనుబంధరంగాలు	1107.1	16.7
2.	నీటిపారుదల& వరదలు నిరోధం	471.0	7.1
3.	విద్యుచ్ఛక్తి	1212.5	18.3
4.	కుటీర & చిన్న పరిశ్రమలు	126.1	1.9
5.	పరిశ్రమలు & ఖనిజాలు	1510.4	22.8
6.	రవాణా & కమ్యునికేషన్లు	1222.4	18.5
7.	విద్య & శాస్త్ర పరిశోధన	354.2	5.3
8.	ఆరోగ్యం	140	2.1
9.	కుటుంబ నియంత్రణ	70.0	1.1
10.	ఇతరాలు	413.0	6.2
	మొత్తం	8576.5	100.0

వార్షిక ప్రణాళికలో పరిశ్రమలకు 22.8 శాతం కేటాయించగా పరిశ్రమలకు 22.8 శాతాన్ని ఇతర అంశాలకు అనగా నీటి సరఫరా గృహ నిర్మాణం, సాంఘిక సంక్షేమం, పట్టణాభివృద్ధికి 6.2 శాతం కేటాయించారు.

12.5.5. వాల్గవ ప్రణాళిక :- ఈ ప్రణాళికలో మొత్తం వ్యయం 15779 కోట్ల రూపాయలు. దీనిలో రవాణా కమ్యునికేషన్లు కొరకు అత్యధికంగా 19.5 శాతాన్ని విద్యుచ్ఛక్తి 18.6 శాతం, పరిశ్రమలకు 18.2 శాతం కేటాయించారు. స్థిరత్వంతో కూడిన, స్వయం పోషకత్వం సాధనదిశగా కేటాయింపులు జరిగాయి.

పట్టిక : 12.13 వాల్గో ప్రణాళికలో వివధ రంగాల కేటాయింపులు :

వ.నెం.	అంశం	మొత్తం	శాతం
1.	వ్యవసాయం, అనుబంధ రంగాలు	2320.41	14.7
2.	నీటిపారుదల & వరదలు	1354.1	8.6
3.	విద్యుచ్ఛక్తి	2931.7	18.6
4.	చిన్న పరిశ్రమలు & కుటీర పరిశ్రమలు	242.6	1.5
5.	పరిశ్రమలు & ఖనిజాలు	28.64.4	18.2
6.	రవాణా, కమ్యునికేషన్లు	3080.4	19.5
7.	విద్య	774.3	4.9
8.	శాస్త్ర పరిశోధన	130.8	0.8
9.	ఆరోగ్యం	335.5	2.1
10.	కుటంబనియంత్రణ	278.0	1.8
11.	నీటి సరఫరా & పరిశుభ్రత	458.9	2.9
12.	గృహవసతి, పట్టణ, ప్రాంతీయాభివృద్ధి	270.9	1.7
13.	వెనుకబడిన తరగతుల సంక్షేమం	164.6	1.1
14.	సాంఘిక సంక్షేమం	64.4	0.4
15.	కార్మిక సంక్షేమం, వృత్తి పనివారల శిక్షణ	31.1	0.2
16.	ఇతర కార్యక్రమాలు	179.8	1.1
17.	ప్రత్యేక పథకాలు	123.6	0.8
18.	చదువుకొన్న నిరుద్యోగులకు పథకాలు	54.0	0.3
19.	ఐదో ప్రణాళికకు మందుచర్యలు	120.0	0.8
	మొత్తం	15778.8	100.0

ఆయిల్ ధరలు వల్ల అనేక రంగాలలో లక్ష్యాలను ఈ ప్రణాళికా కాలంలో చేరుకోలేక పోయిందని చెప్పవచ్చు.

12.5.6. అయిదవ ప్రణాళిక :- పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వావలంబన అనే రెండు ప్రధాన ఆశయాలు లక్ష్యంగా 5వ ప్రణాళికను రూపొందించారు. కేటాయింపులు ఆయారంగాలకు క్రింది విధంగా ఉన్నాయి.

పట్టిక : 12.14 5 వ ప్రణాళికలో వివిధ రంగాలకు కేటాయింపులు

వ.నెం.	అంశం	మొత్తం	శాతం
1.	వ్యవసాయం, అనుబంధ సంస్థలు	4864.9	12.3
2.	నీటిపారుదల, వరదల నివారణ	3876.5	9.8
3.	విద్యుచ్ఛక్తి	7389.5	18.8
4.	కుటీర & చిన్న పరిశ్రమలు	592.5	1.5
6.	రవాణా కమ్యునికేషన్లు	6870.3	17.4
7.	విద్య, శాస్త్ర పరిశోధన	1710.3	4.4
8.	ఆరోగ్యం	760.3	1.9
9.	కుటుంబ నియంత్రణ	491.8	1.3
10.	నీటిసరఫరా, పారిశుధ్యం	1091.6	2.8
11.	గృహవసతి & ప్రాంతీయాభివృద్ధి	1150.0	2.9
12.	వెనుకబడిన తరగతుల సంక్షేమం	724.0	10.8
13.	సాంఘిక సంక్షేమం	88.2	0.2
14.	కార్మిక సంక్షేమం, వృత్తి పనివారల శిక్షణ ఇతర ప్రత్యేక పథకాలు.	817.3	2.1
	మొత్తం	రూ. 39426.2	100.0

5 వ ప్రణాళికలో అత్యధికంగా పరిశ్రమలకు, ఖనిజాలకు ప్రాధాన్యత నిచ్చారు. మొత్తం పెట్టుబడిలో వరుసగా వీటికి 22.8 శాతం, 22.1 శాతం కేటాయించగా, విద్యుచ్ఛక్తికి 18.8 శాతం, రవాణా, కమ్యునికేషన్లకు 17.4 శాతం, సాంఘిక సేవలకు 18 శాతం కేటాయించారు.

12.5.7. ఆరవ ప్రణాళిక :- స్థూల జాతీయోత్పత్తిలో 5.2 శాతం, తలసరి జాతీయాదాయంతో 3.3 శాతం పెరుగుదల లక్ష్యంగా ఈ ప్రణాళికలో వ్యయాలు క్రింది విధంగా ఉన్నాయి.

పట్టిక : 12.15 ఆరవ ప్రణాళిక ఆయారంగాలకు వనరుల కేటాయింపు

వ.నెం.	అంశం	వ్యయం (కోట్లలో)	శాతం
1.	వ్యవసాయం	6623.5	6.1
2.	గ్రామీణాభివృద్ధి	6996.8	6.4
3.	ప్రత్యేక ప్రాంతాభివృద్ధి కారక్రమాలు	1580.3	1.4
4.	నీటిపారుదల & వరద నిరోధం	10929.9	10.0
5.	ఇంధన రంగం	30751.3	28.1
6.	పరిశ్రమలు & ఖనిజాలు	16947.5	15.5
7.	రవాణా	14208.4	13.0
8.	కమ్యూనికేషన్లు సమాచార బ్రాడ్ కేస్టింగ్	3469.5	3.2
9.	సైన్సు & టెక్నాలజి	1020.4	0.9
10.	సాంకేతిక సేవలు	15916.6	14.6
11.	ఇతరములు	847.5	0.8
	మొత్తం	109291.7	100.0

ఈ ప్రణాళికలో ఆత్యధిక ప్రాధన్యం ఇంధన రంగానికి ఇచ్చి అధికంగా కేటాయించారు. తరువాత పరిశ్రమలకు, .రవాణా, కమ్యునికేషన్లు, సాంఘిక సేవలకు ప్రాధన్యత నిచ్చారు.

12.5.8. 7 వ ప్రణాళిక :

7 వ ప్రణాళిక 5.8 శాతం పెరుగుదల రేటు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని కేటాయింపులు జరిగాయి. విద్యుచ్ఛక్తి, వివిధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చారు. 19.1 శాతం సాంఘిక సేవలకు, 14.4 శాతం రవాణా కమ్యునికేషన్లకు కేటాయింపులు చేసారు. కేటాయింపుల తీరు క్రింది పట్టికలో చూడండి.

పట్టిక : 12.16 ఎడో ప్రణాళికలో వివిధరంగాల కేటాయింపులు

వ.నెం.	అంశం	వ్యయం (కోట్లలో)	శాతం
1.	వ్యవసాయ అనుబంధ రంగాలు	31509.4	14.4
2.	నీటిపారుదల మరియు వరదలు	16589.4	7.4
3.	విద్యుచ్ఛక్తి మరియు ఇంధనం	61689.3	28.2
4.	కుటీర మరియు చిన్నతరహా పరిశ్రమలు	3249.3	1.5
5.	పరిశ్రమలు మరియు ఖనిజాలు	25971.1	11.9
6.	రవాణా మరియు కమ్యునికేషన్లు	37973.6	17.4
7.	సాంఘిక సేవలు ఇతరాలు	41747.0	19.1
	మొత్తం	రూ. 218729.6	100.0

12.5.9. ఎనిమిదవ ప్రణాళిక :- ఈ ప్రణాళికలో ప్రభుత్వరంగంలో రూ.434100 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. దీనిలో సింహభాగం ఇంధన రంగానికి కేటాయించారు. మొత్తం పెట్టుబడిలో 26.6 శాతం ఇంధనానికి కేటాయించారు. మిగతా కేటాయింపులు కొరకు దిగువ పట్టికను గమనించుము.

పట్టిక : 12.17 8వ ప్రణాళికలో వనరుల కేటాయింపు

వ.నెం.	అంశం	మొత్తం వ్యయం	శాతం
1.	వ్యవసాయం అనుబంధ రంగాలు	22467	5.2
2.	గ్రామీణాభివృద్ధి	34425	7.9
3.	ప్రత్యేక ప్రాంతాభివృద్ధి	6750	1.6
4.	నీటిపారుదల మరియు వరదలు	32525	7.5
5.	ఇంధనం	115561	26.6
6.	పరిశ్రమలు మరియు ఖనిజాలు	46922	10.8
7.	రవాణా	55926	12.9
8.	కమ్యునికేషన్లు	25110	5.8
9.	సైన్సు మరియు టెక్నాలజి పర్యావరణం	9042	2.1
10.	సాంఘిక సేవలు	79012	18.2
11.	సాధారణ మరియు ఆర్థిక సేవలు	6360	1.4
	మొత్తం	434100	100.0

మొత్తం పబ్లిక్‌రంగ పెట్టుబడులలో అత్యధిక భాగం అనగా 23.8 శాతం వ్యవస్థాపన రంగాలకు కేటాయించారు.

12.5.10. తొమ్మిదవ ప్రణాళికలో వనరుల కేటాయింపు :- సామాజిక న్యాయము, సమాన న్యాయము లక్ష్యములుగా ఆర్థిక వృద్ధిని సాధించుటకు ధ్యేయంగా నిర్ణయించుకొని అందుకు అవసరమయిన రంగాలకు వనరులను క్రింది విధంగా కేటాయించారు.

పట్టిక : 12.18 9 వ ప్రణాళికలో ఆయారంగాలకు వనరుల కేటాయంపు

వ.నెం.	అంశం	మొత్తం	శాతం
1.	వ్యవసాయం; నీటిపారుదల మొ॥వి	170232	19.8
2.	శక్తి	2,15,545	25.1
3.	పరిశ్రమలు మరియు ఖనిజాలు	69972	8.1
4.	రవాణా మరియు సమాచారం	1,68940	19.6
5.	సైన్సు, టెక్నాలజి మరియు పర్యావరణం	25529	3.0
6.	ఆర్థిక సర్వీసులు	26978	3.1
7.	సామాజిక సర్వీసులు	1,82005	21.2
	మొత్తం	859200	100.0

ఈ ప్రణాళికలో శక్తి రంగానికి రూ. 215545 కోట్లు కేటాయించగా, సామాజిక సర్వీసులకు 21.2 శాతం వనరులను కేటాయించారు.

12.5.11. పదవ ప్రణాళికలో వనరుల కేటాయింపులు :- 9 వ ప్రణాళికలో సాధించిన విజయాలను ప్రేరణగా, మరియు ఆప్రణాళికలో గల లోపాలను దృష్టిలో ఉంచుకొని 10 వ ప్రణాళిక రూపకల్పన చేసారు. ఈ ప్రణాళికలో ప్రయివేటు రంగానికి ప్రాధాన్యతనిస్తూ ఉద్యోగవకాశాలు పెంచుటకు వనరులు పేకరణ మరియు పంపిణీలను పొందపరిచారు. ఈ ప్రణాళికలో వనరుల కేటాయింపు ఇలా ఉంది.

పట్టిక : 12.19 10 వ ప్రణాళికలో ఆయారంగాలకు వనరుల కేటాయింపు.

వ.నెం.	అంశం	మొత్తం (కోట్ల రూ॥లు)	శాతం
1.	వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు	58933	3.9
2.	గ్రామీణాభివృద్ధి	121928	8.0
3.	ప్రత్యేక ప్రాంత అభివృద్ధి పథకాలు	20,879	1.3
4	నీటిపారుదల, వరదనివారణ	103315	6.8
5.	శక్తి	403927	26.5
6.	పరిశ్రమలు, ఖనిజాలు	58939	3.9
7.	సమాచారం	98968	6.5
8.	రవాణా	225977	14.8
9.	సైన్సు, టెక్నాలజి, పర్యావరణం	30424	2.0
10.	సాధారణ ఆర్థిక సేవలు	38630	2.5
11.	సామాజిక సేవలు	3,47391	22.8
12.	ఇతర సర్వీసులు	16328	1.0
	మొత్తం	1525639	100.0

12.6. పణాళికలు - ప్రాధాన్యత క్రమాల్లో మార్పులు:-

మన ప్రణాళికల్లో పెట్టుబడుల తీరును గమనించినట్లయితే అవసరాలను బట్టి ఆయా ప్రణాళికల్లో ఒక్కో అంశానికి ప్రాధాన్యత నిచ్చారని తెలుస్తుంది. మొదటి ప్రణాళికా ప్రారంభం నాటికి దేశీయంగా ఏర్పడిన ప్రతికూల పరిస్థితులు - దేశ విభజన, ఆహార ధాన్యాల కొరత, బహిర్గతంగా ప్రపంచ యుద్ధాల ప్రభావాలు ప్రాధాన్యతక్రమంలో వ్యవసాయ రంగాన్ని పురిగొలిపాయి. మిగితారంగాలకు తక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు.

పంచవర్ష ప్రణాళికలు - కీలకాంశాలు :

మొదటి పంచవర్ష ప్రణాళిక	- ముఖ్యలక్ష్యం వ్యవసాయాభివృద్ధి, ధరలస్థిరత్వం సాధించుట
రెండవ ప్రణాళిక	- అసమానతల తగ్గింపు తద్వారా సామాజిక న్యాయం సాధించడం
3వ ప్రణాళిక	- అసమానతల తగ్గింపు తద్వారా సామాజిక న్యాయం సాధించుట
4వ ప్రణాళిక	- సుస్థిర వృద్ధి, స్వయం పోషకత్వం సాధించడం
ఐదో ప్రణాళిక	- కనీస అవసరాల పథకం అమలు ద్వారా పేదరిక నిర్మూలన, స్వావలంభన
ఆరవ ప్రణాళిక	- నిరుద్యోగ నిర్మూలన, స్వావలంభన, పేదల జీవన ప్రమాణాస్థాయి, IRDP అమలు.
ఎడో ప్రణాళిక	- ఆహార ఉత్పాదకత పెంపుదల, పని కల్పన, అధిక శ్రామిక ఉత్పాదన
8వ ప్రణాళిక	- మానవ వనరుల అభివృద్ధి, ఉపాధిహామి పథకం అమలు
తొమ్మిదవ ప్రణాళిక	- అన్ని రంగాలను సమన్వయం ద్వారా ముందుకు తీసుకువెళ్ళడం, పర్యావరణ, అడవులు, పర్యాటక రంగం అభివృద్ధి
పదవప్రణాళిక	-ప్రాంతీయ అసమానతలను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పైపట్టికలో ఆయా ప్రణాళికలలో గల ముఖ్యమయిన ప్రాధాన్యతలను వివరించాము.

రెండవ ప్రణాళికలో పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత నిచ్చినా, మొదటి ప్రణాళికా కాలంలో ప్రారంభించిన అభివృద్ధిని కొనసాగించాలని నిర్ణయించారు. పరిశ్రమలకు 20.1 శాతం నిధులను కేటాయించారు. ఈ ప్రణాళిక నమూనా రష్యాదేశ వృద్ధి నమూనాను పోలి ఉంది. అయినప్పటికి వ్యవసాయరంగంలో మొదటి ప్రణాళికా కాలంలో సాధించిన ప్రగతిని దృష్టిలో ఉంచుకొని అదేరీతిలో పారిశ్రామిక రంగాన్ని ప్రాధాన్యత క్రమంలో ఉంచడంలో తప్పులేదని చెప్పవచ్చు. మూడవ ప్రణాళికలో కూడా రెండవ ప్రణాళికా ప్రాధాన్యతలే కొనసాగాయని చెప్పవచ్చు. వ్యవసాయోత్పత్తి రెండవ ప్రణాళికలో అశ్రద్ధ వల్ల తగ్గడంతో ఈ ప్రణాళికలో పరిశ్రమలకు ప్రాధాన్యత తగ్గకుండా వ్యవసాయాన్ని అభివృద్ధి పరచాలని భావించారు. అయితే మూడవ ప్రణాళికలో అస్తవ్యస్తంగా ఆర్థికవ్యవస్థ తయారయింది. విద్యుత్ కొరత వల్ల పారిశ్రామికీకరణ మందగించడంతో 4 వ ప్రణాళికలో స్థిరత్వం కూడిన వృద్ధితో పాటు స్వావలంభనను సాధించాలని, స్థాపిత శక్తిని పూర్తిగా వినియోగించుకోవాలని వ్యవసాయం, పరిశ్రమలకు సంబంధించిన అభివృద్ధి కృషిలో సడలింపు నిర్ణయాలు తీసుకున్నారు.

అయిదవ ప్రణాళికలో పేదరిక నిర్మూలన, స్వావలంభన సాధించాలని నిర్ణయించి పరిశ్రమలకు ప్రాధాన్యతనిస్తూ శక్తిరంగాన్ని వృద్ధి చేయాలని సంకల్పించారు. సామాన్య ప్రజలకు అవసరమయిన వినియోగ వస్తు ఉత్పత్తికి ప్రాధన్యాతనిచ్చారు. వ్యవసాయ రంగం ద్వారా గ్రామీణ పేదరిక నిర్మూలన పథకాలు, పేదప్రజల జీవన స్థితిగతులను మెరుగు పరచుకనీస అవసరాల పథకాన్ని ప్రారంభించారు.

గత అయిదు ప్రణాళికానుభవం ద్వారా అనగా ఆర్థికవృద్ధిని వేగంగా సాధించుట ద్వారా పేదరికం, నిరుద్యోగం తగ్గదనే విషయం గ్రహించి ఆరవ ప్రణాళికలో స్థిరత్వంతో కూడిన వృద్ధి లక్ష్యంగా ఉద్యోగితకు రెండవ స్థానాన్ని ఇస్తూ, కనీస అవసరాలు పథకం

ద్వారా సామాజిక న్యాయం లభిస్తుందని భావించారు. అవస్థాపనా సౌకర్యాలకు ప్రాధాన్యత నిచ్చారు. ఇంధనానికి ఈ ప్రణాళికలో మొదటి స్థానమిచ్చారు. 1978-79 లో ఆయిల్ ధరలు పెరిగిన నేపధ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. మహలనోబిస్ వ్యూహం నుండి ఆలోచనలు మరలిస్తుండటంలో ఈ ప్రణాళికా కాలం నుండి పరిశ్రమలకు కేటాయింపులు క్రమేపీ తగ్గాయి. మరోవైపు వ్యవసాయ రంగానికి పెద్ద మొత్తంలో కేటాయింపులు జరిగాయి.

సామాజిక న్యాయంతో కూడిన స్వయం పోషక వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో 7వ ప్రణాళికలో ఆహారం, పని, ఉత్పాదకతలకు ప్రాధాన్యత నిచ్చారు. ఆధునీకీకరణ, సాంకేతిక ప్రగతికి శక్తి లభ్యత అవరోధంగా ఉందని భావించి ఈ రంగానికి ఎక్కువ మొత్తాలు కేటాయించారు. ఆరవ ప్రణాళికా మాదిరిగానే ఈ ప్రణాళికలో కూడా వ్యవసాయానికి ప్రాధాన్యత నిచ్చి గ్రామీణాభివృద్ధి సాధించుటకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వరంగ పెట్టుబడులు సత్ఫలితాలిచ్చే వాటికే పరిమితం చేసారు. మానవ వనరుల అభవృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చారు.

పెరుగుతున్న కోశ బడ్జెటరీలోటు, విదేశీ మారకపు చెల్లింపుల సంక్షోభం, తీవ్రమైన ద్రవ్యోల్బణం నేపద్యంలో ఎనిమిదవ ప్రణాళిక రూపొందించారు. సంపూర్ణ ఉద్యోగిత, పూర్తి అక్షరాస్యత, ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధి, అవస్థాపన సౌకర్యాలు బలోపేతం చేయడం ఈ ప్రణాళికలోగల ప్రాధాన్యతలు. అయినప్పటికీ ఇంధన రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. తరువాత స్థానంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి ఉన్నాయి. విచారించదగిన విషయమేమంటె రానురానూ ప్రతి ప్రణాళికలోనూ శాతంలో లెక్కిస్తే విద్య, ఆరోగ్యం, మీద కేటాయింపులు క్రమేపీ తగ్గుచూ వచ్చాయి. తొమ్మిదవ ప్రణాళికలో సామాజిక న్యాయం సమానత్వ సాధనాలకు పెద్ద పీటవేసారు. పేదరికం నిర్మూలన సాధించే విధంగా గ్రామీణాభివృద్ధి, గ్రామీణ ఉపాధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. సేవలరంగంలో 7.87 శాతం వృద్ధి రేటును సాధించారు. పదవ ప్రణాళికలో ఆర్థికాభివృద్ధితో పాటుగా ప్రయివేటు రంగాన్ని దృష్టిలో ఉంచుకొని విధానాలను రూపొందించారు. ఉపాధి అవకాశాలు కల్పించే రంగాలను త్వరగా అభివృద్ధి చేయాలని, నిర్దిష్ట గ్రూపులును ఆధారంగా వివిధ పథకాలు ప్రవేవపెట్టాలని నిర్ణయించారు. అన్ని ప్రాంతాలలో ప్రగతిని సమానంగా సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

12.7. పారిశ్రామికాభివృద్ధిపై ప్రణాళికల పాత్ర :-

అభివృద్ధి చెందుతున్న భారతదేశం వంటి దేశాలలో ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామికీకరణ ప్రధాన పాత్ర వహిస్తుంది. కావున భారత ప్రభుత్వాలు మొదటి ప్రణాళిక నుండి నేటి వరకు అమలు చేసిన ప్రణాళికలలో పరిశ్రమలకు పెద్దపీట వేస్తున్నారు. ప్రణాళికల కాలంలో సాధించిన పారిశ్రామిక ప్రగతి ఈ క్రింది విధంగా ఉంది.

మొదటి ప్రణాళిక (1951-56) :- మొదటి ప్రణాళికలో పారిశ్రామీకరణ కొరకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. మౌలిక వసతులైన విద్యుత్తు, నీటిపారుదల రంగాల అభివృద్ధికి వనరులను పెచ్చించారు. పరిశ్రమల రంగంలో 797 కోట్లను ఖర్చుపెట్టారు. ప్రభుత్వరంగ సంస్థల కోసం 575 కోట్లు ఖర్చు పెట్టారు. అయినా ఈ ప్రణాళికలో పారిశ్రామిక ఉత్పత్తులు 39% పెరిగాయి. సాలుసరి వృద్ధిరేటు 7%గా ఉంది.

ఈ ప్రణాళికా కాలంలో సింద్రి ఎరువుల ఫ్యాక్టరీ, చిత్తరంజన్ లోకోమోటివ్ ఫ్యాక్టరీ, భారతీయ టెలిఫోన్ ఇండస్ట్రీస్, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీని, పెన్సిలిన్ ఫ్యాక్టరీని స్థాపించారు. ఇవియేగాక కీలక రంగాలైన ఉక్కు, ఔషధాలు, ఫార్మాస్యూటికల్స్, ఎరువులు, యంత్ర నిర్మాణం మొదలైన రంగాలలో కొన్ని పరిశ్రమలను ప్రారంభించారు.

రెండవ ప్రణాళిక (1956-61) :- 1956 పారిశ్రామిక విధానం ప్రకారం పారిశ్రామికీకరణ కొరకు కృషి చేసారు. ఈ ప్రణాళికల కాలంలో ప్రభుత్వ రంగానికి పెద్దపీట వేశారు. మొత్తం ప్రణాళికా వ్యయంలో 27% అనగా 1810 కోట్లు, పరిశ్రమల రంగంలో వ్యయం చేశారు. ప్రభుత్వ రంగంలో 870 కోట్లు, ప్రైవేటు రంగంలో 675 కోట్లు వ్యయం చేశారు. ఈప్రణాళికా కాలంలో 3 పెద్ద ఉక్కు కర్మాగారాలు ప్రభుత్వ రంగంలో స్థాపించారు. ఒరిస్సాలో రూర్కెలా ఉక్కు కర్మాగారాన్ని పశ్చిమ జర్మనీ సహకారంతో, మధ్యప్రదేశ్‌లోని

భీలాయి ఉక్కు కర్మాగారాన్ని రష్యా సహకారంతో, పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ ఉక్కు కర్మాగారాన్ని బ్రిటన్ సహకారంతో నిర్మించారు, అంతేగాక H.M.T ని విస్తృత పరిచారు. నంగల్ వద్ద ఒక ఎరువుల కర్మాగారాన్ని నిర్మించారు.

ఆటమిక్ ఎనర్జీ, బొగ్గు, చమురు వెలికితీత రంగాల అభివృద్ధికి కొన్ని పథకాలు రూపొందించారు. ఇవియేగాక గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమల రంగంలో 60 ఇండస్ట్రియల్ ఎస్టేట్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు రసాయనాలు, టెక్స్‌టైల్స్, జూట్, సిమెంట్, తేయాకు, పంచదార, కాగితం మొదలైన రంగాలలో పరిశ్రమలను స్థాపించారు. ఈ ప్రణాళికా కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి 40% పెరిగింది. వార్షిక వృద్ధిరేటు 6.6% గా ఉంది. దీనిని స్థూలంగా పరిశ్రమల ప్రణాళిక అనవచ్చును.

మూడవ పంచవర్ష ప్రణాళిక (1961-66) :- ఈ ప్రణాళికలో దీర్ఘకాలికంగా పరిశ్రమల రంగంలో సమగ్ర అభివృద్ధిని వ్యవసాయంతో పాటు స్థాపించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ ప్రణాళికలో పరిశ్రమల రంగంలో 3,000 కోట్లు వ్యయం చేశారు. పై మొత్తాన్ని ప్రభుత్వ రంగంలో 1700 కోట్లు, ప్రైవేటు రంగంలో 1300 కోట్లు వ్యయం చేశారు.

కాని ఈ ప్రణాళికా కాలంలో జరిగిన చైనాతో యుద్ధము మరియు అనావృష్టి పరిస్థితుల వలన ఆశించినంత అభివృద్ధి జరగలేదు. కాని 1965-66 లో తప్ప మిగతా 4సం॥లో పారిశ్రామిక వృద్ధిరేటు సాలీనా 7.6% ఉంది.

నాలుగవ ప్రణాళిక (1969-74) :- ఈ ప్రణాళికలో ప్రభుత్వ రంగంలో 3,050 కోట్లు, ప్రైవేటు రంగంలో 2250 కోట్లు మొత్తం 5300 కోట్లు పరిశ్రమల రంగంలో పెట్టుబడి పెట్టారు. ఇది మొత్తం ప్రణాళికా వ్యయంలో 23.4%గా ఉంది. ఈ ప్రణాళికా కాలంలో పారిశ్రామిక పునాది మరింత విస్తరించడమే కాకుండా ఆధునీకీకరణ స్వావలంబన సాధించగలిగింది.

మిశ్రమ లోహాలకు అవసరమైన ప్రత్యేక రకం ఉక్కు, టైర్లు, అల్యూమినియం, ఆటోమొబైల్, పెట్రోలియం శుద్ది ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ట్రాక్టర్లు, ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తులు మంచి ప్రగతి సాధించాయి. అయితే కీలకమైన విద్యుత్తు, ఉక్కు కొరతవల్ల ఈ ప్రణాళికా కాలంలో ఉత్పత్తి లక్ష్యం అందుకోలేక పోయింది. ఈ ప్రణాళికా కాలంలో పారిశ్రామికవృద్ధి రేటు 4.7%గా ఉంది. ఈ ప్రణాళికా కాలంలో వృద్ధిరేటు లక్ష్యం 6% ఉండగా 5.5% మాత్రమే సాధించడం జరిగింది.

ఐదవ ప్రణాళిక (1974-79) :- ఈ ప్రణాళికలో పరిశ్రమల రంగంలో 10,135 కోట్లు వ్యయం చేశారు. ఇది మొత్తం ప్రణాళికా వ్యయంలో 22% . ఈ ప్రణాళికలో ప్రైవేటు రంగం పై విదేశీ పెట్టుబడులపై నియంత్రణలు తొలగించారు. ఈ ప్రణాళికా కాలంలో వృద్ధిరేటును 8.1%గా నిర్ణయించారు. కాని అది 5.9%నికి మాత్రమే చేరుతుంది. పెట్రోల్ ధరలు పెరగటం వలన ఇంధన రంగంలో విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చారు.

పెట్రోలు సంక్షోభం, కీలక రంగాల ఉత్పత్తి తగ్గటం వలన, విద్యుత్తు కొరత, ద్రవ్యోల్బణం పెరగటం వలన లక్ష్యాలను చేరుకోలేక పోయారు.

ఆరవ ప్రణాళిక (1980-85) :- చిన్నతరహా పరిశ్రమల రంగంలొ 22,000 కోట్లు వ్యయం చేశారు. ఇది మొత్తం ప్రణాళికలో 23%. ఇంతేగాక శక్తి అభివృద్ధి కొరకు 4300 కోట్లు, బొగ్గు రంగంలో 2870 కోట్లు వ్యయం చేశారు.

అల్యూమినియం, జింకు, లిడ్, థర్మోప్లాస్టిక్స్, పెట్రోకెమికల్స్, ఎలక్ట్రికల్ పరికరాలు, ఆటోమొబైల్స్, వినియోగ వస్తువులపై రుణాలు పెట్టుకున్న లక్ష్యాలను అధిగమించగలిగారు. అంతేగాక 500 మెగావాట్ల విద్యుత్ జనరేటర్లను, బోయిలర్లను, అధిక సామర్థ్యం ఉన్న ఎరువుల కర్మాగారాలను, బ్లాస్ట్ ఫర్నెస్ యూనిట్లను నెలకొల్పారు. ఈ ప్రణాళికా కాలంలో వృద్ధిరేటు లక్ష్యం 6% గా నిర్ణయించినప్పటికి, 5.5.% వృద్ధి మాత్రమే సాధించారు.

ఏడవ ప్రణాళిక (1985-90) :- ఈ ప్రణాళికా కాలంలో భారీ, మధ్యతరహా పరిశ్రమల రంగంలో 19,710 కోట్లు, గ్రామీణ, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి 2750 కోట్లుతో కలిపి మొత్తం పరిశ్రమల రంగంలో 22460 కోట్లు వ్యయం చేశారు. ఇది మొత్తం

ప్రణాళికా వ్యయంలో 12.5%. ఈ ప్రణాళికలో పారిశ్రామిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధునీకరించారు. విద్యుచ్ఛక్తి, బొగ్గు, పెట్రోలియం, రైలు, రవాణా వంటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ప్రణాళికాకాంలో పారిశ్రామికరంగ వృద్ధి 8.5%గా ఉంది.

ఎనిమిదవ ప్రణాళిక (1992-97) :- ఈ ప్రణాళికా కాలంలో పరిశ్రమల రంగంలో 40,670 కోట్లు వ్యయం చేశారు. ఈ ప్రణాళికా కాలంలో తీవ్రమైన మార్పులు సంభవించాయి. 15 రకాల పరిశ్రమలకు తప్ప మిగిలిన పరిశ్రమలకు లైసెన్సు అవసరం లేకుండా చేశారు. ప్రభుత్వరంగ సంస్థల వాటాలను ప్రయివేటు సంస్థలకు అమ్మివేయడం ప్రారంభించారు. ఈ ప్రణాళికలో పారిశ్రామిక వృద్ధిరేటు 7.6% గా ఉంది.

9 వ ప్రణాళిక (1997-2002) :- ఈ ప్రణాళికలో 8. శాతం వృద్ధిరేటును నిర్ణయించారు. 8 వ ప్రణాళికలో కన్నా కొద్దిపాటి మొత్తాలను పెంచారు. పరిశ్రమలు విషయంలో ప్రయివేటు భాగస్వామ్యం పెంచుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రాధాన్యతను క్రమేపీ తగ్గించు నేపధ్యంలో వాటికి కేటాయింపులు తగ్గించారు. ఈ ప్రణాళిక మొదటి మూడు సంవత్సరాలలో 1997-98 లో 4.0 శాతం పారిశ్రామిక ఉత్పత్తి ఉండగా 1999-2000 నాటిక 8.0 శాతం పెరిగింది. 2001-02 కాలంలో ప్రాథమిక వస్తువుల యందు వార్షక వృద్ధిరేట్లు 2.8 శాతం ఉంది. ఈ వృద్ధిరేటు 2000-01 లో 3.9 శాతం. మూలధన ఉత్పత్తుల యందు పెరుగుదల లేదని చెప్పవచ్చు. 2000-01 సం॥లో 1.8 శాతం ఉండగా 2001-02 సం॥నాటికి -4.0 శాతానికి పడిపోయింది. మాధ్యమిక వస్తువల ఉత్పత్తిలో వృద్ధికూడా తగ్గింది. వినియోగవస్తు ఉత్పత్తిలో 2000-01 సం॥లో 8.0 శాతం ఉంటె 2001-02 సం॥లో 5.8 శాతానికి తగ్గింది. మొత్తం మీద ఈ ప్రణాళికకు మొతం ప్రణాళికా వ్యయంలో 33.5 శాతం పరిశ్రమలకు కేటాయించినా అది 27.3 శాతం మాత్రము ఖర్చు చేసారు.

పదవ ప్రణాళిక (2002-07) :- నూతన పారిశ్రామిక తీర్మానం మరియు నూతన ఆర్థిక సంస్కరణలు అమలు పరచు దిశగా ఈ ప్రణాళికలో చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వరంగం ప్రమేయాన్ని తగ్గించి,ప్రయివేటు రంగం ద్వారా వాటికి అన్ని విధాలా సహకారం అందిస్తున్నారు. ఈ ప్రణాళికలో పరిశ్రమల ప్రగతిని తెలుసుకొనుటకు కొంతకాలం అగవలసి ఉంది. ఈ విధంగా ప్రణాళికలు పారిశ్రామికాభివృద్ధిపై విశేషమయిన పాత్రను కలిగి ఉన్నది.

12.8. వ్యవసాయ రంగంపై ప్రణాళికల పాత్ర :-

దేశంలో ప్రధాన ఆధారభూతమైన వ్యవసాయరంగం అభివృద్ధిలో ప్రణాళికల పాత్ర చాలా ఉంది. వ్యవసాయ వనరులు సమీకరణ, తద్వారా ఉత్పాదక పెంపుదలలో వీటి పాత్ర అమోఘం.

భారత పంచవర్ష ప్రణాళికలు - వ్యవసాయ రంగం :- సుమారు 250 సం॥ల దాస్య పాలన నుండి విముక్తి పొందిన భారతదేశం దేశ అభివృద్ధి కోసం ప్రణాళికలను రూపొందించి అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకున్నది. ఆయితే దేశంలో మొదటి పంచవర్ష ప్రణాళిక (1951-56)ను ప్రారంభించు నాటికి వ్యవసాయరంగం దుర్భర పరిస్థితులలో ఉన్నది.

వ్యవసాయదారులు అధిక ఋణగ్రస్తతో మునిగిఉన్నారు. కమతముల, విభజన మరియు విఘటన వలన వ్యవసాయ కమతములు చాలా చిన్నవిగా యుండుటయే గాక వ్యవసాయదారుని కమతమంతయు ఒకే ప్రదేశములో ఉండక వివిధ ప్రదేశములలో ఉండెడిది. మంచి దిగుబడి నిచ్చు విత్తనములు, ఎరువులు మొదలగు ఆధునిక ఉత్పత్తి పద్ధతులు ప్రవేశపెట్టుటకు వారికి ఆర్థిక స్థోమత లేక పోవుటయే గాక దానికి సంబంధించిన పరిజ్ఞానము కూడా లేదు. నీటిపారుదల వసతులు గల భూమి చాలా తక్కువ. వ్యవసాయము వర్షాధారముగా ఉండెడిది. "భారతవ్యవసాయము ఋతుపవనములతో జూదముగా ఉండెడిది" భూమి మరియు శ్రామిక ఉత్పాదకత అతితక్కువగా ఉండెడిది. ప్రపంచ దేశములతో పోల్చినచో భారతదేశ ఉత్పాదకత చివరి స్థానమును కలిగి యుండెడిది. వ్యవసాయరంగముపై 70% ప్రజలు ఆధారపడుచున్నప్పటికి, ఆహార వస్తువుల ఉత్పత్తిలో స్వయం పోషకత్వము ఉండెడిదికాదు. ఆహారవస్తువుల దిగుమతి చేసుకొనబడుతుండేది. అంటే వ్యవసాయ ప్రాధాన్యత కలిగిన దేశం అయినప్పటికి ఆహార వస్తువుల కోసం దిగుమతులపై ఆధారపడవలసి వచ్చేది. 1947 లో దేశ విభజన వ్యవసాయ రంగంమునకు చాలా సమస్యలు సృష్టించినది. దేశ విభనకు ముందున్న జనాభాలో 82%

భారతదేశమునకు రాగా వ్యవసాయ భూమిలో వచ్చిన శాతము చాలా తక్కువ. వరిసాగు భూమిలో 69%; గోధుమ వ్యవసాయ భూమిలో 65% మాత్రమే భారతదేశమునకు లభించినది. అనగా దేశ విభజన వలన భారతదేశమునకు వచ్చిన జనాభా శాతం ఎక్కువ కాగా వ్యవసాయ భూమి తక్కువ. దేశ విభజనకు ముందు నీటి పారుదల వసతులున్న భూమి 24% కాగా దేశవిభజన వలన భారత దేశమునకు 19% నీటిపారుదలగల భూమి లభించింది.

వ్యవసాయ రంగ ప్రణాళిక లక్ష్యములు :- వ్యవసాయ రంగంలో నున్న దుర్భర పరిస్థితులను తొలగించి వ్యవసాయాభివృద్ధికి పంచవర్ష ప్రణాళికలు ప్రాధాన్యత నిచ్చినవి. వ్యవసాయరంగ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుటలో భారత ప్రణాళికా సంఘము కొన్ని ముఖ్యమైన లక్ష్యములు పరిగణించినది. ఉత్పత్తిని పెంచుట, ఆధునిక ఉత్పత్తి పద్ధతులను ప్రవేశ పెట్టుట, వ్యవసాయము క్రిందనున్న భూమి పరిమాణమును పెంచుట, నీటిపారుదల వసతులు పెంచుట మొదలగు చర్యల ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంచుట. ఉద్యోగ అవకాశములను పెంచుట. వ్యవసాయ రంగములో ఉద్యోగితను పెంచుట, గ్రామీణ ప్రాంతములలోని పేదప్రజల ఆదాయములు పెంచుట. భూమిపై జనాభా ఒత్తిడిని తగ్గించుట, వ్యవసాయం పై ఆధారపడు వారి సంఖ్యను తగ్గించి, ఇతర రంగములలో వారికి ఉద్యోగితను కల్పించుట గ్రామీణ ప్రాంతాలలో ఆదాయ అసమానతలను తగ్గించి, భూస్వామ్య పద్ధతులలో మార్పులను చేసి కౌలుదారులను భూకామాందుల పీడన నుండి రక్షించుట, మిగులు భూమిని సన్నకారు రైతులకు పంపిణీ చేయుట మొదలు చర్యల ద్వారా గ్రామీణ ప్రాంతములలో ఆదాయ వ్యత్యాసములను తగ్గించుట. ప్రాంతీయ వ్యత్యాసములను తగ్గించుట, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ప్రాంతీయ అసమానతలు తగ్గించుటకు ప్రత్యేక చర్యలు తీసుకొనుట మొదలగునవి.

లక్ష్యసాధనకు వ్యూహము:- వ్యవసాయ రంగమునకు నిర్ణయించిన ధ్యేయములు సాధించుటకు వివిధ పథకములతో కూడిన వ్యూహము రూపొందించబడినది.

1) ఉత్పత్తిని, ఉద్యోగితను పెంచుటకు సమాజాభివృద్ధి పథకములు, విస్తరణ సేవలు కల్పించుట, నీటిపారుదల వసతులు పెంచుట, అధిక దిగుబడి వంగడాలను వాడుట, నూతన ఉత్పత్తి పద్ధతులు ప్రవేశ పెట్టుట మొదలగు చర్యల ద్వారా ఉత్పత్తిని పెంచుట.

2) గ్రామీణ ఆదాయ వ్యవత్యాసాలను తగ్గించుటకు వ్యవసాయ రంగములో మధ్యవర్తులను తొలగించుట, కౌలుదారులకు రక్షణ కల్పించుట మరియు భూయాజమాన్యమును కల్పించుట, భూకమతములకు గరిష్ట పరిమాణమును నిర్ణయించి మిగులు భూమిని భూమి లేని వారకి, చిన్న కమతముల వారికి పంపిణీ చేయుట. దీని వలన వ్యవసాయముపై ఆధారపడి యుండు వారి సంఖ్యను తగ్గించవచ్చు.

3) వ్యవసాయముపై ఆధారపడి యుండు వారి సంఖ్యను తగ్గించుటకు గ్రామీణ ప్రాంతములలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను, చేతి వృత్తులను, రవాణా మరియు సమాచార ప్రసార వసతులను పెంచుట, పారిశ్రామిక రంగమునకు వ్యవసాయ రంగము నుండి ప్రజలను తరలించుటకు వసతులు మరియు ఆసక్తులను కల్పించుట మొదలగు వ్యూహములు రూపొందించెను. వీటి వలన గ్రామీణ ఆదాయ అసమానతలు వ్యత్యాసాలను తగ్గించవచ్చు.

వివిధ ప్రణాళికలలో వ్యవసాయ రంగంముపై పెట్టుబడులు :- మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగమునకు "ప్రాధాన్యత" ఇవ్వబడినది.

"వ్యవసాయ రంగమునకు అధిక ప్రాధాన్యతను ఇవ్వవలెను. ఆహార వస్తువులు, పారిశ్రామిక ముడి పదార్థములు గణనీయముగా పెంచకుండా పారిశ్రామికాభివృద్ధి సాధ్యం కాదు" అని ప్రణాళికాసంఘము పేర్కొన్నది,

మొదటి పంచవర్ష ప్రణాళికా పెట్టుబడులలో 31% వ్యవసాయ రంగమునకు కేటాయించబడినది. తదుపరి పంచవర్ష ప్రణాళికలలో కూడా 21% నుండి 24% వరకు వ్యవసాయ రంగమునకు పెట్టుబడులను కేటాయించడం జరిగినది. వివిధ ప్రణాళికలలో వ్యవసాయ రంగమునకు కేటాయించిన పెట్టుబడులు క్రింది విధముగా నున్నవి.

ప్రణాళిక	మొత్తం పెట్టుబడి	వ్యవసాయ రంగముపై పెట్టుబడి	మొత్తం పెట్టుబడిలో వ్యవసాయ రంగశాతము
1 వ ప్రణాళిక	1960	600	31
2 వ ప్రణాళిక	4600	950	20
3 వ ప్రణాళిక	8600	1750	21
4 వ ప్రణాళిక	15780	3670	23
5 వ ప్రణాళిక	34430	8740	22
6 వ ప్రణాళిక	109290	26130	24
7 వ ప్రణాళిక	218730	48100	22
8 వ ప్రణాళిక	434100	93680	22
9 వ ప్రణాళిక			
10 వ ప్రణాళిక			

రెండవ పంచవర్ష ప్రణాళిక కేటాయింపులలో వ్యవసాయ రంగమునకు ద్వితీయ స్థానమిచ్చినందున ఆహార వస్తువులు, పారిశ్రామిక ముడి పదార్థముల కొరత మొదలగు సమస్యలు ఏర్పడినవి. అందుచేత మూడవ ప్రణాళిక నుండి పరిశ్రమలకు వ్యవసాయమునకు ఇంచుమించు సమాన ప్రాధాన్యత ఇవ్వబడినది. 3వ ప్రణాళికలోనూ ఆ తరువాత వార్షిక ప్రణాళికలలోనూ (1966-69) ప్రవేశ పెట్టబడిన నూతన వ్యవసాయ వ్యూహము వ్యవసాయ రంగములో విపలవాత్మక మార్పులు తెచ్చినది. దీనిని హరిత విప్లవముగా పేర్కొన్నారు. దీని ఫలితముగా వ్యవసాయ ఉత్పత్తిలో మరియు ఉత్పాదకతలో గణనీయమైన పెరుగుదల ఏర్పడినది. ఆహార వస్తువులలో స్వయం పోషకత్వము సాధించుటయే గాక ఎగుమతులకు కొంత మిగులు కూడా ఏర్పడినది.

వ్యవసాయ అభివృద్ధి రేటు :-

1950-51 నుండి వ్యవసాయాభివృద్ధి రేటుక్రింది విధముగా నున్నది.

కాలము	కాంపౌండ్ సాంవత్సరిక వృద్ధిరేటు శాతం
1951-61	3.3
1961-71	2.2
1971-81	1.7
1981-91	3.9
1991-01	-
1951-1991	2.8

మొదటి దశాబ్దములో 1951-61 వరకు వ్యవసాయాభివృద్ధి రేటు 3.3% గా ఉన్నది. తదుపరి 2 మరియు 3 వ దశాబ్దములలో వృద్ధిరేటు తగ్గినది. 2వ దశాబ్దములో (1961-71) వృద్ధిరేటు 2.2% కాగా 3వ దశాబ్దము(1971-81) 1.7%నకు తగ్గినది. దీనికి ప్రధాన కారణము వర్షపాతము, ప్రకృతి శక్తులు అనుకూలముగా లేకుండుట నూతన వ్యవసాయ వ్యూహము ప్రవేశ పెట్టబడినప్పటికి వృద్ధిరేటు

ఆశాజనకము గాలేదు. 4వ దశాబ్దము (1981-91)లో వృద్ధి రేటు 3.9%నికి పెరిగినది. 1951-1991 కాలములో అనగా మొత్తం 40 సం॥ల కాలమునకు వృద్ధిరేటు 2.8%. ఋతుపవనములలో మార్పులు, వర్షాభావము మొదలగునవి లేకుండిన యెడల వృద్ధిరేటు కొంత ఎక్కువగా ఉండెడిది.

వ్యవసాయ ఉత్పాదకములను ఉపయోగించుటలో ప్రగతి:

మొదటి ప్రణాళిక నుండి వ్యవసాయ ఉత్పాదకముల వాడుకలో వ్యవసాయదారులలో నూతన దృక్పథము కలుగజేయుటలో ప్రభుత్వము కృషి చేసినది. నూతన వ్యవసాయ వ్యూహము ఉత్పాదకములతో గణనీయమైన మార్పు వచ్చినది.

ఉత్పాదకములు	1960-61	1991-92
నీటిపారుదల భూమి (మిలియన్ హెక్టారులు)	28	73
రసాయనిక ఎరువులు (మిలియన్ టన్నులు)	0.3	12.7
క్రిమి సంహారక మందులు (వేలటన్నులు)	6.0	78
అధిక దిగుబడి వంగడముల క్రింద భూమి (మి.హె.)	1.5	67
భూసార సంరక్షణ (మిలియన్ హెక్టారులు)	2	36
వ్యవసాయ సంస్థాగత పరపతి పంపిణీ చేసిన మొత్తము (రూ॥కోట్లు)	214	11200

నీటిపారుదల వసతుల క్రింద నున్న భూమి 28 నుండి 78 మిలియన్ హెక్టారులకు పెరిగినది. రసాయనిక ఎరువుల వాడకము 0.3 నుండి 12.7 మిలియన్ టన్నులకు,క్రిమి సంహారక మందులు వాడకము 6 నుండి 78 వేల టన్నులకు, అధిక దిగుబడి వంగడముల క్రింది నున్న భూమి 1.5 మిలియన్ హెక్టారుల నుండి 67 మిలియన్ హెక్టారులకు, భూసార సంరక్షణ 2నుండి 36 మిలియన్ హెక్టారులుకు, వ్యవసాయ సంస్థాగత పరపతి రూ॥214 కోట్లనుండి రూ॥11200 కోట్లకు పెరిగినవి. వ్యవసాయములో నూతన ఉత్పత్తి పద్ధతుల ప్రగతికి ఇవి చిహ్నములు.

ప్రధాన వ్యవసాయ ఉత్పత్తులలో పెరుగుదల :- ప్రణాళికా కాలములో ప్రధాన వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల క్రింది విధముగా నున్నది.

వస్తువు	1950-51	1990-91	1951-51 1990-91	1960-61 1990-91
ఆహార వస్తువులు (మి.ట.)	51	176	245	2.6
నూనె గింజలు (మి.ట.)	5	18	260	3.4
చెరుకు (మి.ట.)	57	240	320	2.6
పత్తి (మి.బే.)	3	10	233	1.7
జనుము (మి.బే.)	3	9	200	2.7

వివిధ ప్రధాన వ్యవసాయ వస్తువుల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల సంభవించినది. ఆహార వస్తువులు 1990-91 నాటికి 176 మిలియన్ టన్నులకు, నూనె గింజలు 18 మిలియన్ టన్నులకు, చెరుకు 240 మిలియన్ టన్నులకు, పత్తి 10 మిలియన్ బెళ్ళకు, జనుము 9 మిలియన్ బేళ్ళకు పెరిగినది. 1950-51 తో పోల్చిన యెడల 1990-91 లో ఆహార వస్తువుల పెరుగుదల శాతము 245,

నూనెగింజల పెరుగుదల 260 శాతము, చెరుకు పెరుగుదల శాతము 320, పత్తి పెరుగుదల శాతము 233, జనుము పెరుగుదల శాతం 200.

ఉత్పాదకత - దిగుబడి :- వ్యవసాయ వస్తువుల ఉత్పాదకత పెగినది. హెక్టారుకు దిగుబడి పెరిగినది. హరిత విప్లవము, ఆధునిక ఉత్పత్తి పద్ధతులు దీనికి దోహదము చేసినవి. 1951-52 నుండి 1964-65 మధ్య హెక్టారుకు ఉత్పాదకత సూచిక 1.4% కాగా ఇప్పుడు 2% నకు పైగా నున్నది.

విమర్శనాత్మక పరిశీలన :- వ్యవసాయ ప్రణాళిక ఫలితముగా వ్యవసాయరంగములో అభివృద్ధి జరిగినది. ఉత్పత్తి మరియు ఉత్పాదకత పెరిగినది. అయినప్పటికీ వ్యవసాయాభివృద్ధి మందకొడిగా నున్నది. దీనికి కారణాలు అనేకం.

1) ఋతు పవనములతో జూదము :- వ్యవసాయము ఇంకనూ ఋతుపవనాలతో జూదముగా ఉన్నది. కొన్ని ప్రాంతాలలో అధిక వర్షము, వరదలు సంభవించుట వలన వ్యవసాయ ఉత్పత్తులు దెబ్బతినుచున్నవి. నీటిపారుదల వసతులను పెంచి, ఋతు పవనముల అనిశ్చితలను తొలగించుటకు పటిష్టమైన చర్యలు తీసుకొనబడలేదు. ప్రణాళికలలో నిర్దేశించిన నీటిపారుదల వసతులు కూడా అనేక కారణముల వలన పూర్తిగా ఉపయోగింపబడలేదు.

2) నూతన వ్యవసాయ వ్యూహము పరిమితముగా మండుట:- నూతన వ్యవసాయ వ్యూహము వలన ఏర్పడిన హరిత విప్లవము కొన్ని పంటలకు కొన్ని ప్రాంతములకు మాత్రమే పరిమితమై ఉన్నది. ఆహారేతర పంటల (వస్తువుల) విషయంలో హరిత విప్లవము యొక్క ఫలితాలు స్వల్పముగా నున్నవి. హరిత విప్లవము నీటిపారుదల, ఇతర ఉత్పాదకముల లభ్యత బాగా ఉన్న ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఉన్నది. మెట్ట వ్యవసాయ భూములకు హరిత విప్లవం విస్తరించలేదు.

3) భూసంస్కరణలు విఫలమగుట :- మధ్యవర్తుల తొలగింపు, కౌలుదారుల సంరక్షణ చట్టము, భూకమతములకు గరిష్ట పరిమాణ చట్టము చేసినప్పటికీ, వాటిని అమలు పరుచుటలో చాలా లోపములున్నవి. కౌలుదారుల పీడన పూర్తిగా తొలగలేదు. కమతముల గరిష్ట పరిమాణము నిర్ణయించగా వచ్చిన మిగులు భూమి చాలా తక్కువ. చిన్న కమతముల వారికి, భూమి లేని వ్యవసాయ శ్రామికులకు భూమి పంపిణీ నామమాత్రముగనే ఉన్నది. వాస్తవముగా వ్యవసాయం చేయు కౌలుదార్లకు భూమిపై హక్కు కల్పించుటలో ప్రభుత్వము విఫలమైనది. భూసంస్కరణలు ఆశించిన ఫలితములు ఇవ్వనందున వ్యవసాయాభివృద్ధి కొంత వరకు కుంటుపడినది. వాస్తవముగా వ్యవసాయము చేయు కౌలుదార్లకు ఉత్పత్తిని పెంచవలెనను కోరిక వృద్ధి చెందలేదు.

4) సాంకేతిక మార్పులకు ప్రాధాన్యతనిచ్చి సంస్థాగత మార్పులకు తగినంత ప్రాధాన్యత ఇవ్వక పోవుట:- వ్యవసాయ రంగంలో నెలకొనియున్న సంస్థాగత అడ్డంకులను తొలగించకుండా, సాంకేతిక మార్పుల వలన మాత్రమే ఆశించిన ఫలితములురావు. సంస్థాగత మరియు సాంకేతిక మార్పులు జోడించినపుడే అభిలషణీయ వ్యవసాయాభివృద్ధి రేటు సాధించవచ్చు. భారతదేశ వ్యవసాయాభివృద్ధిని పరిశీలించిన యెడల సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి వలన వ్యవసాయరంగంలో ఆదాయ వ్యత్యాసాలు పెరిగినవి. హరిత విప్లవము వలన ధనిక రైతులే ఎక్కువ లాభము పొందినారు. ఆర్థిక స్థోమత లేని సన్నకారురైతులు, వ్యవసాయ శ్రామికులు ఎక్కువగా లాభపడలేదు, కౌలుదారుల పీడన జరుగుచునేయున్నది. దీనికి కారణము సంస్థాగత మార్పులు అభిలషణీయముగా లేకుండుట.

5) వ్యవసాయ రంగములో పెట్టుబడి తగ్గుదల :- హరిత విప్లవము మొదటి దశలో వ్యవసాయ రంగములో ప్రైవేటు పెట్టుబడి ఎక్కువగా పెరిగినది. కాని క్రమేణా ఇది తగ్గినది. వ్యవసాయ రంగముపై ప్రభుత్వ పెట్టుబడులు కూడా క్రమేణా తగ్గినవి. ప్రైవేటు పెట్టుబడులు దేశములోని ఉత్తర ప్రాంతములలోనే చేయబడినవి. ఇతర ప్రాంతములలో ముఖ్యంగా తూర్పు ప్రాంతములలో పెట్టుబడులు పెరగలేదు. వ్యవసాయ రంగము వనరుల కొరతను ఎదుర్కొనుచున్నది.

6) జనాభా నియంత్రణ విఫలమగుట :- గ్రామీణ ప్రాంతములలో జనాభా పెరుగుదల అరికట్టబడలేదు. పెరుగుతున్న శ్రామికులకు వ్యవసాయేతర రంగములలో ఉద్యోగిత కల్పించుటకు గట్టి కృషి చేయబడలేదు. వ్యవసాయ రంగముపై జనాభా ఒత్తిడి నివారించబడలేదు. శ్రమ-సాంద్రత పద్ధతుల ద్వారా గ్రామీణ పారిశ్రామికీకరణను ప్రోత్సహించుటకు ప్రభుత్వము పటిష్టమైన చర్యలు చేపట్టలేదు.

పైన వివరించిన వివిధ కారణముల వలన వ్యవసాయ రంగములో వృద్ధిరేటు మందకొడిగా ఉన్నది. ఏది ఏమైనప్పటికి పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి వ్యవసాయాభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకొని వాటిని సక్రమంగా అమలు చేయగలిగితే వ్యవసాయ రంగము అభివృద్ధి సాధ్యమౌతుంది.

వ్యవసాయ ప్రణాళిక రూపొందించుటలో ఇబ్బందులు :

పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళిక కన్నా వ్యవసాయ ప్రణాళిక రూపందించుట కొంత కష్టము. ముఖ్యముగా వెనుకబడిన దేశములలో చాలా సమస్యలు ఎదుర్కొనబడును.

1) వ్యవసాయదారులు సంఘటితపడి ఉండరు. వివిధ ప్రాంతములకు విస్తరించియుంటారు. వ్యవసాయకమతములు చాలా చిన్నవి. వ్యవసాయదారుల సంఖ్య చాలా ఎక్కువ. వ్యక్తిగత దృక్పధము కల్గి ఉంటారు. ఆధునిక పోకడల పరిజ్ఞానముండదు. అందుచేత వ్యవసాయదారుల చర్యలను, ప్రతిస్పందనలను నియంత్రణ చేయుట చాలా కష్టము.

2) భారతదేశములోని వ్యవసాయదారులు వ్యవసాయమును ఒక జీవన విధానముగా పరిగణిస్తారే తప్ప వ్యాపారముగా పరిగణించరు. ఈ దృక్పధమును మార్చుట కొంత కష్టసాధ్యము.

3) భూసారము, శీతోష్ణస్థితి, మానవ వనరులు మొదలగు వానితో ప్రాంతీయ తేడాల వలన సమగ్ర వ్యవసాయ ప్రణాళిక రూపొందించుటలో సమస్యలు ఏర్పడతాయి.

4) ప్రకృతి శక్తులలో మార్పులు వ్యవసాయ రంగ ప్రణాళికను తారుమారుచేయవచ్చు. మధ్య సాలుసరి, పేరుగుదల రేటు

పైన వివరించిన కారణములేకాక మరికొన్ని వ్యవసాయమునకున్న ప్రత్యేక లక్షణముల వలన వ్యవసాయ ప్రణాళిక రూపొందిచుటలో కొన్ని ఇబ్బందులున్నవి.

వివిధ ప్రణాళికలలో వ్యవసాయ రంగం కేటాయింపులు, ధ్యేయములు, సాధించిన ప్రగతి :-

మొదటి ప్రణాళిక:

మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యవసాయ రంగమునకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చినది. మొత్తం పెట్టుబడి రూ॥1960 కోట్లలో రూ॥600 కోట్లు అనగా 31% వ్యవసాయ రంగం అభివృద్ధికి కేటాయించబడినది. ఈప్రణాళికా ప్రధాన ధ్యేయాలు.

1) ఆహార ధాన్యముల కొరతను నివారించుట.
2) పరిశ్రమలకు వ్యవసాయ ముడి పదార్థముల కొరతను నివారించుట.
3) వ్యవసాయములో బహుముఖ విస్తరణను ప్రవేశపెట్టుట.
4) వ్యవసాయ సంపద మరియు ఆదాయ వ్యత్యాసములను తగ్గించుటకు భూవిధానములను అమలు పరచుట
5) కౌలుదార్ల పీడన తొలగించి వారికి రక్షణ కల్పించుట.

మొదటి ప్రణాళికలో వ్యవసాయ రంగము సాధించవలసిన ఉత్పత్తి లక్ష్యములు, వాస్తవముగా సాధించిన లక్ష్యములు దిగువ సేర్కొనబడినవి.

వ్యవసాయ పంట	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవముగా సాధించిన లక్ష్యము
ఆహార ధాన్యములు (మిలియన్ టన్నులు)	62	67
నూనె గింజలు (మిలియన్ టన్నులు)	55	56
చెరుకు (మలియన్ టన్నులు)	63	60
పత్తి (మిలియన్ బేళ్ళు)	42	40
జనుము (మిలయన్ బేళ్ళు)	54	42

చెరుకు, పత్తి, జనుము పంటలో తప్ప, ఆహార ధాన్యములు, నూనె గింజల ఉత్పత్తులు నిర్దేశించిన లక్ష్యము కన్నా ఎక్కువగా పెరిగినది. మిగితా పంటలలో కూడా వాస్తవ ఉత్పత్తులకు, నిర్దేశించిన లక్ష్యములకు తేడా స్వల్పముగా మాత్రమేనున్నది. ఋతు పవనములు అనుకూలముగా ఉండుట దీనికి ప్రధాన కారణము. 1.5 మిలియన్ హెక్టారుల భూమికి నీటిపారుదల వసతులు కల్పించబడినవి. 1.1 మిలియన్ హెక్టారుల భూమి పునరుద్ధరణ చేయబడినది.

శాస్త్రీయ ఉత్పత్తి పద్ధతులు ప్రవేశపెట్టుట, ఉద్యోగిత పెంచుటకు కుటీర మరియు చిన్నతరహా పరిశ్రమలను అభివృద్ధి చేయుట మొదలగు లక్ష్యముల సాధనకు సమాజాభివృద్ధి పథకములు చేపట్టబడినవి.

మొత్తం మీద మొదటి ప్రణాళికలో వ్యవసాయ రంగం ఉత్పత్తులు అనుకులంగా ఉన్నవి. వ్యవసాయరంగ ప్రణాళిక విజయవంతమైనది. "వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల, ద్రవ్యోల్బణమును నివారించుటకు, ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు, రాబోవు ప్రణాళికలలో ఎక్కువ ఆర్థికాభివృద్ధిరేటు సాధించుటకు తోడ్పడినది అని ప్రణాళికా సంఘము పేర్కొనినది" వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గినవి, దిగుమతలు తగ్గించబడినవి.

రెండవ ప్రణాళిక :- మొదటి ప్రణాళికలో వ్యవసాయ రంగం బలపడినదని భావించి రెండవ ప్రణాళికలో పరిశ్రమలకు ప్రణాళికా సంఘము ప్రథమ స్థానమిచ్చినది. మొదటి ప్రణాళిక కన్నా కొంత తక్కువ శాతము కేటాయింపులో వ్యవసాయ ఉత్పత్తిని పెంచవచ్చునని, భావించబడినది. అందుచేత మొదటి ప్రణాళికలో మొత్తం పెట్టుబడిలో వ్యవసాయ రంగము 31% కాగా రెండవ ప్రణాళికలో ఆ పెట్టుబడి 20%నికి తగ్గించబడినది. రెండవ ప్రణాళికలోని మొత్తం పెట్టుబడి రూ॥4600 కోట్లులో వ్యవసాయరంగం పై పెట్టుబడి రూ.950 కోట్లు అనగా 20%. రూ॥530 కోట్లు వ్యవసాయాభివృద్ధి, సమాజాభివృద్ధికి, రూ.430 కోట్లు భారీ మరియు చిన్న నీటిపారుదల ప్రాజెక్టులకు కేటాయించబడినది. రెండవ ప్రణాళికలో వ్యవసాయ ఉత్పత్తుల నిర్దేశించిన లక్ష్యములు, వాస్తవంగా సాధించన ఉత్పత్తులు దిగువ విధంగా ఉన్నవి.

వస్తువు	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవ ఉత్పత్తి
1) ఆహార వస్తువుల (మిలియన్ టన్నులు)	81	80
2) నూనెగింజలు (మిలియన్‌టన్నులు)	76	65
3) చెరుకు (మిలియన్ టన్నులు)	78	104
4) పత్తి (మిలియన్ బేళ్ళు)	65	54
5) జనుము (మిలియన్ బేళ్ళు)	65	40

ఈ ప్రణాళికలో చెరుకు పంటలో తప్ప మిగిలిన వాటిలో నిర్దేశించిన లక్ష్యములు సాధింపబడలేదు. వ్యవసాయ ఉత్పత్తుల లక్ష్యములు సాధింపబడనందున వ్యవసాయ వస్తువల ధరలు పెరిగినవి. ఆహార వస్తువలు దిగుమతి చేసుకొనవలసిన పరిస్థితి ఏర్పడినది. వ్యవసాయ రంగమునకు తక్కువ ప్రాధాన్యత నిచ్చుట దీనికి కారణమని పలువురు ప్రణాళికా సంఘమును విమర్శించారు. అయితే ఋతు పవనముల వైఫల్యము కొంత వరకు వ్యవసాయ ఉత్పత్తులు తగ్గుటకు కారణము.

మూడవ ప్రణాళిక :- రెండవ ప్రణాళిక అనుభవమును బట్టి వ్యవసాయ రంగములో పెరుగుదల రేటు ఆర్థికాభివృద్ధికి ప్రధానమైనదని విదితమైనందున మూడవ ప్రణాళికలో వ్యవసాయ రంగమునకు ప్రాధాన్యత ఇవ్వబడినది.

మూడవ ప్రణాళిక మొత్తం పెట్టుబడి రూ॥8600 కోట్లలో వ్యవసాయరంగమునకు రూ॥1750 కోట్లు అనగా 20.4% కేటాయించబడినది.

వ్యవసాయ రంగములో సాంద్ర వ్యవసాయ జిల్లాల కార్యక్రమము (I.A.D.P.) ప్రారంభించబడినది. ఈ పథకములో నూతన వ్యవసాయ పద్ధతులు ప్రవేశ పెట్టబడినది. ఆ తరువాత అధిక దిగుబడి వండగముల కార్యక్రమము చేపట్టబడినది. ఈ నూతన వ్యవసాయ వ్యూహము హరిత విప్లవము తెచ్చింది. మూడవ ప్రణాళికలో వ్యవసాయ ఉత్పత్తుల నిర్దేశించిన లక్ష్యములు, వాస్తవంగా సాధించిన ఉత్పత్తులు దిగువ విధముగా నున్నవి.

వస్తువు	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవ ఉత్పత్తి
1) ఆహార వస్తువులు (మిలియన్ టన్నులు)	100	72
2) నూనెగింజలు (మిలియన్ టన్నుల)	98	64
3) చెరుకు (మిలియన్ టన్నులు)	100	127
4) పత్తి (మిలియన్ బేళ్ళు)	70	46
5) జనుము (మిలియన్ బేళ్ళు)	62	45

రెండవ ప్రణాళిక వలె ఈ ప్రణాళికలో కూడా చెరుకు పంటలో తప్ప మిగితా వాటిలో నిర్దేశించిన లక్ష్యములు సాధింపబడలేదు. ముఖ్యంగా ఆహార వస్తువుల ఉత్పత్తి రెండవ ప్రణాళిక కన్నా తగ్గింది. రెండవ ప్రణాళికలో ఆహార వస్తువుల ఉత్పత్తి 80 మిలియన్ టన్నులు కాగా మూడవ ప్రణాళికలో 72 మిలియన్ టన్నులుకు తగ్గినది. ఇతర వస్తువుల ఉత్పత్తి కూడా రెండవ ప్రణాళికకు ఇంచుమించు సమానముగామన్నదే గాని, చెప్పుకోదగిన ప్రగతి లేదు. వ్యవసాయ ఉత్పత్తుల విషయములో మూడవ ప్రణాళిక విఫలమైనది. దీనికి కారణములు.

1) ఋతు పవనముల వైఫల్యము

2) ఈ ప్రణాళికా కాలములో సంభవించిన యుద్ధములు.

ఆహార పదార్థముల ఉత్పత్తి తగ్గుట, కొన్ని ప్రాంతములలో క్షామ పరిస్థితులు ఏర్పడుట వలన ఆహార పదార్థములు భారీగా దిగుమతి చేసుకొనవలసి వచ్చినది. విదేశీ మారక ద్రవ్య సమస్య ఏర్పడినది. ఈ ప్రణాళికలో కూడా వ్యవసాయ రంగంలో వృద్ధి సాధ్యపడలేదు. అంతే ఈ ప్రణాళిక వ్యవసాయరంగం విషయంలోనే కాక అన్ని రంగాల విషయంలో కూడా విఫలమైనదని చెప్పవచ్చు.

నాలుగవ ప్రణాళిక :- మూడవ ప్రణాళిక అనంతరము మూడు సం॥లు 3 సాంవత్సరిక (వార్షిక) ప్రణాళికలు (1966-69) అమలు పరచబడినవి. ఈ 3 వార్షిక ప్రణాళికలలో వ్యసాయ రంగముపై రూ॥1624 కోట్లు పెట్టుబడి చేయబడినది. వీటిలో నీటి పారుదల వసతులు పెంచుటకు, అధిక దిగుబడి వంగడములకు ప్రాధాన్యత ఇవ్వబడినది. నాలుగవ ప్రణాళికలో వ్యవసాయమునకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడినది. ఈ ప్రణాళికలో పేర్కొనిన ధ్యేయములు.

1) స్థిరత్వముతో కూడిన అభివృద్ధి

2) వ్యవసాయ ఉత్పత్తిలో 5% పెరుగుదల

3) ఆర్థికాభివృద్ధిలో గ్రామీణ ప్రజలు పాల్గొనుట, పెంపొందించుట.

4) ఆర్థికాభివృద్ధి ఫలితములు గ్రామీణ ప్రజలు ఎక్కువగా పొందునట్లు చేయుట.

వ్యూహము:- వ్యవసాయరంగ లక్ష్యములు సాధించుటకు వ్యవస్థాపనా వసతులు పెంచుట, దిగుబడి పెంచు వ్యూహములో అధిక దిగుబడి వంగడములు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహార మందులు ప్రధాన అంశములు. వ్యవసాయ వ్యాపారీకరణ, విచక్షణాత్మక

యాంత్రీకరణ, సులభ వ్యవసాయ పరపతి మొదలగునవి మరికొన్ని విధానములు. వ్యవసాయదారులకు, వ్యవసాయ యంత్రములు మరియు ఇతర సేవలు అందించుటకు Agro - Industrial Corporation స్థాపించబడినది. సన్నకారు రైతుల అభివృద్ధికి, సన్నకారు రైతుల అభివృద్ధి ఏజెన్సీ (SFDA) నెలకొల్పబడినది. మెట్ట వ్యవసాయ అభివృద్ధికి చర్యలు చేపట్టబడినవి.

వ్యవసాయ రంగంలో పెట్టుబడి :- ఈ ప్రణాళికలో మొత్తం పెట్టుబడి రూ. 16160 కోట్లలో వ్యవసాయ రంగంపై పెట్టుబడి రూ॥ 3300 కోట్లు.

నిర్దేశించిన ఉత్పత్తులు - వాస్తవ ఉత్పత్తులు :- ఈప్రణాళికలో నిర్దేశించిన ఉత్పత్తులు, వాస్తవ ఉత్పత్తులు దిగువ విధముగానున్నవి.

వస్తువు	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవ ఉత్పత్తి
1) ఆహార ధాన్యముల (మిలియన్ టన్నులు)	129	104
2) నూనెగింజలు(మిలియన్ టన్నులు)	10.5	8.7
3) చెరుకు (మిలియన్. టన్నులు)	150	140
4) పత్తి (మిలియన్ బేళ్ళు)	8.0	5.8
5) జనుము (మిలియన్ బేళ్ళు)	7.4	6.2

నాలుగవ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యములు ఏ పంటలోనూ సాధింపబడలేదు. అన్నింటిలోనూ వాస్తవ ఉత్పత్తి నిర్దేశించిన దానికన్నా చాలా చాలా తక్కువగా నున్నది. నిర్దేశించిన వ్యవసాయాభివృద్ధిరేటు 5% కాగా వాస్తవ వృద్ధిరేటు 2.8% మాత్రమే. అయితే అధిక దిగుబడి వంగడముల క్రింద భూమి విస్తరణ మరియు భూసార పరిరక్షణ క్రింద భూమి విస్తరణ లక్ష్యములు అధిగమించబడినవి. ఈ ప్రణాళికలో ఏర్పడిన వ్యవసాయ ఉత్పత్తుల తగ్గుదల ద్రవ్యోల్బణ పరిస్థితులకు దారితీసినది. ఆర్థికాభివృద్ధి రేటు కుంటుపడినది. వ్యవసాయ రంగ లక్ష్యములు విఫలమగుటకు ప్రధానకారణములు :-

1) నీటిపారుదల శక్యతను పూర్తిగా ఉపయోగించుకొనకపోవుట.
2) రసాయనిక ఎరువుల సప్లయ్ కొరత
3) ఋతుపవనముల అనిశ్చిత.

అయిదవ ప్రణాళిక :- నాలుగవ ప్రణాళికలో విధానములే అయిదవ ప్రణాళికలో కూడా కొనసాగించబడినవి. వ్యవసాయాభివృద్ధి సాలుసరి పెరుగుదల రేటు 3.94%గా నిర్ణయించబడినది. ఈ ప్రణాళికా మొత్తం పెట్టుబడి రూ॥39300 కోట్లలో రూ॥8080 కోట్లు అనగా 21% వ్యవసాయ రంగమునకు కేటాయించబడినది. నిర్దేశించిన లక్ష్యములు సాధించుటకు బహుముఖ విధానము అవలంబించబడినది.

1) సమస్యలను గుర్తించుట, వాటి పరిష్కారమునకు పరిశోధనలు.
2) నీటి వనరుల నిర్వహణ, పరపతి వసతులు పెంచుట, పంటలకోత అనంతర వసతులు పెంచుట.
3) వ్యవసాయ సేవల విస్తరణ
4) సర్టిఫికేటు పొందిన వంగడముల ఉత్పత్తి మరియు పంపిణీ పెంచుట.
5) వ్యవసాయ ఉత్పత్తులు పెంచుటకు తగిన ఆసక్తుల్ను పెంచు వ్యవసాయధరల విధానము.
6) కౌలుదారులకు రక్షణ, భూయాజమాన్యము కల్పించుట, మిగులు భూమిని భూమిలేని వ్యవసాయ శ్రామికులకు పంపిణీ చేయుట,గ్రామీణ రంగములో ఆదాయ, సంపద వ్యత్యాసములు తగ్గించుట.

నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యములు - వాస్తవ ఉత్పత్తులు :-

నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యములు, వాస్తవముగా సాధించిన ఉత్పత్తులు దిగువ విధముగా ఉన్నవి.

వస్తువు	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవ ఉత్పత్తి
ఆహార వస్తువులు (మిలియన్ టన్నులు)	125	126
నూనె గింజలు (మిలియన్ టన్నులు)	12.0	8.9
చెరుకు (మిలియన్ టన్నులు)	165	165
పత్తి (మిలియన్ బేళ్ళు)	8.0	7.1
జనుము (మిలియన్ ళ్ళు)	7.7	7.1

ఆహార వస్తువులు, చెరుకు పంటల్లో తప్ప మిగతా వాటిలో నిర్దేశించిన లక్ష్యములు సాధింపబడలేదు. వ్యవసాయ ఉత్పాదకముల వాడుక పెరిగినప్పటికీ, నిర్దేశించిన లక్ష్యములు సాధింపబడలేదు. ఈ ప్రణాళికలో గమనించవలసిన మరొక అంశము ఉత్పత్తులలో ఒడిదుడుకులు. ఆహార పదార్థముల ఉత్పత్తి 1975-76 లో 121 మిలియన్ టన్నులు, 1976-77లో 70.8 మిలియన్ టన్నులు. అలాగే, పత్తి, జనుము ఉత్పత్తులలో కూడా చాలా ఒడిదుడుకులున్నవి. 5వ ప్రణాళికలో వ్యవసాయరంగం వైఫల్యమునకు కారణములు

1) ఋతుపవనముల వైఫల్యము

2) ప్రణాళిక వైఫల్యము

ఆరవ ప్రణాళిక :- ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగమునకు నిర్దేశించిన పెరుగుదల రేటు 3.8%. ఈ వృద్ధిరేటును సాధించుటకు రూ॥24700 కోట్లు అనగా మొత్తం పెట్టుబడిలో 25% వ్యవసాయ రంగమునకు కేటాయించబడినది. ఇందులో రూ॥12540 కోట్లు వ్యవసాయాభివృద్ధికి రూ॥12260 కోట్లు నీటిపారుదలకు కేటాయించబడినవి. వ్యవసాయరంగ కేటాయింపులు దిగువ విధముగా నున్నవి.

1) వ్యవసాయము (Agriculture)	రూ॥5696 కోట్లు
2) గ్రామీణాభివృద్ధి (Rural Development)	రూ॥ 5364 కోట్లు
3) ప్రత్యేక ఏరియా పథకములు (Special Area Programmes)	రూ॥ 1480 కోట్లు
4) నీటిపారుదల వరదల నివారణ	రూ॥ 12610 కోట్లు

గ్రామీణాభివృద్ధికి, నీటిపారుదలకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడినది. ఆరవ ప్రణాళికలో వ్యవసాయాభివృద్ధి అంశములు దిగువ పేర్కొనిన విధముగా ఉన్నది.

1) వ్యవసాయ మార్కెటింగ్, వ్యాపారము, సంస్థాగత అంశములకు ప్రాధాన్యత

2) సన్నకారు మరియు ఉపాంత రైతుల అభివృద్ధికి చర్యలు.

ఎ) చిన్న కమతముల ఉత్పాదకత, ఆదాయము పెంచుట.

బి) సన్నకారు రైతులకు తమ పంటలు నిల్వ చేసుకొనుటకు, విక్రయమునకు వసతులు పెంచుట

సి) సమన్విత గ్రామీణాభివృద్ధి పథకము (IRDP) , జాతీయ గ్రామీణ ఉద్యోగితాపథకం (NREP) etc మొ॥గు పథకముల ద్వారా గ్రామీణ పేదవారికి ఉద్యోగ అవకాశములు పెంచుట మరియు బహుముఖం చేయుట

3) వ్యవసాయ రంగములో ప్రాంతీయ వ్యత్యాసములు తగ్గించుటకు వ్యవసాయాభివృద్ధి తక్కువగా నున్న ప్రాంతములలో నూతన ఉత్పత్తి పద్ధతులను, హరిత విప్లవమును విస్తరింప చేయుట.

4) జాతీయ ఆహార రక్షణ వ్యవస్థ నెలకొల్పుట. ఈ పథకములో నాలుగు అంశములు ఉంటాయి.

ఎ) పర్యావరణ పరిరక్షణ

బి) సాంకేతిక పరిరక్షణ అనగా స్థిరత్వముతో కూడిన అభివృద్ధి

సి) ఆహార నిల్వలు సుమారు 15 మిలియన్ టన్నులకు తగ్గకుండా ఉంచుట

డి) పేదవారికి తగినంత కొనుగొలు శక్తి కల్పించుట అనగా సాంఘిక భద్రత కల్పించుట.

ఇ) పోషక ఆహార విద్య

ఎఫ్) కొరత వస్తువుల ఉత్పత్తి పెంచుట ద్వారా ధరల స్థిరీకరణ ఏర్పరచుట.

5) ఆహార ధాన్యములలో స్వయం సమృద్ధి సాధించుట.

నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యములు - వాస్తవ ఉత్పత్తులు :-

వస్తువు	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవ ఉత్పత్తి
1) ఆహార ధాన్యములు (మిలియన్ టన్నులు)	154	146
2) నూనె గింజలు (మిలియన్ టన్నులు)	11.1	13.0
3) చెరుకు (మిలియన్ టన్నులు)	215	170
4) పత్తి (మిలియన్ బేళ్ళు)	9.2	8.5
5) జనుము (మిలియన్ బేళ్ళు)	9.1	7.8

సాధించిన ప్రగతి :- ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగము చాలా వరకు తృప్తికరమైన ప్రగతిని సాధించింది.

1) ఆహార వస్తువులలో ఇంచుమించు స్వయం పోషకత్వము సాధించబడినది. దీనికి కారణములు, నీటిపారుదల క్రింద భూమి విస్తరించుట, అధిక దిగుబడి నిచ్చు వంగడముల వాడుక, రసాయనిక ఎరువులు మొదలగు నూతన వ్యవసాయ పద్ధతులు, ఆహార ధాన్యములు లాభసాటి ధరలతో సేకరణ.

2) అధిక దిగుబడి వంగడముల క్రింద భూమి 35.2 మిలియన్ హెక్టారుల నుండి 56 మిలియన్ హెక్టారులకు విస్తరించినది.

3) రసాయనిక ఎరువుల వినియోగము 5.3 మిలయన్ టన్నుల నుండి 8.4 మిలియన్ టన్నులకు పెరిగినది.

4) నీటిపారుదల శక్యత (సౌకర్యం) 54 మిలియన్ హెక్టారుల నుండి 68 మిలియన్ హెక్టారులకు పెరిగినది.

ఈ ప్రణాళికలో వ్యవసాయరంగ ప్రగతి వ్యవసాయ రంగములో రెండవ హరిత విప్లవమును ప్రారంభించినదను అభిప్రాయమును కలిగించినది.

విమర్శనాత్మక పరిశీలన :- ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగ ప్రగతి కొంత తృప్తికరముగా నున్నప్పటికి పటిష్టమైన పునాదులు ఏర్పడలేదు.

1) వ్యవసాయ ఉత్పత్తిలో సాంవత్సరిక ఒడుదుడుకులు తగ్గలేదు. దీనికి ప్రధాన కారణము వ్యవసాయము ఇంకనూ ప్రధానముగా వర్షముపై ఆధారపడుట.

2) ఆహార వస్తువుల ఉత్పత్తి పెరుగుదల కొన్ని ప్రాంతములకే పరిమితమై ఉన్నది. వ్యవసాయాభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలు ఎక్కువగా తగ్గలేదు. అనగా హరిత విప్లవములో ప్రాంతీయ అసమానతలు కొనసాగుచునేయున్నవి.

3) వివిధ వ్యవసాయ వస్తువుల ఉత్పత్తి పెరుగుదల రేట్లలో అసమతౌల్యము గోచరిస్తుంది. కొంతవరకు దీనికి కారణము వ్యవసాయ రంగములో ప్రాంతీయ అసమానతలు.

4) వ్యవసాయ ఉత్పత్తుల పెరుగదల, ఉత్పాదకముల పెరగుదల రేటు సమానంగా లేదు. అనగా ఉత్పాదకముల - ఉత్పాదకత తగ్గుదల గోచరించుచున్నది. హరితవిప్లవము బాగా విస్తరించిన ప్రాంతములలో ఇది గోచరించుచున్నది. నూతన ప్రాంతములకు హరిత విప్లవము విస్తరణ చేయవలె.

5) అడవీ ప్రాంతముల తగ్గుదలను అరికట్టే, పర్యావరణ సమతౌల్యము పరిరక్షించుటకు చర్యలు పటిష్టముగా చేపట్టబడలేదు.

6) ఆహార ధాన్యముల మిగులు అనునది వాస్తవ మిగులుకాదు. పేదవారిలో తగినంత కొనుగోలు శక్తి లేనందున ఆహార ధాన్యముల మిగులు గోచరించుచున్నది. వెనుకబడిన ప్రాంతాలలో వ్యవసాయాభివృద్ధి, సన్నకారురైతుల అభివృద్ధి, గ్రామీణ ఉద్యోగితో పెంచుట మొదలు పథకముల ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెంచవలె.

7) ఆహార ధాన్యములు తప్ప, మిగతా వ్యవసాయ ఉత్పత్తులలో గణనీయమైన ఉత్పత్తి పెరుగుదల లేదు. వ్యవసాయ వ్యాపారీకరణ, ఆహార ధాన్యముల నుండి వ్యాపార పంటలకు మార్పు గోచరించదు.

ఏడవ ప్రణాళిక :- ఆరవ ప్రణాళికల వరకు వ్యవసాయ రంగములో ప్రగతి సాధించినప్పటికి, ఇంకనూ వ్యవసాయ రంగములో నున్న మూలకమైన బలహీనత తొలగి పోలేదు. ఈ బలహీనతలు తొలగించుట ఏడవ ప్రణాళిక ధ్యేయము.

1) దేశములో చాల ప్రాంతములలో వర్ణాధార వ్యవసాయమైనందున ఉత్పత్తి ఒడుదుడుకులకు లోనగుచున్నది. నీటి పారుదల వసతులు కూడా ఋతుపవనాల అనిశ్చితలకు లోనగుచున్నవి. అందుచేత ఏడవ ప్రణాళికలో వ్యవసాయ ఉత్పత్తులను ప్రాంతీయ విస్తరణ చేయుటకు నిర్ణయించబడినది. నీటిపారుదల వసతులు తక్కువగా నున్న ప్రాంతాలలో నీటి పారుదల వసతులు పెంచుట, సాధ్యం కాని ప్రాంతములలో మెట్ట వ్యవసాయమును అభివృద్ధి చేయుట.

2) ఆహార ధాన్యముల ఉత్పత్తి వ్యవసాయము బాగా అభివృద్ధి చెంది వినియోగము ఎక్కువగా నున్న కొన్ని ప్రాంతములకే పరిమితమై ఉన్నది. అందుచేత ఈ ప్రాంతములలో విక్రయము కాగల మిగులు బాగా పెరిగినవి. ప్రభుత్వము సేకరించిన ధాన్యములు బాగా పెరిగినందున, వాటిని నిల్వచేయుట మొదలగు సమస్యలు ఏర్పడినవి.

3) వ్యవసాయ రంగములలో ప్రాంతీయ అసమానతలు కొనసాగుచునేయున్నవి. వెనుకబడిన ప్రాంతములలో వ్యవసాయం ఉత్పాదకత తక్కువగానున్నది. అందుచేత వెనుకబడిన ప్రాంతములకు ఆధునిక ఉత్పత్తి పద్ధతులను విస్తరణ చేసి ఉత్పాదకతను పెంచవలెను.

4) చాలా మంది వ్యవసాయదారుల ముఖ్యంగా సన్నకారు మరియు ఉపాంత రైతుల ఆదాయములు చాలా తక్కువగా నున్నవి. నూతన ఉత్పత్తి పద్ధతులను వారు ప్రవేశ పెట్టలేక యున్నారు. దీనివల్లే ఎక్కువ శ్రద్ధ వహించి నూతన పద్ధతులను ప్రవేశ పెట్టుటకు ఆర్థికస్థోమత మరియు ఆసక్తులు కల్పించి వ్యవసాయ ఉత్పాదకత మరియు ఉత్పత్తి పెంచలేదు.

5) వివిధ వ్యవసాయ వస్తువుల ఉత్పత్తిలో అసమతౌల్యము ఉన్నది. దీనిని నివారించవలెను. EX :- పశ్చిమ ప్రాంతములో వరిపంట ఉత్పత్తిలో మార్పులు తెచ్చి ఆ ప్రాంతములో ఉత్పత్తి పెంచిన యెడల ఆహార వస్తువల ఉత్పత్తిలో అసమతూకం తగ్గించవచ్చు. అదేవిధంగా, మెట్ట వ్యవసాయములో అభివృద్ధిని సాధించి పప్పుధాన్యముల ఉత్పత్తిలో అసమతూకము నివారించవచ్చు. మెట్ట వ్యవసాయములో సన్నకారు రైతులు ఎక్కువగా నున్నందున వారు లాభపడతారు.

6) గ్రామీణ జనాభా పెరుగుదల, వ్యవసాయ భూపరిమాణము పెరుగుదల, అడవుల ధ్వంసము వలన పర్యావరణ అసమతౌల్యము మొదలగు సమస్యలున్నవి. గ్రామీణ జనాభా పెరుగుదల అరికట్టుట, అడవుల పెంపకము, భూసారపరిరక్షణ, నీటివనరుల ఉత్తమ నిర్వహణ, పర్యావరణ మొదలగు చర్యలు అవసరం.

ఏడవ ప్రణాళికలో వ్యవసాయ వ్యూహము - ధ్యేయములు :-

ఆహార ధాన్యములు, పప్పులు, నూనె గింజలు, వస్త్ర నారలలో స్వయం పోషకత్వము సాధించుట. ఈ ప్రణాళికలో ఉత్పత్తి లక్ష్యములు క్రింది విధముగా ఉన్నవి.

వస్తువు	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవ లక్ష్యము
ఆహార ధాన్యములు (మిలియన్ టన్నులు)	180	172
నూనెగింజలు (మలియన్ టన్నులు)	18	17
చెరుకు (మిలియన్ టన్నులు)	217	210
పత్తి (మిలియన్ బేళ్ళు)	9.5	10.5
జనుము (మిలియన్ బేళ్ళు)	9.5	7.9

వ్యవసాయ రంగముపై పెట్టుబడి :- ఈ ప్రణాళికలో మొత్తం పెట్టుబడి రూ॥2187296 కోట్లలో వ్యవసాయ రంగమునకు 39,770 కోట్లు పెట్టుబడి కేటాయించ బడినది. అందులో వ్యవసాయాభివృద్ధికి రూ॥10,570 కోట్లు,గ్రామీణాభివృద్ధి మరియు ప్రత్యేక ఏరియా పథకములకు రూ॥12,220 కోట్లు, నీటిపారుదల మరియు వరదల నియంత్రణకు రూ॥16,980 కోట్లు కేటాయించబడినవి. వ్యవసాయ రంగముపై పెట్టుబడి మొత్తం ప్రణాళికా పెట్టుబడిలో 22 శాతము.

సాలుసరి పెరుగుదల రేటు :- ఈ ప్రణాళికలో వ్యవసాయరంగము సాలుసరి పెరుగుదల రేటు 4% గా నిర్ణయించబడినది. ఆహార ధాన్యముల సాలుసరి పెరుగుదలరేటు 3.7% గా నిర్ణయించబడినది. జనాభా పెరగుదల కారణముగా పెరుగనున్న ఆహారధాన్యములకు డామండ్ తప్పు పరచుటకు ఆహార ధాన్యముల ఉత్పత్తి పెరుగుదల రేటు అధికముగా నిర్ణయించబడినది. వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదల లక్ష్యములకు అనుగుణముగా వ్యవసాయ ఉత్పాదకముల పెరుగుదల లక్ష్యములు కూడా నిర్ణయించబడినవి. రసాయనిక ఎరువుల ఉత్పత్తి 14 మిలియన్ టన్నులకు పెంచబడుతుంది. అదనముగా 11 మిలియన్ హెక్టారులకు నీటిపారుదల వనరులు కల్పించబడతాయి.

ప్రధాన వ్యవసాయ విధానములు :- తూర్పు ప్రాంతములలో ప్రత్యేక వరిపంట పథకములు, జాతీయ నూనె గింజల ప్రాజెక్టు స్థాపన, వర్షాధార వ్యవసాయమునకు నీటి వనరుల పథకము, సన్నకారు మరియు ఉపాంత రైతుల అభివృద్ధికి చర్యలు, సామాజిక అటవీ పెంపక పథకము, మొత్తర వ్యవసాయ భూమిలో 70% వర్షాధారమైనదిగా ఉన్నది. వ్యవసాయ ఉత్పత్తులలో చాలా భాగం వర్షాధార భూముల నుండి వచ్చుచున్నది. అందుచేత మెట్ట వ్యవసాయ అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టబడినది. భూసంస్కరణలు పటిష్టముగా అమలు పరచుట, కమతముల ఏకీకరణ శీఘ్రగతిని అమలు పరచుట. బహుళ పంటల కార్యక్రమము, సాంద్ర వ్యవసాయము, నూతన పద్ధతుల ద్వారా దిగుబడి పెంచుట, భూమి పునరుద్ధరణ మరియు వాటి అభివృద్ధి పథకములు, భూసార పరిరక్షణ మరియు నీటివనరుల అభిలషణీయ నిర్వహణ పథకములు, పంటల భీమా పథకములు, వర్షాభావమును తట్టుకొనగల విత్తనములు అభివృద్ధి చేయుట అడవుల పెంపకము అభివృద్ధి చేయుట, వ్యవసాయాభివృద్ధి, సన్నకారు రైతుల అభివృద్ధి ఉద్యోగిత పెంపుదల ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేయుట, వ్యవసాయ ఉత్పాదకములు, వ్యవసాయ సేవలు తగినంత పరిమాణములో కల్పించుట, అధిక దిగుబడి వంగడములు క్రింద భూపరిమాణమును విస్తరించుట, వ్యవసాయ రంగములోనున్న నష్టభయములు, అనిశ్చితలు కనీసము చేయుట సముచిత వ్యవసాయ ధరల విధానము రూపొందించి వ్యవసాయదారులకు ఉత్పత్తి ప్రోత్సాహకములు కల్పించుట, వ్యవసాయాభివృద్ధికి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారమునకు పరిశోధనలు అభివృద్ధి చేయుట మొదలగు విధానాలను ప్రభుత్వము ఈ ప్రణాళికలో అమలు చేయడానికి పూనుకున్నది.

విమర్శనాత్మక పరిశీలన :- ఈ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యములు చాలావరకు సాధించబడినవి. వ్యవసాయ రంగమునకు శాస్త్రీయ మరియు బలీయమైన పునాదులు నిర్మించబడినవి. అయితే కొన్ని పంటలల్లో ఆశించిన లక్ష్యములును సాధింపబడలేదు. కానీ నిర్దేశించిన లక్ష్యమునకు, వాస్తవ ఉత్పత్తికి ఉన్న తేడా తక్కువగా ఉన్నది. నూనెగింజల లక్ష్యము 18 మిలియన్ టన్నులు కాగా వాస్తవ ఉత్పత్తి 17 మిలియన్ టన్నులు. ఆహార ధాన్యముల ఉత్పత్తి లక్ష్యము 180 మిలియన్ టన్నులు కాగా వాస్తవ ఉత్పత్తి 172 మిలియన్ టన్నులు, చెరుకు లక్ష్యము 217 మిలియన్ టన్నులు కాగా వాస్తవ ఉత్పత్తి 210 మిలియన్ టన్నులు. జనుము లక్ష్యము 9.5 మిలియన్ బేళ్ళు కాగా వాస్తవ ఉత్పత్తి 7.9 మిలియన్ బేళ్ళు. దీనికి కారణము ఉత్పత్తి లక్ష్యములు కొంత అధికముగా నిర్ణయించుట అని భావించబడుతున్నది.

పత్తి పంట విషయంలో వాస్తవ ఉత్పత్తి నిర్దేశించిన లక్ష్యము కన్నా మించినది. పత్తి ఉత్పత్తి నిర్దేశించిన లక్ష్యము 9.5 మిలియన్ బేళ్ళు కాగా వాస్తవ ఉత్పత్తి 10.5 మిలియన్ బేళ్ళు. అధిక దిగుబడి వంగడముల క్రింద వ్యవసాయ భూమి 67 మిలియన్ హెక్టారులకు పెరిగినది. మొత్తం మీద ఏడవ ప్రణాళిక వ్యవసాయ రంగమునకు, గ్రామీణాభివృద్ధికి శాస్త్రీయ మరియు పటిష్టమైన పునాదులు వేసినది.

ఎనిమిదవ ప్రణాళిక :- ఏడవ ప్రణాళికలో వ్యవసాయ రంగము, గ్రామీణ అభివృద్ధికి తీసుకొనిన విధానాల వలన ఈ ప్రణాళికలో కూడా ఆరంగమునకు కేటాయింపులు, ఈ ప్రణాళిక ధ్యేయాలు ఏవిధంగా ఉంటాయోనను విషయాలు అధిక ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగము ధ్యేయాలు క్రింద విధముగా ఉన్నవి.

1) ప్రాంతీయ అసమానతలు తగ్గించుట - వర్షాధార ప్రాంతముల అభివృద్ధి :-

వ్యవసాయరంగ అభివృద్ధి ప్రాంతీయ అసమానతలు తగ్గించుటకు, వర్షాధార ప్రాంతములలో వ్యవసాయ, ప్రాంతీయ అభివృద్ధి పథకములు చేపట్టబడతాయి. ముఖ్యముగా తూర్పు రాష్ట్రములు, కొండ ప్రాంతములపై దృష్టి కేంద్రీకరింపబడుతుంది. ఆరవ, ఏడవ ప్రణాళికలో రూపొందించిన పథకములు కొనసాగించబడుటయే కాక వాటిని ఇంకనూ విస్తృత పరిచి, నూతన వ్యవసాయ పద్ధతులను ఈ ప్రాంతములకు విస్తృతపరచి, ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుటకు తీవ్ర కృషి చేయబడుతుంది. మెట్ట వ్యవసాయ అభివృద్ధి పథకము పటిష్ఠముగా అమలు పరచబడుతుంది. ఈ ప్రాంతముల రైతులు వారి భూమి మరియు నీటివనరులను అభిలషణీయముగా ఉపయోగించుటకు చర్యలు తీసుకొనబడతాయి. వర్షాధారప్రాంతముల అభివృద్ధికి చేపట్టు కార్యక్రమముల వలన ఆ ప్రాంతములలో ఉద్యోగిత కూడా పెరుగుతుంది.

2) సన్నకారు మరియు ఉపాంత రైతుల అభివృద్ధి :- సన్నకారు మరియు ఉపాంత రైతుల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించబడుతుంది. వారి సమస్యలను పరిష్కరించి, వారి ఆదాయములు పెంచుటకు చర్యలు తీసుకొనబడతాయి.

3) వ్యవసాయం బహుముఖం చేయుట :- పండ్ల పెంపకము, పూలపెంపకము, పాడి పరిశ్రమ, మత్స్యపరిశ్రము, పశు పరిశ్రమ మొదలగునవి వ్యవసాయ రంగముతో పాటు ప్రోత్సహించబడతాయి,

4) మార్కెటింగ్ వసతులు పెంచుట :- వ్యవసాయ వస్తువుల మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసి, లోపములను తొలగించి, వ్యవసాయదారులు లాభసాటి ధర పొందునట్లు చర్యలు తీసుకొని వారికి తగిన విధముగా మార్కెట్ సౌకర్యాలను కల్పించడం జరుగుతుంది.

5) వ్యవసాయ ప్రాతిపదిక పరిశ్రమలు అభివృద్ధి చేయుట :- వ్యవసాయ ప్రాతిపదిక పరిశ్రమలను ప్రోత్సహించి, వ్యవసాయ శ్రామికులు మరియు సన్నకారు రైతుల ఉద్యోగిత మరియు ఆదాయము పెంచుటకు చర్యలు చేపట్టబడతాయి.

6) ఎగుమతుల అభివృద్ధి :- సాంప్రదాయముగా ఎగుమతి చేయబడుచున్న వ్యవసాయ వస్తువు, మరియు పండ్లు, పూల ఉత్పత్తుల ఎగుమతులు పెంచుటకు చర్యలు తీసుకోబడతాయి.

7) ప్రయివేటు - ప్రభుత్వేతర సంస్థలు :- పంచాయితీరాజ్ వ్యవస్థ, వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధిలో పాల్గొనుటకు ప్రోత్సాహకములు కల్పించబడతాయి. వ్యవసాయ ఉత్పాదకతను పెంచుటకు తగిన చర్యలు చేపట్టబడతాయి, క్లుప్తంగా, వ్యవసాయ ఉత్పత్తిని ఉత్పాదకతను పెంచుట, పెరగుతున్న జనాభా మరియు పారిశ్రామికీకరణకు అనుగుణముగా వ్యవసాయ ఉత్పత్తులను పెంచుట, ప్రాంతీయ అసమానతలు తగ్గించుట, ఎగుమతులను పెంచుట, వ్యవసాయమును బహుముఖం చేయుట వ్యవసాయ ప్రాతిపదిక పరిశ్రమలు అభివృద్ధి చేయుట, వ్యవసాయ రంగమునకు అవస్థాపనా వసతులు పెంచుట ఎనిమిదవ ప్రణాళిక ప్రధాన ధ్యేయాలు.

వ్యవసాయ ఉత్పాదకములు :- వ్యవసాయ రంగ ఉత్పత్తి లక్ష్యములను సాధించుటకు తగిన పరిమాణములో వ్యవసాయ ఉత్పాదకములను పెంచుటకు చర్యలు తీసుకొనబడతాయి. వీటి లక్ష్యములు క్రింది విధముగా నున్నవి.

వ్యవసాయ ఉత్పాదకము	లక్ష్యము
1) సర్టిఫైడ్ విత్తనములు	70 లక్షల క్వింటాలు
2) రసాయనిక ఎరువులు	183 మిలియన్ టన్నులు
3) క్రిమి సంహారక మందులు	84 వేల టన్నులు
4) అధిక దిగుబడి వంగడముల క్రింద భూమి	78 మిలియన్ హెక్టారులు.

చిన్న నీటిపారుదల వసతులు పెంచుటకు, వీటి నిర్వహణను సమర్థవంతం చేయుటకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వ్యవసాయ పరపతిని పెంచుటకు చర్యలు చేపట్టబడతాయి.

వ్యవసాయ రంగంముపై పెట్టుబడి :- ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగంముపై మొత్తం పెట్టుబడి రూ॥93,680 కోట్లు, ఇది ప్రణాళికా మొత్తం పెట్టుబడిలో 22%, వ్యవసాయ రంగముపై పెట్టుబడులు దిగువ విధముగా ఉన్నవి.

1) వ్యవసాయము మరియు సంబంధిత కార్యకలాపములు	రూ॥32,020 కోట్లు	7.7. శాతము
2) గ్రామీణాభివృద్ధి మరియు ప్రత్యేక వీరియా పథకములు	రూ॥37,890 కోట్లు	8.7 శాతము
3) నీటిపారుదల మరియు వరదరల నియంత్రణ	రూ॥ 23,770 కోట్లు	5.5 శాతము
మొత్తం పెట్టుబడులు	రూ॥93,680 కోట్లు	21.9 శాతం

వ్యవసాయాభివృద్ధి రేటు :- ఈ రేటును ఈ ప్రణాళికలో సాలుసరి 2.1%గా నిర్ణయించబడినది.

వ్యవసాయ ఉత్పత్తుల లక్ష్యములు :- ఎనిమిదవ ప్రణాళికలో వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు నిర్దేశించిన లక్ష్యములు ఈ క్రింది విధముగా ఉన్నవి.

వస్తువు	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవ లక్ష్యము
1) ఆహార వస్తువులు (మిలియన్ టన్నులు)	210	199
2) నూనె గింజలు (మిలియన్ టన్నులు)	23.0	25
3) చెరుకు (మిలియన్‌టన్నుల	275	277
4) వత్తి (మిలియన్ బేళ్ళు)	14	14.3
5) జనుము మరియు మెస్తా (మిలియన్ బేళ్ళు)	9.5	11.0

ఎనిమిదవ ప్రణాళికలో వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు నిర్దేశించిన లక్ష్యములు కొంత అధికముగా ఉన్నవి. ఈ లక్ష్యములు సాధించుటకు తీవ్రమైన కృషి అవసరము. ఈ ప్రణాళిక వ్యవసాయ వ్యూహము మౌలికముగా సముచితమైనదిగా ఉన్నది. అయితే ఉత్పత్తి లక్ష్యములు సాధించుటకు వర్షపాతము, శీతోష్ణ పరిస్థితులు అనుకూలముగా ఉండవలెను. ఈ ప్రణాళికలో ఇంచుమించు ఏడవ ప్రణాళికలో అనుసరించిన వ్యవసాయ వ్యూహమే కొనసాగించబడినది.

ఈ ప్రణాళికా కాలంలో అదృష్టవశాత్తు వాతావరణ పరిస్థితులు అనుకూలించడం వల్ల నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోగలిగారు. ప్రణాళిక చివరి సం॥లో (1996-97) నూనె గింజలు, చెరుకు, కాటన్ (పత్తి), జనుము మొదలైన పంటలు నిర్దేశించిన లక్ష్యం కంటె ఎక్కువ ఉత్పత్తి జరిగింది. అయితే ఆహారధాన్యాల లక్ష్యం 210 మి.ట. కాగా 199 మి.ట. ఉత్పత్తి జరిగినా, ఇంతవరకు సాధించిన దిగుబడులతో పోల్చితే ఇది ఎక్కువే.

9 వ ప్రణాళికలో వ్యవసాయ ప్రగతి :-

9 వ ప్రణాళిక యందు వ్యవసాయ రంగానికి సుమారుగా మొత్తం ప్రణాళికా వ్యయం రూ॥859,200 కోట్లరూపాయలలో రూ.170 - 230 కోట్ల రూపాయిలను కేటాయించారు. మొత్తం ప్రణాళికా వ్యయంలో ఈ మొత్తం 20 శాతం. ఈ ప్రణాళికలో వ్యవసాయరంగం యొక్క నిర్దేశించిన లక్షము, వాస్తవంగా చేరిన లక్షము క్రింది విధంగా ఉంది.

వ.నెం.	వస్తువు	నిర్దేశించిన లక్ష్యము	వాస్తవ లక్ష్యం
1.	ఆహార వస్తువులు (మి.ట)	234	211
2.	నూనె 1గింజలు (మి.ట)	30.0	20.7
3.	చెరుకు (మి.ట)	336	300
4.	పత్తి (మి.బేళ్ళు)	15.7	10.1
5.	జనము & మెస్తా (మి.బె)	-	11.6

ఈ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేక పోయినప్పటికీ ఉత్పత్తిలో ప్రగతి లేదని చెప్పలేము. ఆహార వస్తువుల ఉత్పత్తి లక్ష్యం 234 మి.ట.. నిర్ధారించగా 211 మి.ట. చేరుకున్నాము. కొద్దిపాటి తేడాలతో ఆయా ఉత్పత్తులు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి.

10వ ప్రణాళికలో వ్యవసాయరంగానికి సుమారుగా 20% (మొత్తం వ్యయంలో) వనరులను కేటాయించారు. వ్యవసాయం గ్రామీణాభివృద్ధి; నీటిపారుదలకు 9వ ప్రణాళికలో కేటాయింపులు 21.4 శాతం. నీటిపారుదలకు కేటాయింపులు 7.4 నుండి 6.8 శాతానికి తగ్గాయి. గ్రామీణాభివృద్ధికి 8.0 శాతం నుండి 9.5 శాతానికి పెంచారు. అంతమాత్రాన ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగాన్ని విస్మరించినట్లు కాదు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచుటకు చర్యలు తీసుకుంటున్నారు.

12.9. ముగింపు : స్వతంత్రానికి ముందు స్వేచ్ఛా ఆర్థిక విధానాలు Lessizfail కు అలవాటుపడిన ఆర్థిక వ్యవస్థ మరియు పరాయి పాలనలో చిన్నాభిన్నమయిన దేశ ఆర్థిక పరిస్థితుల నుండి సామ్యవాద భావనతో పురోగామి దిశకు పయనింపజేయుటలో ప్రణాళికల పాత్ర ఎంతో ఉందని చెప్పవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశం కావడం, దేశ విభజన, అంతర్జాతీయ ప్రభావాలు దేశీయంగా ఆర్థిక వ్యవస్థను కొంతవరకు తిరోగామి విధానాన్ని చూపినాయి. అందువల్ల దేశాభివృద్ధికి ప్రణాళికలు రూపకల్పన చేసారు. అయితే వాటికి అవసరమయిన వనరుల సేకరణలో సమస్యలు ఎక్కువగానే ఉన్నాయి. దేశీయంగా ఉన్న వనరులను సక్రమంగా వినియోగించుకొను యంత్రాంగం అవసరమయినందున ప్రణాళికల రూపకల్పన జరిగింది. ఈ యంత్రాంగానికి వనరుల లేమివల్ల ఇతరదేశాల సహాయంపై ఆధారపడుట తప్పడంలేదు. ఏవిధంగా వనరులు సేకరించినా వాటిని సక్రమమయిన విధంగా వినియోగించుకోవలసి ఉంటుంది. అందువల్ల వనరుల పంపిణి విధానాలు ఎలా ఉన్నావో పరిశీలించవలసి ఉంటుంది. మన ప్రణాళికలలో వ్యయ విధానాన్ని గమనించినట్లయితే

8వ ప్రణాళిక నుండి మానవీయ కోణంలో మానవ వనరుల అభివృద్ధికి ఎక్కువ శ్రద్ధ చూపడంతో పాటు మరోవైపు ప్రయివేటు రంగం పాత్ర క్రమేపీ పెరుగుచున్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద ప్రణాళికా యంత్రాంగం ఆర్థికాభివృద్ధిలో ప్రముఖమయిన పాత్రను కలిగి ఉంది. ఈ నేపద్యంలో మన ప్రణాళికలు, వాటికి అవసరమయిన వనరుల సేకరణ మరియు పంపిణి, కేటాయింపుల తీరుతెన్నులను తెలుసుకొనుట ఎంతో అవసరం ఈ పాఠ్య భాగం అందులకు బాగా ఉపకరిస్తుంది.

12.10. ముఖ్యపదాలు :

- ప్రణాళిక : భవిష్యత్‌లో కొనసాగించు విధానాలను ముందుగా రూపకల్పన చేయుప్రక్రియ.

పంపిణి : వనరులను ఆయారంగాల కొరకు కేటాయించు విధానం

ఆర్థిక ప్రణాళిక ఆర్థిక పరమయిన అంశాలుగల విధానాల రూపకల్పన ప్రక్రియ

అంతర్గతవనరులు దేశీయంగా సమకూర్చుకొను వనరులు

- వార్షిక ప్రణాళికలు ప్రతి 5 సం॥లకు సంబంధించినది పంచవర్ష ప్రణాళిక కాగా ప్రతి సం॥మునకు సంబంధించినవి వార్షిక ప్రణాళికలు.

- లోటు బడ్జెటు : బడ్జెటు అంచనాలలో రాబడులకన్నా వ్యయం ఎక్కువగా ఉండుట

- కాపిటల్ ఇన్‌ఫ్లోస్ : ఇతర దేశాల నుండి దేశంలోకి ప్రవహించే (వచ్చే) మూలధనం

12.11. స్వయం మదింపు ప్రశ్నలు

1. ప్రణాళికలకు అవసరమయిన వనరుల సమీకరణ విధానం వివరించుము
2. మన పంచవర్ష ప్రణాళికలలో వనరులు ఏఏ రంగాల నుండి సమకూరుచున్నవో తెల్పండి.
3. వనరుల సమీకరణ ద్వారా ప్రణాళికలలో వివిధ రంగాలకు కేటాయింపుల తీరును వ్రాయండి.

12.12. చదవ వలసిన పుస్తకాలు :

1. Ruddar Datt, K.P.M.Sundaram : Indian Economy
2. Planning Commission Approach : Papers of various five year plans
3. Misra & Puri : Indian Economy
4. Brahmananda. P.R. : 50 Years of free Indian Economy

- ఆచార్య మోపిదేవి సుందరరావు

పాఠం - 13

పన్ను విధానం మరియు భారతదేశ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం (Taxation and its Impact on Indian Economy)

13.0 లక్ష్యం :

ఈ పాఠ్యభాగాన్ని చదివిన తరువాత మీరు ఈ క్రింది అంశాలను గురించి తెలుసుకుంటారు.

* భారతదేశ పన్ను విధానం
* ప్రభుత్వం యొక్క విధాన నిర్ణయాలు - విచారణ సంఘాల ఏర్పాటు
* భారతదేశ ఆర్థికవ్యవస్థపై పన్నువిధాన ప్రభావం
* కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో పన్నువిధాన నిర్ణయాలు - ఆర్థికవ్యవస్థపై వాటి ప్రభావం.

పాఠ్య నిర్మాణక్రమం :

13.1 ఉపోద్ఘాతం

13.2 భారతదేశ పన్నువిధానం

13.2.1 పన్నువిధాన లక్ష్యాలు

13.2.2 భారతదేశంలో పన్నుల పంపిణి విధానం - రాష్ట్రాల పన్నులు - కేంద్ర ప్రభుత్వ పన్నులు

13.2.3 ప్రత్యక్ష, పరోక్ష పన్నుల తీరు తెన్నులు

13.3 ప్రభుత్వం యొక్క పన్నువిధాన నిర్ణయాలు - విచారణ సంఘాల ఏర్పాటు

13.3.1 పన్ను విధాన విచారణ సంఘం

13.3.2 భారతదేశ పన్ను విధాన సవరణలో - నికోలస్ కాల్డర్, 1956

13.3.3 భూతలింగం కమిటి పన్ను సవరణలు (1967)

13.3.4 ప్రత్యక్ష పన్నుల విచారణ కమిటి - వాంఛూ కమిటి, 1970

13.3.5 వ్యవసాయాదాయ, సంపదలపై పన్ను విధింపు - కె.ఎన్. రాజ్ కమిటి - 1972

13.3.6 పరోక్షపన్నుల విచారణ కమిటి - యల్.కె. ఝూ, 1976

13.3.7 చోక్సే కమిటి రిపోర్ట్, 1977

13.3.8 పన్ను నిర్మాణత పై సవరణలు - రాజా చెల్లయ్య కమిటి రిపోర్ట్, 1991

13.4 భారతదేశ ఆర్థికవ్యవస్థపై పన్నువిధాన ప్రభావం

13.4.1 ఉత్పత్తి ప్రక్రియపై మరియు ఆర్థిక వృద్ధిపై పన్ను ప్రభావం

13.4.1.1 పంపిణి ప్రభావం, వేర్వేరు పన్నులు

13.4.1.2 ప్రత్యక్ష పన్నుల పంపిణి ప్రభావం - బహుమతి పన్ను - ఎస్టేట్ సుంకం - వ్యయ పన్ను

13.4.2 వనరుల సమీకరణపై పన్ను ప్రభావం

13.4.2.1 శ్రామిక సమీకరణపై పన్ను ప్రభావం

13.4.3 ఆదాయపంపిణిపై పన్ను ప్రభావం

13.4.4 ఇతర ప్రభావాలు

13.5 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పన్నువిధాన నిర్ణయాలు - ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం
కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ 2002-03; 2003-04; 2004-05 (BE)

13.6 సారాంశము

13.7 ముఖ్యపదాలు

13.8 నమూనా ప్రశ్నలు

13.9 చదువదగిన గ్రంథాలు

13.1 ఉపోద్ఘాతం :

భారతదేశ ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి అవసరమయ్యే విత్తవనరుల సేకరణలో ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులు ఒక ముఖ్యమైన పాత్రని పోషిస్తున్నాయి. అంటే పన్నువిధానం ఒక కోశసాధనం. వనరుల సమీకరణతోపాటుగా ఆర్థిక అసమానతలను తగ్గించి ఆర్థికవృద్ధి మరియు సమానత (equity) మధ్యన న్యాయబద్ధ సంబంధాన్ని ఈ పన్ను విధానం ప్రోత్సహిస్తుంది. భారతదేశం ప్రణాళిక శకం ఆరంభమైన నాటినుండి పరోక్ష పన్నులపై అధికంగా ఆధారపడుతోంది. ప్రత్యక్ష పన్నులు ఎంత పురోగామిగా విధించిననూ ఆశించిన లక్ష్యసాధన కడుదూరంగా మిగిలిపోయింది. దీనివలన భారతదేశ పన్నువిధానం తిరోగామి పన్ను విధానంగా మారిపోయింది. దీనితో పాటుగా ప్రత్యక్షపన్నులు చెల్లించే వారి సంఖ్య చాలా తక్కువ (జనాభాలో 1 శాతం). దీంతో స్థూల దేశీయోత్పత్తిలో ప్రత్యక్ష పన్నుల శాతం 1999-2000 లో 1.5 శాతం మాత్రమే. అగ్నికి ఆజ్యం పోసినట్లుగా, పన్ను ఎగవేత సమస్య చాలా జటిలంగా తయారైంది. పశ్చిమ దేశాల్లో మొత్తం స్థూలదేశియోత్పత్తిలో 40 శాతం వరకు పన్నులనుండి ఆదాయం వస్తోంది. భారతదేశం దీనిలో సగం కూడా రావడం లేదు. అయితే మనది అభివృద్ధి చెందుతున్న దేశం (తలసరి ఆదాయం $ 500). కావున పన్నురాబడి తక్కువ అని అనుకోవచ్చు. ఇంకా చెప్పాలంటే పన్నుయంత్రాంగం కూడా పన్నుఆమలును కాని పన్నువసూళ్ళని కాని సరిగా చేయలేకపోతుంది. వీటన్నింటివల్ల భారతదేశ పన్నువిధానం పన్ను భారంలో అసమానతలు చోటుచేసుకుని ధనిక, పేద వర్గాలపై చెడు ప్రభావాన్ని చూపుతోంది.

ఈ పాఠ్యాంశం యొక్క ముఖ్య ఉద్దేశ్యం పన్ను విధానం వలన దేశ ఆర్థికవ్యవస్థపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందో చర్చించడం. ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులను ఈ సందర్భంగా వివరించడం జరిగింది. అంతేకాకుండా బడ్జెట్‌లో ప్రతిపాదించిన పన్నువిధానం వలన ఎటువంటి ప్రభావం దేశంపై పడింది అన్నది కూడా విపులీకరించడం జరిగింది. ఈ పాఠ్యాంశాన్ని రెండు భాగాలుగా విభజించి, మొదటి భాగంలో భారతదేశ పన్నువిధానం మరియు తీరు తెన్నులు గురించి వివరించి, రెండవ భాగంలో పన్ను ప్రభావం ఏయే పన్నులలో ఎట్లా వుంటుందో చర్చించడం జరిగింది.

13.2 భారతదేశ పన్ను విధానం :

భారతదేశ ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి అవసరమయ్యే వనరుల సమీకరణలో పన్నుల విధానం (Taxation) ఒక ప్రధాన భూమికను పోషిస్తుంది. పన్నుల ద్వారా లభించే ఆదాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంతో ముఖ్యమైన ఆదాయం. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వనరులను సమకూర్చుకునే మార్గాలలో (Sources) పన్నువిధానం ఒకటి. ఇది ఒక కీలకమైన స్థూల ఆర్థిక విధాన సాధనమని చెప్పవచ్చు. దీని ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించడమే కాకుండా ఆదాయ మరియు సంపదపరమైన వ్యత్యాసాలను

తగ్గించడానికి కూడా వీలవుతుంది. ఈ పన్ను విధానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వానికి ఏ విధమైన వడ్డీ చెల్లింపుల భారం వుండదు. కాకపోతే పన్ను వసూళ్ళ ఖర్చు మాత్రం వుంటుంది. అంతేకాకుండ ప్రభుత్వం ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల ద్వారా ప్రజల్లో పొదుపు చేసే అలవాటును తద్వారా దేశం పొదుపు ద్వారా వచ్చే ద్రవ్యాన్ని గరిష్ఠం చేసుకోవీలున్నది. యింకా చెప్పాలంటే, దేశంలో పెట్టుబడి (Investment) ని ప్రజోపకర ప్రాజెక్టుల వైపు మళ్ళించవచ్చు. ఆ విధంగా వక్రమార్గాలలో అందునా సామాజికంగా పెట్టుబడి దారితప్పకుండ ఈ పన్నువిధానం ద్వారా చూడవచ్చు. అందుచేత పన్నువిధానం ప్రైవేటు వినియోగాన్ని మరియు ప్రైవేటు పెట్టుబడిని తగ్గించడానికి మరియు అట్లా తగ్గించడం ద్వారా తగినన్ని వనరులను ప్రభుత్వం ఆర్థికాభివృద్ధికి సమీకరించుకోడానికి ఉపకరించే సమర్థవంతమైన విత్తసాధనం. ప్రైవేటు వినియోగం తగ్గించడం అంటే ప్రజల్లో పొదుపుని పన్నువిధానం ద్వారా ప్రోత్సహించినట్లే తద్వారా ఆర్థికాభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని గున్నార్ మిర్డాల్ వివరించాడు (Gunnar Myrdal, p.82). ముఖ్యంగా అల్పాభివృద్ధి దేశాలలో పొదుపు ఆవశ్యకత ఎంతైనా వుందని నొక్కి చెప్పవలసిన పనిలేదు. కాబట్టి పన్ను విధానం నిర్బంధ పొదుపు విధానానికి అత్యావశ్యకము. జాతీయాదాయంలో ప్రభుత్వ వాటా పెరుగుతుంది. ఎలాంటప్పుడు ఈ వాటా పెరుగుతుందంటే జాతీయాదాయ పెరుగుదల రేటుకంటే ఉపాంత పన్నురేటు (Marginal rate of Taxation) అధికంగా ఉన్నప్పుడు (A.Lewis, p.40). ద్రవ్యోల్బణ పరిస్థితులలో పన్నురేటు అధికంగా పెరగడం అవసరం. పన్నురేటు పెరిగితే ప్రజలవద్ద వాడుక (Circulation) లో వున్న ద్రవ్యం తగ్గిపోయి వస్తు గిరాకి పడిపోతుంది. దాంతో ద్రవ్యోల్బణ పరిస్థితులను నియంత్రించవచ్చు. అంతేకాకుండా, పన్ను విధానం ద్వారా వనరులయొక్క అభిలషణీయ పంపిణి జరిగే అవకాశముంది. వనరులను దేశంయొక్క ఉత్పాదకశక్తి (productive capacity) పెంచే మార్గాలవైపు ప్రభుత్వం చేత మళ్ళించబడుతుంది. అంటే పెట్టుబడి సాంఘిక లాభాన్ని చేకూర్చే విధంగా వుంటుంది. తద్వారా ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుంది (R.N. Tripathy, p.148).

13.2.1 పన్ను విధాన లక్ష్యాలు :

పన్నువిధానం ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకోవడమే కాకుండా ప్రజోపకర పనులెన్నింటినో చేపడుతుంది. ఏ పని చేసినప్పటికి ప్రభుత్వం ముఖ్యంగా భారతదేశం లాంటి అల్పాభివృద్ధిదేశం ఆర్థికాభివృద్ధిని వేగవంతం చెయ్యాలనే లక్ష్యం వుంటుంది. అంతేకాకుండా ఆర్థిక అసమానతలు మరియు ప్రాంతీయ అసమానతలు, నిత్యావసర వస్తువుల అధికో, త్తి మొదలైన లక్ష్యాలను గలిగివుంటుంది ప్రభుత్వం. కాబట్టి పన్ను విధానాన్ని ప్రభుత్వం పరిపాలనా సంబంధ పనులను నిర్వర్తించడానికి మరియు ప్రజల యొక్క ఆర్థిక మరియు సాంఘిక శ్రేయస్సుని పెంపొందించటానికి ఉపయోగిస్తుంది. భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను విధాన లక్ష్యాలు ఈ క్రింది విధంగా వుంటాయి.

i) వినియోగాన్ని తగ్గించి, పొదుపు పెట్టుబడులను ప్రోత్సహించడం,

ii) ప్రభుత్వం దగ్గర వనరులను అధికం చేయడం,

iii) వనరుల పంపిణీని మెరుగుపరచడం

iv) ఆర్థిక అసమానతలను తగ్గించడం

v) ఆర్థిక మిగులును సమీకరించి జాతీయాదాయాన్ని మరియు జాతీయోత్పత్తిని పెంచడం

vi) ఆర్థిక స్థిరీకరణను పెంపొందింపచేసి, ద్రవ్యోల్బణ పరిస్థితులను నియంత్రించడం, మరియు

vii) ప్రైవేటు రంగాభివృద్ధికి తగిన ప్రోత్సాహకాలు కల్పించడం :

భారతదేశంలో 1951 లో ప్రణాళికాబద్ధ ఆర్థికప్రగతికి శ్రీకారం చుట్టడం జరిగింది. ప్రణాళికలలో నిర్ణయించిన లక్ష్యాల కనుగుణంగా పన్ను విధాన లక్ష్యాలు నిర్ణయించడం జరిగింది. మనదేశ పన్నుల విధాన లక్ష్యాలు స్థూలంగా అభివృద్ధి (Growth), సమానత (Equity), మరియు స్థిరీకరణ (Stabilisation) గా వున్నాయి. ఈ లక్ష్యాల సాధనకోసం పన్నుల వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేర్పులు చేయడం జరిగింది.

భారతదేశం అనేక ఆర్థికవృద్ధి పరమైన సమస్యలలో సతమతమవుతుండడమే కాకుండా పేదరికం మరియు అసమానతల నిర్మూలనకి సంబంధించిన సమస్యలతో కూడ సమస్యలనెదుర్కొంటుంది. వీటితోపాటుగా పాతుకుపోయిన నిరుద్యోగిత (Chronic Unemployment) మరియు ప్రాంతీయాభివృద్ధిలో వ్యత్యాసాలు (Regional Disparities) అదనంగా వున్న సమస్యలు. ఈ సమస్యల వలన భారత ప్రభుత్వం పన్నువిధానం పరంగా కొన్ని లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంది. భారతదేశం అభివృద్ధి చెందాలంటే ముందుగా పేదరిక విషవలయం (Vicious Circle of Poverty) నుండి బయటపడాలి. అంతేకాకుండ ప్రభుత్వం మరియు పబ్లిక్ రంగం ఈ విషయంలో ప్రధాన భూమికను వహించవలసి వుంటుంది. భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో వృద్ధిపరమైన సమస్య ఏమిటంటే పొదుపు తగినంతగా లేకపోవడంచేత దేశంలో మూలధన సంచయం (Capital Accumulation) కావలసిన రీతిలో లేకపోవడం. అంతేకాకుండా ప్రత్యేక వస్తూత్పత్తి ద్వారా డిమాండ్ మరియు సప్లైల మధ్యనవున్న తేడాని పూరించవలసిన అవసరం వుంది. అవస్థాపన సౌకర్యాల కల్పనతోపాటు కీలక పరిశ్రమల స్థాపన ద్వారా దేశాన్ని పారిశ్రామీకీకరణ దిశగా నడపవలసివుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికై ఆ ప్రాంతాలలో వ్యవసాయ మరియు పారిశ్రామికాభివృద్ధి చేపట్టవలసివుంది. వీటితోపాటుగా దిగుమతులను నియంత్రించి ఎగుమతులను ప్రోత్సహించవలసి వుంది. ఇవన్ని కూడా అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఎదురయ్యే ముఖ్యమైన సమస్యలు.

ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం సరిపడే పన్ను విధానాన్ని అమలు జరపవలసి వుంటుంది. ఈ పన్ను విధానం ద్వారా అనవసర మరియు అనుత్పాదక ప్రైవేటు వినియోగాన్ని నిషేధించి ప్రభుత్వానికి అధిక ఆదాయం వచ్చేలాగున ప్రయత్నం చేయాలి. ఈ విధమైన లక్ష్యసాధనకై పన్నువిధానానికి వ్యాకోచత్వం (Elasticity) మరియు బాయన్సీ (Buoyancy) అనే లక్షణాలుండాలి. బాయన్సీ అంటే పన్నుద్వారా అధికాదాయం ప్రభుత్వానికి చేరడం. అంతేకాకుండా పన్నుయొక్క పరిధి (Tax Net) ఎక్కువగా వుండాలి. అంటే పన్నుల పరిధిలోకి ఎక్కువమంది పన్ను కట్టేవారిని తీసుకురావలసి వుంటుంది. ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులను రెండింటిని దృష్టిలో వుంచుకుని చేయవలసి వుంటుంది. భారతదేశంలో పరోక్ష పన్నులే అధికశాతం ఆదాయాన్ని ప్రభుత్వానికి చేకూర్చిపెడుతోంది. అయినప్పటికీ పన్నువిధానం ద్వారా లక్ష్యసాధనకి ఇది అడ్డుకాదు. ఎలాగంటే, పరోక్షపన్నులు, ద్రవ్యోల్బణ ప్రోత్సాహకాలుగా వుంటాయనేది లోకవిదితం. అందుచేత, ముడిసరుకులు మరియు మధ్యతరగతి (Intermediate) వస్తువులుపై పన్ను మినహాయింపు లేదా తక్కువరేటులో పన్ను విధించడం జరుగుతుంది. అలాగే విలాస వస్తువులపై అధిక పన్నులు, నిత్యావసర వస్తువులపై అల్ప పన్నులు విధించడం ద్వారా సాంఘిక న్యాయం అందించబడుతుంది. ప్రత్యక్ష పన్నుల ద్వారా అధికాదాయ వర్గాలపై పురోగామి పన్నువిధానం మరియు అల్పాదాయ వర్గాలపై పన్ను మినహాయింపుల ద్వారా ప్రభుత్వం లక్ష్యసాధనగావిస్తుంది.

సమానత (Equity) మరియు వనరుల సమీకరణ విషయాల పరంగాకూడా పన్ను విధాన లక్ష్యాలుంటాయి. పన్నుభారం (Tax burden) ఆర్థిక రంగాల పరంగాను మరియు వ్యక్తుల పరంగాను సమానంగా పంపిణి అయ్యేలాగున వుండవలసివుంది. ఉదా॥కి వ్యవసాయ రంగంలో చాలా అల్పంగా పన్ను విధింపు వుంటుంది. అయితే వ్యవసాయేతర రంగంలో పన్ను అధికంగా వుంటుంది. స్థూలదేశీయోత్పత్తిలో 1/4 వ వంతుకన్నా కొద్దిగా ఎక్కువగా వ్యవసాయరంగం నుండి వస్తోంది. అయితే దాని నుండి పన్ను ఆదాయం యొక్కశాతం అంతంత మాత్రమే. గ్రామీణ ప్రాంతాలలో ధనికులు ఈ రకంగా పన్ననుండి తప్పించుకుంటున్నారు. ఈ పరిస్థితి సమానత్వానికి విరుద్ధం వ్యక్తుల మధ్యకూడ పన్నువిధానం పురోగామి (Progressive) గా వుండాలి. అయితే పన్నుఎగవేత (Tax Evasion) వల్ల పన్నువిధానం తిరోగామి (Regressive) గా తయారైంది. మనదేశంలో. అందుచేత, నిజాయితీగా పన్ను చెల్లించే వ్యక్తులకి భారంగాను, పన్నుఎగవేసే వ్యక్తులకు అనుకూలంగాను మారిపోయింది. అందుచేత ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష పన్నుల ప్రభావాన్ని ముఖ్యంగా చివరిస్థాయి (Margin) లో కనిష్టం చేసినట్లైతే పన్ను విధానంలో సమానత (Equity) సాధించినట్లవుతుంది. అలాకాకుండా అధిక పన్ను రేట్లు విధించినట్లైతే పని (work) పట్ల అనాసక్తత పెరిగి ఆదాయ మరియు పొదుపులు తగ్గిపోయి ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. దీంతోపాటుగా పన్నుఎగవేత విస్తృతమవుతుంది. నల్లధన రాజ్యస్థాపన జరిగే ప్రమాదం పొంచి వుంటుంది.

పన్నువిధానం ద్వారా కుటుంబాల (Households) యొక్క మరియు కంపెనీల (Corporate Sector) యొక్క పొదుపు మరియు పెట్టుబడులకి సంబంధించిన నిర్ణయాలు ప్రభావితం అవుతాయని అందరు నమ్ముతారు. ఆ కారణంచేత, ఎక్కువమంది విద్వాంసులు జాతీయాభివృద్ధి లక్ష్యాలకనుగుణంగా పన్ను విధాన లక్ష్యాలను రూపొందించి తద్వారా పొదుపు, పెట్టుబడుల నిర్ణయాలను ప్రభావితం చేయ్యాలని సూచిస్తూ వుంటారు. ఈ కారణం చేతనే పన్ను విధింపులో అనేక మినహాయింపులు (Exemptions), రాయితీలో (Rebates), విచక్షణా సహిత పన్నురేట్లు మొదలైన వాటిద్వారా విధాన నిర్ణేతల ఆర్థిక ప్రక్రియలను ప్రత్యేకమార్గాల దిశగా ప్రభావితం చేయడం జరుగుతోంది. ఈ లక్ష్యాలలో ఉపాధికల్పన (Employment Generation), ప్రాంతీయ అసమానతల తొలగింపు (Removal of Regional Disparities), ఎగుమతుల ప్రోత్సాహం, దిగుమతుల స్థానే దేశీయ పరిశ్రమల స్థాపన, మొదలైనవి వుంటాయి. పన్నువిధానం ద్వారా పెట్టుబడులపై సాపేక్షలాభం (Relative Profitability) దెబ్బతినకుండ జాగ్రత్త పడతారు. లేనట్లైతే వినియోగం మరియు ఉత్పత్తులు దెబ్బతినే ప్రమాదముంది.

పైన ఉదహరించిన లక్ష్యాలకనుగుణంగా పన్ను విధానాన్ని రూపొందించడం చాలా కష్టం. ప్రతి పన్ను విధానానికి అనేక రకాలుగా బహుళ ప్రభావాన్ని (Multiple effects) చూపుతాయి. ఈ ప్రభావాలను ముందుగానే లెక్కవేయడం తలకి మించిన పని. ఒక పన్నుని ఒక ప్రయోజనార్థం విధిస్తే ఆ ప్రయోజనంతోపాటు ఎన్నో ఇతర విషమ సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. ప్రజలకి పన్నువిధానం ద్వారా ఉపకారం అటుంచి అపకారం జరిగే పరిస్థితి ఎదురవుతుంది. అందుచేత పన్ను విధానాన్ని చెడు మంచి ప్రభావాలను దృష్టిలో వుంచుకుని ఒక మంచి పన్ను విధానాన్ని (Ideal Taxation) రూపొందించడం చిన్న విషయం కాదు. ఒక పన్ను విధానం ద్వారా అనుకోని చెడు ఫలితాలు ఎదురైతే వాటిని నివారించడానికి అదనపు పన్నుల విధింపు చేపడితే దానివలన పన్ను విధానం సులభతరం (Simplicity) అనే లక్షణాన్ని కోల్పోయి, పన్ను ఎగవేతకి దారితీస్తుంది.

అంతేకాకుండా, ఒక అభివృద్ధి చెందుతున్న దేశం పన్ను విధానాన్ని రూపొందించేటప్పుడు తన పరిపాలనా యంత్రాంగం యొక్క పరిమితులను దృష్టిలో వుంచుకోవలసి వుంది. ఉదా॥కి విలువ ఆధారిత పన్ను (Value Added Tax, VAT) పరోక్ష పన్నులలో అత్యుత్తమమైనది. దీని అమలు విషయంలో భారతదేశం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. పశ్చిమదేశాలలో ఈ VAT ను అమలు చేయడం జరుగుతోంది. అలాగే భారతదేశంలో, వ్యయాధారిత పన్ను (Expenditure Tax) విధించడానికి యంత్రాంగ సామర్థ్యం సరిపోలేదు. అయితే ఈ పన్ను ఆదాయపన్ను (Income Tax) కన్నా శక్తివంతమైందని విజ్ఞుల అభిప్రాయం. అందుచేత పరిపాలనా యంత్రాంగం యొక్క సమర్థత మీద ఆధారపడి పన్ను విధానముండాలి.

భారతదేశంలాంటి అల్పాభివృద్ధి దేశంలో అభిలషణీయమైన పన్ను విధానాన్ని (Optimum Tax Structure) ప్రవేశపెట్టడం అంత తేలికైన పనిగాదు. ముందుపేజీల్లో చెప్పుకున్నట్లుగా నిర్ణయించిన విధానాలకి మరియు వాటాని అమలు చేయడానికి సరిపడే శక్తియుక్తుల మధ్యన పొంతన లోపం అల్పాభివృద్ధి దేశాలలో కనబడుతుంది. వీటితోపాటుగా గణాంక వివరాల కొరత, ప్రజలయొక్క విద్యాస్థాయి, సాంస్కృతిక పోకడలు, మొదలైనవాటి కారణంగా ఒక మంచి పన్ను విధానాన్ని (Ideal Tax System) ఎన్నుకోవడం అభివృద్ధి చెందుతున్న దేశాలలో వున్న ప్రధాన సమస్య, వీటితోపాటుగా, భారతదేశం ఒక ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ (Dual economy) కి మంచి ఉదాహరణ. ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ అంటే పారిశ్రామిక రంగంలో అధునాతన సాంకేతిక పద్ధతులు అవలంభించుట, వ్యవసాయరంగంలో పురాతన ఉత్పత్తి పద్ధతులనవలంభించుట జరుగుతుంది. యిటువంటి వ్యవస్థలో సమర్థవంతమైన (efficient) మరియు అభిలషణీయమైన (optimum) పన్ను విధానాన్ని రూపొందించటంలో సమస్యలు ఉత్పన్నమవుతాయి.

భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వం వనరుల సమీకరణ నిమిత్తమై ఎక్కువగా పరోక్షపన్నులపై ఆధారపడడం కద్దు. ప్రత్యక్ష పన్నుల యొక్క బేస్ (Tax Base) చాలా సంకుచితమైనది (Narrow). అందుచేత, విత్త సమీకరణకు మరియు విత్త అవసరాలకు ప్రత్యక్ష పన్నులు ఖజానాకు సరిపడినంతగా వనరులను సమీకరించలేవు. అమెరికా, కెనడా, బెల్జియమ్, ఆస్ట్రేలియా, మరియు నార్వేలలో మాత్రం పరోక్ష పన్నుల కంటే ప్రత్యక్ష పన్నుల ద్వారానే ప్రభుత్వాలకి ఆదాయం

ఎక్కువగా వస్తోంది. అమెరికాలో పరోక్ష పన్నుల ద్వారా వచ్చే పన్ను ఆదాయం ప్రత్యక్ష పన్నుల ఆదాయంలో 1/13 వ వంతు మాత్రమే. కెనడాలో అయితే 1/2 వంతుగాను, బెల్జియంలో 2/3 వ వంతుగాను, ఆస్ట్రేలియాలో 3/2 వ వంతుగాను మరియు నార్వేలో 7/2 వ వంతుగాను వుంది.

R.N. Tripathy మాటల్లో చెప్పాలంటే, "అభివృద్ధి చెందుతున్న దేశాలలో దీర్ఘకాలిక పన్ను లక్ష్యం సమర్థవంతమైన పురోగామి ఆదాయ మరియు సంపద పన్నుల విధానాన్ని అభివృద్ధి పరచడం. ఆ దేశాలలో ఈ రెండు పన్నులు వారి విత్త ఆయుధశాలలో ప్రధానమైన అస్త్రాలు అయినప్పటికి, పరోక్ష పన్నులపై విత్తాభివృద్ధి సాధనాలుగా (Development Finance) అత్యధికంగా ఆధారపడడం అనేది తప్పించుకోలేనటువంటిది" అని వ్యాఖ్యానించాడు. (R.N. Tripathy, p.151). పరోక్షపన్నులపై అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎక్కువగా ఆధారపడుతున్నాయన్నది ఇక్కడ యదార్థం. దీనికి కారణం తలసరి ఆదాయాలు అత్యంత అల్పంగా వున్న తరుణంలో ఆదాయపు పన్నుద్వారా ఆదాయం ఎట్లావస్తుంది. ఎక్కువమంది ఆదాయవర్గాలు మినహాయింపు పరిమితి (Exemption Limit) క్రిందకే వచ్చేస్తారు. ఈ పరిమితి ఒకవేళ యింకా తగ్గిస్తే పన్ను వసూళ్ళకయ్యే ఖర్చు ఎక్కువగాను, పన్ను ఆదాయం తక్కువగాను వస్తుంది. యింకో మార్గంగా, పన్నురేట్లు పెంచినట్లైన ఆర్థిక ప్రక్రియపరంగా ప్రోత్సాహకాలు (Incentives) తగ్గిపోతాయి. భారతదేశంలో స్థూల దేశీయోత్పత్తిలో ప్రత్యక్ష పన్నులశాతం 2004 - 05 లో 1.8 శాతం మాత్రమే. 1999 - 2000 లో 1.5% అంటే భారతదేశం పరోక్ష పన్నుల మీదనే ఎక్కువగా ఆధారపడుతోంది. అందుచేత వస్తువులపై పన్ను విధింపు విధానం (Commodity Taxation) అమలు చేసినట్లయితే ప్రజల పరంగా ప్రోత్సాహకాలు (Incentives) దెబ్బతినవు. అంతేకాకుండా పరోక్షపన్ను విధానం వనరుల పంపిణిలో తటస్థం (Neutral) గా వుంటుంది. అందుచేత ఈ విధానం అభిలషణీయం. సర్‌ఆర్థర్ లెవీస్ ఏమన్నాడంటే "పన్ను చెల్లించే వ్యక్తికి వస్తువు ధరలో పన్నుశాతం ఎంతో సాధారణంగా తెలిసే అవకాశం లేదు. కాబట్టి ఈ పరోక్ష పన్ను విధానంలో మానసికంగా ప్రజలపై వత్తిడి వుండదు. అందుచేత, ప్రత్యక్ష పన్నులకంటే పరోక్ష పన్నులే నయం" అని అన్నాడు. (W.A. Lewis, p.401)

13.2.2 భారతదేశంలో పన్నుల పంపిణి విధానం (Devolution of Taxes) :

భారతదేశ రాజ్యాంగం ఫెడరల్ పన్ను విధానాన్ని ప్రతిపాదించింది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఏయే పన్నులు విధించాలో భారత రాజ్యాంగం సవిస్తరంగా తెలియజేసింది. ఈ పన్నుల పంపిణి (కేంద్ర రాష్ట్రాల మధ్యలో) కి 1935 లో చేసిన భారత ప్రభుత్వ చట్టం కూడా ఒక ఆధారం. భారత ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలకు పన్నుల విధింపుపరంగా చాలా విస్తృతమైన అధికారాలు ఇవ్వబడ్డాయి. అయితే కేంద్రానికి మాత్రం రాష్ట్రాల కేటాయింపులు పోగా మిగిలిన పన్ను విధించే అధికారం (Residual Power of Taxation) కేంద్రానికే చెందుతుంది (Report of the Taxation Enquiry Commission, Vol.1, p.8). దీని అర్థం కేంద్రానికి తనకంటూ ప్రత్యేకమైన పన్నులను రాజ్యాంగం కేటాయించలేదా అంటే కేంద్రానికి తనకంటూ ప్రత్యేకమైన పన్నులు అనగా ఆదాయపు పన్ను మొదలైనవి. కేంద్ర రాష్ట్రాలమధ్య పన్నుల పంపిణి విధానాన్ని టాక్సేషన్ ఎన్‌క్వయిరీ కమీషన్ "పన్ను నిర్మాణం" (Tax Structure) అని లేదా పన్ను పద్ధతి (Tax system) అని పిలిచింది.

i) **రాష్ట్రాల పన్నులు** : (VII Schedule, List II, Constitution of India)

1. భూమి శిస్తు; 2. వ్యవసాయాదాయపన్ను ; 3. ఆస్తిపన్ను ; 4. అమ్మకపు పన్ను; 5. మోటారు వాహనాలపై పన్ను; 6. వృత్తిపన్ను; 7. వినోదపు పన్ను; 8. స్టాంపు డ్యూటీ; 9. పశువులు మరియు నావలపై పన్ను మొదలైనవి.

ii) కేంద్ర ప్రభుత్వ పన్నులు :

1. ఆదాయపు పన్ను; 2. సంపద పన్ను; 3. బహుమతి పన్ను; 4. కస్టమ్స్ మరియు ఎక్సైజ్; 5. కేపిటల్ గెయిన్స్ పై పన్ను; మొదలైనవి

కొన్ని పన్నులు కేంద్ర ప్రభుత్వం విధించి ఆ వచ్చిన పన్ను ఆదాయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్యన పంపిణి అవుతుంది. దీనికి ఉదా॥ కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ మరియు ఆదాయపు పన్ను, ఆదాయపు పన్నుని తప్పనిసరిగా రాష్ట్రాలవాటాని అందజేయాలి. మిగతావాటి విషయంలో కేంద్ర ప్రభుత్వానికి అంత తప్పనిసరి బాధ్యతలేదు. ఈ వాటా పంపిణి అంతా కూడా కేంద్ర ప్రభుత్వంచే 5 సం॥ల కొకసారి నియమించబడే విత్త సంఘం (Finance Commission) యొక్క సలహాల మేరకు జరుగుతుంది. 1952 నుండి ఈనాటివరకు 11 విత్తసంఘాలు పన్ను పంపిణి విధానాన్ని సమీక్షించాయి. 12 వ విత్త సంఘం నియమించబడింది.

భారతదేశంలో విధించబడే పన్నులను స్థూలంగా రెండు రకాలుగా చెప్పవచ్చును. అవి (i.) ప్రత్యక్ష పన్నులు - ఆదాయపు పన్ను (వ్యక్తుల మరియు కంపెనీల) మరియు (ii.) పరోక్ష పన్నులు - యూనియన్ ఎక్సైజ్, అమ్మకపు పన్ను మొదలైనవి. ప్రత్యక్ష పన్నులంటే పన్నుని బదిలి చేయ వీలులేనివి. ఉదా॥ ఆదాయపు పన్నుని ఎవరిమీద విధించబడిందో వారిమీదే పన్నుభారం చివరగా వుంటుంది. అయితే పరోక్ష పన్ను విషయంలో మొదటగా పన్ను ఒక వ్యాపారస్థునిపై విధించబడినమా ఆ పన్నుభారం చివరగా ఇతర వ్యక్తులపైకి బదిలి చేయబడుతుంది. అంటే పన్నుభారం చివరగా వస్తు కొనుగోలుదార్లపై వుంటుంది. ధనికుడైన లేక పేదవ్యక్తి అయినా ఈ పరోక్షపన్ను తటస్థంగా (Neutral) వుంటుంది. అందరిపై అనగా అందరి వినియోగదార్లపై సమానంగా భారం మోపబడుతుంది. అందుచేత యిటువంటి పన్నులను తిరోగామి పన్నులనవచ్చును (Regressive). ప్రత్యక్ష పన్నుల విషయంలో పురోగామి పన్నురేట్లలో ధనికుడైతే ఎక్కువరేటు పన్ను, పేదవాడైతే తక్కువరేటు పన్ను విధించబడుతుంది. అయితే పన్ను ఎగవేత (Tax Evasion) వల్ల ముఖ్యంగా ధనవంతులు పన్నుని ఎగవేయడం వలన యిది కూడా తిరోగామి (Regressive) పన్ను విధానమే అవుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రత్యక్ష పన్నుల పాత్రని పెంచవలసి వుంది. ఎంతోమంది ఆర్థిక శాస్త్రవేత్తలు పరోక్ష పన్నులపై ఎక్కువగా ఆధారపడితే మంచిదని అన్నారని యింతకుముందే గడిచిన పేజిల్లో తెలుసుకున్నాము. మొత్తం పన్ను ఆదాయంలో ప్రత్యక్ష పన్నులపై ఎంత శాతంవరకు ఆధారపడవచ్చు లేక ఎంతశాతం పరోక్ష పన్నులపై ఆధారపడాలి అన్న మీమాంసకి సమాధానం లేదు. భారతదేశంలో మొత్తం పన్ను ఆదాయంలో సింహభాగాన్ని పరోక్షపన్నుల ఆదాయం రూపంలో పొందుతున్నాం. అంటే 70-75 శాతం వరకు పరోక్ష పన్నులనుండే ఆదాయం వస్తోంది. పరిపాలనా యంత్రాంగంలో వున్న అసమర్థతల వల్లనూ, మరియు పన్ను ఎగవేతవల్లను ఆదాయపు పన్ననుండి అధికమొత్తంలో ఆదాయాన్ని పొందడంలేదు. ఆదాయపుపన్ను రేట్లు అదివరకే అధికంగా వున్నాయి. పెంచే దానికన్నా తగ్గించవలసిన ఆవశ్యకత వుందని సిద్ధాంతకర్తల వాదం. అందుచేత ప్రత్యక్ష పన్నులనుండి ఆదాయాన్ని పెంచాలంటే పన్నులు ఎగవేతని అరికడితే ఖజానాకి అధికమొత్తంలో ఆదాయం చేరుతుంది. అయితే ఆదాయపు పన్ను మరియు సంపద పన్ను చెల్లించేవారి సంఖ్య భారతదేశంలో చాలా తక్కువ. పరిపాలనా యంత్రాంగ అసమర్థత దీనికి తోడై ఆదాయానికి గండిపడుతోంది.

పై కారణాలచేత పరోక్ష పన్నులను ఆదాయ సమీకరణనకు వాడడం జరుగుతోంది. పరోక్ష పన్నుల పరిధి విస్తృతమైనది. పన్నురేట్లను తేలికగా మార్చవచ్చు. ప్రజలవద్దనుండి వ్యతిరేకత అంతగా వుండదు. వ్యాపారస్థులు పన్నుని వినియోగదార్లకి బదిలిచేయ వీలుంటుంది. ఈ వ్యాపారస్థులు పన్ను ఎగవేత ద్వారాను మరియు వస్తువు యొక్కధర పన్నుకన్నా ఎక్కువగా పెంచడం వలన అధిక లాభాలు సంపాదించగలరు. అంతేకాకుండా, ఈ పన్నులు తిరోగామి (Regressive) గా వుంటాయనేది విమర్శ. అనగా ధనిక, పేద అనే తేడా లేకుండా అందరి మీద ఒకేరేటులో పన్ను విధింపు వుంటుంది. అయితే పరోక్ష పన్నులను కూడా పురోగామిగా చేయవచ్చు. ఎలాగంటే విలాసవంత వస్తువులపై అధికంగా పన్నురేటుని విధించడం మరియు నిత్యావసర వస్తువులపై

అల్పంగా రేటుని విధించడం ద్వారా పరోక్ష పన్నులను కూడా పురోగామి పన్ను విధానంగా మార్చవచ్చును. ఈ పరోక్ష పన్నులను విలువ ఆధారిత పన్నుగా మార్చినట్లైతే పన్ను ఆదాయం స్వతసిద్ధంగా పెరిగే అవకాశముంది.

కేంద్రప్రభుత్వ ప్రత్యక్ష పన్నులు ఏమనగా (i) అదాయపుపన్ను, (ii) కార్పోరేటు పన్ను, (iii) బహుమతి పన్ను, (iv) సంపద పన్ను, (v) వ్యయపన్ను, (vi) వడ్డీలపై పన్ను, (vii) హోటల్ మరియు ప్రయాణాలపై పన్ను, (viii) ఎస్టేట్ డ్యూటి మొదలైనవి. పరోక్ష పన్నులు కస్టమ్స్ డ్యూటీలు, మరియు యూనియన్ ఎక్సైజ్. రాష్ట్రాలలో ప్రత్యక్షపన్నులు ఆస్తిపన్ను, వృత్తిపన్ను, మోటారు వాహనాలపై పన్ను, పశువులు మరియు బోట్లపై పన్ను మొదలైనవి వుంటాయి. పరోక్ష పన్నులో అమ్మకపు పన్ను, ఆక్ట్రాయి, రాష్ట్రాల ఎక్సైజ్ పన్ను మొదలైనవి. కేంద్రం ప్రత్యక్ష పన్ను అయిన ఆదాయపు పన్నులో రాష్ట్రానికి విత్త సంఘం సలహాల ననుసరించి వాటా యిస్తుంది.

13.2.3 ప్రత్యక్ష, పరోక్ష పన్నుల తీరుతెన్నులు :

1950 - 51 తర్వాతనుండి పరోక్షపన్నులు కేంద్ర మొత్తం పన్ను ఆదాయంలో అత్యధిక వాటాశాతం కలిగివుంటుంది. 1950 - 51 లో కేంద్రంయొక్క మొత్తం పన్ను ఆదాయంలో పరోక్షపన్నుల వాటాశాతం 63. అటుతర్వాత ఈ వాటాశాతం పెరుగుతూ వస్తోంది. 1980-81 నాటికి 83 శాతానికి పెరిగింది. పట్టిక.1 లో చూడగలరు. పరోక్ష పన్నులు 1990 - 91 నాటికి 84 శాతానికి పెరగ్గా 90 వ దశాబ్దంలో పరోక్షపన్నుల విత్త ప్రాముఖ్యత (Fiscal Importance) తగ్గి ప్రత్యక్ష పన్నుల వాటాశాతం పెరగనారంభించింది. ఉదా॥కి 1950 - 51 లో ప్రత్యక్ష పన్నుల వాటాశాతం, మొత్తం పన్ను ఆదాయంలో, 37 శాతం వుండగా 60 - 61 సం॥లో 30 శాతానికి తగ్గింది. అటుతర్వాత బాగాతగ్గి 1991-92 లో 15 శాతానికి పడిపోయింది. దీనికి కారణం పన్ను విధింపు మరియు అమలులో పరిపాలనా యంత్రాంగ వైఫల్యం మరియు పన్ను చెల్లించవలసిన వారినుండి పన్ను ఎగవేత ఎదురవడం. అటు తర్వాత ప్రత్యక్ష పన్నులనుండి ఆదాయం పెరిగి 1999-2000 లో 32 శాతానికి చేరుకుంది. అటుపిమ్మట కొద్దిగా వసూళ్ళ శాతం పడిపోయింది. ప్రత్యక్ష పన్నులనుండి ఆదాయం పెరగడం ఒక మంచి పరిణామం అనిచెప్పవచ్చు. ప్రత్యక్ష పన్నుల రేట్లు పురోగామిగా వుండడం చేత ఆదాయ మరియు సంపదల పరంగా అసమానతలు తొలగి సామాజిక న్యాయం సిద్ధిస్తుంది.

అయితే పన్నులనుండి భారతదేశంలో వసూలవుతున్న ఆదాయం విదేశాలతో పోలిస్తే తక్కువగా వుందని చెప్పవలసి వుంటుంది. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలలో ప్రత్యక్ష పన్నులమీద అధికంగా అనగా 2/3rds వరకు ఆదాయాన్ని వసూలు చేయగల్గుతున్నాయి. భారతదేశంలో దీనికి వ్యతిరేకంగా అదేవంతున పరోక్ష పన్నులమీద ఆధారపడటం గమనార్హం. స్థూలదేశీయోత్పత్తిలో పన్నుల అంటే ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులనుండి వచ్చే ఆదాయంయొక్క శాతం భారతదేశంలో తక్కువనే చెప్పాలి. 1950-51 లో స్థూలదేశీయోత్పత్తిలో పన్నుల శాతం (Tax / GDP ratio) 6 శాతం వుండగా అది 1980-81 నాటికి 17 శాతానికి పెరిగింది. పట్టిక. 2 లో ఈ విషయాన్ని చూడగలరు. తర్వాత, 1986-87 నుండి 2000-01 అంటే 15 సం॥లలో స్థూలదేశీయోత్పత్తి - పన్నుల నిష్పత్తి 16 శాతంనుండి 14 శాతానికి పడిపోయింది. 2002-03 సం॥లో కొద్దిగా పెరిగి 17 శాతం అయ్యింది. పట్టిక.2 లో గమనించగలరు. 1998-99 వ సం॥లో మాత్రం 20 శాతంగా ఈ నిష్పత్తి నమోదు చేసుకుంది. 1985-87 నుండి 2000-01 కాలంలో నిష్పత్తి పడిపోవడానికి గల కారణం పరోక్ష పన్నుల నుండి ఆదాయం పడిపోవడమే. అయితే ఈ తగ్గుదల ప్రత్యక్ష పన్ను ఆదాయంలో పెరుగుదల వుండడం మూలంగా కొంతవరకు లోటు భర్తీ అయ్యిందని చెప్పవచ్చు. అభివృద్ధి చెందిన దేశాలలో పన్నులనుండి వచ్చే ఆదాయం యొక్కశాతం స్వీడన్‌లోనైతే 41 శాతం, ఫ్రాన్స్‌లో 39 శాతం, పశ్చిమ జర్మనీలో 35 శాతం, యు.కె. లో 33 శాతం, అమెరికాలో 29 శాతం, మరియు కెనడాలో 29 శాతంగా వుంది. భారతదేశంలో పన్నులనుండి అదాయం యింకా పెరగవలసి వుందని తెలుసుకోవచ్చు.

పట్టిక.1

ప్రత్యక్ష పరోక్ష పన్నుల వాటా శాతం

1950 - 51 నుండి 2003 - 04 (రూ॥ కోట్లలో)

సంవత్సరములు	ప్రత్యక్ష పన్నులు		పరోక్ష పన్నులు		మొత్తం
	రాబడి	%	రాబడి	%	పన్ను రాబడి
1950-51	231	37	396	63	627
1960-61	402	30	948	70	1350
1970-71	1009	21	3743	79	4752
1980-81	3268	17	16576	83	19844
1985-86	6252	14	37015	86	43267
1990-91	14267	16	73297	84	87564
1995-96	41603	24	133248	76	174852
1999-2000	42270	32	90100	68	132370
2002-2003	101067	28	256822	72	357889
2003-2004 (RE)	121970	29	293313	71	415283

మూలం : Economic Survey 2001-02; 2002-03; 2003-04.

పట్టిక.2

స్థూల దేశీయోత్పత్తిలో పన్నుశాతం

1950-51 నుండి 2004-05

సంవత్సరం	నిష్పత్తి
1950-51	6.00
1960-61	10.00
1970-71	14.00
1980-81	17.00
1989-90	16.00
1999-2000	14.10
2000-2001	14.60
2001-02	13.70

2002-03	14.90
2003-04	15.20
2004-05*	16.70

Source : * Economic & Political Weekly June 26, July 2, 2004, p. 2757.
Economic Survey, 2001-02, 2002-03.
* Eleventh Finance Commission's Projections.

పట్టిక. 3. లో స్థూలదేశీయోత్పత్తిలో వేర్వేరు పన్నుల శాతం, 1999-2004 కాలంలో ఎట్లా మార్పు చెందిందో తెలియజేస్తుంది. ఆదాయం పన్ను 1999-2000 నుండి 2004-05 వరకు స్థూలదేశీయోత్పత్తిలో 1.5 శాతంనుండి 1.8 శాతం మేర పెరిగింది. కార్పోరేటు పన్ను 1.7 శాతంనుండి 2.2 శాతానికి పెరిగింది. అయితే యూనియన్ ఎక్సైజ్ సుంకం మాత్రం 3.5 నుండి 3.7 శాతానికి పెరిగింది. పెద్దగా మార్పులేదు. మొత్తం కేంద్రపన్నులు అన్ని కలిపి 9.6 శాతం నుండి 10.3 శాతానికి పెరిగింది. రాష్ట్రాల సొంత పన్ను రాబడి (State own Tax Revenue) 5.2 శాతంనుండి 6.4 శాతానికి పెరిగింది.

పట్టిక . 4. భారతదేశ పన్ను నిర్మాణ 1980-81 నుండి 2004-05 కాలంలో ఎట్లా మార్పు చెందిందో సూచిస్తోంది. ఈ పట్టికలో అదాయపు పన్ను, కార్పోరేటు పన్ను యూనియన్ ఎక్సైజ్, కస్టమ్స్ సుంకం, అమ్మకపు పన్ను మరియు సర్వీసు పన్నుల ద్వారా వసూలైన ఆదాయాల గురించి వివరణ యివ్వడం జరిగింది. మొదటగా అదాయం పన్ను మొత్తం 1980-81 లో రూ. 2,817 కోట్లనుండి 2003-04 (RE) నాటికి రూ. 1,03,255 కోట్లకి, 2004-05 (BE) నాటికి రూ. 1,39,365 కోట్లకి పెరిగింది. ఆదాయపు పన్ను రాబడి 48 రెట్లు పెరిగింది. అలాగే కస్టమ్స్ సుంకం రూ. 3,409 కోట్లనుండి 2003-04 (RE) నాటికి రూ. 49,350 కోట్లకి, 2004-05 (BE) నాటికి రూ. 54,250 కోట్లకి 16 రెట్లు పెరిగింది. ఇక యూనియన్ ఎక్సైజ్ ఇదే కాలంలో రూ. 6,500 కోట్ల నుండి రూ. 1,09,199 కోట్లకి పెరిగింది. అనగా 17 రెట్లు పెరిగింది. రాష్ట్రాల ప్రధాన ఆదాయం అయిన అమ్మకపు పన్ను రూ. 1980-81 లో రు. 4,018 కోట్లనుండి 1998-99 (RE) నాటికి రు. 55,739 కోట్లకి పెరిగింది. అంటే 13 రెట్లు పెరిగింది. 1998-99 సం॥లో సర్వీస్ పన్ను కేంద్ర ప్రభుత్వం విధించింది. ఈ పన్ననుండి 1998-99 లో రూ. 1,957 కోట్ల పన్ను రాబడి రాగా 2003-04 (RE) నాటికి రు. 7,890 కోట్లకి పెరిగింది. అంటే 4 రెట్లు అదాయం పెరిగింది. వీటన్నింటితో పోలిస్తే అదాయం పన్ను అధికరెట్లు పెరిగింది. అదాయపు పన్ను విస్తరణ బాగా జరిగింది.

మొత్తం పన్ను ఆదాయం 1950-51 లో రు. 627 కోట్లుంటే 1960-61 సం॥కి రూ. 1350 కోట్లుగాను, 1970-71 కి రు. 4,752 కోట్లుగాను, 1980-81 కి రూ. 19,844 కోట్లుగాను, పెరిగింది. ఈ ఆదాయం ఇట్లా పెరుగుతూ, 1990-91 నాటికి రు. 87,564 కోట్లకి పెరగ్గా 1999-2000 కి రూ. 1,32,370 కోట్లకి పెరిగింది. 2003-04 (RE) సం॥ నాటికి మొత్తం పన్ను ఆదాయం రూ. 4,15,283 కోట్లకి చేరుకుంది. ఈ విషయం పట్టిక. 1 లో చూడగలరు.

పట్టిక 3.

స్థూలదేశీయోత్పత్తిలో వేర్వేరు పన్నుల శాతం, 1999-2004

పన్నులు	1999-00	2000-01	2001-02	2002-03	2003-04	2004-05
అదాయపన్ను	1.5	1.8	1.6	1.7	1.8	1.8
కార్పోరేటు పన్ను	1.7	2.0	1.9	2.0	2.1	2.2

యూనియన్ ఎక్సైజ్ సుంకం	3.5	3.7	3.6	3.9	3.9	3.7
కస్టమ్స్ సుంకం	2.7	2.6	2.1	2.0	2.0	2.6
కేంద్రపన్నులు (స్థూలంగా)	9.6	10.3	9.4	9.8	10.1	10.3
రాష్ట్రాల సొంత పన్ను రాబడి	5.2	5.6	5.6	5.9	6.0	6.4

మూలం : E.P.W, June 26, 2004

Eleventh Finance Commissions Projections

పట్టిక 4.

భారతదేశ పన్ను నిర్మాణత, 1980-81 నుండి 2004-05

సంవత్సరం	ఆదాయ మరియు కార్పోరేటు పన్ను	కస్టమ్స్ సుంకం	యూనియన్ ఎక్సైజ్	అమ్మకపు పన్ను	సర్వీస్ పన్ను
1980-81	2817	3409	6500	4018	-
1985-86	5375	9526	12956	8742	-
1990-91	10706	20644	24514	18228	-
1995-96	32079	35757	40187	35693	-
1996-97	36801	42851	45008	42226	-
1997-98	50110	41000	47700	48290	- -
1998-99	44769	40668	53246	55739	1957
1999-2000	56346	48420	61902	NA	2128
2000-2001	67460	47542	68526	NA	2613
2001-02	68673	40268	72555	NA	3302
2002-03	83030	44852	82310	NA	4122
2003-04(RE)	103255	49350	92379	NA	7890
2004-05 (BE)	139365	54250	109199	NA	NA

మూలం : Economic Survey, 2001-02, 2002-03, 2003-04. & E.P. Weekly, 2004.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ మరియు పాలసీ (NIPFP) అనే సంస్థ (1970-71 నుండి 1983-84 వరకు పన్ను ఆదాయం యొక్క వ్యాకోచత్వం మరియు బాయన్సీ (Buoyancy) లను అంచనావేసి చెప్పడం జరిగింది. భారతదేశ పన్ను ఆదాయం యొక్క వ్యాకోచత్వం (Elasticity) అనేది 1 కన్న తక్కువగా ఉన్నదని అనగా 0.96 వుందని అంచనా వేరు. అయితే

బాయన్సీ 1 కన్నా ఎక్కువగా వుందని అన్నారు. అంతే కాకుండా రాష్ట్రాల ఆదాయం యొక్క వ్యాకోచత్వం ఎక్కువగాను (ఒకటి కంటే ఎక్కువ) మరియు బాయన్సీ కూడా కేంద్రంతో పోలిస్తే మెరుగ్గా వున్నాయి. యూనియన్ ఎక్సైజ్‌యొక్క బాయన్సీ 1.51 వుంది. భారతదేశ విత్తవనరుల అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే భారతదేశ పన్ను ఆదాయం తక్కువనే చెప్పాలి. లంటే అట్లా వున్న అల్ప ఆదాయం భారతదేశ అవసరాలకు అసంపూర్తిగాను (Inadequate), అవ్యాకోచంగాను (Inelastic) మరియు బాయన్సీ లేమితో భారతదేశ పన్ను విధాన నిర్మాణత సతమతమవుతోందని చెప్పవచ్చు.

భారతదేశ పన్ను వ్యవస్థని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య పన్ను ఎగవేత (Tax Evasion). న్యాయబద్ధంకాని మార్గాల ద్వారా చెల్లించవలసిన పన్నుని ఎగవేస్తారు. పన్ను ఎగవేత సమస్య వలన భారతదేశం ఎంతో ఆదాయాన్నీ నష్టపోతుంది. అయితే ఎంత ఆదాయం ఈ సమస్య వల్ల నష్టపోవడం జరిగింది, అనే దానిమీద సరిఅయిన లెక్కలు లేవు. ఉదా॥కి టాక్సేషన్ ఎన్‌క్వయిరీ కమీషన్ (Taxation Enquiry Commission) పన్ను ఎగవేత ద్వారా నష్టపోయిన ఆదాయం రూ. 500 కోట్లుందని అంచనా వేసింది. కేంబ్రిడ్జి ఆర్థిక శాస్త్రవేత్త అయిన నికోలస్ కాల్డర్ (Nicholas Kaldor) భారతదేశ పన్ను విధానాన్ని ప్రక్షాణన చేయడానికి వచ్చి పన్ను ఎగవేత రూ. 200-300 కోట్లుందని లెక్కవేశారు. అయితే డైరక్టు టాక్సెస్ ఎన్‌క్వయిరీ కమిటి (Direct Taxes Enquiry Committe) ఇది రూ. 20-30 కోట్లుగా చెప్పడం జరిగింది. ఈ పన్ను ఎగవేత సమస్య ప్రత్యక్ష పన్నుల వరకే పరిమితం కాకుండా పరోక్ష పన్నులకు కూడా విస్తరించింది. కాలం గడుస్తున్నకొద్ది దేశం అభివృద్ధిని సాధిస్తున్న కొద్ది పన్నుల అమలులో అనేక సమస్యలు ఎదురవుతుండడం వలన పన్ను ఎగవేత అవధులు దాటి పెరుగుతుందని చెప్పవచ్చు. దీనికితోడు పరిపాలన యంత్రాంగ పరిమితులు కారణంగా పన్ను ఎగవేత పెరుగుతోందని చెప్పవచ్చు. దీనిని నివారించడానికై ప్రభుత్వం అనేక కమిటీలను ఏర్పాటుచేసి పన్ను ఎగవేతని అరికట్టడానికి ప్రయత్నించింది. వీటి సలహాల మేరకు పన్ను యంత్రాంగంపై అదనపు భారం, ఎక్కువ తనిఖీలు, ఎక్కువ రికార్డులను నిర్వహించడం, ఎక్కువ క్లిష్టతర పన్ను చెల్లింపు విధానాలవంభించడం మొదలైన వాటి రూపంలో పెరిగింది. దాంతో ఈ కమిటీల సలహాలు నిరుపయోగమయ్యాయి. పన్ను ఎగవేతని నిరోధించలేకపోయాయి. L.K ఝా కమిటి మరియు వాంఛూ కమిటిలో పన్ను ఎగవేతకి కారణం ఎన్నికలు వచ్చినప్పుడల్లా రాజకీయ పార్టీలు విత్త సమీకరణ చేయడం పరిపాటి. దీంతో ఆ పార్టీలో ప్రభుత్వంలోకి వచ్చినప్పుడు పన్ను ఎగవేతని చూసి చూడనట్టు వ్యవహరించడం పన్ను ఎగవేతకి కారణం అనాలన్నారు. అంతేకాకుండా ప్రత్యక్ష పన్నుల రేట్లు అధికంగా విధించడం కూడా పన్ను ఎగవేతకి కారణమని కొందరంటారు. అయితే అధికశాతం ప్రజానీకానికి పన్నులో ఎంత తక్కువరేట్లు విధించినా చెల్లించడం ఇష్టం వుండదు. దీనివలన పన్నులను ఎగవేస్తారు. ఇంకా, ఆదాయపరంగా దేశంలో సరియైన సమాచారం లభించకపోవడం లేక ప్రజలు వివరాలు చెప్పకపోవడంవలన కూడా పన్ను ఎగవేత సమస్య ఎదురవుతుంది. భారతదేశంలో ఈ సమస్య చాలా ముఖ్యమైనది. అందుచేత ఈ సమస్యని అధిగమిస్తే ప్రభుత్వ ఆదాయం ఎన్నోరెట్లు పెరగగలదు. పన్నురేట్లను ముట్టుకోకుండా, పన్నుయొక్క పరిధిని విస్తృతపరచినట్లైతే పన్ను ఎగవేతను కొంతవరకు నివారించవచ్చు. ఉదా॥కి ఆదాయపు పన్ను (Personal Income Tax) విషయంలో గడిచిన 5సం॥ లలో పన్ను రేట్లను మార్చడం జరగలేదు.

పన్ను ఆదాయం - స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి (Tax - GDP Ratio) పెరగాలంటే అదనపు పన్నుల విధింపుకై అన్వేషణ ప్రభుత్వం చేస్తూ వుంటుంది. ప్రభుత్వం నియమించిన అనేక కమిటీలు వ్యవసాయ ఆదాయంపైన ఆదాయపు పన్ను విధించాలని సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా అధికాదాయ వర్గాల వారిని పన్నువలయం (Tax Net) లోకి తీసుకురావలసిన అవసరం వుంది. ఈ రోజున వ్యవసాయ రంగంపై భూమిశిస్తు (Land cess) తప్ప ఏ ఇతర పన్నులు లేవు. అయితే ఆదాయ లెక్కింపులో ఎదురయ్యే సమస్యల వలన మరియు రాజకీయ కారణాలచేత వ్యవసాయ రంగంపై ఏ విధమైన పన్నులు లేవు. ఇదికూడ నల్ల ధన వ్యవస్థకి ఊతం ఇస్తోందని చెప్పవచ్చు.

భారతదేశంలో పన్నువిధానంలో కేంద్రం రాష్ట్రాల మధ్యన ఖచ్చితమైన విభజన భారతరాజ్యాంగం ద్వారా నిర్ణయించబడింది. పన్ను విధాన విచారణ సంఘం (Taxation Enquiry Commssion, 1953-54) ప్రకారం మొత్తం ప్రభుత్వ ఆదాయంలో

కేంద్ర ప్రభుత్వ వాటా శాతం 43 నుండి 48 కి 1938-39 నుండి 1953-54 సం॥లలో పెరిగింది. ఇదేకాలంలో రాష్ట్రాల వాటా శాతం 39 నుండి 41 కి పెరిగింది. అంటే కేంద్రంయొక్క వాటా పెరుగుతోందన్నమాట. దీనికి కారణం కేంద్రం దగ్గర వ్యాకోచత్వం ఎక్కువగా వున్న పన్నులుండడమే. అంతేకాకుండ, రాష్ట్రస్థాయిలో పన్ను వసూళ్ళు సరిగ్గా లేకపోతే ఆ పన్నులు కేంద్రం తీసేసుకునే ప్రమాదం కూడా వుంది. ఈ కారణాల వల్ల రాష్ట్రాలు బలహీన పడే అవకాశాలుంటాయి. దీంతో రాష్ట్రాలు బదిలీ ఆదాయంపై (Transfer of Resources) పై ఎక్కువగా ఆధారపడే అవకాశం వుంది. అదే అమెరికా, కెనడా, మరియు ఆస్ట్రేలియా వంటి ఫెడరల్ దేశాలలో కేంద్ర ఆదాయం తగ్గుముఖం పట్టడం గమనించవచ్చు.

భారతదేశ పన్ను విధానంలో యింకొక వైచిత్రమేమిటంటే, పన్నుభారం (Tax Burden) చాలా ఎక్కువ. అంటే అతి కొద్దిమంది అధికశాతం పన్నుని చెల్లించి భరించడం. ముఖ్యంగా ఆదాయపు పన్ను (Personal & Corporate) పన్నుభారం అధికం. ఒక అంచనా ప్రకారం, భారతదేశంలో 0.5 శాతం జనాభా వక్తిత్వ ఆదాయపు పన్నుని మొత్తం భరించడం జరుగుతోంది. అంటే 0.2 శాతం కలిగిన జనాభా (మొత్తం జనాభా) లో పన్ను భారాన్ని 80 శాతం భరించడం జరుగుతోంది. అదే అమెరికాలోనైతే 31 శాతం మరియు UK లో నైతే 39 శాతంగా వుంది. దీన్నిబట్టి తెలిసిందేమిటంటే పన్నులయొక్క పరిధి పూర్తిగా విస్తరించలేదు. ఉదా॥కి ప్రణాళికా సంఘం అంచనాల ప్రకారం ప్రత్యక్ష పన్నులు చెల్లిస్తున్న జనాభాశాతం '1' మాత్రమే. అలాగే పొగాకు, టెక్స్‌టైల్స్ మరియు ఇతర ఉత్పాదక వస్తువులపై ఎక్సైజ్ సుంకాలు చెల్లించేవారి శాతం కూడా తక్కువే. పన్నుభారం యొక్క పంపిణీలో సమానత లేదు. పట్టణ ప్రాంత ప్రజలే పన్నులను ఎక్కువగా చెల్లించడం జరుగుతోంది. పల్లె ప్రజలమీద పెద్దగా పన్నులు లేవు. అందులోనూ మొత్తం జనభాలో పట్టణప్రాంత ప్రజల శాతం చాలా తక్కువ. గ్రామీణ ప్రజల శాతం ఎక్కువ. సమానత ఎక్కడుంది. అలాగే పరోక్ష పన్నులు ఎక్కువ ఆదాయాన్ని ప్రభుత్వానికి సమాకూరూస్తున్నాయి. మొత్తం ప్రజలందరిని తీసుకుంటే, పరోక్షపన్నులో తిరోగామి పన్నుల విధానాన్ని సూచిస్తాయి. అంటే ధనిక పేద తారతమ్యం లేకుండా అందరిపై ఒకేరకంగా పన్ను భారం వుంటుంది. యింకనూ, పరోక్ష పన్నులలో అధిక శాతాన్ని పేదరిక రేఖ దిగువున వున్న ప్రజలే కడుతున్నారన్నది నిర్వివాదాంశం. ఇదే పరిస్థితి ఆదాయపు పన్ను విధింపులో కూడా వుంది. అంటే ఆదాయపు పన్నులో పురోగామి పన్నువిధానం అమలులో ఉన్నప్పటికి ఆదాయపు పన్ను తిరోగామి పన్నుగా మారిపోయింది. ఎందుకంటే,స్థిర ఆదాయవర్గాల వాళ్ళు పన్నుని చెల్లిస్తున్నారు. ధనిక వర్గాలు మరియు వ్యాపారస్థులు పన్నుని ఎగవేస్తున్నారు. దీంతో ఆదాయ సంపద వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి.

భారతదేశ పన్ను విధానాన్ని సరియైన మార్గంలో పెట్టి పన్ను ఆదాయాన్ని గరిష్ఠం చేయాలంటే టాక్స్ - జి.డి.పి. నిష్పత్తిని యింకా బాగా పెంచవలసివుంది. దీనికొరకై ప్రత్యక్ష పన్ను విధానాన్ని బలోపేతం చెయ్యవలసివుంది. అంతే కాకుండా అదనపు పన్నులను అమలుచేయాలి. ముఖ్యంగా ఆదాయపు పన్నుని వ్యవసాయ ఆదాయంకి విస్తరింప జేయాలి. వ్యవసాయరంగంలో ధనికులను గుర్తించి వారిపై ఆదాయపు పన్ను విధించాలి. అంటే పన్నుల పరిధిని విస్తరించాలి. దీనివలన అన్నివర్గాల ప్రజలు పన్నువలయం (Tax net) లోకి వచ్చేటట్లుగా చేయవలసి వుంది. ఈ చర్యల వలన ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా వివిధ ఆదాయ వర్గాల మధ్యన పన్నుభారాన్ని న్యాయబద్ధంగా (Fair) పంపిణి చేయ వీలవుతుంది.

పన్నుయొక్క పరిపాలనా యంత్రాంగాన్ని కట్టుదిట్టంచేసి దానిలో వుండే లోపాలను సరిదిద్ది పన్ను ఎగవేతని అరికట్టాలి. పన్ను వసూళ్ళ యంత్రాంగాన్ని పటిష్టపరచి ఆ యంత్రాంగానికి ప్రోత్సాహకాలు ప్రకటించి అధిక ఆదాయం వసూలైయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలి. ఈ స్థాయిలో అవినీతి లంచగొండితనాన్ని రూపుమాపాలి.

1957 వ సం॥లో నికోలస్ కాల్డర్ పన్ను సవరణలో (Tax Reforms) లో భాగంగా వ్యయ పన్ను (Expenditure Tax) ని విధించినట్లైతే భారతదేశ పన్ను రుగ్మతలన్ని పోతాయని సూచించాడు. అయితే ఈ పన్నుని విధించడం 1962 లో ఎత్తివేయడం జరిగింది. 1964 లో మరల విధించి 1966 లో మరల ఎత్తివేశారు. ఆ తర్వాత వాంఛూ కమిటి దీని విధింపు గురించి ఆలోచించింది కాని విధించమని మాత్రం సూచించలేదు. ఈ వ్యయ పన్ను ఆదాయపు పన్నుతో పోలిస్తే పన్నుభారం పంపిణి పరంగా సమానత

(Equity) ని పెంపొందింపజేస్తుంది. దీంట్లో ఎన్నో మంచి లక్షణాలున్నప్పటికి దీనివల్ల ప్రజల్లోనూ మరియు ప్రభుత్వంలోనూ విముఖత వుంది. అయితే నల్లధన వ్యవస్థ పోవాలన్న మరియు పన్ను ఎగవేతని నివారించాలన్న వ్యయపన్ను విధింపు ఒక్కటే మార్గం.

13.3 ప్రభుత్వం యొక్క పన్ను విధాన నిర్ణయాలు : విచారణ సంఘాల ఏర్పాటు :

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశ ప్రభుత్వం పన్ను విధానాన్ని దేశ ఆర్థికాభివృద్ధి ఆశయాల దృష్ట్యా మార్పుచేయదలచి అనేకానేక కమిటీలను, మరియు కమిషన్‌లను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో పన్ను విధాన నిర్మాణత పరంగా అనేక సలహాలు మరియు సూచనలు చేశారు. వీటిని ప్రభుత్వం అవసరానుసారం ఉపయోగించుకుంది. ఈ క్రింద ఈ కమిటీలు అందించిన సూచనలను ఒక్కొక్కటిగా చూద్దాం.

13.3.1 పన్నువిధాన విచారణ సంఘం (Taxation Enquiry Commission) 1953-54 :

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పన్ను విధాన ప్రక్షాణనకై మొదటగా ఏర్పాటు చేసిన కమిటి "పన్ను విధాన విచారణ సంఘం". ఈ సంఘాన్ని డా॥ జాన్‌మథాయి అధ్యక్షులుగా కేంద్రప్రభుత్వం ఏప్రియల్ 1953 లో నియమించింది. ఈ సంఘం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ముఖ్యంగా దేశంలో ప్రజలపై కేంద్ర, రాష్ట్ర మరియు స్థానిక ప్రభుత్వాలు విధించే పన్నుల పరంగా భారం ఎట్లావుందో పరిక్షించాలి. అంతేకాకుండా ప్రస్తుతం అమలులో వున్న (అంటే ఆనాడు) పన్ను విధానం ఎంతవరకు దేశ అవసరాలకనుగుణంగా వుందో కూడా పరిశోధన చేయవలసి వుంది. అంటే దేశాభివృద్ధి అవసరాలు మరియు ఆదాయ మరియు సంపదపరంగా అసమానతల నివారణ మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది.

ఈ సంఘం 1954 లో తన రిపోర్టుని ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సంఘం తనయొక్క సూచనలలో పన్ను విధానంలో సమానత (Equity) పై దృష్టి సారించింది. ఈ ప్రయత్నంలో పన్ను విధింపు యంత్రాంగాన్ని పటిష్టపరచి విలాసవంత వస్తువులపై మరియు సగం విలాసవంత వస్తువులపై (Semi, Luxuary goods) అదనపు పన్నులు విధించాలని సూచించింది. వీటితోపాటుగా అమలులో వున్న ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులను విస్తృత పరచి అదనపు ఆదాయాన్ని సమీకరించాలని కూడా సూచించింది. ఈ పన్నులలో ఆదాయపు పన్ను మరియు ఎక్సైజ్ పన్నులు ఉన్నాయి. ఈ సంఘం మొదటగా వ్యవసాయాదాయంపై ప్రత్యక్ష పన్ను విధించమని ప్రభుత్వాన్ని కోరింది. ఈ సంఘం భారతదేశ పన్ను విధానపరంగా మొదటగా సాంకేతిక పరమైన పరిశోధన జరిపింది., అయితే అదనపు పన్నుల విధింపు సూచనపరంగా ఈ సంఘం ప్రజలయొక్క పన్ను చెల్లించే సామర్థ్యాన్ని (Taxable Capacity) పరిగణనకి తీసుకోకపోవడం ఒక లోపం. యింకొకటి ఏమిటంటే దేశం మొత్తాన్ని దృష్టిలో పెట్టుకుంటే సరియైన నిర్ణయంకాదు. అయినప్పటికి, కేంద్ర ప్రభుత్వం ఈ సంఘంయొక్క అనేక సూచనలను ఆమోదించింది. ముఖ్యంగా 2 వ పంచవర్ష ప్రణాళికలో ఈ సంఘం యొక్క సూచనలు రెవెన్యూ గ్యాప్‌ని నివారించడానికి ఉపయోగపడ్డాయి.

13.3.2 భారతదేశ పన్ను విధాన పరిశీలనలు : నికోలస్ కాల్డర్, 1956 :
(Indian Tax Reforms - Report of a Survey, N. Kaldor, 1956)

రెండవ పంచవర్ష ప్రణాళికకి అవసరమయ్యే వనరుల సమీకరణలో పన్ను విచారణ సంఘం విఫలం అయ్యిందనే ఆలోచనలో ప్రభుత్వం కేంబ్రిడ్జి ఆర్థిక శాస్త్రవేత్త అయిన నికోలస్ కాల్డర్‌ని జనవరి, 1956 లో ఆహ్వానించింది. భారతదేశ పన్ను విధానాన్ని పునఃపరిశీలించడానికి (Review) తద్వారా మార్పులు మరియు చేర్పులు చేయ నిశ్చయించి కాల్డర్‌ని ఆహ్వానించడం జరిగింది.

కాల్డర్ మొదటగా చేసిన వ్యాఖ్య ఏమిటంటే భారతదేశ పన్నువిధానం అసమర్థతతోనూ (Inefficient) మరియు అసమానతలను (Inequalities) పెంపొందించే విధంగా ప్రత్యక్ష పన్ను విధానం వుందని చెప్పడం జరిగింది. పన్ను అమలు యంత్రాంగం కూడా

సరిగా లేదని వ్యాఖ్యానించాడు. అంతేకాకుండా, G N P పెరుగుదలకి మరియు పన్ను రాబడికి మధ్యన ఏ విధమైన సంబంధం లేదని కూడా చెప్పడం జరిగింది.

కాల్డర్ మొదటగా ప్రత్యక్ష పన్నులను మెరుగు పరచడానికి అనేక ప్రత్యక్ష పన్నులను సూచించాడు. అవి (i) సంపద పన్ను (ii) బహుమతి పన్ను (iii) మూలధన లాభాలపై పన్ను (Capital Gains Tax) మరియు (iv) వ్యయ పన్ను (Expenditure Tax) కేంద్రప్రభుత్వం ఈ పన్నులన్నింటిని ఆమోదించి అమలుచేసింది. అయితే వ్యయ పన్నుని 1957లో విధించి 1962-63 సం॥లో నిలిపివేసింది. తర్వాత వాంఛూ కమిటి సూచనలు 1964 లో ప్రవేశ పెట్టడలచి అనేక కారణాలచేత విరమించుకుంది.

అయితే కాల్డర్‌యొక్క ప్రతిపాదనలు వ్యాపార వర్గంనుండి అనేక విమర్శలకు గురయ్యాయి. ఈ ప్రతిపాదనల వలన మూలధన సంచయానికి పెద్ద విఘాతం కల్గుతుందని మరియు ప్రజలయొక్క పనిపట్ల మరియు పొదుపుల పట్ల ప్రజలయొక్క సుముఖత (willingess) మరియు సమర్థత (ability) దెబ్బ తింటాయని విమర్శించటం జరిగింది. అలాగే వ్యయాలపై పన్ను ప్రజలకు అసౌకర్యంగాను మరియు చికాకు కలిగించేదిగాను వుంటుందని విమర్శించడం జరిగింది. అయితే కాల్డర్ భారతదేశ పన్ను విధాన దిశను నిర్ణయించాడనడంలో సందేహం లేదు.

13.3.3 భూతలింగం కమిటి పన్ను సవరణలు (1967) :

కేంద్ర ప్రభుత్వం విత్త మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మాజీ సెక్రెటరీగా పనిచేసిన యస్. భూతలింగం అధ్యక్షుడుగా ప్రత్యక్ష పన్నులపై సూచనలు చేయడానికిగాను ఒక కమిటిని నియమించింది. ఈ కమిటి తనయొక్క సూచనలతో 1968 లో తన రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించింది.

భూతలింగం కమిటి సూచనలలో ముఖ్యమైనవి ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచడం, ఎస్టేట్ డ్యూటీని వారసత్వపు పన్నుగా మార్చడం, బహుమతి పుచ్చుకున్నవారే పన్ను కట్టాలనడం, మొదలైనవి వున్నాయి. సాంవత్సరిక డిపాజిట్ పథకం (Annuity Deposit Scheme) ని రద్దు చేయడం కూడా ఈ కమిటి సూచనలలో వుంది. కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచి సాంవత్సరిక డిపాజిట్ పథకాన్ని ఎత్తివేసింది.

13.3.4 ప్రత్యక్ష పన్నుల విచారణ కమిటి - వాంఛూ కమిటి : మార్చి 1970 :

కేంద్ర ప్రభుత్వం మాజి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అయిన కె. యన్. వాంఛూ ఆధ్యక్షునిగా ప్రత్యక్ష పన్నుల విచారణ కమిటీని ఏర్పాటుచేసింది. మార్చి 1970 లో ఈ కమిటీని ప్రత్యక్ష పన్నుల అమలులో ఎదురయ్యే సమస్యలను ముఖ్యంగా నల్లధన వ్యవస్థని మరియు దాని వ్యాప్తిని మరియు పన్ను ఎగవేత సమస్యలపై విచారణ జరిపి తగిన సూచనలనివ్వవలసిందిగా ప్రభుత్వం కోరింది. ఈ కమిటి తన చివరి రిపోర్టును మార్చి, 1972 లో ప్రభుత్వానికి సమర్పించింది. ఈ కమిటి ఎన్నో మంచి సూచనలను చేసింది. నల్లధన వ్యవస్థకి మరియు పన్ను ఎగవేతకి మధ్యన దగ్గర సంబంధముందని వివరిస్తూ 1968-69 లో ఆదాయపు పన్ను ఎగవేత రూ॥ 470 కోట్లుంటుందని వ్యాఖ్యానించింది. దీనికి కారణాలు ఏంటంటే (i) పన్నులకి సంబంధించిన చట్టాలను సరిగా వర్తింప జేయకపోవడం, (ii) ప్రత్యక్ష పన్నుల అధిక రేట్లు (iii) రాజకీయ పార్టీలకు వ్యాపారస్తుల డొనేషన్స్ (iv) అవినీతి మొదలైనవని చెప్పడం జరిగింది. వీటిని నివారించడానికి సూచనలలో ముఖ్యమైనవి. (i) ఆదాయపు పన్ను యొక్క గరిష్ట ఉపాంత పన్నురేటు (Maximum Marginal rate of Income Tax) తగ్గించుట (97.75% నుండి 75%); (ii) వ్యాపారస్థులు రాజకీయ పార్టీలకు ఇచ్చే డోనేషన్స్‌ని పరిమితులను మరియు నియంత్రణలను విధించుట; (iii) కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగ ఆదాయంపై పన్ను విధించే అధికారాన్ని పొందాలి. (iv) అమలులోవున్న అమ్మకపు పన్ను విధానాన్ని ఎత్తివేసి అదనపు ఎక్సైజ్ డ్యూటీలను వేయాలి; (v) వ్యయాలపై పన్ను (Expenditure Tax) ని పన్ను ఎగవేతని నివారించడానికై విధించాలి. (vi) వివరణ యివ్వని వ్యయం (Unex-

plained Expenditure) పై పన్ను విధించాలి. (vii) పన్ను చెల్లించే వారందరికి ఒక శాశ్వత ఎకౌంటు నెంబరు యివ్వాలి; మొదలైన సూచనలను చేసింది.

వాంఛూ కమిటి సూచించిన సూచనలలో చాలాభాగం ప్రభుత్వం ఆమోదించింది. అయితే వ్యవసాయ ఆదాయంపై పన్ను విధింపుని అంగీకరించలేదు. అలాగే కమిటి చేసిన పన్ను ప్రోత్సాహకాలను మాత్రం అమలుచేయలేదు. ఉపాంత పన్నురేటుని దశలవారీగా 40 శాతానికి తగ్గించింది ప్రభుత్వం. 1978 జనవరిలో రూ॥ 1000 ల నోట్లని రద్దు చేసింది. నల్లధన ప్రభావాన్ని ఆర్థిక వ్యవస్థపై తగ్గించడానికి. అయితే ఈ 1000 రూ॥ల నోట్లు ప్రజలదగ్గర వాడుకలో తక్కువ వుండటంచేత నల్లధన వ్యవస్థ దీని ప్రభావం అంతగా వుండదని చెప్పవచ్చు. చివరగా, వాంఛూ కమిటి నల్లధన వ్యవస్థ నిర్మూలనకి మరియు పన్ను ఎగవేతని అరికట్టడానికి పాటుపడిందని చెప్పవచ్చు.

13.3.5 వ్యవసాయాదాయ సంపదలపై పన్ను విధింపు - కె.యన్. రాజ్ కమిటి 1972 :

కేంద్ర ప్రభుత్వం కె.యన్. రాజ్ అధ్యక్షతన వ్యవసాయాదాయ సంపదలపై పన్ను విధింపుకు సంబంధించిన సూచనలు చేయవలసిందిగా ఆదేశించింది. ఈ కె. యన్. రాజ్ కమిటీ ఫిబ్రవరి 24, 1972 న నియమించబడింది. అక్టోబర్ 31, 1972 న తన రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించింది.

రాజ్ కమిటి వ్యవసాయాదాయం మరియు వ్యవసాయేతరాదాయలను ఒకేరకంగా పన్ను విధింపు పరంగా పరిగణించవలసి వుంటుందని అభిప్రాయపడింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ వ్యవసాయరంగంనుండి సంపాదించిన ఆదాయాన్ని వ్యవసాయేతరాదాయంలో సమ్మిళితం చేసి పన్నుని విధించాలి అని వివరించింది. అంతేకాకుండా వ్యవసాయ సంబంధిత ఆస్థిపై పన్నుని విధిస్తూ ఆ ఆస్థి తాలూకూ బేరసారాలపై కేపిటల్ గెయిన్స్ పన్నుని విధించాలని సూచించింది. దీంతోపాటుగా, వ్యవసాయ హోల్డింగ్ పన్ను (Agrl. Holding Tax) ని ప్రవేశపెట్టాలి.

కె.యన్. రాజ్ కమిటి సూచనలననుసరించి కేంద్రప్రభుత్వం ఆదాయపు పన్ను నిర్మాణతలో కొంతవరకు (Partial) వ్యవసాయాదాయ మరియు వ్యవసాయేతర ఆదాయాలను 1973 నుండి సమ్మిళితం చేస్తోందని చెప్పవచ్చు. ఈ విధానంలో పన్ను ఎగవేతని అరికట్టడానికే కాకుండా వ్యక్తిత్వ ఆదాయపు పన్నులో సమానత్వాన్ని (Equity) ని పెంపొందింపచేయడానికి ఉపకరించింది. ఎప్పుడైతే యిలా రెండు ఆదాయాలు సమ్మిళితం చేయబడ్డాయో అప్పుడు ఆ మొత్తం ఆదాయానికి అధిక పన్నురేటు పడుతుంది. అయితే ఒక వ్యక్తికి పన్ను చెల్లించవలసిన (Taxable) వ్యవసాయేతర ఆదాయం లేకపోతే ఆ వ్యక్తి తన వ్యవసాయాదాయంపై పన్ను చెల్లించనవసరం లేదు. అయితే వ్యవసాయ ఆదాయపు పన్ను అమలులో వుంటే తప్ప.

13.3.6 పరోక్ష పన్నుల విచారణ కమిటి : యల్.కె. ఝా - జూలై 1976 :

భారతదేశంలాంటి అల్పాభివృద్ధి దేశంలో ఆరోగ్యవంతమైన మరియు సమర్థవంతమైన పరోక్ష పన్నుల విధానం అవసరం అయివున్నది. ముఖ్యంగా దేశం యొక్క రెవెన్యూ లక్ష్యాల కనుగుణంగాను మరియు ఆర్థికాభివృద్ధికి అనుకూలంగాను పరోక్ష పన్నుల విధానం ఉండవలసిన అవసరం ఉంది. 1950 దశకంలో జాన్ మథాయి అధ్యక్షతన దేశంలో ప్రత్యక్ష పన్నులు ఎట్లా వుండాలో ఇదివరకే పునఃసమీక్ష చేయడం జరిగింది. పరోక్ష పన్నుల విధాన పరంగా ప్రభుత్వం ఎన్నో సమస్యల నెదుర్కోవడం వల్ల జూలై 1976 లో యల్.కె. ఝా అధ్యక్షతన పరోక్ష పన్నుల విచారణ సంఘాన్ని (Indirect Taxation Enquiry Committe, 76) ఏర్పాటు చేయడం జరిగింది. ప్రత్యక్ష పన్నుల విచారణ సంఘం కూడా పరోక్ష పన్నుల విధానాన్ని అధ్యయనం చేసింది. అయితే అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఆ కారణంచే యల్.కె. ఝా కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.

కేంద్ర, రాష్ట్రాల మరియు స్థానిక ప్రభుత్వాల పరోక్ష పన్నుల విధానాన్ని పునఃపరిశీలించి భారతదేశంలో వనరుల యొక్క అభిలషణీయ పంపిణి ఎట్లా జరిగే వీలుందో యల్.కె. ఝా కమిటి చూడవలసి వుంది. విలువ ఆధారిత పన్ను (Value Added Tax, VAT) ని విధించడానికి సానుకూలత గురించి వివరించి దానియొక్క అమలుకి మార్గాలు సూచించడం కూడా ఈ కమిటి యొక్క లక్ష్యంగా వుంది. అలాగే ఎక్సైజ్ డ్యూటీలమీద, దిగుమతి సుంకాలమీద సూచనలు యివ్వవలసి వుంది. మొత్తం పన్ను విధాన నిర్మాణతలో ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల మధ్య సమతౌల్యం ఎట్లా వుండాలో కూడా నిర్ణయించవలసి వుంది.

ఈ కమిటి తన చివరి రిపోర్టుని అక్టోబరు 1977 లో ప్రభుత్వానికి సమర్పించింది. పరోక్ష పన్నుల వాటా శాతం మొత్తం పన్నుల ఆదాయంలో క్రమంగా పెరుగుతూ వస్తోందని ఈ వాటా అభివృద్ధి చెందిన దేశాలలోని వాటా శాతాలతో పోలిస్తే చాలా ఎక్కువ. ఇతర కొన్ని అల్పాభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే కూడా ఈ శాతం భారతదేశంలో ఎక్కువ. యల్.కె. ఝా కమిటి వ్యాఖ్యానించింది. అయితే ప్రత్యక్ష, పరోక్ష పన్నులమధ్య ఏది అభిలషణీయమైన శాతం అని నిర్ణయించడం కష్ట సాధ్యం అని అభిప్రాయపడింది. ఒక్క ప్రభుత్వమే ఈ విషయంమీద తీర్పునివ్వగలదు అని కూడా యల్.కె. ఝా కమిటి వివరణ యిచ్చింది. అయితే పరోక్ష పన్నులకి లక్షణాలుగా, ఆదాయం తగినంత వసూలు అవసరం; పన్నుభారం పురోగామిగా వుండటం, సులభతరంగాను, ఖచ్చితంగాను, ఎకానమీగాను మరియు ప్రజలకు చికాకులు (Harassment) కలిగించని విధంగాను ఉండాలని ఈ కమిటి పేర్కొంది.

ఈ కమిటి సూచనలలో ముఖ్యమైనవి ఏమిటంటే అమ్మకపు పన్ను (Sales Tax) పరంగా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు వర్తించేదిగా ఒక చట్టాన్ని రూపొందించాలని సూచన చేసింది. అయితే ఎక్సైజ్ డ్యూటీని అమ్మకపు పన్నుగా మార్చడానికి మాత్రం ఈ కమిటీ అంగీకరించలేదు. అంతేకాకుండా విలువ ఆధారితపన్ను ఎక్సైజ్‌పన్నుకి మరియు అమ్మకపు పన్నుకి ప్రత్యామ్నాయంగాదని ఈ కమిటి అభిప్రాయపడి ఈ విలువ ఆధారిత పన్నుని కొన్ని ప్రత్యేకమైన ఉత్పాదక వస్తువులపై విధించాలని ప్రభుత్వానికి సూచించింది. అది కూడా ఎప్పుడంటే పరోక్షపన్నులను ఆధునీకరించి (Rationalise) చేసిన తర్వాత మాత్రమే అని కూడా అంది.

ఈ కమిటి ఆక్ట్రాయిపన్ను నిరుపయోగమని మరియు కోరతగ్గ (Desirable) పన్నుకాదని ఎందుకంటే వస్తువుల యొక్క గమనశీలతని అడ్డుకుంటుందని ఈ కమిటి వ్యాఖ్యానించింది. ప్రజలమీద భారం ఎక్కువ చేస్తుందని అందుచేత వ్యాయబద్ధమైంది కాదు అని వివరించింది. ఈ పన్నుని టర్నోవర్ పన్నుక్రింద మార్చి అమ్మకపు పన్నుతో అనుసంధానం చేసి స్థానిక సంస్థలకి అందజేయాలని అన్నది.

ఎక్సైజ్ డ్యూటీలను ఆధునీకరించి (Rationalise) ఒకే రకమైన (Uniform) రేటు విధించమని సూచించింది.

కేంద్రప్రభుత్వం అనేక చర్యలలో భాగంగా యల్.కె. ఝా కమిటి సూచనల ననుసరించి MODVAT (or MANVAT) ని ప్రవేశపెట్టింది. దీంతో పన్ను రిఫండ్ విధానాన్ని అనేక ముఖ్యమైన పరిశ్రమలకు వర్తింపజేయడం జరిగింది. దీంతో ముడిసరుకులమీద ఎక్సైజ్ డ్యూటి విధింపు కారణంగా ఉత్పత్తి ఖర్చు (Cost of Production) మరియు ధరలపై కాస్కేడింగ్ (Cascading) ప్రభావం వుండదని ప్రభుత్వం యొక్క భావన.

13.3.7 ఛోక్సీ కమిటి రిపోర్ట్ (Choksi Comittee Report, 1977) :

ప్రత్యక్ష పన్నుల ముఖ్యమైన ఆదాయపుపన్ను, సర్‌ఛార్జి, సంపదపన్ను మరియు బహుమతి పన్నుల పరంగా సూచనలను చేయడానికై జూన్ 1977 లో సి.సి. ఛోక్సీ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేయడమైనది. ఈ కమిటి ఈ పన్నులను ఆధునీకరించి (Rationalise) ప్రజలపరంగా సులభతరం (Simple) చేయవలసిందిగా ప్రభుత్వం కోరింది. అక్టోబర్ 1978 లో ఈ కమిటి రెండు వాల్యూమ్‌లలో, 260 సూచనలలో (Recommendations) తన రిపోర్టుని సమర్పించింది.

ఈ కమిటి సూచనలలో ముఖ్యమైనది ఏమనగా ఆదాయ పన్ను, సర్‌ఛార్జి, సంపద పన్ను మరియు బహుమతి పన్నులను సమ్మిళితం చేసి ఒకే పన్నుగా దశలవారిగా విధించాలని సూచించింది. జాతీయస్థాయిలో "కేంద్రీయ పన్ను న్యాయస్థానాన్ని (Central Tax Court) స్థాపించాలని అన్నది. అలాగే వ్యవసాయ మరియు వ్యవసాయేతర ఆదాయాలను కలిసి పన్ను క్రిందకు తీసుకురావడమనే ప్రక్రియని రద్దుపరచకుండా కొనసాగించాలని కోరింది. ఆదాయపు పన్నురేట్లను ప్రతీ సం॥ము పార్లమెంటు ప్రకటించడం కాకుండా ప్రత్యక్షపన్నుల జాబితాలో ఆదాయపు పన్నురేట్లను చేర్చమని వివరించింది. ఆదాయపుపన్ను పరిమితి 60 శాతానికి పెంచి సర్‌ఛార్జి ఈ రేటులో విలీనం చేయమని ప్రభుత్వానికి సూచించింది. ఛోక్సీ కమిటి ఆదాయపు పన్నురేట్లను తగ్గించడం వల్ల పన్ను ఆదాయం అధికం అవుతుందని అంచనావేసింది. అయితే ఈ కమిటి నల్లధన సమాంతర (Parallel) ఆర్థిక వ్యవస్థ మరియు దాని దోషాల గురించి చర్చించలేదు.

13.3.8 పన్ను నిర్మాణతపై సవరణలు - రాజా చెల్లయ్య కమిటి రిపోర్టు - ఆగస్టు 1991
(Tax Structure Reforms : Report of the Raja Chellaiah Committee on Tax Reforms August, 1991.)

ఆగస్టు 1991 లో కేంద్రప్రభుత్వం డా॥ రాజాచెల్లయ్య ఆధ్వర్యంలో పన్ను సవరణల కమిటీనొకదానిని ఏర్పాటుచేసి ప్రత్యక్ష పరోక్ష పన్నుల వ్యవస్థలో సమూలమైన మార్పులు చేయవలసిందిగా ఈ కమిటీని ఆదేశించింది. రాజా చెల్లయ్య కమిటి ఫిబ్రవరి 1992 లో తన మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ కమిటి లక్ష్యాలు ముఖ్యంగా ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల వ్యాకోచత్వాన్ని మెరుగుపరచి ప్రత్యక్షపన్నుల, మొత్తం పన్ను ఆదాయంలో, శాతాన్ని మరియు స్థూల దేశీయోత్పత్తిలో శాతాన్ని పెంచే దిశగా తగు సూచనలు చేయడం. అంతేకాకుండా భారతదేశ పన్ను వ్యవస్థను న్యాయబద్ధంగాను (Fairer) మరియు విస్తృతమైంది (Broader) గాను చేయడం ఈ కమిటి లక్ష్యంగా వున్నది. MODVAT ని విస్తృతపరచడం, క్రొత్త పన్నులను సూచించడం, దిగుమతి సుంకాలను సులభతరం చేయడం, ప్రత్యక్షపన్నులను ఆధునీకరించడం మొదలైనవి లక్ష్యాలుగా వున్నాయి.

ఈ కమిటి తన సూచనలలో పన్నురేట్లు తగ్గింపు, స్వల్ప మినహాయింపులు మరియు తగ్గింపులు (deductions) మొదలైన వాటి గురించి ముఖ్యంగా వివరించింది. ఇవి ప్రత్యక్ష పన్నుల విషయంలో పరోక్షపన్నుల విషయంలో కూడా సాధారణ టారిఫ్ స్థాయిలో తగ్గింపు వుండాలని, టారిఫ్ రేట్లలో విస్తృతి (Dispersion) వుండాలని, చివరి ఉపయోగంపై (End-Use) మినహాయింపులు మరియు రాయితీలను రద్దుచేయాలని రాజా చెల్లయ్య కమిటి సూచించింది. ఈ రిపోర్టు పన్ను నిర్మాణతలో స్థిరత్వాన్ని మరియు హేతుబద్ధతని (Rationality) గురించి నొక్కి వక్కాణించింది. అంతేకాకుండా పన్ను అమలుచేసే యంత్రంగాన్ని పటిష్టపరచడమే కాకుండా దానిని ఆధునీకరించి పన్ను అమలుని మెరుగుపరచవలసి వుందని ఈ కమిటి వివరించింది. రాజా చెల్లయ్య కమిటి చేసిన సిఫారసులను కేంద్రప్రభుత్వం 1992-93 బడ్జెట్‌లో అమలు చేసింది. ఇవి ముఖ్యంగా ఆదాయపు పన్నులో మార్పులు మరియు సంపద పన్ను, కేపిటల్ గెయిన్స్ పన్ను ఎక్సైజ్‌డ్యూటీ, దిగుమతి సుంకాల పరంగా మార్పులు ఈ బడ్జెట్‌లో చేయడం జరిగింది. 1993-94 బడ్జెట్‌లో కూడ చెల్లయ్య కమిటి సూచనలు ఎక్సైజ్ డ్యూటి, దిగుమతి సుంకాలపరంగా మార్పులు చేయడం జరిగింది.

భారతదేశ ఆర్థికవ్యవస్థ నిర్మాణతలో సవరణలలో పన్ను సవరణలు ఒక ముఖ్య భాగమైపోయాయి. దీనిలో భాగంగా అనుసరించిన వ్యూహం ఏమనగా సులభతరమైన పన్ను విధానాన్ని ఎక్కువకాని, తక్కువకాని (Moderate) రేట్లతో అనుసంధించి తక్కువ మినహాయింపులలోను మరియు విస్తృతమైన టాక్స్‌బేస్‌తో భారతదేశ పన్ను నిర్మాణత రూపుదిద్దుకుంది. అయినప్పటికి, ప్రత్యక్ష, పరోక్ష పన్నులమధ్య వ్యత్యాసం తగ్గివున్నప్పటికి పరోక్ష పన్నులు మొత్తం ఆదాయంలో 71 శాతాన్ని సమకూరుస్తున్నాయి. ముడిసరుకులమీద చెల్లించిన పన్నులకు క్రెడిట్ యిచ్చే పద్ధతికి MODVAT (Modified Value Added Tax or Manufacture Value Added Tax, MANVAT) ద్వారా శ్రీకారం చుట్టబడింది 1994-95 బడ్జెట్‌లో. ఈ MODVAT అనే వస్తూత్పత్తి పన్నువిధానం (Commodity Taxation) పూర్తిస్థాయి విలువ ఆధారిత పన్నుగా రూపాంతరం చెందింది. ఈ క్రొత్త పన్ను అనగా VAT (Value Added Tax) ఏప్రియల్, 2005 నుండి భారతదేశంలో అమలు జరపబడుచున్నది. ఇది ఒక ఏకీకృత పన్ను విధానం.

ఈ పన్ను విధానం వలన రాష్ట్రాలకు కలగబోయే నష్టాన్ని కేంద్రప్రభుత్వమే భరిస్తుంది. అనగా మొదటి సం॥లో ఏర్పడే నష్టాన్ని భరిస్తుందన్నమాట.

పార్ట్ - II

13.4 భారతదేశ ఆర్థికవ్యవస్థపై పన్ను విధాన ప్రభావం

పన్నులు విధించడం వలన ఆర్థికవ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ మార్పులు మంచిగా వుండొచ్చు లేదా చెడు ప్రభావాన్ని చూపవచ్చు. ఈ పన్నువిధానం నియంత్రించబడిన మార్కెట్టు వ్యవస్థని తయారు చేస్తుంది. అంటే మార్కెట్టుని దాని మానాన అది సప్లై మరియు డిమాండులను సమతౌల్యస్థితిలో వుంచే పరిస్థితి తారుమారు అవుతుంది. అయితే పన్ను విధానం ద్వారా రెవెన్యూని ప్రభుత్వం సమీకరించడమేకాక ఆర్థిక-సామాజిక లక్ష్యాలను నెరవేర్చడానికి ఈ పన్ను విధానం సాధనంగా కూడా ఉపయోగపడుతుంది. ఈ లక్ష్యాలు ఏంటంటే వినియోగాన్ని మరియు ఉత్పత్తిని ప్రజావసరాలకనుగుణంగా నియంత్రించడం, ఆర్థికమాంద్యాన్ని అదుపుచేయడం, ఆర్థికవృద్ధిని సాధించి ఆదాయ అసమానతలను తొలగించడం. అయితే ప్రభుత్వం రెవెన్యూ సంబంధ విషయాలనే దృష్టిలో వుంచుకొనకుండా దేశ ఆర్థికవ్యవస్థపై పన్నుల ప్రభావాన్ని కూడా దృష్టిలో వుంచుకుని పన్ను విధానాన్ని రూపొందించాలి. హెచ్. డాల్టన్ మాటల్లో చెప్పాలంటే "ఆర్థిక విషయాలపరంగా ఏ పన్ను విధానం మంచి (best) దంటే దేనిద్వారా అయితే మంచి ఫలితాలు, అధంపక్షం అత్యల్ప చెడు ఫలితాలు, చూపుతుందో ఆ పన్ను విధానాన్ని అవలంబించాలి" అని వ్యాఖ్యానించాడు. అయితే లైజెఫెయిర్ (Laissez Faire) సిద్ధాంత ప్రభావంలో కొందరు ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రభుత్వం" తటస్థ పన్ను విధానం (Neutral Tax Policy) ని అవలంబించాలి. అంటే మార్కెట్టు వ్యవస్థలో ఒడిదుడుకులు రాకుండా (Market Distortions) పన్ను విధానాన్ని రూపొందించాలని అన్నారు. (Bernad P. Herber, 1967 p. 213) అంటే అభిలషణీయ వనరుల పంపిణి ప్రక్రియకి విఘాతం కలగని పన్ను విధానాన్ని అవలంభించాలి. ప్రపంచ దేశాలలో 1930 తర్వాత పతనం చెందింది ఈ మార్కెట్టు వ్యవస్థ. దీంతో సంపూర్ణ పోటి పరిస్థితుల స్థానే అసంపూర్ణ పోటి పరిస్థితులు స్థానాన్ని పొందాయి. ఈ పరిస్థితికి భారతదేశం మినహాయింపు కాదు. దీంతో ప్రభుత్వపాత్రకి అధిక ప్రాధాన్యం వచ్చి ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం ఏర్పడింది. దీనికొరకై అధిక మొత్తంలో రెవెన్యూ కావలసి వచ్చింది. ఈ కారణాల వల్ల ప్రభుత్వ పన్ను విధానం ఎంతమాత్రం ఆర్థిక వ్యవస్థని ప్రభావితం చెయ్యకుండా "తటస్థంగా" ఉండజాలదు. (OHO Eckotein, Chap. 6) పన్ను విధానానికి ఫలితాల రూపంలో ఆర్థిక వ్యవస్థలోకి పూర్తిగా చొచ్చుకొనిపోయే లక్షణం వున్న కారణంగా ఆర్థికవ్యవస్థని నియంత్రించడంలోనూ మరియు అదుపుచేయడంలోనూ పన్ను విధానం ఒక సమర్థవంతమైన సాధనంగా ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. దీంతో దేశంలో వినియోగం, పెట్టుబడి, పాదుపు ఉత్పత్తులు ప్రభావితం అవుతాయి. అయితే యిక్కడ గుర్తుపెట్టుకోవలసిన విషయం ఏమిటంటే ప్రభుత్వ పన్ను విధానం ద్వారా మార్కెట్టు వ్యవస్థని సరియైన మార్గంలో అంటే సమాజానికి ఉపయోగపడే మార్గంలో పెట్టడం మరియు దానిని నియంత్రించడం అనే విధులను నిర్వర్తిస్తుంది.

హెచ్. డాల్టన్ పన్ను ప్రభావాన్ని ఈ క్రింది వర్గాలుగా విభజించి చర్చించాడు అవి. (i) ఉత్పత్తి ప్రక్రియపై పన్ను ప్రభావం, (ii) పంపిణి వ్యవస్థపై పన్ను ప్రభావం మరియు (iii) ఇతర ఫలితాలు

13.4.1 ఉత్పత్తి ప్రక్రియపై మరియు ఆర్థిక వృద్ధిపై పన్ను ప్రభావం :

ఉత్పత్తి ప్రక్రియపై మరియు ఆర్థికవృద్ధిపై పన్ను ప్రభావాన్ని డాల్టన్ ఈ క్రింది విధంగా విభజించాడు. అది :

(a) పని, పాదుపు మరియు పెట్టుబడుల పరంగా సమర్థతపై పన్ను ప్రభావం (b) పని, పాదుపు మరియు పెట్టుబడుల పరంగా కోరికపై పన్ను ప్రభావం, మరియు (c) వినియోగం మరియు ఉత్పత్తి విధానాలపై పన్ను ప్రభావం.

(a) పని, పొదుపు, మరియు పెట్టుబడుల పరంగా సమర్థతపై (ability) పన్ను ప్రభావం :

పన్ను విధించడమంటే ప్రజలవద్ద నుండి కొనుగోలు శక్తి ప్రభుత్వానికి తరలించడమే. అంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గించడం అన్నమాట. దీంతో పన్ను చెల్లించే వ్యక్తి వస్తువులను కొనుగోలు చేసేటటువంటి శక్తిని పన్ను చెల్లించిన మేర కోల్పోతాడు. ముఖ్యంగా పేద ప్రజలలో ఈ ప్రభావం తీవ్రంగా వుంటుంది. అదే ధనికవర్గం అయితే పన్నుల ద్వారా వారియొక్క పనిచేసే శక్తిని సాపేక్షికంగా పేదవర్గం ప్రజలంత కోల్పోరు. ఎందుకంటే పన్నులు మూలంగా ధనికులు విలాసవంత వస్తువుల వినియోగం తగ్గిపోతుంది. అంతే తప్ప వారి పనిచేసే సమర్థత తగ్గిపోదు. అందుచేత పేద ప్రజలపై అధిక పన్నులు విధించిన వారి పనిచేసే శక్తి సన్నగిల్లుతుంది. ఎందుకంటే వారి జీవన ప్రమాణస్థాయి తగ్గటంవలన వారు పనిచేసే శక్తి కోల్పోతారు. అయితే అన్ని రకాల పన్నులు ప్రజలయొక్క పనిచేసే శక్తిని తగ్గించి వేయవు. ముఖ్యంగా మత్తుపానీయాలు, నల్లమందు మొదలగు వాటిమీద పన్నులు అధికంగా వేయడం వలన ప్రజల పనిచేసే శక్తి పెరుగుతుంది.

అలాగే పన్ను విధింపు ద్వారా ఆదాయం తగ్గితే, పొదుపు కూడా తగ్గిపోతుంది. వ్యక్తుల ఆదాయాలపై పన్ను విధింపు అధికం చేయడంద్వారా పొదుపు చేయగలిగే శక్తి వున్న వ్యక్తులు తమ పొదుపుని తగ్గించివేస్తారు. కాబట్టి, ధనికులపై పన్ను విధించినట్లైన దేశానికి అత్యంత కీలకమైన పొదుపును కోల్పోయే ప్రమాదముంది. దీంతో పెట్టుబడి చేసే శక్తి కూడా నశిస్తుంది. అయితే ఈ విషయాలు అనగా పన్ను ప్రభావాలను దేశంమీద అంచనా వేసేటప్పుడు అదే సమయంలో ప్రభుత్వ వ్యయం యొక్క ప్రభావాన్ని అంచనా వేసినట్లైతే పని, పొదుపు, మరియు పెట్టుబడులు చేసే శక్తి అంతగా కోల్పోవడం జరగదు.

(b) పని, పొదుపు మరియు పెట్టుబడుల పరంగా కోరికపై (Desire) పన్ను ప్రభావం :

పన్ను విధింపుద్వారా ప్రజలయొక్క పని, పొదుపు మరియు పెట్టుబడులపై కోరిక సన్నగిల్లుతుంది. ఎందుకంటే పన్నువలన ప్రోత్సాహకాలు (Incentives) నశిస్తాయి. ఎప్పుడైతే యిటువంటి కోరిక మరియు ప్రోత్సాహకాలు నశిస్తాయో అప్పుడు ఉత్పత్తిపై చెడు ప్రభావాన్ని చూపవచ్చు. అయితే ఈ ప్రభావం పన్నుయొక్క స్వభావాన్ని (Nature) బట్టి మరియు పన్ను చెల్లించే వారియొక్క మానసిక స్పందన (Psychological reaction) పై ఆధారపడి వుంటుంది.

పన్ను స్వభావం :

పన్ను విధానం యొక్క ముఖ్యలక్ష్యం ఏమిటంటే ప్రజలని కష్టపడి పనిచేసే దిశగాను మరియు ఎక్కువ పొదుపు చేసే విధంగా ప్రోత్సహించడమే. అయితే పన్నుకి పన్నుకి మధ్యన ప్రజలమీద వాటి ప్రభావాలలో తేడా వుంటుంది. కొన్ని పన్నులకు మంచి ఫలితాలు ఇచ్చే పరిస్థితి వుంటే మరికొన్ని పన్నులు చెడు ప్రభావాన్ని చూపుతాయి. ఉదా॥ కి గాలివాటు (wind fall) గా వచ్చే ఆదాయం అంటే అనుకోకుండా లభించిన లాభాలపరంగా ఆదాయంపై పన్ను, వారసత్వపు పన్ను, ప్రత్యేక ఎసెన్‌మెంట్స్, మొదలైనవి పని, పొదుపు పెట్టుబడుల పట్ల ప్రోత్సాహాకాల్ని నశింపజేయురు. అంటే ఈ పన్నులవలన ఉత్పత్తి స్తంభించదు. అలాగే యోగ్యమైన (Reasonable) వస్తుపన్ను విధానం అంటే ఎక్సైజ్ డ్యూటీలు మరియు అమ్మకపు పన్నుల వలన చెడు ఫలితాలు అంతగా ఉండవు. అందుచేత అధికపన్నులు ఈ వస్తుపన్ను విధానం (Commodity Taxation) లో విధించరాదు. ఇంకా ప్రత్యక్ష పన్నులైన ఆదాయపు పన్ను మరియు సంపద పన్నులు ప్రజలయొక్క పని, పొదుపు మరియు పెట్టుబడి చేయాలనే కోరికని గట్టిగా దెబ్బతీస్తాయి. అధికపురోగామి ఆదాయపు పన్ను విధానం వలన పనిచెయ్యాలనే కోరిక సన్నగిల్లుతుంది. అయితే సంపద పన్ను మూలంగా ఆదాయపు పన్నుతో పోలిస్తే పెద్దగా చెడు ఫలితాలుండవు. దేనిమీదనంటే పనిపట్ల, కోరికపట్ల. అయితే పొదుపుపట్ల కోరిక ఈ సంపద పన్ను వల్ల చెడినట్లుగా ఆదాయపు పన్నులో చెడు ఫలితాలుండవు. ఈ ఫలితాల విషయంగా, ఆదాయపు పన్నుతో పోలిస్తే వారసత్వపు పన్ను ద్వారా చెడు ఫలితాలు తక్కువే. ఎందుకంటే ఆదాయపు పన్నులో వ్యక్తి తన ప్రస్తుత ఆర్జించిన ఆదాయం నుండి పన్నును చెల్లిస్తే వారసత్వపు పన్ను విషయంలో ఒక వ్యక్తికి సంక్రమించిన సంపదనుండి చెల్లిస్తాడు. అందుచేత వారసత్వపు పన్నుద్వారా చెడు ఫలితాలు పెద్దగా వుండవు.

అలాగే వ్యయాలపై పన్ను (Expenditure Tax) కూడా ఆదాయపు పన్నుతో పోలిస్తే చెడు ఫలితాలనివ్వదు. పనిపట్ల మరియు పొదుపు పట్ల కోరిక పెద్దగా ప్రభావాన్ని చూపదు. పురోగామి వ్యయపన్ను విధానం ద్వారా అనవసర వినియోగం తగ్గి పొదుపు మరియు పెట్టుబడులు ప్రోత్సహించబడతాయి. అందుచేత, పురోగామి ఆదాయపు పన్నుద్వారా పని, పొదుపు, పెట్టుబడులపట్ల కోరికకు విఘాతం కలుగుతుంది. అలాగే సంపద పన్ను మరియు ఆస్థి పన్ను.

పన్నుల యొక్క స్వభావంలో మార్పువుంటే, వాటియొక్క ప్రభావంతో కూడా తేడా వుంటుంది. అంటే పని, పొదుపు మరియు పెట్టుబడుల కోరికపై దాని ప్రభావం వుంటుంది. సమాగమి (Proportional) పన్ను విధానంతో పోలిస్తే పురోగామి పన్ను విధానంలో పనిపట్ల కోరిక ఎక్కువగా సన్నగిల్లే అవకాశం వున్నది. తిరోగామి (Regressive) పన్ను విధానంలో పనిపట్ల కోరిక బాగా పెరుగుతుంది. ఎందుకంటే ఆదాయం పెరుగుతుంటే పన్ను తక్కువ చెల్లించే అవకాశం వుండడం వల్ల నిత్యావసర వస్తువులపై పన్నులు తిరోగామిగా వుంటాయి. మరి విలాసవంతో వస్తువులపై పన్నులు పురోగామి (Progressive) గా వుంటాయి. అయితే విలాసవంత వస్తువులు ఖాళీ (Leisure) సమయాలని అనుభవించడానికి ఉపయోగపడే వస్తువులు నిత్యావసర వస్తువులు జీవనాన్ని కొనసాగించడానికి (Means of Subsistence) ఉపకరించే వస్తువులు. రిచర్డ్ మస్‌గ్రేవ్ (Richard Musgrave) ప్రకారం పనిపట్ల విముఖత నిత్యావసర వస్తువులపై పన్నుపరంగా చెప్పుకోదగినంత పెద్దగా వుండదని. అయితే విలాసవంత వస్తువులపై పన్ను మూలంగా పనిపట్ల విముఖత ఎక్కువగా వుంటుందని వివరించాడు.

పన్ను చెల్లించే వారి మానసిక స్పందన (Psychological Reaction of Tax Payers) :

పన్ను చెల్లించేవారి మానసిక స్పందనని ఎ.సి. పిగూ (A.C. Pigou) "పన్ను విధాన ప్రకటన ప్రభావం" (Announcement Effect of Taxation) అని పిలవడం జరిగింది. దీని అర్థం ఏమిటంటే ప్రతి పన్ను చెల్లించే వ్యక్తి పన్నుభారం వలన మానసికంగా దెబ్బతింటాడు. ఎందుకంటే పన్ను విధించిన వెంటనే అతని ఆదాయం తగ్గిపోతుంది. కాబట్టి ఆ వ్యక్తియొక్క మానసిక స్థితి మారుతుంది. దాంతో పనిపట్ల మరియు పొదుపుల పట్ల విముఖత కల్గుతుందనడంలో సందేహం లేదు. దీనినే 'ప్రకటన ప్రభావం' అని అంటారు. అయితే ఈ ప్రభావం వ్యక్తినుండి వ్యక్తికి మారుతుంది.

పై విషయాన్ని వనరుల పంపిణి ప్రభావం ద్వారాను మరియు వనరుల సప్లైలో మార్పుల ద్వారాను తెలుసుకుందాము.

13.4.1.1 పంపిణి ప్రభావం - వేర్వేరు పన్నులు (Allocative Effects of Different Taxes) :


మార్కెట్ వ్యవస్థ వనరులయొక్క అభిలషణీయమైన పంపిణి (Optimum Allocation of Resources) కి పాటుపడుతుంది. అయితే దీనికి కొన్ని పరిస్థితులు వుంటేనే తప్ప ఈ పంపిణి జరగదు. అవి (i) సంపూర్ణ పోటి పరిస్థితులు, (ii) ఉత్పత్తి కారకాల సంపూర్ణ గమనశీలత (iii) సంపూర్ణ జ్ఞానం మొదలైనవి. వీటితో ఉత్పాదక వనరులు అభిలషణీయంగా పంపిణి అవుతాయి. ఈ పంపిణి వెనుక ఆదాయ సంపదలు కూడా అభిలషణీయంగా వుండాలి. లేనట్లైతే వనరుల అభిలషణీయ పంపిణి జరగనట్లేనని గుర్తుపెట్టుకోవాలి. దీంతోపాటుగా మార్కెట్లలో అసంపూర్ణ పోటి పరిస్థితులుంటే కూడా వనరుల పంపిణిని అభిలషణీయమని గుర్తించజాలము. మార్షల్ వనరుల యొక్క ఉప-అభిలషణీయస్థితి (Sub-optimal) ని గుర్తించాడు. మార్షల్ వినియోగదారుని మిగులు (Consumers Surplus) పై పన్నుయొక్క ప్రభావాన్ని అంటే పన్ను వసూళ్ళను పోల్చడం ద్వారా వనరుల అభిలషణీయ పంపిణిని అధ్యయనం చేయడానికి ప్రయత్నించాడు. ఉదా॥కి వినియోగదారుని మిగులులో నష్టం ప్రభుత్వం వసూలు చేసిన పన్ను ఆదాయం కన్నా తక్కువగా ఉంటే పన్ను విధించిన పరిశ్రమనుండి పెట్టుబడి తరలిపోతే అది సమాజానికి ఉపయోగపడే ఫలితం. దీనివలన వనరుల అభిలషణీయ పంపిణి దిశగా ప్రయాణించినట్లు అవుతుందని చెప్పవచ్చు. దీంతో మార్షల్ యిట్లా అన్నాడు. "క్షీణ ప్రతిఫలాలు అనుభవిస్తున్న పరిశ్రమపై పన్ను విధించి, పెరుగుతున్న ప్రతిఫలాలు ఉన్న పరిశ్రమకి సబ్సిడీలు ఇచ్చి, స్థిర ప్రతిఫలాలు ఉన్న పరిశ్రమకి ఏ చర్య తీసుకోకుండా, అంటే అటు పన్నుకాని, ఇటు సబ్సిడీకాని విధించకపోవడమన్నమాట", పన్ను విధానముండాలి అని మార్షల్ అనడం జరిగింది. అలాగే వస్తూత్పత్తిపై ప్రత్యేక పన్నులు మరియు ఎడ్వెలోరెమ్ (Advalorem) పన్నుల ప్రభావం వేర్వేరుగా వుంటుంది.

డాల్డన్ ప్రకారం ఆలోచించినట్లయితే ఒక వస్తువుకి వున్న డిమాండ్ వ్యాకోచత్వం ఆధారంగా పన్ను ప్రభావాన్ని అంచనా వేయచ్చు. డిమాండ్ వ్యాకోచత్వం అధికంగా ఒక వస్తువుకున్నట్లైన అటువంటి వస్తువుపై పన్ను విధించిన లేక పన్నురేటు అధికం చేసిన పన్ను ప్రభావం అధికంగా వుంటుంది. అలాకాక, డిమాండ్ వ్యాకోచత్వం స్వల్పంగా వుంటే పన్ను ప్రభావం అంతగా వుండదు. వనరుల అభిలషణీయ పంపిణి ఒక వస్తువుయొక్క డిమాండ్ వ్యాకోచత్వంపై ఆధారపడివుంటుంది. పన్ను వ్యవస్థలో డిమాండ్ వ్యాకోచత్వం వున్న పరిశ్రమపై పన్ను విధిస్తే, ఉత్పత్తి తగ్గి పెట్టుబడి ఇతర మార్గాలవైపు ప్రయాణిస్తుంది. అలాగే సప్లై వ్యాకోచత్వం ఎక్కువగా ఉంటే అటువంటి వస్తువుపై పన్ను విధిస్తే పన్ను ప్రభావం అధికంగా వుంటుంది. సప్లై వ్యాకోచత్వం తక్కువగా ఉంటే పన్నురేటు అటువంటి వస్తువుపై పెద్ద ప్రభావాన్ని చూపదు. కొన్ని వస్తువులపైనున్న డిమాండ్ లేక సప్లై వ్యాకోచత్వం వుంటే అటువంటి వస్తువులపై పన్ను ప్రభావం వుండదు. దీంతో వనరుల పంపిణిపై కూడా ఏ విధమైన ప్రభావం వుండదు. ఇదంతా ఎందుకంటే పరోక్ష పన్నుల విధానంలో ఈ అంశాలన్ని పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

పంపిణి ప్రభావాన్ని చర్చించేటప్పుడు పరోక్షపన్నుల ప్రభావం ఆదాయ పంపిణిపై ఎట్లా వుంటుందో అధ్యయనం చేయవలసివుంది. పరోక్ష పన్నులు ద్రవ్యోల్బణ ప్రేరకాలుగా పనిచేస్తాయి. ఎందుకంటే ఈ పన్నులు ఆదాయ సంపద వ్యత్యాసాలను పెంచుతాయి. ఈ పన్నులు తిరోగామిగా వుంటాయి. దీనివలన, విలాసవంత వస్తువులపై డిమాండ్ పెరుగుతుంది. అయితే ఒక అభివృద్ధి చెందుతున్న దేశం ఈ వస్తువుల తయారి తట్టుకుని నిలబడలేదు. వనరులన్ని ఈ విలాసవంత వస్తూత్పత్తికై తరలిపోతాయి. పరోక్ష పన్నులను ఎన్నిక చేసుకున్న వస్తువులపై విధించవలసి వుంటుంది. భారతదేశానికి ఈ విధమైన పరోక్ష పన్ను విధానం ఎంతైనా సరిపోతుంది.

పరిశ్రమల మధ్యన పంపిణి (Allocation) అంటే వనరుల పంపిణి ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులు పరంగా ఎట్లా వుంటుందో చూడవలసి ఉంది. అంటే పంపిణి ప్రభావాన్ని చూద్దాం (Allocative effect) దీనికొరకై సంపూర్ణ ఉద్యోగితను ఊహించుకుందాము. ఒక ప్రత్యక్ష పన్ను మరియు ఒక పరోక్ష పన్నుని తీసుకుంటున్నాము. ప్రభుత్వంకు ఈ రెండు పన్నులనుండి సమానమైన ఆదాయం వస్తోంది. అంతేకాకుండా సమాగమి (Proportional) ఆదాయపు పన్నుని మరియు ఒక వస్తువుపై పరోక్ష పన్నుని తీసుకుంటున్నాము.

ఒక వినియోగదారుడు ఎట్లా ప్రవర్తిస్తాడో ఈ క్రింది పటం ద్వారా చూద్దాము.



పటం 1 : ప్రత్యక్ష పరోక్ష పన్నుల పంపిణి ప్రభావం (Allocative Effects of Direct & Indirect Taxes)

మనం తీసుకున్న వినియోగదారుడు తనయొక్క ఆదాయాన్నంతటిని X మరియు Y అనే వస్తువులపై ఖర్చు చేయవలసి వుంది. పన్నుల ప్రభావాన్ని ఉదాసీన వక్రరేఖల ద్వారా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. పటంలో చూపినట్లుగా A_1Q_1 అనేది వినియోగదారుని యొక్క బడ్జెట్ పరిమితిరేఖ (Budget Constraint Line). ఈ బడ్జెట్ పరిమితి లేక ధర రేఖ i_1 అనే ఉదాసీనరేఖ E_1 అనే బిందువు వద్ద టాంజెంట్‌గా వుండడం చేత వినియోగదారుడు మొరటుగా సమతౌల్యస్థితిలో వున్నాడు. యిటువంటి పరిస్థితులలో ప్రభుత్వం X వస్తువుమీద పరోక్ష పన్ను విధించింది. దీంతో ధర పెరిగి యిదివరకు కన్నా తక్కువ పరిమాణంలో వస్తువుని కొంటాడు. అంటే ఇదివరకు అంటే పన్నుకి పూర్వం $O Q_1$ కొంటే యిప్పుడు పన్నువేసిన తర్వాత $O Q_3$ కొన్నాడు. వినియోగదారుని క్రొత్త సమతౌల్యస్థితి E_3 దగ్గర i_3 ఉదాసీన వక్రరేఖ మీద వుంది. వినియోగదారుని బడ్జెట్ లైన్ $A_1 Q_3$ గా వుంది. పన్నువిధించిన తర్వాత. i_3 కూడా i_1 కన్నా తక్కువ స్థాయిలో వుంది. అంటే i_3 మీద అల్ప సంతోషం వుంటుంది. అయితే ఇప్పుడు ప్రభుత్వం అదే రెవెన్యూ వచ్చే ప్రత్యక్ష పన్నుని విధించారు. (A_2 Q_2 బడ్జెట్ రేఖ క్రిందికి మళ్ళీ (Shift) A_1 Q_1 కి సమాంతరంగా వుంటుంది. క్రొత్త సమతౌల్యం E_2 దగ్గరవుంది. i_2 అనేది i_3 కన్నా ఎత్తులో i_1 కన్నా క్రిందుగా వుంది. వినియోగదారుడు $O Q_2$ వస్తుపరిమాణాన్ని వినియోగిస్తాడు. అంటే ప్రత్యక్ష పన్ను ద్వారా తక్కువ హాని వినియోగదారునికి జరిగిందన్నమాట అదే రెవెన్యూ ఇచ్చే పరోక్ష పన్ను లోపిస్తే పరోక్ష పన్నులు ప్రజలమీద అధిక బరాన్ని మోపడమే కాకుండా వనరుల అభిలషణీయ పంపిణికి దోహదపడవు. అయితే X వస్తువు అధికమొత్తంలో వనరులను ఉపయోగిస్తున్నట్లైతే పరోక్ష పన్ను X మీద విధించడం ద్వారా వనరుల అభిలషణీయంగా పంపిణి అవుతాయి. ఎందుకంటే వనరులను ఎకానమిగా వాడడం ఎప్పుడు జరుగుతుందంటే X పరిశ్రమమీద అనవసరంగా పన్నులు విధించినప్పుడు. దాంతో వనరుల పంపిణి అభిలషణీయంగా జరుగుతుంది. కాబట్టి వనరుల ఉపయోగం మెరుగుపరచాలంటే పరోక్ష పన్నులే మేలు. భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో వనరులను ప్రజోపకర ప్రాజెక్టులవైపు తరలించాలంటే ప్రత్యక్ష పన్నులకంటే పరోక్ష పన్నులే ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. అయితే సరియైనటువంటి పరోక్షపన్నులను తెలివిగా ఎన్నుకోవలసి వుంటుంది.

పరోక్షపన్నులు యింకోరకంగా ప్రత్యక్ష పన్నులకంటే మెరుగైనవి. అదేమిటంటే ప్రత్యక్ష పన్నులలో నిజమైన సమాగమి (Proportional) ఆదాయపు పన్నుని పొందటం చాలా కష్టం. అంటే ఆదాయానికి తగ్గట్టుగా పన్ను విధించడం. అయితే ప్రపంచంలో పన్ను చెల్లించే ఆదాయంపై సరియైన అర్థం లేకపోవడమే. ఉదా॥ సొంత వినియోగం (Self - Consumption) కి ఉపయోగించే ఆదాయం లెక్కవేయడం కష్టం. అలాగే మన్నిక కల్గిన వస్తువులనుండి ఆదాయాన్ని లెక్కించడం, యింకా చెప్పాలంటే ఆదాయాన్ని సంపాదించడానికై చేసిన ఖర్చులను లెక్కించడం కూడా కష్టం. అంతే కాకుండా కేపిటల్ గెయిన్స్, గాలివాటు లాభాలు, కాజువల్ ఆదాయాలు మొదలైన వాటివల్ల సమాగమి ఆదాయపు పన్నుని విధించడం కష్టసాధ్యం. అందుచేత పటం 1. ద్వారా చెప్పిన విషయం సిద్ధాంతాన్ని అర్థం చేసుకోడానికే తప్ప వేరే ఏం కాదు. అందుచేత ప్రపంచ ప్రభుత్వాలు పురోగామి ఆదాయపు పన్నుని (Progressive Income Tax) ఎక్కువగా అభిలషిస్తున్నాయి.

13.4.1.2 ప్రత్యక్ష పన్నుల పంపిణి (Allocative) ప్రభావం :

ప్రత్యక్ష పన్నులు వనరుల పంపిణి ప్రభావంవల్ల ఆదాయాల సాపేక్ష ఆకర్షణ మారుతుంది. ఉదా॥ ఒక కార్మికుడు పన్ను విధింపు వల్ల తనయొక్క ఉద్యోగితను ఒక పరిశ్రమనుండి యింకొక పరిశ్రమకు మార్చుకునే అవకాశం వుంది. దీనివల్ల పన్నుభారాన్ని తగ్గించుకునే అవకాశం వుంది. అయితే అట్లా మారినాకాని పన్నుభారం మారకపోతే కార్మికుడు పరిశ్రమని మార్చుకోడం నిరర్థకం. అలాగే ప్రత్యక్ష పన్నుల ద్వారా సాపేక్ష లాభత (Relative Profitiability) మారితే పెట్టుబడి ఎక్కడ లాభం ఎక్కువగా వస్తుందో ఆ పరిశ్రమకి తరలిస్తారు. అలాగే సాపేక్షరాబడిరేటు (Relative Rate & Return) వేర్వేరు ఆస్తులతో పన్నులవల్ల మారితే ఎక్కడైతే రేటు ఎక్కువగా వుంటుందో ఆ చోటుకి పెట్టుబడి తరలించబడుతుంది. అంటే పన్నులవల్ల లాభంకాని రాబడిరేటు గాని తగ్గితే పాదుపు చేసినటువంటి సొమ్ముని దేనిలోనూ పెట్టుబడి పెట్టక బంగారంలోనూ, భూములలోను మొదలైన ఆస్తులపై వుంచే అవకాశం వుంది. అందుచేత, రాబడిమీద పన్నులు విధించడం వల్ల పాదుపు పెట్టుబడులు తగ్గిపోతాయి.

పంపిణీ ప్రభావం : శ్రమ మరియు మూలధనం : ప్రత్యక్ష పన్నులు :

శ్రమపై ప్రత్యక్ష పన్నుల ప్రభావం :

శ్రమపై పంపిణీ ప్రభావం (Allocative Effect) ఎట్లా వుంటుందంటే వేతన ఆదాయం (Wage Income) యొక్క సాపేక్ష ఆకర్షణలో మార్పుల రూపంలో వుంటుంది. వేర్వేరు ఉద్యోగాలలో (Employments) వేతన ఆదాయంలో పన్నుల ద్వారా వచ్చిన మార్పులను బట్టి ప్రత్యక్ష పన్నుల ప్రభావం వుంటుంది. రెండు ఉద్యోగవకాశాలున్నాయి. ఒకటి సాధారణ ఉద్యోగమైతే యింకొకటి చాలా కష్టమైనది. కాబట్టి ఎవరికి ఒప్పుకోలుగా వుండదు. ఈ కష్టమైన ఉద్యోగానికి వేతనం ఎక్కువ. సాధారణ ఉద్యోగానికి వేతనం తక్కువ. ఈ రెండు వేతనాలమీద సమాగామి (Proportional) ఆదాయపు పన్ను విధించడంవల్ల ఈ రెండు వేతనాల మధ్యన వున్న నిరపేక్ష (absolute) తేడాని తగ్గించివేస్తుంది. అయితే సాపేక్షవేతన తేడా అట్లే వుంటుంది. దీంతో కష్టతరమైన ఉద్యోగం నుండి శ్రమ (Labour) తరలిపోతుంది. అంటే కష్టతర ఉద్యోగాన్ని (Disagreable Job) జీతం ఎక్కువ వుంటే చేస్తారుకాని, పన్నువల్ల జీతం తగ్గిపోతే ఆ ఉద్యోగంలో ఎవరు వుండరు. దీనినే శ్రమపై పంపిణీ ప్రభావం అని అంటారు. అలాకాకుండా, ఈ రెండు ఉద్యోగాలమీద పురోగామి (Progressive) ఆదాయపు పన్నుని రెండు వేతనాలకి వేరువేరు రేట్లలో విధిస్తే, అంటే కష్టతర ఉద్యోగ వేతనం ఎక్కువ గాబట్టి ఎక్కువ పన్నురేటు విధించి, సాధారణ ఉద్యోగంపై వేతనం తక్కువ అందుచేత తక్కువరేటులో పన్ను విధించినట్లైతే, ఈ రెండు వేతనాలలో నిరపేక్ష తేడా మరియు సాపేక్షతేడా రెండు కూడా తగ్గుతాయి. అందుచేత పురోగామి ఆదాయపు పన్ను విషయంలో శ్రమమీద పునఃపంపిణీ (reallocative) ప్రభావం ఎక్కువగా వుంటుంది అని ప్రెస్ట్‌యొక్క అభిప్రాయం (AR Prest, 1974, Ch. 3). అయితే కష్టతరమైన ఉద్యోగవేతనానికి అదనంగా ఒప్పుకోలు ఉద్యోగవేతనంలో ఒక శాతంగా నష్టపరిహారం ఇచ్చినట్లయితే, శ్రమపై సమాగామి పన్ను ద్వారా ఏ విధమైన పునఃపంపిణీ (reallocative) ప్రభావం వుండదు. పురోగామి ఆదాయపు పన్ను ద్వారా శ్రమపై పునఃపంపిణీ ప్రభావం వుండి శ్రమ కష్టతర ఉద్యోగాల నుండి తరలిపోతుంది.

మూలధనంపై ప్రత్యక్ష పన్నుల ప్రభావం :

మూలధనంపై ప్రత్యక్షపన్నుల పంపిణీ (Allocative) ప్రభావాన్ని తెలుసుకుందాము. యిక్కడ పెట్టుబడిని రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి అధిక రిస్కుతో కూడుకున్న పెట్టుబడి. రెండవది తక్కువ రిస్కుతో కూడుకున్న పెట్టుబడి. రిస్కుతో కూడుకున్న పెట్టుబడిపై రాబడిరేటు మార్పు చెందిందిగా వుంటుంది. అయితే లాభం లేకపోతే నష్టం రిస్కుతో వున్నట్టి వెంచెర్‌ని చేపడితే దానిమీద రాబడిరేటు (Return) ఎక్కువ వుండాలి. ఎందుకంటే అధికంగా రిస్కు తీసుకోడం జరుగుతోంది కాబట్టి. ఇలాంటి పరిస్థితులలో అదాయపు పన్ను ఒక పెట్టుబడిమీద విధిస్తే తద్వారా దానిమీద రాబడిరేటు తగ్గితే (రిస్కుతో కూడిన వెంచర్‌లో) అపుడు తక్కువ రిస్కువున్న వెంచర్లలో పెట్టుబడి తద్వారా మూలధనం తరలిపోతుంది. ఈ ప్రభావం పురోగామి పన్నుల విధానంలో వుంటుంది. ఈ ప్రభావం అంటే పురోగామి ఆదాయపు పన్నువల్ల అధికంగా (Strong) వుంటుంది. దీనివలన పెట్టుబడిమీద ఆదాయం తగ్గటం జరుగుతుంది. రిస్కులో వున్న పెట్టుబడులలో ఆదాయం మరీ తగ్గుతుంది. తర్వాత ఎటువంటి వెంచరులో పెట్టుబడి పెడతారు అంటే క్షేమంగా వుండే వెంచర్లలోనా లేక యింకా అధికంగా రిస్కువున్న వెంచర్లలోనా అనేది పెట్టుబడిదారుల యొక్క మానసిక స్థైర్యంపై ఆధారపడి వుంటుంది.

రిస్కుతోకూడిన వెంచర్లపై ఆదాయపు పన్ను విధించడం ద్వారా నష్టం వస్తే ఆ నష్టాన్ని ప్రభుత్వం భర్తీచేసే వీలుంటే (అంటే Loss - Offset వుంటే) ప్రభావం మూలధనంపై వేరుగా వుంటుంది. ఉదా॥కి వచ్చిన నష్టాన్ని ఆదాయపు పన్నువల్ల ఇంకొక సం॥ ఆదాయంతో భర్తీ చేసినట్లైతే అంటే ఆఫ్‌సెట్ చేసినట్లైతే సం॥ సగటు పన్ను చెల్లింపు (Tax liability) పెట్టుబడి రాబడిలో హెచ్చుతగ్గులు (Fluctuations) వలన మార్పుచెందదు. ఈ పన్ను వెంచరుపై వచ్చే సగటు రాబడి ద్వారా నిర్ణయించబడుతుంది. అందుచేత సమాగామి (Proportional) ఆదాయపు పన్ను విధింపు ద్వారా రిస్కుతోవున్న వెంచరుపై చెడు ప్రభావం వుండబోదు. ఎలాంటప్పుడంటే

పన్ను అధికారులు పెట్టుబడిపై నష్టాన్ని భర్తీచేసే వీలును కల్పించినప్పుడు పురోగామి ఆదాయపు పన్ను విధింపువల్ల రిస్కుతో వున్న వెంచర్‌పై ఎటువంటి ప్రభావం ఉంటుందన్నది ఇదమిద్దంగా ఖచ్చితంగా తెలియవచ్చే అవకాశంలేదు. అయితే పోల్‌టాక్స్ (Poll Tax) మూలధనంపై తటస్థ (Neutral) ప్రభావాన్ని చూపిస్తుంది. ఆదాయపు పన్నుకన్నా ముఖ్యంగా సమాగమి పన్ను విధానంలో మూలధనంపై ప్రభావం నష్టాన్ని భర్తీ చేసే వీలు (loss offset) వుంటే పోల్‌టాక్స్ మరియు ఆదాయపు పన్ను ప్రభావితం మూలధనంపై ఒకటే అని చెప్పవచ్చు.

అలాగే మూలధనంపై సాంత్సరిక పన్ను (Annual Tax) విధిస్తే వేర్వేరు మూలధన ఆస్థులపై సాపేక్ష ఆకర్షణలో మార్పు వస్తుంది. దీనివల్ల పెట్టుబడి పంపిణి (Allocation) మార్పు చెందుతుంది. మూలధన వనరులు పన్నువలన తక్కువ ఆకర్షవంతమైన వెంచర్లనుండి ఎక్కువ ఆకర్షవంతమైన వెంచర్లవైపు తరలిపోతాయి. పన్ను యంత్రాంగం అసమర్థత కారణంగా కూడా మూలధన వనరులు తరలిపోతాయి

బహుమతిపన్ను : పంపిణి ప్రభావం :

వ్యక్తులు ఇతరులకు బదిలీచేసిన ఆస్తులను 'బహుమతి' అంటారు. ఇది బహుమతి ఎందుకయ్యిందంటే ఈ ఆస్థిని పుచ్చుకున్నవాడు ఏ విధమైన చెల్లింపు చేయకుండా ఆస్తిని పొందేడు కాబట్టి. ఈ బహుమతి మీద పన్నుని విధిస్తారు. అప్పుడు పుచ్చుకున్న వ్యక్తికాని లేక ఇచ్చిన వ్యక్తికాని పన్ను చెల్లించవలసి వుంటుంది. ఈ పన్నుని బహుమతి యొక్క విలువను బట్టి లేక బహుమతి ప్రధాత యొక్క చెల్లింపు శక్తిపై పన్ను విధించబడుతుంది, లేక బహుమతి విలువ మరియు చెల్లింపు శక్తులను బట్టి కూడా పన్ను విధిస్తారు. ఈ విధమైన బహుమతిపన్ను విధింపు వల్ల మూలధనంపై ఏ విధమైన పంపిణి (Allocative) ప్రభావం వుండదు.

ఎస్టేట్ డ్యూటీ లేక మరణాలపై పన్ను :

చనిపోయిన వ్యక్తియొక్క ఆస్థిపై ఎస్టేట్ డ్యూటి లేదా మరణాలపై పన్నుని (Death Duty) ఆ ఆస్థి వారసులకు చేరకముందే విధించబడుతుంది. లేకపోతే వారసత్వపు పన్ను (Inheritance Tax) దీనిలో ఆస్థి వారసులకు బదిలీ అయిన పిదప పన్ను విధించబడుతుంది. ఈ పన్నులు వ్యక్తుల యొక్క పొదుపు చేయాలనే కోరికని ప్రభావితం చేస్తాయి. అంతే తప్ప పొదుపుని ఏ రూపంలో మదుపు పెట్టేరు అన్న అంశంమీద ఈ పన్నుల ప్రభావం వుండబోదు.

వ్యయపన్ను : పంపిణి ప్రభావం :

వ్యయాలపై పన్నుని పొదుపుయొక్క సప్లై మరియు మూలధన సంచయాలపై ఎటువంటి ప్రభావం చూపుతుంది అన్న విషయంగా చర్చించడం జరుగుతుంది. అయితే ఈ పన్నుని వనరుల పంపిణీ ప్రభావం పరంగా కూడా చర్చించవలసి వుంటుంది. వ్యక్తిత్వ వినియోగంపై సమాగమి వ్యయపన్ను (Proportional Expenditure Tax) అధికంగా వుంటుంది. (Higher Tax Liability) ముఖ్యంగా ఎవరైతే విలాసవంత వస్తువులను వినియోగిస్తారో వారిపై పన్ను అధికంగా వుంటుంది. ఎందుకంటే విలాసవంత వస్తువులు అధిక ధరలకి సాధారణంగా అమ్ముడవుతుంటాయి. ఎప్పుడైతే పన్ను అధికంగా విధించబడుతుందో, అప్పుడు విలాసవస్తువుల డిమాండ్ తగ్గిపోతుంది. వనరులు విలాసవంత వస్తు తయారినుండి నిత్యావసర వస్తు తయారివైపు తరలిపోతాయి. పురోగామి వ్యయపన్ను కూడా విలాసవంత వస్తువుల డిమాండ్‌ను మరింతగా తగ్గించి వేస్తాయి. ఎందుకంటే నిత్యావసర వస్తువుల వినియోగం తర్వాతే విలాసవంత వస్తువులపై వ్యయం చేయడం జరుగుతుంది.

అలాగే వ్యయపన్నుని పెట్టుబడి వినియోగం (Investment Expenditure) పై విధిస్తే, అప్పుడు రిస్కుతో వున్న వెంచర్లకి అనుకూలత వుంటుంది. ఎందుకంటే రిస్కులో వున్న వెంచరులో సగటు రాబడి రేటు ఎక్కువగా వుంటుంది. పెట్టుబడి క్షేమంగా వున్న వెంచర్లపై విముఖత పెరుగుతుంది. తక్కువ టర్నోవరు కలిగి అధిక రాబడి రేటు కల్గిన వ్యాపారాలు అయిన

గృహనిర్మాణం లాంటి రంగాలు ఈ వ్యయపన్ను విధింపువల్ల అభివృద్ధిని సాధిస్తాయి. హోల్‌సేల్ వ్యాపారాలు దానికి వ్యతిరేకంగా వుంటాయి. పురోగామి రేట్లతో మరియు తగినన్ని మినహాయింపులలో వ్యయపన్ను విధించినట్లైతే పెట్టుబడిని సరియైన మార్గాలలోకి మళ్ళించవచ్చు.

13.4.2 వనరుల యొక్క సప్లైపై పన్ను ప్రభావం : (Willingness to Work, Save & Invest)

పన్నుయొక్క ప్రభావం ఉత్పత్తి కారకాలపై వుంటుంది. ఈ ప్రభావం వేర్వేరు ఉత్పత్తి కారకాలపై వేర్వేరుగా వుంటుంది. పన్నుయొక్క ప్రభావం ఉత్పత్తికారకాల సప్లై మీదే కాకుండా వాటియొక్క ఉపయోగంపై (Utilisation) ఉంటుంది. ఉదా॥ భూమిమీద పన్ను విధిస్తే, సప్లైపరంగా పన్ను ప్రభావం సున్నా. అదే దాని ఉపయోగం పరంగా ఆలోచిస్తే పన్ను విధించిన తర్వాత ప్రభావం ఎక్కువగా వుంటుంది. అలాగే శ్రమని కూడా ఉపయోగం పరంగానే పన్ను విధానాన్ని అధ్యయనం చేయవలసి వుంటుంది. ఎందుకంటే శ్రమయొక్క సప్లై అనేక కారకాల మీద ఆధారపడి వుంటుంది. అటువంటప్పుడు పన్ను విధానాన్ని మరియు దాని ప్రభావాన్ని అధ్యయనం చేయడం వల్ల అనేక చిక్కులు ఎదురవుతాయి. అలాగే మూలధనం, మూలధనం పొదుపు ద్వారా ఏర్పడుతుంది. పొదుపు అనేక కారణాల కారణంగా చేయడం జరుగుతుంది. కాబట్టి పన్ను ప్రభావాన్ని మూలధనం యొక్క ఉపయోగం పరంగానే అధ్యయనం చేయవలసి వుంది.

అల్పాభివృద్ధి దేశాలలో పొదుపు చేయగల శక్తి ఒక్క ధనికులకే వుంటుంది. పేద ప్రజలు పొదుపు చేయలేరు. కారణం ఆదాయ స్థాయి తక్కువ. యిటువంటి పరిస్థితిలో ధనికులపై పన్ను విధించిన దేశంలో మూలధన సంచయనం తగ్గిపోయి ఆర్థిక వృద్ధి వెనకబడుతుంది. ధనికులను పన్ను పరిధినుండి తప్పిస్తే, దేశంలో ఆదాయ పంపిణి పరమైన న్యాయానికి (Distributive Justice) భంగం కలిగి సామాజిక రాజకీయ అశాంతికి దారి తీస్తుంది. అంటే అల్పాభివృద్ధి దేశాలలో ప్రస్తుత వినియోగానికి మరియు భవిష్యత్ వినియోగానికి మధ్యన విషమ సమస్య తలెత్తుతుంది. ఈ సమస్యని ప్రభుత్వమే నివారించాలి.

అంతే కాకుండా పొదుపు పెట్టుబడికి దారితీస్తుంది. అయితే పొదుపు చేసేవారు మరియు పెట్టుబడి చేసేవారు వేరు వేరుగా వుంటారు. పెట్టుబడి చేసే సామర్థ్యం ఉద్యమదారుల ఆర్థిక శక్తిమీద, లాభాలమీద, విత్త సంస్థలు అప్పుఇచ్చే విధానం మీద ఆధారపడి వుంటుంది. పెట్టుబడియొక్క స్థాయి మరియు విధానం (Pattern) పన్ను విధానం ద్వారా ప్రభావితం కాబడతాయి. పొదుపుమీద పన్ను విధిస్తే పెట్టుబడిదారులకి పొదుపు తక్కువగా అంది పెట్టుబడిస్థాయి తగ్గుతుంది. అలాగే పెట్టుబడి ద్వారా వచ్చే సంపాదనని పన్ను పరిధిలోకి తీసుకువస్తే మార్కెటు ద్వారా వనరులు సేకరించే పరిస్థితి దెబ్బతింటుంది. పన్నుని పంచని లాభాలపై (Retained Profits) విధిస్తే పెట్టుబడిదారులకి అంతర్గత వనరులపై పెట్టుబడిని సమకూర్చుకోలేరు. పెట్టుబడి సామర్థ్యం తగ్గిపోతుంది. వ్యాపార సంస్థలపై అధికపన్నులు విధించినట్లైన పన్ను ప్రభావం రెండురకాలుగా వుంటుంది. మొదటిది, పన్ను విధింపు ముందర లాభం (Profit Before Tax) ఎక్కువగా వుంటే పెట్టుబడి మంచిగా చేసినట్లవుతుంది. దీంతో పెట్టుబడి తగ్గుదలపై మొత్తంమీద వత్తిడి పెరుగుతుంది. అంటే పెట్టుబడి తగ్గిపోతుందన్నమాట. రెండవది, వ్యాపార సంస్థలో పన్ను ప్రభావాన్ని తగ్గించడానికి సంస్థపై ఖర్చులు ఎక్కువచేస్తారు. పెద్దగా లాభాలు తగ్గకుండా జాగ్రత్త పడతారు. అందుచేత అధికపన్నులు విధిస్తే సంస్థలో పరిపాలనా యంత్రాంగం పై ఎక్కువ ఖర్చు చేస్తారు. అంటే ఆఫీసు భవనాలు విలాసవంతంగా కట్టడం, ఫర్నీచరుని ఆధునీకరించడం, అదనపు వేతనం ఇవ్వడం మొదలైన వాటికి పాల్పడతారు. దాంతో పన్ను ప్రభావాన్ని తగ్గించుకుంటారు. పన్నుని తగ్గించుకోడానికి ఇతర మార్గాలు ఇంకా అనేకం వున్నాయి. సంస్థలు వాటి నష్టాలను ఒక సం॥నుండి యింకొక సం॥కి బదిలి అయ్యే అవకాశం, పన్ను అధికార యంత్రాంగం అనుమతించినట్లైన, కొంతకాలానికి సగటు పన్ను చెల్లింపు భారం (Tax Liability) తగ్గిపోతుంది. సంస్థలు అప్పుడు పెట్టుబడికి వనరులు సమకూర్చుకునే అవకాశం కల్గుతుంది. అలాంటి సౌకర్యం లేనట్లయితే, సంస్థ నష్టం వచ్చినప్పుడు పన్ను చెల్లించక లాభం వచ్చిన సం॥లు పూర్తి పన్ను చెల్లించవలసి వుంటుంది. విలువ ఆధారిత పన్ను(VAT) విషయంలో ఒక సంస్థ స్థాయిలో ఎంత వస్తు విలువ వచ్చి కలిసింది అన్న దానిమీద పన్ను విధిస్తారు. లాభాన్ని బట్టి పన్ను విధింపు

వుండదు. ఈ పద్ధతి క్రింద నష్టం వచ్చిన సం॥లో కూడా పన్ను చెల్లించవలసిన కారణంగా పెట్టుబడి సామర్థ్యం దెబ్బతింటుంది. వీటితోపాటు సంపదపన్ను, ఆస్తిపన్ను విధించితే సంస్థలయొక్క పరిస్థితి బాగా దిగజారిపోతుంది. అందుచేత భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఈ విషయాలన్ని పరిగణనలోకి తీసుకుని తగిన పన్ను విధానం అవలంభించి మూలధన సంచయానికి తద్వారా ఆర్థిక వృద్ధి జరిగేలాగున కృషి చేయాలి. అంటే తక్కువ ప్రాధాన్యత కల్గిన పరిశ్రమలపై అధికంగా పన్నులు విధించి, అధిక ప్రాధాన్యత కల్గిన పరిశ్రమలపై మినహాయింపులు, మరియు అత్యల్ప పన్నురేట్లు విధించి ప్రోత్సహించాలి.

పాదుపు సామర్థ్యం ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల విధానంపై ఆధారపడి వుంటాయి. పరోక్ష పన్నుల విధానంలో అవ్యాకోచం గల్గిన వస్తువులపై పన్ను విధించడం వల్ల ప్రజల వినియోగం పెరుగుతుంది. తద్వారా పాదుపు తగ్గిపోతుంది. అయితే వ్యాకోచం గల్గిన వస్తువులపై పరోక్ష పన్నులు విధించిన వినియోగ వ్యయం తగ్గిపోతుంది. దీంతో పాదుపు(Equity) సమస్య తలెత్తుతుంది. సమానతతో కూడిన ఆదాయ పంపిణి జరిగితే జాతీయాదాయం ఎక్కువ భాగం పేద ప్రజల దగ్గరకి వెళుతుంది. వీరిలో పాదుపు చేసే శక్తి తక్కువగా వుంటుంది. ఎందుకంటే ఉపాంత వినియోగ ప్రవృత్తి (MPC) ఎక్కువగా వుంటుంది. అభివృద్ధి కుంటుపడుతుంది. అదాయ అసమానతలు ఎక్కువచేసే పంపిణీ జరిగితే ధనికుల దగ్గర ఆదాయం ఎక్కువగా చేరి పాదుపు జరిగి వృద్ధికి దారి తీస్తుంది. అయితే ప్రభుత్వమే పాదుపు చేపడితే వృద్ధికి ఆటంకం ఏర్పడదు.

ఇక ప్రత్యక్ష పన్నులు విషయానికొస్తే, వ్యయపన్ను (Expenditure Tax) పాదుపుకి అనుకూలం. అయితే అదాయపు పన్ను పాదుపుని నిరుత్సాహ పరుస్తుంది. ఆదాయం సంపాదించాలన్న కోరికకూడా నశిస్తుంది. పురోగామి పన్ను విధానంలో పన్నుని ఎక్కువ చెల్లించే పరిస్థితి వుంటుంది. దాంతో పాదుపు దెబ్బతింటుంది. దీనికి కారణం అంటే అదాయం సంపాదించే కోరిక తగ్గటానికి కారణం అదాయంయొక్క ఉపాంత ప్రయోజనం పన్ను చెల్లించిన తర్వాత వేగంగా పడిపోతుంది. అప్పుడు పనిపట్ల విముఖత ఏర్పడుతుంది. పన్ను ప్రభావం పాదుపుపై ఎట్లా వుంటుందంటే పాదుపుయొక్క ఆదాయం వ్యాకోచత్వంపై ఆధారపడి వుంటుంది. అంతేకాకుండా అదాయపు పన్ను రేటుపై కూడా ఆధారపడి వుంటుంది. అంటే పాదుపుయొక్క సప్లై దేనిమీద ఆధారపడి వుంటుందంటే నికర ఆదాయంలో వచ్చే మార్పులపై పాదుపుయొక్క స్పందన ఎట్లా వుంది అనే దాని మీద నిర్ణయించబడుతుంది. అధిక వ్యాకోచత్వం పాదుపుకి వున్నట్లైతే అధికపన్ను రేటు వల్ల పాదుపు అధికంగా పడిపోతుంది.

వ్యయపన్ను ఆదాయాన్ని వినియోగానికుపయోగించినప్పుడు మాత్రమే విధించబడుతుంది. పాదుపుచేస్తే పడదు. ఆదాయాన్ని సంపాదించడాన్ని కాని పాదుపును కాని వ్యయ పన్ను ప్రభావితం చేయదు. ఆదాయపు పన్ను మాదిరిగా, ఈ వ్యయపన్నుని వ్యాపార సంస్థలకి వర్తింపజేసినట్లైతే పాదుపు బాగా ప్రోత్సహించబడుతుంది. ఆదాయపు పన్ను వ్యాపార సంస్థలను ఒక రకంగా చెప్పాలంటే శిక్షిస్తుంది. ఎందుకంటే అదాయపు పన్ను లాభాలను పన్ను పరిధిలోకి తీసుకువస్తుంది. నష్టం ఆర్జించే సంస్థని పన్ను విధించకుండా ప్రోత్సహిస్తుంది. వ్యయపన్ను ఆదాయపు పన్ను కన్నా మెరుగైనది. వ్యయపన్ను మూలధన సాంద్రత గల్గిన పరిశ్రమలను నిరుత్సాహపరచి దేశంలో నిరుద్యోగితను నివారిస్తుంది. ఎందుకంటే మూలధన సాంద్రత మూలంగా కంపెనీ ఖర్చు పెరుగుతుంది. ఖర్చు పెరిగితే వ్యయపన్ను విధించబడుతుంది. దీంతో శ్రామిక సాంద్రత గల్గిన పరిశ్రమలు ప్రోత్సహించబడి నిరుద్యోగిత నివారించబడుతుంది. అయితే వ్యయపన్ను విధింపు మూలంగా పన్ను యంత్రాంగానికి అనేక సమస్యలు ఎదురవుతాయి. అవి వ్యక్తుల వినియోగ వ్యయం పరంగా మరియు కంపెనీల వినియోగ వ్యయం పరంగా, వ్యక్తులమీద ఈ పన్ను మొత్తం వ్యయం మీద వేస్తే తిరోగామి పన్ను విధానంగా మారిపోతుంది. అలాకాకుండా ఎన్నికచేసిన వస్తువులపై వేస్తే పాదుపు పెరిగే అవకాశం వుంది. పన్నువిధానం తిరోగామిగా మారకుండా వుండాలంటే వ్యయపన్నుని పురోగామి (Progressive) గా విధించి సమానతకి తోడ్పడాలి. అంతేకాకుండ మినహాయింపులు కూడా యిచ్చి పేదవర్గాలని ఆదుకోవాలి. పన్ను యంత్రాంగానికి ఇవన్నీ చాలా క్లిష్టతరమైనవి. ముఖ్యంగా భారతదేశంలో అలాగే కంపెనీ వ్యయంపై కూడా వ్యయపన్ను చాలా సమస్యలను సృష్టిస్తుంది. ఉదా॥ ఏ వ్యయాలపై పన్ను విధించాలి అన్నది సమస్య. పన్ను పరిధిలో శ్రామికులపైన చేసిన ఖర్చుని తీసుకువచ్చిన శ్రమ సాంద్రత ఉత్పత్తి పద్ధతులకి తీవ్ర విఘాతం

కలగడమే కాకుండా శ్రామికులపై వెచ్చించే శ్రేయస్సు సంబంధ ఖర్చుకూడా దెబ్బతినే అవకాశం లేకపోలేదు. అలాగని వ్యయపన్ను నుండి మినహాయింపులు ఇస్తే శ్రామికుల మీద అనవసర వ్యయానికి తలుపులు తెరచినట్లు అవుతుంది. అంతేకాకుండా క్రమబద్ధ మరియు సమగ్ర ఎకౌంటింగ్ కూడా ఒక సమస్య అవుతుంది. ముఖ్యంగా చిన్న చిన్న వ్యాపారసంస్థల విషయంలో దీంతో పన్ను ఎగవేతకి మార్గం సుగమం అవుతుంది.

పై విషయాలన్ని మూలధనంపైన పన్ను విదింపువల్ల పొదుపు ఎట్లా మార్పు చెందుతుందో చర్చించడం జరిగింది.


13.4.2.1 శ్రామిక సప్లైపై పన్ను ప్రభావం :

పన్ను విధించడం వల్ల శ్రామిక సప్లైలో మార్పు వస్తుంది. శ్రామిక సప్లై పన్ను విధింపు వలన అదాయ ప్రభావం (Income Effect) చేత పెరుగుతుంది ఎందుకంటే తగ్గిన వేతనాన్ని భర్తీ చేసుకునేందుకు. అలాగే పన్ను విధింపువల్ల ప్రత్యామ్నాయ ప్రభావం (Substitution Effect) వలన సప్లై తగ్గి చౌకగా వున్న ఖాళీని (Leisure) శ్రామికుడు కోరుకుంటాడు. వేర్వేరు పన్నులలో ఈ రెండు ప్రభావాలలో వేరువేరుగా వుంటాయి.

ఈ విషయాన్ని ఉదాసీన వక్రరేఖాపటం ద్వారా తెలుసుకుందాము. ఈ రేఖల ద్వారా శ్రామికుడు పని (Work) ని మరియు ఖాళీ సమయాన్ని ఎట్లా సమన్వయం (Trade-off), పన్ను విధింపువలన ఎట్లా చేస్తాడో తెలుసుకోవచ్చు. ముందుగా చేసుకునే ప్రమేయం ఏమిటంటే ఎక్కువ పని గంటలు పనిచేస్తే ఎక్కువ ఆదాయాన్ని పొందుతాడు శ్రామికుడు. అంటే వేతనం గంటలను బట్టి యివ్వబడుతుంది. పటం 2. లో ఈ విషయం వివరించబడింది.

Y - అక్షంమీద ఆదాయ సంపాదన X - అక్షంమీద ఖాళీ సమయాన్ని చూపడం జరిగింది. W_1N_1 అనే రేఖ ఆదాయ సంపాదన - అవకాశ రేఖ. ఈ రేఖమీద శ్రామికుడు పని - ఖాళీయొక్క ఏ సమ్మేళనాన్నైనా కోరుకుంటాడు. అయితే W_1N_1 రేఖ i, అనే ఉదాసీనా వక్రరేఖకి E_1 అనే బిందువు దగ్గర టాంజెంటుగా వుంది. E_1 బిందువు శ్రామికునియొక్క పని ఖాళీల సమ్మేళన పరంగా ఒక సమతౌల్యస్థితి. ఈ బిందువు దగ్గర OL_1 ఖాళిని L_1N_1 పనిని కోరుకుంటాడు. ఆ సమ్మేళనం (OL_1 - L_1 N_1) దగ్గర శ్రామికుని సంపాదన (E_1 L_1) గా వుంటుంది. E_1 దగ్గర ఖాళీ-సంపాదన పరంగా ఉపాంత - ప్రత్యామ్నాయ రేటు (MRS) వేతనానికి సరిపోయింది. అందుచేత ఇది సమతౌల్యస్థితి అయ్యింది.

ఇప్పుడు పోల్‌టాక్స్ (తలపన్ను) విధించబడింది. ఈ పన్ను ఆదాయాన్ని బట్టి వుండదు. శ్రామిక సప్లై పై పోలుటాక్స్ వలన ప్రత్యామ్నాయ ప్రభావం వుండదు.



పటం 2 : శ్రామిక సప్లై పై పన్ను ప్రభావం
(ఆదాయ మరియు ప్రత్నామ్నాయ ప్రభావాలు)

అయితే ఆదాయ ప్రభావం వుటుంది. శ్రామికుడు అతని ఆదాయంతో నిమిత్తం లేకుండా పన్ను చెల్లించాలి. పన్ను వలన అతని సంపాదన తగ్గుతుంది. అందుచేత శ్రామికుడు ఎక్కువ పనిగంటలు చేయడానికి సిద్ధమవుతాడు. పటంలో చూపబడినట్లుగా W_1W_2 స్థాయిలో పోల్‌టాక్స్ విధించారు. దీంతో ఆదాయ సంపాదన - అవకాశ రేఖ W_1N_1 నుండి (W_2N_2) గా క్రిందికి మళ్ళింది. ఈ పన్ను వల్ల ఆదాయం తగ్గిపోయింది. శ్రామికుడు ఖాళీని త్యాగం చేసి పనిగంటలు పెంచుతాడు. ఖాళీ సమయం OL_1 నుండి OL_3 కి తగ్గుతుంది. పనిగంటలు L_1N_1 నుండి (L_3N_1) గా పెరుగుతాయి. మొత్తం సంపాదన T_3L_3 నుండి T_3E_3 పన్ను చెల్లిస్తాడు. E_3 అనేది శ్రామికునియొక్క క్రొత్త సమతౌల్యస్థితి E_3E_1 కి ఎడమ ప్రక్క వుంటుంది. పటం 2. లో A & B లను చూడండి. ఆదాయ ప్రభావం వలన శ్రామిక సప్లై పెరిగింది.

అలాగే సమాగమి ఆదాయపు పన్ను (Proportional Income Tax) విధిస్తే ఆదాయ సంపాదన తగ్గిపోతుంది. దీనివల్ల, ఖాళీ చవకగా మారి పన్ను విధింపుకు పూర్వపు ఆదాయాన్ని సంపాదించాలంటే శ్రామిక ఖర్చు పెరుగుతుంది. సమాగమి ఆదాయపు పన్నుని W_1W_3 / OW_1 రేటులో విధించడం జరిగింది అని అనుకుందాము. అపుడు ఆదాయ సంపాదన - అవకాశరేఖ W_3N_1 గా మారింది. ఈ పన్ను ప్రభావంలో అదాయ మరియు ప్రత్యామ్నాయ ప్రభావాలు రెండు వుంటాయి. ప్రత్యామ్నాయ ప్రభావంలో ఖాళీ చవకగా మారడంవల్లనూ శ్రామిక ఆదాయం ఖర్చు పెరగడంవల్లను శ్రామికుడు ఖాళీవైపు మొగ్గు చూపిస్తాడు. దీంతో శ్రామిక సప్లై తగ్గిపోతుంది. క్రొత్త సమతౌల్య స్థితి E_2 దగ్గర ఏర్పడుతుంది. ఇది E_1L_1 కి కుడివైపున వుంటుంది. (పటం 2 ఎ) ఆదాయ ప్రభావం వలన అదాయం తగ్గింది కాబట్టి, శ్రామిక సప్లై పెంచి అధిక పనిగంటలు పనిచేయటానికి ఇష్టపడతాడు. అప్పుడు సమతౌల్యస్థితి E_2 దగ్గర ఏర్పడుతుంది. పటం 2 బి చూడండి. ఇది E_1L_1 కి ఎడమప్రక్క వుంది. అయితే నికర ఫలితం ఏట్లా వుంటుందనేది ఆదాయ ప్రత్నామ్నాయ ప్రభావాల సాపేక్ష శక్తిపై ఆధారపడి వుంటుంది. అందుచేత E_1 కి ఎడమ ప్రక్కన కాని కుడి ప్రక్కన గాని E_2 వుంటుంది.

అదే పురోగామి ఆదాయపు పన్నులో అయితే శ్రామిక సప్లైకి తీవ్రంగా హాని కలుగుతుంది. అదాయపు పన్నుయొక్క ఉపాంత రేటు సగటురేటు కన్నా వేగంగా పెరగడమే కారణం, ముఖ్యంగా ఆదాయం పెరుగుతున్నప్పుడు. అందుచేత ప్రత్యామ్నాయ ప్రభావం ఎక్కువగా వుంటుంది. అంటే సమాగమి అదాయపు పన్నుతో పోలిస్తే పురోగామి పన్నులో ఈ ప్రత్యామ్నాయ ప్రభావం తీవ్రంగా వుంటుంది. దీని తీవ్రత ఆదాయపు పన్నులో పురోగామి విధానం (Progression) మీదను, వేతన రేటులో పెరుగుదల బట్టి వుంటుంది. అదాయపు పన్నులో పురోగతి అధికంగా వున్నను, వేతనంలో పెరుగుదల వేగంగా వుంటేనూ, శ్రామిక సప్లై అధికంగా తగ్గిపోతుంది.

ఇప్పటివరకు ఏం తెలుసుకున్నామంటే ఒక శ్రామికుడు పనిగంటలను ఎట్లా నిర్ణయించుకున్నాడో చూశాము. అంటే శ్రామికునికి పనిగంటలు నిర్ణయించుకోడంలో స్వేచ్ఛగా వ్యవహరిస్తాడని తెలుసుకున్నాం. అయితే సాధారణంగా ఇటువంటి పరిస్థితి వుండదు. అంతేకాకుండా అదాయపు పన్నుని పూర్తిగా అమలు చెయ్యక పోవడం వల్ల కూడా పైన వివరించిన పన్ను ప్రభావం మారిపోయే అవకాశం వుంది. అదాయాన్ని అనేక రకాలుగా సంపాదించే అవకాశం వున్న కారణంగా పన్నుని ఎగవేసే అవకాశం వుంటుంది. దీంతో ఆదాయ, ప్రత్యామ్నాయ ప్రభావాలు ఏ ప్రభావాన్ని శ్రామిక సప్లై మీద చూపలేవు. అందుచేత వ్యక్తినుండి వ్యక్తికి శ్రామిక సప్లైపై పన్ను ప్రభావం వేరుగా వుంటుంది.

ఆలాగే పన్నులో కోత విధిస్తే పనిగంటలలో ఎటువంటి మార్పు వస్తుందో చూసినట్లైన, శ్రామిక సప్లై పెరుగుతుంది. ఖాళీని తక్కువ కోరుకుంటారు. అయితే ఆదాయం పెరుగుతుంటే, శ్రామికుడు ఖాళీని కోరుకుంటాడు. దీంతో శ్రామికసప్లై తగ్గుతుంది. కాబట్టి పన్నుకోత వల్ల ఎటువంటి ప్రభావం వ్యక్తిపరంగా చెప్పడం కష్టం. ఆర్థిక వ్యవస్థ మొత్తంమీద ఎట్లావుంటుంది అంటే "పన్నుకోత వల్ల మొత్తం నిజ ఆదాయంలో పన్ను ఎంతైతే తగ్గించబడిందో ఆ మేర పెరుగుదల వుండదు. ఏ కారణం చేతనైనా పెరిగిందంటే అప్పుడు అభిలషణీయ అదాయపు పన్నురేటు (Optimal Income - Tax Rate) సున్నాగా మారిపోతుంది"

(James Gwartney & Richard Stroup, March 1983). అందుచేత పన్నుకోత జాతీయాదాయాన్ని ఎప్పుడు పెంచుతుందంటే ఈ పన్నుకోతతోబాటుగా దేశంయొక్క ఉత్పాదక సామర్థ్యం పెరిగినప్పుడు మాత్రమే.

పరోక్ష పన్నుల ప్రభావం శ్రామిక సప్లైపై ఎట్లా వుంటుందంటే ప్రత్యక్ష పన్నుల మాదిరిగానే వుంటుంది. అంటే పరోక్ష పన్నుల ద్వారా ఆదాయం తగ్గి శ్రామిక సప్లై తగ్గుతుంది. రెండు రకాల పన్నులలోను ఆదాయ ప్రభావం ఒకే రకంగా వుంటుంది. రెండు కూడా వ్యక్తిపై ఒకే పన్ను చెల్లించే భారం (Tax Liability) పడుతుంది. అంతే కాకుండా ప్రత్యామ్నాయ ప్రభావంలో పరోక్ష పన్నుద్వారా ఎంత సప్లై తగ్గిందో (శ్రామిక) అంతే సమాన రాబడి గల్గిన సమాగమి ఆదాయపు పన్నులో గూడా అంతే శ్రామిక సప్లై తగ్గిపోతుంది.

అంతేకాకుండా, ఖాళీ సమయాన్ని అనుభవించడానికి ఉపయోగపడే వస్తువులు వుంటాయి (Some Goods are Complementary to Leisure) ఉదా॥ వినోదపు సేవలు (Entertainment Services) ఇటువంటి వస్తువులపై డిమాండ్ తగ్గి శ్రామిక సప్లై పెరుగుతుంది. ఖాళీకి ప్రత్యామ్నాయ వస్తువులపై పరోక్ష పన్నులు విధిస్తే వాటిపై డిమాండ్ తగ్గి ఖాళీ (Leisure) పై డిమాండ్ పెరుగుతుంది. దానివలన శ్రామిక సప్లై తగ్గిపోతుంది. అయితే ప్రభుత్వం వస్తువులపై పన్ను విధించేటప్పుడు పూరక వస్తువులా లేక ప్రత్నామ్నాయ వస్తువులా అని చూడకుండ డిమాండ్ వ్యాకోచత్వం, రెవెన్యూ రాబడి, ఆదాయ స్థాయిలను బట్టి పన్ను విధిస్తారు. దాన్ని బట్టి పన్ను ప్రభావం వుంటుంది.

13.4.3 ఆదాయ పంపిణీపై పన్ను ప్రభావం :

ఆదాయ సంపద అసమానతలను తొలగించి సమసమాజ స్థాపనే ధ్యేయంగా పెట్టుకున్నాయి ఈనాటి ఆధునిక ప్రభుత్వాలు. ప్రజలశ్రేయస్సే ముఖ్యం. పన్నులను విధించడం ద్వారా ఈ అసమానతలని తగ్గించే ప్రయత్నం చేస్తుంది ప్రభుత్వం. దీనికై పురోగామి పన్నులను ఉపయోగిస్తారు. అంతేకాకుండా ప్రభుత్వ వ్యయ విధానం ద్వారా కూడా ప్రభుత్వం అసమానతలను తగ్గిస్తోంది. పురోగామి పన్ను విధానం అదాయాన్ని, బహుమతులని, సంపదని, వారసత్వాన్ని, గాలివాటు లాభాలని, కేపిటల్ గెయిన్లు అని, మొదలగు వాటిని దృష్టిలో వుంచుకుని పన్నులను విధించడం ద్వారా అసమానతలని నివారించే ప్రయత్నం చేస్తుంది. అయితే కష్టపడి పనిచేసి అధికోత్పత్తికి అవసరమైన ప్రోత్సాహకాలను కూడా ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని పన్ను విధానంలోను, ప్రోత్సాహకాలలోనూ ఆరోగ్యదాయకమైన సమన్వయాన్ని సాధిస్తుంది. తద్వారా ఆర్థికవృద్ధి మరియు అసమానతల నివారణ మధ్యన వున్న విభేదాన్ని ప్రభుత్వం నివారించే ప్రయత్నం చేస్తుంది.

అసమానతలని లెక్కించే విధానం (Measuring Inequality)

ఆదాయాలలో తేడాలబట్టి అసమానతలను గుర్తించవచ్చు. జాతీయదాయంలో పేద ప్రజలు తక్కువ వాటాని, ధనికులు ఎక్కువ వాటాని పొందినట్లైతే దానినే ఆదాయ అసమానతలు అని అంటారు. దేశం 60 శాతం వున్న ప్రజలకి జాతీయాదాయం లో 40 శాతం కూడా అందకుండ వుండడం, మిగిలిన 40 శాతం మంది ఉన్నత ఆదాయ వర్గాల వాళ్ళకి 60 శాతం జాతీయాదాయం అందడాన్ని అసమానతలు అని అంటారు. ఈ అసమానతలు తెలుసుకోవాలంటే ప్రజలయొక్క ఆదాయాన్ని బట్టి కిన్‌టైల్స్ (Quintiles) గాను మరియు డెసైల్స్ (Deciles) గాను వర్గీకరించి వాటిని ఆరోహణక్రమం (ascending order) లో ఒక పట్టిక తయారుచేసి దానిద్వారా అసమానతలు అంటే జాతీయాదాయ వాటా ఎట్లావుందో తెలుస్తుంది. Quintiles లో వర్గీకరిస్తే 5 క్విన్ టైల్స్ (5×20%) వస్తాయి. అనగా 1st, 2nd, 3rd, 4th మరియు 5th Quintiles. 1st క్వింటైల్ అత్యంత పేదవర్గం, మరియు 5th క్వింటైల్ అత్యంత ధనికమైన వర్గం. మొదటి 3 క్వింటైల్స్ కలిపితే 60 శాతం మంది ప్రజలు జాతీయాదాయాన్ని అత్యల్పంగాను పొందుతున్నారు. మిగిలిన 3rd, 4th క్వింటైల్స్ కలిపితే 40 శాతం మంది ప్రజలు జాతీయాదాయాన్ని అత్యధికంగా పొందుతున్నారు. ఇదే అసమానత అంటే. అదే డెసైల్స్ (Deciles) లో అయితే 10 శాతం మంది ప్రజలని ఒక వర్గంగా

చూపుతారు. అంటే జాతీయాదాయం మొత్తాన్ని 100 శాతం అనుకుంటే డెసైల్స్ ప్రకారం 10 వర్గాలు వస్తాయి. అవి 1,2,3,4,5,6,7,8,9,10 వర్గాలు. ఈ అసమానతలను లోరెంజ్ (Lorenz Curve) రేఖ ద్వారా తెలుసుకుంటాము. అదేంటో ఈ క్రింది వివరణలో తెలుసుకుంటారు.

పన్ను విధానం ద్వారా ఈ అసమానతలు తగ్గించే ప్రయత్నం చేయడం జరుగుతుంది. ఆదాయ పంపిణియొక్క పరిమాణం (Size Distribution of Income) లో మార్పుని ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా తీసుకురావచ్చును. అనగా కార్పోరేటు పన్ను స్థానంలో విలువ ఆధారిత పన్ను, ఆస్థిపన్ను స్థానంలో అమ్మకపు పన్నులను విధించడం ద్వారా, ఇంకా ఎన్నో రకాల పన్నుల సమ్మేళనాల ద్వారా అసమానతలను తొలగించవచ్చు. దేశంలోని ప్రతి ఒక్క వ్యక్తి పట్ల అసమానతలు ఎట్లా వున్నాయో తెలుసుకోవడం తలకుమించిన భారం. అందుచేత పైన చెప్పినట్లుగా కుటుంబాలని క్వింటైల్స్‌గా విభజించి వర్గీకరించడం జరుగుతుంది.

ఒక పన్ను స్థానంలో యింకొక పన్నుని విధించడంవల్ల కొన్ని కుటుంబాల ఆదాయ స్థితి మెరుగవుతుంది. మరికొందరిది దిగజారుతుంది. అయితే ఆదాయ పరిస్థితిని బట్టి దానిలో మార్పులు బట్టి ఒక కుటుంబ పరిస్థితిని అంచనావేయడం జరుగుతుంది. నిజ ఆదాయంలో మార్పు వస్తుంది. అది వ్యయార్హ ఆదాయం పెరగడం మూలంగాను మరియు వస్తువుయొక్క ధర తగ్గడం మూలంగానూ కావచ్చు.

ఒక కుటుంబం యొక్క వ్యయార్హ ఆదాయాన్ని (Disposable Income) ఈ క్రింది విధంగా నిర్వచించవచ్చు (R.A. MUSGRAVE & P.B. MUSGRAVE, 1989, p. 239-242)

$$DRY = \frac{E - T_y}{P + T_s} = \frac{DY}{GP}$$

ఇక్కడ DRY = Disposable Real Income (వ్యయార్హ నిజ ఆదాయం)

E = సంపాదన (Earnings)

T_y = ఆదాయపు పన్ను (Tax on Income)

P = ధర (Price)

T_s = అమ్మకపు పన్ను (Sales Tax Addition)

DY = Disposable After-Tax Income


GP = Gross Price (స్థూల ధర)

ఇప్పుడు DRY మీద ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల ప్రభావాన్ని చూద్దాం. అదాయంపరంగా పన్ను ప్రభావం T_y లో మార్పు ద్వారా వస్తాయి. వ్యయం పరంగా పన్ను ప్రభావం T_s లో మార్పు ద్వారా వస్తాయి. అందుచేత T_y పెరిగితే DRY తగ్గిపోతుంది. దీంతో DY పడిపోతుంది. అలాగే T_s పెరిగితే DRY తగ్గి దాంతో GP పెరుగుతుంది.

దీంతోపాటుగా, సాధారణ సమన్వయ విధానంలో భాగంగా ఆదాయ సంపాదనపై ద్వితీయ శ్రేణి పన్ను ప్రభావం (Secondary Effects) వుంటుంది. అలాగే వ్యయం వైపుకూడా ఇదే రకమైన ద్వితీయశ్రేణి పన్ను ప్రభావం కూడా వుంటుంది. వీటివల్ల

E లోనూ, మరియు P లోనూ మార్పులు వస్తాయి. వ్యక్తిత్వ ఆదాయ పన్నులో పంపిణి పరంగా ఫలితాలు అదాయంతో ముడిపడి వుంటాయి. అదే ఎక్సైజ్ పన్నుల విషయంలో వ్యయంపరంగా ప్రభావం ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. కాబట్టి పన్ను భారాన్ని అంచనా వేయడంలో ప్రత్యక్ష, పరోక్ష పన్నులలో ఆదాయస్థాయి ప్రముఖ పాత్ర నిర్వర్తిస్తుంది.

పన్ను ప్రభావాన్ని పన్నులో మార్పుద్వారా ఆదాయ పంపిణి ఎట్లావుంది. పన్నుకి ముందర ఎట్లావుంది, పన్నుకి తర్వాత ఎట్లావుంది అనే అంచనా ద్వారా తెలుసుకోగలం. ఈ విషయాన్ని లోరెంజ్‌గ్రాఫ్ ద్వారా తెలుసుకోవచ్చు.



పటం 3. ఆదాయ సమానత అంచనా

వ్యయార్హ ఆదాయశాతాన్ని అంటే సమ్మిళిత (Cummulative) శాతాన్ని Y- అక్షం మీద, సమ్మిళిత (Cummulative) కుటుంబాల శాతాన్ని X - అక్షం మీద గుర్తించాము. ఈ కుటుంబాలన్ని ఆదాయం పరంగా అత్యల్ప స్థితినుండి అత్యున్నత స్థితిని చూపించాము. OB రేఖ సమానతని గుర్తించే రేఖ (Line Equality) OAB రేఖ (వక్రరేఖ) అత్యల్ప ఆదాయ వర్గం నుండి అత్యున్నత ఆదాయవర్గం వారు పొందిన మొత్తం ఆదాయవాటా. ఉదా॥కి అత్యల్ప ఆదాయవర్గం అనగా మొదటి క్వింటైల్ వర్గం పొందిన జాతీయాదాయ శాతం 6 (పటంలో చూడండి). మొదటి 4 క్వింటైల్స్ అంటే దేశంలో 80 శాతం మంది ప్రజలు జాతీయాదాయంలో 60 శాతాన్ని పొందేరు. చివరి అంటే 5వ క్వింటైల్ వర్గం మిగిలిన 40 శాతం జాతీయదాయాన్ని పొందారు. అదాయపంపిణిలో సమానత వుంటే OAB రేఖ, సరళరేఖ అయిన OB తో కలిసిపోవలసి వుంటుంది. ఎందుకంటే OB ఆదాయ

సమానత రేఖ. అయితే ఈ OAB వక్రరేఖ OB రేఖకి దూరంగా వుంది కాబట్టి ఆదాయ అసమానతలున్నట్టుగా తెలుస్తోంది. ఈ అసమానత ఎంతవుందో తెలుసుకోవాలంటే "గినీకోఎఫీషియంట్" (Gini Coefficient) ద్వారా తెలుసుకోవచ్చు. దీని సూత్రం ఈ క్రింద యివ్వబడింది.

$$Gini\ Co-efficient = \frac{Area\ Between\ Lorenz\ Curve\ \&\ Line\ of\ Equality}{Area\ of\ the\ Triangle\ OBC}$$

ఈ కో-ఎఫీషియంట్ విలువ 'O' కి 'I' మధ్యన వుంటుంది. విలువ 'O' కి దగ్గరగా వుంటే అసమానతలు అధికంగా వున్నట్టు, 'I' కి దగ్గరగా వుంటే అసమానతలు అత్యల్పంగా వున్నట్టు. 'I' అయితే సంపూర్ణ సమానతని సాధించినట్లు.

ఆదాయ సమానత అంచనా = $\frac{OABC}{OBC}$

ఇటువంటి పరిస్థితిలో పన్ను విధించడం వల్ల ఆదాయ అసమానత రేఖ OA'B గా మారింది. అంటే OA'B రేఖ OAB కి లోపల వుంది. సంపూర్ణ ఆదాయ సమానతరేఖ, OB, కి OAB కన్నా దగ్గరగా వుంది. అంటే ఆదాయ పంపిణి మెరుగైందన్నమాట. OB కి దూరంగా అసమానతరేఖ వుంటే అసమానతలు పెరిగినట్లుగాను, OB కి అసమానతరేఖ దగ్గరగా వుంటే ఆదాయపంపిణి సమానత దిశగా ప్రయాణిస్తున్నట్టు.

ఆదాయ సమానత అంచనా = $\frac{OA'BC}{OBC}$

$$\frac{OABC}{OBC} < \frac{OA'BC}{OBC}$$

దీని అర్థం, పన్నుమార్పు పురోగామి (Progressive) గా వుందన్నమాట. అంటే ఆదాయపు పన్నుని ఇదివరకు కన్నా ఎక్కువ పురోగామిగా మార్చడం జరిగింది. అయితే మొత్తం రెవెన్యూ స్థిరంగా వున్నప్పుడు ఇటువంటి పరిస్థితి వుంటుంది. అలాగే పన్నురేటు మార్చకుండా రాబడిని పెంచడం (By raising all liabilities by the same percentage).

పంపిణిమీద మొత్తం ప్రభావం ఎట్లా వుంటుందంటే, పన్నులయొక్క పురోగామి విధానంపైన, మొత్తం పన్నుల స్థాయి, మరియు ఆదాయ పంపిణి పన్ను విధింపునకు పూర్వం ఎట్లావుంది అనే విషయాలమీద ఆధారపడి వుంటుంది. అయితే ఎక్కువగా వున్నట్టి, కాని మోడరేట్‌గా వున్న పురోగామి పన్నువిధానంకి ఆదాయ పంపిణి అధికంగా ప్రభావితం అవుతుంది. దీంతో పోలిస్తే తక్కువగా వున్నట్టి కాని, వాడియైన (Sharp) పురోగామి పన్ను విధానంతో పోలిస్తే.

భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో పన్నువిధానం ద్వారా ఆదాయ సంపద అసమానతలను నివారించడానికి అనేక పరిమితులున్నాయి. పురోగామి ప్రత్యక్ష పన్ను విధానం ద్వారా అసమానతలు తగ్గించవచ్చు. అయితే ప్రత్యక్ష పన్నులు కట్టేవారి శాతం చాలా తక్కువ. సుమారుగా ఈ శాతం 1 నుండి 2 వుండొచ్చు మొత్తం జనాభాలో. అంతేకాకుండా స్థూల దేశీయోత్పత్తిలో ప్రత్యక్ష పన్నుల వాటా 2 శాతం మాత్రమే. ఇటువంటి పరిస్థితులలో ప్రత్యక్ష పన్నులద్వారా అసమానతలు ఎట్లా నివారించబడతాయి. అంతేకాకుండా పన్ను ఎగవేతకూడా అసమానతలు నివారించడానికి ప్రతిబంధకంగా వుంది. పరోక్షపన్నుల విధానం సాధారణంగా ద్రవ్యోల్బణ స్వభావం కలిగివుంటుంది. అందుచేత అసమానతలు పెంచేవిధంగా వుంటుంది. ఎంత ఎన్నిక

చేసిన వస్తువులపై పన్నులు విధించినా, అందులోమా విచక్షణా సహిత రేట్లు విధించిననూ పరోక్షపన్నులను పురోగామి పన్నులుగా విధించడం జరగని పని. అందుచేత పరోక్షపన్ను విధానం తిరోగామి (Regressive) గా వుంటుంది. అసమానతలు పెరుగుతాయే కాని తగ్గేప్రశ్న లేదు. అయితే దీర్ఘకాలంలో పన్నువిధానాన్ని అధికంగా పెరిగే రేట్లతో (Steep Rates of Taxation) రూపొంది పన్ను ఎగవేతని కఠినంగా నియంత్రించినట్లైతే సంపద మరియు ఆర్థికశక్తి కేంద్రీకృతం కాకుండా చూడవచ్చును.

13.4.4 ఇతర ప్రభావాలు :

ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానం ఆర్థిక వ్యవస్థ మీద అనేక విధాలుగా వుంటుందని తెలుసుకున్నాము. పన్నులు విధించడం మూలంగా ఇతరములైన ప్రభావాలు కూడా వుంటాయి, అవి తెలుసుకుందాము.

(i) **పన్నువిధానం మరియు ఆర్థికస్థిరత్వం :** పన్నువిధానం ద్వారా ఆర్థిక వ్యవస్థలో మార్పులు తీసుకురావడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని సాధించవచ్చు. పన్నులు విధించడం వలన సార్థక డిమాండ్‌లో మార్పులు వస్తాయి. పన్ను విధిస్తే ప్రజల కొనుగోలు శక్తి తగ్గి సార్థక డిమాండ్ పడిపోతుంది. దీంతో నిరుద్యోగిత ఏర్పడుతుంది. అలాకాకుండా, పన్నులు తగ్గిస్తే సార్థక డిమాండ్ పెరిగి ఉద్యోగిత పెరుగుతుంది. అందుచేత సార్థక డిమాండ్ దెబ్బతినకుండా ఉండేలాగున పన్ను విధానాన్ని రూపొందించవలసి వుంటుంది. అంతేకాకుండా దేశీయావసరాలను దృష్టిలో పెట్టుకుని పన్నులను విధించవలసి వుంటుంది.

(ii) **పన్నుల ప్రభావం మరియు ద్రవ్యోల్బణం :** పన్నువిధానానికి ద్రవ్యోల్బణ పరిస్థితులలోనూ, ఆర్థిక మాంద్య పరిస్థితులలోనూ వేర్వేరు పాత్రలు పోషిస్తూ వుంటుంది. ద్రవ్యోల్బణ పరిస్థితులలో పన్ను విధానం ద్వారా కొనుగోలు శక్తి తగ్గించవలసి వుంటుంది. అందుచేత ఆదాయాల మీద మరియు వ్యయాలపైన పన్నులు విధించి ప్రజల వినియోగాన్ని తగ్గిస్తారు. అయితే ప్రత్యక్ష పన్నులే ఈ పరిస్థితులలో అధిక ప్రభావాన్ని చూపుతాయి. పరోక్ష పన్నులైన అమ్మకపు పన్ను ఎక్సైజ్ డ్యూటీల వల్ల వస్తుధరలు పెరిగి ద్రవ్యోల్బణం మరింతగా పెరిగే అవకాశం వుంది. పన్నులు విధించడంవల్ల, సార్థక డిమాండ్ తగ్గి ధరలు స్థిరత్వం పొందుతాయి. ఇదే ధరల స్థిరీకరణ అని అంటారు. పన్నులు విధించడం వల్ల అంటే అధికంగా విధించడం వల్ల వనరులు ప్రభుత్వం చేతిలోకి చేరతాయి. ఈ వనరులను ఉత్పాదక ప్రక్రియలకి ఉపయోగించడం వల్ల ఉత్పత్తి మరియు ఉద్యోగిత బాగా పెరుగుతాయి. అంతే కాకుండా పాదుపురేటు పెరగడానికి తగిన రాయితీలు కూడా యివ్వడం వల్ల మూలధన సంచయనానికి దారితీస్తుంది. దిగుమతి సుంకాల తగ్గింపు వల్ల కూడా ద్రవ్యోల్బణ పరిస్థితులే మెరుగవుతాయి.

(iii) **ఆర్థికమాంద్యం మరియు పన్నుప్రభావం :** ఆర్థికమాంద్య కాలంలో ప్రజల కొనుగోలు శక్తి పెంచవలసివుంది. దీనికొరకై పన్నురేట్లను తగ్గించవలసిన అవసరం వుంది. ముఖ్యంగా అల్పాదాయ వర్గాలపై పన్నురేట్లు తగ్గాలి. పరోక్షపన్నులను తగ్గించడం ద్వారా ఈ ప్రభావాన్ని పొందవచ్చు. అంతేకాకుండా లోటు బడ్జెట్ విధానాన్ని ఇక్కడ అందరు కోరుకుంటారు. దీనివల్ల ఆర్థిక ప్రక్రియ పెరగడమే కాకుండా ఉద్యోగిత కూడా పెరుగుతుంది. సార్థక డిమాండ్ పెరుగుతుంది. ఆర్థికమాంద్య పరిస్థితులలో పన్నువిధానం ద్వారా కొనుగోలు శక్తిని ధనికులనుండి పేదవర్గాల వారికి తరలించే వీలవుతుంది. దీంతో ఆదాయ అసమానతలు నివారించ వీలవుతుంది. పేదవర్గాల కొనుగోలు శక్తి పెంచడమే ఆర్థికమాంద్య పరిస్థితులలో ప్రభుత్వ తక్షణ కర్తవ్యం.

(iv) **నియంత్రణ ప్రభావం :** పన్నువిధానం ద్వారా ఉత్పత్తి వినియోగాలను దేశ ఆర్థిక లక్ష్యాలకనుగుణంగా నియంత్రించే వీలున్నది. కొన్ని వస్తువుల ఉత్పత్తిపై అధికంగా పన్నులు విధించి కొన్ని వస్తువుల ఉత్పత్తికి మినహాయింపులు కల్పించడం ద్వారా అమకున్న లక్ష్యసాధనని చేరుకోవచ్చు. అలాగే కొన్ని వస్తువుల వినియోగాన్ని కూడా పన్నుల ద్వారా నియంత్రించవచ్చు. కొన్ని వస్తువుల వినియోగంపై అధికంగా పన్నులు విధించడం ద్వారా ఆర్థిక లక్ష్యాలను సాధించవచ్చు. యింకా ఎగుమతి / దిగుమతి సుంకాల ద్వారా వస్తువుల ప్రవాహాన్ని నియంత్రించవచ్చు.

(v) **ఆర్థికవృద్ధి మరియు పన్నువిధానం :** జాన్ ఎడ్లర్ (John Adler) ప్రకారం, "ప్రైవేటు పొదుపు పెట్టుబడులను ప్రోత్సహించి, నిరుపయోగంగా వున్న వనరులను సమీకరించడానికి పన్ను విధానం ఒక ముఖ్యమైన సాధనం" అని అన్నాడు. అల్పాభివృద్ధి దేశాలలో పన్ను విధానం ద్వారా మూలధన సంచయనం అభివృద్ధి పరచడానికి దోహదపడుతుంది. అది ఏలాగంటే

(i) ఉత్పాదక మార్గాలవైపు నిరుపయోగంగా వున్న వనరులను తరలించవచ్చు.

(ii) మూలధన పరిశ్రమల స్థాపనకై పొదుపు పెట్టుబడులను ప్రోత్సహించవచ్చు; మరియు

(iii) వ్యర్థ వినియోగం నుండి వనరులను మూలధన వస్తు తయారీకి ఉపయోగించవచ్చును.

అభివృద్ధి చెందిన దేశాలలో మూలధన సంచయానికి పన్నువిధానం ఎంతో సహకరిస్తుంది. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలలో పన్ను విధానానికి కొన్ని పరిమితులున్నాయి. అందుచేత ఈ దేశాలు మూలధన సంచయానికి ప్రత్యేక మార్గాలు అన్వేషించవలసివుంది. అసలే తక్కువగా వున్న వినియోగంపై అదనంగా పన్నులు విధించినట్లైతే వినియోగం యింకా పడిపోతుంది. అయితే ప్రత్యక్ష పన్నుల ద్వారా అదనపు మూలధన సంచయానికి మార్గం సుగమం అవుతుంది. పాల్‌వాన్ ఫిలిప్స్ యిలా అన్నాడు. "సరియైనచోట అదనపు ప్రత్యక్ష పన్నులు విధించినట్లైన ప్రైవేటు మూలధన సంచయనం పెద్దగా తగ్గిపోదు. ముఖ్యంగా అభివృద్ధి యొక్క ముందు దశలలో, అంతే కాకుండా పన్ను ఆదాయం ద్వారా పబ్లిక్ మరియు ప్రైవేటు పెట్టుబడులు అధికంగా ఉత్పాదకతను సాధించే వీలుంది" అని అన్నాడు. ఈ విధంగా పన్నువిధానం ద్వారా ఆర్థిక వృద్ధి సాధించే వీలుంది.

13.5 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పన్ను విధాన నిర్ణయాలు - ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం :

ప్రభుత్వం బడ్జెట్ విధానం ద్వారా ప్రజల యొక్క శ్రేయస్సుని గరిష్టం చేయ ప్రయత్నం చేస్తుంది. దీనికొరకై అనేక ఆర్థిక విధానాలను బడ్జెట్ రూపంలో సం॥కి ఒకసారి రూపొందిస్తుంది. ప్రభుత్వం ఆ సం॥లో చేపట్టబోయే ఆర్థిక సామాజిక ప్రక్రియలకు బడ్జెట్ ఒక దర్పణం లాంటిది. అందుచేత బడ్జెట్ అంటే రెవెన్యూ అంచనాలు వ్యయం పరంగా అంచనాలలో కూడుకున్న ఒక విత్తపరమైన ప్రభుత్వ విధానం. చేపట్టబోయే ప్రభుత్వ కార్యక్రమాలు గురించిన వివరణ కూడా బడ్జెట్ పత్రంలో వుంటుంది. ఆర్థిక వ్యవస్థ యొక్క పనితీరును ఫండ్స్ యొక్క ప్రవాహం మూలంగాను మరియు కోశవిధాన పద్ధతుల ద్వారాను తెలుసుకోవచ్చు. ప్రభుత్వం ఆర్థికవ్యవస్థపై తను తీసుకున్న చర్యల కారణంగా ఏర్పడిన ఫలితాలపై సరియైన అవగాహన వుంటేనే కోశ మరియు ఆర్థిక విధానాలను నిర్ణయించగలదు (UNO, 1958). బడ్జెట్‌యొక్క పరిమాణం సం॥లు గడుస్తున్న కొద్దీ పెరుగుతోంది. ఎందుకంటే దేశీయావసరాలు పెరుగుతున్నాయి కనుక. భారతదేశంలో ప్రభుత్వంపై పొదుపు, పెట్టుబడి, మరియు మూలధన సంచయాలను పెంపొందించే గురుతర భాద్యత కూడా ఉంది. అందుచేత బడ్జెట్ ప్రాధాన్యతను సంతరించుకుంది.

బడ్జెట్ ప్రతిపాదించడంలో వున్న ముఖ్యమైన లక్ష్యాలు ఏంటంటే

(i) వేగవంతమైన ఆర్థికాభివృద్ధి (ii) ఆదాయ సంపద అసమానతలు తొలగించడం
(iii) ధరల స్థిరీకరణ (iv) ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం.

బడ్జెట్ విధానాల ద్వారా ఆర్థిక వ్యవస్థపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతుంది అనే విషయాన్ని బడ్జెట్‌లలో అనుసరించిన పన్ను విధానాల ద్వారా తెలుసుకుందాము.

13.5.1 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ (2002-2003) : పన్ను ప్రభావం :

బడ్జెట్ ప్రతిపాదించే నాటికి అనగా 2002-2003 సం॥లో 5.4 శాతం వృద్ధిని మాత్రమే సాధించవచ్చని ఆశించడమైనది. ఎందుకంటే పరిశ్రమల రంగం కుంటుపడింది కావున మిగతా చలాంకాలన్ని మెరుగ్గా వున్నాయి. ద్రవ్యోల్బణం 1.1 శాతానికి

పడిపోయింది. విదేశీమారక నిల్వలు $ 50 బిలియన్లకి చేరుకున్నాయి. పెట్రోలు ధరలు పడిపోవడం మరియు ఆహారనిల్వలు 60 మిలియన్ టన్నులకి పెరగడం మొదలైన మంచి ఫలితాలవల్ల బడ్జెట్ ప్రభావం దేశం మీద మంచిగా వుంటుందని ఆశించడమైనది. బడ్జెట్‌ను ప్రతిపాదిస్తూ ప్రభుత్వం మొత్తం ఆర్థికవ్యవస్థ తిరోగమనదశలో వున్నదని గ్రహించి పన్ను విధానాన్ని దానికనుగుణంగా ప్రకటించింది. ఈ పన్ను విధానం మూలంగా డిమాండ్ తిరిగి పెరుగుదల ఆరంభిస్తుందని, పెట్టుబడి మరియు ఉత్పాదకత పెరిగి ఆర్థికవృద్ధి వేగవంతమవుతుందని తలచింది. దీనికొరకై టాక్స్‌బేస్‌ని విస్తృతపరచి, పన్ను నిర్మాణతను సులభతరం మరియు ఆధునీకరించి (Rationalise) పన్నుని స్వచ్ఛందంగా ప్రజలు కట్టేలాగున ప్రోత్సహించ నిశ్చయించింది.

పరోక్ష పన్నుల పరంగా ప్రత్యేక ఎక్సైజ్ సుంకాన్ని అనేక వస్తువుల మీద తగ్గించింది - సర్వీస్ పన్నుని విస్తృతపరచింది. అలాగే కస్టమ్స్ సుంకాన్ని కూడా తగ్గించింది. ఈ ప్రతిపాదనల వలన ఎక్సైజ్ సుంకం ద్వారా అదనంగా రూ. 6,700 కోట్లు మరియు దిగుమతి సుంకం ద్వారా రూ. 2,200 కోట్లు వస్తుందని అంచనావేయడం జరిగింది.

ప్రత్యక్ష పన్నుల విషయంలో అదాయపు పన్నురేట్లను మార్చకుండా యధాతధంగా వుంచింది. పెట్టుబడులు పెంచడానికి మాత్రం అదనపు తరుగుదలని 15% వరకు అనుమతించి అదికూడా క్రొత్త ప్లాంట్ మరియు యంత్రసామాగ్రిపై అనుమతించడం జరిగింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికై పన్నురేటుని 48% నుండి 40% తగ్గించింది. హోటల్స్‌పై వ్యయపన్ను (Expenditure Tax) రూమ్ ఛార్జెస్ రూ. 3000 దాటితే విధించడం జరిగింది. గృహ ఋణాల వడ్డిపై పన్ను రాయితీ కొనసాగించింది ప్రభుత్వం. అదాయపు పన్నుపై గుజరాత్ సర్‌ఛార్జ్ 2 శాతం ఎత్తివేయడం జరిగింది. ఈ ప్రతిపాదనల వల్ల అదనంగా ప్రభుత్వానికి రూ. 6000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయడం జరిగింది.

2002-03 బడ్జెట్‌ను పారిశ్రామికవేత్తలు మరియు స్థిర ఆదాయ వర్గాలవారు అర్పించలేదు. ముఖ్యంగా 5 శాతం సర్‌ఛార్జిని మధ్యాదాయ వర్గాలపై విధించడం జరిగింది. అలాగే వంటగ్యాస్ మరియు కిరోసిన్ ధరలు పెంచి సామాన్యుడిపై భారం మోపింది ప్రభుత్వం. అంతేకాకుండా కోశలోటు 2001-02 లో 4.7 శాతం వుంటే 2002-03 లో 5.7 శాతానికి (G.D.Pలో) పెరిగింది. దీనికి కారణం కార్పోరేటు పన్ను, ఎక్సైజ్ సుంకం మరియు దిగుమతి సుంకంనుండి ఆదాయం బాగా తగ్గింది. పన్ను లక్ష్యాలు ఆకావికలు అయ్యేయి. 2000-01 లో దిగుమతి సుంకాలనుండి ఆదాయం బాగా తగ్గిన ఈ బడ్జెట్‌లో కూడా దిగుమతి సుంకాలు తగ్గించడం జరిగింది. దీనికి కారణం WTO యొక్క వివిధిధాల కనుగుణంగా దిగుమతి సుంకాలు తగ్గించడం జరిగిందని చెప్పవచ్చును. ఈ విధంగా పరిశ్రమకి ఈ బడ్జెటుపరంగా రాయితీలు లేవు. దీంతో ఉద్యమిత్వ లక్షణాలు కుంటుపడే అవకాశం వుంది. మధ్యాదాయ వర్గాలపై అధిక భారాన్ని అదాయపు పన్ను రూపంలో అంటే 5% సర్‌ఛార్జ్ పెంచడం, మరియు పన్ను రిబేటు కూడా తగ్గించి వేయడం వల్ల ఈ వర్గాలపై పన్నుభారం అధికం అవుతుందని చెప్పవచ్చు. ధనికవర్గాలు పన్ను ఎగవేత ద్వారా పన్నుకట్టరు. వ్యాపారస్తులు తప్పుడు లెక్కలు చూపి పన్నుకట్టరు. దీంతో పన్నువిధానం తిరోగామిగా వుందనడంలో సందేహం లేదు.

13.5.2 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ (2003-04) పన్ను ప్రభావం :

2003-04 బడ్జెట్‌ను ఫిబ్రవరి 28, 2003 న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం జరిగింది. పన్నువిధానం పరంగా పన్ను సవరణలు (Tax Reforms) తీసుకువచ్చి కోశ విధానాన్ని పటిష్టపరచా (Fiscal Consolidation) లని ఈ బడ్జెట్ ఉద్దేశ్యంగా పెట్టుకుంది. అంతే కాకుండా బడ్జెట్‌లో లోపాలను పురోగామిగా సవరించాలని (Progressive elimation) మరియు అదనపు ఎక్సైజ్ సుంకాన్ని మెరుగుపరచాలని కూడా కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. యింకా, ఏప్రియల్ 1, 2003 నుండి విలువ ఆధారిత పన్నుని (VAT) మరియు సర్వీస్ పన్నులను రాష్ట్రస్థాయిలో విధించాలని నిర్ణయించింది. ఈ పన్ను లక్ష్యాలు "పాంచ్ ప్రాధాన్యతల"లో ఒకట్టెయ్యింది. ఈ పాంచ్ ప్రాధాన్యతలలో (Panch Priorities) దిగుమతి సుంకాన్ని (Customs Duty) ప్రజల జీవితాల్ని కాపాడే అత్యవసర మందుల తయారి యంత్రాలు, సామాగ్రిపై 25 శాతం నుండి 5 శాతానికి తగ్గించి వేసింది. ఈ మందుల మీద ఎక్సైజ్ సుంకాన్ని

పూర్తిగా ఎత్తివేసింది. దీంతో ఈ మందుల తయారిని దేశీయ ఉత్పత్తిదారులే చేపట్టడానికి మార్గం సుగమం అయ్యింది. నెలసరి స్థిర ఆదాయ వర్గాలకి స్టాండర్డ్ డిడక్ట్‌ని రూ॥ 30,000 కి పెంచింది. 60 ఏళ్ళుపైబడిన వ్యక్తులకి రిబేటుని రూ. 20,000 కు పెంచింది. అదాయపు పన్నురేట్లు పురోగామి విధానంలో ఏ మార్పు చేయలేదు. అయితే అంతక్రితం విధించిన గుజరాత్ భూకంపం సర్‌ఛార్జ్ 5 నుండి 25 శాతానికి తగ్గించారు. పరోక్ష పన్నుల పరిధిలో మూడంచెల (3-tier) ఎక్సైజ్ సుంకాన్ని 8%, 16% మరియు 24% విధించడానికి నిర్ణయించడమైనది. కేంద్ర అమ్మకపు పన్ను (Central Sales Tax) దశలవారీ ఎత్తివేసి విలువ ఆధారిత పన్నుని విధించాలని బడ్జెట్ ప్రతిపాదించింది. సర్వీస్ పన్నుని విధించడానికి కేంద్ర ప్రభుత్వం రాజ్యంగ సవరణ చేయ నిశ్చయించింది. ఈ సవరణ ద్వారా కేంద్రప్రభుత్వానికి సర్వీస్ టాక్స్ విధించే హక్కు వస్తుంది.

2003-04 బడ్జెట్‌ని ప్రతిపాదించేటప్పుడు ప్రభుత్వం కేల్కర్ కమిటి పన్ను విధానం మీద సూచనలను దృష్టిలో వుంచుకున్నప్పటికి కేల్కర్ కమిటి నివేదించిన సూచనలలో అధికశాతాన్ని ప్రభుత్వం ఒప్పుకోలేదు. దీనికి కారణం 2004 లో ఎన్నికలే కారణం. ప్రత్యక్ష పన్నుల పరంగా ఏ ఒక్క కేల్కర్ సూచననూ ఒప్పుకోవడం జరగలేదు. దీంతో ఆదాయపు పన్నులో మార్పులు చేయలేదు (రేట్లు 10%,20%,30%) కార్పోరేట్ పన్ను రేట్లు కూడా అలాగే వున్నాయి (35%, 40%). పెట్టుబడిని బాగా పెంచడానికి డివిడెండ్ పన్నుని ఎత్తివేయమని కేల్కరు సూచించగా ప్రభుత్వం 12.5% అలాగే వుంచింది. ప్రభుత్వ విత్తశాస్త్ర సూత్రం ప్రకారం ప్రభుత్వం ఎకానమి సూత్రం ఆధారంగా షేర్ హోల్డర్స్ దగ్గరనుండి కాక కంపెనీల దగ్గరనుండే వసూలు చేయ నిశ్చయించింది. దీంతో ప్రభుత్వానికి సులభంగా రెవెన్యూ వసూలయ్యే అవకాశం వచ్చింది. స్టాండర్డ్ డిడక్షన్ 30,000 పెంచి కొంత ఊరట కలిగించిన టాక్స్ రిబేటుని 20% నుండి 15% తగ్గించడం వల్ల పొదుపు తగ్గి ఖర్చు పెరుగుతుందని ప్రభుత్వం యొక్క ఆలోచన. దీనివలన ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరిగి పారిశ్రామిక రంగం వృద్ధి రేటు సాధించే వీలుంది. దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితులు పునరావృతం కాకుండా వుంటాయి. అయితే మధ్యాదాయ వర్గాలు అదాయపుపన్ను మినహాయింపులో మార్పు లేకపోవడంవల్ల మరియు రిబేటు తగ్గిపోవడం వల్ల అధిక మొత్తంలో పన్నులు చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఆలోచన ఏంటంటే ప్రత్యక్ష పన్నుల వాటాని స్థూలదేశీయోత్పత్తిలో పెంచాలని, అంతేకాకుండా అధిక రెవెన్యూని అదాయపు పన్నుద్వారా రాబట్టాలన్నది విధానంగా పెట్టుకుంది. అయితే ప్రభుత్వ మాటల్లో చెప్పాలంటే, "కోశవిధానాన్ని పటిష్టం చేయడానికి వ్యయానికి పునఃప్రాధాన్యతలు కల్పించడం (Expenditure Reprioritisation) లేక రెవెన్యూని పెంచడం (Revenue Augmentation)" అని అనడం జరిగింది. దీంతో వ్యయాన్ని సవరించింది. అంటే వ్యయాన్ని రూ. 6,296 మేర తగ్గించింది. అయితే రెవెన్యూ పెంచడం మాటల్లోనే తప్ప చేతల్లో లేకపోవడంచేత పన్ను ఆదాయం రూ. 1,64,177 కోట్లు మాత్రమే వుంది (గడచిన సం॥లో రూ. 172965 కోట్లు) అంటే రూ 8,788 కోట్లమేర పడిపోయింది. అలాగే "టాక్స్ - GDP" నిష్పత్తి కూడా (కేంద్ర ప్రభుత్వం) 1995-96 లో 10.5 శాతం వుంటే 2002-03 లో 9.2 శాతంకి తగ్గింది. కేల్కరు కమిటి సూచనలు రెవెన్యూ - తటస్థతని (Revenue - neutrality) సూచిస్తుంటే, కేంద్రప్రభుత్వం ఆ ప్రతిపాదనలు (Kelkar Committe Recommendation) ఒప్పుకొనకపోయినా ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలు మూలంగా యించుమించు అదే ఫలితాన్ని యిస్తున్నాయి. ఎందుకంటే ఎన్నికల సం॥లో పన్ను చెల్లించే వారి సంఖ్య బాగా తగ్గి రెవెన్యూ వసూళ్ళు గణనీయంగా పడిపోతాయి.

మధ్యాదాయ వర్గాల వారికి మరియు అధికాదాయ వర్గాలవారికి కొన్ని మంచి విషయాలున్నాయి. గృహ ఋణాల అప్పులపై గరిష్ఠ మినహాయింపుని రూ.1,50,000 గా నిర్ణయించింది. అయితే కేల్కర్ కమిటి దీనిని రూ. 50,000 కి తగ్గించమని సూచన చేసింది. దీంతో గృహ నిర్మాణాలు ఊపందుకుంటాయి. దీంతోపాటుగా గృహనిర్మాణ అప్పులపై వడ్డీరేట్లు బాగా తగ్గడంతో ప్రజలు సొంత యింటి నిర్మాణం అధికంగా చేపట్టడం జరిగింది. ఇది ప్రజాశ్రేయస్సు పెరగడానికి నిదర్శనం. అలాగే పిల్లల చదువుకైన ఖర్చులో ఒక పిల్లవానికి రూ. 12,000 చొప్పున ఇద్దరిపిల్లల విద్యాఖర్చుకి (మొత్తం రూ. 24,000) 15 శాతం రిబేటు ఇచ్చింది ప్రభుత్వం. దీంతో విద్యాభివృద్ధికి చేయూతనివ్వడం జరిగింది. దీంతో మానవ మూలధన సంచయానికి మార్గం సుగమం అయ్యిందని చెప్పుకోవచ్చు. అయితే విద్యకి 2002-03 లో ఎంతైతే కేటాయించారో (రూ. 7025) అంతే 2003-04 లో కేటాయించడం

జరిగింది.

పరోక్షపన్నుల విషయంలో ప్రభుత్వం VAT అమలును ఒక సం॥ వాయిదా వేసింది. రాష్ట్రప్రభుత్వాలన్ని ఏవో కొన్ని అపోహలు వ్యక్తీకరించాయి. అందువల్ల ఏప్రియల్ 1, 2005 నుంచి అమలు చేయాలని (దేశమంతటా) ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లో 1995 నుండి VAT అమలులోవుంది. దీంట్లో కాస్కేడింగ్ (Cascading) సమస్య వుండదు. ఉత్పత్తికి ముందర ఏ దశలోనైనా పన్ను చెల్లిస్తే దానికి క్రెడిట్ ఇస్తారు. వ్యాపారాభివృద్ధికి మరియు ప్రభుత్వానికి ఉభయ తారకంగా వుంటుంది.

ఈ బడ్జెట్ వల్ల కోశవిదాన పటిష్టత (Fiscal Consolidatioin) ఎంతవరకు జరిగిందనేది ప్రశ్నార్థకం. ఆర్థిక వ్యవస్థలో బడ్జెట్ ప్రభావం నిజానికి దూరంగా వుందని చెప్పవచ్చు.

13.5.3 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ (2004-05) (బడ్జెట్ అంచనాలు) :

కేంద్రప్రభుత్వం జూలై 8, 2004 న బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దీంట్లో కాలయాపన జరగడానికి కారణం దేశంలో సాధారణ ఎన్నికలు, 2004 ఏప్రియల్/మే లో జరగడమే. ఈ బడ్జెట్‌ను UPA ప్రభుత్వం NCMP (National Common Minimum Programme) ఆధారంగా ప్రవేశపెట్టింది. దీనిని గ్రామీణ బడ్జెట్ అని అనవచ్చు. ఎందుకంటే గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసింది. అయితే పెరుగుతున్న కోశలోటు (Fiscal Deficit) నేపధ్యంలో బడ్జెట్ ప్రవేశ పెట్టబడింది. దీంతోపాటుగా ద్రవ్యోల్బణం మొదటిసారిగా (చాలాకాలం తర్వాత) పెరగనారంభించింది. అందుచేత ఈ బడ్జెట్ కోశ విధానాన్ని పటిష్టతను మరియు ఆర్థిక సవరణలను వేగవంతం చేయ నిశ్చయించి వ్యవసాయం, విద్య, మరియు ఉపాధి అవకాశాలను అభివృద్ధి పరచాలని ఆశయంగా పెట్టుకుంది.

పన్నువిధానం పరంగా ప్రభుత్వం పెద్దమార్పులను తీసుకురాలేదు. ముఖ్యంగా ఆదాయపు పన్ను మినహాయింపుని రూ 1,11,000/- వరకు పెంచి అల్పాదాయ వర్గాల వారికి మేలు చేసిందని చెప్పవచ్చు. దీనివల్ల 1.4 కోట్లమంది ప్రజలకి మేలు కల్గుతుందని అంచనా. దీనివలన పన్ను యంత్రాంగానికి కూడా పని తగ్గిపోయే అవకాశముంది. అయితే ఈ పరిమితిని దాటితే 2003-04 పన్ను రేట్లు, మినహాయింపులు వర్తిస్తాయి. స్థిర ఆదాయవర్గాల వారికి తీరని నష్టం జరిగింది.

దీర్ఘకాల కేపిటల్ గెయిన్స్ మీద పూర్తిగా పన్ను ఎత్తివేయడం వల్ల సెక్యూరిటీస్‌లో లావాదేవీలు పెరుగుతాయి. స్వల్పకాల కేపిటల్ గేయిన్స్‌మీద 10 శాతం పన్నురేటు విధించబడుతుంది. అయితే ప్రభుత్వం ఇంత ఎక్కువగా విత్త ఆస్థులను మరియు మార్కెట్లను ప్రోత్సహించనవసరంలేదు. అయితే ప్రభుత్వం బడ్జెట్‌లో విత్త లావాదేవీలపై 0.15 శాతంని స్టాక్ ఎక్సేంజ్‌లో లావాదేవీల విలువపై విధించింది. దీంతో సెన్సెక్స్ (Sensex) పతనం ప్రారంభమైంది. కేపిటల్ గెయిన్స్ పన్నుకి ఈ ఛార్జ్ ప్రత్యామ్నాయం కాదు.

ప్రభుత్వం ఈ పన్ను విధానాల ద్వారా ప్రత్యక్ష పన్నుల ద్వారా అదనంగా రూ. 2000 కోట్లు వస్తాయని మరియు పరోక్షపన్నుల ద్వారా రెవెన్యూ " తటస్థంగా " వుంటుందని వివరించింది. ఇది ఎలావుందంటే ఏమీలేనిదాన్ని కొండంతలు చేసి మాట్లాడినట్లుగా వుందని చెప్పవచ్చును. బహుశ రెవెన్యూని పెంచే పద్ధతులు ఫలాన్నివ్వాలంటే ఏళ్ళు పడుతుంది. అయితే స్థూల దేశియేత్పత్తిలో కోశలోటు ఈ బడ్జెట్‌లో తక్కువ వుందని చెప్పవచ్చు. పటం.5 చూడండి. 2003-04 సవరించిన అంచనాలతో పోలిస్తే తక్కువ. 2004-05 బడ్జెట్‌లో కోశలోటు 4.4 శాతం వుంటే 2003-04లో 5.6 శాతం వుంది. కష్టకాలంలో కేంద్రప్రభుత్వం మంచి బడ్జెట్‌ను అందించడంలో సఫలీకృతం అయ్యిందని చెప్పవచ్చు.

పరోక్ష పన్నుల విషయానికొస్తే దిగుమతి సుంకాలను ఒక కొలమానంలో తగ్గించాలని నిర్ణయించింది కేంద్రం. దీనికి కారణం ASEAN దేశాలతో సమానమైన టారిఫ్ రేట్లను తీసుకురావడానికి అలాగే స్టీల్, కాపర్, లెడ్, జింక్ మొదలగు ముడిసరుకులపై 15 శాతం దిగుమతి సుంకాన్ని తగ్గించడం జరిగింది. ఎక్సైజ్ సుంకం ట్రాక్టర్లపై పూర్తిగా ఎత్తివేసి వ్యవసాయరంగం ఆధునీకరించడానికి మార్గం సుగమం అయ్యింది. ఆరోగ్యరంగంలో దిగుమతి సుంకాన్ని 5 శాతానికి తగ్గించి ఆరోగ్య పనిముట్లు తేలికగా లభ్యమయ్యేలాగున ప్రభుత్వం నిర్ణయాలు చేపింది. అలాగే కంప్యూటర్లు, LPG గ్యాస్‌స్టవ్‌లు మొదలైనవాటి మీద ఎక్సైజ్ రేట్లు సడలించింది. తప్పనిసరి CENVAT నుండి చేనేత మరియు పవర్ మగ్గాలను తప్పించి టెక్స్‌టైల్ రంగానికి క్రొత్తపన్ను విధానాన్ని ప్రవేశపెట్టదలచింది. సర్వీస్‌పన్నుని 8.1 నుండి 10% కి పెంచ తలపెట్టింది ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం. వస్తువులమీద సేవలమీద పన్నుని సమైక్యం చేయాలన్న ఆశయాన్ని పెట్టుకుంది.

పట్టిక. 5. :

కేంద్రప్రభుత్వ బడ్జెట్ - 2004-05

	వివరములు (నాస్తవమైన)	2002-03 బడ్జెట్ అంచనాలు	2003-04 సవరించిన అంచనాలు	2003-04 బడ్జెట్ అంచనాలు	2003-05
1.	రెవెన్యూ రాబడి	231748	253935	263027	309322
	పన్నురాబడి: (కేంద్రం)	159425	184169	187539	233906
	పన్నేతర రాబడి	72323	69766	75488	75416
2.	మూలధన రాబడి	182414	184860	211228	168507*
3.	మొత్తం రాబడి	414162	438795	474255	477829
4.	ప్రణాళికేతర వ్యయం	302708	317821	352748	332239
5.	ప్రణాళికా వ్యయం	111455	120974	121507	145590
6.	మొత్తం వ్యయం	414162	438795	474255	477829
7.	రెవెన్యూ వ్యయం	339628	366227	362887	385493
8.	మూలధన వ్యయం	74535	72568	111368	92336
9.	రెవెన్యూ లోటు (7-1) (4.4)	107880 (4.1)	112292 (3.6)	99860 (2.5)	76171
10.	కోశ లోటు {6-(1+ అప్పు రికవరీలు + ఇతర రాబడులు}	145072 (5.9)	153637 (5.6)	132103 (4.8)	137407 (4.4)
11.	ప్రాధమికలోటు (10-వడ్డీచెల్లింపులు)	27268 (1.1)	30414 (1.1)	7548 (0.3)	7907 (0.3)

* మార్కెట్ స్థిరీకరణ పధకం ద్వారా సమీకరించే రూ॥ 60,000 కోట్లు ఈ అంచనాలలో కలపలేదు.

మూలం : (Southern Economist, July 15, 2004, p.4)

అయితే ఎన్ని సంస్కరణలు చేపట్టినా రెవెన్యూ లోటు మరియు కోశ లోటు పెరుగుతూ వుండడం శోచనీయం. రెవెన్యూ లోటు పూర్తిగా 2007-08 నాటికి తొలగిపోతుందని అంచనా. అయితే అది 2008-09 పట్టవచ్చు లేదా 2010-11 పట్టచ్చు. అది ప్రభుత్వం చేతిలో లేదు. కోశ లోటు పెరగడం పట్ల IMF, ప్రపంచ బ్యాంక్ మరియు భారతదేశ రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పైన చెప్పిన పన్నువిధానాలు అన్ని కూడా స్థిర ఆదాయవర్గాలమీద అల్పాదాయవర్గాల మీద భారంగా తయారయ్యాయి. మొత్తం స్థూలపన్ను రాబడిలో పరోక్ష పన్నులు సింహభాగాన్ని ఆక్రమించి 1996-97లో 69.9 శాతం వుండగా 2002-03 నాటికి 71.7 శాతంగాను, 2004-05 లో బడ్జెట్ అంచనాల ప్రకారం 56.1 శాతానికి తగ్గింది. పరోక్షపన్నుల ఎక్కువగా రాబడి నిస్తున్నాయంటే పేదప్రజలు ఎక్కువగా పన్నులు కడుతున్నట్టుగా వుంటుంది. కాబట్టి తిరోగామి పన్నువిధానాన్ని సూచిస్తున్నాయి. ఒకసారి శ్రీ రాజీవ్ గాంధి ఇలా అన్నారు, " ఒక రూపాయి పేదల మీద ఖర్చుచేస్తే దానిలో 15 పైసలే వారికి సంక్షేమ కార్యక్రమాల ద్వారా అందుతోంది." ప్రణాళికా సంఘం ఏమన్నదంటే, " 10 పైసలు మాత్రమే పేదలకు సంక్షేమపథకాల ద్వారా అందుతోంది." ప్రత్యక్ష పన్నులు శాతం మొత్తం రాబడిలో పెరిగితే ధనిక వర్గాలవారు అధికంగా పన్నుభారానికి గురిఅవుతారు. 1996-97లో ప్రత్యక్షపన్నుల రాబడి శాతం 30.1 వుండగా, 2002-03 లో 28 శాతం తగ్గి 2004-05 బడ్జెట్ అంచనాల ప్రకారం 43.9 శాతానికి పెరిగింది. ఇది ముదావహం. అధికాదాయవర్గాల వారిని ఎక్కువగా పన్నులకు గురిచేస్తే పొదుపు పెట్టుబడులు తగ్గిపోతాయని అనుకున్నాము. అయితే ఆ పొదుపు పెట్టుబడులను ప్రభుత్వమే చెయ్యచ్చు, మార్కెటు వ్యవస్థవైపు మొగ్గుచూపుతున్నాం కాబట్టి ఈ విషయాన్ని ఆలోచించాలి. 1996-97లో మొత్తం పన్ను రాబడి రూ 1288 బిలియన్లుంటే, 2004-05 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ. 3177 బిలియన్లకి పెరుగుతుందని అంచనా.

13.6 సారాంశం

వేగవంతమైన ఆర్థికవృద్ధిని సాధించడానికి భారతప్రభుత్వానికి పన్నువిధానం ఒక కీలకమైన స్థూల ఆర్థిక విధాన సాధనం (Instrument of Macro Economic Policy). ప్రభుత్వం ఆర్థిక లక్ష్యాల ననుసరించి ప్రత్యక్ష పరోక్ష పన్నుల విధానాన్ని రూపొందిస్తుంది. ఈ విధానం ద్వారా పొదుపు పెట్టుబడులను ప్రోత్సహించి, ఆదాయ, సంపద అసమానతలను తగ్గించి, మరియు ఆర్థిక స్థిరీకరణకి తోడ్పడుతుంది, ప్రభుత్వం. అయితే ఒక మంచి పన్ను విధానాన్ని (Ideal Tax System) రూపొందించడం చాలా క్లిష్టతరమైన విషయం. ఎందుకంటే పన్నువిధానం ఆర్థికవ్యవస్థపై బహుళప్రభావాన్ని (Multiple effects) చూపుతుంది. ఈ ప్రభావాలన్నింటిని ముందుగా ఊహించడం కష్టం. భారతదేశంలో ప్రత్యక్ష పన్నులతో పోలిస్తే పరోక్ష పన్నులనుండి అధికాదాయం ప్రభుత్వానికి వస్తుంది. పరోక్ష పన్నులు ధనిక, పేద వర్గాల మధ్యన తటస్థంగా ఉండే లక్షణం ఉండడం వలన అల్పాదాయ, పేద వర్గాలు పన్నుభారాన్ని అధికంగా మోస్తారు. దీంతో పన్నువిధానం తిరోగామిగా మారిపోతుంది. అదే పశ్చిమ యూరోపియన్ దేశాలలో ప్రత్యక్షపన్నుల నుండి అధికంగా ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. భారతదేశంలో ప్రత్యక్షపన్నుల బేస్ (Tax Base) చాలా సంచితమైనది. అందుచేత పరోక్షపన్నుల శాతం (మొత్తం పన్ను ఆదాయంలో) తగ్గి ప్రత్యక్ష పన్నులశాతం పెరగవలసివుంది. 2003-2004 సం॥లో మొత్తం పన్ను రాబడిలో ప్రత్యక్ష పన్నులనుండి 29 శాతం, పరోక్ష పన్నులనుండి 71 శాతం ఆదాయం ప్రభుత్వానికి వస్తోంది. అంతేకాకుండా టాక్ - GDP నిష్పత్తి 1950-51 లో 6 శాతం వుంటే 2003-04 లో 17 శాతానికి పెరిగింది. NIPFP అనే పరిశోధనా సంస్థ భారతదేశ పన్ను వ్యాకోచత్వం 1 కన్నా తక్కువగా (0.96) అంచనా వేసారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆదాయ పరిస్థితి. రాష్ట్రాల ఆదాయ వ్యాకోచత్వం 1 కన్నా ఎక్కువ. భారతదేశ విత్త అవసరాలు దృష్టిలో పెట్టుకుంటే పన్నురాబడి తక్కువనే చెప్పవచ్చు. దీనికి తోడు పన్ను ఎగవేత సమస్య జటిలంగా తయారైంది. అంతేకాకుండా అదనంగా రంగాలను పన్ను పరిధిలోకి తీసుకొచ్చి రాబడి పెంచుదామంటే రాజకీయ జోక్యం పెద్ద అడ్డంకిగా మారింది. దీనికి ఉదా॥ వ్యవసాయాదాయంపై ఆదాయం పన్ను విధింపు. భారతదేశ పన్ను విధానాన్ని ప్రక్షాళన చేయటానికై అనేక విత్త సంఘాలను నియమించింది. ఈ

సంఘాధ్యక్షులుగా కాల్డర్, ముథాయి, భూతలింగం, రూ, వాంచూ, భోక్సీ, రాజాచెల్లయ్య మొదలైనవారున్నారు. వీరు అనేక మార్పులను ప్రభుత్వానికి సూచించడం జరిగింది. ప్రభుత్వం వీటిని కాలానుగుణంగా అమలు చేస్తూ వస్తోంది.

పన్ను విధానం ద్వారా వనరులపరంగా అభిలషణీయ పంపిణి జరగాలి. ఈ ప్రభావం ప్రభుత్వం యొక్క ఆర్థిక విధానాలనుబట్టి వుంటుంది. అంటే మార్కెట్టు వ్యవస్థపై మొగ్గుచూపితే ఒక రకమైన ప్రభావం, మార్కెట్టుపై ప్రభుత్వ జోక్యం అధికంగా వుంటే ఒక రకమైన ప్రభావం వుంటుంది. మార్కెట్ వ్యవస్థపరంగా తటస్థపన్ను విధానాన్ని అవలంభించాలని, ప్రభుత్వ నియంత్రణ అధికంగా వుంటే తటస్థ పన్ను విధానాన్ని విడనాడాలని ఆర్థిక శాస్త్రవేత్తలు సూచించడం జరిగింది. భారతదేశంలో మిశ్రమ ఆర్థిక విధానం అమలులో వుంది. కాబట్టి ముఖ్యంగా 80 వ దశకం వరకు దానికి తగ్గట్టుగా పన్నువిధానం రూపొందించబడింది. 90 దశాబ్దంలో సరళీకృత ఆర్థిక విధానాలకనుగుణంగా పన్నువిధానాన్ని తయారుచేయడం జరిగింది. కాబట్టి పన్ను విధాన ప్రభావాన్ని అంచనా వేసేటప్పుడు ఈ విషయాలను మనసులో పెట్టుకోవలసి వుంది.

అయితే పన్నుభారం మోపబడ్డ వ్యక్తి తనయొక్క పని, పొదుపు మరియు పెట్టుబడులకు తగిన విధంగా మార్పు చేసుకుంటాడు. పన్నుభారం పెరిగితే పని తగ్గిపోతుంది. అయితే అన్ని పన్నుల ప్రభావం ఒకే మాదిరిగా వుండవు. పన్నులవల్ల ప్రోత్సాహకాలు కూడా తగ్గే ప్రమాదం వుంది. ప్రత్యక్షపన్నులు పొదుపు పెట్టుబడులను దెబ్బతీస్తాయి. పరోక్షపన్నులపై చెడుప్రభావం అంతగా వుండదు. ప్రత్యక్ష పన్ను అయిన వ్యయపన్నుపరంగా కూడా చెడుప్రభావం అంతగా వుండదు. ఆదాయపుపన్ను పురోగామి పన్నువిధానం. అందుచేత చెడుప్రభావం అధికంగా వుంటుంది. పిగూ పన్నుభారం వలన మానసిక వత్తిడి పెరిగి పొదుపు పెట్టుబడులు దెబ్బతింటాయని అన్నాడు.

పన్నులు విధించడం మూలంగా వనరులయొక్క అభిలషణీయ పంపిణి వేర్వేరు ఉపయోగాల మధ్యన ఎట్లా మార్పు చెందుతుందో తెలుస్తుంది. మార్షల్ క్షీణ ప్రతిఫలాలున్న పరిశ్రమపై పన్ను విధించమన్నాడు. డాల్టన్ వస్తువుపై ఉన్న డిమాండ్ వ్యాకోచత్వాన్ని బట్టి పన్ను ప్రభావాన్ని అంచనా వెయ్యాలన్నాడు. వ్యాకోచత్వం ఎక్కువగా వుంటే ఉత్పత్తి తగ్గి పెట్టుబడి ఇతర మార్గాల వైపు తరలిపోతుంది. సప్లై వ్యాకోచత్వం కూడా పన్ను ప్రభావాన్ని ప్రభావితం చేస్తుంది. తర్వాత ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల విషయంలో కూడా ప్రభావం వేరుగా వుంటుంది. ప్రత్యక్ష పన్నులతో పోలిస్తే, పరోక్షపన్నుల ద్వారా దేశ ఆర్థికవ్యవస్థకి అధికమోని జరుగుతుంది. అయితే ఒక రంగం అధికంగా వనరులను ఉపయోగిస్తున్నట్లైతే, ఆ రంగంమీద పరోక్షపన్నులు విధించిన, వనరులు అభిలషణీయ పంపిణి జరిగే వీలుంది.

అలాగే ఒక కార్మికుడు పన్నుల విధింపు వల్ల తన ఉద్యోగితను ఒక పరిశ్రమనుండి వేరొక పరిశ్రమకు తరలిస్తాడు. అంటే పన్ను అధికంగా వున్న చోటనుండి పన్ను భారం తక్కువగా వున్న పరిశ్రమకు తరలిపోతాడు. పురోగామి ఆదాయపు పన్ను విధానంలో శ్రమమీద పునఃపంపిణి ప్రభావం అధికంగా వుంటుంది. అలాగే పురోగామి పన్నుల విధానంలో పెట్టుబడి రిస్కులేని వెంచర్లలోకి, రిస్కువున్న వెంచర్లనుండి, తరలిపోతుంది. పన్ను యంత్రాంగం పన్నువల్ల వచ్చే నష్టాన్ని భర్తీ చేసే వీలు (Loss-offset) కల్పిస్తే పన్ను ప్రభావం వుండదు. యింకా బహుమతి పన్ను మరియు ఎస్టేట్ పన్నుల వల్లకూడా ఏ విధమైన చెడుప్రభావం పెట్టుబడిపై వుండదు.

వ్యయపన్ను విధించడంవల్ల విలాసవంత వస్తువుల తయారి నియంత్రించబడుతుంది. పెట్టుబడి వినియోగంపై అధికంగా పన్నువిధిస్తే రిస్కులో వున్న వెంచర్లపై పెట్టుబడి తరలిపోతుంది. పురోగామి రేట్లలో తగ్గినన్ని రాయితీలలో వ్యయపన్ను విధిస్తే పెట్టుబడిని సరియైన మార్గాలవైపుకి మళ్ళించవచ్చు.

పన్నుయొక్క ప్రభావం ఉత్పత్తి కారకాల సప్లైపై కూడా వుంటుంది. ఉదా॥కు. సమాగమ ఆదాయపుపన్నుని విధించడంవల్ల శ్రమ-ఖాళిని సమన్వయం చేయడంలో ఆదాయ మరియు ప్రత్యామ్నాయ ప్రభావాలు వాటి ఉనికిని నిరూపిస్తాయి. ఆదాయ ప్రభావం

బలీయంగా వుంటే శ్రామిక సప్లై పెరుగుతుంది, ప్రత్యామ్నాయ ప్రభావం ఎక్కువగా వుంటే శ్రామిక సప్లై తగ్గుతుంది. పురోగామి ఆదాయపు పన్ను విషయంలో శ్రమకి తీవ్రహాని కలుగుతుంది. పరోక్షపన్నుల విధానంలో కూడా ప్రభావం ఈ విధంగానే వుంటుంది.

పన్నులను విధించటం ద్వారా ఆదాయ సంపద వ్యత్యాసాలను తొలగించే వీలుంది. దీనికై పురోగామి పన్ను విధానాన్ని ఉపయోగిస్తారు. దీనికొరకు ముందుగా అసమానతలను అంచనావేసి పన్నువిధానాన్ని రూపొందిస్తారు. ఈ పన్ను విధానంలో అసమానతలు తగ్గే అవకాశముంది. దీనిని లోరెంజ్ రేఖ ద్వారా తెలుసుకుంటాము. ఈ అసమానతలు తగ్గించడానికి మోడరేటుగా పురోగామి పన్ను విధానాన్ని అమలు చేయవలసివుంది. అయితే ప్రత్యక్ష పన్నులశాతం స్థూల దేశీయోత్పత్తిలో 2కి దగ్గరగా వున్న కారణంగా పురోగామి ఆదాయపు పన్నుద్వారా ఎట్లా అసమానతలు తగ్గించగలము అన్నది ప్రశ్న. దీనికి తోడు పన్ను ఎగవేత అసమానతలు తగ్గించటానికి ప్రతిబంధకంగా మారింది.

పన్ను విధానం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని, ద్రవ్యోల్బణ నివారణని, ఆర్థికమాంద్య నిర్మూలనని, ఆర్థికవృద్ధిని, మరియు దేశ ఆర్థిక వ్యవస్థ నియంత్రణని సాధించ వీలుంది.

పన్నువిధానం మరియు దేశ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ప్రభుత్వం అనుసరించే బడ్జెట్ విధానంపై ఆధారపడి వుంటుంది. బడ్జెట్ అనేది ప్రభుత్వం ఒక ప్రత్యేక సం॥లో అనుసరించబోయే ఆర్థిక ప్రక్రియలకు ఒక దర్పణం లాంటిది. ఈ బడ్జెట్‌లో పన్నువిధానం అనేది అత్యంత కీలకమైంది. 2002-03, 2003-04 మరియు 2004-05 (BE) బడ్జెట్లపరంగా పన్నువిధానం దానియొక్క ప్రభావాన్ని చర్చించడమైనది. ముఖ్యంగా ప్రత్యక్ష పన్నులపరంగా ఆదాయపు శ్లాబ్‌రేట్లు మార్చకుండా గుజరాత్ సర్ ఛార్జ్‌ని ఎత్తివేయటం జరిగింది. పన్ను రిబేటు 15% కి తగ్గించింది ప్రభుత్వం. దీని వెనుకగల ఉద్దేశ్యం ప్రత్యక్ష పన్నుల వాటాని మొత్తం పన్ను ఆదాయంలో పెంచడం ద్వారా అసమానతలు తగ్గించడమే. పరోక్ష పన్నులను అంటే ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలను తగ్గించింది. వంటగ్యాస్, పెట్రోల్, కిరోసిన్‌లపై ధరలు పెంచింది. దీంతో కుటుంబరంగం మరియు పారిశ్రామిక రంగాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం కేల్కరు కమిటి ప్రత్యక్ష పన్నుల సవరణలను దృష్టిలో వుంచుకొనకుండా 2003-04 బడ్జెట్‌ని రూపొందించింది. పెట్టుబడిని పెంచడానికి డివిడెండ్ పన్నుని ఎత్తివేసింది. 2004-05 లో పారిశ్రామిక రంగాన్ని పునరుజ్జీవింప చేయడానికి సర్వీస్‌టాక్స్‌ని 8% నుండి 10% కి పెంచింది. రిబేటు 20% నుండి 15% (ఆదాయపు పన్ను) తగ్గించడం వల్ల దేశంలో ఆర్థికమాంద్య పరిస్థితులు తగ్గి పారిశ్రామిక రంగం అభివృద్ధిని సాధిస్తుందని ఆశించడమైనది (2003-04 బడ్జెట్‌లో). గృహ ఋణాలపై వడ్డీని గణనీయంగా తగ్గించడమేకాకుండా 100 శాతం పన్ను మినహాయింపుని రూ. 1,50,000 గా నిర్ణయించింది. దీంతో గృహనిర్మాణరంగం ఊపందుకుంది. 2004-05 లో ఆదాయపు పన్ను మినహాయింపు స్థాయిని రూ. 1,11,000 చేయడంద్వారా అల్పాదాయ వర్గాలకీ ఊరట కలిగించింది. దీంతో పొదుపు పెరిగే అవకాశం మరియు ఖర్చు పెరిగే అవకాశం వుంది. 1.4 కోట్లమందికి ప్రయోజనం చేకూరుతుందని అంచనా. కేపిటల్ గెయిన్స్ మీద పన్ను ఎత్తివేయడం వల్ల సెక్యూరిటిస్‌లో లావాదేవీలు పెరుగుతాయి. గ్రామీణాభివృద్ధి మరియు విదేశ వ్యాపారాభివృద్ధికి దిగుమతి సుంకాలను 2004-05 లో తగ్గించడం జరిగింది. ఏప్రియల్ 1, 2005 నుండి VAT అమలుచేయ సంకల్పించింది. దీనిద్వారా రాష్ట్రాలకు ఏర్పడే నష్టాన్ని భర్తీ చేస్తామని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది. CENVAT ఎత్తివేసి టెక్స్‌టైల్స్ రంగానికి చేయూతనిచ్చింది. అయితే రెవెన్యూ లోటూ మరియు కోశ లోటూ పెరుగుతూ వుండడం శోచనీయం.

13.7 ముఖ్య పదాలు :

1) సమానత (Equity)
2) స్థిరీకరణ (Stabilisation)
3) పేదరిక విషవలయాలు (Vicious Circles of Poverty)
4) పన్ను వ్యాకోచత్వం (Tax Elasticity)

5) పన్ను బ్రాయన్సీ (Tax Broyancy)
6) పన్నుభారం (Tax Burden)
7) పన్ను మినహాయింపు (Tax exemptions)
8) రాయితీలు (Rebates)
9) బహుళ పన్ను ప్రభావం (Multiple Effect of Tax)
10) మంచి పన్ను విధానం (Ideal Tax System)
11) విలువ ఆధారిత పన్ను (Value Added Tax)
12) ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ (Dual Economy)
13) అభిలషణీయ పన్నువిధానం (Optimum Taxation)
14) సంకుచిత పన్ను బేస్ (Narrow Tax Base)
15) వస్తువులపై పన్ను విధానం (Commodity Taxation)
16) తటస్థ పన్నువిధానం (Neutral Tax System)
17) రెసిడ్యువల్ పన్ను విధింపు అధికారం (Residual Powers of Taxation)
18) పన్నుల పంపిణి విధానం (Devolution of Taxes)
19) పురోగామి, పన్నుల విధానం (Progressive Taxation)
20) సమాగమి పన్నుల విధానం (Proportional Taxation)
21) తిరోగామి పన్నుల విధానం (Regressive Taxation)
22) పన్ను - స్థూలదేశీయోత్పత్తి నిష్పత్తి (Tax - GDP Ratio)
23) పన్ను - వలయం (Tax Net)
24) పన్ను ఎగవేత (Tax Evasion)
25) ఉపాంత పన్ను రేటు (Marginal rate of Taxation)
26) కేంద్రీయ పన్ను న్యాయస్థానం (Central Tax Court)
27) మార్పుచేసిన విలువాధారిత పన్ను (MODVAT)
28) కేంద్ర విలువాధారిత పన్ను (CENVAT)
29) ఉత్పాదక విలువాధారిత పన్ను (MANVAT)
30) పన్ను విధాన ప్రకటన ప్రభావం (Announcement Effect of Taxation)
31) పంపిణి ప్రభావం (Allocative Effect)
32) నష్టాన్ని భర్తీ చేసే పీలు (Loss offset Provision)
33) అభిలషణీయ ఆదాయపు పన్నురేటు (Optimal Income Tax Rate)
34) రెవెన్యూలోటు
35) కోశలోటు

36) ప్రాధమికలోటు

37) పాంచ్ ప్రాధాన్యాతలు (Panch Priorities)

38) వ్యయ పునఃప్రాధాన్యత (Expenditure Reprioritisation)

39) రెవెన్యూ తటస్థత (Revenue - Neutrality)

40) కోశవిధాన పటిష్టత (Fiscal Consolidation)

13.8 నమూనా ప్రశ్నలు

1. "మితిమీరిన పన్ను విధింపు వలన ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోతుంది" సోదాహరణముగా వివరించండి.

2. "ఒక మంచి పన్ను విధానమంటే ఏదంటే ఏ పన్ను విధింపు వలనైతే ఆర్థిక వ్యవస్థపై మంచి ప్రభావం కనబడుతుందో లేక అధమపక్షం అత్యంత తక్కువ చెడు ప్రభావాన్ని చూపిస్తుందో ఆ పన్ను విధానాన్ని మంచి పన్ను విధానమని అంటారు." వివరించండి.

3. ఈ క్రింది వాటిపై పన్ను ప్రభావాన్ని వివరించండి.
   a) ఆర్థిక నియంత్రణ
   b) ఆర్థిక వృద్ధి
   c) అసమానతల తగ్గింపు

4. ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల పరంగా వనరుల పంపిణిపై ప్రభావాన్ని వివరించండి.

5. వ్యక్తిగత ఆదాయపు పన్ను మరియు కంపెనీ ఆదాయపు పన్నుల విధింపు వలన ఆర్థిక వ్యవస్థపై ఎటువంటి ప్రభావం వుంటుంది?

6. ఈ క్రింది వాటి గుర్చించి వ్రాయండి.
   a) ఎస్టేట్ డ్యూటి, మరణాలపై సుంకం, బహుమతిపన్నుల ప్రభావం
   b) ఎక్సైజ్ సుంకం, దిగుమతి సుంకంల ప్రభావం

7. బడ్జెట్ ప్రతిపాదనల వలన ముఖ్యంగా పన్నువిధాన ప్రతిపాదనల ప్రభావం ఆర్థిక వ్యవస్థపై ఎట్లా వుంటుంది?

8. 2004-05 (BE) బడ్జెట్‌లో పన్ను ప్రతిపాదనలు, రాబోయే కాలంలో వాటి ప్రభావాన్ని గురించి వ్రాయండి.

9. భారతదేశంలో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల తీరుతెన్నుల గురించి వ్రాయండి.

10. పన్ను విచారణ సంఘాలు, వాటి సూచనలు గురించి వ్రాయండి.

11. నీవు వ్యవసాయ ఆదాయ, సంపదలపై పన్ను విధిస్తే ఎట్లా స్పందిస్తావు?

12. విత్తవనరుల సమీకరణకు ప్రభుత్వానికి ఏ మార్గాన్ని అవలంభిస్తే వనరులను గరిష్టంగా పొందగలరో ఆ మార్గాన్ని సూచించండి.

13. పన్నువిధాన లక్ష్యాలుగా వృద్ధి, సమానత, మరియు ఆర్థిక స్థిరీకరణలను ప్రభుత్వం నిర్ణయించింది. అయితే యివి పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు. ఈ పరస్పర విరుద్ధతని ఎట్లా సమన్వయం చేస్తే ఆదాయం గరిష్టం అవుతుందో వివరించండి.

14. ఈ క్రింది విషయాలు గురించి వ్రాయండి.

a) పన్ను ఎగవేత (Tax Evasion)

b) పన్ను కట్టకుండా మానివేయుట (Tax Avoidance)

13.9 చదువదగిన గ్రంథాలు :

1)	Richard A. Musgrave & Peggy B. Musgrave,	-	"Public Finance in Theory and Practice," 5th Edition, 1989.
2)	R.A. Musgrave,	-	"The Theory of Public Finance"
3)	A.R. Prest,	-	"Public Finance"
4)	A.C. Pigou,	-	"A Study of Public Finance".
5)	Hugh Dalton,	-	"Public Finance". (Principles of Public Finance)
6)	S. Ganguly,	-	"Public Finance".
7)	Ursula Katherine Hicks,	-	"The Public Finance".
8)	Govt. of India,	-	'Report of the Taxation Enquiry Commission', 3 Volumes, New Delhi, 1954.
9)	Raja J. Chellaiah,	-	"Fiscal Policy in Underdeveloped Countries", 1969.
10)	Nicholas Kaldor,	-	"Taxation for Economic Development", & Indian Tax Reforms - Report of a Survey", 1956.
11)	Govt. of India,	-	"Tax Reforms Committee", Raja Chellaiah, Chairman. 1991.
12)	Govt. of India,	-	"Direct Taxes Enquiry Committee" (Wanchoo Comittee), 1971.
13)	H.C. Bhatia,	-	Public Finance, 1998.
14)	R.N. Tripathy,	-	"Public Finance in Under Developed Countries"
15)	Gunnar Myrdal,	-	"Economic Theory and Under developed Regions"
16)	W.A. Lewis,	-	"The Theory of Economic Growth".
17)	R.K. Lekhi,	-	"Public Finance", 1996.
18)	Dutt, R & KPM Sundaram,	-	"Indian Economy", 2004.
19)	P.K. Dhar,	-	"Indian Economy", 2002
20)	Economic Surveys,	-	2001-2002, 2003-04.
21)	Economic & Political Weekly,	-	July, 2004; Aug, 2004; June 2004; Aug 2004.
22)	Southern Economist,	-	Aug 2004; July 2004.

డా॥ జి. దుర్గాప్రసాద్

పాఠం: 14

భారతదేశ కోశ విధానం - కోశ సాధనాలు కోశ సవరణలు

Fiscal Policy in India - Its Instruments - Reforms

14.0 లక్ష్యం :

ఈ పాఠ్యభాగం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకోగలుగుతారు.

1) కోశ విధాన నిర్వచనాలు

2) కోశ విధాన ఉద్దేశ్యాలు

3) కోశ విధాన సాధనాలు
   ఎ) ప్రభుత్వ వ్యయ విధానం
   బి) భారతదేశ పన్ను విధానం
   సి) ప్రభుత్వ ఋణ విధానం
   డి) భారతదేశ లోటు విత్త విధానం

విషయ సూచిక :

14.1 ఉపోద్ఘాతం,

14.2 భారతదేశ కోశ విధానం

14.3 కోశ విధానం పూర్వపు పరిస్థితి

14.4 కోశ విధాన నిర్వచనాలు

14.5 కోశ విధాన ఉద్దేశ్యాలు : వనరుల సమీకరణ - మూలధన సంచయం మరియు అభివృద్ధి - పెట్టుబడిని ప్రోత్సహించుట- ధరల స్థిరీకరణ - ఆదాయ, సంపదల సమపంపిణీ.

14.6 కోశ విధాన సాధనాలు :

14.6.1 ప్రభుత్వ వ్యయ విధానం : కేంద్ర వ్యయ వర్గీకరణ - కేంద్ర ప్రభుత్వ వ్యయ పోకడలు. రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం : రాష్ట్రాల వ్యయ వర్గీకరణ - రాష్ట్రాల అభివృద్ధి వ్యయం - రాష్ట్రాల వ్యయ పోకడలు. స్థూల దేశీయోత్పత్తిలో కేంద్ర రాష్ట్రాల వ్యయ శాతం - రాష్ట్ర ప్రభుత్వాలకు కోశ సవరణ పథకం.

14.6.2 భారతదేశ పన్ను విధానం : కేంద్ర ప్రభుత్వ పన్ను రాబడి - ప్రత్యక్ష పన్నులు మరియు వాటి ప్రాముఖ్యత - పరోక్ష పన్నులు - కోశ సూచికలు - 11వ విత్త సంఘ సూచనలు.

14.6.3 ప్రభుత్వ ఋణ విధానం : ప్రభుత్వ ఋణం -.స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి - వడ్డీ చెల్లింపులు - ప్రభుత్వ వ్యయ నిష్పత్తి - రాష్ట్రాల ఋణ పరిస్థితి.

14.6.4 భారతదేశ లోటు విత్త విధానం : లోటు విత్త విధాన పోకడలు : రెవెన్యూ లోటు - కోశ లోటు - ప్రాథమిక లోటు.

14.7 సారాంశం

14.8 ముఖ్య పదాలు

14.9 నమూనా ప్రశ్నలు

14.10 చదువదగిన గ్రంథాలు

14.1 ఉపోద్ఘాతం :

గడిచిన అధ్యాయాలలో భారతదేశ పన్ను వ్యవస్థ గురించి తెలుసుకున్నారు. ఈ అధ్యాయంలో "భారతదేశ కోశ విధానం" గురించి తెలుసుకుంటారు. భారత ప్రభుత్వం 1951లో ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి, 1956లో సమ సమాజ స్థాపనకి శ్రీకారం చుట్టడం జరిగింది. దీంతో ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికై ప్రభుత్వమే ఒక ఉద్యమదారునిగా మారి అవస్థాపనా సౌకర్యాలు కల్పించి తద్వారా పారిశ్రామికీకరణను పబ్లిక్ రంగ సంస్థల పరంగాను మరియు ప్రైవేటు రంగ సంస్థల పరంగాను పెద్ద పెట్టున సాధింప నిశ్చయించింది. వీటి ద్వారా దేశంలో ఉత్పాదకతని ఉపాధి అవకాశాలని, సమతని, ధరల స్థిరీకరణని సంపూర్ణ ఉద్యోగితను సాధించాలని కంకణం కట్టుకుంది. భారత ప్రభుత్వం. ఈ లక్ష్యాల కవసరమైన విత్తవనరుల సమీకరణ చేయ తలపెట్టి ఒక ఆర్థిక విధానాన్ని రూపొందించింది. దానినే కోశవిధానం అని అనవచ్చు. ఈ విధానంలో ఆదాయ, వ్యయ, ఋణ, మరియు లోటు విత్త విధానాలుంటాయి. అనగా పన్నులు విధించడం ద్వారా, వ్యయం చేయడం ద్వారా, ఋణ సేకరణ ద్వారా మరియు లోటు బడ్జెట్ విధానం ద్వారా ఆర్థిక వ్యవస్థ అవసరాలు మరియు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చ తలపెట్టింది ప్రభుత్వం. అయితే ఈ కోశ విధానాన్ని గట్టిగా మొదటగా చెప్పిన ఆర్థిక శాస్త్రవేత్త జె.ఎమ్. కీన్స్ ఈయన ఏమన్నాడంటే వ్యయాన్ని బట్టి రెవెన్యూని సమీకరించాలి అని అంటూ లోటు బడ్జెట్ విధానాన్ని అమలుచేయాలి అని అన్నాడు. సాంప్రదాయ ఆర్థిక శాస్త్రవేత్తలు సంతులిత బడ్జెట్ గురించి చెపుతూ ఆదాయాన్ని అంటే రెవెన్యూని బట్టి వ్యయం చేయాలి అనే విషయాన్ని చెప్పారు. అంటే ప్రభుత్వం ఒక సాధారణ పౌరుని మాదిరిగానే ప్రవర్తించాలన్నమాట. అందుచే వీరు తటస్థ పన్ను విధానాన్ని (Neutral Tax System) అనుసరించాలని వాదన చేశారు. ఈనాడు భారత దేశంలో రెవెన్యూ వ్యయం అంటే పరిపాలనా యంత్రాంగ ఖర్చు హద్దులు దాటి పెరుగుతోంది. దీన్ని భరించడానికి అధికంగా కేంద్ర ప్రభుత్వం అప్పులు చేస్తోంది. అప్పు అనేది మూలధన సంయానికై ఉపయోగిస్తే రాబోయే తరాలపై ఋణభారం పెద్దగా వుండదు. దీంతో కోశలోటు గణనీయంగా పెరిగి భారతదేశం యొక్క ఋణ విమోచన శక్తి తగ్గి అసలు విదేశాలనుండి మరియు అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుండి అప్పు అందకపోయే ప్రమాదం ఏర్పడి భారతదేశం కూడా ఒకనాటి లాటిన్ అమెరికన్ దేశాలలాగా ఋణ విషవలయం (Debt Trap) లో చిక్కుకునే ప్రమాదం పొంచి వుంది. ఈ కారణంగానే ప్రపంచ బ్యాంక్ అప్పు యివ్వడానికి ముందుగా షరతులు విధిస్తోంది. ముఖ్యంగా కోశలోటు స్థూల దేశీయోత్పత్తిలో 4 శాతం కన్నా తక్కువగా వుండాలన్న నిబంధన విధించింది. 2004-05 బడ్జెట్ అంచనాలలో కోశలోటు 4.4 శాతంగా వుంటుందని అంచనా. ఈ విషయాలన్నింటిని ఈ పాఠంలో పూర్తిగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాము.

14.2 భారతదేశ కోశ విధానం - కోశ సాధనాలు - కోశ సవరణలు

(Fiscal Policy in India - Its Instruments - Reforms)

ఒక దేశ ప్రభుత్వం ఆ దేశ ప్రజల శ్రేయస్సుని మెరుగుపరిచే దిశగా కృషి చేసింది. ఈ ప్రయత్నంలో అనుకున్న రీతిలో ఆర్థిక ప్రక్రియను నియంత్రించే నైతిక బాధ్యత ప్రభుత్వంపై వుంది. ప్రభుత్వం యొక్క బాధ్యతలు 20 వ శతాబ్దంలో పూర్తిగా మారిపోయాయి. అంటే బాధ్యతలు బాగా విస్తరించబడ్డాయి. ఎప్పుడైతే బాధ్యతలు విస్తరించబడ్డాయో, వాటిని నిర్విఘ్నంగా నెరవేర్చాలంటే డబ్బు కావాలి. ఈ డబ్బుని ప్రభుత్వం సమీకరించడాన్ని "కోశవిధానం" అని అనుకోవచ్చు. సాంప్రదాయంగా కోశ విధానం అంటే ఆదాయ మరియు వ్యయ విధానం క్రింద చెప్పేవారు. ఆధునిక యుగంలో బాధ్యతలు పెరుగుతున్న కారణంగా కోశ విధానం రూపురేఖలు మారి అభివృద్ధిని వేగవంతం చేయడానికై ప్రభుత్వం ఋణాలు చేయడం మరియు లోటు బడ్జెట్ విధానాన్ని అనుసరించడం వంటి సాధనాలు ద్వారా డబ్బుని సమీకరిస్తోంది. అందుచేత ఒక సమర్థవంతమైన కోశ విధానంలో అనేక విధాన నిర్ణయాలు వుంటాయి. ఈ విధాన నిర్ణయాలు ప్రభుత్వం యొక్క మొత్తం విత్త నిర్మాణతని సూచిస్తాయి. దీంట్లో వ్యయ విధానం, పన్నురాబడి, ఋణ విధానం, ఋణ నిర్వహణ, బదిలీలు, మొదలైనవి వుంటాయి. ఈ విధానాలన్నింటిని ఆర్థిక లక్ష్యాలకనుగుణంగా మంచి ఫలితాలు సాధించే వీలుగా ఒక సరియైన సమతౌల్య స్థితిని సాధించేలాగున ప్రయత్నం చేస్తుంది ప్రభుత్వం. కాబట్టి కోశవిధానం ఆర్థిక లక్ష్యాల పరంగా మార్కెట్టు వ్యవస్థ యొక్క పనితీరుని నియంత్రిస్తుంది. అయితే కోశ విధాన సఫలత అంతాకూడా ఆర్థిక వ్యవస్థలో వున్న పరిస్థితులు అంటే దేశంలోని ఆర్థిక స్థిరత్వం, మార్కెట్టు శక్తులు, కోశ సాధనాల సరియైన ఉపయోగిత మరియు విదేశీ మూలధన, వ్యాపార పరిస్థితి మొదలైన వాటిపై ఆధారపడి వుంటుంది.

14.3 కోశ విధానం - పూర్వపు పరిస్థితి :

1930 దశాబ్దపు ఆర్థిక మాంద్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేసేంతవరకు కోశవిధానం అనేది ప్రభుత్వ ఖజానాకు సంబంధించిందిగానే అనుకోవడం జరిగింది. ఆర్థిక మాంద్యానికి పూర్వం ప్రభుత్వ విత్త విధానం (Public Finance) మూడు విషయాలకే పరిమితం అయ్యేది అవి 1) ప్రభుత్వ వ్యయం ద్వారా శ్రేయస్సులో మార్పు 2) పన్ను భారం యొక్క సమపంపిణి, మరియు 3) అంతిమ పన్ను భారం (Incidence of Taxation). ఈ విషయాలకే విత్తశాస్త్రం పరిమితం అవ్వడం చేత విత్తశాస్త్రం యొక్క పరిధి విస్తరించలేకపోయింది. ప్రభుత్వం యొక్క పన్ను విధానం మరియు వ్యయ విధానాలు పూర్తిగా అభివృద్ధి చెందలేకపోయాయి. దీనినే సాంప్రదాయ విత్త విధానము అని అనవచ్చు. ఈ సిద్ధాంతం ఆర్థిక వ్యవస్థ పనితీరుకు ఆవలినైపు ఉండే రీతిలో ఆనాడు చెప్పబడింది. ఈ సాంప్రదాయ సిద్ధాంతం వలన ఈ క్రింది విషయాలు తెలుస్తాయి. (1) ప్రతి సం॥ కూడా బడ్జెట్ సంతులిత అవసరం (Balanced Budget) 2) ప్రభుత్వ ఋణం ఒక భారం, 3) ప్రైవేటు విత్త శాస్త్రంలో ఏదైతే పరిస్థితి వుంటుందో పబ్లిక్ విత్త శాస్త్రంలో అదే పరిస్థితి వుండాలి. అంటే ఆదాయానికే వ్యయాన్ని సరిచెయ్యాలి; 4) పన్ను విధానం తటస్థంగా (Neutral) వుండాలి. అంటే ఒక మంచి పన్ను ప్రభుత్వానికి మంచి కాలంలోను మరియు చెడ్డ కాలంలోనూ ఒకే ఆదాయాన్ని యివ్వగలగాలి. మరియు 5) పన్నులు వినియోగం మీద విధించాలి అంటే పేదవారి మీద విధించాలి. ఎందుకంటే ధనికుల మీద విధిస్తే అంటే పొదుపు మీద విధిస్తే దేశంలో పెట్టుబడికి నష్టం వాటిల్లుతుంది. (Paul Samuelson Economics, Ch. 19)

పైన వివరించిన సాంప్రదాయ విత్త శాస్త్రానికి మహా ఆర్థిక మాంద్య (Great Depression) పరిస్థితులలో కాలం చెల్లిపోయింది. దీనికి ముఖ్య కారకుడు కేంబ్రిడ్జి ఆర్థిక శాస్త్రవేత్త అయిన జాన్ మేనార్డ్ కేన్స్ (John Maynard Keynes) మరియు ఆయన ప్రఖ్యాత పుస్తకం. "(General Theory of Employment, Interest and Money" 1936). విత్త శాస్త్రం యొక్క పరిధి విస్తరించబడి, బడ్జెట్ లేదా కోశవిధానం ఆర్థిక నియంత్రణ సాధనంగా మారిపోయింది. ఈ కొత్త విత్త విధానంలో ప్రభుత్వానికి తిరుగులేని పాత్ర కల్పించబడింది. ఒక్కసారి నిరుద్యోగిత సర్వసాధారణ విషయంగా గుర్తించబడి ఆర్థిక వ్యవస్థ ఆటుపోట్లకి లోనవుతూ వుండడం, మరియు ప్రైవేటు రంగం సంపూర్ణ ఉద్యోగితను కాపాడలేక పోవడం వల్ల ప్రభుత్వం యొక్క ఆదాయ వ్యయ విధానంలో సమూలమైన మార్పులు చేసి ఆదాయ స్థాయి మరియు ఉద్యోగితలను కాపాడవలసి వుంది. ఈ విధమైన ఆలోచనల వలన ప్రభుత్వం యొక్క వ్యయం ఆదాయాన్ని వుండవచ్చునని మరియు సంతులిత బడ్జెట్ విధానానికి నూకలు చెల్లిపోయాయనే ఆలోచనలకు బలమైన పునాది ఏర్పడింది. పూర్వం పన్నులు ఎక్కడ పొదుపు పెట్టుబడులను ఎక్కడ దెబ్బతీస్తాయోనన్న ఆపోహవల్ల "చిన్న బడ్జెట్"ను ప్రతిపాదించడం జరిగింది. అయితే ఇప్పుడు పెట్టుబడి డైరెక్టుగా పొదుపు మీద ఆధారపడి వుండకపోవడం మరియు ఉపాంత మూలధన సామర్థ్యం అల్పంగా వున్న పరిస్థితులలో ప్రభుత్వ వ్యయం పెంచడం వలన "పెద్ద బడ్జెట్" లపై వున్న వ్యతిరేకత పోయింది. అంతేకాకుండా ఆర్థిక మాంద్య కాలంలో, కీన్స్ వినియోగానికి పెద్దపీట వేశాడు. ఎందుకంటే దానివల్ల ఆర్థిక పురోగతికి మార్గం సుగమం అవుతుందని అన్నాడు. దీంతో కీన్స్, సాంప్రదాయ ఆర్థిక వేత్తలలా కాకుండా, పేద ప్రజలను పన్ను విధింపు నుండి "ధార్మికంగాను మరియు ఆర్థికంగాను" మినహాయింపు యివ్వాలని అన్నాడు. దీంతోబాటుగా కీన్స్ ప్రభుత్వ ఋణాన్ని కూడా సమర్థించాడు. కీన్స్ ఋణం పెరిగితే జాతీయాదాయం పెరుగుతుందని అన్నాడు. పబ్లిక్ ఋణం లోటు బడ్జెట్ విధానంతో సంబంధం కలిగివున్న కారణంగా ఆదాయం గుణక ప్రభావం కారణంగా పెరుగుతుందని వివరించాడు.

కాబట్టి కోశవిధానమంటే అనుకున్న రీతిలో ఆర్థిక వ్యవస్థని నియంత్రించడానికి తద్వారా ఆర్థిక వృద్ధిని సమానతని, మరియు ఆర్థిక స్థిరీకరణని సాధించే ప్రక్రియగా చెప్పవచ్చు. ఈ లక్ష్య సాధనలో పన్ను విధానం, వ్యయ విధానం, ఋణ విధానం మొదలైనవి సాధనాలుగా ఉపయోగపడతాయి. అంతే కాకుండా ప్రభుత్వ విత్త విధానం వ్యయావసరాలను బట్టి ఆదాయాన్ని సమకూర్చుకునేదిలా వుంటుంది. కాబట్టి ప్రైవేటు విత్త శాస్త్రం వేరుగా వుంటుంది.

14.4 కోశ విధాన నిర్వచనాలు :

పైన వివరించిన మాటల్లో కోశవిధానమంటే చూచాయగా తెలుసుకున్నాము. కోశ విధానమనగా 1) పన్ను విధానం, 2) ప్రభుత్వ వ్యయ విధానం; 3) ప్రభుత్వ ఋణవిధానం మరియు 4) ప్రభుత్వ ఋణ నిర్వహణ విధానంల పరంగా ప్రభుత్వ విధాన నిర్ణయాలు. పన్ను

విధానంలో ప్రభుత్వం ఎంత వరకు మరియు ఏ విధంగా ప్రైవేటు ఆర్థిక వ్యవస్థనుండి సమీకరించాలనే విషయంపై చేసే నిర్ణయాలు వ్యయ విధానంలో ప్రభుత్వం నుండి ప్రైవేటు ఆర్థిక వ్యవస్థకు నిధి ప్రభావం ఎట్లు వుండాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఋణ విధానంలో అప్పు ఎంత చేయాలి మరియు ఎక్కడినుండి చేయాలి అనేది నిర్ణయించబడుతుంది. ఈ ఋణ విధానంలోనే ప్రభుత్వ ఋణం ఎంత వుంది, మార్కెటునుండి ఋణం ఎట్లా మరియు ఎంత పొందాలి, ఋణ సేకరణ పత్రాల గరిష్ఠ కాలపరిమితి, వడ్డీ రేటు, మొదలైనవి నిర్ణయిస్తారు. కాబట్టి కోశ విధానంలో ప్రైవేటు వ్యయం మరియు పొదుపు ప్రవాహం నుండి ప్రభుత్వానికి నిధుల ప్రవాహం వుంటుంది. అలాగే ప్రభుత్వం నుండి ప్రైవేటు ఆర్థిక వ్యవస్థ వైపుకి నిధుల ప్రవాహం కూడా వుంటుంది. ఈ రెండు ప్రవాహాల మొత్తాన్ని కోశవిధానం అని అంటారు. (Maurice, W. Lee : Economic Functions, Growths and Stability, p. 413)

సూక్ష్మంగా చెప్పాలంటే, కోశవిధానమంటే ప్రభుత్వ ఆదాయ మరియు వ్యయ విధానాల యొక్క మొత్తం ప్రభావం ఆదాయం, ఉత్పత్తి మరియు ఉద్యోగితల మీద ఎట్లా వుంటుందో తెలియజేస్తుంది. ఐ. హార్వే మరియు ఎం. జాన్సన్‌ల ప్రకారం, "కోశవిధానమంటే ప్రభుత్వ వ్యయం మరియు పన్ను విధానాలలో మార్పు, ఈ మార్పు యొక్క ఉద్దేశ్యం ఆర్థిక ప్రక్రియ యొక్క విధానాన్ని మరియు స్థాయిని ప్రభావితం చేయడమే. (Harvey I & Jhonson, M : An Introduction to Macro Economics) జి.కె. షా ఏమన్నాడంటే, కోశ విధానంలో ధరలు, ప్రభుత్వ వ్యయం యొక్క సంయోజనం మరియు టైమింగ్, పన్ను భారంలో మార్పులు, పన్ను చెల్లింపు ఎన్నిసార్లు వుండాలి అనే విషయాలలో మార్పులకు సంబంధించిన రూపకల్పన వుంటుంది. (Shaw, G.K.- An Introduction to the Theory of Macro-economic Policy) ఆట్టో ఎక్‌స్టీన్ (Otto Eckstein) ప్రకారం, పన్నులు మరియు వ్యయంలో మార్పులనే కోశ విధానమనవచ్చు. ఈ మార్పులు స్వల్పకాలిక లక్ష్యాలైన సంపూర్ణ ఉద్యోగితా, ధరల స్థాయి మరియు స్థిరీకరణలకి ఉద్దేశించబడినవి." అని అన్నాడు (Otto Eckstein- Public Finance).

విత్త శాస్త్రం పరంగా యు.కె. హిక్స్ పేరు ఉదహరించకపోతే ఆ శాస్త్రం పూర్తి అయినట్లు కాదు. ఈవిడ అంటే మిసెస్ యు.కె. హిక్స్ కోశవిధానాన్ని యిట్లా వివరించింది. "విత్త శాస్త్రంలోని వేర్వేరు భాగాలు ఏ విధంగా సామూహికంగా ఆర్థిక విధానాలను పెంపొందింప జేసేటటువంటి విధానమే కోశ విధానమని అంటారు." అయితే ఈ విత్త శాస్త్రంలో ప్రతీ భాగం తనకంటూ ప్రత్యేకంగా ఉన్న పనిని నిర్వర్తిస్తూనే (పన్ను యొక్క ప్రాధమిక విధి రెవెన్యూని సమీకరించడమే) సామూహికంగా ఆర్థిక విధాన లక్ష్యాలను సాధిస్తుంది. (UK Hicks Public Finance)

ఆర్థర్ స్మిథీస్ (Arthur Smithies) ఏమన్నాడంటే "ప్రభుత్వం తన యొక్క వ్యయ రాబడి విధానం ద్వారా జాతీయాదాయం, ఉత్పత్తి మరియు ఉద్యోగితలపై కోరుకున్న ప్రభావాన్ని కలుగజేసి నష్టం వాటిల్లే ప్రభావాన్ని నివారించే ప్రయత్నాన్ని కోశవిధానమనవచ్చు." అని అన్నాడు. ఈ నిర్వచనం కోశవిధాన లక్ష్యాల గురించి మరియు కోశవిధాన సాధనాల గురించి వివరిస్తుంది.

గార్డ్‌నర్ ఏక్లే (Gardner Ackley) ప్రకారం "కోశవిధానమంటే ప్రభుత్వ వ్యయం (వస్తు సేవలపై)లో మార్పులు లేక పన్నురేట్ల స్థాయిలో మార్పులు. ఈ మార్పుల వలన ప్రభుత్వం మార్కెట్టులో డైరెక్టుగా ప్రవేశిస్తుంది. అంతేకాక ప్రభుత్వం ప్రైవేటు డిమాండ్ డైరెక్టుగా ప్రభావాన్ని చూపిస్తుంది. యిక్కడ మార్కెట్టులో ప్రవేశం అంటే వస్తుసేవల వినియోగంపై వ్యయం ద్వారానూ మరియు పన్ను రేట్లలో మార్పు ద్వారా ప్రైవేటు వినియోగాన్ని ప్రభావితం చేయడం జరుగుతుంది.

యు.ఎన్. రిపోర్టు (UN Report on Taxes and Fiscal Policy) ప్రకారం "కోశవిధానానికి ఒక కేంద్రీకృత పనిని అప్పజెప్పడం జరిగింది. ఆ పని ఏమిటంటే, అల్పాభివృద్ధి దేశాల దయనీయమైన అల్ప ఉత్పత్తి నుండి ఆర్థికాభివృద్ధి విధానాలని ఫైనాన్స్ చేయడానికి సరిపడే పొదుపు వనరులను సమీకరించడం. ఈ పొదుపు వనరులతో పెట్టుబడిని విజృంభించిన రీతిలో ప్రభుత్వం చేపట్టడానికి ఉపకరించే సాధనం, ఈ కోశవిధానం."

ఈ నిర్వచనాలన్నింటిని దృష్టిలో పెట్టుకుంటే కోశవిధానంలో ముఖ్యంగా వ్యయ, పన్ను, మరియు ఋణ విధానాల ద్వారా ప్రభుత్వం అనుకున్న రీతిలో ఆర్థిక వ్యవస్థని నియంత్రించి వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి, అసమానతల నిర్మూలనకి మరియు ధరల స్థిరీకరణకి తోడ్పడి సమాజ శ్రేయస్సుని గరిష్ఠం చేసే ప్రయత్నం జరుగుతుంది.

ఈ నిర్వచనాలన్ని ఆధునిక కోశవిధానాన్ని తెలియజేస్తాయి. దీనిని ప్రతిపాదించిన వారిలో ముఖ్యులు కేన్స్, ఏ.పి. లెర్నర్, గున్నార్ మిర్డాల్ మొదలైనవారు. దీని ప్రకారం బడ్జెట్ విధానం తటస్థంగా కాకుండా దేశ ఆర్థిక విధానాన్ని రూపొందించడానికి ఉపయోగపడే శక్తివంతమైన సాధనం అని అన్నారు కీన్స్ మరియు లెర్నర్. దీనినే వీరిద్దరు ఏమని పిలిచారంటే "విధులననుసరించి విత్త విధానం" (Functional Finance) అని అన్నారు. అంటే కోశవిధానం ద్వారా దేశంలో ద్రవ్యోల్బణాన్ని కాని ఆర్థిక మాంద్యాన్ని కాని ఆరికట్టవచ్చు. అందుచేత కోశ విధానం ద్వారా ప్రభుత్వం ఒక ధనాత్మకమైన పాత్రని పోషిస్తుంది. అబ్బా పి. లెర్నర్ విధుల ననుసరించి విత్త విధానానికి మూల సూత్రధారి. కీన్స్ ప్రకారం ఆదాయం పెరుగుతున్నపుడు వినియోగం తగ్గి పొదుపు పెరిగి వస్తు సేవలకి గిరాకి తగ్గుతుంది. దీంతో ఆర్థిక వ్యవస్థలో అసమతౌల్య స్థితి ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితులలో ఆదాయ ఉద్యోగితలను నిలబెట్టుకోవాలంటే "ప్రభుత్వ వ్యయాన్ని" పెంచి డిమాండులో వున్నటువంటి లోటును భర్తీచేయాలి అని అన్నాడు. దీన్ని పబ్లిక్ పనులు చేపట్టడం ద్వారా చేయాలని వివరించాడు. కీన్స్ కోశవిధానానికి అధికమైన పాపులారిటి రావడానికి ఏకైక కారణం ద్రవ్య విధానం యొక్క విఫలతే. అంటే ద్రవ్య విధానం మహా ఆర్థిక మాంద్య పరిస్థితులలో నిరుద్యోగితను మరియు ఆర్థిక స్థిరీకరణను సాధించలేకపోయింది. కీన్స్, సాంప్రదాయకోశ తటస్థతనుండి దూరం అయి ప్రభుత్వ జోక్యం ద్వారా ఆర్థిక స్థిరీకరణను మరియు అధిక ఉద్యోగితను సాధించే వీలుంది అని అన్నాడు. ఈ విధానంలో కీన్స్ పురోగామి పన్ను విధానం, పెరిగే ప్రభుత్వ వ్యయం మరియు లోటు బడ్జెట్ వుండాలని అన్నాడు. పురోగామి పన్ను విధానం ద్వారా పునఃపంపిణి ప్రభావం వుండి దేశంలో వినియోగం పెరుగుతుందని అన్నాడు. అయితే ప్రభుత్వం ఒక సంతులిత పాత్రని పోషించి ప్రైవేటు పెట్టుబడి మరియు ఉద్యమిత్వ లక్షణాలలో వున్న లోటుని ప్రభుత్వ వ్యయ విధానం ద్వారా పూరించాలని అన్నాడు. అయితే కీన్స్ మరియు లెర్నర్ ప్రతిపాదించిన విధులననుసరించి విత్త విధానం అల్పాభివృద్ధి దేశాలలో అంతగా సరిపోదు (R.N. Tripathy, Public Finance in Underdeveloped Countries). ఎందుకంటే అల్పాభివృద్ధి దేశాల తక్షణ కర్తవ్యం పొదుపు పెట్టుబడులను పురోగామిగా పెంచడం ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించడం. అందుచేత కోశ విధానం అల్పాభివృద్ధి దేశాలలో అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భిన్నంగా వుంటుంది.

చివరగా కోశవిధానమంటే బడ్జెట్ విధానమని అర్థం, మన దేశంలో కేంద్ర ప్రభుత్వ ప్రతి సం॥ తన బడ్జెట్ విధానాన్ని ప్రకటిస్తుంది. ఈ ప్రకటనలో ప్రభుత్వం రాబోయే సం॥కాలంలో చేపట్టబోయే విత్తవిధానాన్ని వివరిస్తుంది. అనగా దీంట్లో పన్ను ఆదాయం గురించి అంచనాలు, వ్యయం గురించిన వివరాలు, ఋణ సేకరణ మొత్తం మొదలైన విషయాలు పొందుపరచబడతాయి. 2004-05 (B.E.) బడ్జెటు వివరాలని "పన్ను ప్రభావం" అన్న అధ్యాయంలో ఒక పట్టిక (పట్టిక 5) రూపంలో ఇవ్వబడింది. ఆ పట్టిక చూసిన విషయం అర్థమవ్వగలదు. ఈ బడ్జెట్ ప్రకటనలో అనేక విధాన నిర్ణయాలు చేయడం జరుగుతుంది. ఈ ప్రకటన తయారి వెనుక నిష్ణాతులైన ఆర్థిక వేత్తలు, పాలనాపరమైన సైద్ధాంతిక వేత్తలు, రాజకీయ పాలకపక్షం ఆలోచనలు మొదలైనవి ఈ బడ్జెట్ ప్రకటనలో ప్రతిబింబిస్తాయి. ఈ సం॥ సాధారణ ఎన్నికల కారణంగా జూలై 8, 2004న కేంద్ర బడ్జెట్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడింది. మామూలుగానైతే ప్రతి సం॥ ఫిబ్రవరి 28న ప్రవేశపెడతారు. (Southern Economist, August 1, 2004, pp. 21-24).

14.5 కోశ విధాన ఉద్దేశ్యాలు : (Objectives of Fiscal Policy)

ఆర్థిక పరిస్థితిననుసరించి కోశ విధాన లక్ష్యాలు రూపొదిద్దుకుంటాయి. అభివృద్ధి చెందిన దేశాలలో సాధించిన వృద్ధి రేటుని నిలబెట్టుకునే దిశగా లక్ష్యాలు ఏర్పడతాయి. అదే అభివృద్ధి చెందుతున్న దేశాలలోనైతే ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా లక్ష్యాలు వుంటాయి. కాబట్టి అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న దేశాలలో కోశ విధాన లక్ష్యాలు వేరుగా వుంటాయి. ఇక్కడ ఆర్థర్ స్మిథీస్ ఏమన్నాడంటే, "కోశ విధాన లక్ష్యం ప్రాధమికంగా సమిష్టి డిమాండ్‌ని నియంత్రించి, ప్రైవేటు ఆర్థిక వ్యవస్థని దాని సాంప్రదాయ పరిస్థితి, అనగా అనేక ఉపయోగాల పరంగా వనరుల కేటాయింపుకి వదిలివేయడం (Arthur Smithies, Federal Budgeting and Fiscal Policy) అని వివరించాడు. అభివృద్ధి చెందిన మరియు చెందుతున్న దేశాలలో ఆర్థిక వ్యవస్థలో ఆటుపోట్లు మరియు అనిశ్చిత స్థితి వున్నప్పటికి కోశ విధానం పరంగా రెండు దేశాల్లోనూ పరిస్థితి వేరుగా వుంటుందని వేరే చెప్పనక్కరలేదు. యిక్కడ ఏ.కె. ఘోష్ ఏమన్నాడంటే, అల్పాభివృద్ధి దేశాలలో ఆర్థికపరమైన అనిశ్చిత స్థితి ఆదాయంలో పెనుమార్పుల రూపంలో వుంటే అభివృద్ధి చెందిన దేశాలలో అధికంగా వున్న జాతీయాదాయ స్థాయి దగ్గర మోడరేటుగా ఆర్థిక వ్యవస్థ ఊగిసలాడుతుంది." (AK Ghosh, Stability and Fiscal Policy in Underdeveloped Countries, 1956) అని అన్నాడు. అందుచేత, అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక స్థిరీకరణ సాధించాలంటే విధుల

ననుసరించి విత్త విధానం ద్వారా అంటే ప్రభుత్వ వ్యయ విధానం ద్వారా సాధించవచ్చు. అయితే అల్పాభివృద్ధి దేశాలలో వనరుల సమీకరణ ఒక పెద్ద ప్రతిబంధకంగా వున్న పరిస్థితులలో "క్రియాశీలక విత్త విధానం" ద్వారా వనరులను పన్నువిధానం, ఋణ విధానం మరియు లోటు బడ్జెట్ విధానం ద్వారా సమీకరించి ఆర్థిక వృద్ధిని మరియు స్థిరీకరణని సాధించవచ్చు. కావున, క్రియాశీలక విత్త విధానం ద్వారా అల్పాభివృద్ధి దేశాలలో ఆర్థికాభివృద్ధిని సాధించే వీలుంది.

ప్రొ. బెంజామిన్ హిగ్గిన్స్ (Economic Development) ప్రకారం, "కోశవిధానం ఆర్థికాభివృద్ధి సాధించే సాధనంగా వివరిస్తూ అభివృద్ధి విధానంలో నెమ్మదితనం (Gradualism) కి స్థానం లేదు అని అంటూ దాని స్థానంలో ప్రభుత్వ జోక్యం ద్వారా అంటే big push విధానం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చని వివరించాడు. యిక్కడ నెమ్మదితనం అంటే అభివృద్ధిని కాలానుగుణంగా సాధించడం కాకుండా కోశ విధానం ద్వారా అభివృద్ధిని వేగంగా సాధించవచ్చని హిగ్గిన్స్ అభిప్రాయం. అంటే కోశవిధానం ద్వారా ఉత్పత్తి విధానాన్ని వినియోగాన్ని మరియు సాధారణ ధరల స్థాయిని ప్రభావితం చేసి అభివృద్ధిని సాధించేవీలుంది. అలాగే నర్క్సే ఏమన్నాడంటే అల్పాభివృద్ధి దేశాలలో కోశ విధానం ఒక క్రొత్త రూపుని సంతరించుకుంటుందని అదికూడా మూల ధన సంచయనం రూపంలో వుంటుందని అన్నాడు. అంటే మూలధన సంచయనం ఆర్థిక వృద్ధి అత్యంత కీలకమైన కారకం. ఇది అభివృద్ధి చెందాలంటే కోశ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. అల్పాభివృద్ధి దేశాలలో పొదుపు మరియు తలసరి ఆదాయాలు తక్కువగా వుంటాయి. ఏదోకొద్ది మంది ధనవంతులుకూడా వారి పొదుపుని అనుత్పాదక వినియోగం (Conspicuous Consumption) కొరకై ఉపయోగిస్తారు. ఇటువంటి పరిస్థితులలో కోశ విధానం ద్వారా పొదుపుని ఉత్పాదకరంగాల వైపు మళ్ళించవచ్చు. నర్క్సే ప్రకారం అభివృద్ధిని నిర్ణయించే కీలక అంశం ఉపాంత పొదుపు ప్రవృత్తే (Marginal Propensity to save) అని అన్నాడు. ఈ ఉపాంత పొదుపు ప్రవృత్తిని ప్రభుత్వ వ్యయ విధానం ద్వారా క్రొత్త పరిశ్రమలు నెలకొల్పి, బ్యాంకింగ్ వ్యవస్థని అభివృద్ధి పరచి, అవస్థాపనా సౌకర్యాలు మెరుగుపరచి, పెంచవచ్చు. దీనివలన దేశంలో ఉత్పత్తి, ఆదాయం, ఉద్యోగిత పెరుగుతాయి. అంతేకాకుండా పన్ను విధానం ద్వారా ప్రైవేటు వినియోగాన్ని తగ్గించే మరియు నిరుపయోగంగా వున్న వనరులను మూలధన సంచయానికి బదిలి అయ్యేలాగున చూడవచ్చు.

ఒక అభివృద్ధి చెందుతున్న దేశంలో ఒక్క ద్రవ్య విధానం వల్ల పెద్దగా ఉపయోగం వుండదు. ఎందుకంటే ఆ దేశంలో ద్రవ్య మరియు మూలధన మార్కెట్లు అంతగా అభివృద్ధి చెందవు కాబట్టి అందుచేత కోశ విధానాన్ని ద్రవ్య విధానంతో జతచేసిన వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని సాధించడమేకాకుండా ఆర్థిక వ్యవస్థలో స్థిరీకరణను కూడా సాధించవచ్చు. ఈ విషయాన్ని రాజా చెల్లయ్య కూడా ధృవీకరించడం జరిగింది. ఆయన ఏమన్నాడంటే, "విత్త ప్రణాళికను అమలు చేయడం మరియు నిజ మరియు ద్రవ్య విషయంగా సమతౌల్యాన్ని సాధించడానికి కోశ విధానం పైనే ఎక్కువగా ఆధారపడవలసి వుంటుందని వివరించాడు. (Raja J. Chellaiah, Fiscal Policy in Underdeveloped Countries).

ఒక మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో వున్న అల్పాభివృద్ధి దేశంలో, విత్త విధానం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించాలంటే ఈ క్రింది లక్ష్యాలు కోశ విధానానికి వుంటాయి. (R.N. Tripathy, Public Finance in Underdeveloped Countries, p. 62.)

ఎ) పబ్లిక్ మరియు ప్రైవేటు రంగాల్లో ఉత్పాదక పెట్టుబడిని ప్రోత్సహించడం మరియు వేగవంతం చేయడం.

బి) పబ్లిక్ రంగ పెట్టుబడికి అవసరమయ్యే నిజ మరియు ద్రవ్య వనరులను గరిష్ఠంగా సమీకరించడం.

సి) ఆర్థిక వ్యవస్థ యొక్క గరిష్ఠ వృద్ధి రేటుని దృష్టిలో వుంచుకుని సాధ్యమైనంత వరకు ద్రవ్య స్థిరీకరణని పెంపు చెయ్యాలి; మరియు

డి) పెరుగుతున్న జాతీయ ఉత్పత్తిని పునఃపంపిణీ చేయాలి.

పై నాలుగు కోశ విధాన లక్ష్యాలను కేన్స్ మాటల్లో చెప్పాలంటే, "ప్రభుత్వం యొక్క, అందునా అల్పాభివృద్ధి దేశం యొక్క, ఆర్థికాభివృద్ధిని సాధించే కోశవిధాన ప్రక్రియ ఎట్లా వుంటుందంటే ప్రభుత్వమే పెట్టుబడిదారునిగాను, ప్రభుత్వమే స్థిరీకరణదారునిగాను, ప్రభుత్వమే పొదుపరిగాను, మరియు ప్రభుత్వమే ఆదాయ పునఃపంపిణీదారునిగాను వుంటుంది." (J.M. Keynes, The Keynesian Theory of Finance Development, p. 154).

ఐక్య రాజ్యసమితి (UNO) అల్పాభివృద్ధి దేశాలలో కోశ విధానంలో ఈ క్రింది లక్ష్యాలు వుండాలని వివరించింది. (UNO : Methods of Financing Economic Development in Underdeveloped Countries, 1949)

ఎ) అతిగావున్న లేదా ప్రమాదకర ఆదాయ మరియు సంపద అసమానతలని నివారించడం. ఈ ప్రయత్నంలో దేశీయ మార్కెట్లను విస్తృతపరచి మరియు అనవసర దిగుమతులను తగ్గించుకోవాలి.

బి) ఆర్థికాభివృద్ధినుండి, బహుశ, ఏర్పడిన ద్రవ్యోల్బణాన్ని నివారించాలి,

సి) ఆర్థికాభివృద్ధి ఆశించిన విధంగా జరగడానికి ప్రోత్సాహకాలను ఏర్పాటుచేసి అభివృద్ధి అనుకున్న రీతిలో జరిగేలాగున ప్రోత్సహించాలి, మరియు

డి) ఆర్థికాభివృద్ధికి అందుబాటులో వుండే పొదుపు మొత్తాన్ని పెంచాలి.

అయితే పైన వివరించిన లక్ష్యాలు ముఖ్యంగా ఆర్థిక వృద్ధి మరియు అసమానతల నివారణ రెండింటికి ఒక దానితో నొకటికి పొంతన వుండదు. ఈ రెండింటి మధ్యన నెలకొన్న వ్యతిరేకతని కోశవిధానం ద్వారా సమన్వయం చేసుకోవలసి వుంది. యిదంతా కూడా ఆర్థిక వృద్ధిలో ప్రైవేటు రంగం యొక్క పాత్ర ఎట్లా వుంది. ప్రభుత్వం యొక్క ఆర్థిక - సామాజిక విధానాలు, ఆర్థిక పరిస్థితులు మరియు ఏ రేటులో వృద్ధిని సాధించాలి అనే విషయాలపై ఆధారపడి వుంటుంది. (R.N. Tripathy, Public Finance in Underdeveloped Countries, P. 64).

ఒక దేశ ప్రత్యేక ఆర్థిక పరిస్థితులను బట్టి, అవి నిర్దేశించుకున్న లక్ష్యాలననుసరించి ఆ దేశ కోశ విధానం రూపు దిద్దుకుంటుందని తెలుసుకున్నాము. సాధారణంగా కోశ విధానాన్ని ఈ క్రింది లక్ష్యాలను సాధించడానికి రూపొందించడం జరుగుతుంది. అవి :

ఎ) ఉత్పత్తి కారకాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం;

బి) ఆదాయ, సంపద పరంగా ఉన్న అసమానతలను తొలగించడం;

సి) ధరల స్థిరత్వాన్ని సాధించడం మరియు

డి) సంపూర్ణ ఉద్యోగితా స్థాయిని అందుకోడానికి ప్రయత్నించడం.

ముఖ్యంగా కోశ విధాన లక్ష్యాలుగా నాలుగింటి గురించి చెప్పుకోవచ్చు. అవి : వృద్ధి, సమానత, స్థిరీకరణ మరియు ఉద్యోగిత. అల్పాభివృద్ధి దేశాలలో వీటిని కొద్దిగా మార్చి ఆర్థికాభివృద్ధి, సమానత, ఉద్యోగితగా చెప్పుకోవచ్చు.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధికి కావలసిన మూలధనం, నైపుణ్యం గల్గిన శ్రామికులు, సాంకేతిక పరిజ్ఞానం, పొదుపు, పెట్టుబడులు కొరతగా వుంటాయి. అందుచేత ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడమనేది ఆ దేశాల ముఖ్యమైన కోశ విధానంగా వుంటుంది. 1951లో ప్రణాళికాయుగం ప్రారంభంతోనే భారత ప్రభుత్వం వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని సాధించాలని ప్రణాళికా లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. అంతేకాకుండా, యిటువంటి దేశాల్లో ఉపాంత వినియోగ ప్రవృత్తి ఎక్కువగా వుండి పొదుపు పెట్టుబడులు తక్కువగా వుంటాయి. అందుచేత కోశ విధానం ద్వారా వినియోగాన్ని తగ్గించి పొదుపును పెంచే ప్రయత్నం చేస్తాయి. తద్వారా పెట్టుబడి పెరిగి అభివృద్ధిని సాధించే వీలుంది.

ఆర్థికాభివృద్ధిని సాధించడంలో కోశ విధానం నిర్వహించే పాత్రను ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ఆర్థిక శాస్త్రవేత్త యు.కే. హిక్స్ వివరిస్తు కోశ విధాన లక్ష్యాలను తన గ్రంథమైన "ప్రభుత్వ విత్తం" అనే పుస్తకంలో ఈ క్రింది విధంగా వివరించడం జరిగింది.

1) ప్రభుత్వ వ్యయ విధానం ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ప్రైవేటు రుగానికి చేయూతనిస్తుంది.

2) రెవెన్యూ సర్దుబాట్ల వల్ల కావలసిన ద్రవ్య వనరులను సమీకరించి ద్రవ్యోల్బణ రహిత ఆర్థిక స్థిరత్వాన్ని కలుగజేస్తుంది.

3) ఋణ విధానం ద్వారా మూలధన సంచయం జరిగేటట్లు కల్పించి ఋణాల నిర్వహణను కొనసాగిస్తుంది; మరియు

4) కొరతగా వున్న వనరులను అభిలషణీయంగా ఉపయోగించేలాగున పరిపాలనా పరమైన సమస్యలను పరిష్కరిస్తుంది.

కోశ విధానంలో వ్యయ, పన్ను మరియు ఋణ విధానాలుంటాయని పైన పేర్కొనబడింది. అంతే కాకుండా కోశ విధానం వనరుల అభిలషణీయ పంపిణీకి దోహదం చేస్తుంది.

దేశం స్వతంత్ర వ్యవస్థగా మారేంతవరకు భారతదేశానికి ఒక నిర్దిష్టమైన కోశ విధానమంటూ ఏదీలేదు. ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి శ్రీకారం చుట్టిన తర్వాత ఒక ఖచ్చితమైన కోశవిధానాన్ని ఈ క్రింది లక్ష్యాల రూపంలో నిర్ధారించడం జరిగింది.

1) ఆర్థికాభివృద్ధి సాధించడానికి వీలుగా అవలంభించిన వేర్వేరు పథకాలు మరియు ప్రాజెక్టులకు అవసరమైన విత్త వనరులను సమీకరించడం;

2) పొదుపు మరియు పెట్టుబడుల రేటులను పెంచి మూలధన సంచయన రేటుని పెంచడం;

3) కోశ ప్రోత్సాహకాలతో ప్రైవేటు రంగాభివృద్ధికి కృషి చేయడం;

4) అభిలషణీయ వనరుల ఉపయోగితను పెంచడం;

5) ఆర్థిక స్థిరీకరణ సాధించడానికై ద్రవ్యోల్బణ పరిస్థితులను నియంత్రించాలి.

6) పేదరికాన్ని మరియు నిరుద్యోగితను నివారించాలి;

7) పబ్లిక్‌రంగ సంస్థల అభివృద్ధికి కృషిచేసి సమ సమాజ స్థాపనగావించాలి.

8) ప్రాంతీయ అసమానతలని తగ్గించాలి, మరియు

9) ఆదాయ మరియు సంపదల పంపిణీ పరంగా వున్న అసమానతలని తగ్గించాలి.

పైన ఉదహరించిన కోశ లక్ష్యాల సాధనకై భారత ప్రభుత్వం తనకోశ విధానంలో రెవెన్యూ, వ్యయ, మరియు ఋణ విధానాలను పొందుపరచింది.

14.5.1 వనరుల సమీకరణ :

ఆర్థికాభివృద్ధిని వేగంగా సాధించడానికి చేపట్టబోయే పథకాలకి మరియు ప్రాజెక్టులకు తగినన్ని విత్త వనరులను సమీకరించాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధన సంచయనం చాలా అల్పంగా వుంటుంది. ఆర్థికాభివృద్ధి సాధించడానికి మూలధన సంచయం అవసరం. దీనికోసం పొదుపుని బలవంతంగానైనా పెంచవలసి వుంది. తగిన ప్రోత్సాహకాలతో ఉద్యమిత్వ లక్షణాలని పెంపొందింపజేయాలి. ఈ ప్రయత్నంలో వినియోగాన్ని బాగా తగ్గించడం మరియు సామాజికంగా అనుత్పాదక రంగాలవైపు పెట్టుబడి మళ్ళకుండా ఉండేలాగున ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. దీనివల్ల వనరుల సమీకరణ జరిగి ద్రవ్యోల్బణ పరిస్థితులు అరికట్టబడతాయి. ఇది సాధించాలంటే ప్రభుత్వానికి ప్రత్యక్షంగా ఆర్థిక వ్యవస్థ మీద నియంత్రణ అవసరం. దీంతో బాటుగా పురోగామి పన్ను విధానం ద్వారాను, విలాసవంత వస్తువుల దిగుమతిపై అధికరేటులో సుంకం విధించడం, విలాసవంత వస్తువుల దేశీయుత్పత్తిని రద్దు చేయడం మొదలైన విధానాలవల్ల ప్రభుత్వం ఆర్థికాభివృద్ధికి తగినన్ని వనరులను సమీకరించగలదు. పన్ను విధానం అభివృద్ధికి విత్త వనరుల సమీకరణలో ప్రముఖ పాత్రని నిర్వర్తిస్తుంది. అంతే కాకుండా ప్రభుత్వం పబ్లిక్ రంగ సంస్థలలో ఎక్కువ భాగం నష్టాల ఊబిలోవున్న కారణంగా తగినన్ని నిధులు ప్రభుత్వానికిరావు. ఋణాలు కూడా అంతగా వనరులను సమీకరించలేవు. ఎందుకంటే ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అలాగే లోటు బడ్జెట్ విధానం కూడా ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో వుంచుకుని ఋణ సమీకరణ చేయవచ్చు. లేనట్లయితే లాటిన్ అమెరికన్ దేశాల "డెట్‌క్రెసిస్" భారతదేశంలో కూడా ఏర్పడుతుంది. కాబట్టి పన్ను విధానం ద్వారా తగినన్ని వనరులను సమీకరించగలిగే ముఖ్యమైన సాధనం.

14.5.2. మూలధన సంచయం మరియు ఆర్థిక వృద్ధి :

అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధన సంచయం ఆర్థిక వృద్ధిలో కీలకపాత్ర వహిస్తుంది. మూలధన సంచయనాన్ని వేగవంతం చేస్తే వృద్ధి వేగవంతమవుతుంది. కోశ విధానం మూలధన సంచయాన్ని త్వరితగతిన సాధించగలిగే ఒక ముఖ్యమైన సాధనం అల్పాభివృద్ధి దేశాలు "పేదరిక విషవలయం" చిక్కుకుని వాటినుంచి బయటపడలేకపోతున్నాయి. దీనికి కారణం మూలధన కొరత. అందుచేత ఆర్థిక వ్యవస్థలో సంతులిత వృద్ధి ద్వారా ఈ పేదరిక విషవలయాన్ని చేధించవచ్చు. యిట్లా చేయ్యాలంటే మూలధన సంచయనం అధికరేటులో పెరగవలసి వుంది. దీంతో దేశం యొక్క ఉత్పాదకశక్తి పెరిగి వృద్ధిని సాధిస్తుంది. ఒక్కసారి పేదరికదేశం దాని యొక్క వెనుకబాటు తనం నుండి బయటపడిన వెంటనే పెట్టుబడి ఉత్తేజితమై మూలధన సంచయం జరుగుతుంది. ఇక్కడ ఐక్యరాజ్యసమితి ఏమందంటే "ఒక రాకెట్ కాని లేదా ఒక చంద్రయాన నౌక కాని ఒక నిర్దిష్టమైన వేగం దాటితే తప్ప భూమి యొక్క గురుత్వాకర్షణ శక్తినుండి బయటపడలేదు. అట్లా బయటపడినప్పుడు మాత్రమే ఆ నౌక ఒక స్వేచ్ఛగా చలించే అంతరిక్ష వస్తువు కాగలదు." పేదరిక విషవలయం నుండి బయటపడాలంటే తగినంత పెట్టుబడి పెట్టాలి. ఆ తర్వాత ఆ దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది. యిక్కడ రాజాచెల్లయ్య అభివృద్ధిని వేగవంతం చెయ్యాలంటే ఈ క్రింది సూచనలను చేశాడు. అవి :

1) పొదుపు - ఆదాయ నిష్పత్తిని పెంచాలి. ఎట్లా చెయ్యాలంటే వినియోగాన్ని నియంత్రించి ఆ నిష్పత్తిని (ఎస్.వై. నిష్పత్తి) పెంచాలి.

2) పెట్టుబడి రేటుని పెంచడం :

3) ఉత్పాదక మార్గాలవైపుకి వ్యయ ప్రవాహాన్ని ప్రోత్సహించాలి,

4) బాగా బహిర్గతమైన ఆదాయ, సంపద వ్యత్యాసాలను తగ్గించాలి.

ఈ విషయాలను దృష్టిలో వుంచుకుని కోశ విధానాన్ని రూపొందించాలి. దీనికొరకై పెట్టుబడిని పబ్లిక్ మరియు ప్రైవేటు రంగాలలో పెంచడమేకాకుండా, ప్రజోపకర మార్గాలవైపు పెట్టుబడిని మళ్ళించాలి. దీనివలన దేశం మొత్తం మీద పొదుపు పెరిగి మూలధన సంచయం జరుగుతుంది. ఈ పరిస్థితికి పన్ను విధానం కూడా చేయూతనిస్తుంది. దీంతో బాటుగా లోటుబడ్జెట్ విధానం, ఋణ విధానం కూడా ఎంతైనా ఉపయోగపడుతుంది. ఈ విధానాలను ఒక సమపాళ్ళలో సమ్మిళితం చేసి ఉత్పత్తి, వినియోగం, మరియు పంపిణిలో దెబ్బతినకుండా చూడాలి. అంతేకాకుండా, పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేలాగున ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను మరియు అవకాశాలను కల్పించాలి. ఆర్థిక వ్యవస్థ అంతా కూడా సంతులిత వృద్ధి సాధించేలాగున కోశవిధానాన్ని రూపొందించవలసి వుంటుంది. యిక్కడ రాజాచెల్లయ్య ఏమన్నాడంటే "అత్యంత ఫలప్రదమైన అభివృద్ధిపథం ఏమనగా, వ్యవసాయ రంగం మరియు పారిశ్రామికరంగాలు సంతులిత వృద్ధిని సాధించే మార్గం" అని అన్నాడు (Raja Chellaiah, Fiscal Policy in Under developed countries p. 41). ఇటువంటి సంతులిత వృద్ధి మూలంగా జాతీయాదాయం మరియు తలసరి ఆదాయాలు పెరిగే అవకాశం వుంది.

14.5.3 పెట్టుబడిని ప్రోత్సహించుట :

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పొదుపు పెట్టుబడుల ఆవశ్యకత గురించి వేరే చెప్పనక్కరలేదు. అయితే పొదుపు పెరిగినంత మాత్రాన పెట్టుబడి పెరుగుతుందని అనుకోనవసరం లేదు. పొదుపు పెట్టుబడిగా మారాలంటే బ్యాంకింగ్ వ్యవస్థతో బాటుగా దేశంలో ఉద్యమిత్వ లక్షణాలు ప్రజల్లోవుంటేనే జరుగుతుంది. అల్పాభివృద్ధి దేశాల్లో పొదుపు అసలే తక్కువ, ఆ పొదుపు కూడా అనుత్పాదక రంగాలవైపు తరలిపోవడం అవేది కద్దు. అంటే అంచనా వ్యాపారం, బంగారు వెండి నగలు, భూ సంబంధ వ్యాపారాలు మొదలైన వాటిలో పొదుపు మదుపు చేయబడుతుంది. కాబట్టి కోశ విధానం ద్వారా పొదుపుని పెంచడమే కాకుండా ఆ పొదుపుని సరియైన ప్రజోపకరమార్గాల వైపుకి మళ్ళించాలి. సరియైన ప్రోత్సాహకాలు మరియు రాయితీలు కల్పించి దేశంలో ఉద్యమిత్వ లక్షణాలు పెంచాలి. దీని జాడకు పన్నువిధానాన్ని వ్యయ విధానాన్ని ఉపయోగించి పెట్టుబడి ఉత్పాదక మార్గాలవైపుకి ప్రోత్సహించాలి. ఈ విధానంలో ప్రజల సాంఘిక ప్రయోజనాన్ని గరిష్ఠం చేయాలి. పబ్లిక్ రంగంలో పెట్టుబడి పెంచితే తద్వారా ప్రైవేటు రంగంలో పెట్టుబడి పెరిగి దేశం మొత్తం పారిశ్రామికాభివృద్ధి సాధించే అవకాశం పెరుగుతుంది. యిక్కడ నర్క్సే ఏమన్నాడంటే, "కోశవిధానాన్ని కోశరాయితీల రూపంలో అనగా పెట్టుబడి, తరుగుదల రాయితీ, విత్త సౌకర్యం, విదేశీ మారకద్రవ్యం, పన్నుహావడే, అభివృద్ధి రాయితీలు, సబ్సిడీలు మొదలైనవన్ని ప్రైవేటు రంగంలో పెట్టుబడిని గణనీయంగా

పెంచే అవకాశం వుంది. అయితే వీటితోపాటు, ప్రభుత్వం అవస్థాపనా సౌకర్యాలైన రవాణా, తంతితపాల సౌకర్యం నీటిపారుదల, వరద నియంత్రణ, విద్యుచ్ఛక్తి, పోర్టులు, సాంకేతిక ట్రైనింగ్, విద్య, ఆసుపత్రులు, విద్యాలయాలు, మొదలైనవి కల్పించాలి. ఈ సౌకర్యాలు బహిర్గత ఆదాలు కలుగజేసి పారిశ్రామిక రంగంలోనూ, వ్యవసాయ రంగంలోను పెట్టుబడులు పెరిగే అవకాశం వుంది. పెట్టుబడి పెరగడంతోనే మార్కెట్టు విస్తృతమవుతుంది. ఉత్పత్తి వ్యయం తగ్గి పెట్టుబడి యొక్క సామాజిక ఉపాంత ఉత్పాదకత పెరుగుతుంది." అని అన్నాడు.

ఒక అభివృద్ధి చెందుతున్న దేశంలో పెట్టుబడి యొక్క విధి విధానం అంతా కూడా సామాజిక ఉపాంత ఉత్పాదక మీద ఆధారపడి వుంటుందనడంలో సందేహంలేదు. ఏ ప్రాజెక్టులోనైతే ఈ సామాజిక ఉపాంత ఉత్పాదకత (Social Marginal Productivity) ఎక్కువగా వుంటుందో ఆ రంగంలో పెట్టుబడి పెట్టవలసి వుంటుంది. అయితే అమార్త్య కే. సేన్ ఏమన్నాడంటే "సామాజిక ఉపాంత ఉత్పాదకత ప్రకారం పెట్టుబడి పెట్టడం అనేది స్వల్ప కాలంలో ఉపయుక్తంగా వుంటుంది. దీర్ఘ కాలంలో ఈ పద్ధతి మీద ఆధారపడి పెట్టుబడి పెట్టడం వీలుకాదు" అవి అన్నాడు. అయితే కోశ విధానం ద్వారా సాంఘిక ప్రయోజనాన్ని మరియు ఆర్థికాభివృద్ధిని సమన్వయం చేసుకోవలసి వుంది.

14.5.4 ధరల స్థిరీకరణ :

అల్పాభివృద్ధి దేశాలలో ఆర్థిక వృద్ధి మరియు ధరల స్థిరీకరణ అనే రెండు జాయింట్ లక్ష్యాలుగా వున్నాయి (R.N. Tripathy, Public Finance in Underdeveloped Countries) ధరల స్థిరీకరణ అంటే ధరలు నిరపేక్షికంగా స్థిరంగా వుంటాయని గాదు (R.N. Musgrave, Theory of Public Finance) అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థిక అస్థిరత ద్రవ్యోల్బణం రూపంలో వుంటుంది. నర్క్సే ఏమని నమ్ముతున్నాడంటే "ద్రవ్యోల్బణ వత్తిళ్ళు పెట్టుబడి విధానంలో అంతర్లీనంగా వుంటాయని, ఈ వత్తిళ్ళు నివారించాలంటే పెట్టుబడిని ఆపివేయడం కాదు అని అంటూ ఈ ద్రవ్యోల్బణాన్ని నివారించాలంటే అనేక ఇతర మార్గాలున్నాయి. వాటిలో కోశవిధానం అత్యంత శక్తివంతమైనది" అని అన్నాడు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ద్రవ్యోల్బణం అనేది ఒక శాశ్వత వైపరీత్యం. ఈ దేశాలలో ప్రభుత్వ వ్యయం పెరిగే లక్షణం కలిగి వుండడంవల్ల ధరలు పెరిగే లక్షణాన్ని సంతరించుకున్నాయి. అంతేకాకుండా ఆదాయం పెరుగుతున్న పరిస్థితులలో సమిష్టి డిమాండ్ సమిష్టి సప్లయిని మించి వుండే అవకాశం వుంటుంది. దీనివల్ల వినియోగ, మూలధన వస్తువులు పెరుగుతున్న ఆదాయానికి తగ్గట్టుగా వుండవు. దీనివల్ల ద్రవ్యోల్బణ వ్యత్యాసం (Inflationary Gap) ఏర్పడుతుంది. తరువాత వేతనాలు పెరిగి, విపరీత ద్రవ్యోల్బణ (Hyper Inflation) పరిస్థితులు ఏర్పడతాయి. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాలలో తక్కువస్థాయి (Mild)లో వున్న ద్రవ్యోల్బణాన్ని నివారించలేనటువంటిది. ఎందుకంటే వ్యయం పెరుగుతూ వుంటుంది కాబట్టి గ్రాడ్యువల్‌గా పెరిగేధరలు ఉత్పత్తిని, పెట్టుబడిని మరియు మూలధన సంచయాన్ని ఉత్తేజపరుస్తాయి. అందుచేత మైల్డుగా పెరిగే ధరలు ఆర్థికాభివృద్ధికి దోహదకారులు. అయితే ద్రవ్యోల్బణ వ్యత్యాసం పెరిగితే, దాని నివారణలో కోశ విధానం అత్యంత కీలకపాత్ర నిర్వహిస్తుంది. ఈ కోశ విధానంలో, ప్రభుత్వ వ్యయంలో తగ్గుదల, పన్ను విధానంలో పెంపుదల, మరియు ఋణ విధానంలో సరళత మొదలైనవి ఆచరిస్తారు. ఈ విషయంగా మస్గ్రేవ్ ఏమన్నాడంటే "ఉద్యమిత్వ ఆశావాదాన్ని ప్రోత్సహించడానికి ధరల స్థాయిని లక్ష్యంగా పెట్టుకోవడం ఆమోదయోగ్యమైన విషయమే. అయితే ఆర్థిక వ్యవస్థని యుద్ధ ఆర్థిక వ్యవస్థ (War Economy) క్రింద వేగంగా మార్పు చేయాలంటే ధరలలో చెప్పుకోదగ్గ (Substantial) పెరుగుదల అవసరం. ఇతర సమాయాల్లో ధరలలో తగ్గుదల ఉపయోగకారిగా వుంటుందని" వివరించాడు (R.A. Musgrave, The Theory of Public Finance) దీని అర్థం ఏమిటంటే ఉద్యమదారుల ఆశాభావాన్ని పెంచాలంటే ధరల పెరుగుదల అవసరం. ఎందుకంటే ధరలు పెరిగితే లాభాలు వచ్చే అవకాశం వుంది. కాబట్టి ఆర్థిక వ్యవస్థ త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే ధరలలో చెప్పుకోదగ్గ పెరుగుదల అవసరం. ఎందుకంటే పెట్టుబడి ప్రక్రియ ఊపందుకుంటుంది. సమాజ పరంగా తక్కువ ధరలకి వస్తువులు లభిస్తే ప్రజల శ్రేయస్సు పెరిగినట్లే అని అనుకోవచ్చు.

ద్రవ్యోల్బణ వ్యతిరేక పన్ను విధానంలో పరిమితులున్నాయి. అవి :

1) ప్రత్యక్ష పన్ను విధానంలోనే పురోగామి పన్ను విధానానికి అవకాశం వుంది;

2) పెట్టుబడిని మరియు ఉత్పత్తిని నిరుత్సాహపరుస్తుంది.

3) సాంఘిక శ్రేయస్సుని పెంపొందించే వాటిపై వ్యయం తగ్గించడం హర్షించదగ్గ విషయంకాదు; మరియు

4) సాధారణ ప్రజానీకం మీద అధికంగా పన్నులు విధించడం వల్ల వారి కొనుగోలు శక్తి తగ్గిపోతుంది.

అందుచేత కోశ విధానంలో ద్రవ్య విధానాన్ని అనుసంధానం చేసినట్లయితే కోశ విధానం సత్ఫలితాలనిస్తుంది. దీనివల్ల ఆర్థిక వృద్ధి మరియు ధరల స్థిరీకరణ సాధించే వీలుంది.

3.5. ఆదాయ, సంపదల సమ పంపిణీ :

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆదాయ సంపదల సమ పంపిణీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఒక అభివృద్ధి లక్ష్యం. అభివృద్ధి ముందు దశలలో సంపద ఏదో కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం అయ్యుంటుంది. దీనికి కారణం ప్రైవేటు యాజమాన్యం, మొత్తం ఆర్థిక వ్యవస్థపై పట్టు సాధించడమే. ఈ కారణంచేత దేశంలో సామాజిక, ఆర్థిక సమస్యలు తలెత్తి ఆర్థిక పరమైన అనిశ్చితకి దారితీసాయి. అమితమైన అసమానతలవల్ల ఆర్థికాభివృద్ధికి విఘాతం కల్గి ప్రజలయొక్క పౌష్టికాహార, ఆరోగ్య, మరియు జీవన ప్రమాణాలు తగ్గిపోతాయి. (U.N.O. Method of Financial Development). అందుచేత, ఈ అసమానతలను తగ్గించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. దీనికొరకై ప్రభుత్వాలు సరియైన కోశ విధానాన్ని రూపొందించి ఆదాయ సంపద వ్యత్యాసాలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం వేర్వేరు వర్గాలలోవున్న ఆదాయ సంపద తేడాలను కోశ విధానం అంటే పన్ను విధానం, వ్యయ విధానం ద్వారా తగ్గించే ప్రయత్నం చేస్తున్నది. ఇక్కడ పునఃపంపిణి వ్యయం (Redistributive Expenditure) ఆర్థికాభివృద్ధికి దోహదపడితే, ఆర్థికాభివృద్ధి పునఃపంపిణికి దోహదపడాలి. డబ్ల్యు. డబ్ల్యు. హెల్లర్ మాటల్లో చెప్పాలంటే "పునఃపంపిణి విత్తం (Redistributive Finance) తక్కువ ఖర్చుతో అధిక లాభాలను అల్పాభివృద్ధి దేశాలకి అందిస్తున్నట్లుగా కనబడుతోంది. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే" అని వివరించాడు. చక్కటి ప్రణాళికతో కోశ విధానాన్ని రూపొందించి ప్రభుత్వ వ్యయ విధానాన్ని అవలంభించినట్లయితే మానవ మూలధనం (Human Capital) అభివృద్ధి చెంది ఆదాయ పంపిణి వ్యవస్థపై ధనాత్మకమైన (Positive) ప్రభావాన్ని చూపిస్తుంది. అలాగే పునఃపంపిణి పన్ను విధానం (Redistributive Tax Policy) ద్వారా ధనికవర్గాలపై పురోగామి పన్నులు విధించి పేదవర్గాలకి మినహాయింపు ఇచ్చి అసమానతలను తగ్గించవచ్చు. అలాగే విలాసవంత వస్తువులపై అధిక పన్నులు విధించడం వల్ల పంపిణిలో సమానత సాధించవచ్చు. ముఖ్యంగా పన్ను భారం సమంగా పంపిణి అవుతుంది.

కోశ విధానం పునఃపంపిణి సాధనంగా వాడుతున్నపుడు పురోగామిగా వుండాలి. అధిక పురోగామి పన్ను విధానం వలన పొదుపు పెట్టుబడులకు హాని కలిగే ప్రమాదం వుంది. పొదుపు పెట్టుబడులుంటేనే ఆర్థిక వృద్ధి ఉంటుంది, లేకపోతేలేదు. వృద్ధి కావాలంటే సామాజిక న్యాయాన్ని అంటే సమానతని సాధించడం కష్టం. సమానత సాధిస్తే వృద్ధి వుండదు. ఈ రెండు లక్ష్యాలు పరస్పర విరుద్ధమైనవి. కాబట్టి మధ్యే మార్గాన్ని అవలంభించాలి. అంటే కొంతమేర అసమానతలని భరించి వృద్ధిని సాధించాలి. ఆర్.ఎన్. త్రిపాఠి మాటల్లో చెప్పాలంటే, "న్యాయసమ్మతమైన (Functional) అసమానతలను కొంతమేర సహించి, న్యాయ సమ్మతం కానటువంటి అసమానతలను తప్పని సరిగా నివారించాలి." (R.N. Tripathy, Public Finance for Underdeveloped Countries, p. 107). అంటే అధిక పన్నులను ఉద్యమ దారులు కానివారిపైన వేయాలి. అలాగే న్యాయ సమ్మతం కాని వినియోగం పైన అధికంగా పన్నులు వేయాలి. ఈ విధానంవల్ల అంటే న్యాయసమ్మతమైన అసమానతలను భరించినట్లుగా అవుతుంది. దీనివలన పొదుపు, పెట్టుబడులు పెరుగుతాయి. వీటిపై పన్నులు అల్పంగా విధించడంవలన ఆర్థికాభివృద్ధి జరగడానికి అవకాశం వుంది. అయితే ప్రభుత్వ వ్యయం యొక్క ప్రభావం పునఃపంపిణి మెరుగ్గా వుండాలంటే మానవ వనరుల పెంపుదలపై వ్యయం చేసినట్లయితే, శ్రామికులలో నైపుణ్యత పెరిగి జాతీయాదాయంలో శ్రామికుల వాటా వేతనం రూపంలో పెరుగుతుంది. ఇదే పునఃపంపిణి ప్రభావం. అలాకాకుండా, ప్రభుత్వ వ్యయాన్ని మూలధన వస్తు పరిశ్రమల అభివృద్ధికై వెచ్చిస్తే జాతీయాదాయంలో మూలధనం యొక్క వాటా పెరిగి అసమానతలు పెరిగే అవకాశం వుంది. (కె.ఆర్. రణదేవ్). అయితే పబ్లిక్ రంగ సంస్థల ద్వారా కోశవిధానాన్ని అమలుచేస్తే ద్రవ్యోల్బణ పరిస్థితులకి దారితీసి ఆదాయ పంపిణి పేద వర్గాల నుండి ధనిక వర్గాల వైపుకి జరుగుతుంది. ఎందుకంటే పబ్లిక్‌రంగ సంస్థలలో అధికమొత్తంలో పెట్టుబడి జరుగుతోంది. కాబట్టి అందుచేత, ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకుని కోశ విధానాన్ని రూపొందించవలసి వుంటుంది.

సూక్ష్మంగా కోశవిధానాన్ని చెప్పాలంటే భారతదేశంలో పెట్టుబడి పెరగవలసిన ఆవశ్యకత గురించి పైన వివరించిన లక్ష్యాలలో ఎక్కువ భాగం సూచిస్తున్నాయి. ఈ లక్ష్యాలన్ని కూడా సామాజికంగా అభిలషణీయ పెట్టుబడి విధానం గురించి సూచిస్తున్నాయి. అంతే

కాకుండా, ఈ లక్ష్యాలన్ని కేంద్రీకృత ప్రణాళికను తెలియజేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కోశ విధానమంటే సామాజిక శ్రేయస్సుని గరిష్ఠంచేసే పెట్టుబడి విధానమని అనవచ్చు. అంతేకాకుండా ఆర్థికవృద్ధి, సమానత మరియు స్థిరీకరణ ముఖ్య ఆశయాలైవున్నాయి.

4.0 కోశ విధాన సాధనాలు :

గడిచిన పేజీల్లో చెప్పుకున్న వివరణ ఆధారంగా కోశ విధాన సాధనాలు ముఖ్యంగా నాలుగు అవి :

1) ప్రభుత్వ వ్యయ విధానం (Public Expenditure Policy)

2) పన్ను విధానం (Taxation Policy)

3) ప్రభుత్వ ఋణ విధానం (Public Debt Policy)

4) లోటు బడ్జెట్ విధానం (Deficit Financing Policy)

పైన పేర్కొన్న కోశ విధాన సాధనాల ద్వారా భారతదేశంలో కోశ విధాన లక్ష్యాలైన ఆర్థికవృద్ధి, సమానత, స్థిరీకరణ మొదలైనవి ఎట్లు సాధించబడ్డాయో పరిశీలిద్దాము.

4.1 ప్రభుత్వ వ్యయ విధానం :

ప్రణాళికా శకం ఆరంభమైన తర్వాత ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికై కోశ విధానంలో ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి లక్ష్యాలు సాధించడంలో 1950-51 నుండి ఈనాటి వరకు ప్రభుత్వ వ్యయం ఎన్నో రెట్లు పెరిగింది. ప్రభుత్వం యొక్క బాధ్యతలు ఎన్నో రెట్లు పెరిగాయి. పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడానికి తద్వారా ప్రజల శ్రేయస్సుని గరిష్ఠం చేయడంలో ఈ పెరుగుతున్న వ్యయం అవసరమైంది.

ఈ పెరుగుతున్న వ్యయంలో అధిక శాతం రెవెన్యూ వ్యయం ఎక్కువ. ఈ రెవెన్యూ వ్యయంలో పెరుగుదల అంతా పన్ను ఆదాయం మరియు పన్నేతర ఆదాయం ద్వారా సమకూర్చుకోబడింది. పట్టిక 1 లో చూపినట్లుగా 1950-51లో మొత్తం వ్యయం రూ. 530 కోట్ల నుండి 2004-05 (B.E.)లో రూ. 4,77,829 కోట్లకి పెరిగింది. అంటే 901 రెట్లు పెరిగింది. 1950-51లో రెవెన్యూ వ్యయం 66 శాతం వుంటే 2004-05లో 81 శాతంగా వుంది. అధిక శాతం నిర్వహణా వ్యయంగా వుంది. మూల ధన వ్యయం ఇదే కాలంలో 34 శాతం నుండి 19 శాతానికి పడిపోయింది.

పట్టిక 1 : ప్రభుత్వ వ్యయంలో మార్పు, 1950-51 నుండి 2004-05

(రూ. కోట్లలో)

సం॥లు	రెవెన్యూ వ్యయం		మూలధన వ్యయం		మొత్తం
	వ్యయం	శాతం	వ్యయం	శాతం	వ్యయం
1950-51	350	66	180	34	530
1980-81	14540	60	9630	40	24170
1990-91	76210	71	31780	29	107990
1994-95	118810	78	32890	22	151700
2001-02	301610	83	60840	17	362450
2002-03	339628	82	74535	18	414163
2003-04	362887	77	111368	23	474255
2004-05 (B.E.)	385493	81	92336	19	477829

మూలం : ఎకనామిక్ సర్వే, 2002-03 మరియు 2003-04

పట్టిక : 2 : ప్రణాళికేతర మరియు ప్రణాళికా వ్యయం 1989-90 నుండి 2004-05

రూ. కోట్లలో

	వివరం	1989-90 వాస్తవ	2003-03 వాస్తవ	2003-04 R.E.	2004-05 B.E.
1.	ప్రణాళికేతర వ్యయం	64,500	302708	352748	332239
	ఎ. రెవెన్యూ	52,130	268074	284801	293650
	బి. మూలధన	12,370	34634	676947	38589
2.	ప్రణాళికా వ్యయం	28,400	1,11,455	1,21,507	1,45,590
	ఎ. రెవెన్యూ	12,070	71,554	78,086	91,843
	బి. మూలధన	16,330	39,901	43,421	53,747
	మొత్తం వ్యయం (I.II.)	92,900	4,14,163	4,74,255	4,77,829

మూలం : 2002-03 అండ్ 2003-04 ఎకనామిక్ సర్వే

కేంద్ర వ్యయ వర్గీకరణ :

1987-88 బడ్జెట్‌కు పూర్వం కేంద్ర ప్రభుత్వం యొక్క రెవెన్యూ వ్యయాన్ని మూడు రకాలుగా విభజించేవారు అవి : 1) సివిల్ వ్యయం, ఇందులో సాధారణ సేవలు, కమ్యూనిటీ సేవలు, సాంఘిక సేవలు మరియు ఆర్థిక సేవలు కూడా కలుపబడ్డాయి. 2) రక్షణ వ్యయం, మరియు 3) రాష్ట్రాలకు కేంద్ర పాలిత ప్రాంతాలకు లభించే గ్రాంట్లు. ఈ వర్గీకరణతోపాటుగా అభివృద్ధి వ్యయం అని మరియు అభివృద్ధేతర వ్యయం అని కూడా విభజనజరిపింది. ఈ అభివృద్ధి వ్యయంలో 1) సాంఘిక, కమ్యూనిటీ సేవలు; 2) ఆర్థిక సేవలు, మరియు 3) రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు గ్రాంట్లు వుండేవి. ఈ వ్యయం అంతా కూడా అభివృద్ధికే ఉపయోగించేవారు. అభివృద్ధేతర వ్యయంలో పన్ను వసూళ్ళు, పరిపాలనా సేవలు, వడ్డీ చెల్లింపులు, పెన్షన్‌లు, రాష్ట్రాలకు ఇతర గ్రాంట్లు, మొదలైనవి వుంటాయి. ఈ రెండింటితోపాటు రక్షణ వ్యయం కూడా వుండేది.

1987-88 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం క్రొత్త వర్గీకరణ చేపట్టింది. దీనిక్రింద 1) ప్రణాళికా వ్యయం; మరియు 2) ప్రణాళికేతర వ్యయం అని వ్యయాన్ని విభజించడం జరిగింది. ప్రణాళికా వ్యయంలో ప్రణాళికా సంబంధమైన ఖర్చులు చోటుచేసుకుంటాయి. అంటే ప్రణాళికలలో తీసుకున్న నిర్ణయాల కనుగుణంగా వ్యయం చేయబడుతుంది. దీంట్లో భాగంగా ఈ క్రింది వర్గీకరణ వుంటుంది.

ఎ) కేంద్ర ప్రణాళిక ననుసరించి-వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, వరద నియంత్రణ, ఇంధనం, పరిశ్రమలు, గనులు, రవాణా, కమ్యూనికేషన్స్, సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, సాంఘిక సేవలు, మొదలైనవి; మరియు

బి) రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ప్రణాళికలకిచ్చే కేంద్ర సహాయం.

ప్రణాళికేతర వ్యయంలో వడ్డీ చెల్లింపులు, రక్షణ రెవెన్యూ వ్యయం, ముఖ్యమైన సబ్సిడీలు (ఆహారం, ఎరువులు, ఎగుమతి ప్రోత్సాహకాలు), రైతులకు ఋణ విమోచన, పోస్టల్ లోటు, పోలీస్, పింఛనులు, ఇతర సాధారణ సేవలు (రాష్ట్రాల విభాగాలు, పన్ను వసూళ్ళు, విదేశీ సంబంధాలు, మొదలైనవి), సాంఘిక సేవలు (విద్య, ఆరోగ్యం, వార్తా ప్రసారం మొదలైనవి), ఆర్థిక సేవలు (వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుశ్చక్తి, రవాణా, కమ్యూనికేషన్లు, సైన్స్ మరియు సాంకేతిక విజ్ఞానం, మొదలైనవి). ఇవన్నీ రెవెన్యూ ప్రణాళికేతర వ్యయంగా

చెప్పవచ్చు. మూలధన ప్రణాళికేతర వ్యయంలో రక్షణ మూలధన వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థలకి అప్పులు, రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాలకి అప్పులు, విదేశీ ప్రభుత్వాలకి అప్పులు వుంటాయి.

అలాగే ప్రణాళికా వ్యయంలో కూడా రెవెన్యూ మూలధన వర్గీకరణ వుంటుంది. పట్టిక. 2 లో ప్రణాళికా మరియు ప్రణాళికేతర వ్యయంలో మార్పుని గమనించవచ్చు. ప్రణాళికేతర వ్యయం రూ. 64,500 కోట్ల నుండి 2004-05 నాటికి 3,32,239 కోట్లకి అంటే 5 రెట్లు పెరిగింది. ప్రణాళికా వ్యయం రూ. 28,400 కోట్లనుండి రూ. 145590 కోట్లకి అనగా 5 రెట్లు పెరిగింది. 1989-90 నుండి 2004-05 కాలంలో రెండు రకాల వ్యయాలు అంటే ప్రణాళికేతర మరియు ప్రణాళికా వ్యయాలు రెండు ఒకే మోస్తరుగా పెరిగాయని తెలుస్తోంది. అయితే మొత్తం వ్యయంలో ప్రణాళికేతర వ్యయం యొక్క శాతం ఎక్కువ. ఉదా॥కి 1989-90 లో ప్రణాళికేతర వ్యయం 69 శాతం వుండగా 2004-05లో 70 శాతంగా వుంది. మిగిలినది ప్రణాళికావ్యయం.

కేంద్ర ప్రభుత్వ వ్యయ పోకడలు :

అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రభుత్వ వ్యయంలో కొన్ని పోకడలు కొట్టొచ్చినట్లు కనబడతాయి. భారతదేశ ప్రభుత్వ వ్యయంలో ఈ విషయం చక్కగా బోధ పడగలదు. ప్రణాళికా శకం ఆరంభం అయిన తర్వాత ప్రభుత్వవ్యయం పెరుగుతూ వచ్చింది. యిటువంటి పరిస్థితి అనగా వ్యయంలో పెరుగుదల స్వాతంత్ర్యం తర్వాతనే ప్రస్ఫుటంగా కనబడింది. స్వాతంత్ర్యం రాక పూర్వం ముఖ్యంగా రెండవ ప్రపంచయుద్ధకాలంలో బ్రిటీష్ ప్రభుత్వం యొక్క పరిపాలనా లక్ష్యం వేరుగా వున్న కారణంగా ముఖ్యంగా శ్రేయో రాజ్యస్థాపన లక్ష్యంగా లేదు కాబట్టి ప్రభుత్వ వ్యయం తక్కువగా వుండేది. అయితే రక్షణ మీద అధికంగా ఖర్చు చేయడం జరిగింది. అటు తరువాత ప్రజల యోగ క్షేమాలే ప్రభుత్వ లక్ష్యంగా వున్న కారణంగా వ్యయం పెరుగుతూ వచ్చింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఈ పెరుగుదల వేగాన్ని పుంజుకుంది. అంతే కాకుండా ప్రభుత్వ వ్యయం యొక్క తరహాలో కూడా మార్పు సంతరించుకుంది. ప్రభుత్వం ప్రజల జీవన విధానంలో ఎక్కువగా పాలుపంచుకోవడం చేత కూడా అధిక వ్యయం జరుగుతూ వస్తోంది. ఈ వ్యయంలో అభివృద్ధి వ్యయం మొత్తం వ్యయంలో పెరుగుతూ వస్తోంది. అయితే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఈనాటి వరకు అంటే 57 సం॥లలో మన పొరుగు వారి నుండి యుద్ధ భీతి వల్ల కూడా ప్రభుత్వవ్యయం పెరుగుతూ ఉండడం గమనించగలం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వ్యయంలో పెరుగుదలకి కారణాలలో జనాభా అవసరాలు పెరగడమే కాకుండా కరువు కాటకాలు, పెరుగుతున్న సబ్సిడీలు, సామాజిక వ్యయం పెరగడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణ పరిస్థితులు, మొదలైనవి కారణాలు చెప్పవచ్చు.

పట్టిక.1 లో చూపబడినట్లుగా ప్రభుత్వ రెవెన్యూ వ్యయం గణనీయంగా పెరగడం భారతదేశం యొక్క ప్రభుత్వ వ్యయ పోకడగా చెప్పవచ్చు. 1950-51 లో రూ. 350 కోట్లున్న రెవెన్యూ వ్యయం 2004-05 (BE) నాటికి రూ. 3,85,493 కోట్లకి పెరిగింది. అంటే 1100 రెట్లు పెరిగింది. దీనికి కారణం రక్షణ వ్యయం పెరగడం, పరిపాలనా విస్తరణ, ప్రజాస్వామ్య వ్యవస్థలైన పార్లమెంటు మొదలైన వాటి పరంగా ఖర్చులు పెరగడం, ప్రభుత్వం యొక్క విదేశీ బాధ్యతలు పెరగడం, దేశ నిర్మాణంలో ప్రభుత్వం యొక్క పాత్ర పెరగడం. అంటే విద్యా, ఆరోగ్యం, ధరలు పెరుగుదల పరంగా వ్యయం పెరగడం కారణంగా చెప్పవచ్చు. అయితే మూలధన వ్యయం 1950-51 లో రూ. 180 కోట్ల నుండి రు. 92336 కోట్లకి అంటే 512 రెట్లు పెరిగింది. దీంతో పోలిస్తే రెవెన్యూ వ్యయమే అధికంగా పెరిగిందని గమనించగలం.

తర్వాత, అభివృద్ధేతర వ్యయం (Non - Development Expenditure) మొత్తం వ్యయంలో సింహభాగాన్ని ఆక్రమిస్తోంది. దీనికి కారణం, రక్షణ రంగం మీద వ్యయం, ఋణసేవలు, మరియు పరిపాలనలపై వ్యయం అధికంగా జరగడమే.

అంతే కాకుండా, ప్రణాళికేతర రెవెన్యూ వ్యయం పెరుగుదల భారతదేశంలో 80 దశకం నుండి వేగాన్ని పుంజుకుంది. ఉదా॥కి 1980 దశాబ్దంలో ప్రణాళికేతర రెవెన్యూ వ్యయం ఒక సం॥కి రూ. 5000 కోట్ల చొప్పున పెరుగుదల నమోదు చేసుకుంది. ఈ వ్యయంలో 70 శాతం ఖర్చు అంతా కూడా వడ్డీ చెల్లింపులు, రక్షణ వ్యయం, సాధారణ సేవలు, మరియు సబ్సిడీలపై జరుగుతోంది.

ఈ నాలుగు వ్యయాలను అనగా వడ్డీ చెల్లింపులు, రక్షణ వ్యయం, సబ్సిడీలు మరియు సాధారణ సేవలు నియంత్రించడం సాధ్య పడే విషయం కాదు. అప్పులు పెరుగుతున్న కొద్ది వడ్డీ చెల్లింపులు పెరిగిపోతాయి. ఉదా॥కి 1985-86లో రూ. 7500 కోట్ల వడ్డీ చెల్లింపు జరిగితే 1986-87 కి రు.9250 కోట్లుగాను, 1990-91 లో రూ. 21,500 కోట్లుగాను మరియు 2003-04 లో రూ. 1,23,220 కోట్లకి పెరిగింది. పట్టిక.3 చూడగలరు.

రక్షణ వ్యయం కూడా గణనీయంగా పెరగడంచేత ప్రణాళికేతర వ్యయం పెరగనారంభించింది. దీనికి ముఖ్యకారణం కాశ్మీర్ సమస్య భారత పాకిస్థాన్‌ల మధ్య గత 57 సం॥లుగా నలుగుతోంది. దీంతో యుద్ధ వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డానికి పెద్దకాలం పట్టదు. దీని వలననే అణుశక్తి పాటవంలో పరీక్షలు మాజీ భారత ప్రధాని శ్రీ అటల్ బిహారి వాజపేయి యొక్క క్రియాశీలక రక్షణ విధానంలో భాగంగా జరిపింది. దీనికి తోడు కార్గిల్ చొరబాటు తనం పాకిస్థాన్ వైపు నుండి జరిగింది. వీటి కారణంగా చైనాతో ధీటుగా నిలబడడానికి భారత్ రక్షణ వ్యయాన్ని పెంచుతూ వస్తోంది. 1985-86 లో రక్షణ వ్యయం రూ. 7000 కోట్లుంటే, 1990-91 నాటికి రూ. 10,870 కోట్లుగాను, మరియు 2003-04 కి రూ. 44,350 కోట్లుగా పెరిగింది. 2004-05 (BE) లో రక్షణ వ్యయం రూ. 77,000 కోట్లకి పెంచడం జరిగింది. పట్టిక 3 లో చూపబడింది.

యిక సబ్సిడీలు ముఖ్యంగా ఆహారం, ఎరువులు, ఎగుమతుల ప్రోత్సాహం మొదలైన వాటికి యివ్వబడుతున్నాయి. అయితే ఈ సబ్సిడీలు కేంద్ర ప్రభుత్వ వ్యయంలో ముఖ్య భాగంగా వున్నాయి. ఈ సబ్సిడీలు వ్యయాన్ని తగ్గించాలి అని అనేక సార్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఈ వ్యయంలో పెరుగుదల ఉంటూనే వుంది. 1985-86 లో సబ్సిడీ వ్యయం రూ. 4,900 కోట్లుండగా,1990-91 నాటికి రు. 12,160 కోట్లుగాను, 2003-04(BE) కి రూ. 49,900 కోట్లుగా పెరిగింది.

సాధారణ సేవలపై వ్యయం కూడా గణనీయంగా పెరుగుతూ వస్తోంది. సాధారణ సేవలలో రాష్ట్రాల విభాగాలపై వ్యయం, పన్ను వసూళ్ళు, పోలిస్, పించనులు మొదలైనవి వుంటాయి. వేతన సవరణలు మరియు కరువు భత్యం పెరిగినపుడు సాధారణ సేవల పై వ్యయం పెరుగుతూ వస్తోంది. ఈ వ్యయం 1985-86 లో రూ. 2,060 కోట్ల నుండి 1990-91 లో రూ. 6,850 కోట్లుగాను మరియు 2003-04 లో రూ. 34,750. గాను పెరిగింది.

పట్టిక 3 : ప్రణాళికేతర రెవెన్యూ వ్యయం, 1985-86 నుండి 2003-04 (రూ. కోట్లలో)

వివరం	1985-86	1990-91	1994-95	2003-04
1. వడ్డీచెల్లింపులు	7500	21,500	46,000	1,23,220
2. రక్షణ రంగం	7000	10,870	16,170	44,350
3. అన్ని రకాల సబ్సిడీలు	4900	12,160	9,460	49,900
4. సాధారణ సేవలు	2060	6,850	9,800	34,750
మొత్తం వ్యయం	24,460	51,380	81,430	2,52,220

మూలం : (Economic Surveys, 2003-04 & EPW. June, 2004

పట్టిక 4 : కోశ సూచికలు : 1980-81 నుండి 1990-91

(స్థూల దేశీయోత్పత్తి లో శాతం)

(%)

వివరం	1980-81 నుండి 1984-85 సగటు	85-86	86-87	87-88	88-89	89-90	90-91	85-86 నుండి 89-90 సగటు
రెవెన్యూ	18.1	19.5	20	20.1	19.6	20.9	19.5	20
రెవెన్యూ వ్యయం	18.6	21.4	22.6	23.1	22.7	24.8	23.9	23
రక్షణ వ్యయం	2.7	3.3	3.8	4.0	3.8	3.6	-	3.7
వడ్డీ చెల్లింపులు	2.6	3.3	3.6	4.0	4.2	4.6	4.8	3.9
సబ్సిడీలు	2.6	3.3	3.4	3.5	3.6	4.2	-	3.6
మూలధన వ్యయం	7.5	7.4	8.3	7.0	6.3	6.5	6.0	7.1
మొత్తం వ్యయం	26.1	28.8	30.9	30.1	29.0	31.3	29.9	30.1
కోశ లోటు	8.0	9.3	10.9	10.0	9.4	10.4	10.4	10.1

మూలం : EPW, June 19, 2004

1980వ దశకంలో వృద్ధిరేటులో గణనీయ పెరుగుదల (5.5%) కు గల కారణాలలో విదేశీ ఋణాలు, పబ్లిక్ రంగ సంస్థలపై ఖర్చుల్లో పెరగుదలలు కూడా కారణాలుగా చెప్పవచ్చు. విదేశీ ఋణాలు 1980-81 లో $ 20.6 బిలియన్ డాలర్లుంటే 1989-90 లో $ 64.4 బిలియన్లుగా పెరిగింది. దీనిలో దీర్ఘకాల అప్పులు 1980-81 నుండి 1984-85 వరకు $ 1.9 బిలియన్లుంటే 1985-86 నుండి 1989-90 కాలంలో $ 3.5 బిలియన్లకి పెరిగింది. ఈ విదేశీ ఋణాలు - స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి 1984-85 లో 17.7 శాతం వుంటే 1989-90 లో 24.5 శాతం నమోదైయింది. ఇదేకాలంలో ఋణవిమోచన (Debt service) నిష్పత్తి 18 శాతంనుండి 27 శాతం పెరిగింది. ఋణభారం గణనీయంగా పెరిగిందని చెప్పుకోవచ్చు.

ఈ ఋణం వల్ల సమ్మైవైపునున్న ప్రతిబంధకాలు కొంతవరకు తొలగిపోయాయి. అంటే ఉత్పత్తికి సంబంధించిన ఆటంకాలు కొంతవరకు తొలగిపోయాయని చెప్పవచ్చు. పెరుగుతున్న దేశీయ రెవెన్యూ వ్యయం (Current Expenditure) దేశంలో డిమాండ్ పెరుగుదలకు ఉత్ప్రేరకంగా పనిచేసింది. ముఖ్యంగా సేవలరంగంలో, దీనికి కారణం రక్షణ వ్యయం, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, మరియు 4 వ వేతన సంఘ వేతన సవరణల వల్ల జీతభత్యాల పెరుగుదల వ్యయం మొదలైనవి. పట్టిక 4. లో చూపబడినట్లుగా రెవెన్యూవ్యయం 1980వ దశకం మొదటిభాగంలో 18.6 శాతం (Current Expenditure as a % of GDP) వుంటే అది 1980 చివరిదశకంలో 23 శాతానికి పెరిగింది. రక్షణవ్యయం, వడ్డీలు, మరియు సబ్సిడీలు మొత్తం కలిపితే వ్యయం ఇదేకాలంలో 7.9 శాతంనుండి (2.7 + 2.6 + 2.6), 11.2 శాతానికి పెరిగింది.

మొత్తం వ్యయం (రెవెన్యూ + మూలధన) 1980 ప్రాథమిక దశకంలో 26.1 శాతం వుంటే (as a % of GDP), 1980 చివరి దశకంలో 30.1 శాతం వుంది. పట్టిక 4. చూడండి. ఈ వ్యయం పెరుగుదల కారణంగా కోశ లోటు ఇదేకాలంలో 8 శాతంనుండి (GDP లో) 10.1 శాతానికి పెరిగింది.

ఈ కోశలోటు స్థూల దేశీయోత్పత్తిలో 5 శాతం మించి వుండరాదన్న నిబంధన ప్రపంచ బ్యాంకు విధించింది. అలా కుదించితేనె తప్ప ఋణాలు మంజూరు చేయడం జరగదని చెప్పడం జరిగింది. ఈ కారణంగా భారతదేశం తనయొక్క ఋణ విమోచన శక్తిని

ఇనుమడింప చేసుకొనేందుకై ఈ కోశలోటును తగ్గించే ప్రయత్నం చేయనారంభించింది. సరళీకృత ఆర్థిక విధానాలు 1990వ దశాబ్దం యొక్క ప్రారంభ దశలో ప్రవేశపెట్టడం జరిగింది. దీనివల్ల 1991-92లో 0.8 వున్న వృద్ధిరేటు (GDP) 1996-97 నాటికి 7.8 శాతానికి పెరిగింది. ఇది 2001-02 సం॥లో 4.4 శాతానికి పడిపోయి మరల 2003-04 (A) సం॥కి 8.1 శాతానికి పెరిగింది (Economic survey, 2003-04, Govt. of India). స్థూలదేశీయోత్పత్తిలో ఈ పెరుగుదల కారణంగా 2002-03 సం॥లో కోశలోటు 5.9 శాతంగాను (GDP లో) 2003-04 (RE) కి 4.8 శాతానికి పడిపోయింది. ఈ కోశలోటు 2004-05 (BE)కి 4.4 శాతానికి పడిపోయింది. అంటే ప్రపంచ బ్యాంక్ నిబంధనల లోపలే కోశలోటు వుంది.

కోశలోటు పెరుగుదలకి ముఖ్యకారణం ఋణభారం పెరగడం. అయితే కోశలోటు 5 శాతానికి లోపలే వుంది కాబట్టి ఋణభారం 1980 దశకంలో వున్నంతగాలేదు. 1980-81 నుండి 1984-85 కాలంలో కోశలోటు 8 శాతం వుంటే 1985-86 నుండి 1989-90 కాలంలో 10.1 శాతానికి పెరిగింది, కేంద్ర రాష్ట్రాలు కలిపి. అందుచేత, ఋణభారం మరియు వడ్డీ చెల్లింపులు ఆ రోజుల్లో బాగా పెరిగాయి. ఈ వడ్డీ చెల్లింపులు వ్యయం మొత్తం రెవెన్యూ వ్యయంలో 34 శాతం వుంది, 2003-04 (BE) లో ఇదే 1950-51 లో 11శాతం మరియు 1985-86 లో 23 శాతంకి, 1990-91లో 29 శాతానికి పెరిగింది. అటు తర్వాత 2001-02 లో 36 శాతానికి పెరిగింది. దీనివలన ఈ పద్దుక్రింద వ్యయం బాగా పెరిగిందన్నమాట. ఈ ఋణసేకరణ ప్రణాళికేతర వ్యయంగా చూపించినా, ఋణాలకు, అభివృద్ధికి మధ్యన వున్న సంబంధం ధనాత్మకమైనదే కాని వేరు కాదు. అంటే ఋణాలు పెరిగితే అభివృద్ధి కూడా పెరిగే అవకాశముంది. అయితే ఆ ఋణాలన్ను ఉత్పాదక మార్గాల వైపుకే మళ్ళించాలి. ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి శ్రీకారం చుట్టిన నాటినుండి ఋణాలు అధికంగా చేయడం జరుగుతూనే వుంది. ఉదా॥కి 1950-51 లో రు. 2860 కోట్ల అప్పుచేయగా మార్చి, 2004 కి రు. 15,12,470 కోట్లకి ఋణం పెరిగింది. అంటే ఋణవిమోచన భారం పెరిగింది. ఇక్కడ, ఆర్థికాభివృద్ధికి, వృధావ్యయానికి మూల్యాన్ని అధికంగా చెల్లిస్తున్నామని తెలుస్తోంది.

పై విషయాలనుబట్టి రెండు విషయాలు తెలుస్తున్నాయి. ఒకటి, ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రభుత్వవ్యయం గణనీయంగా పెరగడం. రెండవది, రక్షణపరంగావున్న అభద్రత కారణంగా కూడా ప్రభుత్వవ్యయం పెరిగింది. దీంతో ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడవలసిన కొరతగా వున్న వనరుల్ని రక్షణ వ్యవస్థని బలోపేతం చేయడానికి ఉపయోగించవలసివస్తోంది. ఋణభారం, సబ్సిడీలు పెరిగినప్పటికి, సరళీకృత ఆర్థిక విధానాలద్వారా విదేశీ పెట్టుబడులు పెరిగి తద్వారా ఋణభారం అపేక్షికంగా తగ్గడం, మరియు W.T.O లో అంటే ప్రపంచ వ్యాపారసంస్థలో సభ్యునిగావున్న భారతదేశం సబ్సిడీలను నెమ్మది నెమ్మదిగా ఎత్తివేసి 2005 నాటికి పూర్తిగా ఎత్తివేయవలసిన పరిస్థితి ఏర్పడింది, W.T.O నిబంధనల ప్రకారం ప్రపంచబ్యాంకు ఋణగ్రహీత దేశాలకు పరిపాలన వ్యయాన్ని స్థూల దేశీయోత్పత్తిలో 10 శాతం మేర తగ్గించమని సలహా చెప్పడం జరిగింది. ఎందుకంటే పరిపాలనా వ్యయం అవధులు దాటి పెరగడమే దీనికి కారణం. దీంతో ఉద్యోగస్తులకు స్వచ్ఛంద పదవీవిరమణ VRS పధకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగులను నిర్భంధంగా రిటైరు చేయ తలపెట్టింది. క్రొత్తగా ఉద్యోగాల కల్పనని స్తంభింపజేసింది.

రాష్ట్రప్రభుత్వాల వ్యయం :

కేంద్ర ప్రభుత్వం మాదిరిగానే రాష్ట్రప్రభుత్వాలు కూడా తమ తమ సాంవత్సరిక బడ్జెట్‌లను ప్రతిపాదిస్తాయి. ఈ బడ్జెట్‌లలో రాష్ట్ర ప్రభుత్వాలు వారియొక్క రెవెన్యూ మరియు వ్యయం అంచనాలు వారికి సంబంధించిన చట్టసభల్లో ప్రవేశపెట్టి తీర్మానం చేస్తూ వుంటారు. కేంద్ర ప్రభుత్వ వ్యయంతోపాటు రాష్ట్రాల వ్యయంకూడా ప్రణాళికాకాలంలో పెరుగుతూ వస్తోంది. ఈ క్రింది పట్టికలో చూపినవిధంగా రాష్ట్రాల వ్యయం 1951-52 లో రూ. 392 కోట్లనుండి 2002-03 (BE) నాటికి రూ. 3,55,160 కోట్లకి పెరిగింది. అనగా, ప్రణాళికా శకం ఆరంభమైన నాటినుండి 2002-03 సం॥ నాటికి రాష్ట్రాల రెవెన్యూ వ్యయం 906 రెట్లు పెరిగినట్లుగా తెలుస్తోంది. ఈ వ్యయం యొక్క పెరుగుదలకి కారణం : 1. పరిపాలనా లోటుపెరిగి ఋణభారం పెరిగింది. అయితే బడ్జెట్ పరంగా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వానికున్న స్వేచ్ఛలేదు - అంటే బడ్జెట్ పరిమితి (Budget Constraint) కి లోబడి విధులు నిర్వర్తించాలి రాష్ట్ర ప్రభుత్వాలు. దీంతో ఋణభారం పెరిగే పరిస్థితి ఏర్పడింది. అందుచేత, రాగల కాలంలో వేతన, జాబితాల సవరణలు ఉండే పరిస్థితి కనబడుటలేదు. యిక్కడ ముఖ్యంగా 11 వ విత్తసంఘం (Eleventh Finance Commission) కొన్ని సూచనలు చేసింది. అవి : 1. రొటీన్‌గా పే

సంఘాన్ని ఏర్పాటుచేసి ప్రక్రియకి స్వస్తి చెప్పాలి. ఎందుకంటే వేర్వేరు వర్గాల ఉద్యోగుల జీతభత్యాలు ధరల ప్రభావంతో ముడిపెట్టబడియున్నాయి. కాబట్టి 2. వేతన సంఘాన్ని నియమించేటప్పుడు ముందుగా రాష్ట్రాలను సంప్రదించాలి. ఇదివరకు ఇలాంటి సంప్రదాయం లేకుండా కేంద్రమే తనంతటతానుగా వేతన సంఘాన్ని నియమిస్తూవుండేది. దీంతోపాటుగా, కార్మిక సంఘాలు ఈనాడు ఉన్న వేతన సంబంధ విషయంగా ఐక్యపోరాటంలో విఫలం అవుతున్నాయి. దీనికి కారణం రాష్ట్రప్రభుత్వాలు విజయవంతంగా కోశసంబంధ సమ్యలను (Fiscal crisis) వ్యక్తీకరిచడం. ఈ కారణంగా ప్రభుత్వవ్యయం (రాష్ట్రాల) వ్యయాన్ని నియంత్రించే అవకాశం వుంది. రాబోయేకాలంలో వృధా మరియు అనుత్పాదక వ్యయాన్ని నియంత్రించి, నిర్వహణ మరియు సామాజికరంగ వ్యయాన్ని కుదించకుండా సరియైన పరిపాలన పద్ధతులను అవలంభించి వనరుల సమీకరణను గరిష్టం చేసుకుని, కోశ సమతౌల్యంలో నాణ్యతని పెంచే అవసరం వుంది.

రాష్ట్రాల వ్యయ వర్గీకరణ :

భారతరాజ్యాంగం రాష్ట్రప్రభుత్వాలకి అంతర్గత రక్షణవ్యవస్థ (Law and Order) తో బాటుగా అనేక దేశ నిర్మాణ బాధ్యతలను అప్పజెప్పింది. వీటిలో విద్య, ఆరోగ్యం, నీటిపారుదల, వ్యవసాయం మొదలైనవి ముఖ్యమైనవి. కేంద్ర ప్రభుత్వం ఎట్లాగైతే శ్రేయోరాజ్య స్థాపనకై కృషిచేస్తుందో, రాష్ట్రాల ముఖ్య ఉద్దేశ్యం కూడా అదే. అంటే రాష్ట్రాలు పారిశ్రామిక, వ్యవసాయ పురోగతికి తోడ్పడుతూ, పేద ప్రజల అభ్యున్నతికి తోడ్పడతాయి. రాష్ట్రాల వ్యయాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి 1. అభివృద్ధివ్యయం, మరియు 2. అభివృద్ధేతర వ్యయం. రాష్ట్రాలలో అభివృద్ధేతర వ్యయం కన్నా అభివృద్ధివ్యయం యొక్క శాతమే యంత్రాంగ విస్తరణ మరియు పెరుగుదల, వేతనాలు మరియు జీతభత్యాల పెరుగుదల, ప్రభుత్వం విద్యా ప్రజారోగ్యం, మొదలైన సేవల కల్పనలో పెరుగుదల, పేదరిక నిర్మూలన పథకాలలో పెంపుదల, ప్రభుత్వం ప్రజల శ్రేయో కార్యక్రమాలలో అధికంగా పాలుపంచుకొనుట, మరియు అభివృద్ధి కార్యక్రమాల్లో పెంపుదల కారణంగా చెప్పవచ్చు.

పట్టిక 5. రాష్ట్రాల రెవెన్యూ రాబడి మరియు వ్యయం (రు. కోట్లలో)

సం॥	రాబడి	వ్యయం	మిగులు / లోటు
1951-52	396	392	+4
1080-81	16290	14810	+1480
1998-99	203100	229540	-26440
2000-01	237950	291520	-53570
2002-03 (BE)	306940	355160	-48220

మూలం : Economic Survey, 2002-03.

అయితే కేంద్రానికి రాష్ట్రంకు మధ్యనున్న తేడా ఏంటంటే కేంద్ర ప్రభుత్వం 1980 దశకం ప్రారంభంనుండి రెవెన్యూ లోటు (Revenue Deficit) తన బడ్జెట్‌లో అనుభవిస్తుండగా, రాష్ట్రాలు మాత్రం 1980 దశకం చివరివరకు మొత్తంమీద రెవెన్యూ మిగులు (Revenue Surplus) నే అనుభవించాయి. (EPW, June 5, 2004) అయితే 5 వ పే సంఘం (5th Pay Commission) జీతభత్యాల సవరణలు చేసిన నాటినుండి రాష్ట్రాలు తమ రెవెన్యూ పద్దులో మొదటిసారిగా లోటును చవిచూసాయి. ఈ లోటుకి కారణం వేతనాలు, జీతాల పెరుగుదల లేక పరిపాలనా యంత్రాంగ పెరుగుదల అనే విషయం ఆలోచన చేస్తే, ప్రభుత్వ వినియోగంలో వేతనాల, జీతాల - ఆదాయ నిష్పత్తి, వస్తువులు - ఆదాయం నిష్పత్తితో పోలిస్తే 1970 మరియు 1980 దశాబ్దాలలో వేగంగా పెరిగిందని తెలుస్తోంది. రాష్ట్రాల వేతన బిల్లు చాలా అధికంగా వుందని చెప్పవచ్చు. మొత్తం కేంద్ర, రాష్ట్ర, మరియు స్థానిక సంస్థల వేతన బిల్లులను పరిశీలించినట్లైన ఈ విషయం గ్రహించగలము. 1983 తర్వాత 4, 5 పే సంఘాల వేతన సవరణలు ప్రారంభమయ్యాయి. ఈ పే సవరణలకు ముందే వేతనాలు మరియు జీతాలు వేగంగా పెరగడం ప్రారంభించాయి రాష్ట్ర ప్రభుత్వాలలో. దీనివలన రాష్ట్రంలో ఎక్కువగావుంది. ఇది శుభసూచకమే.

ముందుగా అభివృద్ధేతర వ్యయ వర్గీకరణని చూద్దాము. ఈ వ్యయంలో ఈ క్రింది అంశాలుంటాయి.

i. రాష్ట్రప్రభుత్వ విభాగాలు (Organs of State) ;

ii. కోశ సంబంధ సేవలు (Fiscal Services) (ఉదా॥కి పన్ను వసూళ్ళు)

iii. వడ్డీ చెల్లింపులు, రుణ విమోచనము

iv. పరిపాలనా సేవలు (Administrative Services); మరియు

v. పింఛన్లు మరియు ఇతర సాధారణ సేవలు

ప్రభుత్వం బాధ్యతలు పెరుగుతున్నకొద్దీ, వ్యయంకూడా పెరుగుతూ వుంది. అంతర్గత రక్షణ వ్యవస్థ రాష్ట్రాల బాధ్యత. కావున పోలీస్ యంత్రాంగంపై ఖర్చు గణనీయంగా పెరిగింది. రాష్ట్రాల అభివృద్ధేతర వ్యయంలో వడ్డీ చెల్లింపులు వరంగా వ్యయం సింహభాగాన్ని ఆక్రమిస్తోంది. ఉదా॥ కు 2002-03 సం॥ లో రాష్ట్రాలు రు. 74,670 కోట్లుగాను, లేదా మొత్తం అభివృద్ధేతర వ్యయంలో 47 శాతాన్ని ఆక్రమించింది. ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వానికి మరియు మార్కెట్టు అప్పులకి జమచేయడం జరుగుతోంది. దీని తర్వాత పరిపాలనా వ్యయం తరువాతి స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ వ్యయం 2002-03 సం॥లో రూ. 69,250 కోట్లుగా వుంది. దీంట్లో పింఛన్లు కూడా వున్నాయి. అభివృద్ధేతర వ్యయాన్ని పట్టిక 6 లో చూడగలరు. అభివృద్ధేతర వ్యయం 1951-52 లో రు. 196 కోట్లుండగా 2002-03 (BE) నాటికి రు. 157500 కోట్లకి పెరిగింది. అనగా 804 రెట్లు పెరిగింది. సాపేక్షికంగా చూస్తే 1951-52 లో అభివృద్ధేతర వ్యయం మొత్తం రెవెన్యూ వ్యయంలో 50 శాతం వుంటే 2002-03 నాటికి 44 శాతానికి తగ్గింది. ఇది మంచి పరిణామమే. పట్టిక 6. చూడగలరు.

పట్టిక 6 : రాష్ట్రాల అభివృద్ధి మరియు అభివృద్ధేతర వ్యయం

1951-52 మండి 2002-03 **(రూ. కోట్లలో)**

సం॥లో	అభివృద్ధి వ్యయం	అభివృద్ధేతర వ్యయం	ఇతర వ్యయం	మొత్తం రెవెన్యూ వ్యయం
1951-52	196 (50)	196 (50)	-	392
1971-72	2160 (53)	1880 (47)	-	4040
1980-81	10,510 (71)	4090 (28)	200	14,800
1993-94	66,390 (63)	37360 (36)	1000	105090
1998-99	128980 (56)	96890 (42)	3670	229540
2002-03 (BE)	191070 (54)	157500 (44)	6600	355170

మూలం : EPW Research Data & RBI Bulletins

Note : బ్రాకెట్లలో వున్నవి మొత్తం వ్యయంలో శాతాలు.

రాష్ట్రాల అభివృద్ధి వ్యయం :

రాష్ట్రాల అభివృద్ధి వ్యయం రెండు రకాలుగా విభజించవచ్చు. 1. సామాజిక మరియు కమ్యూనిటి సేవల వ్యయం; మరియు 2. ఆర్థిక సేవల వ్యయం. సామాజిక, కమ్యూనిటి సేవల వ్యయాన్ని ప్రధానంగా విద్య, కుటుంబ నియంత్రణ, ప్రజారోగ్యం, గృహ వసతి, కార్మిక ఉపాధి, సాంఘిక భద్రత, సంక్షేమం, మరియు ప్రకృతి వైపరీత్యాలనుండి రక్షణ మొదలైన వాటిపై వెచ్చించేటటువంటి వ్యయం. ఈ వ్యయం రాష్ట్రాల వ్యయంలో ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. ఈ వ్యయంవల్ల ప్రజలకు ధనాత్మకంగా ఎంతోమేలు జరుగుతుంది. అంటే ప్రజల సంక్షేమం పెరిగితే దేశం ఆర్థికంగా ముందడుగు వేస్తుంది. ఈ సేవలు ఎంత అభివృద్ధి పరిస్తే ప్రజలు అంత ఆనంద సంతోషాలతో వుంటారు. పేదరికం దరిజేరదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రణాళికబద్ధ ఆర్థిక ప్రగతి చేపట్టిన తర్వాత పేదరికం ఈనాడు 26 శాతానికి తగ్గిపోయింది. 2010 సం॥ నాటికి పేదరికమే భారతదేశంలో వుండదని అంచనా. యిదంతా కూడా రాష్ట్రప్రభుత్వాలు చేపడుతున్న సామాజిక, ఆర్థిక కార్యక్రమాలవల్ల జరిగిందని గ్రహించాలి. వీటిలో విద్యా, ఆరోగ్య సౌకర్యాలు ప్రధానపాత్ర వహిస్తాయి. సాధారణ, సాంకేతిక విద్యవల్ల దేశంలో నైపుణ్యం కల్గిన కార్మికశక్తి తయారవుతుంది. వీరు అంటే నైపుణ్యం కల్గిన శ్రామికుల వల్ల దేశం

అభివృద్ధి పథంలో నడుస్తుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని ఉపయోగించుకోడానికి వీలవుతుంది. ఒక విద్య వుంటే సరిపోదు. దానికి తోడు పూర్తి ఆరోగ్యంతోవున్న శ్రామిక శక్తివల్ల దేశంలో అధిక ఉత్పాదకశక్తి తయారవుతుంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే ముఖ్యంగా మన పొరుగుదేశమైన చైనాతో పోలిస్తే భారతదేశంలో శ్రామికుల ఉత్పాదకశక్తి చాలాతక్కువ. దీనికి అనేక పరిస్థితులు కారణమైనా, శ్రామికులలో విద్యా ఆరోగ్యాల లోపమే ముఖ్యకారణాలు.

భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పెద్దమొత్తంలో ఈ రెండింటిమీద ఖర్చుచేయడం జరిగింది. అయితే యింకా చెయ్యవలసిన అవసరం వుంది. దేశంలో పాఠశాలలు, కాలేజీలు, యూనివర్శిటీలు గణనీయంగా పెరిగాయి. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ఆసుపత్రులు, ప్రాధమిక ఆరోగ్యకేంద్రాలు అధికసంఖ్యలో స్థాపించి ఎంతో వ్యయాన్ని చేసింది. అయితే కేంద్రబడ్జెటులో విద్యకి కేటాయింపులు తగిన రీతిలో అంటే అవసరాలకి తగినవిధంగా వుండడంలేదు. ఉదా॥కి స్థూల దేశీయోత్పత్తిలో 3 శాతానికి దగ్గరగా విద్యమీద పెట్టుబడి వెచ్చింప బడుతోంది. దీనిని కనీసం 10 శాతం చేస్తేగాని విద్య సామాన్యునికి అందుబాటులోనికి రాదు. అలాగే ఆసుపత్రులు, డాక్టర్లు కూడా ఎక్కువగా కావలసివుంది. పెరుగుతున్న జనాభా అవసరాలని దృష్టిలో పెట్టుకుంటే యిప్పుడున్న సౌకర్యాలు అంతంతమాత్రమే. ముఖ్యంగా పశ్చిమ అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అభివృద్ధి వ్యయంలో రెండవ వర్గంకి చెందిన వ్యయం ఆర్థిక సేవలపై రాష్ట్రాలు చేసే వ్యయం. ఆర్థిక సేవలపై పెట్టే వ్యయం ప్రధానంగా వ్యవసాయం, పశు సంవర్ధన, సహకారం, నీటి పారుదళ, విద్యుచ్ఛక్తి, గ్రామీణాభివృద్ధి పథకాలు, కమ్యూనిటి అభివృద్ధి ప్రాజెక్టులు, సివిల్ పనులు, పరిశ్రమలు, ఖనిజాలు, మొదలైన వాటిమీద చేయడం జరుగుతుంది. వీటిలో వ్యవసాయం అత్యంత ప్రధానమైన వ్యయం. ఎందుకంటే ఈనాడు 56 శాతం మంది ప్రజానీకం వ్యవసాయం ముఖ్యవృత్తిగా జీవనం సాగిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో 71 శాతంమంది ఆధారపడ్డారు. పారిశ్రామికరంగం, సేవల రంగం దేశంలో అభివృద్ధిని సాధించడంలో వ్యవసాయంమీద ఆధారపడిన జనాభా గణనీయంగా తగ్గింది. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 27 శాతం మాత్రమే. అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లో వ్యవసాయరంగ వాటా 2 నుండి 3 శాతం మాత్రమే. వ్యవసాయం తర్వాత రాష్ట్రాల వ్యయం కమ్యూనిటి ప్రాజెక్టులు, సివిలు పనులమీద చేయడం జరుగుతోంది. ఈ రోజున పనికి ఆహారపథకం ద్వారా అనేక ప్రజోపకర పనులను ప్రభుత్వం చేపడుతోంది. కమ్యూనిటి ప్రాజెక్టుల ద్వారా ప్రజల జీవన స్థితి గతులను ముఖ్యంగా గ్రామీణ ప్రజల స్థితిగతులను బాగుచేయడం జరుగుతోంది. ప్రణాళికశకం 1951 లో ప్రారంభమైన నాటినుండి పెద్దమొత్తంలో కేటాయింపులు చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టులోనే గ్రామీణ ప్రాంతాలలో డ్వాక్రా పథకాన్ని స్త్రీలలో ప్రోత్సహించి వారి కాళ్ళమీద వాళ్ళు ఆర్థికంగా నిలబడేటట్లు చేయడం జరుగుతోంది. వీరికి అతి తక్కువ వడ్డీకి అంటే పావలా వడ్డీకి ఋణాలు మంజూరు చేసి వారిలో ఉద్యమిత్వ లక్షణాలు పెంపొందింపచేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. వీటికి ప్రభుత్వానికి ఎంతో వ్యయం అవుతుంది.

అయితే అభివృద్ధి వ్యయం అభివృద్ధేతర వ్యయంతో పోలిస్తే అధికంగా వుంది. పట్టిక 6. లో చూసినట్లుగా, అభివృద్ధివ్యయం 1951-52 లో రు. 196 కోట్లుండగా, 1980-81 నాటికి రు. 10,510 కోట్లకి పెరిగి 2002-03 నాటికి రు. 1,91,070 కోట్లకి పెరిగింది. అనగా 975 రెట్లు పెరిగింది. అభివృద్ధేతర వ్యయంతో పోలిస్తే అభివృద్ధి వ్యయమే వేగంగా పెరిగింది. పట్టిక 6 చూడండి. సాపేక్షికంగా చూస్తే, అభివృద్ధి వ్యయం మొత్తం రెవెన్యూ వ్యయంలో 1951-52 లో 50 శాతం వుంటే 2002-03 నాటికి 54 శాతం అయ్యింది. 1951-52 లో అభివృద్ధి వ్యయం మరియు అభివృద్ధేతర వ్యయాలు 50:50 వుండగా 2002-03 సం॥లో 54:44 గా వున్నాయి. ఈ అభివృద్ధి వ్యయంలో ప్రధాన భూమికను పోషించేది విద్యావ్యయం. ఈ వ్యయం మొత్తం అభివృద్ధి వ్యయంలో 34 శాతంనుండి 35 శాతం వరకు వుంటుంది. 1993-94 గా విద్యపై రు. 21,770 కోట్లు వెచ్చించడం జరిగింది. దీని తర్వాత వచ్చేది వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగాలమీద వెచ్చించే వ్యయం. దీనికై 1993-94 లో రు. 20,400 కోట్లు వెచ్చించడం జరిగింది.

రాష్ట్రాల వ్యయ పోకడలు :

ప్రణాళికలు ప్రారంభమైన నాటినుండి రెవెన్యూ వ్యయం గణనీయంగా పెరిగింది. 1951-52 లో రు. 392 కోట్లనుండి 2002-03 లో రు. 3,55,170 కోట్లకి పెరిగింది. చాలా వేగంగా పెరిగింది. దీనికి కారణం పరిపాలన వ్యయంలో పెరుగుదల, వేతనాలు, జీతాలు పెరగడం, మరియు వడ్డీ చెల్లింపులలో పెరుగుదల ముఖ్యకారణాలుగా చెప్పవచ్చు. అంతేకాకుండా, రాష్ట్రాల వ్యయంయొక్క సంయోజనంలో కూడా మార్పుని గమనించవచ్చు. అంటే మొత్తం రెవెన్యూ వ్యయంలో అభివృద్దేతర వ్యయంకన్నా అభివృద్ధి వ్యయం ఎక్కువగా వుండటం రాష్ట్రాల రెవెన్యూ పోకడలో ముఖ్యాంశం. ఉదా॥ కు 2002-03 లో ఈ రెండు వరుసగా 44:54 (అభివృద్ధి మరియు అభివృద్దేతర వ్యయాలతోపాటు ఇతర వ్యయాలు వున్నాయి). ఈ ఇతర వ్యయం 2002-03లో 2 శాతం వుంది. అందుచేత 2002-03 లో అభివృద్ధి వ్యయం 54 శాతం వుంది. ఈ ఇతర వ్యయాలు స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, పంచాయితీరాజ్ సంస్థలకి ఇచ్చిన బదిలీమొత్తం. తర్వాత, అభివృద్ధి వ్యయంలో విద్యపై చేసిన వ్యయం సింహభాగాన్ని పొందింది.

రాష్ట్రప్రభుత్వాలు వారి రాష్ట్రాభివృద్ధిని ఎట్లా చేపడతారంటే, విత్త సమీకరణని మార్కెట్టు ఋణాలనుండి మరియు కేంద్రప్రభుత్వంనుండి అప్పులు మరియు చిన్న పొదుపు మార్గాల ద్వారా చేపడుతారు. 1951-52 సం॥లో రాష్ట్రాల మూలధన వ్యయం రు. 190 కోట్లు వుండగా 2002-03 లో ఈ వ్యయం క్రింద రు. 75,770 కోట్లు కేటాయించబడింది. ఈ డబ్బుని బహుళార్థసాధక నదీ పరివాహక ప్రాజెక్టులు, నీటి పారుదల, నౌకాయానం, వ్యవసాయాభివృద్ధి మరియు పరిశోధన, విద్యుచ్ఛక్తి పథకాలు, రోడ్డురవాణా, నీటిపనులు, పారిశ్రామికాభివృద్ధి మొదలైనవి.

స్థూల దేశీయోత్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యయ శాతం :

పట్టిక 7 లో చూపిన విధంగా, కేంద్రప్రభుత్వ రెవెన్యూ వ్యయం అనగా సాధారణ వ్యయంలో అతి ముఖ్యమైన వ్యయం వడ్డీచెల్లింపుల పరంగా అయిన వ్యయం. 1999-2000 సం॥లో, స్థూల దేశీయోత్పత్తిలో, వడ్డీచెల్లింపుల వ్యయశాతం 5.2 వుండగా 2003-04 సం॥కి ఇంచుమించు అదేశాతంగా వుంది. అయితే 11 వ విత్త సంఘ అంచనాల ప్రకారం ఈ శాతం 4.3 కి తగ్గింది. అంటే ఋణభారం తగ్గుతుందన్నమాట. స్థూల దేశీయోత్పత్తిలో పించన్లు, సాధారణ సేవలు, సామాజిక సేవలు మరియు ఆర్థిక సేవల పరంగా వ్యయశాతం పెద్దగా మార్పులేదు. పట్టికలో చూపిన కాలంలో, అనగా 1999-2000 నుండి 2004-05 వరకు. సాధారణ సేవల వ్యయ అంచనాలశాతం మాత్రం 11 వ విత్త సంఘం ప్రకారం 2004-05 లో 2.1 శాతానికి పెరిగింది. 11 వ విత్త సంఘం ప్రకారం రెవెన్యూ వ్యయం 1999-2000 నుండి పెద్దగా మార్పులేని కారణంగా రెవెన్యూ లోటులో పెద్దగా మార్పులేదు. దీంతో కోశలోటులో ఏ విధమైన తగ్గుదల లేదు. స్థూల దేశీయోత్పత్తిలో మూలధన వ్యయం శాతంలో కూడా మార్పులేదు. అయితే 11 వ విత్త సంఘం మాత్రం మూలధన వ్యయశాతం 2004-05 లో 4 శాతానికి పెరగగలదని అంచనావేసింది.

ఇక రాష్ట్రాల విషయానికొస్తే, వడ్డీ చెల్లింపుల వ్యయం - స్థూల దేశీయోత్పత్తి శాతం చూసినట్లైతే ఈ నిష్పత్తి పెరుగుతోంది. అయితే 11 వ విత్త సంఘం మాత్రం 2004-05 లో ఈ శాతం పడిపోతుందని అంచనా వేసింది. రాష్ట్రాలు సామాజిక సేవలమీద ఎక్కువగా ఖర్చుచేస్తున్నాయి. పట్టిక చూచినట్లైన, స్థూల దేశీయోత్పత్తిలో ఈ వ్యయశాతం 1999-2000 నుండి 2002-03 వరకు 5.8 శాతం నుండి 5.4 శాతానికి మారింది. కేంద్రంతో పోలిస్తే రాష్ట్రాలు అధికంగా వ్యయం చేస్తున్నాయని తెలుస్తోంది. 11 వ విత్త సంఘం కూడ 2004-05 లో ఇదేరకంగా వుంటుందని అంచనా వేసింది. విద్య మీద రాష్ట్రాలు 3 శాతాన్ని ఖర్చుచేస్తున్నాయి. ఆర్థిక సేవల పై ఖర్చు శాతం కూడా ఎక్కువగానే వుంది. అయితే 11 వ విత్త సంఘ అంచనాలు ప్రకారం 2004-05 లో ఈ ఖర్చు శాతం 2.3 కి తగ్గుతుందని లెక్కించడం జరిగింది.

పట్టిక 7 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యయం, 1999-04
మరియు
11 వ విత్త సంఘ అంచనా 2004-05

వివరం	1999-2000	2000-01	2001-02	2002-03	2003-04 (BE)	2004-05 విత్తసంఘ అంచనా
		స్థూల దేశీయోత్పత్తిలో శాతం				
1. రెవెన్యూ వ్యయం						
(a) **కేంద్రం**						
(i) వడ్డీ చెల్లింపులు	5.2	5.2	5.1	5.1	5.0	4.3
(ii) పింఛన్లు	0.8	0.8	0.7	0.6	0.6	0.7
(iii) సాధారణ సేవలు	0.3	0.4	0.4	0.4	0.3	2.1
(iv) సామాజిక సేవలు	0.4	0.3	0.3	0.3	0.3	0.3
(v) ఆర్థిక సేవలు	0.4	0.5	04	0.5	0.5	0.3
(b) **రాష్ట్రాలు :**						
(i) వడ్డీ చెల్లింపులు	2.6	2.8	3.2	3.3	-	2.6
(ii) పింఛన్లు	1.3	1.3	1.3	1.3	-	1.0
(iii) సాధారణ సేవలు	0.1	0.2	0.2	0.4	-	1.7
(iv) సామాజిక సేవలు	5.8	5.4	5.6	5.4	-	5.8
విద్య	3.2	3.1	3.1	2.9	-	1.8
ప్రాథమిక ఆరోగ్యం	0.9	0.8	0.8	0.8	-	0.5
నీటి సరఫరా, శానిటేషన్	0.4	0.3	0.3	0.3	-	0.5
(v) ఆర్థిక సేవలు	4.3	3.3	3.3	3.1	-	2.3
II మూలధనవ్యయం :						
(i) కేంద్రం	2.5	2.3	2.7	2.5	2.7	4.0
(ii) రాష్ట్రాలు	2.1	3.1	3.2	3.9	4.4	2.9

మూలం : EPW, June 26, 2004, P. 2758.

రాష్ట్రాలలో మూలధన వ్యయం కేంద్ర ప్రభుత్వ వ్యయంకన్నా ఎక్కువగా పెరుగుతోంది. 1999-2000 లో ఈ వ్యయశాతం 2.1 వుండగా 2003-04 కి 4.4 కి పెరిగింది. మూలధన వ్యయం గణనీయంగా పెరిగింది. అయితే 11 వ విత్త సంఘ లెక్కల ప్రకారం 2004-05 లో 2.9 శాతానికి తగ్గుతుందని అంచనా వేయడం జరిగింది.

సూక్ష్మంగా చెప్పాలంటే కేంద్రంలో వడ్డీ చెల్లింపుల వ్యయాన్ని నియంత్రించడం సాధ్యపడే విషయంగా తోచడం లేదు. అంతేకాకుండా కేంద్రంలో వడ్డీ చెల్లింపుల వ్యయం రెవెన్యూ వ్యయంలో అతిపెద్ద వ్యయంగా చెప్పవచ్చు. అలాగే రాష్ట్రాలలో వడ్డీ చెల్లింపుల వ్యయం పెరుగుతూ వస్తోంది. సామాజిక సేవల వ్యయం విషయంలో 1999-2000 నుండి 2002-03 కాలంలో 0.7 శాతం (GDP లో) వృద్ధిని సాధిస్తుందనుకుంటే 0.4 శాతానికి (GDP లో) పడిపోయింది 2002-03 లో.

కోశలోటు రెవెన్యూ లోటు పెరగడంతోనే పెరిగిపోతోంది. 1999-2000 లో స్థూల దేశీయోత్పత్తిలో కోశలోటు 9.9 వుండగా 2001-02 వరకు అదేమాదిరిగా వుండి 2002-03 (RE) లో 9.4 శాతానికి పడిపోయింది. అంటే స్వల్పంగా పడిపోయింది. కోశలోటు

అధికంగా వుండడంచేత సామాజిక అవస్థాపనా సౌకర్యాలమీద అంటే విద్య, ఆరోగ్యం, నీటిసరఫరా మరియు శానిటేషన్ మొదలైన వాటిపై వెచ్చించటానికి వనరుల కొరతని ఏదుర్కొనవలసి వస్తోంది. రెవెన్యూలోటు మరియు కోశలోటుల ప్రభావం బలంగా ఈ సామాజిక రంగాలపై పడి వాటిపై ప్రభుత్వవ్యయాన్ని కుదించవలసిన అగత్యం ఏర్పడుతోంది. ఈ పరిస్థితులలో 11 వ విత్తసంఘం ప్రభుత్వ విత్త వనరులను పునర్నిర్మించవలసిన అవసరాన్ని గురించి సూచనచేసింది. దీనివల్ల 2004-05 సం॥కి స్థూల ఆర్థిక స్థిరీకరణ సాధించే వీలున్నది. ఈ విత్త సంఘం రెవెన్యూ లోటుని వేగంగా తగ్గిస్తే కోశలోటు తగ్గి సామాజిక రంగాలకి విత్తవనరులు అందుబాటులో వుంటాయని పేర్కొంది. సామాజిక రంగాల అభివృద్ధి జరిగితే నైపుణ్యం గల్గిన శ్రామిక శక్తి తయారవుతుంది. పూర్తి ఆరోగ్యవంతులవడంచేత ఉత్పాదక శక్తి పెరుగుతుంది. దీంతో శ్రామికులు ఆర్థికంగా సంపన్నులై ఆదాయసంపద వ్యత్యాసాలు బాగా తగ్గే అవకాశముంటుంది. అందుకనే భారతదేశంలో వ్యయ, పన్నువిధానాలు, అదాయ, సంపద వ్యత్యాసాలు లేని వ్యవస్థకై పాటుపడుతోంది. అయితే P.C. మహాల్‌నోబిస్, భారతప్రభుత్వ వ్యయవిధానం ద్వారా ఆదాయ సంపద వ్యత్యాసాలు తొలగింపబడలేదనే అభిప్రాయాన్ని వ్యక్తపరచడం జరిగింది. అందుచేత, సామాజిక రంగాలపై వ్యయాన్ని పెంచవలసిన అవసరం వుందని గ్రహించాలి.

రాష్ట్ర ప్రభుత్వాలకు కోశ సవరణ పథకం : (Fiscal Reform Programme for the States)

వేతన సవరణలు మూలంగా రాష్ట్ర ప్రభుత్వాలపై పడ్డ భారాన్ని జాతీయాభివృద్ధి మండలి (National Development Council) ఫిబ్రవరి 19, 1999 న చర్చించడం జరిగింది. దీనికొరకై ఈ విత్త విషమ పరిస్థితిని అనుభవిస్తున్న ముఖ్యమైన 7 రాష్ట్రాలలో మాధ్యమిక కోశ విధానాన్ని (Medium Term Fiscal Strategy) అమలు చేయాలని మార్చి 20, 1999 న నిర్ణయించడం జరిగింది. దీంట్లోభాగంగా, కేంద్రం మరియు రాష్ట్రాలు ఉమ్మడిగా ఈ దిశగా పథక రచనచేసి కేంద్రప్రభుత్వం అడ్వాన్స్ రూపంలో విత్తసహాయం చేయడంతోపాటు రాష్ట్రాలు మీడియమ్ టెర్మ్ కోశ సవరణలను ఒక కాలపరిమితి లోపల చేపట్టవలసి వుంటుంది. ఈ కేంద్ర అడ్వాన్స్ సహాయ ప్యాకేజీని ప్రణాళికా సంఘం మోనిటర్ చేస్తుంది. రాష్ట్రాలు చేపట్టవలసిన కాలపరిమితి (Time Bound) కోశ సవరణలు ఏంటంటే.

i. ప్రణాళికేతర రెవెన్యూ వ్యయం తగ్గించడం. దీనికి తగిన పన్నువిధానం, వ్యయవిధానం అనుసరించడం మరియు ప్రభుత్వ పరిమాణాన్ని కుదించడం.

ii. ధరల / సబ్సిడీల పరంగా సవరణలు చేపట్టాలి. ఎందుకంటే రాష్ట్రాల కోశభారాన్ని తగ్గించడానికి మరియు కేటాయింపు సామర్థ్యాన్ని (Allocative Efficiency) మెరగుపరుచుకునేందుకు;

iii. వ్యవస్థాగత సవరణలు చేపట్టాలి. ఎందుకంటే పబ్లిక్ సేవల అందుబాటులో సామర్థ్యాన్ని మరియు నియంత్రణని మెరుగుపరచడానికి, మరియు

iv. ప్రభుత్వం అత్యవసరం'కానటువంటి ఏరియాలలో తనపాత్రని తగ్గించడం. అది ఎలాగంటే వికేంద్రీకరణ ద్వారాను, పెట్టుబడుల ఉపసంహరణలద్వారాను మరియు ప్రైవేటీకరణద్వారాను చేపట్టాలి.

ఈ సవరణలకి ముఖ్య కారణం రాష్ట్రాల బడ్జెట్‌లలో రెవెన్యూ లోటుని మధ్యంతర కాలపరిమితిలోపల పూర్తిగా తీసివేయడానికై ఉద్దేశించబడింది. ఈ పథకం క్రింద 9 రాష్ట్రాలు కేంద్ర సహాయాన్ని ఉపయోగించుకున్నాయి. అవి, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్, మిజోరామ్, ఒరిస్సా, సిక్కిం, మరియు ఉత్తరప్రదేశ్. ఈ 9 రాష్ట్రాలకు విడుదల చేసిన ప్యాకేజి మొత్తం రు. 3387 కోట్లు.

14.6.2 భారతదేశ పన్ను విధానం :

పన్నుల నుండి వచ్చే రెవెన్యూ భారత ప్రభుత్వానికి అతిముఖ్యమైన ఆదాయం. ఆర్థికాభివృద్ధికి కావలసిన విత్తవనరులను ప్రభుత్వం ఎక్కువగా పన్నులనుండే సమీకరించుకుంటుంది. అందుచేత పన్నువిధానం ఒక ముఖ్యమైన కోశసాధనంగా చెప్పవచ్చు. ఈ పన్నులు రెండు రకాలు. అవి : ప్రత్యక్ష పన్నులు మరియు పరోక్ష పన్నులు. ఈ రెండింటిలో ప్రభుత్వానికి పరోక్ష పన్నులనుండే అధిక ఆదాయం

వస్తోంది. అంటే పరోక్ష పన్నులనుండి మొత్తం పన్ను రాబడిలో 71 శాతం ఆదాయం వస్తోంది. అయితే ప్రత్యక్షపన్నుల శాతం పెరిగేదిశగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఎందుకంటే ఆ శాతం పెరిగితే ఆదాయ, సంపద వ్యత్యాసాలు తగ్గే అవకాశం వుంది. ప్రస్తుతానికి భారతదేశ పన్నువిధానం తిరోగామి పన్ను విధంగా వుంది. ఎందుకంటే పన్నులను అధికశాతం భరిస్తున్నది సామాన్య ప్రజానీకమే. అంతే కాకుండా ప్రణాళికల కవసరమయ్యే నిధులలో అధికశాతం పన్నుల నుండే ప్రభుత్వం సేకరిస్తోంది. ఉదా॥కి మొదటి ప్రణాళికకు కావలసిన నిధులలో 12.7 శాతం, పన్నులనుండే సేకరించడం జరిగింది. అదే 3 వ ప్రణాళికలో 34 శాతం, 5 వ ప్రణాళికలో 37 శాతం మరియు 7వ ప్రణాళికలో 15 శాతం ఆదాయం పన్నులనుండే వచ్చింది. మొత్తం ఆదాయంలో 72.13 శాతం ఆదాయం పన్నులనుండి ప్రభుత్వానికి వస్తోంది. తర్వాత, జాతీయాదాయంలో 15 నుండి 16 శాతం ఆదాయం పన్నులనుండే వస్తోంది. ఈ పన్నులద్వారా సమీకరించిన విత్తవనరులద్వారా పెట్టుబడిని ప్రజోపకర ఉపయోగాలవైపు ప్రభుత్వం మళ్ళించే అవకాశం వుంది. దీనివల్ల సామాజిక ఉపాంత ఉత్పత్తి దేశంలో పెరుగుతుంది. దీంతో సాంఘిక సక్షేమం గరిష్టం అవుతుంది.

భారతదేశ పన్నువిధాన లక్ష్యాలు ఈ క్రింది విధంగా వున్నాయి :

i) ఆర్థికాభివృద్ధికై విత్తవనరుల సమీకరణ ii) పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా మూలధన సంచయనానికి తోడ్పడటం. iii) ఆదాయ, సంపదలలో అసమానతలను తొలగించడం, iv) ధరల స్థిరీకరణ సాధించడం. ఈ లక్ష్యాలన్ని ప్రణాళికా నిర్ణయాలకనుగుణంగా వుంటాయి. ఈ లక్ష్యసాధనకు పన్నుల వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన మార్పులు చేయడం జరుగుతోంది.

కేంద్రప్రభుత్వ పన్నురాబడి :

కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో రెవెన్యూ రాబడి రెండు రకాలుగా వుంటుంది. అవి i) పన్నురాబడి, అంటే ప్రత్యక్ష, పరోక్ష పన్నులనుండి వసూలైన పన్ను ఆదాయం, మరియు ii) పన్నేతర ఆదాయం, అనగా పన్నులు మినహా ఇతర రకాలైన మార్గాలనుండి వచ్చే ఆదాయం. పన్నులనుండి వచ్చే ఆదాయంలో వుండేవి i) ప్రత్యక్ష పన్నులు : వ్యక్తిత్వ ఆదాయపు పన్ను మరియు కంపెనీ ఆదాయపు పన్ను అదే రాష్ట్రాలకైతే ఆస్తిపన్ను మరియు వృత్తి పన్నులు వుంటాయి.

ii) పరోక్ష పన్నులు : యూనియన్ ఎక్సైజ్, దిగుమతి సుంకం, సర్వీస్ పన్ను మొదలైనవి. రాష్ట్రాలకి అమ్మకపు పన్ను మరియు కొనుగోలు పన్నులు ఉంటాయి.

పన్నేతర ఆదాయం అనగా 1. విత్త మరియు ఇతరసేవలు, 2. వడ్డీ రాబడి మరియు 3. డివిడెండ్లు మరియు లాభాలు, రాష్ట్రాల విషయంలో లైసెన్స్ ఫీజులు, మార్కెట్టు ఫీజులు, బాడుగలు, మొదలైనవి వుంటాయి. వీటిని స్థానిక సంస్థలు వసూలు చేస్తాయి. కేంద్రప్రభుత్వానికి విత్త లేక కోశ సేవలపై ఆదాయం వస్తుంది. ఉదా॥ నాసిక్‌లో మింట్‌లో కాయిన్స్, రూపాయి కాగితములు ముద్రించడం ద్వారా ప్రభుత్వం డబ్బుని సంపాదిస్తుంది. వడ్డీరాబడి అంటే రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన అప్పుపై వడ్డీ సంపాదిస్తుంది.. తర్వాత, పబ్లిక్ రంగ సంస్థలనుండి డివిడెండ్లు మరియు లాభాలరూపంలో ఆదాయం వస్తుంది.

మొత్తం రెవెన్యూ రాబడిలో పన్నులనుండి ఆదాయం మూడువంతులపైనే వుంటుంది. పట్టిక 8 లో చూపించినట్లుగా, 1950-51 లో పన్నురాబడి రు.357 కోట్లుంటే 1980-81 కి రు. 9,390 కోట్లకి, 1990-91 లో రు. 42,978 కోట్లకి, 2001-02 కి రు. 1,33,660 కోట్లకి, 2003-04 కి రు. 1,87,539 కోట్లకి, మరియు 2004-05 (BE) కి రు. 2,33,906 కోట్లకి పెరిగింది. 1950-51 నుండి 2004-05 సం॥కి పన్నురాబడి భారతదేశంలో 655 రెట్లు పెరిగింది. మొత్తం రాబడిలో పన్ను రాబడియొక్క శాతం 1950-51 లో 88శాతం వుండగా 2001-02 నాటికి 66 శాతానికి తగ్గి 2003-04 కి 71 శాతానికి పెరిగి, 2004-05 (BE) నాటికి 76 శాతంగా మారింది.

పన్నేతర ఆదాయం యొక్క విత్తప్రాధాన్యత (Fiscal Importance) మొత్తం రాబడిలో స్వల్పంగా వుంది. ఉదా॥కి పట్టిక. 8 ప్రకారం 1950-51 లో రు. 49 కోట్లుండగా 1980-81 కి రు. 3,440 కోట్లకి, 1990-91 కి రు. 11,976 కోట్లకి, 2001-02 కి 67,790 కోట్లకి

2004-05 (BE) కి రు. 75,416 కోట్లకి పెరిగింది. అంటే 1950-51 నుండి 2004-05 కి 1539 రెట్లు పెరిగింది. సాపేక్షికంగా చూస్తే, మొత్తం రాబడిలో పన్నేతర రాబడి 1950-51 లో 12 శాతం, 2001-02 లో 34 శాతం, 2004-05 లో 24 శాతంగా వుంది.

పట్టిక 8.

కేంద్రప్రభుత్వ రెవెన్యూ (రెవెన్యూ పద్దు)

1950-51 నుండి 2004-05 (BE) రూ. కోట్లలో

సం॥లు	పన్ను రాబడి (Tax Revenue)	పన్నేతర రాబడి (Non-Tax Revenue)	మొత్తం రెవెన్యూ
1950-51	357(88)	49 (12)	406 (100)
1980-81	9390 (73)	3440 (27)	12830 (100)
1990-91	42978 (78)	11976 (22)	54954 (100)
1996-97	93701 (74)	32578 (26)	126279 (100)
1999-2000	128511 (71)	52923 (29)	181434 (100)
2001-02	133660 (66)	67790 (34)	201450 (100)
2002-03	159425 (69)	72323 (31)	231748 (100)
2003-04	187539 (71)	75488 (29)	263027 (100)
2004-05 (BE)	233906 (76)	75416 (24)	309322 (100)

మూలం : EPW Research Data, Dutt. & Sundaram, Indian Economy, 2004.
Note: (బ్రాకెట్లలోని అంకెలు మొత్తం రెవెన్యూలో శాతాలు)

ప్రత్యక్ష పన్నులు మరియు వాటి ప్రాముఖ్యత :

ప్రత్యక్ష పన్నులలో అత్యంత విత్త ప్రాధాన్యత కల్గినది ఆదాయపు పన్ను. ఈ ఆదాయపు పన్ను రెండు రకాలుగా వుంటుంది. ఒకటి, వ్యక్తిత్వ ఆదాయపు పన్ను. రెండు కంపెనీ ఆదాయపు పన్ను. ఈ పన్నులు పురోగామిగా విధించబడి పన్ను లక్ష్యాలలో ఒకట్రైన ఆదాయ, సంపద అసమానతలను తగ్గించడానికి ఉపకరిస్తాయి. ఈ పన్నులు స్థిర ఆదాయ వర్గాలపైన, పారిశ్రామిక మరియు వ్యాపార సంస్థల లాభాలపైన విధిస్తారు. ఆర్థికాభివృద్ధితోపాటు సామాజిక న్యాయాన్ని సాధించే వీలుంది. అయితే ఈ పన్నుల ద్వారా వచ్చే ఆదాయం స్థూల దేశీయ ఉత్పత్తిలో 3 నుండి 4 శాతంగా వుంది (1999-2000 నుండి 2004-05 కాలంలో). ఈ రాబడి తక్కువనే చెప్పవచ్చు. దీనికి కారణం స్థిర ఆదాయవర్గాల జీతభత్యాలు దేశం మొత్తంమీద తక్కువగా వుండడమే కాకుండా, ఎక్కువమంది జీతాలు ఆదాయపు పన్ను మినహాయింపునకు లోబడేవుండడం. దీంతోపాటుగా ప్రత్యక్ష పన్నులు కట్టేవారి శాతం మొత్తం జనాభాలో 1 శాతం మాత్రమే. దీనికి తోడు పన్ను ఎగవేత (Tax Evasion) మరియు పన్నులనుండి తప్పించుకొనుట (Tax Avoidance) మొదలైన సమస్యలవల్ల ప్రభుత్వం తను అనుకొన్న లక్ష్యాలను సాధించలేని నిస్సహాయస్థితిలో పడిపోయింది. దీంతో పురోగామిగా ఉటుందనుకున్న ప్రత్యక్ష పన్ను విధానం తిరోగామి పన్ను విధానంగా మారిపోయింది. అంటే ధనికులు పన్నులు ఎగవేయడం, అల్పాదాయ వర్గాలవారు పన్నులు క్రమం తప్పకుండ చెల్లించడం. ఈ కారణాలవల్ల మొత్తం పన్నురాబడిలో ప్రత్యక్ష పన్నులనుండి వచ్చే రాబడి 1990-91 లో 19.1 శాతం వుంటే 2002-03 నాటికి 38.4 శాతానికి పెరిగింది. అధికశాతం ఆదాయం పరోక్ష పన్నులనుండి వస్తోందన్నమాట.

ఆదాయపు పన్నుని కేంద్రప్రభుత్వం వ్యక్తులమీద కంపెనీలమీద విధిస్తుంది. పన్ను వసూళ్ళలో కేంద్ర ప్రభుత్వం విత్త సంఘంయొక్క సలహామేరకు రాష్ట్రాలకు వాటా ఇస్తుంది. వ్యక్తులమీద, విధించే ఆదాయపు పన్ను వ్యక్తులయొక్క ఆదాయం ప్రభుత్వం నిర్ణయించిన పరిమితిని దాటి వుంటేనే విధించబడుతుంది. ఈ రోజున రు. 50,000 దాటితే (సంవత్సరాదాయం) నే పన్ను పరిధిలోకి వ్యక్తులు వస్తారు. 2004-05 (BE) లో రు. 1,00,000 ఆదాయం కల్గినవారు (ఒక సంవత్సరానికి) పన్ను చెల్లించనక్కర లేదని మన దేశ విత్తమంత్రి పి. చిదంబరం బడ్జెట్ ప్రసంగాన్ని జూలై 8, 2004 న చేశారు. ఈ రాయితీవల్ల 1.4 కోట్ల పన్ను చెల్లింపుదారులు లబ్ధిని పొందుతారు. సంవత్సరానికి లక్షరూపాయలు ఆదాయం దాటిన వారందరికి పన్ను మినహాయింపు. అదివరకున్న రు. 50,000 మాత్రమే వర్తిస్తుంది. బడ్జెట్ సవరణలలో ఈ లక్ష ఆదాయంగల వారు పన్ను చెల్లించనక్కరలేదన్న రాయితీని రు. 1,11,000/-కు పెంచడం జరిగింది. అయితే పన్నురేట్లను చాలా సం॥ల నుండి అంటే 6,7 సం॥లనుండి మార్పులేదు. ఈ రేట్లు ఈనాడు కూడా అమల్లో వున్నాయి అవి :

రు. 50,000 సం॥ ఆదాయం వరకు పన్ను లేదు

రు. 50,001 నుండి రు. 60,000 వరకు 10 శాతం పన్నురేటు

రు. 60,001 నుండి రు. 1,50,000 వరకు 20 శాతం పన్నురేటు

రు. 1,50,000 పైబడి 30 శాతం పన్నురేటు

ఈ పన్నురేట్లని పురోగామి రేట్లని అంటారు. ఈ రేట్లపై సర్‌చార్జ్ కూడా వుండేది. 2004-05 బడ్జెట్‌లో ఎత్తివేయడం జరిగింది. దీంతోబాటుగా అనేక పన్ను రాయితీలు అంటే రిబేట్లు కూడా వుంటాయి. గృహనిర్మాణానికై తీసుకున్న బ్యాంకు అప్పులపై వడ్డీ రు. 1,50,000 రాయితీ యివ్వబడింది. బ్యాంక్ వడ్డీరేట్లు కూడా బాగా తగ్గడంతో గృహనిర్మాణ రంగం బాగా వృద్ధిని పుంజుకుంది.

ఆదాయపు పన్ను రాబడి మెరుగ్గా వున్నటువంటి లేదా పెరిగేటటువంటి ఆదాయమూలం (Source) స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదాయపు పన్ను నుండి రాబడి గణనీయంగా పెరిగింది. దీనికి కారణం, దేశం అభివృద్ధి చెందడంతోపాటు ప్రజలయొక్క ఆదాయాలలో పెరుగుదల ఏర్పడింది. పట్టిక 9. లో చూపబడిన విధంగా 1950-51 లో రు. 140 కోట్లుండగా, 1990-91 లో రు. 5371 కోట్లుగాను, 2000-01 లో రు. 31,764 కోట్లుగాను, 2003-04 (BE) లో రు. 44,070/- కోట్లుగాను ఆదాయపు పన్ను పెరిగింది. అనగా 314 రెట్లు పెరిగింది.

కేంద్ర ప్రభుత్వం తను వసూలు చేసిన ఆదాయపు పన్ను రాబడిని విత్త సంఘ సలహా మేరకు రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాటా ఇస్తుంది. ఉదా॥కి 10 వ విత్త సంఘ సలహామేరకు ఆదాయపు పన్ను రాబడిలో 77.5 శాతాన్ని రాష్ట్రాలకు పంచి ఇచ్చింది కేంద్రం. అయితే 11 వ విత్త సంఘం ఈ నిబంధనని రద్దు చేసింది.

పట్టిక 9 : కేంద్ర ప్రత్యక్ష పన్నుల రాబడి (1950-51 నుండి 2003-04) రు. కోట్లలో

సం॥లు	ఆదాయపు పన్ను (Income Tax)	కార్పోరేషన్ టాక్స్	మొత్తం ప్రత్యక్ష పన్నుల రాబడి
1950-51	140	40	180
1980-81	1510	1310	2910
1990-91	5371	5335	11024
1998-99	20,240	24529	46600
1999-2000	25,654	30692	57958
2000-01	31,764	35,696	68306
2001-02	32,004	36,609	69197
2002-03	36,858	46,172	83080
2003-04(BE)	44070	51,499	95714
2003-04(Prov)	41,441	63,608	1,05,236

మూలం : (Economic Survey, 2003-04)

పట్టిక 10

కేంద్ర పరోక్ష పన్నుల రాబడి (1950-51 నుండి 2003-04) రు. కోట్లలో

సం॥లు	ఎక్సైజ్ సుంకం	కస్టమ్స్ సుంకం	సర్వీస్‌టాక్స్	మొత్తం పన్ను రాబడి
1950-51	70	160	-	230
1980-81	6500	3410	-	9910
1990-91	24514	20644	-	45158
1998-99	53246	40668	1957	95871
1999-2000	61902	48420	2128	112450
2000-01	68526	47542	2613	118681
2001-02	72555	40268	3302	116125
2002-03	82310	44852	4122	131284
2003-04 (BE)	96791	49350	8000	154141
2003-04(Prov)	90764	48625	7890	147279

మూలం : Economic Survey, 2003-04.

కంపెనీ ఆదాయం అంటే లాభాలపై వేసే పన్నుని కార్పోరేట్ టాక్స్ అని అంటారు. కేంద్రప్రభుత్వం కంపెనీ ఆదాయపు పన్నుని భారీ మరియు చిన్న తరహా కంపెనీల లాభాలపై వేస్తుంది. పన్నురేటు దేశీయ కంపెనీలపై నికర లాభంపై 35 శాతం విదేశీ కంపెనీలపై నికరలాభంపై 48 శాతం పన్నుని విధిస్తున్నారు. (1998-99). విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు దేశీయ పారిశ్రామికాభివృద్ధికై కేంద్ర ప్రభుత్వం కంపెనీలపై 1990-91 నుండి తగ్గిస్తూ వస్తున్నది. ఈ సం॥లోనే సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమయ్యాయి.

ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి జరగడంతోబాటే కంపెనీ ఆదాయపు పన్ను రాబడి కూడా పెరుగుతూ వస్తోంది. ఉదా॥కి పట్టిక 9 లో చూపిన విధంగా, 1950-51 లో కేవలం రు. 40 కోట్లున్నది, 1990-91 లో రు. 5375 కోట్లుగాను, 2000-01 లో రు. 35,696 కోట్లుగాను, 2003-04 లో రు. 51499 కోట్లుగాను కంపెనీ ఆదాయపు పన్ను పెరుగుతూ వస్తున్నది. ఈ పెరుగుదలకి కారణం దేశంలో పారిశ్రామికీకరణ జరగడమే. ఈ కంపెనీ ఆదాయపు పన్నులో రాష్ట్రాలకు వాటా ఇవ్వబడదు.

పట్టికలో మొత్తం ప్రత్యక్ష పన్నుల రాబడి ఇవ్వబడింది. 1950-51 లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష పన్నులనుండి రు. 180 కోట్లు రా ా, 1990-91 లో రు. 11024 కోట్లకి పెరిగి, 2000-01 లో రు. 68,306 కోట్లుగాను, 2002-03 నాటికి రు. 83,080 కోట్లుగాను, మ ియు 2003-04 (BE) లో రు. 95,714 కోట్లకి వృద్ధి పొందింది. అయితే, ఇదంతా అభివృద్ధికి ప్రతీక అయినప్పటికి, వ్యక్తిత్వ ఆదాయపు పన్నులో, స్థూలదేశీయోత్పత్తిలో శాతంగా చూసినట్లైతే స్థిరంగా వుండడమే కాకుండా 1950-51 లో వున్న 1.43 శాతం (GDPతో) పోలిస్తే ఈ శతాబ్దాంతానికి ఈ శాతం తక్కువగా వుంది. అంటే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గడిచిన 50 సం॥లలో ఆర్థికవృద్ధి గణనీయంగా పెరిగినప్పటికి, వ్యక్తిత్వ ఆదాయపు పన్నులో పెరుగుదలలేదు. ఈ కారణంగానే కేల్కర్ టాస్క్‌ఫోర్స్ (Kelkar Task Force) ప్రత్యక్ష పన్నుల సవరణలను (Reforms) ని చేపట్టింది. అదీకాకుండా, ప్రత్యక్ష పన్నులలో బుయాన్సి (Buoyancy) అంటే పెరిగే సూచనలు మెండుగా వుండడంచేత, పరోక్ష పన్నులతో పోలిస్తే, రెవెన్యూని ప్రత్యక్ష పన్నులనుండి పెంచే యోచన చేసింది.

పట్టిక 11 లో పన్నురాబడి శాతాన్ని మొత్తం పన్ను రాబడి పరంగాను, స్థూల దేశీయోత్పత్తి పరంగాను చూపించడం జరిగింది. ఈ పట్టిక ప్రకారం, మొత్తం పన్ను రాబడిలో ప్రత్యక్ష పన్నులశాతం 1990-91లో 19.1 శాతం వుంటే 1998-99 నుండి పెరిగి అంటే 32.4 శాతానికి పెరిగింది. అటుతర్వాత, ఈ పెరుగుదల కొనసాగుతూ 2002-03 నాటికి 38.1 శాతానికి పెరిగింది. విత్త సవరణల ఫలితంగా

ప్రత్యక్ష పన్నుల శాతం పెరుగుతూ వచ్చింది. పశ్చిమ అభివృద్ధి చెందిన దేశాల్లో అధికశాతం పన్నురాబడి అంతా ప్రత్యక్ష పన్నుల ద్వారానే రావడం గమనార్హం. భారతదేశంలో అందుకు విరుద్ధంగా పరోక్షపన్నులపై ఆధారపడడం జరుగుతోంది. అయితే విత్తసవరణల ఫలితంగా, ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. అంతేకాకుండా, ఎప్పుడైతే ప్రత్యక్ష పన్నుల శాతం పెరిగిందో, దేశంలో ఆదాయ సంపద అసమానతలు తగ్గి సామాజిక న్యాయం పెంపొందించబడుతుంది. అంటే పన్నువిధాన లక్ష్యాలలో ముఖ్యమైన ఒక లక్ష్యం నెరవేరే అవకాశం వుంది.

ఇదే పట్టికలో ఆదాయపు పన్నుతో పోలిస్తే కార్పోరేషన్ టాక్స్ మొత్తం పన్నురాబడిలో అధికశాతం కల్గివుంది. అయితే రెండింటికి పెద్దతేడా లేదని పట్టికను చూస్తే తెలుస్తుంది.

స్థూల దేశీయోత్పత్తిలో శాతాన్ని చూసినట్లైతే, 1990-91 లో ప్రత్యక్ష పన్నులు 1.9 శాతంగా వుంటే 2002-03 నాటికి 3.4 శాతానికి పెరిగి, 2003-04 (BE) లలో 3.5 శాతానికి పెరగగలదని అంచనా. ఆదాయపు పన్ను 1999-2000 సం॥వరకు 1.3 శాతంగా వుంది. ఇది 1950-51 లో వున్న ఆదాయపు పన్ను శాతానికి అంటే 1.5 శాతం కన్నా తక్కువగావుంది. ఈ విషయాన్ని పై పేరాలలో చెప్పడం జరిగింది. అంటే 1950-51 నుండి 1999-2000 వరకు ఆదాయపు పన్ను, స్థూలదేశీయోత్పత్తిలో, 1.5 శాతం కన్నా తక్కువగా వుంది.

ప్రత్యక్ష పన్నులలో ఆదాయపు పన్ను, కార్పోరేషన్ టాక్స్‌లే కాక సంపదపన్ను, బహుమతి పన్ను, వడ్డీపన్ను, ఎస్టేట్ సుంకం, వ్యయపన్ను మొదలైనవి వున్నాయి. ఆదాయపు పన్ను మరియు కార్పోరేషన్ టాక్స్ తప్ప మిగతా పన్నులు ప్రస్తుతం అమలులో లేవు, ఒక్క సంపదపన్ను మినహాయించి. అయితే సంపద పన్ను యొక్క పరిధిని మినహాయింపు స్థాయిని రు. 15 లక్షలకు పెంచడంద్వారా బాగా తగ్గించివేసింది. అందుచేత ప్రత్యక్ష పన్నులంటే ఆదాయపుపన్ను (Personal Income Tax),

పట్టిక 11. పన్ను రాబడి, 1990-91 నుండి 2003-04 %

వివరం	1990-91	98-99	99-00	2000-01	01-02	02-03	03-04 (BE)
			స్థూల పన్నురాబడిలో శాతం				
A ప్రత్యక్ష పన్నులు :	19.1	32.4	33.7	36.2	37.0	38.4	38.1
i) ఆదాయపు పన్ను	9.3	14.1	14.9	16.8	17.1	17.0	17.5
ii) కార్పోరేషన్ టాక్స్	9.3	17.1	17.9	18.9	19.6	21.3	20.5
B. పరోక్షపన్నులు :	78.4	66.7	65.5	62.9	62.1	60.7	61.3
i) కస్టమ్స్	35.9	28.3	28.2	25.2	21.5	20.7	19.6
ii) ఎక్సైజ్	42.6	37.0	36.0	36.3	38.8	38.1	38.5
iii) సర్వీస్ టాక్స్	-	1.4	1.2	1.4	1.8	1.9	3.2
			స్థూలదేశీయోత్పత్తిలో శాతం				
A. ప్రత్యక్ష పన్నులు	1.9	2.7	3.0	3.3	3.0	3.4	3.5
i) ఆదాయపు పన్ను	0.9	1.2	1.3	1.5	1.4	1.5	1.6
ii) కార్పోరేషన్ టాక్స్	0.9	1.4	1.6	1.7	1.6	1.9	1.9
B. పరోక్షపన్నులు :	7.9	5.5	5.8	5.7	5.1	5.3	5.6
i) కస్టమ్స్	3.6	2.3	2.5	2.3	1.8	1.8	1.8
ii) ఎక్సైజ్	4.3	3.1	3.2	3.3	3.2	3.3	3.5
iii) సర్వీస్‌టాక్స్	-	0.1	0.1	0.1	0.1	0.2	0.3
ప్రత్యక్ష + పరోక్ష పన్నులు అన్ని కలిపి	10.1	8.3	8.9	9.0	8.2	8.8	9.1

మూలం : ఎకనామిక్ సర్వే, 2003-04

మరియు కార్పోరేషన్ టాక్స్ మాత్రమే. రాష్ట్రాలకు ఈ ఆదాయపు పన్నులో వాటా ఇస్తుంది కేంద్రం. 80 వ రాజ్యంగ సవరణ ఆధారంగా కేంద్రపన్ను వసూళ్ళ మొత్తంలో కొంత శాతాన్ని మాత్రమే అందజేస్తుంది. ఆదాయపు పన్నులో ఫలానా శాతం యివ్వాలన్న (రాష్ట్రాలకు) పూర్వపు పద్ధతి మరిక లేదు. ఆదాయపు పన్ను, కార్పోరేషన్ టాక్స్‌లు రెండు ఆర్థికవృద్ధి (Economic Growth) మరియు ఆదాయాల పెరుగుదలపైన ఆధారపడి వాటి రెవెన్యూలో మార్పు ఏర్పడుతుంది. అయితే ఇక్కడ పన్ను యంత్రాంగంలో సవరణలు (Reforms) చేపట్టడం ద్వారా సమాచారస్థాయి పెరిగి పన్ను ఎగవేతని అరికట్టే అవకాశం ఏర్పడుతుంది. దీంతోపాటుగా క్లిష్టమైన మినహాయింపులు మరియు తగ్గింపులు (deductions) ఎత్తివేయడంవల్ల ఆదాయపు పన్ను, కార్పోరేషన్ పన్నుల పరంగా సార్థక పన్నురేటు (Effective Tax Rate) పెరుగుతుంది. దీనివల్ల ప్రత్యక్షపన్నుల విత్త సమర్థత పెరుగుతుంది. మొత్తం పన్ను రాబడిలో ప్రత్యక్షపన్నుల వాటా పెరుగుతుంది.

4.23 పరోక్ష పన్నులు : (Indirect Taxes)

పరోక్షపన్నులు వస్తువులు, సేవలపై విధించబడతాయి. ప్రత్యక్ష పన్నులను ఆదాయంపై విధించబడతాయని తెలుసుకున్నాము. పరోక్షపన్నులు ముఖ్యంగా మూడురకాలు. అవి 1. యూనియన్ ఎక్సైజ్ సుంకం. 2. కస్టమ్స్ సుంకం, మరియు 3. సర్వీస్ టాక్స్, యివి కేంద్ర పరిధిలో విధించబడే పన్నులు. రాష్ట్రాల విషయంలో పరోక్షపన్నులలో ముఖ్యమైనది అమ్మకపు పన్ను (Sales Tax) దీంతోపాటుగా MODVAT మరియు CENVAT or MANVAT). యివి విలువాధారిత పన్నులు అని అంటారు. యివి ఎక్సైజ్‌పన్నుయొక్క ప్రతిరూపాలే.

2003 బడ్జెట్ ప్రకారం, మొత్తం పన్ను రాబడిలో పరోక్ష పన్నులద్వారా 58 శాతం ఆదాయం వస్తోందని అంచనా. మిగిలిన 42 శాతం ప్రత్యక్ష పన్నులద్వారా వస్తోందన్నమాట. పరోక్ష పన్నులలో అధికశాతం రాబడి అంటే 38 శాతం రాబడి అంతా ఎక్సైజ్ సుంకంనుండి వస్తోంది. మిగిలిన 20 శాతం రాబడి కస్టమ్స్ సుంకంనుండి వస్తోంది. అయితే 1990 దశకంలో చేపట్టిన సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా ముఖ్యంగా దిగుమతులను సరళీకృతం చేసిన కారణంగా, కస్టమ్స్‌సుంకం 1990 దశాబ్దంలో క్రమంగా పడిపోయింది. 1990 దశాబ్దం తర్వాత, కస్టమ్స్ డ్యూటీ రేట్లు స్థిరీకరణ దిశగా ప్రయాణిస్తున్నాయి. దీంతో రెవెన్యూలో తగ్గుదల ఆగే అవకాశం లేకపోలేదు. ఈ రేట్ల పెరుగుదల కొంతస్థాయివరకే జరిగే అవకాశం వుంది, W.T.O నిబంధనల కారణంగా దీనివలన, కస్టమ్స్ సుంకంనుండి రాబడి భవిష్యత్‌లో ఒక ముఖ్యమైన రాబడిగా పరిగణించే అవకాశం వుండదు. పూర్వం కస్టమ్స్ రెవెన్యూని ఒక ముఖ్యమైన రాబడిగా గుర్తించడం జరిగింది. ఈ కారణాల వల్ల యూనియన్ ఎక్సైజ్ పరోక్ష పన్నులలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం దేశీయంగా తయారైన వస్తువులపై విధిస్తుంది. అయితే రాష్ట్రాలు ఎక్సైజ్ సుంకాన్ని మత్తుపానీయాలు (Liquor) మరియు మందులు (Drugs) పై విధించడంవల్ల కేంద్రం ఈ వస్తువులపై ఎక్సైజ్ సుంకాన్ని విధించదు.

పట్టిక 10. లో చూపబడిన విధంగా పరోక్షపన్నుల రాబడి 1950-51 లో రు. 270 కోట్లుండగా, 1990-91 కి రు. 45,158 కోట్లకి పెరిగి, 2000-01 కి రు. 1,18,681 కోట్లకి పెరిగి, 2002-03 కి రు. 1,31,284 కోట్లకి పెరిగింది. 2003-04 (BE) లో పరోక్షపన్నుల మొత్తం రాబడి రు. 1,54,141 కోట్లకి పెరగగలదని అంచనా. 1950-51 నుండి 2002-03 కి రాబడి 571 రెట్లు పెరిగింది. ఇదే పట్టికలో ఎక్సైజ్ సుంకంనుండి రాబడి రు. 70 కోట్లనుండి (1950-51) 1990-91 నాటికి రు. 24,514 కోట్లుగాను, 2000-01 కి. రు. 68,526 కోట్లుగాను, 2002-03 కి రు. 82,310 కోట్లుగా పెరిగింది. 2003-04 బడ్జెట్ అంచనాలు ప్రకారం ఎక్సైజ్ రెవెన్యూ రు. 96,791 కోట్లకి పెరగగలదని అంచనా. యిక దిగుమతి సుంకం అంటే కస్టమ్స్ సుంకం దిగుమతి అయిన వస్తువులపై వేస్తారు. పట్టికలో చూపిన విధంగా, దిగుమతి సుంకం 1950-51 లో 160 కోట్లుంటే 1990-91 లో రు. 20,644 కోట్లకి, 2000-01 లో రు. 47,542 కోట్లకి, 2002-03 లో రు. 44,852 కోట్లకి పెరిగింది. 2003-04 (BE) లో రు. 49,350 కోట్లకి దిగుమతి సుంక రెవెన్యూ పెరగగలదని అంచనా.

యిక సర్వీస్‌టాక్స్. ఈ పన్నుని సేవలకై విధిస్తుంది కేంద్రం. ఈ పన్నుని మొదటిసారిగా 1998-99 లో టెలిఫోన్స్, ఇన్సూరెన్స్, బ్రోకరేజ్ మొదలైన వాటిపై విధించింది. సం॥లు గడుస్తున్న కొద్దీ ఈ పన్నుయొక్క పరిధి పెరుగుతూ వస్తోంది. 2004-05 బడ్జెట్ నాటికి మొత్తం 58 సేవలకై పన్ను విధించడం జరిగింది. సర్వీస్‌టాక్స్ పన్నురేటుని 8 శాతం నుండి 10 శాతానికి 2004-05 బడ్జెట్‌లో పెంచడం

జరిగింది. కొత్త సర్వీసులైన వ్యాపారవినోద సేవలు, విమానాశ్రయ సేవలు, రవాణా ఏజెంట్ల సేవలు, వస్తువుల విమాన రవాణా సేవలు, సర్వే మరియు ఎక్స్‌ప్లోరేషన్ సేవలు, ఒపీనీయన్ పోల్ సేవలు, మేథోసంపత్తి సేవలు, స్వతంత్ర TV మరియు రేడియో కార్యక్రమాలు, పారిశ్రామిక నిర్మాణసేవలు, బహిరంగ కేటరర్స్ సేవలు, మొదలైనవి పన్ను పరిధిలోకి తీసుకురావడం జరిగింది. 1998-99 లో మొదటిసారిగా విధించబడి రు. 1,957 కోట్ల ఆదాయం రాగా, 2002-03 కి రు. 4,122 కోట్లకి పెరిగింది. 2003-04 బడ్జెట్ అంచనాలలో రాబడి రు. 8000 కోట్లకి పెరగగలదని అంచనా.

పట్టిక 11 లో పన్నురాబడి గురించి సమాచారం ఇవ్వబడింది. దీనిప్రకారం, మొత్తం పన్ను రాబడిలో ఎక్సైజ్ సుంకం వాటా 1990-91 లో 42.6 శాతం వుండగా 2002-03 నాటికి 38.1 శాతానికి తగ్గింది. 2003-04 బడ్జెట్ అంచనాలలో ఈ శాతం 38.5 గా వుండగలదని అంచనా. అయితే కస్టమ్స్ యొక్కవాటా 1990-91 లో 35.9 శాతం వుండగా 2002-03 కి 20.7 శాతానికి పడిపోయింది. 2003-04 బడ్జెట్ అంచనాలలో యింకా పడిపోయింది. దీనికి కారణం సరళీకృత ఆర్థిక విధానాల కారణాన దిగుమతులు సరళీకృతం అయ్యేయి. అంతేకాకుండా భారతదేశం W.T.O లో సంతకం చేసిన కారణంగా దిగుమతుల పరంగా నిబంధనలను ఎత్తివేయవలసివుంది. వీటివల్ల కస్టమ్స్ రెవెన్యూ శాతం పడిపోయింది. యిక సర్వీస్‌టాక్స్ మొత్తం పన్నురాబడిలో 1998-99 లో 1.4 శాతం వుంటే 2002-03 లో 1.9 శాతానికి పెరిగింది. 2003-04 బడ్జెట్ అంచనాలలో ఈ పన్ను శాతం 3.2 శాతానికి పెరగగలదని అంచనా.

పై పట్టిక 11 లో స్థూల దేశీయోత్పత్తిలో కేంద్ర పన్నుల రాబడి ఎంత శాతంలో వుందో కూడా చూపబడింది. , ఎక్సైజ్ సుంకం - స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి 1990-91 లో 4.3 శాతం వుండగా తర్వాత తగ్గుదల ప్రారంభమై 2002-03 నాటికి 3.3 శాతానికి పడిపోయింది. ఈ తగ్గుదల 1998-99 నుండి ప్రారంభం అయ్యింది. 2003-04 (BE) అంచనాలలో ఈ శాతం 3.5 శాతంగా వుండగలదని అంచనా. దీనికి కారణం 1990 దశకంయొక్క ఉత్తరార్థభాగంలో ఉత్పాదకరంగం వృద్ధిలో తగ్గుదల.

కస్టమ్స్ రెవెన్యూ - స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి కూడా 1990-91 లో 3.6 శాతం వుండగా 1998-99 నుండి తగ్గుదల ప్రారంభమై 2002-03 నాటికి 1.8 శాతానికి పడిపోయింది. దీనికి కారణాలు ఇదివరకే వివరించడం జరిగింది. దిగుమతుల సరళీకృతమే దీనికి కారణం. స్థూల దేశీయోత్పత్తిలో సర్వీస్ టాక్స్ శాతం చాలా తక్కువ. పరోక్ష పన్నులు మొత్తం కలిపితే స్థూల దేశీయోత్పత్తిలో శాతం 1990-91 లో 7.9 శాతం వుండగా 2002-03 కి 5.3 శాతానికి తగ్గింది. 2003-04 (BE) లో ఈ శాతం 5.6 శాతానికి పెరగగలదని అంచనా.

(MODVAT or MANVAT) :

పరోక్ష పన్నులలో సవరణలు (Reforms) తీసుకు వద్దామనే ఉద్దేశ్యంలో L.K ఝా కమిటి సూచన మేరకు ఎక్సైజ్ సుంకాన్ని ఉత్పాదకస్థాయిలో విలువ ఆధారిత పన్నుగా మార్చి 1986 సం॥లో మొదటిసారిగా దేశంలో ప్రవేశపెట్టబడింది. దీనినే మోడిఫైడ్‌వాల్యూ ఎడెడ్ టాక్స్ (Modified Value Added Tax at the Manufacturing stage). దీనివల్ల ముడిసరుకులపై కట్టిన పన్నుకి క్రెడిట్ ఇవ్వబడుతుంది. అంటే ముడిసరుకులపై కట్టిన పన్నుని ఆ వస్తువులతో తయారైన అంటే పూర్తిగా తయారైన వస్తువు విలువలోంచి ఆ పన్నుని తీసివేసి మిగతా పన్నుని చెల్లించాలి. దీనివల్ల పన్నుపై పన్ను చెల్లించే పరిస్థితి వుండదు. (No cascading effect) ఈ MODVAT లో పారిశ్రామిక వేత్తలు వారు ముడిసరుకులపై చెల్లించిన పన్నుని పూర్తిగా రిఇంబర్స్ (వెనక్కి ఇచ్చేటట్లుగా) చేసుకునే వీలు కల్పించబడింది. దీనివల్ల పూర్తిగా తయారైన వస్తువుపై పన్ను భారం తగ్గుతుంది. అంతేకాకుండా ఎగుమతి, దిగుమతి వ్యాపారం పెరుగుతుంది. ఎందుకంటే ఎగుమతిదారులు తాము ముడిసరుకులపై చెల్లించిన పన్నుపై పొందిన క్రెడిట్‌ని తాము తయారుచేసే వస్తువుపరంగా ఉపయోగించుకోవచ్చు. MODVAT స్వావలంబనకి మరియు దేశీయ ఉత్పాదకశక్తి పెంపుదలకి ఉపకరిస్తుంది.

VAT విలువాధారిత పన్ను (Value Added Tax) :

ఒక వస్తువుయొక్క తయారి స్టేజ్‌నుండి అమ్మకపు దశకు మధ్యవున్న దశలలో ఎంతవిలువ వచ్చి చేరింది అనే విషయం ఆధారంగా పన్ను విధించబడుతుంది. అంటే వస్తువు విలువనుండి ముడిసరుకుల విలువని తీసివేస్తే అదేవస్తువు విలువ. ఈ విధంగా ప్రతి దశలోను

చేసి కలిసిన విలువ ఆధారంగా పన్నుని VAT లేదా విలువాధారిత పన్ను దీంట్లో వస్తువు విలువ తీసుకుని ప్రతిదశలోనూ పన్నువేస్తారు. MODVAT లో ముడిసరుకులపై చెల్లించిన పన్నుకి క్రెడిట్ ఇస్తారు. VAT ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందివుంది. 60, 70 దేశాలలో ఈ VAT ని విధిస్తున్నారు. ఈ VAT ని పూర్తిగా కేంద్రంగాని, రాష్ట్రంగాని, లేదా రెండింటి భాగస్వామ్యంతోగాని విధించవచ్చు. కేంద్రం విధించే VAT ని CENVAT అని పిలుస్తారు. ఇది 2000-01 బడ్జెట్ నుండి అమలులోకి వచ్చింది. 2000-01 కి ముందు ఎక్సైజ్ సుంకంయొక్క విలువాధారిత రేట్లు 8%, 16% మరియు 24% వుండేవి. CENVAT లో ఒకే ఒక రేటు విధించబడుతుంది. ఆ రేటు 16%.

ఈ VAT ని ముఖ్యంగా కేంద్రం అమలుచేసిన CENVAT లాగా రాష్ట్రాలు VAT ని అమలు చేయవలసివుంది. రాజకీయ, ఆర్థిక కారణాలచేత VAT యొక్క అమలు పొడిగించబడుతోంది. అంటే రాష్ట్రాలు వారి అమ్మకపు పన్ను స్థానే ఈ VAT ని అమలు చేయవలసి వుంది. దీంట్లో వస్తువులు, సేవలు రెండూ వుంటాయి. దీంట్లో వున్న లాభనష్టాల మాట అటుంచి, VAT అమలువల్ల రాష్ట్రాల ఆదాయం పెరిగే అవకాశం లేకపోలేదు. అమ్మకపు పన్నుని ఒకసారి విధించబడే పన్ను VAT దశలవారిగా ప్రతి ఉత్పత్తి దశలో వచ్చి చేరే విలువపై పన్ను వేయడం జరుగుతుంది. దీనివల్ల పన్నుఎగవేతకి తావు వుండదు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకి అధిక ఆదాయం వస్తుంది. ఈ పన్నుని అంటే VAT ని 1.4.2005 నుండి అమలుచేయవలసి వుంది, రాష్ట్రాలు అసలు 1.4.2004 నుండి ప్రవేశపెట్టాలి. VAT అమలు అయిన తర్వాత అమలులో వున్న లోపాల కారణంగా ఏమైన రెవెన్యూ నష్టం జరిగితే దానిని కేంద్రప్రభుత్వమే భరిస్తుందని మన కేంద్ర విత్తమంత్రి హామీ ఇవ్వడం జరిగింది. పన్నుయంత్రాంగంలో సమూలమైన మార్పులు చేసి పన్నుపరమైన సమాచారాన్ని సమగ్రంగా పొందేందుకు కృషిజరగాలని ప్రభుత్వ యోచన.

కోశ సూచికలు :

2003-04 బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రత్యక్ష పరోక్ష పన్నుల నిష్పత్తి 39:61 ఉండగలదని అంచనా. అయితే ఈ నిష్పత్తి ఈ రోజున అనగా 2004-05 బడ్జెట్‌నాటికి 42:58 గా వుంది. పరోక్షపన్నుల పాత్ర తగ్గడం అంటే అది శుభసూచికయే. ఇది ఒకప్పుడు అంటే 1990-91 లో 84 శాతంగా వుంది. పరోక్షపన్నులను అధికశాతం భరించేది సామాన్యులే. అంటే తిరోగామి పన్ను విధానమన్నమాట. అయితే పరోక్షపన్నుల శాతం 58 కి తగ్గింది కాబట్టి సామాన్యులపై భారం తగ్గి సామాజిక న్యాయం పెరుగుతోందని అర్థం. ప్రత్యక్ష పన్నులవాటా శాతం 42 కి పెరిగిందంటే ఆదాయసంపద అసమానతలు దేశంలో తగ్గుతున్నాయని అనుకోవచ్చు. ఎందుకంటే ప్రత్యక్ష పన్నులు పురోగామిగా వుంటాయి కాబట్టి.

పట్టిక 12 లో కోశసూచికలు చూపబడ్డాయి. ఈ కోశ సూచికలన్ని స్థూల దేశీయోత్పత్తిలో శాతంగా చూపించబడ్డాయి. ముందుగా కేంద్ర రాష్ట్రాలు కలిపి పరిస్థితిని మదింపుచేస్తే, 1999-2000 నుండి పన్ను రాబడి 14.1 శాతం నుండి 2003-04 (BE) కి 15.2 గా పెరిగింది. 11 వ విత్త సంఘ అంచనాల ప్రకారం 2004-05 లో పన్నురాబడి 16.7 శాతానికి పెరిగే సూచనలున్నాయి. అయితే రెవెన్యూ రాబడి రెవెన్యూ వ్యయం కన్నా తక్కువగా ఉంది. దీంతో రెవెన్యూలోటు ఏర్పడింది. ఈ రెవెన్యూ లోటు విత్త సంఘ అంచనాల ప్రకారం 1 శాతానికి తగ్గిపోయింది. కోశలోటు కూడా పట్టికలో చూపిన విధంగా 1999-2000 లో 9.9 శాతం వున్నది. 2001-02 లో 9.5 గా వుంది. అంటే పెద్దమార్పులేదు. అయితే విత్త సంఘ అంచనాల ప్రకారం 2004-05 లో 6.5 శాతానికి తగ్గింది.

తర్వాత, ఒక్కకేంద్రం పరిస్థితి చూసినట్లైతే, పట్టిక 12 ప్రకారం రెవెన్యూలోటు 1999-2000 లో 3.5 శాతం వుంటే 2003-04 (BE) కి 4.1 శాతానికి పెరిగింది. విత్తసంఘ అంచనాల ప్రకారం 1 శాతానికి తగ్గింది. కోశలోటు, ఇదేకాలంలో 5.4 శాతంనుండి 5.6 తగ్గి విత్త సంఘ అంచనాల ప్రకారం 2004-05 లో 4.5 శాతం వుండగలదని అంచనా. 2003-04 సవరించిన అంచనాల ప్రకారం కోశలోటు 4.8 శాతంగాను, మరియు 2004-05 బడ్జెట్ అంచనాల ప్రకారం 4.4 శాతంగాను వుంది. ఈ కోశలోటు ప్రపంచబ్యాంక్ నిబంధనల ప్రకారం 5 శాతానికి లోపల వుండాలి.

రాష్ట్రాల విషయానికొస్తే, రాష్ట్రాలు తమ సొంత పన్ను రాబడిని పూర్తిగా పెంచుకోవడంలో విఫలం అయ్యారు. అయితే తేడా చాలా తక్కువ అంటే పన్ను వసూళ్ళకి, పన్ను వసూలుకాని పరిస్థితికి మధ్య తేడా తక్కువగా వుండడం చేత రాష్ట్రాలువారి రెవెన్యూని పూర్తిగా అవతికాలంలో వసూలుచేసే స్థితికి రాగలరు.

పట్టిక 12 కేంద్రరాష్ట్ర కోశ సూచికలు, 1999-2004

స్థూల దేశీయోత్పత్తిలో శాతం (%)

వివరము	1999-00	2000-01	2001-02	2002-03 (BE)	2003-04	2004-05 11 వ విత్త సంఘ అంచనా
I) కేంద్ర రాష్ట్రాలు కలిపి						
(a) పన్నురాబడి	14.1	14.6	13.7	14.9	15.2	16.7
(b) పన్నేతర రాబడి	3.8	3.5	4.1	4.7	4.4	3.2
(c) రెవెన్యూ రాబడి	19.4	19.4	19.1	20.9	21.0	20.0
(d) రెవెన్యూ వ్యయం	26.3	26.6	26.7	28.3	27.5	21.0
(e) మూలధన వ్యయం	3.3	3.1	3.2	3.9	4.4	6.6
(f) రెవెన్యూ లోటు	6.4	6.8	7.2	7.0	6.1	1.0
(g) కోశ లోటు	9.9	9.9	9.8	9.4	9.5	6.5
II) కేంద్రం ఒక్కటే						
(a) పన్నురాబడి	8.8	9.0	8.1	9.0	9.2	10.3
(b) పన్నేతర రాబడి	2.8	2.7	3.0	2.9	2.5	3.0
(c) రెవెన్యూ రాబడి	9.4	9.2	8.8	9.6	9.3	13.3
(d) రెవెన్యూ వ్యయం	12.9	13.2	13.1	13.8	13.4	11.5
(e) మూలధన వ్యయం	2.5	2.3	2.7	2.5	2.7	4.0
(f) రెవెన్యూ లోటు	3.5	4.1	4.4	4.2	4.1	1.0
(g) కోశ లోటు	5.4	5.7	6.1	5.9	5.6	4.5
III) రాష్ట్రాలు :						
(a) రెవెన్యూ లోటు	3.0	2.8	2.8	2.7	2.0	0.0
(b) కోశలోటు	4.7	4.3	4.2	4.7	4.0	2.5

మూలం : E.P.W. June, 26, 2004

ఉదా :కి పట్టిక 12 లో చూపబడిన విధంగా రెవెన్యూ లోటు తీసుకున్న కాలంలో బాగా తగ్గింది. అనగా 1999-2000 లో 3 శాతం వున్నది. 2003-04 నాటికి 2 శాతానికి తగ్గింది. విత్తసంఘ అంచనాల ప్రకారం సున్నాగా మారింది. అయితే కోశ లోటు నిలకడగా 4 శాతంపైనే వుంది. 1999-2000 లో కోశలోటు రాష్ట్రాలలో 4.7 శాతం వుంటే 2003-04 (BE) కి 4.0 కి తగ్గింది. విత్తసంఘ అంచనాలపరంగా అయితే 2004-05 లో రాష్ట్రాల కోశలోటు 2.5 శాతానికి పడిపోయింది.

కోశ లోటు ఎక్కువగా వుందని దానిని తగ్గించే ప్రయత్నం చేయాలని 11 వ విత్తసంఘం అభిప్రాయపడింది. రెవెన్యూ ఎక్కౌంట్‌లో మిగులు సాధించి మూలధన వ్యయాన్ని ధరించాలని సూచనచేసింది. అయితే గడచిన కాలాల్లో చేసిన అప్పుల ఋణవిమోచన వ్యయం పెరిగిన కారణంగా రెవెన్యూలోటుని తగ్గించే అవకాశం లేదు. అని 11 వ విత్త సంఘం అనుకుంది. దీంతో ఋణం ఒక ప్రక్క, లోటు ఇంకొక ప్రక్క బాధిస్తూ స్థూల ఆర్థికవ్యవస్థ స్థిరీకరణ ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడింది. విత్తసంఘం సూచన ఏంటంటే, కోశవిధానం ఆర్థికపరమైన ఒడిదుడుకులను సమర్థవంతంగా తట్టుకునేదిగా వుండాలి. యూరోపియన్ యూనియన్ (EU) దేశాలు అనుసరించే కోశలోటు పరిమితి లేదా స్టాండర్డ్ స్థూల దేశీయోత్పత్తిలో 3 శాతంగా నిర్ణయించారు. అయితే విత్తసంఘం దీనిని భారతదేశ పరిస్థితులకనుగుణంగా 6.5 శాతంగా చెప్పింది. దీంతోబాటుగా "ఋణ - (GDP)" నిష్పత్తి 60 గా పశ్చిమదేశాలు పాటిస్తుంటే, విత్తసంఘం భారతదేశానికి 55 శాతంగా నిర్ణయించింది. కోశ లోటుని నియంత్రించడంతోబాటు, టాక్స్‌బేస్‌ని పెంచుకొని తద్వారా పన్నురాబడిని పెంచుకోవాలని 11 వ విత్తసంఘం సూచించింది. అయితే సామాజిక అవస్థాపనా సౌకర్యాల కల్పనకై వ్యయాన్ని తగ్గించకూడదు, అని సూచించింది.

11 వ విత్త సంఘ సూచనలు :

11 వ విత్త సంఘ ఇతర సూచనలు : కేంద్రం పరంగా : 1. టాక్స్‌బేస్‌ని విస్తృత పరచుకోవడం, 2. ప్రభుత్వంయొక్క సరియైన పరిమాణ (Rightsizing) నిర్ధారణ, అన్నిస్థాయిలలోను, 3. స్థూల దేశీయోత్పత్తిలో ఫలానా శాతం అప్పుతీసుకోవాలన్న నిర్ణయం 4. రాష్ట్రాల ప్రణాళికలకి సహాయం యొక్క నిర్ణయంలో సవరణలు, మరియు 5. బహుళ - సంవత్సర బడ్జెటింగ్ విధానం ప్రవేశపెట్టాలి.

రాష్ట్రప్రభుత్వాలు పరంగా : విత్తసంఘ సూచనలు. 1. వృత్తి పన్ను మరియు వ్యవసాయ ఆదాయంపై పన్నుల ద్వారా రాష్ట్రాలు వారి ఆదాయాన్ని పెంచుకోవాలి. 2. యూజర్ చార్జెస్ ద్వారా పన్నేతర ఆదాయాన్ని పెంచుకోవాలి 3. అన్నిస్థాయిల్లోనూ ప్రభుత్వాన్ని సరియైన పరిమాణానికి కుదించాలి. 4. స్థూలరాష్ట్ర ఉత్పత్తి (Gross State Domestic Product) లో ఫలానా శాతంగా అప్పులపై పరిమితులు విధించాలి మరియు 5. బహుళ సంవత్సర బడ్జెటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలి.

11 వ విత్తసంఘ సూచనలమేరకు కేంద్ర ప్రభుత్వం మొత్తం పన్నురాబడి లో 28 శాతం రాష్ట్రాల వాటాగా యివ్వబడుతోంది. దీంతోపాటుగా అదనంగా 1.5 శాతం రాబడిని ఏ రాష్ట్రాలైతే పంచదార, టెక్స్‌టైల్స్ మరియు పొగాకులపై పన్ను విధించరో (Sales Tax) వారికి ఇవ్వబడుతుంది. అంటే కేంద్రంయొక్క పన్ను ఆదాయంలో 29.5 శాతం రాష్ట్రాలకు పంచడం జరుగుతుంది. 2000-05 కాలానికి ఉదా॥కి 2003-04 లో కేంద్రం యొక్క మొత్తం పన్ను ఆదాయం అయిన రు. 2,51,530 కోట్లలో రాష్ట్రాల వాటాక్రింద రు. 63,760 కోట్లు యివ్వబడింది. ఇంకా ఇతర బదిలీలుపోను కేంద్రంయొక్క నికర ఆదాయం అంటే పన్ను ఆదాయం రు. 1,84,170 కోట్లు, 2003-04 లో.

భారతదేశంలో సంకుచిత టాక్స్‌బేస్ వల్ల ఉత్పాదకరంగం మీద పన్ను ఆదాయానికై అధికంగా ఆధారపడడం జరుగుతోంది. 2003-04 బడ్జెటులో భారతదేశ విత్త సమస్యల గురించి ప్రధానంగా దృష్టిలో వుంచుకోవడం జరిగింది. అంటే నిర్మాణాత్మక బలహీనతలపైన దృష్టి సారించడం జరిగింది. ఈ బడ్జెట్ రెవెన్యూ సమీకరణంలో మోడెస్టు వృద్ధి వుండగలదని ఆశిస్తూ ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ఋణేతర మూలధన సమీకరణ జరగగలదని ఆశించడమైనది. వ్యయాన్ని హేతుబద్ధంగా (Rationalisation of Expenditure) చేయడం, ద్రవ్య యాజమాన్యతను మెరుగుపరచడం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని పటిష్టపరచడమేకాకుండా విత్తవనరులను ఉత్పాదక ఉపయోగాలవైపు మళ్ళించవచ్చు అని 2003-04 బడ్జెట్‌లో అంచనా వేయడం జరిగింది. యిదంతా కోశ పటిష్టత జరగడానికి ఉపయోగపడుతుంది. కోశ సంబంధ భాద్యతలను (Fiscal Responsibility) చట్టపరంగా నిర్దేశించడం భారతదేశంలో ఒక మైలురాయికాబోతుంది. రాగల కాలంలో ఈ విధానాన్ని అమలు జరపడం ద్వారా ప్రభుత్వ విత్తంపై దాని ప్రభావం వుండగలదు. ముఖ్యంగా, మార్చి 31, 2008 నాటికి రెవెన్యూ లోటుని సున్నాకి సమానం చేయాలన్నది లక్ష్యం. కోశ సంబంధ భాద్యతల చట్టం ఈ దిశగా ఎంతో మేలు జరుగుతుందని ఆశించడమైనది. ఈ చట్టంవల్ల రాష్ట్రాలనుండి వచ్చే అసందర్భ విత్త డిమాండ్‌ని నియంత్రించే వీలుకూడా వుంది.

14.6.3 ప్రభుత్వ ఋణ విధానం : (Public Debt Policy) :

ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రభుత్వ ఋణవిధానం కూడా ఒక శక్తివంతమైన కోశ సాధనంగా ఉపయోగపడుతోంది. భారతదేశంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఋణసేకరణ ద్వారా మూలధన వ్యయానికి కావలసిన విత్త వనరులను సేకరిస్తాయి. అంటే రైల్వే నిర్మాణానికి, నీటి పారుదల ప్రాజెక్టులకి, అవస్థాపనా సౌకర్యాల కల్పనకి ఋణాన్ని సేకరిస్తాయి. ప్రభుత్వ బడ్జెట్‌లో ఏర్పడే లోటును కూడా ఈ ఋణాలతో ముఖ్యంగా దేశీయ ఋణంతో పూరించడం జరుగుతుంది. స్వాతంత్ర్యం రాకపూర్వం ఋణసేకరణ పూర్తిగా యుద్ధావసరాల కొరకే సేకరించడం జరిగింది. ఉదా॥కి రెండవ ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటిష్ ఇండియా ఋణం రు. 730 కోట్లనుండి రు. 1940 కోట్లకి పెరిగింది. దీంట్లో రక్షణ వ్యవస్థపై చేసిన మూలధన వ్యయంతోపాటుగా స్టెర్లింగ్ ఋణ విమోచనకై చేసిన ఋణం కూడా వుంది. ఋణాలు రెండుమార్గాల ద్వారా వస్తాయి. ఒకటి, దేశీయ ఋణం. రెండవది, విదేశీ ఋణం. స్వాతంత్ర్యం రాకపూర్వం స్టెర్లింగ్ (బ్రిటిష్ కరెన్సీ) ఋణం ఎక్కువగా వుండేది. దేశీయ ఋణాన్ని మార్కెట్టు ఋణాల రూపంలోను, చిన్న పొదుపు మొత్తాలద్వారా ప్రభుత్వం ఋణాన్ని సేకరించడం 1951 నుండి ప్రారంభమైంది. స్వాతంత్ర్యం తర్వాత భారత ప్రభుత్వ ఋణం వేగంగా పెరగడం ఆరంభమైంది. దీనికి ముఖ్యంగా మూడు కారణాలు చెప్పవచ్చు. అవి. 1. ఆర్థికాభివృద్ధికి అవసరమైన వనరుల సమీకరణ, 2. ద్రవ్యోల్బణ పరిస్థితులను అరికట్టడానికి, 3. రక్షణ వ్యయాన్ని భరించడానికి ఋణసేకరణ జరుగుతోంది.

1951 లో ప్రణాళికయుగం ప్రారంభంతోనే ఆర్థికాభివృద్ధి వరంగా ఏర్పాటు చేసిన లక్ష్యసాధనకై వనరుల సమీకరణలో భాగంగా ప్రభుత్వ ఋణవిధానం రూపు దిద్దుకుంది. ప్రభుత్వఋణంలో రెండు భాగాలుంటాయి. ఒకటి, ప్రభుత్వ ఋణం, రెండవది, ఇతర బాధ్యతలు (other liabilities). మొదటిదైన ప్రభుత్వ ఋణంలో రెండు ఋణాలుంటాయి. అవి i. దేశీయ ఋణం, మరియు ii. విదేశీ ఋణం. విదేశాలలో సేకరించిన ఋణాన్ని విదేశీ ఋణమని అనవచ్చు. దేశీయంగా ప్రజల వద్దనుండి సేకరించిన ఋణాన్ని దేశీయ ఋణమని అంటారు. విదేశీ ఋణంలో ఎక్కువభాగం అంతా అధికార అభివృద్ధి సహాయం (Official Development Assistance) నుండి వస్తుంది. అందుచేత, ఈ ఋణం (external loans) అనేక రాయితీలతోనూ మరియు దీర్ఘకాలానికి ఇవ్వబడుతుంది. ఈ ఋణాలన్ని విదేశీ కరెన్సీలో చెల్లించవలసివుంటుంది. దీనికై అంతర్జాతీయ ద్రవ్యసంస్థ సంధాన కర్తగా వుంటుంది. 1951 లో ఈ విదేశీ ఋణం మొత్తం ఋణంలో 1.1 శాతం వున్నది. 1993 నాటికి 10 శాతానికి పెరిగింది. 1999-2000 సం॥కి 6 శాతంగాను మరియు 2002-03 నాటికి 4 శాతంగాను వుంది. 1951 లో కేవలం రు. 30 కోట్లున్న విదేశీ ఋణం, 1999-2000 కి రు. 56,130 కోట్లకి పెరిగి, 2002-03 కి రు. 57,650 కోట్లకి మార్పు చెందింది. పట్టిక. 13 చూడగలరు.

ఇక దేశీయ ఋణం మొత్తం ఋణంలో సింహభాగాన్ని ఆక్రమించింది. ఈ ఋణంలో మార్కెట్టు ఋణాలు, మరియు ట్రెజరి బిల్లులు ఉంటాయి. అంతే కాకుండా అంతర్జాతీయ విత్త సంస్థలకి ఇచ్చిన సెక్యూరిటీస్ వుంటాయి. ఈ దేశాలకు ఋణం ఇతర (Other Liabilities) అప్పులతో కలిపి 1951 లో 99 శాతం వుండగా, 1999-2000లో 94 శాతం గాను, మరియు 2002-03 లో 96 శాతం గాను పెరిగింది. ఇతర అప్పులలో (i) చిన్న పొదుపు మొత్తాలు, (ii) భవిష్యనిధి (Provident Fund) , (iii) ఇతర పద్దులు, అనగా ప్రభుత్వేతర భవిష్యనిధుల ప్రత్యేకడిపాజిట్లు, (iv) రిజర్వు నిధులు మరియు డిపాజిట్లు అనగా రైల్వేలు, పి& టిల డిపాజిట్లు మొదలైనవి.

పట్టిక. 13 కేంద్ర ప్రభుత్వ ఋణం గురించిన వివరాలు ఇవ్వబడ్డాయి. ఈ పట్టికలో దేశీయ ఋణం (Internal Debt) లో ఇతర అప్పులు (Other Liabilities) కలిపిన సమాచారం యివ్వడం జరిగింది. ఈ రెండు కలిపి 1950-51 లో రు. 2,830 కోట్ల గాను, 90-91 లో రు. 2,83,033 కోట్లుగాను

పట్టిక 13. కేంద్ర ప్రభుత్వ ఋణం, 1950-51 నుండి 2002-03

సం॥లు	దేశీయ ఋణం ఇతర అప్పులు	విదేశీ ఋణం	మొత్తం ఋణం
1950-51	2830 (99)	30 (1)	2860 (100)
1980-81	47407 (81)	11316 (19)	58723 (100)
1990-91	283033 (90)	31525 (10)	314558 (100)
1994-95	483540 (91)	49510 (9)	533050 (100)
1995-96	554984 (92)	51249 (8)	606233 (100)
1996-97	621438 (92)	54238 (8)	675675 (100)
1997-98	722962 (93)	55332 (7)	778294 (100)
1998-99	819966 (94)	55960 (6)	8759256 (100)
1999-2000	934130 (94)	56130 (6)	990260 (100)
2002-03	15,04,220 (96)	57650 (4)	15,61,570 (100)

మూలం : Economic Survey, 2003-04.

పట్టిక. 14 స్థూల దేశీయోత్పత్తిలో ఋణ శాతం (Debt - GDP Ratio)

సం॥లు	దేశీయ ఋణం	విదేశీ ఋణం	మొత్తం ఋణం
1990-91	52.9	5.9	58.7
1995-96	47.0	4.3	51.3
1996-97	45.6	4.0	49.6
1997-98	47.7	3.7	51.4
1998-99	46.5	3.2	49.7
1999-2000	47.9	2.9	50.8
2001-02	58.0	3.0	610
2002-03	61.0	2.8	63.8

మూలం : RBI Bulletins & Dutt & Sundaram, Indian Economy 2004.

1998-99 నాటికి రు. 9,34,130 కోట్లుగాను, మరియు 2002-03 కి రు. 15,04,220 కోట్లుగాను పెరిగింది. అంటే దేశీయ ఋణం భారతదేశంలో (కేంద్ర ప్రభుత్వం) 531 రెట్లు పెరిగింది. 1950-51 నుండి 2002-03 కాలంలో మొత్తం ఋణంలో దేశీయ ఋణం 81 శాతం నుండి 99 శాతం వరకు వుంది. అయితే విదేశీ ఋణం 1950-51 లో కేవలం 30 కోట్లుంటే, 1990-91 లో రు. 31525 కోట్లకి పెరిగి, ఆ తర్వాత సాపేక్షికంగా పడిపోయింది. అంటే నిరపేక్షికంగా 1990-91 లో మొత్తం అప్పులు విదేశీ ఋణం 10 శాతం వుండగా 2002-03 నాటికి 4 శాతానికి పడిపోయింది. విదేశీ ఋణంలో తగ్గుదల ఎంతైనా ముదావహం. ఎందుకంటే విదేశీయుల మీద ఆధార పడడంవల్ల దేశానికి భవిష్యత్‌లో లాభం కన్నా నష్టమే ఎక్కువ జరుగుతుంది. దేశీయ ఋణంలో ఇతర అప్పులు కూడా మొత్తం ఋణంలో అధిక శాతాన్ని కలిగి వున్నాయి. అంటే దేశీయ ఋణం, ఇతర అప్పులు సుమారుగా 60:40 నిష్పత్తిలో వుంటాయి. యింకొక విషయం ఏమిటంటే పైన వివరించిన విషయాలలో భారతదేశం నుండి పాకిస్థాన్ విడిపోకముందు బ్రిటిష్ ప్రభుత్వం చేసిన అప్పులో పాకిస్థాన్ వాటా క్రింద రు. 300 కోట్లని భారతదేశానికి ఇవ్వవలసి వుండగా, ఆ డబ్బు కలపడం జరగలేదు.

భారతదేశం ముందుగా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికై ఋణాలను సేకరించడం జరిగింది. అయితే కాలం గడుస్తున్నకొద్దీ ఋణ భారం పెరిగింది. ఈ పెరిగిన ఋణాన్ని రెవెన్యూ వ్యయాన్ని భరించేటందుకు వాడడం జరుగుతోంది. ఇది విచారించదగ్గ అంశం. అప్పుల వల్ల దేశంలో ఉత్పాదకశక్తి పెరిగితే సమాజానికి లాభం చేకూరుతుంది. రెవెన్యూ వ్యయాన్ని భరించడంవల్ల సమాజంలో ప్రత్యేకంగా ఏ విధమైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగే అవకాశం లేదు. అంతే కాకుండా, ప్రభుత్వ వ్యయ విధానంలో కఠిన నియమాలు లేకపోవటం, అప్పులు విపరీతంగా పెరగడానికి బలమైన కారణం. వ్యయం పెరిగితే రెవెన్యూ లోటు మరియు కోశ లోటులు పెరగడం జరుగుతోంది. సామాజిక వ్యయం కూడా అవధులు దాటి పెరుగుతోంది. దీనికి తోడు పరిపాలనా యంత్రాంగ వ్యయం విపరీతంగా పెరగడం అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. పబ్లిక్ రంగ సంస్థలు దీర్ఘకాలంగా నష్టాల వూబిలో కూరుకుని పోవడం యింకొక కారణంగా చెప్పవచ్చు. లోటు బడ్జెట్ వల్ల ద్రవ్యోల్బణం పెరిగి అప్పులు చేయవలసిన అగత్యం ఏర్పడుతుంది. అప్పులు ఎప్పుడైతే పెరుగుతాయో, అప్పులు తీర్చడానికయ్యే వడ్డీ వ్యయం కూడా పెరుగుతుంది. ఈ వడ్డీల పరంగా చేసిన వ్యయం 1986-87 లో రు. 9250 కోట్లుండగా, 1990-91 లో రు. 21, 500 కోట్లకి పెరిగి 2003-04 బడ్జెట్‌లో రు. 1,23,220 కోట్లకి చేరుకుంది.

విదేశీ ఋణం పట్టికలో చూపిన విధంగా 1950-51 లో 1 శాతం వున్నది (మొత్తం ఋణంలో) 2002-03 నాటికి 4 శాతంగా పెరిగింది. విదేశీ ఋణంలో పెరుగుదల మన విదేశీ వ్యాపార చెల్లింపుల శేషాన్ని బట్టి నిర్ణయించడుతుంది. అంటే దిగుమతులు ఎగుమతుల కన్నా అధికంగా వున్నప్పుడు అప్పులు పెరిగే అవకాశం వుంది. విదేశీ ఋణంలో అధిక శాతం ఋణాలన్నీ అమెరికా ఇచ్చిన అప్పులే. ఈ ఋణాలు మొత్తం విదేశీ ఋణంలో 30 శాతం వుంటాయి. యింకొక విషయం ఏమిటంటే, విదేశీ ఋణాలన్నింటిని చారిత్రక విదేశీ మారక విలువ దగ్గర లెక్కకడతారు. అదే మార్కెట్టు విదేశీ మారక రేటు దగ్గర లెక్క కడితే పట్టికలో చూపించిన విదేశీ ఋణ మొత్తాలన్ని ఎన్నో రెట్లు అధికం అవుతాయి. ఉదా॥కి 2002-03 లోని విదేశీ ఋణం రు. 2,30,000 కోట్లు అవుతుంది.

కేంద్ర ప్రభుత్వం దేశీయంగా ఇతర అప్పులు చేస్తుందని అనుకున్నాం గదా. ఇవి ముఖ్యంగా చిన్న పొదుపు మొత్తాలు, భవిష్యనిధి, నిర్బంధ డిపాజిట్ పథకాలు, రైల్వేల యొక్క రిజర్వ్ నిధులు, ఆదాయపుపన్ను సాంవత్సరిక డిపాజిట్ పథకాలు, మొదలైనని వుంటాయి. వీటి ద్వారా ప్రభుత్వం అప్పులను సమకూర్చుకుంటుంది. దీనికి కారణం ప్రభుత్వం యొక్క వ్యయం పెరగడమే. ఆదాయపుపన్ను రాయితీల ద్వారా చట్టపరమైన విధి విధానాల ద్వారా ద్రవ్యాన్ని ప్రజల వద్దనుండి నిర్బంధంగా వసూలు చేసే ప్రక్రియే ఈ ఇతర అప్పులు.

ప్రభుత్వ ఋణం - స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి : (Debt GDP Ratio) ప్రభుత్వ ఋణ భారాన్ని రెండు పద్ధతుల ద్వారా కొలవవచ్చు. ఒకటి, ఋణ - GDP నిష్పత్తి. రెండవది, ప్రభుత్వ వ్యయంలో వడ్డీ చెల్లింపుల శాతం. కేంద్ర ప్రభుత్వ ఋణ తీరు తెన్నులు చూసినట్లైతే, ఋణ - GDP నిష్పత్తి 1990 దశకంలో తగ్గిందనే చెప్పవచ్చు. పట్టిక. 14 చూసినట్లైతే, మొత్తం ఋణం - GDP నిష్పత్తి 1990-91 లో 58.7 శాతం వుండగా, 1999-2000 నాటికి 50.8 శాతానికి తగ్గింది. దేశంలో ఋణ భారం తగ్గిందని చెప్పవచ్చు. అయితే విదేశీ ఋణం - GDP నిష్పత్తిలో తగ్గుదల ఎక్కువగా వుంది. ఉదా॥కి 1990-91 లో ఈ నిష్పత్తి 5.9 శాతం వుండగా, 1999-

2000 కి 2.9 శాతానికి తగ్గింది. యిదే రీతిలో కాకపోయినా, దేశీయ ఋణం 1990-91 లో 52.9 శాతం వుండగా, 1999-2000 కి 47.9 శాతానికి తగ్గింది. దీన్నిబట్టి తెలిసిందేమిటంటే 90 దశాబ్దంలో ఋణభారం తగ్గింది. పట్టిక. 14 లో చూడగలరు.

2000 దశాబ్దం మొదటి రెండు సంవత్సరాలలో ఋణ భారం పెరిగింది.. ఉదా॥కి 2001-02 లో మొత్తం ఋణం - GDP నిష్పత్తి చూస్తే 61 శాతానికి 2002-03 లో 63.8 శాతానికి పెరిగింది. దీంట్లో అధిక భాగం అంతా కూడా దేశీయ ఋణ పెరుగుదలే. 2001-02 లో దేశీయ ఋణంలో పెరుగుదల 58 శాతంగాను, 2003-03లో 61 శాతంగాను పెరిగింది. అయితే విదేశీ ఋణం 2001-02 లో 3 శాతంగాను, 2002-03 లో 2.8 శాతం గాను మార్పు చెందింది. అంటే 1999-2000 సం॥ నుండి విదేశీ ఋణం -GDP నిష్పత్తి ఇంచుమించు స్థిరంగా వుందని చెప్పవచ్చు. అయితే భారతదేశ ఆర్థిక పరిశోధనా సంస్థల ప్రకారం స్థూల దేశీయోత్పత్తిలో 2002-03 లో ఋణ భారం 61 శాతంగా వుందంటే అది ఆందోళ కలిగించే విషయం గాదు. అది మోయలేని భారం కూడా కాదు. కొన్ని ఇతర దేశాల్లో ఇది 100 శాతం కన్నా ఎక్కువగా వున్న దాఖాలాలు వున్నాయి. ఉదా॥కి అమెరికాలో ప్రభుత్వరుణం వారి స్థూల దేశీయోత్పత్తిలో 150 శాతం వుంది. U.K లో ఇది 300 శాతం వుందని అంచనా. వీటిలో పోలిస్తే, భారతదేశ ఋణ భారం గురించి పెద్దగా ఆందోళన చెందవలసిన పనిలేదు.

వడ్డీ చెల్లింపులు - ప్రభుత్వ వ్యయ నిష్పత్తి :

ఋణ భారాన్ని లెక్కించడానికి ఉపకరించే యింకొక సాధనం వడ్డీ చెల్లింపులు - ప్రభుత్వ వ్యయ నిష్పత్తి. అనగా ప్రభుత్వ వ్యయం ఎంత శాతం మేర వడ్డీ చెల్లింపులకై ఉపయోగించబడుతోందో తెలియజేస్తుంది. ప్రభుత్వ వ్యయంలో వడ్డీ చెల్లింపుల శాతం కాలం గడుస్తున్న కొద్ది పెరుగుతోంది. ఎందుకంటే అప్పులు వేగంగా పెరుగుతున్నాయి కాబట్టి. వడ్డీ - వ్యయ నిష్పత్తి 1950-51 లో 9 శాతం వుండగా 1987-88 నాటికి 24.50 శాతానికి పెరిగింది. 1950-51 లో వడ్డీ చెల్లింపులు రు. 32.40 కోట్లుండగా వ్యయం రు. 346 కోట్లుగా వుంది. 1987-88 లో వడ్డీ రు. 11251 కోట్లుండగా వ్యయం రు. 46174 కోట్లుగా వుంది. 1990-91 నాటికి ఈ నిష్పత్తి 29 శాతానికి పెరిగింది. అంటే వడ్డి రు. 20850 కోట్లుగాను, వ్యయం రు. 71129 కోట్లుగాను వున్నాయి. 2002-03 లో వడ్డీ రు. 115660 కోట్లుంటే 2003-04 లో వడ్డీ రు. 1,23,220 కోట్లుగా వుంది. వ్యయంలో వడ్డీ శాతం 2002-03 లో 28 శాతం మరియు 2003-04 లో 26 శాతంగా వుంది. ఋణ భారం పెరిగిందని చెప్పవచ్చు. వడ్డీ చెల్లింపులకై చేసిన వ్యయం అంతా అభివృద్ధేతర వ్యయం క్రిందకి వస్తుంది. అందుచే ఋణ భారం నిరంతరం పెరిగే సూచనలున్నాయి.

రాష్ట్రాల ఋణ పరిస్థితి :

రాష్ట్రాల కోశ పనితీరు (Fiscal Performance) 1980 దశాబ్దపు మధ్య భాగం నుండి క్షీణిస్తూ వస్తోంది. ఈ విషయం రాష్ట్రాల కోశ లోటు, రెవెన్యూ లోటు, మరియు ఋణ - నిష్పత్తి ద్వారా తెలుస్తోంది. రాష్ట్రాల ఋణ పరిస్థితిపై 1990 దశాబ్దపు మధ్యస్థం నుండి గొప్పగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీనికి కారణం ఋణ - నిష్పత్తి నిరంతరం పెరగడమే. ఈ ఋణ - నిష్పత్తి పెరిగి పెరిగి 28.1 శాతానికి చేరుకుంది. 2002-03 సం॥లో. నిరపేక్షంగా చూసినట్లైతే, రాష్ట్రాల ఋణం 1990-91 లో రు. 1,10,289 కోట్లనుండి 2002-03 లో రు. 6,83,170 కోట్లకి పెరిగింది. అంటే 5 రెట్లు పెరిగింది. అయితే ఋణాల పరంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు (guarantees) తీసుకుంటే, ఋణ భారం యింకా ఎన్నో రెట్లు పెరుగుతుంది. రాష్ట్రస్థాయిలో ఋణ భారం పెరిగితే అది భారతదేశ సార్వభౌమాధికారానికి దెబ్బ తగులుతుంది. ముఖ్యంగా క్రెడిట్ రేటింగ్ సంస్థలో భారతదేశానికి తక్కువ క్రెడిట్ రేటింగ్ యిచ్చే అవకాశం వుంది. దీంతో అప్పులు పుట్టే అవకాశం తగ్గి ఆర్థికాభివృద్ధి మందగించే ప్రమాదం లేకపోలేదు.

రాష్ట్రాలలో మొదటిసారిగా 1987-88 లో రెవెన్యూ పద్దులో లోటు ఏర్పడింది. అంతక్రితం వరకు మిగులు బడ్జెట్టే వుండేది. దీంతో స్థూలకోశ లోటు (Gross Fiscal Deficit) 1980వ దశకం మొదటి అర్థభాగంలో, స్థూల దేశీయోత్పత్తిలో సగటున 2.8 శాతం వుండగా, 1986-87 లో 3 శాతం గాను, 1990-91 లో 3.3 శాతం గాను పెరిగింది. ఈ కాలం తర్వాత కొద్దికాలం ఆర్థికవ్యవస్థలు (రాష్ట్రాల) పటిష్టపడి GFD/GDP (స్థూల కోశ లోటు + స్థూల దేశీయోత్పత్తి) నిష్పత్తి 2.4 శాతానికి తగ్గింది, 1993-94 లో వేతన సవరణలు అటు

తర్వాత జరగడంతోనే GFD పెరగనారంభించింది. ఉదా॥కి 1997-98 లో 2.9, శాతానికి 1998-99 లో 4.3 శాతానికి మరియు 1999-2000 నాటికి 4.7 శాతం గాను పెరిగింది. పట్టిక. 12 కేంద్ర, రాష్ట్ర కోశ సూచికలు చూపబడ్డాయి. GFD/GDP నిష్పత్తి 2000-01 లో 4.3 శాతానికి తగ్గి, 2002-03 కి మరల 4.7 శాతానికి పెరిగి 2003-04 నాటికి 4 శాతానికి తగ్గింది. 11 వ విత్త సంఘ అంచనా ప్రకారం రాష్ట్రాల కోశ లోటు 2.5 శాతానికి తగ్గింది.

రాష్ట్రాల ఋణాన్ని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: (i) అంతర్గత ఋణం (ii) కేంద్రంనుండి అప్పులు మరియు అడ్వాన్స్‌లు ; మరియు (iii) భవిష్యనిధి.

(i) అంతర్గత ఋణం :

రాష్ట్రాల అంతర్గత ఋణంలో (i) మార్కెట్టు అప్పులు మరియు బాండ్స్ (ii) రిజర్వ్ బ్యాంక్ నుండి 7 రోజులలో తరుణోపాయ అడ్వాన్స్‌లు (Ways & Means Advances, WMA) (iii) బ్యాంకుల నుండి ఋణాలు మరియు ఇతర సంస్థల నుండి అప్పులు. ఇక్కడ ఇతర సంస్థలు అంటే NABARD, ESIC, మొదలైనవి. అంతేకాకుండా, NSSF (National Small Savings Fund) సంస్థకి సెక్యూరిటీస్‌ని విడుదల చేయడం ద్వారా అప్పుని పొందుతాయి రాష్ట్రాలు. ఈ NSSF ఋణాలను 1999-2000 సం॥కి ముందు కేంద్ర అప్పుల క్రింద పరిగణించేవారు. 1999-2000 నుండి రాష్ట్రాల అంతర్గత అప్పుగా చూడబడుతున్నాయి. WMA (Ways & Means Advances) మరియు OD (Over Drafts) లను తాత్కాలిక ద్రవ్య అవసరాలను (Mismatches) అధిగమించడానికి ఉపయోగపడిననూ, ఇవి (WMAs &ODs) క్రమంగాను, నిరంతరంగాను అందుతుండడం చేత వీటిని రెగ్యులర్‌గా అందే విత్తం క్రింద స్వల్పకాల అప్పులైన WMA, రిజర్వునిధులు మరియు డిపోజిట్లను విత్త సంఘం (Finance Commission) పరిగణనలోకి తీసుకోదు. తర్వాత, WMA రిజర్వుబ్యాంక్ నిర్ణయించిన బ్యాంకు రేటు దగ్గర లభ్యమవుతుండగా, OD బ్యాంక్ రేటు + 3 శాతం రేటుకి లభిస్తుంది. ఒక పరిమితి దాటితే, OD బ్యాంక్ రేటు + 6 శాతంకి దొరుకుతుంది.

(ii) కేంద్ర ప్రభుత్వంనుండి అప్పులు మరెయు అడ్వాన్స్‌లు :

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ప్రణాళిక మరియు ప్రణాళికేతర అవసరాలకు ఋణాన్ని మంజూరు చేస్తుంది. ఈ అప్పులు ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. ప్రణాళికా అప్పుల క్రింద కేంద్ర ప్రభుత్వ పథకాలకి (Centrally Sponsored Schemes) లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు డైరక్టుగా విదేశాలనుండి ఋణాలను పొందే అవకాశం లేదు. అయితే విదేశీ ప్రభుత్వాల నుండి మరియు విదేశీ విత్త సంస్థలనుండి ఋణాలు కేంద్రం ద్వారా రాష్ట్రాలకు అందుతుంది. దీనిని కూడా ప్రణాళికా పథకాలకే అందజేయబడుతుంది. ఈ ఋణాన్ని "అదనపు కేంద్ర సహాయం" (Additional Central Assistance, ACA). అంటారు. దీనిని ఋణ నిబంధనలను పునఃనిర్వచించి యివ్వడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వంనుండి అందిన ఋణం మొత్తం 2001-02 లో రు. 2,33,688 కోట్లు. ఇది రాష్ట్రాల మొత్తం ఋణంలో 39.6 శాతం కేంద్రంయొక్క ఋణాలపై, ప్రణాళికా మరియు ప్రణాళికేతర, వడ్డీ 1984-85 లో 7.5 శాతం వుంటే 1995-98 కాలంలో 13 శాతానికి పెరిగింది. 1998 లో 12.5 శాతానికి ప్రస్తుతం 10.5 శాతానికి తగ్గించబడింది.

చిన్న పొదుపు మొత్తాలనుండి అంటే కిసాన్ వికాస్ పత్రం, జాతీయ పొదుపు పత్రాలు (NSCs) నుండి రాష్ట్రాల ఋణం (as Securities to NSSF) 1999-2000 లో రు. 26416 కోట్లుండగా 2000-01 లో రు. 59022 కోట్లకి అంటే రెట్టింపు అయ్యింది. NSSF (National Small Saving Fund) నుండి రాష్ట్రాలకు అందిన అప్పు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కనబడదు. అయితే కేంద్రమే NSC డిపాజిట్‌దార్లకు డబ్బుని చెల్లించే విషయంలో జవాబుదారిగా వుంటుంది. ఈ అప్పులమీద చార్జ్ చేసే వడ్డీ ఎక్కువగా వుంటుంది. అంటే 1998-99 లో 14 శాతం వుండగా ప్రస్తుతం 9.5 శాతంగా మారింది.

రాష్ట్రాలకు బ్యాంకులనుండి విత్త సంస్థలనుండి అందిన ఋణం 10 రెట్లు పెరిగింది. 1991 నుండి 2001 వరకు. 1991 లో రు. 2,906 కోట్లుంటే 2001 లో రు. 32335 కోట్లకి పెరిగింది. ఈ ఋణాన్ని అందజేసిన వాళ్ళలో LIC, GIC, NABARD, REC,

IDBI, HUDCO మొదలైన సంస్థలున్నాయి. ఈ ఋణాలు, ముఖ్యంగా గృహ నిర్మాణం, గ్రామీణ రోడ్లు, పారిశుధ్యం, విద్యుచ్ఛక్తి, రవాణా మొదలైన ప్రత్యేక ప్రాజెక్టులకు ఇవ్వబడుతుంది. ఈ ఋణాలపై వడ్డీ 5. ఈ అప్పుని చేయాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం. అందుచేత ఈ ఋణాలను కేంద్రం నియంత్రిస్తుంది. మార్చి 2001 నాటికి ఈ అప్పులు మొత్తం అప్పుల్లో 6.5 శాతం వున్నాయి.

(iii) పబ్లిక్ పద్దు అప్పులు (Public Account Liabilities) :

ఈ పబ్లిక్ పద్దు అప్పుల క్రింద ప్రభుత్వమే ఒక బ్యాంకర్‌గా పని చేసి డిపాజిట్లను ఆహ్వానిస్తుంది. వాటిపై వడ్డీని కూడా డిపాజిట్‌దార్లకు ఇస్తుంది. ఈ పద్దులో, భవిష్యనిధి మరియు చిన్న పొదుపు పథకాలు ఉంటాయి. ఇవి రాష్ట్రప్రభుత్వం యొక్క పబ్లిక్ పద్దు అప్పులక్రింద వుంటాయి. 1990 దశాబ్దంలో ముఖ్యంగా చివరలో భవిష్యనిధి వేగంగా పెరిగింది. దీనికి కారణం వేతన సవరణలే. పెరిగిన వేతనం కొంత భాగాన్ని భవిష్యనిధిలో నిర్బంధంగా డిపాజిట్ చేసిన కారణంగా భవిష్యనిధి బాగా పెరిగింది. భవిష్యనిధి రూపంలో రాష్ట్రాల ఋణం మొత్తం ఋణంలో 17.5 శాతం వుంది, మార్చి, 2002 నాటికి రాష్ట్రాలు వసూలు చేస్తున్న చిన్న పొదుపు మొత్తాల మీద సగటు వడ్డీ 10.5 శాతం.

పైన వివరించిన అన్నింటిలోకి మార్కెట్టు అప్పులు బాగా చవక. అంటే రాష్ట్రాలు చౌకగా పొందే ఋణం మార్కెట్టు అప్పులే. ఎందుకంటే యిటీవలి కాలంలో మార్కెట్టు అప్పులపై వడ్డీ రేటు గణనీయంగా పడిపోయింది. ఉదా॥కి 1995-96 లో వడ్డీ రేటు 14.0 శాతం వుండగా, మార్చ్ 2003 నాటికి 6.2 శాతానికి పడిపోయింది. అందుచేత, మొత్తం అప్పుల్లో, రాష్ట్రాల మార్కెట్టు అప్పులు మార్చి 1991 లో 14.2 శాతం వుంటే మార్చి 2003 నాటికి 17.2 శాతానికి పెరిగింది.

పట్టిక. 15 లో రాష్ట్రాల ఋణ పరిస్థితి చూపబడింది. రాష్ట్రాల మొత్తం అప్పు రు. 110289 కోట్ల నుండి (1990-91) రు. 683170 కోట్లకి (2002-03) పెరిగింది. అంటే 6 రెట్లు పెరిగింది. 1990-91 నుండి 2000-01 వరకు అంతర్గత ఋణం కేంద్రం ఇచ్చిన అప్పులతో పోలిస్తే తక్కువగా వుంది. అంతర్గత ఋణం 1990-91 లో మొత్తం అప్పులో 16.8 శాతం వుంటే 2000-01 నాటికి 35.5 శాతానికి పెరిగింది. కేంద్రం ఇచ్చిన అప్పులు 1990-91 లో 67.2 శాతం వుంటే 2000-01 కి 45.1 శాతంగా తగ్గినవి. 2001-02 మరియు 2002-03 లో అంతర్గత ఋణం కేంద్రం ఇచ్చిన అప్పులని అధిగమించింది. దీనికి కారణం మార్కెట్టు అప్పులు చవుకగా దొరకడమే. అంతేకాకుండా, విత్త సంఘాలు కూడా రాష్ట్రాలకు కేంద్రం ఋణాలను తగ్గించాలని సూచించాయి, తర్వాత, చిన్న పొదుపు మొత్తాలు మరియు భవిష్యనిధి సంబంధించిన అప్పులు 1990-91 లో మొత్తం అప్పులో 15 శాతం వుంటే 2002-03 లో 17 శాతానికి పెరిగేయి.

సగటు సాంవత్సరిక వృద్ధిరేటు, రాష్ట్రాల ఋణం పరంగా, 1980 మరియు 1990 దశాబ్దాలలో ఒకే మాదిరిగా 16.4 శాతంగా వుంది. అంటే 1990 దశకం మొదటి అర్ధభాగంలో వృద్ధిరేటు 14.4 శాతం వుంటే, 1990 దశకం రెండవ అర్ధభాగంలో 18.8 శాతంగా వుంది.

రాష్ట్రాల పెరుగుతున్న అప్పుల భారాన్ని సరియైన విత్త పద్ధతుల ద్వారా నియంత్రించవలసిన అవసరాన్ని గురించి విత్త సంఘాలు పదేపదే వివరించాయి. ఋణ భారాన్ని రాష్ట్రప్రభుత్వాలు వారియొక్క విత్త పరిస్థితిని మెరుగుపరచుకొనే దిశగా ప్రయత్నించాలి. అంటే అదనపు రెవెన్యూ సేకరణ, వ్యయాన్ని కుదించడం, మరియు పునఃప్రాధాన్యతీకరణ చేయడం మొదలైనవి ఆచరించాలి. ఇందుకై రెవెన్యూ విషయాలలో సంతులిత సాధించేందుకు తగిన కోశ సవరణలు (fiscal reforms) చేపట్టాలి. అప్పులకు రైటాఫ్ (Write - off) చేయడం అంటే కొట్టివేయడం, లేదా నైవ్ అనగా అప్పు చెల్లించనక్కర లేని వెసులుబాటు మొదలైనవి దీర్ఘకాలంలో నివారణోపాయాలుగా పనికిరావు. ఉదా॥కి 11 వ విత్త సంఘం రు. 340 కోట్ల మేర రాష్ట్రాల రుణాన్ని రైటాఫ్ చేయడం జరిగింది. ఇటువంటి రిలీఫ్ ఇచ్చేముందర వ్యయ తగ్గింపు విషయంగా మరియు రెవెన్యూ పెంచుకునే దిశగా సరియైన ప్రోత్సాహకాలను కేంద్రప్రభుత్వం ప్రకటించితే రాష్ట్రాలు వారి విత్త పరిస్థితిని మెరుగుపరచుకుంటాయి.

పట్టిక 15 : రాష్ట్రాల ఋణ పరిస్థితి, 90-91 నుండి 02-03 వరకు రు. కోట్లలో.

సం॥లు	అంతర్గత ఋణం	కేంద్రం నుండి అప్పులు, అడ్వాన్స్‌లు	చిన్న పొదుపు మొత్తాలు, భవిష్యనిధి	మొత్తం ఋణం
1990-91	18524 (16.8)	74117 (67.2)	16961 (15.4)	110289
1995-96	43246 (20.4)	131505 (62.0)	37502 (17.7)	212225
1996-97	50961 (21)	149053 (61.2)	42878 (17.6)	243525
1997-98	60663 (21.6)	172729 (61.4)	49103 (17.5)	281207
1998-99	74176 (21.7)	203786 (59.6)	61072 (17.9)	341978
1999-2000	119495 (28.5)	216194 (51.5)	78949 (18.8)	420132
2000-01	176723 (35.5)	224590 (45.1)	92056 (18.5)	498092
2001-02	241301 (41.1)	235564 (40.2)	102242 (17.4)	586687
2002-03	309610 (45.32)	258130 (37.78)	115430 (16.90)	683170

మూలం : EPW, J une 19 & June 26, 2004 f. 2727.

14.6.4 భారతదేశ లోటు విత్త విధానం (Deficit Financing in India) :

కేంద్ర ప్రభుత్వం లోటు విత్త విధానాన్ని ఒక ముఖ్యమైన కోశ సాధనంగా ఎంతో కాలంగా ఉపయోగిస్తోంది. ప్రభుత్వం తన యొక్క రెవెన్యూ ఆనగా పన్నులమండి పన్నేతర వనరులనుండి, అప్పుల ద్వారాను సమీకరించే సాధారణ రెవెన్యూ కంటే వ్యయావసరాలు ఎక్కువగా వున్నపుడు లోటు విత్త విధానాన్ని వాడుకుని రెవెన్యూ వ్యయాల మధ్యనున్న తేడాని పూరించే ప్రయత్నం చేస్తుంది. సూక్ష్మంగా చెప్పాలంటే ప్రభుత్వ ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా వున్నపుడు ఆ తేడాని క్రొత్తగా ద్రవ్యాన్ని తయారు చేయడం ద్వారా (Creation of New Money) అనగా క్రొత్తగా ద్రవ్యాన్ని మింటింగ్ (Minting) చేయడం ద్వారా పూరిస్తుంది. ప్రస్తుత ఆదాయాన్ని మించి ప్రభుత్వం వ్యయం చేయవలసివస్తే దానిని లోటు విత్త విధానం అని అంటారు. ఎందుకంటే ప్రభుత్వం వ్యయాన్ని తప్పనిసరిగా చేయవలసి వుంది. ఆదాయం తక్కువగా వుంది గదాని వ్యయం మానివేయడం కుదరదు. అది ప్రభుత్వ విత్త విధానానికే విరుద్ధం, అందుచేత ఆదాయ వ్యయాల మధ్యన వున్న తేడాని లోటు విత్త విధానం ద్వారా పూరించవలసి వుంటుంది.

భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో లోటు విత్త విధానం ముఖ్యంగా కేంద్ర బ్యాంకు (RBI) దగ్గరనుండి ఋణాన్ని పొందడం ద్వారా చేపట్టబడుతుంది. అంటే కేంద్రప్రభుత్వం రిజర్వు బ్యాంకు వద్దనుండి ఋణాన్ని సేకరించి తద్వారా ఆదాయ వ్యయాల్లో వున్న తేడాని పూరిస్తుంది. అయితే RBI పూరకనే ఋణాన్ని ప్రభుత్వానికి మంజూరు చేయదు. అందుచేత ప్రభుత్వం తన సెక్యూరిటీస్, అనగా ట్రెజరి బిల్లులను RBI దగ్గర మదుపు పెట్టిన వెంటనే వాటి ఆధారంగా RBI పేపరు కరెన్సీని క్రొత్తగా మింటింగ్ అంటే ప్రింటింగ్ చేయడం విడుదల చేస్తుంది. దీనితో దేశంలో ద్రవ్య సప్లై పెరుగుతుంది. అప్పుడు ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడతాయి. ప్రభుత్వం ఈ విధంగా విడుదల చేసిన కరెన్సీని ఉపయోగించి ఆదాయం కన్నా అధికంగా ఉన్న వ్యయాన్ని భరిస్తుంది. ప్రణాళికా సంఘం లోటు విత్త విధానాన్ని ఏట్లా నిర్వచించిందంటే, " లోటు బడ్జెట్ (Budget Deficit) వల్ల స్థూల జాతీయ వ్యయానికి(Gross National Expenditure) డైరెక్టుగా వచ్చి చేరిన దానినే లోటు విత్త విధానమని అనడం జరిగింది. ఈ బడ్జెట్ లోటు రెవెన్యూ పద్దు (Revenve Receipts) లో గాని లేక మూలధన పద్దు (Capital Receipts) లో గాని వున్నప్పటికి దానిని పూరించే పద్ధతినే లోటు విత్త విధానమని

అంటారు. ప్రభుత్వం తను సమీకరించే పన్నులు, ప్రభుత్వ పారిశ్రామిక సంస్థల రాబడి, ప్రజల వద్దనుండి ఋణాలు, డిపాజిట్లు, నిధులు, మరియు ఇతరత్రా వచ్చే రాబడుల మొత్తం కంటే ప్రభుత్వం వ్యయం ఎక్కువగా చేసే విధానాన్ని లోటు విత్త విధానం అని అంటారు. ప్రభుత్వం ఈ లోటును ఆదివరకే కూడ బెట్టిన ద్రవ్య నిల్వలనుండి ద్రవ్యాన్ని వెనక్కి తీసుకోవడం ద్వారా (Running Down accumulated balances) గాని లేదా బ్యాంకింగ్ వ్యవస్థనుండి ఋణాలు గ్రహించడం ద్వారా గాని అంటే ఇందాక అన్నట్లుగా క్రొత్తగా కరెన్సీని మింటింగ్ చేయడం ద్వారా కాని పూరిస్తుంది" అని ప్రణాళికా సంఘం లోటు విత్త విధానాన్ని వివరించింది. రెవెన్యూ రాబడి అంటే పన్ను ఆదాయం, మరియు పన్నేతర ఆదాయం మూలధన రాబడి అనగా ప్రజలనుండి అప్పులు, భవిష్య నిధి, విదేశీ ఋణాలు, చిన్న పొదుపు మొత్తాలు మొదలైనవి. రెవెన్యూ పద్దు (Revenue Account) లో లోటు గాని మిగులు గాని మరియు మూలధన పద్దు (Capital Account) లో లోటు గాని మిగులు గాని వున్నప్పుడు, ఆ రెండింటి యొక్క మొత్తాన్ని (Aggregate) తీసుకున్నప్పుడు ఏర్పడే లోటుని బడ్జెట్ లోటు (Budget Deficit or Budgetary Deficit) అని పిలుస్తారు. ఈ లోటు బడ్జెట్‌ని పూరించేదే లోటు విత్త విధానమని పిలుస్తారు.

విదేశాలలో లోటు విత్త విధానాన్ని పబ్లిక్ నుండి ఋణాల ద్వారాను మరియు కమర్షియల్ బ్యాంకుల నుండి ఋణాల ద్వారాను మరియు రాష్ట్రీయ వ్యాపార సంస్థల రాబడుల ద్వారాను అమలు జరపడం జరుగుతోంది. ముఖ్యంగా అమెరికాలలో పబ్లిక్ ఋణాల ద్వారా లోటు విత్త విధానాన్ని ఉపయోగించడం జరుగుతోంది. భారతదేశంలో బడ్జెట్ లోటుని పబ్లిక్ ఋణాల ద్వారా భర్తీచేయడం జరగదు. ఎందుకంటే మన ప్రభుత్వం పబ్లిక్ ఋణాలను మూలధన పద్దులో రాబడిగా అంటే ఆదాయంగా చూపెడుతోంది కాబట్టి. అందుచేత మనం బడ్జెట్ లోటుని క్రొత్త కరెన్సీని విడుదల చేయడం ద్వారాను మరియు అదివరకే పోగుపడిన ద్రవ్యనిల్వలనుండి విత్‌డ్రా చేయడం ద్వారాను పూరించబడుతోంది. కాబట్టి లోటు విత్త విధానంలో ఏం చెప్పబడుతుందంటే బడ్జెట్ లోటుని ఏ మార్గాల ద్వారా భర్తీ చేస్తామో వాటి గురించి తెలియజేస్తుంది. అంతేకాకుండా, లోటు విత్త విధానం ద్వారా ద్రవ్య సప్లై పెరిగి ప్రజల దగ్గర వున్న లిక్విడ్ ఆస్తులపై (Liquid assets) పై ప్రభావాన్ని చూపుతుంది. అంటే ద్రవ్య సప్లై పెరగడం వల్ల ధరలు పెరిగి ప్రజల దగ్గర వున్న ఆస్తుల విలువ తగ్గిపోతుంది (Real Balance Effect of Don Patinkin). అంటే ఆర్థిక వ్యవస్థ పై ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ కారణాల చేతనే లోటు విత్త విధానం ఒక కోశ సాధనంగా వాడబడుతోంది. దీనివల్ల లోటు విత్త విధానానికి మరియు బడ్జెటరీ లోటుకి మధ్యన తేడాని గ్రహించగలరు. అంటే లోటు విత్త విధానం అనే విషయం చాలా విశాలమైనది ఎందుకంటే ఎన్నో అంశాలు దాంట్లో కూడుకుని వున్నాయి. అయితే బడ్జెట్ లోటు విత్త విధానంలో ఒక భాగం మాత్రమే. ఈ లోటు విత్త విధానాన్ని కేన్స్ (J.M.Keynes) సమర్థించడం జరిగింది. ముఖ్యంగా ఆర్థిక మాంద్య లక్షణాలు తొలగించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఉపకరించే సాధనంగా ఆయన అభివర్ణించాడు.

లోటు విత్త విధాన పోకడలు :

పట్టిక. 16 లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లలో లోటు ఎట్లా మార్పు చెందింది, 1990-91 నుండి 2004-05 కాలంలో, ఆనే సమాచారం యివ్వడం జరిగింది. ఈ పట్టికలో మూడు రకాల "లోటు" లను వివరించడం జరిగింది. అవి (i) రెవెన్యూలోటు, (ii) కోశ లోటు, మరియు (iii) ప్రాధమిక లోటు. వీటి గురించి తెలుసుకుందాము.

(i) రెవెన్యూ లోటు : రెవెన్యూ రాబడి (Revenue Receipts) కంటే రెవెన్యూ వ్యయం (Revenue Expenditure) ఎక్కువగా వుంటే దానిని అంటే ఆ రెండింటి మధ్య వున్న తేడా (Gap) ని రెవెన్యూ లోటు (Revenue Deficit) అని అంటారు. రెవెన్యూ రాబడి అంటే పన్ను ఆదాయం మరియు పన్నేతర ఆదాయం. రెవెన్యూ వ్యయం అనగా ప్రణాళికా మరియు ప్రణాళికేతర వ్యయం. ఈ వ్యయాన్ని పన్ను మరియు పన్నేతర ఆదాయంతో భరిస్తారు. అందుచేత,

రెవెన్యూ లోటు = రెవెన్యూ వ్యయం - రెవెన్యూ రాబడి.

పట్టిక. 16 లో చూసినట్టైతే, రెవెన్యూ లోటు 1990-91 నుండి 2002-03 వరకు వేగంగా పెరిగింది. ఉదా॥ కి 1990-91 లో రు. 18,560 కోట్లనుండి 2002-03 కి రు. 1,07,880 కోట్లకి పెరిగింది. అనగా 6 రెట్లు పెరిగింది. 2003-04 (BE) దగ్గరనుండి

పడిపోవనారంభించింది. 2003-04 లో రు. 99,860 కోట్లుగా మారి 2004-05 (BE) లో రు. 76171 కోట్లకి యింకా పడిపోయింది.

స్థూల దేశీయోత్పత్తిలో రెవెన్యూలోటు,

పట్టిక.16 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లలో లోటు పరిస్థితి

(1990-91 నుండి 2004-05) రు. కోట్లలో

సం॥లు	రెవెన్యూ లోటు		కోశ లోటు		ప్రాథమిక లోటు	
	లోటు	%of GDP	లోటు	GDP లో%	లోటు	GDP లో%
1990-91	18560	3.2	44630	7.7	23,130	4.0
1994-95	31030	3.0	57700	5.6	13,640	1.3
1995-96	29730	2.4	60240	4.9	10,200	0.8
1997-98	46450	3.3	89940	6.3	23300	1.6
1999-2000	54150	3.0	7^950	4.4	(-)8050	(-)0.4
2002-03	107880	4.4	145072	5.9	27268	1.1
2003-04(RE)	99860	3.6	132103	4.8	7548	0.3
2004-05(BE)	76171	2.5	137407	4.4	7907	0.3

మూలం : GOI Budgets.

పట్టికలో చూసినట్లైన, 199-91 లో 3.2 శాతంగా వున్నది 1995-96లో 2.5 శాతానికి తగ్గి మరల 97-98లో పెరిగి 2002-03 నాటికి 4.4 శాతానికి పెరిగింది. అటుతర్వాత 2003-04 (RE) కి 3.6 గా తగ్గి, మరియు 2004-05 (BE) లో 2.5 గా తగ్గగలదని అంచనా వేయడం జరిగింది. 2003-04 నాటికి స్థూల దేశీయోత్పత్తిలో 3.6 శాతం వుందంటే అది ఎక్కువక్రిందే లెక్క. దీనికి కారణం ప్రణాళికేతర వ్యయం ఎక్కువగా పెరగడమే. దీనివల్ల వసూలయ్యే పన్నుల ఆదాయం సరిపోడం లేదు. అదికాకుండా పన్ను ఎగవేత, మరియు పన్నుకట్టకుండ మానివేయడం (Tax Avoidance) మొదలైన కారణాల వల్ల రెవెన్యూరాబడి తక్కువగా వుండడం కారణంగా చెప్పవచ్చు. రెవెన్యూ రాబడి మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో 2002-03 లో 20.9 శాతంగాను రెవెన్యూ వ్యయం 2.3 శాతంగాను వుంది. ఇది మొత్తం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి పరిస్థితి. ఒక్క కేంద్రం పరిస్థితి అంచనావేస్తే 2002-03 లో రెవెన్యూరాబడి 9 శాతంగాను, మరియు రెవెన్యూ వ్యయం 13.8 శాతంగాను వున్నాయి. వ్యయం బాగా పెరిగిపోయింది.

కోశ లోటు (Fiscal Deficit)

భారతదేశ లోటు విత్తవిధానంలో కేంద్రప్రభుత్వం చాలాకాలంగా మార్కెట్టు ఋణాలను, చిన్న పొదుపు మొత్తాలను, భవిష్యనిధి మొదలైన వాటిని మినహాయించింది. అనగా, వీటిని అంటే ఈ ఋణాలను కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో "మూలధనరాబడి " క్రింద ఎంతోకాలంగా పరిగణిస్తోంది. అందుచేత లోటు విత్తవిధానంలో ఈ ఋణాలు వుండవు. అదే అమెరికాలాంటి దేశాలలో మార్కెట్టు అప్పులను లోటువిత్తవిధానంలో భాగంగా చూస్తారని యిదివరకే తెలుసుకున్నాము. కాబట్టి భారతదేశంలో లోటును లెక్కలేసేటపుడు ఈ ఋణాలను మినహాయించడం వాడుకగా జరిగిపోతోంది.

ఈ విషయాన్ని పెద్ద తప్పుగా పరిగణించాడు B.R షినాయి అనే భారత ఆర్థిక శాస్త్రవేత్త, 1954-55లో. ప్రభుత్వం ఈ విషయాన్ని ప్రక్కన పెట్టింది. అయితే సుఖమయి చక్రవర్తి కమిటి యిదే విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. (Committee on the working of the Monetary System in India). దీంతో కేంద్ర ప్రభుత్వం మేలుకొని చేసిన తప్పిదాన్ని సరిదిద్దే ప్రయత్నంలో " కోశలోటు " (Fiscal Deficit) అనే కొత్త విషయాన్ని బడ్జెట్‌లో ప్రవేశపెట్టింది.

కోశలోటు అంటే బడ్జెటరీ లోటుకి మార్కెట్టు అప్పులు మరియు ప్రభుత్వంయొక్క ఇతర అప్పులను కలిపినట్లైతే దానినే 'కోశ లోటు' అని అంటారు. దీనిని ఈ క్రింది విధంగా వ్రాయవచ్చు.

కోశ లోటు = బడ్జెట్ లోటు + ప్రభుత్వం చేపిన మార్కెట్టు మరియు ఇతర బుణాలు.

బడ్జెట్ లోటు = {(రెవెన్యూ రాబడి + మూలధనరాబడి) - (రెవెన్యూవ్యయం + మూలధనవ్యయం)}

బడ్జెట్‌లోటు = మొత్తం వ్యయం - మొత్తం రాబడి.

బడ్జెట్‌లోటు (Budgetary Deficit) పరిగణనలోకి తీసుకునే విధానానికి 1997-98 బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం స్వస్తి పలికింది. ఆనాటినుండి కోశ లోటు బాగా వాడుకలోకి వచ్చింది. పట్టిక 16 చూసినట్లైతే కోశ లోటు వేగంగా పెరగడాన్ని చూస్తాము. 1990-91లో రు. 44630 కోట్లుంటే 2002-03 నాటికి రు. 1,45,072 కోట్లకి పెరిగి అటుతర్వాత తగ్గి రు. 132103 కోట్లకి చేరుకుంది. 2004-05 (BE) అంచనాలలో కోశలోటు రు. 1,37,407 గా మారింది. స్థూల దేశీయోత్పత్తిలో కోశలోటు శాతాన్ని పట్టికలో చూసినట్లైతే 1990-91లో 7.7 శాతం అంటే అత్యంత అధికంగా వుంది. దీంతో అంతర్జాతీయ ద్రవ్య సంస్థలైన ప్రపంచబ్యాంక్, IMF లు ఆందోళన వ్యక్తం చేసి ఈ శాతాన్ని రాగలకాలంలో 5 శాతానికి కనీసం తగ్గించాలని కేంద్రప్రభుత్వంమీద వత్తిడి తీసుకువచ్చాయి. యిదేకాకుండా, సరళీకృత ఆర్థిక విధానాలు అమలుచేసిన కారణంగా కోశలోటు 1994-95 లో 5.6 కి తగ్గింది. 1995-96 లో 4.9 శాతానికి తగ్గి 1997-98 లో మరల వేగంగా పెరిగి 6.3 కి చేరుకుంది. 2002-03 నాటికి 5.9 శాతంగాను, అటుతర్వాత 2003-04 (RE) లో తగ్గి 4.8 శాతానికి చేరుకుంది. 2004-05 బడ్జెటు అంచనా ప్రకారం కోశలోటు 4.4 శాతం కాగలదని అంచనా వేయడం జరిగింది. ప్రభత్వం ఈ కోశలోటును 4 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశ ఆర్థిక పరిస్థితులు చూస్తే ఈ లక్ష్యం అసాధ్యంగా కనబడుతుంది. అంతర్జాతీయ ద్రవ్యసంస్థల వత్తిడి కారణంగా అంటే కోశలోటుని గణనీయంగా తగ్గిస్తే కాని బుణాలు మంజూరు చేయము అన్న హెచ్చరికతో కేంద్రప్రభుత్వం ఆర్థిక పరమైన కఠినచర్యలు తీసుకోనారంభించింది. ముఖ్యంగా ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. అయితే భారతదేశంలో ఉన్న అంతర్గత వత్తిళ్ళు కారణంగా ప్రణాళికేతర వ్యయాన్ని ఎంతవరకు తగ్గించగలదనేది ప్రశ్నార్థకం.

ప్రాధమిక లోటు : (Primary Deficit)

యిటీవల కాలంలో కేంద్ర విత్త మంత్రిత్వశాఖ 'ప్రాధమికలోటు అనే క్రొత్త పదాన్ని ప్రవేశపెట్టింది. కేంద్రప్రభుత్వం తీసుకున్న బుణాలపై వడ్డీ చెల్లిస్తుంది (Servicing of Debt). ప్రణాళికేతర వ్యయంలో వడ్డీ చెల్లింపులకై అధికవ్యయం అవుతోంది. లోటు ఏర్పడ్డానికి ముఖ్యకారణం బుణాలు పెరగడంవల్ల వడ్డీ చెల్లింపులు పెరుగుతున్నాయి. అందుచేత ఈ వడ్డీ చెల్లింపులపై చేసే వ్యయాన్ని కోశలోటునుండి తీసివేస్తే వచ్చేదే " ప్రాధమికలోటు " అందుచేత,

ప్రాధమికలోటు = కోశలోటు - వడ్డీ చెల్లింపులు.

పట్టిక. 16 లో చూసినట్లైన ప్రాధమిక లోటు బాగా తగ్గింది. 1990-91 లో రు. 23, 130 కోట్లుంటే 2004-05 బడ్జెట్ అంచనాల ప్రకారం రు. 7907 కోట్లుండగలదని అంచనా. స్థూల దేశీయోత్పత్తిలో ప్రాధమిక లోటు శాతాన్ని పట్టికలో చూసినట్లైతే 1990-91 లో 4 శాతం వుంటే 2004-05 కి 0.3 శాతానికి తగ్గింది. అంటే వడ్డీ చెల్లింపులను కోశలోటులోంచి తీసివేస్తే, కేంద్రప్రభుత్వం మిగతా అవసరాలకు ఎంత అప్పు చేయాలో ఈ ప్రాథమిక లోటు ద్వారా తెలుస్తుంది.

లోటు విత్తవిధానాన్ని భారతప్రభుత్వం ప్రణాళికలకవసరమైన నిధులను సేకరించడానికి ప్రవేశపెట్టడం జరిగింది. వ్యయానికి సంబంధించిన లక్ష్యాలకు అవసరమైన నిధులను కేవలం పన్నువిధానం ద్వారా పొందడం సాధ్యపడదు. ప్రణాళికలలో ఉత్పత్తి మరియు ఉద్యోగితా లక్ష్యాలను దేశం సాధించగలిగే వృద్ధి రేటును బట్టి నిర్ణయించబడతాయి. దీనికై పన్నులనుండి రాబడి, విదేశీ ఋణాలు సరిపడని పరిస్థితి ఏర్పడినప్పుడు అనగా లోటు ఏర్పడినప్పుడు అదనపు విత్త వనరులను మార్కెటు ద్వారాను మరియు RBI ద్వారాను సేకరించి లోటును భర్తిచేయవలసివుంటుంది. యిక్కడ లోటు విత్తవిధానం ద్వారా నిజవనరుల తయారీ (Creation of Real Resources) జరగదు. అయితే ప్రజల వద్దనుండి వనరులు ప్రభుత్వానికి బదిలీ అవుతాయి. అంటే నిజవనరులు అనగా భూమి, శ్రమ, మూలధనం మొదలైన రూపాలలో వుంటుంది. లోటు విత్తవిధానం ద్వారా ద్రవ్యం ప్రింటింగ్ చేయబడుతుంది. అదనంగా దీనిద్వారా నిజవనరులు తయారుకావు. అంతేకాకుండా, కోశలోటు గడిచిన కాలంలో గణనీయంగా పెరిగింది. దీంతో ప్రభుత్వానికి ఋణభారం బాగా పెరిగింది. 1990-91 నుండి 10 సం॥లలో ఋణభారం 5 రెట్లు పెరిగింది. అంటే 1990-91లో ఋణం రు 3,14,560 కోట్లుంటే, 2003-04లో రు. 1779760 కోట్లకి పెరిగింది. దీంతో వడ్డీ చెల్లింపులు బాగా పెరిగిపోయాయి. 1980-81లో రు. 3,500 కోట్లుంటే 2003-04 లో రు 1,23, 220 కోట్లకి వడ్డీభారం పెరిగింది. పన్ను ఆదాయంలో 67 శాతం మరియు రెవెన్యూరాబడిలో 48 శాతం వడ్డీ చెల్లింపులకే సరిపోతోంది. తర్వాత, లోటు విత్తవిధానం వల్ల ధరలు పెరిగి వినియోగం తగ్గి, పొదుపు ప్రజలమీద బలవంతంగా రుద్దబడుతుంది. అయితే పెట్టుబడి పెరుగుతుందా అంటే ఉత్పాదకరంగాలలో పెట్టుబడి పెరగక, ద్రవ్యోల్బణం వల్ల లాభపడే రంగాలనైపు అంటే విలాసవంత వస్తుతయారి, మొదలైన వాటినైపు పెట్టుబడి తరలిపోతుంది. చివరగా, ఒక అల్పాభివృద్ధి దేశంలో అభివృద్ధి ప్రారంభ దశలలో లోటు విత్త విధానం ఆర్థికాభివృద్ధికి ఎంతైనా దోహదపడుతుంది. ఒక దశ తర్వాత, లోటు విత్త విధానం అవసరించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవలసి వుంటుంది. కాబట్టి లోటు విత్త విధానం ఒక అగ్ని కణం లాంటిది. అందుచేత అది ఒక మంచి సేవకుడు, కాని ఒక దుష్టయజమాని.

14.7 సారాంశం :

ఒక దేశ ప్రభుత్వం ఆ దేశ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసి ప్రజల శ్రేయస్సుని మెరుగు పరచే కృషిలో భాగంగా కోశ విధానాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఒక సాధనంగా ఉపయోగిస్తున్నాయి. 20వ శతాబ్దంలో పురోగామి దేశాలలో ప్రభుత్వం యొక్క బాధ్యతల రూపురేఖలు మారి ఎంతో విస్తరించబడ్డాయి. జనాభా బాగా పెరిగి ప్రజల యొక్క అవసరాలు కూడా ఎంతో పెరిగాయి. అంతే కాకుండా ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతికి భారతదేశ ప్రభుత్వం 1951లో శ్రీకారం చుట్టడం జరిగింది. వీటివల్ల బాధ్యతల పెరుగుదలతోపాటు ప్రభుత్వం యొక్క వ్యయం పెరిగి అధికమొత్తంలో ద్రవ్య సమీకరణ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. పెట్టుబడిని మరియు ఆదాయ పంపిణీలను సామాజిక న్యాయాన్ని పెంపొందించే దిశగా చేపట్టవలసిన అగత్యం ప్రభుత్వానికి కలిగింది. ఈ పనులన్నింటికి కావలసిన ద్రవ్య సమీకరణ మరియు దాని వ్యయాన్ని కోశవిధానమని చెప్పవచ్చు. ఈ ద్రవ్య సమీకరణ పన్ను విధానం ద్వారాను, ఋణ విధానం ద్వారానూ మరియు లోటు విత్త విధానం ద్వారాను చేపట్టబడుతుంది. దానినే కోశవిధానం అని అంటాము. అయితే అనుకున్న ఫలితాలను అనుకున్నట్టు సాధించాలంటే కోశవిధానానికి రిజర్వు బ్యాంకు యొక్క ద్రవ్య విధానం అనుసంధానం చేయవలసివుంది. కోశ విధానం మరియు ద్రవ్య విధానాలు "డబుల్ బారెల్‌గన్" మాదిరిగా పనిచేసి లక్ష్యాన్ని గురి తప్పకుండా సాధించే వీలుంది.

సాంప్రదాయ ఆర్థిక శాస్త్రవేత్తల ప్రకారం బడ్జెట్ సమతౌల్యంలో వుండవలసిన అవసరం గురించి చెపుతూ పన్ను విధానం తటస్థ ప్రభావాన్ని చూపేదిగా వుండాలి అని అన్నారు. పన్నులు వినియోగం మీదే ఉండాలి తప్ప ఆదాయం మీద వుండరాదని అన్నారు. అంటే పేదవారికి భారంగాను ధనికులమీద స్వల్పంగాను పన్నులుండాలి అని అన్నారు. అయితే కీన్స్ ఈ విధానాన్ని తప్పు పట్టి కోశవిధాన ప్రాముఖ్యతను గట్టిగా నొక్కి చెప్పడం జరిగింది. వ్యయ విధానం ద్వారా ఆదాయ ఉద్యోగితా స్థాయిలను పెంచవచ్చు అనే విషయాన్ని చెప్పాడు. కోశ విధానంలో ప్రజల వద్దనుండి ప్రభుత్వానికి ప్రభుత్వం వద్దనుండి ప్రజల వద్దకు నిధుల ప్రవాహం వుంటుంది. హార్వే మరియు జాన్సన్, జి.కె. షా, ఎక్‌స్టీన్ మొదలైనవారు ఏమన్నారంటే పన్ను విధానం మరియు వ్యయ విధానంలో మార్పులనే కోశ విధానమని అన్నారు. ఈనాడు కోశ విధాన పరిధి పెరిగిన కారణంగా, "పెద్ద బడ్జెట్" తయారు చేయబడుతోంది. పూర్వం "చిన్న బడ్జెట్" ఉండేది.

కోశవిధానం అంటే ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థని కోశ సాధనాలు అనుకున్న రీతిలో నియంత్రించి జాతీయాదాయం, ఉత్పత్తి మరియు ఉద్యోగితలపై అనుకున్న ఫలితాన్ని సాధించడమే. అంటే ఆర్థికాభివృద్ధికి కావలసిన వనరులను సమీకరించి ప్రభుత్వం పెట్టుబడిని చేపట్టడానికి ఉపకరించే సాధనమే కోశవిధానం. కీన్స్ మరియు లెర్నర్‌లు ఏమన్నారంటే బడ్జెట్ అనేది తటస్థంగా కాకుండా దేశ ఆర్థిక విధానాన్ని రూపొందించడానికి ఉపయోగపడే శక్తివంతమైన సాధనంగా వుంటుందని అన్నారు. దీనినే "విధులననుసరించి విత్త విధానం" అని పిలిచారు. ఈ విధానంలో పురోగామి పన్ను విధానం, పెరిగే ప్రభుత్వ వ్యయం, మరియు లోటు బడ్జెటు వుండాలని కీన్స్ అన్నాడు. వీటిలో ఆర్థిక స్థిరీకరణ సాధించవచ్చని అన్నాడు. అయితే ఈ విధానం అంటే విధులననుసరించి విత్త విధానం అల్పాభివృద్ధి దేశాలలో అంతగా సరిపోదు. ఎందుకంటే ఈ దేశాల తక్షణ కర్తవ్యం పొదుపు, పెట్టుబడులను వేగంగా పెంచడం. తద్వారా అభివృద్ధిని వేగవంతం చేయడం, భారతదేశంలో కోశ విధానాన్ని బడ్జెట్ విధానమని అనవచ్చు.

ఆర్థిక పరిస్థితి ననుసరించి కోశ విధాన లక్ష్యాలు రూపుదిద్దుకుంటాయి. వేర్వేరు దేశాలలో ఆర్థిక పరిస్థితి వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి లక్ష్యాలు వేర్వేరుగా వుంటాయి. అందుచేత అభివృద్ధి చెందిన దేశాల పరిస్థితికి, అభివృద్ధి చెందుతున్న దేశాల పరిస్థితి వేరుగా వుంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో "క్రియాశీలక విత్త విధానం" ద్వారా వనరులను సమీకరించి ఆర్థిక వృద్ధిని మరియు స్థిరీకరణని సాధించవచ్చు. వీటిననుసరించి భారతదేశం లాంటి మిశ్రమ ఆర్థిక వ్యవస్థలలో కోశ విధాన లక్ష్యాలుగా ముఖ్యంగా వృద్ధి, సమానత ఉద్యోగిత, మరియు స్థిరీకరణ అయినాయి. దీనికై పొదుపు, పెట్టుబడులను ప్రజోపకరవనులకు అందేటట్లుగా చేసి సామాజిక న్యాయాన్ని పెంపొందింపజేయాలి. భారతదేశ కోశ విధానం పూర్తిగా పై అంశాలకు కట్టుబడి వుంది. ప్రభుత్వం తన కోశ విధానంలో రెవెన్యూ, వ్యయ, మరియు ఋణ విధానాలను పొందుపరచి లక్ష్య సాధనకై కృషి సల్పుతోంది.

ప్రభుత్వ బాధ్యతలు పెరగడంతోబాటే వ్యయం కూడా ఎన్నో రెట్లు పెరిగింది. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ వ్యయంలో రెవెన్యూ వ్యయం అధికంగా పెరగనారంభించింది. ఈ రెవెన్యూ వ్యయం మొత్తం వ్యయంలో 1950-51లో 66% వుంటే 2004-05 (B.E.) కి 81%గా పెరిగింది. 1987-88 బడ్జెట్ తర్వాత నుండి రెవెన్యూ వ్యయాన్ని ప్రణాళికా మరియు ప్రణాళికేతర వ్యయంగా వ్యవహరించడం జరుగుతోంది. ప్రణాళికేతర వ్యయం రెవెన్యూ వ్యయంలో సింహభాగాన్ని ఆక్రమించింది. దీంట్లో ముఖ్యంగా వడ్డీ చెల్లింపులు, రక్షణ వ్యయం, సబ్సిడీలు, సాంఘిక సేవలు, ఆర్థిక సేవలు వుంటాయి. ఈ వ్యయం 1950-51 నుండి 2004-05 నాటికి 5 రెట్లు పెరిగింది. వీటిలో వడ్డీ చెల్లింపుల వ్యయం చాలా అధికంగా వుంది. 1985-86లో ఈ వ్యయం రు. 7500 కోట్లుంటే 2003-05లో రు. 1,23,220 కోట్లకి పెరిగింది. దీని తర్వాత, రక్షణ వ్యయం వస్తుంది. 2004-05 (B.E.) రక్షణ వ్యయం రు. 77,000 కోట్లకి చేరుకుంది. సబ్సిడీలపై కఠిన నిర్ణయాలు చేసినప్పటికి ఆహారం, ఎరువులు మరియు ఎగుమతులపై సబ్సిడీ వ్యయం భారీగా పెరిగింది. తర్వాత సాధారణ సేవలు అంటే పన్ను వసూళ్ళు, పించన్లు కూడా వ్యయ పెరుగుదలని సూచిస్తున్నాయి. ఈ రెవెన్యూ వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 1980-81 ప్రారంభదశకంలో 18.6% వున్నది. 1990-91 నాటికి 24 శాతానికి పెరిగింది. ఇదేకాలంలో మొత్తం వ్యయం (రెవెన్యూ+మూలధన) 26% నుండి 30%కి పెరిగింది. ఈ వ్యయం పెరుగుదల కారణంగా కోశలోటు ఇదే కాలంలో 8% నుండి 10 శాతానికి పెరిగింది. దీనికి ముఖ్య కారణం ఋణభారం పెరగడం.

రాష్ట్రాల వ్యయం కూడా భారతదేశంలో ఎన్నో రెట్లు పెరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుండి ఈనాటి వరకు 1951-52లో రు. 392 కోట్లుంటే 2002-03లో రు. 3,55,160 కోట్లకి పెరిగింది. దీనికి కారణం పరిపాలనా వ్యయంలో పెరుగుదల మరియు పే సవరణ సంఘ సిఫారసులను అమలు చేయడం వలన వ్యయంలో పెద్దగా మార్పులు జరిగాయి. రాష్ట్రంలో అభివృద్ధి వ్యయం ఎక్కువగాను మరియు అభివృద్ధేతర వ్యయం తక్కువగాను వుంది. 1986-87 వరకు రాష్ట్రంలో లోటు బడ్జెట్టే లేదు. వేతన సంఘ సవరణలవల్ల రాష్ట్రాలు లోటు బడ్జెట్‌ను భరించవలసిన అవసరం ఏర్పడింది. స్థూల దేశీయోత్పత్తిలో వడ్డీ చెల్లింపుల శాతం కేంద్రం విషయంలోనైతే 5 శాతం వుండగా, రాష్ట్రాల విషయంలో ఈ శాతం పెరుగుతూ వస్తోంది. అంతేకాకుండా, రాష్ట్రాలు సామాజిక సేవలపై వ్యయం ఎక్కువగా చేస్తున్నాయని అనడానికి నిదర్శనం స్థూల దేశీయోత్పత్తిలో సామాజిక సేవల వ్యయం యొక్క శాతం 5.4% నుండి 5.8% గా వుంది, 1990-91 నుండి 2004-05 వరకు చివరగా చెప్పేదేమిటంటే, వడ్డీ చెల్లింపుల భారాన్ని తగ్గించే లేదా నియంత్రించే అవకాశం కనుచూపు దూరంలో కనబడుటలేదు.

అంతేకాకుండా మహల్‌నోబిస్ ప్రకారం, భారత వ్యయ విధానం ద్వారా ఆదాయ, సంపద వ్యత్యాసాలు భారతదేశంలో తొలగించబడలేదనే విషయాన్ని చెప్పడం జరిగింది.

ఆర్థికాభివృద్ధికి కావలసిన విత్త వనరులను భారత ప్రభుత్వం ఎక్కువగా పన్ను విధానం ద్వారానే సేకరిస్తోంది. అందుచేత పన్ను విధానం ఒక ముఖ్యమైన కోశవిధానంగా చెప్పవచ్చు. ఈ పన్నులలో ప్రత్యక్ష పన్నులకంటే పరోక్ష పన్నులనుండే అధిక ఆదాయాన్ని ప్రభుత్వం సమీకరిస్తోంది. ఈ కారణంగా భారత పన్ను విధానం ఒక తిరోగామి పన్ను విధానంగా చెప్పవచ్చు. ప్రత్యక్ష పన్నులు పురోగామిగా వున్నను ఎక్కువమంది ప్రజల ఆదాయాలు తక్కువగా వున్న కారణంగాను, మొత్తం ప్రజలలో 1 శాతం మాత్రమే పన్నుని చెల్లిస్తున్నారు. దీంతో బాటుగా పన్నుఎగవేత, మరియు పన్ను కట్టకుండ మానివేయుట వంటి (Tax Avoidance) సమస్యలవల్ల ప్రత్యక్ష పన్ను విధానం కూడా తిరోగామి పన్ను విధానంగా మారిపోయింది.

మొత్తం రెవెన్యూ రాబడిలో పన్ను ఆదాయం 1950-51లో 88 శాతం వుంటే, 2004-05లో 76 శాతంగా వుంది. పన్నేతర ఆదాయం యొక్క విత్త ప్రాముఖ్యత తక్కువగా వుంది. ప్రత్యక్ష పన్నులలో, కార్పొరేషన్ టాక్స్‌నుండి అధికాదాయం వస్తోంది. పరోక్ష పన్నులలో, ఎక్సైజ్ సుంకం అధికాదాయాన్ని ఇస్తుంది. ఈ విధంగా వసూలు చేసిన ఆదాయంలో రాష్ట్రాలకు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం 11వ విత్త సంఘ సిఫారస్‌ల మేరకు 28 శాతాన్ని రాష్ట్రాలకు పంచియిస్తోంది. మొత్తం పన్నులలో, పరోక్ష పన్నుల ద్వారా అధిక రాబడి వస్తున్ననూ, పరోక్ష పన్నుల రాబడి పెరుగుతోంది. ఇది ముదావహం. ఎందుకంటే ఆదాయ అసమానతలను తగ్గించాలంటే వీటి శాతం పెరగాలి. స్థూల దేశీయోత్పత్తిలో ప్రత్యక్ష పన్నుల శాతం పెరుగుతూ వస్తోంది. పరోక్ష పన్నుల శాతం తరుగుతూ వస్తూంది. ఇది శుభపరిణామం. అయితే కేంద్రం యొక్క మరియు రాష్ట్రాల యొక్క రెవెన్యూ రాబడితో పోలిస్తే రెవెన్యూ వ్యయం, స్థూలదేశీయోత్పత్తిలో, అధిక శాతం కలిగివుంది. దీంతో కోశ లోటు 1999లో 5.4% వుంటే 2003-04లో 5.6%గా వుంది (కేంద్రం ఒక్కటే). రాష్ట్రాల కోశలోటు కూడా ఇదే కాలంలో 4.7% నుండి 4% పడిపోయింది. ఇది 2.5% పడిపోతుందని విత్త సంఘం అంచనా. కోశలోటుని తగ్గించడానికి 11వ విత్త సంఘం టాక్స్ బేస్‌ని విస్తృత పరచాలని, స్థూలదేశీయోత్పత్తిలో ఫలానా శాతం అప్పుతీసుకోవాలని, రాష్ట్రాల ప్రణాళికల సహాయంలో సవరణలు అని టాక్స్ రిఫార్మ్‌ని ప్రవేశపెట్టింది. రాష్ట్రాలు, వారి వృత్తి పన్ను మరియు వ్యవసాయం ఆదాయంపై పన్నుల ద్వారా ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని అంది. రాష్ట్రాల అప్పులు మరియు జి.ఎస్.డి.పి.ల నిష్పత్తి నిర్ణయించాలని అంది.

పూర్వం కోశవిధానమంటే ఆదాయ వ్యయ విధానమని చెప్పడం జరిగింది. భారతదేశం వృద్ధిని సాధిస్తున్న కొద్దీ వ్యయావసరాలు పెరిగి విత్త వనరుల సమీకరణ యొక్క విస్తృతి మరియు పరిధి పెరిగింది. దీంతో ఋణవిధానం అత్యంత శక్తివంతమైన కోశసాధనంగా ప్రభుత్వం ఉపయోగిస్తోంది. అసలు ఈ ఋణవిధానం మూలధన వ్యయావసరాలు తీర్చుకునేలాగున చేపట్టబడింది. అయితే వ్యయావసరాలు పెరిగి ఋణంలో రెవెన్యూ వ్యయాన్ని చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇది విచారకరం. స్వాతంత్ర్యం రాకపూర్వం ఋణ విధానం యుద్ధావసరాలకే పరిమితం చేయబడింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో మొత్తం అప్పు రు. 1950కోట్లు.

ఋణ విధానంలో దేశీయ ఋణం మరియు ఇతర అప్పులు, మరియు విదేశీ ఋణం వుంటాయి. దేశీయ ఋణం మొత్తం సింహభాగాన్ని ఆక్రమించింది. 1950-51లో రు. 2830 కోట్లున్నది. 2002-03లో రు. 15,04,220 కోట్లకి పెరిగింది. ఇదే కాలంలో విదేశీ ఋణం రు. 30 కోట్ల నుండి రు. 57,650 కోట్లకి పెరిగింది. ఋణ భారం పెరగడానికి కారణం రెవెన్యూ వ్యయం ఎక్కువగా పెరగడం. వ్యయంలో ప్రభుత్వం కఠిన నియమాలు పాటించకపోవడం. దీంతో రెవెన్యూ లోటు, కోశ లోటు పెరగడం పర్యవసానం. అంతేకాకుండా పరిపాలనాయంత్రాంగ వ్యయం పెరగడం యింకో కారణంగా చెప్పవచ్చు. ఋణ భారాన్ని కొలవాలంటే ఋణ జి.డి.పి. నిష్పత్తిని తెలుసుకోవాలి. ఈ నిష్పత్తి 1990-91లో 58.7% వుంటే, 2002-03లో 63.8 శాతానికి పెరిగింది. విదేశీ ఋణం పరంగా ఈ నిష్పత్తి 2002-03 లో 2.8%గా వుంది. అలాగే ప్రభుత్వ వ్యయంలో ఎంత శాతం వడ్డీ చెల్లింపులకై ఖర్చు చేయబడుతుందో లేదో తెలుసుకోవడం ద్వారా ఋణ భారాన్ని తెలుసుకోవచ్చు. ఈ శాతం 1950-51లో 9 శాతం వుండగా 2003-04లో 26 శాతంగా వుంది. ఋణభారం పెరిగింది.

రాష్ట్రాల ఋణ విషయానికొస్తే 1987-88లో మొదటిసారిగా రెవెన్యూ పద్దులో లోటు ఏర్పడింది. అప్పటినుండి రాష్ట్రాల పరిస్థితి దిగజారింది. ఋణ జి.డి.పి. నిష్పత్తి రాష్ట్రాల పరంగా 2002-03లో 28 శాతానికి పెరిగింది. 2002-03 లో రాష్ట్రాల అప్పు రు. 6,83,170

కోట్లకి పెరిగింది. రాష్ట్రాల ఋణంలో అంతర్గత ఋణం, కేంద్రం నుండి అప్పులు, పబ్లిక్ పద్దు అప్పులు వుంటాయి. 11వ విత్త సంఘం సూచనలు ఏమిటంటే ఋణభారాన్ని కుదించాలని చెపుతూ, రాష్ట్రాలు అదనపు రెవెన్యూ సేకరణ, వ్యయాన్ని కుదించడం, వ్యయాన్ని పునఃప్రాధాన్యతీకరణ చేయడం అవసరం అన్న సూచనలు చేసింది. విత్త సంఘం రాష్ట్రాల ఋణాన్ని రు. 340 కోట్ల మేర రైటాఫ్ చేసింది.

చివరగా భారతదేశ ప్రభుత్వం లోటు విత్త విధానాన్ని ఒక ముఖ్యమైన కోశ సాధనంగా ఎంతో కాలంగా వాడుతోంది. దీని ప్రాముఖ్యత గురించి కీన్స్ మొదటిసారిగా అనడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం లోటు విత్త విధానాన్ని రిజర్వు బ్యాంక్ దగ్గర నుండి ఋణం క్రొత్త కరెన్సీని ప్రింటు చేయడం ద్వారా పొందుతోంది. అదే అమెరికాలోనైతే మార్కెట్టు ఋణాల ద్వారా లోటు విత్తవిధానం అమలు చేయబడుతుంది. లోటు విత్త విధానంమంచే ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా వున్నపుడు, రెవెన్యూ మరియు మూలధన పద్దతులను పరిగణవలోకి తీసుకున్నపుడు, ఆ లోటుని లోటు విత్త విధానం ద్వారా పూర్తి చేయడం జరుగుతుంది. దీనిని "బడ్జెటరీ లోటు" అని అంటారు. ఈ లోటు రెండు రకాలు : రెవెన్యూ లోటు (రెవెన్యూ రాబడి మరియు వ్యయాల మధ్య తేడా) మరియు కోశలోటు (రెవెన్యూ లోటు ప్లస్ మార్కెటు ఋణాలు). అయితే కోశలోటు నుండి వడ్డీ చెల్లింపుల వ్యయాన్ని తీసివేస్తే వచ్చేదే "ప్రాథమిక లోటు". ఇది 2000 సం॥లో ప్రవేశపెట్టబడింది. కోశలోటు 2004-05లో 4.4%కి తగ్గుతుందని అంచనా. 1990-91లో 7.7 శాతం వుంది. ఈ కారణంగానే పరిశీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టబడ్డాయి. రెవెన్యూలోటు మరియు ప్రాథమిక లోటు బాగా తగ్గాయి. లోటు విత్త విధానం ఎంత శక్తివంతమైన కోశసాధనమైన విత్త వనరుల సమీకరణపరంగా, ఈ విధానం ద్వారా ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడి వినియోగం తగ్గి పొదుపు ప్రజలమీద బలవంతంగా రుద్దబడుతుంది. పెట్టుబడి విలాసవంత వస్తువుల వైపు తరలించబడుతుంది. భారతదేశానికి ఇది మంచిది కాదు. అల్పాభివృద్ధి దేశాలలో ఈ విధానం అభివృద్ధి మొదటి దశలలో ఎంతో ఉపయోగకారిగా వుంటుందన్నది వాస్తవం. ఒక దశ దాటిన తర్వాత, ఈ విధానాన్ని ఉపయోగించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవలసి వుంటుంది.

14.8 ముఖ్య పదాలు :

1) తటస్థ పన్ను విధానం (Neutral Tax Policy)
2) అంతిమ పన్ను భారం (Incidence of Taxation)
3) సంతులిత బడ్జెట్ (Balanced Budget)
4) అనుత్పాదక వినియోగం (Conspicuous Consumption)
5) ఉపాంత పొదుపు ప్రవృత్తి (Marginal propensity to Save)
6) పేదరిక విషవలయాలు (Vicious Circles of Poverty)
7) ఋణ విషమ పరిస్థితి (Debt Crisis)
8) పన్ను హాలీడే (Tax Holiday)
9) సామాజిక ఉపాంత ఉత్పాదకత (Social Marginal Productivity)
10) ద్రవ్యోల్బణ వ్యత్యాసం (Inflationery Gap)
11) విపరీత ద్రవ్యోల్బణం (Hyper Inflation)
12) పురోగామి మరియు తిరోగామి పన్ను విధానం (Progressive & Regressive Taxation)
13) పునఃపంపిణీ వ్యయం (Redistributive Expenditure)
14) పునఃపంపిణీ విత్తం (Redistributive Finance)
15) పునఃపంపిణీ పన్నువిధానం (Redistributive Tax Policy)
16) విధులనమనుసరించి విత్త విధానం (Functional Finance)
17) అభివృద్ధి మరియు అభివృద్ధేతర వ్యయం (Development & Non - Development Expenditure)
18) ప్రణాళికా మరియు ప్రణాళికేతర వ్యయం (Plan & Non-Plan Expenditure)

19) రెవెన్యూ మరియు మూలధన వ్యయం (Revenue & Capital expenditure)
20) రెవెన్యూ మరియు మూలధన రాబడి (Revenue & Capital Receipts)
21) స్థూల దేశీయోత్పత్తి (Gross Domestic Product)
22) స్థూల రాష్ట్రీయోత్పత్తి (Gross State Domestic Product)
23) కోశ సవరణలు (Fiscal Reforms)
24) పన్నేతర రాబడి (Non-Tax Receipts)
25) పన్ను ఎగవేత (Tax Evation)
26) పన్ను మానివేయుట (Tax Avoidance)
27) కంపెనీ ఆదాయపు పన్ను (Corporation Tax)
28) పన్ను వ్యాకోచత్వం (Tax Elasticity) మరియు పన్ను బుయాన్సీ (Tax Buoyancy)
29) MODVAT or MANVAT (Modified Value Added Tax or Manufacturing VAT)
30) CENVAT (Central Value Added Tax)
31) విలువాధారిత పన్ను (Value Added Tax, VAT)
32) అమ్మకపు పన్ను (Sales Tax)
33) సర్వీస్ పన్ను (Service Tax)
34) కాస్కేడింగ్ ప్రభావం (Cascading Effect)
35) రెవెన్యూలోటు (Revenue Deficit) మరియు కోశలోటు (Fiscal Deficit)
36) బహుళ - సంవత్సర బడ్జెటింగ్ విధానం (Multi-Year Budgeting System)
37) ప్రభుత్వ సరియైన పరిమాణ నిర్ధారణ (Government Right Sizing)
38) వృత్తి పన్ను (Profession Tax)
39) అధికార అభివృద్ధి సహాయం (Official Development Assistance, ODA)
40. ఋణ స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి (Debt-GDP Ratio)
41) స్థూల కోశ లోటు (Gross Fiscal Deficit, GFD)
42) అవసరార్థ ఋణం (Ways & Means Assistance, WMA)
43) అదనపు కేంద్ర సహాయం (Additional Central Assistance, ACA)
44) జాతీయ చిన్న పొదుపు మొత్తాల విధి (National Small Savings Fund, NSSF)
45) జాతీయపొదుపు పత్రాలు (National Savings Certificates, NSCS)
46) స్థూల జాతీయ వ్యయం (Gross National Expenditure)
47) ప్రాథమిక లోటు (Primary Deficit)

14.9 నమూనా ప్రశ్నలు

1) "రాబడిని బట్టి వ్యయం చేయాలని సాంప్రదాయ ఆర్థిక వేత్తలంటే, కీన్స్ వ్యయాన్ని బట్టి రెవెన్యూని సమీకరించాలి అని అన్నాడు". వివరించండి.
2. కోశ విధానాన్ని నిర్వచించి, ఒక అభివృద్ధి చెందుతున్న దేశంలో కోశ విధాన లక్ష్యాలు ఏలా వుండాలో తెలుపండి.
3) భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో కోశ సాధనాల పనితీరుని విశ్లేషించండి.
4) లోటు విత్త విధాన పాత్ర గురించి చెప్పండి.
5) ఈ క్రింది వాటి గురించి వ్రాయండి?

ఎ) పన్ను - స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి

బి) ఋణ - స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి

సి) కోశలోటు

డి) రెవెన్యూ లోటు

6) భారతదేశంలో వ్యయ పోకడలు గురించి వ్రాయండి

7) కోశ : వరణల గురించి తెలపండి

8) ఈ క్రింది సమాచారాన్ని ఉపయోగించి రెవెన్యూలోటు మరియు కోశలోటులను లెక్కించండి. (రు. కోట్లలో)

2003-04 సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం :

పన్ను రాబడి	:	1,87,539
పన్నేతర రాబడి	:	75,488
మూలధన రాబడి	:	2,11,228
(మూలధన రాబడిలో ఋణాలు మరియు ఇతర అప్పులు : 1,32,103)		
మొత్తం రాబడి	:	4,74,255
రెవెన్యూ వ్యయం	:	3,62,887
మూలధన వ్యయం	:	1,11,368
మొత్తం వ్యయం	:	4,74,255
(జ : రెవెన్యూ లోటు	రు.	99,860 కోట్లు
కోశలోటు	రు.	1,32,103 కోట్లు)

9) భారతదేశ కోశ విధానాన్ని సవిస్తరంగా వ్రాయండి.

14.10 చదువదగిన గ్రంథాలు

1) Raja J. Chellaiah : Fiscal Policy in Underdeveloped Countries, 1969, George Allen & Vhwin.
2) R.N. Tripathy : Public Finance in Underdeveloped Countries.
3) R.A. Musgrave : The Theory of Public Finance
4) J.C. Hansen : Monetary & Fiscal Policy
5) A.R. Prest : Public Finance in Underdeveloped Countries, 1973.
6) G.K. Shaw : Fiscal Policy, Mac Millan, 1972.
7) Gerhard Colin : Essay in Public Finance & Fiscal Policy Oxford.
8) M. Govinda Rao : Proposals for State level Budgetary Reforms. EPW, 1 Feb, 1992.
9) EPW June : July, & Aug. 2004
10) Economic Surveys : 2002-03, 2003-04.
11) Sonthern Economist : July, Aug. 2004
12) Dutt & Sundaram : Indian Economy, 2004
13) R.K. Lekhi : Public Finance, 1996
14) H.L. Bhatia : Public Finance, 1998
15) P.K. Dhar : Indian Economy
16) RBI : Currency & Finance
17) OHO Eckstein : Public Finance
18) UK Hicks : Public Finance, James Nisbet & Co.,
19) S. Ganguly : Public Finance.

డా॥ జి. దుర్గాప్రసాద్

పాఠం - 15

భారతదేశ విదేశీ వ్యాపారం - వ్యాపార చెల్లింపుల శేషం. విదేశీ వ్యాపారం మరియు అంతర్జాతీయ వ్యాపారం సంస్థ.

విషయసూచిక :

15.1 పరిచయం

15.2 ప్రణాళికాపూర్వం భారతదేశ విదేశీ వ్యాపారం.

15.3 ప్రణాళికా కాలంలో విదేశీ వాణిజ్యంలో సంభవించిన స్థూల పరిణామాలు.

15.3.1 1951 నుండి 1979 వరకు గల పరిణామాలు.

15.3.2 1980 నుంచి 1990 మధ్య కాలంలో వ్యాపారం పోకడలు.

15.3.3 నూతన ఆర్థిక సంస్కరణలు కాలంలో విదేశీ వ్యాపారం.

15.4 మన విదేశీ వ్యాపారం - ఎగుమతులు మరియు దిగుమతుల నిర్ణయకాలు

15.4.1 ఎగుమతుల నిర్ణయకాలు

15.4.2 దిగుమతుల నిర్ణయకాలు

15.5 స్వాతంత్ర్యం వాటి నుండి వ్యాపార పరిణామాల ధోరణిలోగల ముఖ్యాంశాలు.

15.5.1 పెరుగుచూ ఉన్న వ్యాపార విలువ

15.5.2 అధిక మొత్తంలో దిగుమతులు పెరగడం.

15.5.3 చాలినంతగా లేని ఎగుమతుల విస్తరణ.

15.6 భారతదేశ విదేశీవాణిజ్యంలో అంతర్భాగాలు - సంక్షిప్త వివరణ. దిగుమతులలో అంతర్భాగాలు

15.7 దిగుమతులలో అంతర్భాగాలు మరియు మార్పుల ధోరణులు.

15.8 ఎగుమతులలో అంతర్భాగాలు.

15.9 భారతదేశ వ్యాపార దిశ - ఇటీవలి పరిణామాలు

15.10 భారతదేశ విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం.

15.10.1 1990లో విదేశీ చెల్లింపుల సంక్షోభానికి దారితీసిన పరిస్థితులు.

15.10.2 చెల్లింపుల శేషంలోని సంక్షభ నివారణా చర్యలు.

15.10.3 సంక్షోభనంతర పరిణామాలు (1991 నుండి వేటివరకు)

15.11 భారతదేశ విదేశీ వ్యాపారం పై అంతర్జాతీయ వ్యాపార సంస్థ ప్రభావాలు.

15.11.1 GATT ఆవిర్భవం - లక్ష్యాలు

15.11.2 ఉరుగ్వే సమావేశం - డంకెల్ ప్రతిపాధనలు

15.12 భారతదేశ విదేశీ వ్యాపారంపై W.T.O. వల్ల ఏర్పడిన ప్రభావాలు.

15.13 TRIPs, TRIMs మరియు ఇతర విధానాలు వల్ల విదేశీ వ్యాపారంపై కలిగిన ప్రభావాలు.

15.14 సారాంశము.

15.15 ముఖ్యపదాలు

15.16 స్వయం మదింపు ప్రశ్నలు

15.17 చదువవలసిన పుస్తకాలు.

15.0 లక్ష్యం :

ఈ పాఠ్యభాగమున ముఖ్యముగా ప్రణాళికాభివృద్ధి ప్రక్రియ నేపథ్యములో భారతదేశ విదేశీ వాణిజ్య రంగంలోనూ, విదేశీ చెల్లింపుల ఖాతాలోను సంభవించిన వ్యవస్థా పూర్వక పరిణామాల గురించి వివరంగా తెలుసుకుంటాము. ప్రణాళికా ప్రక్రియ ప్రారంభకాలంలో గల విదేశీ వ్యాపారము, చెల్లింపుల శేషం పరిస్థితులను, వివిధ పంచవర్ష ప్రణాళికలకాలంలో గల పరిస్థితులను సవివరంగా పరిశీలించిన మీదట భారత విదేశీ చెల్లింపుల విషయంలో సంభవిస్తున్న పరిణామాలను నరైన మరియు కావలసిన, రావలసిన దిశలలో వస్తున్నదీ లేనిదీ విపులీకరించడం జరుగుతుంది.

ఈ భాగం చదివిన మీదట క్రింది భావనలను వివరంగా తెలుసుకోగలుగుతాము. అవి.

భారత దేశ విదేశీ చెల్లింపుల ఖాతాలో పరిణామాలు

★ విదేశీ చెల్లింపుల ఖాతాలో ఇటీవలి సంక్షోభానికి కారణాలు

★ విదేశీ చెల్లింపుల ఖాతాలో సంక్షోభ నివారణ చర్యలు

★ విదేశీ చెల్లింపుల ఖాతాలో సంక్షోభానంతరం పరిణామాలు

★ విదేశీ వ్యాపారం మరియు అంతర్జాతీయ వ్యాపార సంస్థ ప్రభావాలు మొ॥ వి.

15.1 పరిచయము :

విదేశీ వ్యాపారంలతో వ్యవస్థాపూర్వక మార్పులు ముఖ్యంగా మూడు రకాలుగా ఉంటాయి. ఎగుమతుల దిగుమతుల మధ్య వాణిజ్య విలువ, ఎగుమతి దిగుమతుల స్వభావాల అంతర్భాగాలు మరియు విదేశీ వ్యాపార దిశ అనగా ఏఏ దేశాలకు వస్తువులను ఎగుమతి మరియు దిగుమతి చేస్తున్నది మొ॥ వాటి ద్వారా విదేశీ వాణిజ్యంలో మార్పులు తెలుసుకోవచ్చును.

దేశ అభివృద్ధి తొలిదశలో దిగుమతులు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అనంతరం ఎగుమతులు ప్రథన పాత్ర వహిస్తాయి. అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామిక సంబంధ వస్తువులను, అభివృద్ధి చెందని దేశాలు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేస్తాయి. అయితే సాంకేతిక ప్రగతి వల్ల అభివృద్ధి చెందిన దేశాల వస్తు ఉత్పత్తి వ్యయాలు తక్కువగా ఉంటే అభివృద్ధి చెందుతున్న దేశాల ఉత్పత్తి వ్యయాలు ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల ఎగుమతి, దిగుమతి విషయాల్లో ఈ రెండు దేశాలకు వ్యత్యాసముంటుంది. దీనివల్ల అభివృద్ధి చెందిన దేశాలు వ్యాపారశేషం అభివృద్ధి చెందిన దేశాలకు అనుకూలంగాను అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రతికూలంగాను ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల చుట్టూ అభివృద్ధి చెందిన దేశాల వ్యాపారం కేంద్రీకరించబడి ఉంటుంది.

ఈ నేపథ్యంలో మనము ప్రణాళికా యుగం ఆరంభంలోని భారతదేశ విదేశీ వాణిజ్య పరిస్థితులు, వర్తమాన వాణిజ్య పరిస్థితులను పోల్చి విదేశీ వాణిజ్య రంగంలో ప్రణాళికాభివృద్ధికి అనుగుణంగా రావలసిన మార్పులు వచ్చినది లేనిది తెలుసుకోవలసి ఉంది. తర్వాత విదేశీ చెల్లింపులు విషయంలో పరిణామాలలో వచ్చిన మార్పులను పరిశీలించవలసి ఉంది. ఈ కారణం చేత ఈ భాగమున విదేశీ వ్యాపారంపై అంతర్జాతీయ వాణిజ్య సంస్థ ప్రభావాలను వివరించడమైనది. ఎందువలననగా ఇటీవల అంతర్జాతీయంగా విదేశీ వ్యాపారమునందు ఇ.ఊ.ం. యొక్క ప్రభావం చాలా ఉంది. అంతర్జాతీయ వ్యాపారం అనునది అన్ని దేశాలకు ఒక్క 'గ్లోబల్ విలేజ్' గా హద్దులు చెరచి ఒక సంస్థ నిబంధనలకు అనుగుణంగా జరుగుచున్నది. ఈ వ్యాపార నేపథ్యంలోను విదేశీ వ్యాపార చెల్లింపుల శేషంలో సంభవించిన పరిణామాలను వివరించడమయినది. మొదటిగా విదేశీ వ్యాపారం మరియు ఇ.ఊ.ం. ప్రభావాలు గురించి వివరించాము. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకొను సౌలభ్యం కొరకు, విదేశీ వ్యాపార విశ్లేషణ అనంతరం విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం గురించి వివరించాము.

15.2 ప్రణాళికా పూర్వం భారతదేశ విదేశీ వ్యాపారం :

రెండవ ప్రపంచయుద్ధానికి ముందు భారతీయ ఎగుమతులు ఎక్కువగాను, దిగుమతులు తక్కువగాను ఉండేలా 'బ్రిటీష్ ఇండియా' పాలన విధానం ఉండేది. ఎందుకంటే ఇండియాలో పనిచేస్తున్న బ్రిటీష్ మిలటరి ఉద్యోగులకు జీతాలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఫించన్లు, స్టెర్లింగ్ ఋణాలపై వడ్డీ, ఇండియాలో బ్రిటన్ పెట్టుబడులపై మరియు డివిడెండ్లపై వడ్డీలు ఇవన్ని చెల్లించడానికి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారు.

రెండవ ప్రపంచయుద్ధం జరుగుచున్న కాలంలో దేశం యొక్క విదేశీ వ్యాపారంలో మార్పు కనిపించింది. ఎక్కువ మొత్తాలలో వస్తువులను బ్రిటన్కు ఇండియా నుండి ఎగుమతి చేయడం జరిగింది. యుద్ధ కాలమున డిమాండుకు తగిన వస్తువులను ఇండియాకు దిగుమతి చేయలేకపోయింది. దీనివల్ల వ్యాపార సమతౌల్యం దెబ్బతిన్నది. ఎక్కువ ఎగుమతులు తక్కువ దిగుమతులు వల్ల వ్యాపార సమతౌల్యం ఇండియాకు అనుకూలంగా ఉంది. బ్రిటన్తో విదేశీ వ్యాపారం అనుకూలంగా ఉండటం ద్వారా స్టెర్లింగ్ ఋణాలను తీసివేసినా 1947 నాటికి ఇండియా రూ.1733 కోట్లు స్టెర్లింగ్ మిగులు కల్గిఉంది. యుద్ధం వల్ల రక్షణ విధానం అవలంభించడంతో ఇండియాలో వినియోగ వస్తు పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. తూర్పు మధ్య ప్రాంతం మరియు ప్రాశ్చాత్య దేశాలలోను భారత్కు సాన్నిహిత్యం పెరగడంతో ఈ దేశాలులో తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి, వినియోగ వస్తు పరిశ్రమల అభివృద్ధికి, ముడి సరకులను దిగుమతి చేసుకోడానికి అవకాశం కలిగింది. స్వాతంత్ర్యానికి ముందు భారతదేశ ఎగుమతి, దిగుమతి విధానాలను పట్టికలో వివరించాము. దీనిని బట్టి వ్యాపార విధానాన్ని అంచనా వేయవచ్చును.

పట్టిక - 1

1937 - 38 నుండి 1947 - 48 కాలాల్లో

భారతదేశం యొక్క ఎగుమతి, దిగుమతులు (కోట్ల రూ॥లు)

సం॥ము	ఎగుమతులు	దిగుమతులు	వ్యాపారశేషం
1938 - 39	169	152	+17
1945 - 46	266	245	+21
1946 - 47	319	288	+31
1947 - 48	403	ఆ389	+14

పై పట్టికలోని దత్తాంశ సమాచారం ప్రకారం 1938-39 నుండి 1947-48 మధ్య కాలాల్లో దేశ ఎగుమతి దిగుమతులు క్రమంగా పెరుగుతూ వ్యాపారశేషం అన్ని సం॥లో ధనాత్మకంగా సూచిస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రణాళికలు ప్రారంభించు వరకు అనగా 1948-49 నుండి 1950-51 వరకు యుద్ధ సమయంలోను యుద్ధం తరువాత విధించిన కంట్రోళ్లు (నిబంధనలు) వల్ల డిమాండ్ పెరిగి ఎగుమతులు కంటే దిగుమతులు ఎక్కువగా పెరిగాయి. దేశ విభజన వల్ల ఆహార మరియు జనపనారలలో కొరత ఏర్పడుట వల్ల కూడా దిగుమతులు పెరిగాయి.

15.3 ప్రణాళిక కాలంలో విదేశీ వాణిజ్యంలో సంభవించిన స్థూల పరిణామాలు:

15.3.1 1951 నుండి 1979 వరకు గల పరిణామాలు:

ప్రణాళికా కాలంలో ఇండియా విదేశీ వాణిజ్యంలో స్థూల పరిణామాలను విపులంగా అర్థం చేసుకొనుటకు నేటి వరకు ఈ పరిగణలోకి తీసుకొని సరళీకృత ఆర్థిక విధానాలు మరియు వాటి ముందు కాల పరిస్థితులుగా విభజించినట్లయితే బాగుంటుంది. ఇండియాలో 1980 నుండి అనగా ఆరవ పంచవర్ష ప్రణాళికా కాలం నుండి సరళీకరణ విధానాలు మొదలయినట్లు చెప్పవచ్చు.

మొదటి ప్రణాళికా కాలం నుండి ఏడవ ప్రణాళిక అంతమైన వరకు ఎగుమతుల, దిగుమతుల వివరాలు, వ్యాపార శేషంను పట్టిక - 2 లో దత్తాంశ రూపంలో సూచించడమయినది. దీనిని పరిశీలించిన యెడల క్రింది విషయాలు గోచరిస్తాయి. మొదటి ప్రణాళికా కాలంలో వ్యాపారశేషం ఋణాత్మకంగా 108 కోట్ల రూ॥లు ఉంది. ఎందుకంటే పారిశ్రామీకీకరణ ప్రారంభం కావడంతో మూలధన వస్తువులను దిగుమతి చేసుకోవడం జరిగింది. అందువల్ల ఎగుమతులు వార్షిక సగటున రూ.622 కోట్లు ఉండగా దిగమతులు రూ. 700 కోట్లుగా ఉన్నాయి.

రెండవ ప్రణాళికలో పారిశ్రామికీకరణ ప్రారంభమయినది. ఇనుము - ఉక్కు పరిశ్రమల స్థాపన, భారీ విస్తరణ, మరియు రైల్వే పునఃనిర్మాణం మరియు ఎన్నో పరిశ్రమలను ఆధునీకరించడం, వల్ల దిగుమతులు పెరిగాయి. ఈ దిగుమతులతో పాటు ఇతర అవసరాలకు కావలసిన వస్తు దిగుమతులు పెరిగిపోయాయి. అంతర్గతంగా ఏర్పడిన కొరతను ధరలను అదుపులో ఉంచుటకు ఆహార పదార్థాల దిగుమతులు ఉపకరించాయి. ఎగుమతుల వలన 613 కోట్ల రూ॥లు వార్షిక ఆదాయాన్ని పొందాము. అయితే ఎగుమతులు మొదటి ప్రణాళికాకాలం కన్నా తక్కువగా ఉన్నాయి.

మూడవ ప్రణాళికా కాలంలో ఎగుమతులు విలువ రూ.747 కోట్లు కాగా, సగటు వార్షిక దిగుమతులు రూ.1224 కోట్లు. పారిశ్రామికీకరణ పుంజుకోవడం వల్ల దిగుమతులు (యంత్ర సామగ్రి మొ॥వి) పెరిగాయి. అంతేకాక, చైనా, పాకిస్థాన్ లతో యుద్ధాలు. 1965-66 సం॥లో పంటల నష్టాలు, కరువు మొ॥వి ఆహార వస్తువుల దిగుమతులకు కారణమయినాయి. దీనివల్ల ఎగుమతి దిగుమతుల్లో అంతరం ఏర్పడి విదేశీ వ్యాపార శేషం భర్తీకి ఐఓ నుండి రుణాలు తీసుకోవలసి వచ్చింది. అంతేకాక 1966 లో రూపాయి విలువను 36.5 శాతం తగ్గించింది. అయినప్పటికీ పరిస్థితులు చక్కబడక పోవడంతో 59 పరిశ్రమలపై ప్రభుత్వం ఆంక్షలను సరళీకృతం చేసినా లోటు తగ్గకపోగా మరింత పెరిగింది. వార్షిక ప్రణాళికా కాలంలో కొంతవరకు అనుకూల పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఇదే పరిస్థితులను 4వ ప్రణాళికా కాలంలో కూడా అవలంభించుట వల్ల వ్యాపార మిగులు మొదటిసారిగా ఏర్పడింది. అయినా చమురు ధరలు పెరుగుదల వల్ల ఆశించిన మేర పెరగలేదు. మొత్తం మీద 1972-73 మరియు 1976-77 సం॥లలో మిగులు ఏర్పడింది. 5వ ప్రణళికా కాలంలో ముఖ్యమయిన దిగుమతులయిన పెట్రోలియం, ఎరువులు మరియు ఆహార ధాన్యాల ధరలు పెరగడం వల్ల దిగుమతులు విలువ పెరిగింది. ఎగుమతులు కూడా పెరిగాయి. తద్వారా 1976-77లో 72 కోట్ల రూ॥లు మిగులు ఏర్పడింది. ఈ మిగులుకు కారణం - చేవలు, చేవలు సంబంధించిన ఉత్పత్తులు, కాఫీ, టి, వేరుసెనగ, కాటన్ ఫేబ్రిక్, రెడీమెడ్ వస్త్రాలు మరియు చేతి వస్తువులు ఎక్కువగా పెరగడమే. అయితే తరువాత కాలంలో వచ్చిన పారిశ్రామిక తీర్మానాలు ఈ మిగులును ఎంతోకాలం ఉంచలేదు.

15.3.2 1980 సం॥ నుండి 1990 మధ్య కాలంలో భారతదేశ విదేశీ వాణిజ్యం పోకడలు:

పట్టిక - 2 ను పరిశీలించినట్లయితే 1978-79, 5వ ప్రణాళికాకాలం చివరిలో వ్యాపార శేషం మరింత పెరిగింది. అయిల్ ఎగుమతి దేశాలు పెట్రోలు ధరలు పెంచడంతో దిగుమతుల బిల్లు ఒక్కసారిగా 1978-80లో రూ.6814 కోట్లు న్నుండి 1981-82 నాటికి రూ.13,608 కోట్లకు పెరిగింది. లోటు భర్తీకి మరలా IMF నుండి రుణాలు తీసుకోవలసి వచ్చింది. తరువాత కాలంలో సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావం వల్ల 1980 - 81 నుండి 1984 - 85 అనగా ఆరవ ప్రణాళికా కాలంలో వార్షిక సగటు దిగుమతులు రూ.14,986 కోట్లు ఉండగా ఎగుమతులు రూ.9,051 కోట్లు మాత్రమే ఉండి, లోట్లు రూ.5835 కోట్లుకు చేరుకుంది. 1985-86 నుండి 1989-90 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం మరియు జనతాదళ్ ప్రభుత్వం అనుసరించిన స్వేచ్ఛా విధానం వల్ల ఏడవ ప్రణాళికా కాలంలో దిగుమతులు విలువ బాగా పెరిగి లోటు 10,841 కోట్ల రూపాయలకు పెరిగింది.

1989-90 తరువాత 1990-91 మరియు 1991-92 వరకు వార్షిక ప్రణాళికలు, 1992-97 వరకు ఎనిమిదవ పంచ వర్ష ప్రణాళిక అమలు జరిగాయి. 1997-98 నుండి 2002 వరకు 9వ ప్రణాళిక అమలవగా 2002 నుండి 2007 వరకు పదవ ప్రణాళికా అమలులో ఉంది. ఈ కాలంలో అనగా 1991 నుండి నేటి వరకు సరళీకృత ఆర్థిక విధానాల వల్ల వ్యాపార రంగంలో ప్రయివేటు యాజమాన్య జోక్యం పెరిగింది. పోటీతత్వం ఏర్పాటు కావడంతో ఎగుమతి దిగుమతుల్లో అనేక మార్పులు ఏర్పడినాయి. వీటి పరిణామాలను పట్టిక - 3 లో చూడవచ్చును.

15.3.3 నూతన ఆర్థిక సంస్కరణలు, 1991, నుండి భారతదేశ విదేశీ వ్యాపారం:

1991-92 సంవత్సరములో ఎగుమతులు అమెరికా డాలర్లతో చూసినట్లయితే సుమారుగా 1.5 శాతం (1990-91 సంవత్సరములో పోల్చితే) తగ్గినట్లు కనిపిస్తుంది. 1990-91 సం॥ములో $ 18145 మిలియన్లు ఉండగా 1991-92 సం॥లో $ 17866 మిలియన్ల డాలర్లుగా ఉంది. దిగుమతులు మాత్రం బాగా పెరిగాయి. ఈ పెరుగుదల 19.4 శాతంగా నమోదయింది. ఎగుమతులు పెంచుటకు ఎగుమతి-దిగుమతి విధానాల్లో అనేక ప్రోత్సహకాలు ప్రకటించింది. రూపాయి విలువను కూడా తగ్గించింది. కాని అధిక మొత్తంలో ఎగుమతులు జరగలేదు. జనరల్ కరెన్సీ ఏరియా (GCA) లో ఎగుమతులు 6.34 శాతం 1991-92 పెరిగాయి. అయినా రూపాయి చెల్లింపు ఏరియా (RPA) 42.5 శాతంగా నమోదయింది. 1990-91 మధ్య కాలంలో రష్యాలో ఏర్పడిన అంతర్గత రాజకీయ సర్దుబాట్లు కూడా దీనికి తోడవడంతో ఎగుమతులు పెరుగుదల చెప్పదగినవిగా లేవు. 1992-93 సంవత్సరం నాటికి మరింతగా ఎగుమతులు దిగజారాయి. దీనికి అనేక అంశాలను కారణాలుగా చెప్పవచ్చు. 1992-93 సంవత్సరంలో అయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. దిగుమతులపై గల నిబంధనలు తొలగించడం, ఎగుమతులకు సంబంధించిన జనరల్ కరెన్సి ఏరియా (GCA) లో పెరుగుదల మొ॥వి కారణాలుగా పేర్కొనవచ్చు. వ్యాపారము మరియు మారకపు రేట్లలో సరళీకృత ధోరణులు పై అంశాలకు భూమిక వహించాయి. కాని ఎగుమతికి రూపాయి చెల్లింపుల ఏరియా (RPA) తగ్గుముఖం పట్టింది.

పట్టిక - 2

ఇండియా విదేశీ వ్యాపారం 1950 - 51 నుండి 1990 - 91 వరకు (కోట్ల రూ॥లు)

సంవత్సరము	ఎగుమతులు	దిగుమతులు	వ్యాపార విలువ	వ్యాపారశేషం
1950-51	600.7	650.2	1250.9	-49.5
1955-56	608.9	774.3	1383.2	-165.4
1960-61	642.4	1121.6	1764.0	-479.2
1965-66	805.6	1408.5	2214.1	-602.9
1972-73	1971.0	1867	3838	+104
1975-76	4043	5265	9308	-1222
1976-77	5146	5074	10220	+72
1979-80	6459	9022	1548.1	-2,563
1980-81	6711	12523	19234	-5812
1981-82	7781	13560	21341	-5779
1982-83	8803	14293	23096	-5490
1983-84	9771	15832	25603	-6061
1984-85	11744	17134	28878	-5390
1985-86	10965	,19658	30643	-8673
1986-87	12452	20201	32653	-7749
1987-88	15741	22399	38140	-6658
1988-89	20281	27693	47974	-7412
1990-91	32558	43193		-10635

Source : Reserve Bank of India Bulletin.

పట్టిక 3

భారతదేశ విదేశీ వ్యాపారం 1991 - 92 నుండి 2003 - 04 వరకు

(US $ Million)

సంవత్సరము	ఎగుమతులు	దిగు-మతులు	వ్యాపార విలువ	వ్యాపార శేషం
1991-92	17865	19411	37276	-1546
1992-93	18537	21882		-3345
1993-94	22238	23306		-1068
1994-95	26330	28654		-2324
1995-96	31797	36678		-4881
1996-97	33470	39133		-5663
1997-98	35006	41484		-6478
1998-99	33218	42389		-9171
1999-2000	36822	49671	86493	-12849
2000-2001	44560	50536		-5976
2001-02	43827	51413		-7586
2002-03	52719	61412	114131	-8693
2003-04	61718 (అంచనాలు)	75400	137198	-13682

Source : DGCI and S

1992-93 నుండి 1999-2000 మధ్యగల 8 సంవత్సరాల విదేశీవ్యాపార ధోరణులను విశ్లేషించితే ఎగుమతులు 17,866 మిలియన్ల అమెరికా డాలర్లు నుండి (1991-92లో) 31797 మిలియన్ల అమెరికా డాలర్లు (1995-96) అనగా 78 శాతం ఒక్క నాల్గు సంవత్సరాల్లో పెరిగినట్లు తెలుస్తుంది. కాని సరళీకృత విధానాలు అనుసరించుట వల్ల కస్టమ్ సుంకాలు తగ్గి దిగుమతులు పెరిగాయి. 1991-92 లో 19411 మిలియన్ డాలర్లు దిగుమతులు ఉండగా 1995-96 నాటికి 36678 మిలియన్ డాలర్లకు చేరింది. ఈ పెరుగుదల సుమారుగా 89 శాతానికి సమానము. దీని ఫలితంగా వ్యాపార లోటు 4881 మిలియన్ డాలర్లకు పెరిగింది. 1991-92 సం॥లో ఈ లోటు 1545 మిలియన్ డాలర్లు మాత్రమే.

తరువాత కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యాపార విధానంలో అనేక మార్పులు సంభవించాయి. ప్రపంచంలో అనేక దేశాలు ముఖ్యంగా పశ్చిమాసియా దేశాల్లో వ్యాపార ధోరణులు నన్నగిల్లాయి. జపాన్‌లో తిరోగమన ఫలితాలు రష్యా వ్యాపారం 1998 లో ప్రపంచ వ్యాపారంలో 2 శాతానికి పడిపోవడం వంటి పరిస్థితులు మనదేశ విదేశీ వ్యాపారం పై ప్రభావం చూపడం వల్ల మన విదేశీ వ్యాపారంలో తగ్గుదల ఏర్పడింది. 1998-99 సంవత్సరములో మన ఎగుమతులు గత సంవత్సరం కన్నా - అనగా 1997-98 లో 35006 మిలియన్ల డాలర్లు నుండి 33219 మిలియన్ల డాలర్లకు పడిపోయాయి. మరునటి కాలంలో ఎగుమతులు కొంతమేరకు పెరిగాయి. 1999-2000 సం॥లో ఎగుమతులు విలువ 37556 మిలియన్ల డాలర్లు. ఎగుమతుల పెరుగుదల దిగుమతుల కూడా పెరుగుట వల్ల వ్యాపారలోటు బాగా పెరిగింది. మొత్తం మీద 1992-93 నుండి 1999-2000 మధ్య గల ఎనిమిది సంవత్సరాలల్లో సగటు వార్షిక ఎగుమతులు 9.7 శాతం ఉండగా దిగుమతులు 11.4 శాతం ఉంది.

2000-01 నుండి 2003-04 మధ్యకాలంలో అంతర్జాతీయ వ్యాపారంలో మన దేశం యొక్క వాటా ఆశించినంతగా వృద్ధి చెందలేదు. అయితే 1999-2000 సంవత్సరం తర్వాత వ్యాపార లోటు తక్కువగా ఉంది. 2003-04 వార్షిక వ్యాపార లోటు మాత్రం గడిచిన సంవత్సరాలు కన్నా ఎక్కువ ఉంటుందని (13682 మిలియన్ల డాలర్లు) అంచనా వేశారు.

15.4 మన విదేశీ వ్యాపారం - ఎగుమతి మరియు దిగుమతి నిర్ణయకాలు :

15.4.1 ఎగుమతుల నిర్ణయకాలు:

భారత ఎగుమతులను కొన్ని బహిర్గత అంతర్గత కారకాలతో పాటు వాస్తవ మారకపు రేటు నిర్ణయిస్తాయి. బహిర్గత కారకాలలో దిగుమతి దేశాలలోని వృద్ధిరేటు, ప్రపంచ వ్యాపార వృద్ధి రేటు, దిగుమతి చేసుకొను దేశాలలోని ధరల స్థాయి, ఉంటాయి. అలాగే అంతర్గత కారకాల్లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు మరియు ధరల స్థాయిలో మార్పురేటు ఉంటాయి. ఎగుమతులు పెరగడానికి పై వాటితో పాటు తగ్గుతున్న ఎగుమతులు వాస్తవ మారకపురేటు (RERx) ప్రధానమయినది. అయితే ఎగువ కారకాలలో అనుకూల మరియు ప్రతికూల కారకాలున్నపుడు ఎగుమతులు స్థితిని అనుకూల కారకాలలో సాపేక్షంగా బలమైన కారకాలు నిర్ణయిస్తాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని G.E. కాస్టా మహాశయుడు కొన్ని అంశాలను వెలికి తీసాడు, అవి మన ఎగుమతులవృద్ధికి పారిశ్రామిక దేశాలలో వృద్ధికి సంబంధముంది. విదేశీ మాంధ్య పరిస్థితులు మన దేశ వ్యాపారంలో ఎగుమతులను తగ్గిస్తుంది. మారకపు రేటు తగ్గుదల వల్ల కొంతమేర ఎగుమతులు పెరిగాయి. తరువాత కాలంలో ఈ ఎగుమతులు తగ్గాయి.

15.4.2 దిగుమతి నిర్ణయకాలు:

దేశం యొక్క వృద్ధిరేటు మరియు సాపేక్ష దిగుమతుల ధరలు దిగుమతి నిర్ణయకాలులో ప్రధానమయినవి. ఇండియాలో అధిక వృద్ధి రేటు మరియు తగ్గిన సాపేక్ష ధరలు కలసి దిగుమతుల పరిమాణం ఎక్కువ చేసింది. దిగుమతుల విషయమై G.E కాస్టా ఈ విశ్లేషణ చేసాడు (1) చాలా సంవత్సరాలలో ఆర్థికావృద్ధిలోని పెరుగుదల మరియు సాపేక్ష ధరలోని పెరుగుదల కలసి దిగుమతి పరిమాణం తగ్గుదలకు దారి తీసింది. (2) కొన్ని సార్లు ఆర్థిక వృద్ధిలోని పెరుగుదల మరియు సాపేక్ష దిగుమతులోని తగ్గుదల కలసి ఎగుమతుల పరిమాణం పెంచింది (3) 1977-78 నుండి పెరుగుచున్న పారిశ్రామిక అవసరాలు అదేవిధంగా ఎగుమతుల ధరలో వచ్చిన పెరుగుదల మరియు ప్రభుత్వం అనుసరించిన దిగుమతుల సరళీకరణ ప్రక్రియ మన దిగుమతుల పెరుగుదలకు కారణభూత మయినాయి. (4) దిగుమతి సాపేక్ష ధరలు దిగుమతులను ప్రభావితం చేస్తాయి. (5) మొత్తం మీద మన దిగుమతులకు ఆర్థికవృద్ధి రేటుకు అనుసరించి ఉన్నాయని పేర్కొనడం జరిగింది.

15.5 స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి వ్యాపార పరిమాణల ధోరణి - ముఖ్యాంశాలు:

మన దేశం యొక్క విదేశీ వ్యాపారంలో ఎగుమతి దిగుమతుల మార్పులు సమీక్షను క్రింద వివరించాము.

15.5.1 పెరుగుచూ ఉన్న వ్యాపార విలువ:

1950-51 లో భారత విదేశీ వ్యాపారం విలువ 1250 కోట్ల రూపాయలు నుండి 1980-81 నాటికి రూ.19000 కోట్లకు పెరిగింది. అలాగే 1995-96 నాటికి 2,28,110 కోట్ల రూ॥కు చేరింది. గత 10 సం॥ల కాలంలోనే అత్యధిక పెరుగుదల కనిపించింది. ఇంత త్వరితగతిన పెరుగుచున్న అంతర్జాతీయ వ్యాపారం వలన భారత్‌ను ఎక్కువస్థాయి అభివృద్ధి కలిగిన ఆర్థిక వ్యవస్థగా వర్గించవచ్చును. 2002-2003 నాటికి 114131 మిలియన్లు డాలర్లు ఉండగా 2003-04 లో 137198 మిలియన్లు డాలర్లకు పెరగనున్నది.

15.5.2 అధిక మొత్తంలో దిగుమతులు పెరగడం:

1. పారిశ్రామికీకరణ నిమిత్తం అధిక ముడిపదార్థాలు, యంత్ర పరికరాలు దిగుమతి చేసుకోవడం, (2) పెరుగుచున్న జనాభావలన, తరచుగా సంభవించు ప్రకృతి వైపరిత్యాలు, ఉత్పత్తిలో కొరత నివారణకు దిగుమతులు పెరిగాయి (3) పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల నిత్యవసరవస్తువుల కొరతను నివారించుటకు దిగుమతులపై ఆధారపడవలసి వచ్చింది. (4) రక్షణవస్తు కొనుగోలు, విలాస

15.7 భారతదేశ దిగుమతులలో అంతర్భాగాలు మరియు మార్పుల ధోరణులు.

మన దిగుమతులలో అనేక రకాల వస్తువులు ఉన్నాయి. వాటి ప్రాధాన్యత క్రమం క్రమేపీ మారుచున్నది. పట్టిక - 5 నందు ఈ విషయాన్ని గ్రహించవచ్చును. పరిశ్రమరంగంలో అభివృద్ధి మరియు స్వేచ్ఛా వ్యాపార విధానం వలన దిగుమతులు డాలర్ ధరలలో 28 శాతం, (1995-96) పెరిగాయి. ఎక్కువ పెరుగుదల ఎరువులలో 60 శాతం, ఎడిబల్ ఆయిల్ (edible oil) 24 శాతం, పేపరు బోర్డు, తయారీ మరియు వార్తా ప్రింట్లు 92 శాతం, మూలధన వస్తువులలో 34 శాతం, వజ్రాలు, ముత్యాలలో 29 శాతం సంభవించింది. ఇది ఇలా ఉండగా Cereals లో 19 శాతం తగ్గుదల, రవాణా పరికరాలలో ఋణాత్మక వృద్ధి కనిపించింది.

మొత్తం మీద దిగమతులలో గమనించిన వలసినది ఏమంటే 1995 లో 277 శాతం ఉన్న మూలధన వస్తువులు 1996 నాటికి 25 శాతానికి తగ్గిపోయాయి. ఎరువులు 5 శాతం నుండి 2.1 శాతానికి, ఇంధన దిగుమతులు 28 శాతం నుండి 21.5 శాతానికి తగ్గాయి. 2002 - 03 లో మూలధన వస్తువులు దిగుమతి గతం కన్నా తగ్గాయి. ప్రణాళికాభివృద్ధి తొలిదశలో దిగుమతులు తక్కువ రేటులోను కేవలం తయారైన పారిశ్రామిక మరియు వినియోగ వస్తువులు ఎక్కువగాను ఉండేవి.

పట్టిక - 5

భారతదేశ దిగుమతులలో అంతర్భాగాలు - ఇటీవలి పరిణామాలు (శాతంలో)

వస్తువులు	1974-95	1995-96	1996-97	2002-03	2003-04
A) ఆహారం, ఆహార సంబంధమైనవి	5.8	3.6	3.6	4.7	4.8
1. Cerials	0.1	0.1	0.1	---	---
2. Pulses	0.7	0.6	0.5	1.0	0.7
3. Cashewnuts	0.8	0.6	0.4	0.5	0.4
4. Edible oils	0.7	1.8	2.5	2.9	3.4
B. Fuel	23.2	23.0	28.0	30.6	28.7
5. బొగ్గు	2.5	2.5	2.5	2.0	1.9
6. POL	20.7	20.5	25.5	28.6	26.8
C. ఎరువులు	3.7	4.6	2.1	1.1	1.1
D. పేపరు బోర్డు etc.,	0.9	1.3	1.5	0.8	0.9
E. మూలధన వస్తువులు	26.5	27.8	25.0	11.2	11.9
7. ఎలక్ట్రానిక్ యంత్రాలు	9.5	10.7	10.6	5.9	6.1
8. ఎలక్ట్రికల్ యంత్రాలుetc.	5.2	5.8	4.6	1.1	1.1
9. రవాణా వస్తువులు	3.9	3.0	2.7	2.1	2.7
10. ప్రాజెక్టు వస్తువులు	6.5	6.5	5.1	0.9	0.5
F. ఇతరములు	24.0	23.0	24.8	28.7	30.0
11. రసాయనాలు	10.3	9.9	9.7	7.0	7.5
12. ముత్యాలు etc.,	5.7	5.7	6.9	10.1	9.4
13. ఇనుము ఉక్కు	3.8	3.7	3.8	1.5	1.8
14. Non Ferrous metals	2.5	2.5	2.9	1.1	1.2
15. వృత్తి సంబంధ ఆప్టికల్ వస్తువులు	1.7	1.8	1.5	1.9	1.6
G. విభజించని వస్తువులు	16.1	16.1	15.1	23.0	22.6
మొత్తం (A+B+C+D+E+F+G)	100	100	100	100	100

15.8 ఎగుమతులలో అంతర్భాగాలు :

స్వాతంత్ర్యం సిద్ధించునాటికి మనదేశ ఎగుమతులలో ప్రధానంగా జనపనార, టి మరియు నూలు వస్త్రాలు ప్రధానమయినవి. ప్రణాళిక అమలుకాలానికి పారిశ్రామీకీకరణ లేకపోవుటవల్ల వాటి ఉత్పత్తులు ఎగుమతుల్లో అంతగాలేవు. మొత్తం మీద 1960-61 నాటికి ఎగుమతులు 1040 కోట్లు కాగా వాటిలో జనపనార వస్తువులు 213 కోట్లు కలిగి ఉంది. ఆయా వస్తువుల ఎగుమతి స్థాయి క్రమాలను పట్టిక - 6లో చూడవచ్చు.

మన ఎగుమతులను ప్రధానంగా నాలుగు వర్గాలుగా విభజించవచ్చు. 1. వ్యవసాయ సంబంధమయినవి, 2. ఖనిజ సంబంధమయినవి. 3. తయారీ వస్తువులు 4. మినరల్ మరియు బ్రికెంట్స్.

పట్టిక - 6

భారతీయ ఎగుమతుల వర్గీకరణ - అంతర్భాగాలు (రూ॥ కోట్లలో)

వర్గము	1970-71	1980-81	1993-94	2002-03
1. వ్యవసాయ సంబంధమైనవి	487	2057	15315	33691
	(31.7)	(30.6)	(22.0)	(12.8)
2. ఓర్స్ & ఖనిజాలు	164	413	2785	7591
	(10.7)	(6.2)	(4.0)	(3.8)
3. తయారీ వస్తువులు	772	3747	52083	198760
	(503)	(55.8)	(74.3)	(76.6)
4. పెట్రోలియం వస్తువులు	13	28	1248	13102
	(0.8)	(0.4)	(1.8)	(4.9)
5. ఇతరములు	99	465	1106	1993
	(6.5)	(6.9)	(1.6)	(2.0)
మొత్తం	1535	6710	69757	255137
	(100)	(100)	(100)	(100)

పై పట్టిక ద్వారా తెలియునదేమనగా 1970-71 నుండి 2002-03 వరకు గల మధ్య కాలంలో సాంప్రదాయ వస్తువులయిన వ్యవసాయ సంబంధ వస్తువుల ఎగుమతుల ద్రవ్య రూపంలో పెరుగుదల కనిపించినప్పటికీ వాటి యొక్క శాతం క్రమేపి తగ్గుచున్నది. 1970-71 సం॥లో 4. వ్యవసాయం మరియు ఖనిజాలవాటా మొత్తం ఎగుమతులలో 42 శాతం ఉండగా 16.6 శాతానికి, 2002-03 లో నమోదయింది. తయారీ రంగంలో ఎగుమతుల్లో మంచి పురోగతి కనిపించింది. 1970-71 సం॥లో మొత్తం ఎగుమతుల యందు వీటిశాతం 50.3 ఉండగా క్రమేపీ పెరుగుచూ 2002-03 నాటికి 70.6 శాతానికి చేరింది. 2003-04 సం॥ల ఏప్రిల్-జనవరి మధ్యలో ఈ పెరుగుదలలో మార్పులు కనిపించాయి.

మన ఎగుమతులలో ప్రధానమయిన వస్తువుల గురించి ముందుగానే తెలుసుకున్నాము. వీటిని స్థూలంగా పట్టిక - 7 నందు వివరించాము. మొత్తం ఎగుమతులలో ప్రధానంగా, తయారీ వస్తువులే ఎక్కువ. దాని తరువాత జీడిపప్పు, ఇంజనీరింగ్ వస్తువులు క్రమసంఖ్యను కలిగి ఉన్నాయి. 2002-03 నాటికి తయారీ వస్తువులు (198760 కోట్ల రూ॥లు), ప్రథమ స్థానాన్ని కలిగి ఉంది. టెక్స్‌టైల్స్, రెడీమేడ్ గార్మెంట్స్ కూడా ప్రధాన ఎగుమతులుగా ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులు సుమారుగా 33691 కోట్ల రూ॥లు ఉన్నాయి.

పట్టిక - 7

భారతీయ ప్రధాన ఎగుమతులు (కోట్ల రూపాయల్లో)

రకం	1960-61	1970-71	1980-81 ,	1990-91	2002-03
కాఫి	2	25	214	252	994
టి	195	148	426	1070	1652
పండ్లు, కూరగాయలు	7	18	116	335	1692
పత్తి & తయారీవస్తువులు	91	75	277	2100	16217
తోళ్ళు & తోళ్ల వస్తువులు	39	72	337	2566	3945
ఇనుము ఓర్	27	117	303	1049	4200
పొగాకు	25	33	141	263	1022
ఇంజనీరింగ్ వస్తువులు	13	130	727	3877	1420
తయారీ వస్తువులు	-	9	378	4012	5120
జీడిపప్పు	30	52	140	447	2053
చేతి పనులు వస్తువులు	-	70	894	6167	9140
చేపలు, మొ॥వి	7	31	213	960	6928
బియ్యం	-	5	224	462	5832

5.9 భారతదేశ వ్యాపారదశ - ఇటీవలి పరిణామాలు:

ఏదేని ఒకదేశం యొక్క విదేశీ వ్యాపారమును పూర్తిగా అర్థం చేసుకొనుటకు ఆ దేశ వ్యాపార దిశ గురించి తెలుసుకోవాలి. 1950-51 నుండి మన వాణిజ్య దిశలో గణనీయమైన మార్పులు సూచించబడినాయి. ఒకప్పుడు మన వాణిజ్యంలో అతిపెద్ద భాగ స్వామి అయిన ఇంగ్లాండుతో సంబంధాలు తగ్గి మిగిలిన దేశాలతో సంబంధాలు వృద్ధి చెందాయి. వ్యాపారదిశను వివిధ ప్రాంతాలుగా విభజిస్తే అమెరికా ప్రాంతంలో (ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా, ఇతర అమెరికా దేశాలు) 1951 - 52 సం॥లో సుమారుగా 28.2 శాతం ఎగుమతులు ఉండగా దిగుమతులు 36.3 శాతం ఉండేది. యూరఫ్ దేశాలు (పశ్చిమ ఐరోపా, EFTA, ఆస్ట్రేలియా, నార్వే, పోర్చుగల్, స్వీడన్, స్విట్జర్‌లాండ్, ECM ,తూర్పు ఐరోపా) 36.8 శాతం ఎగుమతులు 31.5 శాతం దిగుమతులు ఉన్నాయి. ఆసియా దేశాలు 27.8 శాతం, ఎగుమతులు, 22.7 శాతం దిగుమతులు ఉన్నాయి. మరిన్ని విషయాలను పట్టిక - 8 లో తెలిపాము.

(1951-52 నుండి నేటి వరకు) ప్రారంభంలో పారిశ్రామిక దేశాలలో కేంద్రీకృతమయిన మన వ్యాపార దశ రానురాను అభివృద్ధి చెందుతున్న దేశాలవైపు మరలుచున్నది. ఆయా గ్రూపులుగా విభజించిన దేశాల్లో వ్యాపార శాతాన్ని గమనించినట్లయితే యూరోపియన్ యూనియన్ (జూఏ) మరియు ఆఫ్రికా దేశాలు ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. ంఆఙ్యూ దేశాల్లో సౌది అరేబియా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆఫ్రికా ప్రథమ స్థానంలో ఉంది.

పట్టిక - 8 గమనించినట్లయితే దేశాలవారీగా అమెరికాలో మంచి వ్యాపార సంబంధాలున్నట్లు తెలుస్తుంది. 1960-61 సంవత్సరంలో 16 శాతం ఎగుమతులు అమెరికా ఆక్రమించగా 1970-71, 1980-81, 1990-91 మరియు 2002-03 సంవత్సరాలలో ఈ దేశానికి గల ఎగుమతుల శాతం వరసగా 13.5%, 11.1%, 14.7%, 20.1% శాతంగా నమోదు అయింది. 2002-03 నాటికి 20.7 శాతం ఎగుమతులు అమెరికా దేశానికి అయినాయి. యుకె తో మనకు గల ఎగుమతుల సంబంధాలు క్రమేపి తగ్గుముఖం పట్టాయి. ఈ మధ్యక ంలో తూర్పు దేశాలలో మన వ్యాపార సంబంధాలు క్రమంగా పెరుగుచున్నవి. సొవియట్ రష్యాతో ఈ మధ్యకాలంలో విదేశీ వ్యాపారంలో మార్పుల రీత్యా, హెచ్చు తగ్గులకు లోనయింది. ఇరాక్ మరియు ఇరాక్‌లు కూడా మన వ్యాపారంలో ప్రముఖస్థానాన్ని

ఆక్రమించాయి. ముఖ్యంగా అయిల్ దిగుమతుల్లో యుద్ధకాలంలో సౌదీ అరేబియా నుండి చమురు దిగుమతులు పెరిగాయి. ఇంగ్లాండు తరువాత కామన్‌వెల్త్ తో భాగస్వామ్యమయినప్పటికి ఇతర దేశాలతో సంబంధాలు కలిగి వ్యాపారాన్ని విస్తరించు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కొరియా, సింగపూర్, మలేషియా, హంకాంగ్ మరియు తైవాన్ నిరంతర అభివృద్ధి సాధించుట నేపథ్యంలో అదే పంథాలో నిర్భంధాలు లేని ఆర్థిక స్వేచ్ఛ విధానాలు ద్వారా ఎగుమతులు పెంచు అవకాశాలు అన్వేషిస్తున్నారు.

పట్టిక - 8

ఇండియా విదేశీ వ్యాపారదిశ - వివిధ దేశాల్లో వ్యాపారం (శాతంలో)

ప్రాంతం / దేశం	1960-61		1970-71		1980-81		1990-91		2002-03		2003-04	
	ఎగు మతులు	దిగు మతులు	Ex	Im	Ex	Im	Ex	Im	Ex	Im	Ex	Im
1. OECD	66.1	78.0	50.1	63.8	46.6	45.7	53.5	54.0	50.0	37.9		
1. E.U.	36.2	37.1	18.4	19.6	21.6	21.0	27.5	29.4	21.2	19.0		
(a) బెల్జియం	0.8	1.4	1.3	0.7	2.2	2.4	3.9	6.3	3.2	6.0		
(b) ఫ్రాన్సు	1.4	1.9	1.2	1.3	2.2	2.2	2.4	3.0	2.0	1.8		
(c) జర్మనీ	3.1	10.9	2.1	6.6	5.7	5.5	7.8	8.0	4.0	3.9		
(d) నెదర్లాండ్స్	1.3	0.9	0.9	1.2	2.3	1.7	2.0	1.8	2.0	0.6		
(e) UK	26.9	10.4	11.1	7.8	5.9	5.8	6.5	6.7	4.7	4.5		
(a) ఉత్తరఅమెరికా	18.7	31.0	15.3	34.9	12.0	14.7	15.6	13.4	22.0	8.2		
(b) కెనడా	2.7	1.8	1.8	7.2	0.9	2.6	0.9	1.3	1.3	0.9		
4. USA	16.0	29.2	13.5	27.7	11.1	12.9	14.7	12.1	20.7	7.2		
మిగిలిన OECD	10.1	7.1	15.2	7.4	10.6	7.4	10.4	11.2	4.6	5.3		
ఆస్ట్రేలియా	3.5	1.6	1.6	2.2	1.4	1.4	1.0	3.4	1.0	2.2		
జపాన్	5.5	5.4	13.3	5.1	8.9	6.0	9.3	7.5	3.5	3.0		
2. OPEC	4.1	4.6	6.4	7.7	11.1	27.8	5.6	16.3	13.1	5.6		
ఇరాన్	0.8	2.6	1.7	5.6	1.8	10.7	0.4	2.4	1.2	0.4		
ఇరాక్	0.5	0.2	0.6	0.2	0.8	6.0	0.1	1.1	0.4	*		
కువైట్	0.5	0.0	1.0	0.3	1.4	2.7	0.2	0.8	0.5	0.3		
సౌదిఅరేబియా	0.5	1.3	0.9	1.5	2.5	4.3	0.3	6.7	1.8	0.7		
3. తూర్పుయూరప్	7.0	3.4	21.0	13.5	22.1	10.3	17.9	7.8	1.8	1.3		
GOR	0.5	0.3	1.6	1.1	0.7	0.4	*	*	*	*		
రోమానియా	0.2	0.4	0.9	1.0	0.9	0.8	0.3	0.1	0.1	0.1		
రష్యా	4.5	1.4	13.7	6.5	18.3	8.1	16.1	5.9	1.3	1.0		
4.మిగిలిన LDCS	14.8	11.8	19.8	14.6	19.2	15.7	16.8	18.4	30.8	19.6		
ఆఫ్రికా	6.3	5.6	8.4	10.4	5.2	1.6	2.1	2.2	3.2	1.8		
ఆసియా	6.9	5.7	10.8	3.3	13.4	11.4	14.3	14.0	25.3	16.0		
లాటన్‌అమెరికా కరేబియన్	1.6	0.4	0.7	1.0	0.5	2.5	0.4	2.3	2.3	1.8		
5. ఇతరములు	8.0	2.2	2.7	0.4	1.0	0.5	6.2	3.5	4.2	35.6		
మొత్తం	100	100	100	100	100	100	100	100	100	100		

(* జర్మనీలో ఇమిడిఉన్నవి)

పట్టిక - 8.1

మన విదేశీ వ్యాపారం గల ప్రధాన దేశాల వాటా

దేశం	2000-01	2001-02	2002-03
USA	13.0	12.2	13.4
UK	5.7	5.0	4.6
Belgium	4.6	4.4	4.7
Germany	3.9	4.0	4.0
Japan	3.8	3.8	3.8
Switzerland	3.8	3.4	2.4
Honkong	3.7	3.2	3.1
UAE	3.4	3.6	3.8
China	2.5	3.1	4.2
Singapore	2.5	2.4	2.5
Malaysia	1.9	2.0	1.9
మొత్తం	48.6	47.2	47.9

15.10 భారతదేశ విదేశీ వ్యాపార చెల్లింపులు శేషం:

ఒక నిర్మీత కాలంలో ఒక దేశం ఇతర దేశాలకు చెల్లించు మొత్తానికి విదేశాలనుండి ఆ దేశానికి వచ్చే రాబడి మొత్తానికి గల తేడానే చెల్లింపుల శేషం అంటారు. ఒక దేశం అనిపైన వాడిన పదం వ్యక్తులకు, వ్యాపార సంస్థలకు వివిధ స్థానిక ప్రభుత్వాలకు కూడా వర్తిస్తుంది. ఒక దేశ చెల్లింపుల శేషం ఖాతా అంతర్జాతీయ వ్యాపారమునకు సంబంధించిన మన దేశపు మొత్తం ఆర్థిక వ్యవహారాలను సూక్ష్మీకరించి చెబుతుంది. ఈ ఖాతాలో సాధారణంగా వర్తమాన మరియు మూలధన ఖాతాలు ప్రధానంగా ఉంటాయి. ఒక దేశం నుండి మరోక దేశానికి వస్తుసేవలు వాస్తవంగా బదిలీ అయ్యే వ్యవహారాలను 'వాస్తవ వ్యవహారాలు' అంటారు. ఇవి ఆదాయాన్ని సృష్టించే వ్యవహారాలు. వీటిని మూలధన వ్యవహారాలు అంటారు. ఇవి ఆదాయ స్థాయిని ప్రత్యక్షంగా ప్రభావితం చేయవు. అందువలన ఆదాయాన్ని సృష్టించే వాస్తవ వ్యవహారాలను చెల్లింపుల శేషం వర్తమాన ఖాతాలోను, ద్రవ్య సంబంధమైన వ్యవహారాలను చెల్లింపుల శేషం మూలధన ఖాతాలోనూ చూపుతాయి. చెల్లింపుల ఖాతాలో వసూళ్లకు సంబంధించిన వ్యవహారాలను చెల్లింపులకు సంబంధించి ఈ రెండు శాలను సూచిస్తారు. స్వాతంత్రనంతరం మనదేశ వ్యాపార చెల్లింపులు క్రింది విధంగా ఉన్నాయి.

పట్టిక - 9

భారతదేశ వ్యాపార చెల్లింపుల శేషం (కోట్ల రూ॥లు)

ప్రణాళిక	వాణిజ్య లోటు	నికర ఆదృశ్యాంశాలు	వ్యాపార చెల్లింపుల శేషం	3 as % of 2
(1)	(2)	(3)	(4)	(5)
మొదటి ప్రణాళిక	- 542	500	- 42	92.2
రెండవ ప్రణాళిక	-2339	614	-1725	26.5
మూడవ ప్రణాళిక	-2382	431	-1951	81.1
వార్షిక ప్రణాళిక	-2067	52	-2015	2.5

4వ ప్రణాళిక	-1564	1664	+100	106.4
5వ ప్రణాళిక	-3179	6221	+3082	195.7
6వ ప్రణాళిక	-30456	19072	-11384	62.6
7వ ప్రణాళిక	-54204	+13157	-4104.7	24.3

మూలము : RBI Bulliten.

పై పట్టిక నుండి, మొదటి ప్రణాళికలో మన వ్యాపార చెల్లింపులు కొరియన్ యుద్ధం వల్ల ఏర్పడిన ద్రవ్యోల్బణం, 1953 లో అమెరికాలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం మరియు సంతృప్తికరమయిన వ్యాపార ఉత్పత్తులు, పారిశ్రామిక రంగం అనుకూలత వల్ల వ్యాపారశేషంలో కేవలం రూ. 42 కోట్లు మేర లోటు నమోదయింది. రెండవ ప్రణాళికలో ఈ లోటు రూ.2339 కోట్లకు చేరినా నికర అదృశ్యాంశాలు రూ. 614 కోట్లను మిగులుగా వ్యాపార చెల్లింపుల శేషం రూ.1725 కోట్లకు చేరింది. దీనికి కారణం, ఖాదీ మరియు మోళిక పరిశ్రమలకు కావలసిన మూలధన వస్తువులను పెద్దమొత్తంలో దిగుమతి చేసుకోవడం, వ్యవసాయ ఉత్పత్తి దేశీయ డిమాండుకు సరిపడినంతగా లేనందున పెరుగుచున్న జనాభాకు కావలసిన ఆహారపదార్థాలు, పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలను దిగుమతి చేసుకోవడం బరిగింది. 3వ ప్రణాళికలో రక్షణా సామగ్రిని దిగుమతి చేసుకోవడం, స్వదేశీ మార్కెటులో ఆహార ధాన్యాల కొరతను నివారించుటకై భారీగా దిగుమతి చేసుకున్న ఆహారధాన్యాల వల్ల ఈ లోటు మరింతగా పెరిగింది. అంతర్గత కొరతను నివారించుటకు వార్షిక ప్రణాళికలో దిగుమతులు చేసుకున్నారు. 4వ ప్రణాళికలో పరిస్థితులు చక్కబడటంవల్ల భారతదేశ విదేశీవ్యాపార చరిత్రలో మొదటిగా వ్యాపార శేషంలో మిగులు రూ.104 కోట్లు ఏర్పడింది. అయితే 1973 సం॥ము నుండి పెరుగుచున్న ఆయిల్‌ధరల వల్ల సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొనవలసినా ఎగుమతుల విస్తరణల విధానం, దిగుమతుల ప్రత్యమ్నాయ విధానం, స్వావలంభన మొ॥ చర్యలు వల్ల మరొకసారి 1976-77లో రూ.68 కోట్లు మేర మిగులు సాధించాము. 1972-73 మరియు 1976-77 సం॥ మినహా మొగిలిన అన్ని కాలాలలోను లోటు పెరిగింది. 5వ మరియు ఆరవప్రణాళికలలో లోటు మరింత పెరిగింది. దిగుమతులు పెరిగిపోయి ఎగుమతులు తగ్గడం దీనికి గల ప్రధాన కారణం. నిరాపేక్షంగా చూచినపుడు ఏడవప్రణాళికా కాలంలో వ్యాపార విలువ ముందు ప్రణాళిక కన్నా అధికంగా ఉంది. అదృశ్యాంశాలు ఎక్కువ పెరిగినప్పటికీ వాణిజ్య లోటు రూ.54204 కోట్లకు పెరిగినందున ప్రణాళికాంతానికి వ్యాపార చెల్లింపులలోటు రూ.41041 కోట్లుగా చూపడమయినది. 2001-2002 సంవత్సరములో ఈ లోటు సుమారుగా 60427 మి॥డాలర్లు. మరునటి సంవత్సరంలో అనగా 2002-03 సంవత్సరంలో వాణిజ్య లోటు 62428 మిలియన్ డాలర్లు. నికర అదృశ్యాంశాలు ఈ రెండు సంవత్సరాలలో లోటుకన్న కొంచెం మెరుగుగా ఉన్నవని చెప్పవచ్చును. తద్వారా చెల్లింపుల శేషంలో అనుకూల ఫలితాలు వచ్చినట్లు కనబడుతుంది.

15.10.1 1990లో విదేశీ చెల్లింపుల సంక్షోభానికి దారితీసిన పరిస్థితులు:

ఏడవ ప్రణాళిక ముగిసిన తర్వాత ఇండియాలో రాజకీయాల్లో అస్థిరత్వ ప్రభుత్వాల వలన ఎనిమిదవ ప్రణాళిక ప్రారంభానికి ముందు వార్షిక ప్రణాళికలు అమలు జరుపబడినాయి. తర్వాత 1992 ఏప్రిల్ నుండి 1997 మార్చి 31 వరకు ఎనిమిదవ ప్రణాళికలో వ్యాపార చెల్లింపుల లోటు మరింతగా పెరిగింది. పట్టిక చూడండి.

పట్టిక - 10

వార్షిక మరియు 8వ ప్రణాళికలో విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం (మి.డాలర్లు)

సంవత్సరము	వాణిజ్య లోటు	నికర అదృశ్యాంశాలు	వ్యాపార చెల్లింపుల శేషం
1990-91	- 9438	-242	-9680
1991-92	- 2798	+1620	-1178
1992-93	- 4368	+ 820	- 3526
1993-94	- 2386	+ 1228	- 1158
1994-95	- 4983	+ 2349	- 2634
1995-96	- 8945	+ 3511	- 5434
2001-02	- 12703	+ 13485	+
2002-03	- 12910	+ 17047	+

1990-91 నాటికి 1980 మిఱడాలర్లు వ్యాపార శేషంలో లోటు ఉండి. 1980-81 నాడు లోటు తక్కువ. 1980-81 నుండి 1990-91 నాటికి మనవ్యాపార శేషంలో లోటు నూమారుగా రెట్టింపయింది. ఇది ఆర్థిక సంక్షోభానికి దారి తీసిందని చెప్పవచ్చు. చాలా మంది ఆర్థికవేత్తలు వ్యాపార చెల్లింపుల శేషంలో ఏర్పడిన సంక్షోభానికి ప్రధానంగా - విదేశీ ఋణసేవలలో మరియు రెమిటెన్సులలో పెరుగుదల వలన 1980-81 లో 73 శాతం, 1980-85లో 60 శాతం వ్యాపార లోటును పూరించిన నికర అదృశ్యాంశాలు 1990-91 నాటికి 13 శాతానికి పడిపోవుట వల్ల వ్యాపార చెల్లింపుల సంక్షోభానికి ప్రధానమైనది. తర్వాత బడ్జెటులో కాలానుగుణంగా పెరిగిన అధికలోటు, ఆహారము, ఎరువులపై ఇచ్చిన అత్యధిక సబ్సిడీలు వ్యవసాయదారుల ఋణాల వడ్డీ మాఫీ వంటి అంతర్గత అంశాలతో పాటు గల్ఫ్ దేశాల్లో ఏర్పడిన సంక్షోభ పరిస్థితులు, అప్పటి ఏఐఎఫ్ లో వచ్చిన మార్పులు వలన వ్యాపార సంబంధాలలో విరామం ఏర్పడటం మరియు పారిశ్రామిక దేశాలలో ఏర్పడిన మాంద్య పరిస్థితులు వంటి అంతర్జాతీయ పరిణామాలు కూడా 1990 - 91 నాటికి తీవ్ర సంక్షోభానికి దారితీసాయి. ఈ సమయంలో మనదేశీ విదేశీ మారక నిల్వలు కనిష్టస్థాయికి చేరుకున్నాయి. కరెంటు ఖాతాలో లోటుయ్యూలదేశియోత్పత్తిలో 2.5 శాతం కన్నా అధికంగా ఉంది. అలాగే విదేశీ రుణసేవల భారము ఎక్కువగా పెరిగి దాదాపు వర్తమాన ఖాతా రాబడిలలో 21 శాతంగా ఉన్నాయి. దిగుమతుల పెరుగుదల రేటుకన్నా ఎగుమతులు పెరుగుదల రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ ఎగుమతులు రాబడిలో 26 శాతం వరకు విదేశీ రుణ సేవల చెల్లింపులు ఉండుటచే మన విదేశీ మారక నిల్వలలో 1990-91 నాటికి గణనీయంగా తరుగుదల ఏర్పడింది. ఇదే సమయమున ప్రవాస భారతీయులు డిపాజిట్లు ఉపసంహరణతో ఈ సమస్య మరింత తీవ్రతరమయింది. దీని వల్ల అంతర్జాతీయంగా పరపతి పొందే స్థాయి తగ్గింది. జూన్ 1991 నాటికి మన విదేశీ మారక నిల్వలు అత్యల్ప స్థాయికి తగ్గాయి. కనీసం రెండు వెలలు దిగుమతులకు మరియు అంతర్జాతీయ చెల్లింపులకు సరిపోని స్థితి ఏర్పడ చే అంతర్జాతీయ మార్కెటులో మనదేశము ఎడల విశ్వసనీయత సమన్య ఏర్పడింది. ఈ విధంగా వ్యాపార చెల్లింపుల శేషంలో సంక్షోభం మరియు దాని స్వభావరీత్యా మన ప్రభుత్వం 1991లో నూతన వాణిజ్య విధానమును ప్రకటించి అందులో చెల్లింపుల శేషం లోటు సమస్యకు నివారణా చర్యలను చూపింది.

15.10.2 చెల్లింపుల శేషంలోని సంక్షోభానికి నివారణా చర్యలు:

1990-91 ఆర్థిక సంవత్సరానికి తారస్థాయికి చేరిన చెల్లింపుల శేషంలోని సంక్షోభాన్ని నివారించుటకు కాంగ్రెస్ ప్రభుత్వం 1991లో పలు చర్యలు తీసుకుంది. బంగారు నిల్వల తాకట్టు పెట్టడం, రూపాయి విలువను తగ్గించడం, దిగుమతులను నియంత్రించడం, ఎగుమతులకు ప్రోత్సహకాలివ్వడం, అదృశ్యాంశాలను నుండి ఆదాయాన్ని పెంచుకోవడం, రక్షణ విధానాన్ని పాటించడం ద్వారా దిగుమతులను అరికట్టడం, మారకపు రేట్లులో మార్పులు మొదలయిన చర్యలు తీసుకొన్నారు. మన రిజర్వు బ్యాంకు వద్ద నిల్వయున్న

బంగారం దాదాపు 47 టన్నులు తాకట్టుగా ఉంచి రమారమి $ 600 మిలియన్ల అమెరికా డాలర్లను సంపాదించారు. మన రూపాయి విలువను రెండు పర్యాయములు ఒకే మాసంలో బహిర్గత విలువను 18 శాతం నుండి 20 శాతం వరకు తగ్గించారు. మన రూపాయి విలువను తగ్గించుటవల్ల అమెరికా, బ్రిటన్, జర్మనీ, జపాన్ మరియు ఫ్రెంచి దేశాల ద్రవ్యాల విలువలో తగ్గించుటవల్ల మన రూపాయి వారికి చౌకగా లభించింది. అందువల్ల మన ఎగుమతులు పెరిగి విదేశీ మారక నిల్లలు పెరిగే అవకాశం ఏర్పడింది. ఇతర దేశాల ద్రవ్యం మనకు ప్రియంకావడంవల్ల దిగుమతులు తగ్గించు వీలుకలిగింది. తర్వాత మొత్తం దిగుమతులలో ప్రధానమైన మూలధన వస్తువులు, రక్షణ వస్తువులు, అయిల్ వంటి వాటిని మినహాయించి మిగిలిన దిగుమతులపై నియంత్రణ విధించవలసి యుండగా నూతన వాణిజ్య విధానం ద్వారా దిగుమతులపై సుంకాలు తగ్గించుటవలన దిగుమతులు చౌకగా లభించి దిగుమతుల నియంత్రణ ప్రశ్నార్థకంగా మిగిలింది. అలాగే ఎగుమతులను ప్రోత్సహించే దీనిలో భాగంగా పూర్తిగా తయారైన వస్తువులను అధిక ధరగల వస్తువులను ఎగుమతి చేస్తూ తద్వారా విలువైన విదేశీమారక ద్రవ్యాన్ని పొందవచ్చు. బాగా నాణ్యత గల వస్తువులను తక్కువధరకు సకాలంలో అందించగల్గితే పోటీ ఉత్పత్తిదారులను తేలికగా ఎదుర్కొనగలము. అందుకే ఎగుమతులను పెంచెందుకు ప్రభుత్వం మంచి ప్రోత్సాహం కల్పించాలి. తర్వాత వాణిజ్య లోటును చెల్లింపులు శేషంలో లోటును పూరించేందులకు మరింత ఎక్కువ. వస్తుసేవలను అందిస్తూ విదేశీయుల నుండి పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని పొందాలి. విదేశా యాత్రికులను మరింత ఆకర్షించేందుకుగాను మన చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను మరింత ఆకర్షించేదులకు సుందరంగా తీర్చిదిద్దాలి. దిగుమతులను అరికట్టుటకు దిగుమతి సుంకాలు, కోటాలు విధించుట, లైసెన్సు లివ్వడం కఠినం చేయడం మొదలయిన చర్యల ద్వారా దిగుమతులను అరికట్టి చెల్లింపులలోని లోటును కొంత వరకు తగ్గించవచ్చును. అయితే ఈ విధానానికి మన సరళీకృత ఆర్థిక విధానాలలో అవకాశంలేదు. ఎందుకంటే దిగుమతులను కూడా సులభతరం చేసేందులకు ద్వారాలు తెరిచారు. వినిమయపు రేటు విధానంలో దశల వారిగా అమలు పరిచిన విధానాలు వర్తమాన ఖాతాలోని అంశాలను పూర్తిగా, మార్కెటు శక్తులకే విడిచిపెట్టింది. ఈ పరిణామంలో అనగా సంక్షోభనంతర పరిణామాలను తెలుసుకోవడం అవసరం.

15.10.3 సంక్షోభనంతర పరిణామాలు (1991 నుండి నేటి వరకు):

సరళీకృత ఆర్థిక విధానాలు మనదేశంలో కొనసాగుతున్నాయి. వీటిని పరిశీలిస్తే, 1990-91 నాటి పరిస్థితికి 1995-96 పరిస్థితికి మరియు 1996 నుండి 2004 నేటికి గల పరిణామాలులో తేడాలున్నాయి. 1990-91 నుండి 1993-94 నాటికి వాణిజ్య లోటు కొంత వరకు తగ్గింది. ఈ తగ్గుదల -3.2 శాతం నుండి -0.9 శాతానికి తగ్గింది. నికర అదృశ్యాంశాలలో మాత్రం 1990-91 లో 242 మిలియన్ల డాలర్లలోటు ఉండగా 1995-96 నాటికి 3511 మిలియన్ల డాలర్లకు పెరిగింది. స్థూల జాతీయోత్పత్తిలో -0.1 శాతం నుండి 1.1% శాతానికి పెరిగింది. అలాగే విదేశీ చెల్లింపుల శేషంలో లోటు 1990-91లో గరిష్ట స్థాయిలో 9680 మిలియన్ల కోట్ల డాలర్లు ఉండగా 1993-94 నాటికి 1158 మిలియన్ డాలర్లకు పడిపోయింది. అయితే 1995-96 నాటికి 5434 మిలియన్ డాలర్లకు చేరాయి. అనగా వ్యాపారం శేషంలోటు 1990-91లో దేశ స్థూలజాతియోత్పత్తిలో -32 శాతం ఉండి 1993-94 నాటికి -0.5 శాతానికి తగ్గిపోయి 1995-96 నాటికి -1.7 శాతానికి చేరుకుంది. ప్రవాస భారతీయుల డిపాజిట్లు 1991-92 నాటికి 290 మిలియను డాలర్లు ఉండగా 1996వ సం॥ నాటికి 945 మిలియను డాలర్లుకు పెరిగాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 1990-91లో 97 మిలియను డాలర్లు ఉండగా 1995-96 నాటికి 1929 మిలియను డాలర్లకు చేరుకున్నాయి. ఈ ఫలితాలన్నీ వ్యాపార చెల్లింపుల శేషంపై అనుకూల ప్రభావాల్ని కలిగాయి. 2003 సంవత్సరం నాటికి వ్యాపార చెల్లింపుల శేషము నుపటికాలం కన్నా మెరుగుగా ఉందని చెప్పవచ్చు.

2003-04 బడ్జెటు నందు ఎగుమతుల దిగుమతుల విధానంలో అనేక ఎగుమతి పధకాలు కల్పించారు. కొన్ని రకాల వ్యవసాయ వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించారు. తయారీరంగంలో సామర్థ్యాన్ని పెంచడానికి, ఎగుమతులు పెంచుటకు, ఈ రంగం ఎగుమతులు వృద్ధిచేయుటకు సుంకాలను విషయంలో సడలింపులు చేసారు. మొత్తం మీద 1991 సరళీకృత ఆర్థికవిధానాలు లేదా నూతన ఆర్థికవిధానాలు మన ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ చెల్లింపులు, వాణిజ్య లోటులోనూ, అదృశ్య అంశాల పెరుగుదల విషయలోనూ, కరెంటు ఖాతా, ప్రవాస భారతీయుల డిపాజిట్లు విషయంలోనూ మంచి ఫలితాలు వస్తున్నాయి. ఇవన్నీ స్వల్పకాల ఫలితాలు మాత్రమే. దీర్ఘకాలిక ఫలితాలకొరకు వేచియుండక తప్పదు.

15.11 భారతదేశ విదేశీ వ్యాపారంపై అంతర్జాతీయ వ్యాపార సంస్థ ప్రభావాలు:

15.11.1 GATT ఆవిర్భావం - లక్ష్యాలు:

అంతర్జాతీయ ద్రవ్యనిధిని ఏర్పాటు చేసిన తరువాత అనగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐఓ ద్రవ్య సహకారంతో అనేక విజయాలు సాధించుచున్న తరుణంలో ప్రపంచ వాణిజ్య వ్యాప్తికి కూడా ఒక ప్రత్యేక సంస్థను స్థాపించాలనే ప్రతిపాధన వచ్చింది. ఈ ప్రాధ్యలంతో హవానాలో ప్రపంచ వాణిజ్య, ఉద్యోగవకాశాల గురించి చర్చించేందుకు ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటుకావడం, ఆ తరువాత 1948వ సం॥లో ఇండియాతో సహా 23 వాణిజ్య దేశాలు స్రజుఊఊ(స్రలిదీలిజీబిజి జుఏజిలిలిళిలిదీశి శిదీ ఊబిజీజిరితీతీరీ బిదీళి ఊజీబిళిలి) ను ఏర్పాటు చేయడాన్ని సంతకాలు చేయడం జరిగింది. దీని యొక్క ముఖ్య ఉద్ధేశ్యాలేమిటంటే - ప్రపంచ వాణిజ్య విస్తరణ, సభ్య దేశాలన్నిటిలో ఉత్పత్తిని పెంచి తద్వారా సంపూర్ణ ఉద్యోగితను సాధించుట ప్రపంచమంతట నిరుపయోగంగా ఉన్న వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకొనుట, తద్వారా ప్రపంచ ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచుట జరుగుతుంది.

అంతర్జాతీయ వాణిజ్యాభివృద్ధికి సంబంధించిన అంశాలు, సుంకాలకు సంబంధించిన విషయాల గురించి నిర్ణీతకాలంలో సంప్రదింపులు జరుపుకోవాలని, విదేశీ వ్యాపారంలో భాగంగా నిర్ణయించే కోటాల విధింపు, సుంకాల విధింపు మరియు ఇతర నియంత్రణల గురించి చర్చించుకోవడం ఈ స్రజుఊఊ సమావేశంలో తరచూ జరుగుతుంది. ఈ లక్ష్య సాధన పరోక్షంగా స్వేచ్ఛా వ్యాపారం ద్వారా, ప్రపంచ వాణిజ్యం ద్వారా సాధ్యపడుతుందని స్రజుఊఊ అభిప్రాయం. స్రజుఊఊ ప్రవర్తనా నియమావళి 3 ప్రాధమిక సిద్ధాంత అంశాలపై ఆధారపడి ఉంది.

1. ఎటువంటి పక్షపాత ధోరణి లేకుండా అన్ని సభ్యదేశాలకు వాణిజ్యంలో సమాన ప్రాతినిధ్యం కల్పించుట.
2. వాణిజ్య అవరోధాలను, పరిమాణ నియంత్రణలను వ్యతిరేకించుట.
3. ప్రపంచ వాణిజ్యభివృద్ధి కొరకు సభ్యదేశాలు మధ్యగల అభిప్రాయ భేదాలను వీలయినంత వరకు పరస్పర సంప్రదింపులు ద్వారా పరిష్కరించుట.

సుంకాల తగ్గింపు మరియు విచక్షణారహిత వాణిజ్యముల ద్వారా స్వేచ్ఛా వ్యాపారమునకు అనుకూలముగా వాతావరణము కల్పించుట ద్వారా వాణిజ్యం వల్ల వచ్చే లాభాలు, ప్రతిఫలాలు ప్రపంచ దేశాలు పరస్పరం పంచుకొని లాభం పొందుటకు మోస్ట్ ఫేవర్డ్ నేషన్ క్లాజును ఏర్పటుచేసారు.

GATT యొక్క ప్రాధాన్యతాంశాలు:

GATT ఒప్పందం ప్రకారం సభ్యదేశాల్లో ఏదైనా సభ్యదేశం అంర్జాతీయ చెల్లింపుల ఇబ్బందులను ఎదుర్కొనుచున్నపుడు ఆయాదేశాలు తమ విలువైన విదేశీ సూరక ద్రవ్యాన్ని పొదుపు చేసుకునేందుకు వీలుగా మాత్రమే నియంత్రణలు విధించు అవకాశం కల్పిస్తుంది. అలానే స్వదేశీ ధరల విధానం మరియు ఉత్పత్తి విధానాలకు హాని కల్గించే దిగుమతులు మాత్రమే అరికట్టబడతాయి. విచక్షణారహిత వాణిజ్య విధానం అనుసరించబడుతుంది. అంతర్జాతీయ వాణిజ్యాన్ని అవరోధపరిచే సుంకాలు తగ్గించి పరస్పర లాభ సాటిగా ఉండే విధంగా వాణిజ్యం కొనసాగించు చర్యలు GATT ద్వారా ఉంటాయి. పై లక్ష్యాలకు GATT తరుచుగా సమావేశాలు, సంప్రదింపులు జరిపి వాణిజ్య విస్తరణకు దోహదపడుతుంది.

15.11.2 ఉరుగ్వే సమావేశం - డంకెల్ ప్రతిపాధనలతో:

GATT (గ్యాట్) సమావేశాలు అనేకం జరిగినా ఉరుగ్వే సమావేశంలో గ్యాట్ జనరల్ డైరక్టర్ ఆర్థర్ డంకెల్ ప్రవేశపెట్టిన ప్రతిపాదన ప్రసిద్ధి గాంచింది. సుదీర్ఘ చర్చల అనంతరం 28 సెక్షన్లతో 400 పేజిలలో డిసెంబరు 1993న ఆంగీకరించగా 1994 సంవత్సరం ఏప్రిల్ 15 వ తేదిన ఇండియా సంతకం చేయడంతో మొత్తం సభ్యదేశాలు 118 అయినాయి. ప్రపంచంలో ఇంచుమించుగా అన్ని దేశాలు వీటిలో సభ్యత్వం కలిగిఉన్నాయని చెప్పవచ్చు. డంకెల్ ప్రతిపాదనలో ప్రధానంగా 5 (అయిదు) అంశాలున్నాయి.

1. సేవారంగంలో వాణిజ్యాన్ని ప్రోత్సహించుట (Promotion of Trade in invisibles.)
2. వాణిజ్య పరమయిన పెట్టుబడులను సభ్యదేశాలు ప్రోత్సహించుట (Trade Related investment measures (TRIMs)
3. వ్యవసాయానికి సంబంధించిన అంశాలు.
4. మేధా సంపత్తికి సంబంధించిన పేటెంటు హక్కులు (Trade Related intellectual property Rights (TRIPs)
5 పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలు (Environment Protection).

ప్రపంచ వ్యాప్తంగా వస్తువాణిజ్యం కంటె సేవావాణిజ్యం వేగంగా GATT పెరుగుట గుర్తించింది. సేవలవాణిజ్య విలువ 1992లో $ 960 బిలియన్ డాలర్లు ఉండగా తరువాత కాలంలో మరింత పెరగడమేకాక 50 శాతం ఉత్పాదక కార్యక్రమాలు మరియు ఉద్యోగవకాశాలు కేవలం సేవల రంగంలోనే ఏర్పడుచున్నాయి. ఈ ఒప్పందం ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు తమకు అనుకూలంగా ఉన్న వస్తువుల ఉత్పత్తిపై కేంద్రీకరించి ఎగుమతులను పెంచుకునేందుకు గల అవరోధాలను నియంత్రించి, రక్షణ విధానంలో కంటే స్వేచ్ఛ విధానంలోనే వాణిజ్య పరిస్థితులు మెరుగౌతాయని వాణిజ్యమునకు సంబంధించిన పెట్టుబడులు (TRIMs) విషయంలో పేర్కొన్నారు. మేధా సంపత్తికి సంబంధించిన పేటెంటు హక్కులు ద్వారా ఆయాదేశాలు పరిశోధనలను విస్తృతపరచి ఉత్పత్తులు పెంచుకొను హక్కును TRIPs ద్వారా అందిస్తుంది.

డంకెల్ ప్రతిపాదనలు GATT చరిత్రలో సరిక్రొత్త అధ్యయాన్ని సృష్టించినా అభివృద్ధి చెందుతున్న దేశాల విషయంలో కొంత విమర్శకు గురైయింది. GATT స్థానంలో అంతర్జాతీయ వ్యాపార సంస్థ WTO ను 1995 నుండి అమలులోకి తెచ్చారు.

15.12 భారతదేశ విదేశీ వ్యాపారంపై WTO వల్ల కలిగిన ప్రభావాలు:

WTO తనవిధులను జనవరి 1, 1995 నుండి ప్రారంభమయినాయి. GATT యొక్క లక్ష్యాలే దీనియందు ప్రధానంగా ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న 48 దేశాల యందు 29 అల్పాభివృద్ధి దేశాలు యొక్క అంతర్జాతీయ వ్యాపారంలో మంచి భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్లు తెలుస్తుంది. ప్రపంచ వ్యాపార విషయాలను నిరంతరం పర్యవేక్షించు ఒక వ్యవస్థ (Watching dog) గా WTO పేర్కొనబడింది.

మనదేశంలో WTO సిద్ధాంతాలు సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, ప్రయివేటికరణ నినాదాలను పోలి ఉన్నాయి. ఆర్థిక సంస్కరణలలో ఎక్కువ భాగం WTO నియమావళి సంబంధించినవిగా పేర్కొనవచ్చు. అంతర్జాతీయకరణ అనుపదం చాలా విచిత్రమయినది. WTO కూడా దానికి పర్యాపదంగా పేర్కొనవచ్చు. WTO ద్వారా ప్రపంచ దేశాలను సమైఖ్యపరచి సాంప్రదాయ ఆర్థికవేత్తలు ప్రకటించిన "తులనాత్మక వ్యయ సిద్ధాంతానికి అనుగుణంగా వ్యాపారాన్ని కొనసాగింప జేయుట మనకు గోచరిస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం అభివృద్ధి చెందిన బ్రిటన్ లాంటి దేశాల నుండి వెనుకబడిన వలన రాజ్యాలకు ఎటువంటి ఆటంకంలేకుండా వస్తు ప్రవాహాలు కొనసాగుటకు అవకాశం కల్పించుట WTO పనిగా విమర్శలున్నప్పటికీ లాభాలు కూడా ఉన్నాయి. మనదేశ ప్రపంచీకరణ విధానంలో విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, శ్రామికులు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు పొందు అవకాశం మొ॥ కలిగిఉంది. ఈ నేపధ్యంలో 1991లోనే దిగుమతి సుంకాలు తగ్గించడం జరిగింది. GATT నియమావళి కనుగుణంగా మోళిక పన్నుల (Basic Duty) ను 30 శాతం మేరకు తగ్గించి ఆరు సంవత్సరాలు కాలం పాటు కొనసాగేలా మన దేశం ప్రకటించింది. ముడిసరకులు, మాధ్యమిక మరియు మూలధన వస్తువులు ఈ పన్నుల పరిధిలో ఉన్నాయి. అయితే వ్యవసాయ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువులు మరియు ఇనుపసంబంధంకాని జింక్, కాపర్ వంటి పదార్థాలను Basic Duties పరిధి నుండి తొలగించారు. టారిఫ్ తగ్గింపులు ఆర్థిక సంస్కరణలో భాగంగా మన నాయకులు ప్రకటించినప్పటికి రాజా చెల్లయ్య కమీషన్ నందు ఈ ప్రస్తావన ఉంది. డంపింగ్ విషయంలో GATT ఒప్పందం వల్ల ప్రయోజనాలు ఉన్నాయని చెప్పవచ్చు. దేశీయ మార్కెటింగ్‌లో ఒక శాతం మించని వస్తువుల దిగుమతులపై ఆయాదేశాలు డంపింగ్‌ను తొలగించారు. యాంటిడంపింగ్ ప్రొసీడింగ్స్ 2 శాతం ఉంటె నియంత్రణలు ఉండవు. మొత్తం మీద ఇండియా డంపింగ్ దిగుమతులు దేశీయ మార్కెటులో 1 శాతం కంటె ఎక్కువ కావడం వల్ల మనకు లాభసాటిగా ఉందని చెప్పవచ్చు.

ఎగుమతులు సబ్సిడీలు నిషేధానికి సంబంధించి GATT ఒప్పందాలలో 1000 డాలర్లు తలసరి ఆదాయం గల దేశాలు ప్రపంచ వ్యాపారంలో ఆయా వస్తువులు ఎగుమతులు 3.25 శాతం మించని వాటికి సబ్సిడీలు తొలగించాలని నిబంధనలను సరళతరం చేయుట వల్ల మన ఎగుమతులు ప్రొత్సాహం తగ్గకపోగా ఇతర దేశాలకు ఈ నిబంధన వల్ల ఆదేశ వస్తు విలువ పెరిగి మన వస్తువులకు గిరాకి ఏర్పడుతుంది. అయితే కొన్ని వస్తువుల ఎగుమతులు 2.5 శాతం మించి ఉన్నాయి. మన ఎగుమతులలో ప్రధానంగా బియ్యం, టి, ఇనుపధాతువు మొదలయినవి ఎక్కువ భాగం కలిగి ఉన్నాయి. **GATT ఎగ్రిమెంటు పరిధిలో గల మన ఎగుమతులు** ఆయా కాలాల్లో క్రింది పట్టిక చూపాం. ప్రపంచ వాణిజ్యంలో మనదేశ వాటాను గమనించవచ్చు.

వాణిజ్యంలో మనదేశ వాటా (US $ మిలియన్లు)

వస్తువు	1990 ప్రపంచం	1990 ఇండియా	1990 మొత్తంలో ఇండియాశాతం	2001 ప్రపంచం	2001 ఇండియా	2001 మొత్తంలో ఇండియాశాతం
Rice	3995	254	6.4	7530	631	8.4
Tea & Mate	2650	585	22.1	2978	415	3.9
Spices	1415	109	7.7	2440	252	10.3
Iron Ore	7653	578	7.6	8758	321	3.7
Leather Manufactuers	13226	832	6.3	24082	779	3.2
Pearls, Precious & Semi-precious stones	27577	2710	9.8	56135	6242	11.1

పైన తెలిపిన వస్తువులలో Tea & Mate లలో మనదేశం ప్రపంచవాణిజ్యంలో నుమారుగా 22 శాతం ఎగుమతులు వ్యాపారవాటాను 1990లో కలిగి ఉంది. అయితే 1995-96 సంవత్సరంలో 14.4 శాతం ఉంది. 2001 నాటికి 13.9 శాతం నమోదయింది. ప్రపంచవ్యాప్తంగా మన సుగంధ ద్రవ్యాలకు మంచి గిరాకి ఉంది. 1990 సం॥లో 7.7 శాతం ఉండగా 2001 లో 10.3 శాతానికి వీటి ఎగుమతులు పెరిగాయి. విలువయిన రాళ్లు మొ॥వి కూడా క్రమేపీ పెరుగుచున్నవి మొత్తం మీద అంతర్జాతీయ మార్కెటునందు పైన తెలిపిన వస్తువులు నూమారుగా 23 శాతం ఉంది. అయితే ఈ నాటికి 77 శాతం ఎగుమతులు GATT ఎగ్రిమెంటు పరిధిలోకి రాలేదు. అందువల్ల ఎగుమతులకు కల్పించే సబ్సిడీలు వల్ల ఎగుమతులపై ప్రతికూల ప్రభావాలు అంతగాలేవని చెప్పవచ్చు.

పట్టిక

ప్రపంచ ఎగుమతుల్లో భారతదేశం వాటా (US $ మిలియన్లు)

సంవత్సరం	ప్రపంచం	ఇండియా	మొత్తంలో ఇండియా శాతం
1970	313804	2031	0.6
1975	876094	4665	0.5
1980	1997686	8486	0.4
1985	1930849	8904	0.5
1990			
1995	4946096	31117	0.6
2000	5744068	37940	0.7
2001	5555028	36528	0.7

గమనించదగిన విషయమేమంటే వార్షిక నగటు ఎగుమతుల్లో పెరుగుదల కనిపించినప్పటికీ 5 సంవత్సరాల కాలపరిధిలో మన ఎగుమతులలో పెరుగుదల ప్రపంచ ఎగుమతుల్లో పెరుగుదల ఒకశాతం మించలేదు. 1970 సం॥ములో 0.6 శాతం నమోదు కాగా 1985 సం॥ వరకు తగ్గుదల ఏర్పడింది. 1995లో 0.6 శాతం చేరుకొని 2000 మరియు 2001 సంవత్సరంలో 0.7 శాతానికి చేరుకుంది. దీనిని బట్టి చూస్తే ప్రపంచ వాణిజ్య సంస్థతో ఒప్పందాల వల్ల ఎగుమతుల్లో వృద్ధి చెప్పుకొదగినదిగా లేదు. కాని ఎగుమతుల వల్ల వచ్చిన ఆదాయాలు దిగుమతులకు వెచ్చించవలసిన అవసరం తగ్గినందున చెల్లింపుల శేషంలో మిగులుకు దారి తీసి మనకు ప్రయోజనకారిగా ఉందని మాత్రం చెప్పవచ్చు.

15.13 TRIPs; TRIMs మరియు ఇతర అంశాలలో WTO ద్వారా మన వ్యాపారంలో ఏర్పడిన పరిణామాలు:

TRIPs అంగీకారం ప్రకారం మనదేశానికి ప్రధానంగా ఫార్మస్యుటికల్స్ మరియు వ్యవసాయరంగంపై ప్రభావాలు చూపుతున్నాయి. సాంకేతిక మరియు పారిశ్రామిక సాంకేతికత మొదలైన అంశాల్లో నూతన ఆవిష్కరణలు చేపట్టు దేశాలకు పేటెంటు హక్కును కల్పించుట WTO ద్వారా సాధ్యపడుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరిశోధన, సాంకేతికాభివృద్ధి తక్కువగా ఉంటుంది. అందువల్ల వారు తమకు కావలసిన ఉత్పత్తి నమూనాలను, వంగడాలను అభివృద్ధి చెందిన దేశాల నుండి దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. అందుకొరకు ఈ దేశాలకు ప్రతిఫలంగా కొంత భాగాన్ని మూల్యంగా చెల్లించవలసి ఉంటుంది. వాటిని మరేదేశం ఉత్పత్తి చేయు అవకాశం ఉండదు.

మనదేశ ఫార్మస్యుటికల్స్ మరియు డ్రగ్స్ ఉత్పత్తులు తక్కువ ధరకే మనకు లభిస్తాయి. వీటి ఎగుమతుల ద్వారా 2386 కోట్ల రూ॥లు విలువగల విదేశీమారక ద్రవ్యాన్ని 1996-97లో సంపాదించారు. అయితే TRIPs నిబంధనల వల్ల మరియు స్వేచ్ఛా వ్యాపార విధానాల వల్ల 70 శాతం డ్రగ్స్ ధరలు 5 నుండి 10 రెట్లు పెరిగే అవకాశం ఉండటం వల్ల ప్రజలతో పాటు వ్యాపారం నష్టాలకు లోనగు పరిస్థితులు ఏర్పడతాయి.

మనకు అవాదిగా సాంప్రదాయకంగా కొనసాగుతున్న ఆయుర్వేదం (Haldi/Turmeric) పసుపు, వేప వంటి వస్తువులపై పేటెంటు హక్కులు అనేక దేశాలు పొందుటకు ప్రయత్నిస్తున్నాయి. మేధాసంపత్తికి సంబంధించిన పేటెంటు హక్కులు పేరుతో ధనిక దేశమయిన అమెరికా వీటిపై పేటెంటు చట్టం 1995 అనుసరించి ప్రయత్నించగా దానిని ఇండియా సమర్థవంతంగా తన నిరసనను తెలియజేసింది. Dr.R.D.Mashelkar. శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా డైరక్టర్‌జనరల్ మహాశయుడు మన వారసత్వ సంపదగా నిజనిరుపణ వల్ల అమెరికా దానిని ఒక సాంకేతిక తప్పిదంగా భావించి హక్కులను మనకు ఇవ్వడం జరిగింది. వీటితో పాటుగా నీమ్ (Neem) బాస్మతి రైస్, తులసి మొదలైనవి ఉన్నాయి.

వాణిజ్య పరమయిన పెట్టుబడుల విధానాలను 1980 లో అమెరికా ప్రస్తావించింది. అమెరికాకు జపాన్ మరియు నూతనంగా పారిశ్రామికీకరణ చెందిన తూర్పు ఆసియాదేశాల వల్ల కలిగిన నష్టాలను భర్తీ చేసుకొను నేపధ్యంలో ఈ విధానాన్ని రూపొందించింది. GATT 8వ సమావేశంలో ప్రస్తావించింది. దీని వల్ల ద్రవ్య వరమయిన వాణిజ్య సేవలు, టెలికమ్యూనికేషన్లు, మార్కెటింగ్‌లలో బహుళ జాతి సంస్థలు పెట్టుబడులు పెట్టి లాభార్జనధ్యేయం. దీనివల్ల అనగా TRIMs అగీకారం ప్రకారం ఆయాదేశాల ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులు పట్ల విచక్షణ చూపరాదు. అంతేకాక విదేశీ పెట్టుబడిదారులకు కొన్ని హక్కులు కల్పిస్తారు. పెట్టుబడిదారులు దేశంలో ఎక్కడయినా పరిశ్రమలు పెట్టుటకు అవకాసం కల్పించాలి అంతేకాక దిగుమతి ముడివస్తువులకు నిరాటంకంగా అనుమతిని కొనసాగించాలి.

టెక్స్‌టైల్స్ ఎగుమతుల విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎక్కువగా లాభాలు పొందుటకు ప్రయత్నిస్తున్నాయి. దానిలో భాగంగా అమెరికా మానవీయ అంశాలను WTO లో ప్రస్తావించి శ్రామిక సబంధ సమస్యలను సృష్టించుటకు ప్రయత్నించింది. ఎందువలననగా మనదేశంలో తయారయిన గార్మెంట్సు యొక్క ఉత్పత్తి వ్యయాలు తక్కువగా ఉండటం దానిని ఇతర దేశాల్లో ఎక్కువ ధరకు విక్రయించుట అమెరికాకు నచ్చలేదు. ఎందుకంటే ఒక షర్టు మనదేశంలో 10 రూ॥లు ఉంటె అమెరికాలో 200 రూ॥లు ఉంటుంది. తులనాత్మక వ్యయాల్లో తేడా నివారణకు అమెరికా ప్రయత్నిస్తుందని వాదించినా అభివృద్ధి చెందిన దేశాలు మన దేశంతో పాటు వ్యతిరేకించడం జరిగింది. దానివల్ల వెనుకబడిన దేశాల BOP లో అసమతౌల్య మేర్పడుతుందని మలేషియాలాంటి

దేశాలు వాదించాయి. అయినప్పటికీ అమెరికా మన టెక్స్‌టైల్స్ ఎగుమతులపై యాంటి డంపింగ్ విధానం విడవక పోవడంతో WTO కి మన దేశం ఫిర్యాదు చేసింది WTO దీనిపై తీవ్రంగా స్పందిస్తూ GATT ఎగ్రిమెంటు ఆర్టికల్ 2 మరియు 5 పూర్తిగా విస్మరించుట జరుగుచున్నదని హెచ్చరించింది. మొత్తం మీద మన ఉన్ని Shirts ఎగుమతులపై గల సమస్యలను పరిష్కారంలో WTO చొరవచూపింది.

WTO నిబంధనల మేరకు మరియు మన సరళీకృత ఆర్థిక విధానాల వల్ల విదేశీ పెట్టుబడులకు మార్గాలు ఏర్పడ్డాయి. దిగుమతులపై చేయవలసిన వస్తువులను అయాదేశాల బహుళ జాతి సంస్థలు పెట్టుబడుల రూపంలో దేశంలోకి పెట్టుబడి ప్రవాహాలు రావడంలో BOP నందు అనుకూల ఫలితాలు ఏర్పడ్డాయి. మనదేశంలో 90వ దశకంలో (1991-02 మరియు 1995-96) బహుళ జాతి సంస్థల ఎగుమతులు, దిగుమతుల వృద్ధి కనిపించింది. ఈ కంపెనీలు కూడా మంచి లాభాలను గడించాయి. 1991-02 లో దిగుమతుల వల్ల విదేశీ మారకద్రవ్యం 1374.1 కోట్ల రూ॥లు ఉండగా ఎగుమతులకు 1617.2 కోట్లు రూ॥లు ఉంది. గతంలో దిగుమతి చేసుకొను అనేక వస్తువుల సంస్థలు దేశీయంగా విదేశీ సంస్థల సహాయంతో నెలకొల్పబడినాయి. అయితే దిగుమతి పరిమాణ నియంత్రణలు (QRs) అమెరికా విషయంలో నెరవేరలేదు. అందువల్ల మన వ్యాపారదిశ యురోపియన్, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలకు విస్తరించి సంబంధాలను మెరగువర్చుకొను చర్యలను పెంచింది. WTO నిబంధనలు అమెరికా వంటి దేశాలకు అనుకూలంగా ఉండటం వల్ల వెనుకబడిన దేశాలు సమస్యలను ఎదుర్కొనుట జరుగుతుంది. కొన్ని వస్తువులకు ప్రత్యక దిగుమతి లైసెన్సు విధానాలను ఏర్పాటు చెనుకోవలసి వస్తున్నది.

మొత్తం మీద WTO వల్ల మన దేశ వ్యాపారంలో అనేక మార్పులు సంభవించాయి. కొన్ని రకాల ఉత్పత్తులు తగ్గే ప్రమాదం ఉందని, పేటెంట్ విధానం వల్ల శాస్త్రజ్ఞుల మధ్య సేచ్ఛగా విజ్ఞాన సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం నిషేధించబడుట వల్ల అంతర్జాతీయంగా అనేక సమస్యలు ఏర్పడతాయి. బహుళ జాతి సంస్థల ప్రాబల్యం పెరుగుదలకు WTO దోహదం చేసింది. ఇప్పటికీ మనదేశ దిగుమతుల యందు కొన్ని వస్తువుల ప్రాధాన్యత తగ్గలేదు. విదేశీ సంస్థలు లాభాలు కలుగు సంస్థలపైనే కేంద్రీకరించుట వల్ల దిగుమతులపై ప్రభుత్వ వ్యయం తగ్గలేదు. వ్యవసాయ వస్తువుల ఎగుమతులను పరిశీలించినట్లయితే క్రమేపి తగ్గుదల కనిపిస్తుంది. WTO నిబంధనల వల్ల వ్యవసాయరంగానికి ఇచ్చు సబ్సిడీలు కోతవల్ల, ఎరువులు, రసాయనాల పై రాయితీలు తొలగింపు వల్ల వ్యవసాయం భారంగా మారి తద్వారా ఎగుమతులపై వాటి ప్రభావాలు కనిపిస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది.

14. సారాంశము :

పైన వివిధ భాగాలలో వివరించబడిన అంశాలన్నింటిని పరిశీలించిన మీదట స్పష్టమగు అంశమేమనగా భారత విదేశీ విధానం విప్లవాత్మకమైన వ్యవస్థాపూర్వక మార్పులకు గురైందని చెప్పవచ్చును. 50 మరియు 60వ దశకంలో దిగుమతులలో పెరుగుదల విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటుకి కారణంగా మరియు 70వ దశకంలో ఎగుమతులలో పెరుగుదల వ్యాపార పెరుగుదలకు కారణమయింది. 70వ దశాబ్ది నుండి ఎగుమతులలో పెరుగుదల అంతగా పెరగకపోయినా దిగుమతులు పెరిగి వ్యాపార చెల్లింపుల శేషం పెరిగింది. తరువాత కాలంలో ఎగుమతులు పెరిగినా ఆశించిన ధరలు లేకపోవడం వల్ల ఉపయోగం లేకపోయింది. వ్యవసాయ ఉత్పత్తుల నుండి పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులు 80వ దశకం నుండి ప్రారంభమయింది. అదే సమయంలో ఆయిల్ ఎగుమతి చేయు దేశాలు (OPEC) వెనుకబడిన దేశాలవైపు కేంద్రీకృతమయినాయి. మనదేశ వ్యాపార చెల్లింపుల శేషంలో పెరుగుదల అంతర్గత కారణాల వల్ల ఎక్కువగా ఉంది. అభివృద్ధి చెందిన దేశాల రక్షణ విధానం ఒకవైపు ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రపంచీకరణ స్వేచ్ఛాయుత, సరళీకృత మార్కెటు విధానాలు వల్ల మన దేశంలో ఎగుమతులు కన్నా దిగుమతులు పెరిగాయి. స్వల్పకాలంలో దిగుమతులకు చేయు ఖర్చులు తగ్గినా దీర్ఘకాలంలో వచ్చు ఫలితాలను అంచనా వేయుట కష్టం.

విదేశీ వ్యాపారం పై ప్రభావాలు కల్గించుటలో WTO యొక్క పాత్ర ఎంతైనా ఉంది. WTO నిబంధనలు ఆధారంగా ప్రపంచ దేశాలు వ్యాపార విధానాలను రూపొందించుకొవలసి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న మన దేశం లాంటి మరికొన్ని దేశాల్లో WTO విధానాలు అనునరించి లాభాలు పొందాయని 100 శాతం నిజమైన విషయమని చెప్పలేము. ఆర్థిక సంస్కరణల ముసుగులో బహుళ జాతి సంస్థల పెట్టుబడులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలు కొన్ని నష్టపోయాయి. ఇండోనేషియా మరియు మరికొన్ని ఆసియా పులులుగా పేర్కొన్నదేశాల చరిత్రే దీనికి ఉదాహరణ. మనదేశ విషయంలో కూడా WTO వల్ల దిగుమతుల భారం తగ్గిందే గాని ఎగుమతుల్లో

పెరుగుదల ఆశించినట్లులేదు. అంతేకాక ప్రపంచ ఎగుమతుల్లో మనదేశం వాటా 0.7 శాతం వద్ద నిలకడగా కొనసాగడం మనకు తెలుసు. ఆర్థిక సంస్కరణల కాలం ముందు ఈ శాతం దీనికి సుమారుగా 0.6గా ఉందంటె విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ WTO వల్ల, ఆర్థిక సంసర్కణల వల్ల BOP లో ధనాత్మక ఫలితాలు రావడం ఊరట కలిగించే అంశం. మన ఆర్థిక విధానాలు ప్రపంచ అనుసంధానం చేయటం వల్ల ఫలితాలు ముందు ముందు ఏవిధంగా ఉంటాయో వేచిచూడవలసిందే!

15.15 ముఖ్యపదాలు :

విదేశీ వర్తకం	: కొనుగోలుదారులు, విక్రయదారులు వివిధ దేశములలో నుండి వారిద్దరి మధ్య వస్తుసేవల మార్పిడి జరుగుట విదేశీ వ్యాపారం / వర్తకం.
BOP	: Balance of Payments: (విదేశీ వ్యాపారం) చెల్లింపుల శేషం.
GATT	: General Agreement on Trade and Tariffs.
PTI	: Promotion of Trade in Invisibilities
TRIMs	: Trade Related investment measures
TRIPs	: Trade Related Intellectual property Rights
వ్యాపార లోటు	: ఎగుమతులు, దిగుమతుల మధ్య గల అంతరం. దిగుమతులు ఎగుమతుల కన్నా ఎక్కువగా ఉంటే లోటు ఏర్పడుతుంది.
వ్యాపార చెల్లింపుల శేషం	: దృశ్యాంశాలతో పాటు అదృశ్యాంశాల ద్వారా వచ్చిన రాబడులతో దిగుమతులకు చెల్లించు చర్యలు మధ్య ఏర్పడు బాలెన్సు.
మోస్ట్‌ఫేవర్డ్ నేషన్సు	: విదేశీ వ్యాపారానికి అనుకూలమయిన దేశంగా గుర్తింపు పొందిన దేశాలను వ్యవహరిస్తారు.

15.16 స్వయం మదింపు ప్రశ్నలు:

1. మన దేశ విదేశీ వ్యాపార పరిస్థితులు వివిధ ప్రణాళికాకాలంలో ఎలా ఉన్నవో వివరించండి?
2. 1991 సంవత్సరం అనంతరం విదేశీ వ్యాపారంలో ఏర్పడిన పోకడలు తెల్పుము.
3. విదేశీ వ్యాపారంలో గల వివిధ నిర్ణయకాలు మరియు వ్యాపార పరిణామ ధోరణులు వ్రాయుము.
4. మన విదేశీ వ్యాపారంలో గల అంతర్భాగాలలో కలిగిన పరిణామలు వివరించుము.
5. మన విదేశీ వ్యాపార దిశలో ఏర్పడిన మార్పులు ఏమిటి?
6. భారతదేశ విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం చెల్లింపుల శేషంలో ఏర్పడిన సంక్షోభాలు, నివారణలు చర్యలు, తదనంతర పరిణామాలు క్లుప్తంగా వ్రాయుము.
7. మన విదేశీ వ్యాపారంలో WTO యొక్క ప్రభావాలను వివరించుము. WTO సిద్ధాంతాలు మనకు ఆచరణీయమా చర్చించండి.

15.17 చదువవలసిన పుస్తకాలు:

Jalam bimal	:	Indian Economic Crisis.
V.S.Mahajan	:	Indian Foreign Trade & Balance of Payments.
M.Sundara Rao	:	Trends & Determinants of India's Foreign Trade.
Planning Commission	:	Various Five Year Plans
Ruddar Datt, KPM.Sundaram	:	Indian Economy
K.Dhingra	:	The Indian Economy and Environment.
Govt. of India	:	Economic Survey 2003 -04.

ఆచార్య మోపిదేవి సుందరరావు

పాఠ్యభాగం - 16

భారతదేశ వర్తకనిబంధనలు, భారత ఆర్థికాభివృద్ధిపై అంతర్జాతీయ ఆర్థిక సంస్థల పాత్ర మరియు వ్యాపార సరళీకరణ.

పాఠ్య నిర్మాణక్రమము :

16.0 ఉద్దేశ్యము

16.1. పరిచయము

16.2. వర్తకనిబంధనలు - పరిచయవివరణ

16.2.1 వర్తకనిబంధనల నిర్వచనం, అర్థవివరణ

16.2.2. వర్తకనిబంధనలు - వివిధ భావనలు.

16.3. భారతదేశ విదేశీ వర్తకనిబంధనలు తీరు తెన్నులు.

16.4. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలపాత్ర.

16.4.1. అంతర్జాతీయద్రవ్యనిధి

16.4.2. ప్రపంచబ్యాంకు

16.4.3. అంతర్జాతీయ అభివృద్ధి ఏజన్సీ

16.4.4. అంతర్జాతీయ విత్త సంస్థ

16.4.5. ఆసియా అభివృద్ధి బ్యాంకు

16.5.. వ్యాపార సరళీకరణ

16.5.1. వ్యాపార విధాన పోకడల దశలు

16.5.2. ఇండియాలో 1991 సం॥ము నుండి గల అంతర్జాతీయ వాపార సరళీకరణ విధానాలు.

16.6. ముగింపు

16.7. ముఖ్యపదాలు

16.8. స్వయం మదింపు ప్రశ్నలు

16.9. చదవవలసిన పుస్తకాలు

16.0. ఉద్దేశ్యము :

ఈ పాఠ్యభాగమును చదివాక క్రింది అంశాలను తెలుసుకోగలము :

భారత వర్తకనిబంధనల తీరుతెన్నులు, వర్తకనిబంధనలు

ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ ఆర్థిక సంస్థల యొక్క పాత్ర.

భారతదేశ సరళీ కృత వ్యాపార ధోరణులు

వివిధ కాలాల్లో ఎర్పిమపాలసీ మొ॥వి.

16.1.0. పరిచయము :

దేశ ఆర్థికాభివృద్ధిని నిర్ణయించు అంశాల్లో ప్రధానమయినది విదేశవ్యాపారం. విదేశీవ్యాపారాన్ని వర్తకనిబంధనలు తెలియజేస్తాయి.ఎగుమతులు దిగుమతుల విధానాలనుబట్టి వర్తకనిబంధనలు మారుతూ ఉంటాయి. ఆర్థికాభివృద్ధికి అనుకూలమయిన వర్తక నిబంధనలు ఎంతైనా అవసరం. మరోవైపు దేశంలో సంపూర్ణ ఉద్యోగిత సాధించుటకు అవసరమయిన వనరులు దేశీయంగా లభ్యంకానపుడు విదేశి సంస్థలపై ఆధారపడుట తప్పకాదు. ఆర్థిక సహాయం పొందుట ద్వారా అనేక దేశాలు అభివృద్ధి పథంలో పయనించాయి. వర్తకం మరియు వివిధ సంస్థలు సహాయం ద్వారా దేశాభివృద్ధి సాధ్యం కానపుడు ఆర్థిక విధానాలను అనుకూలంగా మార్చుకొని దిగుమతి భారాన్ని తగ్గించుటకు దిగుమతి ప్రత్యామ్నాయ విధానాలు అవలంభించాలి. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గమనించినట్లయితే WTO ప్రభావం వల్ల వ్యాపార నియంత్రణలు తొలగించవలసి ఉంది. ఈ నేపథ్యంలో మన దేశం యొక్క వర్తక నిబంధనలు, వ్యాపార సరళీకరణ విధానాలు వల్ల దేశ ఆర్థికాభివృద్ధి పై గల ప్రభావాలను తెలుసుకొనుట ఎంతైనా అవసరం. ఈ పాఠ్యభాగమున వీటి గూర్చి వివరించుట జరిగింది.

16.2. వర్తకనిబంధనలు - పరిచయవివరణ.

అంతర్జాతీయ వ్యాపార విధాన నిర్ణయాలలో అతిప్రాముఖ్యం సంతరించుకున్న అంశాల్లో వర్తకనిబంధనలు ఒకటిగా పేర్కొనవచ్చు. ఒక దేశ వర్తక నిబంధనలను ఆ దేశానికి అంతర్జాతీయ వర్తకంలో వచ్చే లాభాలను ప్రధానంగా నిర్ణయిస్తూ, ఆ దేశ అంతర్జాతీయ వర్తకంలో వచ్చె లాభాలను ప్రధానంగా నిర్ణయిస్తూ, ఆదేశ అంతర్జాతీయ చెల్లింపుల పరిస్థితికి కారణమవడం వల్ల అంత ప్రాధాన్యతను కలిగి ఉంది. అందువల్ల అంతర్జాతీయ చెల్లింపుల స్థితిని చక్కదిద్దడానికి చేసే విధాన నిర్ణయాలన్నింటికి, వర్తక నిబంధనలు కేంద్రబిందువుగా ఉంటాయి. ముఖ్యంగా అంతర్జాతీయ వ్యాపారం నుంచి లభించే లాభాలు అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య విభిన్నంగా పంపిణి కావడానికి అంతర్జాతీయ మార్కెటులో ఆ దేశాలకున్న వర్తక నిబంధనలే ప్రధాన కారణం అవుతున్నాయి. కాబట్టి ఈ వర్తక నిబంధనల అంశం చాలా ముఖ్యమయినది. ఈ నేపద్యంలో మనదేశం యొక్క వర్తక నిబంధనలను విశ్లేషించుటలో వివిధ అంశాలను వివరించడమయినది.

16.2.1. వర్తక నిబంధనల నిర్వచనం అర్థవివరణ :

విదేశీ వ్యాపారంలో ఒక దేశానికి ఎంత ఎగుమతులకు ఎంత దిగుమతులు వస్తాయనేది వర్తకనిబంధనలు తెలియజేస్తాయి. ఎగుమతులకు వచ్చే ధరల కంటే దిగుమతుల ధరలు పెరిగితే వర్తక నిబంధనలు ఆ దేశానికి ప్రతికూలమవుతాయి. తద్వారా విదేశీవ్యాపారం నుండి లాభం తగ్గుతుంది. అలికాక దిగుమతి ధరల కంటే ఎగుమతి ధరలు పెరిగినట్లయితే ఆ దేశానికి వర్తక నిబంధనలు అనుకూలంగా మారి తద్వారా ఆ దేశానికి విదేశీ వ్యాపారం నుంచి వచ్చే లాభం పెరుగుతుంది. మరొక రకంగా చెప్పాలంటే రెండు దేశాల మధ్య భౌతికంగా వస్తువులు ఏ నిష్పత్తిలో మారకం అవుతాయో దానిని వర్తకనిబంధనలని అంటారు.అంటే ఎగుమతి వస్తువులు, దిగుమతి వస్తువులు ఏ నిష్పత్తిలో వినిమయం అవుతున్నాయో వర్తక నిబంధనలుతెలియజేస్తాయి. వర్తక నిబంధనలు ఒక దేశం దాని వస్తువులను ఏమేరకు ఏఏ ధరల వద్ద అమ్మినది, కొన్నది తెలుస్తుంది.

రెండు దేశాలమధ్య అనేక వస్తువుల ఎగుమతి, దిగుమతి అయినపుడు వినిమయం రేటును భౌతికప్రమాణాల నిష్పత్తిలో చెప్పలేం. వస్తువులను వివిధ రకాల భౌతిక ప్రమాణాలలో కొలవడం వల్ల ఇటువంటి సమస్యలు ఎదురౌతాయి. కాబట్టి ఈ సమస్యలను అధిగమించడానికి వర్తకనిబంధనలు ధరల నిష్పత్తిలో చెప్పవలసి ఉంటుంది. ఈ పద్ధతిని అమలుపరిస్తే వర్తకనిబంధనలను ఎగుమతి ధరల సూచీ సంఖ్యకు, దిగుమతి ధరల సూచిసంఖ్యకు మధ్య ఉన్న నిష్పత్తిగా నిర్వచించ వలసి ఉంటుంది. దీనిప్రకారం వర్తకనిబేధనలను క్రింది విధంగా తెలియపరుస్తాము.

వర్తక నిబంధనలు $= \frac{\text{ఎగుమతి ధరలు}}{\text{దిగుమతిధరలు.}} \times 100$

పైన సూచించిన ఈ ధరల నిష్పత్తి కేవలం ధరలనే కాక అంతర్జాతీయ వ్యాపారంలో ఒక దేశానికి అంతర్జాతీయ మార్కెటులో ఉన్న స్థానాన్ని, ఆ వ్యాపారం వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు కలిగే ప్రయోజనాన్ని, శ్రేయస్సును కూడా అంతర్లీనంగా ప్రతాబించించడంతో వర్తక నిబంధనలకు అంతర్జాతీయ వ్యాపారంలో అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది.

16.2.2. వర్తకనిబంధనలు - వివిధ భావనలు

వివిధ ఆర్థికవేత్తలు ప్రవేశపెట్టిన వర్తక నిబంధనల భావనను ప్రపంచదేశాలు పాటిస్తున్నాయి. వర్తకనిబంధనలు అనే భావనను మొదటిగా J.S మిల్ అంతర్జాతీయ డిమాండు సూత్రం ఆధారంగా వస్తు మార్పిడి నిష్పత్తికి సంబంధించినవిగా ప్రతిపాదించడం జరిగింది. ఆ భావనను మార్షల్, వైనర్ మొ॥ మహాశయులు మరింతగా మెరుగుపరచి వర్తక నిబంధనలను ఉత్పత్తి కారకాల మార్పిడికి సంబంధించినవిగా వివరించారు. ఆధునిక ఆర్థికవేత్తలు వర్తకనిబంధనలను అంతర్జాతీయ వ్యాపారంలోని ప్రయోజనాలను విశ్లేషించే దిశలో ప్రయత్నించారు. ఈ రకంగా వినిమయంరేటులో ఈ వివిధ భావనలను వివిధ రచయితలు వివరించారు. వర్తకనిబంధనలకు సంబంధించిన వివిధ భావనలను G.M. మేయర్ 3 భాగాలుగా వర్గీకరించారు. వీటిని ప్రపంచ వాణిజ్యంలో పాలుపంచుకుంటున్న దేశాలు ప్రామాణికంగా భావిస్తున్నారు. అవి ఏమనగా.

1. స్థూలవస్తు వినిమయ వర్తక నిబంధనలు= $\frac{\text{దిగుమతి పరిమాణ సూచి}}{\text{ఎగుమతి పరిమాణసూచి}} \times 100 = \frac{\text{దిగుమతి పరిమాణ సూచి}}{\text{ఎగుమతి పరిణామ సూచి}}$

ఈ భావనను మొదటిగా టాసిగ్ ప్రతిపాదించాడు. ఎగుమతి దిగుమతుల వస్తుపరిమాణాన్ని ప్రధానంగా తీసుకొని స్థూల వస్తు వినిమయ వర్తకనిబంధనలను పేర్కొంటురు. ఈ నిష్పత్తి ఎక్కువగా ఉంటే స్థూలవస్తు వర్తకనిబంధనలు పరిగణనలోనికి తీసుకోలేకపోవడాన్ని ఒక పరిమితిగా చెప్పవచ్చును. అదేవిధంగా వస్తు నాణ్యత, ఎగుమతి, దిగుమతుల కలయిక మొదలైన అంశాలను కూడా స్థూల వస్తు వినిమయ వర్తకనిబంధనలు పరిగణ లోనికి తీసుకోక పోయారు. దీని కారణంగా స్ర్ఫ.ఐ డోనార్ఫ్ వంటి ఆర్థిక వేత్తలు ఆదాయాత్మక వర్తకనిబంధనలను ప్రవేశ పెట్టారు.

2. ఆదాయాత్మక వర్తక నిబంధనలు= $\frac{\text{ఎగుమతుల యూనిట్ విలువ సూచి}}{\text{దిగుమతి యూనిట్ విలువ సూచి}} \times$ ఎగుమతి వస్తు పరిమాణం

ఆదాయ వర్తక నిబంధనలు= $\frac{\text{ఎగుమతి యూనిట్ విలువ సూచి} \times \text{ఎగుమతి వస్తుపరిమాణం} \times 100}{\text{దిగుమతి యూనిట్ విలువ సూచి}}$

(or)

Income Terms of Trade = PX/Pm*qx*100

ఆదాయాత్మక వర్తక నిబంధనలు రెండు దేశాల ఆదాయాలు ఏ నిష్పత్తిలో వ్యాపారంలో వినిమయం అవుతున్నాయో చూపుతాయి. ఈ వినిమయం రేటులో వచ్చిన మార్పు ఒకదేశానికి ఎగుమతి ద్వారా సమకూరినా దిగుమతి శక్తిలో వచ్చిన మార్పుని సూచిస్తుంది. అంటే ఒక దేశం ఎగుమతుల ద్వారా అది దిగుమతి చేసుకోగల సామర్థ్యాన్ని ఏ విధంగా సమకూర్చు కుంటుందో తెలుపుతుంది. ఈ భావనను

క్రింది విధంగా కూడా చెప్పవచ్చు.

$$I = \frac{P_x - Q_x}{pm}$$ ఇందులో

I = ఆదాయ వర్తక నిబంధనలు

P_x = ఎగుమతుల ధర సూచి

Q_x = ఎగుమతుల పరిణామ సూచి

pm = దిగుమతి ధర సూచి

మరోవిధంగా :

I = నికర వర్తకనిభంధనలు × ఎగుమతి వస్తు పరిమాణ సూచి.

అని కూడా ఆదాయ వర్తకనిబంధనలును వివరిస్తారు. అయితే ముందుగా నికర వర్తకనిబంధనలను తెలుసుకోవలసి ఉంటుంది.

ఆదాయాత్మక వర్తక నిబంధనలు అనుసరించి ఒక దేశ విదేశీ వ్యాపారంలో ఎగుమతి వస్తువుల విలువ, దిగుమతి వస్తువుల విలువ సమానంగా ఉన్న పరిస్థితులలో దిగుమతి వస్తువుల ధరలు, వస్తురాశులు స్థిరంగా ఉండి ఎగుమతి వస్తువుల ధరలలో పెరుగుదల ఏర్పడితే ఆ ఎగుమతుల ధరలు పెరుగుదల ఫలితంగా ఎగుమతుల వస్తురాశుల శాతం తగ్గుతుంది. ఈ స్థితిలో ఎగుమతి వస్తువుల ధరలు స్థిరంగా ఉండుట వాటి ధరలలో కొంత శాతం పెరుగుదల వల్ల వస్తు వినిమయపు రేటులో అభివృద్ధి ఉంది దానివల్ల అవే దిగుమతులను అంతకు ముందు కంటే తక్కువ మొత్తం ఎగెమతులలో కొనుగోలు చేసే అవకాశం ఏర్పడుతుంది. ఈ కారణంగా ఆదాయ వినిమయ రేటులో వచ్చిన మార్పు ఏ విధంగా కలుగుతుందంటే ఎగుమతి ధరలు పెరిగిన అనుపాతంలోనే ఎగుమతులు తగ్గడం వల్ల మొత్తం ఎగుమతుల విలువ మారదు. ఆ కారణంగా ఆదాయ వినిమయం రేటులో ఏమార్పు రాదు. అంతేకాక ఎగుమతుల ద్వారా లభించిన దిగుమతి చేసుకొను శక్తిలో మార్పు ఉండదు. అంటే వస్తు వినిమయం రేటులో మార్పు ఉన్నప్పటికీ ఆదాయ వినిమయం రేటులో మార్పు ఉండక పోవచ్చు. అయినప్పటికీ ఈ నిబంధనలు కేవలం ఒక దేశం ఎగుమతుల వల్ల ఊర్పడే దిగుమతి సామాజాన్ని తెలియజేస్తుందే కాని ఆ దేశం మొత్తం దిగుమతి సామర్థ్యాన్ని కేవలం ఎగుమతులపైనే కాక మూలధన ప్రవాహలు, అదృశ్యాల ద్వారా వచ్చి రాబడులు, ఏకపక్షక చెల్లింపులు మొ॥ వి ఉంటాయి. అంతేకాక ఇందులో ఆ దేశానికి విదేశీ వ్యాపారం వల్ల వచ్చు మొత్తం లాభం/నష్టం తెలుపదు.

3. నికర వర్తక నిభందనలు:

నికర మైనవస్తు వర్తకనిబంధనలు లేదా వస్తు వినిమయ నిబంధనలు అనే భావనను మార్షల్ దిగుమతి ధరలు ఎగుమతి ధరల నిష్పత్తిని తెలియ చేసెవిగా వివరించాడు. ఈ భావనను క్రింది విధంగా చూపించవచ్చు.

నికర వర్తకనిబంధనలు = ఎగుమతి వస్తు యూనిట్ విలువ సూచి×100

దిగుమతి యూనిట్ విలువ సూచి

(or)

$$N = \frac{Px}{Pm} X100$$

పై సమీకరణ ద్వారా రెండు కాలాల మధ్య వర్తక మార్పులను తెలుకోవాలంటె ఎగుమతి దిగుమతి ధరలను ప్రస్తుత ఆధార సంవత్సరాల మధ్య గల వ్యత్యాసాన్ని బట్టి తెలుసుకోవచ్చు.

దీనివల్ల తెలియునదేమంటే ఒక దేశ ఎగుమతుల ధరల సూచి సంఖ్య పెరుగుతున్నపుడు దిగుమతుల ధరలసూచి సంఖ్య స్థిరంగా ఉంటే నిర్ధిష్ట పరిమాణం గల దిగుమతులను ఇంతకు ముందు కన్న తక్కువ విలువ గల ఎగుమతుల ద్వారా పొందగలదు. ఈ స్థితిని అనుకూల వర్తక నిబంధనలుగా పరిగణించవచ్చు. ఆవిధంగా కాక ఆ దేశ దిగుమతుల సూచీ సంఖ్య పెరుగుతూ ఉంటే వర్తకనిబంధనలు ప్రతికూలంగా మారి ఆ దేశానికి వర్తకనిబంధనలు ప్రయోజనాన్ని చేకూర్చవు. ఈ నికరమైన వస్తు వర్తకనిబంధనలు కేవలం సాపేక్ష ధరల కదలికసాధారంగానే రూపొందించబడినాయి. కాని ఒక దేశం వ్యాపారాన్ని ప్రభావితం చేసే ఇతర ముఖ్యంశాలైన ఎగుమతి, దిగుమతుల పరిమాణం, ఎగుమతి దిగుమతుల కలయిక, వాటి నాణ్యత ఉత్పత్తి కారకాలకు సంబంధించిన వివిధ అంశాలు పరిగణనలోకి తీసుకోవడం జరగలేదు. నికర వస్తు వినిమయ లోపాలు అధిగమించడానికి స్థూల వస్తు వినిమయ వర్తక నిబంధనలు రూపొందించడం జరిగింది.

పై భావనల ద్వారా వర్తకనిబంధనలు అనుకూల ప్రతికూల ఫలితాలను అంచనావేస్తారు. మనదేశంలో వర్తక నిబంధనలను ఇపుడు పరిశీలిద్దాము.

16.3. భారతదేశ విదేశీ వర్తక నిబంధనలు తీరుతెన్నులు.

ఇండియా విదేశీ వ్యాపార గమనంలో వర్తకనిబంధనలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. ఈ దిగువ పట్టికలో వివిధ కాలంలోని ఎగుమతి దిగుమతుల ధరల సూచి మరియు పరిమాణ సూచీలు ఇవ్వబడినవి. ఈ సూచీలను బట్టి వివిధ కాలాల్లో వర్తక నిబంధన పోకడలను పరిశీలించవచ్చును.

పట్టిక-1

భారత దేశ ఎగుమతి దిగుమతి సూచి (1968 -69=100)

	యూనిట్ విలువ సూచి		వస్తుపరిమాణ సూచి.	
దిగుమతులు	1969 1970		1980-81	1990-91

Source: RB1, Report on currency & Finance, 1974-75 and hand book of statisticks on Indian Econmy (2001)

పట్టిక -2

భారతదేశ విదేశీ

మొదటి పట్టికలో ఇవ్వబడిన ఎగుమతి దిగుమతుల ధరలు మరియు పరిమాణ సూచీలు పరిశీలించాక తెలియునదేమనగా దిగుమతులలోని పెరుగుదల ఎక్కువ భాగం వాని ధరలలోని పెరుగుదల వలన వచ్చినదనియు కాని ఆమేరకు దిగుమతుల పరిమాణం పెరగలేదని తెలియుచున్నది. ఉదాహరణకు ఆహార దిగుమతుల విషయంలో పరిమాణం సూచి 1969-70లో 82 కాగా 1975-76 కు 134 మేరకు మాత్రమే పెరిగింది. కాని అదే కాలంలో ధరల సూచి 97 నుండి 265కు పెరిగింది. అదేవిధంగా ఖనిజ ఇంధనాల విషయంలో కూడా 1969-70లో పరిమాణ సూచి 213 కాగా 1979-80 సంకి 543 కి పెరిగింది. అదే కాలంలో ధరల సూచి 77 నుండి 728 పాయింట్లకు పెరిగింది. పారిశ్రామిక వస్తు దిగుమతులు, యంత్రాలు, రవాణా పరికరాలు, రసాయనాల దిగుమతుల విషయంలో కూడా ధరల సూచి పరిణామ సూచి కన్నా ఎక్కువని గమనించవచ్చు. ధరల సూచిలోని ఎక్కువ పెరుగుదల వల్ల దిగుమతి చెల్లింపుల్లో గణనీయమయిన పెరుగుదల ఏర్పడి ఎక్కువ భాగంగా మారింది. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దిగుమతి వస్తువులకు గల అవ్యాకోచ డిమాండు పరిస్థితి వల్ల దిగుమతులు తప్పక చేసుకోవలసి వచ్చింది.

ఎగుమతుల విషయంలో 1969-70 సంవత్సరంలో పరిమాణ సూచి 100 కాగా 1979-80 సంవత్సరం నాటికి అవి 199 కి పెరిగింది. అదే కాలంలో ధరల సూచి 104 నుంచి 236కు పెరిగింది. అంతర్జాతీయంగా ఎగుమతి వస్తు ధరల్లో ఏర్పడిన పెరుగుదల

పరిమాణ సూచికన్న ధరల సూచిలో ఎక్కువ మార్పులు తీసుకువచ్చింది. ఉదాహరణకు ఖనిజ ఇంధనాలు, బోగ్గు మొదలయిన వస్తువుల విషయంలో ధరలు పెరుగుదల ఎక్కువగా నమోదయింది. అదే విధంగా టి (Tea) మరియు జనపనార ఎగుమతుల విషయంలో కూడా ధరల సూచిలో పెరుగుదల ఆ ఎగుమతుల పెరుగుదలకు ఎక్కువ అవకాశం కల్పించిందని చెప్పవచ్చును. అనగా అంతర్జాతీయ వ్యాపార వ్యవస్థలో నెలకొని ఉన్న ద్రవ్యోల్బణ పరిస్థితులు ఎగుమతుల పెరుగుదలకు ఎక్కువ సహకరించిందని చెప్ప వచ్చును. 1978-83 సంవత్సర ముసాయిదా ప్రణాళికలో పేర్కొనిన విధంగా 1974-75 సంవత్సర కాలంలో దాదాపు 25 శాతం మేరకు ఎగుమతి వస్తు ధరల సూచిలో పెరుగుదల ఏర్పడింది. మొదటి పట్టికలో చూపిన విధంగా స్థూలంగా భారతదేశ ఎగుమతి ధరల సూచిలో సరాసరి /. సగటున 80వ దశకంలో 16.9 శాతం, 90 దశకంలో 13,6 శాతం పెరుగుదల ఏర్పడింది. అదే విధంగా దిగుమతి ధరల సూచిలో సాధారన దిగుమతుల విషయంలో 80వ దశకంలో 10 శాతం, 90వ దశకంలో 6.9 శాతం పెరుగుదల ఏర్పడింది. అదే విధంగా పరిణామ సూచిలో మార్పుల విషయంలో ఎగుమతుల విషయంలో 80వ దశకంలో 8 శాతం, 90వ దశకంలో 13.3 శాతం పెరుగుదల నమోదయింది. దిగుమతి పరిమాణ సూచిలో 80వ దశంలో 7.3 శాతం, 90వ దశకంలో 13.6 పెరుగుదల ఉంది. దీనిని బట్టి తెలియునదేమనగా ఎగుమతి ధరల్లో పెరుగుదల 80వ దశకంతో పోల్చితే 90వ దశకంలో తక్కువని చెప్పవచ్చును. అదే విధంగా దిగుమతుల విషయంలో కూడా 80వ దశకంలోనే ధరలు ఎక్కువని తెలిస్తుంది. ఏదిఏమయినప్పటికీ 90వ దశంకంలో ఎగుమతుల ధరలు పరిమాణంతో పోల్చినపుడు దిగుమతుల పరిమాణ దరల సూచిలో ఎక్కువగా కనిపించుచున్నదని చెప్పవచ్చును.

1990-91 సంవత్సరము నుండి 2000-2001 కాలంలో సంభవించిన పరిణామాలను పరిశీలించాక - ఎగుమతుల విషయంలో ధరల నూచి పెరుగుదల 113 పాయింట్లు కాగా పరిమాణ సూచి విషయంలో ఎక్కువ మార్పులు చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ వివిధ ఎగుమతుల్లో ఈ మార్పులు వివిధ రకాలుగా ఉన్నాయి. ఆహార వస్తు ఎగుమతుల్లో ధరల సూచివల్ల 100 శాతం మార్పురాగా పరిమాణ సూచిద్వారా 150 శాతం మార్పు ఏర్పడింది. కాని పారిశ్రామిక వస్తు విషయంలో ధరల సూచిలో మార్పు ప్రభావం 227 శాతం కాగా పరిమాణ సూచి ప్రభావం కేవలం 85 శాతం మాత్రమే. రసాయనాల విషయంలో ధరల సూచి ప్రభావం 130 శాతం, పరిమాణ సూచి 283 శాతంగా ఉంది. కాని ముడి పరికరాలు ధరల సూచి ప్రభావం ఎక్కువగా నమోదయింది.

దిగుమతుల విషయంలో 1990-91 సంవత్సరం నుండి 2000-01 సంవత్సరం వరకు ధరల సూచిలోని పెరుగుదల 82 శాతంగాను, పరిమాణ సూచిలో పెరుగుదల 194 గాను నమోదయింది. అనగా ఖనిజ ఇంధనాలు, యంత్రాలు మరియు రవాణా పరికరాల విషయంలో ధరలసూచి పెరుగుదల శాతం 91 శాతంగాను పరిమాణ సూచిలోని పెరుగుదల 133 శాతంగాను నమోదయింది. రసాయనాలు సంబంధి పదార్థాల విషయంలో ధరల సూచి పెరుగుదల పరిమాణ సూచి పెరుగుదల కన్నా ఎక్కువగా ఉంది. దానివల్ల రసాయనాల దిగుమతుల విషయంలో చెల్లింపుల భారం ఎక్కువగా ఏర్పడింది. రెండవ పట్టికలో ఇవ్వబడిన వివిధ వర్తక నిబంధనల పోకడలను పరిశీలించాక నికర వస్తు వర్తకనిబంధనలు 1975-76 సంవత్సరం నుండి 1980-81 సంవత్సరం వరకు పూర్తిగా ప్రతి కూలంగా ఉన్నాయి. అదేకాలంలో ఆదాయ వర్తక నిబంధనలు సూచిలో కలిగిన పరిణామాలు దిగుమతులు చేసుకొనే శక్తి తక్కువని, ఇది నికర వస్తు వర్తక నిబంధనలు 100 శాతం కన్నా తక్కువ నమోదు కావడం ద్వారా సూచించబడుచున్నదని తెలుస్తుంది. కాని 1980-81 సంవత్సరం తరువాత ఆదాయ వర్తకనిబంధనల సూచిలో అనుకూల పరిణామాలు స్పష్టంగా ఏర్పడినవని చెప్పవచ్చును. 1990-91 సంవత్సరం నుండి ఆదాయ వర్తక నిబంధనల్లో అనుకూల పరిణామాలు ఏర్పడి 1998-99 నాటికి 592 శాతంగాను 2000-2001 సంవత్సరం నాటికి 731.6 గరిష్టస్థాయికి చేరుకొనుట వర్తక నిబంధనల్లో ఇటీవల సంస్కరణల కాలంలో నెలకొన్న మంచి పరిణామంగా చెప్పవచ్చును. ఏమయినప్పటికీ ఈ సుభ పరిణామం స్థూల వస్తువర్తత నిబంధనల్లోగాని నికరవస్తు వర్తక నిబంధనలో గాని అంత స్పష్టంగా కానరాలేదు.

16.4 భారతదేశ ఆర్థికాభివృద్ధిలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థల పాత్ర:

అభివృద్ధి చెందుతున్న దేశాలు వేగవంతముగా అభివృద్ధిపథంలో పయనించుటకు ఆర్థిక వనరుల అవసరం ఎంతైనా ఉంటుంది. వలస పాలనలో ఆర్థికాభివృద్ధి మందగించిన మనదేశ ఆర్థిక వ్యవస్థ, స్వాతంత్రానంతరం అనేక కార్యక్రమాలను అమలు

పరచి అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ఈ దశలో ఆర్థిక సహకారం కోసం ఇతర విదేశీ సంస్థల పై ఆధార పడక తప్పదలేదు 1947 లో స్వాతంత్ర్య సంపాదించిన నాటినుండి మనదేశం అనేక అభివృద్ధి కార్యక్రమాలను, పంచవర్ష ప్రణాళికలను అమలు పరచి అభివృద్ధి వ్యూహంతో ముందుకు పయనించుచున్నది. అయితే ఈ కార్యక్రమాల అమలుకు దేయంగా వనరుల సమీకరణ తగినంతగాలేదు. మనదేశ ఆర్థిక వ్యవస్థ పేదరికపు విషవలయంలో ఉండుటవల్ల నిధుల కొరత తీవ్ర సమస్యగా పరిణమించింది. దీనివల్ల, మన దేశం వలే అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక సహాయం అందించు నేపథ్యంలో రెండవ ప్రపంచ యుద్ధము తరువాత ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల మధ్య సహాయ సహకారాలను పెంచేందుకు ఐక్యరాజ్య సమితి అనేక సంస్థల పుట్టుకకు శ్రీకారం చుట్టింది. ఈ సంస్థలు సభ్యదేశాలకు కావలసిన ఆర్థిక వనరులను సమకూర్చుతున్నాయి. ఈ నేపథ్యంలో మనం ఆర్థిక సహాయం పొందే అంతర్జాతీయ సంస్థల గూర్చి తెలుసుకుందాం.

మనదేశానికి ఆర్థిక సహాయం అందించు సంస్థల్లో ప్రధానమయినవి. అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) ప్రపంచబ్యాంకు (IBRD), అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (IDA), అంతర్జాతీయ విత్త సంస్థ (IFC), ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB) ప్రధానమయినవిగా పేర్కొనవచ్చును.

16.4.1 ఇండియా ఆర్థికాభివృద్ధిలో అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) పాత్ర:

అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) ను స్థాపించిన నాటి నుండి మన భారత దేశం శాశ్వత సభ్యత్వం కొనసాగిస్తున్న అయిదు పెద్ద దేశాలలో ఒకదేశంగా పరిగణించబడుచున్నది. మనదేశం మొదటి 400 మిలియన్ S.D.Rs కోటా మొత్తంగా పెట్టి నేడు 2207 మిలియన్ SDR లు దాటి కోటా మొత్తాన్ని పెంచింది. అందులో బంగారం, డాలర్లు కలిపి దాదాపు 550 మిలియన్ డాలర్లు కలిగి ఉంది. (1973 సం॥లో IMF Special Drawing Rights (Paper gold) అనే ప్రత్యేక కరెన్సీని సృష్టించింది. దీనిని క్లుప్తంగా SDR- అని సంభోదిస్తున్నారు). ప్రారంభంలో ఒక డాలరు విలువ రూపాయితో పోల్చినపుడు రూ.3.30 లకు సమానంగా ఉండేది. అయితే రూపాయి విలువ అనేక సార్లు మూర్తహీనీకరణ చేయుట వల్ల తగ్గి 1978 నాటికి 1 డాలరు విలువ రూ.8.25 కు పెరిగింది. అయితే 1991 నాటికి మూల్యహీనీకరణ వల్ల రూపాయి విలువ మరింతగా తగ్గి డాలరు 35 రూపాయలకు సమానంగా అధికారిక రేటుకు పెరిగింది. ఇటీవల కాలంలో సంస్కరణల్లో భాగంగా రూపాయి మారక నియంత్రణ సడలింపువల్ల మరియు ఎగుమతుల ప్రోత్సాహకం దృష్ట్యా రూపాయి విలువ డాలర్లుతో పోల్చినపుడు 45 రూపాయిలు నుండి 46 రూ॥లు వరకు చేరింది.

మన అంతర్జాతీయ చెల్లింపుల ఇబ్బందులను తొలగిస్తేనే గాని అభివృద్ధి సాధ్యంకాదు. అందువల్ల వీటిని తొలగించుటకు అనేక సార్లు IMF నుండి స్వల్పకాలిక రుణాలను తీసుకోవడం జరిగింది. మొదట్లో మనం 1948-49 సంవత్సరములో IMF నుండి $100 మిలియన్లు తీసుకొని 1956-57 సం॥ములో ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడం జరిగింది. మరలా 1957లో IMF నుండి 200 మిలియన్ల డాలర్లును మన అభివృద్ధి కార్యక్రమాల వలన ఏర్పడిన అంతర్జాతీయ చెల్లింపులలోని లోటును నివారించుటకు అప్పుగా తీసుకోవడం జరిగింది. ఈ మొత్తంలో సుమారుగా 63 మిలియను డాలర్లను ఇంకా తిరిగి చెల్లించకుండానే 1961 సంవత్సరంలో మరలా మరో 250 మిలియను డాలర్లను IMF నుండి రుణంగా స్వీకరించడం జరిగింది.

మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు బాగా తగ్గిపోయిన పరిస్థితుల్లో IMF ఎంతగానో అందుకుంటుంది. 1965-66 సంవత్సరంలో మన విదేశీ చెల్లింపుల ఇబ్బందులు మరింతగా త్రీవమయినందున IMF అప్పు తిరిగి చెల్లించుటలో అనేక ఇబ్బందులను ఎదుర్కొనడం జరిగింది. అయినప్పటికి మరలా IMF నుండి 300 మిలియను డాలర్లను అప్పుగా స్వీకరించాము. 1981 సంవత్సరములో 5,000 మిలియను SDR (రూ. 5,000 కోట్లు) IMF నుండి చాలా పెద్ద మొత్తంలో ఆయిల్ ధరలు పెరిగినందున ఏర్పడిన సంక్షోభ నివారణకు ఆయిల్ బిల్లులు చెల్లించుటకు మళ్ళీ IMF ను ఆశ్రయించ వలసి వచ్చింది. తద్వారా అంతర్జాతీయంగా దేశప్రతిష్టను కాపాడుకోవడంలో IMF ప్రాత అద్వితీయము. 1988-89 సంవత్సరము నుండి అంతర్జాతీయ చెల్లింపుల ఖాతాలోటును పూరించుటకు రుణాలును IMF నుండి తీసుకోవడం జరుగుచున్నది. అదే సంవత్సరములో ప్రత్యక్ష కరెంటు ఖాతాలో లోటు నివారణకు సుమారుగా 8 బిలియను డాలర్లు రుణం తీసుకోవడం జరిగింది. అయితే 1990-91 సంవత్సరం నాటికి దేశ ఆర్థికవ్యవస్థలో ఎన్నడూలేని విధంగా కరెంటు ఖాతాలో లోటు విపరీతంగా, మరింతగా పెరిగి పరిస్థితి విషమించినట్లయింది. రాజకీయ అనిశ్చితి వల్ల ప్రవాస భారతీయుల (NRIs)

నుండి వచ్చే డిపాజిట్ల మొత్తాలు కూడా బాగా తగ్గిపోయాయి. ఈ పరిణామంలో దేశం విదేశీ నిల్వలు కనీసం వాం రోజులకు సరిపడునంతగా కూడా లేకపోవడంతో IMF ను ఆశ్రయించగా, ఆర్థిక దుస్థితిని గమనించిన IMF, మనదేశంపై అనేక ఆంక్షలు విధించి వాటిని అమలు పరచినట్లయితే రుణం ఇచ్చుటకు అంగీకరించింది. (రూపాయి విలువ 22% వరకు మూల్యహీనీకరణ చేయడం, అన్ని రకాల వస్తువుల దిగుమతులపై సుంకాలను 130 % నుండి 30% కి తగ్గించడం, ప్రభుత్వ వ్యయాన్ని 10 శాతం తగ్గించడం మొదలయినవి. ఈ ఆంక్షల్లో ముఖ్యమయిన అంశాలు) ఆంక్షలు అంగీకరించడం వల్ల ఆ సంవత్సరములో 1.3 బిలియను డాలర్లు అప్పుగా తీసుకున్నాము. విపరీతంగా పెరుగుచున్న మన ప్రభుత్వ వ్యయాన్ని ఆరికట్టుటకు అన్ని రకాల సబ్సిడీలను బాగా తగ్గించాము. ఖాయిలా పడిన ప్రభుత్వ సంస్థలను మూసివేయటం లేదా ప్రయివేటుకరణ చేయడం జరుగుచున్నది. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం, బహుళజాతి సంస్థలకు (MNcs) స్వాగతం పలకటం లాంటి అనేక విప్లవాత్మక చర్యల ద్వారా వ్యయాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాము.

ఈ సంస్కరణల వల్ల IMF నుండి రుణావసరాలు తగ్గినప్పటికీ పూర్తిగా తొలగాయని కాదు. IMF సహకారం కొనసాగుతూనే ఉంది. 1991 లో 5132 కోట్ల రూపాయలు, 1992 లో 8934 కోట్ల రూ॥లు 1995 సం॥లో 13,545 కోట్ల రూ॥లు మరియు 1998 సం॥లో 2622 కోట్లు రూ॥లు అప్పుగా తీసుకోవడం జరిగింది. అయితే ఆర్థిక సంస్కరణలు దేశీయంగా ప్రస్తుతానికి విజయవంతం కావడం వల్ల 2000 మరియు 2001 సంవత్సరాలలో IMF నుండి రుణం తీసుకోకపోవడం భారతదేశ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో ప్రముఖ విషయంగా చెప్పవచ్చును.

16.4.2 ఆర్థికాభివృద్ధిలో ప్రపంచబ్యాంకు పాత్ర:

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అనేక ప్రపంచ దేశాల్లో ఆస్తులు విధ్వంసమయినాయి. అంతేకాక ఆయాదేశాలలో ఆర్థికాభివృద్ధికి తగిన వనరులు లేకపోవడంతో వెనుకబడినాయి. ఈ పరిస్థితుల్లో ప్రపంచబ్యాంకులను 1944లో స్థాపించి, దీర్ఘకాలిక పెటుబడులను ఇచ్చేందుకు నిర్ణయింపబడింది. ప్రపంచబ్యాంకు స్థాపించినపుడు IMF సభ్య దేశాలన్నీ, దీనిలోనూ సభ్యులుగా పరిగణించబడతాయి తరువాత ఈ ఆంక్షలను తొలగించి సభ్యత్వం పుచ్చుకొవడం ఆయా దేశాల ఇష్టా యిష్టాలకే వదిలివేయడం జరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధంలో దెబ్బతిన్న దేశాలలో పునర్నిర్మాణం మరియు ఉత్పత్తి కార్యకలాపాలకు వనరులు ప్రయివేటు పెట్టుబడుల నుండి కూడా సమకూరనపుడు, అంతర్జాతీయ వ్యాపారంలో దీర్ఘకాలిక సంతులిత అభివృద్ధిని ఏర్పరచి తద్వారా అంతర్జాతీయ చెల్లింపుల సమతౌల్యం ఏర్పాటు, సభ్యదేశాలలో అత్యవసర ప్రాజెక్టులకు, మరియు ఆర్థికాభివృద్ధికి ఉపయోగకరమైన పెద్దతరహా, చిన్నతరహా ప్రాజెక్టులకు అవసరమయినటువంటి దీర్ఘకాలిక రుణాలను సమకూర్చుట మొ॥వి ప్రపంచ బ్యాంకు యొక్క ప్రధాన లక్ష్యాలు.

మన దేశంలో విద్యుచ్ఛక్తి, రవాణా మరియు సమాచార అభివృద్ధికి ప్రపంచబ్యాంకు ఎంతగానో రుణసహాయం చేసింది. అంతేకాక పారిశ్రామికాభివృద్ధికి ముఖ్యంగా ఉక్కు పరిశ్రమలకు, నీటిపారుదల సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి ఎన్నో విధాల సహాయ సహకారాలను అందించింది. ప్రపంచ బ్యాంకు నుండి రుణ సౌకర్యం పొందిన దేశాలలో మనదేశం తృతీయ స్థానాన్ని ఆక్రమించింది. మన రైల్వేలు, పవర్ ప్రాజెక్టులు, బహుళ ప్రయోజనంగల నీటి పారుదల ప్రాజెక్టులు, పోర్టులు, ఎయిర్‌లైన్స్, స్టీలు ఉత్పత్తి, బొగ్గు ఉత్పత్తి మొదలగు కార్యక్రమాలకు సహాయాన్ని అందించింది.

అంతేకాక ఇండస్ట్రియల్ క్రెడిట్ అండ్ ఇన్వెస్టుమెంటు కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (ICICI) అనే ఆర్థిక సంస్థకు కూడా రుణ సౌకర్యాన్ని కల్పించింది. 1993 జూన్ నాటికి మన దేశం 152 సార్లు ప్రపంచ బ్యాంకు నుండి రుణాల్ని తీసుకుంది దాదాపు ఆ రుణం 22,000 మిలియన్ల డాలర్లు మేరకు ఉంది.

మన ప్రభుత్వ, ప్రయివేటు రంగాలకేకాక, పంచవర్ష ప్రణాళికల అమలుకు కూడా కావలసిన రుణాన్ని ప్రపంచబ్యాంకు కొంత వరకు అందిస్తుంది. మనదేశంలో సంభవించిన వరదలు మరియు ఇతర ప్రకృతి వైపరిత్యాల వల్ల ఏర్పడిన నష్టాల నివారణకు ఎంతో సహాయం చేసింది. కేంద్ర ప్రభుత్వాలకే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా రుణాలను అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

1994 నుండి 2003 మధ్య కాలంలో వివిధ అభివృద్ధి పథకాలు క్రింద కొన్ని వేల కోట్లు రూపాయాలను రుణంగా పొందుటను మంచి ఉదాహరణగా చెప్పవచ్చును. ఎక్కువగా వ్యవసాయ రుణాలు ఇచ్చుటకు ఈ బ్యాంకు శ్రద్ధ చూపుతున్నది.

16.4.3 అంతర్జాతీయ అభివృద్ధి ఏజన్సీ (IDA):

ప్రపంచబ్యాంకును అంతర్జాతీయ విత్త సహాయసంస్థగా పేర్కొనవచ్చు. ఇది వాణిజ్య ప్రాతిపదిక మీద సభ్య దేశముల అభివృద్ధి, అవసరాలను తీరుస్తుంది. నీటి సరఫరా, గృహ వసతి, మురికివాడల నిర్మూలన, పారిశుధ్యము మొదలగు పథకాలకు ఈ సంస్థ రుణాలివ్వదు. అయితే వెనుకబడిన దేశాలు అనగా తలసరి స్థూలజాతీయ ఉత్పత్తి 675 డాలర్లు కంటే తక్కువగల దేశాలకు సహాయాన్ని ఎటువంటి వడ్డీ లేకుండా అందిస్తుంది. కీలకమయిన సౌకర్యాలను అభివృద్ధి పరచుకొనుటకు దేశాలకు సులభ ప్రాతిపదికపై రుణాలివ్వడానికి 1960 సం॥ములో IDA ను ఏర్పాటు చేసారు. దీనిని ప్రపంచ బ్యాంకుకు అనుబంధ సంస్థగా పేర్కొనవచ్చు.

ఈ సంస్థ వాణిజ్య ప్రాతిపదిక మీద కాక సులభ ప్రాతిపదిక మీద రుణాలనిస్తుంది. వడ్డీరేటు లేకుండా కేవలం సర్వీసు ఛార్జీలను మాత్రమే వసూలు చేస్తుంది. ఈ సంస్థ ఇచ్చే రుణాల కాలపరిమితి సుమారు 50 సం॥ల వరకు ఉంటుంది. ఈ సంస్థ ఇచ్చిన రుణాలను రుణగ్రస్త దేశాల స్వంత కరెన్సీలో తిలిగి చెల్లించు అవకాశం కల్పించింది. ప్రపంచ బ్యాంకు నుండి త్వరగా రుణ సహాయాన్ని పొందలేని దేశాలకు IDA ప్రాధాన్యత నిస్తుంది.

1963-64 సంవత్సరములో IDA మనదేశానికి ప్రథమంగా రుణసౌకర్యం కలుగజేసింది. ప్రత్యకించి ఏ ప్రాజెక్టుల కోసం కాకపోయినప్పటికీ, మూలధన వస్తువుల ఉత్పత్తిని చేసే పరిశ్రమల కవసరమయిన యంత్రాలు, మెటీరియల్స్‌ను విదేశాల నుండి దిగుమతి చేసుకోడానికి IDA రుణాలిచ్చింది. అంతే కాక మనదేశంలో వ్యవసాయాభివృద్ధికి రుణాలందించింది. ముఖ్యంగా వ్యవసాయ రుణాలివ్వడం, కమాండ్ ఏరియా అభివృద్ధి ప్రాజెక్టులు, పశుగణాభివృద్ధి ప్రాజెక్టులు విత్తనాభివృద్ధి, కరువుప్రాంతాల అభివృద్ధికి సహాయం అందించింది. అంతేకాక జాతీయ రహదార్ల నిర్మాణం, ఉత్తరప్రదేశ్‌లో గొట్టపుబావులు, గుజరాత్‌లో నీరు నిలిచిపోయే ప్రాంతాలలో డ్రయినేజ సదుపాయం, గ్రామీణ విద్యుదీకరణ మొదలగు కార్యక్రమాలకు IDA బాగా రుణసహాయాన్ని అందించింది. సుమారుగా 116 సార్లు ఈ సంస్థ నుండి అప్పులు పొందాము. అప్పుమొత్తం సుమారు 20,500 మిలియన్లు డాలర్లు ఉంది.

16.4.4 అంతర్జాతీయ విత్తసంస్థ (IFC):

ప్రపంచ బ్యాంకుకు అనుబంధ సంస్థగా IFC 1956లో స్థాపించబడినది. ముఖ్యంగా సభ్యదేశాలలో ప్రయివేటు రంగానికి విత్త సదుపాయాన్ని కలుగజేసేందుకు ఈ సంస్థ ఉద్దేశించబడినది. ప్రపంచబ్యాంకుకు అనుబంధ సంస్థ అయినప్పటికీ ఈ సంస్థకు ప్రత్యేకంగా నిధి, కొన్ని విధులు కూడా ఉన్నాయి. అయితే ప్రపంచ బ్యాంకు సభ్యులంతా ఈ సంస్థలో సభ్యులుగా పరిగణించబడతారు.

IFC సభ్యదేశాలలో ప్రయివేటు రంగ ఉత్పత్తి కార్యక్రమాలను సహాయ సహకారాలందించడం, ముఖ్యంగా సభ్య దేశాలలో వెనుకబడిన ప్రాంతాలలో ప్రయివేటురంగాన్ని ప్రోత్సహించి ఆర్థికాభివృద్ధికి దోహదం చేయడం ఈ సంస్థ ముఖ్య లక్ష్యము. ప్రయివేటు రంగంలో పెట్టుబడి పెట్టే అవకాశాలను సమర్థవంతమయిన యాజమాన్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ సంస్థ ఉద్దేశించబడింది. స్వదేశి, విదేశి ప్రయివేటు మూలధనాన్ని ఉత్పత్తి కార్యక్రమాలవైపు ప్రోత్సహిస్తుంది. ప్రయివేటు రంగ సంస్థలు మంచి సమర్థవంతమయిన యాజమన్యం కలిగి ఉన్నాయని IFC సంతృప్తి చెందితేనే రుణాలను ఇస్తుంది.

IFC 1993 వరకు 600 సంస్థలలో దాదాపు 80 అభివృద్ధి చెందిన దేశాలకు రుణాలిచ్చి ప్రయివేటు పెట్టుబడులను ఉత్పాదక కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తుంది. ఇప్పటి వరకు 2650 మిలియను డాలర్లు పెటుబడి పెట్టింది. మన దేశంలో IFC దాదాపు 13 కంపెనీలలో 50 మిలియనుడాలర్లు వరకు పెట్టుబడి పెట్టింది. మిగిలిన అంతర్జాతీయ బ్యాంకులన్నీ కేవలం ఆయా బ్యాంకుల సభ్యదేశాల ప్రభుత్వాలకే రుణాలిస్తుంటే, కేవలం ఈ IFC మాత్రం సభ్యదేశాలలోని ప్రయివేటు రంగానికి కూడా రుణసౌకర్యం కలుగ జేస్తుంది.

16.4.5 ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB):

ఆసియా మరియు ఫార్‌ఈస్ట్ (Far East) ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పెట్టుబడిని ప్రభుత్వ ప్రయివేటు రంగాలలో ప్రోత్సహించుటకై ఈ బ్యాంకు 1964 సం॥ములో స్థాపించారు. ప్రాంతీయ, జాతీయ ప్రాజెక్టులకు కావలసిన ఆర్థిక వనరులను

సమర్ధవంతంగా సమీకరించుకొని ఆర్థికాభివృద్ధికి తోడ్పడేందులకు కూడా ఈ బ్యాంకు సహకరిస్తుంది. ముఖ్యంగా బాగా వెనుకబడిన దేశాలకు చిన్న దేశాలకు రుణాలివ్వడానికి ఈ సంస్థ ప్రాధాన్యత నిస్తుంది. సభ్యదేశాల ఆర్థిక విధానాలు, ప్రణాళికలలో సహకరించి వనరులను సద్వినియోగ పరచుకునేందుకు విదేశీవాణిజ్యాన్ని ప్రోత్సహించుటకు కూడా ఈ సంస్థ సహకరిస్తుంది.

మనదేశం ADB నుండి ఎటువంటి రుణాలు తీసుకోగూడదని నిర్ణయించుకున్నప్పటికీ రుణం తీసుకున్న దేశాల్లో రుణం పొందటంలో జపాన్, చైనా తరువాత 3వ స్థానాన్ని ఆక్రమించింది. 1990 లో ఏర్పడిన అనిశ్చతి తరువాత రుణాలు కొరకు వెదకటం ప్రారంభమయింది 1990 అంతానికి ABC ఇచ్చిన రుణాలు ప్రయివేటురంగంతో సహా 3624 మిలియను డాలర్లుకు చేరియింది. భారతదేశం సుమారుగా 644 మిలియను డాలర్లు 14 సార్లుగా తీసుకుంది. మరలా 181 మలియన్‌డాలర్లు అప్పుగా పొందింది.

సభ్య దేశాలలో అభివృద్ధి ప్రాజెక్టులకు కావలసిన సాంకేతిక సహాయాన్ని అందించి తద్వారా ఆయాదేశాల అభివృద్ధికి తోడ్పడేందుకు ఈ సంస్థ ప్రయత్నిస్తుంది. అయితే ఈ రుణాలు ఎక్కువగా నిర్భంధ అప్పల రూపంలో ఉంటాయి. ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకమయిన ప్రాజెక్టులకు ఆర్థికవనరులు సమకూర్చుటకు ప్రత్యేక విండో కింద నిధులు అందిస్తుంది ADB సభ్యదేశాలకు సహజంగా ప్రాజెక్టుల కవసరమయిన విదేశీ మారకద్రవ్య వనరుల రూపంలో అప్పులిస్తుంది. అయితే ఈ అప్పులు తిరిగి చెల్లించేటపుడు ఏ కరన్సీ రూపంలో అప్పు తీసుకోవడం జరుగుతుందో అదే కరెన్సీ రూపంలో తిరిగి చెల్లించవలసి ఉంటుంది. ఈ నిబంధన అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ మొత్తం మీద ADB వనరులను సమకూర్చటంలో విశేష కృషి చేస్తుందని చెప్పడంలో సందేహం లేదు.

పైన పేర్కొన్న విధంగా అంతర్జాయ ద్రవ్య సంస్థలు మనదేశ ఆర్థిక వ్యవస్థ ఆర్థికాభివృద్ధి చెందుటలో కావలసిన ద్రవ్య వనరులను సమకూర్చుట జరుగుచున్నది. అభివృద్ధి చెందుతున్న దశలో కేవలం స్వదేశివనరులే సరిపోవు. కాబట్టి తప్పనిసరిగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలనుండి సహాయాన్ని పొంది త్వరిత గతిన అభివృద్ధి చెందేందులకు మనదేశం కూడా తీవ్రంగా ప్రయత్నిస్తుంది. అయితే ఇటీవల కాలంలో నూతన ఆర్థితక సంస్కరణలు, ప్రపంచీకరణ ప్రభావాలు వల్ల రుణాలు తీసుకునే స్థితి నుండి కొంతవరకు బయటపడుట జరుగుట దేశానికి శుభ పరిణామంగా చెప్పవచ్చు.

16.5 వ్యాపార సరళీకరణ:

16.5.1 వ్యాపార విధాన పోకడల దశలు:

విదేశీ వ్యాపార విధానంలో నెలకొన్న పరిణామాలనుబట్టి విదేశీ వ్యాపార విధాన పోకడలను 5 దశలుగా విభజించారు.

ఈ దశలేవనగా -

1947-48 నుండి 1951-52 వరకు ప్రథమదశ

1952-53 నుండి 1956-57 వరకు రెండవదశ

1956-57 నుండి 1966 వరకు తృతీయదశగాను

1966 నుండి 1975 వరకు 4వ దశగాను మరియు

1975-76 నుండి అనంతర కాలాన్ని 5 వదశగాను వర్గీకరించారు. ఈ అయిదు దశలయందు వ్యాపార పోకడలు ఈ విధంగా ఉన్నాయని చెప్పవచ్చు. ప్రథమ దశలో దిగుమతుల నియంత్రణ విధానాలు ప్రారంభం కాబడినాయి. ఎగుమతుల విషయంలో స్పష్టమయిన విధానాలు రూపుదిద్దుకోలేదు. ద్వితీయ దశలో దిగుమతి లైసెన్సు విధానాలు కొంతమేరకు సడలించబడినాయి. అదే సమయంలో ఎగుమతుల విషయంలో కొద్ది స్థాయిలో ప్రోత్సాహకాలు ప్రారంభించబడినాయి. తృతీయదశలో దిగుమతుల నియంత్రణలు మరింత పటిష్టంగా అమలు పరచబడినాయి. అదే సమయంలో ఎగుమతి ప్రోత్సాహక విషయంలో సృష్టమయిన విధానాలను రూపకల్పన చేయడం జరిగింది. దిగుమతి ప్రత్యమ్నాయ వస్తు పరిశ్రమలకు అంకురార్పణ జరిగి ప్రోత్సహించబడినది. మూల్యన్యూనీకరణ (1966 సం॥లో) అనంతరం ప్రారంభించబడిన 4వ దశలో ఎగుమతుల ప్రోత్సహకంతో పాటు దిగుమతులు కూడా కొంతమేరకు సడలించబడినాయి. మొదలియాన్ కమిటి సూచనలు అమలు కొంతవరకు జరిగాయి. ముల్యం న్యూనీకరణ అంతగా విజయవంతం కాకపోవడంతో వార్షిక ప్రణాళికాకాలంలో మరలాదిగుమతులను నియంత్రంచవలసి వచ్చింది. ఈ దిగుమతి నియంత్రణ 1975-76 వరకు కొనసాగాయి.

1975-76 నుండి ప్రారంభమయి చివరి దశలో ఎగుమతులను ప్రోత్సహించుటకు దిగుమతుల సరళీకరణ ప్రక్రియను ప్రారంభించడమయినది. జనతా ప్రభుత్వ పాలనలో అత్యవసర వస్తువులు దేశీయ సరఫరా కొరకు ధరలను దేశీయంగా నియంత్రించుటకు దిగుమతులు సడలించబడినాయి. ఆర్థికాభివృద్ధి దృష్ట్యా ఎగుమతులు ప్రోత్సహించుటకు. దిగుమతుల సరళీకరణ ప్రక్రియ విధానంగా వేగవంతం కాబడినది. 1985 తంవత్సరములో ఎగుమతి దిగుమతి విధానాన్ని రూపకల్పన చేయుటలో అజాద్ హుస్సేన్ కమిటి

సూచనలను పరిగణించి ఎగుమతి ప్రోత్సాహక దిగుమతి ప్రతిస్థాపన విధానాల మధ్య ఒక చక్కని సమన్వయాన్ని సాధించడానికి ప్రయత్నాలు జరిగాయి. మూలధన వస్తువులు మరియు సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిని దిగుమతి చేయుటలో సరళీకరణ చేసారు. వీటిలో ప్రధానాంశంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1985-86 నుండి 1989-90 వరకు మొదటిదశ సరళీకరణ విధానాలను అత్యంత సమర్థవంతంగా అమలుపరిచారు. ఈ కాలంలో దిగుమతుల్లో వృద్ధి 17 శాతం కనిపించింది. మొదటిదశ సరళీకరణ విధానాలు విజయవంతం కావడంతో, ఎగుమతుల్లో వృద్ధి కనిపించడంతో 1991 నుండి అనుసరించిన నూతన అంతర్జాతీయ వ్యాపార విధానాలు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయుట జరిగింది.

16.5.2 ఇండియాలో 1991 సం॥ము నుండి గల సరళీకృత అంతర్జాతీయ వ్యాపార సరళీకరణ విధానాలు :

భారతదేశ విదేశీ వ్యాపారం లో నూతన అధ్యయనాన్ని రూపొందించుటలో 1991 నూతన విదేశీ వ్యాపార విధానం ప్రముఖమయినది. అప్పటి వాణిజ్య మంత్రి Mr.P. చిదంబరం దీనిని ప్రకటించారు. అంతవరకు విదేశీ వ్యాపారంలో దిగుమతి నియంత్రణలు, ఎగుమతుల ప్రోత్సాహకాలు, మొదలయిన అంశాల్లో వ్యాపార లైసెన్సులను క్రమబద్ధీకరించుట జరిగింది. అయితే వాణిజ్య విధానంలో సంస్కరణలు తెస్తూ వ్యాపారంపై గల పాలనాపరమయిన లైసెన్సు నియంత్రణలను తొలగించుటకు చర్యలు తీసుకోవడం జరిగింది. అవసరమయిన ఎరువులు, edible oil వంటి వస్తువులకు మినహా మిగిలిన వాటికి లైసెన్సు సడలింపు నిచ్చారు. ఎగుమతి చేయుటకు కేటాయించిన ఎగుమతి వాడలను (Export Houses) రద్దుచేసారు. అన్ని వస్తు జాబితాను OGL రకంగా పేర్కొనడం జరిగింది (Open General List). ప్రభుత్వము యొక్క ముఖ్య ఉద్దేశమేమంటే అత్యవసరమయిన వస్తువులు మినహా మిగిలిన అన్ని వస్తువుల విషయంలో వికేంద్రీకరణ విధానాన్ని అమలుపరుచుటగా పేర్కొనవచ్చు. 100 శాతం ఎగుమతులకు స్వేచ్ఛను కల్పించుట జరిగింది. దిగుమతుల విషయంలో కూడా మొదట్లో 30 శాతం వరకు అనుమతించినా తరువాత సడలించుట జరిగింది. చెల్లింపుల శేషమునందు గల అసమతౌల్యాన్ని నివారించాలన్న థ్యేయంతో ఈ చర్యలు తీసుకున్నారు. 1991 ఆగష్టు 3వ దీన ఎగుమతి ప్రోత్సాహకంలో భాగంగా నూతనంగా ఎగుమతి సంబంధయూనిట్లు (Export oriented units-(EOU)) లను మరియు ఎగుమతి ప్రోత్సాహక జోనులను (Export Promoter Zones) (EP2) ఏర్పటు చేస్తారు. దీనిద్వారా ఎగుమతి చేయదలచిన సంస్థలను ప్రత్యేకంగా గుర్తించడం జరుగుతుంది. ఇటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ ఎగుమతుల్లో పెరుగుదల ఆశించినంతగా లేదు.

1991 సంవత్సరము మరియు అనంతరం అనగా 1999-2000 కాలం వరకు గల మధ్య కాలాన్ని పరిశీలించినట్లయితే ఎగుమతులు ఆశించినంతగా పెరగలేదని తెలుస్తుంది. దీనివల్ల వ్యాపార చెల్లింపుల శేషంలో లోటు తగ్గలేదు. అందువల్ల 1999-2000 మరో ఎగ్జిమ్ (ఎగుమతి-దిగుమతి విధానం) పాలసీని ప్రవేశ పెట్టుటకు ప్రేరణ నిచ్చింది. దీనిద్వారా మరో నూతన వ్యాపారం విధానాలను రూపొందించడం జరిగింది.

ఎగ్జిమ్ పాలసీని 1999-2000 సంవత్సరానికి రామకృష్ణ హెగ్డే, కామర్స్ మినిష్టరు, 1999 మార్చిలో ప్రవేశపెటారు. దీనిలో ప్రధానంగా దిగుమతుల నియంత్రణ విషయంలో గత కాలం కన్నా సడలింపులు పెంచారు.

ఎగుమతి చేసుకొను వస్తువుల విషయంలో లైసెన్సులను అవసరం లేకుండా చేసిన వస్తువులు 894కి చేరాయి. అంతేకాకుండా 414 రకాల వస్తువులను ప్రత్యేక దిగుమతి లైసెన్సు రూటులో (SIL) ఉంచారు. FTZ (Free Trade Zones) స్వేచ్ఛా వ్యాపారం జోనులో ఎటువంటి కస్టమ్స్ ప్రమేయం లేకుండా ఎగుమతి నిర్వాహణకు మరింత స్వేచ్ఛను కల్పించారు. అన్ని ఎగుమతుల ప్రోత్సాహక జోను (EPZ) FTZ లను పరిగణలోకి తీసుకోబడతాయి. ఎగుమతి ఒరియణన్టెడ్ యూనిట్స్ (EOU) ను 20 శాతానికి తగ్గించారు

2000 సంవత్సరములో ఎగుమతి దిగుమతి విధానాలను ప్రకటిస్తూ ప్రత్యేక ఆర్థిక జోను (SEZ) లను ఏర్పాటు చేసారు. దీని ప్రకారం దిగుమతి ముల్ధన వస్తువులు మరియు ముడి సరకుల డ్యూటిని తొలగించారు. SEZ ఏరియాకు సంబంధించిన అన్ని వస్తువులను ఎగుమతి సంబంధ వస్తువులుగా పేర్కొనడం జరిగింది. SEZ యూనిట్లు ప్రాంతీయ టారిఫ్ ఏరియా (DTA) క్రింది ఉత్పత్తులు టెర్మినల్ పన్నులు లేకుండా కొనసాగించే అవకాశం కల్పించారు.

వ్యాపార విధానంలో ఈ మార్పులను తీసుకువచ్చినప్పటికీ వినియోగవస్తు దిగుమతుల పరిమాణ నియంత్రణలను (QRs) తొలగించలేదు. వినియోగ వస్తువులతో పాటు వ్యవసాయ వస్తువులు కూడా ఇందులో ఉన్నాయి. చెల్లింపుల శేషంలో చెల్లింపుల

సమస్య వల్ల దీనిని అనుసరించ వలసి వచ్చింది. అయితే అనేక దేశాలు ఈ విషయమై నిరసన వ్యక్తపరచడంతో QRs ను 2003 నాటికి తొలగించుటకు సమ్మతించింది. అయినప్పటికీ అమెరికా ఈ అంశాన్ని W.T.O. కి నివేదించడంతో, W.T.O సూచనలు మేరకు 2001-02 సంవత్సరంలో మరో ఎగ్జిమ్ పాలసీని ప్రకటిస్తూ తప్పనిసరిలో QRs ను తొలగించవలసి వచ్చింది అంతేకాక దిగుమతి, నియంత్రణలుగల మిగిలిన 715 రకాల వస్తువులపై నియంత్రణలు తొలగించారు. వీటిలో వినియోగ వస్తువులయిన, మాంసము, నెయ్యి; ద్రాక్ష, టీ ఉత్పత్తులు, కాఫి బాస్మతిరైసు, తీరు (Wine) వైను, విస్కి, రమ్, జిన్ ప్లాస్టిక్ తో తయారీ బ్రిఫ్‌కేసులు, గ్రిటింగ్ కార్డులు, కాటన్, కృత్రిమ ఫిలిమెంట్లు, టెక్స్‌టైల్స్, జాకెట్లు, టైస్, సింతటిక్ ఫైబర్, తోళ్లు ఉత్పత్తులు, ప్రెజర్ కుక్కర్లు, రేడియో బ్రాడ్ కాస్టింగ్ కలర్ టి.వి.లు, తోటపని ట్రాక్టర్లు, మోటరుసైకిళ్లు, అలారం గడియారాలు, లైఫ్‌బోట్లు, బొమ్మలు, టూత్‌బ్రష్‌లు, బాల్ పెన్నులు, దువ్వెనలు మొ॥వి ఇందులో ఉన్నాయి. రెండవరకం (వాడిన వస్తువు) వస్తువులను అనగా వాహనాలు, మాంసం, పౌల్ట్రి ఉత్పత్తులు మరియు ప్రాథమిక వ్యవసాయ వస్తువులపై నిబంధనలు తొలగించారు. వ్యవసాయ వస్తు ఎగుమతులకు కూడా ఎగుమతి ప్రోత్సాహక మూలధన వస్తువులు జాబితా (EPCG) గా, పన్ను మినహాయింపు పథకం (DES) అనుసరించి ప్రకటించారు.

QRs తొలగింపువల్ల దేశీయంగా, కళాకారులు, ఉపాంత సన్నకారురైతులు, చిన్న పరిశ్రమదారులకు ప్రతికూలంగా మారాయి. జాతియ ప్రభుత్వం కూడా ప్రత్యేక నినాదంతో 1947 సంవత్సర విధానాలు పరిరక్షణ ధ్యేంతో భారతీయుడిగా ఉండు. భారతవస్తువునే కొను (Be Indian - Buy India) అను నినాదంతో దిగుమతులను నియంత్రించుటకు ప్రయత్నించినా ఎగుమతుల ప్రోత్సాహక విధానాలు కొనసాగించుటకు ప్రయత్నాలు ముమ్మరమయినాయి. 2002-07 సంవత్సరానికి ఎగుమతి - దిగుమతి విధానంలో అనేక అంశాలు ప్రస్తావించబడింది.

ఎగ్జిమ్‌పాలసి 2002-2007 లో సేవల రంగంలో మార్పులు తెచ్చారు. ప్రత్యేక ఆర్థిక జోనుల (SEZ) యందు భారతీయ బ్యాంకులను అనుమతిస్తూ వాటిద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకర్షించు ప్రయత్నాలకు అవకాశం కల్పించారు. దీనిలో భాగంగా నగదు నిల్వల నిష్పత్తి (CRR), SLR ను అంశాలను మినహాయించారు. SEZ నందు విదేశీ వాణిజ్య రుణాలను (ECB), (External Commercial borrowings) అనుమతించారు.

ఉద్యోగ సంబంధిత అంశాలు గురించి ఈ విధానంలో ప్రస్తావించారు. అందులో భాగంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించి ఉత్పత్తి స్థాయిని పెంచుటకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. కుటీర, చేతిపనుల మార్కెటు విస్తరణను ఎగుమతులను పెంచు విధానంలో మార్పులు తెచ్చారు. తోళ్ళు, టెక్స్‌టైల్స్, ఆభరణాలు, సాంకేతిక పరిజ్ఞానం విషయాల్లో ఎగుమతి ప్రోత్సాములు ఇస్తూ తీర్మానించారు. పన్ను మినహాయింపు సంబంధ సర్టిఫికెట్ (DEEC - Duty exemption notitlement certificate) లైసెన్సు ను ఆధునీకరించారు.

పై విధంగా అనేక విధానాలను ఎగుమతి దిగుమతి విధానాల్లో ప్రవేశపెట్టి 2002-2007 ఎగ్జిమ్ పాలసీ ముగింపు కాలంలో సుమారు 1 శాతం మేర ప్రపంచ వాణిజ్యంలో భాగం సంపాదించాలని నిర్ణయించారు. 2002 సంవత్సరములో 0.67 శాతంగా నమోదయిన వ్యాపారం వాటా 1 శాతం వరకు పెరగడం కష్టకాదని భావించారు. ఈ అంశాన్ని విలువ రూపంలో వివరించినట్లయితే - 2001-2000 సంవత్సరంలో ఉన్న ఎగుమతుల విలువ 46 బిలియను డాలర్లు నుండి 2007 నాటికి 80 బిలియను డాలర్లకు పెంచాలని భావించారు. కాంపాండ్ వృద్ధి రేటులో (ACGR) ఈ మొత్తం వృద్ధి వార్షికంగా 11.9 శాతం డాలర్లు ఉండాలి. అయితే ఎగుమతులు పెంచుటకు, దిగుమతి డ్యూటీలను మరింతగా తగ్గించకుండా ప్రయత్నాలు ప్రారంభించవలసి ఉంటుంది. ఇటీవల కాలంలో మరిన్ని మార్పులు ఈ విధానంలో చేయడం జరిగింది.

వ్యాపార విధానంలో ఇటీవలి పరిణామాలు:

కేంద్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక 2002 - 2007 కాలానికి అంతర్జాతీయ వ్యాపారంలో మార్పులు తీసుకువచ్చి 2004 - 2009 కాలానికి గాను కొత్త విధానాన్ని 2004 ఆగష్టు 31 న ప్రకటించారు. ఈ విధానంలో W.T.O. యొక్క వివిధ అంశాలను అమలు పరచుటకు ప్రాముఖ్యత నిచ్చారు. ఈ 5 సంవత్సరాల కాలంలో ప్రపంచ వాణిజ్యంలో ఇండియా వాణిజ్యాన్ని 1.6 శాతానికి పెరిగే విధంగా వివిధ పథకాలను ప్రకటించారు. వ్యవసాయ వస్తు ఎగుమతులు పెరుగుదల విషయంలో ప్రత్యేక పథకాలు రూపకల్పన

చేసారు. దిగుమతులు సరళీకరణ విధానం పూర్తి కాబడుతుంది, ఈ విధంగా వాణిజ్య, వ్యాపార విధానంలో ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు తెస్తున్నారు.

16.6 ముగింపు:

అంతార్జాతీయ వ్యాపార విధాన నిర్ణయాలలో ముఖ్యమయిన అంశంగా వర్తకనిబంధనలును పేర్కొంటారు. ఇవి ఒక దేశ లాభనష్టాలను వివరించడం వల్ల అంతప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ వర్తకనిబందనలును వివిధ భావాలలో వివరించుట జరిగింది. అదాయ, స్థూల వర్తక మరియు నికర వర్తక నిబంధనలు వీటిగల భావనలు. మనదేశ విదేశీ వ్యాపార గమనంలో పరిణామ సూచీలు, ఎగుమతులు దిగుమతుల ధరల సూచీల ఆధారంగా వర్తకనిబంధనలు పరిశీలిస్తున్నారు. ఎగుమతి దిగుమతులను స్థూలంగా వివరించినపుడు ఇప్పటికీ దిగుమతుల ప్రాబల్యమే ఎక్కువ. వస్తుపరిమాణ సుచిక కన్నా ధరలసూచి ఎక్కువగా ఉండటం గమనించవచ్చు. ఎగుమతుల పరిణామ సూచి ధరల సూచికన్న తక్కువగా ఉండటవల్ల వ్యాపార లాభాలు తక్కువగా ఉన్నవని చెప్పవచ్చు. అయితే 2000-2001 తరువాత వీటి పరిస్థితుల్లో మార్పులు ఏర్పడినవి. ఆదాయ వర్తకనిబంధనల్లో అనుకుల పరిణామాలు లోను ఏర్పడినవని చెప్పవచ్చును. అయితే ఈ సుభ పరిణామం స్థూల వస్తువర్తక నిబంధనల్లోను, నికర వర్తక నిబంధనల్లో ను మరింత స్పష్టత ఏర్పడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో అవసరమయిన వనరులను వ్యాపారం, ఇతర మార్గాల ద్వారా సంపాదించలేని పరిస్థితుల్లో ప్రపంచ ఆర్థిక సంస్థల సహాయం తీసుకొనుట జరుగుతుంది. ఒకస్థాయిలో మనదేశం అప్పుల ఊబిలో చిక్కుకొనుట భయాందోళనకు గురిచేసింది. కాని అదృష్టవశాత్తు ఆర్థిక సంస్కరణలు అనుకూల ఫలితాలు ఇవ్వడం వల్ల చెల్లింపుల శేషంలో అసమతౌల్యాన్ని నివారించుటకు అప్పుల రూపంలోనే కాక విదేశీ విధానం ఎంతో సహకరించింది. IMF నుండి ఇటీవల రుణాలు తీసుకోవడం తగ్గడాన్ని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అయినప్పటికీ అవసర సమయంలో అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు ఎంతగానో సహకరిస్తున్నాయి. రుణాల చెల్లింపు, రుణసేకరణ మధ్య సమతౌల్యం కొనసాగిస్తూ ఆర్థికాభివృద్ధికి రుణాలను వినియోగించితే రుణభారం భావితరాలకు భారం కాబోదు.

దేశ ప్రగతికి అవసరమయిన మార్పులు చేయుట అవసరమే. అభివృద్ధి చెందిన దేశాలు విదేశీ వ్యాపారం ద్వారా ఆదాయాలను ఎక్కువగా సంపాదించ గలగుచున్నవి. మనదేశం విషయానికొస్తే వలస దేశంగా 1947 వరకు ఉండటంవల్ల, దోపిడీకి గురైనందున నేటికీ పూర్తిస్థాయిలో అభివృద్ధిని సాధించలేకపోయాము. వ్యాపార అభివృద్ధికి ఎగుమతులను పెంచుటకు ప్రోత్సాహకాలు కొనసాగడం తప్పనిసరి ఎందుకంటే ప్రపంచ వాణిజ్యంలో మనదేశం వాటా 1 శాతం కంటే తక్కువగా ఉండటమే. నూతన ప్రభుత్వం 2009 సంవత్సరాంతానికి 1.6 శాతానికి మన వాటాని పెంచుటకు చేయు ప్రయత్నాలు హర్షించదగినవి.

16.7 ముఖ్యపదాలు

1. వర్తకనిబంధనలు : ఎగుమతిధరల సూచికి మరియు దిగుమతి దరలసూచికి మధ్యగల నిష్పత్తి.
2. ఆదాయ వర్తకనిబంధనలు : ఎగుమతి యూనిట్ మీద సుచి / దిగుమతి విలువ సూచి × ఎగుమతివి వస్తు పరిమణం × 100
3. స్థూలవస్తు వినిమయవర్తకనిబందలు : ఎగుమతి పరిమాణ సూచి / దిగుమతి విలువ సూచి × 100
4. నికర వర్తకనిబంధనలు : ఎగుమతి యూనిట్ విలువ సూచి / దిగుమతి విలువ సూచి × 100
5. IBRD : International Bank for Reconstruction & Development (ప్రపంచ బ్యాంకు)
6. IMF : International Menetory Fund అంతర్జాతీయ ద్రవ్యనిధి
7. IDA : International Development Agency.
8. IFC : International Financial Corporation.
9. ADB : Asian Development Bank.
10. SDR : Special Drawing Rights (కాగితం బంగారంగా వ్యవహరిస్తారు)